# ఆధునిక ఐరోపా చరిత్ర (1789-1919)

## ఎం.ఏ. చరిత్ర, మొదటి సంవత్సరం : నాల్గవ పేపరు


**రచయితలు**

**ఆచార్య వి. సుందరరామశాస్త్రి** (రిటైర్డ్)
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ ఎమ్. హనుమంతరావు**
ప్రిన్సిపాల్ (రిటైర్డ్)

**డా॥ వి.కె. మోహన్,** యం.ఏ.
ప్రిన్సిపాల్ మరియు చరిత్ర శాఖాధిపతి
ఎస్.వి.ఆర్. ఎమ్. కళాశాల
నగరం

**డా॥ వి.వి. సుబ్బారెడ్డి,** యం.ఏ. పి.హెచ్.డి.
రీడర్, చరిత్ర విభాగము
యస్.జి. హెచ్.ఆర్ అండ్ యమ్. ఆర్. కళాశాల
గుంటూరు.

సంపాదకులు
**ఆచార్య వి. సుందరరామశాస్త్రి** (రిటైర్డ్) ఎం.ఏ. పి.హెచ్‌డి.
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త
**ఆచార్య డి. భాస్కరమూర్తి** ఎం.ఏ. పి.హెచ్‌డి.
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య వి. చంద్రశేఖర రావు** ఎం.కాం. పి.హెచ్‌డి.



**దూర విద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510

Ph : 0863-2293299, 2293356, 08645 - 211023,
Cell : 9848285518, 08645 - 211024 (Study Material)
Website : www.anucde.com, e-mail : anucde@yahoo.com

**M.A. History of Modern Europe (1789 to 1919)**

First Edition : 2004

Second Edition : 2005

Third Edition : 2007

Fourth Edition : 2008

No. of Copies : 1000

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A. Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Prof. V. Chandrasekhara Rao,** *Director*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడి మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే $B^{++}$ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య వి. బాలమోహన్‌దాస్**

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# M.A. History 1st Year

# PAPER IV - HISTORY OF MODERN EUROPE (1789 TO 1919)

## SYLLABUS

Unit 1 : The French Revolution of the year 1789 - The Ancient Regime - Social and Economic and intellectual conditions in France and Europe Political Condition - Causes of the Revolution and the cause for its taking place in France and not any where else in Europe - course the Revolution - The National Assembly and Legislative Assembly The National convention and the Reign of Terror - The Revolutionary Wars - causes and effects of the wars - Counter - Revolution and Return to Despotism - The Directory and Consulate constitutions Napoleon Bonaparte and the Napoleonic Empire - Fall of Napoleon estimate of Napoleon - An assessment of the results of the French Revolution.

Unit 2 : The reaction and its Triumph - The Congress of Vienna and the Concert of Empire - The Revolution of 1830 in France and other European Countries - Louis Philippe and the Revolution of 1838 in France and in Europe - Russia and Turkey in Nineteenth Century The Greek War of Independence and the Serbian revolt - easter Question and the Disintegration of the Concert of Europe.

Unit 3 : The Second Republic and Second Empire in France under Napoleon III - His Domestic and Foreign Policies - Triumph of Nationalism in Europe - Unification of Italy and Joseph Mazzini - Bismarck an Unification of Germany - Experiments in Liberalism in Russia an Results - The Eastern Question and Crimean War.

Unit 4 : Nationalism and Wars of Independence in Balkan States - Greece and Serbia - European interest in the Balkan War - Kulture Kamph in Germany - The Third Republic in France - Eastern Question from 1856 to 1914 Internal and External Developments in Russia - Colonial Rivalries between Germany, France and Britain in Asia and Africa.

Unit 5 : Europe before the First World War - Triple alliance and Triple Entent - Causes and Course of the War - The Russian Revolt of 1917 - Cause Courses and Results of the Revolt - The End of the War and peace of Versailles in 1919 - Terms and Conditions in the Peace and Criticism of the Peace.

**Text Books and Suggested Readings :**


1. Kettlebey, C.D.M., : A History of Modern Europe
2. Hazen C.d. : A History of Modern Europe (1789 - 1945)
3. Rose Halland : The Revolutionary and Napoleonic Era
4. Thompson, David : Europe Since Napoleon
5. Fisher, H.A.L., : A History of Europe (Vol. II only)
6. Southgate, G.W. : Modern European History (Vol. III only)
7. Hayes, G.J.H. : Modern Europe to 1870
8. --do-- : Contemporary Europe Since 1870
9. Louis Gottschalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.
10. Lipson, E. : Europe in the 19th and 20th Centuries
11. Grant and Tamperley : Europe in the 19th and 20th Centuries.

# M.A. (Previous) DEGREE EXAMINATION, DECEMBER- 2005
First Year

## History Paper IV - HISTORY OF MODERN EUROPE ( 1789 to 1919 )

Time : Three hours | Maximaum : 100 marks

Answer ALL questions.
All questions carry equal marks.

1. (a) Examine the causes for French Revolution ( 1789 ).
1789 నాటి ఫ్రెంచ్ విప్లవ కారణాలను వివరింపుము.

Or

(b) Mention the administrative reforms introduced by Napoleon Bonaparte.
నెపోలీయన్ బోనపార్టీ ప్రవేశ పెటిన పరిపాలనా సంస్కరణలను వివరింపుము.

2. (a) Discuss the role of Metternich in European politics.
ఐరోపా రాజకీయాలలో మెటర్నిక్ నిర్వహించిన పాత్రను చర్చించుము.

Or

(b) Examine the importance of 1848 Revolution in France.
ఫ్రాన్సులో 1848 లో సంభవించిన విప్లవ ప్రాధాన్యతను వివరింపుము.

3. (a) Narrate the efforts for the unification of Italy.
ఇటలీ ఏకీకరణకు జరిగిన ప్రయత్నాలను వివరింపుము.

Or

(b) Explain the causes and results of Crimean War ( 1854-56 ).
క్రిమియా యుద్ధ ( 1854-56 ) కారణాలను, ఫలితాలను వివరింపుము.

4. (a) Discuss the nature of wars for independence in the Balkan States.
బాల్కన్ రాజ్యాలలో సాగిన స్వాతంత్ర్య పోరాటాల స్వభావాన్ని వివరింపుము.

Or

(b) Trace the colonisation of Africa by the European Powers.
ఆఫ్రికాలో ఐరోపా రాజ్యాల వారి వలసల స్థాపనను గూర్చి వివరింపుము.

5. (a) Mention the causes for the Russian Revolution of 1917.
1917 నాటి రష్యా విప్లవ కారణాలను వివరింపుము.

Or

(b) Examine the terms and conditions of the treaty of Versailles.
వర్సైల్స్‌సంధి ఒప్పందాలను, షరతులను వివరింపుము.

**(DH 04)**

# M.A. (Previous) DEGREE EXAMINATION, MAY 2006.

History

Paper IV - **HISTORY OF MODERN EUROPE (1789 To 1919)**

Time : Three hours Maximum : 100 marks

Answer ALL questions

All questions carry equal marks.

1. (a) Discuss the role of the French Philosophers in the French Revolution.
ఫ్రెంచి విప్లవంలో ఫ్రెంచి మేధావుల పాత్ర గురించి చర్చించుము.

Or

(b) Write a note on the Continental System of Napoleon.
నెపోలియన్ ఖండాంతర విధానం గురించి వ్రాయుము.

2. (a) Give an account of the Revolution of 1830
1830 నాటి విప్లవం గురించి వ్రాయుము.

Or

(b) Discuss the Greek War of Independence.
గ్రీకు స్వాతంత్ర్య యుద్ధం గురించి చర్చించుము.

3. (a) Examine the unification of Germany.
జర్మనీ ఏకీకరణ గురించి పరిశీలించుము.

Or

(b) Write a note on the Crimean War.
క్రిమియా యుద్ధం గురించి వ్రాయుము.

4. (a) Write a note on the Third Republic in France.
ఫ్రాన్స్‌లో తృతీయ రిపబ్లిక్ గురించి వ్రాయుము.

Or

(b) Discuss the scramble for Africa.
ఆఫ్రికాకై త్రొక్కిసలాట గురించి చర్చించుము.

5. (a) Write a note on the formation of Triple Alliance and Triple Entente.
ట్రిపుల్ అలయన్స్, ట్రిపుల్ ఆంతాంతిల గురించి వ్రాయుము.

Or

(b) Discuss the causes of the Russian Revolution of 1917
1917 నాటి రష్యా విప్లవ కారణాల గురించి చర్చించుము.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఫ్రెంచి విప్లవ కాలంనాటి ఐరోపా | 1.1 - 1.12 |
| 2. | ఫ్రెంచి విప్లవానికి పూర్వరంగం - ఆధునిక యుగం, దాని లక్షణాలు | 2.1 - 2.24 |
| 3. | 1789 నా ి ఫ్రెంచి విప్లవ కారణాలు | 3.1 - 3.26 |
| 4. | ఫ్రెంచి విప్లవ గమనము 1789-1795 | 4.1 - 4.32 |
| 5. | మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ - నెపోలియన్ అధిగమనం (1795-99) | 5.1 - 5.11 |
| 6. | 1789 ఫ్రెంచి విప్లవ ఫలితాలు : ఐరోపా ఖండంపై దాని ప్రభావం | 6.1 - 6.6 |
| 7. | నెపోలియన్ యుగం (1799-1815) | 7.1 - 7.41 |
| 8. | మెటర్నిక్ యుగం - సాంప్రదాయ పునరుద్ధరణ (1815 - 1848) | 8.1 - 8.25 |
| 9. | 1848 నుండి 1914 వరకు ఫ్రాన్సుదేశ చరిత్ర | 9.1 - 9.25 |
| 10. | పారిశ్రామిక విప్లవం - కారణాలు - లక్షణాలు | 10.1 - 10.20 |
| 11. | మధ్య ఐరోపాలో జాతీయ సమైక్యతా ఉద్యమాలు | 11.1 - 11.17 |
| 12. | 1800 నుండి 1856 వరకు రష్యా చరిత్ర | 12.1 - 12.13 |
| 13. | మధ్య ఐరోపాలో నియంతృత్వ సామ్రాజ్యాలు - జర్మనీ, ఆస్ట్రియా, హంగేరీలు | 13.1 - 13.12 |
| 14. | 1856 నుండి 1914 వరకు ప్రాచ్య సమస్య | 14.1 - 14.15 |
| 15. | అంతర్జాతీయ సంబంధాలు | 15.1 - 15.14 |
| 16. | మొదటి ప్రపంచ యుద్ధం - అనంతర పరిణామాలు | 16.1 - 16.26 |

పాఠం - 1

# ఫ్రెంచి విప్లవకాలంనాటి ఐరోపా

## విషయసూచిక

1.0 లక్ష్యం
1.1 ఉపోద్ఘాతము
1.2 మధ్య యుగంలో ఐరోపా
1.2.1 భూస్వామ్య విధానం (Feudalism)
1.2.2 మధ్యయుగంలో వర్తక వాణిజ్యాలు
1.2.3 భూస్వామ్య విధానము - రాజ్యపరిపాలనా వ్యవస్థ
1.2.4 మధ్యయుగంలోని మత వ్యవస్థ

**1.0 లక్ష్యం :**

1789లో ప్రారంభమై సుమారు ఒక దశాబ్దం పాటు ఐరోపా యావత్తును నూతన భావాల ప్రభావంతో, నూతన వ్యవస్థల ఆవిష్కరణతో ఫ్రెంచి విప్లవం కొత్త రూపాన్ని ఇచ్చింది. అయితే ఫ్రెంచి విప్లవం నాటికి ఫ్రాన్సు దేశంలో నెలకొన్న పరిస్థితులు ఇంచుమించుగా అన్ని ఐరోపా దేశాల్లోను సమానంగా ఏర్పడి ఉన్నాయి. అయితే ఈ విప్లవం మొదట ఫ్రాన్సులో ఎందుకు ప్రారంభం అయిందో, ఆ విప్లవ ప్రభావం ఫ్రాన్సుకు పరిమితం కాకుండా తక్కిన ఐరోపా దేశాలకు సైతం ఎందుకు విస్తరించిందో విపులంగా తెలుసుకోవలసి ఉంది. అందుకు ఆ సమయంలో ఐరోపాలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడి ఉన్నవో, అవి ఫ్రాన్సులో ఎటువంటి విశిష్టతను కలిగినవో తెలుసుకోవడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**1.1 ఉపోద్ఘాతము :**

ఫ్రెంచి విప్లవం ఐరోపాలోను, క్రమంగా యావత్ప్రపంచంలోను ఆధునిక యుగాన్ని తెచ్చి పెట్టినట్లు కానవస్తుంది. సాధారణ ప్రజానీకం రాజకీయ చైతన్యంతో తమను పరిపాలిస్తున్న రాజ్య వ్యవస్థపై తిరుగుబాటు చేయడం, రాజును పదవీచ్యుతుని చేసి, వధించి, తమ దేశంలో రాజరిక వ్యవస్థనే నిర్మూలించడం, తమ ఇష్టానుసారం ప్రజాపరిపాలనా విధానాన్ని రాజ్యాంగ బద్ధంగా నిర్మించుకోవడం మొదలైన అనేక సంఘటనలు అంతకు పూర్వం చరిత్రలో అరుదు. అంతకుపూర్వం రాజకీయ వ్యవస్థలో ప్రజలకు ఎటువంటి స్థానం లేదు. ఆ తరువాత రాజకీయ వ్యవస్థ ప్రజాబలానికి లోబడింది.

ఫ్రాన్సులో సంభవించిన ఈ పరిణామాలు కేవలం ఆ దేశానికి పరిమితమైనవి కావు. అవి అన్ని ఐరోపా దేశాలను కొద్దిగానో, గొప్పగానో, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేసి, ఆ దేశాల్లో సైతం ఆధునిక యుగారంభానికి శ్రీకారం చుట్టాయి. సాధారణ ప్రజానీకం బలీయమై అనేక దేశాల్లోని నిరపేక్ష (Absolute) పరిపాలకులను, రాజ్యాంగాలను ఇయ్యవలసిందిగా రాజ్యాంగ బద్ధంగా పరిపాలించవలసిందిగా, ఒత్తిడి చేశాయి.

ఫ్రాన్సుతో ప్రారంభించి, ఐరోపాలో ఏర్పడిన ఈ నూతన భావాలను, సంఘటనలను సవివరంగా తెలియడానికి ముందు అసలు ఆధునిక యుగమంటే ఏమో, ఈ ఆధునిక యుగం ఎలా ప్రారంభమైందో తెలియడం అవసరం. అందుకు ఆధునిక యుగానికి పూర్వం, మధ్యయుగంలో ఎటువంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయో తెలియంది ఆధునిక యుగస్వరూపం పూర్తిగా విశదం కాదు.

ఏ దేశచరిత్రలోనైనా, ఆధునిక యుగం మధ్య యుగం కంటె విభిన్నమైన లక్షణాలతో విశిష్టంగా కానవస్తుంది. ఈనాడు మనకు అందుబాటులో ఉన్న ప్రయాణ సౌకర్యాలు, సమాచార సౌకర్యాలు, వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలతో కూడిన ప్రజాస్వామ్య

పరిపాలనా విధానాలు, శాస్త్రసాంకేతిక విజ్ఞానాల పురోగమనం, పరిశ్రమలు, అవి ఉత్పత్తి చేసే వివిధమైన వస్తువులు, వాటితోకూడిన సౌకర్యాలు మొదలైనవన్నీ సుమారొక రెండు శతాబ్దాల పూర్వం ఊహా మాత్రంగా కూడ లేవు. ఇవి ఉత్పన్నమై ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడం వలన మధ్యయుగం నుండి మానవజాతి ఆధునిక యుగంలోనికి అడుగుపెట్టింది. ఈ ప్రత్యేక లక్షణాలతో ఆధునికయుగం ప్రప్రథమంగా ఐరోపాలో ప్రారంభమై క్రమంగా ప్రపంచ వ్యాప్తమైంది. ఈ పరిణామాలు ఏ కారణాల వలన, ఏ విధంగా రూపుదిద్దుకున్నాయో తెలుసుకోవడం ఆధునిక ప్రపంచ చరిత్ర ఉద్దేశ్యం. అందుకు ఆరంభం ఆధునిక ఐరోపా చరిత్ర అధ్యయనం.

ఈనాటి ప్రపంచం 21వ శతాబ్దంలో అడుగు పెట్టినంత మాత్రాన ఆధునికమైందని భావించడం పొరపాటు. ఆధునిక యుగ లక్షణాలు అన్ని ప్రపంచ దేశాల్లో సమానంగా లేవు. అవి అన్ని దేశాల్లో ఏకకాలంలో సంభవించలేదు. అనగా మధ్యయుగం నుండి ఆధునిక యుగంలోనికి ప్రస్థానం ఆయా దేశాల ప్రజల ఆలోచనల్లో, ఆచరణల్లో ప్రాప్తించే మార్పులను బట్టి జరుగుతుంది. ప్రస్తుత ప్రపంచంలో శాస్త్ర, వైజ్ఞానిక రంగాల్లో అత్యధిక పురోగమనం సాధించి, అపారంగా భౌతిక సంపదలను సుఖ జీవనాన్ని సాధ్యం చేసుకొన్న కొన్ని ఐరోపా దేశాలు సైతం మధ్యయుగంలో అజ్ఞానము, అంధవిశ్వాసాలతో, పేదరికంతో వెనుకపడి ఉన్నవే. అయితే అటువంటి పరిస్థితులను అధిగమించి, పురోగతి సాధించడం లోనే ఆధునికయుగ లక్షణాలు ఇమిడి ఉన్నాయి.

ఆర్థిక, సామాజిక రంగాల్లోను, మత, సాంస్కృతిక రంగాల్లోను ప్రజా జీవనంలో రూపుదిద్దుకున్న నూతన పరిణామాలు క్రమంగా రాజకీయ రంగాన్ని కూడ ప్రభావితం చేయడంతో కొన్ని ఐరోపా దేశాల్లో ఆధునిక యుగం తొలుత ప్రారంభం అయింది. ఈ పరిణామాలు ఆ ఐరోపా దేశాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి తద్వారా ఆధునిక యుగం ప్రపంచ దేశాలన్నిట కొద్దిగానో, గొప్పగానో ప్రారంభం అయి వృద్ధిచెందటానికి దారితీసాయి. ఈ పరిణామాలు జాతీయ, అంతర్జాతీయ విధానాల్లో విశేషమైన పరిణామాలు కల్గించి, ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆధునిక యుగారంభానికి కారణం అయినాయి. ఈ పరిస్థితులను క్రమపద్ధతిలో విశ్లేషించి, అవగాహన చేసుకున్నప్పుడే ఆధునిక ఐరోపా చరిత్ర సులువుగా స్పష్టపడగలదు.

ఆధునిక ఐరోపా చరిత్రను మనం - భారతీయులం - అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఏమిటో సూచన ప్రాయంగా అర్థం అయి ఉంటుంది. ఆధునిక యుగ పరిణామాల్లోని ప్రధానాంశంగా కొన్ని ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని అనేక దేశాలను తమ వలస (ౘళిజిళిదీరిబిజ) రాజ్యాలుగా మార్చుకొని పరిపాలించాయి. ఆ విధంగా భారతదేశం బ్రిటిష్ వారి వలస పాలన (ౘళిజిళిదీరిబిజ ఝ్రతిజిలి) లో సుమారు రెండు శతాబ్దాల కాలం లోబడి, అనేక దోపిడీలకు గురై, దుస్థితిపాలైన విషయం. వారిని పారద్రోలి, స్వాతంత్ర్యం సంపాదించుకొనేందుకు భారతీయులమైన మనం సుదీర్ఘపోరాటాన్ని జరపడం ఆధునిక భారతదేశ చరిత్రసారం. ఐతే ఈ విధంగా సాధారణ ప్రజలు ప్రభుత్వాలపై తిరుగుబాటుచేసి, స్వాతంత్ర్యము సంపాదించుకోవడము, తమకు కావలసిన విధంగా పరిపాలనా విధానాన్ని రూపొందించుకొని, దాన్ని రాజ్యాంగ బద్ధంగా చేసి అమలు జరుపుకోవడమూ మధ్యయుగాల్లో కని, విని ఎరుగనవి. ఇటువంటి పరిణామాలు ఐరోపా దేశాల వలసవాద పరిపాలనకు లోనైన అనేక ఆసియా - ఆఫ్రికా దేశాల్లోను సంభవించాయి. ఈ పరిణామాలకు మూలం ఆ దేశ ప్రజానీకాల్లో ఏర్పడ్డ రాజకీయ చైతన్యం. ఈ రాజకీయ చైతన్యం జాతీయాభిమానం ప్రధాన లక్షణంగా కలది. తమ దేశాలను ఆర్థికంగా కొల్లగొడుతూ, సాంస్కృతికంగా అణచివేస్తున్న ఐరోపా వలస వాదం నుండి విముక్తమై, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన స్వయం పరిపాలనా వ్యవస్థలను నిర్మించుకొనే ఉద్దేశ్యంతో సాగినవి. ఈ విధంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లోని సామాన్య ప్రజానీకంలో రాజకీయ చైతన్యం, జాతీయాభిమానంతోను, స్వేచ్ఛా స్వాతంత్ర్య కాంక్షతోను కల్గిన సంఘటన, అనగా సమైక్యత. ఈ దేశాల్లో ఏర్పడ్డ ఆధునిక యుగలక్షణం. ఇది కలగడానికి ఈ దేశాలు ఐరోపా దేశాల వలసవాద పరిపాలనకు గురికావడం, తద్వారా ఐరోపా నాగరికతా సంస్కృతులను అర్థం చేసుకొని అనుసరించడం మూల కారణాలు. ఈ పరిణామాలు ఈ విధంగా ఐరోపాలో ఉత్పన్నం అయి ప్రపంచవ్యాప్తం అయినాయి.

ఈ పరిణామాలు తొలుదొలుత ఐరోపాలో సంభవించడానికి కారణం ఆ దేశాల్లోని ప్రజానీకం ప్రపంచమంతటిలో **ఉత్కృష్టమైన** జాతి అని భావించడం పొరపాటు. ఈ పరిణామాలకు కారణమైన పరిస్థితులు, అవకాశాలు, అవసరాలు మొదట **ఆ దేశాల్లో** సంభవించాయి. కొన్ని విధాలయిన అవసరాలు, అవకాశాలు ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కచోట సమకూరుతూ నూతన

యుగాల ఆవిష్కరణకు కారణం అవుతాయి. మధ్యయుగంలో భారతదేశంలోను, చైనాలోను ఉత్పత్తి అయ్యే అనేక వ్యావసాయక, పారిశ్రామిక వస్తువుల కొరకు ఐరోపా అర్రులు చాచింది. ఈ దేశాలు మధ్యయుగంలో ప్రపంచంలోని అన్ని నాగరిక దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసేవి. ఈ ఎగుమతి వాణిజ్యం కొరకు ఐరోపా దేశాలు ప్రత్యక్షంగా భారతదేశం తోను, చైనా తోను సంబంధం పెట్టుకోవాలని, సముద్ర మార్గాలను కనుగొనడానికి విశేషమైన పరిశ్రమ చేశాయి. అనగా మధ్యయుగంలో మహత్తరమైన అవకాశాలు భారత, చైనా దేశాలకు ప్రాప్తించాయని, ఆధునిక యుగంలో అటువంటి అవకాశాలు కొన్ని ఐరోపా దేశాలకు మరియు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ప్రాప్తించాయని గ్రహించవలసి ఉంటుంది.

ఏవిధమైన అవసరాలు ఏ విధమైన అవకాశాలను సృష్టించుకోడానికి, ఐరోపా దేశాలు ఆధునికీకరణ చెందడానికి కారణమైనాయో, సమగ్రంగా ఆధునిక యుగలక్షణాలు ఏ దేశాల్లో ఏ స్వరూపంలో సంభవించాయో అధ్యయనం చేయడం ఆధునిక ఐరోపా చరిత్రను చదవడంలోని మౌలికమైన ప్రయోజనం. అయితే ఈ విషయాలను స్పష్టంగా అవగాహన చేసుకోడానికి అంతకు పూర్వం నాటి, అనగా మధ్యయుగం నాటి, పరిస్థితులను మనసులో ఉంచుకోవడం అవసరం. అప్పుడే ఆధునిక యుగ స్వరూప, స్వభావాలు స్పష్టంగా బోధపడగలవు.

## 1.2 మధ్యయుగంలో ఐరోపా :

మధ్యయుగంనాటి ఐరోపాను గూర్చి తెలుసుకొనేముందు ప్రపంచంలోని అన్ని దేశాల్లోను పరిస్థితులు ఇంచుమించు అదే విధంగా ఉన్నాయని గుర్తుంచుకోవడం అవసరం. బలీయమైన సాంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచరణలు, వాటిపై ఆధారపడ్డ వ్యవస్థలు ప్రజాజీవనాన్ని నియంత్రించడం మధ్యయుగ లక్షణం. అన్ని దేశాల్లోను, అనగా ఆనాటి నాగరిక ప్రపంచంలోని అన్ని దేశాల్లోను, మధ్యయుగంలో కానవచ్చే ప్రధానమైన వ్యవస్థ భూస్వామ్యవిధానం. దానికి లోబడిన గ్రామీణ ప్రజాజీవనం, ప్రబలమైన మతవిశ్వాసాలు, ఆచారాలు, వాటిని నియంత్రిస్తూ నిర్వహించే మత వ్యవస్థ మధ్యయుగ జీవనంలో మరొక ప్రధానాంశం. గ్రామీణ జీవనవిధానాన్ని, అనగా భూస్వామ్య విధానాన్ని (Feudalism) పునాదిగా చేసుకున్న నిరపేక్ష రాచరిక విధానం మరొక ప్రధాన లక్షణం. ఇవి ఒక దానిపై మరొకటి ఆధారపడి, సమిష్టిగా సాధారణ ప్రజాజీవనాన్ని సాంప్రదాయాల చట్రంలో బిగించాయి. సాధారణ ప్రజానీకం పేదరికం, అజ్ఞానం, అచేతనత్వాలతో కూడిన నిస్సహాయస్థితిలో ఉండిపోవడం మధ్యయుగ చరిత్ర సారాంశం.

ఈ నిస్సహాయస్థితి నుండి విముక్తుడై సాధారణ మానవుడు చైతన్యవంతుడు కావడం, అంధవిశ్వాసాలకు, ఆచరణకు స్వస్తి పలికి ఆధునిక యుగంలో అడుగుమోపడం ఈ పరిస్థితుల విచ్ఛినంతో సాధ్యమైనాయి. మధ్యయుగం విచ్ఛిన్నం కావడమే ఆధునిక యుగారంభానికి నాంది కనుక మధ్య యుగ లక్షణాలను గూర్చిన అవగాహన అవసరం.

### 1.2.1 భూస్వామ్య విధానము (Feudalism) :

మధ్యయుగంనాటి ఐరోపా దేశాల్లో సమాజము, ఆర్థికవ్యవస్థ, వాటిపై ఆధారపడి రాజ్యవ్యవస్థ, భూస్వామ్య విధానంపైన ఆధారపడినవి. అనగా భూమి - పంటపొలాలు ఆర్థికస్థితికి, హోదాలకు, తద్వారా సామాజిక స్థితికి మూలమైనవి. ఈ పంటపొలాలు కలిగినవారు, లేదా వాటిపై ఆధిపత్యం కలిగినవారు ఉన్నత వర్గానికి చెందిన ప్రభువులు, మతాధిపతులు. వారు రాజ్యవ్యవస్థలో సైతం ఉన్నత పదవులను పొందగలిగేవారు. రాజ్యవ్యవస్థకు ఆధారమైన ఆదాయానికి భూములపై ఫలసాయం ప్రధానమైన వనరు. ప్రభువులు ఈ విధంగా రాజ్యాదాయాన్ని పొందగలిగి, సైనికబలం కలిగి ఉండేవారు, కనుక రాజ్యపరిపాలనలో కీలకమైనవారు. ఈ విధంగా సామాజిక, ఆర్థిక రాజకీయ వ్యవస్థలకు భూమి మూలమై ఉండటం వల్ల మధ్యయుగం భూస్వామ్య విధానంపై ఆధారపడిందని - భూస్వామ్యయుగమని (Feudal Age) అని వ్యవహరించడం జరిగింది.

పదునారో శతాబ్దికి పూర్వం, అనగా మధ్యయుగంలో, ఐరోపా సంపూర్ణంగా వ్యవసాయ ఆర్థిక విధానం, పరిమితంగా కుటీర పరిశ్రమలు కలిగిన గ్రామీణ జీవనం కలిగింది. అన్ని ఐరోపాదేశాల్లోను, తొంబదిశాతం ప్రజానీకం గ్రామీణ జీవనులే. తక్కిన పదిశాతం కుగ్రామాల నడుమ, సుమారైన పట్టణాల్లో నివసించే ప్రభువులు, వారి ఉద్యోగిగణము, ఉన్నత మతాధిపతులు, ఈ పట్టణాలు నేటి నగరాలు, పెద్ద పట్టణాలతో పోల్చదగిన లక్షణాలు కలవికావు. కేవలం పరిమాణం వలన ప్రభువుల ప్రసాదాల చుట్టు విస్తరించడాన మాత్రమే అవి పట్టణాలని వ్యవహరించడం జరిగింది.

వ్యావసాయక జీవనులైన ప్రజానీకం రెండు వర్గాలుగా, లేదా రెండు తరగతులుగా ఏర్పడింది. వారు - ప్రభువులు, కర్షకులు. ప్రభువులు మతాధిపతులతో కలసి ఉన్నత వర్గంగా, అనేక హక్కులు, హోదాలు కలిగిన స్వాధికారవర్గం (Privileged Class) గాను, కర్షకులు ఎటువంటి ప్రత్యేక హక్కులు, హోదాలు లేని స్వాధికార రహిత వర్గం (Unprivilegedz Class) గానూ ఏర్పడి ఉన్నారు. కర్షకుల్లో కొందరు కొంచెం ఉన్నత స్థాయికి, ప్రభువుల్లోని వివిధ తరగతుల్లో పలువురు దిగువస్థాయికి చెందినా, ప్రధానంగా సమాజం ఈ రెండు వర్గాలతోనే కూడి ఉంది.

ప్రభువర్గం-అత్యధిక శాతం పంటభూములను కలిగింది ఐనా, వారు తమ పొలాల్లో ఎటువంటి కృషి, అనగా వ్యవసాయం లేదా వ్యవసాయక శ్రమ, చేసేవారు కారు. వారికి అటువంటి అవసరం లేదు. అయితే, పంటలో అత్యధిక శాతం వారికే చెందేది. ఈ ఫలసాయంతో వీరు తమకంటె ఉన్నత స్థానంలో ప్రభువులకు, లేదా రాజుకు కొన్ని విధాలయిన సేవలను అందించే బాధ్యత కలిగినవారు. ఈ విధంగా భూములపై ఫలసాయం క్రమంగా వివిధ తరగతులకు చెంది, సోపాన క్రమంలో ఏర్పడి ఉన్న ప్రభు వర్గం ద్వారా అత్యున్నత స్థితిలో ఉన్న రాజుకు చేరడం భూస్వామ్యవ్యవస్థలోని ప్రధానాంశం.

ప్రభువర్గంలోని తక్కువస్థాయికి చెందినవారు తమ కంటే పైస్థాయికి చెందిన ప్రభువులకు కప్పం చెల్లించేవారు. వారి సేనలో చేరి, వారు చేసే పోరాటాల్లో పాల్గొనేవారు. అదేవిధంగా, వారు తమకంటె పై తరగతి వారికి, ఈ విధంగా ప్రభువర్గం సోపాన క్రమంలో నిర్మాణమై, తమకంటే క్రింది తరగతులకు చెందిన ప్రభువుల నుండి కప్పము, సైనిక సేవలను పొందుతూ పనిచేసేది. అందరికంటే తక్కువస్థాయికి చెందిన ప్రభువర్గమూ, వారి భూములూ, ఒక చిన్నగ్రామం చుట్టూ విస్తరించి ఉండేవి. ఈ విధమైన భూవసతి కలిగిన గ్రామాన్ని లేదా గ్రామాలతో కూడిన ప్రదేశాన్ని (Estate) ఇంచుమించుగా ఒక పరిమాణం (Unit) గా భావించడం జరిగేది. ఈ పరిమాణాన్ని మేనోర్ (Manor) అని పిలిచేవారు. మేనోర్‌ను స్థూలంగా ఒక చిన్నగ్రామము, దానిచుట్టి ఉన్న పంట భూములూ, అని అర్థం చేసుకోవచ్చు. గ్రామంలో ప్రభువు నివసించే భవనం కాక తక్కినవన్నీ పూరిగుడిసెలే. ప్రభువుల జీవితం సుఖసౌఖ్యాలతో విలాసవంతంగా ఉండేది. సాధారణ ప్రజానీకం చాలీచాలని విధంగా, భారంగా ఉండేది.

సాధారణ ప్రజానీకం కష్టించి జీవించేది. సామాజికంగా తక్కువ స్థాయికి, ఆర్థికంగా హీనస్థాయికి చెందింది. పంట భూములను సాగుచేసి ఫలసాయం సాధించేది సాధారణ ప్రజానీకం, దానిని అనుభవించేది ప్రభువర్గం. వీరిని సేద్య బానిసలు (Serfs) అని వ్యవహరించేవారు. అయితే వీరు బానిసలుకారు, కాని వీరి జీవనస్థాయి అంతకు మించింది కాదు. బానిసలు భూస్వాముల నుండి కూడు, గుడ్డలు మాత్రం పొంది ఏవిధమైన ప్రతిఫలం లేకుండా వారి భూముల్లోను, ఇండ్లలోని సమస్తచాకిరి చేసేవారు; వారిని వస్తువుల వలె, పాడిపశువుల వలె సంతలో విక్రయించడం జరిగేది. వారికెటువంటి వ్యక్తి స్వేచ్ఛ ఉండదు. అయితే సేద్యబానిసల సామాజికస్థితి అటువంటిది కాదు. వారికి వ్యక్తి స్వేచ్ఛ ఉంది; సంతల్లో క్రయవిక్రయాలకు లోబడిన వారుకారు; వారు ప్రభువుల నుండి కూడుగుడ్డలను పొంది ఊడిగం చేసేవారు కారు. వారు సమాజంలోని అత్యధిక సంఖ్యాకులైన ప్రజానీకం. భూములను సాగుచేసి ఫలసాయంలో కొంతమేర తాము పొంది, తక్కినది ప్రభువుల పరం చేయడం వీరి సామాజిక, ఆర్థిక బాధ్యత. అందుచేత వీరిని పాలికాపులు అని కూడ (Share - Croppers) అనలేము.

ఈ సేద్యబానిసల్లో కొందరు స్వంత భూములు కలిగినవారు. అయితే ప్రభువుల భూముల్లో పనిచేసిన తరువాత మాత్రమే తమ భూములను సాగుచేసుకొనే అవకాశం కలిగినవారు. అయితే, వారు ప్రభువుల భూములను సాగుచేయడం తమ ఇష్టాయిష్టాలనుబట్టి, ఆర్థిక అవసరాలనుబట్టి కాక, తప్పనిసరి. అనగా సేద్య బానిసలైన సాధారణ ప్రజానీకం భూమిని ఆశ్రయించి ఉండవలసిన వారు (tied to the soil) గ్రామాన్ని విడిచి, ప్రభు సేవ నుండి వారు తప్పించుకోలేరు. ప్రభువులకు దొరకకుండ పారిపోవడమో లేక అతడు విధించిన మొత్తాన్ని చెల్లించడము మాత్రమే వారికి స్వేచ్ఛను ఇయ్యగలిగింది.

ప్రభువు పట్ల ప్రజానీకానికి కొన్ని తప్పని బాధ్యతలు ఉండేవి. వాటిలో మొదటిది ప్రతి వారంలో రెండు లేక మూడు రోజులు తప్పనిసరిగా ప్రభువుకు చెందిన భూముల్లో సాగుబడి పనులు ఏవిధమైన ప్రతిఫలం లేకుండా చేయడం. నాట్లు, కోతల సమయాల్లో అవసరమైనట్లు మరిన్ని రోజులు ఈ సాగుబడి పనులు నిర్వర్తించవలసి ఉండేది. ప్రభువుల భవనాల్లో అవసరమైన వంట చెరుకును అడవి నుండి తెచ్చిపెట్టడం. గ్రామంలోని రహదార్లు, పంటకాలువలు మొదలైన వాటి మరమ్మత్తులు సాధారణ

ప్రజానీకం చేయవలసి ఉండేది. రెండవది, ప్రభువుకు వివిధమైన సుంకాలు, కట్టడులు చెల్లించడం; వారి ఇండ్లలో జరిగే వేడుకలు, విందులకు అవసరమైన కోళ్ళు, బాతులు, గొర్రెలు, ధాన్యం సమకూర్చడం. మూడవది, గ్రామంలోని ప్రజలు తప్పనిసరిగా ప్రభువుకు చెందిన రొట్టెలు కాల్చుకునేపొయ్యి (Oven), ద్రాక్షరసం పిండే యంత్రం (Wine Press), పిండిమర, ఉపయోగించుకొని, అందుకు ప్రతిఫలంగా కొన్ని రొట్టెలు, కొంత ద్రాక్షరసం, కొంతమేర పిండి సమర్పించడం.

సేద్య బానిసల్లో స్వంతభూమి కలిగినవారు మరణించినప్పుడు, వారికి వారసులు లేనట్లయితే, వారి భూములు ప్రభువుల స్వాధీనమయ్యేవి. వారసులున్నట్లయితే, వారి హక్కులను గుర్తించి భూములను సంక్రమింపజేయడానికి ప్రభువుకు కొంతమూల్యం, లేదా సుంకం చెల్లించవలసి ఉంటుంది. వేరొకరికి విక్రయిస్తే, క్రయధనంలో ప్రభువుకు కొంత వాటా చెల్లించవలసి ఉంటుంది. అలాగే సేద్య బానిసలు లేదా సాధారణ ప్రజానీకం తమ పశువుల్లో ఉత్తమమైనవి ప్రభువు కంటపడి అతడు కోరినట్లయితే, మారు మాట్లాడకుండ ఇచ్చివేయవలసి ఉండేది.

ఈ వ్యవస్థ రూపొందడానికి దారితీసిన పరిస్థితులను కూడ సూక్ష్మంగా, అవగాహన చేసుకోవలసి ఉంది. ఎందుకంటే ఆధునిక కాలంలో అనేక తాత్త్వికులు, భూస్వామ్య వ్యవస్థను ఖండించి దానికి ప్రత్యామ్నాయ విధానాలను సూచించినప్పుడు వారి విమర్శకు ఆధారాలేవో అవగాహన చేసుకోవడానికి, ఆ వ్యవస్థకు పూర్వరంగం ఏదో ఆలోచించవలసి ఉంటుంది. ఇవి ముందు పాఠాలలో మరింత సుబోధకం కాగలదు.

ఈ వ్యవస్థ మనకిప్పుడు విడ్డూరంగాను, చాలా దురన్యాయంతో కూడింది గానూ కానవస్తున్నా, వాస్తవానికి అదొక విరూపమైన సహకార గ్రామీణ జీవన వ్యవస్థ. పూర్వం కర్షకులు, కుటీర పరిశ్రమలతో జీవించే చేతి వృత్తులకు చెందినవారు పరస్పరం తమ ఉత్పత్తులను, సేవలను సహకారభావంతో పంచుకొని జీవించే సామాజిక వ్యవస్థ, వారి రక్షణ కొరకు ఏర్పడిన ప్రభుత్వ వ్యవస్థ, అనగా ప్రభువర్గం - అదుపుతప్పి, క్రమంగా విరూపం చెందాయి. అంతట ప్రభువర్గం క్రమంగా గ్రామీణజీవనులపై మితిమీరిన ఆధిపత్యం సంపాదించింది. విద్యా, వివేచనలకు అవకాశాలు లేని సాధారణ ప్రజానీకం ఈ పరిణామక్రమాన్ని గుర్తించలేక ఆమోదించడం జరిగింది. ఇవన్నీ ఆకస్మికంగా జరిగిన పరిణామాలు కావు; గుర్తించ వీలులేనంత నెమ్మదిగా కొన్ని శతాబ్దాల కాలంలో ఏర్పడ్డాయి. అంతకు కొంతకాలం క్రిందట, గ్రామీణ కర్షకులు తమ భూములు, వాటిపై వచ్చే పంటలు, తమ పశుగణాలు - ధన, మాన, ప్రాణాలకు దోపిడీ దొంగల బారినుండి, అడవి మృగాల బారినుండి ప్రభువులు ఆయుధాలు ధరించి రక్షణ కల్పించారు. క్రమంగా రక్షకులు బలపడడం, వారు బలపడిన కొలది గ్రామీణ ప్రజానీకం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, హక్కులు కోల్పోవడం జరిగింది. ఈ పరిణామాల్లో భూమిపై యాజమాన్య హక్కులు కలిగిన కర్షకుల్లో అధిక సంఖ్యాకులు సేద్య బానిసలుగా మారిపోవడమూ, వారి భూములపై గల యాజమాన్య హక్కులు ప్రభువులకు సంక్రమించడం జరిగింది. అయితే, గ్రామీణ జీవనంలో సామాన్యమైన అవసరాలు - అనగా అందరికి కావలసిన సౌకర్యాలు రోడ్లు, పంట కాలువలు మొదలైన వాటి నిర్మాణ, నిర్వహణ కార్యక్రమాలు యధాపూర్వంగా సహకార ప్రాతిపదికపైనే జరుగుతూ ఉండడాన ప్రభువర్గం తన ఆధిపత్యంతో సేద్య బానిసల చేత, ప్రతిఫలం చెల్లించకుండ ఈ సేవలను పొందుతున్నట్లుగా కానవస్తుంది.

ఈ విధమైన సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో కలిగిన భూస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడం ఆధునిక యుగారంభానికి కారణమని పైన పేర్కొనటం జరిగింది. ఈ అసమానతలకు, సాంప్రదాయకమైన ప్రభువర్గ దోపిడీని ఎదిరించగలగడం, సర్వసమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా ఆధునిక సమాజం ఏర్పడటం ఆధునికయుగ లక్షణాల్లో ఒకటి. అయితే అది అన్నంత తేలికగా వచ్చింది కాదు. అనాదిగా వస్తున్న సాంప్రదాయకమైన హక్కులను, కట్టడాలను, ప్రభువర్గం తేలికగా వదులుకోలేదు. అసలు ఆ హక్కులు దురన్యాయ పూరితమని గ్రహించగలిగిన విజ్ఞానం ముందుగా ఉత్పన్నం కావలసిఉంటుంది. అది గ్రహించిన సాధారణ ప్రజానీకం తమ హక్కులను సాధించుకునేందుకు, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా నూతన సామాజిక వ్యవస్థను నిర్మించుకొనడానికి, దానిని పరిరక్షించే నూతన రాజ్య వ్యవస్థలను ఏర్పరచుకోవడానికి కావలసిన ధైర్యం, చైతన్యం తెచ్చుకోవలసి ఉంటుంది. అవి వారికి సాంప్రదాయకమైనా ఆర్థిక వ్యవస్థలోని - సాంప్రదాయక జీవనోపాధులు కాకుండ ప్రత్యామ్నాయమైన అవకాశాలేర్పడినప్పుడే సాధ్యమవుతాయి. ఈ ప్రత్యామ్నాయ

ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ విధానం (Capitalism). ఇది సాంప్రదాయకమైన గ్రామీణ వ్యవస్థను, అందులోని ప్రజా జీవనవిధానాలు, జీవనోపాధులను ఇంచుమించుగా నిర్మూలించి, నూతన విధానాలను ఏర్పరచింది.

అయితే పదహారో శతాబ్ది ప్రారంభం నాటికి భూస్వామ్య వ్యవస్థలో ఏర్పడిన కొన్ని పరిణామాలు, ఆ వ్యవస్థ విచ్ఛిన్నమై పెట్టుబడిదారీ విధానం రూపొంది, స్థిరపడడానికి దారితీసాయి. అందుకు గల కారణాలు ఆర్థిక కారణాలను సవిస్తారంగా రాబోయే ఖండికలో వివరించడం జరిగింది. ప్రస్తుతం గమనించవలసిన అంశమేమిటంటే భూస్వామ్య విధానం విచ్ఛిన్నం కావడమే పెట్టుబడిదారీ విధానం రూపొందిన మూలకారణమనే విషయం. ఈ పరిణామం ప్రభువర్గంలోనూ ప్రారంభం అయింది. బహుకాలంగా సేద్యబానిసలు తమ భూములను సాగుచేసి, ఫలసాయం అందిస్తూ ఉండటాన ప్రభువర్గం అత్యధిక సంపన్నం అయింది. వారిలో పలువురు శాశ్వతమైన తమ ప్రభుత్వాలు, శాశ్వతమైన సేద్యబానిసల సేవల కంటే, వర్తక వాణిజ్యాల్లో తమ ధనాన్ని మదుపు చేయడం వలన సులువుగా త్వరితంగా మరింత లాభాలను ఆర్జించగలమని తెలుసుకున్నారు. సాంప్రదాయక నిర్బంధాల వల్ల ఉదాసీనంగా, నిరాసక్తంగాను సేద్య బానిసలు ప్రవర్తిస్తారు. ప్రభువుల భూములను సాగుచేసే సమయంలో కంటే తమ భూములు తాము సాగు చేసుకొనేటప్పుడు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. అందుచేత ప్రభువులు వారిచేత పనిచేయించుకోవడం కంటే, నియమితమైన ధనాన్ని చెల్లించి వారు స్వేచ్ఛను పొందడమే మేలని భావించి అందుకు ప్రోత్సహించారు. తమ భూములను చిన్న చిన్న చదరాలుగా లేదా కమతాలుగా విభజించి రైతులకు పాలికియ్యడము లేదా అందులో కూలికి పనిచేసేందుకు రైతులను నియమించుకొనడమో చేసి, వ్యవసాయంపై అజమాయిషీ చేయడానికి ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించారు. తాము వర్తక వాణిజ్యాలను చేపట్టి, తమ ఎస్టేట్లను వదలి పట్టణాల్లో, సముద్రతీరాన వాణిజ్యకేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో నివసించసాగారు. ఈ పరిణామాలు అట్లాంటిక్ తీరాలైన ఇంగ్లాండ్, హాలెండ్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాలలో ముందుగా ప్రారంభమైనాయి. సేద్యబానిసలు స్వేచ్ఛపొందడం ప్రభువర్గం తమ భూస్వామ్య హక్కులను వదలి వర్తక వాణిజ్యాలను చేపట్టడం భూస్వామ్య విధానం బలహీనపడటానికి ఒక కారణం.

## 1.2.2 మధ్యయుగంలో వర్తక వాణిజ్యాలు :

మధ్యయుగంనాటి పట్టణాలు కేవలం పరిమాణం మాత్రమేగాని ఆధునిక లక్షణాలను బట్టి ఆ విధంగా వ్యవహరించ వీలులేదని పైన పేర్కొనడాన్ని ఈ సందర్భంలో జ్ఞప్తికి తెచ్చుకోవడం అవసరం. పట్టణాలు, నగరాల అభివృద్ధి ఆధునిక యుగ లక్షణాల్లో ముఖ్యమైనది. ఆధునిక యుగంలో పారిశ్రామికాభివృద్ధి, దానివలన వర్తక వాణిజ్యాల విస్తరణ జరగడంతో పట్టణాలు, నగరాలు విస్తరించడం వృద్ధిచెందడం జరిగాయి. పారిశ్రామిక యంత్రాగారాల్లో పాటుపడేందుకు పల్లెల నుండి అధికాధికంగా జనాభా వలసవచ్చి నివాసాలు ఏర్పరచుకోవడం ఒక ఆధునిక యుగలక్షణమని గుర్తించడం అవసరం. వారేకాక విద్యావంతులు సైతం పరిశ్రమల్లోను, వర్తక నిలయాలలో (Commercial Concerns) ని పాలక యంత్రాంగంలో ఇంజనీర్లు, మెకానిక్‌లు, గుమస్తాలు, అకౌంటెంట్లు మొదలగు అనేక విధాలైన ఉపాధి సౌకర్యాల వలన పట్టణాలు, నగరాల వైపు ఆకర్షితులైనారు. ఈ విధంగా అతి త్వరితంగా జనసాంద్రత కల్గిన పట్టణాలు ఏర్పడడంతో వారికి నిత్యావసరాలైన వస్తువుల క్రయ విక్రయాలతో అవి మరింతగా వర్తక కేంద్రాలుగా రూపొందసాగాయి. అభివృద్ధి చెందుతున్న శాస్త్రవిజ్ఞానం వైద్యరంగాన్ని వృద్ధిచేయడంతో ఆధునిక వైద్యాలయాలు, అందులో వైద్యసిబ్బంది వృద్ధిచెందడం ఉపాధి సౌకర్యాల విస్తరణకు దారితీసింది. ఈ విధమైన తెల్లకాలరు ఉద్యోగులు (White Collar Jobs) పొందడానికి మునుపెన్నడూ లేనంతగా విద్యా, వైజ్ఞానిక సముపార్జన పట్ల ప్రజలు ఆసక్తులైనారు. శాస్త్ర, సాంకేతిక విద్యల అభివృద్ధి పారిశ్రామికాభివృద్ధికి అత్యంతావశ్యకం. కనుక పట్టణాలు, నగరాలు, విద్యావైజ్ఞానిక వికాసాలకు కేంద్రస్థానాలయినాయి. విద్యాలయాల వృద్ధితో ఉన్నతవిద్యావంతులైన వారికి వాటిలో అధ్యాపకావకాశాలు కల్గడం - అనగా మరింతగా ఉపాధి కేంద్రాలుగా ప్రాముఖ్యత సంతరించుకోవడం జరిగింది. కేవలం శాస్త్రీయ, వైజ్ఞానిక విద్యలనే కాక మానవీయ శాస్త్రాలు (Humanities), సామాజిక శాస్త్రాల (Social Sciences) అభివృద్ధి కూడ అక్కడి విశ్వవిద్యాలయాల్లో సాధ్యమైంది. ఈ విధమైన శాస్త్రవిజ్ఞానాభివృద్ధి, విస్తరణ, విద్యావంతుల సంఖ్యలో అభివృద్ధి, మొదలైన కారణాల వలన ప్రజల్లో విమర్శనాత్మకమైన ఆలోచనా విధానం, యుక్తాయుక్తాల విచక్షణ సాధ్యమై, వారిలో అపూర్వమైన సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం ఏర్పడ్డాయి.

పత్రికారంగంలోను గ్రంథ ప్రచురణలోను అంతకుముందు కంటే గణనీయమైన అభివృద్ధి ప్రారంభమైంది. ఇవన్నీ ఆధునిక యుగంలో సంభవించిన సామాజిక, రాజకీయ సంస్కరణలకు, సంఘర్షణలకు అనగా విప్లవాలకు కారణమైనాయి. ఈ మార్పులకు పట్టణాలు, నగరాలు కేంద్రస్థానాలని, అటువంటి పట్టణాలు, నగరాల అభివృద్ధి ఆధునిక యుగలక్షణాల్లో అత్యంత మౌలికమైనదని గ్రహించవలసి ఉంది.

వర్తక వాణిజ్య రంగాల్లోను అనేక విధాలైన ఉద్యోగ పదవులలోను ప్రవేశించిన విద్యావంతులు అంతకుముందు అనగా మధ్య యుగం నాటి ఐరోపా సమాజంలో ఉండేవారు కాదు. ఆనాటి సమాజంలో ఉన్నత వర్గాలకు చెందిన ప్రభువర్గం, మతాధిపతులు, దిగువ వర్గానికి చెందిన సాధారణ ప్రజానీకం అనే రెండే వర్గాలు వుండేవని పైన వివరించడం జరిగింది. కాగా యిప్పుడు పట్టణాల అభివృద్ధి, అక్కడి విద్యావంతులైన ప్రజానీకం మధ్యలో - నూతనంగా అభివృద్ధి చెందుతున్న సామాజిక వర్గం. మధ్యలో వచ్చి చేరిన వారు గనుక వీరిని మధ్యతరగతి (Bourgeoirse) అని వ్యవహరిస్తారు. వీరు సాధారణంగా భావిస్తున్నట్లు 'ఉండీ లేని అనగా అటు ఐశ్వర్యవంతులుకాని యిటు పేద ప్రజానీకం గాని, కాక మధ్య తరగతిగా ఏర్పడినవారుకాదు. వర్తక వాణిజ్యాలతో అపారంగా ధనార్జన చేస్తూ అనతికాలంలోనే ధనవంతులైనవారు, తమ విద్యా విజ్ఞానాలతో గౌరవప్రదమైన, ఆదాయ కారకమైన ఉద్యోగాలు నిర్వహించే అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు మొదలైనవారు, కల్గిన ఐశ్వర్యవంతము, చైతన్యవంతము అయిన సామాజిక వర్గము. తమ ప్రసంగాలతో, రచనలతో ప్రజలను ఉత్తేజితులను చేసి సంస్కరణల ఆవశ్యకతను గూర్చి చాటిచెప్పిన మేధావులు, తాత్త్వికులు, కవులు, కళాకారులు ఈ మధ్యతరగతిలో చేరినవారు. రాజకీయ, సామాజిక సంస్కరణలకు, అందుకు అవసరమైన విప్లవాలకు కారణమైన చైతన్యాన్ని సాధారణ ప్రజానీకంలో ప్రవేశపెట్టినవారు కనుక ఆధునిక యుగానికి సూత్రధారులు మధ్యతరగతివారు. వారి కార్యకలాపాలకు నిలయాలుగా ఆధునిక యుగపరిణామాలకు పట్టణాలు, నగరాలు రంగస్థలాలుగా ఆయినాయి.

ఈ విధమైన ఆధునిక యుగ ప్రారంభానికి కారణమైన మధ్యతరగతి సామాజికవర్గం, పట్టణాలు, నగరాల అభివృద్ధి ఎలా ప్రారంభమై విస్తరించాయో తెలుసుకొనడం అవసరం.

క్రీ.శ. ఆరంభానికి కొన్ని శతాబ్దాల పూర్వము నుండి గ్రీకులు, తర్వాత రోమన్లు విస్తారంగా భారతదేశంతోనూ, భారతదేశం ద్వారా చైనాతోనూ వర్తక వాణిజ్యాలను నిర్వహించేవారు. క్రీ.పూ. ఒకటవ శతాబ్దం నుండి క్రీ.శ. అయిదవ శతాబ్ది వరకు విలసిల్లిన రోమన్ సామ్రాజ్యం విస్తారంగా ఈ వర్తక వాణిజ్యాలను జరుపుతూ ఉండేది. దీనివలన ఇటలీలో అనేక ముఖ్యనగరాలు వర్తక వాణిజ్య కేంద్రాలుగా వృద్ధిచెందాయి. కాని క్రీ.శ. అయిదవ శతాబ్ది చివర రోమన్ సామ్రాజ్యం పతనం చెందటంతో ప్రత్యక్షంగా లేక సూటిగా జరిగే వర్తక వాణిజ్యాలు కుంటుపడినాయి. అయినా భారతదేశం ఉత్పత్తి చేసే సుగంధద్రవ్యాలు, రాతిఉప్పు(Salt Petre) అతి నాజూకైన నూలు, పట్టువస్త్రాలు, మణిమాణిక్యాలు యింకా ఎన్నో ఆసక్తికరమైన వస్తువులను అక్కడి సంపన్న వర్గం కోరుతూనే ఉంది. అయితే ఈ వస్తువులతో వర్తక వాణిజ్యాలను అరబ్బులు కైవసం చేసుకున్నారు. వారు అనేక కష్టనష్టాలు సహించి, భారతదేశానికి సముద్ర మార్గం ద్వారా వచ్చి ఈ వస్తువులను కొని తీసుకెళ్ళి, తమ దేశాలలో కైరో, బాగ్దాద్, డెమాస్కస్ మొదలైన వర్తక కేంద్రాలలో విక్రయించేవారు. ఇటలీలోని వెనీస్, జెనీవా వంటి నగరాలలోని వర్తకులు మధ్యదరా సముద్రమార్గాన ఈ వస్తువులను మొదట అరబ్బు దేశాల్లోని వర్తక కేంద్రాలలో క్రయంచేసి, తమ నగరాలకు తీసుకొని వెళ్ళి తర్వాత ఐరోపా అంతటా సరఫరా చేసేవారు.

అయితే ఈ వస్తువుల సరఫరా, వర్తక వాణిజ్యాల నిర్వహణ అధిక వ్యయప్రయాసలతో కూడినది, ప్రమాద భరితమైనది. సముద్ర మార్గాన ప్రయాణించే సమయాన వర్తకుల పడవులను తరచుగా సముద్ర దొంగలు కొల్లగొట్టేవారు. అదిగాక సముద్రాలపై వీచే తుఫానులు, ఆటుపోటులు చాలా ప్రమాదకారణంగా ఉండేవి. భూమార్గాన సైతం దొంగల దోపిడీలు, సరైన రహదారులు లేని కారణాన వస్తువులకు కలిగే నష్టాలు, యివన్నీ పూరించుకునేందుకు వర్తకులు తమ సరుకులకు అధిక వెలను నిర్ణయించడం జరిగేది. వీటన్నిటివి మించి వందలాదిగ, చిన్న చిన్న సంస్థానాలను (Estates) పరిపాలించే ప్రభువులు ఈ వర్తక వాణిజ్యాలపై ఎగుమతి దిగుమతి సుంకాలను అధిక మొత్తాలలో విధించేవారు. అసలు, ఈ వర్తక వాణిజ్యాలపై ఇటలీ వర్తకులు ఏకస్వామ్యాధికారాన్ని (Monopoly) కలిగి, మధ్యధరా సముద్రంలోనికి ఐరోపా దేశవర్తకులను రానిచ్చేవారు కారు. ఏకస్వామ్యాధికారం చేత వారు నిర్ణయించిన వెలకే వస్తువులను కొనవలసిన స్థితి ఏర్పడినది.

క్రీ.శ. 13వ శతాబ్దంలో సుదీర్ఘకాలం తురుష్కులకు, ఐరోపాలోని వివిధదేశాలకు చెందిన క్రైస్తవరాజ్యాలకు జరిగిన మతయుద్ధాలలో (Crusades) అనేక మంది రాజులు తమ సామంత ప్రభువులతో వారి సైన్యాలతో పశ్చిమాసియాలోని పాలస్తీనా దేశానికి రావడం, అప్పటి ఆసియా దేశాల ఐశ్వర్యము వస్తూత్పత్తి మొదలైన ఆర్థికాంశాలను అవగాహన చేసుకోవడం జరిగాయి. వారు ఇటాలియన్ వర్తకులపై ఆధారపడి, వారు విధించిన అధిక వెలకు వస్తువులను కొనడం కంటె నేరుగా ఆసియా దేశాలతో వాణిజ్య సంబంధాలు పెట్టుకోవడం యుక్తమని తోచింది. మతయుద్ధాలలో అధిక సంఖ్యలో మరణించగా మిగిలిన ప్రభువర్గం స్వదేశాలకు తిరిగి వెళ్ళిన తర్వాత మధ్యధరా సముద్రం ద్వారా కాక, నేరుగా మరొక సముద్ర మార్గం ద్వారా ఆసియా దేశాలతో వర్తక మార్గాలను రూపొందించుకునే ఉద్దేశ్యంతో విస్తారంగా పరిశోధనలను ప్రోత్సహించారు. ఈ పరిశోధనల ఫలితంగా 15వ శతాబ్దాంతంలో వాస్కోడిగామా భారతదేశానికి అట్లాంటిక్, హిందూ మహాసముద్రాల ద్వారా సముద్రమార్గాన్ని కనిపెట్టటం జరిగింది.

భారతదేశంతోను, ఆగ్నేయాసియాలోని తూర్పుఇండియా దీవులు, చైనాదేశంతోను ఐరోపాలోని అట్లాంటిక్ తీరదేశాలు నేరుగా వర్తకవాణిజ్యాలు నిర్వహించగలగడంతో పైన పేర్కొన్న ఆర్థిక పరిణామాలు ప్రాప్తించాయి. వ్యావసాయక ఆర్థికవిధానంపై ఆధారపడిన భూస్వామ్య హక్కులు, హోదాలు కంటె వర్తక వాణిజ్యాలు అనతికాలంలో అధికాదాయాన్ని సమకూర్చగలవని గ్రహించడంతో ప్రభువర్గంలోని దిగువ తరగతి తమ ఎస్టేట్లను, హోదాలను, విక్రయించి పట్టణాలకు పరుగులు తీయసాగారు. వారు బహుకాలంగా తమవద్ద సమకూడుతున్న ధనాన్ని, ఎస్టేట్లను, హోదాలను అమ్మివేయగా వచ్చిన ధనాన్ని వర్తక వాణిజ్యాల్లో పెట్టుబడి పెట్టసాగారు. ఇది పట్టణాల, నగరాల అభివృద్ధికి మూలమైంది.

ఈ పరిణామాలు భూస్వామ్య విధానం క్షీణించి, విచ్ఛిన్నం కావడానికే కాక గ్రామీణమైన కుటీరపరిశ్రమలపై కూడ విశేష ప్రభావాన్ని చూపింది. సులువుగా అధికాదాయాలు లభిస్తుండడంతో జనం నాణ్యమైన, నాజూకైన వస్తువులను కొనడానికి, అందుకు అధికమూల్యం చెల్లించడానికి సంసిద్ధులైనారు. మధ్యయుగం నాటి కుటీర పరిశ్రమల ఉత్పత్తులు వారికి సంతృప్తి కల్గించలేకపోయాయి. అధిక నైపుణ్యం కలిగిన పనివారు పట్టణాలకు తరలివెళ్ళి కార్ఖానాలు నెలకొల్పి పట్టణ ప్రజానీకం మెచ్చే వస్తువులు తయారు చేయనారంభించారు. వారు కొన్ని వర్తకసంఘాలను బోలిన వృత్తిసంఘాలను (Guilds) నెలకొల్పి అధికోత్పత్తులతో అధికాదాయాన్ని పొందగా, గ్రామీణ కుటీర పరిశ్రమలు క్రమంగా క్షీణించాయి.

వాస్తవానికి, భూస్వామ్య యుగంలోని బానిసలవలెనే వృత్తిపనివారు (Crafts men and artisans) కూడ ప్రభువర్గం యొక్క ఆధిపత్యానికి లోబడినవారే. అయితే పట్టణాల పెరుగుదల వలన వారి వృత్తులకు అధిక ప్రాముఖ్యత లభించింది, అధికాదాయం సాధ్యమైంది. కాగా వారు తమ నైపుణ్యాన్ని మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం కల్గింది. అందుచేత, సేద్యబానిసలవలె సంవత్సరం పొడవునా చాకిరి చేసే పరిస్థితులను వారు తొలగించుకొని, అందుకు మారుగా సంవత్సరానికొకసారి, నియమితమైన మొత్తాన్ని చెల్లించే షరతుపై ప్రభువు వర్గం నుండి స్వేచ్ఛను పొందారు. ఈ స్వేచ్ఛ వలన వారికి తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని, విరివిగాను, నాణ్యంగాను వస్తూత్పత్తి చేసే వీలు కలిగింది. పెరుగుతున్న గిరాకీకి ధీటుగా వారు ఉత్పత్తి చేస్తూ అధికాదాయాలను గడించసాగారు.

వీరు, తమలో తమకు ఏర్పడే వ్యర్థమైన పోటీని నివారించుకొనేందుకు, అవసరమైన ముడిపదార్థాలను తెప్పించుకునే సందర్భంలోను, తమ వస్తువులను విక్రయించే సందర్భంలోను పరస్పరం సహకరించుకునే విధంగాను వాణిజ్య, వృత్తిసంఘాలు (Guilds) గా ఏర్పడ్డారు. పదునాలుగు, పదునైదు శతాబ్దాల్లో అనేక ప్రధాన నగరాల్లో రొట్టెలు కాల్చేవారి, మద్యం తయారు చేసేవారిని, ఇనుము పనివారిని, మృదంగులు, దుస్తుల తయారు చేసేవారిని ఈ విధంగా వృత్తి సంఘాలు వీటిని విక్రయించే వర్తకుల సంఘాల వంటి సంఘాలు ఏర్పడి, వృద్ధిచెందాయి. ఈ సంఘాల్లోని సభ్యులు తమలో తమకు ఏర్పడే స్వల్ప విభేదాలను తామే పరిష్కరించుకొనే విధంగా, తమ వృత్తులకు అనుగుణంగా న్యాయ చట్టాలను రూపొందించుకొని, తమ సంఘాల్లోనే తీర్పులు పొందేవారు. ఈ కారణాన ప్రభువులు లేదా మత వ్యవస్థ నిర్వహించే న్యాయస్థానాలతో వీరికి అవసరం లేకపోవడము, ఈ సంఘాలు బలపడిన కొలది భూస్వామ్య విధానము, మతవ్యవస్థ ప్రాబల్యం క్షీణించడమూ జరిగింది. ఫ్రాన్సు, నెదర్లాం

మొదలైన కొన్ని అట్లాంటిక్ తీరంలోని ఐరోపాదేశాల్లో ఈ వాణిజ్య, వృత్తి సంఘాలు పట్టణ, నగర పరిపాలన నిర్వహించడం ప్రారంభమైంది. ఈ విధమైన పాలక సంస్థలను కమ్యూన్స్ (Communes) అనేవారు.

అయితే, వర్తక, వృత్తి సంఘాలు తమ స్వేచ్ఛను సాధించుకొని, ప్రభువర్గం నుండి విముక్తమైనా, ఆ యుగ లక్షణాలకు అనుగుణంగా పెత్తందారీ మనస్తత్వం మాత్రం వదులుకోలేకపోయాయి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తమకెంత అవసరమో, ప్రయోజనకరమో, ఇతరులకు సైతం అలాగే అవసరమూ, ప్రయోజనకరమూ అని గుర్తించలేకపోవడాన, ఈ సంఘాలు బడుగు వర్గాల పీడనకు సాధనాలుగా మారినాయి.

ఈ సంఘాలలో సభ్యులు కాకుండ వేరెవ్వరు, ఆ విధమైన వృత్తులను, వాణిజ్యాన్ని అవలంబించకుండ వీరు కఠినంగా నిషేధించి అనుమతి నిరాకరించారు. వస్తూత్పత్తిలో సరైన నాణ్యతా ప్రమాణాలను పాటించడానికి అటువంటి నిబంధనలను వీరు రూపొందించి అమలుచేశారు. అందుచేత ఈ వృత్తుల్లో ప్రవేశించదలచినవారు తదనుగుణమైన సంఘాల్లో సభ్యత్వం పొందడానికి ముందుగా సంఘసభ్యుడైన ఒక మేస్త్రీ (Master Craftsman) వద్ద పనివానిగా చేరవలసి ఉంటుంది. అతడు ఆ మేస్త్రి వద్ద కేవలం కూడుగుడ్డలను మాత్రమే పొందుతూ, అతడు చెప్పిన పనిచేస్తూ శిక్షణ పొందవలసి ఉంటుంది. శిక్షణకాలం పూర్తి అయిన తరువాత మేస్త్రి అతన్ని స్వంత కార్ఖానా నెలకొల్పుకొనేందుకు అనుమతిస్తూ, సంఘంలో సభ్యత్వాన్ని కూడ కలిగిస్తాడు. అయితే, శిక్షణకాలానికి ఏ పరిమితి ఉండేదికాదు. కనుక కూడుగుడ్డలను మాత్రం పొందుతూ, చెప్పిన పనులన్నీ చేసే పనివాణ్ణి మేస్త్రీలు వదులుకొనేవారు కారు. వారిచేత పనిచేయించుకొంటూ, తాము లాభాలు గడించడానికి వీరు అలవాటుపడ్డారు. కనుక వారికి ఎన్నడూ అనుమతినిచ్చి, విముక్తి ప్రసాదించేవారు కారు.

అయితే, వర్తక వాణిజ్యాలు అభివృద్ధి చెందిన కొలది, వస్తూత్పత్తికి అధిక గిరాకీ లభించడం, గ్రామాల్లోని వృత్తిపనివారు సైతం పట్టణాలకు అధికంగా వలస వెళ్ళడం ప్రారంభమైంది. అటువంటి పరిస్థితిలో ఈ సంఘాలు తమ సభ్యత్వంలేని పనివారిని నిరోధించడంలో విఫలమై క్రమంగా బలహీనపడ్డాయి. తరువాత కాలంలో అనేక వృత్తుల్లో మానవశక్తికి మారుగా యాంత్రికశక్తి ప్రవేశించడంతో ఈ సంఘాల్లో చేరి శిక్షణ పొందవలసిన అవసరం క్రమంగా తగ్గిపోయింది. అయితే ఈ పరిణామాలు పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాల నాటికి విస్తృతమై, వృత్తి వాణిజ్య సంఘాల ప్రాబల్యాన్ని తుదముట్టించడంతో పారిశ్రామిక విప్లవం సంభవించింది. ఈ పరిణామాలను గూర్చి ముందు ముందు మరింత విపులంగా వివరించడం జరిగింది.

### 1.2.3 భూస్వామ్య విధానం : రాజ్యపరిపాలవ వ్యవస్థ :

భూస్వామ్య విధానం అమలులో ఉన్న మధ్యయుగాల్లో సమాజం రెండు వర్గాలుగా ఏర్పడి ఉన్నట్లు పైన వివరించడం జరిగింది. ఈ రెండువర్గాల స్థితిగతులు, జీవనవిధానాలు ఐరోపా ఖండమంతటా, ఎక్కడైనా, ఒకేతీరుగా ఉండేవి. అనగా ఫ్రాన్సు, జర్మనీ, ఇంగ్లండ్ అనే పేర్లతో దేశీయ, జాతీయ వివక్షత లేనే లేకుండ ప్రభువర్గం తమ హక్కులు, హోదాలతో, అలాగే సాధారణ ప్రజానీకం పేదరికం, అజ్ఞానం, నిరంతరశ్రమ చేత మాత్రమే జీవించేవి. ఐరోపా సమస్తమూ "క్రిసెండమ్" అని వ్యవహరింపబడే ఏకైక సమాజ వ్యవస్థగా భావించబడేది. దానికి రాజకీయంగా పవిత్రరోమన్ చక్రవర్తి, మత సాంస్కృతిక విషయాల్లో పోప్ సర్వాధిపతులు.

ఐతే, ఐరోపా యావత్తు ఒకే సమాజంగా, అందుచేత ఒకే రాజ్యంగా భావించడం సాధ్యమైనా, తదనుగుణంగా పరిపాలనా నిర్వహణ మాత్రం అసాధ్యం. అందుచేత పదమూడో శతాబ్దినాటికే పవిత్ర రోమన్ సామ్రాజ్య వ్యవస్థ క్రమంగా బలహీనపడి, నామమాత్రమైంది. కాగా స్థానికంగా ప్రభువర్గం వాస్తవమైన సర్వాధికారాలను పొందిన రాజ్యవ్యవస్థగా రూపొందింది.

స్థానిక ప్రభువులు తమలో తాము ఆధిపత్యపోరాటాలు చేస్తూ, బలహీనమైన ప్రభువులను లొంగదీసుకొని కొందరు మరింత బలవంతులు కావడం అత్యంత సహజమైన పరిస్థితి. ఈ విధంగా బలవంతులైన ప్రభువులు డ్యూక్ (Duke), ఎర్ల్(Earl) కౌంట్ (Count) మొదలైన బిరుదాలతో తమ ఎస్టేట్లను చిన్నరాజ్యాలుగా విస్తరింపజేశారు. వారు తమ ఆధీన ప్రాంతాల్లో, లేదా రాజ్యల్లోని ప్రభువుల నుండి కప్పం వసూలు చేసేవారు. వారినుండి సైనికపరమైన సేవలను పొందేవారు. వారినుండి పొందిన కప్పంతో సైన్యాన్ని పెంపొందించుకుంటూ, తమలో తాము ఆధిపత్యపోరాటాలు చేసుకోవడం, అవసరమైనప్పుడు తమ సైన్యంతో రాజు తరపున అతని శత్రువులతో పోరాడడమూ తమ కార్యక్రమంగా కలిగి ఉండేవారు.

ఉన్నత ప్రభువర్గంలోని ఆధిపత్య పోరాటాలు కలిగించే అశాంతిని నివారించడానికి క్రమంగా వారు ఒక సమాఖ్యగా ఏర్పడి, దానికి తమలో అగ్రగణ్యుడైన వానిని నాయకునిగా ఎన్నుకోవడం ప్రారంభమైంది. వారు తమలో అధిక సైనికబలము, రాజ్యాదాయము కలిగిన వానిని తమ నాయకునిగా ఎన్నుకొనడం జరిగేది. అటువంటి నాయకుడు రాజు కాగా, అతడు కేవలం సమానులలో ప్రథముడు మాత్రమే.

తక్కిన ప్రభువర్గం రాజుకు పరిపాలనలో సాయపడే ఒక ప్రతినిధుల సభకు తమ ప్రతినిధులను ఎన్నుకునేవారు. ఈ ప్రతినిధులు సాధారణంగా డ్యూక్, ఎర్ల్ వంటి ఉన్నతస్థాయి ప్రభువుల నుండి మాత్రమే ఎన్నికయ్యేవారు. ఈ ప్రతినిధుల సభను పార్లమా (Parlament) ఎస్టేట్స్ జనరల్, డయట్ (Diet) మొదలైన పేర్లతో, ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క పేర వ్యవహరించడం జరిగేది. అనేక ఐరోపా దేశాల్లో భూస్వామ్య వ్యవస్థ బలహీనం అవుతున్న కొద్దీ ఈ ప్రతినిధుల సభలు కూడా బలహీనం అవుతూ వస్తున్నాయి. ఐనప్పటికీ పన్నులు, సుంకాలు విధించి, వసూలు చేయడం వంటి ఆర్థిక వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాలు మాత్రం ఈ ప్రతినిధుల సభ ఆమోదం పొందకుండ రాజు స్వతంత్రించడానికి వీలులేదు. ప్రభుత్వ వ్యవస్థలోని ఉన్నత పదవులు, మంత్రులు, సేనాధిపతులు, విదేశీ రాయబారులు మొదలైనవాటికి ప్రధానంగా ఉన్నత ప్రభువర్గం - డ్యూక్, ఎర్ల్ వంటి హోదాలు కలిగిన ప్రభువుల నుండి మాత్రమే నియామకాలు జరిగేవి.

రాజు తన వాస్తవాధికారాలను ప్రయోగించి, ప్రభువులను అదుపుచేయ ప్రయత్నించినప్పుడు వారు పలువురు కలిసి తిరుగుబాటు చేయడం రాజును పదవీచ్యుతుని చేయడం జరిగేది. ఆ కారణాన రాజు ప్రభువర్గాన్ని సమర్థిస్తూ, వారి సమర్థతతో తన పదవిలో కొనసాగేవాడు. ప్రభువుల పరస్పరకలహాల్లో విచారణ జరిపి, తీర్పునిచ్చే అధికారం కూడ రాజుకు లేదు. ప్రభువులు తాము నిర్వహించే న్యాయస్థానాల్లో సాధారణ ప్రజలను విచారించి శిక్షించేవారు కాని, తమను విచారించి శిక్షించే ఎటువంటి వ్యవస్థను (మత వ్యవస్థ మినహా) బలపడనీయలేదు. వారు తమ పరస్పర స్పర్థలను ద్వంద్వయుద్ధంచేసి, ఎవరో ఒకరు ఓడి మరణించడమే తమ తగవుకు పరిష్కారంగా వ్యవహరించేవారు.

అటువంటి సర్వాధిపత్యాన్ని కలిగి ఉండడా ప్రభువులు ముఖ్యంగా ఉన్నత ప్రభువర్గం తమ తమ ఏలుబడిలోని ప్రదేశాలను సంపూర్ణమైన స్వయంపరిపాలనాధికారంతో పరిపాలించేవారు. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, వాణిజ్యం మొదలైన వివిధ వృత్తులకు చెందిన సమస్త ప్రజానీకం నుండి సాధారణ ప్రభువులు పన్నులు, సుంకాలు వసూలు చేయడం, అందులో కొంత భాగం మిగుల్చుకొని తక్కినది తమపై అధిపతులైన ఉన్నత ప్రభువర్గానికి చెల్లించడం - అలాగే ఉన్నత ప్రభువర్గం తమకు సాధారణ ప్రభువర్గం నుండి అందిన సొమ్ములో కొంతభాగం మిగుల్చుకొని, తక్కినది తమ అధిపతులైన ప్రభువులకు - వీరు రాజుకు, కప్పంగా చెల్లించడం పరిపాలనలోని ప్రధానాంశం. అనగా ఉత్పాదకులైన సామాన్య ప్రజానీకం నుండి వివిధ అంతస్తుల్లో, వివిధ హోదాల్లో ఏర్పడి ఉన్న ప్రభువర్గం ద్వారా రాజ్యాదాయం రాజుకు చేరేది.

## 1.2.4 మధ్యయుగంలోని మత వ్యవస్థ :

పదహారో శతాబ్ది ప్రారంభం నాటికి ఐరోపా యావత్తు 'క్రిసెండమ్' (Christendom) అనే పేర ఏకసమాజంగా, ఏక్యరాజ్య వ్యవస్థగా భావించబడుతున్నట్లు పైన వివరించడం జరిగింది. వీటిలో ఏకసమాజం అనేది ఏకరాజ్య వ్యవస్థ కంటె వాస్తవమైంది. ప్రభువర్గం ప్రాబల్యం పొందడాన ఏకరాజ్యవ్యవస్థ కేవలం నామమాత్రావశిష్టం అయిందని పైన వివరించడం జరిగింది. కాని ఏకైక మతానుసరణ వలన, ఆ మత వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం వలన ఏకసమాజవ్యవస్థ నాటి కింకా ప్రబలంగా ఉంది. 'క్రిసెండమ్' అనే పదానికి "క్రైస్తవాధిపత్యంలోని ప్రదేశం" అని అర్థం చేసుకోవచ్చు. ఐరోపాలోని సమస్త ప్రజానీకము భాషా, సంస్కృతుల పరిగణన లేకుండ రోమన్ కాథలిక్ మతవ్యవస్థ యొక్క ధార్మిక ఆధిపత్యంలో ఉండడమే క్రిసెండమ్ యొక్క సార్ధకత. రోమన్ కాథలిక్ మతం కాక వేరొకటి మధ్య, పశ్చిమ ఐరోపాదేశాల్లో లేదు. ఆ మతవ్యవస్థకు రోమ్‌నగరం లోని సెంట్‌పీటర్స్ చర్చి యొక్క ప్రధాన మతాధిపతి అయిన పోప్ సర్వాధిపతి. ఐరోపాలోని తూర్పుప్రాంత దేశాలు గ్రీక్ ఆర్థడాక్స్ చర్చి అనే మరో మత వ్యవస్థలో చేరి, ఆ వ్యవస్థకు అధిపతి అయిన పెట్రార్క్ (Petrarch) ఆధిపత్యానికి లోబడి ఉన్నాయి.

పధహారో శతాబ్దం వరకు రోమన్ కాథలిక్ మత వ్యవస్థ దైవికమైన సంస్థగా ప్రజల అచంచల భక్తిగౌరవాలను అందుకుంటూ ఉంది. ఆ సంస్థకు విధేయులు కానివారు దైవధిక్కారం చేసినట్లు భావించి, వెలివేయబడేవారు. వెలివేయడం అంటే సమాజం నుండి గెంటివేయడం, వారితో ఏ సంబంధం కలిగి ఉండకపోవడం కాదు - 'వెలి' అంటే మరణశిక్ష అమలు జరపవలసిందిగా మతాధిపతులు ప్రభువులను ఆజ్ఞాపించడం, ప్రభువులు మారుమాట్లాడక ఆ శిక్షను అమలుచేయడం. వివిధ ప్రదేశాలలో మత వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే మతాధిపతుల సహాయంతో పోప్ మధ్య, పశ్చిమ ఐరోపా అంతట రాజులు, సమస్త ప్రభువర్గం పైన కూడ ఆధిపత్యం వహించి, వారిని పదవుల నుండి తొలగించే అధికారం కలిగి ఉండేవాడు.

క్రీస్తు శకం ఐదోశతాబ్దిలో దండయాత్రలు జరిపి రోమన్ సామ్రాజ్యాన్ని, ఐరోపా ప్రజల నాగరికతా సంస్కృతులను, విచ్ఛిన్నం చేసిన అనేక అనాగరిక తెగలకు చెందినవారు స్థిరజీవనం పొందడానికి, నాగరికతా సంస్కృతులను అలవరచుకోడానికి ఆనాడు చర్చి విశేషమైన కృషి చేసింది. కేవలం ఆధ్యాత్మిక ప్రబోధాలేకాక, వారిలో విద్యావ్యాప్తికి, నైతికమైన శీలసంపద వృద్ధి చెందడానికి చర్చి చేసిన కృషి వలన క్రమంగా ఆ వ్యవస్థకు బలీయమైన ప్రభావం చేకూరి ప్రజలను విధేయులుగా చేసుకోగలిగింది. పోప్‌కు, అతని అనుచరులైన మతాధిపతులకు ప్రజల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన గౌరవ ప్రపత్తులు కలిగాయి. క్రమంగా అదే విధానాలను కొనసాగిస్తూ మతవ్యవస్థ ధార్మికమైన, ఆధ్యాత్మికమైన అన్ని అంశాల్లో అన్ని అంశాల్లో నియమ నిబంధనలను, ఆచారాలను విధించడానికి అర్హత కలిగి ఉంది. పోప్, అతని వద్ద సర్వోన్నతమైన సభలోని సభ్యులు ఈ విధమైన వివరణలను ఇయ్యడానికి, నియమనిబంధనలను విధించడానికి, వాటిని ఉల్లంఘించిన వారిని శిక్షించడానికి తిరుగులేని అధికారం కలవారైనారు. పైన వివరించినట్లు మతవ్యవస్థ చేతిలోని సాధనంగా రాజులు, ప్రభువులు మతవ్యవస్థ నిర్ణయాలను, విధించే శిక్షలను అమలు జరుపుతూ ఉండేవారు. తద్వారా క్రైస్తవ ధర్మాన్ని పరిపాలిస్తూ, అధర్మాన్ని శిక్షించే అధికారం మతవ్యవస్థ కలిగి ఉంది.

మతవ్యవస్థ విద్యాలయాలను నిర్వహించి, విద్యావ్యాప్తికి కృషి చేసేది. అందులో మతాధిపతులే అధ్యాపకులు, మతపరమైన జ్ఞానము అక్కడ బోధింపబడే విద్య. సాధారణంగా ప్రభువర్గానికి, మతాధిపతుల వర్గానికి చెందిన వారి పిల్లలే ఆ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసేవారు. వారిలో అధికసంఖ్యాకులు మత వ్యవస్థలోనే చేరిపోయేవారు. ప్రభువర్గాల్లో తమ ఎస్టేట్లను, ఆస్తిపాస్తులను విభజించి తమ సంతానానికి పంచే అవసరం రాకుండా కొందరు సంతానాన్ని మత వ్యవస్థలో ప్రవేశపెట్టేవారు. మతవ్యవస్థలో చేరినా, వారి సుఖభోగాలకు, హోదాలకు ఏ మాత్రం భంగం లేకుండేది. దేశంలోని పంటపొలాల్లో ముప్పదిశాతం పైగా ప్రభు వర్గానికి చెందినవైతే మరొక ముప్పదిశాతం మతవ్యవస్థకు చెంది ఉండేది. ఆ భూములపై ఫలసాయంతో మతాధిపతులు సైతం అపారమైన సుఖభోగాల్లో తేలియాడుతూ ఉండేవారు.

ప్రభువర్గం నిర్వహించే న్యాయస్థానాల్లో న్యాయవాదులుగా, తీర్పులను ఇయ్యడంలో ప్రభువులకు ప్రధాన సలహాదార్లుగా మతాధిపతులే పదవులనాక్రమించి ఉండేవారు. న్యాయ చట్టాలు పూర్తిగా మతపరమైనవి. న్యాయవాదులు మతపరమైన న్యాయాన్నే అనుసరించి వాదించేవారు.

ఈ విధంగా పదిహేనో శతాబ్ది వరకు, మధ్యయుగాల నాటి ఐరోపా ప్రజాజీవనం - విద్యా, విజ్ఞానము, ఆలోచనలు, ఆచారాలు సమస్తము మతపరంగానే ఉన్నాయి. మానవుడు పాపి - అతడు తన పాపపరిహారం చేసుకోవడమే జీవన సార్థకత. కరుణామయుడైన దేవుని శరణువేడి ఏ విధమైన ఆశాపాశాలకు బద్ధుడు కాకుండ, నియమబద్ధంగా నిరాడంబరంగా జీవిస్తూ, తన పాపాలను కడిగివేసుకొని, పరలోక సామ్రాజ్యంలో అడుగుపెట్టే అర్హతను సంపాదించుట కొరకే మానవుడు ఈ లోకంలో జీవించాలని మత వ్యవస్థ బోధించేది.

మతవ్యవస్థను నిర్వహించడంలో సర్వాధిపతి అయిన పోప్ క్రీస్తు ప్రభువుకు ప్రతినిధిగా, సెంట్‌పీటర్ వారసునిగా భావించబడేవాడు. అతడు తన జీవితకాలం ఆ పదవిలో కొనసాగే అధికారంతో కార్డినల్ (Cardinal) అనబడే ఉన్నత మతాధిపతులు సమితి (College of Cardinals) చేత ఎన్నుకోబడేవాడు. ఈ ఉన్నత మతాధిపతులు తమ విద్యావినయాలు, నడవడి, మత వ్యవస్థకు చేసిన విశేషమైన సేవ ప్రాతిపదికలుగా పోప్ చేత ఎంపిక చేయబడినవారు. వీరుకాక రోమ్‌నగరంలో అనేక మతాధికారులు, (Clerks) న్యాయవాదులు, ఇంకా అనేక విధాలైన ఉన్నతోద్యోగులతో కూడిన సభ, కార్యాలయాలు, మత వ్యవస్థ పరిపాలనకు ఉంటాయి.

ప్రాదేశికమైన (Local) మత పరిపాలన కొరకు క్రైస్తవ మండలం యావత్తు కొన్ని విభాగాలు ప్రావిన్స్ (Province) అనే పేర విభజింపబడింది. ప్రభువుల ముఖ్యపట్టణాలు, రాజుల రాజధానులు, ఇంకా ఇతర ప్రధాన పట్టణాల్లో ప్రోవిన్షియల్ కార్యాలయాలు ఉంటాయి. ఈ ప్రాదేశిక విభాగాలకు ఆర్చి బిషప్‌లు అధిపతులు. వీరిలో నుండే కార్డినల్స్, ఇతర ఉన్నత మతాధిపతులు ఎంపిక చేయబడేవారు. రాష్ట్రాలు జిల్లాలవలె డయోసిస్ (Diocese) అనబడే విభాగాలు చేయబడేవి. వాటిపై బిషప్పులు అధిపతులు. డయోసిస్ కంటె చిన్న విభాగం పారిష్ (Parish). ఇవి గ్రామాలు, పట్టణాల్లోని వివిధ విభాగాలు.

ఈ విధమైన పరిపాలనా విధానంలో వివిధ స్థాయిల్లో, హోదాలతో కూడిన ఉద్యోగ, అధిపతులతో కూడిన అధికార యంత్రాంగం (bureaucracy) వలన మతవ్యవస్థ సామ్రాజ్యంలోని సామ్రాజ్యంగా రూపొందింది.

ఈ అధికారం యంత్రాంగాన్ని నిర్వహించేందుకు, చర్చిలు, విద్యాలయాలు నిర్మించి, నిర్వహించేందుకు మత వ్యవస్థ సైతం ప్రభువులు, రాజువలెనే ప్రజానీకంపై కొన్ని విధాలైన పన్నులు విధించి వసూలు చేసేది. అంతేకాక బహుకాలంగా ప్రభువులు, రాజ్యాధిపతుల నుండి విస్తారంగా భూములను సంపాదించింది. దేశంలోని పంటభూముల్లో మూడోవంతు పైగా మత వ్యవస్థకే చెంది ఉండేది. వీటిపై లభించే ఆదాయంతో మతాధిపతులు - పై నుండి క్రిందికి భోగలాలసులు, నైతిక, ధార్మిక జీవనం పట్ల నిరాసక్తులు అయి ఉండేవారు. కొందరు డ్యూక్‌లు, ఎర్ల్‌లు వలె పోప్ స్వయంగా రాజ్యం సంపాదించి పరిపాలిస్తూ, సేనానాయకుడై పోరాటాలు చేస్తూ ఉండేవారు.

పైన పేర్కొన్న మతాధిపతి వర్గాన్ని "లౌకిక మతాధిపతు" లని వ్యవహరించేవారు. అనగా ప్రాపంచిక జీవనులైన సాధారణ ప్రజానీకం నడుమ, వారిని ధార్మిక జీవనులుగా నడిపించడానికి పాటుపడేవారని అర్థం. వీరుకాక పూర్తిగా లౌకిక జీవితాన్ని వదలి, శీలము, నిరాడంబరత్వము, ఆధ్యాతిక జీవనం ప్రధానంగా, క్రీస్తు ప్రభువు జీవించినట్లే అనుకరించి, జీవించే కొందరు మతాధిపతులుండేవారు. వీరు బిషప్పులు, ఆర్చి బిషప్పులకు లోబడి ఉండే పనిలేదు. వీరు స్వతంత్రంగా వ్యవహరించే కొన్ని సంఘాలు (Orders) కు చెంది ఉండేవారు. ఆ సంఘాలు పోప్‌కు మాత్రమే లోబడి ఉండేవి. ఆ సంఘాలకు అబ్బోట్స్(Abbots) అనబడే అధిపతులుండేవారు. ఈ సంఘాలు మతప్రచారానికి, ఉన్నతమైన విజ్ఞానాన్ని బోధించడానికి ఉద్దేశించినవి. విద్యాలయాలు, ఇతర ధార్మిక సేవాసంస్థలు వీరి అధీనంలో ఉండేవి.

అయితే పదునైదవ శతాబ్ది నాటికి మతవ్యవస్థలో మతపరమైన జ్ఞానము, సత్ప్రవర్తన పూర్తిగా లోపించాయి. మతాధిపతులు పూర్తిగా ప్రభువర్గంతో చేరిపోయి స్వాధికారవర్గంగా రూపొందారు. పన్నుల వసూళ్లు, పంటపొలాల నుండి ఫలసాయం పొందుట, సాధారణ ప్రజానీకాన్ని పీడించడం వారి ప్రవృత్తి అయింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. ఫ్రెంచి విప్లవ కాలంనాటి ఐరోపా పరిస్థితిని వివరించుము.
2. మధ్యయుగపు భూస్వామ్య పరిస్థితిని, మతవ్యవస్థను వివరించుము.

**చదువదగిన గ్రంథాలు :**


1. Kettelebey, C.D.M., : A History of Modern Europe
2. Hazen Cd : A History of Modern Europe (1789 - 1945)
3. Rose Halland : The Revolutionary and Napoleonic Era


**- ఆచార్య వి. సుందరరామశాస్త్రి**

పాఠం - 2

# ఫ్రెంచి విప్లవానికి పూర్వరంగం : ఆధునిక యుగం, దాని లక్షణాలు


2.0 లక్ష్యం

2.1. ఉపోద్ఘాతం

2.2 జాతీయరాజ్యాలు : నిరపేక్షరాచరికాలు

2.2.1 జాతీయరాజ్యాలు : భూస్వామ్యవ్యవస్థ విచ్ఛిన్నం

2.2.2 జాతీయరాజ్యాలు : మధ్యతరగతి ప్రాబల్యం

2.2.3 జాతీయరాజ్యాలు : మత వ్యవస్థ

2.2.4 ప్రాంతీయ భాషా సారస్వతాలు

2.2.5 జాతీయ రాజ్యాల వికాసము - విస్తరణ

2.2.6 జాతీయరాజ్యాల పరిణామక్రమం

2.2.6.1 పశ్చిమ ఐరోపా

2.2.6.2 మధ్య ఐరోపా

2.3 జాతీయరాజ్యాలు - ఆర్థికపరిణామాలు

2.3.1 వాణిజ్యరాజ్యవిధానం (Mercantilism)

2.3.2 వలసరాజ్యవిధానం (Colonialism)

2.4 సామ్రాజ్యవిస్తరణవిధానం (Imperialism)

2.5 శాస్త్ర, సాంకేతిక విజ్ఞానవికాసం

2.6 మానవతావాదం (Humanism)

2.7 విజ్ఞానోద్దీప్తయుగం (Enlightenment)


## 2.0 లక్ష్యం :

ఫ్రెంచివిప్లవంతో ప్రారంభం అయి, ఐరోపా ఖండంలోని అనేక దేశాల్లో ప్రజలు తమకు కావలసిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను నిర్మించుకొనేందుకు విప్లవమార్గాన్ని అనుసరించారు. ఈ విధంగా ఫ్రెంచి విప్లవం ఐరోపాఖండంలో చాలామేర నూతన శకారంభానికి శ్రీకారం చుట్టింది. ఇటువంటి ప్రజాఉద్యమాలు, వాటికి కారణమైన నూతన భావచైతన్యమూ అపూర్వమైనవి, అనగా అంతకు పూర్వం కానవచ్చేవి కావు. ఇవి ఆధునిక యుగ లక్షణాలు. ఇంతకు ముందు పాఠంలో మధ్యయుగ లక్షణాలను, అవి క్రమంగా ఆధునికయుగానికి దారితీసిన పరిణామాలను గూర్చి వివరించడం జరిగింది.

ఈ అంశాలను మరింత స్పష్టపరచి, ఆధునికయుగ లక్షణాలను, ఆధునికయుగం అవతరించడంలోని అవరోధాలు, వాటిని వివిధ దేశాల ప్రజలు అధిగమించిన తీరు ఈ పాఠంలో నిరూపించడం జరిగింది. ఈ పరిణామ క్రమంలో ఆధునికయుగాన్ని ఆవిష్కరించడం ఫ్రాన్సు దేశంలో, ఫ్రెంచి ప్రజలు జరిపిన విప్లవ పోరాటంతో ప్రారంభమయింది.

## 2.1. ఉపోద్ఘాతం :

ఫ్రెంచివిప్లవం అనేక కారణాల సమిష్టి ఫలితంగా ఉత్పన్నమైనా, అది తుదకు ఫ్రాన్సు దేశంలో నిరపేక్షరాచరికాన్ని ఎదిరించి, వ్యక్తి స్వేచ్ఛ సమానత్వాలను, ప్రాథమికమైన మానవ హక్కులను, గుర్తించి పరిరక్షించే ప్రజాస్వామ్యపరిపాలన వ్యవస్థను

నెలకొల్పడం ప్రధానోద్దేశంగా జరిగింది. కనుక ఈ విప్లవం పూర్తిగా రాజకీయ కారణాలతో, లక్షణాలతో, సాగిందని రాజకీయఫలితాలను ఇచ్చిందని భావించడం కద్దు. రాజకీయవిప్లవాలకు ఫ్రాన్సు పుట్టినిల్లు, పారిశ్రామిక, వాణిజ్య విప్లవాలకు బ్రిటన్ పుట్టినిల్లు అని పలువురు చరిత్రకారులు, ఒకరిననుసరించి ఒకరు పదేపదే వ్రాస్తూ ఉండడం తరచుగా గమనించవచ్చు. నిజానికి రాజకీయవిప్లవాలనేవి ప్రత్యేకంగా ఉండవు. సాంఘిక, ఆర్థిక సమస్యలు సమిష్టిగా తుదకు రాజకీయ సమస్యలుగా పరిణమించి, ప్రజానీకాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసినప్పుడు విప్లవాలు సంభవించాయి. అయితే ఇటువంటి విప్లవాలు మాత్రం పూర్తిగా ఆధునిక యుగంలోనే కానవస్తాయి. కనుక, ఈ అసంతృప్తులు ప్రజల్లో చైతన్యాన్ని, ఉద్వేగాన్ని కలిగించి విప్లవోన్ముఖులుగా చేయడానికి కారణమైన పూర్వరంగాన్ని గూర్చిన సమగ్ర పరిణామక్రమాన్ని ఈ క్రింది విధంగా విశ్లేషించి, అవగాహన చేసుకోవచ్చు.

## 2.2 జాతీయరాజ్యాలు - నిరపేక్షరాచరికాలు :

సాధారణ ప్రజానీకంలో నూతనమైన ఆలోచనా ధోరణులు, ఆకాంక్షలు ఏర్పడడానికి, వాటిని సార్థకం చేసుకొనేందుకు వారు సమైక్యంగా ఉద్యమించడం ఒక అసాధారణ పరిణామం. ఈ పరిణామం వారిలో ఏర్పడిన సౌభ్రాత్రభావం (Feeling of fraternity) నుండి ఉత్పన్నమైందని నిస్సంశయంగా చెప్పవచ్చు. ఒక దేశప్రజానీకం తామందరు ఒకరినొకరు సహోదరులమని భావించుకోవడం, తాము అనుభవిస్తున్న కష్టసుఖాలు అందరికి సమానమైనవని, సుఖాలను సమంగా అనుభవించడంలో అందరికి సమానమైన హక్కు ఉందని గుర్తించడం సౌభ్రాత్రభావం. దీనికి రెండవవైపు తమకు ప్రాప్తించిన ఇక్కట్లను, దురవస్థలను నివారించుకోవడంలో తామందరు సమానంగా పాటుపడాలని గుర్తించడం. ఈ సౌభ్రాత్రభావం దేశప్రజానీకంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని, సమానావకాశాలను కల్పించి, సమిష్టిగా తమ అభివృద్ధికి కృషి చేసేందుకు పురి కొల్పుతుంది. ఈ సమానత్వ సౌభ్రాత్ర భావాలే రాజకీయ దృక్పథం నుండి చూచినప్పుడు జాతీయతాభావంగా (Nationalism) అది ఆ దేశ ప్రజానీకాన్ని సమైక్య పరచి ముందుకు నడిపించే భావనాశక్తిగా నిర్వచించబడుతుంది. ఐరోపాఖండ చరిత్రలో పదహారో శతాబ్ది ప్రారంభంనుండి ఈ విధమైన భావజాలము, అవి కల్గించే జాతీయ సమైక్యతా ధోరణులు ప్రారంభమైనట్లు, అవి క్రమంగా ప్రబలమై ప్రజానీకాన్ని విప్లవమార్గాన నడిపించి, సాంఘిక, రాజకీయ రంగాల్లో నూతన వ్యవస్థలను నిర్మించినట్లు గ్రహించవచ్చు. ఫ్రెంచి విప్లవం ఇటువంటి జాతీయభావాల ఫలితంగా ఉద్భవించి, అందలి పరిణామాలు ఈ భావాలను మరింత ప్రబలం చేసినట్లు ముందు అధ్యాయాల్లో గ్రహించ గలుగుతారు.

అయితె ఈ విధమైన పరిణామాలు మాట్లాడినంత, గ్రంథాల్లో కొద్ది సంఖ్యగల పేజీల్లో వివరించినంత సులువుగాను, త్వరితంగాను జరగవు. అవి పురోగామిశక్తులు (Progressive forces) అనగా ముందుకు నడిపించే శక్తులకు ప్రతీపశక్తుల (Reactionary forces) అనగా ఆటంకాలు కలిగించే సాంప్రదాయిక శక్తులకు నడుమ బహుకాలం సాగే సంఘర్షణలో క్రమక్రమంగా ఏర్పడే పరిణామ ఫలితాలని గుర్తుంచుకోవాలి. ఈ విధమైన పరిణామక్రమంలో ఐరోపా ఖండంలో మొట్టమొదటగా ఒక స్పష్టమైన జాతీయ రాజ్యంగా సుస్థిరపడింది ఫ్రాన్సు. కాగా, ఇదే విధమైన పరిణామ ప్రభావాల్లో అట్లాంటిక్ తీరంలోని స్పెయిన్, పోర్చుగల్, నెదర్లాండ్స్ (లేదా హాలెండు) మొదలైన దేశాలు ఫ్రాన్సును అనుగమిస్తూ పురోగమించాయి. ఈ విధంగా జాతీయరాజ్యాలు ఏర్పడి, స్పష్టమైన స్వరూపాలను ధరించడంలో ప్రధాన సాధనం అయింది నిరపేక్షరాచరికం (Absolute Monarchy).

నియంతృత్వ, లేదా నిరపేక్ష రాచరికమనగానే, అటువంటి రాచరికవ్యవస్థ యొక్క దుష్పరిపాలన నుండి విముక్తులు కావడానికి ప్రజానీకం విప్లవసంఘర్షణలు జరిపిందనగానే స్ఫురించే అర్థం - నియంతలు తమ అహంకారము, అధికారగర్వాలకు ప్రజలను గురిచేశారని అయితే వారికి అటువంటి అవకాశం ఎలా వచ్చింది. కేవలం తమ సైనికశక్తి చేత మాత్రమేనా ?

మధ్యయుగంలో మధ్య, పశ్చిమ ఐరోపా ప్రజానీకం యావత్తు, "క్రిసెండమ్" (Cristendom) అనే పేర ఒకే సమాజవ్యవస్థలో చేరి ఉందని పైన వివరించడం జరిగింది. అటువంటి స్థితిలో ప్రత్యేకమైన జాతీయభావాలతో ప్రజానీకం

వివిధదేశాలకు చెందిన వారుగా స్పష్టపడడం, జాతీయరాజ్యాలు అవతరించడం అసాధ్యం. పరిపాలనా సౌలభ్యం కొరకు ఈ యావత్ప్రజానీకము చిన్నచిన్న స్థానిక ప్రభుత్వాలుగా, వివిధ హోదాలకు చెందిన ప్రభువర్గం యొక్క ఆధిపత్యంలో ఉండేవారని కూడా పైన వివరించడం జరిగింది. కనుక జాతీయరాజ్యాల ఏర్పాటు ఈ ప్రభువర్గాన్ని బలహీనపరచి, రాజ్యవ్యవస్థ బలపడడంచేత జరిగిందని గ్రహించాలి. అలాగే అస్పష్టమైన, అవాస్తవికమైన "క్రిసెండమ్" అనే ఊహామాత్రమైన సామాజిక వ్యవస్థ నుండి బయటపడి, స్పష్టంగా నిర్వచించగలిగిన లక్షణాలతో ప్రజానీకాలు జాతీయ సమాజాలుగా ఏర్పడినప్పుడే, తమను చిన్న చిన్న ప్రభుత్వాల్లో బంధించిన ప్రభువర్గం నుండి వారు రాజకీయంగా **విముక్తులు** కాగలిగేది. అటువంటి రాజకీయవిముక్తి వలన, అందుకు సాధనంగా వారు బలపరిచిన పటిష్టమైన రాజ్యవ్యవస్థల వలన నిరుపేక్షరాచరికాలు ప్రభవించి, ప్రబలమైనాయి. అనగా, అది ప్రజలు కోరుకున్న పరిణామమే, ఒకానొక సమయంలో కొంత ప్రయోజనాన్ని చేకూర్చినదేనని తెలుసుకోవచ్చు.

భూస్వామ్యవిధానం బలహీనపడి విచ్ఛిన్నం కావడం నుండే నిరపేక్షరాచరికం పుట్టుకొచ్చింది. అది పశ్చిమ, మధ్య ఐరోపా దేశాలను జాతీయ రాజ్యాలుగా రూపొందించి, ఆధునిక యుగం వైపునకు నడిపించింది. అయితే అటువంటి పరిణామాలకు దారితీసిన పరిస్థితులను సక్రమంగా అవగాహన చేసుకున్నప్పుడే, ఆ పరిణామాల స్వరూప, స్వభావాలు సరిగా బోధపడగలవు. ఈ పరిణామాలను రెండు వైపులనుండి పరిశీలించవలసి ఉంది. ఒక వైపు మధ్యయుగంనాటి సాంప్రదాయిక వ్యవస్థలు బలహీనపడి, విచ్ఛిన్నం కావడం. రెండవవైపు ప్రజానీకంలో నూతన భావాలు, ఆకాంక్షలు అంకురించి, క్రమంగా వికాసం చెందడం.

## 2.2.1 భూస్వామ్యవ్యవస్థ విచ్ఛిన్నం :

ఐరోపా ఖండమంతటిని చిన్న చిన్న స్థానిక ప్రభుత్వాలుగా విభజించి, హోదాలు, అధికారాలు, హక్కులు తమ వరకు ప్రత్యేకించుకొని, జాతీయ రాజ్యాల ఆవిర్భావానికి అవరోధంగా ఉన్న భూస్వామ్యవ్యవస్థ కొన్ని కారణాల వలన పదమూడు, పదునాలుగు శతాబ్దాలనుండి బలహీన పడసాగిందని పైన వివరించడం జరిగింది. అందుకు మొదటికారణం ప్రభువర్గం సంఖ్యలో క్షీణించడం, రెండవది వారి ప్రాబల్యం క్షీణించడం.

పదమూడో శతాబ్ది మొదటి పాదంలో ప్రభువర్గం సంఖ్యాబలం తగ్గిపోవడం "క్రూసేడు" లనే మతయుద్ధాల నుండి ప్రారంభమైంది. తురుష్కుల దండయాత్రల్లో తూర్పు ఐరోపా, ఆసియా మైనర్ ప్రాంతాల్లో ఈ మతయుద్ధాలు జరిగాయి. ఆసియావాసులు అయిన తురుష్కులు హిమాలయ ప్రాంతంలోని తమ స్వస్థలంనుండి బయలుదేరి పడమటగా దండయాత్రలు చేసి పర్షియా, ఆసియామైనర్ ప్రాంతాలను ఆక్రమించారు. ఆసియా మైనర్‌లోని పాలస్తీనా, సిరియా దేశాలు, క్రైస్తవుల పుణ్యస్థలాలైన జెరూసలెమ్, బెత్లహేమ్ మొదలైనవి వారి హస్తగతమైనాయి. వారి దండయాత్రా ప్రమాదం నుండి ఈ పుణ్యస్థలాలను సంరక్షించడం ప్రతి క్రైస్తవుని బాధ్యతగా అందుకు బయలుదేరవలసిందిగా ఐరోపాలోని ప్రభువులకు, రాజులకు పోప్‌నుండి ఆదేశాలు అందాయి. అసంఖ్యాకమైన ఐరోపా ప్రభువర్గం తమ సేనలతో బయలుదేరి ఈ మత యద్ధాల్లో పాల్గొన్నారు. ఈ యుద్ధాల ఫలితంగా ఐరోపా ప్రభువర్గం అధిక శాతం మరణించి బలహీనమైంది.

క్రూసేడుల కారణంగా తమ స్వదేశాలను స్వస్థలాలను వదలి బహుదూరం పర్యటించిన ప్రభువర్గానికి తూర్పు ఐరోపాలోని బైజాంటైన్ సామ్రాజ్యంలోను, తురుష్కుల్లోను అమలులో ఉన్న పటిష్టమైన రాచరిక వ్యవస్థ, నిరపేక్షంగా, నియంతృత్వాధిపత్యం చలాయించడం తెలిసివచ్చింది. కాగా ఈ మతయుద్ధాల అనంతరం బ్రతికి, తిరిగి స్వదేశానికి వెళ్ళిన ప్రభువుల్లో కొందరికి సంపూర్ణాధికారంతో కూడిన రాచరిక వ్యవస్థను తమ దేశాల్లో నెలకొల్పాలనే ఆకాంక్ష కలిగి, బలపడింది. మత యుద్ధాల్లో అసంఖ్యాకంగా ప్రభువులు వారి సేనలు మరణించడం వలన, వారికి చాలవరకు అవరోధాలు తొలగి పోయినట్లయింది. లోగడ ప్రభువర్గం రాజు బలపడడం తమ అధికార ప్రాభవాలకు భంగంగా, తమ హోదాలకు, హక్కులకు ముప్పుగా భావించి, ప్రతిఘటించేవారు. రాజుతో తాము చేసుకొన్న ఒప్పందాలను వాటి వలన తమకు సంక్రమించిన హక్కులను బహుజాగ్రత్తగా

కాపాడుకొనేవారు. ఈ పరిస్థితిలో రాజు బలపడడం అసాధ్యం. అయితే, ఈ మతయుద్ధాలు అధిక సంఖ్యలో ప్రభువులు మరణించడానికి, ప్రభువర్గ ఆధిపత్యం, భూస్వామ్యవిధానం బలహీనపడడానికి దోహదం చేశాయి.

## 2.2.2 మధ్యతరగతి ప్రాబల్యం :

క్రూసేడుల వలన ప్రభువర్గం బలహీనపడినంత మాత్రాన రాచరికవ్యవస్థలు బలోపేతం అయి జాతీయరాజ్యాలు ఏర్పడడం సాధ్యం కాలేదు. అది అందుకు అనుకూల పరిస్థితిని మాత్రమే కలిగించింది. కాగా అందుకు కారణమైంది మధ్యతరగతి ప్రాబల్యం, అందుకు కారణం వర్తకవాణిజ్యాల విస్తరణ.

క్రూసేడుల కారణంగా విస్తారంగా ప్రభువులు తూర్పు ఐరోపా, ఆసియా మైనర్లలో పర్యటించడమూ, అక్కడి సంపన్నవర్గం భారతదేశంనుండి, చైనా, ఆగ్నేయ ఆసియా దేశాలనుండి వివిధమైన వస్తువులు తెప్పించుకొని, విలాసవంతమైన జీవితాన్ని గడపడం గమనించారు. అంతకు పూర్వం ఈ వస్తువులు మధ్య, పశ్చిమ ఐరోపా దేశాల్లోని ప్రభువర్గానికి అరబ్బు వర్తకుల వలన చేరేవి. తరువాత ఇటాలియన్ వర్తకులకు, వారినుండి తక్కిన ఐరోపాఖండానికి చేరేవి. ఈ విధంగా అనేకచోట్ల చేతులు మారినందున ఆ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయేవి. తూర్పు ఐరోపాలోని బైజాంటైన్, తురుష్క సామ్రాజ్యాల్లో జరుగుతున్న ఈ వర్తక వాణిజ్యాలు, వాటిలోని ఆర్థిక ప్రయోజనాలు ప్రభువర్గాన్ని ఆకర్షించాయి. కాగా, ఈ మతయుద్ధాల నుండి సజీవంగా స్వంత ప్రదేశాలకు మరలి వెళ్ళిన ప్రభువుల్లో అధిక సంఖ్యాకులకు, ముఖ్యంగా రాజకీయంగా తక్కువ స్థాయికి చెందిన ప్రభువర్గానికి వర్తక వాణిజ్యాల పట్ల విశేషమైన ఆసక్తి కలిగింది. వారు తమ ఎస్టేట్లను అమ్మివేసి, లేదా వ్యవసాయ భూములను కౌలుకిచ్చి, పట్టణాలకు చేరారు. ఆ విధంగా లభించిన ధనాన్ని, అంతకు పూర్వం నుండి వారి వద్ద ప్రోగుపడుతున్న సంపదను వర్తక వాణిజ్యాల్లో పెట్టుబడి పెట్టి అచిరకాలంలోనే అపారమైన లాభాలతో ధనవంతులు అయ్యారు. వారిని చూచిన మరి కొందరు అదేవిధంగా పట్టణాలకు చేరడంతో క్రమక్రమంగా ప్రభువర్గానికి భూస్వామ్య విధానంలోని హక్కులు, హోదాల పట్ల మక్కువ క్షీణించింది. పట్టణాలు, నగరాలు విస్తృతంగా అభివృద్ధి చెందసాగాయి.

ఈ మధ్యతరగతి సాధారణంగా అర్థం చేసుకొనే విధంగా కేవలం నగరజీవనం పట్ల వ్యామోహంతో, స్వల్పాదాయాలతో అధికమైన ఖర్చులు చేస్తూ, అప్పుల పాలయ్యే వర్గము కాదు, 'ఉండీ, లేని' వర్గమూ కాదు. వారిలో పెట్టుబడిదారులు, వర్తక వాణిజ్య సంస్థలకు అధిపతులై అత్యధిక ధనవంతులైన వారు ఉండేవారు. వారితోపాటుగా అనేక వృత్తి సంఘాల అధిపతులై, వస్తువులను ఉత్పత్తిచేసి విక్రయించడం ద్వారా ధనవంతులైన వారు ఉండేవారు. వీరేకాక, వీరివలె సంపన్నులు కాకున్నా, విశేషమైన విద్యా, వైజ్ఞానిక ప్రాముఖ్యత కలిగిన మేధావులు, న్యాయవాదులు, ఉద్యోగులు ఉండేవారు. వీరిలో బహుళంగా, లోగడ ప్రభువర్గానికి చెంది, భూస్వామ్య హక్కులు, హోదాలపట్ల పట్టుదలగా సేద్యబానిసలను పీడించిన వారే అయినా, పట్టణాల్లో వర్తక వాణిజ్యాల్లో ప్రవేశించిన తరువాత వారి ఆలోచనా విధానం సంపూర్ణంగా మారిపోయింది.

లోగడ, భూస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్న మధ్యయుగంలో ప్రభువులు తమ స్థానిక ప్రభుత్వ పరిధిలో వృత్తి పనివారిపైన, వర్తకులపైన అధిక పన్నులు, సుంకాలు వసూలు చేసేవారు. తమ భూభాగంలో ప్రవేశించే వాణిజ్య వస్తువులపై దిగుమతి సుంకాన్ని, ఆ భూభాగం దాటి బయటికి వెళ్ళేటప్పుడు ఎగుమతి సుంకాన్ని విధించేవారు. ఈ విధంగా అసంఖ్యాకమైన ప్రభుత్వాలు విధించే పన్నులు, సుంకాలు వర్తక వాణిజ్యాలకు తీవ్రమైన ప్రతిబంధకాలై, దీనివలన వృత్తిపనివారికి ప్రోత్సాహం లోపించేది. స్థానిక ఉత్పత్తులు స్థానికంగానే వినియోగం అయ్యేవి. మారిన పరిస్థితిలో అధికాధికంగా ప్రభువర్గం వర్తక వాణిజ్యాలలో ప్రవేశించడంతో ఈ విధమైన దుష్టసంప్రదాయం కలిగించే హాని వారికి తెలిసివచ్చింది. అంతట మధ్యతరగతిగా మారిన ప్రభువర్గం స్థానిక ప్రభుత్వాలు అంతరించి, పన్నులు, సుంకాలు విధించి వసూలు చేసే అధికారం కేవలం రాజుకు మాత్రమే పరిమితమై ఉండాలని కోరుకున్నారు. ఆ విధంగా అసంఖ్యాక స్థానిక ప్రభుత్వ వ్యవస్థలు రాజ్యంలో విలీనమైనప్పుడు రాచరిక వ్యవస్థ బలపడింది. దానికి జాతీయ స్వభావము, స్వరూపము చేకూరాయి.

### 2.2.3 మతవ్యవస్థ :

అసంఖ్యాకమైన స్థానిక ప్రభుత్వ వ్యవస్థలేకాక, మతవ్యవస్థ కూడ మధ్యయుగాల్లో రాజ్యవ్యవస్థ బలపడకుండా జాగ్రత్తలు తీసుకొనేది. రాజు బలవంతుడైతే, రాజ్యం సువిశాలంగా పటిష్టమైన పరిపాలనా వ్యవస్థ కలిగిందైతే స్థానికంగా బిషప్పులు, ఆర్చి బిషప్పులు మొదలైన మతాధికారులు రాజ్య వ్యవస్థకు లోబడి ఉండవలసి వస్తుంది. మతవ్యవస్థ తరపున వారు పన్నులు వసూలు చేయడం, రోమ్‌లోని కేంద్రమతవ్యవస్థకు వార్షికంగా చెల్లింపులు చేయడం అసాధ్యం అవుతాయి. స్థానిక ప్రభువులతో చేయి కలిపి, స్థానిక మతాధిపతులు ప్రజలపై సంపాదించిన పట్టువిడిపోతుంది. కాని మధ్యతరగతిలో వ్యాపించి, క్రమంగా వారి రచనల ద్వారా ప్రజా సామాన్యంలో విస్తరిస్తున్న నూతన విజ్ఞానం మతవ్యవస్థ ప్రబోధాలను, వారు విధించే నైతిక, ధార్మిక నిబంధనలను విమర్శించి, ప్రశ్నించడం ప్రారంభమైంది. ఈ విజ్ఞానం పూర్తిగా మతపరమైనదికాక, మానవతావాదంతో కూడింది. మానవజీవితం పాపభూయిష్టమని, ఈ పాపభారాన్ని వదిలించుకొని, పరలోక సామ్రాజ్యంలో ప్రవేశం పొందగలగడమే జీవిత ధ్యేయం కాని, సుఖసౌభాగ్యాలను ఆశించడం కాదన్న మధ్యయుగంలోని చర్చి ప్రబోధాలు ఈ మారుతున్న నాగరికతాసంస్కృతుల్లో ప్రజలకు సంతృప్తి కల్గించలేకపోతున్నాయి. నూతన విజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక పురోగమనంతో చర్చిబోధనల్లోని తప్పులను ఎంచి, వాటిలోని యథార్థాన్ని ప్రశ్నార్థకం చేసింది. నూతన విజ్ఞానంలో అంతర్భాగంగా వృద్ధిచెందిన సాంఘిక శాస్త్రాలు, మానవతావాదవిజ్ఞానం, ఇహలోకంలో మానవజీవిత ప్రాముఖ్యతను, అతని సుఖశాంతులకు అవసరమైన సాంఘిక, రాజకీయ వ్యవస్థల నిర్మాణాన్ని గూర్చి, నిర్వహణలను గూర్చి చర్చించింది. సమస్త విజ్ఞానానికి పరమార్థం మానవునికి భౌతిక, పారమార్థిక ప్రయోజనాలను రెండింటిని కల్గించడం, అంతేకాని జీవితం పాపపంకిలమని తృణీకరించడం కాదు.

ఈ విధమైన విద్యావిజ్ఞానాలు, ఆలోచనాధోరణులు మధ్యయుగాలనాటి విశ్వాసాలను, సాంప్రదాయాలను బ్రద్దలు కొట్టాయి. అవి రాజకీయంగా జాతీయరాజ్యస్థాపనకు అనుకూలమైన సిద్ధాంతాలను ప్రతిపాదించాయి. అటువంటి ఆధునిక రాజనీతి తత్త్వజ్ఞుల్లో మాకియవెల్లి (Machiavelli) ని ప్రధానంగా చెప్పవలసి ఉంటుంది. ప్రభువర్గం వంటి విచ్ఛిన్నకర శక్తులను నిర్మూలించి, జాతీయరాజ్యాల నిర్మాణాన్ని చేపట్టడం రాజు యొక్క విధి, అందుకు ఏవిధమైన ఉపాయాలను అనుసరించినా, అవి నీతిబద్ధం కాకున్నా తప్పులేదు అని మాకియవెల్లి సమర్థించాడు. మతవ్యవస్థ సైతం రాజ్యవ్యవస్థకు లోబడి ఉండవలసిందేనని, జాతి ప్రయోజనాలను కాపాడగలిగిన రాజ్యవ్యవస్థ కంటె, రాజు యొక్క క్షేమం కంటె ఉత్కృష్టమైనవి మరేవీ లేవని అతడు నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

నూతనవిజ్ఞానం కల్గిస్తున్న విమర్శనాత్మక పరిశీలనా దృక్పథం, సిద్ధాంతీకరణ నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలనేకాక మతవ్యవస్థను సమీక్షించాయని, చర్చి బోధనల్లోని లోపాలను బహిర్గతం చేశాయని పైన వివరించడం జరిగింది. ఈ విమర్శను రోమన్ కాథలిక్ చర్చి తృణీకరించి, తన లోపాలను సవరించుకోవడానికి నిరాకరించడంచేత ఆ మతవ్యవస్థలో సాంప్రదాయవాదులకు, సంస్కరణవాదులకు నడుమ తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. సంస్కరణ వాదులు పలుదేశాల్లో మతవ్యవస్థ నుండి విడిపోయి, వేర్వేరుగా లూథరన్, కాల్వినిస్టు మొదలైన ప్రత్యేక మతవ్యవస్థలను ఏర్పరచుకొన్నారు. ఈ పరిణామం ఐరోపా ప్రజానీకమంతా భావించుకుంటున్న సామాన్య మతసంస్కృతికి, దానిపై ఆధారపడ్డ ఏకైక మతవ్యవస్థకు తీవ్రమైన విఘాతం కల్పించడాన్ని, 'క్రిసెండమ్' విచ్ఛిన్నం కావడాన్ని పైన వివరించడం జరిగింది. ఈ విచ్ఛిన్నత వివిధదేశాలను, జాతీయరాజ్యవ్యవస్థలుగా ఏర్పరచింది. మతపరంగానైనా, విదేశీయుడైన పోప్‌కు లోబడి ఉండటానికి జాతీయరాజ్యాల సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని వదులుకోవడానికి జాతీయ రాచరికవ్యవస్థ అవకాశం ఇయ్యలేదు.

సంస్కరణాత్మక ప్రయత్నాల్లో రోమన్ కాథలిక్ మతవ్యవస్థ విచ్ఛిన్నమై ప్రొటెస్టెంట్ క్రైస్తవ మతాలు విస్తారంగా ప్రజాదరణ పొందడంతో మరీ కొట్టవచ్చినట్టు కన్పించే అనేక ఛాందస సిద్ధాంతాలను, ఆచరణలను వదిలివేసి రోమన్ కాథలిక్ మతవ్యవస్థ కొంత సంస్కరణాత్మక దృక్పథాన్ని అవలంబించి, తిరిగి కొంతవరకు ప్రజామోదాన్ని పొందింది. కాని, జరిగిన పరిణామాలను -

జాతీయ రాజ్యాలూ, జాతీయ మతవ్యవస్థలు ఏర్పడడాన్ని, క్రిసెండమ్ విచ్ఛిన్నం కావడాన్ని - మాత్రం తిరుగ త్రిప్పలేక పోయింది. కాగా ప్రభువర్గం, రాజుల అధికార ప్రాభవాలను అదుపుచేయడానికి ఈ మతవివాదాలను సరైన సాధనంగా చేసుకొన్నారు. రాజు ప్రొటెస్టెంట్ మతాన్ని అభిమానిస్తే, ప్రభువులు రోమన్ కాథలిక్ మతాన్ని, అతడు ఈ మతాన్ని అభిమానిస్తే వారు ఆ మతాన్ని, కేవలం తమ సంఘర్షణలకు అనువుగా ఉపయోగించుకొన్నారు. పదునేడవ శతాబ్ది ప్రథమార్ధం ఇంచుమించు అన్ని ఐరోపాదేశాల్లో రాజులకు ప్రభువులకు ఇలా మతం పేరిట తీవ్రయుద్ధాలు జరిగాయి. వ్యవసాయ ప్రధానమైన ఆర్థికవ్యవస్థతో, భూస్వామ్యవ్యవస్థ, ప్రభువర్గమూ ఎక్కడ ఇంకా పటిష్టంగా ఉన్నాయో, ఆ దేశాల్లో రోమన్ కాథలిక్ మతానుయాయులైన ప్రభువులు తమ సమిష్టి కృషితో రాజును అదుపుచేయగలిగారు. అలాగే ఎక్కడ రాజు రోమన్ కాథలిక్ మతానికి చెందిన వాడో అక్కడ ప్రభువర్గం ప్రొటెస్టాంట్ మతాన్ని సమర్థించి రాజును ఓడించి అదుపులో ఉంచారు. ఈ పోరాటాల్లో అట్లాంటిక్ తీరదేశాల్లో ప్రొటెస్టాంట్ మతాభిమానులైన రాజులు రోమన్ కాథలిక్ మతాన్ని సమర్థించే ప్రభువర్గాన్ని అదుపు చేయగలిగారు. అందుచేత ఫ్రాన్సు, హాలెండు, స్పెయిన్, పోర్చుగల్ దేశాలు కొంతవరకు జాతీయ రాజ్యాలుగా అవతరించాయి. కాని మధ్య ఐరోపాలో ఆస్ట్రియా, ప్రష్యా, ఇంకా అనేక జర్మన్ రాజ్యాలు, ఇటలీ ద్వీపకల్పంలోని రాజ్యాలు భూస్వామ్యవ్యవస్థ, ప్రభువర్గ ప్రాబల్యం అధికంగా కలవి. పారిశ్రామిక, వాణిజ్యాభివృద్ధి ఆ దేశాల్లో చాలాకాలం వరకు చెప్పుకోదగినట్లు జరగలేదు. అందుచేత అవి జాతీయసమైక్యతను పందొమ్మిదో శతాబ్ది తుదిపాదం వరకు సాధించలేకపోయాయి. ప్రభువర్గాన్ని అదుపుచేయడంలో విఫలమై అనువుపరచుకోవడం ద్వారానే ఆ దేశాల్లో రాజ్యవ్యవస్థలు కొలదిమాత్రంగా బలపడ్డాయి.

ఈ విధంగా మధ్య తరగతి ప్రాబల్యం పొందిన దేశాల్లో మతవ్యవస్థ సైతం తన పట్టు కోల్పోవడం జాతీయరాజ్యాల ఆవిర్భావానికి అనువుపడి౦ది.

## 2.2.4. ప్రాంతీయ భాషా సారస్వతాలు :

నూతన విద్యావిజ్ఞానవ్యాప్తితో బాటు సంభవించిన మరొక ముఖ్యమైన పరిణామం ప్రాంతీయ భాషల అభివృద్ధి. మధ్యయుగంలో విద్యావంతులు, ఐరోపాలోని అన్ని దేశాల్లో, లాటిన్ భాషలో ప్రవీణులు. విజ్ఞానం యావత్తు మతపరమై, ఆ మతవ్యవస్థ రోమన్ కాథలిక్ చర్చి ఆధీనంలో ఉన్నప్పుడు లాటిన్ భాష మధ్య, పశ్చిమ ఐరోపాలో అంతట వ్యాపించింది. విద్యాలయాలను మతవ్యవస్థ నిర్వహించేది కనుక, విజ్ఞానం యావత్తు మతపరము, అది లాటిన్ మాధ్యమం (medium) లో ఉండేది. అందుచేత ఏ దేశానికి, లేదా ఏ ప్రాంతానికి చెందిన వారైనా, భాషాభేదం లేకుండ విద్యావంతులైన ప్రభువర్గము, మతాధిపతులు లాటిన్ భాషలో సంభాషించుకొనేవారు. కవులు తమ కవిత్వాన్ని, మేధావులు తమ తాత్త్విక రచనలను, ఆ భాషలోనే చేసేవారు. చర్చిలో ధార్మిక, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆ భాషలోనే జరిగేవి. సాధారణ ప్రజానీకానికి విద్యావకాశాలు లేక, తమ చాకిరితో కాలం వెళ్ళదీసేవారు కనుక, వారు తమ ప్రాంతంలోని అనాగరకమైన ప్రాక్తనభాషల్లో మాట్లాడుకొనేవారు. ఈ భాషాభేదం కూడ సమాజంలోని ఆర్థిక, రాజకీయ అసమానతలు, సాంఘిక వివక్షతలకు తోడుగా జాతీయసమగ్రత ఏర్పడడానికి అవరోధంగా నిలిచింది.

కాగా ఈ నూతన విద్యావిజ్ఞానాలు కేవలం మతపరమైనవికాక, మానవతావాదంపై ఆధారపడినవి కావడాన మతవ్యవస్థ ప్రాచుర్యాన్ని కోల్పోసాగింది. అయితే, లాటిన్ చాల సుసంపన్నమైన నాగరికభాష. ఆధునిక యుగారంభంలో ఆ భాషలోను ప్రాచీన ఐరోపా సంస్కృతికి మూలాధారమైన గ్రీకు భాషలోను ఉత్పన్నమైన కావ్యాలు, నాటకాలు, తాత్త్విక, శాస్త్రీయ, వైజ్ఞానిక రచనలు పునరుజ్జీవనం పొంది, మధ్య, పశ్చిమ ఐరోపాలో వ్యాపించడం చేతనే, అక్కడ నూతన విద్యా, వైజ్ఞానిక పరిణామాలు సంభవించాయి. ఈ పరిణామాల్లో, ఈ భాషలు, సారస్వతాలు చర్చి ఆధ్వర్యంలో కాక, కేవలం సంపన్న వర్గాల్లోనే కాక మరికొంచెం విస్తృతంగా జనబాహుళ్యంలోనికి ప్రవేశించడం జరిగింది. వీటి ప్రభావం చేత ఆ ప్రాంతాల్లోని సాధారణ ప్రజానీకం ఉపయోగిస్తున్న ప్రాక్తన భాషలు నాగరకమైనాయి, అనగా వ్యాకరణ బద్ధంగాను, ఆ భాషా పదజాలాన్ని స్వీకరించి సుసంపన్న మయినాయి. ప్రాచీన గ్రీకు, లాటిన్ భాషల్లోని కావ్య, నాటక శైలిని గ్రహించి, ఈ భాషల్లో అటువంటి సాహిత్యాన్ని నిర్మించడము,

ఆ భాషల్లోని వైజ్ఞానిక, తాత్త్విక గ్రంథాలను అనువదించడమూ జరిగింది. ఈ పరిణామాలలో అభివృద్ధి చెందిన ఈ భాషలు, వాటిలోని సాహిత్య, సారస్వతాలు ప్రతిబింబించే సంస్కృతి పశ్చిమ ఐరోపాలోను, క్రమంగా మధ్య ఐరోపాలోను, వివిధ ప్రజానీకాల్లో జాతీయ వారసత్వ సంపదగా (National Heritage) ఏర్పడి, వారిలో ఆత్మగౌరవాన్ని, ప్రత్యేకమైన నాగరికతా సంస్కృతులతో కూడిన వ్యక్తిత్వాన్ని సమకూర్చాయి. ఆనాడు సంభవించిన రాజకీయ, ఆర్థిక పరిణామాల్లో జాతీయభావం ఉత్పన్నమయే దశలో ఈ నాగరికతాసంస్కృతుల వికాసం దానికి నైతికమైన భావపూరితమైన సంపూర్ణతను చేకూర్చింది. ఈ పరిణామాలు మొదట మధ్యతరగతిలోనే ప్రారంభమై, క్రమంగా ప్రజా బాహుళ్యంలోనికి విస్తరించాయి. నూతన విద్యా, విజ్ఞానాలను అందించి, వాటిని అవధరించి నూతన భావాలను కలిగి, నూతన వ్యవస్థల నిర్మాణానికి, బీజావాపన చేసినవారు మధ్యతరగతి వారే. కనుక ప్రాంతీయభాషా, సారస్వతాలు, సంస్కృతీవికాసం వృద్ధిచెందడానికి కూడ వారే ముందు వరుసలో నిలిచారు.

## 2.2.5 జాతీయరాజ్యాల వికాసము, విస్తరణ :

పైన పేర్కొన్న పరిణామాల్లో ప్రారంభమైన జాతీయరాజ్యాలు పూర్వపు పవిత్ర రోమన్ సామ్రాజ్యంవలె నామమాత్రమైన కేంద్రీకృతాధికారం కలిగి, అతి విశాలమైన ప్రదేశాల్లో విస్తరించినవి కావు. వైవిధ్యంతో కూడిన అనేక జాతులకు, భాషాసంస్కృతులకు చెందిన ప్రజానీకాన్ని కలిగి, పరిపాలనా సౌలభ్యం కొరవడినట్టి తురుష్క సామ్రాజ్యం వంటివి కావు. వందలాదిగా ప్రభువులు తమ ప్రభుత్వాల్లో ఒకే భాషాసంస్కృతికి చెందిన ప్రజలను పంచుకోవడంతో ఏర్పడిన చిన్న చిన్న భూఖండాలు (Estates) కావు. అవి తగుమాత్రమైన విస్తీర్ణంతో పరిపాలనా సౌలభ్యం కలిగి, ఒకే భాషాసంస్కృతులకు చెందిన ప్రజలను, కేంద్రీకృతాధికారం కలిగిన రాచరిక వ్యవస్థను కలిగినవి. ఆ ప్రజానీకం తమ భాషాసాంస్కృతిక సమైక్యత నుండి పొందిన ఉత్తేజంతో, వారి ఆత్మగౌరవానికి, ఆకాంక్షలకు ఆధారభూతంగా ఏర్పడినవి. కనుక ఈ జాతీయరాజ్యాలు అన్ని రంగాల్లో ఇతర దేశాలతో పోటీపడి సుసంపన్నం కావడానికి, రాజకీయంగా బలీయం కావడానికి, వర్తక వాణిజ్యాలను అభివృద్ధి చేసి విస్తరించుకోడానికి కృషి చేసినవి. ఆ కృషి ప్రధానంగా ఆ రాజ్యాల ప్రజలది. వీరు తమ దేశాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన భావచైతన్యం కలిగినవారు. కనుక తరువాత కాలంలో తమ అభీష్టాలకు అనుగుణమైన రాజకీయ సంస్కరణల కొరకు, లేదా శాస్త్ర, సాంకేతిక పురోగమనము, తద్వారా పారిశ్రామికాభివృద్ధి సాధించుకొనేందుకు ఉద్యమాలు, విప్లవాలు నడిపినవారు.

17వ శతాబ్దిలోని ఐరోపాఖండంలో ఈ విధమైన జాతీయ రాజ్యాల ఆవిర్భావము వాటి క్రమపరిణామాలు కానవస్తాయి. ఈ రాజ్యాలలోని రాచరికవ్యవస్థను చరిత్రకారులు "ఉదారవాద నియంతృత్వమని" (Benevolent Despotism) వ్యవహరిస్తారు. ఈ నియంతృత్వ రాచరికం మొదట ఫ్రాన్సులో పదునాలుగో లూయీ (1643-1715) కాలంలో రూపొందడం ప్రారంభించి, క్రమంగా అట్లాంటిక్ తీరంలోని ఐరోపా దేశాలన్నింటికి విస్తరించింది. పదునాలుగో లూయీ అనేక వృత్తి, వాణిజ్య సంఘాలను ప్రోత్సహించి, ఇతర దేశాలనుండి నిపుణులైన పనివారు ఫ్రాన్సు దేశానికి వచ్చి స్థిరపడడాన్ని ప్రోత్సాహించాడు. ఉత్పత్తులను అధికం చేయడానికి, వర్తక వాణిజ్యాలు విస్తరించడానికి కృషి చేశాడు. పరిశ్రమల అభివృద్ధికి ముడిపదార్థాలు, విక్రయ కేంద్రాలకు ఉత్పత్తులు, సులువుగా రవాణా కావడానికి రోడ్లు, జలమార్గాలుగా కాలువలు నిర్మించాడు. కాలువలు వ్యవసాయాభివృద్ధికి సాగునీరు అందించడానికి కూడ ఉపయోగించి, ఫ్రాన్సు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేశాయి. ఈ ఆర్థికాభివృద్ధి వలన రాజ్యాదాయం అధికం కాగా, పదునాలుగో లూయీ విలాస వంతమైన భవనాలను నిర్మించి, ఆడంబరంగా రాజసభను నిర్వహిస్తూ, వైభవోపేతంగా గడిపాడు. కళలు, విద్యావిజ్ఞానాల ప్రోత్సాహానికి విరివిగా వ్యయం చేశాడు. వీటి కొరకు అతడు ప్రజలపై అధిక పన్నుల భారాన్ని మోపలేదు. ఈ విధంగా దేశ ఆర్థికాభివృద్ధికి, మధ్యతరగతి వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి, అవసరమైన సంస్కరణలకు అతని పరిపాలనాకాలం శ్రీకారం చుట్టింది. రాజ్యవైభవానికి, సాంస్కృతిక వికాసానికి తక్కిన ఐరోపా రాజ్యాలన్నిటికి ఫ్రాన్సు ఆదర్శం కాగలిగిన అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పింది. ఈ విధానాలను అతని తరువాత ఫ్రాన్సుదేశాన్ని పరిపాలించిన పదునైదవ లూయీ కూడ కొనసాగిస్తూ, పారిశ్రామిక, వాణిజ్యాభివృద్ధికై బాంక్ ఆఫ్ ఫ్రాన్సును, ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీని

నెలకొల్పాడు. అయితే, పదునాలుగో లూయీ తన ప్రతిష్టను, ప్రభావాన్ని చాటుకోవడానికి, ఫ్రాన్సు దేశానికి నలువైపుల సహజ సరిహద్దులు ఏర్పడే విధంగా రాజ్యాన్ని విస్తరింపజేయడానికి తన జీవిత కాలమంతా ఎడతెగని పోరాటాలు చేశాడు. పదునైదో లూయీ తన భోగలాలసతకు మితిమీరిన వ్యయం చేశాడు. ఈ కారణాల వలన ధనాగారం సంపూర్ణంగా ఖాళీఅయి, ప్రభుత్వం అప్పుల పాలైంది. దేశం ఆర్థికసంక్షోభానికి గురైంది. అటువంటి పరిస్థితిలో ఫ్రెంచి విప్లవం సంభవించింది.

అలాగే హాలెండు పరిశ్రమల్లో, వాణిజ్యంలో ప్రగతి సాగించి, పదునేడవ శతాబ్దంలో డచ్చి ఈస్టిండియా కంపెనీని నెలకొల్పింది. ఇండియాతోను, ఆగ్నేయాసియా దేశాలతోను వర్తకం చేయడానికి ఈ దేశాల్లో అనేక స్థావరాలను నెలకొల్పింది. కాని బ్రిటన్‌తో పోటీ వలన, ఆంతరంగిక రాజకీయ కల్లోలాల వలన చిరకాలంలోనే వర్తక విస్తరణ నిలిచిపోయినా, ఒక జాతీయ రాజ్యంగా వృద్ధిచెంది, ఆగ్నేయాసియాలోని కొన్ని దేశాలను వలసలుగా మార్చుకొని, బ్రిటన్‌కు ఒక మిత్రదేశంగా తగినంత పురోగమనం సాధించింది.

ప్రష్యాదేశంలో గ్రాండ్ ఎలెక్టర్‌గా ఎన్నికైన ఫ్రెడరిక్ విలియం (1640-88) ఆ దేశంలో పారిశ్రామికాభివృద్ధికి పునాదులు వేశాడు. వర్తక, వృత్తి సంఘాలకు ప్రోత్సాహాన్నిచ్చి శాస్త్ర, సాంకేతిక విద్యాభివృద్ధికి కృషిచేసి, ఆధునికీకరణను ప్రారంభించాడు. అయితే, వ్యవసాయ ప్రధానమైన ఆర్థికవ్యవస్థ, భూస్వామ్యవిధానం యొక్క ప్రాబల్యము, ప్రభువర్గం పటిష్టంగా ఉండటం వలన అతని ప్రయత్నాలు తగిన ఫలితాలను సాధించలేక ప్రజల ఆమోదం పొందలేకపోయాయి. ఆ తరువాత ప్రష్యారాజైన మొదటి ఫ్రెడరిక్ విలియం (1713-40) తిరిగి ఇటువంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమం తలపెట్టాడు. కాని తగిన ఫలితాలు రాలేదు.

సాంప్రదాయిక విధానాలపై జరిగే వ్యవసాయ ప్రధాన ఆర్థికవ్యవస్థ, హక్కులు, హోదాలపట్ల తీవ్రమైన పట్టుదల కలిగిన ప్రభువర్గము ఉన్న దేశాల్లో వర్తక వాణిజ్యాభివృద్ధికి, మధ్య తరగతి వారి ప్రాబల్యానికి అవకాశాలు చాల స్వల్పంగా ఉంటాయి.

1759 నుండి 88 వరకు స్పెయిన్ దేశాన్ని పరిపాలించిన మూడో ఛార్లెస్, 1750 నుండి 1777 వరకు పోర్చుగల్‌ను పరిపాలించిన పాంబెల్ ఇదే విధమైన ఆర్థికవిధానాలను అవలంభించి, మతవ్యవస్థను, ప్రభువర్గాన్ని అదుపుచేయడానికి వర్తక వాణిజ్యాల విస్తరణకు, వలసరాజ్యాల స్థాపనకు కృషిచేశారు.

ఈ విధంగా అట్లాంటిక్ తీరంపైనున్న అనేక ఐరోపాదేశాల్లో పారిశ్రామిక, వాణిజ్యాభివృద్ధికి, మతవ్యవస్థను, ప్రభువర్గాన్ని అదుపులో ఉంచడానికి ప్రయత్నిస్తూ, ఈ రాజులు ఉదారభావాలు కలిగిన సంస్కరణాభిలాషులుగా కానవస్తారు. కనుక వీరి నియంతృత్వాన్ని 'ఉదారవాద నియంతృత్వము' (Benevolent Despotism) అని వ్యవహరించడం జరిగింది. అయితే వీరి సంస్కరణాయుత కార్యక్రమం యథార్థంగా విజ్ఞతాయుతమైన ఉదారవాదం కాదు. తమ అధికారాన్ని అభివృద్ధి చేసుకొని, స్థిరపరచడం వీరి ధ్యేయం. అందుకు ప్రభువర్గాన్ని మతాధిపతులను అదుపు చేయడం వారి అవసరం. ఆ వ్యవస్థల వలన తమ రాజ్యాధిపత్యానికి భంగం వాటిల్లకుండ ముందు జాగ్రత్తగా వారిని అణచి ఉంచారు. తమ అధికారం బలపడిన కొలది వారి అహంకారము, ఆధిపత్యవ్యామోహం విపరీతమై ప్రజాకంటకులైనారు.

## 2.2.6 జాతీయ రాజ్యాలు - పరిణామక్రమం :

పైన వివరించిన కారణాలు, అనుకూల పరిస్థితుల ఫలితంగా జరిగిన జాతీయరాజ్యాల వికాసపరిణామక్రమాలు ఆకస్మికంగా, ఒక్కసారిగా సంభవించలేదు. వాటికి ప్రతికూలశక్తులు బలహీనం కావడానికి, అనుకూల శక్తులు బలపడి నిరపేక్షరాచరిక వ్యవస్థల్లో జాతీయ రాజ్యాలు ఏర్పడడానికి సుమారొక శతాబ్దికాలం పట్టింది. ఆ మధ్య కాలంలో అనేక ప్రయోగాలు, వాటిలో మార్పులు చేర్పులతో సంభవించిన ఒడిదుడుకులు, క్రమంగా వాటిని అధిగమించే ప్రయత్నాలు జరిగాయి. అటువంటి ఒడిదుడుకుల్లో సామాన్య ప్రజలు తీవ్రమైన కష్టనష్టాలకు గురి అవుతూ, నిరపేక్షరాచరికాల దుష్పరిపాలనను ప్రతిఘటిస్తూ విప్లవాలు చేశారు. ఈ పరిణామాలు ఒక ఘట్టమయితే, జాతీయ రాజ్యాల పరిణామానికి మూలమైన ఆర్థిక పరిస్థితులు వేరొక విధంగా పరిణమించి ఈ

రాజకీయ పరిణామాలకు మరో ముఖాన్ని ప్రదర్శించాయి. ఇవన్నీ అట్లాంటిక్ తీరంలోని ఐరోపా దేశాల్లోనే ప్రధానంగా ప్రాప్తించాయి. కాగా, దక్షిణ, మధ్య ఐరోపాలోని దేశాల్లో ఈ జాతీయ రాజ్యాల పరిణామక్రమం వేరొక మార్గాన సాగి, వేరేవిధమైన ఫలితాలను ఇచ్చాయి. అక్కడ పశ్చిమ ఐరోపాతో పోల్చదగినంతగా పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య విస్తరణ పదునేడో శతాబ్దిలో కూడ జరగలేదు. అందుచేత చైతన్యవంతమైన మధ్యతరగతి ప్రజానీకం అక్కడ తగినంతగా ఉత్పన్నం కాలేదు. కనుక అక్కడి పరిణామాలు ప్రజల పూనికతో కాక, ప్రధానంగా ప్రభుత్వపరంగా జరిగాయి. స్థూలదృష్టితో చూచినప్పుడు ఐరోపా అంతటా ఈ పరిణామాలు ఒకే విధమైనవిగా కనిపించినా, శాస్త్రీయంగా విశ్లేషించి అధ్యయనం చేసినప్పుడు వీటి వైరుధ్యం, స్వభావంలోనూ, వాటి ఫలితాల్లోను తప్పక బోధపడుతుంది.

## 2.2.6.1 పశ్చిమ ఐరోపా పరిణామాలు :

ఉదారవాద నియంతృత్వాలు ఏర్పడే సమయాన, ప్రభువులు బహుళంగా పట్టణాలకు తరలివెళ్ళి, తమ భూస్వామ్యహక్కులను వదిలివేయడాన లోగడవలె పన్నుల వసూలుకు అవకాశం లేకపోయింది. అందువలన రాజ్యవ్యవస్థ గ్రామాలలోని కర్షకులనుండి పన్ను వసూళ్ళకు ప్రత్యామ్నాయంగా పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించుకోవలసివచ్చింది. కాని అదంత సులువుగ్గా అప్పటికప్పుడు సాధ్యం అయ్యేది కాదు. అది అనేక ప్రయోగాల్లో వాటి బాగోగులు చూచి సవరించుకొటూ, కాలానుగుణంగా అభివృద్ధి చేయవలసింది. ఉదాహరణకు ఫ్రాన్సు దేశాన్నే తీసుకొని పరిశీలిస్తే, ప్రభువర్గం పట్టణాలకు తరలిపోతూ, తమ పంటభూములను కౌళ్ళకు ఇచ్చి, వాటిపై అజమాయిషీకి తన ఏజంట్లను నియమించారు. ఈ ఏజంట్లు కేవలం భూములనుండి ఫలసాయాన్ని ప్రభువుల పక్షాన కర్షకులనుండి పొంది, వారికి అప్పగించేవారే కాని, లోగడ ప్రభువులవలె కర్షకుల నుండి పన్నులు వసూలు చేసేవారు కారు. కనుక పదునైదవ శతాబ్దిలోనే ఫ్రాన్సు దేశాన్ని కొన్ని పరిపాలనా విభాగాలుగా చేసి, బైలిఫ్ (bailiff) లని, సెనెషల్ (Seneschal) అని ఉద్యోగులను నియమించడం జరిగింది. ఈ పరిపాలనా విభాగాలు వైశాల్యంలో సమానమైనవి కావు. వాటిపై నియమింపబడిన అధికారుల విధులలో స్పష్టతలేదు. ప్రభువర్గం ఏజంట్లు ఒక ప్రక్క, ఈ అధికారులు మరొక ప్రక్క, కర్షకజనం నుండి ఫలసాయాలను, పన్నులను వసూలు చేసేవారు. వీరుకాక పదునాలుగో శతాబ్దంలో పదమూడో లూయీ (1610-43) ప్రధాన మంత్రి అయిన కార్డినల్ రిష్లూ (Richlieu) దేశమంతటిని 'ఇంటెండెన్సీ' (Intendency) లనే మరోవిధంగా విభజించి, వాటిపై ఇంటెండెంట్ (Intendent) లనే అధికారులను నియమించాడు. ఈ విధంగా పరిపాలనా విధానాలు, అధికార యంత్రాంగాలు ఒక దానిపైఒకటి, ఎవరి అధికారపరిధులు స్పష్టంగా లేక, ఎవరికి తోచిన విధంగా వారు పన్నులు వసూలు చేయసాగారు. ప్రభుత్వం ఆర్థికంగా గడ్డు పరిస్థితిలో పడినప్పుడు రిష్లూ తర్వాత ప్రధానమంత్రి అయిన కార్డినల్ మాజరిన్ (Mazarin) పన్నులు వసూలు చేసే అధికారాన్ని కొందరు సుంకగుత్తకాంట్రాక్టర్లకు (tax - farmers) అమ్మివేసి, అధిక ధనాన్ని సంపాదించి, తాత్కాలికంగా కోశాగారాన్ని నింపాడు. వీరు దేశంలో ఏదో ఒక నిర్దిష్ట ప్రదేశంపై పన్ను వసూలు చేసే అధికారాన్ని, నియమితమైన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి, కొనుగోలు చేశారు. వారి అధికారాలపై ఎటువంటి అదుపులు ఉండవు. కనుక తమ ఇష్టానుసారం కర్షకులను పిండి పన్నులను వసూలు చేశారు.

ప్రభువర్గంలో అధికాధికంగా పట్టణాలకు తరలివెళ్ళి పెట్టుబడిదారులుగా అవతారం ధరించినా, గ్రామీణమైన దేశాన్ని పరిపాలిస్తూ కర్షకులను తమ అహంకారానికి, అధికారానికి గురిచేసి పీడిస్తున్న ప్రభువర్గం కూడ చెప్పదగినంత పరిమాణంలోనే ఉంది. వీరితో పాటు స్థానిక మతాధిపతులు సైతం తాము వసూలు చేసి పన్నులను పూర్వం వలెనే క్రూరంగా వసూలు చేసుకొంటూనే ఉన్నారు. పట్టణాల్లో పాలకసంస్థలు వృత్తిపనివారి, వర్తకుల సంఘాలతో 'పార్లమా' (Parliament) లుగా ఏర్పడి అధికమైన అధికార దర్పాలను ప్రదర్శిస్తున్నాయి. ఈ సంస్థలపై, వ్యవస్థలపై రాజుకు సంపూర్ణమైన ఆధిపత్యంలేదు. వాటిని పూర్తిగా అదుపుచేయాలన్నా, నిర్మూలించాలన్నా, రాజు వారి శతృత్వాన్ని కొనితెచ్చుకొని, ఇక్కట్లకు గురికావలసి ఉంటుంది. పైగా అటువంటి ఉన్నత వర్గాలకు చెందిన వారు తన సభలో పరివేష్టించి ఉండడమూ, వారి నడుమ తను హోదాను, అధికారదర్పాన్ని ప్రదర్శించడము రాచరికానికి అవసరం. అందుచేత ఒక ప్రక్క రాచరిక నియంతృత్వం మరొక ప్రక్క స్వాధికారవర్గాల పీడన కొనసాగుతూ ప్రజాజీవనాన్ని సంక్షోభానికి గురిచేస్తున్నాయి.

1789 నాటి ఫ్రెంచి విప్లవ సమయాన ఈ విధమైన అయోమయ పరిస్థితిలో, అస్పష్టమైన అధికారపరిధి కల్గిన అనేక పరిపాలన వ్యవస్థల్లో సాధారణ ప్రజానీకం, అన్ని విధాల ప్రభువర్గం కంటె, మతాధిపతులకంటె మిన్న అయిన మధ్యతరగతి, అసమానతలకు, దోపిడీకి గురవుతూ ఆనాటి పరిస్థితిపట్ల తీవ్రమైన అసంతృప్తిని కలిగి ఉన్నారు. మధ్యతరగతి వారి విజ్ఞతాయుత భావాలు విద్యావంతులు కాకున్నా సాధారణ ప్రజానీకానికి కూడ ఆ పరిస్థితిలో అర్థమై, వారి వైజ్ఞానిక నాయకత్వంలో విజృంభించారు. చైతన్య వంతమైన ప్రజానీకం దేశ సాధారణ పరిస్థితుల్లో సుసంఘటితమై విప్లవం చేయడంలో వారిలోని సమైక్యతాభావంతో జాతీయభావాలు ప్రబలమైనాయి. అంతేగాక ఆ జాతీయతాభావానికి కేవలం సమైక్యత, సమానత్వమే కాక తమ అభీష్టానుసారం సాంఘిక, రాజకీయ సంస్కరణలు చేపట్టే సంకల్పము, సాహసము కూడ కలిగాయి. ఫలితంగా జాతీయ భావాలు ఉదార వాదంతో సమ్మేళనం చెంది, లోగడ రాచరిక వ్యవస్థలను సమర్థించిన దానికి బదులుగా, రాజ్యాంగబద్ధ రాచరికాన్ని, లేదా సంపూర్ణమైన ప్రజాప్రభుత్వాన్ని కోరటానికి దారితీసింది.

ఈ పరిణామాలు అప్పటివరకు క్రమంగా ప్రబలమవుతూ, వైభవోపేతంగా రాజ్యాలను పరిపాలించుకొంటున్న నియంతృత్వాధికారానికి పెద్ద సవాలు విసిరాయి. ఫ్రాన్సులో ప్రారంభమైన ఈ రాజకీయపరిణామం అచిరకాలంలోనే అన్ని దేశాలకు విస్తరించి, అక్కడి ప్రజలను కూడ విప్లవమార్గానికి ప్రేరేపించగలదు. కారణమేమంటే, ఫ్రాన్సులో ఏర్పడి ఉన్న పరిస్థితులు కొంచెం ఇంచుమించుగా అన్ని దేశాల్లోను ఏర్పడి ఉన్నాయి. అన్ని దేశాల్లోను పీడనకు గురవుతూ నిరపేక్షరాచరికం పట్ల స్వాధికార వర్గాలపట్ల ద్వేషభావాన్ని పెంచుకొంటున్న సాధారణ ప్రజానీకం అత్యధిక శాతంలో ఉంది. అందుచేత ఐరోపాలోని ఇతర దేశాల నిరపేక్ష రాజ్యాధినేతలు భయకంపితులై, ఫ్రెంచి విప్లవాన్ని కఠినంగా అణచివేయడానికి పూనుకున్నారు. అక్కడ యథాతథంగా బూర్బన్ వంశీయుల నిరపేక్షపరిపాలనను పునఃప్రతిష్ఠించి దానిని కాపాడడం తమ మనుగడకు అవసరమని వారు భావించారు. అయితే వారికి తమలో తమకు ఉన్న పరస్పర అసూయాద్వేషాలచేత వెంటనే కార్యోన్ముఖులు కాలేకపోయారు. ఈలోగా 1790-91 సంవత్సరాల్లో విప్లవకారులు ఫ్రెంచి రాజకుటుంబాన్ని అనేక అవమానాలకు గురిచేసి, నిరపేక్షరాచరికవ్యవస్థను పూర్తిగా తొలగించి, దాని స్థానంలో రాజ్యాంగబద్ధరాచరికాన్ని నెలకొల్పారు. దీనితో సంఘటితమైన ప్రజాబలం ముందు రాజ్యాధికారం పరాజయం పొందక తప్పదని నిర్ధారణ అయింది.

శతాబ్దాల తరబడి నిరపేక్షమైన అధికారాన్ని చలాయించిన రాచరికం ప్రజల నిర్దేశానికి లోబడి రాజ్యాంగబద్ధమై, పరిమితమైన అధికారాలతో ప్రవర్తించలేకపోయింది. ఫ్రెంచిరాజు పదహారో లూయీ తన బంధువైన ఆస్ట్రియా చక్రవర్తి రెండవ జోసెఫ్‌ను, ప్రష్యారాజు రెండవ ఫ్రెడరిక్ విలియమ్‌ను తనకు సాయంగా రావలసిందిగా, ప్రజావిప్లవాన్ని అణచి, తనను తిరిగి పూర్వపు రాజ్యాధికారంతో నెలకొల్పవలసిందిగా అభ్యర్థిస్తున్నాడు. నిరపేక్షరాచరికంతో పాటు విప్లవకారులు భూస్వామ్యవిధానం యొక్క అవశేషాలను, ప్రభువర్గం వారి హోదాలు, ఆధిపత్యాలను సైతం సమూలంగా రద్దు చేయడంతో తమ ఎస్టేట్లను, అధికార ప్రాభవాలను కోల్పోయిన కొందరు ప్రభువులు ఫ్రాన్సు నుండి పారిపోయారు. వారు ఆస్ట్రియా, ప్రష్యా రాజ్యాల సరిహద్దుల్లో నివసిస్తూ, రెండో జోసెఫ్‌ను, రెండో ఫ్రెడరిక్ విలియమ్‌ను తమ ఫ్రాన్సుపై దండెత్తవలసిందిగాను, తమదేశంలో రాజవంశాన్ని రాచరిక సాంప్రదాయాలను, ప్రభువర్గం యొక్క అధికార ప్రాభవాలను పునరుద్ధరించవలసిందిగాను కోరుతున్నారు. ఫ్రాన్సులో విప్లవఫలితంగా ఏర్పడిన నూతనప్రభుత్వం వీరిని ప్రజావ్యతిరేకులుగా పరిగణించారు. అది జాతీయభావాలకు, జాతిప్రయోజనాల స్పష్టమైన స్వరూపానికి నిదర్శన. దేశంలోపల కూడ తక్కువ వ్యవధిలో, త్వరితంగా సంభవించిన పరిణామాలు సాంప్రదాయాల పట్ల విశ్వాసం కలిగిన సాధారణ ప్రజానీకాన్ని విస్మయపరచాయి. రాచరిక వ్యవస్థలోను, రాజుగా పదహారో లూయీలోను అనేక లోటుపాట్లు ఉన్నప్పటికీ, సామాన్య ప్రజలు తమ హద్దులను అతిక్రమించి, వారిని అధికార భ్రష్టులను చేయడం మహాదోషంగా భావించారు.

ఇక్కడ ప్రధానంగా గుర్తించవలసిన అంశం జాతీయ భావాలు, వాటిపై ఆధారపడిన సమైక్యత, రాజ్యవ్యవస్థల సంస్కరణ మొదలైనవి వాంఛించి, వాటికై ఉద్యమించి పోరాడేది ప్రధానంగా మధ్యతరగతి. అటు ప్రభువర్గానికి, మతాధిపతులకు వాటి అవసరం లేదు, వారికి వారి పదవులు, హోదాలు, ఆధిపత్యమే ముఖ్యం. వాటిని సంరక్షించుకొనేందుకు విదేశీయులతో చేయి

కలపడానికి వారు వెనుకాడరు. అలాగే సరైనవిద్య, వైజ్ఞానిక దృక్పథం ఏర్పడని సాధారణప్రజానీకం కూడ అటువంటి భావాలను, పరిణామాలను ఆమోదించలేదు. సాంప్రదాయాన్ని అనుసరించి పోవడంలో వారికొక ప్రశాంతమైన అలజడులు లేని జీవితం లభిస్తుంది. మార్పుకు వారు తగినంత వ్యవధి తీసుకుంటారు. అంతవరకు వారు సంస్కరణాత్మక ప్రయత్నాలను వ్యతిరేకిస్తారు. జాతీయభావాలు, ఉదార భావాలు ఇటువంటి అనుకూల, ప్రతికూల పరిస్థితుల నడుమ బలపడడానికి దీర్ఘకాలికమైన వ్యవధి తీసుకొంటాయని గుర్తించడం అవసరం.

ఫ్రాన్సులో 1791 లో ఏర్పడ్డ మొదటి రిపబ్లిక్ జాతీయ సమైక్యతాభావానికి, ఉదారవాద సంస్కరణలకు ఒక స్వరూపాన్ని ఇచ్చింది. కాని, సాంప్రదాయిక వర్గాలైన రాచరికవాదులు, విప్లవము, విప్లవ పరిణామాల పట్ల ఉదాసీనంగా ఉండే తటస్థవాదులు, పూర్తిగా దానిపట్ల ఆసక్తిని పొందలేదు. వారిని దారికి తెచ్చి, దేశప్రజానీకమంతటిని సమైక్యంగా విప్లవోన్ముఖంగా నడిపి, నూతన వ్యవస్థను సుస్థిరం చేయడానికి విప్లవవాదులైన రిపబ్లికన్‌లు అనేక దౌర్జన్య విధానాలను అనుసరించారు. వాటితోపాటు, ఒక విదేశీయుద్ధం సంప్రాప్తమైతే, అది ప్రజానీకంలోని భేదాభిప్రాయాలను తొలగించి, దేశభక్తిని కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. అందుకై వారు కూడ ఆస్ట్రియా - ప్రష్యాలతో కయ్యానికి కాలుదువ్వారు. ఫ్రెంచి శాసన సభలోని రిపబ్లికన్ వాదులు తమదేశం నుండి పారిపోయిన ప్రభువులకు (Emigrees) ఆశ్రయం కల్పించడం, తమదేశంలో ప్రజలు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై సాగిస్తున్న విప్లవాన్ని గూర్చి అందలి పరిణామాల గూర్చి అనవసరమైన బెదిరింపు ప్రకటనలు చేయడం వలన ఆ రెండు దేశాలు ఫ్రాన్సుకు శత్రువులుగా ప్రకటించారు. ఈ చర్యలు తను దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో అనవసర జోక్యంగా, తమ దేశప్రజల సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని (Sovereignty) ధిక్కరించడం గాను వాదించి, వారికి బుద్ధి చెప్పడానికి యుద్ధం ప్రకటించారు.

రాచరిక వ్యవస్థలో దేశ సర్వసత్తాక సార్వభౌమాధికారం రాజుపరమై ఉంటుంది. కాని రాచరిక వ్యవస్థను రాజ్యాంగబద్ధం చేసినా, లేదా రద్దుచేసి రిపబ్లిక్ ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్నా, అందుకు దక్షులైన ప్రజలకే ఆ అధికారం సంక్రమిస్తుంది.

1792లో ఫ్రాన్సు, ఆస్ట్రియా - ప్రష్యాలతో పోరాటానికి దిగి చిత్తుగా ఓడిపోయింది. అందుకు రాజు పదహారో లూయీ దేశ ప్రజల పట్ల వారు నిర్మించుకొన్న రాజ్యాంగబద్ధ ప్రభుత్వం పట్ల ద్రోహం చేయడమే కారణమని రాచరికాన్ని పూర్తిగా తొలగించడమూ, రాజుకు శిరచ్ఛేదం చేసి రిపబ్లిక్‌ను నెలకొల్పడమూ జరిగింది. అయితే చిత్రంగా అప్పటినుండి ఫ్రాన్సు అంతర్గతంగా అల్లకల్లోలమై, రిపబ్లిక్ వాదులు భయంకర పరిపాలన (Reign of Terror) జరిపి వందలు, వేలుగా జనాన్ని వధిస్తున్నా, విదేశీ యుద్ధరంగంలో ఫ్రెంచి సేనలు ఘనవిజయం పొంది, ఆస్ట్రియా, ప్రష్యాలను తరిమివేయగలిగారు. ఆ పోరాట సమయంలో ప్రభుత్వం నిర్వహించిన జాతీయ సమితి ప్రజల్లో జాతీయ సమైక్యతను రిపబ్లిక్ పట్ల అంకితభావాన్ని ప్రబోధించింది. అంతేగాక, ఆస్ట్రియా - ప్రష్యాలు తమ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకొంటున్నాయని, అందుకు వారికి తగిన గుణపాఠం నేర్పాలని ఫ్రెంచి ప్రజానీకం బహుళంగా విశ్వసించింది. ఈ విశ్వాసం వారికి తమ జాతీయసమైక్యత, సాంఘిక, ఆర్థిక రాజకీయసమానత్వం, ప్రజల సర్వసత్తాకసార్వభౌమాధికారం మొదలైన విషయాల పట్ల గల నిబద్ధతకు నిదర్శన. అంతేకాక, ఐరోపా ఖండలో తాము మాత్రమే పీడితజాతి కాదని, తాము మాత్రమే రాచరిక నియంతృత్వంపై పోరాటం చేయడం వల్ల ఏకాకులైనామని గుర్తించి, సౌభ్రాతృత్వ చట్టాన్ని 1793 లో ప్రకటించారు. ఈ చట్టంవలన ఫ్రెంచి రిపబ్లిక్ తాను జయించిన ఐరోపా భూభాగాల్లో రాచరిక నియంతృత్వాన్ని, స్వాధికార వర్గ హక్కులు హోదాలను రద్దుచేసి రిపబ్లిక్ ప్రభుత్వాలను నెలకొల్పుతుందని, ఆ ప్రాంతాల్లో వారి వలన పీడనకు గురవుతున్న ప్రజానీకాలకు విముక్తి కలిగిస్తుందని ప్రకటించారు. ఇది జాతీయ ప్రజాప్రభుత్వవ్యవస్థలు క్రమంగా ఐరోపాలో విస్తరించి, అనేక ఇతర ప్రాంతాల్లోని ప్రజల్లో, రాజకీయ చైతన్యాన్ని రగిల్చింది. ఇది ఫ్రెంచి విప్లవం సాధించిన ఫలితాల్లో అతి ముఖ్యమైంది.

క్రమేణ, ఫ్రెంచి రిపబ్లికన్ ప్రభుత్వం అనేక విధాలైన రాజ్యాంగ చట్టాలతో ప్రయోగాలు చేసి, ఫ్రెంచి ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వాలకు భంగం కలిగించని సమర్ధవంతమైన ప్రజా ప్రభుత్వ వ్యవస్థను రూపొందించడానికి ప్రయత్నించింది. ఆ కాలంలో ఐరోపాలోని నియంతృత్వ రాచరికాలు, సాంప్రదాయ రాజ్యవ్యవస్థలు ఏర్పరచిన పటిష్టమైన కూటమి (Coalition) తో పోరాటాలు

చేస్తూనే ఉంది. ప్రజలను ఉత్తేజపరచి, దేశరక్షణ, తద్వారా తాము నిర్మించుకున్న రాజకీయ వ్యవస్థాపరిరక్షణలను గూర్చి అప్రమత్తులను చేస్తూనే ఉంది. సుదీర్ఘకాలం జరిగిన ఈ పోరాటాలు ఫ్రెంచి ప్రజల జాతీయ సమైక్యతను, రాజకీయ చైతన్యాన్ని మరింతగా ప్రబలం చేశాయి. ఫ్రెంచి విప్లవం ద్వారా ఆ ప్రజానీకంలో ఏర్పడిన ఈ జాతీయ సమైక్యత, రాజకీయ చైతన్యం పరిగణించదగిన ఫలితం. విప్లవం తాత్కాలికంగా ఏ విధమైన ప్రయోజనాలను చేకూర్చినా, అవి ప్రజలు కోరినవైనా, కాకున్నా, ఈ పరిణామఫలితం మాత్రం శాశ్వతమై, తాత్కాలిక వైఫల్యాల నుండి ఫ్రెంచి ప్రజలను పటిష్టమైన రిపబ్లిక్‌ను నెలకొల్పుకోడానికి ముందుకు నడిపించింది.

ఫ్రెంచి ప్రజలు శత్రు కూటమితో సుదీర్ఘకాలం జరిపిన పోరాటం వారిలో జాతీయ భావాన్ని ప్రబలం చేసినా, రాజకీయంగా అనర్ధదాయకమైంది. అది సైనిక బలాల ప్రాధాన్యతను, వాటిని అదుపులో ఉంచుకొని ఉపయోగించే సమర్ధుడైన పరిపాలకుని ఆవశ్యకతను చాటి చెప్పింది. సైనిక బలాలను అదుపులో ఉంచి, ఉపయోగించగల సమర్థుడు రాజకీయ పరిభాషలో నియంత. నియంతృత్వ ప్రాబల్యంలో జాతీయ వ్యవస్థ అతనికి మరింత బలాన్ని చేకూర్చుతుంది కాని, ప్రజలు కోరుకొనే స్వేచ్ఛా, సమానత్వాలతో కూడిన సర్వసత్తాక సార్వభౌమత్వం ప్రజలపరం కావడానికి దోహదం చేయదు. సూటిగా చెప్పాలంటే ఈ విప్లవ పోరాటాలు నెపోలియన్ నియంతృత్వాన్ని రంగస్థలం మీదకు తెచ్చి, ప్రజాపాలనావ్యవస్థ (Republic) ను తెరవెనుకకు పంపాయి. ఐరోపా దేశాల ముందు ఫ్రెంచి జాతీయ ప్రతిష్టను నిరూపించడానికి తగిన దక్షునిగా నెపోలియన్ ప్రజలదృష్టిలో సమున్నతమైన పీఠాన్ని అధిష్టించాడు. ఒకటిన్నర దశాబ్దాలకుపైగా నెపోలియన్ నిరంతరంగా చేసిన పోరాటాలు అతని వ్యక్తిగత ప్రయోజనాలకు, వ్యక్తిత్వాన్ని ప్రముఖంగా ఆవిష్కరించడానికి, అతని బంధువర్గాన్ని ఐరోపాలోని అనేక దేశాల్లో రాజ్యాధినేతలుగా నిలపడానికి ఉపకరించాయి. కాని, ఫ్రెంచి ప్రజానీకం అతని విజయాలను ఫ్రెంచిజాతికి గర్వకారణాలుగా భావించారు. నిరపేక్షరాచరికం నుండి ప్రారంభమైన విప్లవం తిరిగి నెపోలియన్ నియంతృత్వానికి దారితాసి, ఒకవిధంగా విఫలం అయిందని చెప్పవచ్చు. అయినా, అది ఫ్రెంచి ప్రజల్లో అకుంఠితమైన జాతీయభావాన్ని, గర్వాన్ని కలిగించి, మున్ముందు సులువుగా రాజకీయ సంస్కరణల కొరకు విప్లవమార్గాన్ని చేపట్టగల సమైక్యతను కలిగించింది.

నెపోలియన్ పోరాడి ఓడించిన ఐరోపా అగ్రరాజ్యాధినేతలు, ఆస్ట్రియా, ప్రష్యా, రష్యా, బ్రిటన్‌లు 1815లో వియన్నాలో సమావేశమై భవిష్యత్తులో నెపోలియన్ వంటి నియంతలు తలెత్తి, ఐరోపా శాంతి భద్రతలకు ముప్పు తెచ్చిపెట్టకుండ ముందు జాగ్రత్తచర్యలు చేపట్టదలచారు. వారి నిర్ణయాల్లోని ప్రధానాంశం ప్రజానీకంలో తలెత్తే జాతీయసమైక్యతా భావాలు, స్వేచ్ఛాసమానత్వాలపై ఆధారపడిన ప్రజాపరిపాలనావ్యవస్థ పట్ల ఆకాంక్షలు వారిని విప్లవంవైపు నడిపిస్తాయి; అటువంటి విప్లవాలు నెపోలియన్ వంటి నియంతలను సృష్టిస్తాయి; కనుక నియంతృత్వాలు తలెత్తకుండ తీసుకోవలసిన చర్యల్లో మొట్టమొదటిది ప్రజల్లో కలిగే రాజకీయచైతన్యాన్ని మొగ్గలోనే త్రుంచి వేయడం. ఇటువంటి ఆలోచనతో వారు ఏర్పరచిన ఐరోపా దేశాల సరిహద్దులు, పరిపాలనా వ్యవస్థలు ప్రజల జాతీయభావాలను, రాజకీయ ఆకాంక్షలను నిర్లక్ష్యం చేశాయి. అప్పటికే అవి ఉధృతమైన విషయాన్ని, తాత్కాలికంగా వాటిని అణచి ఉంచడంలో అవి మున్ముందు ఉవ్వెత్తున లేచి విజృంభిస్తాయని వారు గుర్తించలేదు. కనుక వియన్నా కాంగ్రెసు నిర్ణయాలకు మొదటినుండి ప్రజలనుండి ప్రతిఘటన ఎదురవుతూనే ఉంది. తాము నిర్ణయించిన విధంగా ఐరోపా రాజకీయపరిస్థితిని సంరక్షించి నిర్వహించడానికి వారు ఏర్పరచుకొన్న ఐరోపారాజ్యకూటమి (Concert of Europe) 1830లో విచ్ఛిన్నమైంది. ఇది విచ్ఛిన్నం కావడానికి మొదటికారణం ఐరోపాలోని వివిధ ప్రాంతాల్లో, లేదా దేశాల్లో ప్రజలు నిరపేక్షరాచరికాన్ని వ్యతిరేకించి, రాజ్యాంగబద్ధ రాచరికాలను కోరుతూ, స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వాలను ఆశిస్తూ తిరుగుబాట్లు చేయడం, ఆ తిరుగుబాట్లను అణచడం ఐరోపా రాజ్య కూటమికి అసాధ్యం కావడం. 1830లో ఇంచుమించు ఐరోపాలోని అన్ని ప్రధానమైన దేశాల్లో ప్రజలు జాతీయభావాలు, స్వేచ్ఛా, సమానత్వం వంటి ఉదార భావాలతో తిరుగుబాట్లు చేశారు. రెండవ కారణం, అటువంటి ప్రజా ఉద్యమాల పట్ల కూటమిలోని అగ్రరాజ్యాల నడుమ ఏకాభిప్రాయం కుదరకపోవడం.

పందొమ్మిదో శతాబ్ది తొలిదశకంలో నెపోలియన్ నియంతృత్వం నానాటికి ఉచ్ఛస్థితికి చేరుతున్న సమయంలో, తూర్పు ఐరోపాలోని తురుష్క సామ్రాజ్యంలోని గ్రీకులు, సెర్బులు (Serbs) స్వాతంత్ర్య పోరాటాలు ప్రారంభించారు. ఈ స్వాతంత్ర్య

పోరాటాలకు తురుష్కుల మతాభిమానంతో కూడిన నిరపేక్షరాజ్య పాలన, అక్కడి క్రైస్తవప్రజానీకాల పట్ల వారు అవలంభించిన క్రూరమైన అణచివేత విధానం కారణం. అయితే ఈ స్వాతంత్ర్య పోరాటాలకు భావనాబలం (Ideological Potence) ఫ్రెంచి విప్లవం నుండి ఉత్పన్నమైందనేది నిర్వివాదాంశం. సాటి రిపబ్లికన్ దేశంగా, స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాత్రాలను అనుసరించి పరిరక్షించడం తమ విధానంగా ప్రకటించుకొని, గ్రేట్ బ్రిటన్, గ్రీక్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షలను, వారి జాతీయతాభావాన్ని సమర్థించింది. వారి స్వాతంత్ర్య పోరాటాల్లో జోక్యం చేసుకొని, స్వప్రయోజనాలను సాధించుకోదలచిన రష్యా కూడ ఈ గ్రీకుల, సెర్బుల స్వాతంత్ర్య పోరాటాల పట్ల ఆసక్తి చూపింది. ఫలితంగా ఐరోపా రాజ్య కూటమి 1830 లో విచ్ఛిన్నమైంది. ఆస్ట్రియా, ప్రష్యా, ఇటలీ వంటి కొన్ని దేశాల్లో, లేదా భూభాగాల్లో 1830 తిరుగుబాటు విఫలమైనా, కొన్ని దేశాల్లో ప్రజలు నిరపేక్షపరిపాలనా వ్యవస్థలను లొంగదీసి, రాజ్యాంగ చట్టాలను పొందగలిగారు. ఈ విప్లవ ఫలితంగా ఫ్రాన్సులో బూర్బన్ వంశీయుల పరిపాలన శాశ్వతంగా తొలగిపోయింది.

అయితే 1789 విప్లవం వలెనే 1830 విప్లవం కూడ శాశ్వత ఫలితాలను ఇయ్యలేదు. రాజ్యాంగబద్ధులై పరిపాలించడానికి అనేక దేశాల్లోని రాజులు సంసిద్ధులు కాలేక పోయారు. క్రమంగా వారు పూర్వపు నిరపేక్ష పరిపాలన వైపు మరలి, తమ దేశాల్లో వాక్స్వాతంత్ర్యాన్ని, పత్రికాస్వాతంత్ర్యాన్ని అరికట్టారు. సభలు, సమావేశాలపైన, ప్రజలు సంఘటితమై రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడంపైన, ఆంక్షలు విధించారు. విచిత్రమేమంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం కొరకు 1789 లోను, 1830 లోను విప్లవాలు చేసిన ఫ్రెంచి ప్రజల్లో అటువంటి ఉదారభావాలతో కూడిన ప్రజాపరిపాలన కంటే నెపోలియన్ తన యుద్ధ విజయాలతో సాధించిన జాతీయప్రతిష్టపై గర్వించసాగారు. 1830 లో ఏర్పడిన రాజ్యాంగబద్ధరాచరికం వారికి సంతృప్తికరం కాలేకపోయింది. దానికి ప్రధాన కారణం లూయీఫిలిప్ అసమర్థ, అవినీతిమయమైన పరిపాలన. అతని వలెనే అనేక దేశాల్లో ప్రజాస్వామ్యయుతమైన ప్రభుత్వవ్యవస్థలు ఏర్పడిన చోట కేవలం పదవీ వ్యామోహం తప్ప మరే విధమైన ఘనత లేని అసమర్థులు, అవినీతి పరులు రాజ్యాధినేతలైనారు. ఈ కారణాన 1848లో ఇంచుమించు అన్ని దేశాల్లోను తిరిగి విప్లవాలు చెలరేగాయి. రాజ్యాంగబద్ధంగా పరిపాలించలేని రాజవంశాలను కొన్ని దేశాల్లో పూర్తిగా తొలగించి సంపూర్ణమైన ప్రజాస్వామ్యవ్యవస్థలను నెలకొల్పడం జరిగింది.

ఈ విప్లవాలు రాజకీయ సంస్కరణలను సాధించుకొని, ప్రజలు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నిరాఘాటంగా అనుభవిస్తూ అన్ని విధాలయిన అసమానతలను రూపుమాపాలని సంకల్పించి జరిపినట్టివి. ఈ ఆశయాలను, ఆ ప్రజలను సుసంఘటితం చేసి విప్లవాలకు తయారు చేసిన సమానత్వ, సమైక్యతాభావాలు, మరొక విధంగా చెబితే జాతీయభావాలేనని, ఈ ఉద్యమాలు జాతీయ భావస్ఫూర్తితో జరిగినవేనని స్పష్టపడుతుంది.

జాతీయభావాలు, వాటి రాజకీయ సారూప్యమైన పరిపాలనా వ్యవస్థలు, తొలుత జాతీయ నిరపేక్ష రాచరికము, తరువాత రాజ్యాంగబద్ధ రాచరికము, లేదా రిపబ్లికన్ వ్యవస్థలు, తమ స్వాభావికమైన స్వరూపాలు పొందడానికి మొదట్లో ప్రభువర్గంతోను, మత వ్యవస్థతోను సంఘర్షించవలసి వచ్చింది. ప్రభువర్గం వలన ఏర్పడిన విచ్ఛిన్నకర శక్తులు, మత వ్యవస్థ జాతీయ ప్రత్యేకతను పరిగణించక విదేశీ ఆధిపత్యాన్ని విధించడము, తొలిదశలోని అవరోధాలు. వాటిని ఎదిరించడంలో, చైతన్యవంతమైన మధ్యతరగతి రాచరిక వ్యవస్థను బలోపేతం చేసింది. ఆ శక్తులు బలహీనపడగానే మధ్యతరగతి తమ ఆశయాలకు ఆకాంక్షలకు నిరపేక్ష రాచరికమే అవరోధమని గుర్తించింది. అందుచేత వారి తదుపరి పోరాటం నిరపేక్ష రాచరికంతోనే. రాజ్యాంగబద్ధ రాచరికాలను, లేదా రిపబ్లిక్ వ్యవస్థలను నిర్మించుకొనేవరకు ఆ పోరాటం సాగింది.

### 2.2.6.2 మధ్య ఐరోపాలో పరిణామాలు :

అయితే పైన ప్రస్తావించినట్లు ఈ పరిణామాలు ప్రధానంగా అట్లాంటిక్ తీర దేశాల్లో జరిగాయి. 1830, 1848 సంవత్సరాల్లో విప్లవాలు మధ్య దక్షిణ ఐరోపాలోని జర్మన్ రాజ్యాల్లో, ప్రష్యాలో, ఆస్ట్రియా సామ్రాజ్యాల్లో కూడ జరిగాయి. అయితే విఫలమైనాయి. అందుకు కారణం కూడ పైన పేర్కొనడం జరిగింది. ఆ దేశాలు ప్రధానంగా వ్యావసాయిక ఆర్థిక విధానము, భూస్వామ్యవ్యవస్థ, ప్రభువర్గ ప్రాబల్యము కలిగినవి. వర్తక వాణిజ్యాలు, పరిశ్రమలు అభివృద్ధి చెందకపోలేదు, కాని తగినంత స్థాయిలో జరుగలేదు.

3

ఆ కారణాన అక్కడ పశ్చిమ ఐరోపాదేశాలవలె చైతన్యవంతమైన, ఆధునిక విజ్ఞానం కలిగిన మధ్యతరగతి రాజకీయ సంస్కరణలకై పోరాటానికి నాయకత్వం వహించగలిగినంత బలంగా లేదు.

అయితే నెపోలియన్ దండయాత్రల వలన చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయి ఉన్న ఇటలీలోను, అసంఖ్యాకమైన జర్మన్ రాజ్యాల్లోను, అంతకు పూర్వం వీరు అనుభవించని జాతీయ సమైక్యత మొదటిసారిగా వారికి కలిగింది. అయితే అగ్రరాజ్యాలు తమ స్వార్థప్రయోజనాల కొరకు, విప్లవాలను అరికట్టే ఉద్దేశంతోనూ వియన్నా కాంగ్రెస్ పూర్వపు రాజ్యాలను, రాజవంశాలను వీలైనంత వరకు పునరుద్ధరించి, ప్రజల మనోభావాలను గాయపరిచింది. అనేక జర్మన్ రాజ్యాల్లోను, ఇటలీ రాజ్యాల్లోను ఈ రాజవంశాల పునరుద్ధరణను, నిరపేక్ష పరిపాలనను వ్యతిరేకిస్తూ ప్రజలు 1830 లోను, 1848 లోను ఇతర ఐరోపారాజ్యాల్లో ప్రారంభమైన తిరుగుబాట్లను గూర్చి విని, ఆందోళనకు దిగారు. కాని వారిలో జాతీయ భావోద్వేగము రాజకీయ సంస్కరణల పట్ల ఆకాంక్ష బలీయం కాకపోవడాన, ఆ విప్లవాలను ఆ రాజ్యాల్లోని **నిరపేక్ష** పాలకులు అణచివేయగలిగారు.

అయితే, రహస్య సంఘాలు, వారి నాయకుల భావావేశపూరితమైన ప్రసంగాలకంటె ఇటలీలలో సార్డీనియా రాజ్యం, జర్మన్ రాజ్యాల్లో ప్రష్యా జాతీయ సమైక్యత పట్ల ఆసక్తి చూపాయి. ఇందుకు కారణం ప్రజల అభీష్టాన్ని గౌరవించడం వలన కాదు. ప్రజల ఒత్తిడి అధికం కావడం వలన కాదు. పత్రికల్లో విస్తారంగా రచనలు ప్రచురితం అవుతున్నా, ప్రజల్లో అనేక రాజకీయ సంఘాలు - కొన్ని బహిరంగంగాను, కొన్ని రహస్యంగానూ ఏర్పడి ఆందోళన చేస్తూ - జాతీయ సమైక్యతను, రాజ్యాంగబద్ధ పరిపాలనను కోరుతూనే ఉన్నాయి. కాని వాటికి ప్రభుత్వాలపై ఒత్తిడి తేగలిగినంత బలం లేదు. కాగా సార్డీనియా, ప్రష్యా రాజ్యాలు ఇటలీ, జర్మనీ దేశాల ఏకీకరణకు పూనుకోవడంలో ముఖ్యోద్దేశం ఆయా ప్రభుత్వాల యొక్క రాజ్యకాంక్ష. తక్కిన రాజ్యాలపై ఆధిపత్యం వహించి సమగ్రంగా భాషా సాంస్కృతిక సమైక్యత గల భూభాగాలన్నింటిని తమ పరిపాలన క్రిందకి తెచ్చుకోవాలని ఉద్దేశించి ప్రారంభించిన ప్రయత్నాలే, ఆ దేశాల్లోని ఏకీకరణోద్యమాలు. పదునాలుగో లూయీ వంటి ఉదార నియంతలను ఆదర్శంగా తీసుకొని, దేశీయ పరిపాలనలో సర్వాధికారయుతంగా, వైభవోపేతంగా పరిపాలించాలనే ప్రగాఢవాంఛ వారిని అందుకు ప్రేరేపించింది. రెండవ కారణం, అనేక జర్మన్ రాజ్యాలు, ఇటాలియన్ రాజ్యాలు ఆస్ట్రియా ఆధిపత్యం క్రింద నలుగుతున్నవి. ఇటలీలోని ఉత్తరభాగం యావత్తు అప్పుడు ఆస్ట్రియా సామ్రాజ్యంలోని అంతర్భాగం. ఆస్ట్రియాను పారద్రోలి, అన్ని ఇటలీరాజ్యాలను తన పాలనాధికారం క్రిందకి తెచ్చుకోవడం సార్డీనియా ఆకాంక్ష. అలాగే ప్రష్యాకు జర్మన్ రాజ్యాల గూర్చి ఆకాంక్ష.

ఆ రెండు దేశాలు తమ జాతీయ సమైక్యతను సాధించుకొన్నది విదేశాలతో చేసిన యుద్ధాలతో. తమ దేశానికి చెందిన భూభాగాలు, భాషా, సాంస్కృతిక ప్రాతిపదికపై తమ జాతీయ రాజ్యవ్యవస్థలో చేరవలసిన రాజ్యాలు, ఆస్ట్రియా ఆధీనంలో ఉన్నందున ఈ పోరాటాలు అనివార్యమైనాయి. కనుక జర్మనీ, ఇటలీల సమైక్యత ప్రజల జాతీయ భావం కంటె రాజ్యాధినేతల ఆకాంక్షల ఫలితం. ఆ దేశాల్లో జాతీయ ఉదారవాద నియంతృత్వం ప్రజల సమర్థనతో కాక రాజ్యాధినేతల సామర్థ్యంతో సమకూరింది.

పశ్చిమఐరోపాలోని ఉదారవాదనియంతలు మధ్యతరగతి వారిని సమర్థిస్తూ పరిశ్రమలను, వర్తక వాణిజ్యాలను ప్రోత్సహించడాన్ని అనుకరిస్తూ జర్మనీ ఇటలీల్లో ప్రభుత్వాలే వాటి అభివృద్ధికి కంకణం కట్టుకొన్నాయి. అలాగే పశ్చిమఐరోపాదేశాలు తమ వర్తక వాణిజ్య విస్తరణకై వలసవాదాన్ని అనుసరించగా ఇటలీ, జర్మనీలు వాటితో పోటీపడి తమ దేశాలను పారిశ్రామీకరించి, వలసలను నెలకొల్పి, ఫ్రాన్సు, బ్రిటన్‌వంటి దేశాలతో సంఘర్షణకు దిగినాయి. ఈ పరిణామాలలోని భేదాన్ని శ్రద్ధగా పరిశీలించవలసి ఉంది. పైన పేర్కొన్నట్లు జాతీయ సమైక్య రాజ్యాలుగా రూపొందించడంలోను, పారిశ్రామికీకరణ, వలసలపై పోరాటాలు అన్ని ఐరోపారాజ్యాలకు సమాన లక్షణాలుగా కన్పించినా, పశ్చిమ ఐరోపాదేశాల మధ్య ఐరోపాదేశాలలో ప్రభుత్వసంకల్పము, కార్యాచరణతో సంభవించాయి.

పశ్చిమ ఐరోపాదేశాల్లో ఈ పరిణామాలు భూస్వామ్యవ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో ప్రారంభమై క్రమ పరిణామంలో వర్తక వాణిజ్యదేశాలు, పారిశ్రామికదేశాలైనాయి. సుదీర్ఘమైన కాలవ్యవధిలో ఆ దేశాలు చైతన్యవంతమైన మధ్యతరగతిని అభివృద్ధి

చేసుకొన్నాయి. వారి ఆలోచనలు, ఆందోళనలు రాజకీయ సంస్కరణలను తెచ్చిపెట్టాయి. అవి ఆర్థిక వ్యవస్థలో భూస్వామ్యవిధానం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు దారితీశాయి. తదనుగుణంగా అవి వలసరాజ్యాలను సంపాదించడంలో సహజంగానే సంఘర్షణలకు దిగాయి. కాని మధ్యఐరోపాలో అనగా ఇటలీలో, జర్మనీలో పరిణామాలు ఈ విధమైన క్రమంలో జరగలేదు. కనుక అక్కడి రాజకీయ సంస్కరణలు రాజ్యాధినేతల ప్రసాదం. వారే రాజ్యాంగాలను అమలు జరిపారు. అందులో తమ సర్వాధిపత్యానికి లోటురాని విధంగా ఏర్పరచుకున్నారు. ప్రష్యా రాజైన మొదటి విలియమ్ (1861-88) జర్మనీ ఏకీకరణ తరువాత జర్మనీ చక్రవర్తిగా ప్రకటించుకొని స్వయంపాలనాధికారం (Autocracy) తో, నామమాత్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పరచాడు. ఆస్ట్రియాసామ్రాజ్యం అదేవిధమైన పరిపాలనావిధానంలో హంగరీ, బోహిమియా, స్లావేనియా మొదలైన దేశాలను, వారి జాతీయ భావాలను అణచివేసి తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఇటలీలో రెండవ విక్టర్ ఇమ్మాన్యుయెల్ రాజ్యాంగ బద్ధరాచరికాన్ని నెలకొల్పినా, అది నామమాత్రమే. అతని తరువాత మొదటి హంబర్ట్ (1878-1900), మూడవ విక్టర్ ఇమ్మాన్యుయెల్ (1900-1946) నియంతలై తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ సామ్రాజ్యవాద విధానాన్ని అనుసరించిన వారే. ఈ రాజ్యాలు, సామ్రాజ్యాలు ప్రధానంగా వ్యవసాయిక దేశాలే అయినా, పశ్చిమ ఐరోపాదేశాలను అనుకరించి, పారిశ్రామికీకరణ, వర్తక వాణిజ్య విస్తరణను వలస రాజ్యస్థాపనను తమ విధానంగా చేపట్టాయి. కనుక పశ్చిమ ఐరోపా దేశాలవలె మధ్య ఐరోపా దేశాల్లో రాజకీయ సంస్కరణలు ఉదారవాదంపై ఆధారపడినవి కావు. అక్కడి రాజకీయ, ఆర్థిక పరిణామాలు రాజ్యాధినేతల ప్రాబల్య ప్రాభవాలను పెంచడానికి ఉపకరించాయి. అక్కడి ప్రజల జాతీయ భావాలు క్రమంగా దేశభక్తిగా కాక రాజభక్తిగా రూపుదిద్దుకున్నాయి. ఈ రెండింటి నడుమనున్న విభేదం ప్రపంచ యుద్ధాల సందర్భంలో స్పష్టమవుతుంది. ఆ యుద్ధాలు సామ్రాట్టుల పలుకుబడిలోని జర్మనీ, ఆస్ట్రియాలకు, ప్రజాస్వామ్యదేశాలైన ఫ్రాన్సు బ్రిటన్‌లకు నడుమ సంభవించిన విషయాన్ని మనసులో ఉంచుకొంటే మధ్య, పశ్చిమ ఐరోపాల్లో సంభవించిన జాతీయరాజ్యాల పరిణామక్రమంలోని భేదాలు స్పష్టపడతాయి.

## 2.3 జాతీయ రాజ్యాలు - ఆర్థిక పరిణామాలు :

ఆధునిక ఐరోపా చరిత్ర ప్రధానంగా ఆర్థిక పరిణామాల ఫలితమేనని సంక్షిప్తం చేయడం పొరబాటు కాబోదు. భూస్వామ్యవ్యవస్థ విచ్ఛిన్నంనుండి జాతీయ రాజ్యాల ఆవిర్భావము, అభివృద్ధి, ఆ రాజ్యాల్లోని ప్రజానీకాలు సాగించిన రాజకీయ ఉద్యమాలు, విప్లవాలు మొదలైనవి మధ్యతరగతి నాయకత్వం క్రింద జరిగినవి. మధ్యతరగతి భూస్వామ్యవిధానం విచ్ఛిన్నం కావడం నుండి ఉద్భవించి, వర్తక వాణిజ్యాల విస్తరణతో ఏర్పడినదే. ఈ పరిణామాలన్నీ తన ప్రయోజనాలను సాధించుకొనేందుకు, జాతీయ భావాలు ప్రాతిపదికగా పటిష్టమైన రాజ్యవ్యవస్థల ఏర్పాటుకు మధ్యతరగతి చేసిన కృషి ఫలితాలు.

ఆధునిక ప్రపంచ చరిత్రలో అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు, లాటిన్ అమెరికా దేశాలు అనగా దక్షిణ అమెరికాలోని ఉత్తరభాగం, ఉత్తర అమెరికాలోని దక్షిణ భాగంలో ఉన్న దేశాలు ఐరోపా దేశాలతో, ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్సు, స్పెయిన్, పోర్చుగల్, హాలెండు వంటి అట్లాంటిక్ తీర దేశాలతో స్వాతంత్ర్య పోరాటాలు జరపడం, తమ జాతీయ స్వపరిపాలనాధికారాలను సాధించుకొనడం ప్రధానాంశంగా కానవస్తుంది. ఈ పోరాటాలకు కారణాలు పైన పేర్కొన్నట్లు ఐరోపాదేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కొరకు, అనగా తమ పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య విస్తరణలను ధ్యేయంగా, ఆసియా - ఆఫ్రికా దేశాలను తమ ఆధిపత్యంలోనికి తీసుకొని కొల్లగొట్టడమే. కనుక ప్రపంచ ఆధునిక చరిత్ర ఆధునిక ఐరోపాలో సంభవించిన ఆర్థిక పరిణామాల నుండి ఉత్పన్నమైందని నిస్సంశయంగా చెప్పవచ్చు.

పధునాలుగు, పదునైదు శతాబ్దాల్లో విస్తారంగా నావికులను ప్రోత్సహించి, నూతన సముద్రమార్గాల అన్వేషణలో గణనీయమైన విజయాన్ని సాధించినవి స్పెయిన్, పోర్చుగల్ దేశాలు. స్పెయిన్ భారతదేశాన్ని చేరడానికి సముద్రమార్గాన్ని కనిపెట్టే ఉద్దేశ్యంతో పంపిన కొలంబస్ నవీన ప్రపంచాన్ని (అంతకుముందు తెలియని అమెరికా ఖండాన్ని, ఆధునిక యుగంలోని తొలిశతాబ్దాల్లో అమెరికా ఖండాన్ని ఆ పేరున పిలిచేవారు), పోర్చుగల్ పంపిన వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గాన్ని కనిపెట్టారు. పదునారో శతాబ్దిలో ఈ దేశాలు తాము కనిపెట్టిన సముద్రమార్గాల ద్వారా అపారమైన లాభాలతో ఆర్థికంగా

అత్యుచ్ఛ స్థితిని చేరాయి. క్రమంగా అది అట్లాంటిక్ తీరంలోని మిగిలిన ఐరోపా దేశాల ఈర్ష్యాసూయలకు కారణమైంది, వారు కూడ క్రమంగా భారతదేశంతో జరిగే వాణిజ్యంలో ప్రవేశించి పోర్చుగల్‌తోనూ, నవీన ప్రపంచంలో విస్తరించేందుకు స్పెయిన్‌తోనూ పోటీపడ్డాయి. ఈ విధమైన పూర్వరంగం నుండి ఆధునిక యుగంలో ఐరోపాదేశాల ఆర్థిక ప్రయోజనాలపై ఆధారపడిన అంతర్జాతీయ సంబంధాలు ఏర్పడ్డాయి.

## 2.3.1 వాణిజ్య రాజ్యరాజ్యవిధానం :

ఈ పరిణామం నుండి ప్రధానంగా రెండు ఫలితాలు ఉత్పన్నం అయినాయి. మొదటిది వర్తక వాణిజ్యాల అభివృద్ధి రాజ్యాలకు పన్నులు, సుంకాల రూపంలో అధికాదాయాన్ని ఇయ్యడమూ, దానివలన రాజులు తమ స్వంత సేనలను నిర్మించుకొని, ఆయుధ సంపత్తిని పెంపొందించుకోవడము. అప్పటికే భూస్వామ్యవిధానం బలహీనమవుతూ, ప్రభువర్గం సంఖ్యాబలంతోను, సైనిక బలంతోనూ క్షీణిస్తుండడంతో రాజ్యవ్యవస్థ తన సైనికావసరాలకై ప్రభువర్గంపై ఆధారపడవలసిన అవసరం తగ్గింది. తుపాకి మందు (gun power) కనుగొనబడి విరివిగా ఉపయోగంలోకి రావడంతో రాజ్యవ్యవస్థల సైనిక శక్తి పెరిగింది. ప్రభువుల సాయంతో అధికంగా సాయుధబలాలను నిర్వహించవలసిన అవసరం తగ్గింది. ఇది రాజ్యవ్యవస్థలు బలోపేతం అయి, నిరపేక్షరాచరికం అభివృద్ధి చెందడానికి దోహదం చేసింది.

రెండవది, వర్తక వాణిజ్య విస్తరణల వలన దేశీయంగా ఉత్పత్తుల అవసరం పెరిగింది. అధిక సంఖ్యలో నిపుణులైన వృత్తి పనివారు, లోగడ సంఘాలుగా ఏర్పడి, ఉత్పత్తి చేయడం కంటె పట్టణాలకు నగరాలకు చేరి, తమ కర్మాగారాలను నెలకొల్పడం జరిగింది. వారిని ఆయా వృత్తుల్లో ప్రవేశించకుండ అరికట్టడం అక్కడి వృత్తి సంఘాలకు సాధ్యంకాలేదు. కాగా, ఈ సంఘాలకు వెలుపల విస్తారంగా పెట్టుబడిదారులు తయారై నిపుణులైన పనివారిని తమ కర్మాగారాల్లో నియమించుకోవడమూ, వర్తక వాణిజ్యాల్లోను, ఉత్పత్తి కార్యక్రమాల్లోను పాల్గొనడమూ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాలు విస్తరించిన కొలది రాజ్యాదాయం, రాజకీయాధికారం ప్రాప్తిస్తాయి. కనుక, నిరపేక్షరాచరికాలు ఈ విధమైన పరిణామాలను ప్రోత్సహించడం జరిగింది. మధ్యయుగంనాటి వర్తక, వృత్తి సంఘాలు క్రమంగా అంతరించడం, దాని స్థానంలో వ్యక్తిగత పెట్టుబడిదారులు వృద్ధికావడం ఈ పరిణామాల ఆర్థిక ఫలితం.

ఈ పరిణామాలను ప్రోత్సహించడంతో రాజులు సైతం, అంతకు పూర్వం కంటె, భిన్నమైన ఆర్థిక దృక్పథాన్ని, విధానాలను జాతీయ ఆర్థిక పురోగతిని ధ్యేయంగా ఏర్పరుచుకున్నారు. వారు తమ దేశ ఉత్పత్తులను అధికంచేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేయడం, తద్వారా అధికంగా బంగారు వెండి నిల్వలను వృద్ధి చేసుకోవడం లక్ష్యంగా ఎంచుకున్నారు. అదేవిధంగా ఇతర దేశాలనుండి దిగుమతులు తమ దేశాల బంగారు వెండి నిల్వలు తరిగిపోవడానికి కారణం అవుతాయి కాబట్టి వాటిని నిరుత్సాహపరచారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలకు తమ దేశనౌకలను ఉపయోగించడం ద్వారా రవాణా ఖర్చులను తగ్గించవచ్చు, కనుక అధికంగా వర్తక నౌకలను, వాటి రక్షణకు యుద్ధ నౌకలను నిర్మించ నారంభించారు. ఎగుమతులను ప్రోత్సహించేందుకు తక్కువ సుంకాన్ని, దిగుమతులను నిరుత్సాహపరచడానికి ఎక్కువ సుంకాన్ని విధించడం ద్వారా తమ దేశ ఉత్పత్తులకు రక్షణసుంకవిధానాన్ని (System of Protective Tariff) అనుసరించారు. మొత్తం మీద వీలైనంత అధికంగా వెండి బంగారు నిల్వలను వృద్ధి చేయడం జాతీయరాజ్యాలలోని నిరపేక్షరాచరికాల లక్ష్యం అయింది. వాటిని బట్టే దేశాల సుస్థిరత్వము, ప్రతిష్ఠ నిర్ణయింపబడేది. ఈ విధంగా సంపాదన, సంపత్తి నిల్వలను ధ్యేయంగా, వర్తకుల మనస్తత్వాన్ని పోలిన విధంగా ఈ రాజులు పరిపాలించిన విధానాన్ని వర్తకరాజ్యవిధానం (Mercantilism) అంటారు. ఈ రాజ్యవిధానంలో ఏవిధంగానైనా, ఎగుమతి, దిగుమతి వాణిజ్యం దేశసంపదకు, సంపద నిలువల అభివృద్ధికి కారణం కావలసి ఉంటుంది.

పటిష్ఠమైన నిరపేక్ష రాజ్యవ్యవస్థల వర్తక రాజ్యవిధానంతో అట్లాంటిక్ తీరంలోని ఐరోపాదేశాలు అపారమైన సంపదను గడించి, వస్తూత్పత్తిలో సైతం గణనీయమైన అభివృద్ధి సాధించాయి. ఈ ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు ఆనాటి ఐరోపాలో **అతి**

త్వరితంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం తోడైంది. దీనితో పందొమ్మిదో శతాబ్ది మధ్యకాలానికి భారీపెట్టుబడులతో, భారీ యంత్రపరికరాలతో, అతి తక్కువ కాలంలో, సులువుగాను చౌకగాను వస్తువులను ఉత్పత్తి చేయగల కర్మాగారాలు (Factories) ఏర్పడసాగాయి. ఈ విధమైన శాస్త్రసాంకేతిక విజ్ఞాన ప్రగతికి, పెట్టుబడిదారీ విధానంపై ఆధారపడిన భారీ కర్మాగారాలలో జరిగే ఉత్పత్తికి మధ్యతరగతివారు కార్యకర్తలు. కాగా, జాతీయ రాజ్యవ్యవస్థలు, వాటిని పరిపాలించే నిరపేక్షరాచరికాలు ప్రోత్సాహకాలైనాయి.

అప్పటివరకు వాణిజ్య ప్రధానదేశాలైన అట్లాంటిక్ సముద్రతీరంలోని ఐరోపాదేశాలు ఈ పరిణామంలో పందొమ్మిదో శతాబ్ది నడిమి కాలానికి పారిశ్రామిక దేశాలుగా మారినాయి. దానితో ఆ రాజ్యాల నిరపేక్ష పరిపాలకులు అనుసరిస్తున్న వర్తకరాజ్యవిధానం, వలసరాజ్యవిధానం (Colonialism) గా మారింది. తమ దేశాలు వాణిజ్యప్రాబల్యం సంపాదించడానికి, ఇతర దేశాలపోటీని నిర్మూలించడానికి మొదట ఈ నిరపేక్ష రాచరికవ్యవస్థలు వర్తకసంఘాలకు సైనికంగా సాయం చేశాయి. ఆ సాయంవలన ఇతర ఐరోపాదేశాల పోటీని పూర్తిగా తొలగించుకొని, ఒక్కొక్క ఐరోపాదేశం ఒక్కొక్క ఆసియా దేశంలో తమ పలుకుబడిగల పరిపాలనామండలాలను (Spheres of influence) ఏర్పరచుకోగలిగాయి, క్రమేణ ఆ మండలాలను వారి వలసలుగా, ఖండాంతర సామ్రాజ్యంలోని అంతర్భాగాలుగా మార్చుకున్నాయి.

వర్తకరాజ్యవిధానాన్ని నిరూపించడానికి భారతదేశంలో ఆంగ్లేయులు అనుసరించిన రాజకీయ, ఆర్థిక విధానాలను ఉదాహరణగా గ్రహించవచ్చు. భారత, చైనాదేశాల్లో ఉత్పత్తి అయ్యే వివిధ వస్తువులను క్రయం చేసి, వాటికి గిరాకి కల్గిన ప్రదేశాల్లో విక్రయించి లాభం గడించడం తొలిదశ. అదే ఉద్దేశంతో భారతదేశానికి వచ్చిన ఇతర ఐరోపావర్తక సంఘాలను, అనగా పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి వారిని స్వదేశరాజులతో చేయికలిపి, దేశంనుండి వెళ్ళగొట్టగలిగారు. ఆ విధంగా భారతదేశం నుండి కేవలం బ్రిటిషువారు మాత్రమే వాణిజ్యాన్ని నిర్వహించే ఏకస్వామ్యాధిపత్యాన్ని (monopoly) ని పొందారు. ఇదేవిధంగా ఇండోనేషియాలో డచ్చివారు, ఇండోచైనాలో ఫ్రెంచివారు, తక్కిన ఐరోపాదేశాల పోటీని పూర్తిగా నిర్మూలించి ఏకస్వామ్యాధిపత్యాన్ని పొందారు.

ఈ ఏకస్వామ్యాధిపత్యం ఐరోపాదేశాలకు ఆసియా దేశాల్లోని ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో సంపూర్ణమైన ప్రయోజనాన్ని కలిగించింది. ఈ ఉత్పత్తులను వారికి మాత్రమే, వారు నిర్ణయించిన వెలకే అమ్మవలసిన పరిస్థితి కలిగి, స్వదేశీయ పారిశ్రామికులు నష్టపోయారు. ఐరోపాదేశాలు ఈ వస్తువుల గిరాకీని బట్టి అధిక వెలకు అమ్మి అపారంగా లాభాలు గడించాయి. వారి వర్తకానికి తమ దేశాల్లోని ప్రభుత్వాలు రక్షకసుంక (Protective tariff) విధానం ద్వారా సంపూర్ణమైన రక్షణ కల్పించాయి. వారి వర్తకవాణిజ్యాల అభివృద్ధి విస్తరణలకు ఈ విధంగా దోహదం చేయడం ద్వారా, అనగా వర్తకరాజ్యవిధానం ద్వారా ఐరోపా దేశాల్లో జాతీయ నిరపేక్ష రాచరికాలు బలపడ్డాయి.

ఖండాంతర వర్తక వాణిజ్య విస్తరణ, వలసల స్థాపన వలన ఐరోపాదేశాలకు ప్రాప్తించిన మరొక అవకాశం - తమ దేశాల్లో మితిమీరిన జనాభా పెరుగుదలకు పరిష్కారం. వారు అమెరికాఖండాన్ని ఈ విధంగా ఉపయోగించుకోగలిగారు. వారి అదనపు జనాభాను వలసలకు తరలించడం ద్వారా, అక్కడి సారవంతమైన నదీమైదానాలను ఆక్రమించి సాగుచేయడం, ఖనిజసంపదను వెలికితీయడం సాధ్యమైంది. దీనివలన మాతృదేశంలో ఆర్థిక పురోభివృద్ధికి వలసల స్థాపన ప్రధానసాధనంగా వారికి తెలిసివచ్చింది. భారతదేశంలో బ్రిటిష్ వారు సైతం అటువంటి వలసలను నెలకొల్పి, తమదేశ అదనపు జనాభాను తరలించడానికి, వాటిని సాధనంగా చేసుకొని తమ పారిశ్రామిక ఉత్పత్తులను దేశంలో విరివిగా ప్రవేశపెట్టడాన్ని గూర్చి యోచించి, తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే అచిరకాలంలోనే అటువంటి ప్రయత్నం అవసరం లేదన్న విషయం స్పష్టమై, విరమించారు.

ఈ విధంగా భూస్వామ్యవిధానం విచ్ఛిన్నం నుండి పెట్టుబడిదారీవిధానము (Capitalism) దాని బాహ్యాలక్షణాలైన వర్తకరాజ్యవిధానం దేశీయంగాను, వలసరాజ్యవిధానం విదేశాంగ విధానంలోను ప్రముఖంగా ఏర్పడ్డాయి.

### 2.3.2 వలసరాజ్యవిధానం (Colonialism) :

శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ప్రగతి వలన వాణిజ్య **దేశాలు** పారిశ్రామిక దేశాలుగా, ఉత్పాదక దేశాలుగా పరిణామం చెందడం**తో** వలసల ప్రయోజనం మరొక విధంగా మారింది. పారి**శ్రామికాభివృద్ధికి** అత్యంతావశ్యకమైన పరిస్థితులు చౌకగాను, సులువుగాను లభించే ముడిపదార్థాల వనరులు, పారిశ్రామిక **ఉత్పత్తులకు విశ్వసనీయమైన** విక్రయ **కేం**ద్రాలు (Market places). **అప్పటికే** ఐరోపాదేశాలు చాలవరకు తమతో వర్తక**సంబంధాలు** కలిగిన **ఆసియాదేశాల్లో** పరిపాలనాధికారాన్ని చేజిక్కించుకోగలిగాయి. అమెరికాఖండంలోని వలసలపై ఆధిపత్యాన్ని సంపాదించాయి. **కనుక లో**గడ **ఉత్పత్తుల**ను కొనుగోలు చేస్తున్న దేశాల్లో, ఉత్పత్తులకు మారుగా ముడిసరుకులనే కొనుగోలు చేయడం, రక్షక సుంకవిధానం ద్వారా ఆయా దేశీయోత్పత్తులను సంపూర్ణంగా నిర్మూలించడం తమ విధానంగా చేసుకొన్నాయి. ఈ పరిణామాలతో ఐరోపా**దేశాలు ఆర్థి**క ప్రయోజనాల కొరకై సామ్రాజ్యవాదాన్ని అనుసరించే దేశాలైనాయి. ఖండాంతర వలసలను తమ సామ్రాజ్యంలోని **అంతర్భాగాలు**గా మార్చుకొని, ఆ దేశాల్లోని సహజవనరులను తమ పారిశ్రామికాభివృద్ధికి యధేచ్ఛగా ఉపయోగించు**కుంటూ**, ఆ దేశాలను తమ ఉత్పత్తులకు విక్రయకేంద్రాలుగా చేసుకొని సామ్రాజ్యాధిపత్యంతో స్వదేశ ఆర్థికాభివృద్ధిని సాధించుకోవడం ఈ సామ్రాజ్యవాద లక్షణం. ఈ విషయాలు సులువుగా బోధపడడానికి భారతదేశంలో బ్రిటిష్ పరిపాలకులు అనుసరించిన రాజకీయ, ఆర్థిక విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చు.

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ పదునేడవ శతాబ్దిలో భారతదేశంనుండి నూలు, పట్టువస్త్రాలను అధికంగా కొనుగోలుచేసి, ఐరోపాలోని సంపన్న ప్రభువర్గాలకు విక్రయించి, అధిక లాభాలు గడించేది. ఇవికాక ఇంకా అనేక వస్తువులతో సుగంధద్రవ్యాలు, వజ్ర వైడూర్యాలు, రాతిఉప్పు మొదలైన వస్తువుల్లో, వారి భారతదేశ వాణిజ్యం జరిగేది, కాని, వారి వలసవాద విధానము, **లేదా** సామ్రాజ్యవాదవిధానానికి దేశీయ ఆర్థికవ్యవస్థ శిధిలమైన తీరును పరిశీలించడానికి ఈ వస్త్రపరిశ్రమ తగిన ఉదాహరణ. **ఈ వర్తకం**లో ఇతర ఐరోపాదేశాల పోటీని అధిగమించడానికి, క్రమేణ నిర్మూలించడానికి, స్వదేశ పరిపాలకుల అంతఃకలహాలు చక్కని **అవకాశాలను** ఇచ్చాయి. వారి అంతర్గతపోరాటాల్లో తమ సైన్యాన్ని కిరాయికి ఇచ్చి గెలిపించి, వారి అభిమానాన్ని బ్రిటిష్ **ఈస్టిండియా** కంపెనీ పొందగలిగింది. వారి సాయంతో సాటి ఐరోపాదేశాల పోటీని తొలగించుకోగల్గడమే కాక, అనేక వాణిజ్య సదుపాయాలను సంపాదించడం ద్వారా స్వదేశీ వర్తకులను, వారికి వస్తువులను విక్రయించే స్వదేశీ వృత్తిపనివారి (artisans and craftsmen) పై కూడ వారు తమ ప్రభావాన్ని ప్రసరింపగలిగారు. స్వదేశీవర్తకులు చితికిపోయి, స్వదేశీవృత్తి పనివారల ఉత్పాదనలను కొను**గోలు** చేయడానికి కేవలం బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ, అందులోని ఉద్యోగులు నెలకొల్పిన వర్తకకంపెనీలు మాత్రమే మిగిలాయి. ఈ విధమైన ఏకస్వామ్యాధిపత్యం స్వదేశీ ఉత్పాదకులకు పూర్తిగా నిరుత్సాహకారణమై పరిశ్రమలు శిధిలమైనట్లు పైన వివరించడం జరిగింది. ఇది తొలిదశలో వారు వర్తక వాణిజ్య విధానాన్ని (mercantilism) అనుసరించిన ఫలితము.

మలిదశలో బ్రిటన్ వాణిజ్య**దేశం**నుండి పారిశ్రామికదేశంగా పరివర్తన చెందిన తరువాత అవలంబించిన వలసవాదవిధానంలో భారతదేశంలో చేనేతపరిశ్రమ పూర్తిగా చితికిపోయింది. ఇంగ్లాండులో 'గ్లాస్గో' మాంచెస్టర్, లాంక్‌షైర్ మొదలైన నగరాల్లో విస్తారంగా పెద్దపెద్ద జౌళి కర్మాగారాలు (Textile factories) నెలకొన్నాయి. వాటికి **నిరంతరా**యంగా ప్రత్తి అవసరం. ఇంగ్లాండులోని ప్రత్తిపంటతోనే వాటిని నిర్వహించడం సాధ్యంకానిది. కనుక బ్రిటిష్ **ఈస్టిండియా కంపెనీ** మునుపటివలె నూలు, పట్టు వస్త్రాలను కాకుండ ముడిప్రత్తిని, పట్టును కొనుగోలు **చేయ**సాగింది. అప్పటికే **భారతదేశంలో పలుప్రాం**తాలు వారి హస్తగతం అయినాయి కనుక, నేత వస్త్రాలపై మూల్యం తగ్గించి, ముడిసరుకుపై అధిక **మూల్యం** చెల్లించి, **స్వదేశీ** వస్త్రాలపై అధిక ఎక్సైజ్ సుంకం విధించి, వాటికిగల నామమాత్రమైన విక్రయావకాశాలను మూసివేసింది. **ప్రత్తి పండించే రైతులు** దానిని నేతగాండ్రకు అమ్మడంకంటె బ్రిటిష్ వర్తకసంఘాలకు అమ్మడం అధిక లాభకరం కనుక, వారికే **అమ్మారు. తమ యం**త్రాగారాల్లో ఉత్పత్తి అయిన వస్త్రాలపై **దిగుమతి** సుంకం తగ్గించి, ఇతర దేశాల దిగుమతులపై అధిక సుంకాన్ని విధించి, తమ ఉత్పాదనలకు విక్రయసౌకర్యాన్ని ఏర్పరచుకోగలిగారు.

దేశీయపరిశ్రమ కుటీరపరిశ్రమ కనుక ఉత్పత్తి వ్యయం (Cost of production) అధికం. బ్రిటిష్ వస్తువులు వాటికంటె అనేక రెట్లు చౌక కనుక దేశీయ ఉత్పత్తులకు గిరాకీ తక్కువ. దానికి తోడు దేశీయ ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకం విధించి, వాటి ఖరీదు మరింతగా పెరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనివలన భారతదేశం సర్వకాల సర్వావస్థల్లోను బ్రిటిష్ వస్తువులకు విశ్వసనీయమైన విక్రయ (market) దేశం అయింది. సులువుగా బ్రిటిష్ పరిశ్రమలు త్వరితగతిన అభివృద్ధి చెందాయి. ఈ విధంగా పరిపాలనాధికారాన్ని చేజిక్కించుకొని, సుంకాలు, పన్నుల విధింపును తమ పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు అభివృద్ధి పొందే విధంగా ఉపయోగించడం వలసవాదవిధానం. పరిశ్రమలు, వాణిజ్యాలపైనే కాక, భూమిశిస్తు, ఇంకా అనేక ఇతర పన్నులను సైతం ఈస్టిండియా కంపెనీ స్వంత లాభాలను దృష్టిలో పెట్టుకొని విధించి, వసూలు చేసింది. ఈ విధంగా మాతృదేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వలసదేశాలను కొల్లగొట్టడం వలసవాదవిధానం.

భారతదేశంలో బ్రిటిష్ పారిశ్రామిక ఉత్పత్తులకు గిరాకీ లభించేవిధంగా వేషభాషల్లో ఆచార వ్యవహారాల్లో వారి ఉత్పత్తులు అవసరమయ్యే విధంగా నాగరికతా సంస్కృతులను మలచింది. కాఫీ, టీ, సిగరెట్లు, విదేశీమద్యాలు, విదేశీ వస్త్రధారణ - ఇవన్నీ ఆ విధంగా భారతదేశంలో ప్రవేశపెట్టడం జరిగింది. బ్రిటన్‌లో అభివృద్ధి చెందుతున్న ఇనుము, ఉక్కు పరిశ్రమకోసం భారతదేశ ఖనిజ సంపదను తరలించి, అందుకై రైలుమార్గాలను నిర్మించి, వాటి నిర్మాణంలో తమ పరిశ్రమలకు స్థిరమైన విక్రయవసతి (marketing facility) ఏర్పరచుకొంది. బ్రిటన్‌లో అభివృద్ధి చెందుతున్న సిగరెట్ల ఫ్యాక్టరీలకొరకు భారతదేశంలో పొగాకు పంటను ప్రోత్సహించింది. చైనానుండి తేయాకు కొనుగోలు కొరకు భారతదేశంలో నల్లమందు విస్తారంగా పండించడాన్ని ప్రోత్సహించి, దీనిని చైనాకు ఎగుమతి చేసి లాభం గడించి, అందులో కొంత భాగాన్ని అక్కడ తేయాకు కొనుగోలుకు ఉపయోగించింది. ఈ విధమైన విధానాలవల్ల భారతదేశం తన సంపదలనే కాక, ముడిపదార్థాలను ఎగుమతి చేయడం వలన పారిశ్రామికాభివృద్ధిని పొందలేకపోయింది. భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం బ్రిటిష్ పరిశ్రమలకు నష్టదాయకం కనుక దేశీయమైన క్రయ విక్రయాలన్నీ అనగా ముడిపదార్థాల కొనుగోలు, తమ పారిశ్రామిక వస్తువుల దిగుమతి, విక్రయాలు అందుకు అనువైన రీతిలో నిర్వహించింది. స్వదేశపారిశ్రామికాభివృద్ధికి, తద్వారా ఐరోపాలోను, అంతర్జాతీయ రాజకీయాల్లోను తమదేశం అగ్రగామిగా ఉండేవిధంగా భారతదేశాన్ని సంపూర్ణంగా వినియోగించుకుంటూనే ఈ దేశ పరిపాలనకు జరిగిన వ్యయం ఈ దేశపు పద్దుల్లోనే చూపించింది. అనగా భారతీయులు తమ కళ్ళు తామే పొడుచుకొనే విధంగా బ్రిటిష్ పరిపాలన భారతదేశంలో జరిగింది.

భారతీయులు ఏదోనాటికి తమను బ్రిటిష్‌వారు దమన నీతితో పరిపాలిస్తున్న విషయాన్ని గ్రహించి తమదేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడతారనే భయంతో, అందుకు ఆవశ్యకమైన జాతీయ భావాన్ని ఎట్టి పరిస్థితిలోను తలెత్తకుండ జాగ్రత్తలు తీసుకొంది. మిషనరీలను ప్రయోగించి, భారతదేశంలోని మత, ధార్మిక వ్యవస్థలను ఆచార వ్యవహారాలను చాలవరకు పరిహాసపాత్రం చేసి, భారతీయులకు తమ సంస్కృతిపట్ల తమకే ఏవగింపు కలిగే పరిస్థితిని కల్పించింది. ఆంగ్ల విద్యావ్యాప్తికై నెలకొల్పిన కళాశాలలు యూరోపియన్ల, ముఖ్యంగా బ్రిటిష్ వారి వైజ్ఞానిక ఆధిక్యతను మనసుకెక్కించడానికి, భారతీయుల వెనుకబడినతనాన్ని గుర్తించడానికి తగిన వాతావరణం కల్పించాయి. ఉన్నతవిద్యకై ఇంగ్లాండు వెళ్లి, తిరిగి వచ్చినవారు అక్కడి రాజకీయ, సాంఘిక వ్యవస్థలను, స్వేచ్ఛా, సమానత్వభావాలను అలవరచుకొని తిరిగి వచ్చిన పిదప వారు ఆ విధమైన భావాలను ప్రజల్లో వ్యాపింపచేయడానికిగాని; భారతదేశంలో బ్రిటిష్ పరిపాలకుల దుర్నీతిని ఖండించడానికిగాని, అవకాశం లేకుండా పత్రికాస్వాతంత్ర్యాన్ని, వాక్స్వాతంత్ర్యాన్ని అదుపుచేసింది.

ఈ విధంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఐరోపాదేశాలు తమ ఆర్థిక ప్రయోజనాల కొరకు వలసరాజ్యాలను నెలకొల్పడం, ఆ దేశాల సహజ, వ్యావసాయిక వనరులను యథేచ్ఛగా వినియోగించుకొని, తమ దేశాభివృద్ధిని సాధించుకొంటూ, వలస దేశాలను వట్టిపోయే విధంగా కొల్లగొట్టడం, ఆ దేశప్రజల నాగరికతాసంస్కృతులను అణచివేయడానికి, వారిలో జాతీయ భావాలు ఏర్పడడాన్ని అరికట్టి, భావదాస్యంలోకి నెట్టివేయడం వలసవాద రాజ్యవిధానం. ఈ వలసలు రాజకీయంగా తమ

అధీనమైనవి కనుక, ఐరోపాదేశాలు వాటిని తమ సామ్రాజ్య భాగాలుగా భావించుకొన్నాయి. ఈ దృష్టితో వలసరాజ్య విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యత్యాసం లేదు. ఐరోపాదేశాలు తమ సామ్రాజ్యభాగాలను ఆర్థికంగా కొల్లగొట్టడం వలసరాజ్యవిధానం కాగా వలసలపై రాజకీయంగా ఆధిపత్యం వహించడం సామ్రాజ్యవాదం. వలసరాజ్యవిధానానికి సామ్రాజ్యవాదం సాధనం, సామ్రాజ్యవాదానికి వలసరాజ్యవిధానం ప్రయోజనం.

## 2.4 సామ్రాజ్య విస్తరణ విధానం (Imperialism) :

అయితే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలేకాక, అంతగా అభివృద్ధిచెందని తూర్పు ఐరోపా దేశాలు, ముఖ్యంగా ఆస్ట్రియా, రష్యాలు సైతం సామ్రాజ్యవిస్తరణవిధానాన్ని అనుసరించాయి. అవి బాల్కన్ ద్వీపకల్పంలోని అనేక క్రైస్తవ ప్రజానీకాలపై తమ సామ్రాజ్యాధిపత్యాన్ని విస్తరింపచేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశాయి. ఆ ప్రయత్నాల్లో నుండి ఆ ఉభయసామ్రాజ్యాలు సుమారొక శతాబ్ది 1815 నుండి 1914 లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు దౌత్యవిధానాలను, సాయుధపోరాటాలను ఉపయోగించి, తమ సామ్రాజ్యప్రయోజనాలను పెంపొందించుకోవడానికి తీవ్రంగా పోటీ పడ్డాయి. ఈ సామ్రాజ్యవాద స్వరూప స్వభావాలను కూడ సమీక్షించి, అవగాహన చేసుకోవడం అవసరం.

పశ్చిమ ఐరోపాదేశాల్లో, అనగా అట్లాంటిక్ తీరదేశాల్లో విస్తరించిన నవీన విజ్ఞానము, దాని ప్రభావంతో ఆ దేశాల్లో ఏర్పడిన నిరపేక్షరాచరికము, వర్తకవాణిజ్య విస్తరణ, మొదలైన పరిణామాలు, పరిమితంగానైనా, మధ్య ఐరోపాలోని ప్రష్యా, ఆస్ట్రియా వంటి దేశాలను ప్రభావితం చేశాయి. ఆ దేశాల్లో కూడ విద్యాలయాలు, వైద్యాలయాలు, వాణిజ్య సంస్థలు తదితర ఆధునిక నాగరికతా లక్షణాలు కొంతవరకు వ్యాపించాయి. అయితే రష్యా ఈ పరిణామాలకు సుదూరంగా, ఆసియా వాసులైన తురుష్క, పారశీక సామ్రాజ్యాల్లో అంతర్భాగంగా వారి వేషభాషలను, నాగరికతను అనుకరిస్తూ, అన్నిరంగాల్లోను వెనుకబడి ఉంది. 1682లో రష్యా సింహాసనం అధిష్ఠించిన జార్ మొదటి పీటర్ సమకాలీన ఐరోపాలో సంభవించిన పరిణామాలను గూర్చి ప్రత్యక్షంగా తెలుసుకొని, తన దేశాన్ని కూడ ఆధునిక ఐరోపాదేశంగా తీర్చిదిద్దడానికి సంకల్పించాడు. అప్పటినుండి, నిదానంగానైనా, అడుగడుగున అవరోధాలను ఎదిరిస్తూ రష్యాదేశం ఆధునీకీకరణ దిశగా అడుగులు వేయసాగింది. ఆధునీకీకరణలో మొట్టమొదటి అడుగు నౌకాబలాన్ని వృద్ధి చేసుకొని, సముద్రాలపై ఆధిపత్యం సంపాదించి, విదేశీవాణిజ్యాన్ని జరపడమని, అట్లాంటిక్ తీరదేశాల అభివృద్ధి దీనిపైనే ఆధారపడి ఉందని, పీటర్ గుర్తించాడు. అ విధంగా నౌకాయానానికి అనువైన సముద్రతీరం వైపు విస్తరించడం ఆనాటి నుండి రష్యా విదేశాంగ విధానానికి ప్రాథమిక సూత్రం అయింది. దీనిని "నీలినీటి విధానం" (Blue water policy) అంటారు. నీలినీరు అనగా లోతైన సముద్రజలం, నౌకాయానానికి అనువైనది. ఈ విధానాన్ని అనుసరిస్తూ జార్ పీటర్ టర్కీ ఆధీనంలోని నల్ల సముద్రంపై కన్నువేశాడు. నల్ల సముద్రం నుండి డార్డెనెల్స్ జలసంధి ద్వారా మధ్యధరా సముద్రంలో ప్రవేశించి, అక్కడినుండి బ్రిటన్, ఫ్రాన్సులవలె ఎర్రసముద్రంగుండా అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రాలలోనికి నౌకాయాన వసతులు సంపాదించడం అప్పటినుండి రష్యాను పరిపాలించిన జార్ చక్రవర్తుల ఆశయం. అయితే అటువంటి విస్తరణ విధానం ఆనాటి ఐరోపా దౌత్య విధానంలోని ముఖ్యాంశం, "తుల్య ప్రాబల్యత" (Balance of Power) ను కాపాడడమనే నీతికి విరుద్ధం, ఆస్ట్రియా, ప్రష్యా రాజ్యాలకు ఆందోళనకరం.

1815 లో వియన్నాకాంగ్రెస్ సమావేశంలో తురుష్కసామ్రాజ్యం మరణావస్థలో ఉందని, తురుష్కులను ఐరోపానుండి వెళ్లగొట్టి, ఆ సామ్రాజ్యభాగాలను పంచుకోవడం మేలని, అప్పటి రష్యన్ జార్ అయిన మొదటి అలెగ్జాండర్ సూచించాడు. అటువంటి సామరస్య విధానం ఆస్ట్రియా, ప్రష్యాలకు ఆందోళన కలిగించకుండా, ఐరోపా అగ్రరాజ్యాల నడుమ తుల్య ప్రాబల్యతకు భంగం లేకుండ, తాను నల్ల సముద్ర ప్రాంతాలను పొందవచ్చునని ఆశించాడు. అవి రష్యా ఆధునీకీకరణ, వాణిజ్య విస్తరణ సజావుగా జరిగేందుకు ఆవశ్యకం. కాని అతని సూచనను అగ్రరాజ్యాలు పట్టించుకోలేదు. పైగా నల్ల సముద్ర ప్రాంతాల్లో రష్యా విస్తరణ భారతదేశంలోని తన వలస సామ్రాజ్యాధిపత్యానికి ప్రమాదమని బ్రిటన్ భావించింది.

ఆ తరువాత రష్యా బాల్కన్ దేశాల్లో, అనగా నల్ల సముద్రం చుట్టూ ఉన్న క్రైస్తవ దేశాల్లో ప్రాబల్యాన్ని పెంచుకోవాలని భావించింది. ప్రజలు తురుష్కసుల్తాన్ మత దురభిమానపూరితమైన నియంతృత్వపరిపాలనను ఎదిరించి స్వాతంత్ర్య పోరాటాలు చేయడం ప్రారంభించటంతో, ఆ దేశాలలోని రష్యా వారికి సాయపడి, వారి మైత్రిని సంపాదించడమే తన ఆశయసిద్ధికి ఏకైక మార్గంగా భావించింది. అయితే, ఈ పోరాటాల్లో రష్యా లాభం పొందడం ఐరోపా అగ్రరాజ్యాలు - ముఖ్యంగా ఆస్ట్రియాకు, బ్రిటన్‌కు ఇష్టంలేదు. తురుష్కసామ్రాజ్య భాగాలను కబళించి,. ఆ తరువాత అదే విధమైన జాతీయ భావాలను, స్వాతంత్ర్య కాంక్షను రెచ్చగొట్టి, తన సామ్రాజ్య భాగాలను కూడ రష్యా కబళిస్తుందని ఆస్ట్రియా భయం. అలాగే రష్యా నల్లసముద్రంపైన, మధ్యధరా సముద్రంపైన ఆధిపత్యం పొందితే భారతదేశ వలససామ్రాజ్యంతో తన సంబంధాలకు విఘాతం కలుగుతుందని బ్రిటన్ భయం. అందుచేత తురుష్క సామ్రాజ్య పతనం కాకుండ కాపాడటానికి ఆ రెండు రాజ్యాలు విడివిడిగా ప్రయత్నాలు చేశాయి. అదే సమయాన బ్రిటన్, ఫ్రాన్సు దేశాలు తురుష్కులు సాటి క్రైస్తవ ప్రజానీకాలపై దుష్పరిపాలన జరుపుతూ ఉండడాన్ని చూచి సహింపలేకపోతున్నవి. ఏ విషయం స్పష్టంగా నిర్ణయించుకోలేక, ఈ రెండు విధాలైన అభిప్రాయాల నడుమ ఊగిసలాడుతూ అగ్రరాజ్యాలు కాలం గడిపిన అంశాన్ని ఆధునిక ఐరోపా చరిత్రలో "ప్రాచ్యసమస్య" (Eastern Question) అంటారు.

1815 నుండి 1914 వరకు ప్రాచ్య సమస్య ఎటూ తేలకుండ అదే స్వభావంతో కొనసాగింది. ఈ నడుమకాలంలో తూర్పు ఐరోపాలో తురుష్కసామ్రాజ్యంలోని అనేక క్రైస్తవ ప్రజానీకాలు తిరుగుబాట్లుచేసి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడం, అగ్రరాజ్యాలు జోక్యం కలిగించుకొని వాటికి స్వాతంత్ర్యాన్ని ఇప్పించడానికి, అదే సమయాన తురుష్కసామ్రాజ్య పటిష్టత గూర్చి యోచించడము, సాధారణ విషయం అయింది. అయితే, ఆ రాజ్యాలను సమర్థించే రష్యా అనేకసార్లు ఆ పోరాటాలను అవకాశంగా తీసుకొని, తన ప్రయోజనం సాధించుకోవడానికి ప్రయత్నించి కృతకృత్యతను పొందడం, వెంటనే అగ్రరాజ్యాలు రంగప్రవేశం చేసి, రష్యా ప్రయోజనాలను నీరుగార్చడం పరిపాటి అయింది. తుదకు మొదటి ప్రపంచ యుద్ధానంతరం వర్సేల్స్ సంధి సమావేశాల్లో వుడ్రో విల్సన్ అన్ని జాతులకు గల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించాలని తన పదునాలుగు సూత్రాల్లో చేసిన ప్రతిపాదన వలన తురుష్క, ఆస్ట్రియా సామ్రాజ్యాలను రెండింటిని రద్దుచేసి, వాటికి లోబడి ఉన్న అన్ని జాతులకు రాజ్యాలను ఏర్పరచడం జరిగింది. స్థూలంగా, ఇవి ఆధునిక ఐరోపాచరిత్రలో సామ్రాజ్యవాద విధానం (Imperialism) యొక్క పూర్వాపరాలు, పరిణామ దశలు.

## 2.5 శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన వికాసం :

ఐరోపా ఖండం మధ్యయుగంనుండి, ఆధునికయుగానికి చేసిన ప్రస్థానంలో సంభవించిన పరిణామాలు - జాతీయ నిరపేక్ష రాచరికాలు ఉద్భవించడం; పారిశ్రామిక విప్లవం సంభవించి వలసరాజ్య విధానం ఆవిర్భవించడం; వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక దేశాల ప్రజానీకాలు జాతీయభావావేశం కలిగి స్వాతంత్ర్య పోరాటాలు చేయడం; స్వపరిపాలనా వ్యవస్థలను నెలకొల్పుకొనడం - వీటన్నిటికి మూలమైనది విద్యా, విజ్ఞానాల వ్యాప్తి. అవి కలిగించే విశ్లేషణాత్మకమైన ఆలోచనా విధానం, వాటినుండి ఉత్పన్నమైన నూతన దృక్పథాలు, వాటి ప్రభావాలను గూర్చి సందర్భోచితంగా అక్కడక్కడ ప్రస్తావించడం, కొంత కొంత విపులీకరించడం జరిగింది. ఈ అంశాన్ని గూర్చి మరికొంత వివరంగా తెలుసుకోవడం యుక్తం. ఈ పరిణామాలను ఐరోపాలో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనం (Renaissance) అంటారు.

క్రీ.శ. పదునైదవ శతాబ్ది మధ్యకాలం నుండి ఐరోపాలో నూతన విజ్ఞానవికాసము, వ్యాప్తి ప్రారంభం అయినట్లు పైన ప్రస్తావించడం జరిగింది. 1453లో బైజాంటైన్ సామ్రాజ్య రాజధాని అయిన కాన్‌స్టాంటినోపిల్ నగరం తురుష్కుల వశం కావడంతో, అక్కడి గ్రీకు భాషాకోవిదులు, కవులు విజ్ఞానులు, తాత్త్వికులు, శిల్పులు, చిత్రకారులు మొదలైన వారు మధ్య, పశ్చిమ ఐరోపాదేశాలకు బహుళంగా వలసవచ్చారు. వారితో పాటు ప్రాచీన గ్రీకు సంస్కృతికి చెందిన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్, ఆర్కిమెడిస్, పైథాగరస్ మొదలైన తత్త్వవేత్తల గ్రంథాలు, సిద్ధాంతాలు, ప్రాచీన గ్రీకు కావ్య, నాటక సాహిత్యం, శిల్ప చిత్రలేఖనా శైలులు మధ్య, పశ్చిమ ఐరోపా దేశాల్లో వ్యాపించడం, విస్తారంగా ప్రభావితం చేయడమూ జరిగింది.

ఈ సాంస్కృతిక పునరుజ్జీవన ఫలితంగా రెండు నూతన దృక్పథాలు మధ్య, పశ్చిమ ఐరోపా దేశాల్లో ప్రారంభమై అత్యంత ప్రాధాన్యతగల రెండు విధాలైన పరిణామాలను కల్గించాయి. వాటిలో మొదటిది ప్రామాణిక సాంప్రదాయవాదం (Classicism). రెండవది మానవతావాదం (Humanism). ప్రాచీన గ్రీకు వాఙ్మయసంపద, కళాశైలులు వాస్తవానికి ఆనాటి మధ్య, పశ్చిమ ఐరోపాకు పూర్తిగా అపరిచితమైనవి కావు. అయితే వాటిని క్రీస్తు పూర్వం విలసిల్లిన సంస్కృతిగానూ, దానినుండి క్రైస్తవ ధార్మిక విజ్ఞానము, మతవ్యవస్థ నిర్వహణకు పునాదులు ఏర్పడిన విధము, వీటిని అధ్యయనం చేయడానికే ఉపయోగించడం జరిగింది. ఆ తత్త్వవేత్తలు నిశితంగా మానవస్వభావాన్ని గూర్చి, సమాజము, రాజ్యవ్యవస్థల గూర్చి, వాటిని అభివృద్ధి పరచడానికి చేసిన చర్చలు మొదలైనవి మధ్యయుగంనాటి విద్వాంసుల దృష్టిని ఆకర్షించలేదు. అలాగే ప్రాచీన గ్రీకు శిల్ప, చిత్రకళలు మానవ దేహ సౌందర్యాన్ని అత్యంత వాస్తవిక రీతిలో చిత్రించి సౌందర్యాన్ని సృష్టించినట్టివి. ఇవన్నీ ఈ లోకానికి సంబంధించిన వ్యవహారాలు, భౌతిక విషయాలు. కనుక మధ్యయుగంనాటి మత వ్యవస్థకు అవి ఆకర్షణీయమైనవికావు. కాగా 1453 తరువాత బైజాంటైన్ నుండి వచ్చిన విద్వాంసులు, కవులు, కళాకారులు ఈ అంశాల్లో తమ సిద్ధాంతాలను, కళాసాంప్రదాయాలను ప్రచారం చేయడంతో మధ్యయుగంలో మతవ్యవస్థ భోదించే ఏకైకవిద్యా, విజ్ఞానవిధానానికి కొంత నిరాదరణ ఎదురైంది.

ప్రాచీన గ్రీకు విజ్ఞానం కేవలం సిద్ధాంతాలను విధించేది కాదు. ఆ సిద్ధాంతాలకు ప్రాతిపదిక అయిన ఆలోచనను, తార్కిక, తాత్త్విక విశ్లేషణలను సైతం ప్రబోధించినట్టిది. పూర్తిగా నైతికమూ, ధార్మికము, పారలౌకికము కాదు. పూర్తిగా భౌతికము, లౌకికమూ కూడ. అది మధ్యయుగంలోని మతవ్యవస్థవలె మానవుడు పాపి, అతనికి తన పాపప్రక్షాళన కంటె ఉన్నతమైన జీవిత లక్ష్యం లేదని బోధించేది కాదు. మానవ జీవిత ప్రాధాన్యతను, జీవన సౌందర్యాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రదర్శించేది. మానవ స్వ.. వంలోని చీకటి వెలుగులు - వాటి ఫలితంగా ఏర్పడే సంఘటనలు వీటన్నింటిని ప్రదర్శించే వాస్తవ చిత్రణా ప్రాధాన్యతగల సాహిత్యము కలిగినది.

పదునైదవ శతాబ్ది మధ్యకాలం నుండి సుమారు రెండున్నర శతాబ్దాలకాలం ఈ తత్త్వశాస్త్రాలు, విజ్ఞానము, ఐరోపాలోని మేధావుల ఆలోచనలకు ప్రాతిపదికలు అయినాయి. ప్రాచీన గ్రీకు, కావ్యనాటకసాహిత్యమూ వాటిలోని ప్రణయ, శృంగార, వీరగాధలు కవులకు కథావస్తువులను, కవితాసాంప్రదాయాలను సమకూర్చాయి. ఈ పరిణామం నుండే పైన పేర్కొన్నవిధంగా విస్తారంగా ఐరోపాలో ప్రాంతీయభాషల అభివృద్ధి జరిగి, జాతీయభావవికాసానికి, జాతీయరాజ్యాల ఆవిర్భావానికి దారితీసింది. ఈ విధంగా ప్రాచీన గ్రీకు విజ్ఞానం, సాహిత్యాలపై కల్గిన ఆరాధనాభావాన్ని ప్రామాణిక సాంప్రదాయవాదం (Classicism) అని వ్యవహరిస్తారు.

## 2.6 మానవతావాదం (Humanism) :

సాంస్కృతిక పునరుజ్జీవనం వలన తిరిగి ప్రాచుర్యం పొందిన ప్రాచీన వాఙ్మయమూ, కళాశైలులు మానవ జీవితానికిచ్చిన ప్రాముఖ్యతనుండి ఉద్భవించిన మానవతావాదం (Humanism) మరింత ప్రాధాన్యత కలిగింది. ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తల ఆలోచనలు, సిద్ధాంతాలు కేవలం ఆధ్యాత్మికమైనవి అస్పష్ట సత్యాన్వేషణకు పరిమితమైనవి, కావు. అవి భౌతిక ప్రపంచానికి అతీతమైన అస్పష్ట, (abstract) శాశ్వత సత్యాన్వేషణ చేసినా, భౌతిక ప్రపంచాన్ని గూర్చిన విచారణలే అధికంగా చేసినవి. ఆనాటి కాలంలో ఆ విషయాలకు నేటివలె వర్గీకరణ లేకున్నా, వారు ప్రకటించిన భావజాలము, సిద్ధాంతాలు ప్రకృతిసిద్ధమైన ప్రపంచం, దాని ఆవిర్భావము, చలనము, అందులోని మానవజీవిత స్వభావస్వరూపాలు, మొదలైన అన్ని అంశాలు కలగలసినవి. వాటి క్రమవికాసం, పరిణామాలు నేటి జీవశాస్త్రం (Biology), భౌతిక రసాయనశాస్త్రాలు (Physical Sciences), గణితము (Mathematics), చరిత్ర, రాజనీతి, ఆర్థికశాస్త్రాల వంటి సామాజిక, మానవతాశాస్త్రాలు (Social Sciences and Humanities) మొదలైన అనేక ఆధునిక శాస్త్రవిజ్ఞానాలకు ప్రాథమిక రూపాలు, కాగా 1453 నుండి, కాన్‌స్టాంట్‌నోపిల్ నగరంనుండి వచ్చిన విజ్ఞులు, మేథావుల వివరణలు, భాష్యాల వలన లోగడవలె ఈ విజ్ఞానం కేవలం మతపరంగా కాక మతేతరమైన

(Secular) శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాల పట్ల విశేషమైన ఆసక్తిని కలిగించింది. అలాగే ప్రాచీన గ్రీకు, రోమన్ శిల్పకళలు మానవ శరీరాన్ని అత్యంతవాస్తవమైన రూపంలో, భంగిమల్లోను ప్రదర్శించడాన్ని ప్రధానలక్షణంగా కలది. ఆ శిల్పకళలో మానవశరీరమే సౌందర్యానికి ప్రమాణం. ఈ శిల్పకళ కలిగించిన స్ఫూర్తితో పదునారో శతాబ్ది నుండి విలసిల్లిన ఐరోపా శిల్పులు, చిత్రకారులు మైకేల్ యాంజిలో, లియోనార్డో డవిన్సీ మొదలైనవారు తమ కళాఖండాల్లో ప్రదర్శించేందుకు మానవశరీరాన్ని, దాని వివిధమైన కదలికల తీరు తెన్నులను అత్యంత నిశితంగా అధ్యయనం చేశారు. అందుకొరకై వారు శవాలను కోసి, లోపలి అవయవనిర్మాణాన్ని, దీనివలన కల్గిన బాహ్యరూపాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారు. వారి ప్రయత్నాల్లో నుండి మానవశరీర నిర్మాణశాస్త్రం (Anatomy) గూర్చి అనేక యథార్థాలు వెల్లడి అయినాయి, వాటివలన అంతకు పూర్వం వ్యాపించి ఉన్న అనేక ఊహలు, అపోహలు నిర్మూలమైనాయి. ఈ విధంగానే ప్రకృతిని నిశితంగా పరిశీలించడం వలన అన్ని విధాలైన శాస్త్ర విషయాల్లోను నిర్ధారితమైన యథార్థాలు, వాటిపై ఆధారపడ్డ సిద్ధాంతాలు ఏర్పడసాగాయి. ఈ విధమైన శాస్త్రవిజ్ఞాన పరిశోధనలకు, బోధనలకు మధ్య, పశ్చిమ దేశాలన్నిటిలో విశ్వవిద్యాలయాలు విస్తారంగా ఏర్పడ్డాయి. వాటికి ప్రధానంగా ఆర్థికవనరులను సమకూర్చి ప్రోత్సాహించిన వారు మధ్యతరగతివారు, ఉదారవాద నియంతృత్వ రాచరికాలు.

## 2.7 విజ్ఞానోద్దీప్త యుగం (Age of Enlightenment) :

పదునేడవ శతాబ్ది ఈ విధమైన వైజ్ఞానిక వికాసం చేత విజ్ఞానోద్దీప్తయుగం (Age of Enlightenment) గా ప్రసిద్ధమైంది. సర్ ఐజాక్ న్యూటన్, ఎడ్మండ్ హాలీ, విలియమ్ హెర్షల్ వంటి భౌతిక శాస్త్రవేత్తలు, రాబర్ట్ బోయ్లే, జోసెఫ్ బ్లాక్, హెన్రీకావెండిష్, లావోషియర్ వంటి రసాయన శాస్త్రవేత్తలు; జేమ్స్ హట్టన్; మాల్పిగీ, రాబర్ట్‌హుక్, జాన్ రీ, లిన్నేయస్ వంటి జీవశాస్త్రవేత్తలు ఉద్భవించారు. వీరి ప్రకృతి పరిశీలన, దానివలన పురోగమించిన శాస్త్రవిజ్ఞానము క్రమంగా "ప్రకృతితత్త్వ" (Natural Philosophy) పరిశీలన, అధ్యయనాలకు దారితీసింది. సహజం యొక్క ఆవిర్భావపరిణామాలు, అనంతవిశ్వానికి కారణాలు, అందులోని శాశ్వతసత్యాసత్యాలు మొదలైన అనేక విషయాలపై చింతన, అధ్యయనం కొనసాగినాయి. ఇవన్నీ ధార్మిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాల, మతవ్యవస్థ విధించిన ఆచారవ్యవహారాల యుక్తాయుక్తాల, ఆవశ్యకతలను కూకటి వ్రేళ్ళనుండి విశ్లేషించాయి. వాటి ఫలితంగా శాశ్వత సత్యమేదీ లేదని, అటువంటి సత్యాన్ని ప్రతిపాదించే మతాలు, వాటి సిద్ధాంతాలు అన్ని కల్పనలేనని, మానవుడు తన నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అవసరమైన వాటిని విశ్వసించి గ్రహించవచ్చు కాని వాటిని నిరభ్యంతరంగా త్రోసి పుచ్చవచ్చుననే ఉపయుక్తవాదుల (Utilitarian) సిద్ధాంతం అధిక ప్రాచుర్యం పొందింది. ప్రతి సిద్ధాంతానికి, ఆచారానికి, వ్యవస్థలకు, సంస్థలకు మానవకళ్యాణానికి దోహదం చేసే ప్రయోజనం ఉండి తీరాలి, అటువంటి ప్రయోజనమేదీ లేనప్పుడు దైవదత్తమని గొప్పలు చెప్పుకొనే మతవ్యవస్థ, తమ రాజ్యాధికారం దైవదత్తమని చాటుకొనే నిరపేక్ష పరిపాలకులు సైతం నిరర్థకమైనవిగా నిరాకరించదగినవి; లేదా సార్థకమైనవిగా సంస్కరించదగినవి. స్థూలంగా ఇది ఉపయుక్తవాద సారాంశం. ఈ వాదం ఫ్రెంచి విప్లవ కాలంనాటి మేధావులకు స్ఫూర్తినిచ్చి వారు సమూలంగా సాంఘిక, రాజకీయ వ్యవస్థలను సంస్కరించడానికి ప్రోత్సహించింది.

పై పరిశీలన ప్రాచీన విజ్ఞానాన్ని భౌతికమైన, లౌకికమైన దృష్టితో అధ్యయనం చేసినప్పుడు, అపారంగా వివిధ శాస్త్రాలకు సంబంధించిన విజ్ఞానం వికసించింది. అది అనేక విధాలైన యంత్రపరికరాలను నిర్మించడానికి, మానవ జీవితాన్ని సౌఖ్యవంతం చేయడానికి అవసరమైన వస్తువులను రూపొందించి విరివిగా ఉత్పత్తి చేయడానికి దోహదపడింది. అనగా ఈ శాస్త్ర విజ్ఞానం లౌకికమైన మానవ జీవితానికి అపారమైన విలువను, ప్రాధాన్యతను ఇచ్చింది. కనుక దాని పునాది మానవతావాదం. ఈ మానవతావాదమే మతవ్యవస్థ బోధించే నైతిక, ధార్మిక విషయాలను సైతం ప్రయోజనకరమైనవిగా సంస్కరించడానికి, ప్రయోజనరహితమైనవి నిర్మూలించడానికి కారణమైంది. ఆ సందర్భంగా నూతన మతశాఖలు ఉత్పన్నం కావడం, అన్ని మతశాఖల అంతరార్థం ఒకటేనని గుర్తించడానికి దారి తీసింది. దైవికమైన వ్యవస్థగా భావించబడిన మతవ్యవస్థనే తన ప్రభావంతో

సంస్కరించగలిగిన మానవతావాదం సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని ప్రతిపాదించే నూతన వ్యవస్థలను నిర్మించడానికి, ఇహలోక జీవనం ప్రశాంతమైనది, పురోగామి, సౌఖ్యవంతమూ అయినదిగాను మానవులు మలచుకొనేందుకు ప్రోత్సహించింది.

అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. వివిధశాస్త్రాలు - భౌతిక, జీవ, సామాజిక శాస్త్రాలు - పురోగమించి అనేక నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించవచ్చు, కాని అవి వాటివరకే పరిమితమై సాధారణ ప్రజలను ఉద్దీపింపజేయడం, ఉత్తేజపరచడం సాధ్యం కాకపోతే అవి ఆచరణాత్మకంగా నూతన వ్యవస్థల నిర్మాణానికి ఉపకరించగలిగేవి కావు. అందుకు దోహదపడింది అచ్చుయంత్రం. అతి తక్కువ వ్యవధిలో, పెద్దసంఖ్యలో తప్పులు లేకుండ ఈ నూతన విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాల ప్రతులు ఐరోపా అంతట వ్యాపించగలిగే అవకాశాన్ని అచ్చుయంత్రం కలిగించింది. అలాగే ఈ నూతన విజ్ఞానాభివృద్ధికి అనేక దేశాల్లోని ముఖ్యనగరాల్లో ఏర్పడ్డ విద్యాలయాలు , వైజ్ఞానికుల సంఘాలు (associations) మరొక ముఖ్యకారణం.

అచ్చుయంత్రం 1450 లో జర్మనీకి చెందిన మెయింజ్ (Mainz) రాజ్యంలో జాన్ గూటెన్ బర్గ్ నిర్మించినట్లు మనకు ప్రస్తుతం తెలుస్తున్నది. అతనికి పూర్వం నెదర్లాండ్స్ (నేటి హాలెండు) లోని హార్లెమ్ పట్టణానికి చెందిన లారెన్స్ కోస్టర్ (Lourens Coaster) అనే వాడు కనిపెట్టినట్లుగా కొన్ని ఆధారాల వలన తెలియవస్తున్నది. కాని ప్రప్రథమంగా విస్తారంగా అచ్చువేసిన గ్రంథాల ప్రతులను తయారుచేసి, ఈ యంత్రాన్ని ప్రాచుర్యంలోనికి తెచ్చిన వాడు జాన్ గూటెన్ బర్గ్ అని నిస్సంశయంగా చెప్పవచ్చు. కాని, ఈ అచ్చుయంత్రానికి చెందిన అనేకమైన మౌలిక సూత్రాలను, పరికరాలను మొట్టమొదట రూపొందించింది - చైనాలోనని ఐరోపాలో కాదని తెలియవలసి ఉంది.

ఈ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం క్రమంగా పారిశ్రామిక విప్లవానికి, దానివలన అనేక ఆర్థిక పరిణామాలకు, కారణమైంది. అలాగే అనేక సాంఘిక, రాజకీయ వ్యవస్థాత్మక మార్పులకు సంస్కరణలకు దారితీసింది. ఈ వివరాలను చారిత్రక క్రమంలో ముందు ముందు పాఠాల్లో గ్రహించగలుగుతారు.

**మాదిరి ప్రశ్నలు :**

1. ఆధునిక యుగ లక్షణాలను చర్చించుము.
2. జాతీయ రాజ్యాలలోని పరిస్థితులను వివరింపుము.
3. జాతీయ రాజ్యాలలో ఆర్థిక పరిణామాలను చర్చింపుము.

**చదువదగిన గ్రంథాలు :**


1. Thompson, David : Europe Since Napoleon
2. Fisher, H.A.L., : A History of Europe (Vii, II only)
3. Southgate, G.W. : Modern European History (Vol. III only)


**- ఆచార్య వి. సుందరరామశాస్త్రి**

పాఠం - 3

# 1789 నాటి ఫ్రెంచి విప్లవ కారణాలు

## విషయసూచిక


3.0 లక్ష్యం
3.1 ఉపోద్ఘాతం
3.2 ఫ్రెంచి విప్లవ కారణాలు
3.2.1 ఆర్థికసంక్షోభం
3.2.1.1 ఆర్థికసంక్షోభం : స్వరూప స్వభావాలు
3.2.1.2 టర్గో (Turgot)
3.2.1.3 క్లూనీ (Clugny)
3.2.1.4 నెకర్ (Necker)
3.2.1.5 కలోని (Calonne)
3.2.1.6 బ్రియెన్నీ (Brienne)
3.2.2. సాంఘిక పరిస్థితులు : కారణాలు
3.2.2.1 స్వాధికారవర్గం (Priveleged class)
3.2.2.2 అస్వాధ్వికార వర్గం (Unpriveleged class)
3.3. రాజకీయ కారణాలు
3.3.1 నిరపేక్ష రాచరికం
3.3.2 పదునారవ లూయీ వ్యక్తిత్వం
3.3.3 మేరీ ఆంటోనటీ
3.3.4 వ్యవస్థాగత లోపాలు : పరిపాలనా వ్యవస్థ
3.3.5 అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రభావం
3.4. నూతన భావాలు, విజ్ఞానము : పూర్వ రంగము
3.4.1 ప్రకృతి తత్త్వం (Natural Phylosphy)
3.4.2 1789 నాటి ఫ్రెంచి మేధావులు - వారి పాత్ర
3.4.2.1 వోల్టైర్
3.4.2.2 రూసో (Rousseau)
3.4.2.3 మాంటిస్క్యూ (Montisquieu)
3.4.2.5 1789 నాటి ఫ్రెంచి విప్లవంలో మేధావుల పాత్ర - విమర్శ


## 3.0 లక్ష్యం :

ఆధునిక ఐరోపా చరిత్రలో ఫ్రెంచి విప్లవం అత్యంత మౌలికమైన పరిణామాలను తెచ్చిపెట్టింది. 1789 నుండి ఐరోపా చరిత్ర ఒకే దేశము, ఒకే సంఘటన ఒకే వ్యక్తిగా ఇమిడిపోయిందని, ఆ దేశం ఫ్రాన్సు, ఆ సంఘటన ఫ్రెంచి విప్లవం, ఆ వ్యక్తి నెపోలియన్ అని లార్డ్ ఆక్టన్ అనే ఒక గొప్ప చరిత్రకారుడు వ్యాఖ్యానించాడు. ఆయనే ఫ్రెంచి విప్లవం ఆకస్మికంగా ఒక

ఉల్కాపాతం వలె సంభవించింది కాదని కూడ వివరించాడు. ఆధునిక ఐరోపా చరిత్రలో ఇంత ప్రాధాన్యత గల ఈ సంఘటనకు గల కారణాలేవో, అవి ఎంత కాలంగా ఏర్పడి పరిపక్వం చెందుతూ ఈ విప్లవరూపంలో విస్ఫోటమైనాయో తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 3.1. ఉపోద్ఘాతం :

ఫ్రెంచి విప్లవం ఆధునిక ఐరోపా చరిత్రలోనే కాక, ఆధునిక ప్రపంచ చరిత్రలోనే జన సామాన్యం చేసిన విప్లవాలలో మొట్టమొదటిది అనవచ్చు. అది జనసామాన్యం తమ దేశ రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల పట్ల జాగరూకత కలిగి, వ్యవస్థల్లోని సమస్యలను సమిష్టిగా, జాతీయ భావ చైతన్యంతో ఎదిరించి చేసిన విప్లవం. అయితే అంతకంటే కొంచెం ముందు అమెరికా వలసల్లోని ప్రజలు బ్రిటిష్‌వారి ఆధిపత్యాన్ని ఎదిరించి స్వాతంత్ర్య పోరాటం చేశారు. అది కూడా సాధారణ ప్రజల సమిష్టి పోరాటమే, దాని ఉద్దేశ్యాలు కూడా ఇంచుమించుగా ఫ్రెంచి విప్లవం యొక్క ఉద్దేశ్యాలతో పోలినవే. అయితే ఆ పోరాటం కంటే ఫ్రెంచి విప్లవం యొక్క ప్రత్యేకత, దేశప్రజానీకం తమ దేశంలోని వ్యవస్థలను సంస్కరించుకొనేందుకు, తమ దేశప్రభుత్వంపై తిరుగుబాటు చేయడం.

ఫ్రెంచి విప్లవ ఫలితాలు కేవలం ఆ దేశానికే పరిమితంకాక, ఐరోపా ఖండంలోని దేశాలన్నింటిని ప్రభావితం చేశాయి. అందుకే ఈ విప్లవ ఫలితాలతో ఐరోపా చరిత్ర యావత్తు ఒకే దేశ చరిత్రగా, ఒకే సంఘటనగా, ఒకే వ్యక్తిగా ఇమిడి పోయిందని, ఆ దేశ చరిత్ర ఫ్రెంచి చరిత్ర, ఆ సంఘటన ఫ్రెంచి విప్లవం, ఆ వ్యక్తి నెపోలియన్ అని లార్డ్ ఆక్టన్ విజ్ఞతతో కూడిన వ్యాఖ్య చేశాడు. ఫ్రెంచి విప్లవాన్ని ఉదాహరణగా, లేక "నమూనా" (Model) గా తీసుకొని, అన్ని ఐరోపా దేశాల ప్రజలు పందొమ్మిదో శతాబ్దిలో అనేక విప్లవాలు చేసి తమ దేశాల్లోని నిరపేక్ష రాచరికాన్ని (Absolute Monorchy) రూపుమాపడానికి ప్రయత్నించారు. విప్లవ కాలంలో ఫ్రెంచి ప్రజానీకం తాము సాధించుకొన్న ప్రజాపాలన (Republican) వ్యవస్థను, స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాత్రాలను సంరక్షించుకొనేందుకు చేసిన సుదీర్ఘ పోరాటాల్లో సుస్థిరమైన జాతీయ వ్యవస్థగా ఏర్పడటం జరిగింది. అదే విధంగా ఐరోపాలోని అనేక దేశాల ప్రజానీకాలు జాతీయ భావోత్తేజాన్ని పొందాయి. తమ దేశంలో తమకు అనుగుణమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థల నిర్మాణానికి పోరాటాలు చేశాయి. ఈ విధంగా, ఆనాటి ఫ్రాన్సును చూస్తే, యావత్తు ఐరోపా స్వరూపస్వభావాలు అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేకించి ప్రతి ఐరోపా దేశ చరిత్రను విడివిడిగా చూడనవసరం లేదని ఆయన తాత్పర్యం.

ఫ్రెంచి విప్లవం నిరపేక్ష రాచరికాన్ని ఎదిరించి పోరాడి, దాని స్థానంలో సర్వసత్తాక ప్రజా సార్వభౌమాధికారాన్ని (Popular Sovereignty) సంరక్షించగల రాజ్యాంగబద్ధ (Constitutional) రాచరిక వ్యవస్థను నెలకొల్పినట్లు సాధారణంగా అర్థం చేసుకోవచ్చు. అందుచేత ఈ విప్లవం రాజకీయమైందని, రాజకియ కారణాల నుండి ఉత్పన్నమై, రాజకీయ పరిణామాలను కలిగించిందని భావించడం కద్దు. కాని, వాస్తవంగా ఈ విప్లవ కారణాలు కేవలం రాజకీయమైనవి కాదని, విప్లవ ప్రారంభ కాలంలో ప్రజల దాడికి రాజకీయ వ్యవస్థ లక్ష్యం కాదని, గుర్తించవలసి ఉంది. ఫ్రెంచి సమాజంలోని సాంఘిక, ఆర్థిక అసమానతలు, వాటి వలన సాధారణ ప్రజానీకం అన్ని రంగాల్లోను అణచివేతకు, దోపిడీకి గురవుతూ, తమ దురవస్థలను నిర్మూలించడాన్ని కోరుకున్నారు. కాని తుదకు వారి ఆగ్రహం నిరపేక్ష రాచరికంపై కేంద్రీకృతమైంది. దీనిని బట్టి సాంఘిక, ఆర్థిక వ్యవస్థలకు, రాజ్యవ్యవస్థకు గల సంబంధం వలన, ఏ రంగంలో సంస్కరణ అయినా రాజకీయ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటుందని, సంస్కరణలకు వ్యతిరేకత క్రమంగా రాజ్యవ్యవస్థ నుండి రావడమే అందుకు కారణమని గ్రహించవచ్చు. సాంప్రదాయక రాజ్యవ్యవస్థ సాంప్రదాయకమైన సాంఘిక, ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడి ఉండడాన ఏ రంగంలోనైనా, సాంప్రదాయాన్ని వ్యతిరేకించడమూ, సంస్కరణలను ప్రతిపాదించడమూ రాజ్యవ్యవస్థను సంస్కరించడంగానే పరిణమిస్తుంది.

కనుక ఫ్రెంచి విప్లవ కారణాలను, వాటి పరస్పర సంబంధాలతో సమూలంగా విశ్లేషించినప్పుడే విప్లవ స్వభావాన్ని, దాని ఫలితాలను తార్కికంగా అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. ఫ్రెంచి విప్లవ కారణాలను ఈ క్రింది విధంగా వర్గీకరించి విశ్లేషించవచ్చు.

## 3.2. ఫ్రెంచి విప్లవ కారణాలు :

స్థూలంగా ఫ్రెంచి విప్లవ కారణాలను ఆనాటి ఆర్థిక సంక్షోభము, పరిపాలనలోని అయోమయం, మేధావుల, తత్త్వవేత్తల ప్రభావము అనే మూడు ముఖ్యమైన వర్గాలుగాను, ఇంకా ఇతర కారణాలుగాను వర్గీకరించవచ్చు. ఆనాటి ఆర్థిక సంక్షోభం కొంతవరకు రాజకీయమైనదిగాను, కొంతవరకు భూస్వామ్యవిధానం యొక్క అవశేషాల నుండి ఉత్పన్నమైన సాంఘిక అసమానతలు, దురన్యాయాలుగాను వర్గీకరించవచ్చు. అలాగే పరిపాలనలోని అవ్యవస్థిత పరిస్థితులు చాలావరకు ఆనాటి ఫ్రెంచిరాజు పదునారవ లూయీ వ్యక్తిగత లోపాల వల్లనే ఏర్పడినట్లు కన్పించినా, అతని పూర్వుల నుండి సంక్రమించిన దుష్ఫలితాలకు, అతడు తన ప్రమేయం లేకున్నా, బాధ్యుడై అనుభవించవలసి వచ్చింది. ఈ పరిస్థితులన్నీ ప్రధానంగా సాంప్రదాయకమైన హోదాలు, అధికారాల పట్ల ప్రభువర్గం మొండి పట్టుదలతో ప్రవర్తించి, మారుతున్న పరిస్థితులను అవగాహన చేసుకొన్నందువల్ల తీవ్రమైనవి. ఈ మారుతున్న పరిస్థితులు బహుళంగా నాటి మేధావులు, తత్త్వవేత్తల విజ్ఞతాయుతమైన ఆలోచనల ఫలితంగా ప్రజల్లో కలిగించిన చైతన్యం వల్ల కలిగినవి. వారి భావాలు, ఆదర్శాలు విస్తారంగా ప్రజాబాహుళ్యంలో వ్యాపించి ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కలిగించడంతో సాధారణ ప్రజానీకం యొక్క ఆశలకు, ఆకాంక్షలకు బలం చేకూరింది.

### 3.2.1 ఆర్థిక సంక్షోభం :

1789 నాటి ఫ్రెంచి విప్లవానికి బీజం ఆనాటి ఆర్థిక సంక్షోభం వేసిందని చరిత్రకారులు భావించడం సహేతుకమేనని చెప్పవచ్చు. రాజ్యవ్యవస్థ ఆర్థికసంక్షోభంలో చిక్కుకొని, దానిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంటే అనేక వ్యవస్థాగతమైన అవాంతరాలు కలగడం అవి ప్రధానంగా సాంప్రదాయక విధానాల నుండి ఉత్పన్నం కావడము జరిగింది. ఈ ఆర్థిక సంక్షోభానికి కారణాలు పదునారో లూయీ కాలంలోనే ఉత్పన్నమయినవి కావు. కాని అతని కాలం నాటికి తీవ్రరూపం ధరించి, తమ దుష్ఫలితాలను కనపరిచాయి. దానితో అతడు దురదృష్టకర పరిణామాలను ఎదిరించవలసి వచ్చింది.

తరతరాలుగా క్రమంగా విషమిస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నంలో, ప్రభువర్గవ్యతిరేకత వలన ఆ ప్రయత్నాలు విఫలమవుతున్న సమయంలో ఫ్రాన్సు దేశం తీవ్రమైన కరువు కాటకాలకు గురవుతున్నది. వ్యవస్థాగతమైన దురన్యాయాలకు తోడు ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో గ్రామీణ కర్షకులు, సేద్యబానిసలు, కూడుగుడ్డలు కూడా కరువై విస్తారంగా పారిస్ నగరాన్ని చేరుతున్నారు. అక్కడ ఏదో ఒకవిధంగా కష్టించి కూడుగుడ్డలు సంపాదించుకొనాలని వారి ఆకాంక్ష. అటువంటి సమయంలో తమ కష్టనష్టాలను తొలగించి, ఉపాధి సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వం ఆదుకొంటుందని వారి ఆశ. కాని ప్రభువర్గ వైఖరి వలన ప్రభుత్వం నిస్సహాయ స్థితిలోపడి, వ్యర్థమైన చర్చలతో, వివాదాలతో కాలం గడుస్తుండడంతో వారు సహనం కోల్పోయి, విపరీత చర్యలకు పాల్పడ్డారు. దానితో విప్లవం ప్రారంభమై తీవ్రరూపం దాల్చింది.

#### 3.2.1.1 ఆర్థిక సంక్షోభం, స్వరూపస్వభావాలు :

పదునారో లూయీ తన అసమర్థత వలన నివారింపలేకపోయాడే కాని ఈ ఆర్థిక సంక్షోభానికి పూర్తిగా అతడు కారకుడు కాడు. తరతరాలుగా, సుమారు రెండు శతాబ్దాలుగా ఫ్రెంచిరాజులు మితిమీరి చేసిన ఖర్చులు, వాటికై వారు చేసిన అప్పులు ఈ సంక్షోభానికి కారణం. పదమూడో లూయీ (1610 - 43) కాలం నుండి ఫ్రాన్సు ఖండాంతర వాణిజ్యం చేస్తూ, రాజ్యాదాయాన్ని అధికంగా సమకూరుస్తున్నా, బూర్బన్ వంశీయుల యుద్ధోన్మాదానికి, భోగలాలసతకు అది సరిపోలేదు. పదునాలుగో లూయీ (1643 - 1715) తన సుదీర్ఘ పరిపాలనాకాలంలో ఫ్రాన్సు దేశానికి సహజ సరిహద్దులు ఏర్పరచాలనే సంకల్పంతో పరిసర

రాజ్యాలన్నింటితో నిరంతరం పోరాటాలు చేశాడు. నాగరికత, సంస్కృతుల్లో ఫ్రాన్సు అగ్రగామిగా తక్కిన ఐరోపా దేశాలన్నిటికి మార్గదర్శకం కావాలని అతని ఆకాంక్ష. అందుకై భవననిర్మాణాలకు, ఫ్రెంచి రాజకుటుంబం యొక్క డాబు, దర్పాలకు అపారంగా ధనాన్ని వెచ్చించాడు. గొప్ప తత్త్వవేత్తలు, కవులు, మేధావులను ప్రోత్సహించి, పోషించాడు. ఈ విధమైన రాజవ్యయానికి ఒక ప్రణాళిక, లెక్కలేవు. ధనాగారంలోని సంపద రాజు ఇష్టానుసారంగా ఖర్చుపెట్టుకునేందుకేనని, సాధారణ జనులవలె ముందువెనుకలు ఆలోచిస్తూ ఖర్చుపెట్టడం, జమాపద్దులు వ్రాసుకుంటూ జరిగిన ఖర్చుల గూర్చి మనస్తాపం చెందడం రాజరిక వ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చుతుందనే ఆనాటి రాజవంశీయుల, ఉన్నత ప్రభువర్గీయుల అభిప్రాయం. అందుచేత రాజ్యాదాయమెంతో తెలియదు. ఎంత ఖర్చు చేయవచ్చో ఆలోచన లేదు.

పదునాలుగో లూయీ కాలం నాటి వలె డాబు దర్పాలకు, యుద్ధాలకు తోడుగా, అతని తరువాత రాజ్యానికి వచ్చిన పదునైదవ లూయీ, భోగలాలసుడై, తన ఉంపుడుగత్తెలకు భవనాలు నిర్మించడానికి, ఐశ్వర్యం సమర్పించుకోడానికి మరింత విచ్చలవిడిగా దుర్వ్యయం చేశాడు. అతని కాలంలో ఫ్రాన్సు ఆస్ట్రియా వారసత్వయుద్ధంలోనూ ఆ తరువాత జరిగిన సప్తవర్ష సంగ్రామం (Seven year war) లోనూ పాల్గొని ఘోర పరాజయం పొందింది. దానితో రాచరిక ప్రతిష్ట దిగజారింది. ఈ విధమైన దుర్వ్యయానికి రాజ్యాదాయం సరిపోక ఫ్రెంచి రాజవంశం విరివిగా అప్పులుచేయు ప్రారంభించింది. రాజ్యానికి ఋణదాతలు మధ్యతరగతి వారు. వర్తక వాణిజ్యాల్లో అపారంగా లాభాలు గడిస్తూ, ప్రభువులకు, రాజ్యానికి వారి భోగలాలసలతకు, యుద్ధఖర్చులకు, కావలసిన ఋణాలను సమకూర్చగలిగిన వారు మధ్య తరగతి వారే. హెచ్చువడ్డీరేట్లతో అందినంత వరకు రాజ్యం అప్పులు చేస్తుంటే, వారు తమ సంపాదన ధ్యేయంగా అప్పులిచ్చేవారు. అయితే రాజ్యానికి ఋణాలు పుట్టించడం కూడ అసాధ్యమైన పరిస్థితి ఆసన్నంకాగా అప్పుడు పదునారో లూయీ కళ్ళు తెరచాడు. ఫ్రెంచి విప్లవానికి ముందు సంవత్సరములో, అనగా 1788లో ప్రభుత్వ ఆదాయ వ్యయాలను పరిశీలిస్తే నాటి పరిస్థితి విశదం అవుతుంది. ఆ సంవత్సరంలో రాజ్యాదాయం 211, 708, 977 లివర్లు (Livers), ధనాగారానికి చేరింది. అయితే అప్పటివరకు ప్రభుత్వం చేసిన ఋణాల మొత్తం 4.467,478,000 లివర్లు. దానిపై ఏటా 235,999,999 లివర్లు వడ్డీ చెల్లించవలసి ఉంటుంది. అనగా ప్రభుత్వాదాయం చేసిన ఋణాలకు వడ్డీ చెల్లించడానికి సరిపోదు.

### 3.2.1.2 టర్గో (Turgot) :

పదునారో లూయీ 1774లో టర్గో (Turgot) ను ఆర్థికమంత్రి (Controller General of Finance) గా నియమించి, అతని సాయంతో ఆనాటి ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కాలని తలచాడు. వాస్తవంగా టర్గో చాల సమర్థుడు, బహుశ ఫ్రాన్సు దేశంలో జన్మించిన ఆర్థిక నిపుణుల్లో అగ్రగణ్యునిగా భావించదగిన వాడు. అయితే, అప్పటి ఆర్థికసంక్షోభానికి ప్రధానంగా రాజు, ప్రభుత్వ వ్యవస్థ బాధ్యులని, వారు చేసే దుర్వ్యయం అందుకు మూలకారణమని భావించి దానిని తగ్గించడానికి అనేక చర్యలను చేపట్టాడు. ముందుగా ప్రభుత్వం నుండి రాయితీలు పొందుతున్న ప్రభువుల పట్టికల (Lists) ను పరిశీలించి, అందులో అనేకులు పరిమితిని మించి పొందుతున్నట్లు, అంతకు రెట్టింపు సంఖ్యలో ఏ విధమైన అర్హత లేనివారు కూడ పొందుతున్నట్లు గుర్తించి, ఈ పరిస్థితిని చక్కబరచడానికి చర్యలు తీసుకున్నాడు. వాటిలో ప్రధానంగా కోర్వీ (Corvee) అనే రహదార్ల పన్ను రద్దు వాటిలో ప్రధానమైనది. ఇది ప్రభువర్గం తమ ప్రభుత్వ పరిధిలోని కర్షకులు, సేద్య బానిసలు చేత ప్రతిఫలం చెల్లించకుండా రోడ్లను నిర్మించి, వాటిని వర్తక వాణిజ్యావసరాలకు, వస్తువుల రవాణాకు ఉపయోగించే సందర్భంగా వసూలు చేసే పన్ను. "సొమ్మొకడిది సోకొకడిది" అన్న చందంగా రోడ్ల నిర్మాణానికి తాము ఏ విధంగాను కృషి చేయకున్నా, వాటిని ఉపయోగించుకున్న వారిపై పన్ను వసూలు చేయడం ప్రభువర్గానికి ఒక ప్రత్యేక హోదా. దీనిని రద్దు చేయడం వలన ధాన్యం దేశంలోని అన్ని ప్రాంతాలకు స్వేచ్ఛగా రవాణా కావడానికి, ఆహారధాన్యాలు సులువుగా లభించడానికి అవకాశం కలుగుతుంది. వాటి ధర తగ్గి ప్రజాబాహుళ్యానికి అవి అందుతాయి. దాని స్థానంలో ప్రభువులు, మతాధిపతులతో సహా అందరు భూకామందులు చెల్లించవలసిన

ఒక క్రొత్త పన్నును గూర్చి యోచించాడు. ఈ సంస్కరణలు సహజంగా ప్రభువర్గానికి సహించరానివి. పట్టణాల్లో పరిశ్రమలను, వర్తకాన్ని ఇంకా అదుపులో ఉంచుకున్న వృత్తి సంఘాలను రద్దుచేయడం మరొక నూతనమైన యోచన. ఈ సంఘాలు సాధారణమైన వృత్తి పనివారిని, చిన్న వర్తకులను అభివృద్ధి చెందనీయకుండా, వారి శ్రమను సొమ్ము చేసుకొని వృద్ధి చెందుతున్న బడానాయకులను పోషించేవి. అంతేకాక, ప్రత్యేకమైన ప్రతి పరిశ్రమకు, వర్తకానికి చెందిన ఈ సంఘాలు, ఆయా పరిశ్రమల నుండి, వర్తకం నుండి ప్రభుత్వానికి రావలసిన సుంకాలను సమిష్టిగా శతాబ్దాల క్రిందట నిర్ణయించిన రేట్ల ప్రకారం చెల్లిస్తూ, రాజ్యాదాయాన్ని క్షీణింపచేస్తున్నాయి. ఈ సంఘాలను రద్దు చేయడంద్వారా, ప్రతి కార్మికుడు, వర్తకుడు స్వతంత్రులై, స్వేచ్ఛగా తమ వృత్తులను నిర్వహించుకుంటూ అభివృద్ధి చెందడానిక అవకాశం ఏర్పడుతుంది. వీరందరూ సమిష్టి (Collective) గా కాక వ్యష్టి (Individual) గా పన్నులు చెల్లించడం వలన రాజ్యాదాయం వృద్ధి చెందుతుంది. వ్యావసాయక, పారిశ్రామిక ఉత్పత్తులు, ప్రధానంగా ధాన్యము, ద్రాక్షసారాయి వర్తకాలను స్వేచ్ఛగా జరిగే విధంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధించబడే అంతర్గత సుంకాల (Internal Customs) ను రద్దు చేయడం మూడవ ప్రతిపాదన. ప్రభువులపై భూమిశిస్తు టైలీ (Taille)ను విధించడానికి టర్గో ఆలోచించకున్నా, ప్రభువులు కాకున్నా, వారితో ఏదోవిధమైన సంబంధం గల పలువురు ఈ పన్ను నుండి రాయితీలు పొందడాన్ని నివారించడాన్ని అతడు ప్రతిపాదించాడు. విద్యాలయాల నిర్వహణను మతవ్యవస్థ చేతినుండి తప్పించడానికి ప్రత్యేకంగా పాఠశాలలను నెలకొల్పి, మతవ్యవస్థకు చెందని సాధారణ ప్రజల నుండి వాటిలో ఉపాధ్యాయుల నియామకాన్ని టర్గో యోచించాడు. దీనితో విద్యాలయాల నిర్వహణను సాకుగా మతవ్యవస్థ అపారంగా ఆస్తులను సంపాదించి, వాటిపై ఆదాయాలు పొందుతూ, ప్రభుత్వానికి పన్నుల నుండి రాయితీలను అనుభవించే దురన్యాయాన్ని నివారించవచ్చు. అలాగే కొంతదేశం ప్రభువర్గపాలనలో ప్రభుత్వపాలనలో మరి కొంత దేశం ఉన్నటువంటి అయోమయ పరిస్థితిని నివారించి, దేశమంతటికి ఒకే విధమైన పరిపాలన వ్యవస్థ ఏర్పాట్లును గూర్చి యోచించాడు. పారిష్ (Parish) లనబడే స్థానిక విభాగాల పైన, వాటిపైనున్న ఎరాండిస్మా (Arrondisments), వాటిపై రాష్ట్రస్థాయిలోను, వాటి వాటి స్థాయికి తగిన స్థానిక ప్రభుత్వాలను "మున్సిపాలిటీ" లనే వాటిని, ఫ్రెంచి జాతీయ స్థాయిలో "గ్రాండ్ మున్సిపాలిటీ"ని, ఏర్పరచడం అతని యోచన ఈ స్థానిక ప్రభుత్వాలకు ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొనడానికి, అందరు భూకామందులకు వోటు హక్కును ఇయ్యడానికి అతడు యోచించాడు. ఈ ఓటు హక్కు వలన కేవలం ప్రభువర్గమే కాక, సాధారణ ప్రజానీకం, చిన్నచిన్న కమతాలు కలిగిన భూకామందులు, అందరికి అవకాశం కలుగుతుంది.

టర్గో ప్రతిపాదనలు ప్రభువర్గము, మతాధిపతి వర్గము బహుకాలంగా అనుభవిస్తున్న హోదాలను భంగపరచేవి. బహుకాలంగా వీరు పన్ను మినహాయింపులను అనుభవిస్తుండగా, వారిని కూడా పన్నులు చెల్లించేందుకు నిర్బంధించేవి. సాధారణ ప్రజానీకాన్ని తమతో సమానంగా ఉద్ధరించడానికి, తద్వారా తమ ఆధిక్యతకు, ఆధిపత్యాలకు పాడే చరమ గీతాలు. కనుక, వారు నిర్ద్వంద్వంగా ఈ సంస్కరణలను వ్యతిరేకించారు. రాజశాసనాలను గుర్తించి, అమలు జరిపే అధికారంగల అనేక స్థానిక సభలు వీటిని గుర్తించడానికి నిరాకరించాయి. ఈ సభల్లో ప్రభువర్గానికి, మతాధిపతులకు చెందిన ప్రతినిధులు అధిక సంఖ్యాకులు కావడాన, అవి ఈ సంస్కరణాత్మక ప్రతిపాదనలను నిరాకరించాయి. ప్రభువర్గము, మతాధిపతి వర్గము మేరీ ఆంటోనెటీ ద్వారా రాజుపై ఒత్తిడి తెచ్చి, రెండు సంవత్సరాలలో టర్గోని పదవి నుండి తొలగించడానికి కారకులైనారు. పదునారో లూయీ, "నేను, టర్గో, ఇద్దరమే ప్రజల హితవు కోరే వారము" అంటూ అతన్ని పదవి నుండి తొలగించాడు. తద్వారా తాను పదవీచ్యుతుడు కావడానికి దారివేసుకున్నాడు.

టర్గోను పదవినుండి తొలగించినా, అతని ప్రతిపాదనలు స్వాధికార వర్గాలు, నియంతృత్వ రాచరికము వ్యతిరేకించినా, అతని ఆలోచనల్లో అధిక భాగం ఫ్రెంచి విప్లవకాలంలో ఏర్పడిన పరిమిత రాచరికం రాజ్యాంగం (1791 - 92), జాతీయ సమితి (National Convention) వారి రాజ్యాంగ చట్టాల్లో పొందుపరచి, అమలు జరపడానికి ప్రయత్నించడం ముందు ముందు గమనించగలరు.

**3.2.1.3 క్లూనీ (1776 - 77) :**

టర్గో తరువాత 1776లో ఆర్థికశాఖకు కంట్రోలర్ జనరల్‌గా నియామకం పొందిన క్లూనీ (Clugny) యుక్తిపరుడు. దేశం గూర్చి యోచించి, సంస్కరణలను ప్రతిపాదించి పదవికి ముప్పు తెచ్చుకోవడం తెలివితక్కువగాను, అధికారం, ఆధిపత్యం కలిగిన వర్గాలకు సన్నిహితంగా మెలగడంతో తన హితం ఇమిడి ఉందని గ్రహించినవాడు. కనుక టర్గో చేసిన ప్రతిపాదనలన్నింటిని రద్దుచేసి, ప్రభువర్గానికి మేరీ ఆంటోనటీకి చేరువ అయినాడు. అయితే బలవత్తరమైన ఆర్థిక సంక్షోభాన్ని నివారించడానికి లేదా కనీసం తాత్కాలికంగా ఉపశమింపచేయడానికి అదనపు నిధుల అవశ్యకత మాత్రం తప్పనిసరి అయినదని అతడు గుర్తించాడు. అందుకై అతడు ప్రభుత్వపరంగా లాటరీలను నిర్వహించి, నిధులు సమకూర్చుకోడానికి సమాయత్తమైనాడు. కాని 1777లో అతని మరణం వలన ఆ విధంగా సంక్షోభాన్ని పరిష్కరించడం సాధ్యంకాకపోగా, వెనుకటి సమస్యలన్నీ మరింత బలవత్తరమై అత్యవసర పరిస్థితిని సృష్టించాయి.

**3.2.1.4 నెకర్ (1777 - 81) :**

క్లూనీ తరువాత 1777లో ఆర్థికశాఖ మంత్రిగా (Controller General) నియమితుడైన నెకర్ జెనీవాకు (ఇటలీ దేశంలో ఒక గొప్ప వర్తక కేంద్రం) చెందిన సంపన్న వాణిజ్య కుటుంబానికి చెందినవాడు. కనుక ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడం, అంతకంటే ముందు ఖర్చును అదుపు చేసుకోవడం వంటి ఆర్థిక కార్యకలాపాల్లో ప్రజ్ఞాపాటవాలు కలవాడు. సంపన్న కుటుంబానికి చెందినవాడు కావడాన, అవినీతికి పాల్పడి, స్వలాభానికి పాటుపడే అవసరం లేనివాడు. అయితే నెకర్ బాధ్యతాయుతమైన పదవిని నిర్వహించడానికి కావలసిన ధైర్యం, నిర్ణయం తీసుకున్నాక దానికి కట్టుబడిఉండే స్థిరచిత్తం లోపించినవాడు. అతడు అనేక నిర్మాణాత్మకమైన ప్రణాళికలు వేశాడు, కాని రాజకీయ రాజ్యాదాయ (Political Economy) విషయాల్లో మౌలికమైన మార్పులను తీసుకొని రావడం అసాధ్యమేనని, అటువంటి మార్పులు లేకుండా సంక్షోభాన్ని నివారించడం కూడ అసాధ్యమని గుర్తించాడు. ఆనాటి ఆర్థిక సంక్షోభాన్ని గూర్చి ఆలోచించక, ఫ్రెంచి రాచరికం కేవలం గ్రేట్‌బ్రిటన్‌తో తమకున్న వలస రాజ్యవిస్తరణలోని పోటీ వలన, ఆ దేశాన్ని ఎదిరించి స్వాతంత్ర్యం పోరాటం చేస్తున్న అమెరికా వలసలకు సైనిక సాయంచేసి, యుద్ధంలో పాల్గొంది. ఇది ప్రభుత్వం యొక్క బాధ్యతారాహిత్యానికి చక్కని ఉదాహరణ.

అమెరికా వలసల స్వాతంత్ర్య పోరాటానికి సైనిక సాయం చేయడంలో పదునారో లూయీకి ఏ మాత్రం భావ సారూప్యత, సానుభూతి కాక కేవలం గ్రేట్‌బ్రిటన్ పట్ల వ్యతిరేకత మాత్రమే ప్రధానాంశం. సాధారణ ప్రజానీకం స్వాతంత్ర్య పోరాటం చేయడం నిరపేక్షరాచరికానికి ఏమాత్రం రుచించనిది. కాని పోరాటం సందర్భంగా జరిగిన నౌకా యుద్ధాలు, చాలా ధనవ్యయాన్ని, సైనిక నష్టాన్ని కలిగించి, దేశ ఆర్థికస్థితిని మరింతగా కుంగదీశాయి. ఆ పోరాటంలో ఫ్రెంచి నౌకాబలం చాలా ప్రముఖ పాత్ర నిర్వహించి, వలసల్లోని బ్రిటిష్ సేనాధిపతి అయిన కారన్ వాలిస్‌కు సకాలములో మాతృదేశం నుండి సైనిక సాయం అందని దుష్కర పరిస్థితి కల్పించింది. బ్రిటిష్ పరాజయానికి కీలకపాత్ర నిర్వహించింది. ఆ సమయంలో నెకర్ కొంతవరకుక్రొత్త అప్పులను పుట్టించి, అప్పటి ఆర్థికావసరాలను తీర్చాడు. అయితే, యుద్ధానంతరం 1781లో నెకర్ మొదటి నుండి ఫ్రాన్సుకు సంబంధించిన ఆర్థిక సమస్యలను, అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు ఆ సమస్య మరింత తీవ్రతరం అయిన వైనమూ, వివరిస్తూ ప్రభుత్వ ఆదాయ వ్యయపట్టిక (Compte Rendu Roidean Etat des Finance) ను తయారుచేసి ప్రకటించాడు. దీనివలన ఋణదాతలు ఫ్రెంచి ఆర్థిక పరిస్థితి పట్ల కొంతవరకైన నమ్మకం కలిగి, మరికొన్ని క్రొత్త ఋణాలను అందిస్తారని నెకర్ ఆశించారు. అయితే అందులో ప్రభువర్గం పొందుతున్న రాయితీలను గూర్చి వాస్తవాలు ప్రకటించినందుకు అతడు వారి ఆగ్రహానికి గురికాక తప్పలేదు.

## 3.2.1.5 కలోన్ (1783 - 87) :

1783లో నెకర్ పదవీ భ్రష్టుడైన తదుపరి ఇద్దరు ముగ్గురు అప్రసిద్ధులు, ఆర్థికశాఖను నిర్వహించారు. వారివలన ఉన్న సమస్యలు పరిష్కారం కాలేదు. క్రొత్తగా ఏవీ తలెత్తలేదు. అయితే కాలం గడచిన కొద్ది పాత సమస్య, ఆర్థికసంక్షోభం మరింతగా జటిలం కాసాగింది. 1785 నుండి 1787 వరకు ఆర్థిక శాఖను నిర్వహించిన కలోన్ (Calone) మరిన్ని ఋణాలు చేయడం ద్వారా రాజ్యాదాయ వ్యయాల నడుమ విభేదాన్ని సవరించ ప్రయత్నించాడు. ఇందుకై విరివిగా క్రొత్త ఋణాలను పుట్టించేందుకు, నెకర్ కంటె భిన్నమైన రీతిలో, దుబార ఖర్చును మరింతగా, అపరిమితంగా చేయడం ముఖ్యమని భావించాడు. దీనివలన ఋణదాతలు ప్రభుత్వం అప్పుల ఊబిలో క్రుంగుతున్నట్లు గుర్తించారు. పైగా ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉండటమే అటువంటి ఆడంబరమైన ఖర్చులు చేయడం సాధ్యపడుతున్నదని, కనుక ప్రభుత్వానికి మరింతగా ఋణసాయం చేయవచ్చునని భ్రమిస్తారు. ఈ అదనపు దుబారాతో 1786 నాటికి కలోన్ ఫ్రెంచి ధనాగారాన్ని సంపూర్ణంగా ఖాళీచేసి ఇకపై ఋణాలను పుట్టించడం అసాధ్యమనే స్థితికి దేశాన్ని, ప్రభుత్వాన్ని చేర్చాడు. నూతనంగా పన్నులు విధించకుండా, సవ్యమైన పద్ధతిలో రాజ్యాదాయాన్ని పెంపొందించకుండ ప్రభుత్వ ఆర్థిక స్థితిని చక్కదిద్దటం అసాధ్యమని కలోన్ స్పష్టం చేశాడు.

పదునారో లూయీ, గత్యంతరంలేని పరిస్థితిలో, కలోన్ సలహా మేరకు, ఆర్థిక సంస్కరణలు తీసుకొని రావడానికై ప్రభు వర్గంనుండి, మతాధిపతి వర్గంనుండి ప్రముఖులతో ఒక సమావేశాన్ని (Council of Notables) ఏర్పాటు చేశాడు. వారిముందు కలోన్ తన ఆర్థిక ప్రణాళికను వివరించి, స్వాధికారవర్గాల (Privileged Estatesd) తో సహా భూకామందులు అందరు తమ స్వంత భూములపై తప్పక చెల్లించవలసిన భూమి పన్నును విధించడం తప్పనిసరిగా స్పష్టంచేశాడు. యథాప్రకారంగా వారు అందుకు తీవ్ర అభ్యంతరం తెలిపి, ప్రభుత్వాదాయం ఎలా దుర్వినియోగం అవుతుందో ఆర్థికమంత్రి స్పష్టం చేయాలని, ప్రజాసంక్షేమాన్ని గూర్చి ఆలోచించడానికి అది ప్రాతిపదిక అని - ప్రజాసంక్షేమం పట్ల ఆందోళన చెందుతున్నట్లుగా వాదిస్తూ, సంస్కరణలను అడ్డుకున్నారు. అంతేకాక, కలోన్ అసమర్థతను పదునారో లూయీకి ప్రముఖంగా వివరించి, అతన్ని పదవి నుండి తొలగించేలా చేశారు.

## 3.2.1.6 బ్రియెన్నీ (1787 - 88) :

కలోన్ తరువాత ఆర్థిక మంత్రిగా టౌలూజ్ (Toulouse) నగరానికి ఆర్చిబిషప్ అయిన కార్డినల్ లోమినీ డి బ్రియెన్నీ నియమితుడైనాడు. అప్పటికి ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి, ఆందోళన తీవ్రతరం అయినాయి. అనేక విధాలైన ఊగిసలాట తరువాత బ్రియెన్నీ లోగడ టర్గో సూచించిన సంస్కరణలన్నీ అనివార్యమని ప్రకటించి, ముందుగా కొర్వీని రద్దుచేయడం, సమస్త భూకామందులు తప్పనిసరిగా చెల్లించవలసిన భూమి పన్నును విధించడం కొరకు పదునారో లూయీ చట్టాలు చేయవలసిందిగా వక్కాణించాడు. అయితే ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన చట్టాలు స్వాధికార వర్గాలకు చెందిన సభలు - డయట్, ఎస్టేట్స్ జనరల్, పార్లమెంట్ - వంటి సభల ఆమోదాన్ని పొందవలసి ఉంటుంది. మధ్య యుగాల్లో రాజరికానికి నిరపేక్షమైన అధికారం లేక రాజుప్రభువర్గంలోని ప్రథముడుగా మాత్రమే ఉన్న నాటి సాంప్రదాయం అది. అయితే ఫ్రాన్సులో పదమూడో లూయీ (1610 - 43) క్రమంగా జాతీయ రాజ్యనిరపేక్ష పరిపాలకునిగా రూపొందే తరుణంలో తన అధికారానికి అవరోధంగా భావించి, 1614 నుండి స్టేట్స్ జనరల్ (Estates General) ను సమావేశపరచడం మానివేశాడు. తరువాత, దానిస్థానంలో అనేక ప్రధాన నగరాల్లో పార్లమా (Parliament) అనే ప్రభువర్గం, మతాధిపతి వర్గాలకు చెందిన ప్రముఖులతో స్థానిక సంస్థలు ఏర్పడ్డాయి. రాజశాసనాలను గుర్తించి, అమలు పరిచే అధికారం ఈ సంస్థలకు సంక్రమించింది (Litt de justice). ఈ సంస్థల్లో పర్సీ నగరానికి చెందిన పార్లమా ఈ ఆర్థిక సంస్కరణలను గుర్తించడానికి నిరాకరించింది. ఆ సంస్థకు ప్రజల మద్దతు కూడ లభించింది. పదునారో లూయీ పరిపాలనా కాలమంతా ఈ విధంగా స్థానిక పార్లమాలు, అతని సంస్కరణాత్మకమైన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అన్ని వర్గాలనుండి తిరిగి ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరచి, సమగ్రమైన

చర్చల ద్వారా సంస్కరణలను రూపొందించి, ఖచ్చితంగా అమలు జరపవలసిందిగా విజ్ఞాపనలు రావడం మొదలైంది. గత్యంతరం లేక పదునారో లూయీ ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరచవలసిందిగా తన మంత్రులను కోరాడు.

కాని అప్పటికి ఎస్టేట్స్ జనరల్ తుదిసారిగా సమావేశమై 175 సంవత్సరాలైంది. అప్పటి ఆ సభలోని సభ్యుల సంతతి సుమారుగా ఏడు తరాలవారు గడచిపోయి ఉంటారు. కనుక యథాతథంగా ఆ సభను సమావేశం చేయడం అసాధ్యం, అందుకై తిరిగి ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరిఅయింది.

## 3.2.2 సాంఘిక పరిస్థితులు - కారణాలు :

ముందు పాఠాల్లో వివరించిన సాంఘిక పరిస్థితులు, వాటికి మూలమైన ఆర్థికవ్యవస్థ, భూస్వామ్య విధానం మొదలైన అంశాలగూర్చి చదవటం జరిగింది. కనుక పై ఖండికలోని ఆర్థిక సంక్షోభం, దానిని పరిష్కరించడంలో ఏర్పడుతున్న ఆటంకాలను, ఫ్రెంచి విప్లవ కాలంనాటి సామాజిక వ్యవస్థ లక్షణాలను, అందులోని దురన్యాయాలు సులువుగా గ్రహించవచ్చు.

మధ్యయుగంలోని అన్ని దేశాలవలె ఫ్రాన్సులోను సామాజిక వ్యవస్థ భూస్వామ్య విధానంపైనే ఆధారపడి ఉండేది. క్రమంగా పదునారో శతాబ్ది ప్రారంభం నుండి ఈ విధానం బలహీనపడి, విచ్ఛిన్నమవుతున్నా, దాని అవలక్షణాలు ఆ సంధి యుగం (Transity Period) లో కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యతరగతి క్రమంగా వృద్ధి చెందుతూ, నూతన భావాలు, సిద్ధాంతాలు, ఒక ప్రక్క వ్యాప్తి చెందుతుండగా మరొక ప్రక్క ఈ భూస్వామ్యవిధానం అవశేషాలు కొనసాగుతూ సాధారణ ప్రజానీకాన్ని దురన్యాయాలకు గురిచేస్తూ ఉన్నాయి. ఈ విధమైన వైరుధ్యభావాల సంఘర్షణలో, సాధారణ ప్రజానీకం మరింత కాలం సహనం వహించలేకపోయారు. మధ్యతరగతి వారి వైజ్ఞానిక నాయకత్వంలో ప్రజాబలం సుసంఘటితమై ఈ తిరుగుబాటును చేసింది.

సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, వాటిలోని వివక్షతలు ప్రధానంగా పంటభూముల పంపిణీ ఆధారంగా ఏర్పడ్డాయి. మధ్యయుగంలోను, ఆధునిక యుగం తొలిదశలో సైతం, ఈ పంపిణీ అస్తవ్యస్తమై స్వంత భూములు కలిగిన కర్షకులు బహుళంగా సేద్యబానిసలుగా మారడం, వారి భూములు ప్రభువులపాలై, వాటిపై స్వామ్యం (Ownership) వారికి సంక్రమించడం జరిగింది. దీనికితోడుగా మతవ్యవస్థ సైతం విస్తారంగా పంట భూములపై స్వామ్యం సంపాదించింది. ఈ పరిణామాల్లో సమాజం స్వాధికారవర్గం (Privileged Section), అస్వాధికార వర్గం (un privileged section) అనే రెండు ప్రధానవర్గాలుగా విభక్తం అయింది. స్వాధికారవర్గంలోని ప్రభువర్గం ప్రథమ వర్గం (First Estates) అని, మతాధిపతివర్గం ద్వితీయ వర్గం (Second Estates) అని వ్యవహరింపబడేవారు. తక్కిన ప్రజానీకమంతా అస్వాధికారయుతమైన తృతీయ వర్గంగా ఏర్పడ్డారు. ఫ్రెంచి విప్లవకాలం నాడు ఫ్రాన్సు దేశజనాభా సుమారు 24 మిలియన్లు. అనగా రెండు కోట్ల నలుబది లక్షలు కాగా వారిలో సుమారు ఒక లక్ష ఏబదివేల ప్రభువర్గము, ఒక లక్ష ముప్పదివేల మతాధిపతి వర్గం ఉండేవి. అనగా, ఈ రెండు వర్గాలు కలిసి దేశజనాభాలో కేవలం ఒక శాతం. వీరు దేశంలోని పంట భూముల్లో సుమారు 60 శాతం ఆక్రమించుకొని ఉండగా, తక్కిన 99 శాతం జనాభా మిగిలిన 40 శాతం స్వంతహక్కులతో చిన్నచిన్న భూకమతాలను కలిగి ఉన్నారు. ఈ 99 శాతం జనాభాలో సుమారు 70 శాతం ఎటువంటి భూమి లేక కేవలం చాకిరీతో జీవితాలను వెళ్ళదీసేవారే.

### 3.2.2.1 స్వాధికారవర్గము (Privileged Class) :

పైన వివరించినట్లు ప్రథమవర్గమైన ప్రభువులు, ద్వితీయవర్గమైన మతాధిపతులు అత్యధికమైన పరిమాణంలో పంట పొలాలను కలిగి, వాటిపై ఫలసాయంతో సౌఖ్యవంతము, విలాసవంతము అయిన జీవితాన్ని గడుపుతూ, తమ స్వామ్యం (Ownership) లోని పంటపొలాలకుగాను ప్రభుత్వానికి ఏవిధమైన పన్నులు చెల్లించవలసిన బాధ్యత లేకుండా కాలం గడిపేవారు. వారికి ఆ హక్కులు, హోదాలు, భోగభాగ్యాలు తరతరాలుగ వచ్చేవి. కనుక, అవి ఏ విధంగా వారికి ప్రాప్తించాయో వారికి

తెలియదు. మధ్యయుగాల్లోని మత ఛాందసభావాలు, కరుడుగట్టిన సాంప్రదాయాలు అవి వారికి దైవదత్తమైనవిగా, ఏ శక్తి వాటిని తొలగించలేనివిగా అభిప్రాయాలను ఏర్పరచాయి. వారికి విలాసవంతమైన భవనాలు, చుట్టూ కోటగోడలు, కాపలాకాచే సైనికులు, ఇంట్లో అనేక విధాలైన సేవకులు ఉండేవారు. గ్రామంలో సాధారణ ప్రజానీకం నివసించే పూరిండ్ల నడుమ వారి కోటలు, ప్రాసాదాలు విస్తరించి ఉండేవి. చర్చిలలోను, నాటకాలు ప్రదర్శించే థియేటర్లలోను మొదటి వరుసలో ఉత్తమమైన ఆసనాలు వారికి కేటాయించబడి ఉండేవి. రాజ్యవ్యవస్థలోని ఉన్నతోద్యోగాలు కేవలం స్వాధికారవర్గానికే పరిమితమై ఉండేవి.

తమ స్వామ్యంలోని భూములపై ఏ విధమైన పన్నులు చెల్లించనవసరం లేని మినహాయింపులు పొందడమే గాక, తమ సంస్థానాల్లోని (Estates) కర్షకులు, వివిధ వృత్తిపని వారి నుండి పన్నులు వసూలు చేసుకునే అధికారము, హక్కు వారికి ఉన్నాయి. అంతేకాక, సంస్థానాల్లో - గ్రామాల్లోను, గ్రామాంతరాల్లోను రోడ్లను నిర్మించడానికి, నిర్వహించడానికి, అవసరమైన మరమ్మత్తులు చేయడానికి కర్షకులను, సేద్యబానిసలను ఏ విధమైన ప్రతిఫలం చెల్లించకుండా ఉపయోగించుకోడానికి, ఆ రహదార్లను ఉపయోగించుకొన్నందుకు కోర్వి (Corvee) అనే పన్ను వసూలు చేసేందుకు ప్రభువర్గానికి అధికారం ఉంది. కాలువలు, నదులు దాటడానికి పడవలు (Ferries) వంతెనలు ఉపయోగించుకునేందుకు సుంకాలు (tolls) వసూలు చేసుకునే అధికారం కూడా ప్రభువర్గానికే ఉంది. అడవుల్లో వేటాడటానికి, సరస్సుల్లో చేపలు పట్టుకోడానికి కేవలం స్వాధికారవర్గానికే, ప్రధానంగా ప్రభువర్గానికే సంపూర్ణ హక్కులు పరిమితమై ఉన్నాయి. సేద్యబానిసలు చేపలు పట్టి వారికి అప్పగించవలసి ఉండేది. ఇవికాక, ప్రభువుల పిండిమరను, ద్రాక్షపండ్ల నుండి రసం తీసే యంత్రాన్ని, రొట్టెలు కాల్చుకొనే పొయ్యి (oven) నెలకొల్పి, విధిగా ప్రజలందరు ఉపయోగించుకొని, కొంత పిండిని, కొంత ద్రాక్షరసాన్ని, కొన్ని రొట్టెలను సమర్పించవలసిన కట్టడి ఉండేది. స్వామ్యాధికారం కలిగిన కర్షకులు తమ ఆస్తిపాస్తులను, పంటపొలాలను వేరెవరికైనా విక్రయించినప్పుడు క్రయధనంలో తప్పనిసరిగా కొంతభాగాన్ని ప్రభువుకు చెల్లించాలి. సేద్యబానిసలకు స్వేచ్ఛనియ్యడానికి సైతం పెద్ద మొత్తాలను ప్రభువర్గం వసూలు చేసేది. ఈ విధంగా వారు రాజుకు ఏవిధమైనా పన్ను చెల్లించకున్నా, పేద ప్రజానీకం నుండి వివిధమైన పన్నులను వసూలు చేసేవారు. ఐశ్వర్యవంతులు పన్ను మినహాయింపులను అనుభవించడం పేదప్రజానీకం అష్టకష్టాలుపడుతూ వారికి అనేక విధాలయిన పన్నులను, కట్టడులను చెల్లించడం దురన్యాయపూరితమైన అసమానత.

తమ సంస్థానాల్లో శాంతిభద్రతల సంరక్షణ ప్రభువు బాధ్యత. తనవద్ద ఉన్న సైనికబలంతో సంస్థానంలోని ప్రజాబాహుళ్యాన్ని సంరక్షిస్తూ, వారిలో వారికి వివాదాలు ఏర్పడినపుడు తన అధీనంలోని న్యాయస్థానంలో, మతాధిపతులైన న్యాయవాదుల సాయంతో విచారించి శిక్షిస్తూ, ఈ ధర్మాన్ని వారు నిర్వహించేవారు. అయితే ప్రభువర్గాన్ని కట్టి ఉంచగల న్యాయచట్టాలేవీ లేవు. అతడు తన పరివారంతో గుర్రాలపై స్వారీచేస్తూ, కర్షకులకు చెందిన పంట భూముల్లో పంటను త్రొక్కివేయవచ్చు. వారి పశువుల్లో ఉత్తమమైనవి తన దృష్టిలో పడినప్పుడు తన పశువులశాలకు తరలించుకొని పోవచ్చు. వీటికి ఏ విధమైన పరిహారం అతడు చెల్లించవలసిన పనిలేదు. ప్రభువుల్లో ఒకరికొకరికి వివాదం ప్రాప్తిస్తే వారు ఏ న్యాయస్థానంలోను ఫిర్యాదుచేసి న్యాయాన్ని పొందేవారు కారు. ద్వంద్వయుద్ధం చేసి, ఆ యుద్ధంలో ఇద్దరిలో ఒకరు చావడమే వివాదానికి పరిష్కారం.

పూర్వం ప్రభువులు బహుళంగా తమ సంస్థానాల్లోనే నివశిస్తూ, తమ ప్రభుత్వపరిధిలో ప్రజలకు శాంతిభద్రతలను కలుగజేస్తూ, న్యాయపరిపాలన నిర్వహిస్తూ ఉండేవారు. ఆ సమయంలో వారు ఈ విధమైన ప్రత్యేక హోదాలను, అధికారాలను చలాయించడం ఏమంత అసహజంగా కన్పించేది కాదు. కాని పదునారవ శతాబ్దం నుండి, వారిలో పలువురు పట్టణాలకు, నగరాలకు తరలివెళ్ళడం, క్రమంగా నిరపేక్ష రాచరికం బలపడడం, రాజులు తమ సైనికావసరాలకై ప్రభువర్గంపై ఆధారపడకపోవడం ఏర్పడసాగింది. ఈ మారుతున్న ఏ పరిస్థితిలో వారి ప్రత్యేక హోదాలు, ఆధిపత్యాలు అర్థరహితంగా, దోపిడిగా స్పష్టపడ్డాయి.

అదే విధంగా మతాధిపతులు సైతం తమకు చెందిన సువిశాలమైన పంటభూముల నుండి ఫలసాయం పొంది యథేచ్ఛగా సుఖభోగాలను అనుభవించేవారు. ధార్మిక, నైతిక సంబంధమైన విజ్ఞానంపట్ల, ప్రవర్తనపట్ల వారికేమాత్రం ఆసక్తిలేదు. ప్రభువర్గంతో

కలిసి, విలాసవంతమైన జీవితాలు గడుపుతూ, వారి పరిపాలనలోని దుర్నీతికి ధార్మికమైన, ఉన్నతమైన సార్థకతను ఆపాదించి సమర్థించేవారు.

స్వాధికారవర్గానికి చెందిన పంటభూములను సేద్యబానిసలు (Serfs), కర్షకులు (Peasant - Proprietors) సాగుచేసి ఫలసాయాన్ని వారికి అందించాలి. అందుకై వారికి ప్రత్యేకమైన ప్రతిఫలమేదీ లేదు. సేద్యబానిసలు కూడుగుడ్డల వరకు ప్రభువు నుండి ప్రతిఫలంగా పొందేవారు. కర్షకులు తమ సొంతభూములను, స్వాధికారవర్గానికి చెందిన భూములలో పనిచేసిన తరువాత, సాగు చేసుకునేందుకు అనుమతి మాత్రం పొందేవారు. అందుకై అనేక విధాలైన పన్నులను, సుంకాలను ప్రభువులకు, మతాధిపతులకు చెల్లించేవారు.

### 3.2.2.2 అస్వాధికారవర్గం (Unprivileged Class) :

పైన పేర్కొన్న ప్రభువర్గానికి, మతాధిపతి వర్గానికి సంపూర్ణమైన వ్యత్యాసంతో జీవించే సాధారణమైన ప్రజానీకం అస్వాధికారవర్గం. పైన పేర్కొన్న సేద్యబానిసలు, చిన్న చిన్న కమతాలు కలిగిన భూకామందులు వివిధ వృత్తులకు చెందిన వాళ్ళు ఈ వర్గంలో అత్యధిక శాతం. వీరంతా పేదరికంతో మ్రగ్గుతూ, స్వాధికార వర్గాలకు ఊడిగం చేస్తూ, కాలం వెళ్ళదీసేవారు. వీరిలోనే మధ్యతరగతి కూడ కలిసి ఉండేది.

ఐశ్వర్యంలోను, విజ్ఞానంలోను తమకు ఏ విధంగాను సాటిరాని ప్రభువర్గం, మతాధిపతివర్గం అనేకమైన హక్కులు, హోదాలు, అధికారాలు కలిగి ఉండగా మధ్యతరగతికి అటువంటి అవకాశాలు లేకపోయాయి. అందుకు కారణం ఆ వర్గాలకు అవి చిరకాలంగా, సాంప్రదాయసిద్ధంగా సంక్రమించడం. అనాదిగా సమాజంలోని వర్గాలు రెండు మాత్రమేకాగా, వర్తక వాణిజ్యాలను, ఉత్పాదక వృత్తులను అవలంబించి, అచిరకాలంలో ఐశ్వర్యవంతమైన ఈ వర్గం మధ్యలో వచ్చి చేరింది. కనుక మధ్యతరగతి. మధ్యలో వచ్చి చేరింది కనుక అటువంటి సాంప్రదాయక హోదాలు, హక్కులు వీరికి లేకపోయాయి. ఈ కారణంగా మధ్యతరగతి స్వాధికారవర్గంపై అసూయ ద్వేషాలు పెంచుకొని సర్వజన సమానత్వాన్ని గూర్చి వాదిస్తూ, సాధారణ ప్రజానీకాన్ని వారిపై ఉసికొల్పేది.

సాధారణ ప్రజానీకంలో మధ్యతరగతి, వర్తక వాణిజ్యాలు, ఉత్పాదక పరిశ్రమలు వృత్తులుగా కలిగి పట్టణాల్లోను, నగరాల్లోను నివసించేది. అందుచేత, సేద్యబానిసలు, కర్షకులవలె స్వాధికారవర్గానికి వెట్టిచాకిరి చేయవలసిన అవసరం వారికి లేదు. అయినా, ప్రభువర్గం రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాబల్యం వహించి, అనేక అన్యాయమైన పన్నులు, సుంకాలు వసూలుచేస్తూ ఉండడం వారికి సహించరానిదిగా ఉంది. అందువలన వారు బహుకాలంగా ప్రభువర్గమూ, మతాధిపతి వర్గమూ శిథిలమైపోవడాన్ని వాంఛిస్తూ, అందుకు అనుగుణమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకొనేవారు. 1789 నాటి ఫ్రాన్సు దేశ ఆర్థికదుస్థితిని పరిష్కరించడానికి స్వాధికారవర్గం అడుగడుగునా అడ్డుతగులడంతో, సాధారణ ప్రజానీకం వారిపట్ల తీవ్రమైన ఆగ్రహం చెందింది. మధ్యతరగతికి దీనితో మంచి అవకాశం లభించినట్లయింది. వారి భావాలను, సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్న సాధారణ ప్రజానీకం స్వాధికారవర్గాలపైన, వారిని సమర్థించి కాపాడుతున్న రాజ్యవ్యవస్థపైన తిరుగుబాటు చేసి ఈ దురన్యాయాలను ప్రతిఘటించారు.

పై వివరణల వలన సాధారణ ప్రజానీకం యొక్క స్థితి బోధపడే ఉంటుంది. స్వాధికార వర్గాలకు చాకిరి చేసి, వారి భూములను పండించి ఫలసాయం ధారపోసి రావడమే వారి జీవనధర్మం. చాకిరి నుండి తప్పించుకొని పోవడం వారికి అసాధ్యమైంది. కనుక నిశ్శబ్దంగా సహనంతో తమ కష్టాన్ని వారికి ధారపోసేవారు. పైగా ప్రభుత్వ వర్గానికి, మతాధిపతులకు, రాజ్యవ్యవస్థకు విడివిడిగా అనేకవిధాలైన పన్నులు, సుంకాలు చెల్లించడం వీరివంతు. వీరి కష్టఫలితాన్ని పొంది అనుభవిస్తున్న ప్రభువర్గం సాధారణంగా రాజుల సన్నిధిలో కాలంగడుపుతూ తమ భూములను, ఆస్తిపాస్తులను "బైలిఫ్" (Bailiff) అనే తమ ఏజంట్ల ద్వారా ఫలసాయాన్ని వసూలు చేసుకునేవారు. అందుచేత కర్షకులు, సేద్యబానిసల సాధారణ జీవితం, అందులోని కష్టసుఖాలు స్వాధికార

వర్గానికి ఎన్నడూ స్పష్టంగా తెలియవు. కనుక వారెన్నడూ సాధారణ ప్రజానీకం యొక్క కోరికలతోను, ఆదర్శాలతోను సానుభూతి చూపలేకపోయారు.

## 3.3. రాజకీయ కారణాలు :

1789 ఫ్రెంచి విప్లవానికి మూలకారణం ఆర్థిక సంక్షోభమే అయినా అది క్రమంగా నిరపేక్షరాచరిక వ్యవస్థ లోని లోపాలుగా రూపొంది, ఆ వ్యవస్థను ప్రక్షాళన చేయడం అత్యవసరమైనదిగా సాగింది. అందుకు కారణం ఆర్థిక వ్యవస్థలోను, దాని కారణంగా సాంఘిక వ్యవస్థలోను ఏర్పడిన అసమానతలను, దురన్యాయాలను భద్రంగా కాపాడడమే తన కర్తవ్యమన్నట్లు రాజ్యవ్యవస్థ ప్రవర్తించడం. రాజ్యానికి ఏర్పడిన సంక్షోభాన్ని నివారించవలసిన విధి ప్రజానీకానిదిగా పరిణమించడంతో, వారు తమ సాధారణ జీవన విధానాన్ని సంస్కరించుకోకుండా రాజ్యవ్యవస్థను ఉద్ధరించలేరు. అందుకు రాజ్యవ్యవస్థే ప్రతిబంధకం కావడంతో వారి ఆగ్రహం దానిపైనే మరలింది.

### 3.3.1 నిరపేక్ష రాచరికం :

స్వరూప, స్వభావాలను బట్టి ఆనాటి ఫ్రెంచి రాజకీయవ్యవస్థ నిరపేక్ష రాచరికాన్ని (Absolute Monarchy) అదుపుచేయగలిగినంత ప్రబలంగా ప్రభువర్గంలేదు. సర్వాధికారాలు - శాసననిర్మాణము (Legislative), పరిపాలనాధికారం (Executive) - న్యాయపరిపాలన (Judiciary) రాజు చేతిలో కేంద్రీకృతమై ఉన్నాయి. పదునాలుగో లూయీ వంటి స్థిరచిత్తుడు, పట్టుదల కలిగినవాడు, ఆ సమయంలో రాజైతే అనుకూలవర్గాలను కూడగట్టుకొని ప్రతికూలవర్గాలను అదుపుచేయగలిగేవాడే, సంక్షోభాన్ని తొలగించగలిగేవాడే. కాని ఆనాటి ఫ్రెంచిరాజు పదునారో లూయీ అందుకు తగినవాడు కాదు. అతనిలో అనేక సుగుణాలు ఉన్నప్పటికి, వాస్తవంగా ప్రజాహితం కోరే మనస్తత్వం కలవాడే అయినా, సకాలంలో సరైన నిర్ణయం తీసుకొని, స్థిరసంకల్పంతో దానిని అమలుపరచగలిగే దక్షత కొరవడినవాడు. అందుకు వ్యక్తిగతంగానే కాక, కొంత వ్యవస్థాగతం గానూ, అతని భార్య అయిన మేరీ ఆంటోనెటీ ప్రభావము కూడ కారణాలైనాయి.

### 3.3.2 పదునారో లూయీ వ్యక్తిత్వం :

వ్యక్తిగతంగానూ మంచితనమూ, నిజాయితీ, ప్రజాహితాన్ని కోరే మనస్తత్వము కలిగినవాడైనా, పదునారో లూయీ సోమరితనమూ, సమయాన్ని సరదాగా గడిపేతత్త్వమూ, తీవ్రమైన విషయాలను కూడ తేలికగా అంచనావేసే గుణము కలిగినవాడు. ఆనాటి ఫ్రాన్సు దేశాన్ని పీడిస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని సరిగా అంచనా వేయడం ఆ కాలంలో ఎవరికి - ప్రభువర్గానికి, పరిపాలనలోని ప్రముఖులకు కూడ చేతకాలేదు. కనుక పదునారో లూయీని ఆ విషయంలో పెద్దగా తప్పుపట్టనవసరంలేదు. కాని, పరిస్థితి తీవ్రతను గుర్తించిన టర్గో, కలోన్, నెకర్ వంటి వారిని విశ్వసించి, అనుసరించలేకపోవడంతో అతని లోపం వ్యక్తం అవుతున్నది. సాంప్రదాయకవ్యవస్థను గ్రుడ్డిగా అనుసరించడంలో నాటి పరిస్థితిలోని క్లిష్టత చాలామందికి అర్థం కాకపోయింది. అది రాచరిక వ్యవస్థ పునాదులను కదిలించగలదని ఎవరూ ఊహించలేదు. అందుకు కారణం అంతకు పూర్వం అటువంటి పరిస్థితి ఎన్నడూ ఉత్పన్నం కాలేదు గనుక.

అయితే పరిస్థితిలోని తీవ్రతను గుర్తించి, రాజుతో సమగ్రంగా చర్చించి, తగు నిర్ణయం తీసుకొనే ఉద్దేశ్యంతో మంత్రులు,ఉన్నతాధికారులు సమావేశం అయినప్పుడు అతడు చర్చల్లో ఏకాగ్రతతో పాల్గొనేవాడు కాదు. అనేకసార్లు తానే వారిని సమావేశాలకు పిలిచి, వారు తనవద్దకు వచ్చేలోగా సుదీర్ఘంగా గుర్రపుస్వారీ చేసి, వేటాడి, అలసి ఇంటికి చేరేవాడు. వారు సమావేశమై పరిస్థితిని గూర్చి చర్చిస్తుండగా, అతడు అలసటవలన నిద్రలోకి జారిపోయేవాడు. కొన్ని పరిస్థితుల్లో వీరు ప్రసంగిస్తుండగా గదిలో అటూ ఇటూ పచార్లుచేస్తూ, కిటికీల్లోంచి బయట తోటలో తిరుగాడే జింకలను, ఆకాశంలో ఎగిరే పక్షులను గురిచూచి

తుపాకి పేల్చి, అవి నేలకూలడంతో సంతోషపడేవాడు. అతనికి పరిస్థితిలోని తీవ్రత తెలియదు, తెలిసినంతవరకు పరిష్కారమార్గం కొరకు అన్వేషించే మానసిక ఏకాగ్రత లేదు. పైగా సాంప్రదాయకంగా ఆధిపత్యవర్గాలైన ప్రభువులు, మతాధిపతులను సమర్థిస్తూ, సాంప్రదాయకమైన పరిపాలనావ్యవస్థలోనే నాటి ఆర్థికసంక్షోభాన్ని నివారించవచ్చుననే అమాయకత్వం, అతని పరిస్థితిని సంపూర్ణంగా అర్థం చేసుకోనీయలేదు.

### 3.3.3. మేరీ ఆంటోనటీ :

పదునారో లూయీ వైఫల్యానికి, దానివలన జరిగిన విప్లవపరిణామాలు, తుదకు అతడు విప్లవానికి బలికావడానికి కొంతవరకు అతని భార్య అయిన మేరీ ఆంటోనటీ కారణమని చరిత్రకారులందరు అభిప్రాయపడతారు. అయితే, ఆమె స్వభావాన్ని, విప్లవకాలంలో నిర్వహించిన పాత్రపట్ల కొందరు చరిత్రకారులు సహేతుకంగానే కొంత సౌమ్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. చరిత్రకారులు బహుళంగా వ్యాఖ్యానించినట్లు ఆమె క్రౌర్యము, దుర్మార్గము మూర్తీభవించిన వ్యక్తి కాదు. ఆస్ట్రియా రాజకుటుంబంలో జన్మించి, ఫ్రెంచి రాణిగా వచ్చిన ఈమె సంపూర్ణంగా సాంప్రదాయక భావాలు, విధానాలు తప్ప మరేమి తెలియనిది, ఆ కారణాల వలన మితిమీరిన అతిశయము, అహంకారము, దర్పము కలిగింది. అవన్నీ రాజవంశీయులకు సహజమే. రాజప్రాసాదాలకు బయట ఉన్న ప్రపంచాన్ని గూర్చి, అందులోని సాధారణ పేద ప్రజానీకాల ఆశలు, ఆకాంక్షలు అర్థం చేసుకోగలిగిన లోకజ్ఞానం లేనిది. అలాగే స్త్రీ సహజంగా భర్తను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే బలీయమైన కోరికగలది. అందుకు తగినట్లు పదునారో లూయీ మెతక స్వభావం, భార్యపట్ల ప్రేమ అతన్ని ఆమె కోరినట్లు చేశాయి. ఆ కారణాన ఈమె దృష్టిలోపడి, మెప్పు పొందినవారికి అర్హతను మించిన ఉన్నత పదవులు లభించేవి. ఈమె ఆగ్రహానికి అత్యంత సమర్థులైనా, పదవీచ్యుతికి, బహిష్కరణలకు గురి కావలసివచ్చేది.

రాజ్యపరిపాలనలో ఈమె అనవసర జోక్యాన్ని ఖండిస్తూ, అందువలన తనకు, తనతోపాటు రాజుకు ముప్పు వాటిల్లగలదని హెచ్చరిస్తూ, ఈమె సోదరుడు ఆస్ట్రియా చక్రవర్తి అయిన రెండో జోసెఫ్ హితవు చెప్తూ లేఖలు వ్రాశాడు. కాని అవి ఈమెపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. విప్లవకాలంలో తృతీయవర్గం (సాధారణ ప్రజలకు ఎస్టేట్స్ జనరల్ సమావేశంలో ప్రాతినిధ్యం వహించిన సభ్యులు) ఒత్తిడి చేసినప్పుడు ప్రభువర్గం, మతాధిపతివర్గం ఈమెను ఆశ్రయించాయి. వారు ఈమెను పొగడ్తల్లో ముంచెత్తి, సాంప్రదాయక పరిపాలన వ్యవస్థ భంగం కలగకుండా ప్రభువర్గము, రాజ్యవ్యవస్థ పరువు ప్రతిష్ఠలు కోల్పోకుండా కాపాడగలిగింది ఈమె మాత్రమేనని, బలప్రయోగంతో తృతీయవర్గాన్ని అణచివేయగలిగిన చర్యలను చేపట్టవలసినదిగా రాజుకు బోధించవలసిందిగాను ప్రోత్సాహపరచారు. మేరీ ఆంటోనటీ తనకు సహజంగా ఉన్న రాచరికదర్పానికి, అహంకారానికి తోడుగా తృతీయ వర్గం చేస్తున్న అల్లరిని సహించలేకపోయింది. ప్రభువుల పొగడ్తలతో ఉప్పొంగి పోయింది, సైనికబలంతో వారిని అణచివేయవలసిందిగా లూయీని ఒత్తిడి చేసింది. దాని ఫలితంగా బాస్టిలీ కోట పతనం, పారిస్ నుండి స్త్రీల ఆకలియాత్ర అందులో రాజకుటుంబం నిస్సహాయస్థితికి క్రుంగిపోవడమూ జరిగాయి.

ఈ సంఘటనల్లో ఆంటోనటీ జోక్యం కలిగించుకొని, తృతీయ వర్గాన్ని రెచ్చగొట్టడంలో ఆమె క్రౌర్యం కంటే అమాయకత్వము, ప్రాపంచిక జ్ఞానం లేకపోవడమే కానవస్తాయి కాని అసహజమైన దుర్మార్గము కాదు. అంతకు ముందెన్నడూ సాధారణ ప్రజానీకం సుసంఘటితంగా నిల్చి, రాజ్యవ్యవస్థను లొంగదీసిన దృష్టాంతాలేవీ లేవు కనుక అటువంటి దురదృష్టకర సంఘటనలు జరగవచ్చని ఈమె ఊహించలేదు. అయితే ఫ్రెంచి విప్లవ పరిణామాలు క్రమంగా రాచరిక వ్యతిరేకంగా మలుపు తిరగడానికి, క్రమంగా రాచరిక వ్యవస్థనే తొలగించడానికి కారణమైన బలవత్తర పరిస్థితులకు మేరీ ఆంటోనటీ బాధ్యత ఉందని ఆమె - పదునారో లూయీపై తెచ్చిన ఒత్తిడి కారణమని, నిస్సంశయంగా చెప్పవచ్చు.

## 3.3.4. వ్యవస్థాగత లోపాలు : పరిపాలనా వ్యవస్థ

పైన వివరించినట్లు ఫ్రెంచి విప్లవ సమయంలో, ఆ దేశ రాజకీయ వ్యవస్థ స్వరూప స్వభావాల్లో నిరపేక్ష రాచరికం, నిరపేక్షరాచరిక వ్యవస్థ ప్రభువర్గం యొక్క ప్రాబల్యాన్ని అణచివేయడంతో అభివృద్ధి చెందింది. ప్రభువర్గంలో అధిక సంఖ్యాకులు భూస్వామ్యవిధానంలో తమకుగల హక్కులు హోదాలను వదిలివేసి పట్టణాలకు తరలివెళ్ళిన విషయంపైన వివరించడం జరిగింది. వారు తమ సంస్థానాల (Estates) పరిపాలనాధికారాలను సైతం త్యజించారు. అటువంటి పరిస్థితుల్లో ప్రబలమౌతున్న రాచరికం పరిపాలనకై ప్రత్యామ్నాయమైన ఏర్పాట్లను చేయవలసివచ్చింది. పదమూడో లూయీ కాలంలోనే అతని ప్రధానమంత్రి అయిన రిష్లూ ఫ్రాన్సు దేశమంతటిని జనరలిట (Generalites) అనే పేరున రాష్ట్రాలుగా విభజించి వాటిపై ఇంటెండెంట్స్ (Intendents) అనే అధికారులను నియమించాడు. నిరపేక్ష రాచరికం శక్తివంతంగా పనిచేయడానికి, కేవలం రాజుకు లేదా రాజ్యానికి లోబడి పనిచేసే, అధికారయంత్రాంగం (Bureaucracy) అవసరం. అయితే అధికార యంత్రాంగాన్ని ఒక్కసారిగా నిర్మించుకోవడం అసాధ్యం. అది అనేకవిధాలయిన ప్రయత్నాల్లో, మార్పులు చేర్పులతో క్రమంగా అభివృద్ధి చెందవలసి ఉంది. కాగా రిష్లూ చేసిన తొలిప్రయత్నం లోపభూయిష్టమై, జనరలిట (రాష్ట్రాలు) సమాన వైశాల్యం కలిగినవి కాకపోవడం, ఇంటెండెంట్స్‌పై తగిన పర్యవేక్షణ, అదుపు లేకపోవడం, తత్ఫలితంగా ఆ ప్రయత్నం విఫలం కావడమూ జరిగింది. రిష్లూ తరువాత ప్రధానమంత్రి అయిన కార్డినల్ మాజరిన్ ఇటువంటి జీతగాండ్రతో కూడిన అధికారబృందం కంటే సుంక గుత్తకాండ్రు చక్కగా పని చేస్తారని భావించాడు. పన్ను వసూలుచేసే అధికారపదవులను విక్రయించడం ద్వారా మాజరిన్ విస్తారంగా సొమ్ము సంపాదించి ధనాగారాన్ని నింపాడు. పదవులు కొనుగోలు చేసిన వారికి పన్ను వసూలు చేసే అధికారం ప్రాప్తిస్తుంది. కాని వారు ఎంత రేటుతో వసూలు చేయాలో నిర్ధారణకాలేదు. అనేకమంది ప్రభువులు పట్టణాలకు తరలివెళ్ళుతూ, తమ సంస్థానాల నుండి వసూలు కావలసిన పన్నులు, సుంకాలను వసూలు చేయడానికి తమ ఏజెంట్లను నియమించిన విషయం పైన వివరించడం జరిగింది. మిగిలి ఉన్న ప్రభువులు సైతం రాజధానిలో నివసిస్తూ రాజుగారి సముఖాన ఉండడాన్ని ఘనతగా భావించి, తమ సంస్థానాల పరిపాలనా నిర్వహణకు అదేవిధంగా ఏజంట్లను (Bailiffs) నియమించారు. కాగా, దేశప్రజానీకం నుండి రెవిన్యూవసూలుకు మూడువిధాలైన అధికారబృందాలు ఇంటెండెంట్లు, సుంకగుత్తకాండ్రు (Taxfarmers) ప్రభువుల ఏజంట్లు (Bailiffs) ఏకకాలంలో ఎవరితీరున వారు పన్నులు వసూలుచేస్తూ, ప్రజల్ని పీల్చి పిప్పిచేయసాగారు. ఈ పరిస్థితులు, వీటివలన గ్రామీణ కర్షకులు, సేద్యబానిసలు పడేబాధలు పదునారో లూయీకి తెలియవు. తెలుసుకోవడానికి అతడు కాని, మేరీ ఆంటోనెటీ కాని ప్రయత్నించలేదు. కేవలం సాంప్రదాయక రాచరికాన్ని పరిపాలనా విధానాన్ని సంరక్షించడం తమ ధర్మంగా భావించారేకాని, వాటిలోని అవకతవకలు గూర్చి వారెన్నడూ విచారించలేదు.

పరిపాలనా యంత్రాంగ నిర్మాణం ప్రాథమికదశలో ఉండడాన అధికారుల పనితీరును పరిశీలించి, వారిని అదుపు చేయడానికి తగిన ఏర్పాట్లుకాని, వారికి స్పష్టమైన విధులు, అధికార పరిమితులుగాని లేకపోయాయి. కనుక వారు తమ ఇష్టానుసారం వసూలుచేసి, అందులోని అధికాంశాన్ని మ్రింగివేసేవారు. దాని ఫలితంగా ప్రజలు పన్నులు చెల్లించలేక పడరానిపాట్లు పడుతుండగా, రాజ్యవ్యవస్థకు చేరవలసినంత మొత్తం చేరక సంక్షోభంలో పడగా, మధ్యలోని అవినీతి అధికారులు అత్యధిక ప్రయోజనాలను పొందుతూ బలపడుతున్నారు.

నిరపేక్షరాచరికం మధ్యతరగతివారి వర్తక వాణిజ్యాలను ప్రోత్సహించడానికి, రాజ్యధనాగారాన్ని నింపుకోవడానికి అనేక వస్తువులపై అధికసుంకాన్ని విధించి, ఈ వస్తువులను నిర్దిష్ట పరిమాణంలో రాజ్యంలోని ప్రతిఒక్కరు తప్పనిసరిగా కొనవలసిందిగా విధించారు. అలాగే ప్రభువర్గమూ, మతాధిపతివర్గము పన్నులలో రాయితీలు (Pension) పొందుతున్నారు. కనుక, వారికి మినహాయింపులను వర్తింపచేసి, తద్వారా నష్టపోయిన రాజ్యాదాయాన్ని భర్తీచేసుకునేందుకు రాచరిక వ్యవస్థ గ్రామీణ కర్షక ప్రజానీకంపై పన్నులను అధికం చేసింది. ఆ విధంగా టైలీ (Taille) అనే భూమిపన్నును, స్వాధికారవర్గాలకు చెందిన వారి

భూములను మినహాయించి, సాధారణ కర్షకుల భూములపై వసూలు చేసేవారు. ప్రతి వ్యక్తి రాజ్యపౌరునిగా ఒక విధమైన పన్ను (Poll Tax) చెల్లించవలసివచ్చేది. ఇవికాక వింగ్టెమ్ (Vingetieme) అనే ఆదాయపన్ను, దేశంలోని అన్ని విధాలైన ఉత్పత్తులపైన, వాణిజ్య వస్తువులపైన ఎగుమతి, దిగుమతి సుంకాలను విధించి వసూలు చేయడం జరిగింది. గాబెల్లీ (Gabelle) అనే ఉప్పు పన్నును, ప్రతి ఫ్రెంచి పౌరుడు, బాలురు, వృద్ధులు అనే తేడా లేకుండా తప్పనిసరిగా నిర్దిష్ట పరిమాణంలో ఉప్పునుకొని, పన్ను చెల్లించవలసి ఉంది. ఈ విధంగా రాజ్యవ్యవస్థ, ప్రభువర్గం, మతాధిపతులు, తమ తమ అధికారాలు, హక్కులను వినియోగించి, సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న వివిధమైన పన్నులు, సుంకాలను వసూలుచేసి, సాధారణ ప్రజానీకాన్ని దుర్భరమైన పీడనకు గురిచేశారు. ఈ దృష్టితో చూచినప్పుడు ఈ అధికారిక, ఆధిపత్య వర్గాలన్నీ కేవలం బడుగురైతులను, పేద ప్రజలను, వారి జవసత్త్వాలను పీల్చి బ్రతుకుతున్నాయని భావించడం యుక్తంగా కానవస్తుంది.

పరిపాలనలోని అయోమయం, అవ్యవస్థితి, అసమర్థతలకు తోడు నిరపేక్షరాజరికపరిపాలన ప్రజల్కకు అతి పీడాకరమైనది. ఏ వ్యక్తికాని, రాజుపట్ల, ఎవరైన ప్రభువు లేక మతాధిపతి పట్ల అవిధేయంగా ప్రవర్తించినట్లు తెలిసిన వెంటనే అతని నిర్బంధానికి రాజశాసనం (Lettre de catchet) జారీచేయబడేది. ఈ శాసనం ప్రకారం ఆ వ్యక్తి కారాగారంలో పడి, విచారణ లేకుండ సంవత్సరాల తరబడి మ్రగ్గిపోవలసిందే. ఎవరైనా గిట్టనివారు ప్రభుత్వానికి తప్పుడు ఆరోపణలు చేసినా, ఈ విధమయిన శిక్ష, విచారణ లేకుండా విధించబడేది. రాజు, మత వ్యవస్థ ఏకకాలంలోనే ప్రజలపైన, మేధావులపైన వారి గ్రంథ రచనలు, పఠనాలు, తీవ్రమైన ఆంక్షలు విధించి కఠినంగా అమలు జరిపేవారు. అనగా వాక్స్వాతంత్ర్యం, వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలు పూర్తిగా లోపించాయని అర్థం.

ఈ విధమైన వి ఁ ధ ఆధిపత్యవర్గాలు, పరిపాలనావిధానాలు ఏకకాలంలో ఎవరిపని వారు చేసుకొనిపోతూ, అందరు ప్రజలను పీడించడం కాక మరో పని లేకుండా, తాము వసూలు చేసే పన్నులు, సుంకాలకు ప్రత్యుపకారంగా ప్రజలకేమి చేయకుండ రాచరికము, పరిపాలనా విధానమూ, అవ్యవస్థితంగా, అనగా ప్రణాళికాబద్ధ ప్రయోజనమేదీ లేనిదిగా చేసివేశారు. ఇటువంటి అయోమయ పరిస్థితి కొనసాగుతున్న తరుణంలో, ప్రజల ప్రయోజనానికే ఏ వ్యవస్థ అయినా ఏర్పడింది. పని చేయవలసింది, అలా కానప్పుడు వ్యవస్థలను సంస్కరించుకోడానికి లేదా నిర్మూలించడానికి ప్రజలకే సర్వాధికారాలు ప్రకృతి సిద్ధంగా ఉన్నాయని బోధించి, వారిని ఉద్యమింపచేయడానికి తగిన విద్యా, విజ్ఞానాలు, వివేచనా విధానాలు ఉద్భవించి, వ్యాపించసాగాయి.

## 3.3.5 అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రభావం :

1789 ఫ్రెంచి విప్లవానికి అమెరికా స్వాతంత్ర్య పోరాటం యొక్క ప్రభావం అపారంగా ఉంది. ఫ్రెంచి ప్రజల స్వేచ్ఛా సమానత్వాల పట్ల జనించిన ఆసక్తికి, ఆధునిక కాలంలో సాధారణ ప్రజానీకం నియంతృత్వ ప్రభుత్వాలను లొంగదీసి, తమకు అవసరమైన సాంఘిక, రాజకీయ వ్యవస్థలను సంస్కరించుకోవడమూ, పునర్నిర్మించుకోవడాన్ని ప్రబోధించే మేధావుల తాత్త్విక సిద్ధాంతాలకు అమెరికా స్వాతంత్ర్య పోరాటం ఒక సజీవమైన ఉదాహరణను సమకూర్చింది. ఉత్తర అమెరికా ఖండంలోని పదమూడు యూరోపియన్ వలసలు క్రమంగా బ్రిటిష్‌వారి వలసపాలనా విధానానికి, నియంతృత్వానికి వ్యతిరేకంగా 1767 నుండి 1783 వరకు స్వాతంత్ర్య పోరాటం చేశాయి. తమ ప్రత్యర్థి అయిన గ్రేట్ బ్రిటన్‌పై వలసరాజ్యాల స్థాపనలోని సంఘర్షణల ఫలితంగా ఈ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభంకావడం ఫ్రాన్సుకు సంతోషం కలిగించింది. బ్రిటిష్ వారిపై తమ కక్ష తీర్చుకునేందుకు ఫ్రాన్సు కొంత కాల్బలాన్ని, కొంత నౌకాబలాన్ని వలసల్లోని స్వాతంత్ర్య యోధులకు సాయంగా పంపింది. ఈ సేనలు గణనీయమైన దక్షతతో బ్రిటిష్ పరాజయానికి కారణమై, అమెరికా వలసలకు స్వాతంత్ర్యం సంపాదించిపెట్టాయి. కాని, ఈ సంఘటన ఫ్రాన్సుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపి, కొద్ది సంవత్సరాల్లో 1789లో ఫ్రెంచి విప్లవానికి కారణమైంది. ఈ కారణాలను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు.

1) ఫ్రెంచి విప్లవం ఆధునిక ఐరోపా చరిత్రలోను, ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటి ప్రజావిప్లవమని పైన పేర్కొన్నా, వాస్తవానికి అటువంటి ప్రప్రథమ సంఘటన అమెరికా స్వాతంత్ర్యపోరాటం. అయితే, రెండవ ప్రపంచ యుద్ధం వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రముఖపాత్రను పోషించడంగాని, తమ దేశ నాగరికతా సంస్కృతులను ప్రపంచ వ్యాప్తం చేయడానికి గాని పూనుకోలేదు. అప్పటివరకు ప్రపంచ వ్యాప్తమైన ఐరోపా ఖండంలో సంభవించిన నాగరికతా సంస్కృతుల పరిణామాలు. అందుచేత ఆ స్థానాన్ని ఫ్రెంచి విప్లవానికి ఈయడం జరిగింది. అయితే, అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో సాయంగా వెళ్ళిన ఫ్రెంచి సైన్యానికి ప్రజాబాహుళ్యం తమ సమిష్టి ప్రయోజనాలను (Collective Welfare) సాధించుకోడానికి జాతీయ భావాలతో సుసంఘటితులు కావడం, వారిలో స్వేచ్ఛా సమానత్వాలు, సహకార, సౌభ్రాత్ర భావాలు ఏర్పడటం, వాటివలన సాధారణ ప్రజానీకం బలీయమైన రాజకీయశక్తిగా ఏర్పడి, నియంతృత్వాధికారాలను నిర్మూలించగలగడం - ఇవన్నీ సజీవ ఉదాహరణలుగా వారి అనుభవంలోనికి వచ్చాయి. మేధావుల రచనలు కల్గించిన వైజ్ఞానిక విప్లవం కంటె, ఈ వాస్తవమైన విప్లవస్వరూపం, వారిని ఉత్తేజపరిచింది.

2. ఆనాటి ఫ్రాన్సు దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్నా, తన రాజ్యాధికారాన్ని, గర్వాన్ని ప్రదర్శించడానికి, వ్యర్థమైన పట్టుదల సాధించుకోవడానికి పదునారో లూయీ అమెరికా స్వాతంత్ర్య యోధులకు, సైనిక సాయం పంపాడు. దీనివలన దేశంలోని ఆర్థిక సంక్షోభం మరింతగా విషమించి, మరింత అత్యవసర పరిస్థితిని సృష్టించింది. ఫలితంగా విప్లవానికి బలమైన పునాది ఏర్పడింది.

## 3.4. నూతన భావాలు - విజ్ఞానము - పూర్వరంగము :

పైన వివరించినట్టు 1789 నాటికి ఫ్రాన్సు దేశంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు, విధానాలు, వాటిలోని అసమానతలు, దురన్యాయాలు ఇంచుమించు అన్ని ఐరోపా దేశాల్లోను సమానమే, కాని ఆ దేశాల్లో కంటే ఫ్రాన్స్‌లోనే ముందుగా ప్రజాచైతన్యము, దాని ప్రభావంతో ఉధృతమైన విప్లవోద్యమము ఏర్పడ్డాయి. అందుకు ప్రధాన కారణాలు రెండు, మొదటిది వర్తక వాణిజ్య విస్తరణ, అభివృద్ధి వలన మిగిలినదేశాల కంటే ఫ్రాన్సులోనే ప్రబలమైన మధ్యతరగతి ఏర్పడడం. రెండవది, దానిననుసరించి, అనేక వైజ్ఞానిక రంగాల్లో - శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు ఫ్రాన్సులోనే అధికంగా వృద్ధిచెందడం.

1789 నాటి ఫ్రెంచి విప్లవం శాస్త్ర, వైజ్ఞానిక పురోగమన దృక్పథం నుండి చూచినప్పుడు విజ్ఞానోద్దీప్తయుగం (Age of Enlightenment) లో సంభవించింది. ఆనాటికి అనేక శాస్త్రవిషయాల్లో గణితము, భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రము, మొదలైనవి గణనీయమైన అభివృద్ధి సాధించి మానవునికి నిత్యజీవితంలో ఉపయోగపడే అనేక విధాలైన యంత్రపరికరాలను, వైద్యము, ఔషధాల ఉత్పత్తి సాధ్యమైనాయి. తక్కువ శ్రమతో మునుపటికన్న అధికమైన ఉత్పత్తి, ఖండాంతర నౌకాయానం, వాణిజ్య సంబంధాలు సాధ్యమైనాయి. వీటి ఆర్థిక ఫలితాలను అలా ఉంచి, వైజ్ఞానిక ఫలితాలను పరిగణిస్తే ఆనాటి సాంప్రదాయకమైన, అశాస్త్రీయమైన అనేక విశ్వాసాలను నిర్మూలించడానికి, ఇంకా అనేకమైనవి తార్కికంగాను, శాస్త్రీయంగాను విశ్లేషించి నిర్ధారణ చేయడానికి అవకాశం కలిగింది.

ఈ పరిణామాలకు మూలం ప్రాచీన గ్రీకు విజ్ఞానము, తాత్త్విక చింతనలు, అవి సాంస్కృతిక పురరుజ్జీవనంతో ప్రారంభమైనవి, అనే విషయాలు పైన వివరించడం జరిగింది. ఆ విజ్ఞానం కేవలం లోకాతీతమైన, అస్పష్టమైన సత్యాలను (Supra Mundane and abstract) అర్థం చేసుకోవడానికి మాత్రమేకాక, భౌతిక ప్రపంచాన్ని, ఈ ప్రపంచంలో మానవుని జీవితస్వరూపాన్ని అర్థంచేసుకోడానికి, మరింత అభివృద్ధి చేసేందుకు ఉపకరించేవనికూడ పైన వివరించడం జరిగింది. మానవుని సంఘజీవనము, రాజకీయ వ్యవస్థల తీరుతెన్నులు, వాటి పరిణామక్రమము ఆర్థికమైన ఆకాంక్షలు, వాటి పరిణామక్రమము వీటన్నిటిని గూర్చి తాత్త్వికంగా ఆలోచించింది, సిద్ధాంతాలను ప్రతిపాదించింది. అందుచేత ఆ విజ్ఞానంలోని మూలసూత్రం మానవతావాదమని (Humanism) పైన వివరించడం జరిగింది.

కేవలం ఈ ప్రాచీనవిజ్ఞానముకాక, పదునాలుగు, పదునైదు శతాబ్దాల్లో అనేక అట్లాంటిక్ తీరదేశాలు జరిపిన సముద్రాంతర నౌకాయానాలు, పరిశోధనలు అంతకు పూర్వం తెలియని అనేక క్రొత్త భూభాగాలు, వాటిలో నివసిస్తున్న మానవసమాజాల నాగరికతలు, సంస్కృతులు తెలుసుకునే అవకాశం కల్పించాయి. అమెరికా ఖండంలో అనేక ఆదిమ జాతులను గూర్చి ప్రాచ్య ప్రపంచంలోని భారతదేశము, చైనాలను గూర్చి, వారు మరింత సన్నిహితమైన జ్ఞానాన్ని పొందారు. ఈ జ్ఞానం వలన సమాజం పుట్టుక, సామాజిక వ్యవస్థలోని పరిణామాలు వీటిలో మానవుని స్థితిగతులు, అలాగే రాజ్యవ్యవస్థల గూర్చి, అధ్యయనం చేసే అవకాశం వారికి లభించింది. ఈ అధ్యయనం వారికి గల ప్రాచీన గ్రీకు నాగరికతా సంస్కృతుల పునరుజ్జీవన ఫలితంగా ప్రాప్తించిన విజ్ఞానంతో మిళితమై, ఆధునిక యుగానికి అనువైన ఆశయాలు, వ్యవస్థల రూపకల్పన మొదలైన వాటిని గూర్చి, అధ్యయనం చేసే అవకాశం వారికి లభించింది. ఈ అధ్యయనం వారికి గల ప్రాచీన గ్రీకు నాగరికతా సంస్కృతుల పునరుజ్జీవన ఫలితంగా ప్రాప్తించిన విజ్ఞానంతో మిళితమై, ఆధునిక యుగానికి అనువైన ఆశయాలు, వ్యవస్థల రూపకల్పన మొదలైన వాటిని గూర్చి ఐరోపాలోని మేధావులు ఆలోచించ గలిగారు. ఈ నూతన విజ్ఞానము, తాత్త్విక చింతనలు మానవతావాదానికి చెందినవని జ్ఞప్తిలో ఉంచుకోవాలి.

ఈ విధమైన వైజ్ఞానిక పురోగమనం మతధార్మిక రంగాలను సైతం తార్కిక విశ్లేషణకు గురిచేసింది. మతవ్యవస్థ బోధించే అనేక సిద్ధాంతాలు, విధించే ఆచారాలు, సాంప్రదాయకంగా కొనసాగుతూ వస్తున్న ఆచార వ్యవహారాలు - ఏవైనాసరే, మానవుని సుఖశాంతులకు అవరోధంగా ఉన్న వాటిని, దోహదం చేయని వాటిని, నిశితంగా విమర్శించి ఖండించింది. ఈ విధమైన వైజ్ఞానిక విప్లవం రాజకీయ విప్లవానికి ముందుగా సంభవించి, దారి చేసింది. ఆ విప్లవ ఫలితంగా సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించడానికి జాతీయ రాజవ్యవస్థ (Nation state system) ను త్వరితంగా రూపొందించడానికి కావలసిన ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రజానీకానికి కలిగించింది. ఈ కారణాల వలన ప్రజల విప్లవోద్యమం ముందుగా ఫ్రాన్సులో సంభవించింది.

మానవతావాదం క్రమంగా వ్యక్తి వాదానికి (Individualism) దారితీసింది. సామాజికమైన వ్యవస్థలకు విధానాలకు మూలం వ్యక్తుల ఆశలు, ఆకాంక్షలు వాటి సమిష్టి స్వరూపమే సామాజికమైన ఆశయాలకు, వ్యవస్థలకు, వాటి సంస్కరణలకు కారణం అవుతుంది. కనుక సామాజిక, ఆర్థిక సంస్కరణలకు మూలం వ్యక్తులు - ఎవరికి వారు సంతృప్తికరమైన, ప్రశాంతము, అభివృద్ధికరమూ అయిన జీవన విధానాన్ని రూపొందించుకోవడం అత్యంత ప్రధానం. మత, ధార్మిక సిద్ధాంతాల కంటే భౌతిక సుఖశాంతులను కలిగించే విధానాలకు, మానవతావాదం ప్రాధాన్యత ఇయ్యడంలోనే వ్యక్తివాదం అంతర్లీనంగా ఉంది. కాగా ఈ నూతన దృక్పథం "త్యాగం కంటే సంతృప్తి మిన్న, ఆత్మనిరాకృతి (Self - denial) కంటే ఆత్మాధిక్యత (Self-gratification) ప్రయోజనకరం" అనే కొత్త ఆదర్శాలు మధ్యయుగాల నాటి ఆధ్యాత్మిక, ధార్మిక భావాలను త్రోసిరాజన్నాయి. మధ్యయుగాల్లో వలె రాజ్యం యొక్క సర్వసత్తాక సార్వభౌమాధికారం (Sovereignty) రాజులోకాక ప్రజల్లో ఉంటుందని, నూతన దృక్పథాన్ని ప్రతిపాదించే తాత్త్వికులు, మేధావులు ప్రకటించారు.

అనేక ఐరోపా దేశాల్లో ఈ కాలంలో ఏర్పడిన నూతన విశ్వవిద్యాలయాలు ఈ శాస్త్ర, సాంకేతిక, తాత్త్విక అధ్యయనాలకు, సిద్ధాంతాల బోధనకు అంకితం అయినాయి. ఫలితంగా ప్రజానీకంలో ఈ విజ్ఞానము, దృక్పథం త్వరితంగా వ్యాపించాయి. అనేక దేశాల్లోని నిరపేక్షరాచరికాలు మేధావులతో కూడిన వైజ్ఞానిక సంస్థలను (Academy) నెలకొల్పాయి. అవి ఈ రంగాల్లో పరిశోధనలను, వాటి ఫలితంగా నూతన విజ్ఞానాన్ని ప్రకటించడంలోను విస్తారమైన కృషిచేశాయి. 1662లో ఇంగ్లాండు రాజు రెండవ ఛార్లెస్ రాయల్ సొసైటీని స్థాపించి, "అన్ని ఆలోచనా విధానాల్లోని, సిద్ధాంతాలను, సూత్రాలను, తాత్త్విక దర్శనాలను (hypotheses) ప్రయోగాలను అన్నిటి చరిత్రలను, ప్రకృతి సిద్ధమైన, గణిత, యాంత్రిక (Mechanical) విషయాలను, గ్రంథస్థమైనవైనా, నూతనంగా కనిపెట్టినవైనా ఆచరణలో ఉన్న సమస్త విషయాలు - ప్రాచీనమైనవి, నవీనమైనవి - అన్నిటిని

గూర్చి అధ్యయనం చేసి, శాస్త్రబద్ధం చేసే ఉద్దేశ్యంతో" నెలకొల్పాడు. అదే ఉద్దేశ్యంతో అటువంటి సంస్థను పదునాలుగో లూయీ ఫ్రాన్సులో కూడ నెలకొల్పాడు.

### 3.4.1 ప్రకృతి తత్వం :

ఈ పరిశోధనల్లోను, తాత్త్విక చింతనల్లోను ఉత్పన్నమైన వాటిలో "ప్రకృతి తత్త్వం" (Natural Philosophy) చాలా ప్రధానమైంది. శాస్త్ర, సాంకేతిక పరిశోధనల తరువాత ప్రజల్లో విప్లవాత్మక దృక్పథాన్ని కలిగించి, ప్రాచీనకాలం నుండి పారంపర్యంగా వస్తున్న ఆలోచనలు, సిద్ధాంతాలు, ఆచారాలు మొదలైనవి. మతధార్మిక విషయాలైనా, సాంఘిక రాజకీయ అంశాలైనా, వాటి పునాదుల నుండి పరిశీలించి అర్థంచేసుకోవడం, అలా అర్థంచేసుకొన్న దానికి తార్కికంగాను, హేతుబద్ధంగాను శాస్త్రస్వరూపాన్ని ఇవ్వడం నుండి ఈ ప్రకృతితత్వం ఉత్పన్నమైంది. ఫ్రెంచివిప్లవ కాలంలోని అనేక మేధావులు డిడిరో (Diderot) వోల్టైర్ (Volatire), రూసో (Rousseau) మొదలైనవారు ప్రధానంగా ఈ ప్రకృతితత్త్వానికి చెందిన వైజ్ఞానికులు. వారి ఆలోచనలు, ప్రతిపాదనలే నూతన వ్యవస్థల నిర్మాణానికి, సంస్కరణలకు ఆలంబనమైనవి. వీరిలో కొందరు క్రైస్తవమతంలోని అంధవిశ్వాసాలను, ఆచారాలను తొలగించి, నైతిక, ధార్మిక విలువలను అభివృద్ధి చేయడానికి పూనుకున్న అభ్యుదయవాదులు కాగా కొందరు, వాటిని సంపూర్ణంగా తిరస్కరించి కేవలం భౌతికతత్త్వాలనే నెలకొల్పడానికి ప్రయత్నించినవారు.

ఈ విధమైన ప్రకృతి తత్వానికి ఆద్యుడని చెప్పదగినవారు పదునైదు - పదునారవ శతాబ్దాలకి చెందిన డెసిడెరెస్ఎరస్మస్ (1466 - 1556) నెదర్లాండ్‌లో జన్మించి, తన అధ్యయనము, ప్రబోధాలతో విస్తారంగా ఐరోపా అంతట పర్యటించి, ఆనాటి ఐరోపా మేధావుల్లో అగ్రగణ్యునిగా ప్రసిద్ధికెక్కాడు. మతవ్యవస్థను నిర్వహించే మతాధిపతులను, వారి సిద్ధాంతాలను తన రచనల ద్వారా అతన్ని నిశితంగా విమర్శించి ఖండించినా, మౌలికంగా ఎరాస్మస్ క్రైస్తవమతం పట్ల గాఢమైన శ్రద్ధాసక్తులు కలవాడు. అవగా మతం పేరున అన్ని విధాలైన కుతర్కాలు, తప్పుడు సిద్ధాంతాలు, అంధవిశ్వాసాలు చలామణి కావడాన్ని మాత్రం వ్యతిరేకించి, అందలి విలువలను శాస్త్రబద్ధంగా హేతువాదంతో అర్థం చేసుకొని, ఆచరించడాన్ని ఎరాస్మస్ ప్రబోధించి ప్రచారం చేశాడు. ఎరాస్మస్ బహుకాలం ఫ్రాన్సులో నివసించి, పర్యటించి అక్కడి భావవిప్లవానికి పునాదులు వేశాడు. అతని తరువాత ఐరోపాలోని తాత్త్విక ధోరణులకు ప్రామాణిక పద్ధతులతో కూడిన ఆలోచనా విధానాన్ని ఏర్పరచినవాడు రీని డైకార్టే (Rene Decartes) ఇతడు ఫ్రాన్సులో జన్మించి ఐరోపా అంతటా పర్యటించి నెదర్లాండ్సు (హాలెండ్) లో సైనికునిగా కొంతకాలం పనిచేశాడు. బవేరియా (ఒక జర్మన్ రాజ్యం) లో హంగరీలో కొంతకాలం నివసించి, తుదకు స్వీడన్‌లో మరణించాడు. గణితశాస్త్రంలోను, భౌతికశాస్త్రంలోను గొప్ప పాండిత్యం సాంపాదించిన డెకార్టే ఆ శాస్త్రాలలోని ఆలోచనావిధానాన్ని అన్ని ఇతర శాస్త్రాలకు వర్తింపచేసి, అనగా కార్యకారణ సంబంధాన్ని బట్టి విశ్లేషించాడు. ఆ విధంగా అతడు కేవలం పాండిత్యం కాక పరిశీలన వలన ప్రకృతి ధర్మాలను అవగాహన చేసుకొనవలసిన అవసరాన్ని గూర్చి ప్రకటించాడు. ఇతని ఆలోచనా విధానాన్ని కార్టీజియన్ తాత్త్విక విధానమని అది ప్రత్యేకంగా తాత్త్వికచింతనలో నూతన ఒరవడి సృష్టించిందని విజ్ఞులు భావిస్తారు. "డిస్కోర్ ఆన్ మెథడ్స్" అనే గ్రంథాన్ని 1637లో "ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ ఫిలాసఫీ" అనే గ్రంథాన్ని 1644లో ప్రకటించి డెకార్టే ప్రకృతితత్త్వానికి ప్రత్యేకమైన, స్పష్టమైన స్వరూపాన్ని చేకూర్చాడు. డెకార్టే వాదం ఆనాడు విజృంభించి వ్యాప్తి చెందుతున్న భౌతిక వాదానికి కొంత పరిమితి విధించి, భౌతిక పదార్థాలే కాక కొన్ని అగోచర పదార్థాలు కూడ సత్యమేనని వాదించింది. శరీరము, ఆత్మ వేరువేరని, మనస్సు, పదార్థము వేర్వేరని వీటిలో మనస్సు ఆత్మ అగోచరమైన, భౌతిక పదార్థాలు కాని, సత్యాలని నిర్ణయించాడు. అయితే వాటిలోని శరీరము, పదార్థము అనే రెండు అంశాలు ప్రకృతి సిద్ధమైన న్యాయానికి కట్టుబడి ఉంటాయి, కనిపించే సత్యాలు అని కార్టీజియన్ తత్త్వం. మతపరమైన ధార్మిక నైతిక సూత్రాలు వీటికే వర్తిస్తాయి కాని మనస్సుకు ఆత్మకు కాదని, కనుక వాటి ప్రాముఖ్యత పరిమితమేనని ఇతని సిద్ధాంతం. కార్టీజియన్ తత్త్వం ఈ విధంగా మతమౌఢ్యాన్ని, మనస్సును కూడా

కట్టిపడవేయడానికి ప్రయత్నించే ధార్మిక, నైతిక సిద్ధాంతాలను, ఖండించింది. కాని ఎరస్మస్ వలెనే డెకార్టే కూడ క్రైస్తవ మతం పట్ల అభిమానం కలవాడే కాని పూర్తిగా తాత్విక సిద్ధాంతాలను తిరస్కరించిన వాడుకాడు.

వీరికి ప్రతిగా నూటికి నూరుపాళ్ళు భౌతికమైన పదార్థాలే సత్యమని, అవి మనకు అనుభవసిద్ధంగా ఎదురుగా ఉండేవి, అలాకానివి, మనకు అనుభవ పూర్వకంగా తెలియనివి విశ్వసించవలసిన పనిలేదు, వాటికై తపించవనవసరంలేదు అని బోధించిన పలువురు మేధావుల్లో జాన్ హాబ్స్, జాన్ లాక్ ముఖ్యులు. హాబ్స్ ప్రపంచమంతట ఉన్నది పదార్థము (Matter) దాని చలనము (Motion) మాత్రమేనని, ఇది ప్రత్యక్షంగా గుర్తించగలిగినవి, కనుక సత్యమైనవి, అని ప్రకటించాడు. పదార్థంలోనే మనసు, ఆత్మ కూడ ఇమిడి ఉంటాయని వాటికై వేరుగా అన్వేషించనవసరం లేదని వాదించాడు. అలాగే జాన్ లాక్ ప్రాచీనగ్రంథాలు వర్ణించే మాయలు, మంత్రాలు, అద్భుతాలు అవన్నీ కేవలం కల్పనలు, మతానికి, వాటికి సంబంధంలేదు, మతం వ్యక్తి అనుభవ సిద్ధము, అతని ఆలోచనలో అర్థవంతమూ అయి ఉంటుంది. కానీ ప్రాచీనగ్రంథాల బోధనల్లోకాదని వాదించాడు. ఆనాటి ఐరోపా దేశాల్లో సంభవిస్తున్న భౌతిక పరిణామాలు వర్తక వాణిజ్య విస్తరణలు, ఉత్పత్తుల పెరుగుదల, జాతీయ నిరపేక్ష రాజ్యాల ప్రాబల్యము ఇవి మాత్రమే సత్యాలు, వాటికి దోహదం చేసే సాంఘిక, మత సంస్కృతులే అంగీకార యోగ్యాలు అలా కానివాటితో మానవునికి సంబంధం లేదని ఈ శాఖకు చెందిన పండితుల వాదనల్లోని సారాంశం. 18వ శతాబ్దిలో ప్రసిద్ధ తత్త్వవేత్త అయిన డేవిడ్ హ్యూమ్ మతానికి, దేవునికి శాస్త్రీయమైన నిర్వచనంతో, వాటి ఉనికిని నిరూపించి విశ్వసించడం అసాధ్యం కనుక, వాటికై తాపత్రయపడడం అవివేకమని తీర్మానించాడు. మానవుని ఆలోచనలు అతని అనుభవంనుండి మాత్రమే పుట్టుకొస్తాయి. అతని అనుభవానికి అందని వాటి గురించిన ఆలోచనలు నిష్ఫలం అని హ్యూమ్ అభిప్రాయం.

ఇటలీ తత్త్వవేత్తల్లో అగ్రగణ్యులైన ఇమ్మాన్యుయేల్ కాంట్ మానవుని నైతిక ధార్మిక ప్రవర్తనకు ఆలంబనగా పారలౌకికమైన భగవంతుని ఉనికి గుర్తించడం తప్పనిసరి అయితే, మానవునికి భావనాస్వేచ్ఛ (Freedom of Thought) కూడ అంత అవసరమని, ఈ ఉభయ వాదాలకు నడుమ సంధి చేయడానికి తన ఆదర్శ వాదాన్ని (Idealism) ప్రతిపాదించాడు.

ఈ విధమైన వైవిధ్యంతో కూడిన ఆలోచనా విధానాలు వైజ్ఞానిక తాత్విక రంగంలో చాలా అయోమయాన్ని గందరగోళాన్ని సృష్టించాయి. ఈ ఆలోచనల మధనం నుండి ఉద్భవించిన దృక్పథాల్లో నాలుగు ముఖ్యమైనవి. ఈ నాలుగు తలొక దిక్కువైపు చూస్తూ, ఒకదానికొకటి పొంతన లేకుండా అభివృద్ధి చెందాయి. మొదటిది, ప్రకృతివాదం (Naturalism), ప్రకృతి మాత్రమే వాస్తవం, విశ్వసనీయం. అంతకుమించిన అతీతవిషయాలను నమ్మశక్యం కాని వాటిని విస్మరించడం యుక్తం. మరొక విధంగా చెప్పాలంటే ఇది పూర్తిగా భౌతికవాదం, పదార్థం మాత్రమే సత్యం, అని దీని సారాంశం. రెండవది, హేతువాదం (Rationalism) ఏ విషయాన్నైనా కార్యకారణ సంబంధంతో పూర్వాపరాలను అనుసంధించి అర్థం చేసుకోవడం, ఆవిధంగా అర్థవంతమైన వాటినే అంగీకరించి, అనుసరించడం యుక్తమని ప్రతిపాదించింది. ఇది ఎందుకు, ఎలా వచ్చింది, అని ప్రశ్నించుకొని, సమాధానాలు రాబట్టగలిగినప్పుడే వాటిలోని సత్యం నిర్ధారణ అవుతుంది. ముందరి పాఠంలో వివరించినట్లు ఏదైనా మానవుని కొరకే, అతని భౌతిక, ఆధ్యాత్మిక సుఖశాంతులు కొరకే. అలాకాని శుష్కతార్కాలు, గ్రంథాల నుండి కాని, పెద్దల బోధనల నుండి కాని గ్రహింపవలసిన అవసరంలేదని, ఆచరించే పనిలేదని నిరాకరించే ప్రయోజన వాదం (Utilitarianism) దీని ఫలితమే. మూడవది, పురోగమన ఆశావాదం (Progressive Optimism) శాస్త్రవిజ్ఞానము, అది కలిగించే తాత్విక చింతనలను వర్తమాన వ్యవస్థలను, వాటి వాస్తవ స్వరూప భావాలను తార్కికంగా అర్థం చేసుకోవడం వలన తగిన సంస్కరణలు చేపట్టడం సాధ్యం అవుతుందని తద్వారా మానవ కళ్యాణానికి అనుగుణంగా వాటిని తీర్చిదిద్దుకోవచ్చునని భావించేవాదం. పైన పేర్కొన్న ఎరాస్మస్, డెకార్టే, కాంట్ వంటి మేధావుల వాదం ఇది. అయితే దీనికి సాంప్రదాయకవాదం (Conservatism) బద్ధశత్రువు. అది నాటి నాగరికతాసంస్కృతుల్లో ప్రాబల్యం వహించి, ఏవిధమైన నూతన భావాలను అనుమతించని మూర్ఖత్వం ప్రదర్శిస్తున్నది. ఈ రెండింటికి సంఘర్షణ అనివార్యమని ఫ్రెంచి విప్లవం ఋజువు చేసింది. ఈ సంఘర్షణలో చోటుచేసుకున్న మారణకాండ,

విధ్వంసనలు వేరొకవాదాన్ని, విధ్వంసకవాదాన్ని (Nihilism) ను ఉత్పన్నం చేశాయి. ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా కుళ్ళిపోవడమే కాక రాయివలె బండబారిందని, దీనిని మొదలంట విధ్వంసం చేస్తేనే, నూతన వ్యవస్థ నిర్మాణం సాధ్యమవుతుందని, ఈ వాదం సారాంశం. ఫ్రెంచి విప్లవ కాలంలోని జాతీయసమితి (National Convertion) నిర్వహించిన తాత్కాలిక ప్రభుత్వ కాలంలో ఈ వాదం క్రమంగా బలపడి, భీభత్స పరిపాలన (Region of Tear) ను సృష్టించింది. తరువాత కాలంలో కారల్‌మార్క్స్ ప్రవచించిన సామ్యవాదానికి ఈ విధ్వంసకవాదం తోడై కమ్యూనిస్టు ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

అయితే ఈ వాదాలన్నింటికి మూలం మానవతావాదమేనని, మానవజీవితవికాసము, మానవునికి ప్రాపంచికజీవితంలో స్వేచ్ఛ, సమానత్వం ప్రాతిపదికలుగా సుఖశాంతులను ఇయ్యగల సామాజిక, ఆర్థికవ్యవస్థల నిర్మాణం అత్యంతావశ్యకమని, అందుకు నడుంకట్టి ఉద్యమించవలసింది కూడ మానవుడే అనే మౌలికతత్త్వమే, లక్ష్యసాధనకై భిన్న మార్గాలను ఎన్నుకోవడంవలన పైన పేర్కొన్న తాత్త్విక సిద్ధాంతాలను పుట్టించింది.

వీటికి తోడుగా, ఈ మార్గాలన్నింటిని అవి రూపుదిద్దుకొనే ప్రక్రియలో ప్రభావితం చేసిన తాత్త్వికదృక్పథం భావచేతనవాదం (Romanticism) ఇది ప్రామాణిక సాంప్రదాయకవాదం (Classicism) తో భౌగొళిక అన్వేషణల ఫలితంగా ఐరోపావారికి తెలియవస్తున్న విజ్ఞానం మేళవించగా ఏర్పడింది. అమెరికా ఖండంలోని ఆదిమ మానవుల జీవన విధానాలను పరిశీలించి ఏర్పరచుకొన్న సామాజిక, రాజకీయ సిద్ధాంతాలు, ప్రాచీన తత్త్వవేత్తల సిద్ధాంతాలతో సమన్వయం చేసినప్పుడు ఈ భావచేతనావాదం ఉత్పన్నమైంది. నేటి నాగరికతా సంస్కృతులకు మూలమైన పూర్వరూపాలనే భ్రమ కొంతవరకు ఈ కాల్పనికమైన భావచేతనను కల్గించింది. గ్రంథాల్లోని సత్యాలకు హేతువులనుకాని, ఆదిమ సంస్కృతుల పరిణామంతో నేటి సంస్కృతి ఉత్పన్నమైన చారిత్రక ప్రక్రియ గూర్చిగాని అవగాహన లేకపోవడం భావచేతనావాదంలోని తీవ్రమైన లోపం అయినప్పటికి ఆనాటి కవులు, మేధావుల రచనల్లో ఇది అన్నిటికంటే ప్రధానమైన తాత్త్వికాంశంగా ప్రతిబింబించి, వారిని, వారి రచనలు చదివిన ప్రజానీకాన్ని గాఢమైన ప్రభావానికి గురిచేసి, అనేక తప్పుడు సిద్ధాంతాలను, కఠినసత్యాల వలె నమ్మించి, వాటి విస్తరణకు కారణమైంది. ఆధునికయుగంలోని అనేక రాజకీయ, ఆర్థిక తత్త్వవేత్తల సిద్ధాంతాలు ఈ కోవకు చెందినవే.

### 3.4.2 1789 నాటి ఫ్రెంచి మేధావులు - వారి పాత్ర :

పైన వివరించిన ఐరోపా విజ్ఞానోద్దీప్తయుగ (Age of Enlightenment) ఇతని రచనలు అనేక విషయాలపై, అనేక ప్రక్రియల్లో చేసినవి, నూరు సంపుటాల్లో ప్రచురితమైనాయి. ఆనాటి పూర్వరంగంలో ఫ్రాన్సు దేశంలో అపూర్వమైన తాత్త్విక వికాసం జరిగింది. 1789 విప్లవ కాలంనాటి వైజ్ఞానిక, తాత్త్విక వికాసానికి కారకులై, ప్రజల్లో విప్లవ భావాలు రేకెత్తడానికి మూలమైన వారిలో అగ్రగణ్యులు వోల్టైర్, రూసో, మాంటిస్క్యూ. వారుకాక మరికొందరు ఫ్రెంచి విజ్ఞానసర్వస్వంలో తాము వ్రాయవలసిన వ్యాసాల వలన ఆనాటి వైజ్ఞానిక విప్లవంలో ప్రముఖ పాత్ర పోషించారు.

### 3.4.2.1 వోల్టైర్ - డీఇజమ్ :

ఫ్రెంచి విప్లవ కాలంనాటి ఫ్రెంచి మేధావుల్లో, తాత్త్వికుల్లో వోల్టైర్ నిస్సందేహంగా అగ్రగణ్యుడు. ఫ్రాన్సిస్ డి ఆరో (Francis de Arouat) అనేది ఇతని అసలుపేరు. కాని వోల్టైర్ అనే పేర ప్రసిద్ధుడైనాడు. వోల్టైర్ రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతడు హాస్యధోరణిలో చురుకైన విమర్శ చేస్తూ, అనేక వ్యాసాలు ప్రచురించాడు. అంతేకాక, కవిగా, నాటకకర్తగా, అత్యంత ప్రసిద్ధుడు. ఐరోపాలోని అనేక దేశాల్లో పర్యటించి, ప్రముఖ రాజులతో సన్నిహితమైన మైత్రి కలిగి, తన భావాలతో వారి అభిమానాన్ని పొందినవాడు. కొంతకాలం ప్రష్యారాజైన ఫ్రెడరిక్ ది గ్రేట్ ఆస్థానంలోను, మరికొంత కాలం రష్యాను పరిపాలించిన జారినా (Zarina) కాథరిన్ దిగ్రేట్ ఆస్థానంలోను నివసించి, వారితో అనేక సందర్భాల్లో తన భావాలను ప్రకటిస్తూ చర్చలు జరిపాడు. తన రచనల్లో వోల్టైర్ స్పర్శించని అంశంలేదు, మత, ధార్మిక, నైతికమైన అంశాలు, రాజకీయ, సాంఘిక ఆర్థికాంశాలు

మొదలైన సమస్త వైజ్ఞానికాంశాల్లో ఇతని పరిశీలనలు, ఆలోచనలు జరిగాయి. అయితే, అన్నింటిలోను అంతర్లీనమైన ఇతని తాత్త్విక దృక్పథం డీఇజమ్ (Deism). ఇది ఆనాటి మేధావులు ప్రకృతిసిద్ధమైన మతవిధానానికి ఇచ్చిన పేరు. ఈ దృక్పథంలోని వ్యక్తిస్వేచ్ఛావాదం (Individualism) నుండే ఇతని రాజకీయ, సాంఘిక సిద్ధాంతాలు రూపుదిద్దుకున్నాయి.

వోల్టైర్ పియరీ బేలే (Pierre Bayle) అనే మరో ఫ్రెంచి మేధావి అనుయాయి. అయితే, సిద్ధాంతాన్ని పియరీబేలే నుండి గ్రహించినా, అది ప్రజల్లో వ్యాపించడానికి ముఖ్య కారకుడు వోల్టైర్, అందుచేత పియరీకంటే వోల్టైర్ మరింత ప్రసిద్ధుడు.

పియరీ బేలే ప్రతిపాదన డీయిజం సాంప్రదాయక క్రైస్తవమతాన్ని కాక, వ్యక్తి స్వేచ్ఛపై ఆధారపడి ఎవరికివారే, తమ అనుభవాల నుండి గ్రహించిన సత్యాలతో తమ మతదృక్పథాన్ని ఏర్పరచుకోవడం. ప్రాచీనమైన పవిత్ర గ్రంథాలలోని విషయాలు, ఆ కాలంలోని జీవన పరిస్థితుల్లో ఆనాటి మేధావులు చెప్పినవి. వాటిని విధిగా అంగీకరించి అనుసరించడం సాధ్యంకాదు. యుక్తం కాదు, ఎందుకంటె అప్పటికి ఇప్పటికి పరిస్థితుల్లో అపారమైన మార్పు వచ్చింది.

డీఇజమ్ భగవంతుని మొట్టమొదటి ప్రకృతిసిద్ధమైన న్యాయానికి కర్త, మానవునికి ఆలోచనలను ప్రసాదించిన తొలిదాత, అలాగే మానవుని ప్రకృతి సిద్ధమైన హక్కులు, ప్రకృతి సిద్ధమైన మనోచేతన (Impulse) లను ఇచ్చినవాడు అని అంగీకరిస్తుంది. అయితే అంతటితో అతని పని తీరిందని ప్రతిపాదిస్తుంది. మానవుడే తెలివితేటలతో తన జీవితాన్ని తానే చక్కదిద్దుకోవాలని అతని మార్గానికి రాజ్యవ్యవస్థకాని, మతవ్యవస్థకాని అడ్డుతగలరాదు. ఈ భావం తరువాత కాలంలో (Laisse-faire) అనే ఒక వాస్తవవాదనకు దారితీసింది.

లైజ్‌ఫైర్ వాదానికి మూలం ఆనాటి వైజ్ఞానిక విప్లవంలోని వ్యక్తివాదం (Individualism) వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలు దేశ ఆర్థిక, రాజకీయ ప్రగతికి మూలసూత్రాలని, వ్యక్తి జీవితంలో రాజ్యవ్యవస్థకాని, మతవ్యవస్థకాని, ఇంకా ఏ సాంప్రదాయికమైన ఆధిపత్య వ్యవస్థలు, వాటి అధికారం ఎంత తక్కువగా ఉంటే వ్యక్తి అంత చైతన్యవంతుడు, ప్రగతిశీలుడు అవుతాడని ఈ వాదం యొక్క సారాంశం. ఫ్రెంచి విప్లవ కాలంనాటి సాధారణ ప్రజానీకం స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాత్రాలను తమ విప్లవ తత్వానికి మౌలికాంశాలుగా భావించి, వాటికి అసూయ కలిగించే నిరపేక్ష రాచరికాన్ని, ప్రభువర్గాన్ని, మతాధిపతులను ఎదిరించి పోరాడటానికి స్ఫూర్తి ఈ తత్త్వమే కలిగించింది.

భగవంతుడు ప్రకృతిసిద్ధంగా న్యాయసూత్రాలను కల్పించి, మానవునికి ప్రగతికాంక్షను, అందుకు కావలసిన చైతన్యాన్ని ప్రసాదించడానికి డీఇజమ్ ప్రతిపాదించే విషయాన్ని పైన వివరించడం జరిగింది. ఈ సిద్ధాంతం తరువాత వ్యక్తివాదం సమర్ధించిందని కూడ వివరించడం జరిగింది. అంతటితో భగవంతుని పని తీరిపోయిందని, భౌతిక ప్రపంచంలో అతనికి స్థానం లేదని డీఇజమ్ వాదిస్తుంది. తను సృష్టించిన ప్రకృతి న్యాయానికి తానే బందీ అయినాడని, కనుక మానవుని జీవితంలో భగవంతుడు ఏ విధంగాను సాయపడలేడని ఈ వాదం యొక్క సారాంశం. 1677లో పియరీ బేలే ప్రకటించిన "చారిత్రక విమర్శనాత్మక నిఘంటువు" (Critical and Historical) ఈ వాదాన్ని ఫ్రాన్సులో విస్తరింపజేసింది. ఈ వాదాన్ని అనుసరించి వోల్టైర్ నిబద్ధమైన క్రైస్తవమతాన్ని, దాన్ని ప్రజలపై విధించే మతవ్యవస్థను తన రచనల్లో తీవ్రంగా విమర్శించాడు, హేళన చేశాడు. అతని విమర్శకు లోగడవలె కాథలిక్, ప్రొటస్టాంట్ అనే విచక్షణ లేదు. రెండు విధాలైన క్రైస్తవమతాన్ని అది నిర్దిష్టమైన నియమ నిబంధనలతో కూడినవి కనుక సంకుచితమైనవి. వ్యక్తి స్వేచ్ఛకు ప్రతిబంధకాలు అని నిరసించింది. కొంతమేరకు క్వాకర్ (Quaker) అనే ఒక నూతన క్రైస్తవ సిద్ధాంతాన్ని మాత్రం అతడు సమర్ధించాడు. ఈ సిద్ధాంతం కాథలిక్, ప్రొటస్టాంట్ విభేదాలు పాటించడాన్ని నిరసించి, యదార్థమైన క్రైస్తవతత్త్వం ఈ రెండింటిలోను లేదని, బైబిల్ ఎవరికి వారే చదివి, వారి వారి అవగాహనను అనుసరించి, మానవ స్వభావాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన సిద్ధాంతాలను మాత్రం ఎవరికి వారే గ్రహించి అనుసరించాలని బోధించింది. కనుక వోల్టైర్ దానిపట్ల సానుభూతిని ప్రదర్శించాడు.

దైవసంబంధమైన మతాన్ని, మతవ్యవస్థ ఆధిపత్యాన్ని నిర్మొహమాటంగా ఖండించిన వోల్టైర్ ప్రభువర్గాన్ని వారి ప్రత్యేక హోదాలు, అధికారాల్లోని అసహజత్వము, దుర్మార్గాలను మరింత ఉద్వేగంతో ఖండించాడు. వ్యక్తి అభివృద్ధికి మానసికమైన ఎదుగుదలకు నాటి సాంఘిక, ఆర్థిక, అసమానతలు ఎంతటి అవరోధాలో ఎత్తిచూపుతూ వాటిపై తన విమర్శనాస్త్రాలను సంధించాడు. అయితే వోల్టైర్ స్వేచ్ఛ పేరిట విశృంఖలత్వాన్ని ప్రజాఉద్యమాల పేరుతో అరాచకత్వాన్ని మాత్రం ఎన్నడూ సహించలేదు. అంతేకాక ఇతనికి ప్రజాస్వామిక ప్రభుత్వ విధానాల పట్ల ఏమాత్రం ఆసక్తి, సానుభూతిలేవు. ఉదారవాదులైన నిరపేక్ష పరిపాలకులే సమాజానికి సంపూర్ణమైన శాంతిభద్రతలు, వ్యక్తిస్వేచ్ఛాసమానత్వాలు ఇయ్యగలరని ఇతని ప్రగాఢ విశ్వాసం. అయితే ఆనాటి నిరపేక్ష రాచరికం అటువంటి ఉద్దేశ్యాలు కలిగింది కాదని అతనికి తెలుసు కనుక, వారిలో మార్పు రావాలని, వారి అధికారం ప్రజల ఆర్థిక, సాంస్కృతిక రాజకీయ పురోగమనానికి అనుకూలంగా, కేవలం శాంతిభద్రతల పరిరక్షణకు పరిమితం కావాలని వాంఛించాడు. దేశ ప్రజానీకం చైతన్యవంతమై తమనుతామే క్రమశిక్షణ, నైతికమైన సత్ప్రవర్తన అలవరచుకొనాలని, అటువంటి ప్రజానీకం సుఖశాంతులతో జీవించగల పరిపాలనా వ్యవస్థను ప్రాజ్ఞ నిరంకుశులే ఏర్పరచగలరని వోల్టైర్ విశ్వసించాడు. "నూరు ఎలుకలు పరిపాలించడం కంటే ఒక సింహం పరిపాలించడం శ్రేయస్కరం" అని ఇతడు తరచు ప్రజాస్వామిక ప్రభుత్వాలను హేళనచేస్తూ, అనేవాడు.

### 3.4.2.2. రూసో :

1789 నాటి ఫ్రెంచి మేధావుల్లో సమాజాన్ని ప్రభావితం చేసిన తత్త్వవేత్తల్లో అగ్రగణ్యుడు వోల్టైర్ అయినా అత్యంత ప్రజాదరణ పొందినవాడు జాన్‌జాక్విస్ రూసో (Jean Jaques Rousseau). ఫ్రెంచి విప్లవానికి కారణమైన సామాజిక సిద్ధాంతాలను ప్రతిపాదించడమేకాక, అవి ప్రజలను ఉద్రేకపరచి పురికొల్పడానికి కూడా ఇతడు ప్రధాన కారకుడు. ఆ సిద్ధాంతాలు నిర్ధారితమైన చారిత్రక సత్యాలపూ కాక, ఉద్వేగపూరితమైన భావచేతనావాదం (Romanticism) పై ఆధారపడి అందుకు అవసరమైన ఊహాజనితమైన తర్కం కలిగినవి కనుక, అవి ప్రజలను ఆలోచించే అవసరం లేకుండా సరాసరి సంఘర్షణకు నడిపించాయి. వోల్టైర్, ప్రజల్లో విజ్ఞత, ఆలోచన పెరగాలని, వాటివలన వారు తమంతట తామే నైతిక, ధార్మిక ప్రవర్తన అవలంభించాలని ప్రతిపాదించాడు. కాని అటువంటి పరిణామం శాశ్వతఫలితాలనిచ్చేది అయినా, సుదీర్ఘకాలంలో మాత్రమే సాధ్యం అవుతుంది. కాని రూసో, ప్రజల తరపున తానే ఆలోచించి, ఆ ఆలోచనలకు ఉద్వేగాన్ని జతచేసి, నేరుగా రంగంలో దింపాడు. దీనివలన ఫ్రెంచివిప్లవగమనంలో అనేక అవాంఛనీయ, అమానుష పరిణామాలు, అల్లకల్లోలాలు ఏర్పడ్డాయి.

"రూసో అసంబద్ధ వ్యక్తిత్వం కలిగి, తాను ఏది కాకూడదో, అదే అయినాడని" సుప్రసిద్ధ చరిత్రకారుడు కారల్‌టన్ హేజ్ అభిప్రాయం. ఆతడు సైనికునిగా, ఉపాధ్యాయునిగా, సెక్రటరీగా, సంగీతకారునిగా ఇలా అనేక అవతారాలు ఎత్తి, అన్ని రంగాల్లోను విఫలమైనాడు. అతని అవినీతి, వ్యసనాలు, నిజాయితీ లేకపోవడం ప్రసిద్ధమైనవి. జీవితమంతా అసంతృప్తితో గడిపిన రూసో సమాజం మీద వ్యక్తుల మనస్తత్వము, ప్రవర్తనల మీద అసహనాన్ని పెంచుకున్నాడు. దీనంతటికి వ్యవస్థలోని లోపాలు కారణమని నిర్ణయానికి వచ్చాడు. అమెరికా ఖండంలోని ఆదిమవాసుల జీవనవిధానంలో సమానత్వము, స్వేచ్ఛ, వాటికి భంగం కాని విధంగా వారు అనుసరించే కట్టుబాట్లు ఇతనికి బాగా నచ్చాయి. వాటి ఆధారంగా, తన అనుభవసారమూ, కొంత తార్కికమైన కల్పన జోడించి ఇతడు ఆనాటి సమాజాన్ని సంస్కరించుకునేందుకు సిద్ధాంతాలను రూపొందించాడు. జీవితంలో విఫలుడైనా, తన సిద్ధాంతాల ప్రచారంవల్ల అపారమైన కీర్తి పొంది సాధారణ ప్రజానీకానికి ఆరాధ్యుడైనాడు.

రూసో ప్రకృతి ఆరాధకుడు, అనేక మేధావులు ప్రకృతిని అధ్యయనం చేస్తున్న కాలంలో ఇతడు ప్రకృతిని ఆరాధించడం ఒక విశేషం. ఆనాటి మేధావులు మనో వైజ్ఞానిక వికాసాన్ని గురించిన ఉద్వేగాన్ని నిరాకరించిన కాలంలో ఇతడు ఉద్వేగ పూరితమైన ప్రజాస్వామాన్యం సిద్ధాంతాలను రూపొందించి ముందుంచాడు. ఇతనిలో కవితాహృదయం ఉంది, అందువల్లనే ప్రకృతి ఆరాధకుడై గణితశాస్త్రంలోని చిక్కు సమస్యలను పరిష్కరించడంలో ఎంత ఆనందం ఉందో సూర్యోదయ సమయంలో ప్రకృతిని

అనుభవించడంలోనూ ఆనందం ఉందని భావించేవాడు. ఈ కవిహృదయంతో చేసిన కల్పనలే అతని భావచేతనావాదానికి పునాది వేశాయి.

ప్రకృతి ఆరాధకుడు కావడాన ప్రకృతి సిద్ధమైన మానవ స్వభావం అతనికి పరమప్రమాణం. సమకాలీనులైన హాబ్స్, లాక్ వలె రూసో దృష్టిలో "ప్రాకృతిక మానవుడు" (Natural Man) క్రూరుడు, కట్టుబాట్లు లేని పశుప్రాయుడు కాదు, విశ్వసించదగినవాడు, గుణవంతుడు. అతడు "ఉదాత్త అనాగరికుడు" (Noble Savage) అమెరికా ఖండంలో నివసిస్తున్న ఆదిమతెగల మానవులు అటువంటి ప్రాకృతిక మానవుని సంతతి. ప్రాకృతిక మానవసమాజాలే, నేటి నాగరిక మానవ సమాజాలకు పునాదులు - అని రూసో విశ్వాసం. 1749లో అతడు మొట్టమొదట ప్రచురించిన గ్రంథం "డిస్కోరెస్ ఆన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్" లో అతడు ప్రాకృతిక మానవుల నైసర్గికమైన, ఆంతరంగికమైన మంచితనాన్ని ప్రస్తుతించి, అటువంటి స్థితినుండి కృత్రిమత్వాన్ని దుర్మార్గాన్ని అలవరచుకొని మానవజాతి పతనమైందని తన సిద్ధాంతాన్ని ప్రకటించాడు. మానవుడు తిరిగి సుఖశాంతులతో, స్వేచ్ఛ సమానత్వాలతో జీవించడానికి ప్రాకృతికస్థితి (State of Nature) కి మరలిపోవడం తప్ప మరోమార్గం లేదని నిర్ధారించాడు. ఆ సమాజంలో హెచ్చుతగ్గులు ఉండవు. ఎవడూ భగవంతుడిచ్చిన భూమిని తన స్వంతమని వాదించడు. అనగా వ్యక్తిగతమైన ఆస్తి ఉండదు. యుద్ధభయాలు, మారణహోమాలు ఉండవు. పన్నులు విధించి, పీడించి వసూలు చేసే ప్రభుత్వాలు ఉండవు, స్వేచ్ఛను అరికట్టే కట్టుబాట్లు, న్యాయసూత్రాలు, వాటిని అమలుచేసే వ్యవస్థలు ఉండవు. మేధావులమంటూ ప్రజలను మోసగించే తత్త్వవేత్తలుండరు.

క్రొత్త భావాలను అత్యంతాసక్తితో ఆహ్వానించి ఆదరించే కాలంలో రూసో సిద్ధాంతాలకు అధిక ప్రజామోదం లభించింది. కాని ప్రాకృతిక సమాజం అతడు వర్ణించినట్లు స్వర్గతుల్యంగా ఉందని భావించడం పూర్తిగా హేతుబద్ధం కాదు. హాబ్స్, లాక్ వర్ణించినట్లు ప్రాకృత మానవుడు క్రూరుడు, కట్టుబాట్లులేని, కరుణలేని కర్కోటకుడు కూడ కాడు. బ్రిటన్‌లో జరిగిన విప్లవాల్లోని కల్లోల పరిస్థితులు, వాటి తరువాత ఏర్పడ్డ అరాచకం వారిరువురిని అటువంటి అభిప్రాయాలకు నడిపించింది. నిరపేక్ష రాచరికమే మృగతుల్యుడైన మానవుణ్ణి శాసించి, శిక్షించి, సత్ప్రవర్తన అలవరిచే సాధనంగా వారు భావించారు. కనుక వారి దృష్టిలో ప్రాకృతిక సమాజంలోని మానవజీవితం హింసాయుతము, అసహ్యమైన అనాగరికతలతో కూడింది. అలాగే రూసో వర్ణించిన ప్రాకృతిక సమాజం సమకాలీనమైన నియంతృత్వము, అసమానతలతో కూడిన సాంఘిక వ్యవస్థ, స్వేచ్ఛను హరించే పరిపాలన, మొదలైన వాటివలన ప్రభావితమై స్వర్గతుల్యంగా అతని కంటికి కానవచ్చింది. ఈ రెండు విధాలైన వర్ణనలు వారి మనోభావాలకు, కల్పనా చాతుర్యానికి ఉదాహరణలే, కానీ ఏదీ సంపూర్ణ సత్యం కాదు.

రూసో 1753లో ప్రకటించిన "ఆరిజిన్ ఆఫ్ ఇనీక్వాలిటీ ఎమాంగ్ మెన్" (Origin of Inequality among men) అనే గ్రంథంలో తన భావాలను, సిద్ధాంతాలను మరింత విపులంగా వివరించాడు. "ఉదాత్త అనాగరికుల్లో" అహంభావం, ధనకాంక్ష, స్వార్థము ప్రవేశించాయని, వాటివలన బలవంతులు బలహీనులను అణచివేసి, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, వ్యక్తిగతమైన సొత్తును ఆక్రమించుకొన్నారని అతని వివరణ అప్పుడు బలవంతులు తమ సొత్తును, ఆస్తిపాస్తులను కట్టుదిట్టంగా పదిలపరుచుకొన్నారు. ప్రభుత్వం వారికి అన్ని విధాల సహాయసహకారాలను అందించింది. ఈ వివరణలో అతడు ప్రాకృతిక సమాజంలోని మానవులు సర్వసమానత్వంతో జీవిస్తూనే, స్వార్థపరత్వము, అహంకారం ఎలా అలవరచుకున్నారో సక్రమంగా వివరించలేకపోయాడు. అందువలన రూసో సిద్ధాంతాల్లో "శాస్త్రీయ నిబద్ధత" లోపించిందని హేస్ సకారణంగా వ్యాఖ్యానించాడు.

రూసో పేరుప్రఖ్యాతులు అతని 1761లో "సోషల్ కాంట్రాక్ట్" గ్రంథం ప్రకటించడంతో పరాకాష్టకు చేరుకొన్నాయి. ప్రాకృతిక సమాజాలు తమ రక్షణ, అంతర్గత శాంతిభద్రతల నిర్వహణ కొరకు, తమంతట తాము, చేసుకున్న ఒప్పందం మేరకు పరిపాలనా వ్యవస్థ ఏర్పడిందని, పరిపాలనా వ్యవస్థలు కాలక్రమేణా తమ అవధులు దాటిన అధికారంతో ప్రజల స్వేచ్ఛను హరించివేసి వారిలోని విభేదాలను, అసమానతలను మరింతగా వృద్ధిచేసి, బలవంతుల పక్షాన చేరాయని, ప్రభుత్వాల నియంతృత్వాన్ని

నిర్మూలించడానికి ప్రజానీకం తాము లోగడ చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకొనక తప్పదని, రూసో గ్రంథంలో వివరించాడు. ప్రజల ఒప్పందమే ప్రభుత్వ వ్యవస్థకు పునాదిగా భావించడంలో మాత్రం రూసో ఇదేవిధమైన సిద్ధాంతాన్ని ప్రవచించిన లాక్‌తో ఏకీభవించాడు. లాక్‌వలెనే ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి, లేదా తిరిగి మరొక ఒప్పందం చేసుకోవడానికి ప్రజలకే అధికారముందని రూసో కూడ భావించాడు. అనగా రాజ్యాల సర్వసత్తాక సార్వభౌమాధికారము (Sovereignty) ప్రభుత్వపరంగా కాక, ప్రజలపరంగా ఉంటుందని, ప్రజలు తమ అవసరాలమేరకు ప్రభుత్వ వ్యవస్థలను నియమించుకోవచ్చు, తొలగించుకోవచ్చు లేదా సంస్కరించుకోవచ్చు. ఈ విధమైన ప్రజాసార్వభౌమాధికార సిద్ధాంతం (Popular Sovereignty) ఫ్రెంచి విప్లవ కాలంలో ప్రాచుర్యంలోనికి వచ్చింది. ఫ్రెంచి ప్రజలను ఆవేశపూరితులను చేసి, విప్లవోన్ముఖంగా నడిపించింది.

లోగడవలె ప్రభుత్వ వ్యవస్థ మరల మితిమీరిన అధికారం చేజిక్కించుకొని, ప్రజాకంటకం కాకుండడానికి ప్రజలు తగు జాగ్రత్త తీసుకొనవలసి ఉంటుంది. అందుకు అవసరమైన ప్రాపంచిక, తార్కిక, విజ్ఞానం వారికి ఉన్నప్పుడే తమ హక్కులను, గుర్తించగలిగి, ప్రభుత్వాల నియంతృత్వాన్ని అరికట్టగలరు. అంతేకాక బహుముఖమైన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సమాజాల మనుగడకు, ఆర్థికాభివృద్ధికి అవసరం. ఐతే, అందరికి ఒకే విధమైన శాస్త్రంపైన, విద్యపైన, ఆసక్తి ఉండదు. అందుకై, విజ్ఞానదాయకమైన విద్యను అభ్యసించే అవకాశం కూడ అంతే అవసరం. ఈ విషయాన్ని వివరిస్తూ రూసో విద్యాభ్యాసం విద్యార్థుల ఇష్టాఇష్టాలపై ఆధారపడాలని, తమకు ఆసక్తికరమైన విద్యను, అభ్యసించే స్వేచ్ఛ విద్యార్థులకు ఉండి తీరాలని వివరించాడు, అంతేకాని తల్లిదండ్రులు కాని, ప్రభుత్వ వ్యవస్థ కాని ఒత్తిడిచేసి, బలవంతంగా వారిచేత ఇష్టంలేని చదువులు చదివించరాదని ఎమిలీ (Emile) అనే నవలలో హితబోధ చేశాడు.

ఐరోపాలోని అనేక సమకాలీన దేశాల్లో సైతం రూసో ప్రభావం విస్తృతంగా వ్యాపించింది. బ్రిటిష్ తత్త్వవేత్తలు హ్యూమ్, థామస్ పైన్, రూసోను ఆరాధించి, అతని ఆలోచనలను తమ తాత్త్విక సిద్ధాంతాల్లో ఉపయోగించుకున్నారు. జర్మన్ తత్త్వవేత్త ఇమ్మాన్యుయేల్ కాంట్ రూసో సిద్ధాంతాలనే తన ఆదర్శవాదం (Idealism) లో నిక్షేపించి ప్రచారం చేశాడు. ఫ్రెంచి విప్లవ కాలంలో రూసో ప్రతిపాదించిన మూడు ఆదర్శాలు - స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాత్రము దేశమంతట ప్రతిధ్వనించి, ప్రజాసార్వభౌమాధికారం విప్లవకారుల ఉత్తేజానికి కారణమైంది. సద్గుణసంపన్నమైన ప్రజాపాలనా వ్యవస్థను (Republic of viature) స్థాపన విప్లవకారుల లక్ష్యమై ఉన్నత వర్గాల అధికారాలను, మతవ్యవస్థ ఆధిపత్యాన్ని నిర్మూలించడం వారి కర్తవ్యమై ఏర్పడడం జరిగింది.

### 3.4.2.3 మాంటెస్క్యూ (1689 - 1755) :

1789 ఫ్రెంచి విప్లవ సమయంలో, ప్రజానీకానికి, వైజ్ఞానికంగా నాయకత్వం వహించిన మేధావుల్లో మరొక ప్రముఖుడు మాంటెస్క్యూ (Montesquieu) అతడు రూసో వలె భావకుడు, ప్రకృతి ఆరాధకుడు కాడు. సామాజిక సంస్కరణ నుంచి రాజకీయ సంస్కరణ మార్గం వేసినవాడు కాడు. మాంటిస్క్యూ ప్రధానంగా న్యాయశాస్త్ర కోవిదుడు. చరిత్ర చక్కగా అధ్యయనం చేసినవాడు. ఉద్వేగాలకు, ఉద్రేకాలకు లోను కాని తార్కిక చింతన కలవాడు. అతడు ప్రధానంగా ప్రభుత్వాధికారులకు, వాటి ప్రయోగానికి ఉన్న న్యాయనిబద్ధతను విశ్లేషించి, నియంతృత్వాధిపత్యానికి కారణాలను, దాని నిర్మూలనకు మార్గాలను ప్రతిపాదించాడు. 1748లో అతడు రచించిన ది స్పిరిట్ ఆఫ్ లాస్ (Espirit des Lois) అనే గ్రంథం ఆనాటి ఫ్రెంచిప్రభుత్వ నియంతృత్వాన్ని సమకాలీన బ్రిటీష్ ప్రభుత్వంతో తులనాత్మకంగా అధ్యయనం చేసి వ్యత్యాసాలను విశదీకరించింది. బ్రిటన్‌లో రాచరికం రాజ్యాంగబద్ధం కనుక, అది నిరపేక్షాధికారంతో ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించదని, అదేవిధంగా ఫ్రాన్సులో సైతం ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైతేనే నియంతృత్వం తొలగి పోతుందని ఇతడు భావించాడు. రాజ్యాంగబద్ధ ప్రభుత్వంలో శాసననిర్మాణాధికారం, పరిపాలనాధికారం, న్యాయపాలన ప్రత్యేకించి ఉంటాయని ఇతని విశ్లేషణ. ఈ కారణాన నిరపేక్షపరిపాలకుల మాట శాసనం అయి, అదే ప్రజలపై అమలుపరుచబడి, దాని ప్రకారమే న్యాయవ్యవస్థ నడుచుకుంటుందని, ఈ కారణాన

ప్రజల స్వేచ్ఛాసమానత్వాలకు రక్షణ లేదని ఇతడు వివరించాడు. కాగా ఇతని గ్రంథం "ది స్పిరిట్ ఆఫ్ లాస్" ఈ మూడు ప్రభుత్వాంగాలు విడివిడిగా ఉండటం వలన రాచరికనియంతృత్వాన్ని అరికట్టవచ్చునని సిద్ధాంతీకరించింది.

అయితే మాంటెస్క్యూ సిద్ధాంతం కేవలం ఫ్రెంచి, బ్రిటిష్ ప్రభుత్వాల బాహ్యలక్షణాలను మాత్రమే సరిపోల్చి నిర్ధారించినట్టిది. అప్పటికి బ్రిటన్‌లో ప్రజాప్రతినిధులతో కూడిన పార్లమెంట్ కామన్స్ సభ ఏర్పడ్డ విషయము, శాసన నిర్మాణంలో 'పార్లమెంటుకే సంపూర్ణాధికారం ఏర్పడి, రాచరికానికి అందులో ఏ ప్రమేయం లేకపోవడమూ వాస్తవాలే. అయితే, ఈ ఫలితాలు ప్రజా ఉద్యమాలుగా కాక, ప్రభువర్గము క్రమక్రమంగా రాచరిక నియంతృత్వాన్ని అణచి, తమ ప్రాబల్యం పెంచుకోవడానికి చేసిన ఫలితం. అందులో వివిధ దశల్లో ప్రభువర్గానికి, రాచరికానికి ఏర్పడ్డ ఒప్పందాలు లిఖిత పూర్వంకాకున్నా, ఉభయ వర్గాలు వాటికి కట్టుబడి అమలుచేయడంలో, అవి బలమైన సాంప్రదాయాలుగా ఏర్పడ్డాయి. ఈ ఒప్పందాల్లో ఉభయవర్గాలు పరస్పరం తమ ప్రాబల్యం మితిమీరకుండ, తద్వారా క్రమంగా ప్రజాస్వామికవ్యవస్థలు ఏర్పడడానికి దోహదం చేశాయి. కాని మాంటెస్క్యూ ఈ పరిణామాల ప్రాధాన్యతను సరిగా అంచనా వేయలేదు. కనుక అతని తార్కిక సిద్ధాంతంలో తర్కమే కాని సత్యం లోపించింది. అయినప్పటికి, ఫ్రెంచి విప్లవంలో అతని సిద్ధాంతం ప్రబలమైన ప్రభావాన్నే చూపింది. మొదట రాజ్యాంగబద్ధరాచరికాన్ని (Constitutional Monarchy) నెలకొల్పి రాజు అధికారాలను పరిమితం చేయాలనే ఉద్దేశ్యంతో విప్లవకారులు చేసిన ప్రయత్నాలు మాంటెస్క్యూ ప్రభావ ఫలితమేనని నిస్సందేహముగా చెప్పవచ్చు. అయితే కేవలం తార్కికమైన ఈ సిద్ధాంతం ఆచరణలో అసాధ్యం అయినది. ఒక్కసారిగా రాజు తన అధికారాలు పరిమితం కావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. దాని ఫలితంగా అతడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమూ, అందువలన తన పదవిని, తుదకు ప్రాణాన్ని పోగొట్టుకోవడమూ జరిగింది.

### 3.4.2.4 1789 నాటి విప్లవ కాలంలోని మరికొందరు మేధావులు :

పైన పేర్కొన్నవారు కాక 1789 విప్లవకాలంలో మరికొందరు మేధావులు తమ రచనల ద్వారా ప్రజానీకంలో నూతన భావాలను, ఆలోచనలను రేకెత్తించారు. వారిని రెండు వర్గాలుగా (Groups) చరిత్రకారులు గుర్తిస్తారు. మొదటివర్గం విజ్ఞాన సర్వస్వ రచయితలు (Encylopaedists) రెండోవర్గం ఆర్థిక రాజ్యవేత్తలు (Physiocrats).

1751 నుండి 1765 వరకు ఫ్రాన్సులోని పలువురు ప్రసిద్ధులైన విద్వాంసులు, తత్త్వవేత్తలు ఆనాటివరకు అభివృద్ధి చెందిన అన్ని శాస్త్రాలకు సంబంధించిన సమస్త విజ్ఞానాన్ని సిద్ధాంతాలను, తాత్త్విక దృక్పథాలను పొందుపరచిన విజ్ఞాన సర్వస్వం (Encyclopaedia) 28 సంపుటాల్లో ప్రకటించారు. సహజంగానే విజ్ఞానోద్దీప్తయుగంగా ప్రఖ్యాతి చెందిన ఆకాలంలో, అనేక శాస్త్రశాఖలకు చెందిన పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దానికి సంపాదకుడైన డిడిరో (Diderot), దాలెంబర్ట్ (D'Alembert) సహ రచయితలైన రూసో, వోల్టైర్, టర్గో మిరాబూ మొదలైన వారు సాంప్రదాయక వ్యవస్థలను సిద్ధాంతాలను, విమర్శిస్తూ తమ రచనల ద్వారా మతవ్యవస్థను, నిరపేక్షరాజ్యవ్యవస్థను నిశితంగా విమర్శించారు. జాతీయరాజ్యవ్యవస్థ దానిలో స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాత్రాల ప్రాతిపదికపై ఏర్పడవలసిన ప్రజాపాలనా విధానము, మొదలైన అనేక అంశాలను గూర్చిన వ్యాసాలు ఈ విజ్ఞానసర్వస్వంలో చేరినాయి.

రెండోవర్గం ఆర్థికరాజ్యవేత్తలు కూడ విజ్ఞానసర్వస్వంలో వ్యాసాలు వ్రాసినవారే. అయితే వీరు మతవ్యవస్థ, రాజ్యవ్యవస్థలు పునర్నిర్మాణం ఆర్థిక వ్యవస్థను సంస్కరించనిదే సాధ్యంకాదని దృఢంగా విశ్వసించనవారు. అందుచేత వారి వ్యాసాలు విస్తారంగా సంపద ఉత్పత్తి, పంపిణీ, దేశీయ, అంతర్దేశీయ వాణిజ్యం మొదలైన విషయాలపై ఎక్కువ శ్రద్ధచూపాయి. స్థూలంగా వారి సిద్ధాంతం - దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం మూలం; వ్యావసాయికాభివృద్ధి భూస్వామ్యవ్యవస్థను, ప్రభువర్గ ఆధిపత్యాన్ని తొలగించనిదే సాధ్యంకావు. వ్యావసాయకోత్పత్తులను అభివృద్ధిచేయడం పారిశ్రామిక, వర్తకవాణిజ్యాల అభివృద్ధికి కూడ అవసరం. వ్యవసాయమే నిజమైన ఉత్పత్తి, పిడికెడు గింజలు నాటితే అవి రాసుల ధనాన్ని పండిస్తాయి. వర్తకవాణిజ్యాలు సంపద పెంచవచ్చు. కాని ఐశ్వర్యాన్ని పెంచవు అనగా కేవలం ధనరాశులను క్రుమ్మరిస్తాయికాని అవసరాలు తీర్చే ఆహారధాన్యాలను, వస్తువులను

ఇయ్యవు. కనుక వ్యావసాయకాభివృద్ధిలోనే దేశసౌభాగ్యం ఇమిడిఉందని వారి సిద్ధాంతం. వీరు కూడ ఆనాటి నాగరికతలోని కృత్రిమత్వాన్ని నిరసించి, ప్రకృతిసిద్ధమైన స్వభావంతో మానవసమాజాలు స్నేహసహకారాలతో ప్రశాంతంగా జీవించగలిగే "ప్రాకృతిక వ్యవస్థ" (Natural Order) ను పునరుద్ధరించడం గూర్చి విస్తారంగా రచించారు. మానవుని మానసిక, వైజ్ఞానిక అభివృద్ధికి అవరోధంగా ఉన్న అన్ని విధాలైన నియమనిబంధలను తొలగించడం "లైజ్‌ఫైర్" ను నెలకొల్పడం వీరి వాదం.

## 3.4.2.5 1789 నాటి ఫ్రెంచి విప్లవంలో మేధావుల పాత్ర - విమర్శ :

పై పరిశీలన ఫ్రెంచి విప్లవం ప్రజ్వరిల్లడానికి ఆనాటి మేధావులు తమ సిద్ధాంతాలను ప్రకటిస్తూ రచించిన గ్రంథాలు ప్రధానంగా కారణమైనట్టు కానవస్తుంది. అందులో కొంతసత్యం ఉన్నమాట వాస్తవము, అందుచేత పలువురు గ్రంథ రచయితలు ఫ్రెంచి విప్లవానికి భావవిప్లవం ప్రధాన కారణమని భావిస్తారు. కాని నాటి మేధావులు, తాత్త్వికులు ఎవరూ ప్రత్యక్షంగా లేదా సూటిగా ప్రజలను తిరుగుబాటు చేయమని బోధించలేదు. కనుక వారి రచనల వల్ల విప్లవం సంభవించిందని చెప్పడం సహేతుకం కాదు. మేధావుల గ్రంథాలు విద్యావంతులలోనే ప్రచారమైనాయి. వాటిని చదివి ప్రభావితులైనవారు వారి తాత్త్విక సిద్ధాంతాల గూర్చి ఆలోచించారు. అవి వారిలో చర్చనీయాంశాలైనాయి. కాని ఆనాటికి ఫ్రాన్సుదేశంలో తొంబది శాతం గ్రామీణులైన జనసామాన్యం. వారు అధిక విద్యావంతులు కానివారు, విప్లవాలు అటువంటి జనసామాన్యం నుండి ఉద్భవిస్తాయి కాని విద్యావంతుల నుండి కాదు. కనుక విద్యావంతులైనవారు జనసామాన్యానికి నాయకత్వం వహించారు, నడిపించారు.

1789 లో ఫ్రెంచి విప్లవ ప్రారంభము,, గమనము జాగ్రత్తగా పరిశీలించినట్టయితే, ఈ అంశం స్పష్టంగా బోధపడగలదు. ఆర్థిక సంక్షోభాన్ని నివారించేందుకు ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరచి, తీసుకోవలసిన చర్యలను గూర్చి సమగ్రంగా చర్చించడం అవసరమని పదునారో లూయీ 1788 లో నిర్ణయించుకొని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి నెకర్‌ను తిరిగి పదవిలో నియమించాడు. ఎస్టేట్స్ జనరల్ సమావేశం అప్పటికి 175 సంవత్సరాల క్రిందట జరిగింది. అందలి సభ్యులెవరో, వారి సంతతివారెవరో, అసలు దాని సభ్యత్వం వంశపారంపర్యమా అనే విషయాలపై 1788 లోనే ప్రశ్నలు తలెత్తాయి. అటువంటి సంశయాస్పదపరిస్థితిలో అందరి సభ్యులను తిరిగి ఎన్నుకోవడం సులువైన, ఉచితమైన చర్యగా నెకర్ భావించాడు. అయితే, ఈ సందర్భంగా అతడు కొంత అసామాన్యమైన విజ్ఞత కనపరచాడు. పూర్వపు ఎస్టేట్స్ జనరల్ కేవలం ప్రభువర్గం, మతాధిపతులకు చెందిన ప్రతినిధులను మాత్రమే కలిగివుంది. అప్పటికి విద్యా వైజ్ఞానిక రంగాల్లోను, ఆర్థికంగాను ప్రబలమైన మధ్యతరగతి ఉత్పన్నం కాలేదు. సాధారణ ప్రజానీకం కేవలం చాకిరిచేసే అప్రధానమైన వర్గం. అదేవిధంగా సభ్యులను ఎన్నుకొని ఎస్టేట్స్ జనరల్‌ను ఏర్పరిస్తే మధ్యతరగతి మేధావులకు, ప్రజాబాహుళ్యానికి ఏ విధమైన ప్రాధాన్యత ఏర్పడదు, అందువలన ఏ ప్రయోజనమూ నెరవేరదు. అందుకై నెకర్ మధ్యతరగతి, అనగా తృతీయవర్గంగా భావించబడే ప్రజాబాహుళ్యానికి కూడ ఎస్టేట్స్ జనరల్‌లో ప్రాతినిధ్యం ఏర్పరచాలని, అంతేకాక, వారి ప్రాతినిధ్యం ప్రభువులు, మతాధిపతుల, అనగా ప్రథమ, ద్వితీయ వర్గాల ప్రాతినిధ్యం కంటే రెట్టింపు ఉండాలని యోచించి, ఎన్నికలు జరిపించాడు.

ఈ విధంగా 175 సంవత్సరాల తరువాత ఎస్టేట్స్ జనరల్ సమావేశమూ, అందులో అంతకు ముందెన్నడూ లేనివిధంగా తృతీయ వర్గానికి ప్రాతినిధ్యము, యథార్థంగా విప్లవాత్మక పరిణామాలు. తరువాత క్రమంగా మరిన్ని విప్లవాత్మక పరిణామాలకు అవి ప్రాతిపదిక అయినాయి. తృతీయ వర్గంలో చేరిన వారే అయినా మధ్యతరగతి వలె నూతన భావాలు, తాత్త్విక దృక్పథాలు కలిగినవారు ప్రభువర్గంలోను, మతాధిపతుల్లోను కూడ చెప్పదగినంత సంఖ్యలో ఉన్నారు. వాస్తవంగా ఆ వర్గాల్లోని తక్కువస్థాయికి చెందినవారు సాధారణ కర్షకుల కంటే ఆర్థికంగా ఏమంత ఉన్నతస్థితికి చెందినవారు కారు. వారికి స్వాధికార హోదాలు, హక్కుల్లో ఏమంత ఆసక్తిలేదు, నిత్యజీవితంలో సాధారణ ప్రజానీకంతో కలసిమెలసి జీవించేవారు, కనుక తృతీయవర్గం యొక్క ఆశలు, ఆకాంక్షలతో పూర్తి సానుభూతి కలిగి, సహకరించడంతో మేధావుల వాదనలకు, తృతీయవర్గం వారి ఆశయాలకు బలం చేకూరింది.

విద్యావంతులైనవారు మేధావుల రచనలతో ప్రభావితులై, దేశ సాంఘిక, రాజకీయ వ్యవస్థలను సంస్కరించి పునర్నిర్మించదలచారే కాని, వాటిని సమూలంగా పెకలించివేయడానికి పూనుకోలేదు. కాని సాంప్రదాయకవాదులైన ప్రభువర్గము, మతాధిపతి వర్గము, నిరపేక్ష రాచరికము వారిపట్ల సానుభూతి చూపలేదు, సహకరించలేదు. సాధారణ ప్రజానీకం తృతీయవర్గంలోని విద్యావంతులు, మేధావులపట్ల ఆశలు పెంచుకొని జాతీయ సభ (National Assembly) లో వాదించి, తమ దుస్థితిని తొలగించే సంస్కరణలు చేయగలరని విశ్వసించారు. తృతీయ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు దానికి తగినట్లుగానే, సాంప్రదాయక వ్యవస్థలను సమూలంగా ప్రక్షాళన చేసి, సంస్కరించడానికి పట్టుదల కలిగిఉన్నారు. ఈ విధంగా ప్రథమ, ద్వితీయ వర్గాలకు చెందిన స్వాధికార వర్గము, అస్వాధికార వర్గము తమ తమ ఆశయాలకు కట్టుబడి సంఘర్షణకు దిగిన కొలది, సాధారణ ప్రజానీకంలో అసహనం అతిశయించింది. ఈ సంఘర్షణలు ప్రబలమైనకొలది పరిస్థితి విషమించింది. అంతేకాని 1789 మే 5న ఎస్టేట్స్ జనరల్ సమావేశమైనపుడు విప్లవం గూర్చి ఎవరూ ఆలోచించలేదు. విప్లవం కేవలం విషమించే పరిస్థితుల ఫలితం.

ఆనాటి మేధావులు, తాత్త్వికులు కేవలం సాంప్రదాయకవ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపి, వాటిని నిశితంగా విమర్శించడంలో మాత్రం ఏకాభిప్రాయం కలిగిఉన్నారు. కాని వ్యవస్థలోని లోపాలను సవరించి, సంస్కరించడానికి వారందరూ ఏకాభిప్రాయంతో కూడిన ప్రణాళికనొకటి సూచించలేదు. వారిలో వారికి అనేక భేదాభిప్రాయాలున్నట్లు, వారి సిద్ధాంతాలు, దృక్పథాలు చర్చనీయాంశాలై ఉన్నట్లు గ్రహించవలసి ఉంటుంది.

కాగా, పరిస్థితులు అతి త్వరితంగా విషమించి, విప్లవంగా రూపొందడానికి ప్రధాన కారణం సాధారణ ప్రజానీకంలోని తీవ్ర అసంతృప్తి, వారి జీవితం దుర్భరమై సహనం నశించడం, దానికి తగినట్లు ఆ సమయంలో ఫ్రాన్సు తీవ్రమైన కరువు పరిస్థితిలో చిక్కుకొంది. ప్రజలకు కూడు గుడ్డలు కూడా కరువై అలమటిస్తున్నారు. కాని ప్రభువర్గం వారి గోడు పట్టించుకోకుండా, తమ పదవులు, హోదాలు, అధికారాల గూర్చి మాత్రమే ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి వారిపట్ల ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహాన్ని, అసహనాన్ని కలిగించి విప్లవానికి పురికొల్పింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. 1789లో ఫ్రెంచి విప్లవానికి దారితీసిన కారణాలు ఏమిటి ?
2. ఫ్రాన్స్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి రక్షించడానికి జరిగిన ప్రయత్నాలను చర్చించుము.
3. 1789 ఫ్రెంచి విప్లవానికి దారితీసిన రాజకీయ కారణాలు ఏమిటి ?
4. ఫ్రెంచి విప్లవానికి నాంది పలికిన నూతన భావాలను చర్చించుము ?

**చదువదగిన గ్రంథాలు :**


7. Hayes, G.J.H. : Modern Europe to 1870
8. Hayes, G.J.H. : Contemporary Europe Since 1870
9. Louis Gottashhalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.


రచయిత : **ఆచార్య వి. సుందరరామశాస్త్రి**

పాఠం - 4

# ఫ్రెంచి విప్లవగమనము 1789 - 1795

విషయసూచిక


4.0 లక్ష్యం

4.1 ఉపోద్ఘాతం

4.2 విప్లవంలోని తొలిదశ : ఎస్టేట్స్ జనరల్ (Estates General) సమావేశాలు

4.2.1 జాతీయ సభ (National Assembly) రాజ్యాంగ నిర్ణాయక సభ (Constituent Assembly)

4.2.2 బాస్టిలీ (Bastille) కోట పతనం

4.2.3 పదునారో లూయీ తదుపరి విధానము : నిరపేక్ష రాచరిక పతనము

4.2.4 పారిస్ స్త్రీల ఆకలి యాత్ర

4.2.5 రాజ్యాంగ నిర్మాణం

4.3 విప్లవంలో రెండో దశ : ఫ్రాన్సులో పరిమితరాజరికం

4.3.1 పరిమిత రాచరికం పనితీరు, ఫలితాలు

4.3.2 శాసనసభ స్వరూపస్వభావాలు

4.3.3 పరిమితిరాజరికం : రాజ్యాంగప్రతిష్టంభన

4.4 ఫ్రెంచి విప్లవంలో మూడో దశ : జాతీయ సమితి (National Convention)

4.4.1 దేశంలో కల్లోలపరిస్థితి

4.4.2 జాతీయసమితి ముందున్న సమస్యలు : కార్యక్రమం

4.4.3 జాతీయ సమితి విదేశాంగ విధానం (Foreign Policy)


## 4.0 లక్ష్యం :

ఈ అధ్యాయం ఫ్రెంచివిప్లవం ప్రారంభమైన తీరు. అది ప్రజలు ప్రజానాయకులు ఆవేశపరులు, దూరదృష్టిలేనివారు కావడంవల్ల, రాజైన పదునారవ లూయీ అవివేకంవల్ల అనేక అనర్థదాయకమైన పరిణామాలకు లోనైన తీరు వివరిస్తుంది. ఎస్టేట్స్ జనరల్ సమావేశము, అది జాతీయసభ (National Assembly) గాను, రాజ్యాంగ నిర్ణాయకసభ (Constituent Assembly) గాను ప్రకటించుకొనడమూ, రాజ్యాంగాన్ని నిర్మించి, రాజ్యాంగబద్ధమైన రాజరికాన్ని నెలకొల్పడము, అది విఫలం కావడము, తరువాత జాతీయ సమితికి (National Assembly) జరిగిన అనర్థాలను సరిదిద్దటానికి చేసిన మరిన్ని దారుణాలు, ఈ విధంగా వివిధదశల్లో ఫ్రెంచిరిపబ్లిక్ ఆవిర్భవించిన తీరును వివరిస్తుంది.

## 4.1 ఉపోద్ఘాతం :

పై అధ్యాయాల్లో వివరించినట్లు ఆధునిక యుగం ఫ్రెంచి విప్లవంతో ప్రారంభం అవుతుంది. అంతకు ముందెన్నడూ లేని విధంగా సాధారణ ప్రజానీకం దేశ రాజకీయ, ఆర్థికసమస్యలపట్ల అవగాహన కలిగి, ఆసక్తి పెంచుకొని, వాటి పరిష్కారంతోనే తమ జీవితాలను మెరుగుపరచుకునే అవకాశం ఇమిడి ఉందని గ్రహించడమూ, అందుకై వారు ఒక్కుమ్మడిగా విజృంభించి, సాంప్రదాయక వ్యవస్థలను ఎదిరించడమూ జరిగింది. వారు తమ ఆశలకు, ఆశయాలకు అనుగుణమైన పరిపాలనావిధానాలను

ఏర్పరచుకొనడంలో ఉత్సాహం కలిగి అందుకు అవసరమైన ప్రయోగాలను ప్రారంభించారు. ఆ ప్రయోగాల ఫలితంగా మొదట నిరపేక్షరాచరికానికి మారుగా, రాచరికాన్ని రాజ్యాంగబద్ధంగాచేసి, పరిమితమైన అధికారాలను అనుమతించారు. ఇంగ్లాండులో ఈ విధమైన పరిణామాలు ఏర్పడి, వ్యక్తి స్వేచ్ఛ, సాంఘిక, ఆర్థిక సమానత్వాలకు అవరోధం కానివిధంగా రాచరికం ఆచరణలో ఉండడం వారికి కొంత మార్గదర్శకమైందనవచ్చు. తరువాత రాజ్యాంగబద్ధ రాచరికం ఆశించిన విధంగా పని చేయనందున వారు ప్రజాపరిపాలనవ్యవస్థ (Republic) ను ఏర్పరచుకొన్నారు. ఈ ప్రజాపరిపాలనావ్యవస్థకు పునాది సర్వసత్తాక ప్రజాసార్వభౌమాధికారం (Popular Sovereignty) అనగా దేశము, దేశసంస్కృతి ప్రజలవి; దేశ పరిపాలనాధికారం ప్రజలది; అందుకు అవసరమైన ప్రభుత్వవిధానాలను నెలకొల్పడం లేదా తొలగించడం సంపూర్ణకరంగా వారికే చెందిన అధికారం. దేశ ప్రజానీకం యావత్తు ఎటువంటి తారతమ్యాలు లేని సమానత్వం, సౌభ్రాత్రం కలిగినవారు - ఈ ఆదర్శాలు సర్వసత్తాక ప్రజాసార్వభౌమాధికారంలోని అంతరార్థాలు. ఇవి అంతకు పూర్వంనాటి అసమానతలను, నియంతృత్వ ప్రభుత్వాల పీడనను ధిక్కరించి, తిరస్కరించాయి.

అయితే, పై అధ్యాయాల్లో వివరించినట్లు ఈ విప్లవపరిణామాలు సాంప్రదాయ సంరక్షణ విధానానికి (Conservatism) కట్టుబడి, మూర్ఖమైన పట్టుదలతో, మారుతున్న కాలపరిస్థితులను స్వాధికారవర్గం అనగా ప్రభువులు, మతాధిపతులు గుర్తించకపోవడం వల్లనే ప్రధానంగా రూపుదిద్దుకున్నాయి. అయితే అంతమాత్రాన ప్రభువర్గంలోను, మతాచార్యుల్లోను సాధారణ ప్రజానీకంపట్ల సానుభూతి, ఔదార్యము కలిగినవారు లేనేలేరని భావించరాదు. వీరిలోని దిగువ వర్గాలకు చెందినవారి జీవనశైలి, స్థితిగతులు సాధారణ ప్రజానీకం కంటే ఏమంత అతిశయమైనవికావు. అంతేకాక ఆధునిక విజ్ఞానము, తాత్త్విక సిద్ధాంతాల ప్రభావంతో ఉన్నతస్థాయికి చెందినవారిలో సైతం ప్రజలు ఆశలు, ఆకాంక్షలపట్ల సానుభూతి కలిగినవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు.

అలాగే విప్లవాన్ని ప్రారంభించి, నిర్వహించిన సాధారణప్రజానీకం లేదా తృతీయవర్గం సంపూర్ణంగా నూతనభావాలతో కూడిన రాజకీయచైతన్యం కలిగి, నిరపేక్షరాచరికాన్ని స్వాధికారవర్గాల ప్రాబల్యాన్ని తుదముట్టించే పట్టుదల కలిగిన వారని భావించడం కూడ పొరపాటే. సాధారణప్రజానీకం కేవలం తమకు నాయకత్వం వహిస్తున్న మేధావివర్గాన్ని అనుసరించి, తమ ఆశలను, ఆకాంక్షలను సమర్థించుకున్నారు. అంతేకాని, వారివలె విద్యావైజ్ఞానిక పురోగతి సాధించి, సమిష్టిగా, సమైక్యంగా ఉద్యమించింది కాదు. వారు అత్యధికశాతం విద్యావిహీనులు, విజ్ఞతావివేకాల కంటే ఆవేశం అధికంగా కలిగినవారు. అందుచేత, కాలానుక్రమంగా వారు తమకు వైజ్ఞానికంగా నాయకత్వం వహించే మేధావివర్గాన్ని అధిగమించి, తమ ఆందోళనను విప్లవంగా మార్చివేయగా, వారిపై అదుపు కోల్పోయిన మేధావివర్గం నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది. సాధారణ ప్రజానీకంలోని విప్లవోద్వేగాన్ని విమర్శించడంకాని, వారికి హితవు చెప్పడం కాని తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవడమేనని వారిని ఎదిరించిన రాజు, ప్రభువర్గాలవలె తాముకూడ నాశనం కాగలమని మేధావివర్గం భయపడింది. కనుక విప్లవకారణాల్లో మేధావివర్గం పాత్ర ప్రముఖమే అయినా, విప్లవగమనంలో వారు క్రమంగా వెనుకబడి, ఉద్రేకాలకు ఉద్వేగాలకు లోనైన ప్రజాబాహుళ్యాన్ని ఏ మాత్రము నిర్దేశించి అదుపుచేయలేని వారైనారని గుర్తించవలసి ఉంది.

ప్రజల్లో అటువంటి ఉద్రేకాలు రెచ్చిపోయి, మూర్ఖంగా, విధ్వంసక చర్యలకు పూనుకోవడం, అది అసాంఘిక శక్తులకు విచ్చలవిడి అవకాశం కల్పించడమూ మొదట్లో ఊహించినవి కావు. అవి క్రమంగా ఎస్టేట్స్ జనరల్‌లో జరిగిన సంఘటనల్లో నుండి ఉత్పన్నం అయినవే. ఈ అంశాలను వివరంగా అధ్యయనం చేయబోయే ముందు 175 సంవత్సరాల అనంతరం ఎస్టేట్స్ జనరల్ (Estates General) సమావేశం కావడమే ఒక విప్లవాత్మకమైన అసాధారణ సంఘటన అని గుర్తించడం అవసరం.

## 4.2 విప్లవంలో తొలిదశ : ఎస్టేట్స్ జనరల్ (Estates General) సమావేశం :

పై అధ్యాయంలో 1789 నాటి ఫ్రాన్సు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని, క్రొత్త పన్నులు విధించడమూ, ఆ పన్నులు స్వాధికారవర్గాలపై విధించడం తప్పనిసరికావడమూ పై అధ్యాయంలో వివరించడం జరిగింది. ఆర్థిక వ్యవహారాల్లో సంస్కరణలు కేవలం రాజు మాత్రమే చేయరాదని, అందుకు ఎస్టేట్స్ జనరల్ ఆమోదం అవసరమని పార్లమా ఆఫ్ పారిస్ (Parliament of Paris) స్పష్టపరిచింది. ఆ సమయంలో ఫ్రాన్సుదేశం తీవ్రమైన కరువుకాటక పరిస్థితిలో ప్రజలు అన్నార్తులై అలమటిస్తూ ఉండడం కొంత అత్యవసరపరిస్థితిని సృష్టించింది. పారిస్‌లోను, మరికొన్ని ప్రధాన పట్టణాల్లోను ప్రజలు రెచ్చిపోయి అల్లర్లకు పూనుకున్నారు. ప్రభుత్వం సత్వరమే తమ బాధలను తొలగించే ప్రణాళికతో ముందుకు రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని స్థితిలో పదునారో లూయీ ఎస్టేట్స్ జనరల్ సమావేశానికి ఏర్పాట్లు చేయవలసిందిగా ఆదేశిస్తూ నెకర్‌ను తిరిగి ఆర్థికమంత్రిగా నియమించాడు. 1788 సంవత్సర ద్వితీయార్థంలో ఎన్నికలు జరిగి, ఎస్టేట్స్ జనరల్ సభ్యులు నియమితులైనారు. 1789 మే 5న ఆ సభ వర్సే (Versailles) నగరంలో సమావేశం అయింది.

అయితే 175 సంవత్సరాల తరువాత సమావేశం అయిన ఎస్టేట్స్ జనరల్ వెనుకటి వలె కేవలం ప్రభువులు, మతాచార్యుల ప్రతినిధులతో కూడింది మాత్రమే కాదు. తృతీయ వర్గానికి చెందిన సాధారణ ప్రజానీకం కూడా తమ ప్రతినిధులను ఎన్నుకొని ఆ సమావేశాల్లో పాల్గొనడానికి నెకర్ అవకాశం కల్పించాడు. అంతేకాక, దేశఆర్థిక సంక్షోభాన్ని నివారించేందుకు మౌలికమైన (radical) సంస్కరణలు అవసరమని, స్వాధికారవర్గాలైన ప్రభువులు, మతాచార్యులు సైతం కొంతమేరకు పన్నులు చెల్లించే విధులను ఆమోదించక తప్పదని అతడు నిశ్చితంగా అభిప్రాయపడ్డాడు. కేవలం తమహక్కులు, హోదాల పరిరక్షణ, అనగా సాంప్రదాయ సంరక్షణఎట్ల మాత్రమే ఆసక్తి కలిగిన స్వాధికారవర్గం అందుకు సుముఖంగా ఉండదు, కనుక వారిని లొంగదీయడానికి అవసరమైనంత సంఖ్యాబలం తృతీయవర్గ ప్రతినిధులకు ఉండాలని అతడు యోచించి అదే ప్రకారం ఆ సభను ఏర్పరిచాడు. అతని యోచన ప్రకారం స్వాధికార (Previleged) వర్గాలకు చెందిన మొత్తం ప్రతినిధుల సంఖ్యకు తృతీయవర్గ ప్రతినిధుల సంఖ్య రెట్టింపు ఉంది. కనుక తృతీయవర్గ ప్రతినిధులు తమ సంఖ్యాబలంతో అభ్యుదయకరమైన సంస్కరణలను సుగమం చేయగలరని నెకర్ ఆశించాడు.

నెకర్ చేసిన ఏర్పాట్ల ఫలితంగా ఎస్టేట్స్ మూడు సభలతో ఏర్పడింది. మొదటిసభ (First Estate) ప్రభువర్గప్రతినిధులతో కూడింది. రెండవది (Second Estate) మతాధిపతుల ప్రతినిధులతో కూడింది. ఈ రెండు స్వాధికారవర్గానికి చెందినవి. మూడవసభ (Third Estate) సాధారణప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులతో అస్వాధికారవర్గానికి చెందింది. పై అధ్యాయాల్లో వివరించినట్లు మొదటి, రెండవ సభలు సాంప్రదాయకవాదులు - తమ హోదాలు, ఆధిపత్యాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, దేశ సమస్యలు, సాధారణ ప్రజానీకం అనుభవించే దుస్థితి ఎంతమాత్రమూ పట్టించుకోనివారు; వ్యవస్థలో ఎటువంటి సంస్కరణలు, మార్పులను తీవ్రంగా ప్రతిఘటించేవారు. స్వాధికారవర్గాల పట్ల తీవ్రమైన అసంతృప్తిని కలిగి, వ్యవస్థలో సమూలమైన మార్పులను వాంఛించేవారు తృతీయవర్గానికి అనగా అస్వాధికారవర్గానికి చెందిన ప్రతినిధులు.

అయితే, మొదటి, రెండవ సభల్లో సైతం కొందరు ఉదార భావాలు కలిగిన విజ్ఞానులు లేకపోలేదు. వారు తృతీయవర్గం వారి ఆశలను, ఆకాంక్షలను సానుభూతితో సమర్థించేవారు. వారిలో మిరబూ (Mirabeau) అబీసయీస్ (Abbe Sieyes) థామస్ బైలీ మొదలైనవారు ప్రముఖులు. ఎస్టేట్స్ జనరల్ సమావేశాలు ప్రారంభమైనప్పుడే అబిసయీస్ తృతీయవర్గం అనేది దేశంలోని సర్వప్రజానీకం; ప్రస్తుతం దానిస్థానం శూన్యం, అది తగిన స్థానాన్ని కాంక్షిస్తున్నదనే సారాంశంతో ఒక కరపత్రాన్ని ప్రచురించాడు.

అబీసయీస్ ప్రచురించిన కరపత్రంలో వివరించినట్లు తృతీయవర్గం ప్రభువులు, మతాధిపతులు కాని సమస్త ఫ్రెంచి ప్రజానీకం. అందులో ఉన్నత విద్యావంతులు, మేధావులు ఉన్నారు; వర్తక వాణిజ్యాల్లో సంపన్నులైన వారున్నారు. విద్యావంతులు, సంపన్నులు కాని సన్నకారు రైతులైన భూస్వాములు, వివిధ వృత్తులకు చెందిన పనివారు, మొదలైన అన్ని వర్గాలకు చెందినవారున్నారు. వారిలో స్వల్ప సంఖ్యాకులైనవారు (30 మంది) రూసో రచనలను ఆద్యంతం చదివి జీర్ణించుకున్న తీవ్రవాదులు, మిరబూ వీరిని "ముప్పది గొంతులని" నిరసించేవాడు. వీరిలో రాబిస్పియిరీ (Robespierie) ప్రముఖుడు, డాంటన్ (Danton) మారా (Marat) చెప్పదగినవారు. నాటి దేశ దుస్థితికి ప్రజానీకం అనుభవించే దుర్భరదారిద్ర్యానికి స్వాధికార వర్గాలు, వారికి అండగా నిలిచే నిరపేక్ష రాచరికమే కారణమని, వీటి నిర్మూలనలోనే దేశంలో నూతనవ్యవస్థ నిర్మాణము, ప్రజాసంక్షేమము సాధ్యమని వారు వాదించేవారు. విప్లవ పరిణామాల్లో మాత్రం ఇటువంటి స్వల్ప సంఖ్యాకులైన ఆవేశపరులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొని, నింపాదిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే అధికసంఖ్యాకులను వెనక్కునెట్టివేయడం. వీరి తీవ్రవాద ప్రసంగాల వల్లనే మిరబూ వంటివారు వీరిని నిరసన దృష్టితో చూడడం జరిగింది.

ఎస్టేట్స్‌జనరల్‌కు ఎన్నికలు జరిగే సమయాన, ఫ్రాన్సుదేశం దుర్భరమైన క్షామాన్ని ఎదుర్కొంటుంది. తమ సమస్యలు, దుస్థితిని వివరించి తగిన విధంగా తమ ప్రతినిధులు నివారణోపాయాలు చేయగలరని ప్రజలు విశ్వసించారు. కాగా వారు తమ కోర్కెలతో కూడిన పత్రాలను తృతీయవర్గ ప్రతినిధులకు అందచేశారు. ఆ పత్రాలను కాహియర్ (Cahier) అని పిలిచారు. ప్రతినిధులు ఒక్కొక్కరే అటువంటి పత్రాలు వందల కొలదిగా తెచ్చారు. అవి ప్రభుత్వానికి సమర్పించి ప్రజలకు తగువిధంగా సాయం చేయడానికి మొట్టమొదట వారికి అవకాశం ఏర్పడవలసి ఉంది. అయితే ఎస్టేట్స్‌జనరల్ సమావేశాలు అందుకు అనువుగా లేవు.

### 4.2.1 జాతీయ సభ (National Assembly) మరియు రాజ్యాంగ నిర్ణాయకసభ (Constituent Assembly):

ఎస్టేట్స్ జనరల్ సమావేశాలు ప్రారంభమై ఒకటిన్నర నెల గడిచినా, దేశ సమస్యలు, ప్రజల అవస్థలు అక్కడ చర్చల్లోకి రాలేదు. తృతీయవర్గ ప్రతినిధులు ఇప్పుడు సమావేశమైన సభ వెనుకటివలె కేవలం ప్రభువర్గానికి, మతాధిపతులకు చెందిన ఫ్యూడల్ సభ కాదన్నీ, ఫ్రెంచి జాతియావత్తుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయసభ (National Assembly) అని ప్రకటించారు. కనుక ఆ సభలోని అన్ని వర్గాలకు చెందిన సభ్యులు అన్ని విషయాల్లో సమానం; ఏ విధమైన తారతమ్యాలు పాటించక, ఎటువంటి అరరికలు లేక అందరు సమానంగా, తలకొక ఓటును మాత్రమే కలిగి ఉండాలని వారు డిమాండు చేశారు. కాని ప్రభువులు, మతాధిపతులకు ఈ ప్రకటన సహించలేదు. సాధారణ ప్రజలు తమ సభలో పాల్గొనడాన్ని వారు వ్యతిరేకించారు. ఏ సభకు ఆ సభ ప్రత్యేకంగా సమావేశం కావడము, చర్చలపై ఓటింగ్ తలకొకటికాక, సభల వారీగా, అనగా ఉన్నత వర్గాలు కనుక మొదటి, రెండవ సభలు ఓటు విలువ అధికంగా తృతీయవర్గం వారి ఓటు విలువ స్వల్పంగాను ఉండాలని పట్టుబట్టారు. ఈ వాదవివాదాలతో ఒకటిన్నర నెల గడిచింది. ఆ సభలోని చర్చలు, నిర్ణయాల పట్ల ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రజానీకం ఈ కాలయాపన భరించలేకపోయారు. అయితే, స్వాధీకారవర్గ ప్రతినిధుల మొండి వైఖరీ, సర్వసమాన స్వేచ్ఛాసమానత్వాలను నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్న తమ ప్రతినిధులను వారు వ్యతిరేకించడమూ ప్రజానీకానికి ముఖ్యంగా దేశంలోని పలు ప్రాంతాల నుండి ఉపాధి సౌకర్యాలను, అన్నవస్త్రాలు సంపాదించుకునే అవకాశం కొరకు పారిస్ నగరవీధుల్లోనే స్థిరపడ్డ పేద ప్రజానీకం స్వాధీకార వర్గాలపట్ల మరింతగా ద్వేషాన్ని పెంచుకోసాగారు. తలకొక్క ఓటు ఉన్నప్పుడే తృతీయవర్గ ప్రతినిధులు తమ సంఖ్యాబలంతో సంస్కరణలను, ప్రజలకు అవసరమైన సదుపాయాలను సాధించగలిగేది. అందువలన వారు కూడ పట్టుదలతో వ్యవహరించసాగారు.

స్వాధికారవర్గాల ప్రతినిధులు బలవంతంగా తృతీయవర్గ ప్రతినిధులను ఎస్టేట్స్ జనరల్ భవనం నుండి వెళ్లగొట్టి, తమ సాంప్రదాయక హోదాలు, ఆధిక్యతలను కాపాడుకోదలచారు. వారు రాణి అయిన మేరీ ఆంటోటి వద్దకుచేరి, ఆమెను ఒప్పించి, పదునారో లూయీపై ప్రయోగించి ఒత్తిడి తెచ్చారు. ఎస్టేట్స్ జనరల్‌లో జరుగుతున్న పరిణామాలు సాంప్రదాయక వ్యవస్థ మనుగడకే తుదకురాచరికానికే ముప్పు వాటిల్లగలదని వారు వాదించారు. వారి ఒత్తిడికి తలఒగ్గి, పదునారో లూయీ జూన్ 17న స్వయంగా ఎస్టేట్స్ జనరల్ సమావేశంలోని మూడు సభలను ఉద్దేశించి ప్రసంగించి స్వాధికార, అస్వాధికార వర్గాల ప్రతినిధులు విడివిడిగా సమావేశం కావలసిందేనని, తృతీయవర్గప్రతినిధుల సమావేశానికి వేరే భవనం కేటాయించడం జరిగిందని ప్రకటించి, వారిని వెంటనే బయటికి వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించాడు.

రాజాజ్ఞను తృతీయవర్గ ప్రతినిధులేకాక ప్రభువర్గానికి చెందిన మిరబూ, అబిసయీస్ వంటివారు సైతం తీవ్రంగా వ్యతిరేకించారు. మిరబూ సభాకార్యక్రమాలు నిర్వహించే రాజోద్యోగి (Master of Ceremonies) వద్దకు విసవిసా వెళ్ళి, "పో ! మీ రాజుగారికి చెప్పు. ఇక్కడినుండి మేము తుపాకులు గురిపెడితే కాని కదలము" అని గట్టిగా అరిచాడు. పదునారో లూయీ "అందరు కలిసి సమావేశం కాదలచుకున్నారు. అంతేకదా ! అలాగే కానిమ్మ' ని అన్నాడు. రాజులోని ఈ అనిశ్చితస్థితి, ముందుచూపు లేకుండ అధికారాన్ని ప్రయోగించబోవడమూ, తరువాత నాలిక కరుచుకొని వెనక్కుతగ్గడము పరిణామాలకు ప్రధాన కారణం. మూడు సభలను కలిసి సమావేశం జరుపుకోవడాన్ని పైకి ఆమోదించినా, రాజు, ప్రభువర్గము తృతీయవర్గ ప్రతినిధుల మొండితనాన్ని సహించలేకపోయారు. పదునారో లూయీ ఎస్టేట్స్‌జనరల్ సభా భవనంలోనికి తృతీయవర్గ ప్రతినిధులను ప్రవేశాన్ని బలవంతంగా అడ్డుకోవాలని నిర్ణయించుకొని జూన్ 20న ప్రభువర్గ, మతాధిపతుల వర్గ, ప్రతినిధులను మాత్రం సభాభవనంలోనికి పోనిచ్చి, తలుపులు మూసివేయించాడు.

ఈ సంఘటనతో తృతీయవర్గ ప్రతినిధులు రెచ్చిపోయారు. వారు ఆ ప్రక్కనే ఉన్న టెన్నిస్ కోర్టులో సమావేశమై, రాచరిక నిరంకుశత్వాన్ని గర్హించి, ఫ్రాన్సుకు పరిమితమైన అధికారాలతో కూడిన రాజ్యాంగబద్ధ రాచరికం ఉండాలని, అటువంటి రాజ్యాంగం నిర్మించడానికి జాతీయసభ పూనుకుంటున్నదని ప్రకటించారు. రాజ్యాంగనిర్మాణం పూర్తి అయ్యే వరకు తాము విడిపోరాదని ప్రమాణం చేశారు. దీనిని టెన్నిస్‌కోర్టు ప్రమాణం (Tennis Court Oath) అంటారు. టెన్నిస్‌కోర్టు ప్రమాణంలో జాతీయసభ తనకు తానే రాజ్యాంగనిర్ణాయకసభ (Constitutional Assembly) గా ప్రకటించుకొని, ఫ్రాన్సు దేశానికి రాజ్యాంగచట్టాన్ని రూపొందించ పూనుకొంది.

ఈ వరుస సంఘటనలన్నీ అపూర్వమైనవి, విప్లవాత్మకమైనవే. ఈ విధంగా అంతకు ముందెన్నడూ సాధారణ ప్రజానీకం రాజాజ్ఞను ధిక్కరించగలడగమూ, తమకు తాముగా రాచరికాన్ని రాజ్యాంగబద్ధంచేసి, రాజు అధికారాలను పరిమితం చేయాలని ఉద్దేశించడమూ, రాజ్యాంగచట్టం తయారుచేయ పూనుకోవడము, ఏ దేశంలోను జరగలేదు. అటువంటి సంఘటనలు తొలిసారిగా ఫ్రాన్సులో ఏర్పడుతున్నాయి.

### 4.2.2. బాస్టిలీ (Bastille) కోట పతనం :

1789 జూన్ 20 నాటి సంఘటనలతో పదునారో లూయీ నివ్వెరపోయాడు. సాధారణ ప్రజానీకానికి లేదా తృతీయవర్గ ప్రతినిధులు అంతటి ధైర్యమూ, తెగువా, చూపుతారని ధిక్కరించగలుగుతారని అతడు ఏ మాత్రం ఊహించలేదు. వారి వైఖరి, వారు సృష్టిస్తున్న క్రమశిక్షణారాహిత్యం, ఎంత మాత్రమూ సహించరాదని నిర్ణయించుకున్నాడు. దీనికి తగినట్లు స్వాధికార వర్గాలకు చెందిన ప్రభువులు, మతాధిపతులు, మేరీ ఆంటోనెటి ద్వారా అతనిపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ సాంప్రదాయధిక్కారము, రాచరికధిక్కారం దైవ దిక్కారం వంటివేనని అరాచకానికి దారితీస్తాయని హెచ్చరించారు.

పదహారో లూయీ తన అనిశ్చితస్థితిని వదిలి, కఠినంగా వ్యవహరించదలచి, రాజ్యంలోని మూలబలాన్ని (Reserve Force) ను రంగంలో దింపాడు. సైనికబలాన్ని ప్రయోగించి, తృతీయవర్గ ప్రతినిధులను నిర్బంధించడానికి, వారి క్రమశిక్షణారాహిత్యాన్ని కఠినంగా అణచివేయడానికి ప్రయత్నం ప్రారంభించాడు. వర్సై నగరంలో ఆకస్మికంగా సైనికదళాల సంచారం ప్రారంభమై, ప్రజల్లో కలవరాన్ని సృష్టించింది. రాజు ఉద్దేశ్యాన్ని వారు చూచాయిగా గ్రహించారు. దానితో వర్సైలోను, అంతకంటే అధికంగా పారిస్ వీధుల్లో రకరకాల వదంతులు వ్యాపించసాగాయి. అదే సమయంలో ప్రజాహితాన్ని కాంక్షించే నెకర్‌ను పదునారో లూయీ పదవినుండి తొలగించాడు. ఈ వార్త ప్రజల అనుమానాలను, ఆందోళలను మరింత బలపరిచింది. నిరపేక్ష రాచరికము, స్వాధికార వర్గాలు చేయి చేయికలిపి, తమ ఆశలను, ఆకాంక్షలను సైనికబలంతో అణచివేయడాన్ని ఇకపై సహించరాదని వారు ఉద్వేగభరితులైనారు. వారందరు ఒక్కుమ్మడిగా, చేతికిఅందిన ఆయుధాలతో వర్సైనగరానికి సమీపంలో ఉన్న బాస్టిలీ కోటపై దాడిచేశారు. ఈ దాడికి రాబిస్పియిరీ నాయకత్వంలోని పారిస్ పార్లమా నాయకత్వం వహించింది.

బాస్టలీ వద్ద ఉన్న పురాతనమైన కోట రాజద్రోహనేరంపై ఉదారవాదులైన రాజకీయవాదులను నిర్బందించడానికి ఉపయోగపడుతున్నది. వారు కేవలం అనుమానంపై, గిట్టనివారు చేసిన ఫిర్యాదుపై ఆ కోటలో నిర్బంధంలో, ఎటువంటి విచారణ, నిర్దిష్టమైన శిక్ష, శిక్షణకాలం లేకుండ మ్రగ్గిపోతూ జీవితం చాలించేవారు. కనుక ఆ కోటను రాచరికనియంతృత్వానికి చిహ్నంగా భావించి, ఏ మాత్రం సైనికశిక్షణ, ఆయుధసంపత్తిలేని సాధారణప్రజానీకం 1789 జులై 14న దాడిచేసి, నేటమట్టం చేసింది. తమ నాయకులు పలువురు అందులో నిర్బందానికి గురైనారని ప్రజానీకం బావించి, వారిని బయటకు తెచ్చేందుకఉ ఈ దాడి చేసింది. ప్రజల దాడిని అరికట్టి, కోటను రక్షించడానికి రాజు పంపిన సేనలు ప్రజలతో చేరిపోయాయి. తత్ఫలితంగా ప్రజల దాడికి సులువుగా ఆ కోట ధ్వంసం అయింది.

ఈ సంఘటన దేశపరిస్థితులను, ప్రజల దుర్భరదారిద్ర్యాన్ని గ్రహించి, ఆ పరిస్థితులను చక్కబరచవలసిన ఆవశ్యకతను గుర్తించి, సైనికబలాలు సైతం తిరుగుబాటుకు పూనుకుంటున్నట్లు స్పష్టపరుస్తుంది. సాధారణ పేదప్రజానీకంలోని వారు కూడా, తమ దుస్థితికి కారణం సాంప్రదాయక వ్యవస్థలు, వాటిపట్ల తీవ్రమైన పట్టుదల కలిగిన నిరపేక్ష రాచరికము, స్వాధికార వర్గమూ అనే విషయాలను గ్రహించి వారు సైతం తిరుగుబాటుదారులతో చేరిపోయారు. బాస్టిలీకోట పతనం వలన వెంటనే జరిగిన ఫలితం పదునారో లూయీ పారిస్ ప్రజలు, వారికి నాయకత్వం వహించే పారిస్ పార్లమా కోరిన విధంగా నెకర్‌ను వెంటనే పదవిలో నియమించడమూ, వర్సై నగరంలోనికి అదనంగా రప్పించిన సైనికబలగాలను వెంటనే యధాస్థానాలకు పంపివేయడము, ఈ సంఘటనలు తిరుగుబాటు క్రమంగా పోరాటంగా పరిణమిస్తున్నదని, రాజసైనికులకు, తిరుగుబాటుదారులకు ఇకపై తరచుగా పోరాటాలు ప్రాప్తిస్తాయని అనుమానం కలగడంతో సాధారణ ప్రజానీకానికి సైనిక శిక్షణ అవసరమని లఫాయా (Lafayette) గుర్తించాడు. అతడు ప్రభువర్గానికి చెందినవాడు, లోగడ అమెరికా వలసలు బ్రిటిష్ వలసవాద ప్రభుత్వంతో స్వాతంత్ర్యపోరాటం చేసినప్పుడు ఫ్రెంచి ప్రభుత్వం పంపిన బ్రిటిష్ సేనలతో పోరాడిన ఒక ప్రముఖ సేనానాయకుడు. అతడు తయారుచేసిన ప్రజాసైన్యం జాతీయ రక్షకదళం (National Guards) అనే పేర ప్రసిద్ధమైంది.

బాస్టిలీకోట పతనం నిస్సందేహంగా ఒక అసాధారణ సంఘటన. ఆ కోటను నేలమట్టం చేసిన తరువాత అందులో కేవలం ఆరుగురు మాత్రమే చాలకాలం నుండి నిర్బంధంలో ఉన్న రాజకీయ ఖైదీలు ఉన్నారు. ప్రజల్లో పుకార్లు వ్యాపించినట్లు తృతీయవర్గ ప్రతినిధులెవరూ అందులో నిర్బంధంలో లేరు, జులై 14 సంఘటనతో విడుదల కాలేదు. అయినా అదొక అసాధారణ సంఘటన. మొట్టమొదటిగా అది రాచరిక నియంతృత్వంపై తిరుగులేని దెబ్బ. సుసంఘటితమైన ప్రజాబలం ముందు రాజు, అతని సైనిక బలాలు నిష్ప్రయోజనమని, స్పష్టపరిచింది. ఇక రెండవది, ఫ్రెంచివిప్లవగమనంలో ఈ సంఘటన కలిగించిన పూర్తి ఉత్సాహం ఫ్రాన్సుదేశం అంతటా వ్యాపించడం.

ఫ్రాన్సుదేశం అంతట బాస్టిలీ పతనం గూర్చిన సంఘటనలు పునరావృత్తం కానసాగినాయి. ఆనాడు మొదలు దేశమంతట ప్రజలు గుంపులు గుంపులుగా ఏర్పడి, తమకు సమీపంలోని ప్రభువుల కోటలను, వారి భవనాల చుట్టూ ఉన్న ప్రాకారాలను నేలమట్టం చేయడమూ ప్రతిరోజు అసంఖ్యాకంగా నలుమూలల జరగసాగాయి. ఈ పరిణామాలను అరికట్టలేని ప్రభువులు నిస్సహాయులై, లోగడ ప్రజలు మౌనంగా సహించడమే తమ అధికార ప్రభావాలకు మూలకారణమని, వారు కళ్లు తెరచి విజృంభిస్తే అవి క్షణాలమీద అంతరిస్తాయని గుర్తించారు. వారి దుర్గ ప్రాకారాదులను కూల్చివేయడమంటే భూస్వామ్యవిధానాన్ని, అందులోని ప్రధానాంశమైన ప్రభువర్గపు ప్రత్యేకాధికారాలను, హోదాలను నిర్మూలించడమే.

జూలై 14 మొదలు ఫ్రాన్సు దేశమంతట పెచ్చరిల్లిన ఈ విధ్వంసకాండతో స్వాధికారవర్గాలు కళ్ళుతెరిచాయి. వారిలో అధిక శాతం ప్రజల ఆగ్రహానికి గురికాకుండ స్వచ్ఛందంగా తమ ప్రత్యేకాధికారాలు, హోదాలను వదులుకొనేందుకు, తమ ఎస్టేట్లలో సేద్య బానిసత్వం (Serfdom) రద్దు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఆగస్టు 4 న జరిగిన జాతీయసభ సమావేశంలో వారు పోటీపడి తమ నిర్ణయాలను ప్రకటించి, దేశంలో సర్వమానవ సమానత్వం, స్వేచ్ఛ ఏర్పడడాన్ని సమర్థించారు. జాతీయసభ ఈ సంస్కరణలను చట్టబద్ధం చేసింది. ఈ ప్రకటనలలో ఆనాటి జాతీయసభ సమావేశం చారిత్రాత్మకం అయింది.

అయితే, ఈ ప్రకటనలకు కారణం స్వాధికారవర్గాల్లో ఏర్పడిన భయాందోళనలే కాని, వారు వాస్తవంగా విజ్ఞతాయుతులు కావడం కాదు. వారిలో పలువురు పెద్ద సంస్థానాలు డచ్చీలు (Dutchies) కౌంటీస్ (Counties) మొదలైనవి పరిపాలలించేవారు, రాజబంధువులు అయినవారు, కరుడుగట్టిన అహంకారం అధికారదర్పం కలవారు, ఈ పరిణామాలను అంగీకరించలేదు. వారు తమ హోదాలను ఆధిపత్యాలను సాధారణ ప్రజలకు భయపడి వదులుకోవడం అవమానకరంగాను, అవాంఛనీయంగాను భావించారు. కాని ప్రజల తిరుగుబాట్లను ఎదిరించి నిలవడం వారికి అసాధ్యం అయింది. వారు తమ ఎస్టేట్లను వదిలి పారిపోయి, ఫ్రాన్సుదేశానికి ఆస్ట్రియా, ప్రష్యాదేశాల సరిహద్దుల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు. వారిని పలాయతప్రభువులు (Emigree Nobels) అని అంటారు. వారు అక్కడనుండి ప్రష్యా రాజు రెండవ ఫ్రెడరిక్ విలియంతోను, ఆస్ట్రియాలోని రెండవ లియోపాల్డ్ చక్రవర్తితోను మంతనాలు జరుపుతున్నారు. వారిని ఫ్రాన్సుపై దండెత్తి వచ్చి, ప్రజల అరాచకాన్ని అణచివేసి, తిరిగి పదునారో లూయీని నిరపేక్ష రాజ్యాధినేతగా నిలుపవలసిందిగా, స్వాధికారవర్గాల హక్కులు, ఆధిపత్యాలను పునరుద్ధరించవలసిందిగా పలాయత ప్రభువులు అభ్యర్థిస్తున్నారు. దీనినిబట్టి వారికి ఇంకా తమ హోదాలు, ఆధిపత్యాలపైనే కాని, దేశంపైన, దేశప్రజానీకంపైన ఆసక్తి కలుగలేదని, అనగా జాతీయభావాలతో కూడిన సర్వమానవ సమానత్వము, దేశాభిమానము ఏర్పడలేదని స్పష్టపడుతుంది. వారి దృష్టిలో ఏ దేశానికి చెందిన వారైనా, ఉన్నతవర్గాలకు చెందిన ప్రభువులు తమ సాటిరారు. అంతేకాని భాషాసంస్కృతుల ప్రాతిపదికపై స్వదేశ ప్రజానీకం తమకు దగ్గర వారని ఇంకా తెలిసిరాలేదు.

ఈ విధమైన మౌలిక పరిణామాలకు - స్వాధికార వర్గాలను సాధారణ ప్రజానీకంతో కలిపివేసి, స్వేచ్ఛా, సర్వజన సమానత్వము ఏర్పడి, సేద్యబానిసత్వము, సాంఘిక, ఆర్థిక అసమానతలు అంతం కావడానికి శ్రీకారం చుట్టిన బాస్టిలీకోట పతనం విప్లవగమనంలో ఒక ప్రధానమైన మలుపు. ఆ కారణాన జూలై 14 ఫ్రెంచి స్వాతంత్ర్యదినంగా నేటికి ప్రసిద్ధమై, జరుపబడుతున్నది.

## 4.2.3 పదునారో లూయీ తదుపరి విధానము, నిరపేక్ష రాచరికం పతనము :

బాస్టిలీకోట పతనము, తదనంతర పరిణామాలు పదునారో లూయీకి కలిగించిన దిగ్భ్రమ అతడు మరింత నిశితంగా, తెలివితక్కువగా ప్రవర్తించి, తుదకు నిరపేక్ష రాచరికం ఘోరమైన అవమానాల పాలై పతనం కావడానికి కారణమైనాడు. ఆగస్టు 10 న అతడు పారిస్ నగరానికి వచ్చి, వారు సాధించిన విజయాలకు విప్లవకారులను అభినందించాడు. తానుకూడ విప్లవకారుణ్ణేనని,

దేశాన్ని అభ్యుదయపథంలో నడిపిస్తూ, కాలం చెల్లిన సాంప్రదాయాలను, ప్రభువర్గ హోదాలను తొలగించిన తృతీయవర్గ ప్రతినిధులతో తానుకూడ కలిసి నడుస్తానని ప్రకటించాడు. అయితే అంతలోనే తన రాచరికపుహోదాలను జ్ఞప్తికి తెచ్చుకొని, మరొక ప్రయత్నంచేసి, విప్లవాన్ని అణచివేయ పూనుకున్నాడు. అది క్రమంగా రాచరికం మరింతగా అవమానాలకు గురి అయ్యే అనేక సంఘటనలకు వరుసగా దారితీసింది. వాటిలో మొదటిది పారిస్ స్త్రీల ఆకలియాత్ర.

### 4.2.4 పారిస్ స్త్రీల ఆకలియాత్ర :

పదునారో లూయీ మరొక ప్రయత్నంలో విప్లవాన్ని అణచడానికి పూనుకోవడంలో మేరీ ఆంటోనటి ప్రభావం ముఖ్యకారణం. అతన్ని అనిశ్చిత స్థితిలో విప్లవానికి వ్యతిరేకదిశలో నడిపి, అతని మరిన్ని పొరపాట్లకు ఆమె ముఖ్యకారణం. పలాయత ప్రభువులు (Emigree Nobles) అతనితో జరిపే రాయబారాలు, వాటిలోని ప్రోద్భలము రెండవ కారణము. ఈ కారణాల వలన పదునారో లూయీ సరిహద్దు రాష్ట్రం అయిన ఫ్లాండర్స్ నుండి రాజధానికి సేనలను రప్పించాడు. అవి అక్టోబరు ఒకటవ తేదీన వర్సేనగరానికి చేరుకోగా, వాటి సేనాధిపతులకు ఘనమైన విందు చేశాడు. ఈ వార్తలు వెంటనే పారిస్ నగరానికి వ్యాపించగా, అక్కడి ప్రజలు (Paririan Nobles), తాము అన్నార్తులై అలమటిస్తుంటే రాజకుటుంబం విందులు చేసుకుంటున్నందుకు ఆగ్రహించారు. అది జాతీయసభను అణచివేసే ప్రయత్నమని కూడ వారికి తెలుసు. వెంటనే అక్టోబర్ 5 న అన్నార్తులైన స్త్రీలవలె కొన్నివేలమంది పారిస్ నుండి 14 మైళ్ళ కాలినడకన ఊరేగింపుగా వర్సే నగరానికి చేరారు. వారిలో అధిక సంఖ్యాకులు స్త్రీలవలె వచ్చిన పురుషులు. వారు దారి పొడవున "రొట్టె ప్రియమైంది, మాకు రొట్టె కావాలి" (Bread is dear; we want bread) అంటూ నినాదాలు చేస్తూ వర్సే నగరాన్ని చేరి, ప్రాసాదాన్ని ముట్టడించారు. రాజు, రాణి వారిని సముదాయించ ప్రయత్నించారు, దానితో వారు మరింతగా విజృంభించారు. వారు రొట్టె ప్రియమైందని, అనగా కొనలేని విధంగా వెల అధికమైందని నినాదాలు చేయడం అర్థంకాని మేరీ ఆంటోనటి అమాయకంగా "రొట్టె ప్రియమైతే, కేక్ తినవచ్చుకదా !"అని అనడంతో దాన్ని పరిహాసంగా భావించి ప్రాసాదాన్ని చుట్టుముట్టిన జనం రెచ్చిపోయారు. వారుప్రాకారం గోడలెక్కి లోనికి దూకి, రాజప్రాసాదాన్ని ఆక్రమించసమకట్టారు. ప్రాసాదాన్ని సంరక్షించే సేవకులను వారు ఆ సంఘటనలో నరికివేశారు.

పారిస్ గుంపు విధ్వంసనకు పూనుకొని, రాజకుటుంబంపై దాడిచేసి, మరిన్ని అవాంఛనీయ పరిణామాలకు దారితీయడాన్ని నివారించడానికి లఫాయా తన జాతీయ రక్షకదళంతో అక్కడికి చేరుకున్నాడు. కాని అప్పటికే పారిస్ స్త్రీల వేషంలోని గుంపు రాజప్రాసాదాన్ని ఆక్రమించి, రాజకుటుంబాన్ని అదుపులోనికి తీసుకుంది. రాజకుటుంబాన్ని తమతో వచ్చి పారిస్ నగరంలో, తమ నడుమ నివసించవలసిందిగా వారు నిర్బంధించగా, మరోదారిలేని రాజు అందుకు సమ్మతించి ప్రయాణం అయినాడు. దారిపొడవునా, పారిస్ జనం ఉత్సాహంతో పాటలు పాడుతూ, "మాకు రొట్టెలు కాల్చేవాడు, వాని పెండ్లాము, చిన్న వంటవాని కొడుకు లభించారు; మాకిక తిండికి లోటులేద" ని కేకలు వేశారు. (We have the baker, baker's wife, and the little cook boy; We will have plenty of bread).

రాజకుటుంబంతో పాటు జాతీయసభ కూడ వర్సేనుండి పారిస్‌కు తరలివచ్చి, తమ తదుపరి సమావేశాలు, రాజ్యాంగ నిర్మాణము కొనసాగించాయి. దానివలన జాతీయసభ పారిస్ గుంపు, అనగా క్రమశిక్షణ, యుక్తాయుక్త విచక్షణ లేక కేవలం ఆవేశపూరితమైన ప్రజాసముదాయం మధ్య, వారి బలీయమైన శక్తికి లోబడి పనిచేయవలసి వచ్చింది. ఈ పరిణామాలు బాస్టిలీకోట పతనంతోనే ప్రారంభమై, తదనంతర పరిణామాల్లో మరింతగా అతిశయించాయి. మరో విధంగా చెప్పాలంటే, ఆగస్టు 10న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడంతో ఫ్రెంచి విప్లవంలో మేధావుల పాత్ర ముగిసింది. తదుపరి పరిణామాలు వారు ఊహించనవి కావు. కేవలం పారిస్ నగరంలోని అల్లరిమూకలు రాజు తెలివితక్కువతనం వలన రెచ్చిపోయి నడిపించిన సంఘటనలు, వారి ప్రాబల్యం క్రింద తయారు అవుతున్న రాజ్యాంగం, దానికి పదునారో లూయీ స్పందించిన తీరు మరిన్ని మలుపులు త్రిప్పి విప్లవాన్ని నడిపించాయి.

### 4.2.5 రాజ్యాంగ నిర్మాణం :

తదుపరి విప్లవ గమనము, పదునారో లూయీ అనాలోచితమైన చర్యలు, తత్ఫలితంగా జరిగిన అనేక దుష్పరిణామాలను సక్రమంగా అర్థం చేసుకున్నప్పుడే అప్పుడు రాజ్యాంగ నిర్ణాయకసభగా ప్రకటించుకున్న జాతీయసభ నిర్మించిన రాజ్యాంగచట్టాన్ని గూర్చి తెలుసుకోవడం అవసరం.

1789 జూన్ 20 న ఎస్టేట్స్ జనరల్ జాతీయసభగా ప్రకటించుకొని, ఆగస్టు 10 న తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్వహిస్తూ, మరొక ప్రక్క రాజ్యాంగ నిర్ణాయక సభగా, దేశరాజ్యాంగ తయారుచేయడానికి పూనుకుంది. వెనుకటి ప్రభువర్గపాలన క్రింద ఉన్న వందలాదిగా సంస్థానాలు (Estates) వారి పాలన అంతం కావడంతో ఫ్రాన్సుదేశంలో విలీనమైనాయి. ఆ విధంగా ఫ్రాన్సు రాజకీయంగా ఏకీకృతం (unified) అయింది. కనుక వివిధ ప్రాంతాల్లోని విభిన్న పరిపాలనావిధానాలను రద్దుచేసి, దేశమంతటికి వర్తించే జాతీయ పరిపాలనావిధానము, వ్యవస్థల నిర్మాణం అవసరం అయింది. రాజ్యాంగ నిర్ణాయకసభ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రాజ్యాంగం ఫ్రాన్సులో సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను సమూలంగా సంస్కరించి, నూతన వ్యవస్థలను రూపొందించింది.

#### 4.2.5.1 స్వేచ్ఛా సమానత్వాలు :

ఆగస్టు 4 న అత్యధిక శాతం ప్రభువర్గం తమ సాంప్రదాయక హోదాలను, అధికారాలను, వదలివేసి, సేద్యబానిసత్వాన్ని రద్దుచేసినట్లు ప్రకటించగానే రాజ్యాంగపరిషత్తు ఈ పరిణామాన్ని చట్టబద్ధం చేసింది. అప్పటివరకు శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంఘిక, ఆర్థిక అసమానతలు అంతరించి, అందరికి సమానహక్కులతో పాటు పన్నులు చెల్లించడంలో, సమానబాధ్యతలు, దేశపరిపాలనా వ్యవస్థకు, న్యాయచట్టాలకు విధేయులై ఉండడం సమానంగా విధించడం జరిగింది.

#### 4.2.5.2 మానవ హక్కుల ప్రకటన :

ఫ్రెంచి రాజ్యాంగం రూసో భావాలను, సమకాలీనంగా అమెరికా స్వాతంత్ర్య ప్రకటన మొదలైన వాటిని అనుసరించి, దేశ పౌరులందరికి సహజంగా, ప్రకృతిసిద్ధంగా సంక్రమించే హక్కులకు చట్టబద్ధమైన గుర్తింపు, సంరక్షణ ఇచ్చింది. ఈ చట్టాన్ని "మానవ హక్కుల ప్రకటన" (Declaration of Human Rights) అంటారు. వాక్స్వాతంత్ర్యము, సభా స్వాతంత్ర్యము, ఆస్తిహక్కు, వ్యక్తిస్వేచ్ఛ మొదలైనవి 11 అంశాలు ఈ ప్రకటనలో చేరినాయి. ఈ ప్రకటన సర్వమానవ సమానత్వాన్ని, వారి హక్కులు, బాధ్యతల సర్వసమానత్వాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించి, చట్టబద్ధంగా తప్ప ఎవరినీ నిర్బంధించడాన్ని, వారి వారి రాజకీయ, మత, ధార్మిక అభిప్రాయాలను అణచివేయడానికి ఎవరికి అధికారాలు ఉండరాదని ప్రకటించింది. ఈ మానవ హక్కుల ప్రకటన అంతకు పూర్వం జరిగిన హక్కుల ప్రకటనల కంటె సవిస్తరంగాను, సంపూర్ణమై, తదుపరి ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక రాజ్యాంగ చట్టాలకు అనుసరణీయం అయింది. ఈ విధంగా మధ్యయుగాలనాటి వ్యవస్థలను పూర్తిగా తొలగించడం జరిగింది.

#### 4.2.5.3 స్థానికపరిపాలనా విధానం :

ప్రభువులు తమ ఎస్టేట్లను, వాటిని పరిపాలించుకొనే అధికారాలను వదిలివేయడంతో ఫ్రాన్స్ దేశం యావత్తు ఒకే ప్రభుత్వ వ్యవస్థలో చేరిపోయినట్లయింది. అందుచేత దేశమంతటికి ఒకే పరిపాలనావ్యవస్థ అవసరం అయింది. ఆ అవసరాన్ని తీర్చడానికి రాజ్యాంగం దేశమంతటిని 83 డిపార్ట్‌మెంటులు అనే రాష్ట్రాలుగాను, రాష్ట్రాలను కాంటన్ (Canton) అనే విభాగాలుగాను, కాంటన్లను కమ్యూన్ (Commune) లనే మరింత చిన్న విభాగాలుగాను ఏర్పరచడం జరిగింది. వీటిలో కమ్యూన్ ప్రజలతో అత్యంత సన్నిహితమైన పరిపాలనా విభాగం కనుక, వాటిపై అధికారులకు చాలవరకు స్వయంనిర్ణయాధికారాలు ఇచ్చి, ప్రజా సమస్యలకు సత్వరపరిష్కారం జరిగే వీలు కల్పించడం జరిగింది.

### 4.2.5.4 జాతీయ న్యాయవ్యవస్థ :

లోగడ ప్రభువులు, మతాచార్యులు న్యాయపరిపాలనా వ్యవస్థను నిర్వహించేవారు. వారి ప్రత్యేకాధికారాలు రద్దుకావడంతో వారు నిర్వహించే న్యాయవ్యవస్థకు సంబంధించిన విధులను నిర్వర్తించే న్యాయస్థానాలు ఈ రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డాయి. ప్రజలందరికి సమానంగా వర్తించే న్యాయసూత్ర సంపుటాలను (codes) తయారు చేయడానికి యోచనలు జరిగాయి. కాని, ఆ కార్యక్రమం అనేక కారణాల వలన కొంతకాలం తరువాత ప్రారంభమై నెపోలియన్ కాలంలో పూర్తి అయింది.

### 4.2.5.5. జాతీయఆర్థికవ్యవస్థ :

ఫ్రాన్సుదేశం ఆనాడు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం విప్లవానికి మూలకారణం. వరుసగా కొన్ని సంవత్సరాలపాటు కరువు కాటకాలు, రాజకీయ కల్లోలాల వలన ప్రజల జీవితం దుర్భరం అవుతున్నది. ఆర్థిక వ్యవస్థకు తిరిగి జవసత్త్వాలను చేకూర్చడానికి, పరిపాలనను నిర్వహించి ప్రజల దుస్థితిని నివారించడానికి అవసరమైన నిధుల గురించి జాతీయసభ కొన్ని అసాధారణ నిర్ణయాలు తీసుకున్నది. అందులో మొదటిది ఎస్సెనట్ (Assignat) అనే పేరుతో కాగితపు నాణాలను (Paper Currency) ని ప్రవేశపెట్టడం. ఈ కాగితపు ధనానికి హామీగా చర్చి ఆస్తులను స్వాధీనపరచుకొని, వాటిని జాతీయ ఆస్థిగా ప్రకటించి, ప్రభుత్వ నిర్వహణలోనికి తీసుకోవడం.

### 4.2.5.6 చర్చికి సివిల్ రాజ్యాంగం; పదునారో లూయీ చర్యలు :

పై రాజకీయ సంస్కరణలు సమకాలీన మేధావుల తాత్త్విక చింతనలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైనవి; పైన **సమీక్షించిన** సంఘటనల పరంపరలో ప్రభువర్గానికి వ్యతిరేకమైనవే అయినా, అంగీకరించబడినవి. కనుక వాటికి చెప్పుకోదగిన **ప్రతిఘటన** ఎదురుకాలేదు. కాని చర్చి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనపరచుకోవడంతో మతవ్యవస్థకు సాంప్రదాయకంగా ఉన్న ఆదాయవనరులు మూసివేసినట్లయింది. దాని నిర్వహణకై ప్రత్యామ్నాయమైన ఏర్పాట్లు అవసరం అయినాయి. అటువంటి ప్రత్యామ్నాయమైన ఏర్పాటు మతవ్యవస్థ నిర్వహణకై రూపొందించబడిన సివిల్ రాజ్యాంగం (Civil Constitution of Clergy) ఈ సివిల్ రాజ్యాంగం పదునారో లూయీకి వ్యక్తిగతమైన మతవిశ్వాసాలను దెబ్బకొట్టి, అతని అసహనాన్ని బహిర్గతం చేసింది. దానితో ఫ్రెంచివిప్లవకారుల్లో రాచరికవ్యవస్థ నిర్మూలనకు, పదునారో లూయీపై వ్యక్తిగత వైరానికి బీజాలు పడ్డాయి.

మతవ్యవస్థ నిర్వహణ, అనగా చర్చి భవనాల నిర్మాణ నిర్వహణలు, మతాచార్యుల జీవనభృతులు మొదలైన వాటికి నూతన రాజ్యాంగ వ్యవస్థలో ప్రభుత్వమే బాధ్యత వహించడం మతవ్యవస్థయొక్క సివిల్ రాజ్యాంగంలో ప్రధానాంశం. అందుచేత చర్చి భవనాలు ప్రభుత్వ ఆస్తులు, మతాచార్యులు ప్రభుత్వోద్యోగులుగా మారిపోయారు. లోగడ వలె రోమన్ కేథలిక్ మతవ్యవస్థ (ఫ్రెంచి ప్రజల అధిక శాతం రోమన్ కాథలిక్కులు) లోని ఉన్నత మతాధిపతులనగా, బిషప్పులు, ఆర్చి బిషప్పులు మొదలైన వారిని నియమించే అధికారం పోప్‌కు కాక, ఫ్రెంచి ప్రభుత్వానికి సంక్రమించింది. పోప్‌తోగల ఈ అనుబంధం తెగిపోవడంతో కాథలిక్కులు కూడ ఇతర ప్రొటస్టాంట్ క్రైస్తవ శాఖలవలె పూర్తిగా దేశీయం అయినారు. ఈ వ్యవస్థకు గల ప్రత్యేక పవిత్రతా భావాలకు, విశ్వాసాలకు భంగం వాటిల్లింది. ఈ రాజ్యాంగం ప్రకారం ఫ్రాన్సుదేశంలోని అన్ని చర్చ్‌లు, అందరు మతాచార్యులు సమానము. వారిలో పవిత్రత, ప్రాధాన్యతలనుబట్టి ఏ విధమైన అంతరాలు ఉండవు. కనుక మతపరిపాలన కూడ స్థానిక పరిపాలన వలెనే ఈ చట్టం రూపొందించింది. దేశం అంతటిని కొన్ని స్థానిక విభాగాలు, పారిష్ (Parish) అనేవి, ఏర్పరచి, ప్రతి పారిష్‌కు ఒక చర్చిని ఏర్పరచింది. ఆ ప్రాంతాల ప్రజలు తమ ప్రార్థనలు నిర్వహించుకోడానికి ఆ చర్చికేగాని, మరే ఇతర చర్చికి వెళ్ళరాదు.

మతవ్యవస్థ సివిల్ రాజ్యాంగం రోమన్ కాథలిక్ మతాన్ని భక్తి విశ్వాసాలతో అనుసరించే పదునారో లూయీకి తీవ్రమైన అసంతృప్తి కలిగించింది. క్రీస్తు ప్రభువుకు ప్రతినిధిగా ఈ లోకంలో ఉన్న పోప్‌కు ఆయన నిర్వహణలోని మతవ్యవస్థకు అతడు విధేయుడు; పోప్ నియమించిన బిషప్పులు, ఆర్చి బిషప్పులకు అతని దృష్టిలో పవిత్రభావం ఉంది. కనుక వారిముందు మోకరిల్లి ప్రార్థన చేయడం, ఆశీస్సులు పొందడం అతనికి అవమానకరం కావు, పైగా సంతృప్తిని కలిగించేవి. ఈ మారిన పరిస్థితిలో చర్చి ఒక ప్రభుత్వ కార్యాలయం వలె, అందులోని మతాచార్యులు తనవద్ద జీతం తీసుకునే ఉద్యోగులు అయినారు. వారిముందు మోకరిల్లి ప్రార్థన చేయడం, ఆశీస్సులు పొందడం అతనికి అసంగతమైన విషయాలు. కాని అప్పటికే అనేకమార్లు అతడు ప్రజల ఆగ్రహాన్ని చవిచూశాడు. కనుక తన వ్యతిరేకతను బహిర్గతం చేయలేకపోయాడు. ఈ మత వ్యవస్థకు సంబంధించిన రాజ్యాంగచట్టంపై "గత్యంతరం లేక సంతకం చేసినందుకు క్షమించమని" భగవంతుణ్ణి ప్రార్థించి, సంతకం చేశాడు.

సహజంగానే మతవ్యవస్థ సివిల్ రాజ్యాంగం రోమన్ కాథలిక్ మతవ్యవస్థ, మతాచార్యుల వ్యతిరేకతకు గురిఅయింది. పోప్ ఈ చట్టాన్ని తిరస్కరించవలసినదిగా ఫ్రెంచి కాథలిక్కులను ఆదేశించాడు. అధిక సంఖ్యాకులైన మతాచార్యులు ఆ ఆదేశాన్ని పాటించి, తమ ప్రాధాన్యతను నిలబెట్టుకొనడానికి, ఈ చట్టాన్ని తిరస్కరించారు. అయితే దీనిని అంగీకరించినవారు సైతం గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు. అంగీకరించిన మతాచార్యులను జూరింగ్ (Juring) మతాచార్యులని, అంగీకరించని వారిని నాన్-జూరింగ్ (Non-Juring) మతాచార్యులని వ్యవహరించారు.

1791 వ సంవత్సరారంభంలో ఈ మతవ్యవస్థ సివిల్ రాజ్యాంగాన్ని రూపొందించడం, అయిష్టంగా పదునారో లూయీ దానిని ఆమోదించి సంతకం చేయడం జరిగింది. ఆ తరువాత కొద్ది కాలానికి ఈస్టర్ పండుగ సందర్భంగా రాజకుటుంబం సెయింట్ క్లౌడ్ (St. Cloud) చర్చిలో ప్రార్థనలు జరుపుకోదలచి ప్రయాణం అయింది. రాజ్యాంగ చట్టం ప్రకారం వారు తమ పారిస్‌లోని చర్చిలోనే ప్రార్థనలు జరుపుకోవలసి ఉంది, కాని అక్కడి మతాచార్యులు, ప్రభుత్వోద్యోగులు; కాగా సెయింట్ క్లౌడ్‌లో మతాచార్యులు ఈ రాజ్యాంగ చట్టాన్ని తిరస్కరించిన నాన్-జూరింగ్ మతాచార్యులు. ఈ విధంగా రాజు తాను ఆమోదించిన రాజ్యాంగచట్టాన్ని తానే ఉల్లంఘించినట్లయింది. రాజకుటుంబం ఉద్దేశ్యాన్ని గ్రహించిన పారిస్ జనం అతన్ని అటకాయించి, పారిస్‌లోని చర్చిలో ప్రార్థనలు చేయించారు. ఈ సంఘటనతో పదునారో లూయీ పూర్తిగా తన రాజరికాధికారాలు, దర్పమూ పోగొట్టుకోవడమేకాక, పారిస్ జనం చేతిలో బందీ అయినట్లు తనకు సంతృప్తికరంగా మతవిశ్వాసాలను పాటించే స్వాతంత్ర్యం కూడ తనకు లేకపోయిందని గ్రహించాడు. ఆ పరిస్థితి అతనికి భరింపరాని ఆందోళన కలిగించింది. వెంటనే తాను ఫ్రెంచి ప్రభుత్వబంధిఖానా నుండి విముక్తి పొందడానికి యోచించసాగాడు. దేశ సరిహద్దులకు పారిపోయిన పలాయన ప్రభువు (Emigree Nobles) లతో అతడు రహస్యంగా మంతనాలు ప్రారంభించి, వారిద్వారా ప్రష్యారాజు రెండో ఫ్రెడరిక్ విలియమ్, ఆస్ట్రియాలోని రెండవ లియోపాల్డ్ చక్రవర్తిని ఫ్రాన్సుపైకి దండెత్తి రావలసిందిగా కోరడం మొదలుపెట్టాడు.

## 4.2.5.7 పదునారో లూయీ పలాయనం ప్రయత్నం :

పలాయిత ప్రభువులతో సాగించిన మంతనాలలో పదునారో లూయీ పారిస్‌నుండి బయటపడడం మొదట అవసరమని, అందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం అయింది. దానికి తగినట్లుగా మేరీ ఆంటోనటి, కుమారుడు డాఫిన్‌లతో సహా అతడు మారువేషాల్లో జూన్ 20 అర్ధరాత్రి రాజప్రాసాదం నుండి బయటపడి, ఫ్రెంచి సరిహద్దువైపుగా పారిపోయాడు. కాని అతని దురదృష్టం వెంటాడింది. ఫ్రెంచి సరిహద్దు కేవలం 20 మైళ్ళలో ఉండగా వెరెన్నెస్ (Verennes) అనే గ్రామం వద్ద అతనిని ప్రజలు గుర్తించి అటకాయించారు. అనేక విధాలయిన అవమానాలు, దుర్భాషలకు గురిఅయి, రాజకుటుంబం పారిస్ నగరానికి తీసుకుని రాబడింది. ఇక పదునారో లూయీ కేవలం మరణదండన అమలుజరిగి, ఈ లోకం నుండి విముక్తుడయే

వరకు అతనికి నిర్బంధంనుండి ముక్తి లభించలేదు. అతడు చేసిన ఈ విఫలయత్నంలో రాచరిక వ్యవస్థకు, వ్యక్తిగతంగా పదునారో లూయికి విప్లవకారుల తృణీకారము, అవమానము ప్రాప్తించాయి.

### 4.2.5.8 పిల్‌నిజ్ (Pillnitz) ప్రకటన :

పదునారో లూయికి జరిగిన ఈ అవమానం, ఆపద, పలాయత ప్రభువులకు, ప్రష్యా ఆస్ట్రియా రాజ్యాధినేతలకు, ఆందోళన కలిగించింది. రెండో ఫ్రెడరిక్ విలియం, రెండో లియోపాల్డ్ చక్రవర్తి ఆగస్టు నెలలో పిల్‌నిజ్ వద్ద సమావేశం అయి, పరిస్థితిని సమీక్షించారు. రెండవ లియోపాల్డ్ మేరీ ఆంటోనటీకి స్వయాన సోదరుడు, కనుక ఫ్రెంచి రాజకుటుంబంయొక్క భద్రత, రాజ్యవ్యవస్థయొక్క ప్రతిష్ఠ అతనికి మరింతగా ఆందోళనకరం అయినాయి. వారు తమ సమావేశంలో ఒక సంయుక్త ప్రకటన చేశారు. ఫ్రెంచిరాజుకు, రాజ్యవ్యవస్థకు అరాచకశక్తుల వలన కలుగుతున్న ఆపద, అవమానం కేవలం వారికే చెందినవికావు. అవి ఐరోపాలోని అందరు రాజులకు, రాజ్యవ్యవస్థలకు వర్తించేవి. కనుక తాము ఈ పరిస్థితిని ఉపేక్షించి, కోరుకోజాలరు, ఇతర ఐరోపా రాజులు తమతో సహకరించవలసింది అని దాని సారాంశం.

పదునారో లూయి పట్ల ప్రజల్లో అభిమానం క్షీణిస్తున్న దశలో పిల్‌నిజ్ ప్రకటన అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అతనికి విప్లవంపట్ల, రాజ్యాంగంపట్ల నిబద్ధతలేదని, కనుక నూతన రాజ్యాంగం భూస్వామ్య విధానాన్ని ప్రభువుల హోదాలు, ఆధిపత్యాలను రద్దుచేసినట్లే రాచరిక వ్యవస్థను రద్దుచేయాలని, ప్రజాపరిపాలనా వ్యవస్థ (Republic) ని నెలకొల్పాలని తీవ్రవాదులైన విప్లవకారులు వాదించారు. పారిస్ పార్లమెంటుపై పట్టు సాధించి, రాజుపై అనేకమార్లు దాడి చేయించినవారు ఈ తీవ్రవాదులు. వీరు క్రమంగా రిపబ్లికన్ వాదులుగా ఒక రాజకీయ వర్గంగా ఏర్పడ్డారు. తరువాతి కాలంలో ఫ్రెంచి విప్లవాన్ని నడిపించిన, ఫ్రెంచి రాజకీయాల్లో నిర్దేశక పాత్ర (Decision making role) నిర్వహించిన, రాబిస్పియిరీ, డాంటన్, మారా (Marat) మొదలైనవారు వారిలో వారికి అనేక విభేదాలున్నా, రిపబ్లిక్ వాదులుగా ఏర్పడ్డారు. జాతీయసభయొక్క తొలిదశలో ప్రధాన పాత్రదారులైన మిరబూ, అబిసయీస్, లఫాయీ వంటివారు ఈ పరిణామాల్లో మితవాదులుగా ఏర్పడ్డారు. రాచరికం లేనప్పుడు అరాచకం చోటు చేసుకుంటుందని, ప్రజాపరిపాలనా వ్యవస్థ పటిష్టంగా ఉన్న ఇంగ్లాండులో సైతం పరిమితమైన అధికారాలతో రాచరికవ్యవస్థ కొనసాగుతూ ఉన్నదని, ఆ విధానం ఆదర్శవంతమైనదని మిరాబూ గట్టిగా వాదించారు. జాతీయసభ అటువంటి మేధావులతో కూడింది, కనుక వారి మాట నెగ్గింది.

## 4.3 ఫ్రాన్సులో పరిమితరాచరికం :

మితవాదులైన మేధావులు అటు రాజ్యవ్యవస్థ, ఇటు సర్వజన సమానత్వము, స్వేచ్ఛ, ప్రజాసార్వభౌమాధికారం రెండింటిని పరిమిత రాచరిక వ్యవస్థ వలన సాధ్యపడతాయని భావించింది. కనుక రాజ్యాంగ నిర్ణాయకసభ ఫ్రాన్సు దేశానికి రాజ్యాంగబద్ధమైన అధికార పరిమితులతో కూడిన రాచరికాన్ని నెలకొల్పుతున్నట్లు నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం ప్రకారం ఫ్రాన్సు దేశానికి 750 మంది సభ్యులతో కూడిన, ఒకేసభ కలిగిన (Uricaneral) శాసనసభ ఏర్పడింది. ఈ సభలోనికి సభ్యులను ఎన్నుకునేందుకు మొదట వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై ప్రజలు ఎంపికదారులను (Electors) ఎన్నుకుంటారు. వారు రెండవదశ ఎన్నికల్లో కొంతఆస్థి, విద్యార్హత ఉన్నవారిని శాసనసభ సభ్యులుగా ఎన్నుకుంటారు. ఈ సభ శాసన నిర్మాణము, ఆర్థిక వ్యవహారాలు అనగా పన్నుల విధింపు, వసూలు, ప్రభుత్వాదాయాన్ని ఖర్చుచేయడం, రాజకుటుంబ నిర్వహణ మొదలైన అన్ని విషయాల్లోను తుది నిర్ణయం తీసుకొనే అధికారం కలిగింది. మాంటిస్క్యూ ప్రతిపాదించిన అధికార పృథక్కరణ (Separation of Powers) సిద్ధాంతాన్ని అనుసరించి, శాసనసభకు శాసననిర్మాణమే కాని, వాటిని అమలుచేసే పరిపాలనా యంత్రాంగం (Executive) పై ఆధిపత్యం లేదు.

శాసనసభ చేసిన చట్టాలను అమలు జరిపేందుకు వంశానుగతమైన పరిమిత రాచరికమే ప్రధాన పరిపాలనావిభాగం (Chief Executive). దానిపై శాసనసభకు ఎటువంటి అదుపులేదు. శాసనసభ చర్చించి, ఆమోదించిన బిల్లులను రాజు తిరస్కరించ వీలులేదు. అయితే అతడు రెండుసార్లు పునరాలోచనకై, శాసనసభకు త్రిప్పి పంపవచ్చు. రెండవసారి కూడ శాసనసభ ఆమోదించి పంపితే, దానిని అంగీకరించి సంతకం చేయడం కన్నా రాజుకు మార్గాంతరం లేదు. కనుక ఎట్టి పరిస్థితిలోను అతడు బిల్లులను ఏకాఏకిన నిరాకరించలేడు. సైన్యంలోనికి, పౌర పరిపాలనలో కొన్ని ప్రధానమైన పదవులకు నియామకాలు చేసే అధికారం రాజుకు ఉంది.

## 4.3.1 రాజ్యాంగబద్ధ రాచరికం, పనితీరు, ఫలితాలు :

రాజ్యాంగ నిర్ణాయకసభ ఫ్రాన్సు దేశానికి నూతన రాజ్యాంగ చట్టాన్ని తయారుచేయడం, ఆ రాజ్యాంగం ప్రకారం శాసనసభ (Legislative Assembly) కు ఎన్నికలు జరిపి, ఎన్నికైన సభ్యులతో సభను ఏర్పరచడం 1791 సెప్టెంబర్ 30 నాడు పూర్తి చేసింది. క్రొత్త రాజ్యాంగం ప్రకారం పరిమిత రాచరికవ్యవస్థలో దేశ పరిపాలనను క్రొత్త శాసనసభ అక్టోబర్ 1 న తొలి సమావేశం జరిపి ప్రారంభించింది. క్రొత్త శాసనసభలో 750 మంది సభ్యులున్నారు. 1791 అక్టోబర్ 1 నుండి 1792 సెప్టెంబర్ 22 వరకు సుమారు ఒక్క సంవత్సరం ఈ నూతన రాజ్యాంగం, అది నెలకొల్పిన ప్రభుత్వ వ్యవస్థ పని చేసిన కాలం ఫ్రెంచి విప్లవంలో ద్వితీయ ఘట్టం, లేదా రెండో దశగా భావించవచ్చు. ఈ ఘట్టంలో పరిమిత రాచరికం విఫలం కావడమూ, దాని పర్యవసానంగా రాచరికాన్ని, అనగా పూర్తిగా రద్దుచేసి ఫ్రాన్సును రిపబ్లిక్‌గా ప్రకటించడం జరిగింది.

## 4.3.2 శాసనసభ స్వరూప స్వభావాలు :

మాంటిస్క్యూ సిద్ధాంతానికి సంపూర్ణంగా అంకితమైన రాజ్యాంగనిర్ణాయక సభలోని సభ్యులు ఆ సభలోని వారెవ్వరూ ఎన్నికల్లో పోటీచేసి, నూతన శాసనసభలోనికి ప్రవేశించరాదని ముందుగానే ఆంక్ష విధించుకున్నారు. రాజ్యాంగం చేయడంలో పాత్రదారులే దాని ప్రకారం పరిపాలనలో పాత్రదారులైతే, రెండు విధాలైన అధికారాలు ఒకరే నిర్వహించినప్పుడు నియంతృత్వానికి దారితీస్తుందని వారు భయపడ్డారు. ఈ కారణం చేత క్రొత్త శాసనసభలో అందరు కొత్తవారు; అనుభవశూన్యులు; ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ అయినవారు సమకూడారు. రాజ్యాంగనిర్ణాయక సభలోని కొందరైనా, నూతన శాసనసభలో ప్రవేశించనట్లయితే, రాజ్యాంగంలోని భాష మాత్రమేకాక భావం (Letter as well as spirit) కూడా ఎరిగినవారు, అందలి సూత్రాలను వివరించడంలోను అనుసరించడంలోను విజ్ఞతతోపాటు అనుభవాన్ని జోడించి, దానికి యదార్ధ స్వరూపాన్ని చేకూర్చేవారు, ఆ అవకాశం లేకపోవడంతో ఆవేశం అనేక అనర్ధాలకు కారణం కావడమూ ప్రభుత్వం పతనమై, దేశం సంక్షోభానికి గురికావడమూ జరిగింది.

### 4.3.2.1 శాసనసభలోని రాజకీయ వర్గాలు :

1791 అక్టోబర్ 1 న సమావేశమైన నూతన శాసనసభలోని 750 మందిలో 550 మంది నిర్దిష్టమైన రాజకీయ విధానం లేనివారు. వీరు చర్చకు వచ్చిన అంశాలపై, చర్చ జరిగిన తీరునుబట్టి, అప్పటికప్పుడు తోచిన విధంగా వోటు చేసేవారు. వారి ఓటింగ్ వెనుక రాజకీయ సిద్ధాంతాలకంటే ప్రాణాలపై తీపి ప్రధానం. విప్లవకాలంలో పారిస్ పార్లమా నాయకత్వంలో జరిగిన అరాచక సంఘటనల వల్ల పబ్లిక్‌వాదుల పట్ల భయంతో వోటు చేసేవారు. కాని వారిలో వాస్తవంగా అధిక సంఖ్యాకులు రాజ్యాంగవాదులు (Constitutinalists). క్రొత్తగా రూపొందించిన రాజ్యాంగాన్ని అమలుపరచి, ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను నివారించుకోవడంలో దానిని తగువిధంగా అనువదించడం (Interpreting), అనువర్తింపజేయడం

(adaptation) ద్వారా దానికి సంపూర్ణ స్వరూపాన్ని భాషలోను, భావంలోను (in letter and spinit) ఏర్పరచడం వీరి అభిమతం. అనగా వీరు మితవాదులు. దేశాభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకొని రాజ్యవ్యవస్థలను క్రమపరిణామంలో రూపొందించడం వీరి విధానం.

### 4.3.2.2. రిపబ్లిక్ వాదులు :

రాజ్యాంగవాదుల తరువాత ప్రధానమైన రాజకీయవర్గం రిపబ్లికన్ వాదులు. వీరు లోగడ పారిస్ పార్లమా పై పట్టు సాధించి, ప్రజలను రెచ్చగొట్టి, విప్లవ మార్గాన్ని అరాచక పద్ధతుల్లో ఏర్పరచినవారు. భావావేశంతో ఉద్రేకపూరితంగా ఉపన్యసించడం వీరి లక్షణం. రాజ్యాంగం రూపొందే సమయాన ఫ్రాన్సు దేశానికి ప్రజాపరిపాలనవ్యవస్థ (Republic) ఏర్పడాలని తీవ్రంగా ఆందోళన చేసినవారు, కావడాన రాజ్యాంగాన్ని ఆచరణలో అస్పష్టము, అవ్యవస్థితమూ అని నిరూపిస్తూ, వీలైనంత త్వరగా దాన్ని విచ్ఛిన్నమూ, చేయడమూ, ప్రజా పరిపాలనావ్యవస్థను ఏర్పరచడమూ వీరి ఉద్దేశ్యం.

అయితే రిపబ్లిక్ వాదులందరూ ఏకాభిప్రాయాన్ని ఏకీకృతమైన విధానాన్ని కలిగినవారు కాదు. వారిలో డాంటన్ నాయకత్వంలోని కార్డిలియర్ క్లబ్ (Cordelier Club) తీవ్రవాదం (Radical) తో కూడిన రిపబ్లిక్ భావాలు కలిగింది. "మానవుని, పౌరుని హక్కులకు మిత్రమండలి" (Society of the Friends of the Rights of Man and the Citizen) అనే పేర ప్రారంభమై మొదటినుండి తీవ్ర రిపబ్లిక్ వాదులకు కేంద్రం అయింది.

కార్డిలియర్ క్లబ్ తరువాత ప్రధానమైంది జాకొబిన్ క్లబ్ (Jacobin Club). ఇది "రాజ్యాంగమిత్రుల సంఘం" (Society of the Friends of the Constitution) అనే పేర్ల విప్లవానికి కారణమైన ఉదారభావాలు కలిగిన మేధావులు, తాత్త్వికులతో కూడింది. విశేషించి సాధారణ ప్రజానీకంపట్ల సానుభూతి కలిగిన ప్రభువర్గ, మతాధిపతివర్గ ప్రతినిధులతో ఏర్పడింది. కనుక వీరు ప్రజల అభ్యుదయంతోపాటు రాజ్యాంగబద్ధమైన క్రమశిక్షణకు సమాన ప్రాధాన్యతనిస్తూ మితవాదాన్ని అవలంబించినవారు. కాని 1791 నుండి ఈ సంస్థ క్రమంగా రాబిస్పియరీ నాయకత్వంలోని పారిస్ పార్లమా (Parlement of Paris) ప్రభావంలోనికి పోయి అతివాద సంస్థగా రూపొందింది. ప్రజలను రెచ్చగొట్టి రాచరికంపై దాడులు, రాజ్యాంగ నిర్ణాయకసభపైన ఒత్తిడులు తెచ్చి, ఫ్రాన్సులో రిపబ్లిక్ స్థాపనకై తీవ్ర ఆందోళన చేసింది. జాకొబిన్ క్లబ్‌కు చెందిన సభ్యులు శాసనసభలో ఎత్తైన కుర్చీల్లో ఆసీనులై "పర్వతం" (Mountain) అనే మారు పేరున పిలువబడ్డారు.

### 4.3.2.3 ఫోలాన్స్ (Feuillants) :

1791 నుండి జాకొబిన్ క్లబ్ తీవ్రవాదాన్ని అవలంబించడంతో అందులోని మేధావి వర్గం - ఉన్నత వర్గాలకు చెంది, తృతీయ వర్గంతో సానుభూతి కలవారు - విడిపోయి ఫోలాన్స్ (Feuillants) అనే రాజకీయ వర్గంగా ఏర్పడ్డారు. 1792 లోని నూతన శాసనసభలోని మితవాదులైన రిపబ్లిక్‌వాదులు వీరే. రాజ్యాంగవాదుల్లోని అత్యధికసంఖ్యాకులు కూడ వీరే. అప్పటికే విప్లవం సంపూర్ణమైందని, దానిని నిలిపివేసి తదుపరి అరాచకాలకు స్వస్తి పలకాలని వారి వాదన.

### 4.3.2.4 గిరాండీలు (Girondins) :

అయితే క్రొత్త శాసనసభలోని రిపబ్లిక్ వాదులు పూర్వపు క్లబ్బుల పేరునకాక ఫోలాన్స్, గిరాండిస్టులనే పేర్లతో సమీకృతం అయినారు. ఫ్రాన్సులోని గిరాండి (Girondi) రాష్ట్రం నుండి ఎన్నికైన రిపబ్లిక్ వాదులు తీవ్రవాదులకు నాయకత్వం వహించారు. కనుక వారిని (Girondi) అంటారు. వీరు తమ ఊహాపోహలను తాత్కాలికంగా, సైద్ధాంతిక రూపం తొడిగి ఉద్రేకపూరితమైన

వాగ్ధాటితో సభను ఉద్రూతలూగించారు. తక్కిన రాజకీయ వర్గాలను నోరెత్తనీయకుండా సభపై ఆధిపత్యం వహించి నిర్ణయాత్మకమైన (decissive) పాత్రను పోషించారు.

వీరందరుకాక క్రొత్త శాసనసభలో అత్యల్ప సంఖ్యాకులైన రాచరికవాదులు (Monarchists) కూడ ఉన్నారు. సాంప్రదాయకమైన రాచరికం వల్ల ముప్పేమీ లేదని, పదునారో లూయీ వ్యక్తిగత లోపాలవల్ల మాత్రమే కాని వ్యవస్థాగతంగా రాచరికం అప్రతిష్టపాలు కాలేదని వారి అభిప్రాయం. సమర్థుడైన పదునారో లూయీ వంటి రాజు ఆ సమయంలో ఉన్నట్లయితే పరిస్థితులు అలా విషమించేవి కావని వారి విశ్వాసం. కాని రాజు, రాజ్యవ్యవస్థ అప్రతిష్టపాలై, సాధారణప్రజానీకం యొక్క ద్వేషానికి గురైవున్న ఆ తరుణంలో వారు ధైర్యంగా తమ అభిప్రాయాలను ప్రకటించలేకపోయారు.

## 4.3.3. పరిమిత రాచరికవ్యవస్థ : రాజ్యాంగ ప్రతిష్ఠంబన ఫలితాలు :

శాసనసభ సమావేశం అయిన వెంటనే రెండు బిల్లులను ప్రవేశపెట్టి, చర్చించి, ఆమోదించి, తరువాత రాజు ఆమోదానికై పంపింది. రాజ్యాంగం ప్రకారం రాజు శాసనసభ ఆమోదించి, తన అంగీకారం కొరకు పంపిన బిల్లులను కొంత జాప్యం చేయవచ్చు లేదా పునరాలోచనకై త్రిప్పి పంపవచ్చు. కాని, తిరస్కరించే అధికారం అతనికి లేదని పైన వివరించడం జరిగింది. శాసనసభ పునరాలోచించి, ఆమోదించి పంపిన వాటిని అతడు తప్పనిసరిగా అంగీకరించవలసి ఉంటుంది. కాని పదునారో లూయీ వాటిని పునరాలోచనకై పంపగా, నేరుగా తిరస్కరించాడు. దీనితో అతడు ఆమోదించిన రాజ్యాంగాన్ని అతడే ఉల్లంఘించినట్లు, రాజ్యాంగబద్ధమైన పరిమిత రాచరికంపై అతనికి గౌరవంలేనట్లు స్పష్టమై, రాజ్యాంగ ప్రతిష్టంబన (Constitutional Crisis) ఏర్పడింది.

## 4.3.3.1 అంతర్జాతీయ పరిణామాలు : పరిమిత రాచరికంయొక్క విదేశాంగ విధానం :

ఫ్రాన్సులోని రాజ్యాంగ ప్రతిష్టంభనకు తోడు కొంత అంతర్జాతీయమైన అత్యవసర పరిస్థితి కూడ ఆ సమయంలో ఏర్పడింది. 1791 ఆగస్టులో ప్రష్యా, ఆస్ట్రియా రాజ్యాధినేతలు ఫ్రెంచిరాజుకు మద్దత్తుగా సాంప్రదాయవ్యవస్థల సంరక్షణకై ఉద్యమిస్తున్నట్లు పిల్‌నిజ్ ప్రకటన చేశారు. కాని యదార్థంగా వారికి అప్పుడు ఫ్రాన్సుపై దండెత్తే ఉద్దేశ్యం లేదు. బలహీనమైన పోలెండు రాజ్యాన్ని పంచుకొని ఆక్రమించుకోవడంలో వారిరువురు పరస్పరం ఒకరిపట్ల ఒకరికి, ఇరువురికి రష్యాపట్ల అనుమానాలతో అప్రమత్తులై ఉండవలసి వచ్చింది. కాని 1791 నాటికి ఫ్రెంచి విప్లవకారుల్లోని జాతీయ భావాలు, స్వేచ్ఛాసమానత్వాలపట్ల తీవ్రమైన కాంక్ష పోలిష్ ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. అప్పటికే రెండుసార్లు ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాల విస్తరణ విధానాలకు గురిఅయి మూడువంతులు భూభాగాన్ని పోగొట్టుకొన్న పోలిష్ జాతీయవాదులు తాముకూడ ఫ్రెంచివారి వలె విప్లవం జరిపి, విదేశీ ఆక్రమణదారులను తమ దేశంనుండి వెళ్ళగొట్టడానికి సన్నాహాలు చేయసాగారు. ఈ పరిణామాలు ఆస్ట్రియా, ప్రష్యాలకు తీవ్ర ఆందోళన కలిగించాయి, ఫ్రెంచి విప్లవాన్ని అంతట అణచివేయకపోతే తమ రాజ్యాధిపత్యాలకు మొదటికి మోసం వస్తుందని భయపడ్డారు. వారు తమ పరస్పర ఈర్ష్యాసూయలను ఆవల ఉంచి, పట్టుదలతో కార్యాచరణకు పూనుకున్నారు.

1792 శాసనసభలో తమ తార్కికమైన వాదనలు, వాగ్ధాటి ఉపయోగించి ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలను ఇచ్చే గిరాండిస్టులు ప్రభుత్వ విదేశాంగ విధానంలో దూరదృష్టి లేని, ఉద్వేగభరితమైన ప్రణాళికను ప్రతిపాదించి వాదించారు. శాసనసభలో అత్యధిక సంఖ్యలో తటస్థులు, మితవాదులు ఉండడమూ, కొంతమంది రాచరిక వాదులు సైతం ఎన్నికల్లో గెలిచి, శాసనసభలో ప్రవేశించడమూ వారికి ఆశాజనకంగా లేదు. దేశప్రజానీకంలో జాతీయభావోద్వేగాన్ని కల్గించి, అది క్రమంగా రిపబ్లిక్ వ్యవస్థపట్ల తీవ్రమైన పట్టుదలగా రూపొందడం అవసరమని వారు భావించారు. అందుకై ఒక విదేశీయుద్ధం చక్కని సాధనమని, విదేశీయులతో

పోరాడుతూ, దేశ ప్రజానీకం తమ రాజకీయస్పర్ధలను, సైద్ధాంతిక వైరుధ్యాలను విస్మరించి సమైక్యమౌతుందని వారు ఊహించారు. వారిలో ఏర్పడే అటువంటి సమైక్యతా స్వేచ్ఛాసమానత్వాలకు, జాతీయ సంఘటనకు ఉపకరిస్తుంది.

ఈ ఆలోచనతో 1791 ఆగస్టులో ఆస్ట్రియా ప్రష్యాలు ఫ్రెంచిరాజుతో సానుభూతి పొంది, అతన్ని తిరగి పూర్వపు వైభవంతో సింహాసనంపై నిలపడానికి, సాంప్రదాయక రాజ్య వ్యవస్థను పునరుద్ధరించడానికి చేసిన పిల్‌నిజ్ ప్రకటన వారు ఫ్రెంచి దేశ ఆంతరంగిక విషయాల్లో అనవసర జోక్యం కలిగించుకోవడంగా, ఫ్రెంచి ప్రజల రాజకీయ స్వాతంత్ర్యాన్ని, సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడంగాను భావించారు. అందుకై వారికి తగిన గుణపాఠం నేర్పడానికి పదునారో లూయిలో ఏ మాత్రం దేశాభిమానం ఉన్నా, అతడు ప్రష్యా, ఆస్ట్రియాలపై యుద్ధం ప్రకటించవలసి ఉందని వాదించారు, ఆ విధంగా అతనిపై ఒత్తిడి తెచ్చారు. 1792 ఏప్రిల్‌లో పదునారో లూయియా యుద్ధప్రకటన చేశాడు.

## 4.3.3.2 పదునారో లూయియా చర్యలు, పరిమిత రాచరికం రద్దు :

ఈ విధమైన జాతీయ, అంతర్జాతీయ పరిణామాల్లో ఫ్రాన్సులో ఏర్పడిన రాజ్యాంగ ప్రతిష్టంభన యొక్క పూర్వాపరాలను మరింత వివరంగా తెలియవచ్చు. శాసనసభ పదునారో లూయియా ముందుంచిన రెండు బిల్లులు లోగడ రాజ్యాంగ నిర్ణాయకసభ చర్చించినవే. రాజ్యాంగంలో పొందుపరచినవే. అప్పటి నిస్సహాయస్థితిలో పదునారో లూయియా రాజ్యాంగచట్టంపై సంతకం కూడా చేశాడు. ఇప్పుడు శాసనసభ వాటిని అమలుపరచడానికి, ప్రత్యేకమైన చట్టాలుగా చేయదలచి, వాటిని రాజుముందు ఉంచింది. వాటిలో మొదటిది పలాయత ప్రభువుల (Emigree Nobles) కు సంబంధించింది. అది వారికి కొంత గడువును ఇచ్చి, ఆలోగా వారు తిరిగి వచ్చి తమ ప్రభుత్వ హోదాలు అధికారాలను రద్దుచేసుకోవాలి, తమ ఎస్టేట్లను జాతీయ ఫ్రెంచి ప్రభుత్వానికి లోబరచాలి. లేని పక్షంలో వారిని ప్రభుత్వ వ్యతిరేకులుగా, దేశద్రోహులుగా ప్రకటించి వారి ఎస్టేట్లను ప్రభుత్వం స్వాధీనపరచుకుంటుంది. పలాయతప్రభువులు ప్రష్యా, ఆస్ట్రియాల సాయంతో దండెత్తివచ్చి తనను తిరిగి పూర్వవైభంతో సింహాసనంపై నిలిపే కార్యక్రమంలో ఉన్నారు. వారిలో ప్రముఖుడు కౌంట్ ఆఫ్ ఆర్టోయి (Count of Artoise) పదునారో లూయికి స్వయానా సోదరుడు. కనుక వారిపై కఠిన నిబంధనలతో ఆజ్ఞలు జారీచేయడానికి లూయియా నిరాకరించాడు.

రెండవ బిల్లు మతవ్యవస్థ నిర్వహణకై ఉద్దేశించిన సివిల్ రాజ్యాంగం. చర్చి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, మతవ్యవస్థ నిర్వహణ భారాన్ని ప్రభుత్వమే వహించడమూ, దానివలన మతవ్యవస్థ ప్రభుత్వ శాఖల్లో ఒకటిగా, మతాచార్యులు ప్రభుత్వోద్యోగులుగా ఏర్పడడం. పదునారో లూయికి వ్యక్తిగతమైన మతవిశ్వాసాలకు ఇది విరుద్ధం కావడాన అతడు దీనిని కూడ తిరస్కరించాడు. ఈ బిల్లులను లూయియా ఆస్ట్రియా, ప్రష్యాలపై యుద్ధం ప్రకటించిన తరువాత శాసనసభ అతని ముందుంచింది. అతడు స్వయంగా ఆ దేశాలు ఫ్రాన్సుపై దండెత్తి రావాలని కోరుకుంటుండగా శాసనసభ అతని పై ఒత్తిడిచేసి యుద్ధప్రకటన చేయించింది. రోగి పాలు కావాలంటే, వైద్యుడు పాలే ఇయ్యమన్నట్లు పరిస్థితి పదునారో లూయికి కలసివచ్చినట్లయింది. ఆస్ట్రియ, ప్రష్యా సేనలు వచ్చి తనను పూర్వంవలె అధికార ప్రభావాలతో నెలకొల్పబోతున్నారనే ధైర్యంతో అతడు ఈ బిల్లులను నిర్మొహమాటంగా తిరస్కరించాడు. దానికి తగినట్టు ఆస్ట్రో - ప్రష్యాల సేనల చేతుల్లో ఫ్రెంచి సేనలు అనేకచోట్ల ఓడిపోతున్నాయి. ఒక్కొక్క యుద్ధవార్త పదునారో లూయికి ధైర్యం సంతోషం కల్పిస్తున్నాయి.

అయితే, పరిస్థితి అతనికి ఆశించినంత అనుకూలంగా లేదు. ఫ్రెంచి సేనల పరాజయం శాసనసభలోని రిపబ్లిక్ వాదులను ఆశ్చర్యానికి విచారానికి గురిచేసింది. శాసనసభలో దీనిగురించి తీవ్రమైన చర్చ జరిగింది. ఫ్రెంచి సేనల పరాజయానికి, రాజుపై రెండు బిల్లుల తిరస్కారానికి సంబంధం ఉన్నట్లు వారికి తోచింది. వెంటనే పారిస్ పార్లమా ఆధీనంలోని ప్రజల గుంపులు (Parisian mob) జూన్ 20 న రాజప్రాసాదంపై దాడిచేసి రాజును ఘోరమైన అవమానాలకు గురిచేశారు. పోతూ వారు చూపుడువేలు ఊపుతూ, బిల్లులపై సంతకం చెయ్యి ! లేకుంటే మేం మళ్ళీ రావలసి ఉంటుంది అని హెచ్చరించారు.

పదునారో లూయీకి జరిగిన అవమానం ఆస్ట్రో - ప్రష్యన్ సేనలకు అధిపతిగా దండెత్తి వస్తున్న డ్యూక్ ఆఫ్ బ్రన్స్‌విక్‌కి తెలిసింది. అతడు జూలై 25 న ఒక ప్రకటన చేసి, ఫ్రెంచిరాజును అంత నీచంగా అవమానించినందుకు పారిస్ ప్రజానీకం తగిన ప్రతిఫలం పొందుతుందని, తను ఆ నగరాన్ని ఆక్రమించగానే వారిని ఊచకోత కోయగలమనని హెచ్చరించాడు. దండెత్తి వస్తున్న ప్రజానాయకుడు శత్రురాజుపట్ల అంతటి సౌహార్దం ప్రకటించడం పారిస్ ప్రజలకు, రిపబ్లిక్ వాదులకు ఆశ్చర్యం కలిగించి, వారి అనుమానాన్ని బలపరిచింది.

### 4..3.3.3 పదునారో లూయీ పదవీచ్యుతి :

బ్రిన్స్‌విక్ ప్రభువు ప్రకటన రిపబ్లికన్ వాదులకు, పదునారో లూయీ శత్రువులతో రహస్యంగా మంతనాలు చేస్తూ సైనికరహస్యాలు చేరవేస్తున్నట్లు అనుమానం కలిగించింది. ఫ్రాన్సుదేశానికి రాజై ఉండి, ఇటువంటి అకృత్యానికి పాల్పడడం దేశద్రోహమని వారు రాజుపై ఆరోపించి, నిందించారు. ఇప్పుడు రాజు రాజ్యాంగవ్యతిరేకి, దేశద్రోహి ఆగస్టు 9. 10 తేదీల్లో ప్రజలు మరొకమారు రాజప్రాసాదంపై దాడిచేశారు. ప్రాసాద సంరక్షకులైన స్విస్ (Swiss) సైనికులను వధించారు. రాజ కుటుంబం ప్రాణభయంతో శాసన సభాభవనంలోనికి ప్రవేశించింది. వారికి ఏ విధమైన గౌరవ మర్యాదలు లేకుండ ప్రేక్షకుల గాలరీలో కూర్చోడానికి అనుమతినిచ్చారు. అప్పుడు సభలోజరుగుతున్న చర్చ రాచరికపు భవితవ్యాన్ని గూర్చి, రిపబ్లిక్‌వాదులు దేశద్రోహి అయిన రాజును నిర్బంధించి, రాచరికాన్ని పూర్తిగా రద్దు చేయడానికి నిర్ణయించారు. ఆగస్టు 10 న పారిస్ కమ్యూన్ డాంటన్ నాయకత్వంలో రాచరికాన్ని రద్దుచేసి అధికారం హస్తగతం చేసుకొంది; ఫ్రాన్సును రిపబ్లిక్‌గా ప్రకటించింది. వారిపట్ల భయంతో, వారి అదుపాజ్ఞల్లో ఉన్న ప్రజాబలాన్ని గూర్చి భయపడి శాసన సభ్యులు తీర్మానానికి అనుకూలంగా వోటు చేశారు. తనపై చేసిన ఆరోపణలకు పదునారో లూయీ సమాధానాలు ఇయ్యబోగా అతన్ని మాట్లాడనీయలేదు. అక్కడనుండి సరాసరి రాజకుటుంబాన్ని జైలుకు తరలించారు.

## 4.4 ఫ్రెంచివిప్లవంలో మూడోదశ జాతీయ సమితి (National Convention) :

1792 ఆగస్టు 10న పరిమిత రాచరికవ్యవస్థతో ఏర్పడిన ఫ్రెంచి రాజ్యాంగం, దానివలన ఏర్పడిన ప్రభుత్వమూ రద్దయినాయి. మారిన పరిస్థితికి అనుగుణంగా క్రొత్త రాజ్యాంగాన్ని తయారుచేయడము, ఆ కార్యక్రమం పూర్తి అయ్యి, క్రొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు పరిపాలన నిర్వహించడానికి జాతీయ సమితి (National Covention) అనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ జాతీయసమితి 1792 సెప్టెంబర్ 22న తొలిసారిగా సమావేశం అయింది. సెప్టెంబర్ 25 న పూర్వపు రాజకీయ విభాగాలు - ప్రభువర్గ పరిపాలనలో ఉన్న భూభాగాలన్ని రిపబ్లిక్‌లో విలీనమై, ఫ్రెంచిభాష **మాట్లాడే ప్రజా**నీకం విస్తరించి ఉన్న దేశం యావత్తు "అఖండమైన, ఏకైకమైన రిపబ్లిక్" గా జాతీయ సమితి ప్రకటించింది.

### 4.4..1 దేశంలో కల్లోల పరిస్థితి :

దండెత్తి వస్తున్న విదేశీసేనల చేతిలో ఓటమి, రాజును నిర్బంధంలోనికి తీసుకొని రాచరికాన్ని రద్దుచేయడం, ఉత్సాహంతో విదేశీయుద్ధాన్ని తెచ్చి పెట్టిన గిరాండిస్టులు అప్రతిష్ఠపాలవటం అన్నీ సాధారణమైన సంఘటనలు. ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 20 న జాతీయసమితి (National Convention) తాత్కాలిక ప్రభుత్వాన్ని చేపట్టేవరకు దేశమంతట హత్యాకాండలు, అరాచకాలు నిరాకంటంగా జరిగాయి. వాటిని అరికట్టేందుకు ఏ ప్రభుత్వమూ అప్పుడు అధికారంలో లేదు. అటువంటి పరిస్థితిలో పారిస్ కమ్యూన్ సంపూర్ణాధికారం చేజిక్కించుకొని మొదట రాజధాని పరిసర ప్రాంతాల్లోను, తరువాత క్రమంగా దేశమంతట శాంతిభద్రతలు నెలకొల్పే ప్రయత్నం చేసింది. పారిస్ కమ్యూన్‌కు అధిపతి అయిన డాంటన్ (Danton) సర్వాధికారాలు

చలాయిస్తూ నియంతృత్వం సాగించాడు. అతడు ఈ సంఘటనల క్రమం పూర్తిగా పదునారో లూయీ, అతన్ని సమర్థించే రాచరికవాదులదే బాధ్యత అని, రాచరికవాదులను నిర్మూలించడమే శాంతిభద్రతలు నెలకొల్పడంలో మొదటి మెట్టు అని ప్రకటించాడు. ఫ్రెంచి సేనలకు నాయకత్వం వహిస్తున్న లఫాయా సెప్టెంబర్ 2 న వెర్డూన్ (Verdun) వద్ద శత్రువులకు లోబడిపోయాడు. అంతట డాంటన్ "శత్రుసేనలను నిలువరించే మార్గం నా దృష్టిలో ఒక్కటే. రాచరికవాదులను భయభ్రాంతులను చేయడం, అందుకు సాహసం, మరింత సాహసం, ఎల్లవేళల మరింత సాహసం" అవసరమని ("In my opinion, the way to stop the enemy is to terrify the royalists. Audacity, more audacity and always greater audacity") చెప్పాడు. ఆ మాటతో దేశమంతటా రాచరిక వాదులను బందీలుగా పట్టుకొని, సెప్టెంబర్ మొదటివారంలో వేలకొలదిగా నరికివేశారు. దీనిని సెప్టెంబర్ హత్యాకాండ (September massacres) అంటారు. అయితే ఆ సమయంలో డాంటన్ ఫ్రెంచి సైనికబలాలను తగు విధంగా ఉత్సాహపరచాడు. లఫాయా స్థానంలో డ్యూమరిజ్ (Dumouriez) ను సేనానాయకునిగా నియమించాడు. అతని నాయకత్వంలో ఫ్రెంచి సేనలు వాల్మీ (Valmy) వద్ద ఆస్ట్రో - ప్రష్యన్ సేనలపై తిరుగులేని విజయం సాధించాయి. అది మొదలు, 1815 లో వాటర్లూ (Waterloo) వద్ద నెపోలియన్ ఓడి బంధీగా చిక్కేవరకు ఫ్రెంచి సేనలకు ఐరోపాలో ఎటువంటి అపజయం లేకపోయింది.

యుద్ధప్రారంభం నాటికి క్రొత్త ప్రభుత్వానికి తగినంత అనుభవంలేని కారణాన, అపజయాలు ఎదురైనా, రాచరిక నిర్మూలన, రిపబ్లిక్ స్థాపన, వాటివలన ప్రజల్లో తమ దేశానికి తామే సార్వభౌమాధికారులమని, తమ దేశరక్షణ బాధ్యత ప్రభుత్వానిది, ప్రభుత్వసేనలది కాక తమదేనని బలమైన విశ్వాసం ఏర్పడసాగింది. వారిలో ఈ విశ్వాసం ప్రగాఢమైన జాతీయభావాన్ని, జాతీయ సమైక్యతను కలిగించింది. ఈ పరిణామాలు ఫ్రెంచి విప్లవంలోని తదుపరిదశల్లో, ప్రభుత్వ వ్యవస్థలను స్థాపించుకొని నిర్వహించుకోవడంలోను, విదేశీదండయాత్రల నుండి దేశాన్ని సంరక్షించుకోవడంలోను అప్రమత్తులై వ్యవహరించే జాగరూకతను, చైతన్యాన్ని కలిగించాయి. ఇవి తదుపరి ఫ్రెంచి విప్లవసేనల విజయాలకు మూలకారణాలు.

### 4.4.2 జాతీయసమితి ముందున్న సమస్యలు కార్యక్రమం :

1792 సెప్టెంబర్ 20 న తీవ్రరిపబ్లిక్ వాదులైన జాకోబిన్, కార్డిలియర్ క్లబ్బులకు చెందిన అగ్రనాయకులతో ఫ్రాన్సుదేశానికి తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ అగ్రనాయకులతో కూడిన ఉన్నత సంస్థ జాతీయసమితి (National Convention) ఇది 1795 అక్టోబర్ 26 న క్రొత్త రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరిగి, శాశ్వత ప్రాతిపదికన (అనగా శాశ్వతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో మాత్రమే) రిపబ్లిక్ ఏర్పడే వరకు, మూడు సంవత్సరాలకు కొంచెం పైగా అధికారంలో ఉంది. జాతీయసమితికి డాంటన్ నాయకునిగా ఎన్నికైనాడు.

బహుశ చరిత్రలో ఏ శాసనసభ జాతీయసమితి ఎదిరించినన్ని సమస్యలను ఎదిరించి ఉండదని హేస్ (Hayes) చాల యథార్థంగా అభిప్రాయపడ్డాడు. రాజును పదవీచ్యుతుణ్నిచేసి, రాజకుటుంబాన్ని కారాగారానికి తరలించడంతో దేశమంతట రాచరిక వాదులు తిరుగుబాట్లు చేశారు. పారిస్ కమ్యూన్ క్రమశిక్షణారాహిత్యం వల్ల అరాచకాలవల్ల ప్రజల్లో ఉదారభావాల పట్ల రిపబ్లిక్ వ్యవస్థల పట్ల తీవ్రమైన అసంతృప్తి, అసహ్యమూ ఏర్పడ్డాయి. సాంప్రదాయక వాదులేకాక, రాజుపట్ల అటువంటి అనుచిత విధానం అధిక సంఖ్యాకులైన తటస్థ ప్రజానీకాన్ని కూడ రిపబ్లిక్‌కు వ్యతిరేకులను చేసింది. కనుక దేశంలో అల్లర్లు, తిరుగుబాట్లను అణచివేసి ప్రశాంతజీవన విధానాన్ని నెలకొల్పడమూ, రిపబ్లిక్ పట్ల ప్రజల్లో ఆసక్తి కలిగించడమూ అత్యవసరమైంది.

1785 లో ఎస్టేట్స్ జనరల్ సమావేశం ప్రారంభమైన నాటినుండి ఫ్రాన్సులో పరిపాలన లేకుండా పోయింది. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయింది. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు, వ్యవసాయము, పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు ఈ కాలంలోని వాదోపవాదులు, వాటినుండి ఉత్పన్నమైన అరాచకాల్లో పూర్తిగా అడుగంటినాయి. కనుక దేశంలో కరువు కాటకాలకు పరిష్కారం మరొక వైపునుండి అత్యవసరమైంది.

ఈ సమయంలో ఆస్ట్రో - ప్రష్యన్ సేనలు పారిస్‌వైపు విజయపథంలో దూసుకొని వస్తున్నాయి. దేశ రక్షణ పరిపాలనా వ్యవస్థల రక్షణ మరొక వైపునుండి అత్యవసరమైనవి. దేశ ప్రజానీకంలో ఏర్పడిన రాజకీయ వైరుధ్యాలు, వాటివలన సంఘర్షణలు అల్లర్లు దేశపరిపాలనా వ్యవస్థను, రక్షణవ్యవస్థను క్రుంగదీస్తున్నాయి. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించి, విప్లవ ఫలితంగా సాధించుకున్న స్వేచ్ఛ సమానత్వాలను జాతీయభావాలను రిపబ్లిక్‌వ్యవస్థను పటిష్ఠం చేసుకోవలసి ఉంది.

### 4.4.2.1 పదునారవ లూయీ వధ :

1791 ఆగస్టు 10న పదవీచ్యుతుడైన పదునారవ లూయీ పట్ల అనుసరించవలసిన విధానం జాతీయ సమితిలో కొంత వివాదాస్పదమైంది. రాచరికం రద్దుకావడంతో రాజవంశంయొక్క ఆవశ్యకత తీరిపోయింది. రాజుపై దేశద్రోహ నేరం మోపబడింది కనుక అతన్ని సాధారణ పౌరులవలె విచారించి శిక్ష విధించవలసి ఉంది. పదునారో లూయీని జాతీయ సమితి ముందుకు తెచ్చి, రెండు వారాలపాటు విచారణ జరిపి ఏకగ్రీవంగా అతని నేరాన్ని నిర్ధారించడం జరిగింది. ఆ విచారణ కేవలం రాజును వధించేందుకు సాకు మాత్రమే కాని యధార్థంగా నేరనిర్ధారణకు కాదు. అతన్ని దేశద్రోహిగా ఋజువు చేసే సాక్ష్యాలేవీ లేవు. అయినా, రాజువధ వలన దేశంలో సాంప్రదాయక వ్యవస్థ నిర్మూలన జరిగినట్లు స్పష్టమవుతుంది. రాచరికవాదులు ఇకపై తిరుగుబాట్లు చేయడానికి కారణమేదీ ఉండదు. కనుక గిరాండిస్టులు అతనిపట్ల కొంత సరళమైన వైఖరి అవలంబించవచ్చని వాదించినా జాకోబిన్‌లు అతని వధించవలసిందేనని పట్టుబట్టారు. 1793 జనవరి 21 న రాజును శిరచ్ఛేదం చేశాడు. "సభాసదులారా ! మీరు ఆరోపించిన ఆరోపణలు నాకు తెలియవు. అయినా నా రక్తం ఫ్రెంచి ప్రజలకు సంతోషాన్ని కలిగించవచ్చని ఆశిస్తాను" అంటూ అతడు ప్రాణాలు వదిలాడు.

చంచలమనస్తత్వంతో నిలకడలేని నిర్ణయాలు తీసుకొనడం, ఒక్కసారిగా పదవీప్రాభవాలు కోల్పోయిన పరిస్థితిని అలవరచుకొని సరిపెట్టుకోలేకపోవడం తప్ప పదునారవ లూయీలో మరే ఇతర అవలక్షణాలు లేవు. వాస్తవానికి అతడు ఉదారబుద్ధితో సామాన్య ప్రజానీకానికి ఎంతో కొంత మేలు చేయాలనే దృక్పథం కలవాడు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అయిన గ్రేట్ బ్రిటన్‌లో సైతం సుదీర్ఘకాలంలో దశలవారీగా నిరపేక్ష రాచరికాన్ని అదుపుచేయడం జరిగింది. కాని ఫ్రాన్సులో వలె శాసనసభ అత్యవసర సమావేశంలో ఆకస్మిక నిర్ణయంతో కాదు. అటువంటి అనూహ్యమైన, అసాధారణమైన పరిస్థితిలో తన పదవీప్రాభవాలను నిలుపుకోవడానికి పదునారో లూయీ ప్రాకులాడడం అసహజమేమీ కాదు. అంతేకాక, ఫ్రెంచి ప్రజానీకం అంతా రూసో, వాల్టేర్‌ల వలె తాత్వికులు కారు. విద్యా, వైజ్ఞానిక విషయాల్లో సాధారణ ప్రజానీకం చాలా వెనుకబడి, సాంప్రదాయక వ్యవస్థలు, విలువల పట్ల గాఢమైన అభిమానం కలిగి ఉంది. అందుచేత పదునారవ లూయీ వధ దేశంలో తీవ్రమైన అలజడిని సృష్టించి, సాంప్రదాయవాదులకు విప్లవవాదులకు సుదీర్ఘకాలం పోరాటాలకు, అరాచకాలకు కారణం అయింది. అంతేకాక ఐరోపాలోని అన్నిదేశాల నిరపేక్షరాజులు, ప్రభువర్గాలు ఈ సంఘటనతో దిగ్భ్రమ చెందాయి. విప్లవకారుల దుందుడుకుతనంతో ఘోరమైన పాపం జరిగిందని, ఇటువంటి విప్లవపరిణామాలను ఇక ఎంతమాత్రం సహించరాదని వారు నిర్ణయాలు తీసుకున్నారు.

### 4.4.2.2 జాతీయసమితి దేశీయ పరిపాలన (Internal Policy) :

పదునారో లూయీ అనుసరించిన విధానంవల్ల దేశ సాధారణ ప్రజానీకం పేదలు, కార్మికులు, భూములులేని కర్షకులు మొదలైన వారిలో రాచరికంపట్ల తీవ్రమైన అసహ్యము, రిపబ్లిక్ పట్ల విపరీతమైన ఆశాభావంతో కూడిన సానుకూలత ఏర్పడ్డాయి. అలాగే పలువురు విద్యావంతులు వర్తక వాణిజ్యాల వలన సంపన్నులైనవారు తీవ్రవాద రిపబ్లికన్ పారిస్‌లోని జనసమూహాన్ని రెచ్చగొట్టి, రాజుపైకి ఉసిగొల్పి, అతడు అనేక అనాలోచితమైన నిర్ణయాలు తీసుకోవడానికి, పొరపాట్లు చేయడానికి కారకులు కావడం వలన రిపబ్లికన్‌లపై కొంత అయిష్టం ఏర్పరచుకొన్నారు. అంతేకాక, సాంప్రదాయిక వ్యవస్థలపట్ల, రాచరికంపైన అభిమానం

కలవారు కూడ చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. ఈ వైరుధ్యాలు పదునారో లూయీ వధతో, ఆ తరువాత డాంటన్ రాచరిక వాదులను ఊచకోత కోయించిన సెప్టెంబర్ హత్యల (September massacers) తో బహిర్గతం అయినాయి. దేశమంతట రాచరికవాదులకు రిపబ్లికన్‌లకు వీధుల్లోనే భీకరపోరాటాలు జరిగాయి. ల్యాన్స్ (Lyons) మార్సెలెస్ (Marseilles) బోర్డో (Bordeaux) మొదలైన అనేక రాష్ట్రాల్లో ఈ అంతర్యుద్ధాలు ప్రమాదకరమైన స్థాయికి చేరి వందలాదిగా జనులు మరణించారు. లా వెండీ (La Vendee) లో సాధారణ రైతులు రాచరికవ్యవస్థను, కాథలిక్ మతవ్యవస్థను పునరుద్ధరించడానికి తీవ్రమైన తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాట్లను అణచివేయడం జాతీయ సమితి నిర్వహించిన ఘనకార్యం. ఈ అలజడుల వలన దేశ సమైక్యత, సమగ్రతలకు ముప్పువాటిల్లడం విదేశీ కూటమి (First Coalition) తో పోరాడే సమయాన అనేక అనర్థాలకు కారణం కాగలదు.

ఈ తిరుగుబాట్లను అణచడంలో జాతీయ సమితి కొన్ని ప్రయోజనాలను సాధించింది. విదేశీ రాజ్యకూటమితో పోరాడడానికి కావలసిన జాతీయసమైక్యతను సాధిస్తూనే, ప్రజల్లో జాతీయభావం సుస్థిరం కావడానికి, తద్వారా ప్రజాస్వామ్యంలోని రాజకీయవైరుధ్యాలు బలహీనం కావడానికి కృషిచేసింది. జాతీయభావాలు బలపడడం రిపబ్లికన్ భావాలు బలపడడానికి దోహదంచేసింది. అందుకు కేవలం సైనికబలంతో తిరుగుబాట్లను అణచివేయడం మాత్రమేకాక, దేశరక్షణలోను, ప్రజలు తాము ఇష్టపూర్తిగా నిర్మించుకున్న రిపబ్లిక్ వ్యవస్థను రక్షించుకోవడంలోను నిమగ్నులై దేశభక్తిని, జాతీయాభిమానాన్ని అలవరచుకొనే విధంగా విదేశాంగ విధానాన్ని రూపొందించడం వలన జరిగింది. ఈ అంశం తరువాత ఖండికలో మరింత వివరంగా తెలియవస్తుంది.

### 4.4.2.3 భీతావహపాలన ( Relgn of Terror) :

అయితే, తిరుగుబాట్లను అణచివేయడంలో జాతీయసమితి అవలంభించిన దారుణమైన నియంతృత్వ విధానాన్ని భీతావహ పాలన (Relgn of Terror) అంటారు. తిరుగుబాట్లను అణచే అధికారాన్ని జాతీయ సమితి ప్రజాసంరక్షక మండలి (Committee of Public Safety) కి అప్పగించింది. రాబిస్పియరీ అధిపతి, సెయింట్ జస్ట్, కార్నాట్‌లు మిగిలిన సభ్యుల్లో ప్రముఖులు. ప్రజాసంరక్షక మండలికి అనుబంధంగా రక్షకమండలి (Committee of General Safety) విప్లవన్యాయస్థానము (Revolutionary Tribunal) అనే రెండు విభాగాలు ఉంటాయి. సాధారణ సంరక్షణ మండలి ఆధీనంలోనే పోలీసు వ్యవస్థ పనిచేసేది. విప్లవ న్యాయస్థానములో అమలు జరిగే న్యాయసూత్రంలా లా ఆఫ్ సస్పెక్ట్స్ (Law of Suspects).

లా ఆఫ్ సస్పెక్ట్స్ ప్రకారం ఎవరైనా, ప్రభు వర్గానికి చెందినవారు, 1789 ముందు ఏదైన ప్రభుత్వ పదవిని పొందినవారు, పలాయత ప్రభువులకు బంధువులు, మిత్రులు అయినవారు, లేదా 1791 రాజ్యాంగం ప్రకారం పౌరహక్కులకు అర్హత సంపాదించుకోలేనివారు, అనుమానించి శిక్షించదగినవారు. వారిని అదుపులోనికి తీసుకోవడమూ, విప్లవ న్యాయస్థానాల్లో విచారించడమూ, తరువాత శిక్షించడమూ - ఈ కార్యక్రమం ప్రజారక్షక మండలి నిర్వహించేది. వారు ఏ నేరమూ చేసి ఉండకపోవచ్చు, కాని అనుమానించదగినవారు కనుక విప్లవ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టటమూ, వారి సంఖ్య వందల్లో ఉండేది కనుక, విచారణ జరిగినట్లు కొద్దిసేపు కాలక్షేపం చేసి, శిక్ష విధించడమూ జరిగేది. విప్లవ న్యాయస్థానం విధించేది అందరికి ఒకే శిక్ష, అది గిలూటిన్ (Guillotine) పై కెక్కించి, శిరచ్ఛేదం చేయడం. గిలూటిన్ అనే యంత్రాన్ని అందుకొరకై కనిపెట్టి నిర్మించారు. పదునాల్గోలూయీని అలాగే వధించడం జరిగింది. ఇటువంటి న్యాయస్థానాలు, గిలూటిన్ యంత్రాలు నిలిపి ఉంచే విప్లవ మైదానాలు (Revolutionary Square) ఫ్రాన్సు దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోను ఏర్పాటు అయినాయి. అవి స్థానిక న్యాయస్థానాలు (Local Tribunals) 1793 - 94 సంవత్సరాల్లో సుమారు ఒకటిన్నర సంవత్సరాలు ఈ విధమైన భీతావహపాలన జరిగి, ఒక్క పారిస్ నగరంలో అయిదు వేల మంది శిరచ్ఛేదం పొందారు.

మొదట్లో పైన పేర్కొన్నట్లు రాజవంశీయులు, ప్రభువర్గాలతో సంబంధం కలవారు విప్లవ వ్యతిరేకులుగా ఈ విధమైన మారణకాండకు 1793 వరకు గురయ్యారు. తరువాత రిపబ్లికన్‌ల వంతు వచ్చింది. రిపబ్లికన్‌లతో కొందరికి సరైన పట్టుదల, అంకిత భావము లేనట్లు, పదునారో లూయీని కూడ క్షమించి వదలివేయవచ్చునని భావించడమూ శిక్షార్హమైన నేరాలుగా భావించడం జరిగింది. ఈ వర్గానికి చెందిన డ్యుమరిజ్ ఆస్ట్రో-ప్రష్యన్ సేనలకు వెర్డూన్ వద్ద ఓడి లొంగిపోయాడు. ఈ కారణాలవల్ల గిరాండిస్టులు ఈ వరుసలో తలలు పోగొట్టుకున్నారు. వారిలో టెన్నిస్‌కోర్టు ప్రమాణం నాడు తృతీయవర్గ సమావేశానికి అధ్యక్షత వహించి, ప్రమాణం చేయించిన థామస్ బైలీ, గిరాండీ సభ్యులలో ప్రముఖురాలు మేడమ్‌రోలా (Madame Rolland) ఉన్నారు. మేడమ్‌రోలా గిలూటిన్ పైకెక్కిన తరువాత, ఓ స్వేచ్ఛా ! నీ పేరున ఎన్ని దారుణాలు జరుగుతున్నాయో చూడు ! (Liberty ! What crimes are committed in thy name!) అన్నది. గిరాండిస్టులను జాతీయ సమితి నుండి బహిష్కరించి, గిలూటిన్ పై వధించడానికి కారకుడైన మార (Marat) ను చార్లొట్టీ కార్డె (Charlottee Corday) అనే యువతి, గిరాండిస్టుల మద్దత్తుదారు వధించడంతో వారిపై దహనకాండ మరింత అధికమైంది. అక్టోబర్ 1893 వరకు ఈ విధంగా గిరాండిస్టులను వధించడం జరిగింది.

జాతీయసమితి ఆదేశానుసారం చర్చిలను ప్రార్ధనామందిరాలుగా కాక, ఆలోచనామందిరాలు (Temples of Reason) గా ఆలోచనలసారం నాస్తికత్వంగా ఆచరిస్తూ కొందరు పారిస్ యువకులు బహిరంగంగా నాస్తికత్వాన్ని గూర్చి ప్రకటించసాగారు. వారు చర్చి భవనాలను, మతాధిపతులను అణచివేయడంతో వారి తీవ్రవాదం శిక్షార్హంగా కనిపిస్తుంది. వెంటనే విప్లవ న్యాయస్థానం ముందుకు వారిని ప్రవేశపెట్టడం గిలూటిన్‌తో వధించడం జరిగింది. అనుమానితులను గుర్తించి విచారించడమూ, శిక్షించడంలో ఒకేచోట పనిచేయడానికి జాప్యం జరుగుతున్నదని; కనుక దానిని నాలుగు విభాగాలుచేసి (పారిస్ నగరానికి మాత్రం) గిలూటిన్ యంత్రాలను బండ్లపై ఉంచి, సంచార వధ్యస్థానాలు (Revolutionary Square) ఏర్పరచాలని జాక్‌రేని హెబర్ట్ (Jaxquas Rene Hebert) అనే తీవ్ర రిపబ్లిక్ వాది కొందరు అనుమాయులతో కలిసి వాదించాడు. జాతీయ సమితి 1794 మార్చిలో వారి తీవ్రవాదాన్ని సహించక వారందరిని గిలూటిన్‌పై వధించి, శిక్షించింది.

ఈ వివరణ వలన భీతావహపాలన జరిగిన తీరు విశదమౌతుంది. డాంటన్ నాయకత్వంలోని జాతీయసమితి (National Convention) రాబిస్పియిరీ నాయకత్వంలోని ప్రజారక్షక మండలి (Committee of Public Safety) భావించిందే విప్లవం, నిర్వహించిందే రిపబ్లిక్, దానికి వ్యతిరేకులైన రాచరికవాదులు, స్వాధికార వర్గాలకు చెందినవారే కాదు, రిపబ్లిక్ వాదులే అయిన గిరాండిస్టులు సైతం వధించబడ్డారు. అంతేకాదు రిపబ్లిక్ పట్ల వారికంటే తీవ్రభావాలు ఉన్నందున హెబర్ట్, అతని అనుచరులు సైతం వధించబడ్డారు. కల్లు తాగిన కోతులవలె జాతీయసమితి అధినేతలు ఈ విధంగా విచక్షణారహితంగా జరిపిన భీతవహపాలన కొంతకాలం జరిగిన తరువాత, 1794 మే నెలలో ఫ్రాన్సులో రిపబ్లిక్ వ్యతిరేకత అంతరించింది కనుక ఈ మారణ కాండను నిలిపి వేయవచ్చునని డాంటన్, సెంట్‌జస్ట్, ఇంకా కొందరు అగ్రనేతలు భావించారు. ఆ కారణాన రాబిస్పియిరీ వారందరిని గిలూటిన్ పైకెక్కించి శిరచ్ఛేదం చేయించాడు.

### 4.4.2.4 థెర్మిడోరియన్ ప్రతిచర్య (Thermidorian Reaction) :

రాబిస్పియిరీ ఆశయం కేవలం రిపబ్లిక్ వ్యతిరేకతను అంతం చేయడంకాదు; ఉత్తమ స్థాయికి చెందిన సద్గుణ సంపన్నమై రిపబ్లిక్ (Republic of Virtue) ను నెలకొల్పడం, అందుకై రిపబ్లిక్‌వాదుల్లో సైతం సరైన అవగాహన, అంకితభావము లేని వారందరిని నిర్మూలించడం. ఈ ఉద్దేశ్యంతో, లేదా ఈ సాకుతో అతడు రిపబ్లిక్‌వాదుల్లో మితవాదాన్ని, అతివాదాన్ని కూడ సహించలేదు. అయితే అతడు ఆశించిన రిపబ్లిక్‌ను ఆమోదించి అనుసరించే స్థితిలో ఫ్రెంచి ప్రజానీకం లేదు. అతని రిపబ్లిక్ కమ్యూనిస్టుల తరువాత కాలంలో ఊహించిన రాజ్యరహితసమాజం (Stateless Society) వంటిది. అందుకు సాధనంగా

వారు శ్రామికజన నియంతృత్వం (Proletariat Dictatorship) రాబిస్పియిరీ భీతావహపాలనను అనుసరించాడు. ఈ విధమైన భీతావహపాలన కొనసాగింపు అతనికంటె తీవ్రవాదులైన జాతీయసమితి సభ్యులు అతన్ని అనుచరులతో సహా 1794 జులైలో గిలొటిన్ పైకి ఎక్కించడం, వధించడంతో అంతమైంది. రాబిస్పియిరీకి వ్యతిరేకంగా వచ్చిన ఈ అంతర్గత తిరుగుబాటును 1794 థెర్మిడోరియన్ ప్రతిచర్య (Thermidorian Reaction) అంటారు.

థెర్మిడోరియన్ ప్రతిచర్యలో అంతమైన భీతావహపాలన వికృతమైన రాక్షసత్వమే అయినా, కొంతవరకు ఫ్రెంచి ప్రజానీకంలో రిపబ్లిక్ వ్యతిరేకతను అణచివేయడానికి, జాతీయ సమైక్యత సాధించడానికి ఉపకరిస్తుంది. ఆ తరువాత కూడ దాని ఛాయలు అప్పుడప్పుడు కానవచ్చినా, జాతీయ సమితి వాటిని సకాలంలో అదుపుచేసి, రిపబ్లిక్ వాదులకు, సాంప్రదాయవాదులకు నడుమ సంఘర్షణలను నివారించింది.

థెర్మిడోరియన్ ప్రతిక్రియ నాటికి జాతీయసమితి తలపెట్టిన రిపబ్లికన్ రాజ్యాంగం రచించడం ప్రారంభించింది. దాని నిర్మాణం పూర్తిచేసి, దాని ప్రకారం ఎన్నికలు జరిపి శాసనసభలలోనికి సభ్యులను, వారినుండి, ప్రభుత్వాధినేతలను నియమించడం పూర్తిచేసి 1795 అక్టోబర్ 27 న నూతన రిపబ్లిక్ ప్రభుత్వాన్ని, లేదా మొదటి ఫ్రెంచి రిపబ్లిక్‌ను నెలకొల్పి, జాతీయసమితి తనను తాను రద్దు చేసుకుంది. ఆరోజున నూతన శాసనసభల్లోని సభ్యులు, ప్రభుత్వాధినేతలు ఊరేగింపుగా సభా భవనానికి వెళుతున్న సమయంలో అప్పటివరకు జరిగిన మారణకాండకు కారకులన్న ద్వేషంతో సాంప్రదాయకవాదులు వారిపై దాడిచేయ ప్రయత్నించారు. ఆ సమయంలో ఒక చిన్న సైనిక పటాలానికి నాయకుడుగా, ఊరేగింపుకు సంరక్షణ బాధ్యతను నిర్వహిస్తున్న నెపోలియన్ బోనా పార్టీ ఒక్క తూటాను కూడ పేల్చకుండ, ఏ విధమైన నష్టం లేకుండ అల్లర్లను అదుపుచేసి డైరెక్టరీ ప్రశంసలు పొందాడు.

### 4.4.2.5 జాతీయసమితి పాలనా సంస్కరణలు :

కేవలం భీతావహపాలనతో సుమారు రెండు సంవత్సరాలు ఘోర మారణకాండ జరిపి జాతీయసమితి ప్రజల ద్వేషానికి గురైనా, అనాటి క్లిష్టపరిస్థితిలో ప్రజలను అదుపులో ఉంచడానికి, దేశ సమస్యలను ఎదిరించడంలో సంసిద్ధులను చేయడానికి కొంతవరకు అత్యయిక (Emergency) పాలన అవసరమని అంగీకరించడం యుక్తం. ఆ విధంగానే కాక జాతీయసమితి రిపబ్లికన్ విధానంలో దేశపరిపాలనకు అవసరమైన అనేక కార్యక్రమాలు చేపట్టింది. వీటిలో చాలావరకు లోగడ 1791 రాజ్యాంగంలో పొందుపరచిన నిర్ణయాలు, తదుపరి పరిమితరాచరికం చేపట్టినవి. అయితే పరిమితరాచరికం అల్పాయుష్కత (short-lived) వలన, పదునారో లూయీ అవివేకంగా తీసుకున్న నిర్ణయాలు, చర్యలు, తీవ్రవాదులైన రిపబ్లికన్‌ల యుద్ధాసక్తి ఈ పరిపాలనా సంస్కరణలు కార్యరూపం ధరించడానికి అవరోధాలైనాయి. కాగా రాచరికాన్ని రద్దుచేసి, ప్రజల్లో రాజకీయ వైరుధ్యాలను భీతావహపాలనతో అదుపుచేసి జాతీయసమితి ఈ సంస్కరణలను ఆచరణాత్మకం చేసింది. ఈ సంస్కరణలు, వాటివలన ఏర్పడిన వ్యవస్థలు, తరువాత ఫ్రాన్సుదేశం అనేక రాజకీయ పరిణామాల్లో ఒడిదుడుకులకు లోనైనా, శాశ్వతమై, నేటికి నిలచి ఉన్నాయి. ఫ్రెంచివిప్లవం కొన్నివిధాల విఫలమైనట్లు నిర్ధారించినా, ఈ శాశ్వత ప్రయోజనాల దృష్ట్యా కొన్ని విధాలుగా అది విజయవంతమైందని చెప్పడానికి వీలు కలుగుతున్నది. ఈ పరిపాలనా సంస్కరణలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

1) జాతీయ సమితి అంతర్గతంగా రాజకీయవైరుధ్యాలను అదుపుచేసి, బయటనుండి ఐరోపా దేశాల మొదటిసంకీర్ణ కూటమి (First Coaliltion) ను ఎదిరించడంలో ప్రజలను కార్యోన్ముఖులుగా చేయడంలో జాతీయ సమైక్యతను గణనీయంగా సాధించింది. అంతేకాక ప్రజలు తమ దేశం కొరకు, దేశరక్షణ, ప్రజాభీష్టమైన పరిపాలనను నెలకొల్పుకోడానికి ఏ త్యాగానికైనా సంసిద్ధులు కావడానికి అసమానమైన కృషి చేసింది. స్త్రీలు పురుషులు; వయసువారు, ముసలివారు అనే విభేదాలు లేక

తమవంతు కృషితో ప్రతిఒక్కరు దేశాన్ని రక్షించుకోవడంలో నిమగ్నులు కావడాన్ని 1794 లో ఒక శాసనంచేసి, వివరించింది. ఈ శాసనం జాతి (అనగా ఫ్రెంచి జాతి) యుద్ధంలో ఉన్నదని (Nation at arms) అని ప్రకటించి నిజమైన జాతీయ సైన్యాన్ని ప్రజలనుండి తయారుచేసి, విదేశీ దండయాత్రలను ప్రతిఘటించడానికి ఉద్దేశించింది. ఈ చట్టం దేహదారుఢ్య కలిగిన ఫ్రెంచి యువకులందరు తప్పనిసరిగా సైన్యంలో చేరి దేశరక్షణకై పోరాడడాన్ని విధించింది. "యువకులు యుద్ధభూమికి వెళ్ళాలి, వివాహితులైన వారు ఆయుధాల తయారీలోనూ, సరఫరా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి; స్త్రీలు సైన్యం కొరకు దుస్తులు గుడారాలు తయారుచేయడం; ఆస్పత్రులలో సేవచేయడం; పిల్లలు ముడిప్రత్తినుండి గింజలు తీసి; నూలు తీయడానికి వీలుగా ఏకులు చేయాలి; వృద్ధులు జనసమూహాల్లో దేశభక్తిని, క్రమశిక్షణను కలిగించే విధంగా పోరాడుతున్న సైనికులకు ధైర్యం కలిగేలా, దండెత్తి వస్తున్న శత్రువులపట్ల ద్వేషభావం కలిగేలా ప్రసంగాలు చేయాలి. అందరు కలిసి ఫ్రెంచి రిపబ్లిక్ రక్షణకై పాల్గొనాలి".

ఈ విధమైన నిర్బంధ సైనికశిక్షణ, సేవ; జాతియావత్తు పోరాడటానికి సిద్ధం అయ్యే సైనికవిధానం (militarism) ఐరోపాలో అంతకు ముందెన్నడూ లేదు. ఫ్రెంచి వారిని చూచి జాతీయ భావాలు, ప్రగాఢమైన దేశాభిమానం అలవరచుకున్నట్లే క్రమంగా ఐరోపా దేశాలన్నీ ఈ సైనికవిధానాన్ని అనుకరించడం ప్రారంభమైంది. ప్రజల్లో ఏర్పడిన రాజకీయ చైతన్యంతోబాటు ఈ సైనికవిధానం మున్ముందు ఐరోపాదేశాలను యుద్ధోన్మాదులుగా చేసింది. ఆ దేశాలు వలసవాద, సామ్రాజ్య విస్తరణవిధానాల్లో తమ మధ్య పోటీని ప్రధానంగా సైనికసాయంతో తీర్చుకుంటూ ప్రపంచ యుద్ధాలకు దారితీయడానికి కారణం అయింది.

2) లోగడ 1791 రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా ఫ్రాన్సు దేశం అంతటికి వర్తించే న్యాయసూత్ర నిబంధనలను రూపొందించే కార్యక్రమాన్ని జాతీయ సమితి ప్రారంభించింది. విప్లవ ఫలితంగా సాధించుకున్న సాంఘిక, ఆర్థిక సర్వజనసమానత్వం స్థిరపడడానికి దేశ ప్రజానీకం అంతటికి ఒకే న్యాయసూత్ర నిబంధనలు అవసరం. అయితే ఈ కార్యక్రమం నెపోలియన్ బోనాపార్టీ పరిపాలనా కాలం పూర్తి అయింది.

ఈ న్యాయనిబంధనలు అప్పు తీర్చలేని వారిని జైలులో ఉంచడాన్ని తొలగించాయి. ఫ్రాన్సు తన వలసరాజ్యాల్లో బానిసవ్యాపారాన్ని చేయడాన్ని నిషేధించింది. స్త్రీలకు ఆస్తిలో వాటా ఏర్పరచాయి; జ్యేష్టునికి పిత్రార్జితంలో అత్యధిక భాగం, శ్రేష్టమైన వాటాలు ఇచ్చే సంప్రదాయాన్ని తొలగించి, పిత్రార్జితంలో వారసులందరికి సమానమైన వాటాలు ఏర్పరచింది.

3) ఫ్రాన్సు దేశమంతట వర్తించే ఒకేవిధమైన తూనికలు కొలతలతో మెట్రిక్ విధానాన్ని (metric systems) ఏర్పరచి, కొనుగోళ్ళను క్రమబద్ధం చేసింది. దీనిప్రకారం రాసిని (Unit) నూరు భాగాలుగా. లీటరుకు నూరు సెంటీలీటర్లు, సెంటీ లీటరుకు నూరు మిల్లీలీటర్లు, అలాగే మీటరు కొలమానంలో నూరు సెంటీమీటర్లు, సెంటీమీటరుకు నూరు మిల్లీమీటర్లు ఏర్పరచింది.

4) ఫ్రాన్సు దేశం అంతట వివిధమైన భాషలు ఉండడాన్ని తొలగించి, ఫ్రెంచి భాషను రాజభాషగా ఏర్పరచింది. దేశ సరిహద్దు రాష్ట్రాల్లో లోగడ ఇటాలియన్, జర్మన్, ఫ్లెమిష్ భాషలుకూడ వాడుకలో ఉండేవి. దీనివలన జాతీయ సమైక్యతకు భంగం కలుగుతుందనే ఉద్దేశ్యంతో దేశమంతట ఫ్రెంచి భాషను ఉపయోగించడాన్ని విధించింది.

5) సాంప్రదాయక వ్యవస్థలను నిర్మూలించి, వినూత్నమైన రిపబ్లిక్ విధానాన్ని అవలంబించిన తరువాత పూర్వపు సాంప్రదాయాలే కొనసాగడాన్ని జాతీయసమితి హర్షించలేదు. అనేక విషయాల్లో నూతన విధానాలను రూపొందించిన వైనం పైన వివరించడం జరిగింది. అదే విధంగా పూర్వపు గ్రిగోరియన్ కాలెండర్ ఉపయోగించడం మాని, దశాంశ పద్ధతిలో (Metric) రోజులను లెక్కించి, నెలలకు ప్రకృతిసిద్ధమైన కాలసంకేతాలతో పేర్లతో కొత్త కాలెండర్ విధానాన్ని రూపొందించింది. ఈ కాలెండర్ ఫ్రాన్సు దేశాన్ని రిపబ్లిక్‌గా ప్రకటించిన తేదీనుండి ప్రారంభం అవుతుంది. సంవత్సరంలో 12 నెలలు, నెలకు పదేసి రోజుల చొప్పున మూడు వారాలు ఉంటాయి. ప్రతి పదవరోజు సెలవుగా నెలకు మూడు సెలవులుంటాయి. సంవత్సరంలో

చివరగా మిగిలే అయిదు లేక ఆరు రోజులు కూడ జాతీయ సెలవు దినాలుగా పరిగణించడం జరిగింది. ఈ క్రొత్త కాలెండర్‌లో మొదటి నెల వెండిమైరీ (Vendimaire) గ్రిగోరియన్ కాలెండర్‌లో సెప్టెంబర్ - అక్టోబర్ నెలలకు సమానం. తరువాత నెలలు వరుసగా బ్రూమైరీ (Brumaire) ఫ్రిమైరీ (Frimaire), నైవేసి (Nivese), ప్లువియోసి (Pluviose) వెన్టోసీ (Ventose), జెర్మినల్ (Germinal) ఫ్లోరియల్ (Floeal), ప్రెయిరియల్ (Prairiel) మెస్సిడోర్ (Messidor), థెర్మిడోర్ (Thermidor), ఫ్రక్టిడోర్ (Fructidor).

6) ఫ్రాన్స్‌దేశం రిపబ్లిక్ వ్యవస్థలో కొనసాగడానికి సాంఘిక, ఆర్థిక సమానత్వం ప్రధానమని భావించిన జాతీయసమితి, కేవలం స్వాధికారవర్గాలను, ముఖ్యంగా ప్రభువర్గాన్ని నిర్మూలించడంతోనే సమానత్వం సిద్ధించదని, మరికొంత ప్రయోగాత్మక చర్యలను చేపట్టింది. ఈ చర్యలు కొంతవరకు ప్రభుత్వపరంగా సామ్యవాదాన్ని (Socialism) నెలకొల్పడానికి ఉద్దేశించినవి. ప్రభువర్గము, ముఖ్యంగా పలాయత (Emigree) ప్రభువులకు చెందిన విస్తారమైన పంటభూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందుకు ప్రభువర్గానికి ఏ విధమైన పరిహారం చెల్లించలేదు. పలాయతప్రభువులను శాశ్వతంగా ఫ్రాన్సునుండి వెళ్ళగొట్టినట్లుగా జాతీయసమితి ప్రకటించింది. ఈ చర్యలతో విప్లవపూర్వం ఫ్రాన్సులో ఉన్న సాంఘిక, ఆర్థిక తారతమ్యాలు చాలవరకు అంతరించాయి. ఈ సంస్కరణలను ప్రవేశపెట్టినప్పుడు మార (Marat) "ఇప్పటివరకు సంపన్నులు పేదల మజ్జ (Marrow అనగా ఎముకల్లోని మధ్య భాగంలో ఉండే గుజ్జు) ను పీల్చివేశారు. ఇప్పుడు వారు తమ దుష్కృత్యానికి తగినట్లుగా తీవ్రమైన అణచివేతను అనుభవిస్తారు" అన్నాడు. ఈ విప్లవభావంలో సైద్ధాంతిక నిబద్ధత కంటె కక్షసాధింపు ప్రధానోద్దేశ్యంగా కానవస్తుంది.

సాధారణ ప్రజానీకంలో అధిక శాతానికి ఈ సంస్కరణల వల్ల సాగుభూములపై యాజమాన్యహక్కులు ఏర్పడినా, విలాసాలకు లోనై కొద్ది కాలంలోనే వారు తమ ఆస్తులను పోగొట్టుకొనడమూ, అవి క్రమంగా తిరిగి సంపన్నవర్గం ఏర్పడడానికి కారణం అవడము జరుగుతుంది. అందుచేత వారి జీవన ప్రమాణాలు అదుపుచేసి తక్కువ స్థాయిలో ఉంచడానికి అవసరమైనంతమేర వారికి ఋణాలను ఇచ్చి, వాటిని తిరిగి చెల్లించడంతో పొదుపుకు అవకాశం కల్పించడానికి జాతీయ సమితి నిర్ణయించింది. అంతేకాక అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ప్రభుత్వ చట్టాల ద్వారా నియంత్రించి అమలు జరిపింది. ఈ చట్టాలను "లాస్ ఆఫ్ మాక్జిమమ్ (Laws of Maximum) అంటారు. అలాగే వివిధమైన వృత్తిపనివారికి, ఉద్యోగులకు వేతనాలను కూడ వారి అవసరాలకు సరిపడినంత వరకే నిర్ణయించి, అధిక మొత్తాలలో వారివద్ద సంపద సమకూడడాన్ని నిరోధించింది.

1794 జూలైలో థెర్మిడోరియన్ ప్రతిచర్య తరువాత, రాబిస్పియిరీ పతనంలో భీతావహపాలన అంతం కావడంతో అనేక ఇతర చట్టాలు కూడ రద్దు అయినాయి. మొదటి లా ఆఫ్ సస్పెక్ట్స్ (Law of Suspects) దానితోపాటు విప్లవన్యాయస్థానం (Revolutionary Tribunal) రద్దు అయినాయి. అవి అమలులో ఉండగా లాస్ ఆఫ్ మాక్జిమమ్ (Laws of Maximum) కఠినంగా అమలు జరిగి అవి నీతికి పాల్పడిన వారందరిని కఠినంగా శిక్షించడం జరిగింది. అయితే 1794 జూలై తరువాత ఈ చట్టాలన్నీ రద్దు అయినా, దేశ ప్రజానీకంలో కఠినమైన క్రమశిక్షణ ఏర్పడింది. చాలావరకు ఈ సంస్కరణలను ప్రజలు ఇష్టానుసారంగానే అనుసరించసాగారు.

### 4.4.2.6 సద్గుణ సంపన్నమైన రిపబ్లిక్ (Republic of Virtue) :

పైన వివరించిన పరిపాలనాసంస్కరణలు చాలవరకు నూతన సామాజిక, ఆర్థిక వ్యవస్థల నిర్మాణానికి, దానిపై ఆధారపడి ప్రజాపరిపాలనావ్యవస్థ (Republic) పటిష్టంగా నిలిచి ఉండడానికి అవసరమైనవి. అవి ప్రధానంగా రూసో ప్రతిపాదించిన ప్రకృతిసిద్ధ సమాజం (State of Nature) ను పునరుజ్జీవింప చేయడానికి సాధనాలుగా యోచించి అమలుచేయ తలపెట్టినవి.

ఈ ఆదర్శం ముఖ్యంగా రాబిస్పియిరీది. అతడు సామాజిక, ఆర్థిక సమానత్వం, తాత్త్విక పురోగమనం సాధించడం ద్వారా అలాగు సద్గుణ సంపన్నుడైన రిపబ్లిక్‌గా ఫ్రాన్సు దేశాన్ని తీర్చిదిద్ద పూనుకున్నాడు. ప్రభువర్గాన్ని నిర్మూలించడం వలన, వారి అధీనంలోని పంట పొలాలను సాధారణ ప్రజానీకానికి అమ్మడంవలన అతని ఆశయాలు కొంతవరకు సాధ్యమైనాయి. అదేవిధంగా మతవ్యవస్థ నిర్వహణను ప్రభుత్వం చేపట్టడమూ పైన వివరించడం జరిగింది. జాతీయసమితి ప్రభుత్వ నిర్వహణలోని చర్చి భవనాల్లో సాంప్రదాయకమైన ప్రార్థనలు, ప్రవచనాలు జరగడంవల్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. అన్ని విధాలైన సాంప్రదాయాలను నిర్మూలించడమూ, వాటి స్థానంలో నూతన విధానాలను ఏర్పరచడమూ జాతీయసమితి ఆశయంగా పైన వివరించడం జరిగింది.

కేవలం కఠినమైన చట్టాలను చేసి వాటిని కర్కశంగా అమలు చేయడం వలన రిపబ్లిక్ సుస్థిరం కాదని, ప్రజాబాహుళ్యం విజ్ఞతాయుతమై, సహజంగానే దానిపట్ల ఆసక్తి అంకితభావం కలిగి ఉండాలని రూసో గ్రంథాలను ఆద్యంతం అధ్యయనం చేసిన రాబిస్పియిరీ ఆశించాడు. అందుకొరకు ప్రజాబాహుళ్యాన్ని సద్గుణ సంపన్నుడైన రిపబ్లిక్ (Republic of Virtue) ఏర్పడేలా చేయడానికి అతడు కంకణం కట్టుకున్నాడు. మతాలు మూఢభావాలను ఆచారాలను అలవరచి, ఆలోచనలను రానీయవు. అంతేకాక, వివిధ మతాలు, మతశాఖలు ప్రజలను రెచ్చగొట్టి సంఘర్షణలకు, అంతర్యుద్ధాలకు దారితీస్తాయి. కనుక మత బోధలు, ప్రార్థనలకు మారుగా చర్చి భవనాలు విమర్శనాయుతమైన ఆలోచనలను కలిగించేవిగా రూపొందించడానికి అతడు ప్రణాళికలు చేశాడు. సూక్ష్మంగా చెప్పాలంటే ఫ్రాన్సు దేశంలో అన్నివిధాలైన క్రైస్తవ మతశాఖలను, ముఖ్యంగా అధికసంఖ్యాకులు అనుసరించే రోమన్ కాథలిక్ మతాన్ని తొలగించి, మతవిశ్వాసాలకు ఆధ్యాత్మిక విలువలకు తావులేని లౌకిక (Secular) మైన ఆలోచనా విధానాన్ని నెలకొల్పడం అతని ఆశయం. ఈ ఉద్దేశ్యంతో అతడు చర్చి భవనాలు ఆలోచనాలయాలు (Temples of Reason) గా చేయడంతో వందలాదిగా రోమన్ కాథలిక్ బిషప్పులు, బోధకులు (Priests) ఉద్యోగాలు వదలిపెట్టిపోయారు. ఈ కార్యక్రమాన్ని రాబిస్పియిరీ 1793 నవంబరులో పారిస్‌లో పారిస్ కమ్యూన్ ఆధ్వర్యంలోని నోటర్‌డేమ్ (Notre Dame) కేథిడ్రల్‌లో ప్రారంభించాడు. వోల్టైర్ ప్రతిపాదించిన డీఇజమ్ (Deism) మాత్రం ఈ కార్యక్రమంలో అంగీకరించబడింది.

డీ ఇజమ్ అన్ని విధాలైన మతాచారాలను, ప్రార్థనలు, పవిత్రగ్రంధ పఠనాలు, దైవకథలను (Mythologies) అనవసరమైనవిగా, ప్రపంచానికి మూలమైన పరమాత్ముడొకడున్నాడని మనసులో ఉంచుకుంటే చాలునని బోధిస్తుంది. మానవుడు తన భారాన్ని దైవంమీద వేస్తే దానిని మోయడానికి ఆయన సిద్ధంగా లేడని, కనుక మానవుడే తన జీవితాన్ని చక్కదిద్దుకోవాలని ప్రబోధిస్తుంది. కనుక డీ ఇజమ్ రాబిస్పియిరీ ఆలోచనలకు ప్రతికూలం కాదు. మానవసమాజం యావత్తు విజ్ఞతాయుక్తమై, చైతన్యవంతమై, సామాజిక రాజకీయ వ్యవస్థలను స్వయంగా సంరక్షించుకుంటూ, నిర్వహించుకుంటూ ఉంటే అవి రిపబ్లిక్‌కు ప్రాతిపదిక అవుతాయని అతడు యోచించాడు. అటువంటి జ్ఞానము, సత్ప్రవర్తన కలిగించే ఆలోచనాలయాలుగా Temples of Reason) చర్చి భవనాలు రూపొందించే ప్రయత్నం ప్రారంభించాడు.

అయితే సాధారణ ప్రజానీకం ఈ పరిణామాన్ని అర్థం చేసుకొని ఆమోదించలేదు. మత విశ్వాసాలు జీర్ణించుకొనిపోయిన ప్రజాబాహుళ్యం ఇదంతా నాస్తికమతంగా, రిపబ్లిక్ వ్యవస్థ నాస్తికతత్త్వంపై ఆధారపడిందిగా భావించింది. కాగా, సద్గుణ సంపన్న రిపబ్లిక్ కార్యక్రమం మరుగునపడి, మతాలు సామాజిక, రాజకీయ జీవనానికి ఏ విధమైన సంబంధం లేనివిగా ప్రకటించింది. ప్రభుత్వాలు లౌకికమైనవి, మతేతరమైనవి; ఏ మతానికి, మతశాఖకు చెందినవారైనా, సమాజ వ్యవస్థలోను, రాజకీయ పరిపాలనా వ్యవస్థల్లోను మానవులందరికి సమానమైన హక్కులు, బాధ్యతలు సమానావకాశాలు ఉంటాయని జాతీయ సమితి ప్రకటించింది.

### 4.4.3 జాతీయసమితి విదేశాంగ విధానం (Foreign Policy) :

1792 సెప్టెంబర్ 22 న జాతీయసమితి అధికారం చేపట్టేనాటికి దేశంలోపలి అంతర్యుద్ధాలు, అల్లకల్లోల పరిస్థితికి తగినట్లు ఫ్రెంచిసేన ఆస్ట్రో-ప్రష్యా సేనలతో పోరాడుతూ పరాజయాల పాలవుతూ ఉంది. ఆస్ట్రియా - ప్రష్యాలు ఫ్రాన్సులో తిరిగి

నిరపేక్ష రాచరికాన్ని నెలకొల్పే ఉద్దేశ్యంతో దండెత్తి వస్తున్నందున, వారి దండయాత్ర ఫ్రెంచి సేనల పరాజయము దేశం లోపల రాచరికవాదులను, రిపబ్లిక్ వ్యతిరేకులను ఉత్సాహపరుస్తూ సమీకరిస్తున్నాయి. వారు జాతీయసమితిని ఎదిరించి పోరాటాలు ప్రారంభించారు. కనుక దేశం లోపలి భీతావహపాలనతో పాటు దేశం బయట విదేశీ దండయాత్రలు నిలువరించడం, దేశరక్షణతోపాటు రిపబ్లిక్ రక్షణ జాతీయసమితికి అత్యవసర కార్యక్రమం అయింది.

### 4.4.3.1 ఫ్రెంచి రిపబ్లిక్ పట్ల ఐరోపాదేశాల వైఖరి :

ఆనాటి ఐరోపాలో అన్ని దేశాల్లోను సమాజం వర్గీకృతమై స్వాధికారార వర్గాల ప్రాబల్యము, నిరపేక్ష రాచరికము సాంప్రదాయక వ్యవస్థలుగా కొనసాగుతున్న బలమైన రాజ్యాలు తమ ఆధిపత్యాన్ని పలుకుబడిని విస్తరింపజేసుకుంటూ బలహీనమైన రాజ్యాలను లోబరచుకోవడము, ఈ ప్రయత్నంలో తుల్య ప్రాబల్యత (Balance of Power) అనే సాంప్రదాయక సూత్రాన్ని (Convention) అనుసరిస్తూ బలమైన రాజ్యాలు తమ రాజకీయ ఒప్పందాల్లో (Treaties) అవి తమలో తాము ఒక అంగీకారానికివచ్చి బలహీనమైన రాజ్యాల భూభాగాలను నేరుగా పంపిణీ చేసుకొని కలిపివేసుకోవడమూ జరిగేది. ఈ విధంగా అంతకు మునుపే పోలెండును రష్యా, ఆస్ట్రియాలు పంచుకోగా, ఫ్రెంచి విప్లవ భావాలు పోలిష్ ప్రజలను ఉత్తేజితులను చేసి, తమ దేశాన్ని తిరిగి స్వతంత్రరాజ్యంగా ఏర్పరచుకోవాలని, అగ్రరాజ్యాలపై విప్లవం చేయాలని భావిస్తున్న విషయాన్ని పైన ప్రస్తావించడం జరిగింది. అలాగే ఆస్ట్రియా ఆధీనంలో ఉన్న నెదర్లాండ్స్ (బెల్జియం) లో సైతం ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష ఏర్పడసాగింది. స్వాతంత్ర్య కాంక్ష అనగా జాతీయ భావాలు, వాటికి మూలమైన వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలు, సర్వసత్తాక ప్రజాసార్వభౌమాధికారం మొదలైన ఆశయాల సమిష్టి ఫలితం. కనుక ఐరోపా అగ్రరాజ్యాలు ఫ్రెంచి విప్లవభావాలను, రిపబ్లిక్ వ్యవస్థను అరాచకాలకు మూలంగా భావించి, విచ్ఛిన్నం చేయ సంకల్పించుకొన్నవి.

### 4.4.3.2 ఫ్రెంచి రిపబ్లిక్ పట్ల బ్రిటిష్ వైఖరి :

అయితే భౌగోళికంగా ఐరోపా ఖండంలో చేరని, సాంస్కృతికంగా ఐరోపా దేశాల్లో ఒకటైన ఇంగ్లాండు, (తరువాత కాలంలో బ్రిటన్, గ్రేట్ బ్రిటన్‌గా ప్రసిద్ధమైంది) మొదటినుండి రాజకీయ, సాంస్కృతిక పరిణామాల్లో కొంత విలక్షణమైంది. ఆ దేశం రోమన్ కాథలిక్ మతవ్యవస్థనుండి తక్కిన ఐరోపా దేశాల కంటే ముందుగా, స్పష్టంగా విడిపోయి, జాతీయ మతవ్యవస్థను ఏర్పరచుకొంది. అనేకదశల్లో అక్కడి ప్రభువర్గం నిరపేక్ష రాచరికాన్ని అదుపుచేస్తూ క్రమంగా తమలో తాము ఉదారవైఖరులను అవలంబించి, సాధారణ ప్రజానీకం ద్వేషానికి గురికాకుండా ప్రజాపరిపాలనా వ్యవస్థకు బాటలు వేసింది. దీనికి కారణం మిగిలిన ఐరోపాదేశాలన్నిటికంటె అతి త్వరితంగా బ్రిటన్ ఖండాంతర వాణిజ్యాన్ని, దానివలన అభివృద్ధిచెందిన మధ్యతరగతి సామాజికవర్గాన్ని పొందింది. ఈ ఖండాంతర వాణిజ్యం వలన బ్రిటన్‌కు, ఫ్రాన్స్‌కు ఆసియాలో వలసవిధానంలోను, అంతకుపూర్వం అమెరికా ఖండంలోను నిరంతరం స్పర్థలు, సంఘర్షణలు సర్వసమానమైన విషయం. అయితే గణనీయమైన రాజకీయ సంస్కరణలతో, వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలను ఆమోదించి అనుసరించే ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాన్ని అభివృద్ధి చేసుకున్న బ్రిటన్ ఫ్రాన్సులో అవే ఆశయాలు, ఆదర్శాలతో ప్రజలు ఉద్యమించడం విప్లవం తీసుకొని రావడం కొంత సానుభూతితో చూచింది. కాని అచిరకాలంలోనే ఉద్యమం దారితప్పి అరాచకాలకు, విధ్వంసకాలకు పూనుకోవడం, విశేషించి రాజులపట్ల, రాజ్యవ్యవస్థపట్ల అవమానకరంగా ప్రవర్తించడంతో ఇంగ్లాండులో ప్రజాభిప్రాయం మారిపోయింది. కారణమేమంటే నిరపేక్ష రాచరికాన్ని అదుపుచేసి, ప్రజాస్వామిక పరిపాలనా వ్యవస్థకు దారులువేసినా, బ్రిటిష్‌వారు సాంప్రదాయకవాదులు (Conservatives), వారు రాచరిక వ్యవస్థను అనుమానించలేదు, రద్దు చేయలేదు. తమదేశ అవిచ్ఛిన్నసంస్కృతికి చిహ్నంగా రాచరికాన్ని పరిమితమైన అధికారాలతోనైనా, కొనసాగించారు. కనుక ఫ్రెంచి పరిణామాలు వీరికి దుస్సాహసమైనాయి. ఈ కారణాల వలన గ్రేట్ బ్రిటన్ ఫ్రాన్సుపై దండయాత్ర చేస్తున్న ఐరోపాదేశాలతో చేరింది.

### 4.4.3.3. జాతీయసమితి కవ్వింపు ప్రకటనలు :

జాతీయసమితి అధికారం చేపట్టిన వెంటనే, మూడు రోజుల తరువాత, 1792 సెప్టెంబర్ 25 వ ఫ్రెంచి రిపబ్లిక్ ఏకైకము, అఖండమూ అని ప్రకటించింది. దీని సారాంశం తరువాత డాంటన్ 1793 జనవరి 31 న చేసిన మరొక ప్రకటన వలన మరింత స్పష్టమైంది. మొదటి ప్రకటనను సామాన్యంగా, లోగడ ప్రభువర్గపాలనలో స్వయంపరిపాలకంగా (Autonomous) ఉన్న అనేక ఫ్రెంచి భూభాగాలన్నీ ఫ్రాన్సుదేశంగా అఖండమైన, ఏకైక దేశంగా విలీనమై, దేశం యావత్తు రిపబ్లిక్‌గా ఏర్పడిందని అర్థం చేసుకున్నా, జాతీయ సమితి భావం అంత సామాన్యమైంది కాదని గ్రహించవచ్చు. ఫ్రెంచి భాష మాట్లాడే ప్రజానీకం ఫ్రాన్సుకు నలువైపుల ఉన్న ఇతర రాజ్యాల్లోని సరిహద్దు రాష్ట్రాల్లో వ్యాపించి ఉన్నారని అందుకొరకు నలువైపులా ఉన్న ఐరోపా రాజ్యాలతో పోరాటాలు తప్పనిసరి అని, దాని భావం. ఈ భావమే డాంటన్ 1793 జనవరి 31 న చేసిన ప్రకటన - "ఫ్రెంచి రిపబ్లిక్ సరిహద్దులు ప్రకృతి సిద్ధమైనవి. నలువైపులా ఆ సరిహద్దుల మేరకు రిపబ్లిక్‌ను విస్తరింపజేద్దాం. అవి : రైన్, ఆల్ప్స్, పిరనీస్, సముద్రము. ప్రపంచంలోని ఏ శక్తి మనలను ఈ కార్యక్రమం నుండి అరికట్టలేదు" ఈ ప్రకటన ప్రధానంగా ఆస్ట్రియా, ప్రష్యాలను కవ్వించేందుకు చేసినదే.

### 4.4.3.4 యుద్ధ గమనం : పరిణామాలు, ఫలితాలు :

1792 సెప్టెంబర్‌లో జాతీయసమితి అధికారం చేపట్టేసరికి ఆస్ట్రియా, ప్రష్యా సేనలు ఫ్రాన్సుపై దండెత్తి విజయవంతంగా పురోగమిస్తున్నాయి. ఆ రెండు దేశాలు 1792 జులైలో ఫ్రాన్సుపై దండయాత్ర ప్రారంభించాయి. ఫ్రాన్సు అంతకు మునుపే ఏప్రియల్ 20న ఆ రెండు దేశాలపై యుద్ధం ప్రకటించింది. ఈ విషయాలపై ఖండికల్లో ప్రస్తావించడం జరిగింది.

ఆస్ట్రియా సేనలు ఈశాన్య దిశనుండి ఫ్రెంచి సరిహద్దు దాటి లిలీ (Lille) దుర్గాన్ని ముట్టడించాయి. ఫ్రెంచిసేనలు వారి ముట్టడిని విచ్ఛిన్నం చేయలేకపోతున్నాయి. ప్రష్యా సేనలు ఫ్రెంచి సరిహద్దు దాటి లూరెయిన్ (Louraine) రాష్ట్రాన్ని ఆక్రమించి లాంగ్వీ (Longwy), వెర్డూన్ (Verdun) దుర్గాలను ముట్టడించాయి. ఫ్రెంచి సేనాని లఫాయెట్ శత్రు సైనికులచేత వెర్డూన్ వద్ద ఓడి వారి పక్షాన చేరిపోయాడు. అప్పటికి శత్రుసేనలు పారిస్ నగరానికి అతి చేరువకు వచ్చి ఉన్నాయి. ఫ్రెంచి సేనల పరాజయం, ఫ్రెంచి సేనాని శత్రుపక్షానికి చేరడము పారిస్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించడము, పారిస్ కమ్యూన్ నాయకత్వాన రాజప్రాసాదంపై దాడి చేయడమూ పైన వివరించబడినాయి. జూలై 25 వ బ్రన్స్‌విక్ ప్రభువు (Duke of Brunswick) ప్రకటన పారిస్ నగరవాసుల అనుమానాలను మరింత బలపరచడము, వాటి ఫలితంగా లూయీని నిర్బంధంలోకి తీసుకొని, రాజరిక వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడము తదుపరి పరిణామాలు.

### 4.4.3.4.1 జాతీయసమితి యుద్ధసన్నాహాలు :

సుదీర్ఘకాలం రాజకీయ కల్లోలాలు, ఆర్థిక సంక్షోభము, రాచరిక వాదులకు రిపబ్లిక్ వాదులకు నడుమ సంఘర్షణల్లో ఆనాటి ఫ్రాన్సు దేశం అతలాకుతలం అవుతున్నది. దేశంలోని రాజకీయ వైరుధ్యాలు సైనిక బలాలను కూడ ప్రభావితం చేసి వారిలో క్రమశిక్షణా రాహిత్యము, అనైక్యత కలిగిస్తున్నట్లు ఫ్రెంచి సేనల పరాజయాలు, లఫాయెట్ శత్రు పక్షాలతో చేరిపోవడమూ సూచిస్తాయని జాతీయసమితి అభిప్రాయపడింది. అటువంటి సమయంలోనే సెప్టెంబర్ మొదటి వారంలో (1792) రాచరికవాదులను ఊచకోత కోసి, భయభ్రాంతులను చేయవలసిందిగా డాంటన్ ఆదేశించాడు. రాచరికం రద్దు అయిన తరువాత లావెండీ (Lavendee), లయోన్స్ (Lyons) రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున రాచరికవాదుల తిరుగుబాట్లు తలెత్తడమూ వాటిని దారుణ మారణకాండతో అణిచివేయడమూ జరిగింది. తరువాత ఈ కార్యక్రమం మరింత ప్రణాళికా బద్ధంగా

7

నిర్వహణ దక్షతతో భీభత్సపాలన (Reigln of Terror) గా కొనసాగింది. ఈ భీభత్సపాలన, రాచరికవాదుల అణచివేత, వెంటనే సత్ఫలితాలను ఇచ్చాయి. సెప్టెంబర్ 20 న ఫ్రెంచి సేనానులు డ్యూమరిజ్ (Dumoureiz), కెల్లర్ మాన్ (Kellermann) లు బ్రన్స్‌విక్ ప్రభువును వాల్మీ (Valmy) వద్ద ఓడించి వెనక్కు మరల్చారు. ఈ విజయంతోనే డాంటన్ నాయకత్వంలో జాతీయ సమితి సెప్టెంబర్ 25 న ఫ్రెంచి రిపబ్లిక్ "ఏకైకము, అఖండము" అని ప్రకటించగలిగింది.

ఫ్రెంచి సేనలు వాల్మీ విజయంతో ఉత్సాహంగా పురోగమించి ప్రష్యాదేశంలో ప్రవేశించి, వర్మ్స్ (Worms), మెయింజ్ (Mainz), రాజ్యాలను ఆక్రమించాయి. ఆ తరువాత డ్యూమరిజ్ నాయకత్వంలోని ఫ్రెంచి సేనలు ఆస్ట్రియా ముట్టడిలోని లిలీ నగరాన్ని విడిపించి, ఆస్ట్రియన్ సేనలను ఓడించి పారద్రోలుతూ, ఆ దేశం ఆధిపత్యంలోని నెదర్లాండ్స్‌లో ప్రవేశించాయి. ఈ విజయంలో డాంటన్ అపరిమితమైన ఆత్మవిశ్వాసంతో 1792 నవంబర్ 19న సౌహార్ద ప్రకటన (Edict of Fraternitiy) చేసి, డిసెంబర్ 15 న దానికి అనుబంధంగా మరొక ప్రకటన కూడ చేశాడు.

### 4.4.3.4.2 సౌహార్ద ప్రకటన (Edict of Fraternity) :

ఆస్ట్రియా, ప్రష్యా సేనలను దేశంనుండి తరిమివేసి, ఫ్రెంచి సేనలు ఎదురుదాడులు చేయడంతో జాతీయసమితి 1792 నవంబర్ 19 న ఒక హెచ్చరిక చేసింది. "ఫ్రెంచి జాతి (French Nation) ఎవరినైనా, స్వేచ్ఛా సమానత్వాలను వద్దన్నా, వదలివేసినా, ప్రభువులతో, రాజవంశాలతో సంబంధం కలిగిఉన్నా వారిని, వారి ప్రభుత్వాలను కోరి ఆహ్వానించినా, వారందరిని శత్రువులుగా పరిగణిస్తుంద"ని ఈ హెచ్చరిక సారాంశం. ఈ హెచ్చరిక దేశంలోని రాచరిక వాదులకు మాత్రమే కాదు; ఐరోపాలోని నిరపేక్ష రాచరికాలకు, వారి రాజ్యాల్లోని ప్రజలకు కూడ చేసింది. దీని తరువాత డిసెంబరు 15 న దీనిని అనుసరించి చేసిన మరొక హెచ్చరికలో ఫ్రెంచి రిపబ్లిక్ జయించి, ఆక్రమించిన ఇతర ఐరోపా దేశాల భూభాగాల్లో భూస్వామ్యవిధానాన్ని, స్వాధికార వర్గాల ఆధిపత్యాలను, నిరపేక్షరాచరిక వ్యవస్థలను నిర్మూలించి, వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలతో కూడిన రిపబ్లికన్ పరిపాలన వ్యవస్థలను నెలకొల్పడం జరుగుతుంద" ని ప్రకటించింది. అనగా ఫ్రెంచిరిపబ్లిక్ విప్లవాన్ని, విప్లవ ఫలితాలను ఫ్రాన్సుకు మాత్రమే పరిమితం కాకుండా వాటిని ఐరోపావ్యాప్తం చేయ నిశ్చయించుకున్నట్లు ఈ ప్రకటనల సారాంశం. ఇతర ఐరోపా దేశాల్లో సామాజిక, ఆర్థిక అసమానతలకు, రాజకీయ తేడాకు గురవుతున్న ప్రజానీకాలపట్ల సానుభూతిని, సౌహార్దతను ప్రకటించడం చేత, ఈ హెచ్చరికలను సౌహార్ద ప్రకటన (Edict of Fraternity) అంటారు. ఈ ప్రకటనలతో అనేక ఐరోపా దేశాల నిరపేక్ష రాజులను రెచ్చగొట్టి పోరాటాలకు పిలిచినట్లయింది.

### 4.4.3.4.3 ప్రథమ ఐరోపా రాజ్యాల సంకీర్ణ కూటమి (First Coalition of European Powers) :

సౌహార్ద ప్రకటన వలన జాతీయ సమితి, ఆస్ట్రియా, ప్రష్యాలతో బాటుగా మరింతమందిని శత్రువులుగా చేసుకొంది. దీనికితోడుగా 1793 జనవరి 21 న పదునారో లూయీని శిరచ్ఛేదం చేయడంతో ఐరోపాలోని నిరపేక్షరాజ్య వ్యవస్థలన్నీ ఆగ్రహావేశాలతో ఫ్రెంచి తిరుగుబాటుదార్ల పట్ల, జాతీయ సమితి పట్ల యుద్ధాలకు పూనుకున్నాయి. దీనికి తోడుగా జనవరి 31 న డాంటన్ ఫ్రెంచి రిపబ్లిక్ సరిహద్దులను నిర్వచిస్తూ చేసిన ప్రకటన అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ విధంగా ఫ్రెంచివిప్లవ రంగాన్ని విస్తరించి ఐరోపా దేశాలు ఆస్ట్రియా, ప్రష్యాలతో కలిసి సంకీర్ణ రాజ్యకూటమి (Coalition of Powers) గా ఏర్పడ్డాయి. 1795 నుండి 1815 లో నెపోలియన్ వాటర్లూ యుద్ధంలో ఓడి, బంధీగా చిక్కినంతవరకు సుమారు రెండు దశాబ్దాల కాలంలో, ఫ్రాన్సుపై ఈ విధంగా నాలుగుసార్లు సంకీర్ణ రాజ్యాకూటములు ఏర్పడినాయి. వాటిలో ఇది మొదటిది.

**4.4.3.4.4. ఫ్రెంచి రిపబ్లిక్ (జాతీయసమితి) ప్రతిస్పందన : విజయాలు :**

ఈ అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జాతీయసమితి 1793 ఫిబ్రవరి 1 న ఇంగ్లాండు, హాలెండ్‌లపై యుద్ధ ప్రకటన చేసింది. తరువాత నెలలో స్పెయిన్ వారితో చేరి ఫ్రాన్సుపై యుద్ధం ప్రకటించింది. నెదర్లాండ్స్‌ను ఆక్రమించిన ఫ్రెంచి సేనాని డ్యూమరిజ్ హాలెండుపైకి నడిచాడు, కాని వెనుకనుండి ఆస్ట్రియా సేనలు తిరిగి నెదర్లాండ్సును ఆక్రమించి, అతన్ని మరలి రానీయకుండ చేసే సూచనలు కానవచ్చాయి. ఆ సమయంలో బ్రిటిష్ సేనలు యార్కు ప్రభువు నాయకత్వంలో హాలెండ్ పైకి బయలుదేరాయి. యార్క్ ప్రభువు హాలెండ్‌లోని ఫ్రెంచి సేనలను ఓడించి, తరిమివేసి డన్‌కిర్క్ (Dunkirk) ను ఆక్రమించాడు. ఈ పరిస్థితి డ్యూమరిజ్‌కు ఆందోళన కలిగించింది. అతడు హాలెండ్ నుండి వెనుతిరిగి నెదర్లాండ్సు చేరాడు. కాని అప్పటికే అక్కడకి చేరిన ఆస్ట్రియా సేనలు నీర్విండెన్ (Neerwinden) వద్ద అతన్ని ఓడించాయి. తనకు ఆపద వాటిల్లే సమయానికి సైనిక సాయం పంపనందుకు అతడు జాతీయసమితి పట్ల ఆగ్రహించి, ఆస్ట్రియన్లవైపు చేరిపోయాడు (లోగడ లఫాయా ఇదే విధంగా శత్రుపక్షం చేరిపోయిన సంఘటన జ్ఞప్తిలో ఉంచుకోవచ్చును).

వాస్తవంగా ఆ సమయంలో డ్యూమరిజ్‌కు సాయం పంపడానికి, ఐరోపా సంకీర్ణ రాజ్యకూటమిలోని ఇతర దేశాలతో పోరాడడానికి ఫ్రాన్సు వద్ద చాలినంత సేనాబలం లేదు. బ్రిటిష్ సేనలు ఆస్ట్రియా సేనలతో కలిసి నెదర్లాండ్సు ఆక్రమించాయి. స్పెయిన్ సేనలు పిరనీస్ పర్వతాలను దాటివచ్చి ఫ్రెంచి భూభాగంలోని రొసిలోన్ (Roussilon) దుర్గాన్ని ఆక్రమించాయి. బ్రిటిష్ నౌకాబలం మధ్యధరా సముద్రంలోని ఫ్రెంచి రేవు పట్టణం టౌలాన్ (Tonlon) ను ఆక్రమించింది. ప్రష్యా, ఆస్ట్రియా సేనలు సంయుక్తంగా మెయింజ్ రాజ్యాన్ని తిరిగి స్వాధీనపరచుకొని, మరల తూర్పునుండి ఫ్రెంచి సరిహద్దు దాటి చొరబడ్డారు.

ఇటువంటి క్లిష్ట సమయంలో ఫ్రాన్సుదేశాన్ని, దేశవ్యవహారాలను నిర్వహిస్తున్న జాతీయ సమితిని ఆదుకున్నది కేవలం వారి తెగువ, సాహసము, ముందుకే దూసుకుపోయే మూర్ఖత్వము. జాతీయ సమితి నాయకుల్లో ఒకడైన కార్నొట్ (Carnot) ఫ్రెంచి రక్షణ భారాన్ని వహించినవాడు; రాబిస్పియిరీ భీతావహ పాలనలో దేశ పరిపాలనను సమర్ధిస్తున్న తరుణంలో అతడు సైన్యంలో తగు మార్పులను చేసి, సేనాధిపతులను రిపబ్లికన్ భావాలు కలిగిన వారిని నియమించి, ఆస్ట్రో - ప్రష్యన్ సేనలను ఓడించి దేశంనుండి తరిమి వేయడంలో ప్రధానపాత్ర నిర్వహించినవాడు. ఆ సమయంలో అతన్ని "రక్షణ కార్యక్రమ నిర్వహకుడ"ని (Organiser of Defence) జాతీయ సమితి ప్రశంసించింది. అతడు మారిన పరిస్థితుల్లో ఫ్రెంచి సేనను వృద్ధిచేసి, విజయాలు సాధించి "విజయకారకు" నిగా (Organiser of Victory) గా ప్రసిద్ధి పొందగలిగాడు. ఈ కార్యక్రమంలో సెయింట్ జస్ట్ (St. Just) అనే పూర్వపు మతాచార్యుడు, తృతీయవర్గం పట్ల సానుభూతి కలిగి, తరువాత రిపబ్లిక్‌ను బలపరచడంలో ప్రముఖపాత్ర నిర్వహించినవాడు కార్నొట్‌కు సహకరించాడు. భీతావహ పరిపాలన జరిపించడంలో సెయింట్ జస్ట్ రాబిస్పియిరీకి ముఖ్య అనుచరుడు. కనుక దేశ ప్రజలను సమాయత్తం చేసి, యుద్ధ కార్యక్రమానికి తోడ్పడంలో అతనికి అవకాశం కలిగింది.

జాతీయసమితి ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి యుద్ధప్రకటన చేసి, కార్యాచరణకు పూనుకుంది. 1793 ఫిబ్రవరి నెలలోనే సైనిక బలగాన్ని వృద్ధిచేయడానికి నిర్బంధ సైనికసేవ (Lavee as masse) ను విధించింది. ఆరోగ్యవంతులైన ఫ్రెంచి యువకులందరు నిర్బంధంగా సైనిక శిక్షణను పొంది, సైన్యంలో పనిచేయడం దీని ప్రకారం తప్పనిసరి. ఇందుకు సెయింట్ జస్ట్ భీతావహపాలన ద్వారా సంపూర్ణమైన సహకారాన్ని అందించి, సేనాబలాన్ని నిర్మించడంలో కార్నొట్‌కు సాయపడ్డాడు. కార్నొట్ కృషి వలన ఫిబ్రవరి నెల చివరకు ఫ్రాన్సు మూడులక్షల అదనపుసేనను సమకూర్చుకోగలిగింది.

యువకులకు నిర్బంధసైనిక శిక్షణ మాత్రమేకాక, జాతీయసమితి యావత్తు ఫ్రెంచిజాతి యుద్ధకార్యక్రమంలో నిమగ్నమైనట్లు దేశంలోపల రిపబ్లిక్‌ను పటిష్టం చేయడం, వెలుపల ఐరోపా దేశాల్లోకి విస్తరింపజేయడం దేశప్రజానీకం యొక్క

విధి అని ప్రకటించింది. మరోవిధంగా చెప్పాలంటే "ఫ్రెంచి జాతి యుద్ధంలో ఉన్నది" (Nation at arms) అని ప్రకటించి, స్త్రీ పురుష విచక్షణ, బాలవృద్ధ విచక్షణ లేక జాతియావత్తు యద్ధకార్యక్రమంలో పాల్గొనే కార్యాచరణను ప్రజల ముందుంచింది. ఈ కార్యాచరణ ప్రణాళిక వలన సాధారణ ప్రజానీకంలో జాతీయభావము, స్వేచ్ఛ సమానత్వాల పట్ల గాఢమైన ఆసక్తి రిపబ్లిక్ పట్ల అంకితభావము ఏర్పడి, తమదేశం ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కల్పించుకున్న విదేశీయులను పరాజితులను చేయడమూ, ఐరోపాలో మరిన్ని ప్రయోజనాలకు స్వేచ్ఛా సమానత్వాలను ప్రసాదించడమూ తమ కర్తవ్యంగా మనసులో నాటుకున్నాయి. 1793 సంవత్సరాంతం నాటికి నిర్బంధ సైనిక శిక్షణ వలన ఫ్రెంచి సైన్యం ఏడు లక్షల డెబ్బది వేలు దాటింది. అంతకు పూర్వం అది రెండులక్షలకు లోపుగా ఉండేది, మిగిలిన ఐరోపాదేశాల్లో సైతం అదే దామాషాలో, ఆ దేశాల విస్తీర్ణము, జనాభాను అనుసరించి స్వల్ప పరిమితిలో సేనలు ఉండేవి.

ఈ సైనిక సన్నాహాలలో జాతీయసమితి ప్రథమ ఐరోపా రాజ్యాల సంకీర్ణ కూటమిని ఎదిరించి 1794 లో స్పానిష్ సేనలను ఓడించి, తరిమివేసి, స్పెయిన్‌లోని కటలోనియా (Catalonia) రాజ్యాన్ని ఆక్రమించుకొంది. జోర్డన్ అనే ఫ్రెంచి సేనాని (Jourdon) ఫ్లూరస్ (Fleurus) వద్ద ఆస్ట్రియా సేనలను, నెదర్లాండ్‌లోని యార్క్ ప్రభువు నాయకత్వంలోని బ్రిటిష్ సేనలను ఓడించి, తరిమివేశాడు. అదే సమయంలో ఆస్ట్రియా, ప్రష్యాలు పోలెండు పంపకం గురించి ఆత్రపడుతూ తమ సేనలను వెనక్కు పిలిపించాయి. 1795 ఏప్రిల్ 5 న బాసెల్ (Basel) వద్ద ప్రష్యా స్పెయిన్ ఫ్రాన్సుతో విడివిడిగా సంధులు చేసుకొని ఐరోపారాజ్య సంకీర్ణ కూటమినుండి విరమించుకున్నాయి.

1794 సంవత్సరాంతంలో జోర్డన్ ఆస్ట్రియా, బ్రిటిష్ సంయుక్త సేనలను ఓడించిన తరువాత హోలెండ్‌పైకి నడిచాడు. డచ్చి సేనలు (హోలెండ్‌లోని ప్రజలు డచ్చివారు, వారి భాష డచ్ భాష) ఫ్రెంచిసేనలచేత పూర్తిగా పరాజయం పొంది, యుద్ధఖర్చులకు పరిహారం చెల్లించడానికి, డచ్ భూభాగాన్ని కొంత స్వాధీనపరచడానికి అంగీకరిస్తూ సంధి చేసుకుంది. అయితే అక్కడ కూడా పార్లమెంట్‌కు, రాజ్యాధినేత (Stadtholder) కు మధ్య కొంత వైరుధ్యం ఏర్పడింది. ఈ శాంతి సంధిని పార్లమెంటు ఆమోదించింది కాని, రాజ్యాధినేత ఆమోదించలేదు. అతడు ఇంగ్లాండుకు పారిపోయి, బ్రిటిష్ సాయంతో పోరాటం కొనసాగించే ఉద్దేశ్యంతో ఉన్నాడు.

ఇంగ్లాండు, ఆస్ట్రియాతో కలసి పోరాడుతూ నెదర్లాండ్స్‌లో ఫ్రెంచిసేన చేత పరాజయం పొందినా, వాస్తవానికి అజేయంగానే నిల్చి ఉంది. ఇంగ్లాండు బలమంతా ఆ దేశపు నౌకాబలమే కాని, భూమిపై పోరాడే కాల్బలం కాదు. అందుచేత తన నౌకాదళ ప్రాబల్యంతో ఖండాంతర వలసల్లోని డచ్చి, ఫ్రెంచి భూభాగాలను ఆక్రమించి బలపడింది. ఆ విధంగా దక్షిణ ఆఫ్రికాలోని డచ్చి వారి వలస కేప్ ఆఫ్ గుడ్ హోప్ (Cape of Good Hope), ఆగ్నేయాసియాలోని (నేటి వియత్నాం) సుగర్ ఐలండ్ బ్రిటిష్ వారి వలసలుగా మారినాయి.

1795 నాటికి జాతీయసమితి రాజ్యాంగం పూర్తిచేసి, డైరెక్టరీ ఆధ్వర్యంలో శాశ్వతప్రాతిపదికపై రిపబ్లిక్‌ను నెలకొల్పి, పదవీవిరమణ చేసేనాటికి, ఫ్రెంచి సేనలు తమ దేశంనుండి విదేశీ దండయాత్రలను తరిమివేసి, ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి సేనలను అన్ని దిశల్లోను ఓడించి ఎదురుదాడులు చేస్తూ విజయాలు సాధించాయి. ప్రథమరాజ్య కూటమిలో బ్రిటన్, సార్డీనియాలు తప్ప అన్ని దేశాలు ఫ్రాన్సుతో శాంతి ఒడంబడికలు చేసుకొని, కూటమినుండి విరమించుకున్నాయి.

### 4.4.3.4.5 జాతీయసమితి విజయానికి దోహదం చేసిన పరిస్థితులు :

1792 జులై, ఆగస్టు నెలల్లో ఆస్ట్రో - ప్రష్యన్ సేనల చేత తీవ్రమైన అపజయాలు పొందిన ఫ్రెంచి సేనలు సెప్టెంబర్ నెలనుండి విజయ పరంపరలను సాధించడం ఈ సందర్భంలో ఆసక్తికరమైన విషయం. అప్పటి దేశపరిస్థితి అత్యంత దయనీయంగా

ఉంది, తదుపరి పదునారో లూయీ వధ తరువాత ఫ్రెంచివారికి శత్రు కూటమి ప్రబలమై వారి సమస్యలు మరింత క్లిష్టమైనాయి. ఆ తరువాత పోరాటాల్లో ఒక్కొక్క తరుణంలో వెనుకంజ వేసినా, మొత్తం మీద ఫ్రెంచిసేనలు ప్రథమ ఐరోపారాజ్యసంకీర్ణకూటమిని దాదాపుగా విచ్ఛిన్నం చేశాయి. అందుకు దోహదపడిన కారణాలను ఈక్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. జాతీయ సమితి ప్రథమ ఐరోపారాజ్యసంకీర్ణకూటమిపై సాధించిన విజయాలకు ప్రధాన కారణం ఫ్రెంచి ప్రజల్లో ఏర్పడ్డ తీవ్రమైన జాతీయభావము, రిపబ్లిక్‌ను సంరక్షించుకునే గాఢమైన పట్టుదల. 1792 జులై, ఆగస్టు నెలల్లో ఫ్రెంచిసేనలు పదునారో లూయీకి చెందిన రాజ్యసేనలు; వారికి ఫ్రెంచి విజయం వల్ల ఒనగూడేదేమీ లేదు. దాని ప్రయోజనం పూర్తిగా రాచరికానికి చెందుతుంది. రాచరికవిజయం వల్ల తిరిగి దేశంలో స్వాధికార వర్గాల ప్రాబల్యము, నిరపేక్షరాచరికము బలపడతాయి. అందుచేత సైన్యంలోని నిరుపేద వర్గాలకు చెందిన సైనికులకు అప్పటికే విప్లవభావాలు తగినంతగా మనసులో నాటుకున్నాయి. వారు లఫాయాతో పూర్తిగా సహకరించలేదు; అందుచేత అప్పటి పోరాటాల్లో ఫ్రెంచి సేనలు పూర్తిగా పరాజయాలు పొందాయి.

1792 ఆగస్టులో రాచరికాన్ని రద్దుచేసి, ప్రభుత్వపరంగా ఉన్న సార్వభౌమాధికారం ప్రజలపరం కావడంతో పరిస్థితిలో గణనీయమైన పరిణామం జరిగింది. సాధారణ ప్రజానీకంలో తమ స్థితిగతులు మెరుగవుతాయన్న ఆశ, అందుకు రిపబ్లిక్ బలోపేతం కావడం అవసరమన్న భావమూ బలపడ్డాయి. అయితే రాచరిక వాదుల వ్యతిరేకత చెప్పుకోదగినంత బలంగానే ఉన్నది గనుక; రిపబ్లిక్ వ్యవస్థపట్ల ప్రజల విశ్వాసం, ఆసక్తి బలపడడానికి భయంకర పరిపాలన ఉపకరించింది. రిపబ్లిక్ పట్ల ప్రగాఢమైన ఆసక్తి కల్గిన డ్యూమరిజ్, కెల్లర్‌మాన్‌ల వంటివారు ఫ్రెంచిసేనలకు నాయకులు కావడం కూడ ఫ్రెంచి విజయాలకు దోహదం చేసింది. వీటన్నింటికి మూలమైంది భయంకర పరిపాలన. అది ప్రజల్లో బలవంతంగానైనా ప్రబలం చేసిన జాతీయ భావము, రిపబ్లిక్ పట్ల తీవ్రమైన విశ్వాసం. ఆనాటి జాతీయ సమితి నిర్వాహకుల్లోని వాడైన కార్నెట్, సెయింట్‌జస్ట్ ముఖ్యంగా ఈ పరిణామాలకు ప్రధాన కారకులు. అయితే అప్పటికి కూడ కొనసాగుతున్న రాజకీయ వైరుధ్యాలు, రాచరికవాదుల ప్రాముఖ్యత డ్యూమరిజ్ పరాజయానికి కొంత బాధ్యత వహిస్తాయని, దానికి తోడు ఫ్రెంచి సైనిక బలం జాతీయ సమితి తలపెట్టిన బృహత్ప్రణాళికకు సరిపోయినంతగా లేకపోవడం మరొక ముఖ్యకారణమని భావించడం యుక్తం. ఆనాటి భీభత్స పరిపాలనలో అశక్తతకు దేశద్రోహానికి ఏమంత వ్యత్యాసం లేక, ఏ కారణాలైనా సరే పరాజయం శిక్షార్హం కావడంచేత, డ్యూమరిజ్ తన అపజయం తరువాత ఫ్రాన్సులో అడుగు మోపడం అసాధ్యమని గ్రహించాడు. కనుక అతడు శత్రుపక్షాన్ని ఆశ్రయించి ప్రాణం కాపాడుకోవలసి వచ్చింది. కాని, అతని చర్య గిరాండిస్టుల పట్ల అనుమానాలు రేకెత్తడానికి కారణమై, భీభత్స పరిపాలనలోని మారణకాండకు వారు గురికావలసి వచ్చింది. ఇటువంటి కఠినాతి కఠినమైన క్రమశిక్షణ, ఫ్రెంచి ప్రజల మానసిక దార్ఢ్యాన్ని పెంపొందించి, వారిలో జాతీయాభిమానాన్ని, దేశభక్తిని, రిపబ్లిక్‌పట్ల ఆసక్తిని వ్రేళ్ళుపాతుకొని బలపడేలా చేశాయి.

2) ఫ్రెంచి విజయాలకు రిపబ్లిక్ పట్ల గాఢమైన విశ్వాసం ప్రధానకారణం అయితే, అందుకు మూలమైంది మధ్యతరగతి వారి ఆదర్శాలు, ఆశయాలు, తార్కిక వాదాలు మూలకారణాలు. అంతేకాక, రిపబ్లిక్ పతనం వలన దేశం తిరిగి విపరీతమైన ఆర్థిక సంక్షోభానికి, సాంఘిక రాజకీయ కల్లోలాలకు గురవుతుందన్న భయంతో మధ్యతరగతి జాతీయసమితికి అన్నివిధాల యుద్ధకార్యక్రమంలో సహకరించింది. సాదారణమైన కర్షకులు, వృత్తిపనివారు సైతం, తమ ఆర్థిక దుస్థితిని పరిగణించక, యుద్ధ కార్యక్రమంలో పాల్గొని జాతీయసమితికి పూర్తిగా సహకరించారు. అంతేకాక, రిపబ్లిక్ వ్యవస్థ ఈ పోరాటాల ఫలితంగా ఐరోపా దేశాలన్నిటిలో విస్తరించడం తమ వర్తక వాణిజ్యాలకు, పారిశ్రామికాభివృద్ధికి దోహదం కాగలదన్న ఆశాభావంతో వారు ఉత్సాహంగా జాతీయసమితికి తమ సమర్థనను సహకారాన్ని అందించారు.

3) ఈ పరిస్థితులకు భిన్నంగా ఆస్ట్రియా, ప్రష్యా మొదలైన ఐరోపా రాజ్యాల్లోని నిరపేక్ష రాచరికాలు, స్వాధికారవర్గాల ప్రాబల్యం ఆయా దేశాల్లోని ప్రజలకు నిరాసక్తత కలిగిస్తున్నాయి. ఆ దేశాల సేనల రాజ్యసేనలు, రిపబ్లిక్ సేనలు కావు. కనుక

పదునారో లూయీ కాలంనాటి ఫ్రెంచి సేనలవలె నైతికబలం లోపించినవి. అది వారి పరాజయాలకు మూలకారణం. దానికి తోడు పోలెండు పంపకం గూర్చి ఆ రెండు దేశాలమధ్య వైరుధ్యము, ఆ రెండు దేశాలకు రష్యాపట్ల ఉన్న భయాందోళనలు ఆ రాజ్యాధినేతలను స్థిరమైన సంకల్పంతో ఫ్రాన్సుపై పోరాడడాన్ని అసాధ్యం చేశాయి. ఐరోపాలోని ఆస్ట్రియా, ప్రష్యా, స్పెయిన్ వంటి తక్కిన అగ్రరాజ్యాలు తమ అధికార ప్రాబల్యాలను విస్తరించుకోవడంలో పరస్పరం పోటీపడుతూ, తుల్యప్రాబల్యత (balance of power) ను సంరక్షించడమనే ఒక సాంప్రదాయక సూత్రం (Convention) తో ఒకరినొకరు అవరోధాలు కల్పించుకుంటూ మనస్ఫూర్తిగా సహకరించుకోలేకపోయారు. ఈ కారణాల వల్ల వారు ఫ్రెంచి రిపబ్లిక్ సేనలచేత పరాజయ పరంపరలను పొందవలసి వచ్చింది.

గ్రేట్ బ్రిటన్‌కు మొదటినుండి ఐరోపా రాజకీయాల పట్ల ఆసక్తి లేదు. భౌగోళికంగా అది ఐరోపా ఖండంనుండి ఇంగ్లీష్ ఛానల్ (English Channel) అనే సముద్ర కయ్యి చేత వేర్రై, పూర్తిగా తనదేశ సంస్కృతిపై ఆధారపడ్డ జాతీయ భావంతో, తన ప్రయోజనాలను సాధించుకోవడమే ఏకైక లక్ష్యంగా ప్రవర్తించేది. కాగా బ్రిటిష్ వారికి ఖండాంతర వలస సామ్రాజ్యం నిర్మించుకొని, విస్తరించుకుంటూ, నిర్వహించుకుంటూండటమే విదేశీ విధానం. అయితే పదునారో లూయీ వధ వలన వారిలో కొంత సంచలనం చెలరేగి, ప్రధమ ఐరోపారాజ్య కూటమిలో చేరి ఫ్రాన్సుపై పోరాటం చేయటం జరిగినా, యుద్ధ పరిణామాలను తమ వలసల విస్తరణ రూపాన సాధించుకోదలచారు. కనుక బ్రిటన్ ప్రధమ ఐరోపారాజ్య సంకీర్ణంలో అజేయంగా నిలబడింది, అయినా ఐరోపారాజకీయాల పట్ల అనాసక్తంగా ఉంది; కాని అవసరం అయినప్పుడు తన దేశ ప్రయోజనాలను సాధించుకునేందుకు తిరిగి పోరాటంలో పాల్గొనే ఉద్దేశ్యము, శక్తి సామర్ధ్యాలు కలిగి ఉంది.

**మాదిరి ప్రశ్నలు :**

1. ఫ్రెంచి విప్లవంలోని తొలి దశలోని ప్రధాన సంఘటనలను చర్చించుము.
2. ఫ్రెంచి జాతీయసభ రూపొందించిన రాజ్యాంగ ప్రధాన లక్షణములను వివరించుము.
3. ఫ్రెంచి విప్లవములోని రెండవ దశను, పరిమిత రాచరిక వ్యవస్థను చర్చించుము.
4. జాతీయ సమితి యొక్క విదేశాంగ విధానమును విమర్శనాత్మకంగా చర్చించుము.

**చదువదగిన గ్రంథాలు :**


1. Grant and Tamperly : Europe in the 19th and 20th Centuries
2. Kettelebey, C.D.M., : A History of Modern Europe
3. Hazen Cd : A History of Modern Europe (1789 - 1945)


- **డా॥ ముప్పాళ్ళ హనుమంతరావు**

పాఠం - 5

# మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ - నెపోలియన్ అధిగమనం (1795-99)

విషయసూచిక


5.0 లక్ష్యం
5.1 ఉపోద్ఘాతం
5.2 మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ (డైరెక్టరీ) రాజ్యాంగం
5.2.1 డైరెక్టరీ
5.2.2 పౌరసత్వము, ఓటుహక్కు
5.2.3 శాసన నిర్మాణ శాఖ (Legislative)
5.2.4 మత విధానం
5.2.5 డైరెక్టరీ దేశీయాంగ పాలన (Internal Policy)
5.2.6 రాచరికవాదుల వ్యతిరేకత
5.2.7 బేబూఫ్ ఉద్యమం
5.2.8 ఆర్థిక స్థితి
5.3 డైరెక్టరీ ప్రభుత్వ విదేశాంగ విధానం (Foreign Policy)
5.3.1 ఆస్ట్రియాతో పోరాటం (1796-97)
5.3.2 నెపోలియన్ ఇటలీ దండయాత్ర
5.3.3 నెపోలియన్ ఆస్ట్రియా దండయాత్ర
5.3.4 గ్రేట్‌బ్రిటన్‌తో యుద్ధం (1798-99)
5.3.5 నెపోలియన్ ఈజిప్టు దండయాత్ర
5.4 డైరెక్టరీ పతనం


## 5.0 లక్ష్యం :

ఫ్రాన్సులో జాతీయసమితి (National Convention) తయారుచేసిన రాజ్యాంగాన్ని అనుసరించి ఏర్పడిన రిపబ్లిక్ "మొదటి రిపబ్లిక్". ఇది కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే జీవించి, అంతమైంది. దీనిని అంతం చేసినవాడు నెపోలియన్ బోనాపార్టీ. ఈ అధ్యాయం మొదటి రిపబ్లిక్ స్వరూప స్వభావాలను, అందులోని బలహీనతలు, భంగపాట్లను, ఈ పరిస్థితులను ఉపయోగించుకొని నెపోలియన్ బోనాపార్టీ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని తన నియంతృత్వ పరిపాలనకు పునాది వేసుకొన్న తీరును వివరిస్తుంది.

## 5.1 ఉపోద్ఘాతము :

ఫ్రెంచివిప్లవ పరిణామాల్లో రాజ్యాంగబద్ధ రాచరికం విఫలం కావడమూ, డాంటన్ నాయకత్వంలోని పారిస్ కమ్యూన్ రాచరికాన్ని పూర్తిగా తొలగించి 1792 ఆగస్టు 10 న ఫ్రెంచి ప్రభుత్వాన్ని రిపబ్లిక్‌గా, లేదా ప్రజాపాలనా వ్యవస్థగా ప్రకటించడమూ

పాఠం - 5

# మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ - నెపోలియన్ అధిగమనం (1795-99)

విషయసూచిక


5.0 లక్ష్యం
5.1 ఉపోద్ఘాతం
5.2 మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ (డైరెక్టరీ) రాజ్యాంగం
5.2.1 డైరెక్టరీ
5.2.2 పౌరసత్వము, ఓటుహక్కు
5.2.3 శాసన నిర్మాణ శాఖ (Legislative)
5.2.4 మత విధానం
5.2.5 డైరెక్టరీ దేశీయాంగ పాలన (Internal Policy)
5.2.6 రాచరికవాదుల వ్యతిరేకత
5.2.7 బేబూల్ ఉద్యమం
5.2.8 ఆర్థిక స్థితి
5.3 డైరెక్టరీ ప్రభుత్వ విదేశాంగ విధానం (Foreign Policy)
5.3.1 ఆస్ట్రియాతో పోరాటం (1796-97)
5.3.2 నెపోలియన్ ఇటలీ దండయాత్ర
5.3.3 నెపోలియన్ ఆస్ట్రియా దండయాత్ర
5.3.4 గ్రేట్‌బ్రిటన్‌తో యుద్ధం (1798-99)
5.3.5 నెపోలియన్ ఈజిప్టు దండయాత్ర
5.4 డైరెక్టరీ పతనం


## 5.0 లక్ష్యం :

ఫ్రాన్సులో జాతీయసమితి (National Convention) తయారుచేసిన రాజ్యాంగాన్ని అనుసరించి ఏర్పడిన రిపబ్లిక్ "మొదటి రిపబ్లిక్". ఇది కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే జీవించి, అంతమైంది. దీనిని అంతం చేసినవాడు నెపోలియన్ బోనాపార్టీ. ఈ అధ్యాయం మొదటి రిపబ్లిక్ స్వరూప స్వభావాలను, అందులోని బలహీనతలు, భంగపాట్లను, ఈ పరిస్థితులను ఉపయోగించుకొని నెపోలియన్ బోనాపార్టీ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని తన నియంతృత్వ పరిపాలనకు పునాది వేసుకొన్న తీరును వివరిస్తుంది.

## 5.1 ఉపోద్ఘాతము :

ఫ్రెంచివిప్లవ పరిణామాల్లో రాజ్యాంగబద్ధ రాచరికం విఫలం కావడమూ, డాంటన్ నాయకత్వంలోని పారిస్ కమ్యూన్ రాచరికాన్ని పూర్తిగా తొలగించి 1792 ఆగస్టు 10 న ఫ్రెంచి ప్రభుత్వాన్ని రిపబ్లిక్‌గా, లేదా ప్రజాపాలనా వ్యవస్థగా ప్రకటించడమూ

పై అధ్యాయంలో వివరించడం జరిగింది. మారిన రాజకీయ పరిస్థితిని; వ్యవస్థకు అనుగుణంగా క్రొత్తరాజ్యాంగ చట్టాన్ని రూపొందించుకోవడం అవసరం అయింది. 1792 సెప్టెంబరు 22 న వివిధ రిపబ్లికన్ పక్షాలకు చెందిన ప్రముఖులలో జాతీయసమితి (National Convention) దేశ పరిపాలనా బాధ్యతను స్వీకరించి, ఫ్రెంచి రిపబ్లిక్‌కు రాజ్యాంగ చట్టాన్ని తయారుచేసే బాధ్యతను కూడ చేపట్టింది. అనేకవిధాలైన అంతర్గత సమస్యలను, ప్రథమ ఐరోపారాజ్యాల సంకీర్ణ కూటమిగా ఏర్పడిన వివిధ పరిసర దేశాల దండయాత్రలను ఎదుర్కొంటూ జాతీయసమితి మొదటి ఫ్రెంచిరిపబ్లిక్‌కు రాజ్యాంగ చట్టాన్ని తయారుచేసి, దానిని అనుసరించి 1795 అక్టోబర్ 27 న ప్రభుత్వానికి అధికారం అప్పగించింది.

మొదటి ఫ్రెంచి రిపబ్లిక్‌లో అధికార బాధ్యతలు స్వీకరించిన ప్రముఖుల్లో అనగా డైరెక్టర్లలో ఐక్యత లేకపోవడమూ, వారిలో కొందరు అవినీతిపరులు, అసమర్థులు కావడమూ, అనుభవంలేని మేథావులు కేవలం ఆదర్శాలు, ఆలోచనలతో ఆచరణాత్మకం కాని రాజ్యాంగాన్ని తయారుచేయడంవల్ల మొదటి రిపబ్లిక్ విఫలమైంది. అయితే, ఈ కారణాలన్నింటికంటె ప్రధానమైంది నెపోలియన్ అధిగమనం (Rise).

రిపబ్లిక్ వ్యవస్థల మనుగడకు అన్నిటికంటె ప్రబలమైన ప్రతిశక్తి సైనిక ప్రాబల్యం. దేశరక్షణ అవసరాలకు, అంతర్గతకల్లోలాలను అణచి శాంతిభద్రతలు కాపాడడానికి సైన్యంపై ఆధారపడినకొలది ప్రజాపాలనావ్యవస్థ రాజకీయంగా బలహీనమై, క్రమంగా ప్రజల సమర్థనను కోల్పోతుంది. అదేవిధంగా మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ ప్రథమ ఐరోపారాజ్యాల సంకీర్ణ కూటమిని ఎదిరించి పోరాడడంలో కీలకపాత్ర పోషించిన నెపోలియన్ బోనాపార్టీ ప్రజల ప్రశంసలను, హర్షధ్వానాలను అందుకున్నాడు. దానివలన పరిపాలనలోని అవినీతిని, అసమర్థతను ప్రజలు మరింతగా అసహ్యించుకోవడం రిపబ్లిక్ బలహీనపడడమూ జరిగింది. ఈ పరిస్థితిలో నెపోలియన్ డైరెక్టరీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం సులువైంది. 1799 నవంబర్ 19 న డైరెక్టరీ పతనమైంది, అనగా అది నిర్వహించే రిపబ్లిక్ వ్యవస్థ పతనమైంది. దానికి ఆధారమైన రాజ్యాంగం నిరుపయోగమైంది.

## 5.2 మొదటి ఫ్రెంచి రిపబ్లిక్ రాజ్యాంగం :

జాతీయసమితి రూపొందించిన మొదటి ఫ్రెంచిరిపబ్లిక్ రాజ్యాంగం మాంటెస్క్యూ సూత్రాలను అనుసరించి, శాసన నిర్మాణశాఖ (Legislative) కు, కార్యనిర్వాహకశాఖ (Executive) కు ఎటువంటి సంబంధం లేని విధంగా అధికార విభజన చేసింది. ఒకరికొకరు బాధ్యులై ఉండడంవలన పరిపాలన బాధ్యతాయుతంగా ఉండడానికి అవకాశం ఉండేది. కాని కేవలం పుస్తక జ్ఞానము, దానిపై ఆధారపడిన ఆలోచన మాత్రమే కలిగిన రాజ్యాంగ నిర్ణాయక సభలోని సభ్యులు ఆచరణాత్మకమైన ఇబ్బందులను గుర్చి ఆలోచించలేకపోయారు.

### 5.2.1 డైరెక్టరీ :

మొదటి ఫ్రెంచిరిపబ్లిక్ రాజ్యాంగం ప్రభుత్వంలోని అత్యున్నత కార్యనిర్వాహణాధికారాన్ని ఐదుగురు సభ్యులు కల డైరెక్టరీ చేతుల్లో ఉంచింది. కనుక రాజ్యాంగాన్ని డైరెక్టరీ రాజ్యాంగం అని చరిత్రకారులు వ్యవహరిస్తారు. 1795 అక్టోబర్ 27న ఈ రాజ్యాంగం ప్రకారం ఏర్పడ్డ మొట్టమొదటి ప్రభుత్వంలోని డైరెక్టరీ సభ్యులు : 1) కార్నాట్, (Carnat) 2) లెటోర్నియర్ (Letourneur), 3) లార్వెల్లియర్ లేపో (Larevelliere Lepeauy), 4) రూబెల్ (Rewbell), 5) బర్రాస్ (Barras). జాతీయసమితి కాలంలోని భీతావహ పరిపాలన దేశంలో సమర్థులు, విజ్ఞులు అయిన వారిని అత్యధిక సంఖ్యలో వధించడమో, లేక చట్టబద్ధంగా వారిని ప్రభుత్వసేవకు అనర్హులుగా ప్రకటించడమో, దేశం వదలి పారిపోయేలా చేయడమో జరిగినందున రిపబ్లిక్‌లో శాసనసభ్యులు కాని, డైరెక్టర్లు కాని మేథావులు, రాజనీతి తెలిసినవారు లేకపోయారు. కనుక డైరెక్టరీ పరిపాలనా కాలంలో అందరూ సాధారణమైన విద్యావంతులు, సమర్థులు. డైరెక్టర్లలో కార్నాట్ తప్ప అందరు అనామకులు, రాజకీయాలకు క్రొత్తవారు, నైతిక విలువలు లేనివారు, అధికార దుర్వినియోగానికి అవినీతికి అతీతులు కానివారు.

1795 నాటి క్రొత్త రిపబ్లికన్ రాజ్యాంగం, లేదా డైరెక్టరీ రాజ్యాంగం చాలవరకు 1793 నాటి రాజ్యాంగాన్ని పోలి, మధ్యతరగతి వారి ఆశయాలకు, ఆదర్శాలకు అనుగుణంగా రూపొందింది. అనగా దేశ ఆర్థికాభివృద్ధిని, వ్యక్తిస్వేచ్ఛ సమానత్వాలను సాధించే

ప్రజాపాలనావ్యవస్థ, జాతీయసమితి కాలంనాటి "వ్యవస్థీకృతమైన అరాచకం (Organized anarchy) ని తొలగించి క్రమశిక్షణాయుతమైన పరిపాలనా విధానాన్ని నెలకొల్పడానికి ఉద్దేశించింది. కాని వాస్తవంగా ఆచరణలో అది సాధ్యం కాలేదు. రాచరికవ్యవస్థలో రాజు నియంతృత్వాధికారం చెలాయించవచ్చుకాని, ప్రభుత్వ ధనాన్ని తినివేసే లంచగొండి కాబోడు. ఆడంబరాలతో దుర్వ్యయం చేయవచ్చుకాని, స్వంత ఆస్తులు పెంచుకోవడానికి ప్రయత్నించడు. కారణమేమంటే, రాచరిక వ్యవస్థలో రాజ్యానికి చెందిన సమస్తదేశము, దేశ సంపదలు రాజుకు చెందినవనే సాంప్రదాయిక విశ్వాసం (Convention). కాని ప్రజాస్వామిక వ్యవస్థలో రాజవంశాలకు చెందని వారికి ఆకస్మిక అధికారయోగము, రాజ్య ధనాగారము ప్రాప్తించడంతో వీలైనంత మేరకు దానిని కొల్లగొట్టాలని, అధికారం శాశ్వతం కాదు కనుక అది చేతిలో ఉన్నప్పుడే పూర్తిగా వినియోగించుకోవాలని ఆశావ్యామోహాలు కలుగుతాయి. కనుక నైతిక విలువలు లేని, అధికార దుర్వినియోగపరులైన డైరెక్టరీ పరిపాలనలో రాజ్యాంగానికి మూలమైన ఆశయాలు నెరవేరలేదు.

### 5.2.2 పౌరసత్వము ఓటుహక్కు :

డైరెక్టరీ రాజ్యాంగం 1793 రాజ్యాంగం వలెనే నిర్దిష్టమైన ఆస్తి కలిగి, స్థిమితపరులైన వారికే శాసనసభకు ఎన్నికకాగల అర్హతను విధించింది. అలాగే పౌరసత్వం కూడ చదువను వ్రాయను నేర్చిన వారికే ఏదో ఒక వృత్తి వ్యాపారము కలిగిన వారికి మాత్రమే ఇయ్యడం జరిగింది. అక్షరాస్యత ఆర్థిక స్థితిగతులు ప్రాతిపదికగా పౌరసత్వము, ఓటుహక్కు ఇచ్చిన మొట్టమొదటి రాజ్యాంగచట్టం, యావత్ప్రపంచంలోనూ ఇదే. అంతకు పూర్వం అవి కేవలం స్వాధికార వర్గాలకు మాత్రమే పరిమితమై, ఫ్యూడల్ సభల (ఎస్టేట్స్ జనరల్, పార్లమా, డయట్, మొదలైన పేర్లతో వివిధ దేశాల్లో పనిచేస్తున్నవి) లో వారి ప్రాతినిధ్యం కొరకు ఉపయోగపడేవి.

### 5.2.3 శాసన నిర్మాణ శాఖ (Legislative) :

1793 రాజ్యాంగం ఒకే సభతో కూడిన శాసన నిర్మాణశాఖ (Unicameral Legislative) ను ఏర్పరచడాన అది సులువుగా తీవ్రవాదులైన రిపబ్లికన్‌ల చేతికి, వారినుండి పారిస్ కమ్యూనుకు వశమైంది. దానివలన అది తలపెట్టిన బీభత్సపాలనకు, మారణకాండకు అదుపు లేకపోయింది. అటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండ 1795 రాజ్యాంగం రెండు సభలతో కూడిన (bi - Cameral) శాసన నిర్మాణశాఖను ఏర్పరచింది. వీటిలోని దిగువసభ సాధారణ ఎన్నికల ద్వారా, దేశ ప్రజానీకంనుండి, 500 మంది ప్రతినిధులను ఎన్నుకుంటుంది. కనుక దీనికి కౌన్సిల్ ఆఫ్ ఫైవ్ హండ్రెడ్స్ (Council of Five Hundreds) అనిపేరు. అన్నివిధాలైన శాసనాలకు బిల్లులను ప్రతిపాదించేది ఈ సభలోనే. వాటిపై చర్చ జరిగిన తరువాత అవి ఎగువసభకు పంపబడతాయి. ఎగువసభ వాటిని తిరిగి సమగ్రంగా చర్చించి, నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. ఈ ఎగువసభలో పరోక్ష ఎన్నిక ద్వారా, పరిమితమైన ఓటుహక్కుతో 250 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుంది, దీనిని కౌన్సిల్ ఆఫ్ ఎల్డర్స్ (Council of Elders) లేక కౌన్సిల్ ఆఫ్ ఏన్షియంట్స్ (Council of Ancients) అని పిలిచేవారు.

కాగా, శాసననిర్మాణ శాఖలోని దిగువసభకు నిర్ణయాలు తీసుకొనే అధికారాలు లేవని, ఎగువసభకు బిల్లులను ప్రతిపాదించే అధికారం లేదని గుర్తించాలి. దిగువసభ ఎంపికచేసిన వారినుండి ఎగువసభ డైరెక్టరీ సభ్యులను, అనగా ఐదుగురు డైరెక్టర్లను, మంత్రులు, సేనాధిపతుల వంటి ఉన్నత పరిపాలక మండలిని నియమిస్తుంది. దిగువసభ వలన సర్వజనసమానత్వంతో కూడిన రిపబ్లిక్ పనిచేయడం, ఎగువసభ దానిపై అదుపు, అజమాయిషీ కలిగి, పరిపాలన క్రమశిక్షణాయుతంగా ఉండడానికి కృషిచేయడం, ఈ ఏర్పాట్ల మూల సూత్రం.

### 5.2.4 మతవిధానం :

1795 రాజ్యాంగం అంతకు పూర్వంనుండి జరుగుతున్న పరిణామాలు, ముఖ్యంగా రాబిస్పియిరీ ఆలోచనల ప్రకారం చర్చి భవనాలను ఆలోచనాలయాలు చేయడం, అన్నివిధాలయిన మతవిశ్వాసాలను, ఆచారాలను చట్టబద్ధంగా రద్దుచేసి విజ్ఞతాయుతమైన జీవనవిధానానికి పెద్దపీట వేయడం - అత్యధిక సంఖ్యాకులైన రోమన్ కాథలిక్కులకు, మతవిశ్వాసాలు కలిగిన సాధారణ ప్రజానీకానికి ఆమోదం కాని విషయాన్ని గుర్తించింది. విజ్ఞత, మేథస్సు కూడ బలవంతంగా పైనుంచి విధిస్తే అవి గ్రహించలేని సాధారణ ప్రజానీకానికి రుచించవు. అవి వాటంతట, ప్రజల మనసుల్లో, వారి వారి మానసిక పరిణతిని అనుసరించి

ఉత్పన్నం కావలసినవి. కనుక సాధారణ ప్రజానీకం యొక్క మతవిశ్వాసాలతో, ఆచార వ్యవహారాలతో 1795 డైరెక్టరీ రాజ్యాంగం ఎటువంటి అనవసర జోక్యం పెట్టుకోలేదు. అవి పూర్తిగా వ్యక్తిగతమైనవి - సమాజవ్యవస్థకు, రాజ్యవ్యవస్థకు ఏ మాత్రం సంబంధం లేనివిగా ఈ రాజ్యాంగం ప్రకటించింది. అనగా పౌరులకు పూర్తిగా మతస్వేచ్ఛ ఇయ్యడం జరిగింది కాని, మతాలను బట్టి సమాజంలోను, రాజ్యవ్యవస్థలోను ఎటువంటి వివక్షత ఉండదు. సమాజంలోను, రాజ్యవ్యవస్థలోను దేశప్రజలందరు సంపూర్ణంగా సమానులని, ఈ రాజ్యాంగం ప్రకటించింది.

కేవలం మతవ్యవస్థకు మాత్రమేకాక ప్రజలు తమ భావసామ్యంపై ఆధారపడి ఏర్పరచుకొనే వృత్తి సంఘాలు, రాజకీయ సంస్థలు, కార్మికసంఘాలు మొదలైనవి పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉండి, ప్రజల్లో వర్గభేదాలకు కారణం కాకుండ పనిచేయవలసి ఉంటుందని 1795 రాజ్యాంగం విధించింది. ఈ విధమైన ఏ సంస్థ అయినా, విపరీతంగా ప్రజాబలాన్ని కూడగట్టుకొని ప్రభుత్వానికి ప్రతిగా, రాజకీయశక్తిగా, ఎదగడాన్ని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడాన్ని నిరోధించడం రాజ్యాంగం యొక్క ఆశయం. ఆ విధంగా సంఘాలు, సంస్థలు మితిమీరిన ఆధిపత్యాన్ని పొందడం "న్యాయవిరుద్ధం" (Contrary to Public Law) గా రాజ్యాంగం నిర్దేశించింది.

### 5.2.5 డైరెక్టరీ దేశీయాంగ పరిపాలన :

1795 డైరెక్టరీ రాజ్యాంగం విప్లవ ఫలితాలను - స్వేచ్ఛా సమానత్వాలను, ప్రజాపాలనా వ్యవస్థను పొందుపరచుకొని, మధ్యతరగతి మేధావుల భావాలకు అనుగుణంగా రూపొందినా, ప్రజామోదం పొందడం తద్వారా శాశ్వతంగా ఆచరణయోగ్యం కావడం జరుగలేదు. జాతీయసమితి ప్రజాసామాన్యాన్ని రెచ్చగొట్టి వారికి నేర్పిన స్వేచ్ఛాసమానత్వాలు ఈ రాజ్యాంగంలో లేకపోవడాన తీవ్రవాదులైన రిపబ్లికన్‌లకు చాల నిరాశాజనకం అయింది. ఫలితంగా అనేక సందర్భాల్లో ప్రజాస్వామాన్యం ఆవేశపూరితంగా ఉద్యమించడమూ ప్రభుత్వం వారిని కఠినంగా అణచివేసి పరిపాలనలో క్రమశిక్షణ నెలకొల్పడానికి ప్రయత్నించడమూ సాధారణం అయింది. అలాగే విప్లవ ఫలితాలను పొందుపరచుకొన్న కారణాన సాంప్రదాయవాదులు, రాచరికవాదులు ఈ రాజ్యాంగాన్ని నిరసించారు. వారు సైతం తరచుగా రిపబ్లిక్ వ్యతిరేక ఉద్యమాలు ప్రారంభించడమూ, ప్రభుత్వం వాటిని అణచివేయడమూ సర్వసామాన్యం అయింది. వీటికంటె ప్రభుత్వాధినేతల అవినీతి, అసమర్థత ప్రజల నిరసనలకు, అల్లర్లకు ప్రధాన కారణమైంది.

### 5.2.6 రాచరికవాదుల వ్యతిరేకత :

డైరెక్టరీ అధికారం స్వీకరించే నాడే, శాసన సభ్యులు, డైరెక్టర్లు ఊరేగింపుగా సభా భవనానికి వెళ్ళుతుండగా ప్రజల నిరసన పెల్లుబికింది. ఆ సమయంలో ఈ ప్రభుత్వం పూర్తిగా రిపబ్లిక్‌గా భావించిన రాచరికవాదులు జాతీయసమితి కాలంనాటి భీభత్స పరిపాలనలో ఆప్తులను, బంధుమిత్రులను పోగొట్టుకొన్న దుఃఖంలో ఆ ఊరేగింపుపై పారిస్ వీధుల్లో దాడికి దిగారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత డైరెక్టరీ పాలనాకాలంలో ఇదే మొట్టమొదటిది. ఆ సమయంలో ఒక చిన్న సైనిక పటాలానికి నాయకుడుగా ఉన్న నెపోలియన్ చాకచక్యంగా, జననష్టం లేకుండ ఆ అలజడిని నివారించాడు. నెపోలియన్ నెపోలియన్ అధిగమనం ఈ సంఘటనతోనే ప్రారంభం అయింది.

### 5.2.7 బేబూల్ ఉద్యమం :

ప్రారంభ దినాల్లోని రాచరికహదుల తిరుగుబాటువలె డైరెక్టరీ అధికారం స్వీకరించిన కొలదికాలంలో తీవ్రవాదుల ఆందోళనలను ఎదిరించవలసివచ్చింది. బేబూల్ (Babeul) అనే ఒక తీవ్రవాది ఈ ఉద్యమనాయకుడు. ఇతడు పందొమ్మిదో శతాబ్దినాటి మార్క్సిస్టు సామ్యవాదానికి పద్దెనిమిదో శతాబ్దంలో కనిపించిన వేగుచుక్క.

కారల్ మార్క్స్ పందొమ్మిదో శతాబ్దంలో ప్రతిపాదించిన సర్వసమానత్వంతో కూడిన సామ్యవాదం వంటి సిద్ధాంతాన్ని, దేశ సంపదనంతటిని సమానంగా ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా తీసుకొనిరావడాన్ని ప్రతిపాదించారు. ఇతని అనుచరులు "సమానస్థుల సమాజం" (Society of Equals) అనే పేరున ఏర్పడి ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ ఆర్థికంగా అట్టడుగున ఉన్న జనసామాన్యాన్ని ఉత్తేజితం చేయసాగారు. "సామ్యవాదం" (Socialism) అనే పదం ఉత్పన్నం కాకముందే పుట్టుకొచ్చిన

తాత్త్విక సిద్ధాంతం ఇది. దీని ఆవిర్భావం జాతీయసమితి ప్రభువర్గాన్ని, రాచరికాన్ని నిర్మూలించడానికి అదుపులేని జనాన్ని ఉపయోగించుకొని భీభత్సపరిపాలన నడిపిన కాలంలోనిది. ఆ కాలంలో జీన్ జాక్స్ హెబర్ట్ (Jean Jaques Hebert) అనే తీవ్రవాదిని, అతని అనుచరులను గిలొటెన్‌పై శిరచ్ఛేదం చేయడాన్ని గూర్చి పైన ప్రస్తావించడం జరిగింది. ఈ విధమైన ఆర్థికతత్త్వం హెబర్ట్, మరికొందరు సమకాలీన తీవ్రవాద రిపబ్లికన్‌లది. ఈ తీవ్రవాదులను "కోపిష్టులు" (The Errages) అనేవారు. ఈ పదం అపహాస్యంతో కూడి, వ్యవస్థపై "పిచ్చికోపం" కల్గిన ఉన్మాదులని ధ్వనించేది. కోపిష్టులను, హెబర్టిస్టులను లోగడ జాతీయసమితి అణచివేసినట్లే డైరెక్టరీ బేబూలిస్టులను నిర్దాక్షిణ్యామైన విధానాలతో అణచివేసింది. అయితే వారి భావాలు అప్పటికే ప్రజాస్వామాన్యంలో వ్యాపించి, క్రమంగా అభివృద్ధి చెందసాగాయి.

### 5.2.8 ఆర్థిక స్థితి :

డైరెక్టరీ ప్రభుత్వ అసమర్థ పరిపాలన, దేశంలోని రాజకీయకల్లోలాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింతగా క్షీణింపజేశాయి. దేశంలో శాంతిభద్రతలు కరువైనందున వస్తూత్పత్తి కుంటుపడింది. వ్యవసాయము, పరిశ్రమలు దిగజారినాయి. ప్రభుత్వవ్యయం పెరిగింది, కాని దీనికి సమానంగా ఆదాయం పెరగలేదు. ఈ కారణాన లోగడ జారీ చేసిన కాగితపు డబ్బు (Assignats) విలువ పడిపోయింది. ఈ పరిస్థితి ఇంచుమించుగా పదునారో లూయి కాలంలో, 1789 ఫ్రెంచి విప్లవ ప్రారంభకాలం నాటి పరిస్థితి పునరావృతమైనట్లు ఏర్పడింది. ఈ పరిస్థితిలో ప్రజల దృష్టి మరలించి, ప్రభుత్వ ప్రతిష్ఠను నిలబెట్టడానికి విదేశాలతో పోరాటాలు చేయడం తప్ప గత్యంతరం లేకపోయింది.

## 5.3 డైరెక్టరీ ప్రభుత్వ విదేశాంగ విధానము (Foreign Policy) :

ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకొనేందుకు విదేశీయుద్ధాన్ని కోరుతున్న తరుణంలో ఫ్రెంచి ప్రభుత్వం ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణకూటమితో పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉండడం డైరెక్టరీకి కొంత ఊరట కల్గించింది. అయితే, అటువంటి సమయంలో విదేశాలతో పోరాడడం ఆర్థికదృష్టితో గోరుచుట్టుమీద రోకటిపోటు, తదనంతరం ప్రభుత్వం సైనికబలాల ఆధిక్యతకు, ప్రజాస్వామిక (Republican) వ్యవస్థల పతనానికి దారి తీయగలదు. సరిగ్గా ఇదేవిధమైన పరిణామాల్లో డైరెక్టరీ పతనం అయింది.

### 5.3.1 ఆస్ట్రియాతో పోరాటం (1796-97) నెపోలియన్ బోనాపార్టీ అధిగమనం :

1795 అక్టోబర్ 27న డైరెక్టరీ అధికార బాధ్యతలు స్వీకరించేనాటికి ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి (First Coalition of European Powers) ఇంచుమించుగా విచ్ఛిన్నమైందని పై అధ్యాయంలో వివరించడం జరిగింది. కాగా అప్పటికి సంకీర్ణ కూటమిలో మిగిలిన బలిష్టమైన దేశాలు గ్రేట్ బ్రిటన్, ఆస్ట్రియా, సార్డీనియాలు మాత్రమే. గ్రేట్ బ్రిటన్ సంధి సంప్రదింపులు సాగించినా, అవి సఫలం కాలేదు. కాని గ్రేట్ బ్రిటన్ నౌకాబలం కలిగిన దేశం కావడాన దీనితో పోరాటానికి ఫ్రాన్సు కొంత వ్యవధి తీసుకొని సంసిద్ధం కావలసి ఉంది. ఆస్ట్రియా, సార్డీనియాలు భూమిపైనే కాల్బలాన్ని ఉపయోగించి పోరాడదగినవి. కనుక డైరెక్టరీ మొదట ఈ దేశాలను ఓడించడానికి సంకల్పించింది.

డైరెక్టరీలో ఒక డైరెక్టర్, యుద్ధ మంత్రి (Defense Minister) అయిన కార్నొట్ ఆస్ట్రియాపై రెండువైపులనుండి దండయాత్రలు పంపడానికి ప్రణాళికను రచించాడు. జోర్డాన్ (Joardan), మోరో (Moreau) అనే ఇద్దరు సమర్థులైన సేనానులను రైన్ నదీ మైదానం, ప్రష్యాల గుండా రెండు మార్గాలలో దండెత్తడమూ, మరొక సేన నెపోలియన్ బోనాపార్టీ నాయకత్వంలో, ఉత్తర ఇటలీలోని ఆస్ట్రియా ఆధిపత్యం గల ప్రాంతాలపై దండెత్తడమూ, అతని ప్రణాళికలోని ప్రధానాంశం. అయితే ఈ ప్రణాళికను సఫలీకృతం చేసినవాడు నెపోలియన్ బోనాపార్టీ అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

### 5.3.2 నెపోలియన్ ఇటలీ దండయాత్ర :

నెపోలియన్ ఫ్రెంచి సైన్యంలో ఒక చిన్న దళానికి నాయకునిగా పదవిని పొందిన కొద్దికాలానికి, 1795 అక్టోబర్‌లో జాతీయసమితిలోని రాజ్యాంగ నిర్ణాయకసభ సమావేశమై వున్న ట్యూలరీస్ భవనంపై జరిగిన ప్రజల దాడిని అణచివేసినట్లు పై

అధ్యాయంలో వివరించడం జరిగింది. ఆ సంఘటనతో అతడు సమర్దుడుగా గుర్తింపు తెచ్చుకొని, డైరెక్టరీలోని సభ్యుల ఆదరణను సంపాదించి, ఆస్ట్రియాపై ఉద్దేశించిన దండయాత్రలో ఒక సేనకు సర్వసేనాధిపతిగా నియామకం పొందాడు.

ఆనాటి ఫ్రాన్స్ దేశ ఆర్థిక దుస్థితిలో ప్రభుత్వం సైనికులకు మంచిదుస్తులు, చలిబాధకు తట్టుకొనడానికి రగ్గులు, బూట్లు, సాక్స్ కూడ ఇయ్యలేని స్థితిలో ఉంది. దండయాత్ర సమాప్తమయేవరకు వారికి ఆహారం కూడ సమకూర్చలేకపోయింది. ఈ పరిస్థితిలో, శీతాకాలంలో నెపోలియన్ బోనాపార్టీ దండయాత్రకు బయలుదేరదీసినప్పుడు సైనికులు చాల నిరాసక్తంగా, విసుగ్గా ఉన్నారు. కాని నెపోలియన్ తన వ్యూహరచనా చాతుర్యము, యుక్తి ఉపయోగించి యుద్ధ సంఘటనలను జరిగించిన తీరు, తన వాక్చాతుర్యంతో సైనికులను ఉత్సాహపరచిన తీరు, అతన్ని ఐరోపా రాజకీయాల్లో అగ్రశ్రేణి సేనానిగా ప్రత్యేకతను సంపాదించి పెట్టాయి. తన హోదాను ప్రక్కన పెట్టి, సాధారణ సైనికులతో కలసి, వారితోపాటుగా కష్టసుఖాలను సమానంగా అనుభవించడంతో నెపోలియన్ వారి మనసులకు చేరువ కాగలిగాడు. వారిలో అకుంఠితమైన దేశభక్తి, కర్తవ్యనిరతి, త్యాగశీలము జాగృతమయ్యే రీతిన గంభీరమైన ప్రసంగాలు చేసి వారిని ఉత్తేజపరచాడు. అంతేకాక తన ఉద్బోధలకు తాను ఉదాహరణాత్మకంగా ప్రవర్తిస్తూ వారిని తమ ఇబ్బందులను లక్ష్యం చేయక, దేశం కొరకు ఎటువంటి గడ్డుపరిస్థితినైన ఎదిరించి పోరాడే దేశభక్తి పూరితులుగా చేసి నడిపించాడు.

సరైన దుస్తులు, మందుగుండుసామాగ్రి, ఆహార సరఫరాలు లేని సేనలో అసంతృప్తిని, నిరాసక్తతను తొలగించడానికి నెపోలియన్ బోనాపార్టీ తెలివైన విధానాన్ని అవలంబించాడు. అతడు దారిలో శత్రు సీమలో అడుగుపెట్టిన తరువాత, పోరాటంలోని ఒక ప్రధానాంశంగా ఫ్రెంచిసేనలు గ్రామాలను పట్టణాలను యథేచ్ఛగా దోచుకోవడానికి అనుమతినిచ్చాడు. దీనివలన కావలసిన వస్తువులను ఫ్రెంచిసైన్యం పొందగలగడమే కాక, శత్రువులను బలహీనపరచడం కూడ వీలైంది. ఆ రాజ్యాల్లోని ప్రజలు తమను, తమ ఆస్తులను కాపాడడంలో విఫలమైన తమ ప్రభుత్వాలపట్ల అసంతృప్తి చెందడము, తద్వారా ఫ్రెంచి సేనలకు విజయము సాధ్యమైనాయి. ఈ విధంగా శత్రువులను నిర్వీర్యపరచే వేగంతో ఆల్ప్సు (Alps) పర్వతాలను సెయింట్ బెర్నార్డ్ (St. Bernard) కనుమ వద్ద దాటి, ఫ్రెంచిసేనలు సెవాయ్ (Sevoy), నీస్ (Nice) ప్రాంతాల్లో ఊహకు అందని రీతిలో ఆకస్మిక దాడులు చేసాయి. దీనికంతటికి నెపోలియన్ బోనాపార్టీ సేనానాయకత్వము ప్రధాన కారణం. ప్రతి అంశంలోను తగు జాగ్రత్తలు తీసుకొని తన వ్యూహాన్ని అమలు జరపడంలోను, అందుకు తగిన సేనానాయకులను సహాయకులుగా ఎంపిక చేసుకొని వారిని నియుక్తులను చేసి ఉపయోగించుకోవడంలోను నెపోలియన్ అసాధారణమైన శక్తి యుక్తులను ప్రదర్శించాడు. ఫ్రెంచిసేనల ఫిరంగిదళాలు అగ్నిగోళాలను వర్షిస్తుండగా, చెల్లాచెదురైన శత్రు సైనికులను వారి అశ్విక దళాలు విధ్వంసం చేశాయి. ఒక్కనెలలోనే ఐదు భీకర పోరాటాలు చేసి, సార్డీనియాను, ఆస్ట్రియాను విడివిడిగా తీవ్ర పరాజయం పాలు చేసి, నెపోలియన్ వారిరువురు సంయుక్తంగా ఫ్రెంచి సేనలను ఎదిరించే అవకాశం లేకుండ చేశాడు. చెరాస్కో (Cherasco) వద్ద సార్డీనియా నెపోలియన్‌తో సంధి చేసుకొని, సెవాయ్, నీస్ ప్రాంతాలను ఫ్రాన్సుకు అప్పగించి పోరాటంనుండి విరమించింది.

సార్డీనియాను లొంగదీసిన తరువాత నెపోలియన్ ఆస్ట్రియా ఆధిపత్యంలోని ఉత్తర ఇటలీ ప్రాంతాలపైకి తన సేనలను తరలించాడు. అతడు మిలాన్ (Milan) నగరాన్ని సమీపిస్తుండగా అక్కడి ఆస్ట్రియన్ సేనలు అంత వేగంగా ఫ్రెంచిసేనలు తమ పైకి రాగలవని ఊహించనందున పోరాటానికి సంసిద్ధం కాలేక, మాంటూవా (Mantua) కు తరలిపోయాయి. వారిని లోడీ (Lodi) వద్ద ఓడించి, నెపోలియన్ ఆస్ట్రియా అధీనంలోగల లంబార్డీ (Lombardy) మొత్తాన్ని ఆక్రమించాడు. తరువాత అతడు మిలాన్ నగరంలో ప్రవేశించగా, అక్కడి ఇటాలియన్ ప్రజానీకం హర్షధ్వానాలతో ఆహ్వానించి, ఆస్ట్రియా ఆధిపత్యంనుండి తమకు విముక్తి ప్రసాదించినందుకు అభినందించారు. మిలాన్ నగరంలో, సాంస్కృతిక పునరుజ్జీవన కాలంనాటి ప్రసిద్ధ చిత్రకారుల చిత్రపటాలను నెపోలియన్ స్వాధీనపరచుకొని తన విజయ చిహ్నాలుగా పారిస్ నగరానికి పంపాడు.

అయితే లంబార్డీలో ఫ్రెంచిసేనలు సాగించే దోపిడి వలన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తలెత్తి, గ్రామీణ ప్రాంతాల్లోని కర్షకులు తిరుగుబాట్లు చేశారు. అనేక ఫ్రెంచి సైనికులు ఆ అల్లర్లలో మరణించారు. తిరుగుబాటుదారులు పావియా (Pavia) దుర్గంలో తలదాచుకొని తమ దాడులను కొనసాగించారు. ఫ్రెంచిసేనలు పావియాను ఆక్రమించి, అక్కడి కోటను ధ్వంసం చేసి, తిరుగుబాట్లను అణచివేశాయి. ఆ సంఘటనల్లో ఆస్ట్రియా ఆధిపత్యాన్ని ఫ్రెంచివారి దురాగతాలను ఏ విధంగా ఇటాలియన్

గ్రామీణ ప్రజానీకం సహించలేకపోయిందో, వారిని ప్రతిఘటించి, తమకు వాటిల్లుతున్న కష్టనష్టాలను తొలగించుకోడానికి ఏ విధంగా సమైక్యమై సన్నద్ధులైనారో గ్రహించినప్పుడు వారిలో ఏర్పడుతున్న జాతీయభావము, జాతీయ సంఘటన (National Integration) బోధపడతాయి.

ఆస్ట్రియా తగిన సన్నాహాలతో మాంటూవా (Mantua), పెషీరా (Peschiera) దుర్గాలను స్థావరాలుగా చేసుకొని ఫ్రెంచిసేనలతో పోరాటానికి సిద్ధమైంది. కాని నెపోలియన్ పెషీరా వద్ద వారిని ఓడించి, మాంటూవా దుర్గాన్ని ముట్టడించాడు. అదే సమయంలో ఆస్ట్రియాతో రాజకీయ ఒప్పందం గలిగిన పోప్ ఆరో పయస్ (Pius) వారికి సాయంగా సేనలను పంపబోతున్నాడు. వెంటనే నెపోలియన్ కొంతసేనను పోప్ రాజ్యాల (Papal States) పైకి పంపి, పోప్ ఆ ప్రయత్నం విరమించుకొని, యుద్ధ ఖర్చుల పరిహారం (indemnity) చెల్లించడానికి, రోమ్ నగరంలోని ప్రసిద్ధ చిత్రపటాలను సమర్పించుకోడానికి అంగీకరింపజేశాడు.

అంతలో ఆస్ట్రియానుండి అదనపు సైనిక బలగాలు ఇటలీని చేరి యుద్ధ రంగంలో ప్రవేశించాయి. నెపోలియన్ అనేక సందర్భాల్లో ప్రదర్శించినట్లే తెగువతనమూ, సాహసమూ ప్రదర్శించి, తనకున్న సేనతోనే కార్యసాధనకు పూనుకున్నాడు. మాంటూవా దుర్గం ముట్టడిని ఎత్తివేసి, అక్కడి ఆస్ట్రియా సైన్యం అదనపు సేనలను కలిసి పోరాడడాన్ని ఒకప్రక్క నిరోధిస్తూనే, క్రొత్తగా వచ్చిన సైనికబలగాలను రెండుసార్లు వేర్వేరుగా ఓడించాడు. తరువాత తిరిగి మాంటూవాను ముట్టడించి, 1797 ఫిబ్రవరినాటికి, ఆ దుర్గాన్ని స్వాధీనపరచుకొన్నాడు. 1796 సంవత్సరాంతంలోగానే మొడేనా (Modena) ప్రాంతాన్ని పోప్ రాజ్యాలనుండి ఆక్రమించిన కొన్ని భూభాగాలతో కలిపి, సిస్పడేన్ (Cispadane) రిపబ్లిక్‌గా నెపోలియన్ ఏర్పరచాడు. ఫ్రెంచి సేనలు ఆక్రమించి స్వాధీనం చేసుకొన్న ఇతర ఐరోపారాజ్య భాగాల్లో రిపబ్లిక్‌లను నెలకొల్పడాన్ని 1795 లోనే, జాతీయసమితి నిర్ణయించి, సౌహార్ద ప్రకటన చేసిన విషయం జ్ఞప్తికి తెచ్చుకోవలసి ఉంది. ఆ ప్రకటనకు అనుగుణంగా నెపోలియన్ చేసిన ఈ ఏర్పాటు, ఉత్తర ఇటలీలో ఆస్ట్రియా ఆధిపత్యాన్ని తొలగించి, అక్కడి ప్రజలకు స్వేచ్ఛా సమానత్వాలతో కూడిన ప్రజాపరిపాలనా వ్యవస్థను నిర్మించి ఇచ్చిన ఖ్యాతి ఫ్రెంచివారికి దక్కింది; ఫ్రెంచి పలుకుబడి ఆ ప్రాంతాల్లో నెలకొన్నది.

ఉత్తర ఇటలీనంతటిని ఆక్రమించిన నెపోలియన్ బోనాపార్టీ, అప్పటికి ఇంకా పోప్ ఆస్ట్రియన్లతో రహస్యంగా మంతనాలు జరుపుతున్న విషయం పసిగట్టి మరొకమారు పోప్ రాజ్యాలపై దండెత్తాడు. ఈ రెండవ దండయాత్రలో పోప్‌ను, అతనితో చేరి ఉన్న వెనీషియా, ఆస్ట్రియన్ సేనలను ఓడించి, టోలెంటినో (Tolentino) వద్ద సంధి చేసుకొని లొంగిపోయేలా చేశాడు.

### 5.3.3 నెపోలియన్ ఆస్ట్రియా దండయాత్ర :

ఉత్తర ఇటలీలో నెపోలియన్ అసాధారణమైన విజయపరంపరలతో ఆస్ట్రియాను ఓడించగా, డైరెక్టరీ ఆదేశంపై రైన్ మైదానాలగుండా జోర్డాన్, మోరోల నాయకత్వంలో పంపిన సేనలు కొన్ని తొలి విజయాల తరువాత పరాజయం పొందాయి. ఆస్ట్రియాను పరిపాలిస్తున్న ఆర్చి డ్యూక్ ఛార్లెస్ జోర్డాన్‌ను ఓడించి పారద్రోలడంతో బవేరియా (Bavaria) లో విజయం సాధించిన మోరో కూడ భయంతో వెనక్కు మరలాడు. అయితే, ఇటాలియన్ దండయాత్రను విజయవంతంగా ముగించిన నెపోలియన్ 1797లో ఆస్ట్రియాలో ప్రవేశించి, ఆర్చి డ్యూక్ ఛార్లెసును టాగ్లియామెంటో (Tagliamento) వద్ద ఓడించి, ఆస్ట్రియాలోని కారింధియా (Carinthia) ప్రాంతంపై దాడిచేశాడు. ఉత్తర ఇటలీలోని ఆధిపత్యాన్ని కోల్పోయి, స్వంత భూభాగాలపై పరాజయాలను పొంది, ఆస్ట్రియా తన ఓటమిని అంగీకరించి, కాంపో ఫోర్మియో (Campo Formio) వద్ద సంధి చేసుకొంది.

### 5.3.4 కాంపో ఫోర్మియో సంధి (Treaty of Campo Formio) :

1797లో ఆస్ట్రియాను లొంగదీసి నెపోలియన్ బోనాపార్టీ ఆ దేశంతో చేసిన కాంపో ఫోర్మియో సంధి ఫ్రెంచి చరిత్రలోను, నెపోలియన్ జీవితంలోను ఒక ప్రధానమైన ఘట్టం. ఈ సంధికి దారితీసిన ఆస్ట్రియా పరాజయం పూర్తిగా నెపోలియన్ సాధించిన ఘనకార్యమే.

1) కాంపో ఫోర్మియో సంధి షరతుల్లో ఆస్ట్రియా ఉత్తర ఇటలీలోని లంబార్డీని తన ఆధిపత్యంలోని నెదర్లాండ్స్ (బెల్జియమ్) ను గెలుచుకొన్న ఫ్రాన్సుకు స్వాధీనపరచింది. లంబార్డీని నెపోలియన్ తాను లోగడ ఏర్పరచిన సిస్పడేన్ రిపబ్లిక్‌తో

చేర్చి, ఇంచుమించుగా ఉత్తర ఇటలీనంతటిని సిస్ - ఆల్పైన్ (Cis - Alpine) రిపబ్లిక్‌గా ఏర్పరచాడు. ఈ రిపబ్లిక్ ఫ్రాన్సుకు సన్నిహితమైన అనుబంధ రాజ్యంగా ఏర్పడడాన్ని ఆస్ట్రియా గుర్తించి, అంగీకరించింది.

2) ఆస్ట్రియా తాను కోల్పోయిన భూభాగాలకు పరిహారంగా వెనీషియాను, ఇస్ట్రియా (Istria) డాల్మాషియా (Dalmatia) లతో సహా ఆక్రమించుకోడానికి ఫ్రాన్సు అంగీకరించింది. వెనీషియా అంతకుముందు స్వతంత్రమైన రిపబ్లిక్‌గా అతి ప్రాచీనకాలం నుండి కొనసాగుతూ వస్తున్నది. కాంపో ఫోర్మియో సంధివలన అది ఆస్ట్రియా అధీనం కావడంతో ఆ రిపబ్లిక్ అంతమైంది.

ఆస్ట్రియాను సంపూర్ణంగా ఓడించిన తరువాత, ఆ దేశానికి చెందిన లంబార్డీని, నెదర్లాండ్సును ఆక్రమించిన నెపోలియన్ ఆ దేశంపట్ల ఉదారంగా వ్యవహరించి, నష్టపరిహారంగా ప్రత్యామ్నాయ భూభాగాలను ఆక్రమించడాన్ని అంగీకరించవలసిన అవసరం లేదు. కాని, ఆ ఓటమిని అలుసుగా తీసుకొని ఆస్ట్రియాను అవమానించడము, విచ్ఛిన్నం చేయడమూ మున్ముందు చిక్కులు తెచ్చిపెట్టగలవని నెపోలియన్ ఊహించాడు. అందుచేత అతడు ఎప్పటికప్పుడు ఓడిపోయిన రాజ్యాలను మృదువైన సంప్రదింపులు, సమన్వయ ధోరణితో కూడిన షరతులతో శాంతి ఒడంబడికలు చేసుకొని సమాధానపరచడానికి యత్నించేవాడు. ఇది అతని దూరదృష్టికి, దౌత్యనీతికి ఉదాహరణ. లేకుంటే ఓడిపోయిన రాజ్యాలు అచిరకాలంలోనే తిరిగి బలోపేతమై ఫ్రాన్సుపై యుద్ధం ప్రకటించగల ప్రమాదం ఉంది. అయితే ఈ దౌత్యనీతి ఆశించిన ఫలితాలను ఇయ్యలేదు. అందుకు కారణం ఫ్రాన్సు దేశంతో తక్కిన ఐరోపాదేశాలకు మౌలికంగా ఉన్న విభేదాలు. ఫ్రాన్సులో విప్లవ ఫలితంగా ఏర్పడిన రిపబ్లిక్ నిలిచి ఉన్నంతకాలం ఆ విభేదాలు తొలగేవి కావు.

3) ఫ్రాన్సు దేశానికి, హోలీ రోమన్ సామ్రాజ్యానికి సత్సంబంధాలను నెలకొల్పడానికి రేస్టాట్ (Radstat) వద్ద ఒక సమావేశాన్ని ఏర్పరచి, అందులో ఈ ప్రాదేశిక సర్దుబాట్లు అన్నిటిని సమగ్రంగా ఆమోదింపజేయడానికి చక్రవర్తిగా ఆస్ట్రియా ఆర్చి డ్యూక్ రెండవ ఫ్రాన్సిస్ అంగీకరించాడు. ఆనాడు జర్మన్ భాషాసంస్కృతులు కల ఆస్ట్రియా, ప్రష్యా, సాక్సనీ, హానోవర్, హెస్సీకాసెల్, బవేరియా మొదలైన మూడువందల అరవై రాజ్యాలు, సంస్థానాలు హోలీ రోమన్ సామ్రాజ్యంగా చలామణి అవుతున్నాయి. వీటన్నిటికి కలిపి డయట్ (Diat) అనే ఒక సమాఖ్యసభ, ఫ్రాన్సులో ఎస్టేట్స్ జనరల్ వంటిది ఉన్నది. ప్రష్యా నుండి ఆక్రమించిన రైన్ నదీమైదాన ప్రాంతము, ఆస్ట్రియానుండి ఆక్రమించిన ఉత్తర ఇటలీ, నెదర్లాండ్స్ (బెల్జియమ్) ప్రాంతాలను ఫ్రాన్సుకు స్వాధీనపరచడానికి ఈ సభ సమావేశం కావలసి ఉంది.

4) నెపోలియన్ ఇటలీపై దండయాత్ర చేసి, తొలిదశలో ఆక్రమించిన జినోవా (Genoa) ను లిగూరియన్ (Ligurian) రిపబ్లిక్ అనే పేర నెలకొల్పడం జరిగింది.

చక్రవర్తి వాగ్దానం మేరకు 1797 డిసెంబర్‌లో రేస్టాట్ కాంగ్రెసు సమావేశం అయింది. రైన్ నదికి పడమర ప్రష్యా అధీనంలోని మైదానాలను ఫ్రెంచి రిపబ్లిక్ ఆక్రమించడాన్ని ఈ కాంగ్రెస్ ధృవపరచింది. దీనితో ఫ్రెంచి రిపబ్లిక్‌కు తూర్పున రైన్‌నది సహజ సరిహద్దుగా ఏర్పడి, లోగడ పదునాలుగో లూయీ ఆశించినట్లు, డాంటన్ నిర్ణయించినట్లు జరిగింది. నెపోలియన్ దండయాత్రల్లో పదవులు, అధికారాలు కోల్పోయిన ప్రభువులకు హోలీ రోమన్ సామ్రాజ్యంలో మతవ్యవస్థ అధీనంలో ఉన్న ఇతర ప్రాంతాల్లో భూభాగాలను ఇచ్చి స్థిరమైన స్థానాలు కల్పించడానికి ఈ కాంగ్రెసు నిర్ణయించుకొంది.

ఈ ఏర్పాట్లలో ఫ్రాన్సు విశేషంగా లాభించిన విషయం స్పష్టం; ఆస్ట్రియా అధీనంలోని నెదర్లాండ్సును, ఉత్తర ఇటలీలను ఆక్రమించుకొంది, తనకు లోబడిన లిగూరియన్ రిపబ్లిక్, సిస్-ఆల్పైన్ రిపబ్లిక్‌లను సృష్టించింది, రైన్ మైదానాన్ని ఆక్రమించి తూర్పు దిశగా తన భూభాగాన్ని విస్తరింపజేసింది. అయితే పరాజయం పొందిన ఆస్ట్రియా కూడ ఏమి నష్టపోలేదని గుర్తించవలసి ఉంది. సుదూరంగా ఉన్న నెదర్లాండ్స్, ఉత్తర ఇటలీకి మారుగా ఆ దేశం తన సరిహద్దులోని వెనీషియా, ఇస్ట్రియా, డాల్మాషియాలను ఆక్రమించింది. 1792 లోని పిల్‌నాజ్ ప్రకటన కాలంనుండి, ఈ అయిదేండ్లు జరిగిన పోరాటాల్లో స్పష్టమైన విషయం - ఆస్ట్రియా, ప్రష్యాలు ఇద్దరికి హోలీ రోమన్ సామ్రాజ్యంపట్ల శ్రద్ధ, నిబద్ధత లేదని, అవి వేటికవి తమ స్వంత ప్రయోజనాలపట్లనే శ్రద్ధ వహించాయని జర్మనీ జాతీయ ఏకీకరణను గూర్చి తెలుసుకొనే సమయంలో ఈ విషయాన్ని గుర్తించాలి.

## 5.3.4 గ్రేట్ బ్రిటన్‌తో యుద్ధం (1798-99) :

1797 సంవత్సరాంతానికి ఫ్రెంచి డైరెక్టరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పడ్డ ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి (First European Coalition of Powers) లో గ్రేట్ బ్రిటన్ మాత్రమే మిగిలి ఉంది. సంకీర్ణ కూటమి ఏర్పడిన తొలిదశలో ఫ్రాన్సు ఏకాకి. ఇప్పుడు ఫ్రాన్సుకు హాలెండు, స్పెయిన్ మిత్రరాజ్యాలు గ్రేట్ బ్రిటన్‌పై యుద్ధం ప్రకటించి ఉన్నవి. బ్రిటన్ తన నౌకాబలం వల్ల అజేయమైనది. కాని, ప్రస్తుతం ఆ దేశానికి శత్రువులైన ఫ్రాన్సు, స్పెయిన్, హాలెండు ఖండాంతర వాణిజ్యం నిర్వహించేవి, వలసరాజ్యాలను కలిగినవి, అందుచేత గణనీయమైన నౌకాబలం కలిగినవి. 1796 లోనే ఫ్రాన్సు బ్రిటన్ అధీనంలోని ఐర్లాండుపై దండెత్తి తన నౌకాబలాన్ని ప్రయోగించింది, కాని వాతావరణ పరిస్థితి సానుకూలం కాకపోవడంతో వెనుదిరిగింది. ఈ అవకాశాలన్నిటికి తోడుగా 1797 సంవత్సరాంతం నాటికి ఫ్రెంచిసేనకు నెపోలియన్ నాయకత్వం లభించింది.

1796 లో ఐర్లాండుపై విఫలయత్నం చేసిన తరువాత ఫ్రెంచి నౌకాబలము, దీని మిత్రరాజ్యాల నౌకాబలాలను ఓడించడానికి గ్రేట్ బ్రిటన్ సన్నాహాలను చేసింది. కాని వారి నౌకాబలంలో సంభవించిన తిరుగుబాట్ల వలన, వాటిని అణచివేయడానికి చర్యలు తీసుకోవడంలోను కొంత సమయం గడిచింది. బ్రిటిష్ నౌకాబలాధికారులైన నెల్సన్ (Nelson), జెర్విస్ (Jervis) లు తిరుగుబాట్లను అణచి, ముందుగా స్పానిష్ నౌకాబలాన్ని సెయింట్ విన్సెంట్ యుద్ధంలో ఓడించారు. తరువాత కొద్ది నెలల తరువాత మరొక నౌకాదళాధిపతి డంకన్ (Duncan) డచ్చి నౌకాదళాన్ని కాంపర్‌డౌన్ (Camperdown) యుద్ధంలో ఓడించాడు. దీనితో ఫ్రాన్సు మాత్రమే బ్రిటన్‌కు ఎదురుగా నిలచి ఉన్నట్లయింది. ఫ్రెంచిసేనలు భూమిపైన, బ్రిటిష్ సేనలు సముద్రాలపైన శక్తివంతమైనవి.

అప్పటికి ఆస్ట్రియాపై ఉత్తర ఇటలీలోను, ఆస్ట్రియా భూభాగంపైన అనేక యుద్ధాల్లో అపూర్వమైన విజయపరంపరలను సాధించి నెపోలియన్ బోనాపార్టీ ఫ్రాన్సు దేశానికి తిరిగివచ్చాడు. అతని కీర్తి ప్రతిష్ఠలు ఉన్నతస్థాయికి చేరినాయి, ఫ్రెంచి ప్రజానీకానికి ఆరాధ్యుడైన వీరునిగా నెలకొన్నాడు. అతడు స్వదేశానికి రావడమంటే డైరెక్టరీలోని డైరెక్టర్లకు గుండెలు దడదడలాడాయి. అవినీతి, అసమర్థతతో ప్రజల దృష్టిలో పూర్తిగా పతనమైన ప్రభుత్వాన్ని నెపోలియన్ తన శక్తియుక్తులతో పడగొట్టగలడని, ప్రజలు అతన్ని సంపూర్ణంగా సమర్థిస్తారని వారు భయాందోళనలు చెందారు. అందుచేత వారు నెపోలియన్ తిరిగి దేశాన్ని విడిచిపోయేలా చేయడం అత్యవసరంగా భావించి, గ్రేట్ బ్రిటన్‌ను జయించే భారం అతనిపై ఉంచారు.

## 5.3.5 నెపోలియన్ ఈజిప్టుపై దండయాత్ర (1798-99) :

ఆస్ట్రియాతో పోరాటంలో అపూర్వమైన శక్తియుక్తులు, వ్యూహరచనా చాతుర్యము ప్రదర్శించిన నెపోలియన్ గ్రేట్‌బ్రిటన్‌పై దండయాత్రలో ఘోరంగా విఫలమైనాడు. మొదటి నుండి, అతడు అనుసరించిన యుద్ధవ్యూహంలోని అంతరార్థమేదో అతనికే తెలియని అస్పష్టత, ఒక విధానాన్ని ప్రారంభించిన తదుపరి, దాని పూర్తి ఫలితాలను తెలియకుండానే, ఆకస్మికంగా వేరొక విధానాన్ని అనుసరించి, రెండింటికి చెడిన రేవడివలె, తుదకు అపజయంతో మరలి రావడం జరిగింది. అయితే ఆ తరువాత నెపోలియన్ తన యుక్తిని ప్రదర్శించాడు; తన వైఫల్యాలకు పూర్తిగా ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న డైరెక్టర్లే కారణమని ఆరోపించాడు, నిందించాడు, వారిని పదవీభ్రష్టులను చేసి దేశ పరిపాలనాధికారాన్ని కైవసం చేసుకొన్నాడు.

గ్రేట్ బ్రిటన్‌ను జయించడానికి సూటిగా ఆ దేశంపైకి సేనలను నడిపించడం కాక, వారికి భారతదేశంలో గల వాణిజ్య, రాజకీయ సంబంధాలను త్రెంచివేయడం సరైన యుద్ధ వ్యూహంగా నెపోలియన్ భావించాడు. వాస్తవానికి అది సరైన యోచన, బ్రిటిష్‌వారి సైనిక బలము, తద్వారా ఐరోపాలో వారి రాజకీయ ప్రాబల్యము వారికి భారతదేశంతో గల వాణిజ్యము, రాజకీయ ప్రాబల్యము కారణంగా ప్రాప్తించినవే. కనుక, వారికి ఈ అవకాశాలను లేకుండ జేయడంతో బలహీనులై పతనం కాగలరు. కాని ఈ ఆలోచన ఆచరణ సాధ్యం చేయడంలోనే దాని సాఫల్యం ధ్రువపడేది. అంతేకాక, నెపోలియన్ యుద్ధ వ్యూహం ఇదేనని ఖచ్చితంగా చెప్పడం కూడ కష్టమైనదే.

బ్రిటిష్‌వారు భారతదేశంతో రాకపోకలకు, తమ వాణిజ్య, రాజకీయ సంబంధాలను నిర్వహించుకొనడానికి, మధ్యధరా సముద్రాన్ని ప్రవేశించి ఈజిప్టు చేరేవారు. అక్కడినుండి ఈజిప్టు భూభాగంలో కొంతదూరం ప్రయాణంచేసి, ఎర్రసముద్రాన్ని చేరి, దానినుండి అరేబియా సముద్రం ద్వారా భారతదేశాన్ని చేరేవారు. తఈ సంబంధాలను త్రెంచివేయడానికి నెపోలియన్ ఈజిప్టుపై దండెత్తడానికి నిశ్చయించుకున్నాడు.

నెపోలియన్ పోకడలను నెల్సన్ నాయకత్వంలోని నౌకాదళం ఒకటి మధ్యధరా సముద్రంలో నిలిచి, పరిశీలిస్తూ, అతన్ని అనుసరించసాగింది. కాని వాతావరణం ప్రతికూలించడంతో అది వెనుకకు మరలి సార్డీనియా తీరం సమీపంలో కొద్దిరోజులు ఆగవలసివచ్చింది. అవి ఈజిప్టు చేరే సమయానికి అక్కడ ఫ్రెంచి నౌకాబలం లేకపోవడంతో, సిరియా తీరానికి చేరువగా ఉన్న లెవాంట్ (Levant) ద్వీపాన్ని చేరింది. ఈలోగా నెపోలియన్ మాల్టా ద్వీపాన్ని ఆక్రమించి, ఈజిప్టు చేరి, సునాయాసంగా ఆ దేశపు రాజధాని, ప్రధాన రేవుపట్టణము అయిన అలెగ్జాండ్రియాను (కైరో) ఆక్రమించాడు. ఈ యుద్ధాన్ని "పిరమిడ్ల యుద్ధం" (Battle of Pyramids) అంటారు. అతనికి తన ప్రణాళిక సఫలం అవుతున్నట్లే కానవచ్చింది. అక్కడినుండి భారతదేశాన్ని చేరి, దక్షిణ భారతదేశంలో బ్రిటిషువారికి ప్రధాన ప్రత్యర్థి అయిన టిప్పూ సుల్తాన్‌తో కలసి, వారిని దేశంనుండి వెళ్ళగొట్టడానికి నెపోలియన్ యోచించాడు. పిరమిడ్ల యుద్ధంలో గెల్చిన ఉత్సాహంతో అతడు ఒక పిరమిడ్ పైకెక్కి ఫ్రెంచి సైనికులను ఉద్దేశిస్తూ గంభీరోపన్యాసం చేశాడు. వారి అచంచల దేశభక్తి, త్యాగశీలము, అనుపమానమైన శక్తి సామర్ధ్యాలు ఇక ప్రపంచమంతా ప్రశంసిస్తుందని, అందుకు వలసరాజ్యాధిపత్యంలో అగ్రగామిగా ఉన్న బ్రిటన్‌ను ఆ స్థానంనుండి పడగొట్టవలసి ఉందని, అది తప్పక ఫ్రెంచి సైనికులకు సాధ్యమై ఫ్రాన్సుదేశానికి ప్రపంచాధిపత్యం ప్రాప్తించేరోజు సమీపంలోనే ఉందని .... ఇలా అతని ఉపన్యాసం సాగిపోయింది. కాని, అంతలోనే లెవాంట్ నుండి బ్రిటిష్ నౌకాదళాధిపతి ఎడ్మిరల్ నెల్సన్ ఈజిప్టు తీరాన్ని చేరి, నైలునది ముఖద్వారం వద్ద నెపోలియన్ నాయకత్వంలోని ఫ్రెంచి నౌకాబలాన్ని, సేనను ధ్వంసం చేశాడు. ఈ యుద్ధాన్ని "నైలుయుద్ధ" మని (Battle of Nile) అంటారు.

నైలు యుద్ధంలో పరాజయం పొందడమేకాక నెపోలియన్ అతని నాయకత్వంలో మిగిలిన ఫ్రెంచిసేనలు ఈజిప్టులో చిక్కుపడిపోయారు, వారు మాతృదేశంతో ఏ సంబంధము లేక యుద్ధవార్తలు పంపి, సాయం పొందలేక దిగ్బంధంలో పడిపోయారు. అందుకు కారణం నైలునది ముఖద్వారం నెల్సన్ అధీనంలో ఉండిపోవడం. నెపోలియన్ అప్పుడు భూమార్గాన సిరియా చేరాడు, కాని తురుష్కులు ఎక్రే (Acre) వద్ద అతన్ని ఓడించి నిరోధించారు. వారికి సాయంగా సర్ సిడ్నీస్మిత్ నాయకత్వాన ఒక నౌకాబలం సిరియా చేరింది. అంతట నెపోలియన్ వెనుతిరిగి ఈజిప్టుకే చేరాడు. చాలాకాలం తరువాత, అతనికి తిరిగి ఫ్రాన్సుతో సమాచార సంబంధాలు ఏర్పడి, ఫ్రాన్సు మరొక, రెండవ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమిని ఎదిరించవలసిన స్థితిలో ఉన్నట్లు ఫ్రెంచిసేనలు ఇటలీలో పరాజయం పాలైనట్లు తెలుసుకున్నాడు. ఫ్రెంచి ప్రభుత్వం అతన్ని తిరిగి రావలసిందిగా ఆదేశించింది. తన యుద్ధప్రణాళికలను, సేనలను వదిలి నెపోలియన్ స్వదేశం చేరాడు.

## 5.4 డైరెక్టరీ పతనం :

పారిస్‌కు తిరిగివచ్చిన తరువాత నెపోలియన్ కొన్ని వారాలపాటు సాధారణ పౌరునివలె, వీధుల్లో కానవచ్చాడు. ఒక సేనానివలె, సామ్రాజ్యాల చరిత్రల్లో కీలకపాత్రవలె కాక, విద్య, విజ్ఞాన కాంక్ష కలిగిన వానివలె గ్రంథపఠనలో, పరిశోధనా వ్యాసాంగంలో గడిపాడు. కాని, ఆ సమయంలో ఫ్రెంచి రాజకీయాలను నిశితంగా పరిశీలించి, డైరెక్టర్ల మధ్య ఉన్న విభేదాలు, వర్గాలమధ్య వైరాలు బాగా అవగాహన చేసుకున్నాడు.

1789 లో ఎస్టేట్ జనరల్ సమావేశం నుండి ఫ్రెంచి రాజకీయాల్లో, ప్రముఖపాత్ర నిర్వహిస్తూ, తదనంతర కాలంలోని అరాచక పరిస్థితుల్లో తీవ్రమైన అసంతృప్తికి లోనై తెరచాటు అయిన అచి సయాస్ అతనికి ఆ సమయంలో లభించాడు. ఇద్దరూ కలిసి డైరెక్టరీ ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి, సమర్ధవంతము, ఉదారభావాలతో కూడినది అయిన నూతన ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి, ఫ్రాన్సు గౌరవ ప్రతిష్ఠలు పునరుద్ధరించడానికి కృషిచేయడానికి నిర్ణయించుకున్నారు. ఆర్థికంగా కొల్లబోయి, అసమర్థ పరిపాలనతో ప్రజాభిమానం కోల్పోయి, రెండవ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమిచేత పరాజయం పాలౌతున్న దేశాన్ని

పంరక్షించడానికి పటిష్ఠమైన ప్రభుత్వం అవసరమని వారు నిర్ణయించుకున్నారు. కాని ప్రభుత్వ విధానాల్లో వారిరువురి అభిప్రాయాలు భిన్న ధ్రువాలు. నెపోలియన్ బోనాపార్టీ కార్యవాది, స్వయంపరిపాలన (Autocracy) పైన నమ్మకం కలవాడు. స్వయం పరిపాలనమంటే నియంతృత్వమే. అబి సయాస్ ఆలోచనాపరుడు, ప్రభుత్వాంగాల నడుమ పరస్పరం అదుపు చేసుకొనే విధానంతో సమతౌల్యం పాటించి, నియంతృత్వం తలెత్తకుండ కాపాడడాన్ని ఆశించేవాడు. అయితే డైరెక్టరీ అసమర్థత గురించి ఇరువురి అభిప్రాయం ఒకటే, దానిని సత్వరం తొలగించాలనే నిర్ణయంలోను వారిద్దరు ఒకటే.

డైరెక్టరీలోని ఇద్దరు డైరెక్టర్లు జోర్డాన్, మోరో వంటి సేనాధిపతులు రిపబ్లిక్ పట్ల గాఢమైన విశ్వాసం కలిగినవారు, ప్రజల్లో సైతం గణనీయంగా రిపబ్లికన్ భావాలు వృద్ధిచెంది ఉన్నాయి. ఈ కారణాల వలన డైరెక్టరీ ప్రభుత్వాన్ని కూలద్రోయడం తేలికైన విషయం కాదు. అయినా నెపోలియన్ సాహసించి 1799 నవంబర్ 9 న డైరెక్టరీపై సైనికబలాల సాయంతో తిరుగుబాటు చేశాడు. కౌన్సిల్ ఆఫ్ ఏన్షియంట్స్ అనే ఎగువ శాసనసభ ఈ తిరుగుబాటు కారణంగా పారిస్ నగరాన్ని విడిచి సెంట్ క్లౌడ్‌కు తరలి వెళ్ళింది. నెపోలియన్ ట్వీలరీస్ భవనాన్ని ఆక్రమించి, రిపబ్లిక్‌ను పరిరక్షించడానికి ప్రమాణంచేసి పదవీ బాధ్యతలు చేపట్టాడు. డైరెక్టరీకి వైఫల్యాలను ఎత్తిచూపుతూ "నేను ఉజ్జ్వలమైన ఫ్రాన్సును మీకు వదలి వెళ్ళితే మీరేం చేశారు ? నేను ప్రశాంతతను సమకూర్చాను, కాని నాకు ఇప్పుడు యుద్ధం కానవస్తున్నది. నేను మీకు విజయాలు సమకూర్చాను, కాని ఇప్పుడు అన్నీ పరాజయాలే. ఇటలీనుండి అపార ధనరాసులు తెచ్చి మీ ముందుంచాను, కాని అదంతా దుర్వినియోగమై దారిద్ర్యం మిగిలింది" అంటూ గర్జించాడు.

నవంబర్ 10 న శాసనసభ్యులు సెంట్ క్లౌడ్‌లో సమావేశమై తాము పూర్తిగా సైన్యం చేతిలో బందీలైనట్లు తెలుసుకున్నారు. దిగువసభలోనికి నెపోలియన్ ప్రవేశించగానే ఒక్కసారిగా అతడు నిరసనల వెల్లువలో చిక్కుకొని పోయాడు. అతని సోదరుడు దిగువసభలో అధ్యక్ష స్థానంలో ఉన్న లూసియన్ (Lucien) అతన్ని కాపాడి సైనికులకు అప్పగించాడు. సైన్యం చుట్టుముట్టగానే శాసనసభ్యులు గుండెలు చేతపట్టుకొని పరుగులు తీసారు. ఉభయసభల సభ్యులతో ఏర్పడిన ఒక సంఘం (Committee) నెపోలియన్, అబి సయాస్, డ్యూకోస్‌లతో కూడిన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినట్లు ప్రకటించింది.

ఈ విధంగా హింసాయుతమైన తిరుగుబాటులో డైరెక్టరీ ప్రభుత్వమును కూల్చివేసి, నెపోలియన్ తన నియంతృత్వాధిపత్యానికి పునాది వేసుకొన్నాడు. ఈ తిరుగుబాటును 18 బ్రూమైర్ తిరుగుబాటు అని పిలుస్తారు. బ్రూమైరీ జాతీయసమితి అమలుపరిచిన విప్లవ కాలెండర్ (Revolutionary Calendar) లో నవంబర్ నెల.

పైన సూచించినట్లు సైనిక విజయాలు సైనిక ప్రాధాన్యతకు పునాదివేసి, ప్రజాస్వామ్య వ్యవస్థల బలహీనతలు బహిర్గతమైనప్పుడు జాతి పరువు ప్రతిష్ఠలు నిలుపగలిగింది. సైనిక బలంతో పటిష్టమైన పరిపాలన మాత్రమే కాని పబ్లిక్ కాదన్న దృఢ విశ్వాసాన్ని కల్గిస్తుంది. అది ప్రజాస్వామ్య వ్యవస్థలు మరింత బలహీనపడి పతనం కావడానికి దోహదం చేస్తుంది.

**మాదిరి ప్రశ్నలు :**

1. నెపోలియన్ అధిగమనాన్ని సవివరంగా చర్చించండి.
2. మొదటి రిపబ్లిక్ యొక్క రాజ్యాంగ ప్రధాన లక్షణాలు ఏమిటి ?
3. డైరెక్టరీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని చర్చించండి.
4. డైరెక్టరీ పాలనలో నెపోలియన్ జైత్రయాత్రలను వివరించండి ?

**చదువదగిన గ్రంథాలు :**


1. Hazen Cd : A History of Modern Europe (1789 - 1945)
2. Rose Halland : The Revolutionary and Napoleonic Era
3. Thompson, David : Europe Since Napoleon


- డా॥ ముప్పాళ్ళ హనుమంతరావు

పాఠం - 6

# 1789 ఫ్రెంచి విప్లవ ఫలితాలు : ఐరోపా ఖండంపై దాని ప్రభావం

## విషయసూచిక

6.0 లక్ష్యం
6.1 ఉపోద్ఘాతం ఉదారభావాల విజయం
6.2 నూతన సామాజిక వ్యవస్థ
6.3 మత వ్యవస్థపై ప్రభావం - ఫలితాలు
6.4 రాజకీయ వ్యవస్థలపై ప్రభావం
6.5 సామ్యవాదం
6.6 ఫ్రెంచి విప్లవం విఫలం అయినదా
6.7 విప్లవ భావాలు
6.8 విప్లవ స్వభావం

## 6.0 లక్ష్యం :

ఈ అధ్యాయం 1789 ఫ్రెంచి విప్లవ ఫలితాలను విశ్లేషించి, అది విఫలమైనదా, సఫలమైనదా అనే అంశాన్ని సమీక్షించి వివరిస్తుంది.

## 6.1 ఉపోద్ఘాతం - ఉదార భావాల విజయం :

1789 ఫ్రెంచి విప్లవం ఆధునిక యుగానికి ఆరంభమని పై అధ్యాయాల్లో ప్రస్తావించడం, దాని ప్రారంభ పరిణామాలను గూర్చి విశదీకరించడం జరిగింది. అంతకుముందెన్నడూ లేనివిధంగా సాధారణ ప్రజానీకం అసాధారణమైన తాత్విక చైతన్యంతో సుసంఘటితంగా సాంప్రదాయక వ్యవస్థలను ఎదిరించడం జరగలేదని, అది ఫ్రెంచి విప్లవంతోనే ప్రారంభమైందని మరొకసారి చెప్పవలసిన పనిలేదు. అయితే సుసంఘటితం కావడమనే అంశం చెప్పినంత వాస్తవం కాదు; ప్రజల్లో వివిధ వర్గాలకు చెందినవారు వైవిధ్యంతో కూడిన అంశాలు ఆశయాలు కలిగి, ఏ సంఘటనలోనైనా, కొందరు ప్రయోజనం పొందడం, కొందరు తమకున్నవి పోగొట్టుకోవడం జరుగుతుంది. కనుక అటువంటి సంఘటనలను కొందరు ఆహ్వానిస్తారు. కొందరు వ్యతిరేకిస్తారు. అయితే అధికసంఖ్యాకులకు ప్రయోజనం కలిగించే పరిణామాలు, వాటివలన నష్టపోయే అల్పసంఖ్యాకులు వ్యతిరేకించినా ఆగవు. అధిక సంఖ్యాకులు అవకాశాలు లేనివారు, అల్పసంఖ్యాకులు అన్ని అవకాశాలను తమకే సొంతం చేసుకున్నవారు.

ఫ్రెంచి విప్లవ ప్రారంభ పరిణామాలను నిశితంగా పరిశీలించినప్పుడు ఈ అంశం స్పష్టపడుతుంది. అంతకు పూర్వం, మధ్యయుగంలో అన్ని అవకాశాలు సొంతంచేసుకొని, సాంఘికంగాను, రాజకీయంగాను ప్రాబల్యం పొందిన అల్పసంఖ్యాక వర్గానికి ఎదురులేకపోయింది. అంటే సామాజిక, రాజకీయ రంగాల్లో ఏ విధమైన ప్రజాసంఘటన (Integration) జరగలేదని, ఏ సంఘటన (event) జరగలేదని, అందుచేత ఆనాటి వ్యవస్థలు ఎటువంటి అవరోధము లేకుండా కొనసాగాయని స్పష్టపడుతుంది. కాగా

ప్రజానీకం సంఘటితం కావడం, ఆ సాంప్రదాయక వ్యవస్థలను ఎదిరించిన సంఘటన (event) ఫ్రెంచి విప్లవం. ఈ సంఘటనలో అధిక సంఖ్యాకులైన సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం కలిగించే పరిణామాలు అల్పసంఖ్యాకుల అవరోధాన్ని పడగొట్టి వ్యవస్థలలో మార్పులకు నాందిపలికాయి. ఈ విధంగా అధిక సంఖ్యాకుల ప్రయోజనాలకు ఆధారమైన భావాలను ఉదార (Liberal) భావాలని, వాటిని వ్యతిరేకించే అల్పసంఖ్యాకుల స్వార్థ ప్రయోజనాలకు మూలమైన భావాలను సాంప్రదాయక (Traditional) భావాలని వ్యవహరిస్తారు.

ఫ్రెంచి విప్లవం ఉదారభావాలు వాస్తవరూపాన్ని ధరించడం ప్రారంభమైన మలుపు. ఈ ఉదారభావాలు సాంప్రదాయక భావాలతో సంఘర్షించడము, ఈ రెండింటిలోనున్న లోపాలవల్ల సుదీర్ఘమైన ఈ సంఘర్షణల్లో ఒక్కొక్కసారి ఒక్కొక్క దానికి అనుకూల పరిస్థితులు కలిగి సఫలం కావడమూ జరుగుతుందని స్పష్టపడుతుంది. అందుచేత స్థూలదృష్టితో, కేవలం సంఘటనల పరిణామాలను మాత్రం చూచినపుడు 1789 ఫ్రెంచి విప్లవం విఫలమైనట్లు కానవస్తుంది. నిరపేక్ష రాచరికాన్ని నిర్మూలించి, అది నెలకొల్పిన ప్రజాపరిపాలనా వ్యవస్థ (Republic) బాల్యవ్యవస్థలోనే అంతమై, నెపోలియన్ పరిపాలనలో తిరిగి నియంతృత్వ పరిపాలన ఏర్పడడంతో ఈ విప్లవం విఫలమైనట్లు తోస్తుంది కాని, పైన ప్రస్తావించిన భావ సంఘర్షణల్లో అది ఒక మలుపు మాత్రమే.

స్థూలంగా చూచినపుడు ఫ్రెంచి విప్లవం నిరపేక్షరాచరికాన్ని నిర్మూలించి, నెలకొల్పిన రిపబ్లిక్ అనతికాలంలోనే అంతమై, తిరిగి నెపోలియన్ పరిపాలనలోని నియంతృత్వానికి దారితీసి; విఫలమైనట్లు కానవస్తుంది. కాని ఈ తాత్కాలిక ఫలితాలను బట్టి కాక విస్తృతమైన చారిత్రక దృష్టితో చూచినపుడు ఈ విప్లవం ఒక శాశ్వతమైన భావచైతన్యాన్ని కల్గించి ఆ భావాలు విశ్వవ్యాప్తమై, అనేకదేశాల చరిత్రల్లో కీలకమైన పరిణామాలను సృష్టించినట్లు గ్రహించవచ్చు. ఐరోపాలోని పలుదేశాల్లో 1830, 1848 సంవత్సరాల్లో సంభవించిన విప్లవాలు ముందు అధ్యాయాల్లో వివరించడం జరిగింది. ఈ విప్లవాలు 1789 ఫ్రెంచి విప్లవానికి అనగా అందలి అసంపూర్ణమైన కార్యక్రమాన్ని ఫ్రాన్సులో కొనసాగించడమూ, అటువంటి కార్యక్రమాలే ఇతరదేశాల్లో సంభవించడమూ అని గుర్తించవచ్చు. అందుచేత ఫ్రెంచి విప్లవ ఫలితాలు ఒక్క ఫ్రాన్స్‌కే పరిమితంగాక అంతర్జాతీయ సిద్ధాంతాలుగా మారి ప్రపంచ రాజకీయ చరిత్రలో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నట్లు భావించారు. ఫ్రెంచి విప్లవ ఫలితాలను స్థూలంగా ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

## 6.2 నూతన సామాజిక వ్యవస్థ :

ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వమనే మూడు ప్రకృతిసిద్ధమైన మానవసమాజం యొక్క పునాదులపై నూతన సామాజిక, రాజకీయ వ్యవస్థలను నిర్మించింది. అప్పటివరకు అవి కేవలం తాత్వికుల మనోభావాలుగా ఉన్నవి వాస్తవరూపం ధరించడానికి వ్యవస్థీకృతం కావడానికి, ఫ్రెంచి విప్లవంకు సాధనమైంది. సాంప్రదాయక వ్యవస్థలు ఈ నూతన భావాలకు అవకాశం ఈయకపోవటం వలన, వాటిని నిర్మూలించి ఈ ఉదారభావాలను ఫ్రెంచి విప్లవం యదార్థాలుగా నిలిపింది. విప్లవ ఫలితంగా ఏర్పడ్డ రిపబ్లిక్ అంతమైనా, విప్లవ భావాలు అంతంకాలేదు.

ఈ విధంగా మానవ హక్కులను రాజ్యాంగబద్ధంగా గుర్తించడం ఫ్రెంచివిప్లవంలోనే మొట్టమొదటిసారిగా జరిగింది. మానవహక్కులు అనగానే, మానవుడు తన స్వేచ్ఛను ఏ ఏవిధాలుగా వినియోగించుకోగలడో నిర్వచించడం. అవి 1) స్వేచ్ఛా, 2) సమానత్వము 3) సౌభ్రాతృత్వము అనే మూడు పదాలను ప్రభుత్వభవనాలపై వ్రాశారు. నేటికి పారిస్ నగరంలో వాటిని చూడవచ్చును. నెపోలియన్ తనను తానే చక్రవర్తిగా ప్రకటించుకున్న తరువాత కూడా ఆ పదాలను తొలగించలేదు.

ఫ్రెంచి విప్లవకాలంలో జాతీయసభ (National Assembly) తయారుచేసిన రాజ్యాంగంలో మానవునికి ప్రకృతిసిద్ధంగా సంక్రమించిన హక్కులను పొందుపరిచింది. ప్రపంచవ్యాప్తంగా ఆచరణలు వ్యక్తిగతమైన ధార్మిక, నైతిక అంశాలని, వాటికి రాజకీయాలతో, సామాజిక వ్యవస్థతో సంబంధం లేదని ఫ్రెంచివిప్లవం నిరూపించి, లౌకికవాదానికి (Secularism) కు పునాదులు వేసింది. అయితే మానవతావాద ప్రభావంతో ప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం వ్యక్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, ఆస్తిహక్కు మొదలైనవి. ప్రతివ్యక్తి దేశపౌరునిగా ఆయా విధాలైన స్వేచ్ఛకు అర్హులని, ప్రభుత్వాలు వాటిని సంరక్షించాలని ఫ్రెంచి విప్లవం చాటింది.

అలాగే పుట్టుక చేత మానవులందరూ స్వేచ్ఛాయుతులు కావడానికి వారిమధ్య ఎటువంటి సాంఘిక, ఆర్థిక తారతమ్యాలైనా కృత్రిమంగా, వ్యవస్థలు వక్రీకరణ చెందడం వలన ఏర్పడ్డవేకాని, ప్రకృతిసిద్ధమైనవి కావు. కనుక మానవసమాజాలు సర్వమానవ సమానత్వంపై నిలిచి, తారతమ్యాలను నిర్మూలించుకొన్నప్పుడే వారికి సమానమైన రాజకీయ స్వేచ్ఛ, సమానావకాశాలు ఏర్పడగలవు. అందుకు అనుగుణమైన రాజ్యవ్యవస్థను నిర్మించుకోవడానికి, సంస్కరించుకోవడానికి మానవునికి గల శక్తిసామర్థ్యాలను ఫ్రెంచి విప్లవం నిరూపించింది.

ప్రకృతి సిద్ధమైన స్వేచ్ఛాసమానత్వాలను కలిగిన సమాజాల్లోని మానవసంబంధాలు సహోదరభావాలు. అందరు ఒకరినొకరు అన్నదమ్ముల వలె మెలిగే భావమే సౌభ్రాతృత్వం. ఇది సమాజ సభ్యులందరిని ఏకజాతీయులుగా రూపొందించి, వారి సామాజిక, ఆర్థిక జీవనాన్ని రాజకీయవ్యవస్థను బలోపేతం చేస్తుంది. అందరు తమ సమిష్టి సమస్యలను సమిష్టిగా ఎదిరించి, పరిష్కరించుకునే సహకారభావాన్ని పెంపొందిస్తుంది. భూస్వామ్య వ్యవస్థను స్వేచ్ఛా ప్రయత్నము, సమానత్వము, సౌభ్రాతృత్వము వాస్తవ రూపాల్లో నెలకొల్పిన ఫ్రెంచి విప్లవం, వాటికి విరుద్ధమైన మధ్యయుగ వ్యవస్థలను నిరపేక్షరాచరికాన్ని నాశనం చేసింది. భూస్వాములకున్న ఎస్టేట్ హక్కులు రద్దయినవి. తాము సాగుచేసుకునే భూములపై రైతుల హక్కులు గుర్తించబడినవి విప్లవం ఫ్యూడల్ వ్యవస్థను అసమానత్వాన్ని పూర్తిగా రూపుమాపినది. కాగా స్వాధికార వర్గాలైన ప్రభువులు, సేద్యబానిసలు అనే అంతరాలు అంతరించాయి. రాజకీయంగా స్వాధికార వర్గాలైన ప్రభువులు, మతాధిపతులు చెలాయించే ఆధిపత్యాలు రద్దు అయినాయి.

1791 లోనే ఫ్రెంచివిప్లవం సాధించి, తన రాజ్యాంగంలో పొందుపరచిన ఈ ఆదర్శాలు సమకాలీన దేశాల్లో తమ ప్రభావం చూపనారంభించాయి. ప్రష్యాలో సేద్యబానిసలు భూస్వామ్య విధానాన్ని రద్దుచేయడాన్ని, తమకు స్వేచ్ఛాసమానత్వాలను కలిగించడాన్ని కోరటం జరిగింది. ప్రష్యా ఆధీనంలోని పోలిష్ భూభాగంలో ప్రజలు జాతీయభావాలతో ఉత్తేజితులై తమ దేశాన్ని ఆక్రమించిన పొరుగుదేశాలతో ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాలతో పోరాటానికి దిగే సూచనలు కానవచ్చాయి. ఈ విధంగా ఫ్రెంచి విప్లవం పరిసర ఐరోపా దేశాలను గూడా ప్రభావితంచేసే సూచనలు కానరాడం వల్లనే ప్రష్యా - ఆస్ట్రియా రాజ్యాధినేతలు ఈ విప్లవాన్ని అణచి, సాంప్రదాయక వ్యవస్థలను బలోపేతం చేసి నిలుపదలచారు, ఫ్రాన్సుతో పోరాటానికి దిగారు. తరువాత ప్రపంచమంతా ఈ ఉద్యమం సాగి బానిసత్వం రూపుమాసిపోయింది. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చినందున ఫ్రెంచివిప్లవం పౌరులను ఎవరిని, కారణం లేకుండ నిర్బంధించడాన్ని, విచారణ లేకుండ శిక్షించడాన్ని నిషేధిస్తూ ఖైదీలకు శిక్షలు సంస్కరణను ఉద్దేశించినవిగాను, కక్ష సాధించడానికి కాదని స్పష్టపరచాయి. నాటినుండి ప్రపంచవ్యాప్తంగా జైళ్ళలో ఖైదీలను మానవతాదృష్టితో చూడడమూ వారి మంచి చెడ్డలపై శ్రద్ధ తీసుకోవడమూ ప్రారంభమైనాయి.

## 6.3 మతవ్యవస్థపై ప్రభావం, ఫలితాలు - కాథలిక్ మత ప్రాబల్యాన్ని తొలగించుట :

ఫ్రెంచి విప్లవం ఫ్రాన్స్‌లో కాథలిక్ మతప్రభావాన్ని పూర్తిగా తొలగించింది. పోప్‌తో సంబంధాలను తెగతెంపులు చేసింది. మతాధికారుల నియామకం ప్రభుత్వపరమై, వారి ప్రత్యేక హక్కులన్నీ రద్దయినవి. మధ్యయుగాల నాటి శాసనసభలోని

మతాధిపతులసభ తొలగింపబడినది. చర్చిఆస్తులు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, మతాధికారుల ఆదాయాలను తొలగించి, వారికి జీతభత్యాలు ఇయ్యబడినవి. తత్ఫలితంగా మతం, మతాధికారుల ఆధిపత్యం పూర్తిగా నశించిపోయింది. మతం వ్యక్తిగత అంశంగా మారింది. ఈ సంస్కరణలకు పూర్వరంగం హేతువాదం, అవి పద్దెనిమిదో శతాబ్దిలో ఏ విధంగా వృద్ధిచెందిందో వెనుకటి అధ్యాయాల్లో వివరించడం జరిగింది. కాగా ఫ్రెంచి విప్లవం ఆ ఆలోచనా విధానానికి రూపకల్పన చేసింది. మతవిశ్వాసాల్లో మతపరమైన తత్వశాస్త్రం అర్థవంతమై అభివృద్ధి చెందింది. పూర్వం సైనికులు లాయర్ సెయిల్స్ అను గీతం పాడుకొనుచూ దైవపీఠం వద్ద వెలిగే అగ్ని జ్వాలలో తమ పైపులు ముట్టించుకొనడం పవిత్రంగా భావించేవారని విప్లవం వల్ల ఆ పద్ధతిని సైనికులు వదిలివేశారని లెస్లి లిప్సన్ అను పండితుడు వ్రాశాడు. అంధప్రాయంగా అనుసరించడం బదులు అర్థం చేసుకొని అనుసరిండం, దానివలన, సూక్ష్మంగా పరిశీలిస్తే, అన్ని మతాల అంతరార్థము ఒకటేనని, అది మానవతావాదమని స్పష్టపడింది. కానీ మతభావాలు ప్రొటస్టాంటులు సమాన హక్కులు పొందారు. ఫ్రాన్స్ లౌకిక రాజ్యంగా మారెను.

## 6.4 రాజకీయ వ్యవస్థలపై ప్రభావం :

పై అధ్యాయాల్లోను, ఖండికల్లోను ప్రస్తావించినట్లు ఫ్రెంచివిప్లవం మౌలికంగా సాంఘిక, ఆర్థిక కారణాల వల్ల ఉత్పన్నమైనా, తుదకు రాజకీయ లక్షణాలను సంతరించుకుంది. వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలను మౌలికాంశాలుగా ప్రతిపాదించిన ఆనాటి తాత్వికులు, మేధావులు మధ్యయుగ వ్యవస్థలను నిశితంగా ఖండించడం, అవి ఆలోచనాపరులైన మధ్యతరగతిని ప్రభావితం చేయడాన ప్రభుత్వ వ్యవస్థల పరమార్థం వ్యక్తి స్వేచ్ఛా సమానత్వాలను పరిరక్షించడము, వ్యక్తులు తమ భౌతిక సంపదను పెంపొందించుకోవడంలోను, ధార్మిక, ఆధ్యాత్మిక సంక్షేమాన్ని పొందడంలోను సంపూర్ణమైన స్వేచ్ఛ కలిగి ఉండాలనేది పందొమ్మిదో శతాబ్దిలో వేదవాక్కులా ఏర్పడింది. కనుక ఫ్రెంచి విప్లవంతో ప్రారంభమై, పందొమ్మిదో శతాబ్ది నడిమి భాగానికి అనేక ఐరోపా దేశాల ప్రజానీకాలు మధ్యయుగంనాటి నిరపేక్ష రాచరికాలను ఎదిరించారు. తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కలగని రీతిలో నెలకొని, పరిపాలించే రాజ్యాంగబద్ధ రాచరికాలను, ప్రజాస్వామిక వ్యవస్థలను ఏర్పరచుకొనే ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నాల్లోనుండే ఐరోపా దేశాలన్నిటా 1830 లోనూ, 1848 లోను తీవ్రమైన విప్లవాలు సంభవించాయి. ఆస్ట్రియా, ప్రష్యా వంటి పటిష్టమైన నిరపేక్ష రాచరికాలు ఉన్నదేశాల్లో అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయినా, తక్కిన ఐరోపా దేశాలన్నిటిలో క్రమపరిణామంలో ప్రజల అభీష్టాలకు అనుగుణమైన రాజ్యవ్యవస్థలు ఏర్పడ్డాయి. ఈ దేశాలు ప్రధానంగా అట్లాంటిక్ తీరదేశాలని జ్ఞప్తిలో ఉంచుకోవాలి.

ఫ్రెంచి విప్లవకాలంలో తమ ఆంతరంగిక వ్యవహారాల్లో అనవసర జోక్యం కల్గించుకున్న ఆస్ట్రియా, ప్రష్యాలను విప్లవసేనలు ఎదిరించి పోరాడాయి. ఆ పోరాటాల్లో ప్రధానంగా గుర్తించవలసిన అంశం స్వేచ్ఛాసమానత్వాల సంరక్షణ, ప్రజాసార్వభౌమాధికార (Popular Sovereignty) పరిరక్షణ. ఆ సమయంలో జాతి ఆయుధాలు ధరించడం (Nation at Army) జరిగింది. స్త్రీ పురుష విచక్షణ, బాల, వృద్ధ వ్యత్యాసము లేకుండా దేశ ప్రజానీకం యావత్తు యుద్ధంలో అనగా యుద్ధసంబంధమైన కార్యక్రమంలో పాల్గొంది. అందువలన వారిలో ఏర్పడ్డ సౌభ్రాతృత్వం, సమైక్యతా భావం పటిష్టమైన జాతీయభావంగా రూపొందింది. ఈ జాతీయభావనకు తదనంతర కాలంలో నెపోలియన్ పరిపాలన, నియంతృత్వమే అయినా, సర్వజనులకు అంగీకారయోగ్యం అయింది. నెపోలియన్ యుద్ధ విజయాలతో ఐరోపా యావత్తు ఫ్రాన్సుకు అధీనరాజ్యాల సముదాయంగా ఏర్పడితే, అదంతా వారి జాతీయ భావోద్వేగాన్ని సంతృప్తిపరిచింది. వారి స్వేచ్ఛా, సమానత్వ కాంక్షలు ఈ జాతీయభావోద్వేగాన్ని సంతృప్తిపరిచింది. వారి స్వేచ్ఛా, సమానత్వ కాంక్షలు ఈ జాతీయ భావోద్వేగంలో అంతర్భాగాలైనాయి. కాని, తరువాత ఏర్పడ్డ బూర్బన్, ఆర్లియన్ వంశీయుల రాచరికాలు వారి జాతీయ భావోద్వేగాన్ని సంతృప్తిపరచలేకపోవడం, తత్ఫలితంగా మరొకసారి స్వేచ్ఛాసమానత్వాల పట్ల తీవ్ర ఆకాంక్ష పెల్లుబికి విప్లవాలకు, 1830 లలోను 1848 లోను, దారితీయడం జరిగింది. ఈ పరిశీలన వలన ఫ్రెంచి

ప్రజానీకంలో జాతీయ భావోద్వేగం ఫ్రెంచి విప్లవ ఫలితమని స్పష్టమవుతుంది. స్వేచ్ఛా సమానత్వ కాంక్షల్లో వలె జాతీయ భావోద్వేగంలోను ఫ్రెంచి విప్లవం తక్కిన ఐరోపాదేశాలకు క్రమంగా ప్రపంచవ్యాప్తంగాను ఆద్యమైంది. 19 వ శతాబ్ది తొలిదశకంలోను, నెపోలియన్ పశ్చిమ మధ్య ఐరోపాలోని దేశాలను ఫ్రాన్స్‌కు అనుబంధ రాజ్యాలుగా సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంటే, తూర్పు ఐరోపాలో గ్రీకులు, సెర్బ్‌లు తురుష్క సార్వభౌమాధికారాన్ని ధిక్కరించి, స్వాతంత్ర్య పోరాటాలకు పూనుకున్నారు. స్పానిష్, పోర్చుగీసు వలసల్లో ప్రజల ఆదేశాల వలసవాద నియంతృత్వాలను ఎదిరించి రాజ్యాంగాల కొరకు ఆందోళన చేయసాగారు. జర్మన్ రాజ్యాల్లోను, ఇటాలియన్ రాజ్యాల్లోను నెపోలియన్ దండయాత్రల వలన ప్రజానీకం జాతీయ సమైక్యతను చవిచూశారు. వియన్నా కాంగ్రెస్ నిర్ణయాల వలన ఆ జాతీయ సమైక్యత భంగపడగా, అక్కడి ప్రజానీకం 1830, 1848 విప్లవ సమయాల్లో రాజ్యాంగబద్ధ పరిపాలనా వ్యవస్థలను, జాతీయ సమైక్యతను కోరుతూ ఉద్యమాలు చేశారు.

ఈ విధమైన రాజకీయ పరిణామాలు ఫ్రెంచి విప్లవ ప్రభావాలేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఇవి అచిరకాలములోనే ఐరోపా వ్యాప్తమైనట్లే, ప్రపంచవ్యాప్తమూ అయినాయి. అనేక ఆఫ్రికా, ఆసియా దేశాల్లో రాజకీయ స్వాతంత్ర్యం కొరకు, ఐరోపా దేశాల వలసవాద పరిపాలనలను ఎదిరించి, జాతీయోద్యమాలు, పోరాటాలు సంభవించడంలో మూలం ఫ్రెంచివిప్లవ ఫలితాలే.

## 6.5 సామ్యవాదం :

మధ్యయుగంలోని సాంఘిక, ఆర్థిక అసమానతలను స్వాధికారవర్గాల, రాజకీయ ప్రాబల్యాన్ని ఖండించిన తాత్త్వికుల్లో కొందరు వర్తక వాణిజ్యాల వలన సంపన్నులౌతున్న మధ్యతరగతి వాస్తవమైన ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక సమానత్వానికి దోహదం చేయదని, వ్యవసాయము, పరిశ్రమల వలన సంపద ఉత్పన్నం కావాలని వాదించారు. అటువంటి వారిలో ఫ్రెంచి విప్లవానికి తరువాత ఫ్రాన్సుదేశంలోని మేధావుల్లో ఒకడైన లూయీబ్లాంక్ ఒకడు. అతని సామ్యవాద సిద్ధాంతం (Socialism) సమాజంలో కర్షకులు, శ్రామికుల వలన సంపద ఉత్పన్నమవుతుందని, వారి ప్రాముఖ్యతను రాజకీయవ్యవస్థలు గుర్తించాలని వాదించాడు. ఈ సిద్ధాంతం నుండే కమ్యూనిజం అనే సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ రూపకల్పన చేశాడు. పరోక్షంగా ఫ్రెంచి విప్లవమే సోషలిజమ్, కమ్యూనిజమ్‌ల సిద్ధాంతాలకు కూడా మూలమని చెప్పవచ్చును. కారల్‌మార్క్స్ సైతం ప్రాక్తన సమాజంలో మానవులు స్వేచ్ఛాసమానత్వాలు కలిగి, తమంతట తామే నైతికమైన క్రమశిక్షణ కలిగి ఉండేవారని భావించడంలో రూసోను అనుసరించాడు. రూసో ప్రకృతి సిద్ధ సమాజాన్ని (State of Nation) ను పునరుద్ధరించడాన్ని ప్రతిపాదించినట్లే కారల్‌మార్క్స్ ప్రాక్తన సమాజవ్యవస్థ (Primitive Communism) నాటి రాజ్యారహిత సమాజాన్ని (State less Society) పునరుద్ధరించడాన్ని ప్రతిపాదించాడు. ఈ తులనాత్మక విశ్లేషణ ఫలితమేమంటే, ఏ ఆశయాలు, ఆదర్శాలు ఫ్రెంచి విప్లవానికి మూలకారణాలో అవి ఫ్రెంచివిప్లవం విఫలమైనా నిల్చిఉండి, తరువాత తాత్త్వికులకు మేధావులకు ప్రేరణనిస్తూనే ఉన్నాయి. కనుక ఈ విధమైన ఆదర్శాలను వాస్తవాలను చేయడంలో మానవ నాగరికత యొక్క మహాప్రస్థానంలో ఫ్రెంచివిప్లవం ఒకదశ అయితే కారల్‌మార్క్స్ సిద్ధాంతాలపై ఆధారపడి ఉత్పన్నమైన బోల్షివిక్ విప్లవం మరోదశ. ఈ రెండు దశల్లో సాగిన నాగరికతాపరిణామాలు పై సిద్ధాంతాల్లోని అసహజత్వాలను స్పష్టపరచాయి.

ఈ సందర్భంలో గమనించవలసిన మరొక అంశమేమంటే, సర్వమానవ శ్రేయస్సుకు మేధావులు ప్రతిపాదించే నూతన సిద్ధాంతాలు సమకాలీన వ్యవస్థలకు విరుద్ధంగా ఉంటాయి. సమాకాలీన వ్యవస్థల వలన ప్రయోజనం పొందే ఉన్నతవర్గాలు ఈ నూతన సిద్ధాంతాలను వ్యతిరేకించి, అణచివేయడానికి తమ సర్వశక్తులు వినియోగిస్తాయి. కనుక సాంప్రదాయానికి మార్పు సంఘర్షణ అనివార్యం, వాటిలోని లోపాలవలన వాటిలో ఆలోచనకన్న ఆవేశం పాలు అధికమైనపుడు సాంప్రదాయము, మార్పులు జయాపజయాలను పొందుతూ ఉంటాయి. ఈ జయాపజయాల్లో నుండి శాశ్వతమైన ఆచరణీయమైన తత్త్వాలు ఉత్పన్నమై మానవ నాగరికతను ఒక్కొక్క అడుగు ముందుకు తీసుకెళతాయి. అయితే ఈ చారిత్రక సత్యం అప్పటికప్పుడు సంఘర్షణకులోనైన సాంప్రదాయ సంస్కరణాత్మక వర్గాలకు స్ఫురించదు. వీరు ఆదేశాలకు లోనై ఒకరినొకరు నిర్మూలించుకోచూస్తారు.

ఇటువంటి ఆదేశాల నుండి సాంప్రదాయికవ్యవస్థలను సమూలంగా తొలగించాలనే ప్రయత్నాలు ఫ్రెంచి విప్లవకాలంలో జరిగాయి; అవి కొంతవరకు జయించినా, కొంత అపజయాన్ని పొందక తప్పలేదు. సాంప్రదాయకమైన రాచరికవాదులు మరల ప్రాబల్యం పొందకపోలేదు. అయితే అత్యావేశపరులైన సంస్కరణవాదులు, విప్లవవాదులు సాంప్రదాయాన్ని సంపూర్ణంగా విధ్వంసం చేసినపుడు దాని శిధిలాలపై నుండి సామ్యవాదము, ప్రాక్తన సమాజము ఉద్భవిస్తాయనే విధ్వంసక వాదాన్ని (Nihilism) వృద్ధిచేశారు. పందొమ్మిదో శతాబ్ది చివరి భాగానికి ఈ విధ్వంసకవాదం విపరీతంగా వృద్ధిచెంది, కారల్‌మార్క్స్ ప్రతిపాదించిన సామ్యవాదంతో కలిసి, కమ్యూనిజంగా రూపొందింది.

కనుక కమ్యూనిజం ఆశయాలేకాక ఆశయసాధనకు అవలంభించిన విధానాలు సైతం ఫ్రెంచి విప్లవంనుండి ఉత్పన్నమైనవేనని గ్రహించడం యుక్తం.

## 6.6. ఫ్రెంచి విప్లవం విఫలమైనదా ?

**1789** లో సంభవించిన ఫ్రెంచి విప్లవం అనేక పరిణామాలకు లోనై ఈ రాజ్యాంగ పరిషత్తు, రాజ్యాంగబద్ధ రాచరికము, జాతీయ సమితి, డైరెక్టరీ మొ॥ రకరకాల పాలనలకు గురిఅయినది. తుదకు నెపోలియన్ రిపబ్లికన్‌ను రద్దుచేసి తనను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. కనుక విప్లవం విఫలమైందని స్పష్టపడుతుంది. అయితే ఈ వైఫల్యం విప్లవకారుల అనుభవ రాహిత్యం దూరదృష్టిలేని ఉద్రేకం వలన సంభవించింది కాని, ఆశయాల, ఆదర్శాల లోపం వలన కాదు. అయితే, నెపోలియన్ చక్రవర్తిగా, నియంతృత్వాధికారంతో పరిపాలించిన సమయంలో కూడ పరిపాలనా విధానం మాత్రమే మారినది, కాని విప్లవ స్ఫూర్తి తొలగలేదు. ప్రజల హక్కులు తొలగించబడలేదు. సాంఘిక అసమానతలు తిరిగి ఏర్పడలేదు. అందువల్లనే నెపోలియన్ నియంతృత్వాన్ని ప్రజలు తిరస్కరించలేదు.

ఫ్రెంచి విప్లవాన్ని అంతర్జాతీయ విప్లవంగా పరిగణించవచ్చును. దీనికి కారణాలు కలవు. విప్లవ భావాలు, విప్లవ స్వభావం అందుకు కారణం.

## 6.7 విప్లవ భావాలు :

ఫ్రెంచి విప్లవం ప్రకటించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఒక్క ఫ్రెంచి ప్రజలకే చెందినవి కావు. అవి సర్వమానవాళికి చెందిన భావాలు. నేటి సమస్త ప్రపంచం ఈ సిద్ధాంతాలు మహోన్నతమైనవిగా అంగీకరించి పాటిస్తున్నది. ప్రపంచానికి అందిన ఈ భావసంపద ఫ్రెంచివిప్లవ వారసత్వమే.

## 6.8 విప్లవ స్వభావం :

విప్లవ ప్రభుత్వం ఫ్రెంచి ప్రజలకు సమస్త హక్కులను ఇవ్వడమేగాక ఐరోపాలో నిరపేక్ష రాచరికవ్యవస్థలను ఎదిరించి ఆ దేశాల ప్రజలను విముక్తం చేయడమే తన ఆశయంగా సౌభ్రాత్ర శాసనాన్ని (Edict of Fratencity) ప్రకటించింది. అప్పుడే విప్లవం ఫ్రెంచి సరిహద్దులను దాటి విస్తరించింది. ఈ విధంగా అంతర్జాతీయ స్వభావాన్ని ఫ్రెంచి విప్లవం ప్రతిబింబించింది.

### మాదిరి ప్రశ్నలు :

1. ఫ్రెంచి విప్లవ ఫలితాలు, యూరప్ ఖండంపై దాని ప్రభావాన్ని చర్చించండి.
2. ఫ్రెంచి విప్లవం యొక్క ఉదార భావాలను వివరించండి.

### చదువదగిన గ్రంథాలు :


5. Fisher, H.A.L., : A History of Europe (Vii, II only)
6. Southgate, G.W. : Modern European History (Vol. III only)


- డా॥ ముప్పాళ్ళ హనుమంతరావు

పాఠం - 7

# నెపోలియన్ యుగం - 1799-1815

విషయసూచిక


7.0 లక్ష్యం

7.1 ఉపోద్ఘాతం

7.2 నెపోలియన్ జీవితవిశేషాలు

7.2.1 నెపోలియన్ బొనాపార్టీ - బాల్యము, విద్యాభ్యాసము

7.2.2 ఉద్యోగంలో తొలిదశ

7.3 నెపోలియన్ కన్సులేట్ పరిపాలన

7.3.1 కన్సులేట్ రాజ్యాంగం

7.3.2 ప్రథమ కన్సూల్‌గా నెపోలియన్

7.4 ప్రథమ కన్సూల్‌గా నెపోలియన్ విదేశాంగవిధానం

7.4.1 నెపోలియన్ రెండవ ఇటలీ దండయాత్ర

7.4.2 నెపోలియన్ గ్రేట్ బ్రిటన్‌తో సంఘర్షణ

7.4.3 ఎమియన్ సంధి (Peace of Amiens)

7.5 చక్రవర్తిగా నెపోలియన్ : మొదటి ఫ్రెంచి సామ్రాజ్యం

7.5.1 చక్రవర్తిగా నెపోలియన్ పరిపాలన

7.5.2 చక్రవర్తిత్వమైన ఆడంబరాలు

7.6 చక్రవర్తిగా నెపోలియన్ విదేశాంగ విధానం

7.6.1 ఎమియన్స్ సంధి విఫలం

7.6.2 నెపోలియన్ సామ్రాజ్య విస్తరణ విధానం

7.6.3 బ్రిటన్‌తో పోరాటం ప్రారంభం

7.6.4 తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి : రష్యా, ఆస్ట్రియాల పరాజయం

7.6.5 ప్రష్యాతో యుద్ధం (1806)

7.6.6 రష్యాతో యుద్ధం : టిల్సిట్ సంధి (1807)

7.7 నెపోలియన్ సామ్రాజ్యం : రెండవ దశ

7.7.1 1807 నాటి నెపోలియన్ ఉచ్ఛ స్థితి

7.7.2 భూఖండ విధానం

7.7.3 భూఖండ విధానం వలన నెపోలియన్ విదేశాంగ విధానం

7.7.4 చతుర్థ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి (Fourth Coalition of European Powers) : విముక్తి పోరాటం

7.8 నెపోలియన్ పతనానికి కారణాలు

## 7.0 లక్ష్యం :

మొదటి ఫ్రెంచి రిపబ్లిక్‌ను తొలగించి నెపోలియన్ బొనాపార్టీ ఫ్రాన్సుదేశ పరిపాలనాధికారాన్ని హస్తగతం చేసుకోవడంతో ఆ దేశచరిత్రలోనేకాక ఆధునిక ఐరోపా చరిత్రలోనే ఒక నూతన ఘట్టం ప్రారంభమైంది. ఈ ఘట్టంలో అంతట నెపోలియన్ బొనాపార్టీ మాత్రమే కానవస్తాడు. అందుకే నెపోలియన్ రాకతో "ఐరోపాచరిత్ర ఒకేదేశం, ఒకేజాతి, ఒకేవ్యక్తి చరిత్రగా, ఆ దేశం ఫ్రాన్సు, ఆజాతి ఫ్రెంచిజాతి, ఆవ్యక్తి నెపోలియన్" అని చరిత్రకారులు వ్యాఖ్యానిస్తారు. ఈ అధ్యాయంలో నెపోలియన్ ఫ్రెంచిదేశాన్ని, జాతిని, క్రమ శిక్షణాయుతంగాను, అభివృద్ధి సాధకంగాను తీర్చిదిద్ది ఐరోపా రాజకీయాల్లో అసమానమైన ఔన్నత్యం సాధించిపెట్టి, ఆ దేశంలోని పరిణామాలు ఐరోపాచరిత్రనంతటిని ప్రభావితం చేసిన విధానం వివరించడం జరిగింది.

## 7.1. ఉపోద్ఘాతం :

"నాదేశం మరణావస్థలో ఉన్నపుడు నేను జన్మించాన" ని (I was born, when my country was dying) నెపోలియన్ అనేవాడు. వాస్తవంగానే ఫ్రెంచి విప్లవ సంఘటనల్లో దేశం అతలాకుతలం అవుతూ, ప్రజాజీవితం కడగండ్ల పాలవుతూ ఉన్నప్పుడు, మేధావులు, తాత్త్వికులు ఆచరణయోగ్యంకాని సిద్ధాంతాలను ప్రతిపాదించి జనసామాన్యాన్ని ఉద్రేకపరవశులను చేసి, తలెత్తిన సమస్యలకు పరిష్కారం తోచని గందరగోళ పరిస్థితిలో, నెపోలియన్ రాజకీయరంగం మీద ప్రత్యక్షం అయినాడు. దేశాన్ని నడిపించవలసిన పరిపాలనావ్యవస్థ అవినీతిలో కూరుకొనిపోయి, అసమర్థంగా మారినప్పుడు దేశం నలువైపుల శత్రురాజ్యాల సేనలు ఫ్రాన్సును ముంచెత్తబోయే తరుణాన నెపోలియన్ బొనాపార్టీ అధికారం సంపాదించాడు. దేశంలో ప్రజానీకంలోను, సైన్యంలోను జాతీయభావాలను రగిల్చి, ఆర్థికంగా దివాలా తీసి అన్నిటికి లోటు, లేమి తప్ప సమృద్ధిగా మరేదీ లేని స్థితిలో వారిని విజయపథంలో నడిపించినవాడు నెపోలియన్. దేశ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసి, సమర్థవంతమైన పరిపాలనతో అన్ని రంగాల్లోను అభివృద్ధిని సాధించి, దేశానికి శత్రు భయాన్ని నివారించడమేకాక అనేక అధీన (Dependent) రిపబ్లిక్‌లను స్థాపించి రాజకీయ ప్రాబల్యాన్ని, ప్రతిష్ఠను అనేకరెట్లు పెంచినవాడు నెపోలియన్.

వాస్తవంగా నెపోలియన్ అమితమైన అధికారదాహమూ, పదవీకాంక్ష కలిగినవాడు. తన పదవీకాంక్షను తీర్చుకొనేందుకు డైరెక్టరీ ఆధ్వర్యంలోని రిపబ్లిక్‌పై తిరుగుబాటు చేసి, కూలద్రోసినవాడు. అయితే, సమర్థుడైనవాడు అసమర్థుల పాలనలో దేశం సంక్షోభాలకు గురవుతూ ఉన్నప్పుడు అధికారం హస్తగతం చేసుకోవడంలో, అందుకు అవసరమైతే అవినీతి, అధర్మము అయిన మార్గాలను అనుసరించడం తప్పుకాదు. అయితే హస్తగతమైన అధికారాన్ని కేవలం తన స్వార్థం కోసం, స్వలాభం కోసం ఉపయోగించి, దేశాన్ని కొల్లగొట్టి క్రుంగదీయడం నేరం. మాకియవెల్లీ ఉపదేశించిన రాజనీతి ఇదే. జాతి ప్రయోజనాల కోసం, జాతీయ రాజ్యాల సంఘటన, పరిపుష్టి కోసం రాజు తన సర్వశక్తులు ధారపోయాలి. అటువంటి ప్రయోజనాల కొరకు నీతిబాహ్యమైన, అధర్మమైన పనులు చేయడం తప్పుకాదు అన్న మాకియవెల్లీ సూత్రాలను ప్రయోగించి, ఫ్రెంచి జాతిని, జాతీయరాజ్యాన్ని ఉద్ధరించాడు నెపోలియన్. ఈ సంఘటనలు, పరిణామాలు, వాటిలో నెపోలియన్ ప్రదర్శించిన శక్తియుక్తులు వివరంగా అధ్యయనం చేయడం ఈ అధ్యాయం ప్రయోజనం.

## 7.2. నెపోలియన్ జీవిత విశేషాలు :

ఆధునిక ఐరోపాలో చరిత్రను సృష్టించిన నెపోలియన్ ఏరాజవంశంలోను జన్మించినవాడు, పుట్టుకతోనే వంశపారంపర్య హక్కుగా రాజ్యాధికారం పొందినవాడు కాదు. అయిన అతడు రాజ్యాధికారం పొందడానికి, సామ్రాజ్య నిర్మాత కావడానికి ఆనాటి ఐరోపాను ప్రభావితం చేసిన ఉదారభావాలు, విప్లవ సంఘటనలు కారణం. స్వేచ్ఛా సమానత్వాలు, జాతీయభావాలు ఏర్పరచిన సమాజంలో అందరికి సమానావకాశాలు కలిగే వీలుండడము, నెపోలియన్ తన శక్తియుక్తులతో, ప్రజ్ఞాపాటవాలతో అటువంటి

అవకాశాన్ని కల్పించుకొని రాజ్యాధికారాన్ని పొందగల్గడమూ ఆధునికయుగ లక్షణాలని జ్ఞప్తి తెచ్చుకోవలసి ఉంది.

## 7.2.1. నెపోలియన్ బొనాపార్టీ : బాల్యము, విద్యాభ్యాసము :

నెపోలియన్ బొనాపార్టీ 1769 ఆగస్టు 15న మధ్యధరాసముద్రంలో, ఇటాలియన్ ద్వీపకల్పానికి పశ్చిమాన ఉన్న కార్సికా (Corsica) అనే ద్వీపంలోని ఎజాషియో (Ajacio) అనే చిన్న పట్టణంలో జన్మించాడు. ఇతని తండ్రి ఛార్లెస్ బొనాపార్టీ, తల్లి లెటిజియా రమోలిన్ (Letizia Ramoline), ఒక సాధారణ ప్రభువర్గ కుటుంబానికి చెందినవారు. వారి పదముగ్గురు సంతానంలో నెపోలియన్ రెండవవాడు.

కార్సికా ద్వీపం జినోవా రిపబ్లిక్‌కు చెందినది, కాని ఆ ప్రభుత్వం 1769లో, నెపోలియన్ జననానికి కొద్దినెలల క్రిందట ఆ ద్వీపాన్ని ఫ్రాన్సుకు అమ్మివేయడంతో అతడు ఫ్రెంచి పౌరుడైనాడు. 1762లో ఆ ద్వీపాన్ని సందర్శించిన రూసో "ఈ చిన్నద్వీపం ఏదో ఒకనాడు ఐరోపానంతటిని ఆశ్చర్యచకితం చేస్తుందని నా మనసుకు తోస్తున్న" దని జోస్యం చెప్పాడు. అతని ఊహ నెపోలియన్ రూపంలో నిజమైంది. నెపోలియన్ బాల్యం కార్సికా ద్వీపంలోనే గడిచింది, కనుక అతనికి ఫ్రెంచి భాష సరిగా రాదు, ఇటాలియన్ అతనికి మాతృభాష. అయితే ప్రాథమికవిద్య తరువాత ఉన్నతవిద్యకై పారిస్‌లోని సైనిక పాఠశాలలో చేరడం వలన ఫ్రెంచిభాష అభ్యసించడం ప్రారంభమైంది. ఆ పాఠశాలలో నెపోలియన్ సైనిక శిక్షణతో పాటు చరిత్ర, భూగోళశాస్త్రం (Geography), గణితము, రాజనీతి, పరిపాలనా శాస్త్రాలు అభ్యసించాడు. నాటి రాజనీతి తాత్త్వికులైన వోల్టైర్, రూసో గ్రంథాలను, అతడు అధ్యయనం చేసి వారి సిద్ధాంతాలను గ్రహించాడు. కాని, ఉదారవాద నియంత (Benevolent Deopot) అయిన ప్రష్యారాజు ఫ్రెడరిక్ ది గ్రేట్ పరిపాలనా విధానాల పట్ల అధిక అభిమానం పెంచుకున్నాడు, దీనిని బట్టి నెపోలియన్ ఉదారవాద నియంతృత్వ స్వభావాలను అధికంగా అలవరచుకున్నట్లు, విప్లవభావాల పట్ల పైపైన అభిమానము కలిగిఉన్నట్లు గ్రహించవచ్చు.

## 7.2.2. ఉద్యోగంలో తొలిదశ :

సైనికవిద్య ముగిసిన తరువాత నెపోలియన్ తన 17వ ఏట ఫిరంగిదళంలో ఉప లెఫ్టినెంట్‌గా చేరాడు. అతడు తన తల్లికి వ్రాసిన ఒకలేఖలో, ఆ ఉద్యోగంలో జీతం తక్కువ, పనిఎక్కువ, జీతం సరిపోకపోవడంతో రోజుకొకసారి మాత్రమే భోజనం చేస్తూ, ఉదయం 4 గంటలకు నిద్రలేవడం నుండి రాత్రి 10 గంటలకు పడకచేరేవరకు పనిభారంతో, చాలీచాలని ఆహారము, నిద్రతో కాలంగడుపుతున్నట్లు, అయినా గత్యంతరం లేక ఆ ఉద్యోగం చేస్తున్నట్లు వ్రాశాడు. అటువంటి దుస్థితిలో అతనికి ఫ్రాన్సుపైన ద్వేషం కూడ కలిగింది; కార్సికాద్వీప స్వాతంత్ర్యం కొరకు పోరాడాలన్న సంకల్పం కలిగింది; తన భావాలను వ్యక్తంచేస్తూ కొన్ని రచనలు కూడ చేశాడు. రానురాను ఉద్యోగ విధులపట్ల ఏహ్యాభావం కలిగి, ఒకసారి సెలవుపై కార్సికా వెళ్ళి, తిరిగి సకాలంలో వచ్చి విధుల్లో చేరనందుకు ఉద్యోగం పోగొట్టుకున్నాడు.

అయినా జీవనాధారంగా ఉద్యోగం సంపాదించడం అవసరమని గ్రహించి 1792 లో నెపోలియన్ తిరిగి పారిస్ నగరాన్ని చేరాడు. అప్పుడు ఫ్రెంచివిప్లవం క్రమంగా దారితప్పుతూ, దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అతిచౌక అయిన హోటల్‌లో భోజనం చేస్తూ దారిద్ర్యం అనుభవిస్తూ ఒకానొక సమయంలో చేతిగడియారం తాకట్టుపెట్టి, భోజనం చేయవలసిన దుర్భర పరిస్థితులను గడిపాడు. 1792 జూన్ 20న, ఆగస్టు 10 న పారిస్‌లో అల్లరి మూకలు రాజప్రాసాదంపై చేసిన దాడిని కళ్ళారాచూశాడు.

1792 సెప్టెంబర్‌లో డాంటన్ నాయకత్వంలో జాతీయసమితి తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పినపుడు ప్రభుత్వసేనలు ఆస్ట్రో - ప్రష్యన్ దండయాత్రలను నిలువరించలేకపోవడము, నిర్బంధసైనికసేనను విధించి, క్రొత్తగా జాతీయసమితి సేనలను తయారుచేసుకోవడమూ ప్రారంభమైంది. ఆ సమయంలో నెపోలియన్ తిరిగి సైన్యంలో ఉద్యోగం పొంది, ఒక చిన్న అధికార

హోదా (Corporeal) ను కూడ పొందాడు. ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి సేనలతో టౌలోన్ (Towlon) వద్ద జరిగిన యుద్ధంలో అతడు తన ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. తరువాత 1795లో జాతీయ సమితిలోని రాజ్యాంగ సభ సమావేశమైన ట్విలరీస్ (Twileries) భవనంపై రాచరికవాదులు చేసిన దాడిని తరువాత డైరెక్టర్లు ఇతర ఉన్నతాధికారులు పదవీస్వీకారం చేసే సమయాన ఊరేగింపుపైన అల్లరిమూకలు చేసిన దాడిని అణచివేసి, డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. నెపోలియన్ శక్తియుక్తులను గుర్తించి డైరెక్టరీ ప్రభుత్వం అతన్ని సైన్యాధ్యక్షుల్లో ఒకనిగా నియమించింది. ఆనాటి నుండి నెపోలియన్ అమితవేగంగా అభివృద్ధిని అందుకుంటూ అత్యున్నత స్థితిని అందుకున్నాడు.

నెపోలియన్ ఆనాటి డైరెక్టరీ ప్రభుత్వదృష్టిలో పడడానికి, ఉన్నత పదవులను పొందడానికి ప్రధానకారణం అతనికి జోసెఫిన్‌తో జరిగిన వివాహం. ఆమె పూర్తి పేరు జోసెఫిన్ బొవార్నిస్ (Josephin Beauharnais), ఒక ప్రభువు భార్య. ఆమె భర్త జాతీయసమితి నిర్వహించిన భయంకర పరిపాలన (Reign of Terror) లో గిలోటిన్‌కు ఆహుతి అయినాడు. డైరెక్టరీ పరిపాలనా కాలంలో ఒక డైరెక్టర్‌తో సంబంధం కలిగిన జోసెఫిన్‌ను నెపోలియన్ ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడు. దానితో డైరెక్టరీ పరిపాలనా కాలంలో నెపోలియన్‌కు అవకాశాలు సమకూడడము, వాటిని అతడు చక్కగా వినియోగించుకోవడమూ జరిగి, అతని ఉన్నతస్థితికి పునాది పడింది.

## 7.3. నెపోలియన్ కన్సులేట్ పరిపాలన :

పైన వివరించినట్లు నెపోలియన్ ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణకూటమిలోని ఆస్ట్రియాపై దండయాత్రను, అందులోని అంతర్భాగంగా ఉత్తర ఇటలీని జయించి, సిస్ - ఆల్పైన్, లిగూరియన్ రిపబ్లిక్‌లను నెలకొల్పడం, చివరకు ఆస్ట్రియాను లొంగదీసి కాంపో - ఫార్మియో సంధికి ఒప్పించడం వంటి ఘనకార్యాలతో అపారమైన ప్రజాదరణను, డైరెక్టరీ ప్రభుత్వ ప్రాపకాన్ని పొందగలిగాడు. తదుపరి గ్రేట్ బ్రిటన్‌పై గొప్ప ఆత్మవిశ్వాసంతో, తెలివైన వ్యూహంతో దండయాత్రచేసి, ఓడిపోయినా, అతడు తిరిగి స్వదేశానికి వచ్చినపుడు ప్రజలు అసాధారణంగా స్వాగతం ఇచ్చారు. గ్రేట్ బ్రిటన్‌తో జరిగిన నైలు యుద్ధంలో అతడు ఓడిన విషయం ఫ్రాన్సు దేశంలో తెలియదు. తెలిసిన తరువాత కూడ ఆ ఓటమికి అవినీతిమయమైన, అసమర్ధమైన డైరెక్టరీ ప్రభుత్వమే కారణమని, ప్రభుత్వం సకాలంలో సరైన విధంగా సహకరించిఉంటే నెపోలియన్ తప్పక గ్రేట్ బ్రిటన్‌ను లొంగదీయగలిగేవాడని వారు విశ్వసించారు. ఈ విధమైన ప్రజాదరణ సైన్యానికి, అనగా సైనికాధికారులకు లభించడం వల్ల పౌర పరిపాలన (Civil Government) లోని లోపాలు భూతద్దంలో చూచినట్లు కానవచ్చి ప్రభుత్వం పట్ల ప్రజాభిమానం క్షీణించడము, ఆకారణంతో పతనం కావడం సంభవించవచ్చు. సరిగ్గా ఫ్రాన్సులో అదే జరిగిందని 1799 నవంబరు 10న బ్రూమైరి తిరుగుబాటు (Coup deetat of 18th Brumaire) తో డైరెక్టరీ ప్రభుత్వాన్ని కూలద్రోసి నెపోలియన్ ప్రభుత్వాధికారాలను కైవసం చేసుకొన్నాడని పై అధ్యాయంలో వివరించడం జరిగింది.

### 7.3.1. కన్సులేట్ రాజ్యాంగం (Consulate Constitution) :

నెపోలియన్ బొనాపార్టీ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమే వాస్తవంగా రిపబ్లిక్ మృతిచెందడం. కాని ప్రజల్లో రిపబ్లికన్ భావాలు, రిపబ్లిక్ వ్యవస్థ పట్ల ఆకాంక్ష కొంతవరకు బలీయంగానే ఉన్నాయి. కనుక నెపోలియన్ నియంతృత్వాన్ని అభిమానించేవాడు, ఆపేక్షించేవాడే అయినా, ఒక్కసారిగా తన అభిమతానుసారంగా నియంతృత్వపాలనను నెలకొల్పడం అసాధ్యమని గ్రహించినవాడు. 1799 నవంబరు 9న తిరుగుబాటు సందర్భంగా అతడు రిపబ్లిక్ వ్యవస్థను పరిరక్షించి అమలుజరపడానికి ప్రమాణం కూడ చేశాడు. ఈ తిరుగుబాటులో అతనికి సహచరుడైన అచిసయాస్ సమకాలీన రాజనీతి, తాత్త్విక సిద్ధాంతాలను గాఢంగా అభిమానించేవాడు. కనుక నెపోలియన్ తాను "విప్లవానికి కుమారుణ్ణి" ని (I am the son of Revolution) ప్రకటించుకున్నాడు. అనగా తాను విప్లవంలో జనించి, విప్లవభావాలకు అంకితమైనవాడని, విప్లవ ఫలితాలను సంరక్షించి, అమలుపరచడమే తన ధ్యేయమైనట్లు ఈ ప్రకటన వలన దేశంలోని రిపబ్లిక్‌వాదులను సంతృప్తిపరచాడు.

ఈ పరిస్థితికి అనుగుణంగా పరిపాలనా నిర్వహణకై నెపోలియన్ తన సహచరులతో కలిసి ఒక రాజ్యాంగాన్ని నిర్మించాడు. ఆ రాజ్యాంగం రాజ్యాధినేతగా (Head of the State) కన్సులేట్ (Consulate) అనేపేరున ముగ్గురు కన్సూల్ (Consul) లతో కూడిన అత్యున్నత కార్య నిర్వాహక (Chief Executive) మండలిని ఏర్పరచింది. దానితోపాటు మూడు సభలతో కూడిన శాసన నిర్మాణశాఖ (Legislative) ను కూడ ఏర్పరచింది. కన్సులేట్‌తో కూడిన రాజ్యాంగం కనుక దీనిని కన్సులేట్ రాజ్యాంగం అని చరిత్రకారులు వ్యవహరిస్తారు.

కన్సులేట్‌లోని ప్రథమ కన్సూల్ (First Consul) చేతిలో సర్వాధికారాలు కేంద్రీకృతమై ఉంటాయి. అయితే ఆ పదవిలో ముగ్గురిలో ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం మాత్రమే ఉండి తరువాత తప్పుకుంటారు. అనగా మొదటి కన్సూల్ సంవత్సరం తరువాత రెండవ కన్సూల్‌గాను, రెండు మూడు గాను, మూడు ఒకటిగాను పరివర్తన చెందుతారు.

సర్వాధికారాలు మొదటి కన్సూల్ చేతిలో కేంద్రీకృతం కావడం మాంటిస్క్యూ సిద్ధాంతానికి విఘాతం. ఆ విషయం మరుగుపరచి, రిపబ్లిక్ స్వరూపాన్ని ప్రదర్శించడానికి మూడు సభలతో కూడిన శాసన నిర్మాణ మండలిని, తక్కిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈ రాజ్యాంగం యుక్తిగా ఏర్పరచింది. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ (Council of state) అనే ఉన్నతసభ కార్యనిర్వాహ (Executive) విధుల్లో మొదటి కన్సూల్‌కు సాయపడే ఉన్నతాధికారులతో కూడిన సభ ఉంటుంది. దీనిలోని సభ్యులను నియమించడానికి, తొలగించడానికి మొదటి కన్సూల్‌కే సర్వాధికారాలుంటాయి. కనుక ఈ సభ అతని చెప్పుచేతల్లో ప్రవర్తిస్తూ ఉంటుంది. బిల్లులను తయారుచేయడం (drafting) అత్యవసర చట్టాలను రూపొందించడం, చట్టాలను వివరించి వ్యాఖ్యానించడం, అత్యున్నత న్యాయస్థానంగా వ్యవహరించడం ఈ సభ యొక్క అధికార విధులు.

శాసన నిర్మాణ విభాగం (Legislature) లోని మూడుసభలు ట్రిబ్యునేట్ (Tribunate), సెనెట్ (Senate), లెజిస్లేటివ్ బాడీ (Legislative Body). ట్రిబ్యునేట్‌లో నూర్గురు ట్రిబ్యూన్ (Tribune) లు, సెనెట్‌లో 80 మంది సెనెటర్లు (senators), లెజిస్లేటివ్ బాడీలో 300 మంది లెజిస్లేటర్లు (Legislators) ఉంటారు. సెనెటర్లను జీవిత కాల సభ్యత్వంతో మొదటి కన్సూల్, కౌన్సిల్ ఆఫ్ స్టేట్ నియమిస్తారు. సెనెటర్లు ట్రిబ్యూన్లను, లెజిస్లేటర్లను ఎంపిక చేస్తారు. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ తయారుచేసిన బిల్లులను ట్రిబ్యూనేట్ చర్చిస్తుంది. కాని వోటు చేయదు. లెజిస్లేటివ్ బాడీ వోటు చేస్తుంది, కాని చర్చించదు. సెనెట్ మాత్రం వాటిపై వివరణలు, వ్యాఖ్యలు ఇయ్యగలదు.

శాసనసభల స్వరూపము పనుల తీరువలెనే ఎన్నికల విధానం కూడ కన్సులేట్ రాజ్యాంగంలో చిత్రంగా ఉంది. వయోజన వోటింగ్ విధానంలో, వయోపరిమితిని అనుసరించి అందరికి వోటు హక్కు ఉంది, కాని వాస్తవంలో ఇది పూర్తిగా నిరుపయోగం చేయబడింది. ప్రతి కమ్యూను నుండి వోటర్లు తమలో పదోవంతు సభ్యులను ఎన్నుకుంటారు. వీరు ఎంపికదారులు (electors), తమలో పదోవంతు మందిని వారు తిరిగి ఎన్నుకుంటారు. కమ్యూను స్థాయిలో ఎన్నికైన ఎలక్టర్లను "కమ్యూనల్ లిస్టు" అంటారు, ఆ లిస్టు నుండి ఎన్నికైన పదోవంతు ఎలక్టర్లు "డిపార్ట్‌మెంటల్ లిస్టు" వాటి నుండి ఎన్నికైన పదోవంతు జాతీయలిస్టు (National list) గా ఏర్పడతారు. ఈ జాతీయ లిస్టు నుండి ప్రథమ కన్సూల్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్ సభ్యులను నియమిస్తాడు. వారు, సెనెట్ సభ్యులు కలసి ట్రిబ్యునేట్‌కు లెజిస్లేటివ్ బాడీకి, ఇంకా అనేక ఇతర అధికార పదవులకు అర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

శాసనాలను తయారు చేయడానికి కావలసిన ప్రతిపాదన (Proposal) ప్రథమ కన్సూల్ మాత్రమే చేయగలడు. దానిని కౌన్సిల్ ఆఫ్ స్టేట్ లిఖితపూర్వకంగా ట్రిబ్యునేట్, లెజిస్లేటివ్ బాడీల్లో, సభ్యులందరు ప్రథమకన్సూల్ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నియమించినవారే కనుక, దానిని చట్టబద్ధం చేస్తారు.

స్థానిక పరిపాలనలో లోగడ జాతీయసమితి రూపొందించిన విధానాన్ని, అనగా దేశాన్ని కొన్ని డిపార్ట్‌మెంటులుగాను, డిపార్ట్‌మెంటులు, ఎరాండిస్మా (Arondismant) లుగాను, వాటిని కమ్యూనులుగాను విభజించడం, కన్సులేట్ రాజ్యాంగం కొనసాగించింది. అయితే డిపార్ట్‌మెంటులపై ప్రిఫెక్టు (Prefect) లను లోగడ ఎన్నికద్వారా నియమించేవారు, వారికి కొంత స్వపరిపాలనాధికారాలు, ఆర్థికాధికారాలు ఉండేవి. కాని కన్సులేట్ రాజ్యాంగం ప్రిఫెక్టులను ప్రథమకన్సూల్ నియమించేలాగున, అతడు కమ్యూన్‌లపై మేయర్ల (Mayors) ను నియమించేలా ఏర్పరచింది. అనగా స్థానిక స్వపరిపాలనకు మారుగా కేవలం స్థానిక పరిపాలనకు మాత్రమే ఏర్పాటు జరిగింది. వారికిగల ఆర్థిక పరిపాలనాధికారాలను కూడ చాలవరకు ఉపసంహరించడం జరిగింది. ఈ విధంగా జాతీయసమితి నెలకొల్పిన స్థానిక స్వపరిపాలనా విధానం, మొదటి కన్సూల్ చేతిలో సర్వాధికారాలు కేంద్రీకృతమై కేవలం స్థానిక పరిపాలనగా పరిణమించింది.

ఈ విధంగా సర్వాధికారాలను మొదటి కన్సూల్‌కు కట్టబెట్టి కేంద్రీకృతాధికార వ్యవస్థ (Centralized power structure) ను నిర్మించడంతో నెపోలియన్ ఏర్పరచిన కన్సులేట్ రాజ్యాంగం పూర్వపు బూర్బన్ వంశీయుల నియంతృత్వ పరిపాలన కంటె ఏమంత భిన్నమైనది కాదని స్పష్టపడుతుంది. అటువంటి పరిపాలన వ్యక్తిస్వేచ్ఛను హరించివేస్తుందని ఆ కాలపు రాజనీతివేత్తలు, ముఖ్యంగా మాంటెస్క్యూ వాదనలకు ఇది పూర్తిగా విరుద్ధం. అయితే ఆనాటి రాజకీయ కల్లోలాలు, ఆర్థిక సంక్షోభము, అసమర్థ పరిపాలనల్లోని రిపబ్లిక్ కంటె ఈ విధమైన పటిష్ఠమైన రాజ్యాంగబద్ధ పరిపాలన ఫ్రెంచి ప్రజలు కోరుతున్నారని, వారు కోరేది సమానత్వం కాని స్వేచ్ఛకాదని (What the French people want is equality, not liberty) నెపోలియన్ ప్రకటించాడు. "ఫ్రెంచి ప్రజలు స్వేచ్ఛను పూర్తిగా అనుభవించారు. వారికిప్పుడు కావలసింది ఘనత" (The French had tasted enough liberty, now they want greatmen) అని కూడ నెపోలియన్ స్పష్టపరచాడు. వారు ఘనతను పటిష్ఠమైన పరిపాలనతో దేశంలో అభివృద్ధిని, వెలుపల శత్రువులపై విజయాన్ని సాధించినప్పుడే కాని మరేవిధంగాను సాధ్యంకాదని అతని మాటలకు సారాంశం.

### 7.3.2. ప్రథమ కన్సూల్‌గా నెపోలియన్ :

1799లో కన్సులేట్ రాజ్యాంగం అమలులోనికిరాగానే నెపోలియన్ మొదటి కన్సూల్‌గా పదవిని పొందాడు. అతని పదవీకాలం పదిసంవత్సరాలు. అనగా ప్రతి సంవత్సరం ముగ్గురు కన్సూలులు తమ పదవుల్లో పరివర్తన చెందే విధానాన్ని సవరించడం జరిగింది. ప్రతి సంవత్సరం ఈ విధంగా పదవులు మారుతూ ఉండడం వలన ప్రథమ కన్సూల్‌కు దేశపరిస్థితిని, ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవడానికి, తనదైన విధానాన్ని రూపొందించుకోవడానికి అవకాశం ఉండదు. కనుక ఈ సవరణ చేయడం జరిగింది. 1802లో నెపోలియన్ ప్రథమ కన్సూల్‌గా తన అధికారాన్ని ఉపయోగించుకొని, శాసనసభల ద్వారా తనకు జీవితకాలం ప్రథమకన్సూల్‌గా కొనసాగే విధంగా తీర్మానం చేయించాడు. దేశ పరిపాలనలోని సర్వాధికారి జీవితకాలం కొనసాగడంతోనే, రాజ్యాంగానికి, రిపబ్లిక్ స్వరూపానికి అర్థం లేకుండ పోయింది. 1799 నుండి ఫ్రాన్సు రెండవ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి (Second coalition of European power) తో పోరాడుతూనే ఉంది, నెపోలియన్ నాయకత్వంలో 1804 నాటికి ఈ రెండవ సంకీర్ణ కూటమి, ఒక్క గ్రేట్ బ్రిటన్ మినహా అన్ని ఐరోపాదేశాలను ఓడించి, దిగ్విజయాలు సాధించింది. దీనితో నెపోలియన్ కీర్తి ప్రతిష్ఠలు ఆకాశాన్ని అంటడమేకాక, అతడు లేని ఫ్రాన్సు లేదని, ఫ్రాన్సు సగర్వంగా తలెత్తుకొని నిలబడడానికి అతని పాలన అత్యంతావశ్యకమని ప్రజలు గాఢంగా విశ్వసించారు. నెపోలియన్ అందుకు తగిన ప్రచారం చేసుకొన్నాడు. ఆ పరిస్థితిలో జీవితకాలం ప్రథమకన్సూల్‌గా అప్పటికే నియామకం పొంది, రిపబ్లిక్‌ను నామమాత్రంగా మిగిల్చిన నెపోలియన్ తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. అందుకు అతడి చేతిలో కీలుబొమ్మలైన శాసనసభలు కాని, అతన్ని ఆరాధించడం ప్రారంభించిన ఫ్రెంచి ప్రజానీకం కాని ఏ విధమైన అభ్యంతరం చెప్పలేదు. దీనితో 1795 లో ఏర్పడ్డ మొదటి రిపబ్లిక్ అంతమై మొదటి ఫ్రెంచి సామ్రాజ్యం ఏర్పడింది.

అయితే, నెపోలియన్ తన అధికార వ్యామోహంతో, పదవీకాంక్షతో రిపబ్లికన్ పరిపాలనా వ్యవస్థలను తొలగించి, క్రమంగా రాజ్యాంగబద్ధంగానూ, రాజ్యాంగేతరంగాను సంపూర్ణాధికారం తన హస్తగతం చేసుకొని, తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నా, అతన్ని తప్పుపట్టవలసిన అవకాశం లేనివిధంగా ప్రవర్తించాడు. దేశంలో రాజకీయ ప్రశాంతతకు, ఆర్థికాభివృద్ధికి అనుకూల వాతావరణం కలిగేది, దేశ ప్రతిష్ఠ పెంపొందేది పటిష్ఠమైన పరిపాలన నెలకొన్నప్పుడేనని అతడు చేసిన వాదనలను యథార్థం చేశాడు. స్వార్థపరత్వమూ, అవినీతి, అసమర్థతలతో రిపబ్లిక్‌ను నిర్వహించి, ఆ వ్యవస్థలోని అంతర్గత లోపాలను వాస్తవం చేసిన డైరెక్టరీ ప్రభుత్వం కంటె, ప్రథమ కన్సాల్‌గా సర్వాధికారాలను హస్తగతం చేసుకొన్న నెపోలియన్ ఫ్రాన్సు దేశ పురోగమనానికి పునాదులు వేసి, కొంతవరకు ఫలితాలను సాధించి, తనను తాను సమర్థించుకున్నాడు.

### 7.3.2.1. పరిపాలనా స్వభావం :

తనను తాను విప్లవానికి కుమారుణ్ణని ప్రకటించుకున్న నెపోలియన్ సర్వాధికారాలను తన హస్తగతం చేసుకొన్నా, ఫ్రెంచి విప్లవ ఫలితంగా ఏర్పడిన స్వేచ్ఛా సమానత్వాలకు అఘాతం కలిగించలేదు. అయితే నామమాత్రంగా మిగిల్చిన కన్సులేట్ రాజ్యాంగంలో వోటుహక్కును కూడ నామమాత్రమే చేసి, పరోక్ష ఎన్నికల ద్వారా శాసనసభలను, రాజ్యాధినేతలను (Head of the State) నియమించే విధానాన్ని అమలుపరచడంలో, పత్రికా స్వాతంత్ర్యాన్ని ఇంచుమించుగా రద్దు చేయడంతో అతడు వ్యక్తి స్వేచ్ఛను కాపాడాడని చెప్పడం కష్టం. అలాగే నెపోలియన్ రూపొందించిన విద్యావిధానం కూడ దేశభక్తిని, దానికి అనుబంధంగా ప్రభుత్వభక్తిని వృద్ధిచేయడం ప్రధానాశయంగా కలది, ప్రభుత్వాన్ని విమర్శించడానికి, లేదా విమర్శించే హక్కును వినియోగించుకోడానికి ఉద్దేశించింది కాదు. అయితే, అతని పదవీవ్యామోహం, అధికారదాహం తప్ప అతని పరిపాలనలో విమర్శించవలసిన లోపాలేవీ సంభవించలేదు, అటువంటి సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించకుండ ప్రజల నోళ్ళు నొక్కివేసింది లేదు. అయితే విప్లవ ఫలితాల్లోని ఆర్థిక, సాంఘిక సమానత్వానికి, దేశ ప్రజానీకం అంతటికి సమానావకాశాలను కల్పించడంలోను నెపోలియన్ ఎటువంటి అవాంఛనీయమైన మార్పులు తలపెట్టలేదు. జాతీయ జీవన స్రవంతిలో ఎటువంటి తారతమ్యాలు పాటించక అందరికి సమానంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్గించడానికి నెపోలియన్ పాటుపడ్డాడు.

### 7.3.2.2 మతవిధానం :

వ్యక్తిగతంగా నెపోలియన్ ఏ ప్రత్యేక మతాచారాల పట్ల, విశ్వాసాల పట్ల విశేషమైన అభిమానము, పట్టుదల కలిగినవాడు కాడు. అతడు స్పష్టంగా "నాకు మతం మీద నమ్మకం లేదు, దైవంపై మాత్రమే నమ్మకం,"అని సగర్వంగా ప్రకటించుకున్నవాడు. ప్రజలు నన్ను పోప్‌ను సమర్థిస్తానని భావించవచ్చు, కాని అది నిజంకాదు. "నేను ఈజిప్టులో ఉండగా మహమ్మదీయుడిని, ఇక్కడ ప్రజల బాగుకోసం కాథలిక్‌ను" (People may say that I am a Papist. I am nothing. I was a Mohammadan in Egypt, I shall be a Catholic here for the good of the people). అని అతడు పోప్‌లో ఒడంబడిక (Concordt) చేసుకొన్న తదుపరి తనను గూర్చి వివరించుకున్నాడు. డైరెక్టరీ పరిపాలనా కాలంలోనే మతం వ్యక్తిగతం; దానికి ప్రజల సామాజిక, రాజకీయ జీవనంతోను, వ్యవస్థలతోనూ ఎటువంటి సంబంధమూ లేదని ప్రకటించడం జరిగింది. నెపోలియన్ అదే విధానాన్ని అనుసరిస్తూ, ఆనాటి రాజకీయ కల్లోలాలను మతఘర్షణలు తోడు కాకుండ జాగ్రత్తపడ్డాడు.

### 7.3.2.3. కంకార్డ్ (Concordt) :

అయితే నెపోలియన్ మతవిశ్వాసాలకు పూర్తిగా వ్యతిరేకికాదు. ప్రజలను మంచిమార్గంలో నడిపించడానికి మతం అవసరమేనని, మతంలేని రాజ్యం దిక్సూచి లేని పడవవంటిదని తరచు నెపోలియన్ అనేవాడు. మతం పేరున వివక్షతలు, సంఘర్షణలు కాక, నైతికమైన సత్ప్రవర్తనను కలిగించేదిగా మతం ఉండాలని అతని అభిప్రాయంగా గ్రహించవచ్చు. ఆ దృష్టితో

అతడు అన్నిమతాలు మానవతావాదానికి దోహదంచేసేవేనని భావించినట్లు స్పష్టపడుతుంది. కనుక ఈతని మతభావాలు వోల్టైర్ సిద్ధాంతాలపై ఆధారపడిన డీఇజమ్ (Deism) గా భావించవచ్చు. విప్లవకాలంలో చర్చితో ఏర్పడ్డ సంఘర్షణలు, రాబిస్పియరీ నిర్మించ తలపెట్టిన రిపబ్లిక్ ఆఫ్ వర్చ్యు (Republic of virtue) వంటి సంఘటనలతో ఫ్రెంచి విప్లవకారులు ప్రజల మతభావాలపై తీవ్రమైన దెబ్బకొట్టారు, అయినా ప్రజల్లో కాథలిక్ మతం పట్ల శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయిక విశ్వాసం నశించలేదు. వారు పోప్‌కు విధేయతలోనే కాథలిక్ మతధర్మం ఇమిడిఉందని విశ్వసిస్తూనే ఉన్నారు. కాగా, ఈ సాంప్రదాయిక మతవ్యవస్థ బూర్బన్ వంశీయుడైన ప్రొవెన్స్ ప్రభువు (Court of Provence) ను పద్దెనిమిదో లూయిగా, ఫ్రెంచి సింహాసనానికి వారసునిగా గుర్తించి ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచారం విస్తృతమైతే నెపోలియన్ పదవికి భంగం కలుగుతుంది. అందుచేత తన వ్యక్తిగత మతవిశ్వాసాలను పక్కనపెట్టి, రోమన్ కాథలిక్ మతవ్యవస్థను తనకు అనుకూలం చేసుకోవడం అత్యవసరమని నెపోలియన్ గ్రహించాడు.

ఈ పరిస్థితిలో విప్లవకాలంలో బలీయమైన జాతీయవాదానికి, ఫ్రెంచి ఆత్మగౌరవానికి భంగం కలగని రీతిలో అధిక సంఖ్యాకులైన కాథలిక్కుల మతవిశ్వాసాలను గౌరవించి, వారి అభిమానాన్ని పొందడానికి నెపోలియన్ పోప్‌తో ఒక ఒప్పందం చేసుకొన్నాడు. దీనిని కంకార్డ్ (Concordt) అంటారు. అప్పటి పోప్ ఏడవ పయస్ కొంతవరకు సరళమైన విధానాలను అవలంబించేవాడు కావడాన, సమాధానపడి నెపోలియన్‌తో ఈ ఒప్పందాన్ని అంగీకరించాడు.

కంకార్డ్ ఒప్పందం ప్రకారం ఫ్రాన్సులో ఆర్చి బిషప్పులు, బిషప్పుల వంటి మతవ్యవస్థలోని ఉన్నతపదవుల్లో ప్రథమ కన్సాల్ నియామకాలు చేస్తాడు. వారు లోగడవలె దిగువస్థాయికి చెందిన మతాచార్యులను నియమిస్తారు. పోప్ ఈ నియామకాలను గుర్తించి, ధ్రువపరుస్తాడు. దీనివలన పోప్ యొక్క ఆధిక్యత ఫ్రెంచి కాథలిక్ మత వ్యవస్థపై నామకః (de jure) అంగీకరించడం జరిగింది; కాని వాస్తవమైన అధికారాలు (de facto) ప్రథమకన్సాల్‌కే చెందినాయి. ఈ మాత్రం ఆధిక్యతను గుర్తించినందుకే పోప్ లోగడ విప్లవకాలంలో ఫ్రెంచి ప్రభుత్వం స్వాధీనపరచుకొన్న మతవ్యవస్థకు చెందిన ఆస్తులను పోప్, అతని అధీనంలోని ఫ్రెంచి కాథలిక్ చర్చి తిరిగి కోరకుండడానికి అంగీకరించారు.

ఈ అంగీకారం వల్ల రోమన్ కాథలిక్ మతవ్యవస్థ నెపోలియన్ హస్తగతం అయింది. అందులోని మతాధిపతులు, మతాచార్యులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నెపోలియన్ నియమించినవారే. కనుక అతని అదుపాజ్ఞల్లోనే వారు ప్రవర్తిస్తారు. మతవ్యవస్థకు చెందిన ఆస్తులు సంపూర్ణంగా ప్రభుత్వపరం కావడం వివాదరహితం అయింది. మతవ్యవస్థపై తిరిగి పోప్ ఆధిపత్యాన్ని నామమాత్రంగానైనా అంగీకరించడంతో దానికి వెనుకటి పవిత్రత, సాంప్రదాయిక గౌరవం చేకూరినాయని ఫ్రెంచి కాథలిక్ ప్రజానీకం సంతృప్తి చెందింది. అంతేకాక, పోప్ పూర్వం పవిత్ర రోమన్ చక్రవర్తులను పట్టాభిషిక్తులను చేసి ప్రకటించిన విధంగా నెపోలియన్‌ను పట్టాభిషిక్తుని చేశాడు.

నెపోలియన్ తన భావాల్లోని సర్వమతసమానత్వాన్ని అన్ని క్రైస్తవ మతశాఖలకు వర్తింపజేశాడు. వారికేకాక యూదులకు కూడ ఆ విశాల దృక్పథాన్ని వర్తింపజేసి మతస్వేచ్ఛను ఇచ్చాడు. ఫ్రాన్సులో ఆ విధంగా ప్రజలందరికి మతస్వేచ్ఛను ఇయ్యడమూ, మతపరమైన వివక్షతలేవీ లేకుండ అందరికి సమానావకాశాలను వర్తింపజేయడము నెపోలియన్ అనుసరించిన మత విధానంలోని విశేషం.

### 7.3.2.4. ఎమిగ్రి ప్రభువుల పట్ల ఔదార్యం :

ఫ్రెంచి విప్లవకాలంలో ప్రభువర్గ హక్కులను, అధికారాలను వదులుకోవడం ఇష్టంకాని పలువురు ప్రభువులు ఫ్రాన్సు దేశం వదిలి వెళ్ళి, ఆస్ట్రియా, ప్రష్యా రాజ్యాల సరిహద్దుల్లో స్థిరపడిన విషయము పై అధ్యాయంలో వివరించడం జరిగింది.

జాతీయసమితి (National Convention) వారిని ఒక గడువులోపల తిరిగివచ్చి, తమ ఎస్టేట్లను, ప్రత్యేక హోదాలు, అధికారాలను ప్రభుత్వానికి లోబరచవలసిందిగాను, లేని పక్షంలో ప్రభుత్వం వారి ఎస్టేట్లను స్వాధీనపరచుకొని, వారిని దేశద్రోహులుగా భావించి శిక్షిస్తుందని కఠినంగా శాసించింది. అయితే, నెపోలియన్ వారిపట్ల కొంత సరళమైన వైఖరి ప్రదర్శించాడు. వారు ఆశించినట్లు, ప్రయత్నించినట్లు ఫ్రాన్సులో తిరిగి నిరపేక్షరాచరికం ఏర్పడలేదు, వారి హక్కులు, అధికారాలు తిరిగి వారికి ప్రాప్తించలేదు. వారి ఎస్టేట్లు జాతీయసమితి విధించిన గడువు తీరగానే ప్రభుత్వపరమైనాయి. కనుక వారిపట్ల కాఠిన్యం వహించవలసిన అవసరమేదీలేనట్లు భావించి, వారిని తిరిగి వచ్చి ప్రజలతో కలసి జీవించవలసిందిగాను, వారిపట్ల ఎటువంటి వివక్షత ఉండబోదని ప్రకటించాడు. ఈ ప్రకటనతో అనేకులు సంతృప్తి చెంది స్వదేశానికి తిరిగివచ్చారు, నెపోలియన్ వారికి తగిన అధికార పదవులనిచ్చి ఆదరించాడు.

### 7.3.2.5. న్యాయసంస్కరణలు :

నెపోలియన్ పరిపాలనలో అత్యంత విశిష్టమైనది అతని న్యాయసంస్కరణలు; జాతీయసమితి కాలంలోనే, అంతకు పూర్వం దేశాన్ని ముక్కలు చెక్కలు చేసి పరిపాలించే ప్రభువులు అంతరించడంతో, వివిధ ప్రాంతాల్లో ఆచరణలో ఉన్న విభిన్నమైన న్యాయచట్టాలకు బదులు దేశమంతటికి వర్తించే ఒకే న్యాయచట్టము, పరిపాలనా విధానమూ ఏర్పడాలని భావించడం జరిగింది. జాతీయసమితి తరువాత అధికారంలోనికి వచ్చిన డైరెక్టరీ ప్రభుత్వం అసమర్ధత, అంతర్గత వైరాలు, విదేశీయ పోరాటాల కారణంగా ఈ ఆశయం నెరవేరలేదు. దీనిని నెపోలియన్ చేపట్టి అత్యంత ప్రతిష్ఠాత్మంగా నిర్వహించి "రెండవ జస్టిన్" అని పేరు తెచ్చుకున్నాడు. రోమన్ సామ్రాజ్య కాలంలో జస్టిన్ అనే పోప్ రోమన్ సామ్రాజ్యమంతటికి వర్తించే న్యాయచట్టాలను తయారుచేశాడు, దానికి "రోమన్ న్యాయసూత్రాలని" పేరు. అదేవిధంగా నెపోలియన్ ఫ్రాన్సు దేశమంతటికి వర్తించే న్యాయసూత్ర నిబంధనలను (Codes of Law) తయారుచేయించాడు. నెపోలియన్ యుద్ధవిజయాలు అశాశ్వతమై అంతరించిపోయినా, అతని న్యాయసూత్ర నిబంధనలు గ్రానైట్‌పై నిర్మించినట్లు దృఢంగా, శాశ్వతంగా నిలిచిఉంటాయని లార్డ్ ఆక్టన్ వ్యాఖ్యానించాడు.

ఆనాటి న్యాయపరిపాలనా వ్యవస్థలో, అవినీతి, అక్రమం, ఆలస్యం అధికమై విధానం అస్తవ్యస్తమై ఉంది. కనుక న్యాయపరిపాలనా విధానం కూడ సంస్కరించి సరళంగా చేయడాన్ని నెపోలియన్ ఉద్దేశించాడు. ఈ సంస్కరణలను రూపొందించి, అమలు జరిపేందుకు నెపోలియన్ దేశంలో ప్రసిద్ధులైన న్యాయ కోవిదులను ఆహ్వానించి వారితో ఒక సలహాసంఘాన్ని (Law Commission) ఏర్పరచాడు. ఆ సంఘం సుదీర్ఘకాలం న్యాయసూత్ర నిబంధనలను రూపొందించడంలోను, న్యాయపరిపాలనకు తగిన వ్యవస్థను నిర్మించడంలోను 87 సమావేశాలు జరిపి చర్చలు చేసింది. వాటిలో 35 సమావేశాల్లో నెపోలియన్ స్వయంగా పాల్గొన్నాడు. 1804 నాటికి ఈ కమీషన్ తన చర్చలను పూర్తి చేసి, దేశమంతటికి వర్తింపజేయదగిన మూడు న్యాయసూత్ర నిబంధనలను (Codes of Law) రూపొందించింది. అవి పౌరన్యాయము (Civil Law), నేర శిక్షాస్మృతి (Criminal Procedure code), వాణిజ్య న్యాయము (Commercial Law) అనే శాఖలుగా ఏర్పరచడం జరిగింది.

ఈ న్యాయసూత్ర నిబంధనలను అనుసరించి, వివాదాలను విచారించి పరిష్కరించడానికి, శిక్షలు విధించి అమలు జరపడానికి వేర్వేరుగా సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలను, ప్రభుత్వ నిర్వహణలో ఏర్పరచడం జరిగింది. విప్లవపూర్వం నాటి ఫ్రాన్సులో, ఇతర ఐరోపా దేశాల్లో సైతం న్యాయస్థానాలను మతాధిపతుల తోడ్పాటుతో ప్రభువులు తమ ఎస్టేట్లకు పరిమితమై ఉండే విధంగా నిర్వహించేవారు. న్యాయపరిపాలన ఈ విధంగా ప్రభుత్వ అధీనమై, దేశమంతటికి వర్తించడం 1804 నుండి, ఫ్రాన్సులో ప్రారంభమైంది.

పౌరన్యాయంలో విప్లవకాలంనాటి ఆదర్శాలకు విప్లవ ఫలితాలుగా పటిష్ఠమై నిల్చిన భావాలకు చట్టబద్ధమైన గుర్తింపు, న్యాయపరిపాలనలో ప్రముఖ స్థానము ఇయ్యడం జరిగింది. అనగా ఫ్రెంచి పౌరులందరికి ఆర్థిక, సాంఘిక సమానత్వము, వ్యక్తి స్వేచ్ఛ పౌరన్యాయంలో చేర్చడం జరిగింది. సేద్య బానిసత్వమూ, భూస్వామ్య విధానం నాటి ఉన్నత వర్గాల ప్రయోజనాలు ఈ

పౌరన్యాయంలో నిర్మూలించడం జరిగింది; మతసామరస్యము, సర్వమత సమానత్వం అంగీకరించబడినాయి. అలాగే విప్లవకాలంనాడు జాతీయసమితి అమలు జరిపిన క్రూర శిక్షలు, శిరచ్ఛేదము, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం మొదలైనవి న్యాయసూత్రాలకు లోబడి అమలు జరగడానికి, ప్రభుత్వం తన ఇష్టానుసారంగా కక్షతీర్చుకొనే ఉద్దేశంతో అమలుపరచడాన్ని నిర్మూలించడం జరిగింది. సాంప్రదాయిక కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యతనిచ్చి, కుటుంబ ఆస్థిలో వారసులందరికి సమానమైన వాటాలు ఇయ్యడానికి ఏర్పాటుచేయడం జరిగింది. అయితే స్త్రీలకు ప్రత్యేకంగా స్వేచ్ఛనిచ్చినట్లు ఈ న్యాయస్మృతి చెప్పదు, కాని విడాకులను అంగీకరించడంతో మతసాంప్రదాయాలకు భిన్నంగా స్త్రీ స్వాతంత్ర్యాన్ని కొంతవరకు అంగీకరించినట్లు అయింది. అంతేకాక స్త్రీ విద్యకు ప్రాధాన్యతను ఇచ్చిన నెపోలియన్, ఈనాడు స్త్రీ స్వాతంత్ర్యం కొరకు అంగలార్చిన విధంగా, పందొమ్మిదో శతాబ్ది ప్రారంభంలో అంత ప్రాధాన్యత లేదు. కుటుంబంలో స్త్రీ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి తగినంత విద్యా, విజ్ఞానం, ఆమె స్థానాన్ని గౌరవప్రదంగా పీడనారహితంగా ఏర్పరచడము, నెపోలియన్ ఉద్దేశాలు.

### 7.3.2.6 ఆర్థిక విధానము, విజయాలు :

1789 నాటికే విషమించిన ఫ్రెంచి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ఆ శతాబ్దాంతం వరకు సరైన అవకాశం రాకపోవడం పై అధ్యాయాలలో వివరించడం జరిగింది. కాగా, విప్లవ సంఘటనలు, అవినీతి, అసమర్థమైన పరిపాలనలు, రాజకీయ కల్లోలాలు ఆ క్లిష్టపరిస్థితిని మరింతగా విషమింపజేశాయి. ఈ పరిస్థితిని తొలగించి ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి నెపోలియన్ తగిన చర్యలు తీసుకున్నాడు. అన్నిటికంటె అత్యవసరమైనది పన్నులు సక్రమంగా వసూలు కావడానికి, ప్రభుత్వ ఖర్చులో దుర్వ్యయం తగ్గించడానికి సరైన అదుపు చేయడం.

పటిష్ఠమైన పరిపాలన :

నెపోలియన్ ప్రథమకన్సూల్‌గా పదవిని అధిష్ఠించినది మొదలు వరుసగా ఏర్పడ్డ ఐరోపారాజ్య సంకీర్ణకూటములతో నిరంతర పోరాటాలు చేయవలసివచ్చింది. ఈ యుద్ధాలు దేశ ఆర్థికస్థితికి గొడ్డలిపెట్టు వంటిది. అందుకై అధిక సేనలను నిర్మించి, ఆయుధసంపదను పెంపొందించుకోవడం అత్యధిక వ్యయంతో కూడింది. అయినప్పటికి, నెపోలియన్ ఆర్థిక సంస్కరణలు అందుకు తగిన ఆర్థికవనరులను సమకూర్చగలిగినాయి. దానికితోడు, నెపోలియన్ తనచే ఓడిన దేశాలవద్ద తప్పనిసరిగా యుద్ధఖర్చులకు పరిహారాన్ని (Indemnity) వసూలుచేసి, దేశీయ ఆర్థికవ్యవస్థపై ఆ భారం పడకుండ జాగ్రత్తపడ్డాడు.

పైన వివరించినట్లు ఆదాయ వనరులను పటిష్ఠమైన పరిపాలన వలన సక్రమంగా వినియోగించుకోవడము, ప్రభుత్వఖర్చుల్లో పొదుపు పాటించడమేకాక, నెపోలియన్ ఆర్థికపరిస్థితిని చక్కదిద్దేందుకు అనేక నిర్మాణాత్మక చర్యలను చేపట్టాడు. వాటిలో ప్రధానమైనవి వ్యావసాయిక, పారిశ్రామిక ఉత్పత్తులను పెంచడం, దానివలన వాణిజ్య విస్తరణ, వలసరాజ్యాలపై ఫ్రెంచి ఆధిపత్యాన్ని బలపరచడము, మరింతగా విస్తరించడము. ఫ్రెంచి విప్లవకాలంలోని కల్లోల పరిస్థితులు ఖండాంతర వలసలను నిర్వహించడము, విస్తరించడము అసాధ్యం చేశాయి, దానివలన పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి కుంటుపడినాయి.

### వలసభూభాగాల విస్తరణ :

భారతదేశంలోని ఫ్రెంచివర్తకాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రబలమవుతున్న బ్రిటిష్‌వారి వలసరాజ్యాధిపత్యాన్ని అరికట్టేందుకు నెపోలియన్ ఆలోచించాడు. అయితే అప్పటికే పరిస్థితి చాలావరకు చేజారిపోయింది. అయినా, టిప్పుసుల్తాన్, నైజామ్, మహారాష్ట్ర రాజ్యాలలో ఫ్రెంచి నిపుణులచేత వారిసేనలకు తరిఫీదు ఇప్పించడమూ, భారీగా ఆయుధాలను తయారుచేసే కర్మాగారాలను నెలకొల్పడం వంటి విధానాలతో వారికి సహకరించి, వారి మైత్రిని పొందడానికి ప్రయత్నించాడు. కాని వెల్లస్లీ ప్రభువు (Lord Wellesley) భారతదేశంలో ఈస్టిండియా కంపెనీకి గవర్నర్ జనరల్‌గా వచ్చి, నిజామ్‌తో సైన్యసహకారసంధి (Subsidiary

Alliance) చేసుకోవడమూ, టిప్పుసుల్తాన్‌ను నాలుగో మైసూరు యుద్ధంలో ఓడించి, వధించడంతో నెపోలియన్ ప్రయత్నాలు ఫలవంతం కాలేదు. అయితే, ఇండో-చైనాలో నెపోలియన్ ఆశించినమేరకు ఫ్రెంచివలస ప్రాంతాల్లో పటిష్ఠమైన ఆధిపత్యం నెలకొల్పగలిగి, విస్తరణను కూడ సాధించగలిగాడు. అంతేకాక, ఇండో-చైనా నుండి ఫ్రెంచివలసలను ఆస్ట్రేలియా ఖండంలోనికి విస్తరించడానికి కూడ నెపోలియన్ ప్రణాళికలు వేశాడు, కాని ఐరోపాలో నిరంతరంగా పోరాటాల్లో పాల్గొనవలసిరావడంతో అది సాధ్యపడలేదు.

## పారిశ్రామికాభివృద్ధి బాంక్ ఆఫ్ ఫ్రాన్సు :

ఖండాంతర వలససామ్రాజ్యం దేశీయంగా పారిశ్రామికాభివృద్ధికి ప్రాతిపదిక అయేది. కనుక నెపోలియన్ ఆశించినంతగా కాకున్నా, తిరిగి ఫ్రాన్సులో పారిశ్రామికాభివృద్ధికి తగిన వాతావరణం ఏర్పడింది, విదేశీవాణిజ్యం వృద్ధిచెందింది. పారిశ్రామికాభివృద్ధికి, వాణిజ్యాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సదుపాయాల కొరకు నెపోలియన్ 1800లో బాంక్ అఫ్ ఫ్రాన్సు (Bank of France) అనే జాతీయ కేంద్రబాంకును నెలకొల్పి, విప్లవకాలంనాటి ద్రవ్య విధానాన్ని (Monetary policy) పూర్తిగా రద్దుచేశాడు. విప్లవకాలంనాటి ఎసిగ్నాట్ (Assignats) అనే కాగితపుడబ్బు పూర్తిగా విలువను కోల్పోయింది, దీనివలన వర్తక వాణిజ్యాల్లో లావాదేవీలు అసాధ్యం అయినాయి. కనుక దానిని పూర్తిగా రద్దుచేసి పూర్వంవలె వెండి, బంగారు నాణాలను ముద్రించి వాడుకలోనికి తేవడం జరిగింది. ఈ ద్రవ్యవిధానాన్ని బాంక్ ఆఫ్ ఫ్రాన్సు నిర్వహించింది.

పారిశ్రామికాభివృద్ధితోపాటు వ్యావసాయికాభివృద్ధిని కూడ నెపోలియన్ గుర్తించాడు. అందుకొరకై అతడు అనేక సాగునీటి పారుదల వసతులను కల్గించడానికి కాలువల నిర్మాణం చేపట్టాడు. వ్యావసాయికోత్పత్తులు, పారిశ్రామికోత్పత్తులు సక్రమంగా రవాణాకావడం ఆర్థికవ్యవస్థ బలోపేతం కావడానికి ప్రధానమైన అవసరం. అందుచేత విస్తారంగా రోడ్ల నిర్మాణాన్ని, కాలువలపై వంతెనల నిర్మాణాన్ని చేపట్టి, తన పరిపాలనాకాలంలోనే దేశంలోని మారుమూల ప్రాంతాలు కూడ వర్తకకేంద్రాలయిన నగరాలతోను, రేవుపట్టణాలతోను అనుసంధించే ముప్పదిపైగా ప్రధానరోడ్లను (Trunk roads) నిర్మించాడు. ఈ నిర్మాణ కార్యక్రమాలు దీర్ఘకాలికమైన సత్ఫలితాలను ఇయ్యడం అలా ఉంచితే, అప్పటికప్పుడు వేలాదిగా ప్రజలకు ఉపాధిసౌకర్యాలు, ఆదాయవనరులు కల్గించి వారికి సంతృప్తి కలిగించాయి.

## 7.3.2.7. విద్యావిధానం :

ఆధునిక కాలంలో దేశాలలో నూతనవ్యవస్థలు ఏర్పడి, జీవనవిధానాల్లో తీసుకొని వస్తున్న పరిణామాలకు విద్యాసంస్కరణలు అత్యంత మౌలికమైనవి. ముఖ్యంగా ఫ్రాన్సుదేశం రాజకీయంగాను, సాంస్కృతికంగాను ఒకేజాతికి చెందినదిగా, స్థానికమైన ప్రభుత్వాల నిర్మూలనతో సమైక్యం అయిన కారణంగా, దేశమంతటికి ఒకే విద్యావిధానం కూడ అత్యంత ఆవశ్యకంగా నెపోలియన్ భావించాడు.

## విద్యావ్యవస్థ :

విద్యావ్యాప్తికై నెపోలియన్ ప్రతి కమ్యూనులోను ప్రాథమిక పాఠశాలలను (Primary schools) నెలకొల్పాడు. అవి కమ్యూన్‌స్థాయిలోని స్థానికపరిపాలనావ్యవస్థ నిర్వహణలో పనిచేస్తాయి. వాటిపై ప్రిఫెక్టులు, ఉప-ప్రిఫెక్టులు పర్యవేక్షిస్తారు. ఈ ప్రాథమిక పాఠశాలల పై స్థాయిలో మాధ్యమిక పాఠశాలలను గ్రామరు స్కూళ్ళ (Grammar schools) అనేపేర ఫ్రెంచి, లాటిన్ భాషలను, ప్రాథమికమైన (Elementary) శాస్త్ర విషయాలను బోధించే పాఠశాలలను నెలకొల్పాడు. ఈ పాఠశాలలు ప్రభుత్వ నిర్వహణలోనేకాక, ప్రైవేటుగా వ్యక్తులు, సంస్థల నిర్వహణలో సైతం అనుమతించి, వాటిపై ప్రభుత్వ పర్యవేక్షణను మాత్రం తప్పనిసరిగా విధించడం జరిగింది.

పై విధమైన ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల కంటె ఉన్నతమైన స్కూళ్ళను (High schools) లైసీ (Lycee) అనేపేర ప్రతి పట్టణంలో నెలకొల్పడం జరిగింది. వీటిలో ఉపాధ్యాయులను ప్రభుత్వమే నియమిస్తుంది, అన్నివిధాలైన శాస్త్రాల్లో, వైజ్ఞానిక విషయాల్లో ఈ పాఠశాలలు విద్యాబోధన చేసేవి. ఇవి ప్రజాసామాన్యానికి ఉద్దేశించిన విద్యాలయాలు కాగా, సాంకేతిక (Technical) పరిపాలనాశిక్షణ (Civil service) సైనికశిక్షణ (Military schools) ప్రత్యేకంగా నెలకొల్పతగిన సిబ్బందిని తయారుచేయుడానికి ఏర్పాట్లుచేయడం జరిగింది. ఈ పాఠశాలల్లోని విద్యాబోధన దేశమంతట ఒకేవిధమైన ప్రమాణాలతో జరిగేందుకు ఫ్రెంచివిశ్వవిద్యాలయాన్ని (University of France) ను నెపోలియన్ నెలకొల్పాడు. విశ్వవిద్యాలయంలోని ఆచార్యులను, ఉన్నతోద్యోగులను ప్రథమకన్సాల్ నియమించి, ఆ సంస్థను పూర్తిగా తన పర్యవేక్షణలో నిర్వహిస్తాడు. విశ్వవిద్యాలయం అనుమతి లేకుండ క్రొత్తగా స్కూళ్ళను నెలకొల్పి, తమ ఇష్టానుసారమైన విద్యను బోధించడాన్ని నెపోలియన్ కఠినంగా నిషేధించి అమలుజరిపాడు.

ఇవికాక పారిస్ నగరంలో ఒక ప్రత్యేకమైన స్కూలును నార్మల్ (Normal school) అనే దానిని, ఉపాధ్యాయులకు శిక్షణనియ్యడానికి నెలకొల్పాడు.

**విద్యాప్రణాళిక :**

ఈ పాఠశాలలన్నిటిలో, ప్రత్యేకమైన శాస్త్రాలను బోధించడం మినహాయిస్తే, సాధారణ విద్యా బోధనలో (General Education) క్రైస్తవ మతానికి సంబంధించిన నైతిక విషయాలకు, రాజ్యానికి విధేయతను బోధించడం ప్రధానాంశం. దీనివలన నైతిక విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసము, రాజకీయంగా క్రమశిక్షణ కలిగించడం దాని ఉద్దేశం. అప్పటివరకు దేశంలో ఏర్పడ్డ అల్లకల్లోల పరిస్థితి, ఇటువంటి క్రమశిక్షణ కలిగిన పౌరులను తయారు చేయడం చేత మాత్రమే నివారించడం సాధ్యమౌతుందని నెపోలియన్ చాలా దూరదృష్టితో నిర్ణయించాడు.

ప్రభుత్వం విద్యాలయాలకు కొన్ని కరపత్రాలు (Catechisms) పంపి, విద్యార్థుల్లో విద్యపట్ల అవగాహన కలిగించడానికి ప్రయత్నించింది. అటువంటి ఒక కరపత్రంలో పాఠ్యాంశాల ప్రయోజనాన్ని గూర్చి ఈవిధమైన భావాన్ని ప్రకటించడం జరిగింది.

క్రైస్తవులు తమను పరిపాలించే ప్రభువులకు, అనగా ప్రస్తుత సందర్భంలో చక్రవర్తి అయిన నెపోలియన్‌కు గౌరవము, విధేయత, విశ్వసనీయత, సైనికసేవ, విధించిన పన్నులను సామ్రాజ్య నిర్వహణ కొరకు, సంరక్షణ కొరకు చెల్లించడమూ అనేవి అందజేయవలసినవి. వారు చక్రవర్తి క్షేమము, ఈ లోకంలోని అతని విజయాలు, ఆధ్యాత్మికమైన సత్ఫలితాలు కలిగి, సామ్రాజ్యాన్ని భద్రంగా కాపాడగలిగినట్లు చేయవలసిందిగా భగవంతుని ప్రార్థించడం విధిగా భావించాలి.

భగవంతుడు సామ్రాజ్యాలను సృష్టించి, తన అభీష్టంమేరకు చక్రవర్తులనడుమ పంపిణీచేసి, తన వరాలను వారిపై కురిపిస్తాడు; వారిని ప్రజలను పరిపాలించే సర్వోత్కృష్టమైన అధికారంతో నిలుపుతాడు; ఆయన ప్రతినిధులుగా, ప్రతిబింబాలుగా చక్రవర్తులు భూమిపై అవతరిస్తారు. కనుక చక్రవర్తులను గౌరవించి, సేవించడం భగవంతుని సేవించడమే. రక్షకుడైన ఏసుక్రీస్తు తన బోధలో ఈ విషయాలను ప్రకటించి, ఉదహరణాత్మకంగా ఆచరించి మనకు చూపాడు. ఆయన ఆగస్టస్‌సీజర్‌కు విధేయుడై, విధించిన పన్నులను చెల్లించి, "భగవంతునికి చెందినవి భగవంతునికి చెల్లించండి, సీజర్ (చక్రవర్తి) కి చెందినవి సీజర్‌కు చెల్లించండి" అని ఉపదేశించాడు.

ప్రత్యేకంగా మనం (ఫ్రెంచి ప్రజలు) నెపోలియన్ పట్ల మరింత భక్తి విశ్వాసాలు కలిగి ఉండవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, మన పూర్వుల నుండి మనకు సంక్రమించిన పవిత్ర ధర్మాన్ని అనుసరించి, భగవంతుని పూజించే పరిస్థితులు లేకపోయిన సమయంలో ఆ చక్రవర్తి వాటిని పునరుద్ధరించాడు, సంరక్షణకై నిలిచాడు. తన చురుకైన, గంభీరమైన మేధాశక్తితో

ఆయన ఈ ధర్మాన్ని నిలిపి సంరక్షిస్తూ, తన శక్తి సామర్థ్యాలతో సామ్రాజ్యాన్ని శత్రుకూటములనుండి కాపాడుతున్నాడు. ఈ అనితరసాధ్యమైన కార్యక్రమాన్ని సాధించడానికి ఆయనను భగవంతుడు అభిషేకించి పదవిలో నిలిపాడు; భూమిపై అత్యుచ్ఛ స్థితిలో ఉన్న పీఠాధిపతి (పోప్) చేత ఈ ఉత్కృష్టమైన ఆధిపత్యాన్ని పొందాడు.

ఈ కరపత్రం తనకు క్రైస్తవమతంపట్ల విశ్వాసం అంతంత మాత్రమే అయినా, తన పదవీ భద్రతకు దానిని ఉపయోగించుకొన్న తీరూ, పోప్ యొక్క మతవ్యవస్థపై ఆధిపత్యాన్ని అంగీకరించడం ద్వారా, అతని సహకారాన్ని పొంది, అవసరాలకు తగిన విధంగా పరిస్థితులను మలుచుకున్న తీరు సంపూర్ణంగా విశదమౌతాయి.

## స్త్రీవిద్య :

పందొమ్మిదో శతాబ్ది ప్రారంభంలో స్త్రీజాతి సమానత్వాన్ని, విద్య ఆవశ్యకతను గూర్చి చెప్పుకోదగిన ఆలోచనలు, ఉద్యమాలు మొదలు కాకముందే, నెపోలియన్ స్త్రీలకు అవసరమైన విద్యను గూర్చి ఆలోచించాడు. అతని ఆలోచనలు "నేటి మహిళ" కు సంతృప్తికరం కాకపోయినా, నాటి సామాజిక వ్యవస్థలో సగటు మనిషి జీవనవిధానానికి, దానికి మూలమైన అతని ఆకాంక్షలకు అనువైనవి. నేటి మానవునివలె నాటి మానవుని ఆశలు ఆకాశం అందుకోవాలనికాక, ప్రశాంతమైన సమాజంలో ఒడిదుడుకులు లేని జీవితంలో కూడు, గూడు, గుడ్డలకు లోటు లేకుండ కాలం గడపడాన్ని, స్త్రీపురుషుల అన్యోన్య దాంపత్యాన్ని తమ జీవనవిధానంలోనే తమ పిల్లలను పెంచి పెద్దచేయాలని వాంఛించేవారు. అటువంటి జీవితానికి పునాది కుటుంబము, కుటుంబములోని వారికి ఒకరిపట్ల ఒకరికి ప్రేమాభిమానాలు, నెపోలియన్ అటువంటి కుటుంబవ్యవస్థతో, సుఖసంతృప్తులు కల జీవితాన్ని గడపడానికి సహకరించే విధంగా స్త్రీవిద్య ఉండాలని అభిప్రాయపడ్డాడు.

స్త్రీవిద్యకై నెపోలియన్ ప్రత్యేక పాఠశాలలను "ఈకూన్" (Eecouen) అనే వాటిని నెలకొల్పాడు. వాటిలో ప్రధానమైన పాఠ్యాంశం మతవిజ్ఞానం; దానిని సంపూర్ణమైన శ్రద్ధతో బోధించవలసింది, ఏ విధమైన సరళవైఖరికి అందులో తావులేదని ప్రకటించాడు. స్త్రీలు ఇల్లాలుగాను, తల్లిగాను తమ ధర్మాన్ని సక్రమంగా నెరవేర్చగలిగేది మతవిజ్ఞానం చేతనే, వారికి కావలసిన విజ్ఞానం మనం ఆలోచించేదిగా కాక, మనం విశ్వసించేదిగా ఉండాలి, అని అతడు భావించాడు. ఈ పాఠశాలల్లో చదివి బయటికి వచ్చే బాలికలు మోహింపజేసేవారు కాక, శీలవతులుగా రావాలి. వారు తమ సౌశీల్యము, ఉత్తమ గుణాలు, మెత్తని మనసు కలిగి ఆకర్షణీయంగా కావాలికాని తళుకుబెళుకులు, వాక్చాతుర్యం కలిగినందువల్ల కాదు.

మతవిజ్ఞానం తరువాత వారు నేర్వవలసింది ఫ్రెంచి భాషలో చదవడం, వ్రాయడం, ప్రాథమికమైన గణితము, కొద్దిగా చరిత్ర, భూగోళము, అంతేకాని లాటిన్‌భాష వారు నేర్వగూడదు, ఏ ఇతర విదేశీభాషలు వారికి బోధింపకూడదు. పై తరగతుల్లో వారికి కొంచెంగా వృక్షశాస్త్రం, భౌతికశాస్త్రం, పురాజీవశాస్త్రం (National History) ఇవైనా వారు పూర్తిగా అంధవిశ్వాసాల్లో కూరుకుపోకుండ, అవసరమైన విషయ పరిజ్ఞానం మాత్రం పొంది, వాదోపవాదాల్లో ప్రవేశించకుండ తగుమాత్రంగా బోధించాలి.

స్త్రీలు ఇంటిలో నిరంతరం తమపనిలో నిమగ్నులై ఉండాలి. అందుకు అవసరమైన కార్యనైపుణ్యం (Technical skills) వారికి ఇయ్యాలి. వారు తమకు, తమ ఇంట్లో వారికి దుస్తులు కుట్టడము, ఎంబ్రాయిడరీ చేయడము, పూర్తిగా స్త్రీల గృహకృత్యాలు. వారు ఈకూన్ వదలి, స్వంత ఇంటిలో భర్తతోను. పిల్లలతోను సుఖంగా కాలం గడపడానికి అనువైనవిధంగా వంటలు, వార్పులు, వారికి స్వల్పమైన అస్వస్థత ఏర్పడినపుడు ప్రథమచికిత్స చేయడం, తగినవిధంగా ఉపచారాలు (Nursing) చేయగల్గడము తెలిసిఉండాలి. తమ శరీరారోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైనంత వరకు, ఉత్సాహవంతంగా ఉండే నాట్యం, అలాగే కొద్దిగా సంగీతం నేర్చి ఉండాలి. ఇవి స్త్రీవిద్యపట్ల అతని ఆదర్శాలు. "అసలు స్త్రీవిద్య గూర్చి మనం తలబ్రద్దలు కొట్టుకోవలసిన పని లేదు కూడ. ఎందుకంటే వారి గమ్యం వివాహం, అందుకు అనువైన బోధన వారికి తల్లినుండే అధికాంశం లభిస్తుంది." అని కొన్ని సందర్భాల్లో నెపోలియన్ అనేవాడు.

అయితే ఈకూన్‌లను నిర్వహించడంలో నెపోలియన్ అనేక కఠినమైన నిబంధనలను ఏర్పరచాడు. వాటిలో వీలైనంతవరకు స్త్రీలనే నియమించి, ఎటువంటి పరిస్థితిలోనైనా, ఇతర పురుషులకు ప్రవేశం నిషేధించి, ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండ చేశాడు. పురుషులను, బాలికల తండ్రి, సోదరులైనా సావిడి (Parlow) లోనే కాని, అంతకంటెలోనికి ప్రవేశించకుండ కట్టడి చేశాడు. ఆ స్కూళ్ళలో అవివాహితలుగా వయసుమీరినవారు, బాదరబందీలేని వితంతువులు, అయిన స్త్రీలను నియమించి, వారు సర్వకాల సర్వావస్థల్లో అందలి విద్యార్థినులకు కనిపెట్టి ఉండేలా ఏర్పరచాడు.

నెపోలియన్ తలపెట్టిన ఈ పరిపాలనా సంస్కరణలు చాలావరకు అతడు ప్రథమకన్సూల్‌గా పరిపాలించే కాలంలోనే ప్రారంభించాడు. అయితే వాటిని మరిన్ని సంస్కరణలతో అభివృద్ధి పరచడమూ, కొన్నింటిని పూర్తిచేయడము అతడు చక్రవర్తిగా ప్రకటించుకున్న పిదప జరిగాయి. పోప్‌తో కంకార్డ్ (Concordat) ఒప్పందాన్ని 1802 లో చేసుకొన్నాడు, 1804 లో అతడు చక్రవర్తిగా ప్రకటించుకున్నప్పుడు పూర్వపు పవిత్రరోమన్ చక్రవర్తులవలె పోప్ సమక్షంలో పట్టాభిషేకం జరుపుకున్నాడు. విద్యాసంస్కరణలు అతని పరిపాలన ఆద్యంతం క్రమంగా అభివృద్ధిచేయబడినాయి. న్యాయసంస్కరణలను, న్యాయస్మృతులను తయారుచేయడం 1804 లో ప్రారంభమై 1810 లో పూర్తిఅయింది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలను, లలితకళలను ప్రోత్సహించి, అభివృద్ధి చేసేందుకు 1795 లో జాతీయసమితి నెలకొల్పిన ఫ్రెంచిసంస్థ (Institute of France) ను నెపోలియన్ విరివిగా ధనసహాయం చేసి అభివృద్ధి చేశాడు. అయితే అనేక రాజకీయ, సామాజిక శాస్త్రాల అధ్యయనాన్ని నెపోలియన్ తీవ్రంగా వ్యతిరేకించాడు. 1803 జనవరిలో ఒక చట్టాన్ని చేసి, దీని ప్రకారం వాటి బోధన, అధ్యయనాలను పూర్తిగా పాఠ్యాంశాలనుండి తొలగించాడు.

## 7.4. ప్రథమ కన్సూల్‌గా నెపోలియన్ విదేశాంగ విధానం : ద్వితీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి పరాజయం:

1799 లో నెపోలియన్ డైరెక్టరీని తొలగించి, కన్సులేట్ రాజ్యాంగవ్యవస్థను నిర్మించి, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొనే నాటికి ఫ్రెంచి గౌరవప్రతిష్ఠలు అంతర్జాతీయ రాజకీయాల్లో తిరిగి క్షీణదశకు దిగజారాయి. ఇటలీ, ఆస్ట్రియా దేశాలపై నెపోలియన్ సాధించిన యుద్ధ విజయాలు, 1799 లో ఫ్రెంచిరిపబ్లిక్‌ను పోలిన అధీన (dependent) రిపబ్లిక్‌ల స్థాపన - హాలెండులో బటావియన్ (Batavian) రిపబ్లిక్, స్విట్జర్లాండ్‌లో హెల్వెటిక్ (Helvetic) రిపబ్లిక్, ఉత్తర ఇటలీలో సిస్పడేన్ (Cispadane) రిపబ్లిక్‌ల స్థాపన ఫ్రెంచి గౌరవ ప్రతిష్ఠలను ఉచ్ఛస్థితికి చేర్చాయి. కాని మరుసటి సంవత్సరమే నెపోలియన్ గ్రేట్ బ్రిటన్‌ను ఓడించడానికి భారీసన్నాహాలతో బయలుదేరి, ఘోరవైఫల్యంతో ఇల్లు జేరడం జరిగింది. ఈ వైఫల్యంతో లోగడ నెపోలియన్‌చే ఓడి కాంపోఫోర్మియా సంధికి అంగీకరించిన ఆస్ట్రియా, దానిని గాలికి వదిలి, ఫ్రాన్సుపై తిరిగి యుద్ధం ప్రకటించింది. అంతేకాక రష్యాను పరిపాలించే జార్ మొదటిపాల్ (1796-1802) నుండి సైనికసాయం పొందడానికి ఒడంబడిక చేసుకొంది. పోప్‌రాజ్యాల (Popal states) పై దండెత్తి, పోప్‌ను ఓడించి తరిమివేయడము, అతని రాజ్యాలను రోమన్ రిపబ్లిక్‌గా ఏర్పరచడము ప్రక్కనున్న నేపిల్స్ (Naples) కు తీవ్రమైన ఆగ్రహాన్ని కలిగించింది. దీనితో ఫ్రాన్సుకు వ్యతిరేకంగా తిరిగి రెండవసారి ఐరోపారాజ్యాలు కొన్ని సంకీర్ణకూటమిగా ఏర్పడ్డాయి. ఈ ద్వితీయ ఐరోపారాజ్య సంకీర్ణ కూటమి (Second coalition of European Powers) లో ఆస్ట్రియా, రష్యా, నేపిల్స్ ప్రధానమైన సభ్యదేశాలు. ప్రథమ సంకీర్ణ కూటమిలో అజేయంగా నిల్చిన గ్రేట్ బ్రిటన్ ఈ ద్వితీయకూటమిని సమర్ధిస్తూ, ఆర్థిక సాయం చేయడానికి అంగీకరించింది.

మొదట్లో 1799 ప్రారంభంలో ఫ్రాన్సు నేపిల్స్‌పై దండెత్తి ఓడించింది; ఆ దేశాన్ని చిందరవందర చేసింది. ఫ్రెంచిసేనలు అక్కడి రాచరికవ్యవస్థను తొలగించి రిపబ్లిక్ నెలకొల్పారు, దానికి పార్థినోపియన్ (Parthenopean) రిపబ్లిక్ అని పేరుపెట్టారు. కాని అదే సమయాన ఆస్ట్రియాకు సాయంగా జార్ మొదటి పాల్ (రష్యా) పంపిన సేన ఆస్ట్రియా సేనలను కలుపుకొని, లోగడ ఫ్రాన్సు వశమైన ఉత్తర ఇటలీపై దండెత్తింది. ఆ సేనలు ఉత్తర ఇటలీలో లోగడ నెపోలియన్ నెలకొల్పిన సిసాల్పైన్ (Cis-Alpine) రిపబ్లిక్‌ను నిర్మూలించి, మిలాన్ నగరాన్ని వశపరుచుకున్నాయి. ఈ దండయాత్రలను ఎదిరించడానికి ఫ్రాన్స్ నేపిల్స్, పోప్

రాజ్యాలపై దండెత్తిన సేనలను ఉపసంహరించింది, కాని, ఆస్ట్రో - రష్యన్ సేనలచేత అవి నోవి (Novi) వద్ద ఘోరంగా ఓడిపోయాయి. అయితే ఫ్రెంచిసేనలు లిగూరియన్ రిపబ్లిక్ (జినోవా) కు చేరి తిరిగి దండయాత్రకు సన్నాహాలు చేయసాగాయి. ఆ సమయంలో క్రమంగా ఆస్ట్రియా, రష్యాల నడుమ విభేదాలు ఏర్పడసాగాయి. రష్యాసేనల విజయం ఆస్ట్రియాకు కలవరం కలిగించింది; ఆస్ట్రియా తగిన విధంగా సహకరించడం లేదని రష్యా ఆగ్రహించింది. ఆ సమయంలో ఫ్రెంచిసేనాని మసేనా (Massena) రష్యా సేనలను స్విట్జర్లాండులోని జూరిక్ వద్ద ఓడించడంతో జార్ మొదటిపాల్ సంకీర్ణరాజ్యకూటమి నుండి విరమించుకున్నాడు.

మొత్తం మీద ఫ్రాన్సు 1799 లో విజయాలకంటె పరాజయాలనే చవిచూచింది. ఆస్ట్రియా, రష్యాల నడుమ విభేదాలు తలెత్తకపోయినట్లైతే ఫ్రెంచిసేనలు ధ్వంసమై ఉండేవి. ఈ పరాజయాలనే నెపోలియన్ తనకు అనువుగా మలుచుకొని, డైరెక్టరీ అసమర్థతవలన తాను సాధించిన విజయాలు నిష్ఫలం అయినాయని, తాను ఈజిప్టుపై దండెత్తినప్పుడు సకాలంలో తగిన సాయం పంపలేక పోయినందున నిస్సహాయంగా తిరిగి రావలసివచ్చిందని ఆరోపించాడు; తిరుగుబాటుచేసి డైరెక్టరీ పరిపాలనను తొలగించాడు.

## 7.4.1. నెపోలియన్ రెండవ ఇటలీ దండయాత్ర :

1799 నవంబర్‌లో ప్రథమ కన్సూల్‌గా పదవీస్వీకారం చేసిన తరువాత 1800 సంవత్సరంలో నెపోలియన్ ఇటలీలోని ఆస్ట్రియన్ భూభాగాలపై స్వయంగా దండెత్తి, మోరో నాయకత్వంలో మరొక సేనను డాన్యూబ్ నదీమైదానంపై ఆస్ట్రియా రాజ్యంలో చేరిన జర్మన్ భూభాగాలపై దండయాత్ర పంపాడు. అనగా ఆస్ట్రియాను రెండువైపుల నుండి దాడిచేయడంతో తన సైన్యాన్ని ఏ ఒక్క యుద్ధరంగంలో కేంద్రీకరించలేక పోయింది. నెపోలియన్ సెంట్ బెర్నార్డ్ వద్ద ఆల్ప్సు పర్వతాలను దాటి మిలాన్ రాజ్యంలో ప్రవేశించాడు. అప్పటికి ఉత్తర ఇటలీలో ఉన్న ఫ్రెంచిసేనాని మస్సేనా ఆస్ట్రియాసేనల దిగ్బంధంలో చిక్కుకొని, ఆహారపదార్థాలను సంపాదించుకోవడం కష్టమై, శత్రువులకు లొబడే స్థితిలో ఉన్నాడు. అటువంటి సమయంలో నెపోలియన్ మారెంగో (Marengo) వద్ద ఆస్ట్రియన్‌లను ఘోరంగా ఓడించి, పైడ్మాంట్ (Piedmont) రాజ్యాన్ని ఆక్రమించి, సిసాల్పైన్ రిపబ్లిక్‌ను పునరుద్ధరించి, ఆస్ట్రియన్‌లను ఉత్తర ఇటలీనుండి తరిమివేశాడు.

ఉత్తర ఇటలీని ఆక్రమించిన తరువాత ఫ్రెంచిసేనలు తిరిగి దక్షిణ ఇటలీ, లేదా ఇటలీ ద్వీపకల్పంపై దండెత్తాయి; నేపిల్స్‌ను ఓడించి పార్థినోపియన్ రిపబ్లిక్‌ను పునరుద్ధరించాయి. ఆస్ట్రియా ఈ విధమైన ఫ్రెంచి విజయాలతో మరొకసారి భయభ్రాంతమై 1801 లో లూనెవిల్లా సంధి చేసుకొంది. ఇంచుమించుగా కాంఫోఫోర్మియా సంధిలో అంగీకరించిన షరతులను తిరిగి అంగీకరిస్తూ - ఫ్రెంచి భూభాగం రైన్ నదీ పర్యంతంగా తూర్పుదిశగా విస్తరించడము, అక్కడి జర్మన్ ప్రభువులను సామ్రాజ్యంలో (అప్పటి ఆస్ట్రియా పవిత్ర రోమన్ సామ్రాజ్యం యొక్క అవశేషం, ఆ సామ్రాజ్యం వందలాది చిన్న చిన్న రాజ్యాలు, డచ్చీ (Duchies), లుగా విభక్తమైపోగా, వాటిలో పెద్దవి ఆస్ట్రియా, ప్రష్యాలు; కాని సామ్రాజ్యము, చక్రవర్తి అన్నపదాలు అప్పటివరకు ఆస్ట్రియా రాజ్యానికి, ఆ రాజ్యాన్ని పరిపాలించే హప్స్‌బర్గ్ రాజవంశీయునికి మాత్రమే పరిమితమైనవి) వేరే చోట్ల ఎస్టేట్లను ఇచ్చి పరిహారం చెల్లించడానికి అంగీకరించడం జరిగింది. ఈ విధంగా ద్వితీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి కూడ నెపోలియన్ ధాటికి నిలువలేక విచ్ఛిన్నమైంది, కాని గ్రేట్ బ్రిటన్ మాత్రం అలాగే అజేయంగా నిలిచిఉంది.

గ్రేట్ బ్రిటన్ ఆ సమయంలో కొంత అంతర్జాతీయంగా రాజకీయ ఒత్తిళ్ళకు గురవుతున్నది. రష్యా మధ్యధరాసముద్రంపై కొంత పట్టు సాధించాలని, ఖండాంతర వాణిజ్యంలో పాల్గొనాలని ఆలోచిస్తూ, మాల్టా ద్వీపాన్ని 1800 సెప్టెంబర్‌లో గ్రేట్ బ్రిటన్ ఆక్రమించడం పట్ల అసంతృప్తి చెందిఉన్నాడు. నెపోలియన్ ఈజిప్టు దండయాత్ర సందర్భంలో బ్రిటిష్ నౌకాదళాధిపతి ఎడ్మిరల్ నెల్సన్ ఈ ద్వీపాన్ని ఆక్రమించడం పైన ప్రస్తావించడం జరిగింది. తరువాత బ్రిటన్ ఆ ద్వీపంపై తన పట్టును పదిలపరుచుకొంది, అది రష్యాకు రుచించలేదు. అలాగే బ్రిటన్, ఫ్రెంచిరేవులను దిగ్బంధం చేసి తటస్థదేశాల నౌకలను నిరోధించడం ఉత్తర ఐరోపా

రాజ్యాలకు క్రోధ కారణమైంది. ఈ తటస్థదేశాలు ఫ్రెంచి రేవుపట్టణాల గుండా గోధుమ, కలప, ఇంకా అనేక ఇతర వస్తువులను దొంగచాటుగా దిగుమతిచేసి లాభం గడిస్తున్నారు. బ్రిటిష్‌వారి చర్య వారి ప్రయోజనాలను దెబ్బతీసింది. ఉత్తర ఐరోపాలోని రష్యా, ప్రష్యా, స్వీడన్, డెన్మార్క్ ప్రధానంగా ఈ దెబ్బతిన్న దేశాలు, అవి ఒక కూటమిగా చేరి ఉత్తరసమాఖ్య (Northern Legue) అనే పేరుతో బ్రిటన్‌పై యుద్ధానికి దిగాయి. ఈ పరిస్థితి కొంతవరకు నెపోలియన్ రేవుపట్టణం, కోపెన్‌హాగెన్ (Copenhagen) ను, అక్కడి డేనిష్ నౌకాబలాన్ని ధ్వంసం చేసింది. ఆ సమయంలోనే రష్యా జార్ మొదటిపాల్ హత్యగావించబడ్డాడు, రష్యా కూటమినుండి వైదొలగింది; ఉత్తరసమాఖ్య విచ్ఛిన్నం అయింది.

## 7.4.2. నెపోలియన్ గ్రేట్ బ్రిటన్‌తో సంఘర్షణ :

1801 నాటికి తన చిక్కుల్లో నుండి గ్రేట్ బ్రిటన్ బయటపడగలగడంతో ఫ్రాన్స్-బ్రిటన్ ప్రత్యక్ష సంఘర్షణ అనివార్యంగా కానవచ్చింది. ఈ రెండు దేశాల్లో ఫ్రాన్సు నేలమీద, బ్రిటన్ సముద్రం మీద ప్రాబల్యం కలిగినవి కావడాన, వారి సంఘర్షణ ఏ రూపంలో జరుగుతుందో స్పష్టపడలేదు. అందుచేత సంఘర్షణ నివారించి, సయోధ్యకు ప్రయత్నించడం పట్ల ఉభయదేశాలు గణనీయమైన ఆసక్తి కలిగిఉన్నాయి. అదృష్టవశాన, వారిరువురిమధ్య సంప్రదింపులు సఫలమై 1802 లో ఎమియన్స్ సంధి (Peace of Amiens) కుదిరింది. గ్రేట్ బ్రిటన్ ఈ సంధి చేసుకొని యుద్ధాన్ని నివారించడం, నిస్సందేహంగా నెపోలియన్ పట్ల వారికి గల భయసంశయాలే కారణమని చెప్పవచ్చు, కాగా ఈ సంధి నెపోలియన్ సైనిక విజయాలకు, వ్యక్తిగతమైన అధిగమనానికి (rising up) చిహ్నం.

## 7.4.3. ఎమియన్స్ సంధి (Peace of Amiens) :

ఈ సంధి వలన గ్రేట్ బ్రిటన్ ఫ్రెంచి వారినుండి లోగడ ఆక్రమించిన పశ్చిమ ఇండియాదీవులను తిరిగి అప్పగించడానికి, డచ్చివారినుండి ఆక్రమించిన గుడ్‌హోప్ అగ్రంవద్ద వారి వలసను కూడ తిరిగి ఇచ్చివేయడానికి అంగీకరించింది. ఈ విధంగా ఫ్రాన్సు, దాని మిత్రరాజ్యం (హెల్వెటిక్ రిపబ్లిక్) అయిన హాలెండు తమ ఖండాంతర వలసలలోని కొన్నింటిని తిరిగి పొందగలిగాయి. తద్వారా, వారి పారిశ్రామిక పురోగతికి, ఖండాంతర వాణిజ్యానికి మరింత అవకాశం చేకూరినట్లయింది. అయితే డచ్చివారి నుండి ఆక్రమించిన సింహళ ద్వీపాన్ని మాత్రం ఆంగ్లేయులు వదిలి పెట్టలేదు.

గ్రేట్ బ్రిటన్ మాల్టా ద్వీపాన్ని పూర్వపు పరిపాలకులకు నైట్స్ ఆఫ్ సెంట్ జాన్ (Knights of St. John) లకు వదిలివేయడానికి అంగీకరించింది. దీనివలన రష్యా దేశానికి కొంత సంతృప్తి కలిగి, తక్షణ సంఘర్షణను నివారించడం జరిగింది. దీనివలన మధ్యధరాసముద్రంలో తిరిగి ఫ్రెంచి నౌకాబలం తన పూర్వపు ప్రాబల్యాన్ని పొందింది, ఫ్రెంచి రేవుపట్టణాలపై బ్రిటిష్ నౌకాదిగ్బంధం నివారించడం జరిగింది.

ఫ్రాన్సు నేపిల్స్ నుండి, పోప్ రాజ్యాలనుండి సేనలను ఉపసంహరించడానికి అంగీకరించింది. అలాగే తురుష్క సామ్రాజ్యానికి చెందిన ఈజిప్టు నుండి తన సేనలను ఉపసంహరించింది.

ఈ సంధిలో నెపోలియన్ ఈజిప్టును మాత్రమే వదిలివేశాడు, అక్కడ ఫ్రెంచి ప్రాబల్యం వాస్తవంగా ఏమీలేదు. కాని బ్రిటన్ అనేక ముఖ్యమైన ఆక్రమణలను, వలస భూభాగాలను వదిలివేసి, ఎక్కువ నష్టపోయింది. పైగా 1793 లో ప్రథమ ఐరోపా బలవంతులను చేశాయి. కొన్ని ఉన్నతాదర్శాలు, ఆశయ సాధనలకై పోరాడుతున్నామనే ఉత్సాహం, ఉద్వేగం వారిని పురికొల్పి, లోటుపాట్లను గూర్చి అసంతృప్తి చెందడం కాక, పరిస్థితికి ఎదురీదే మనోనిబ్బరము, ఆత్మవిశ్వాసము కలిగించాయి. వాటికితోడు నెపోలియన్ నాయకత్వం వారిని క్రమశిక్షణాయుతులుగా, త్యాగశీలురుగా తీర్చిదిద్దింది. తమ విజయాలతో వారు దేశంలోని రిపబ్లిక్ వ్యవస్థలను పరిపుష్టం చేసుకొని, వాటిని పరిసర ఐరోపా దేశాల్లోకి విస్తరింపజేశారు. ఫ్రెంచివిప్లవంలోని ఉదారభావాల

విజయం, అప్పటివరకు ఐరోపా రాజ్యవ్యవస్థలనున్న ఉదారనియంతృత్వం (Benevolent Despotism) క్రమంగా బలహీనపడసాగింది; దీని స్థానంలో రాజ్యాంగబద్ధ రాచరికాలు, రిపబ్లిక్ వ్యవస్థలు ఏర్పడసాగాయి. ఈవిధంగా రిపబ్లికన్ భావాలకు, వ్యవస్థలకు కూడ ఫ్రెంచి రాజకీయాల అభివృద్ధి పరిణామక్రియల్లో ఎమియన్స్ సంధి ఉచ్ఛదశ స్థితిని సూచిస్తుంది.

రాజ్యసంకీర్ణ కూటమిని ఏర్పరచి, గ్రేట్ బ్రిటన్ ఫ్రాన్సుపై యుద్ధం ప్రకటించిన మౌలిక కారణం విప్లవవాదులు ఐరోపా రాజకీయ పరిస్థితులను తారుమారు చేయకుండా అరికట్టి, యథాతథస్థితిని కాపాడడం. డాంటన్ ఫ్రెంచి రిపబ్లిక్ సహజ సరిహద్దులను ప్రకటించడమూ, విప్లవసేనలు ఆస్ట్రియా అధీనంలోని బెల్జియమ్, ఉత్తర ఇటలీలను, ప్రష్యా అధీనంలోని రైన్ నదీమైదానాన్ని, హాలెండు దేశాన్ని ఆక్రమించడమూ జరిగాయి. ఈ విధంగా ఐరోపారాజ్యవ్యవస్థలు, వాటి సరిహద్దులు తారుమారైనాయి. దీనిని అరికట్టడం బ్రిటిష్ వారి ఉద్దేశం. కాగా, ఎమియన్స్ సంధి వారు ఫ్రెంచి అధిగమనాన్ని, నెపోలియన్ ప్రాబల్యాన్ని అరికట్టలేకపోవడం అంగీకరించినట్లయింది. ఫ్రాన్సు నెలకొల్పిన అనేక అధీన (Subordinate) రిపబ్లికన్‌లను, వారు రైన్ నదీమైదానాన్ని ఆక్రమించడమూ బ్రిటన్ ఆమోదించవలసివచ్చింది. ఈ విధంగా ఎమియన్స్ సంధి నెపోలియన్ అధిగమనం, అతని యుద్ధవిజయాలు అధికార ప్రాభవాలు ఉచ్ఛస్థితికి చేరడాన్ని సూచిస్తుంది.

ఫ్రాన్సుదేశ చరిత్రలో కూడ ఇటువంటి అధిగమనాన్ని, ఎమియన్స్ సంధి సూచిస్తుంది. విప్లవచరిత్రలో, ఫ్రెంచివారు విదేశీరాజ్య కూటములను ఎదిరించి పోరాడవలసిన తొలిరోజుల్లో దేశం అల్లకల్లోలమై, అంతర్గత రాజకీయాలు వివిధ వర్గాల నడుమ పోరాటాలు, మారణహోమాలు తెచ్చిపెట్టడమూ, ఆర్థికంగా దివాలా స్థితిలో ఉండడమూ పైన వివరించడం జరిగింది. ఈ రాజకీయ కల్లోలంలో సైన్యం క్రమశిక్షణ లోపించి, సరైన దుస్తులు, ఆయుధసామాగ్రి లేని దుస్థితిలో ఉంది. ఐరోపారాజ్యాల సంకీర్ణకూటమిసేనలు సుశిక్షితులై, ఫ్రెంచి సేనలను స్వల్పకాలంలో విధ్వంసం చేయగలరని తోచింది. కాని ఫ్రెంచిప్రజల్లోను, సేనలోను క్రమంగా ఏర్పడిన జాతీయతాభావము, దేశభక్తి వారిని అపారమైన సైనికశక్తిగా తయారుచేశాయి.

## 7.5. చక్రవర్తిగా నెపోలియన్ : మొదటి ఫ్రెంచి సామ్రాజ్యం :

1799 లో డైరెక్టరీని తొలగించి అధికారం చేజిక్కించుకున్న నెపోలియన్ 1802 లో జీవితకాలం ప్రథమకన్సూల్‌గా నియమించబడినట్లు శాసనసభలో చట్టం ఆమోదింపజేశాడు. ప్రభుత్వాధికారం యావత్తు ప్రథమకన్సూల్ చేత కేంద్రీకృతమైనా, అతడి పరిపాలన స్వయంపరిపాలనా విధానం (Autocracy) అయినా, రాచరికానికి దీనికి ఏమీ తేడా లేకపోయినా, పేరుకు మాత్రం రిపబ్లిక్‌గానే చెల్లుబడి అయింది. 1804 లో నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకున్నా, 1809 వరకు ఫ్రాన్సు రిపబ్లిక్‌గానే వ్యవహారింపబడింది. 1802 లో గ్రేట్ బ్రిటన్‌తో ఎమియన్స్ సంధి జరిగినా, కేవలం పదమూడు నెలల వ్యవధిలో 1803 లో తిరిగి ఆ రెండు దేశాల నడుమ యుద్ధ వాతావరణం నెలకొని, నెపోలియన్ వంటి కార్యదక్షుడు, పరిపాలనావేత్త, సేనానాయకుడు ఫ్రాన్సుకు అవసరమైన పరిస్థితి కలిగించింది. కనుక అతడు జీవితపర్యంతం ప్రథమకన్సూల్‌గా నియామకం పొందడమూ, తనే సర్వస్వంగా పరిపాలనాధికారాలు చెలాయించడము ప్రజలకు అభ్యంతరంగా తోచలేదు. రాచరికవాదులు ఊరుపేరు లేని నెపోలియన్ సర్వాధిపత్యం చెలాయించడం సహించక, రాజ్యాధిపత్యం బోర్బన్లదేనని ఆందోళన చేయసాగారు. అటువంటి పరిస్థితిలోనే పోప్‌తో కంకార్డ్ ఒప్పందం చేసుకొని, నెపోలియన్ తన పదవిని భద్రంగా నిలుపుకోగలిగినట్లు పైన వివరించడం జరిగింది. నామమాత్రంగా రిపబ్లిక్‌గా వ్యవహరిస్తూ, సర్వాధికారాలు ఒక వ్యక్తిచేత కేంద్రీకృతంకావడం తీవ్రవాదులైన రిపబ్లికన్లకు దుస్సహం అయింది. వారి కుట్రలను భగ్నంచేసి 130 మంది ప్రసిద్ధులైన జాకొబిన్ నాయకులకు నెపోలియన్ దేశ బహిష్కారశిక్ష విధించాడు. పరిస్థితి పూర్తిగా నెపోలియన్ అదుపులో ఉంది. అతనికి ప్రజాసామాన్యం నుండి అపారమైన సమర్థన ఉంది, కనుక తీవ్రవాదులైన రాచరికవాదులను, రిపబ్లికన్‌లను అణచివేయడానికి ఎటువంటి ప్రతిఘటనా ఎదురుకాలేదు. కనుక 1804, మే 18 న సెనెట్ చేత "రిపబ్లిక్ ప్రభుత్వాన్ని చక్రవర్తి అధీనంలో ఉంచడమైన" దని తీర్మానాన్ని ఆమోదింపజేసి, నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు.

దీనితో ఫ్రాన్సులో మొదటి రిపబ్లిక్ (రెండుదశల్లో, ఒకటి డైరెక్టరీ, రెండవది కన్సులేట్) పూర్తిగా అంతమైంది. ఈ పరిణామాన్ని కెటిల్‌బై అనే ప్రసిద్ధ చరిత్రకారుడు, "విప్లవాన్ని రక్షించడానికి నెపోలియన్ మొదటి రిపబ్లిక్‌ను అంతంచేశాడు", దీనిని ప్రజలు ఆమోదించారు, అని చమత్కరించి వ్యాఖ్యానించాడు. సెనెట్ తీర్మానాన్ని ప్రజామోదానికి (Plebiscite) పెట్టగా 35,72,329 వోట్లు అనుకూలంగాను, 2,569 వోట్లు ప్రతికూలంగాను పడినాయి. నెపోలియన్ "ఫ్రెంచి చక్రవర్తి" (The Emperor of the French) గా వ్యవహరించుకొంటూ క్రొత్త పదవీ బాధ్యతలు చేపట్టాడు. అనేకులైన నెపోలియన్ సహచరులను ఈ పరిణామం సహించలేదని సులువుగా గ్రహించవచ్చు. ఒక ఉన్నతాధికారి, "అతడు నెపోలియన్, కాని చక్రవర్తి అయాడు" అని వ్యాఖ్యానించడం దీనిని సూచిస్తుంది. అయితే ఉద్యోగుల్లోని అసంతృప్తులను, ఈర్ష్యాద్వేషాలను సులువుగా పసికట్టి తగిన ప్రతిక్రియ చేయగల శక్తియుక్తులు కలవాడు, కనుక నెపోలియన్‌కు దేశం లోపల ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాలేదు.

అయితే, ఫ్రాన్సు వెలుపలి ఐరోపాలో అనేక రాజ్యాధిపతులకు ఈ పరిణామం మ్రింగుడు పడలేదు. ఆ కాలంలో, మధ్యయుగాలనాటి పవిత్రరోమన్ సామ్రాజ్యానికి వారసులైనట్లు భావించుకొంటూ, ఇతర ఐరోపారాజ్యాల గుర్తింపును కూడ పొంది, చక్రవర్తి బిరుదాన్ని ధరించేవాడు, ఆస్ట్రియా ఆర్చిడ్యూక్ మాత్రమే. కనుక ఆస్ట్రియాను పరిపాలించే రెండవ ఫ్రాన్సిస్ నెపోలియన్ చక్రవర్తిగా వ్యవహరించుకోవడాన్ని అంగీకరించలేకపోయాడు. అలాగే రష్యాను పరిపాలించే మొదటి అలెగ్జాండర్ కూడ ఈ పరిణామాన్ని సహించలేకపోయాడు. రష్యా చక్రవర్తులు ధరించే "జార్" (Tsar or Czar) బిరుదం సీజర్ (Caesar) అనే పదంలోనుండి పుట్టింది, సీజర్, అన్నా జార్ అన్నా చక్రవర్తి అనే అర్థం. వంశానుగతమైన రాజ్యాధికారంతో ఉన్నతమైన రాజవంశాలకు చెందిన తమవలెనే నెపోలియన్ వంటి సాధారణ వంశీయుడు చక్రవర్తిగా ప్రకటించుకోవడం వారికి దుస్సహం అయింది. అయితే వారి అభ్యంతరాలు చాలావరకు వ్యక్తిగతమైనవి.

పైన వివరించినట్లు కంకార్డ్ ఒప్పందం వలన ఫ్రాన్సులోని రాచరికవాదులను ఒప్పించి, పోప్ యొక్క గుర్తింపును పొందడంచేత నెపోలియన్ చక్రవర్తిత్వానికి సాంప్రదాయికమైన (Conventional) అభ్యంతరాలు లేకుండా జాగ్రత్తపడ్డాడు. అతని పట్టాభిషేక సమయంలో పోప్ అక్కడి సభలో హాజరైనాడు. కాని వెనుకటి పవిత్రరోమన్ చక్రవర్తులవలె కిరీటాన్ని పోప్ అతని తలపై ఉంచలేదు; తనే, స్వయంగా తలపై అలంకరించుకున్నాడు. చక్రవర్తిత్వాన్ని తానే, స్వయంగా స్వశక్తితో సంపాదించుకున్నట్లు, ఎవరి దయాదాక్షిణ్యాల వలనకాని, కేవలం సాంప్రదాయిక విధానాల వలనకాని, కాదని స్పష్టపరచడం నెపోలియన్ ఉద్దేశం కావచ్చు. "ఫ్రెంచి రాజమకుటం దుమ్ములోపడి దొర్లడం చూచాను; దీనిని నా ఖడ్గంతో ఎత్తి తలపై ధరించాను" (I found the French crown rolling in the dust; I picked it up with my sword) అని నెపోలియన్ తరచు అనేవాడు.

### 7.5.1. చక్రవర్తిగా నెపోలియన్ పరిపాలన :

దేశీయాంగ పరిపాలనలో (Internal Administration) నెపోలియన్ తన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుజరపడం ప్రథమ కన్సూల్‌గానే ప్రారంభించాడు. కాకుంటే, దీర్ఘకాలికమైన కొన్ని విధానాలు ఉదాహరణకు జాతీయవిద్యావిధానం వంటివి, ఆనాటినుండి క్రమంగా అనేక పరి ల్లో అభివృద్ధి చెందుతూ, అతని చక్రవర్తిత్వ పాలనాకాలంలో కూడ కొనసాగాయి. అయితే, న్యాయ నిబంధనల ూపొందించే కార్యక్రమం మాత్ర 1804 లో అతడు చక్రవర్తిగా ప్రకటించుకున్న తరువాతనే ప్రారంభించాడు. ఆ కార్యక్రమం 1810 లో సంపూర్తి అయింది.

కాగా చక్రవర్తిగా ప్రకటించుకున్న తరువాత నెపోలియన్ తన హోదాను, ఔన్నత్యానికి తగిన ఆడంబరాలపై అభిమానం పెంచుకున్నాడు. కనుక ఆ సమయంలో దేశాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాల కంటే తన ఔన్నత్యాన్ని ప్రదర్శించే కార్యక్రమాలు అధికమైనాయి. అయితే ఈ విషయంలో అతన్ని తప్పుపట్టవలసిన అవసరం అంతగా కనిపించదు. దేశ ఆర్థికాభివృద్ధికి, విద్యావ్యాప్తికి, పరిపాలనా పటిష్ఠతకు, జాతీయ సుసంఘటనకు, అన్నిటికి ఆవశ్యకమైన కార్యక్రమాలను మునుపే చేపట్టి వాటిని

**కొంతవరకు**, శక్తివంచన లేకుండా నెరవేర్చాడు. కనుక ఆడంబరాలకులోనై రాజ్యపరిపాలనను, ప్రజాసంక్షేమాన్ని విస్మరించాడని **చెప్పలేము**. అంతేకాక చక్రవర్తిగా ప్రకటించుకున్నప్పుడు అటువంటి ఉన్నతస్థితిని తగిన విధంగా ఆడంబరాలు ప్రదర్శించడమూ **సహజమే**.

అనేక విషయాల్లో నెపోలియన్ తన సామ్రాజ్యం పురాతనకాలంనాటి రోమన్ సామ్రాజ్యానికి తగిన వారసులుగా ప్రఖ్యాతి చెందాలని కోరుకున్నాడు. రెండూ రిపబ్లికన్ వ్యవస్థలనుండి ఉత్పన్నమైనవే; రెండూ బహుకాలం రిపబ్లిక్ పదాన్ని కూడా ఉపయోగించినవే. పురాతన రోమన్ సామ్రాజ్యం వలె, మధ్యయుగాలనాటి పవిత్ర రోమన్ సామ్రాజ్యం వలె నెపోలియన్ సామ్రాజ్యం కూడ ఐరోపాలో చాలమేర విస్తరించింది. అనేక రాజ్యాలను లోబరచుకొని సామంతరాజులపై ఆధిపత్యం చలాయించినవే. పవిత్రరోమన్ సామ్రాజ్య స్థాపకుడైన చార్లిమాగ్నీ (Charlemagne) కాలం నుండి పవిత్ర రోమన్ చక్రవర్తులందరు పోప్ చేత మకుటధారణ చేయించుకున్నవారు, అలాగే నెపోలియన్ రాజ్యాభిషేక సమయాన పోప్ అక్కడ హాజరైనాడు. అలాగే చార్లిమాగ్నీ కాలంనుండి పవిత్ర రోమన్ చక్రవర్తులు "రోమన్‌ల రాజు" (King of Romans) అని బిరుదు ధరించారు; కాగా నెపోలియన్ తన కుమారునికి (1811 లో ఆస్ట్రియా రాకుమార్తె మేరీ లూసీకి జన్మించినవాడు) "రోమ్‌రాజు" ని బిరుదు ప్రధానం చేశాడు. అనేక శతాబ్దాల కాలం రోమన్ సామ్రాజ్యం తూర్పు విభాగము, పశ్చిమ విభాగాలుగా ఏర్పడింది; అలాగే నెపోలియన్ ఐరోపాను తూర్పు, పడమర విభాగాలుగా, తూర్పుభాగం జార్‌కు, పశ్చిమ భాగం తన వంశీయుల పాలనలో ఉండాలని భావించినట్లు టిల్సిట్ సంధి (Treaty of Tilsit) వలన తెలియవస్తుంది. అన్నిటికంటె ప్రధానమైనది, తాను రాజవంశంలో జన్మించకపోయినా, తన సంతతివారు రాజవంశీయులు కావాలని వాంఛించడం, తన వలెనే జోసెఫిన్ సాధారణ కుటుంబానికి చెందినదే, రాజవంశీయురాలు కాదు. కనుక తమ సంతానానికి రాజవంశీయులుగా గౌరవమర్యాదలు లభించవు. తానొక రాజవంశీయురాలుని వివాహం చేసుకోవడం వల్ల అది సాధ్యమౌతుంది; తన సంతతి కనీసం తల్లి వైపు నుండి రాజవంశీయులు కాగలరని నెపోలియన్ భావించాడు. అందుకై అతడు 1810 లో జోసెఫిన్‌కు విడాకులిచ్చి ఆస్ట్రియా రాకుమార్తె, మొదటి ఫ్రాన్సిస్ కుమార్తె అయిన మేరీ లూసీని వివాహం చేసుకున్నాడు.

## 7.5.2. చక్రవర్తిత్వమైన ఆడంబరాలు :

పై వివరణవలన చక్రవర్తిగా ప్రకటించుకొన్న తరువాత నెపోలియన్ ఆలోచనల్లో సంభవించిన మార్పులు స్పష్టం అవుతాయి. తన ఆలోచనలకు అనుగుణంగా ఫ్రెంచి ప్రభుత్వం తక్కువ రాజ్యాధినేతల దృష్టిలో సమున్నతమైన వైభవంతో కనిపించాలని నెపోలియన్ భావించాడు. స్వేచ్ఛ రిపబ్లిక్ వ్యవస్థకు మూలాధారమైతే వైభవం చక్రవర్తిత్వానికి మూలాధారం.

సమకాలీనమైన రాచరికవ్యవస్థలో వలె రాజ్యాధినేత, చక్రవర్తి అయిన తను రాజ దర్బారులో ఉన్నతాధికారులు, ప్రభువులు మొదలైవారు పరివేష్టించి ఉండడాన్ని నెపోలియన్ కోరుకున్నాడు. సాధారణ ప్రజానీకం ఎన్నుకొన్న ప్రతినిధులు, సాధారణ ప్రజానీకం నుండే వచ్చి, స్వల్ప కాలపరిమితి కలిగిన అధికార హోదాలు కలిగినవారు. అటువంటి వారి నడుమ చక్రవర్తి గౌరవ ప్రతిష్టలు ఘనంగా ఉండవు. తరతరాలుగా ఆధిపత్యం, ఐశ్వర్యం కలిగిన ప్రభువర్గాలు రాజసభకు వన్నెతెస్తాయి. కనుక ప్రభువర్గాన్ని నిర్మూలించిన దేశంలో ఒక క్రొత్త ప్రభువర్గాన్ని తయారుచేయడానికి నెపోలియన్ సంకల్పించాడు. అయితే వారు కేవలం జన్మచేతకాక, సామర్థ్యము, దేశానికి, చక్రవర్తికి చేసిన సేవ ప్రాతిపదికగా ప్రభుత్వ సన్మానం పొంది,ఈ ఉన్నతవర్గాలలోనికి ప్రవేశించినవారు. ధైర్యసాహసాలకు, దేశభక్తి, ప్రభుభక్తి కలిగిన సైనికులు, సైనికాధికారులకు మార్షల్ హోదాలను ఇయ్యడం, పౌర పరిపాలనలోగాని, సైనిక సేవలోగాని గణనీయమైన సేవచేసినవారికి ఈ ప్రభుత్వ సన్మానం లభిస్తుంది. ఈ సన్మానాన్ని లీజియన్ ఆఫ్ ఆనర్ (Legion of honour) అని పిలిచేవారు. మొదట్లో అధికారులను అవినీతికి, అసమర్థతకు లోనుకాకుండ కర్తవ్య పరాయణులుగా ప్రోత్సహించడానికి ఈ విధానాన్ని కన్సులేట్ కాలంలోనే ప్రవేశపెట్టడం జరిగింది. తరువాత అదే విధానాన్ని

కొనసాగిస్తూ, నెపోలియన్ అటువంటి ప్రోత్సాహక సన్మానాలు పొందినవారికి ప్రత్యేక గౌరవాభిమానాలతో ఉన్నతవర్గం ఏర్పడే అవకాశం కలిగించారు.

రాజదర్బారులో పాటించవలసిన క్రమశిక్షణ, మర్యాదలు కూడ విప్లవకాలంలో పూర్తిగా అంతరించినవి. నెపోలియన్ తిరిగి ప్రారంభించాడు. చక్రవర్తి ఎదురుగా నిలిచి, అభివాదం చేయడం, వినయంగా మాట్లాడడం వంటి విషయాలనుంచి, అన్ని విషయాల్లోను సాంప్రదాయిక విధానాలతో కూడిన పద్ధతులు ప్రవేశపెట్టడం జరిగింది.

## 7.5.3 రోమన్ కాథలిక్ మతవ్యవస్థతో సంఘర్షణ :

పోప్‌తో కంకార్డ్‌ఒప్పందాన్ని చేసుకొని, దేశంలో రోమన్ కాథలిక్ ప్రజానీకం నుండి సమర్థన సంపాదించినా, నెపోలియన్ స్వాతిశయము, అహంకార ధోరణుల వలన, పోప్‌తో తిరిగి విభేదాలు తలెత్తాయి. నెపోలియన్ రాజ్యాభిషేకసమయంలో తగిన స్థానం, గౌరవమర్యాదలు ఇయ్యలేదని పోప్ ఆగ్రహించాడు. నెపోలియన్ మతవ్యవస్థ నిర్వహణకై చేసిన అనేక చర్యలను పోప్, ఏడవ పయస్, తప్పుపట్టి నిరసించాడు, మతవ్యవస్థకు గల హక్కులు, ప్రత్యేకాధికారాలకు భంగం కలిగిందని ఆరోపించాడు. నెపోలియన్ నేపిల్స్‌ను, దక్షిణ ఇటలీని ఆక్రమించి, దానిని ఇటలీరాజ్యం (Kingdom of Italy) గా ఏర్పరచి, తన సోదరుడైన జోసేఫ్‌ను రాజుగా నియమించాడు. ఆ విధంగా అధీనరాజ్యాల్లో రాజులను నియమించడం చక్రవర్తికి ఉండే ప్రత్యేకాధికారం. అంతేకాక నెపోలియన్‌కు తన సోదరీ సోదరులపట్ల ప్రేమాభిమానాలు అధికం. ఈ కారణాలచేత ఇటలీరాజ్యానికి అతడు జోసెఫ్‌ను రాజుగా నియమించడం పోప్‌కు గిట్టలేదు. నేపిల్స్ రాజ్యంపైన, నెపోలియన్ ఏర్పరచిన ఇటలీరాజ్యంలో చేర్చిన కొన్ని భూభాగాలపైన పోప్ రాజ్యాధికార హక్కులను కలిగి వున్నాడు, అనగా ఆ భూభాగాలు పోప్ రాజ్యాలకు (Popal states) చెందినవి. పోప్ జోసెఫ్ నియామకాన్ని గుర్తించడానికి నిరాకరించాడు. అంతట నెపోలియన్ పోప్ వద్ద ఉండే ఉన్నతసభ (College of Cardinals) లో కనీసం మూడోవంతు ఫ్రెంచివారుండాలని డిమాండు చేశాడు. దానికి పోప్ సమాధానంగా ఫ్రాన్స్‌లో ఖాళీ అయిన బిషప్ స్థానాలను (Seer) భర్తీచేయడానికి విముఖత చూపాడు. కంకార్డ్ ఒప్పందం ప్రకారం ఆ ఖాళీలను భర్తీ చేయడానికి ఫ్రెంచి ప్రభుత్వం నియామకాలు చేస్తుంది, వాటిని పోప్ గుర్తించి, ధ్రువపరుస్తాడు. కాని ఈ వివాదంలో పోప్ నెపోలియన్‌తో సహకరించడానికి నిరాకరించాడు. దీనికి నెపోలియన్ పోప్ రాజ్యాలను ఆక్రమించాడు. పోప్ ప్రత్యేకంగా నెపోలియన్ పేరుపెట్టకపోయినా, మతవ్యవస్థతో ఈ వివాదం రేకెత్తించిన వారందరికి సంఘ బహిష్కారం విధించాడు.

ఈ వివాదం వలన దేశంలో తను ప్రజాభిమానం కోల్పోవలసివస్తుందని భయపడి నెపోలియన్ పోప్‌తో ఏదోవిధంగా సమాధానపడాలని ప్రయత్నించాడు, కాని సాధ్యపడలేదు. తుదకు నెపోలియన్ పోప్ పట్ల కఠినంగా వ్యవహరించక తప్పలేదు. అతడు పోప్‌ను బందీగా ఫోంటనాబ్లూ (Fontainableau) కోటలో కొన్ని సంవత్సరాలు నిర్బంధంలో ఉంచాడు. రాజ్యాధికారాన్ని మతాధిపతుల ఆధిక్యతకు లోనుకాకుండ ప్రత్యేకించడంలో ఈ విధంగా నెపోలియన్ తన పట్టుదలను ప్రదర్శించాడు.

## 7.6. చక్రవర్తిగా నెపోలియన్ విదేశాంగ విధానం :

నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకొనే నాటికి ద్వితీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమిలోని దేశాలు, గ్రేట్ బ్రిటన్ మినహా, పరాజయం పొంది అతనికి లోబడిన విషయంపైన వివరించడం జరిగింది. గ్రేట్ బ్రిటన్ సైతం ఎమియన్స్ సంధి చేసుకొని, నెపోలియన్‌తో సమాధానపడింది. అయితే ఆ సంధి ఫ్రాన్సుకు, బ్రిటన్‌కు శాశ్వతమైన శాంతిని కల్గించేదికాదు; అనేక విషయాల్లో ఉభయులకు ఆ సంధి షరతులపట్ల అసంతృప్తి ఏర్పడిఉంది. అందుచేత కేవలం పదమూడు నెలల వ్యవధిలో ఉభయదేశాలకు తిరిగి పోరాటం ప్రాప్తించడమూ, అది క్రమంగా అనేక ఇతర పరిస్థితుల వలన తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి (Third coalition of European powers) కి దారితీయడము జరిగింది. ఈ విధంగా ప్రారంభమైన పోరాటాలు **1804** నుండి,

అనగా నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకున్న నాటి నుండి, 1814 లో అతడు శత్రురాజ్యకూటమి (నాలుగో ఐరోపారాజ్య సంకీర్ణకూటమి) చేత సంపూర్ణ పరాజయం పొంది, బందీగా చేజిక్కేవరకు, పూర్తిగా ఒక దశాబ్దికాలం నిరంతరంగా కొనసాగాయి.

చక్రవర్తిగా నెపోలియన్ విదేశాంగ విధానాన్ని, అనగా అతడు తృతీయ, చతుర్థ ఐరోపారాజ్య సంకీర్ణ కూటములతో పోరాటాలు చేసిన దశాబ్దికాలాన్ని రెండుదశలుగా విభజించవచ్చు. మొదటిదశ 1804 నుండి 1810 వరకు, తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి విచ్ఛిన్నం వరకు; రెండవదశ 1810 నుండి 1814 వరకు, చతుర్థ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి చేత అతని సామ్రాజ్యాధికారం పరిసమాప్తమయ్యేవరకు. మొదటిదశలో నెపోలియన్ తన విజయపరంపరలతో ఐరోపానంతటిని తన ఆధిపత్యం క్రిందకు తెచ్చుకొని తిరుగులేని సార్వభౌమాధికారం సాధించాడు. అప్పుడు కూడ గ్రేట్ బ్రిటన్ మినహా కూటమిలోని మిగిలిన ఐరోపా దేశాలన్నీ పూర్తిగా ఓడి నెపోలియన్‌కు లొంగిపోయాయి. మూడుసార్లు సంకీర్ణ రాజ్యకూటముల్లో అజేయంగా నిల్చిన గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి లొంగదీయడానికి నెపోలియన్ పట్టుదల అంతకంతకు బలీయం కాసాగింది. నెపోలియన్‌ను, అతని సామ్రాజ్యాధిపత్యంలోని ఫ్రాన్సును అణచివేయందే బ్రిటిష్‌వారి ఖండాంతర వలసరాజ్యాధిపత్యానికి క్షేమం కలగదు, కనుక గ్రేట్ బ్రిటన్ కూడ పట్టుదలతో పోరు కొనసాగించింది. ఈ కారణాలచేత చతుర్థ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి ఏర్పడడమూ, పోరాటం కొనసాగడమూ అనివార్యమైనాయి.

ఈ రెండో దశలో నెపోలియన్ బ్రిటన్‌ను ఐరోపాఖండ వాణిజ్యంనుండి బయటకునెట్టి, వాణిజ్య విధ్వంసం ద్వారా ఆ దేశాన్ని బలహీనపరచి లొంగదీయడానికి తన శక్తినే కాక యుక్తిని కూడ ప్రదర్శించాడు. అందుకై అతడు భూఖండ విధానం (Continental system) అనే విధానాన్ని (policy) ని రూపొందించి అమలుజరిపాడు. అయితే అది విఫలమై, అతనికే ఎదురుదెబ్బ తగిలింది. పూర్వం ఫ్రాన్సుకు లోబడి అధీనరాజ్యాలు (dependent states) గాను, మిత్రరాజ్యాలు (allied states) గాను సంధి ఒడంబడికలు చేసుకున్న ఐరోపాదేశాలన్నీ ఈ భూఖండవిధానం వలన కష్టనష్టాలకు గురై అతని సార్వభౌమాధికారాన్ని ధిక్కరించి తిరుగుబాట్లు చేశాయి. ఈ తిరుగుబాట్లు క్రమక్రమంగా ప్రబలం కావడము, నెపోలియన్ మరింత మరింతగా నిస్సహాయుడై తుదకు పరాజయం పొందడమూ జరిగింది, అతని సామ్రాజ్యం విచ్ఛిన్నం అయింది.

## 7.6.1. ఎమియన్స్ సంధి విఫలం : బ్రిటన్‌తో పోరాటం పున: ప్రారంభము :

ఎమియన్స్ సంధికి అంగీకరించినా, నెపోలియన్ ఆంతర్యంలో బ్రిటిష్‌వారి వలస రాజ్యాధిపత్యాన్ని, ముఖ్యంగా భారతదేశంలో వారి రాజ్యాధికార ప్రాబల్యాలను, వర్తకవాణిజ్యాలను అంతంచేయాలని బలీయమైన కోరిక ఉంది. ఆ విషయంలో బ్రిటిష్‌వారికి అతని పట్ల ఏమాత్రం సంశయంలేదు. అచిరకాలంలోనే తిరిగి ఈజిప్టుపై దండెత్తి ఆక్రమించగలడని, తద్వారా తమకు భారతదేశంతో రాకపోకలను, సమాచార సౌలభ్యాన్ని నెపోలియన్ నిరోధించగలడని గ్రేట్ బ్రిటన్ తీవ్రంగా అనుమానించింది. అంతేకాక, తన అసాధారణమైన సైనిక నాయకత్వ దక్షతవలన స్వల్పకాలంలోనే నెపోలియన్ ఐరోపానంతటిని తన గుప్పిట్లోకి తీసుకోగలడని, తద్వారా ఐరోపాదేశాల్లోని తమ వర్తకవాణిజ్యాలకు భంగం కలిగించగలడని కూడ బ్రిటన్ భయపడింది. ఈ కారణాల వలన ఎమియన్స్ సంధిలో అంగీకరించినట్లు బ్రిటన్ మాల్టాద్వీపం నుండి వైదొలగి, ఆ ద్వీపాన్ని పరిపాలించుకొనే నైట్స్ ఆఫ్ సెంట్‌జాన్ (Knights of St. John) లకు పరిపాలనాధికారాలను అప్పగించలేదు. అందువలన నెపోలియన్ బ్రిటిష్‌వారి చిత్తశుద్ధిని విమర్శించి, ఎమియన్స్ సంధిని ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపించాడు. దానితో ఫ్రాన్సుకు గ్రేట్ బ్రిటన్‌తో పోరాటం తిరిగి ప్రారంభం అయింది.

## 7.6.2. నెపోలియన్ సామ్రాజ్య విస్తరణ విధానం :

బ్రిటిష్‌వారు ఊహించినట్లే, నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకున్న వెంటనే తన సామ్రాజ్యాధిపత్యాన్ని అతివేగంగా విస్తరింపజేశాడు. వాయువ్య ఇటలీలోని పైడ్‌మాంట్ (Piedmont) ను సార్డీనియా నుండి ఆక్రమించి, జనోవాతో కలిపివేశాడు.

జనోవాను అంతకు పూర్వమే ఆక్రమించి ఆ రాజ్యాన్ని లిగూరియన్ (Ligurian) రిపబ్లిక్‌గా నెపోలియన్ ఏర్పరచడాన్ని పైన వివరించడం జరిగింది.

లోగడ ఉత్తర ఇటలీలోని లంబార్డీ, వెనీషియాలను ఆక్రమించి సిస్-ఆల్పైన్ (Cis - Alpine) రిపబ్లిక్‌గా ఏర్పరచడం పైన వివరించడం జరిగింది. నెపోలియన్ చక్రవర్తిగా ప్రకటించుకున్న తరువాత దానికి తానే అధ్యక్షునిగా ప్రకటించుకొన్నాడు.

స్విట్జర్లాండులోని అధిక భూభాగాన్ని ఆక్రమించి నెపోలియన్ లోగడ హెల్వెటిక్ (Helvetic) రిపబ్లిక్‌గా ఏర్పరచాడు. దీనిని ఇప్పుడు స్విస్ సమాఖ్య (Swiss confederation) గా మార్చి, ఫ్రెంచి సామ్రాజ్యంలో ఒక అధీన భూభాగం (Dependent territory) గా ఏర్పరచాడు.

లోగడ ప్రష్యా నుండి ఆక్రమించిన రైన్ నదీ పశ్చిమ మైదానాలను ఫ్రెంచి భూభాగంగా పునర్నిర్మించేందుకు రాస్టాట్ (Rastadt) వద్ద కాంగ్రెసు సమావేశం అయి, తన కార్యక్రమాన్ని పూర్తిచేసింది. దీనితో అనేక చిన్నచిన్న జర్మన్ సంస్థానాలు (estates), నగర రాజ్యాలు (City - States); పవిత్ర రోమన్ సామ్రాజ్యంలోనివి, ఆస్ట్రియా, ప్రష్యాల ఆధిపత్యం క్రింద ఉండేవి, ఫ్రెంచి భూభాగంలో చేరిపోయాయి.

హాలెండులో లోగడ నెలకొల్పిన బటావియన్ (Batavian) రిపబ్లిక్‌ను పూర్తిగా ఫ్రెంచి ఆధిపత్యంలోనికి తీసుకోవడము, ఆ ప్రాంతం, అక్కడి రేవుపట్టణాలు ఫ్రెంచిసేనల రక్షణలో ఉంచడము జరిగింది. ఈ ఏర్పాట్లవలన డచ్చి రేవులలోనికి బ్రిటిష్ వర్తక నౌకలకు ప్రవేశం నిషేధించి, బ్రిటిష్‌వారి ఐరోపా వాణిజ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం నెపోలియన్ ప్రారంభించాడు. అంతేకాక, పూర్వం బ్రిటన్‌తో చేసుకొన్న వాణిజ్య ఒడంబడికలను పునరుద్ధరించడానికి నిరాకరించి, బ్రిటిష్ ఎగుమతులపై (అనగా ఇతర ఐరోపా దేశాలకు బ్రిటన్‌నుండి దిగుమతులు) అధిక టారిఫ్ సుంకాన్ని విధించి, వారి వర్తకం కష్టతరం చేశాడు. ఈ చర్యలను బ్రిటిష్ పత్రికలు తీవ్రంగా విమర్శించి, నిరసించాయి, అవమానకరమైన వ్యంగ్య చిత్రాలను (Cartoons) ప్రచురించాయి. ఈ కారణాలతో 1803 లోనే ఫ్రాన్సు - బ్రిటన్‌లకు తిరిగి పోరాటం ప్రారంభం అయింది.

అయితే, భూపోరాటంలో ఫ్రాన్సును ఎదుర్కొనడం ఒంటరిగా బ్రిటన్‌కు అసాధ్యం కావడాన కొంచెం నిదానించింది. త్వరలోనే ఆస్ట్రియా - ప్రష్యాలు ఫ్రాన్సుపై పోరాటం ప్రకటించగలవని, అవి భూమిపై ఫ్రాన్సుతో పోరాడుతుండగా, తాను సముద్రంపై పోరాడవచ్చునని బ్రిటన్ ఆలోచించింది. అలాగే నెపోలియన్ బ్రిటన్‌పై పోరాటం నౌకాబలం లేకుండ అసాధ్యమని గ్రహించి, స్పెయిన్ దేశ నౌకాబలాన్ని ఉపయోగించుకోవాలని, అదను చూచి, తన అపారసేనతో బ్రిటన్‌ను ముంచెత్తాలని ఆలోచించాడు. అందుకై ఇంగ్లీష్ ఛానెల్ (English Channel) పై బొలోనా (Bologna) వద్ద, అపారమైన సేనను నిలిపిఉంచాడు. అక్కడినుండి బ్రిటిష్‌దీవులు అతి చేరువలో ఉంటాయి, ఛానెల్‌ను దాటి బ్రిటన్‌పై సులువుగా దండెత్తగలుగుతాయి.

## 7.6.3. బ్రిటన్‌తో పోరాటం ప్రారంభం :

ఈ విధంగా తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమిలో నెపోలియన్ చేసిన పోరాటాలు వ్యూహ, ప్రతివ్యూహాలతో, భూమిపైన, సముద్రంపైన, అనేక ప్రధానమైన యుద్ధ సంఘటనలతో కూడి ఆసక్తికరమైంది.

నెపోలియన్ వ్యూహము, దండయాత్రా సన్నాహాలు బ్రిటిష్ వారికి ఆందోళన కలిగించాయి. వారి నౌకాదళాధిపతి ఎడ్మిరల్ (Admiral) నెల్సన్ అట్లాంటిక్ సముద్రతీరంలోని ఫ్రెంచి, డచ్చి రేవుపట్టణాలను, ప్రధానంగా బోలోనా రేవుపట్టణాన్ని ముట్టడించి దిగ్బంధం చేశారు. అయితే ఈ దిగ్బంధం నుండి ఒక ఫ్రెంచి నౌకాదళం తప్పించుకొని, రోష్‌ఫోర్ట్ (Rochefort) నుండి బయలుదేరి అమెరికా ఖండంవైపు సాగిపోయింది. ఆ నౌకాదళం పశ్చిమ ఇండియా దీవుల (West - Indies) తో బ్రిటన్ వాణిజ్యాన్ని అటకాయిస్తూ బ్రిటన్‌కు కొంత తలనెప్పి కలిగించింది. నెపోలియన్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నెల్సన్

దిగ్బంధాన్ని విచ్ఛిన్నం చేయదలచాడు. అతడు మధ్యధరాసముద్రతీరంలోని ఫ్రెంచి రేవుపట్టణం అయిన టౌలాన్ (Toulon) నుండి విలినేవి (Villeneuve) అనే నౌకాదళాధిపతిని బయలుదేరి, కాడిజ్ (Cadiz) వద్ద స్పానిష్ నౌకాదళాన్ని కలసి, అమెరికా ఖండంవైపు సాగిపోవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఈ ఫ్రెంచి-స్పానిష్ సంయుక్త నౌకాదళాలు పశ్చిమ ఇండియాదీవుల వద్ద ఉన్న రోష్‌ఫోర్ట్ నౌకాదళంతో కలిసి, అట్లాంటిక్ తీర రేవుపట్టణాలను దిగ్బంధం చేసిన బ్రిటిష్ నౌకాదళాన్ని అటువైపునుండి దాడిచేయవలసిందిగా వారికి నెపోలియన్ సూచించాడు. దానివలన నెల్సన్ దృష్టిని మరలించడం, దిగ్బంధాన్ని బలహీనపరచి, ఫ్రెంచిసేనలను బోలోనా నుండి బ్రిటిష్ దీవులలోనికి దించడం అతని ఆలోచన.

నెపోలియన్ పన్నిన ఈ వ్యూహం యుక్తి యుక్తమైందే కాని, అది ఫ్రెంచి, స్పానిష్ నౌకాదళాలు అమెరికా ఖండంవైపు సాగిపోవడం, నెల్సన్ ఏమార్చి తిరిగి ఐరోపాతీరానికి వచ్చి బోలోనా నుండి సేనలను బ్రిటిష్‌దీవుల్లో దింపడం - అతి వేగమైన కదలికపై ఆధారపడింది. అందువలన అతడు ఆశించిన విధంగా జరగలేదు. విలినేవి టౌలాన్ నుండి బయలుదేరి, స్పానిష్ నౌకాబలాన్ని కలిసాడు, కాని నెల్సన్ ఐరోపాతీర రేవుపట్టణాల దిగ్బంధాన్ని సడలించకుండ, అతన్ని వెంటాడి పశ్చిమ ఇండియా దీవులకు సమీపాన ఓడించాడు. అప్పటికి విలినేవి రాకకోసం ఎదురుచూస్తూ రోష్‌ఫోర్ట్ నౌకాదళం బయలుదేరి, ఐరోపాతీరాన్ని సమీపించింది. అందుచేత విలినేవి సులువుగా నెల్సన్ చేత ఓడిపోయాడు. వెంటనే నెల్సన్ అక్కడినుండి బయలుదేరి మెరుపువేగంతో ఐరోపాతీరాన్ని చేరి, ఫ్రెంచి, డచ్చి రేవుపట్టణాల దిగ్బంధాన్ని పదిలపరచి, పశ్చిమ ఇండియా దీవులనుండి విలినేవి నాయకత్వంలో తిరిగివచ్చిన ఫ్రెంచి-స్పానిష్ నౌకాదళాలను ట్రఫాల్గర్ (స్పెయిన్ దేశంలోని దక్షిణ తీరానగల రేవుపట్టణం) వద్ద 1805 అక్టోబర్ 21 న ఓడించాడు. ఈ విధంగా తన వ్యూహం విఫలం కావడంతో నెపోలియన్ బోలోనా రేవుపట్టణం నుండి బ్రిటిష్ దీవులపై దండెత్తలేకపోయాడు.

## 7.6.4. తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి : రష్యా-ఆస్ట్రియాల పరాజయం :

1804 నాటికి ట్రఫాల్గర్ యుద్ధంలో ఫ్రెంచి నౌకాదళం ఓడిపోయిన వార్త తెలియగానే ఐరోపాలో నెపోలియన్ ఆధిపత్యాన్ని తుదముట్టించేందుకు క్రొత్తవ్యూహాలు తయారు అయినాయి. ఆస్ట్రియా, ప్రష్యా, స్పెయిన్, పోర్చుగల్ దేశాలు అతని సామ్రాజ్యాధిపత్యాన్ని ధిక్కరించి పైన వివరించినట్లుగా తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమిని ఏర్పరచాయి. 1805 సంవత్సరం ప్రారంభం నాటికి, ఆ దేశాల నడుమ సంప్రదింపులు పూర్తిఅయి, ఒడంబడికలు కుదిరాయి. గ్రేట్ బ్రిటన్, రష్యాలనడుమ కూడ అటువంటి అంగీకారం కుదిరింది, వారు కూడ తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమితో చేరడం జరిగింది.

నెపోలియన్ ఇటలీరాజ్యానికి (లంబార్డీ, వెనీషియాలతో కూడిన) రాజుగా ప్రకటించుకొనడంతో అతడు ఆస్ట్రియాకు ప్రక్కలో బల్లెం అయినాడు. ఆ రాజ్యాలను తిరిగి తన ఆధిపత్యం క్రిందికి తెచ్చుకొని, నెపోలియన్‌ను అక్కడినుండి గెంటివేయాలని ఆస్ట్రియా ఆలోచన.

శత్రుకూటమి ప్రబలంగా ఉన్నా, ఫ్రాన్సును ముంచెత్తగలిగినంత సేనాబలం ఉన్నా, భూమిపై పోరాటంలో ఆనాటి ఫ్రెంచిసేనకు ఎదురులేదని, అందుకు ప్రధానకారణం నెపోలియన్ నాయకత్వము, వ్యూహరచనా చాతుర్యం ప్రధానకారణాలని పైన వివరించిన సంఘటనలు స్పష్టపరుస్తాయి. ఫ్రాన్సుపై ఆస్ట్రియా రెండువైపుల నుండి దండెత్తడానికి రెండు ప్రబలమైన సేనలను సిద్ధంచేసి, ఒకసేన ఆర్చిడ్యూక్ ఛార్లెస్ నాయకత్వాన ఇటలీపైకి పంపింది. రెండవసేన జనరల్ మాక్ (General Mack) నాయకత్వాన దక్షిణ జర్మనీలోని బవేరియా రాజ్యంలో నిలిపి, రష్యాసేనల ఆగమనానికి ఎదురుచూస్తున్నది. రష్యా నుండి సేనలు రాగానే వారి సంయుక్త (combined) సేనలు రైన్ మైదానం గుండా ఫ్రాన్సుపై దండెత్తడం వారి ఆలోచన.

ఆ సమయంలో నెపోలియన్ బోలోనా రేవుపట్టణానికి చేరువగా బౌలాన్ (Boulogne) వద్ద విడిసిఉన్నాడు. అవకాశం

లభించగానే బ్రిటిష్ దీవులపై దండెత్తి, ఫ్రెంచి సేనలను ఉప్పెనవలె తరలించడం అతని ఆశయం. ఈ లోగా ఆస్ట్రియాసేనలు ఇటలీ రాజ్యంలోనికి, బవేరియా రాజ్యంలోనికి ప్రవేశించాయి. ట్రఫాల్గర్ వద్ద ఫ్రెంచి-స్పానిష్ నౌకాదళాలు ఓడి, ధ్వంసం అయినాయి, నెపోలియన్ బ్రిటన్‌పై దండెత్తడం సాధ్యం కాలేదు. అయితే ఈ అపజయంతో క్రుంగిపోక అతడు మెరుపువేగంతో బౌలాన్‌నుండి బయలుదేరి, బవేరియాలో రష్యాసేనల ఆగమనాన్ని ఎదురుచూస్తూ విడిసి ఉన్న జనరల్ మాక్‌ను ఎదిరించాడు. అక్టోబర్ 20 న ఊల్మ్ (Ulm) వద్ద జనరల్ మాక్ ఓడిపోయాడు. ఊల్మ్ యుద్ధంలో నెపోలియన్ విజయాన్ని గూర్చి విన్న ఆర్చిడ్యూక్ ఛార్లెస్ ఇటలీరాజ్యం నుండి వెంటనే వెనక్కుమరలి, రాజధాని అయిన వియన్నా పరిసరాలకు చేరుకున్నాడు. ఆ నగరం సమీపంగా ఆర్చిడ్యూక్ ఛార్లెస్ రష్యాసేనలను కలుసుకొన్నాడు. వారి సంయుక్త సైన్యాన్ని నెపోలియన్ 1805 డిసెంబర్ 2 న, ఆస్టర్‌లిజ్ (Asterlitz) వద్ద ఓడించి, విజయవంతంగా ఆస్ట్రియా రాజధాని అయిన వియన్నాలో ప్రవేశించాడు. ఆస్టర్‌లిజ్ యుద్ధంలో ఐరోపాలోని రెండు పెద్ద దేశాల సంయుక్తసైన్యాన్ని నెపోలియన్ ఓడించడంతో బ్రిటన్‌తో సహా అన్ని దేశాలు కలవరపడ్డాయి. నిరాశతో క్రుంగిపోయాయి. బ్రిటిష్ ప్రధానమంత్రి విలియమ్ పిట్టు "ఐరోపాపటాన్ని చుట్టివేయండి, దానితో రాగల పదేళ్ళ కాలంతో పనిలేదు" (Roll the map of Europe; it will not be wanted there ten years) అన్నాడట.

నెపోలియన్ ఆస్ట్రియాపై విజయోత్సవాన్ని, తను చక్రవర్తిగా ప్రకటించుకున్న ద్వితీయవార్షికోత్సవాన్ని 1805 డిసెంబర్ 2 న వియన్నాలో జరుపుకున్నాడు. అపజయం పొందిన పవిత్రరోమన్ చక్రవర్తి రెండో ఫ్రాన్సిస్ నెపోలియన్‌తో ప్రెస్‌బర్గ్ సంధి (Treaty of pressburg) చేసుకొని, తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి నుండి వైదొలగాడు. ఆ సంధి షరతుల్లోని భాగంగా నెపోలియన్‌ను ఇటలీరాజుగా ఆస్ట్రియా అంగీకరించింది. అంతేకాక వెనీషియాను ఇటలీరాజ్యంలో విలీనంచేసింది. టైరోల్ రాజ్యాన్ని బవేరియాకు ఇచ్చింది. అనేక జర్మన్ సరిహద్దు రాజ్యాలను వూర్టెంబర్గ్ (Wurtemberg) కు ఇచ్చింది. బవేరియా, వూర్టెంబర్గులు రాజ్యాలుగా (పూర్వం డచ్చి హోదా మాత్రమే కల్గి, డ్యూక్‌ల పరిపాలనలో ఉండేవి) గుర్తించింది. దీనితో ఆస్ట్రియా దక్షిణ జర్మన్ భూభాగాలను, ఉత్తర ఇటలీ భూభాగాలను సంపూర్ణంగా కోల్పోయి, మూడు లక్షలమంది పౌరులను, పెద్ద మొత్తంలో రాజ్యాదాయాన్ని కోల్పోయింది. రెండో ఫ్రాన్సిస్ పవిత్రరోమన్ చక్రవర్తి బిరుదాన్ని త్యజించాడు, కేవలం ఆస్ట్రియా చక్రవర్తిగా మిగిలిపోయాడు. ఆ బిరుదాన్ని కోల్పోయిన తరువాత మొదటి చక్రవర్తి కనుక, రెండో ఫ్రాన్సిస్ కుమారుడు అతడు మొదటి ఫ్రాన్సిస్ అయినాడు. ఉత్తర ఇటలీ, దక్షిణ జర్మన్ రాజ్యాలు నెపోలియన్ ఆధిపత్యం క్రిందికి వచ్చాయి.

1805 లో ఆస్ట్రియా నెపోలియన్‌తో ప్రెస్ బర్గ్ సంధి చేసుకొన్న నాటికి మధ్య ఐరోపా, ఇటలీ ద్వీపకల్పం నెపోలియన్ అధీనరాజ్యాలతో ఏర్పడినాయి. తృతీయ ఐరోపారాజ్య సంకీర్ణకూటమిని విచ్ఛిన్నం చేయడమేకాక ఆస్ట్రియా, నేపిల్స్, సార్డీనియా రాజ్యాలనుండి ఆక్రమించిన భూభాగాలతో నెపోలియన్ ఈ అధీన రాజ్యాలను ఏర్పరచి, తన సోదరీ సోదరులను వాటిపై రాజులుగా, రాణులుగా నియమించాడు. నేపిల్స్-సిసిలీ సంయుక్త రాజ్యంలోని నేపిల్స్‌కు అతడు తన సోదరుడైన జోసెఫ్ బొనాపార్టీని రాజుగాచేసి, పూర్వపు రాజైన ఫెర్డినాండ్‌కు సిసిలీని మాత్రం వదిలిపెట్టాడు. అతడు నెపోలియన్‌కు లోబడి పరిపాలించసాగాడు. ఇటలీ ద్వీపకల్పంలోని లూకా (Lucca) రాజ్యానికి తన సోదరి అయిన ఎలిసీ (Elise Bonaparte) ని రాణిగా చేశాడు; లంబార్డీ, వెనీషియాలతో కూడిన ఇటలీ రాజ్యంలో తన ప్రతినిధిగా యూనీ బొవార్నిస్ (Eugne Beaularnais) పరిపాలిస్తున్నాడు. (ఇతడు మొదటి భర్త వలన జోసెఫిన్ కుమారుడు).

ఈ అధీన రాజ్యాలకు తోడుగా దక్షిణ జర్మన్‌రాజ్యాలను, రైన్ నదికి ఇరువైపులా, రెండు వందలపైబడిన చిన్న చిన్న సంస్థానాలను 16 పెద్ద రాజ్యాలుగా పునర్నిర్మించి, రైన్ రాజ్య సమాఖ్య (Confideration of Rhine) అనే పేరున 1806 లో నెలకొల్పాడు. ఈ రాజ్య సమాఖ్య పరిపాలనకై ప్రత్యేకమైన ఏర్పాట్లుచేసి, ఈ రాజ్యాలను వెనుకటి పవిత్ర రోమన్ సామ్రాజ్యం నుండి వైదొలగినట్లు ప్రకటించాడు. దీనితో సాంప్రదాయిక ఐరోపా రాజకీయ వ్యవస్థలో నామమాత్రంగా మిగిలిన పవిత్రరోమన్ సామ్రాజ్యం పూర్తిగా అస్తమించింది. ఆస్ట్రియా పరిపాలించే హాప్స్‌బర్గ్ వంశీయులు పారంపర్యంగా ధరించే పవిత్ర రోమన్ చక్రవర్తి

అనే బిరుదం రద్దు అయింది. ఈ కారణంచేత, ఆస్ట్రియాను పరిపాలిస్తున్న రెండవ ఫ్రాన్సిస్ ఆస్ట్రియా చక్రవర్తి అనే బిరుదాన్ని ధరించాడు, ఈ విషయంపైన వివరించబడింది.

లోగడ పవిత్రరోమన్ సామ్రాజ్యంలో వందలాదిగా ఉన్న చిన్నరాజ్యాలు, పెద్ద సంస్థానాల్లో ఆస్ట్రియా, ప్రష్యాలు మాత్రమే పెద్దరాజ్యాలు. తక్కినవన్నీ ఆ రెండింటిలో ఏదో ఒకదానికి మిత్రరాజ్యాలుగా తమ ఉనికిని కొనసాగించేవి. నెపోలియన్ రైన్ రాజ్యసమాఖ్యను ఏర్పరచడంతో ఆ రెండు రాజ్యాలకు పోటీగా మరొక పెద్దరాజ్యం, వాటి ఆటకట్టించడానికి ఏర్పరచినట్లయింది. ఈ రాజ్యసమాఖ్యకు ఫ్రెంచిసైనిక నిపుణులు తర్ఫీదునిచ్చిన 63,000 ప్రత్యేక సైన్యం కూడ ఏర్పాటయింది.

### 7.6.5. ప్రష్యాతో యుద్ధం (1806) :

బేలాన్ నుండి నెపోలియన్ బవేరియా పైకి దండెత్తి, ఆస్ట్రియాను ఓడించే సందర్భంలో అతని సేనానుల్లో ఒకడైన బెర్న్‌హార్డ్ (Bernhard) హానోవర్ నుండి తన సేనతో బయలుదేరి వచ్చి నెపోలియన్‌ను వియన్నా సమీపంలో కలుసుకున్నాడు. అతడు దారిలో కొంతమేర ప్రష్యా భూభాగం గుండా, ప్రష్యారాజైన మూడో ఫ్రెడరిక్ విలియమ్ అనుమతిలేకుండ సైన్యంతో కదిలిరావడం ఉభయదేశాల మధ్య సంబంధాలకు దెబ్బతగిలింది. అయినా మూడో ఫ్రెడరిక్ విలియమ్, నెపోలియన్ పట్ల భయమూ, ఆ భయంలో నుండి పుట్టిన ఆరాధనాభావము కలిగి, ఫ్రాన్స్‌పై దండయాత్ర ప్రకటించలేదు. కాని, నెపోలియన్ ఆస్ట్రియాను లొంగదీయడము, దక్షిణ జర్మన్ రాజ్యాలను తన ఇష్టానుసారంగా ఒకరాజ్యసమాఖ్యగా ఏర్పరచడము, దీనివలన ప్రష్యాకు కూడ అతి చేరువలోనే ప్రమాదం ఏర్పడుతున్నదని, మంత్రులు, ఆంతరంగికులు హెచ్చరించడంతో అతడు మేలుకున్నాడు. ముఖ్యంగా జర్మన్ రాజ్యాల్లో విస్తరిస్తున్న ఫ్రెంచి పలుకుబడి, ప్రభావము మున్ముందు ప్రమాదకరమైనవని అతడు భయపడి, నెపోలియన్‌పై యుద్ధం ప్రకటించి, రష్యా సాయాన్ని కోరాడు. కాని రష్యా నుండి సాయం రాకమునుపే, నెపోలియన్ ప్రష్యా పై దండెత్తి, జెనా (Jena) అవుర్‌స్టేట్ (Aurstadt) యుద్ధాల్లో ప్రష్యాను ఘోరంగా ఓడించారు. 1806 లో ఈ పోరాటాల్లో విజయం సాధించిన నెపోలియన్ ప్రష్యా రాజధాని బెర్లిన్‌ను ప్రవేశించి "బెర్లిన్ ప్రకటన" (Berlin Decree) చేశాడు.

### 7.6.6. రష్యాతో యుద్ధం : టిల్సిట్ సంధి (1807) :

తృతీయ రాజ్యకూటమిలో చేరి రష్యా నెపోలియన్ ఆధిక్యతను అణచివేయడానికి రెండు కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది నెపోలియన్ చక్రవర్తిగా బిరుదు ధరించడం, ఈ విషయంపైన వివరించడం జరిగింది. రెండవది, మాల్టా ద్వీపాన్ని ఆక్రమించి మధ్యధరాసముద్రంపై ఆధిపత్యం చలాయించాలనే కోరికతో రష్యా గ్రేట్ బ్రిటన్‌తోను, ఫ్రాన్సుతోను పోటీకి దిగడం. ఆ సమయంలో రష్యా జార్ మొదటి అలెగ్జాండర్ మాల్టాను పరిపాలిస్తున్న నైట్స్ ఆఫ్ సెంట్ జాన్‌కు నాయకుడైనాడు. అతడు ఆస్ట్రియా, ప్రష్యాలతో చేరి, ఐరోపాలో నెపోలియన్ విజృంభణకు అడ్డుకట్ట వేయదలచాడు. ఎయిలూ (Eylau) వద్ద 1807 జూన్‌లో రష్యా సేనలు ఫ్రెంచిసేనలతో తలపడ్డాయి. ఉభయసేనల్లో తీవ్రమైన సైనికనష్టం జరిగింది కాని, జయాపజయాలు తేలలేదు. ఇంతలో ఫ్రాన్సునుండి నెపోలియన్ అదనపు సైనిక బలగాలను రప్పించి, పోరాటం ముమ్మరంచేసి ఫ్రెయిడ్‌లాండు (Friedland) వద్ద రష్యన్లను పూర్తిగా ఓడించాడు. నైమెన్ (Niemen) నదీతీరంలోని టిల్సిట్ పట్టణంలో ఫ్రెంచి చక్రవర్తి నెపోలియన్ రష్యా జార్ మొదటి అలెగ్జాండర్ నడుమ శాంతి సంభాషణలు ప్రారంభం అయినాయి.

టిల్సిట్ శాంతి సంభాషణల్లో నెపోలియన్ రష్యా నుండి భూభాగాలను ఆక్రమించదలచనందుకు జార్ మొదటి అలెగ్జాండర్ సంతోషపడ్డాడు. నెపోలియన్‌కు ఐరోపాలో ప్రధాన ప్రత్యర్థులైన ప్రష్యా, ఆస్ట్రియాలకు రష్యా ఆవల ఉన్న దేశం. కనుక రష్యా నుండి భూభాగాలను ఆశించినా, వాటిని పరిపాలించడం అసాధ్యం. అంతకంటెముందు, తన చేత ఓడిన రష్యాను అవమానించకుండ, మిత్రరాజ్యం చేసుకోవడం అతనికి క్షేమం. తామిద్దరి నడుమ ఆస్ట్రియా, ప్రష్యాలు నలిగి బలహీనం కాగలవు.

అది నెపోలియన్ ఆంతర్యం. అందుచేత అతడు రష్యా నుండి ఎటువంటి ఆక్రమణలను ఆశించకపోగా, పశ్చిమంగా స్వీడన్‌లోనికి, దక్షిణంగా టర్కీ రాజ్యంలోనికి రష్యా విస్తరణలను ప్రోత్సహించాడు. ఈ ప్రాదేశిక విస్తరణలకు రష్యా మరింత సంతోషపడి, ముమ్మందు ఐరోపాలో రెండే అగ్రరాజ్యాలు (ఫ్రాన్సు, రష్యాలు మాత్రమే - ఆస్ట్రియా ప్రష్యాలను ఫ్రాన్సు, టర్కీని రష్యా ఆక్రమించవచ్చని జార్ అలెగ్జాండర్ ఆశపడ్డాడు. అందుకే అతడు టిల్సిట్ శాంతి సంభాషణల్లో "ఐరోపా ఎక్కడుంది? నీవు నేనే కదా!" (What is Europe? Is it not you and I?) అన్నాడు.

టిల్సిట్ సంధిలో బాగా నష్టపోయింది ప్రష్యా. ఆ దేశం లోగడ పోలెండును ఆస్ట్రియా, రష్యాలతో కలిసి పంచుకొని ఆక్రమించిన భూభాగాలను నెపోలియన్ స్వాధీనపరచుకొని, గ్రాండ్ డచ్చి ఆఫ్ వార్సా (Grand Duchy of Warsaw) గా ఏర్పరచి, దానికి గ్రాండ్ డ్యూక్ (Grand Duke) గా సాక్జనీ ప్రభువు (Elector of Saxony) ని నియమించాడు. అతడు నెపోలియన్‌కు లోబడిన మిత్రుడు. సాక్జనీ డచ్చి (Duchy) నుండి రాజ్యంగా (Kingdom) గా సాక్జనీ ఎలెక్టర్‌ను సాక్జనీ ఎలెక్టర్‌ను సాక్జనీరాజుగా గుర్తించాడు. ప్రష్యారాజ్యంనుండి ఎల్బ్ (Elbe) నదికి పశ్చిమంగా ఉన్న భూభాగాన్ని నెపోలియన్ అధీనంలో వెస్ట్‌ఫాలియా (Kingdom of West phalia) గా ఏర్పడింది. దీనితో ప్రష్యారాజ్యం అప్రధానమైన చిన్నదిగా ఏర్పడింది. ఈ క్రొత్తరాజ్యం లోగడ నెపోలియన్ ఏర్పరచిన రైన్ రాజ్య సమాఖ్యకు ప్రక్కనే మరొక అధీన రాజ్యంగా తన సోదరుడైన జెరోమ్ (Jerome) పరిపాలనలో ఉంచాడు.

టిల్సిట్ సంధిలోని ప్రాదేశిక సర్దుబాట్లు (Territorial adjustments) ప్రధానంగా ప్రష్యాను క్రుంగదీయడానికి ఉద్దేశించి, అందుకు ఫ్రాన్సుతో సమానమైన చక్రవర్తిత్వ దేశంగా రష్యాను గుర్తించి, జార్ సమ్మతిని సంపాదించడంతో జరిగినవి. అందుచేత జార్ మొదటి అలెగ్జాండర్ నెపోలియన్‌ను ప్రశంసించి, అతని భూఖండ విధానానికి తన మద్దతును తెలిపాడు. భూఖండవిధానం (Continental system) ఐరోపాదేశాలతో గ్రేట్ బ్రిటన్ చేస్తున్న వాణిజ్యాన్ని దెబ్బతీసి, ఆ దేశ ప్రాభవాన్ని నిర్మూలించడానికి ఉద్దేశించింది కనుక రష్యాకు ఆమోదయోగ్యమే అయింది. రష్యాకు మధ్యధరాసముద్రంపై ఆధిపత్యం సంపాదించాలనే వాంఛ, అందుకై మాల్టాలోని నైట్స్ ఆఫ్ సెంట్ జాన్ లకు నాయకత్వాన్ని సంపాదించడమూ పైన వివరించడం జరిగింది. రష్యా తన ఆశయాన్ని సాధించుకోవడానికి గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు ప్రత్యర్థులు కాగా టిల్సిట్ సంధి వల్ల ఫ్రాన్సుతో మైత్రి కుదిరింది, తురుష్క సామ్రాజ్యాన్ని జయించి మధ్యధరాసముద్ర ప్రాంతాలను ఆక్రమించడానికి వారి సమ్మతి లభించింది. మిగిలిన గ్రేట్ బ్రిటన్‌ను క్రుంగదీయడానికి జార్ నెపోలియన్‌తో సహకరించడం యుక్తమని భావించి భూఖండ విధానానికి అంగీకరించాడు.

## 7.7. నెపోలియన్ సామ్రాజ్యం : రెండవదశ :

పైన వివరించినట్లు చక్రవర్తిగా నెపోలియన్ దండయాత్రలు, సామ్రాజ్య విస్తరణ 1807 లో టిల్సిట్ సంధి వరకు క్రమంగా అధిగమనం చెంది, ఉచ్ఛదశను చేరుకున్నాయి. అక్కడి నుండి క్రమంగా అతని పతనం ప్రారంభమైంది. పరంపరగా పరాజయాలు, మిత్రరాజ్యాల్లోను, అధీన రాజ్యాల్లోను అతని సామ్రాజ్యాధిపత్యంపై అసంతృప్తి, అసహనము ఏర్పడి అవి క్రమంగా తిరుగుబాట్లకు దారితీయడమూ, ఆ తిరుగుబాట్లు రానురాను బలీయమై, అన్ని దేశాలకు విస్తరించడమూ అతని చిక్కులను జటిలంగాను బహుళంగనూ చేశాయి. అవి బలీయమై తన నిస్సహాయత ప్రస్ఫుటం అవుతున్న కొద్ది నెపోలియన్‌కు పూర్వపు చురుకుదనమూ, చాకచక్యము మందగించి, మొండితనం వృద్ధి అయింది, తుదకు అతని పతనము, సామ్రాజ్య విచ్ఛిన్నత తప్పని పరిణామాలైనాయి. ఈ పరిణామాలన్నిటికి మూలమైనది అతని భూఖండ విధానం (Continental system). ఈ పరిణామాలు 1810 నుండి ప్రస్ఫుటమౌతున్నా, వాటికి ప్రాతిపదిక అయింది భూఖండ విధానమేనని చెప్పడం అతిశయోక్తి కాబోదు, కనుక ఈ పరిణామాలకు పునాది 1807 లో పడిందని నిర్ధారించవచ్చు.

0

### 7.7.1. 1807 నాటి నెపోలియన్ ఉచ్ఛస్థితి :

1807 లో నెపోలియన్ పతనానికి పునాది పడిన నాటికి అతని సామ్రాజ్యాధికారము, ప్రాభవము ఉచ్ఛస్థితిని చేరాయి. అతని నియంతృత్వ పరిపాలనలో ఫ్రాన్సుదేశం అరాజకాలు, ఒడిదుడుకులు లేక, క్రమశిక్షణాయుతమైన, ఆర్థిక పురోగతి కలిగి ఉంది. అతని యుద్ధ విజయాలు, సామ్రాజ్యవిస్తరణ ఫ్రెంచి ప్రజానీకానికి గర్వకారణాలు కాగా, వారి జాతీయాభిమానానికి, జాతీయ సమైక్యతకు ప్రేరకాలు కూడ అయినాయి. మధ్య, పశ్చిమ ఐరోపాదేశాలన్నీ, అతని యుద్ధ వ్యూహాలకు, శక్తియుక్తులకు లోబడిపోయాయి. ఆస్ట్రియా, ప్రష్యాల నుండి సాధించిన భూభాగాలతో రైన్ రాజ్యసమాఖ్య (Confederation of Rhine) ను, వెస్ట్‌ఫాలియా రాజ్యము (Kingdom of west phalia) అధీనరాజ్యాలుగా సృష్టించాడు. ఆస్ట్రియాకు లోబడిన ఇటాలియన్ భూభాగాలనుండి ఇటలీ రాజ్యాన్ని ప్రష్యా ఆక్రమణలో నుండి పోలిష్ భూభాగాన్ని గ్రాండ్ డచి ఆఫ్ వార్సా (Grand Duchy of Warsaw) ను ఏర్పరచాడు. హాలెండు, నేపిల్స్ రాజ్యాల్లో అతని సోదరులు, గ్రాండ్ డచి ఆఫ్ వార్సాలో మిత్రులు పరిపాలిస్తున్నారు. ఆస్ట్రియా, ప్రష్యాలు తమ భూభాగాలను అధికంగా కోల్పోయి, అప్రధానమైన చిన్న రాజ్యాలుగా నెపోలియన్ ఆధిక్యతకు లోబడిఉన్నాయి. ఐరోపాదేశాల్లో ఫ్రాన్సు తరువాత బలమైన సైన్యం కలిగిన రష్యా నెపోలియన్‌కు మిత్రరాజ్యం.

అటువంటి స్థితిలో ఒక్క గ్రేట్ బ్రిటన్ మాత్రమే ఫ్రెంచివారికి లోబడక, అజేయంగా, నెపోలియన్ ప్రాబల్యాన్ని ప్రతిఘటిస్తూ నిలిచిఉంది. 1797 లో ప్రథమ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి ఏర్పడిన నాటినుండి 1807 వరకు నెపోలియన్ అన్ని ఐరోపాదేశాలను ఓడించి, సంకీర్ణరాజ్యకూటములను విచ్ఛిన్నం చేయడమూ, వాటిలో గ్రేట్ బ్రిటన్ మాత్రం ఓడిపోక నిలిచి ఉండడమూ పరిపాటి అయింది. అలాగే బ్రిటిష్ నౌకాబలం ఫ్రెంచి నౌకాబలాన్ని ధ్వంసం చేసి, సముద్రాలపై విజయాలు సాధించినా, అవి ఖండాంతర వలసల విస్తరణకేగాని, ఫ్రాన్సును అదుపుచేసి, ఐరోపా రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయాయి.

### 7.7.2. భూఖండ విధానం (Continental System) :

ఐరోపా ఖండమంతటిని తన ప్రాబల్యానికి లోనుచేయగలిగిన నెపోలియన్‌కు బ్రిటిష్ వారు లొంగిరాకపోవడం మనసులో ముల్లుగ్రుచ్చుకున్నట్లు ఉంది. వారిని లొంగదీయడానికి ఇతర ఐరోపాదేశాల్లో వలె సైనికబలము, యుద్ధవ్యూహాలు ఉపయోగపడవని, వారి బలమంతా వారి వర్తక వాణిజ్యాల్లో ఉందని నెపోలియన్ గుర్తించాడు. "బ్రిటిష్‌వారు దుకాణదారుల జాతి" (British is a Nation of Shop - keepers) అంటూ నెపోలియన్ వారిని హేళనచేస్తూ, వారి వ్యాపారాన్ని దెబ్బ తీయడమే, వారిని లొంగదీసే మార్గమని నిశ్చయించుకున్నాడు. అందుకొరకు అతడు రూపొందించిన ప్రణాళిక భూఖండ విధానం (Continental System).

#### 7.7.2.1. భూఖండ విధాన ప్రకటన :

నెపోలియన్ 1806 లో అవుర్‌స్టాట్ వద్ద ప్రష్యా సేనలను ధ్వంసం చేసి బెర్లిన్ నగరం ప్రవేశించిన తరువాత బ్రిటిష్ రేవుపట్టణాలు దిగ్బంధంలో ఉన్నట్లు ఫ్రాన్సు దానియొక్క మిత్రరాజ్యాల నౌకలు బ్రిటిష్ రేవుపట్టణాలకు వెళ్ళరాదని ప్రకటించాడు. ఈ ప్రకటనను బెర్లిన్ ప్రకటన (Berlin Decrees) అంటారు. 1807 లో టిల్సిట్ సంధి జరిగిన తరువాత, విజయోత్సాహంతో మిలాన్ నగరంలో ప్రవేశించి, అక్కడి నుండి మరొక ప్రకటన, బెర్లిన్ ప్రకటనకు అనుబంధంగా చేస్తూ, అన్ని ఐరోపా రేవుపట్టణాలు, అట్లాంటిక్, మధ్యధరా సముద్రాలపైనున్నవి, బాల్టిక్ సముద్రంనుండి అడ్రియాటిక్ సముద్రం వరకు - బ్రిటిష్ నౌకలకు మూసివేయబడినట్లు ప్రకటించాడు. ఈ ప్రకటనలను మిలాన్ ప్రకటన (Milan Decrees) అంటారు. బెర్లిన్ ప్రకటనల వలన ఐరోపారేవుల నుండి బ్రిటన్‌కు ఆహారపదార్థాలు, వ్యావసాయిక, ఖనిజ ముడిపదార్థాలు ఎగుమతి కాకుండ అరికట్టడము, తద్వారా బ్రిటిష్ పారిశ్రామికాభివృద్ధిని దెబ్బకొట్టడము ఉద్దేశించాడు. మిలాన్ ప్రకటనల వలన బ్రిటన్ నుండి పారిశ్రామిక ఉత్పత్తులు

ఐరోపాదేశాలకు రాకుండ నిరోధించడాన్ని ఉద్దేశించాడు. అంతేకాక, మిలాన్ ప్రకటనల్లో ఏ తటస్థదేశాల నౌకలైనా ముందుగా బ్రిటిష్ రేవుల్లో ఆగి, తరువాత ఐరోపా రేవుపట్టణాలకు చేరినట్లైతే, వాటిని వాటిలోని వాణిజ్యవస్తువుల (Merchandise) తో సహా ఫ్రాన్సు స్వాధీనపరచుకొంటుంది, వాటిలో బ్రిటిషు ఉత్పత్తులు పట్టుబడినట్లైతే వాటిని ధ్వంసం చేస్తుందని కూడ ప్రకటించాడు.

### 7.7.2.2. బ్రిటిష్ ప్రతిచర్య :

నెపోలియన్ చేసిన బెర్లిన్, మిలాన్ ప్రకటనలకు సమాధానంగా బ్రిటన్ ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్ (Orders in Council) అనే ప్రకటనలు జారీచేసింది. ఈ ప్రకటనల్లో ఐరోపా రేవుపట్టణాలను బ్రిటన్ దిగ్బంధంలో ఉన్నట్లు భావిస్తూ, ఐరోపా దేశాలనుండి ఏవిధమైన వాణిజ్య వస్తువులను తమ దేశానికి ఎగుమతి చేయరాదని, తమ వస్తువులను దిగుమతి చేసుకోరాదని, తటస్థ దేశాల నౌకలు ముందుగా ఐరోపా రేవుపట్టణాల్లో ఆగి, తరువాత బ్రిటిష్ రేవులను చేరినట్లయితే, వాటిని బ్రిటన్ స్వాధీనపరుచుకొంటుందని, ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్ సారాంశం.

ఇది పైన వివరించినట్లు సాయుధబలాలను ఉపయోగించకుండ వాణిజ్యాన్ని సాధనంగా చేసుకొని నెపోలియన్ బ్రిటన్‌తో సాగించిన పోరాటం. ఇది నెపోలియన్ పతనానికి ముఖ్యకారణమై, అతని పతనం వరకు కొనసాగింది.

### 7.7.2.3. భూఖండ విధానం తీరు :

వాస్తవంగా నెపోలియన్ బ్రిటిష్ వాణిజ్యంపై బలమైన దెబ్బకొట్టాడు. ఐరోపాదేశాలన్నీ ఆనాడు బ్రిటిష్ పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకొంటున్నవే, ఈ ఎగుమతి వ్యాపారం వలన బ్రిటన్ తన పారిశ్రామిక విస్తరణను అతి త్వరితంగా సాధిస్తున్నది. దీనికి అఘాతం కలగడంతో ఆ దేశంలో పారిశ్రామిక విస్తరణ మందగించడం, దీనివలన అక్కడి ప్రజలకు ఉపాధి సౌకర్యాలు తగ్గిపోవడం, ప్రజలకు ఆర్జన వనరులు (Sources of income) తగ్గిపోవడం, అది క్రమంగా తిరిగి పరిశ్రమలు మూతపడే ప్రమాదానికి దారితీయడం, ఈ విధంగా విషమస్థితి ఏర్పడే సూచనలు కల్పించాయి. అయినా, తన జాతీయ గౌరవం నిల్పుకోవడానికి గంభీరంగా ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్‌ను జారీచేసింది.

నిజానికి బ్రిటిష్ రేవుపట్టణాలను దిగ్బంధం చేసేందుకు ఫ్రెంచినౌకాబలం లేదు. అయినా, ఆయాదేశాలు ప్రత్యర్థి దేశాలకు వాణిజ్య నౌకలను నడపడం మానివేశాయి. ఆ పరిస్థితిలో ప్రైవేటు కంపెనీలు, దొంగవ్యాపారం చేసే అనధికార నౌకల యజమానులు, ప్రభుత్వాల కళ్ళుగప్పి, ఎగుమతి, దిగుమతి వాణిజ్యాన్ని నిర్వహించసాగారు, అనగా స్మగ్లింగ్ వ్యాపారం వృద్ధి అయింది. అటువంటి వ్యాపారంలో వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, వినియోగదారులు - ముఖ్యంగా బ్రిటిష్ ఉత్పత్తులు అవసరమైనవి కనుక వాటిని ఉపయోగించుకొనే ఐరోపాదేశాల వినియోగదారులు - అనేక కష్టనష్టాలకు గురైనారు.

బ్రిటిష్ రేవులను సంపూర్ణంగా దిగ్బంధం చేసి దొంగ వ్యాపారాన్ని అరికట్టడానికి నెపోలియన్ అధికాధికంగా డెన్మార్కుపై ఆధారపడవలసి ఉంది. ఫ్రెంచి నౌకాబలంతో సహా, అనేక ఐరోపాదేశాల నౌకాబలాలు లోగడ నెపోలియన్ బ్రిటన్‌తో చేసిన నౌకాయుద్ధాల్లో తీవ్రంగా నష్టమైనాయి. ఈ అవకాశాన్ని ఊహించిన బ్రిటన్ 1807 లో డేనిష్ రేవుపట్టణమైన కోపెన్‌హాగన్ (Copenhagen) పై దాడిచేసి, డేనిష్ నౌకాబలాన్ని ధ్వంసం చేసింది. దీనితో తన భూఖండ విధానాన్ని పటిష్టంగా అమలుజరిపే అవకాశం నెపోలియన్‌కు ప్రాప్తించలేదు, దొంగ వ్యాపారాన్ని అరికట్టడం సాధ్యం కాలేదు, ఐరోపా దేశాల్లో బ్రిటిష్ వస్తువులను ఉపయోగించే వినియోగదారుల కష్టనష్టాలు మరింతగా పెరిగాయి.

దీనికి తోడు గ్రేట్ బ్రిటన్ తన నౌకాబలంతో ఐరోపారేవుల దిగ్బంధన పటిష్టంగా చేయగలిగింది. అందుచేత తటస్థదేశాల నౌకలు ఏవి ఐరోపా రేవుపట్టణాలకు రావడం సాధ్యం కాలేదు. దీనివలన బ్రిటిష్ వాణిజ్యం కంటె ఐరోపాదేశాల వర్తకవాణిజ్యాలు

మరింతగా నష్టపోయాయి. అందుకు ముఖ్యకారణం ఐరోపాదేశాలు బ్రిటన్‌తో సరిపోల్చగలిగిన పారిశ్రామికాభివృద్ధిని అప్పటికి సాధించలేకపోవడం. ఒక ప్రక్క వినియోగవస్తువులు బ్రిటన్ నుండి రాకపోవడంతో ఇక్కట్ల పాలవుతూ, మరొక ప్రక్క తమ వ్యావసాయిక, ఖనిజ ఉత్పత్తులను బ్రిటన్‌కు ఎగుమతి చేసే వీలులేక అవి ఆర్థికంగా క్రుంగిపోయాయి. ఈ వస్తువులను వారు బ్రిటన్‌కు ఎగుమతిచేసి, బ్రిటన్‌నుండి వినియోగవస్తువులను దిగుమతి చేసుకొనేవారు. బ్రిటన్ వ్యావసాయిక దేశం కానందువల్ల ఐరోపాదేశాల నుండి ఎప్పటికప్పుడు ఆహారపదార్థాలు, ముడిప్రత్తి మొదలైనవి ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలను తెప్పించుకోవలసి ఉంది. ఇది ప్రారంభంలో బ్రిటన్‌కు కష్టనష్టాలను కలిగించినా, వారికి భారతదేశంలోను పశ్చిమ ఇండియా దీవుల్లోని (West Indies) వలసరాజ్యాధిపత్యము, అమెరికా సంయుక్త రాష్ట్రాలతో వాణిజ్య సంబంధాలు ఉండడాన అచిరకాలంలోనే తన ఇక్కట్లను అధిగమించగలిగింది. కాని ఐరోపాదేశాలు తమ వ్యావసాయిక ఉత్పత్తులను బ్రిటన్‌కు తప్ప మరే ఇతర దేశానికి ఎగుమతి చేసే అవకాశం లేక, ఆ దేశంతో ఎగుమతి వ్యాపారం స్తంభించడంతో వాటిని నిలువచేసుకొనే అవకాశంలేక, ఘోరంగా నష్టపోయారు.

### 7.7.2.4. భూఖండ విధానం ఫలితం :

ఈ ఆర్థిక పరిణామాల్లో నెపోలియన్ అప్పటివరకు నిర్మించిన సామ్రాజ్య పటిష్టత, అనేక అధీన రాజ్యాలకు ఫ్రాన్సుతో గల సంబంధాలు నిలకడ లేనివైనాయి. నెపోలియన్ ఫ్రాన్సుదేశంలోను, తాను నిర్మించిన అనేక ఐరోపారాజ్యాల్లోను క్రమశిక్షణాయుతమైన, చక్కని పరిపాలనను ఏర్పరచిన ఖ్యాతి, క్రమంగా దిగజారడం ప్రారంభించింది. అందుకు ప్రధాన కారణం, ఆయాదేశాల్లోని వ్యావసాయిక ఉత్పాదకులు, ఖనిజసంపదను వెలికితీసే గనులలోని పనివాండ్రు, మొత్తం మీద మధ్యతరగతికి, దిగువ తరగతులకు చెందిన ప్రజానీకాలు ప్రధానంగా నష్టపోయారు, వారికి వారి దేశాల పరిపాలకుల పట్ల ఆగ్రహం కలిగింది; ఆ దేశాల ప్రభుత్వాలు నెపోలియన్ పట్ల అశాంతికి గురవుతున్నారు. క్రమంగా ఐరోపాదేశాలు భూఖండవిధానాన్ని నిరాకరించడము, నెపోలియన్‌పై తిరుగుబాటు చేయడము ప్రారంభము అయింది.

### 7.7.3. భూఖండ విధానం వలన నెపోలియన్ విదేశాంగ విధానంలోని పరిణామం :

### 7.7.3.1. ద్వీపకల్ప యుద్ధం : పోర్చుగల్ :

భూఖండ విధానం పటిష్ఠంగా అమలుజరగడం ఐరోపాలోని అన్ని రేవుపట్టణాలు బ్రిటిష్ వర్తకానికి మూసివేసినప్పుడే సాధ్యం అవుతుంది. కాని గ్రేట్ బ్రిటన్‌తో శతాబ్దాలుగా సత్సంబంధాలు కలిగి ఉన్న పోర్చుగల్ ఈ విధానాన్ని అనుసరించి, తమ ద్వైపాక్షిక సంబంధాలను భంగపరచుకోవడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడలేదు. మొదట్లో నెపోలియన్ పట్ల భయంవలన మౌనంగా ఊరుకున్నా, తరువాత తన విముఖతను వ్యక్తం చేసింది. వెంటనే నెపోలియన్ పోర్చుగల్‌ను అదుపుచేసి బుద్ధిచెప్పడానికి జూనాట్ (Junot) అనే ఫ్రెంచి సేనానిని సైన్యంతో పంపాడు, అతనికి సాయపడవలసిందిగా స్పెయిన్ రాజు నాలుగో ఛార్లెస్‌ను ఆదేశించాడు. పోర్చుగీస్ రాజు మొదటి మరయా ఫ్రెంచిసేనలు తన రాజధాని అయిన లిస్బన్‌ను చేరేనాటికి, బ్రిటిష్ సాయంతో దేశం వదిలి దక్షిణ అమెరికాలోని తమ వలసరాజ్యమైన బ్రెజిల్‌కు పారిపోయాడు.

### 7.7.3.2. ద్వీపకల్ప యుద్ధం : స్పెయిన్ :

పోర్చుగల్‌పై పోరాటానికి స్పెయిన్ సాయం తీసుకున్న నెపోలియన్ ఫ్రాంకో-స్పానిష్ సంయుక్తసేనలు పోర్చుగల్‌లో ప్రవేశించేలోగానే స్పానిష్ సింహాసనాన్ని కబళించడానికి ఎత్తువేశాడు. రాజ కుటుంబంలోని అంతర్గత విభేదాలను, రాజైన నాలుగో ఛార్లెస్ తెలివితక్కువతనాన్ని తనకు అనుకూలంగా మలచుకొని, సాధింపులు, బెదిరింపులతో వారు స్పానిష్ సింహాసనంపై తమ హక్కులను వదులుకొనేలా చేశాడు. అక్కడ ఖాళీ అయిన సింహాసనంపై, తన సోదరుడైన జోసెఫ్‌ను కూర్చుండ బెట్టి, అతడు

అంతవరకు పరిపాలిస్తున్న నేపిల్స్ రాజ్యాన్ని తన బావమరది అయిన మూరత్ (Murat) కు ఇచ్చాడు. దీనితో బూర్బన్ వంశీయులు పరిపాలిస్తున్న రాజ్యాలన్నీ, ఒక్క సిసిలీ మినహా, బొనాపార్టీ వంశీయుల పరమైనాయి. (లోగడ ఫ్రాన్సు, స్పెయిన్, నేపిల్స్, సిసిలీ రాజ్యాలను బోర్బన్ వంశీయులు పరిపాలించేవారు).

తమ రాజవంశాన్ని అధికారం నుండి తొలగించి, నెపోలియన్ తన సోదరుణ్ణి అక్కడ రాజుగా నియమించడం స్పానిష్ ప్రజానీకానికి దుస్సహం అయింది. ఫ్రెంచి విప్లవం, తదనంతర పరిణామాలు ఆ దేశ ప్రజల్లో రేకెత్తించినటువంటి జాతీయభావాలు, దేశాభిమానము క్రమంగా అన్ని ఐరోపాదేశాల్లోనికి వ్యాపిస్తూ, ప్రజలను జాగృతం చేస్తున్నాయి. అప్పటికే, 1804 నుండి తూర్పు ఐరోపాలో తురుష్క సార్వభౌమత్వానికి, నియంతృత్వ పరిపాలనకు లోబడిన అనేక క్రైస్తవ ప్రజానీకాల్లో జాతీయాభిమానం జాగృతమై స్వాతంత్ర్య పోరాటాలకు పురికొల్పడం గమనించవచ్చు. అలాగే నెపోలియన్ సార్వభౌమాధికారంలో తమదేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సర్వసత్తాక సార్వభౌమాధికారము (Sovereignty) ని పోగొట్టుకొన్న విషయాన్ని అక్కడి ప్రజలు గుర్తించారు. వారు జోసెఫ్ బొనాపార్టీ తమ దేశానికి వచ్చి, సింహాసనం అధిష్ఠించడాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాట్లు లేవదీశారు. దీనితో ఐబీరియన్ ద్వీపకల్పం (Iberian Peninsula) లోని పోర్చుగల్, స్పెయిన్ దేశాలు నెపోలియన్ సార్వభౌమత్వాన్ని ధిక్కరించినట్లయింది. అనేక పెద్ద, బలమైన రాజ్యాలను సునాయాసంగా లొంగదీసిన నెపోలియన్‌కు స్పానిష్ ప్రజల తిరుగుబాటు ఒక సమస్యగా కన్పించలేదు, కాని అతడు ఘోరంగా పొరబడింది ఈ విషయంలోనే.

నెపోలియన్ పెద్ద సేనతో జోసెఫ్‌ను స్పెయిన్‌కు పంపి, అక్కడి తిరుగుబాటును అణచివేసి, అతన్ని సింహాసనంపై నిలిపేందుకు సన్నాహం చేశాడు. ఫ్రెంచిసేనకు డ్యూపాంట్ నాయకుడు, కాని, ఆ సేన క్రొత్తగా తయారై శిక్షణ పొందింది, అనుభవం లేనిది. 18 వేల సేనతో డ్యూపాంట్ స్పెయిన్‌లో ప్రవేశించి, అడుగడుగునా ఆటంకాలతో, అనేక పోరాటాల్లో ఘోరంగా ఓడిపోయి వారి చేతికి చిక్కాడు. స్పానిష్ ప్రజల విజయంతో గ్రేట్ బ్రిటన్ సంతోషపడి వారికి కావలసిన ఆర్థిక, సైనిక సాయం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ విధంగా ద్వీపకల్ప యుద్ధం (Peninsular war) ప్రారంభమై, నెపోలియన్ పతనం వరకు కొనసాగింది. "స్పానిష్ వ్రణం నన్ను తినివేసిందని" '(Spanish ulcer has eaten me) నెపోలియన్ తన సంపూర్ణ పరాజయాన్ని అంగీకరించేవరకు ఆ పోరాటం కొనసాగింది. అంతకంతకు అధిక సేనలను పంపినా, స్పానిష్ ప్రజల తిరుగుబాట్లను అణచడం అతనికి సాధ్యం కాలేదు.

ప్రబలమైన చక్రవర్తుల అపార సేనాబలం, ప్రజల బలం ముందు నిలవదు. చక్రవర్తులసేనలు సుశిక్షితమైనవి, ఆయుధ సంపద కలిగినవైనా, అవి దేశ ప్రజానీకం ముందు స్వల్ప సంఖ్యాకమే అవుతాయి. ప్రజలకు సైనిక శిక్షణలేకున్నా, ఆయుధ సంపద లేకున్నా, వారిలో బలీయమైన జాతీయభావము, స్వాతంత్ర్య కాంక్ష వారిని అపారమైన శక్తి సమన్వితులను చేస్తాయి. ఫ్రెంచి విప్లవకాలంలో జాతీయసమితి (National Convention) పంపిన సేనలు బలీయమైన ఆస్ట్రో - ప్రష్యన్ సేనలను ఓడించడం ఇందువల్లనే జరిగింది. సమకాలీనంగా తూర్పుఐరోపాలోని సెర్బులు, గ్రీకులు జరుపుతున్న స్వాతంత్ర్య పోరాటాలు తురుష్క సుల్తాన్ అణచివేయలేకపోవడానికి ఇదే కారణం. అదేవిధంగా, నెపోలియన్ తన సేనలతో అప్పటివరకు అనేక దేశాల సేనలతో పోరాడి గెలిచాడు. ఆ యుద్ధాల్లో తులనాత్మకంగా, ఆయా సేనల, సేనానాయకుల ఘనతకు ప్రాముఖ్యత ఉంది. కాని ఇప్పుడు నెపోలియన్ పోరాడడం జాతీయభావావేశం, దేశభక్తి స్వాతంత్ర్య కాంక్షలతో సుసంఘటితమైన ప్రజానీకంతో. కనుక అతనికి పరాజయం తప్పలేదు, ప్రజల తిరుగుబాట్లలో ఫ్రెంచి సేనాధిపతి డ్యూపాంట్ బేలన్ (Baylan) వద్ద ఓడి లొంగిపోయాడు. ఈ విజయం స్పానిష్ ప్రజలను మరింత ఉత్సాహపరచింది.

నెపోలియన్‌కు వ్యతిరేకంగా పోర్చుగల్, స్పెయిన్ పోరాటాలను సమర్థించడం తన నైతిక బాధ్యతగా భావించి, గ్రేట్ బ్రిటన్ ఆర్థర్ వెల్లస్లీ నాయకత్వంలో కొంత సైన్యాన్ని స్పెయిన్, పోర్చుగల్ రాజ్యాలకు సాయంగా పంపింది. ఆర్థర్ వెల్లస్లీ ఫ్రెంచి

సేనాధిపతి అయిన జునాట్‌ను వీమెయిరో (Vimiero) వద్ద ఓడించాడు, కాని, బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని వెనక్కు రప్పించి, అతని స్థానంలో నియమించిన సర్ హెన్రీ డాలింపుల్ (Sir Henrey Dalrymple) తెలివి తక్కువగా ఫ్రెంచి సేనలను గెలిచిన సంపదలతో తిరిగి పోయేందుకు అనుమతించాడు. అందుచేత బ్రిటిష్ ప్రభుత్వం అతనిపై విచారణ జరిపి, నిర్దోషిగా భావించినా, స్పానిష్ పోరాటానికి తిరిగి ఆర్థర్ వెల్లస్లీని సేనానాయకునిగా నియమించింది.

1808 లో జోసెఫ్ బోనాపార్టీ స్పానిష్ రాజధాని మాడ్రిడ్‌ను చేరాడు. కాని అప్పటికే ఫ్రెంచి సేనాని డ్యూపాంట్ ఓడి, లొంగిపోయాడు. అందుచేత అతనికి సాయంగా నెపోలియన్ అనుభవ సంపన్నులైన సేనానాయకులతో, పెద్ద సేనతో స్వయంగా కదలివచ్చాడు. అతన్ని ఎదిరించడానికి బ్రిటిష్ సేనాని సర్ జాన్ మూర్ (Sir John Moore) పోర్చుగల్ నుండి బయలుదేరి వచ్చాడు కాని, ధైర్యంచాలక వెనుదిరిగి పోయాడు, ఆ తరువాత చెప్పుకోదగిన సంఘటనలేవీ జరుగలేదు. అందుచేత నెపోలియన్ 1809 జనవరిలో తిరిగి పారిస్ నగరానికి తిరిగివచ్చాడు. కాని 1809 లో తిరిగి స్పానిష్ యుద్ధంలో బ్రిటిష్ సేనలకు నాయకుడై వచ్చిన ఆర్థర్ వెల్లస్లీ ఫ్రెంచిసేనాని సూల్ట్ (Soult) ను అనేకచోట్ల ఓడించి, తలావేరా (Talavera) యుద్ధంలో జోసెఫ్‌ను, అతనికి సాయంగా వచ్చిన మార్షల్ విక్టర్‌ను ఓడించాడు.

అంతట నెపోలియన్ 1810 లో మస్సేనా (Massena) నాయకత్వంలో ఒక పెద్దసేనను పోర్చుగల్ రాజధాని అయిన లిస్బన్ పైకి పంపాడు. కాని ఆ సేనలు పోర్చుగల్ చేరే లోపుగా ఆర్థర్ వెల్లస్లీ లిస్బన్ నగరానికి రక్షణగా మూడు వరుసలుగా దుర్గ ప్రాకారాలను నిర్మించి దుర్భేద్యం చేశాడు. మస్సేనా ఘోరంగా పరాజయం పొంది, లిస్బన్ నగరాన్ని సమీపించడానికి కూడ చేతకాక, స్పెయిన్‌లోనికి మరలివచ్చాడు. దుర్గ ప్రాకారాలనుండి బయటకు వచ్చిన ఆర్థర్ వెల్లస్లీ ఫ్రెంచి సేనానులను, మస్సేనా, సూల్ట్‌లను అనేక పర్యాయాలు ఓడించాడు. 1812 లో నెపోలియన్ రష్యాపై పెద్ద ఎత్తున దండయాత్ర చేయ సంకల్పించి, స్పెయిన్‌లోని సేనలను, సేనాధిపతులను వెనక్కు రప్పించడంతో అక్కడి ఫ్రెంచి బలగాలు మరింత బలహీనమైనాయి. ఆర్థర్ వెల్లస్లీ పోర్చుగల్ నుండి బయలుదేరి స్పెయిన్‌లో ప్రవేశించి, మస్సేనా బదులు స్పెయిన్‌లో ఫ్రెంచిసేనలకు నాయకత్వం వహిస్తున్న మార్మాంట్‌ను సలమాంకా (Salamanca) వద్ద ఘోరంగా ఓడించాడు.

ఆర్థర్ వెల్లస్లీ ఫ్రెంచి సేనలపై సాధించిన ఈ విజయాలతో పోర్చుగీస్, స్పానిష్ దేశాల ప్రజానీకాలు తమ స్వాతంత్ర్యం కనుచూపుమేరలో ఉన్నట్లు గ్రహించారు. అయితే స్వాతంత్ర్యానంతరం స్పెయిన్‌లో తిరిగి బూర్బన్ వంశీయుడైన ఏడో ఫెర్డినాండ్ రాజుకావడం వారికి ఇష్టంగా లేదు. కాడిజ్ (Cadiz) వద్ద ఒక ప్రజా ప్రముఖులసభ (Corter) సమావేశమై తమ దేశానికి ఒక రాజ్యాంగాన్ని తయారుచేసుకున్నారు. ఈ రాజ్యాంగం స్పెయిన్ దేశ సర్వసత్తాక సార్వభౌమాధికారం ప్రజలదేనని నిర్ణయించింది, రాజుకు చాలా పరిమితమైన అధికారాలను అనుమతించింది. అయితే అప్పటికింకా దేశం సంపూర్ణంగా ఫ్రెంచి ఆధిపత్యం నుండి స్వాతంత్ర్యాన్ని పొందలేదు; ఫెర్డినాండ్ తాత్కాలికంగా ప్రజలను సంతృప్తి పరచడానికి దానిని ఆమోదించి, తరువాత తన అధికారం స్థిరపరచుకున్న వెంటనే దానిని రద్దుచేయడానికి తనలో తనే నిశ్చయించుకున్నాడు. ఈ విధంగా 1812 నాటి స్పానిష్ రాజ్యాంగానికి తక్షణ ప్రాముఖ్యత లేకున్నా, దక్షిణ ఐరోపాలో ఉదారవాద రాజకీయ ఉద్యమాల చరిత్రలో తొలిమెట్టుగా పరిగణించదగింది.

1813 లో నెపోలియన్ జర్మన్ రాజ్యాల్లో, అనగా ఆస్ట్రియా, ప్రష్యాలతో పోరాడుతూ మరింత సేనను స్పెయిన్ నుండి ఉపసంహరించవలసి వచ్చింది. అందుచేత ఫ్రెంచిసేనలు మరికొన్నిచోట్ల పరాజయాలు పొందడమూ, స్పెయిన్ రాజధాని, మాడ్రిడ్ (Madrid) లో నివసించడం అసాధ్యమని భావించి, జోసెఫ్ వెనుకకు తగ్గడం జరిగింది. నెపోలియన్ సేనానుల్లో ప్రముఖుడైన మార్షల్ జోర్డన్ జోసెఫ్‌కు సాయంగా వెళ్ళాడు; పిరనీస్ పర్వతాలకు దక్షిణంగా విట్టోరియా (Vittoria) వద్ద వారిద్దరు ఘోరంగా ఓడిపోయారు. తరువాత మరికొన్ని పోరాటాల్లో సైతం పరాజయాలు పొందిన ఫ్రెంచిసేనలు స్పెయిన్‌లో పూర్తిగా నిర్వీర్యమైపోగా,

వెల్లింగ్టన్ (ఆర్థర్ వెల్లస్లీకి డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్‌గా ఉన్నతహోదా లభించింది) ప్రభువు ఐబీరియా ద్వీపకల్పాన్ని పూర్తిగా విముక్తంచేసి, 1814 లో పిరనీస్ పర్వతాలను దాటి, ఫ్రాన్సుపైనే దాడి చేయగలిగాడు.

## 7.7.3.3. ద్వీపకల్పయుద్ధ ఫలితాలు :

1807-08 సంవత్సరాల్లో నెపోలియన్ ద్వీపకల్ప యుద్ధంలో, అనగా పోర్చుగల్, స్పెయిన్ దేశాల్లో పొందిన పరాజయాల వలన అతని ప్రతిష్ఠ బాగా దెబ్బతిన్నది. దిగజారుతున్న ప్రతిష్ఠను పునరుద్ధరించుకోవడానికి అతడు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం ప్రదర్శించవలసి వచ్చింది. ఆ ప్రయత్నంలో భాగంగా 1808 లో ఎర్ఫర్ట్ (Erfurt) వద్ద జార్ మొదటి అలెగ్జాండర్‌తో సమావేశమై ఇరువురు చక్రవర్తుల నడుమ టిల్సిట్ సంధితో సమకూరిన స్నేహసహకారాలను మరొకసారి పదిలం చేసుకున్నాడు. కాని 1809 లో ఆస్ట్రియా మరొకసారి నెపోలియన్‌పై దండయాత్ర ప్రకటించి పూర్వపు పరాజయాలకు ప్రతిక్రియ చేయాలని తలచింది. ద్వీపకల్ప యుద్ధంలో నిమగ్నమై ఉన్న నెపోలియన్ తగినంతసేనను సమీకరించలేడని, ఈసారి అతన్ని తప్పక ఓడించి, లోగడ పొందిన అవమానాలను చెరిపి వేయవచ్చునని ఆస్ట్రియా ఆశించింది. ఈ విధంగా ద్వీపకల్పయుద్ధం నెపోలియన్‌కు సమస్యలు సృష్టించింది.

## 7.7.3.4. ఆస్ట్రియాతో పోరాటం :

గతం 20 సంవత్సరాలకాలంలో నాలుగోసారి ఆస్ట్రియా ఫ్రాన్సుపై 1809 ఏప్రిల్‌లో పోరాటం ప్రకటించింది. ద్వీపకల్పయుద్ధం నెపోలియన్ శక్తియుక్తులకు పూర్తిగా పని కల్పించిందని, తనను ఓడించే సైనికసంపత్తి ఇప్పుడతని వద్ద లేదని ఆస్ట్రియా చక్రవర్తి మొదటి ఫ్రాన్సిస్ భావించాడు. కాని నెపోలియన్ భారీసేనతో ఆస్ట్రియాపైకి నడిచి, వియన్నాను ఆక్రమించి, ఫ్రాన్సిస్ చక్రవర్తిని ఆశ్చర్యపరచాడు. అయితే ఆ సమయంలో ఆస్ట్రియా ప్రధానసేనలు ఆర్చిడ్యూక్ ఛార్లెస్ నాయకత్వాన వియన్నాకు కొంతదూరంలో, డాన్యూబ్‌నది ఒడ్డున కేంద్రీకృతమై ఉన్నాయి. నెపోలియన్ ఆ నదిని దాటి ఆస్ట్రియా సేనలను ధ్వంసం చేయదలచాడు. కొంత సేన మాత్రం నదిని దాటిన తరువాత ఆస్ట్రియా సేనలు వారిని ఎదిరించి చీకాకు పరచడంతో నెపోలియన్ వెనక్కు తగ్గవలసి, ఆస్పెర్న్ (Aspern) వద్ద ఓటమిని చవిచూడవలసి వచ్చింది. కొంత వ్యవధిలో సేనను తిరిగి సమీకరించుకొని తిరిగి ఆస్ట్రియా సేనలను వాగ్రమ్ (Wagram) వద్ద ఎదిరించాడు. ఈ యుద్ధంలో నెపోలియన్ విజయం సంపాదించాడు కాని, అతని సేన అధికంగా ధ్వంసం అయింది. ఆస్ట్రియన్‌లు పరాజయం పొందారు, కాని అతి స్వల్ప సైనిక నష్టంతో బయటపడ్డారు. నెపోలియన్ శక్తియుక్తులు క్రమంగా సన్నగిల్లుతున్నాయని దీనిని బట్టి స్పష్టమౌతుంది. అయినా, పోరాటం కొనసాగించడం కష్టనష్టాలను అధికం చేస్తుందేమోనని ఫ్రాన్సిస్ చక్రవర్తి భయపడి, శాంతి సంభాషణలను ప్రారంభించాడు. ఉభయుల నడుమ అక్టోబర్‌లో వియన్నాసంధి కుదిరింది. ఆస్ట్రియా వియన్నా సంధివల్ల గాలీషియా భూభాగంలోని పశ్చిమభాగాన్ని నెపోలియన్ అధీనంలోగల గ్రాండ్ డచి ఆఫ్ వార్సాకు, తూర్పుభాగాన్ని రష్యాకు సమర్పించుకోవలసి వచ్చింది. ఇలిరియన్ (Illyrian) రాష్ట్రాలను నెపోలియన్ ఫ్రెంచి సామ్రాజ్య భాగాలుగా ఆక్రమించాడు. టైరోల్‌ను, ఎగువ ఆస్ట్రియాను నెపోలియన్ మిత్రరాజ్యమైన బవేరియా ఆక్రమించింది. ఈ సంధివలన ఆస్ట్రియా నాలుగున్నర మిలియన్ల జనాభా కలిగిన భూభాగాలను పోగొట్టుకొని యుద్ధఖర్చుల పరిహారంగా (Indemnity) అపారమైన ధనాన్ని నెపోలియన్‌కు చెల్లించింది; లక్షా పదివేలకు సైన్యాన్ని ఎన్నడూ మించకుండ అదుపులో ఉండడానికి అంగీకరించింది. మున్ముందు ఇటువంటి అనాలోచితమైన యుద్ధాలకు పూనుకోకుండ వాగ్దానం చేసింది.

అంతేకాక, ఆ సమయంలో నెపోలియన్‌కు తన సామ్రాజ్యానికి వారసుడు తనవలె సాధారణమైన ప్రభువంశానికి చెందినవాడు కాకుండ, తల్లి వైపు నుండి అయినా, ఒక ఉన్నతమైన రాజవంశీయుడు కావాలని కోరిక కలిగింది. 1810 లో తనకు లోగడ జోసెఫిన్‌తో జరిగిన వివాహం సరైన స్థానిక (Parish) మతాచార్యుని సమక్షంలో పవిత్రం చేయడం జరగలేదని, అందువలన

చెల్లదని ప్రతిపాదించి, రద్దు చేసుకొన్నాడు. ఆ తరువాత ఆస్ట్రియా చక్రవర్తి రెండవ ఫ్రాన్సిస్ కుమార్తె అయిన మారియా లూసా (Maria Louisa) ను వివాహం చేసుకొన్నాడు. మరుసటి సంవత్సరం వారికి జన్మించిన కుమారునికి రోమ్‌కు రాజుగా బిరుదాన్ని ఇచ్చాడు. వియన్నా సంధిలో ప్రాదేశిక నష్టాలకు గురై, తమ రాకుమార్తెనిచ్చి వివాహం చేయవలసిరావడం ఆస్ట్రియాకు మనసులో మంట కల్గించింది.

## 7.7.3.5. ప్రష్యాతో పోరాటం :

పోర్చ్‌గల్, స్పెయిన్‌లలో ప్రారంభమైన ప్రజాచైతన్యము, దాని ఫలితమైన స్వాతంత్ర్య పోరాటాలు 1810 లో ప్రష్యాలోను చెప్పదగిన రీతిలో ప్రారంభమైనాయి. 18 వ శతాబ్దిలో ఫ్రాన్సు దేశంలో సంభవించిన ఉదారవాదము, మానవతావాదాలతో కూడిన మేధోద్దీపన (Enlightenment) ప్రష్యాలోనూ ప్రారంభమైంది. అయితే ఫ్రాన్సులోవలె నిరపేక్షరాచరికము, ప్రభువర్గమూ దానిని అణచివేయ పూనుకోలేదు. భూస్వామ్య విధానాన్ని, సేద్యబానిసత్వాన్ని రద్దుచేయడానికి, స్వేచ్ఛా సమానత్వాలను ప్రజలకు ఇయ్యడానికి ప్రష్యారాజు మూడో ఫ్రెడరిక్ విలియమ్ అంగీకరించాడు. ఈ సంస్కరణలు స్పెయిన్‌లోవలె, జాతీయభావాన్ని, స్వాతంత్ర్యకాంక్షను ప్రజల్లో రగుల్చుతున్నాయి. జెనా, అవుర్ స్టాట్ యుద్ధాల్లో ప్రష్యా పరాజయం పొంది పరాభవానికి గురికావడం, టిల్సిట్ సంధిలో భూభాగాన్ని కోల్పోవడము వారిని ఆవేశపరచి, ఆ పరాభవాన్ని చెరిపివేసుకోవడానికి ప్రోత్సహిస్తున్నాయి. ఈ పరిణామాలను నెపోలియన్ వ్యతిరేకించాడు. దీనికి కారకులైన సంస్కరణవాదులను పదవుల్లో నుండి తొలగించేందుకు ప్రష్యా రాజుపై ఒత్తిడి తెచ్చాడు. నెపోలియన్ చర్యలు ప్రష్యన్లను మరింత ఆవేశపూరితులను చేసి, తమ అంతర్గత వ్యవహారాల్లో అతడు అనవసరంగా జోక్యం చేసుకొంటున్నట్లు భావించారు. ఆ సమయంలో ద్వీపకల్ప యుద్ధంలో నెపోలియన్ స్పష్టమైన పరాజయాన్ని పొందడము, 1812 లో స్పెయిన్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడము జరిగాయి. ఈ పరిణామాల్లో ప్రష్యా నెపోలియన్‌పై పోరాటానికి సిద్ధపడసాగింది.

## 7.7.3.6. రష్యాతో స్పర్ధ :

టిల్సిట్ సంధి (1807) తో ఫ్రెంచి చక్రవర్తి నెపోలియన్, రష్యా జార్ మొదటి అలెగ్జాండర్ ఆప్తులైనట్లు, ఉభయులు తమ సామ్రాజ్యాధికారాలను విస్తరించుకొని ఐరోపాను చెరిసగం పంచుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు పైన వివరించడం జరిగింది. అయినా అతి కొద్దికాలంలో ఉభయులు తమ రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడంలో విభేదించి పోరాటాలకు దిగడం జరిగింది. తన పలుకుబడిని విస్తరించుకోవడంలో రష్యా తనకు సహకరించినంతగా నెపోలియన్ రష్యాకు సహకరించలేదు.

నెపోలియన్ ప్రష్యానుండి ఆక్రమించిన పోలిష్ భూభాగాన్ని గ్రాండ్ డచి ఆఫ్ వార్సా అనే పేర ప్రత్యేక రాజ్యంగా తన రక్షణలో ఏర్పరచడం జార్‌కు ఆందోళన కలిగించింది. ఈ ఏర్పాటుతో నెపోలియన్ పోలిష్ ప్రజల జాతీయభావాలను, స్వాతంత్ర్యకాంక్షను నెరవేర్చినట్లు, విదేశీ ఆక్రమణల్లో (రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాల) అంతర్ధానమైన పోలెండును తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు కనిపించి, ఆ ప్రజల గౌరవాదరాలను పొందాడు. అతడు తరువాత ఇదే విధంగా రష్యా ఆక్రమణలోని భూభాగాన్ని వదులుకోవలసిందిగా, గ్రాండ్ డచి ఆఫ్ వార్సాలో కలిపివేయవలసిందిగా ఒత్తిడితేవచ్చు; లేదా ఆ ప్రాంతంలోని పోలిష్ ప్రజలు రష్యాపై తిరుగుబాటు చేసి, గ్రాండ్ డచి ఆఫ్ వార్సాలో చేరిపోవచ్చు. కనుక నెపోలియన్ పోలిష్ విధానం జార్‌కు ఆందోళనకరమైంది.

నెపోలియన్ ఆస్ట్రియా రాకుమార్తె మారియా లూసా (Maria Louisa) ను వివాహం చేసుకోవడం కూడ జార్ మొదటి అలెగ్జాండర్‌కు అశాంతి కల్గించింది. ఆస్ట్రియా అప్పటివరకు ఫ్రాన్సుకు రష్యాకు ఉభయులకు ప్రత్యర్థి, కనుక వారిరువురు కలసి ఆస్ట్రియాను అదుపులో ఉంచవచ్చు. కాని ఈ వైవాహిక సంబంధం వలన ఫ్రాన్సు ఆస్ట్రియాకు బాగా చేరువ కాగలదని, అది తనకు ప్రమాదకరం కాగలదని జార్ శంకించాడు.

1809 లో జార్ అలెగ్జాండర్ స్వీడన్‌పై దండెత్తి, ఫిన్లాండును ఆక్రమించాడు. అందువలన రష్యా దేశానికి బాల్టిక్ సముద్రం నుండి నౌకాయానానికి వీలు కలిగింది. ఇందుకు నెపోలియన్ అభ్యంతర పెట్టలేదు; కారణమేమంటే రష్యా బాల్టిక్ సముద్రం నుండి అట్లాంటిక్ సముద్రంలోనికి ప్రవేశించి, ఖండాంతర వాణిజ్యంలో పాల్గొనడం వలన గ్రేట్ బ్రిటన్‌కు ఎక్కువ ప్రమాదం. అందుచేత గ్రేట్ బ్రిటన్ రష్యాతో కొంతవరకు సత్సంబంధాలే కలిగి ఉండడాన, ఆ దేశంపై కాక స్వీడన్‌పై దండెత్తి ఓడించి, ఫిన్లాండుకు మారుగా నార్వేను స్వాధీనపరచుకొనేలా ఏర్పరచింది. నార్వే అప్పటికి ఫ్రాన్సుకు మిత్రరాజ్యమైన డెన్మార్క్ అధీనంలో ఉంది. కాగా రష్యా నార్వే ఆక్రమణ ఫ్రాన్సుతో, నెపోలియన్‌తో పోరాటానికి కారణమైంది.

ఈ కారణాలన్నీ సమిష్టిగా రష్యా భూఖండ విధానాన్ని తిరస్కరించడానికి పురికొల్పాయి. భూఖండ విధానాన్ని తిరస్కరించడం, అనగా గ్రేట్ బ్రిటన్‌తో వాణిజ్య సంబంధాలను కలిగిఉండడం, నెపోలియన్‌కు అత్యంత ఆగ్రహకారణం. కనుక అతడు రష్యాపై యుద్ధం ప్రకటించాడు. అప్పటికి రష్యా ప్రధానంగా వ్యావసాయిక దేశం, తన వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేయడమూ బ్రిటిష్ వస్తువులను, అనగా బ్రిటన్ ఎగుమతిచేసే అనేక దేశాల ఉత్పత్తులను తన వినియోగానికి తెప్పించుకోవడం అత్యంత ఆవశ్యకమైన విషయం. భూఖండ విధానాన్ని అంగీకరించడంతో జార్ ప్రజల నిరసనలకు గురై, అక్కడక్కడ అల్లర్లు కూడా చెలరేగడంతో ఆందోళన చెందాడు, భూఖండ విధానానికి స్వస్తి చెప్పాడు.

1812 లో నెపోలియన్ రష్యాపై దండయాత్ర ప్రకటించగానే, ఆస్ట్రియా 30 వేల సేనను అతనికి సాయంగా పంపింది. ప్రష్యా మరొక 20 వేల సేనను పంపుతూ, నెపోలియన్ ప్రష్యా భూభాగాలనుండి తన సేనలను రష్యాలోనికి నడిపించడాన్ని ఆమోదించాడు. ఈ రెండుదేశాలు ఆవిధంగా సహకరించనట్లైతే, నెపోలియన్ తన సేనను, సమయాన్ని కొంతవరకు జర్మన్ భూభాగాలపైనే ఖర్చుచేయవలసివచ్చేది, రష్యాతో పోరాటంలో మరింత ఘోరంగా పరాజయం పొందేవాడు. ఫ్రాన్సు నుండి 2 లక్షల 50 వేల సేనను, రైన్ రాజ్యసమాఖ్య నుండి మరొక లక్ష ఏబదివేల సేనను, 80 వేల ఇటాలియన్, 60 వేల పోలిష్ సేనలను, డచ్చి, డేనిష్ పటాలాలను, మొత్తం 6 లక్షల సేనతో రష్యాపై దండెత్తాడు.

ఆ సమయంలో రష్యా సెర్బుల స్వాతంత్ర్య పోరాటానికి మద్దత్తుగా తురుష్కులతో పోరాటం చేస్తూ తన సేనతో అధిక భాగాన్ని అక్కడికి పంపింది. కనుక నెపోలియన్ అది తనకు సరైన అదనుగా భావించాడు. ఆ పోరాటంలో టిల్సిట్ సంధిలో అంగీకరించిన షరతులను గౌరవించి నెపోలియన్ రష్యాకు తనమద్దత్తు అందించవలసి ఉంది. కాని అలా చేయలేదు. రష్యా బ్రిటిష్ మధ్యవర్తిత్వంతో తురుష్కులతో బుఖారెస్టు సంధి చేసుకొని, 1812 లో పోరాటాన్ని ముగించి, నెపోలియన్‌తో పోరాడేందుకు సిద్ధమైంది. ఇప్పుడు రష్యాకు నైతికంగానేమి, సైనికంగానేమి గ్రేట్ బ్రిటన్, స్వీడిష్ యువరాజైన బెర్నిడోట్ మద్దత్తునిస్తున్నారు. బెర్నిడోట్ లోగడ నెపోలియన్ సేనాపతుల్లో ఒకడు, స్వీడన్‌కు యువరాజుగా, కాబోయేరాజుగా అతనిచేతనే నెలకొల్పబడినవాడు. కాని నెపోలియన్ నియంతృత్వమూ, సామ్రాజ్యవాదము, అధికార వ్యామోహాలతో విసుగెత్తి, రష్యా పక్షాన చేరాడు. ఉభయుల నడుమ స్నేహాన్ని గూర్చి పైన వివరించడం జరిగింది.

## 7.7.3.7. రష్యాతో పోరాటం :

నెపోలియన్ తగిన సన్నాహాలతో 1812 జూన్ నెలలో రష్యాపై పోరాటం ప్రకటించకుండానే నైమన్ (Niemen) నదిని దాటి రష్యా భూభాగంలో ప్రవేశించాడు. వాస్తవంగా సంఖ్యాబలంలో, సాయుధ సంపదలో, నిర్వాహక పటిష్ఠతలో నెపోలియన్ నాయకత్వంలోని ఫ్రెంచిసేనలు ఆధిక్యత కలవి. కనుక రష్యా సేనలు ధైర్యంగా వాటిని ఎదిరించలేక వెనుకకు మరలసాగాయి. రష్యా సేనలు బార్క్లేడిటోలీ (Barclay de Tolly) నాయకత్వాన ఒకవైపునుండి, బాగ్రాటియన్ (Bagration) నాయకత్వాన మరొక వైపునుండి నెపోలియన్‌ను ఎదిరించాయి కాని, ఉభయసేనలు, ప్రత్యక్షంగా తలపడకుండ వెనుకంజవేస్తూ, నెపోలియన్‌ను

మరింత మరింతగా రష్యా భూభాగంలోనికి రప్పించాయి. వారు పోతూ పోతూ దారిలో పట్టణాలను, పల్లెలను నిర్మానుష్యంచేసి, పురోగమిస్తున్న ఫ్రెంచి సేనలకు ఏవిధమైన సంపదలు, వస్తువులు, ఆహారపదార్థాలు లభించకుండ చేశారు. బార్క్లేడిటోలీకి మారుగా నియమితుడైన కుతుసోవ్ (Kutusov) బొరోడినో (Borodino) వద్ద ఫ్రెంచిసేనలను నిలువరించడానికి సెప్టెంబర్ 7 న వ్యర్థ ప్రయత్నం చేశాడు. అయితే, ఆ పోరాటంలో సైతం అప్పటికే రష్యా భూభాగంలో సుమారు ఏడువందల మైళ్ళదూరం చలిబాధలో రోగగ్రస్తమై, సరైన ఆహారం లేని ఎడారి భూముల్లో నడిచిన ఫ్రెంచిసేన అపారంగా నష్టమైంది. ఈ విధమైన విపత్కర పరిస్థితిలోనే ఫ్రెంచిసేనలు చాలవరకు బలహీనమై, కొన్ని సైనిక పటాలాలు పోరాటం వదిలి వెనక్కు పోవడం, ఆస్ట్రియా, ప్రష్యాల నుండి ఆశించిన విధంగా సైనిక సాయం లభించక పోవడమూ - జరిగింది.

బొరోడినో వద్ద విజయం సాధించగలిగి, ఒక వారం తరువాత నెపోలియన్ మాస్కోలో ప్రవేశించగలిగినా, నిర్మానుష్యము, ఐశ్వర్యరహితమూ అయిన ఆ నగరం అతనికి ఏవిధమైన ప్రయోజనమూ, ప్రతిష్ఠ చేకూర్చలేదు. నెపోలియన్ ప్రవేశించిన నాటి రాత్రి, ఆకస్మికంగా ప్రజ్వరిల్లిన మంటల్లో సైనికుల నివాసాలు, ఆహారపదార్థాల నిలువలు సంపూర్ణంగా దగ్ధమై పోయాయి. ఇది రష్యన్లు అవలంబించిన యుద్ధ తంత్రంలో ఒక భాగమని కొందరు చరిత్రకారులు భావించడం యుక్తమేకావచ్చు. ఈ విధంగా మాస్కో ఆక్రమణ తరువాత నెపోలియన్ పాట్లు అధికమైనాయికాని, తీరలేదు. అయినప్పటికి జార్ సంధి సంప్రదింపులు ప్రస్తావిస్తాడనే ఆశతో నెపోలియన్ కొంతకాలం అక్కడనే వేచిఉన్నాడు. రష్యన్ సేనాధిపతులు అప్పుడప్పుడు అటువంటి సూచనలిస్తూ అతన్ని ఆశపెట్టారు. కాని జార్ ఫ్రెంచిసేనలు సంపూర్ణంగా రష్యా భూభాగం నుండి వైదొలగిన తర్వాతనే స్నేహసంబంధాలను గూర్చి ప్రస్తావించడం జరుగుతుందని నిర్మొహమాటంగా స్పష్టపరచాడు. చేసేదిలేక, నెలపైగా మాస్కోలో దుర్భర పరిస్థితిలో గడిపి అక్టోబర్ 22 న నెపోలియన్ మాస్కోనుండి తిరిగి స్వదేశానికి ప్రయాణం అయినాడు. అతడు డిసెంబర్ 13 న తిరిగి నైమన్ నదిని దాటి ఫ్రెంచి భూభాగంలో అవమానభారంతో అడుగుపెట్టాడు. నెపోలియన్ రష్యానుండి వెనక్కు మరలడం చరిత్రలోనే అత్యంత దుర్భర పరిస్థితిగా కూస్ వ్యాఖ్యానించాడు.

తిరుగు ప్రయాణంలో తాను వచ్చిన దారిని రష్యన్ సేనలు ముందుగానే ధ్వంసంచేసి ఆహారపదార్థాలు లభించకుండ చేసినందున, ఆ దారిని కాక, దానికి సమాంతరంగా దక్షిణ దిక్కున వేరొక మార్గాన, ఆస్ట్రియాకు చేరడానికి నెపోలియన్ యోచించాడు. కాని రష్యన్ సేనానులు ఆ మార్గాన్ని మూసివేసి, అతడు వచ్చిన దారినే మరలిపోయేవిధంగా గత్యంతరం లేని స్థితిని సృష్టించారు. ప్రకృతిసిద్ధంగాను, యుద్ధాల్లోను చాలావరకు ధ్వంసమైన ఫ్రెంచిసేనలు, ధైర్యము, ఉత్సాహం కోల్పోయి, దుష్కరమైన మార్గాన తిరిగివెళ్తూ అనేకచోట్ల వెనుకనుండి రష్యన్ సేనల దాడులను భరిస్తూ, మిగిలిన సేనలు కూడ చాలావరకు నష్టమై, నెపోలియన్ సర్వస్వమూ కోల్పోయి స్వదేశం చేరాడు. ఐరోపా ఖండాన్ని గడగడ లాడించిన, ఆశ్చర్యపరచిన, నెపోలియన్ సైనికనాయకత్వ పటిమ, ధైర్య సాహసాలు, వ్యూహచాతుర్యం అన్నీ రష్యాదండయాత్రలో నిశ్శేషంగా అంతరించాయి.

### 7.7.4. చతుర్థ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి (Fourth Coalition of European Powers) : విముక్తి పోరాటం :

1812 సంవత్సరంలో సుదీర్ఘకాలంగా చేస్తున్న ద్వీపకల్ప పోరాటం (Peninsular war) లో, స్పెయిన్, పోర్చుగల్ దేశాలతో, నెపోలియన్ పరాజయం స్పష్టపడింది. అదే సంవత్సరంలో రష్యాతో చేసిన దండయాత్రలో ఫ్రెంచిసేన, నెపోలియన్ ప్రతిష్ఠ ధ్వంసం అయినాయి. ఈ పరిణామాలతో లోగడ అతనిచేత ఓడి పరాభవం పొందిన ఆస్ట్రియా-ప్రష్యాలు అతని నియంతృత్వాధిపత్యం నుండి విముక్తం కావడానికి పోరాటాలకు సిద్ధమైనాయి. నెపోలియన్ దండయాత్ర వల్ల తీవ్రమైన నష్టానికి గురైన జార్ మొదటి అలెగ్జాండర్, వారితో అన్ని విధాల సహకరించడానికి సంసిద్ధతను వ్యక్తంచేశాడు. జార్ మొదటి అలెగ్జాండర్ నెపోలియన్‌తో ఆ సమయంలో తనకు అన్నివిధాల అనుకూలమైన షరతులతో సంధి చేసుకోవచ్చు. కాని అతడు అంతకుమించిన

పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని, ఐరోపా ఖండాన్ని నెపోలియన్ నియంతృత్వం నుండి విముక్తం చేసిన ఘనతను సాధించాలని నిశ్చయించుకున్నాడు. అందుచేత అతడు ఆస్ట్రియా, ప్రష్యాలతో చేరి విముక్తి పోరాటానికి నాయకత్వం వహించదలచాడు. మొదటినుండి అనేక పర్యాయాలు ఐరోపారాజ్య సంకీర్ణకూటముల్లో పాల్గొని, ఫ్రెంచి అధిగమనాన్ని, నెపోలియన్ ప్రాబల్యాన్ని అరికట్టడంలో ఫలం కాలేకపోతున్న గ్రేట్ బ్రిటన్ కూడ వారితో సహకరించడానికి ముందుకు వచ్చింది.

## 7.7.4.1. ఐరోపా విముక్తకునిగా జార్ మొదటి అలెగ్జాండర్ :

1812 డిసెంబర్ మాసాంతాన జార్ మొదటి అలెగ్జాండర్ ప్రష్యాసేనాని జనరల్ యార్క్ (Yorck) తో, ప్రష్యాసేనలు రష్యన్ స్వీడిష్ సేనలతో సహకరించేట్లు, అందుకు ప్రతిగా ప్రష్యాను జెనా యుద్ధానికి పూర్వపు విస్తీర్ణంతో పునరుద్ధరించేట్లు ఒప్పందం చేసుకున్నాడు. 1813 జనవరిలో అతడు నైమన్ నదిని దాటి ఫ్రెంచి భూభాగంలో ప్రవేశించి, ఐరోపా ప్రజానీకాల విముక్తి పోరాటం ప్రకటించాడు. ప్రష్యారాజు మూడో ఫ్రెడరిక్ విలియం తన సేనాని రష్యాతో చేసుకొన్న ఒప్పందాన్ని ధృవీకరించి, ప్రజల అభినందనలు పొందాడు. అప్పటికి నెపోలియన్ ఆధిపత్యం క్రింద ప్రష్యా తన సర్వసత్తాక సార్వభౌమత్వాన్ని కోల్పోయి, భూఖండ విధానానికి కట్టుబడి నిస్సహాయ స్థితిలో ఉండడంతో, ఆ రాజ్యంలోను, ఇంకా అనేక జర్మన్ రాజ్యాల్లోను బలమైన జాతీయభావాలు, స్వాతంత్ర్యకాంక్ష, జాతీయ సమైక్యతకై సంకల్పము ఏర్పడుతున్నాయి. రష్యా, ప్రష్యాల సహకారంతో నెపోలియన్ ఆధిపత్యం నుండి ఐరోపా విముక్తి పోరాటం ప్రారంభం అయింది. నెపోలియన్ విజయాలతో రైన్‌రాజ్య సమాఖ్యలోనికి చిట్టచివరిగా చేర్చబడిన మెక్లిన్‌బర్గ్ రాజ్యం మొట్టమొదటగా తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, అతని ఆధిపత్యాన్ని ధిక్కరించింది.

## 7.7.4.2. నెపోలియన్ ప్రతిచర్య :

అయితే అటువంటి విపత్కర సమయంలో సైతం నెపోలియన్ తన స్వాభావికమైన చాకచక్యము, తెలివి ప్రదర్శించి, నేపిల్స్ నుండి, దక్షిణ జర్మన్ రాజ్యాలనుండి సుమారు రెండులక్షల సైన్యాన్ని తరలించగలగాడు. ఈ సేనలతో అతడు 1813, మే 2 న సాక్జనీ (Saxony) రాజ్యంలో ప్రవేశించి, లూజెన్ (Lutzen) వద్ద రష్యా, ప్రష్యా సంయుక్తసేనలను ఓడించాడు. తరువాత మే 20 న బేజెన్ (Bantzen) వద్ద మరొక విజయం సాధించాడు. కాని, తగినంత అశ్విక బలం లేనందున ఈ విజయాలను పురస్కరించుకొని మరింత ప్రబలమైన ఎదురుదాడులు చేయడం అతనికి సాధ్యం కాలేదు, ఈ విజయాలు నిష్ఫలం అయినాయి.

## 7.7.4.3. మెటర్నిక్ జోక్యం :

ఆ సమయంలో ఆస్ట్రియా ప్రధానమంత్రి (Chancellor) అయిన మెటర్నిక్ ఉభయపక్షాల నడుమ రాజీ కుదర్చడానికి, ఐరోపాలో ప్రజ్వరిల్లుతున్న యుద్ధ జ్వాలలను ఆర్పడానికి ప్రయత్నించాడు. అతడు నెపోలియన్ కొన్ని షరతులకు అంగీకరిస్తే పోరాటం చల్లారుతుందని; ఈ విధమైన సూచనలు చేశాడు. అవి ప్రష్యాను పూర్వపు విస్తీర్ణంతో పునః ప్రతిష్ఠించడం; గ్రాండ్ డచి ఆఫ్ వార్సా (పోలెండు) ను ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాల నడుమ తిరిగి పంపకం చేయడం; ఆడ్రియాటిక్ తీరంలోని ఇలిరియన్ రాష్ట్రాలను (Illyrian provinces) తిరిగి ఆస్ట్రియా పరంచేయడం; రైన్ రాజ్యసమాఖ్యను రద్దుచేసి, జర్మనీకి చెందిన హామ్‌బర్గ్, లూబెక్ రేవుపట్టణాలను వదిలివేయడం.

కాని నెపోలియన్‌కు కావలసింది శాంతి కాదు; సంపూర్ణంగా శత్రువులపై విజయం, వారిని తన పాదాక్రాంతులను చేసుకోవడం. మిత్రులైనవారు శత్రువులుగా మారడము, సహకరించవలసినవారు సలహాలను ఇయ్యడం అతని పట్టుదలను, భంగపడ్డ వ్యక్తిత్వాన్ని మరింత బలీయం చేసి, మొండితనాన్ని పెంచాయి. అయితే, తన ఆశయాలను సాధించుకొనేందుకు,

కావలసినంతబలం చేకూర్చుకొనే వ్యవధి లభిస్తుంది కనుక, అతడు తాత్కాలికంగా ఈ యుద్ధ విరమణ షరతులను (Terms of armistice) అంగీకరించాడు. కాని, ఆ వ్యవధి నెపోలియన్‌కు ప్రయోజనం కంటే ప్రమాదానికే కారణమైంది. ఆ సమయంలో గ్రేట్ బ్రిటన్ ఐరోపాలోని అనేక శత్రురాజ్యాలను నెపోలియన్‌కు ప్రతిగా సమీకరించడానికి కావలసిన ఆర్థికసాయాన్ని అందించి, సైనిక ఒప్పందాలను చేసుకొని, అతనికి ప్రబలమైన ప్రత్యర్థి కూటమిని తయారుచేసింది. 1813 ఆగస్టులో నెపోలియన్ ఆస్ట్రియా ప్రతిపాదించిన యుద్ధవిరమణ షరతులను త్రోసిపుచ్చడంతో, పోరాటం ప్రారంభం కావడమూ, అది నెపోలియన్‌కు దురంతమైన సేనాబలంతో ఏర్పడడమూ, ఆస్ట్రియా కూడా వారితో చేరిపోవడము జరిగింది. ఈ శత్రుకూటమే నాలుగో ఐరోపారాజ్య సంకీర్ణకూటమి.

### 7.7.4.4. ఐరోపాజాతుల పోరాటం లేక లీప్జిగ్ (Leipzig) యుద్ధం (Battle of Nations) 1813 :

నాలుగో ఐరోపారాజ్య సంకీర్ణకూటమి ఏర్పడే సమయాన నెపోలియన్ నాలుగులక్షలసేనతో దక్షిణ జర్మనీలోని సాక్జనీలో ఉన్నాడు. ఉత్తర జర్మన్ రాజ్యాలైన బోహేమియా (Bohemia), సైలేషియా (Silesia) లలో ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలు తన సేనలను కేంద్రీకరించి ఉన్నాయి. 1813 ఆగస్టులో డ్రెస్డెన్ (Dresden) వద్ద నెపోలియన్ చిట్టచివరి ఘనవిజయాన్ని సాధించి, ఆస్ట్రియా సేనాని అయిన ష్వార్జెన్‌బర్గ్ (Schwarzenberg) ను ఓడించాడు. ఆ తరువాత ఫ్రెంచి సేనానులు పదే పదే పరాజయాలను ఎదుర్కొంటూ, వెనుకంజవేస్తూ లీప్ జిగ్ (Leipzig) వద్దకు చేరారు. అక్కడ ఫ్రెంచిసేనలు అన్నివైపులనుండి శత్రుసేనల దిగ్బంధించగా గత్యంతరం లేని స్థితిలో అక్టోబర్ 16 నుండి 19 వరకు మూడురోజులపాటు జరిగిన "ఐరోపాజాతుల పోరాటం" చేయక, విధ్వంసానికి గురికాక తప్పలేదు. పోరాటం మధ్యలో సాక్జనీ నెపోలియన్ పక్షాన్ని వీడి, సాటి జర్మన్ రాజ్యాలతో చేరిపోయింది. నెపోలియన్ కేవలం సైనికబలంతోను, తన సేనానాయకత్వ పటిమతోనూ నెలకొల్పి, విస్తరింపజేసిన సామ్రాజ్యం సైనికబలంతో ప్రత్యర్థులు తనను అనేక రెట్లు అధిగమించడంతో, తన సేనా నాయకత్వ పటిమ నిష్ప్రయోజనం కాగా, లీప్ జిగ్ పోరాటంలో ఓడి, రైన్ నదిని దాటి ఫ్రాన్సుకు తిరిగివచ్చాడు. అనంతరం ఒక సంవత్సరకాలంలోనే అతడు ఐరోపా అంతటా నెలకొల్పిన అధీనరాజ్యాలు ఒకదానివెంట ఒకటిగా కూలిపోయాయి.

రైన్ రాజ్యసమాఖ్య విచ్ఛిన్నమై అందలి జర్మన్ ప్రభువులందరు ఐరోపారాజ్య సంకీర్ణకూటమితో చేరిపోయారు. వెస్ట్‌ఫాలియా రాజ్యంనుండి అతని సోదరుడైన జెరోమ్ బోనాపార్టీని తిరుగుబాటుచేసి వెళ్ళగొట్టారు. హాలెండులో అతని అనుకూల ప్రభుత్వం, బటావియన్ రిపబ్లిక్, పతనమై పూర్వపు ఒరేంజి రాజవంశం తిరిగి అధికారం సంపాదించింది. డెన్మార్క్ 1814 జనవరిలో ఐరోపారాజ్యకూటమితో కీల్ (Kiel) సంధి చేసుకొని నార్వేను స్వీడన్‌కు ఇచ్చివేయడానికి దానికి బదులుగా స్వీడన్ నుండి పోమరేనియాను కొంత ఆర్థిక పరిహారాన్ని పొందడానికి అంగీకరించింది. అనగా నెపోలియన్‌కు అయిష్టమైన రీతిలో మిత్రరాజ్యాలతో సంధి చేసుకొంది. ఆస్ట్రియా టైరోల్ (Tyrol) ను ఇలిరియన్ రాష్ట్రాలను ఆక్రమించింది. నేపిల్స్‌లో అతని బావమరిది అయిన జోషిమ్ మురత్ కూడ ఆస్ట్రియాతో చేతులు కలిపి నెపోలియన్ పక్షాన్ని వదిలివేశాడు.

గ్రాండ్ డచి ఆఫ్ వార్సాలోని, వార్సా (Warsaw) రాజ్యము, దక్షిణ జర్మనీలోని సాక్జనీ రాజ్యము మాత్రమే ఇంకా నెపోలియన్ పట్ల కొంతవరకు విధేయంగా మిగిలిఉన్నాయి. అప్పటికి ఫ్రాన్సులో అదనంగా సైనికబలాలను తయారుచేసేందుకు యువకులెవరూ మిగలలేదు. ఆ సమయంలో సైతం నెపోలియన్ పట్టుదల సడలలేదు. ఆస్ట్రియా నెపోలియన్ పట్ల కొంత సాదరంగా సంధి షరతులను ప్రతిపాదించింది. ఫ్రాన్సు తన సహజ సరిహద్దులను కలిగిన, పదునాలుగో లూయీ కలలుకన్న జాతీయరాజ్యంగా, నెపోలియన్ పరిపాలించుకోవచ్చునని ఆస్ట్రియా ప్రతిపాదన సారాంశం. కాని నెపోలియన్‌కు కావలసింది తన యుద్ధ విజయాలతో ఏర్పడ్డ సామ్రాజ్యం కాని శత్రువులు మన్నించి ఇచ్చిన రాజ్యం కాదు.

1814 లో తిరిగి పోరాటం ప్రారంభమైంది. ప్రష్యా సేనాని బ్లూషర్ ఆస్ట్రియా సేనాని ష్వార్జెన్ బర్గ్ రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాల సంయుక్త సేనలతో రైన్ నదిని దాటి ఫ్రాన్స్ ఉత్తర భాగంలో ప్రవేశించారు. స్వీడిష్ రాజు బెర్నెడోట్ స్వీడిష్, డచ్చి, బెల్జియమ్ సేనలతో ప్రవేశించాడు. ద్వీపకల్ప యుద్ధంలో సంపూర్ణ విజయం సాధించిన బ్రిటిష్ సేనాని డ్యూక్ ఆఫ్ వెల్లింగ్ టన్ (ఆర్థర్ వెల్లస్లీ) స్పానిష్, పోర్చుగీసు సేనలతో దక్షిణ ఫ్రాన్సుపై పిరనీస్ పర్వతాలను దాటి, దండెత్తి వచ్చాడు. లంబార్డీ, వెనీషియాల నుండి మరొక ఆస్ట్రియన్ సైన్యం ఆల్ప్స్ (Alps) పర్వతాలను దాటి, ఫ్రాన్స్‌పై దండెత్తి వచ్చింది. మార్చి 1 న (1814) చతుర్ధరాజ్యకూటమి (Fourth coalition) లోని ప్రధాన దేశాలైన ప్రష్యా, రష్యా, ఆస్ట్రియా, గ్రేట్ బ్రిటన్ చౌమాంట్ (Chaumont) వద్ద సమావేశమై, రాగల 20 సంవత్సరములపాటు తమ దేశాలమధ్య స్నేహసహకారాలను కొనసాగిస్తూ, ఒకరికి విరుద్ధంగా మరొకరు వేరొకరితో సంధులు చేసుకొనకుండ, తమ ప్రధాన శత్రువైన నెపోలియన్ పూర్తిగా పదవీచ్యుతుడయేవరకు యుద్ధాన్ని వ్యతిరేకించకుండ, తాము అందరు, తలకొక లక్ష ఏబదివేల సేనను సమకూర్చుకోవడానికి, ఈ సంధి వలన అంగీకరించారు. గ్రేట్ బ్రిటన్ అదనంగా అయిదు మిలియన్ పౌండ్ల యుద్ధనిధిని సమకూర్చడానికి కూడ అంగీకరించింది.

### 7.7.4.5. ఫోంటనాబ్లో (Fontanableau) సంధి :

మార్చి 31 నాటికి ఫ్రెంచి సైన్యాల నిరోధం క్షీణించి, పారిస్ ఐరోపారాజ్య సంకీర్ణకూటమి వశం అయింది. ఏప్రిల్ నెలలో నెపోలియన్ కూటమి రాజ్యాధినేతలతో ఫోంటనాబ్లో (Fontanableau) సంధి చేసుకొని, సింహాసనాన్ని త్యజిస్తున్నట్లు, ఫ్రాన్సుదేశంపై తనకు, తన కుటుంబానికి సర్వ హక్కులు, అధికారాలను వదులుకుంటున్నట్లు, అందుకు బదులుగా కూటమి దేశాలు తనకిచ్చిన ఎల్బా (Elba) దీవిని తన నివాసంగా చేసుకొని, సంవత్సరానికి రెండు మిలియన్ ఫ్రాంకుల జీవనభృతిని పొందేట్లు అంగీకరించాడు. అతని భార్య మాజీ సామ్రాజ్ఞి (Ex-Empress) మేరీ లూసాకు ఇటలీలోని పార్మా (Parma) రాజ్యాన్ని ఐరోపారాజ్యకూటమి దేశాలు ఇయ్యడానికి అంగీకరించాయి.

### 7.7.4.6. నెపోలియన్ పునరాగమనం :

నెపోలియన్ ఎల్బా ద్వీపంలో సుమారు 10 నెలలు నివసించాడు. ఈలోగా భయంకర యుద్ధం వలన ఏర్పడ్డ సంక్షోభం, అరాచకత్వం క్రమంగా సర్దుకున్నాయి. ఆకాలంలో ఫ్రాన్సుదేశాన్ని ప్రశాంత పరిస్థితులు పునరుద్ధరించి, ప్రాదేశిక సమగ్రతకు భంగం వాటిల్లకుండ సంరక్షించినవాడు టాలీరాండ్. నెపోలియన్ కాలంలో ఐరోపారాజ్యాలకు, రాజ్యవ్యవస్థలకు ఏర్పడిన సంక్షోభాలను చక్కబరచడానికి వియన్నాలో రాజ్యాధినేతలందరు, సమావేశం అయిఉన్నారు. ఆ తరువాత కొద్దికాలంలో నెపోలియన్ తిరిగి ఫ్రాన్సులో ప్రత్యక్షం అయినాడు. నెపోలియన్ ఆశలకు ఐరోపాఖండం తప్ప ఎల్బా ద్వీపం సంతృప్తికరం కాదు, కనుక అతడు ఎక్కువకాలం ఫోంటనాబ్లో సంధికి కట్టుబడి ఉండలేకపోయాడు. అతన్ని ఫోంటనాబ్లో సంధి షరతుల్లో అంగీకరించిన విధంగా మిత్రదేశాలు, అనగా ఐరోపారాజ్య సంకీర్ణకూటమి దేశాలు సాదరంగాను, గౌరవంగాను మన్నించక ఐరోపా శాంతిభద్రతలకు భంగం కలిగించేవానిగానే అనుమానించాయి. తన భార్యకు, కుమారునికి వ్రాసిన లేఖలను చేరకుండ, వాటికి జవాబులు రాకుండ అటకాయించాయి; అనుకున్న విధంగా జీవనభృతిని చెల్లించలేదు. ఈ కారణాలన్నీ నెపోలియన్ పూర్వపు ఆశయాలు తిరిగి తలెత్తడానికి కారణమైనాయి. ఫ్రాన్సులో ప్రశాంత పరిస్థితులు నెలకొన్న తరువాత తనకు కొంత అనుకూల వాతావరణం ఏర్పడిందన్న విషయం అతడు అర్థం చేసుకొన్నాడు. వెంటనే ఫ్రాన్సుకు తిరిగివచ్చి, తన సామ్రాజ్యాన్ని పునర్నిర్మించే ప్రయత్నాలు ప్రారంభించాడు.

1815 ఫిబ్రవరి 26 న నెపోలియన్ ఎల్బా ద్వీపం నుండి కేవలం 700 మంది అనుచరులతో బ్రిటిష్ గస్తీ నౌకలను ఏమార్చి ఫ్రాన్సులో ప్రవేశించాడు. అతన్ని బంధించడానికి పంపిన సేనలు, అతనికి జయధ్వానం చేసి, స్వాగతం ఇచ్చాయి.

నెపోలియన్ రాజధానికి చేరేసరికి "ఫ్రెంచి సింహాసనం సంరక్షించడానికి ప్రాణత్యాగం చేస్తాన" ని ప్రతిజ్ఞ చేసిన పద్దెనిమిదో లూయీ బెల్జియం సరిహద్దులకు పారిపోయాడు. నెపోలియన్-ఐరోపా రాజ్యాధినేతల దురాక్రమణకు గురైన ఫ్రాన్సును రక్షించి, విప్లవ ఫలితంగా సాధించుకున్న స్వేచ్ఛా సమానత్వాలను, కర్షకులకు భూములపై హక్కులను కాపాడడము, ప్రభువర్గాలు తిరిగి దేశంలో తలెత్తకుండ చేయడానికి, యుద్ధాన్ని వదిలివేసి, ప్రజలను చక్కగా పరిపాలించడానికి తిరిగివచ్చినట్లు ప్రకటించాడు. ఇకనుండి రాజ్యాంగబద్ధంగా పరిపాలించడానికి కూడ వాగ్దానం చేశాడు.

## 7.7.4.7. వాటర్లూ యుద్ధం :

వియన్నాలో సమావేశమైన ఐరోపారాజ్యాధినేతలు అప్పటివరకు సంధి పత్రంలో చేర్చవలసిన అంశాల గూర్చిన వాదోపవాదాలతో, రాజకీయ వైరుధ్యాలతో సతమతమవుతూ ఉన్నారు. వారు నెపోలియన్ పునరాగమనంతో మేలుకొని, తమ విభేదాలను ప్రక్కనపెట్టి, ముంచుకొస్తున్న ప్రమాదాన్ని అరికట్టడానికి సన్నాహాలు ప్రారంభించారు. 1815 జూన్ 11 న నెపోలియన్ లక్షాఎనుబదివేల సేనతో యుద్ధరంగానికి కదిలిపోయి, ధైర్యసాహసాలతో, యుద్ధ తంత్ర నైపుణ్యంతో పోరాడాడు. కాని శత్రుకూటమిసేనలు అంతకు అనేక రెట్లు అధికంగా ఉండి అనేకచోట్ల జరిగిన పోరాటాల్లో తుదకు వాటర్లూ వద్ద నౌకాయుద్ధంలో విజయం సాధించాయి. జూన్ 21 న నెపోలియన్ పూర్తిగా ఓడిపోయి, నిరుత్సాహంగా పారిస్ నగరాన్ని చేరాడు. జూలై 7వ తేదీన సంకీర్ణకూటమి సేనలు మరొకమారు పారిస్ నగరాన్ని ఆక్రమించడమూ, నెపోలియన్ మరొకమారు సింహాసన త్యాగం చేసి, తన కుమారుని తన వారసునిగా నిలపడము జరిగాయి. ఫ్రాన్సులో లఫాయా ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పాడు.

జూలై 15 న నెపోలియన్ బాస్టిలీ కోట పతనం వార్షికోత్సవ దినంన, అమెరికా ఖండానికి చేరి తలదాచుకొనే ఉద్దేశంతో రోష్ఫోర్ట్ (Rochefort) రేవుపట్టణ ప్రాంతానికి వెళ్ళాడు. అతడు తనకు తానే బ్రిటిష్ నౌకాదళాధిపతులకు స్వాధీనపరచుకొని, తనకు ఇంగ్లాండులో లేదా అమెరికా ఖండంలో ఆశ్రయం కల్పించవలసిందిగా కోరాడు. కాని వారు అందుకు నిరాకరించి, సెంట్ హెలీనా ద్వీపానికి బందీగా తీసుకొని వెళ్ళారు. శేషజీవితాన్ని బ్రిటిష్ నిర్బంధంలో గడిపి, నెపోలియన్ 1821 మే 5 న మరణించాడు.

## 7.8. నెపోలియన్ పతనానికి కారణాలు :

నెపోలియన్ జీవిత చరిత్రను - అతని యుద్ధవిజయాలు, సామ్రాజ్య నిర్మాణము, పతనము - సమీక్షించిన తరువాత అతని పతనానికి కారణాలను గుర్తించవలసిఉంది. ఇక్కడ గుర్తించవలసిన అంశమేమంటే, అతని ఉచ్ఛదశకు కేవలం అతని శక్తిసామర్థ్యాలు ఎలా కారణమైనాయో అతని పతనానికి కూడ అవే మూలకారణాలనేది వాస్తవం.

1. నెపోలియన్ వ్యక్తిగతంగా చాలా పట్టుదల కలిగినవాడు. ఆ పట్టుదల అతన్ని నింపాదిగా పరిస్థితులను అవగాహన చేసుకొని తగిన ప్రణాళికతో కార్యాచరణకు పూనుకోనీయని మొండితనాన్ని కూడా కల్గించింది. పట్టుదల కలిగిన వారు గడ్డు సమస్యలు ఎదురైనకొలది, మరింత పట్టుదలతో మూర్ఖంగా ముందడుగు వేయడం సాధారణముగా మానవస్వభావం. అందునా, అతని తొలిదశలో సరైన సాయుధ సంపద, ఆహారపదార్థాలు, తుదకు సైన్యానికి సరైన దుస్తులు లేని దశలో ఇటలీ దండయాత్రను నిర్వహించి, ఆస్ట్రియాను లొంగదీసి సాధించిన విజయాలు అతనిలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని కల్గించాయి. అదే విధమైన ఆత్మవిశ్వాసంతో తుదివరకు గడ్డు పరిస్థితులను సవాలుగా తీసుకొని, వాటిని అధిగమించడానికి పట్టుదలతో ముందడుగు వేయడమే అతని స్వభావం అయింది. అంతేకాని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, అప్పటికి అవసరమైన ఉపాయాలను, కేవలం యుద్ధమేకాక, దౌత్యనీతిని కూడ ఉపయోగించడం అతనికి పూర్తిగా స్వభావ విరుద్ధం. ఈ పట్టుదల, విపరీతమైన ఆత్మవిశ్వాసం, ఎక్కడ, ఎంతవరకు సత్ఫలితాలను ఇయ్యగలిగినవో అక్కడ, అంతవరకే నెపోలియన్ విజయాలను సాధించాడు.

తక్కిన సందర్భాల్లో ఈ సద్గుణాలు కూడ దుర్గుణాలుగా, అతనికి దూరదృష్టి లేకపోవడం, సమన్వయ ధోరణి లోపించడంగా పరిణమించాయి. తానొక కారణజన్ముడినని, తనకు అసాధ్యమేదీ ఉండదని నెపోలియన్ భావించుకొనే వాడని కొందరు రచయితలు వ్యాఖ్యానిస్తారు. ఆ లక్షణాల మౌలికరూపం అతని మొండి పట్టుదల, మితిమీరిన ఆత్మవిశ్వాసము.

2. నెపోలియన్ అపరిమితమైన సామ్రాజ్యదాహమూ, పదవీ వ్యామోహమూ మూర్తీభవించినవాడు. ఐరోపా యావత్తు తనకు పాదాక్రాంతం కావాలని, ఇంగ్లాండును కూడా లొంగదీసి తానే ఐరోపా రాజకీయాలకు నిర్ణాయక శక్తి (Decision maker) గా కావాలని వాంఛించాడు. అందువలన తాత్కాలికంగా ఇతర రాజ్యాలతో చేసుకొన్న సంధులు, ఒడంబడికలను తానే ఉల్లంఘించాడు. అపార సైనికశక్తితో, తన యుద్ధతంత్ర నైపుణ్యంతో అన్ని ఐరోపా రాజ్యాలను తనకు అధీనులుగా చేసుకొన్నాడు. కాని, ఈ అధీనరాజ్యాల్లో కొన్నైనా మిత్రరాజ్యాలై ఉండాలని, అందుకై కొన్ని రాజ్యాలపట్లనైనా స్నేహము, సద్భావము కలిగి ఉండాలని అతడు ఎన్నడూ భావించలేదు. అందుచేత, అతని అధికారదాహము, సామ్రాజ్య విస్తరణకాంక్ష ఐరోపానంతటిని అతనికి వ్యతిరేకమైన శత్రుకూటమిగా చేసింది. అందువలన అతడు 1807 నుండి ఏకకాలంలో అనేక ప్రత్యర్థి రాజ్యాలతో అనేక వైపుల పోరాటాలు చేయవలసివచ్చింది. అంతకు ముందువలె కాక, ఆ సమయంలో అతని సేనాబలమూ, శక్తియుక్తులు ఎదురైన సమస్యలను అధిగమించడానికి సరిపోలేదు.

3. నెపోలియన్ దుర్గుణాల నుండే అతని సమస్యలు మరింత బలవత్తరం అయినాయి. అతని యుద్ధోన్మాదానికి, సామ్రాజ్యాధిపత్యము, నియంతృత్వాలకు లోగడ అనైక్యంగా ఉండి పరాజయం పొందిన అనేక ఐరోపారాజ్యాధినేతలు తమ విభేదాలను కొంతకాలం విస్మరించి, సమైక్యంగా నిలిచారు. అప్పుడు వారి సేనాబలం నెపోలియన్ సేనాబలం కంటే అనేకరెట్లు ఆధిక్యత కలిగిఉంది. అటువంటి పరిస్థితిలో నెపోలియన్ సేనానాయకత్వ దక్షత, యుద్ధ వ్యూహనిర్మాణ కౌశలమూ పనికిరాలేదు. ఒకప్పుడు సైనికబలంతో ఏ రాజ్యాధినేత తనముందు నిలువలేని ఆధిక్యత కలిగినవాడు. ఆ తరువాత ఐరోపారాజ్యాధినేతల సంయుక్త సేనాబలం ముందు అత్యల్పశక్తి కలిగినవాడైనాడు.

4. నెపోలియన్ అధికార వ్యామోహము, నియంతృత్వము అవధులు మీరి, అతని అనుచరులైన బెర్నెడోట్ వంటివారు, అనేక రాజ్యాల్లో అధిపతులుగా అతడు నిలిపిన బంధువులు సైతం వ్యతిరేకులైనారు.

5. నెపోలియన్ తన యుద్ధవిజయాలతో ఫ్రెంచి ప్రజానీకానికి, వారి జాతీయభావానికి గర్వకారణమైనట్లే, తనచేత పరాజితులైన ఇతరరాజ్యాల ప్రజానీకాల జాతీయభావాలకు అఘాతం కల్పించి వారిని రెచ్చగొడుతున్నట్లు గ్రహించలేకపోయాడు. తన అధీన రాజ్యాలన్నిటిలో ఫ్రెంచి రాజకీయవ్యవస్థలను, పరిపాలనా విధానాలను ప్రవేశపెట్టడమూ, భూఖండ విధానాన్ని విధించి, ఆ దేశాల విదేశాంగ విధానాన్ని ఫ్రాన్సుకు, అనగా తనకు అనుకూలంగా ఏర్పరచడం వారిలో జాతీయ భావావేశానికి, జాతీయ సమైక్యతా కాంక్షకు బీజారోపణ చేశాడు. తన సైనిక నాయకత్వదక్షత, యుద్ధతంత్ర నైపుణ్యమూ ప్రత్యర్థుల సేనలతో జరిగిన పోరాటంలో అమేయ ఫలితాలను ఇయ్యగలిగినా, జాతీయ భావావేశంతో పోరాడే ప్రజానీకాలను ఓడించలేకపోయాయి. ఈ జాతీయభావాలే ఫ్రెంచిసేనలను ఐరోపారాజ్య సంకీర్ణ కూటములపై విజయం సాధించడానికి మూల కారణాలు. ఈ జాతీయభావాలే, ఫ్రెంచివిప్లవతత్త్వం ఐరోపావ్యాప్తం అయిన తరువాత నెపోలియన్‌ను నిస్సహాయునిగా చేసి ఓడించెను. తన మితిమీరిన ఆత్మవిశ్వాసం, మొండి పట్టుదల వలన నెపోలియన్ ఈ పరిణామాన్ని గుర్తించలేకపోయాడు.

6. అలాగే ఎట్టి పరిస్థితిలోనూ ఎవరికి తలవంచక, తనశక్తి సామర్థ్యాలతో ఐరోపా సమస్తాన్ని జయించగలననే ఆత్మవిశ్వాసంతో ప్రత్యర్థి కూటమిరాజ్యాలు అనేక పర్యాయాలు అతనికి సాదరమైన షరతులతో సంధి ప్రస్తావనలు తెచ్చినప్పుడు నెపోలియన్ తిరస్కరించాడు. అంతేకాక, తన శత్రుదేశాలతో చేసుకొన్న సంధి ఒడంబడికలను గౌరవించక, విశ్వసనీయుడుకాడని, అతన్ని తుదముట్టించందే ఐరోపారాజ్యాలకు శాంతి భద్రతలు ఉండబోవని స్థిరమైన అభిప్రాయాన్ని ప్రత్యర్థి దేశాలకు కలిగించాడు.

7. తన పదవీవ్యామోహమూ, అధికార దాహం వలన ఫ్రాన్సులో సైతం విప్లవ ఫలితంగా ఏర్పడిన రిపబ్లికన్ వ్యవస్థను క్రమంగా నిర్వీర్యంచేసి, తుదకు నిర్మూలించాడు. అలాకాక, తన పరిపాలన దక్షతను రిపబ్లిక్ విధానంలో అమలుజరిపి, అదే విధంగా తను జయించిన ఐరోపా భూభాగాల్లో సైతం, నామమాత్రంగా కాక, కొంత రిపబ్లికన్ స్వరూపం కలిగిన పరిపాలనా వ్యవస్థలను నెలకొల్పినట్లైతే, ఆ దేశాల్లోని నిరపేక్ష రాచరికవ్యవస్థలు బలహీనపడేవి; భూస్వామ్యవిధానం క్షీణించేది; ప్రజల జాతీయ భావావేశము, ఉదారభావాలు అప్పుడు నెపోలియన్ బలపడడానికి దోహదం చేసేవి. కాని అటువంటి రాజకీయ దూరదృష్టి అతనిలో కొరవడడం చేత వివిధ దేశాల్లోని ప్రజానీకాలను భూఖండ విధానంతో దురవస్థల పాలుచేసి, తన సామ్రాజ్యానికి పునాదులు లేకుండా చేసుకున్నాడు.

పైన పేర్కొన్న అతని గుణ గణాలు అతని ఉన్నతికి ఎలా దారితీశాయో, అలాగే అతని పతనానికి దారితీశాయి.

**మాదిరి ప్రశ్నలు :**

1. **1799-1815** కాలాన్ని నెపోలియన్ యుగమనటానికి కారణాలు ఏమిటి ?
2. ప్రథమ కన్సూల్‌గా నెపోలియన్ కృషిని వివరించండి.
3. నెపోలియన్ విదేశాంగ విధానాన్ని వివరించండి.
4. నెపోలియన్ యుద్ధాలపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
5. భూఖండ విధానాన్ని విమర్శనాత్మకంగా చర్చించండి.
6. నెపోలియన్ పతనానికి దారితీసిన కారణాలను వివరంగా చర్చించండి.

**చదువదగిన గ్రంథాలు :**

1. Hayes, G.J.H. : Contemporary Europe Since 1870
2. Louis Gottashhalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.
3. Lipson, E. : Europe in the 19th and 20th Centuries

**డా॥ ముప్పాళ్ళ హనుమంతరావు**

పాఠం - 8

# మెటర్నిక్ యుగం - సాంప్రదాయ పునరుద్ధరణ (1815 - 1848)

**విషయసూచిక :**


8.0 లక్ష్యం

8.1 ఉపోద్ఘాతం

8.2 వియన్నా పరిష్కారం

- 8.2.1 చేమాంట్ సంధి
- 8.2.2 వియన్నా కాంగ్రెస్ అనుసరించిన సూత్రాలు
- 8.2.3 వియన్నా కాంగ్రెస్ ప్రాముఖ్యత

8.3 పవిత్రమైత్రి (Holy Alliance)

- 8.3.1 ఐరోపా దేశాల ప్రతిస్పందన
- 8.3.2 పవిత్ర మైత్రిలో సభ్యత్వం

8.4 ఐరోపారాజ్య కూటమి (Concert of Europe)

- 8.4.1 ఐరోపా రాజ్యకూటముల ప్రథమ సమావేశం
- 8.4.2 ఐరోపా రాజ్యకూటమి ద్వితీయ సమావేశం
- 8.4.3 ఐరోపా రాజ్య కూటమి తృతీయ సమావేశం
- 8.4.4. పైడ్మాంట్‌లో తిరుగుబాటు
- 8.4.5 ఐరోపారాజ్య కూటమి చతుర్థ సమావేశం
- 8.4.6 ఐరోపారాజ్య కూటమి విచ్ఛిన్నం

8.5 వ్యవస్థ పతనం, 1830, 1848 విప్లవాలు

- 8.5.1 ఫ్రాన్స్‌లో బూర్బన్ వంశ పునఃస్థాపన

8.6 ఇతర ఐరోపాదేశాల్లో 1830 విప్లవం

- 8.6.1 1830 విప్లవ ఫలితం

8.7 ఫ్రాన్స్‌లో లూయీ ఫిలిప్పు పరిపాలన

- 8.7.1 లూయీ ఫిలిప్పు తొలిజీవితం
- 8.7.2 నెపోలియన్ గాథలు (Nepoleanic Legend)
- 8.7.3 లూయీ ఫిలిప్పు సాంప్రదాయవాదిగా మారటం
- 8.7.4 గైజో మంత్రిత్వం
- 8.7.5 1848 విప్లవం - లూయీ ఫిలిప్పు పతనం

8.8. మెటర్నిక్

- 8.8.1 మెటర్నిక్ జీవితము, స్వభావము
- 8.8.2 మెటర్నిక్ విధానము
- 8.8.3 కారల్స్‌బడ్ ఆజ్ఞలు (Carlsbad Decree)
- 8.8.4 మెటర్నిక్ పతనం

8.9 ప్రాచ్య సమస్య (Eastern Question)

- 8.9.1 సెర్బియా స్వాతంత్ర్య పోరాటం
- 8.9.2 గ్రీకు స్వాతంత్ర్య పోరాటం

## 8.0 లక్ష్యం :

ఈ అధ్యాయం చదవడం ద్వారా నెపోలియన్ పతనాంతరం ఐరోపాలో జరిగిన మార్పులు మెటర్నిక్ ఫ్రెంచివిప్లవ భావాలను అంతంచేసి సాంప్రదాయవిధానాన్ని ప్రతిష్ఠించాలని చేసిన ప్రయత్నాలు తెలుస్తాయి. క్రీ.శ. 1815 నుండి 1848 వరకు సాంప్రదాయ వాదానికి ఉదారవాదానికి జరిగిన సంఘర్షణ, అందులోని భాగంగా 1830 లోను, 1848లోను ఉదారవాద విప్లవాలు విజయం సాధించడం మొదలైన అంశాలు తెలుసుకోవడం జరుగుతుంది. అట్లే టర్కీ బలహీనత తిరుగుబాటు, గ్రీసు స్వతంత్ర ప్రకటన గూడ తెలుసుకోవడం జరుగుతుంది.

## 8.1 ఉపోద్ఘాతం :

నెపోలియన్ పతనానంతరం విజయం సాధించిన రాజ్యాలు ఐరోపాలో తిరిగి సాంప్రదాయక రాజ్యవ్యవస్థను పునరుద్ధరించాయి. ఫ్రెంచివిప్లవం వల్ల ఐరోపాలో వ్యాపించిన ఉదారవాదాన్ని అణచివేశారు. రిపబ్లిక్‌లను కూలగొట్టినారు. 1848 సం॥ దాకా ఈ అణచివేత కార్యక్రమం సాగినది. కనుక ఈ యుగానికి సాంప్రదాయ పునరుద్ధరణ యుగమని పేరు వచ్చినది. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించినవాడు ఆస్ట్రియా ప్రధానమంత్రి మెటర్నిక్ కనుక ఈ యుగానికి మెటర్నిక్ యుగమని కూడా పేరు వచ్చింది.

మెటర్నిక్ యుగాన్ని రెండు ఘట్టాలుగా విభజించవచ్చు. ఇందులో 1815 నుండి 1830 వరకు సాగిన మొదటి **ఘట్టంలో** మెటర్నిక్ సాంప్రదాయక వ్యవస్థను నిలపగలిగాడు. తన సిద్ధాంతంలో విజయం సాధించాడు. అయితే 1830 **నుండి** 1848 వరకు జరిగిన రెండవ ఘట్టంలో 1848 విప్లవాలు జరిగి మెటర్నిక్ స్థాపించిన సాంప్రదాయక రాజ్యవ్యవస్థలను **అంతం చేశాయి.** కనుక ఇది విప్లవాల ఘట్టం అని జాతీయ ఉదారవాదాల విజయం అని చెప్పవచ్చును. ఈ ఘట్టంలో **మెటర్నిక్** విధానం పూర్తిగా అపజయం పొంది అతని పతనానికి దారితీసింది.

వియన్నా కాంగ్రెస్ జాతీయ ఉదారవాదాన్ని అణచుటలో మొదటి భాగంగా వీరు ఆస్ట్రియా రాజధాని వియన్నాలో సమావేశమై నెపోలియన్ సామ్రాజ్యాన్ని ఛిన్నా భిన్నం చేసి పంచుకున్నారు. రాచరికాలను పునఃప్రతిష్ఠ చేసినారు. దీనికే వియన్నా కాంగ్రెస్ పరిష్కారం అని పేరు వచ్చింది. ఆ తరువాత మరలా జాతీయ ఉదారవాదులు తలఎత్తకుండా ఉండటానికి తిరుగుబాట్లను అణచడానికి, ఐరోపాలోని అగ్రరాజ్యాలు ఒక సమితిగా ఏర్పడినాయి. 1830 వరకు వారి కృషి విజయవంతంగా జరిగింది. ఈ యుగంలో ఇంతవరకు మొదటిఘట్టం. జాతీయ ఉదారవాదాలను అణచివేయడానికి మెటర్నిక్ ఎన్ని ఏర్పాట్లు చేసినా అవి తాత్కాలికమే అయినది. ఐరోపావాసులు ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలను ఉదారవాదాన్ని వదులుకోలేదు. మెటర్నిక్ అణచివేత వల్ల తాత్కాలికంగా అణగినట్లు కన్పించినా, తరువాత సాంప్రదాయవాదంతో సంఘర్షణ పడి 1830 - 1848 విప్లవాలుగా విజృంభించింది. 1830 విప్లవాన్ని అణచినా మెటర్నిక్ 1848 విప్లవంతో విఫలుడై ఇంగ్లాండు పారిపోయినాడు. ఇతని పలాయనంతో తిరిగి ఉదారవాదం ఐరోపాలో విజృంభించి ఐరోపా అంతటా ప్రాకి తిరుగులేని వ్యవస్థగా నిలద్రొక్కుకున్నది. 1830 నుండి 1848 వరకు రెండవఘట్టం.

## 8.2 వియన్నా కాంగ్రెస్ పరిష్కారం :

నెపోలియన్ ఓటమి తరువాత యుద్ధంలో జయించిన ఆస్ట్రియా రష్యా ఇంగ్లాండు తదితర రాజ్యాధిపతులు రాజకీయ సమస్యలను పరిష్కారం చేసుకోవడానికి 1815 లో ఆస్ట్రియా రాజధాని అయిన వియన్నాలో సమావేశమయ్యారు. దానినే వియన్నా కాంగ్రెస్ అని పిలుస్తారు. నెపోలియన్ సామ్రాజ్యాన్ని యుద్ధంలో విజయం సాధించిన రాజ్యాలు పంచుకోవడం ఈ **సమావేశం ఉద్దేశ్యం అయినప్పటికీ** నెపోలియన్ యుద్ధాలవలన తారుమారుఅయిన యూరప్‌పరిస్థితిని తిరిగి బాగుచేయుటకే తాము అక్కడ **సమావేశము** అయినట్లు అని ప్రకటించారు. నెపోలియన్ యుద్ధాల ఫలితంగా ఐరోపా వ్యవస్థ పాడైపోయిందని

సరిహద్దులు మారాయని కొన్ని రాజ్యాలు చిన్నవై కొత్త కొత్త రాజ్యాలు ఏర్పడినవని వాటన్నిటిని తిరిగి పునఃనిర్మాణం చేయాలని వీరు భావించారు.

### 8.2.1 చౌమంటు స్నేహసంధి (1814) :

వియన్నా కాంగ్రెసు సమావేశమై ఐరోపాలో శాంతిస్థాపన, పూర్వపు ఐరోపా దేశాల సరిహద్దులు రాజ్యవ్యవస్థలు పునరుద్ధరించడానికి ప్రాతిపదికగా ఇంగ్లాండు, ఆస్ట్రియా, ప్రష్యా రాజ్యాలు చౌమంట్ స్నేహసంధి చేసుకున్నాయి. ఈ సంధి ప్రకారం ఆ నాలుగు రాజ్యాలు స్నేహసంబంధాలు కొనసాగించడం 2. నెపోలియన్‌ను పీడించడం 3. నెపోలియన్‌ను తిరిగి ఎట్టి పరిస్థితులలో ఐరోపాలో అడుగు పెట్టనివ్వకుండా చేయడం. 4. ఐరోపా రాజకీయ పరిస్థితిని పునర్ నిర్మాణం చేయడం తమ కర్తవ్యంగా అంగీకరించాయి. కనుక ఈ సంధి షరతులలోని చివరి షరతును అమలు జరుపుటకు వారు 1815లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో సమావేశమైనారు. వియన్నా శాంతి సమావేశంలో ఒక టర్కీ తప్ప ఐరోపాలోని చిన్న పెద్ద అన్నీ కలిపి 207 రాజ్యాలు పాల్గొన్నవి. కొందరు రాజులు స్వయంగా పాల్గొనగా కొన్ని రాజ్యాలు వారి ప్రతినిధులను పంపాయి. స్వయంగా ఇందులో పాల్గొన్న రాజకీయ వేత్తలలో ముఖ్యులు. 1. రష్యాజార్ ఒకటవ అలెగ్జాండర్. 2) ప్రష్యారాజు మూడవ ఫ్రెడరిక్ విలియం. 3) ఇంగ్లాండ్ విదేశాంగ మంత్రి లార్డుకాసల్‌రి 4) సేనాని డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్ 5) ఆస్ట్రియా చక్రవర్తి మొదటి ఫ్రాన్సిస్ 6) అతని ముఖ్యమంత్రి మెటర్నిక్. అయితే, సమావేశానికి ఫ్రెంచిరాజు 18వ లూయీని ఆహ్వానించలేదు. ఆహ్వానించాలని కూడా ఎవ్వరూ భావించలేదు. కాని ఫ్రాన్సు ప్రతినిధిగా నెపోలియన్ ప్రభుత్వంలోని విదేశాంగ మంత్రి టెరాండ్ పాల్గొన్నాడు. **అందువల్ల** వియన్నా కాంగ్రెస్‌లో ఫ్రాన్సు గూడా పాల్గొన్నా, ఆ దేశానికి గల పాత్ర సమావేశంలోని రాజ్యాధినేతల నిర్ణయాలను **ఆ**మోదించి, ఆచరించడమే.

వియన్నా కాంగ్రెస్ సమావేశానికి ఆస్ట్రియా ప్రధానమంత్రి మెటర్నిక్ అధ్యక్షత వహించినాడు. అతడు ఈ సమావేశంలో ప్రముఖపాత్ర వహించినాడు. ఈ సభలో 207 రాజ్యాలు పాల్గొన్నప్పటికి అగ్రరాజ్యాలయిన ఇంగ్లాండు, ఆస్ట్రియా, రష్యా, ప్రష్యాలు మాత్రమే నిర్ణయాలు తీసుకున్నారు. వానిని మిగతా రాజ్యాలు ప్రేక్షకులుగా ఆమోదించారు.

నెపోలియన్ ఓడిపోయినందుకు సంతోషంగా ఎంతో ఉత్సాహంగా, ఎంతో ఆడంబరంగా వేడుకలతో ఈ సమావేశం జరిగింది. విందు వినోదాలతో, నాట్యబృందాలతో సభ్యులంతా నాట్యంచేస్తూ విజయోత్సాహంతో ఈ సభ నిర్వహించారు. చక్రవర్తులతో సహా అందరూ విలాసంగా నాట్యం చేసారు. ముఖాలకు బొమ్మల ముసుగులు గూడా ధరించి నాట్యం చేసారట. నెపోలియన్ ఓడిపోయినందుకు వారు పొందిన ఆనందానికి అది నిదర్శనం. విదేశరాజులు ప్రతినిధులతో వియన్నా పట్టణం కళకళలాడినది. వీరందరికి ఆస్ట్రియా చక్రవర్తి మొదటి ఫ్రాన్సిస్ ఆతిధ్యమిచ్చి విందులతో ముంచెత్తాడు.

### 8.2.2. వియన్నా కాంగ్రెస్ అనుసరించిన సూత్రాలు :

వియన్నా కాంగ్రెస్ ఐరోపాలో ప్రశాంత పరిస్థితుల పునరుద్ధరణ, దాని నిర్వహణల గూర్చి ఒక క్రమపద్ధతి ప్రకారం పరిష్కారాలు చేసుకోవలెనని నిర్ణయించింది. ఈ పద్ధతి ప్రకారం వీరు 4 సూత్రాలను పాటించారు. అవి 1. Restoration యథాస్థితి 2. Legitamacy వారసత్వ పునఃస్థాపన 3. Balance of Power రాజకీయ తుల్యప్రాబల్యం 4. Compensation పరిహారం ఈ మూలసూత్రాల ప్రాతిపదికగా ఈ సమావేశం శాంతి పరిష్కారం చేసింది.

#### 8.2.2.1 యథా తథస్థితి (Restoration) :

నెపోలియన్ అధికారానికి రాకపూర్వం ఐరోపా రాజ్య పరిస్థితి ఎట్లా ఉన్నదో అట్లాగే పునరుద్ధరించడం, నెపోలియన్ ఐరోపా రాజ్యాల సరిహద్దులన్నీ మార్చివేశాడని తిరిగి వాని పూర్వపు సరిహద్దులకు తగ్గించి యథాస్థితి నెలకొల్పాలని తీర్మానించారు.

### 8.2.2.2 ఫ్రాన్స్ చుట్టూ బలమైన రాజ్యాలు నిర్మాణం :

వియన్నా కాంగ్రెస్ ఐరోపా శాంతిభద్రతలకు ఎప్పుడైనా ముప్పు ఫ్రాన్సు వల్లనే ఏర్పడుతుందని, అందువల్ల భవిష్యత్తులో ఫ్రెంచి దురాక్రమణలను అరికట్టగల బలమైన రాజ్యాలు ఆ దేశం చుట్టూ ఏర్పడి ఉండడం అవసరమని భావించింది. ఆ ఉద్దేశ్యంతో ఫ్రాన్సుకు ఉత్తరదిశగా బెల్జియమ్‌ను హాలెండ్‌తో కలిపివేసి ఒక బలమైన రాజ్యాన్ని ఏర్పరిచింది. అలాగే ఆగ్నేయదిశలో స్విస్ సమాఖ్య ఒక బలమైన రాజ్యాన్ని ఏర్పరిచింది. సార్డీనియాకు పైడ్‌మాంట్‌ను కలిపి బలపరచడం జరిగింది. తూర్పున ఆస్ట్రియా, ప్రష్యాలకు వారి పూర్వపు భూభాగాలనేకాక, నెపోలియన్ నియంతృత్వాన్ని అంతంచేసిన విముక్తి పోరాటంలో పాల్గొన్నందుకు బహుమతిగా అనేక రైన్ ప్రాంతపు భూభాగాలను ఇచ్చిన విషయం పైన వివరించడం జరిగింది.

### 8.2.3 వియన్నా కాంగ్రెస్ పరిష్కారంలోని లోపాలు :

ఈ విధంగా వియన్నా సమావేశం చేసిన పరిష్కారంలో అనేక లోపాలు ఉన్నాయి. వాటన్నింటిని స్థూలంగా ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోనికి తీసుకోకుండ ఉదారవాదాన్ని త్రోసిపుచ్చి, సాంప్రదాయక వ్యవస్థలను పునరుద్ధరించ ప్రయత్నించడమని, సంక్షిప్తంగా చెప్పవచ్చు. ఫ్రెంచి విప్లవ కాలంలో ప్రజలను చైతన్యవంతంచేసిన స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాత్ర సిద్ధాంతాలను, వారిలో ప్రబలమైన జాతీయ భావాలను పూర్తిగా విస్మరించి, వియన్నా శాంతి సమావేశం సాంప్రదాయకమైన నిరపేక్షరాచరికాన్ని పునరుద్ధరించి, అన్ని దేశాల్లోను నెలకొల్పింది.

బెల్జియమ్‌ను హాలెండ్‌తో కలపడం ఆ దేశ ప్రజలు ఎంతమాత్రం సహించలేదు. బెల్జియంలో ప్రజలు సెల్టిక్ (Celtic) జాతీయులు కాగా, హాలెండు ప్రజలు ట్యుటానిక్ (Teutonic) జాతీయులు; వారి భాష ఫ్లెమిష్, వీరి భాష డచ్చి. బెల్జియం అప్పటికి వ్యవసాయ ప్రధానమైన ఆర్థికవ్యవస్థ కలిగి, భూస్వామ్య విధానము (Feudalism) అనుసరిస్తూ, సాంప్రదాయికమైన కాథలిక్ మతాన్ని అవలంబిస్తుంది. హాలెండు విదేశవాణిజ్యం నిర్వహిస్తూ, ఐశ్వర్యవంతమైన మధ్యతరగతి ప్రజానీకంలో, ప్రొటెస్టాంటు క్రైస్తవ మతశాఖ అయిన కాల్వినిజం (Calvinism) ను అనుసరిస్తూ ఉంది. ఇంత పరస్పర విరుద్ధమైన రెండు జాతుల ప్రజలను కలిపి ఏకరాజ్యంగా చేయడం, వారిద్దరి మధ్య కలతలు రేపి, 1830లోను, 1848 లోను విప్లవాలు చెలరేగడానికి ప్రాతిపదిక వేసినట్లయింది.

అలాగే లోగడ డెన్మార్కుతో కలిసిఉన్న నార్వేను వియన్నా కాంగ్రెస్ స్వీడన్‌తో కలిపింది. న్యాయసమ్మతమైన (Legitimacy) యథాపూర్వస్థితిని పునరుద్ధరింపపూనిన కాంగ్రెసు పోలెండ్‌లో ప్రజల జాతీయ భావాలను, ఆకాంక్షలను గుర్తించక, న్యాయబద్ధంకాని విధంగా, ఆ దేశాన్ని రష్యాపరం చేసింది.

అసంఖ్యాకమైన చిన్న చిన్న రాజ్యాల నడుమ విభజింపబడి ఉన్న ఇటాలియన్, జర్మన్ ప్రజానీకాలు నెపోలియన్ సామ్రాజ్యంలో గణనీయమైన రాజకీయ సమైక్యతను అనుభవించి, భాషా, సంస్కృతుల ప్రాతిపదికపై, తాము జాతీయరాజ్యవ్యవస్థ (Nation States) గా ఏర్పడాలని వాంఛిస్తున్నారు. కాని వియాన్నా కాంగ్రెస్ వారి ఆకాంక్షలను నిరాదరించి, వెనుకటి రాజవంశాల పాలనలో, వెనుకటి రాజ్యవ్యవస్థలుగా తిరిగి ఛిన్నాభిన్నంచేసింది.

ఈ లోపాలు బుద్ధిపూర్వకంగా చేసినవి, ప్రజల అసంతృప్తిని రెచ్చగొట్టి వారిని 1830లోను, 1848 లోను విప్లవ ఉద్యమాలకు నడిపించినవి.

### 8.2.4 వియన్నా కాంగ్రెస్ ప్రాముఖ్యత :

పైన వివరించినట్లు వియన్నా కాంగ్రెసు ఐరోపా పునర్నిర్మాణము, అందుకు అవసరమైన ప్రాతిపదికగా చేసిన పరిష్కారము అనేక లోపాలతో కూడింది. అవి పూర్తిగా ఐరోపా అగ్రరాజ్యాల ప్రయోజనాలు, ముఖ్యంగా నెపోలియన్‌ను ఓడించి అతని సామ్రాజ్యనిర్మాణము, నియంతృత్వాలను నిర్మూలించడానికి కంకణం కట్టుకున్న ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలు తమ ప్రయోజనాలను

సాధించుకునేందుకు ఉద్దేశించి చేసినదే. అయినప్పటికి ఈ శాంతి సమావేశానికి ఆధునిక ఐరోపా చరిత్రలో చాల ప్రాధాన్యత ఉంది. అందులోని మొట్టమొదటి అంశం అగ్రరాజ్యాల అధినేతలు తమ స్వార్థచింతనతోనైనా, ఒకచోట సమావేశమై, ఐరోపా ఖండంలో శాంతిభద్రతలను గూర్చి, నియంతృత్వ ధోరణులను అరికట్టి, వివిధ రాజ్యాల (States) సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని సంరక్షించడాన్ని గూర్చి, ఆలోచించడానికి, సమిష్టిగా కృషిచేయడానికి ఒకచోట సమావేశం కావడం. ఈ దృష్టితో చూచినపుడు రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం జర్మనీ నియంతృత్వ విస్తరణ వాదాలను తిరిగి తలెత్తకుండా, ప్రపంచ శాంతికి భంగం కలిగించే వివాదాలను, వైరుధ్యాలను దేశాల నడుమ ఏర్పడకుండ తగు జాగ్రత్తలు తీసుకోవడానికి ఏర్పడ్డ నానాజాతిసమితి, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వ్యవస్థల్లో ఇది మొదటిది, వాటికి మార్గదర్శకమైనట్టిది అని చెప్పవచ్చు.

రెండవ అంశం, ఆధునిక ఐరోపా చరిత్రలో తదుపరి ఘట్టాలు, విస్తృతంగా ప్రజాఉద్యమాలు, విప్లవాలు జాతీయరాజ్యాలుగా రూపొందడానికి, రాజ్యాంగ సంస్కరణలను సాధించుకోవడానికి తలెత్తినవి. ఈ కాంగ్రెస్ పరిష్కారం వల్లనే. వియన్నా కాంగ్రెస్ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానం, వారి ఆకాంక్షలను అణచివేసి నిరపేక్ష రాచరికవ్యవస్థలను పునర్నిర్మించుకోవటమే తదుపరి సంఘటనలకు 1830, 1848 విప్లవాలకు, ఇటలీ జర్మనీ సమైక్యతా ఉద్యమాలకు మూలమైంది.

## 8.3 పవిత్ర మైత్రి (Holly Alliance) :

వియన్నా కాంగ్రెస్ సమావేశాల్లో 1815 జూన్ 9వ తేదీన ఐరోపాలో సుస్థిర శాంతి భద్రతలను నెలకొల్పడానికి రష్యాచక్రవర్తి జార్ అలెగ్జాండర్ క్రైస్తవ మత సిద్ధాంతాలు ప్రాతిపదికగా ఒక మిత్రకూటమి ఏర్పరచాడు. దానికే పవిత్ర మైత్రి అనిపేరు. పవిత్రమైన క్రైస్తవమత సిద్ధాంతాల ప్రాతిపదికగా ఏర్పడిన మిత్ర కూటమి గనుక దానికి పవిత్రమైత్రి (Holly Alliance) అని పేరు వచ్చింది. అలెగ్జాండర్ ఈ సంస్థ ఏర్పాటు చేయడానికి ప్రధానకారణము అతడు గొప్ప దైవభక్తుడు; పాపభీతి కలవాడు ఫ్రెంచి విప్లవం, నెపోలియన్ యుద్ధాలవలన జరిగిన రక్తపాతాన్ని చూచి చలించిపోయాడు. ఫ్రెంచి విప్లవం దైవానికి, మతానికి, వ్యతిరేక ఉద్యమమైనందున పాపభీతి లేకుండ పోయినది. కనుక విచక్షణ లేకుండా విప్లవవాదులు విప్లవ వ్యతిరేకులను హత్యలు చేయగల్గారని అలెగ్జాండర్ భావించినాడు. కనుక క్రైస్తవ మతసిద్ధాంతాలైన శాంతి, ధర్మం, దయాదాక్షిణ్యాలను రాజకీయరంగంలో ప్రవేశపెట్టినట్లయితే ప్రజలలో పాపభీతి గల్గి రక్తపాతం తగ్గిపోవునని గూడ నమ్మాడు అంతేగాక తాను దైవ ప్రతినిధిని ఐరోపాలో ఏర్పడిన క్లిష్ట సమస్యలను పరిష్కరించి శాంతిని స్థాపించడానికి తనను దైవం తన రూపంగా పంపెనని విశ్వసించాడు. కనుక ఐరోపాలో శాంతిని పెంపొందించుటకు ఈ సమితిని వియన్నా కాంగ్రెస్ సమావేశాలు ముగియగానే 1815 సెప్టెంబరులో స్థాపించినాడు.

పవిత్రమైత్రి ఐరోపాలో రక్తపాతం జరగకుండా చూచుట, 2) ఐరోపాలో ప్రజలు శాంతియుతంగా జీవించునట్లు చేయడము 3) పాలకులు, పాలితులు అనగా రాజులకు, ప్రజలకు మధ్య సౌభ్రాతృత్వం, సహకారం, ఐక్యతను పెంపొందించుట అను ఆశయాలతో యిది నెలకొల్పబడింది.

అయితే, ఆస్ట్రియా ఛాన్సలర్ (ప్రధానమంత్రి) అయిన మెటర్నిక్ మాత్రం జార్ అలెగ్జాండర్ చేసిన ఈ హాస్యాస్పదమైన ప్రతిపాదనలను సమర్థించాడు. ఈ విధంగా క్రైస్తవ మతసూత్రాలను రాజకీయాలతో మేళవించడం వల్ల దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతాన్ని, దానితోపాటుగా వియన్నా కాంగ్రెస్ పునరుద్ధరించిన నిరపేక్షరాచరిక వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడం సులువుకాగలదని ఆలోచించాడు. ప్రజలను మతపరంగా హెచ్చరించి, బెదిరించి, స్వేచ్ఛా సమానత్వాలు, జాతీయభావాలు సాధించుకునేందుకు విప్లవమార్గాన్ని అనుసరించడం కేవలం రాజ్యాధికారమేకాక, దైవధిక్కారమని ప్రకటించి, అణచివేయవచ్చుననేది అతని ఆలోచన. అందువలన ఈ పవిత్రమైత్రిని అతడు ప్రజావ్యతిరేక కూటమిగాను, కొంతవరకైనా ఉదార భావాలు గల జార్ మొదటి అలెగ్జాండర్‌ను సంపూర్ణమైన నిరపేక్షపాలకునిగాను మార్చివేయగలిగారు.. అనేకదేశాల్లో ప్రజలు రాజ్యాంగబద్ధ సంస్కరణలకొరకు, జాతీయరాజ్యాలుగా సమైక్యం కావడం కొరకు ప్రారంభించిన ఉద్యమాలను అణచివేయడానికి ఐరోపారాజ్య

**కూటమి (Concert of Europe)** ను ప్రధాన సాధనంగా చేయగలిగాడు. కాగా, అతడు పవిత్రమైత్రి (Holy Alliance) కి **అంగీకరించిన** దేశాలు ఒక కూటమిగా పరస్పర సహకారంతో, ఉమ్మడిగా కార్యాచరణకు పూనుకోవాలని సూచించి, దీనిని ఐరోపా రాజ్యకూటమి (Concert of Europe) గా ఏర్పరచాడు.

కాగా పవిత్రమైత్రి యొక్క ప్రాధాన్యత ఐరోపా రాజ్యకూటమి (Concert of Europe) ఏర్పడడానికి ప్రాతిపదికగా, వియన్నా కాంగ్రెస్ ఏర్పరచిన ఐరోపా రాజ్యాలను, రాజకీయ వ్యవస్థలను అమలుజరిపి, సంరక్షించడానికి ఆధారమైన తాత్విక సిద్ధాంతంగా ఉపయోగపడింది. ఉదారవాదాలను, ప్రజలు ఆకాంక్షలను అణచివేయడానికి 1815 నుండి 1848 వరకు ఆస్ట్రియా, ప్రష్యా - రష్యాలు చేసిన ప్రయత్నాలకు తాత్విక సిద్ధాంతంగా ఉపయోగపడినందున పవిత్రమైత్రిని "అపవిత్రమైత్రి" గా ఉదారవాదులు నిరసించారు.

**వారసత్వపునఃస్థాపన** (Legitamacy) : నెపోలియన్‌కు పూర్వం ఏ రాజ్యాలను ఏ రాజవంశాలు పాలించి వున్నవో ఆ రాజవంశాల వారసత్వాన్ని పునరుద్ధరించి సింహాసనములపై వారిని ప్రతిష్ఠించవలెనని అదే న్యాయబద్ధమైన నిర్ణయమని భావించారు.

**రాజకీయతుల్యప్రాబల్యం** (Balance of Power) : ఫ్రాన్సులో ఇంకా విప్లవభావాలు వున్నవి. భవిష్యత్తులో ఫ్రాన్సు బలపడి ఐరోపా రాజ్యాలపై దండెత్తి రాజకీయ వ్యవస్థలను పాడుచేయకుండా నిరోధింపవలసి వున్నది. అందుకు ఫ్రాన్సు చుట్టూ బలమైన రక్షణ కూటమిని ఏర్పాటు చేయవలెనని నిర్ణయించినారు.

**పరిహారం** (Compensation) : నెపోలియన్ పతనానికి సహాయపడిన వారికి లోగడ అతనితో యుద్ధంచేసి నష్టపడిన వారికి ప్రతిఫలం ముట్టచెప్పడం సమంజసమని భావించారు. ఈ నిర్ణయం వల్ల అగ్రరాజ్యాలు తమ ఇష్టం వచ్చిన రీతిలో ఐరోపా రాజ్యభాగాలను తమ స్వంతం చేసుకున్నవి. నెపోలియన్ వైపు పోరాడిన రాజ్యాలు తమ ప్రాంతాలు పోగొట్టుకొని చాల నష్టపడినవి.

**ఐరోపా ఖండంలో వచ్చిన మార్పులు** : వియన్నా కాంగ్రెస్ సభ నిర్ణయించిన నాలుగు సూత్రాలు అమలు జరిపి ఐరోపా ఖండాన్ని పునర్ వ్యవస్థీకరించినారు. అందువల్ల ఐరోపా రాజకీయ పరిస్థితిలో అనేక మార్పులు వచ్చినాయి.

**యథాస్థితి అమలు** : ఈ సూత్రం ఫ్రాన్సుకు అన్వయించి విప్లవానికి ముందుకాలంలో ఫ్రాన్సు దేశానికి ఏ సరిహద్దులుండేవో ఆ సరిహద్దులకు తగ్గించినారు. నెపోలియన్ కష్టించి సంపాదించి ఫ్రాన్సులో కలిపిన 1) రెయిన్‌లాండ్ 2) సవాయ్ ప్రాంతాలను ఫ్రాన్స్ కోల్పోయింది. 1792లో వున్న సరిహద్దులు ఫ్రాన్సు సరిహద్దులుగా గుర్తింపబడినవి.

**వారసత్వపునఃస్థాపన అమలు** : ఈ సూత్రాన్ని అన్వయించి పూర్వపు రాజావంశాలను పునరుద్ధరించారు. 1) ఫ్రాన్సులో బూర్బన్ వంశస్థుడైన 18వ లూయీని రాజును చేశారు. 2) స్పెయిన్‌ను నేపుల్సు, సిసిలి రాజ్యాలు పూర్వం పాలించిన బూర్బన్ వంశస్తులకు తిరిగి ఇవ్వబడినవి. 3) హాలెండ్‌లో ఆరంజి వంశం. 4) సార్డీనియా, పైడమాంటులలో సవాయ్ వంశం. 5) పార్మా, మొదీనా, టస్కనీ రాజ్యాలలో హేబ్స్‌బర్గ్ వంశాలు 6) మధ్య ఇటలీలో పోప్ పునఃప్రతిష్ఠింపపడ్డారు. 7) స్విస్ సమాఖ్య పునరుద్ధరింపబడింది. 8) టైరోల్‌ను తిరిగి ఆస్ట్రియా పొందినది కాని ఆస్ట్రియాలో కలుపరాదు. 9) నెపోలియన్ సంరక్షకత్వం క్రిందవున్న రైన్‌నది సమాఖ్యకు చెందిన జర్మన్ రాజ్యాలను వేరుచేసి స్వాతంత్ర్యం యిచ్చాడు.

**పరిహారం అమలు - రాజ్యపంపకాలు** :

ఈ సూత్రాన్ని అన్వయించి రాజ్యపంపకాలు జరిగాయి. నెపోలియన్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నం చేసి వారి ఇష్టానుసారంగా పంచుకున్నారు. అందువల్ల ఐరోపా రాజకీయ స్థితి పెక్కు మార్పులకు లోనయింది.

**ఆస్ట్రియా పొందిన రాజ్య భాగాలు** :

ఆస్ట్రియాకు చెందిన బెల్జియంను హాలెండ్‌లో కలిపినందుకు ప్రతిఫలంగా ఆస్ట్రియాకు ఇటలీలోని వెనీస్, మిలాన్ (లంబార్డి) లు ఇవ్వబడినవి. 2) ఆస్ట్రియా రాజవంశానికి చెందిన ఇతర హేబ్స్‌బర్గ్ రాజులకు టస్కని, పార్మా, మొదీనా రాజ్యాలు

యివ్వబడినవి. 3) నెపోలియన్ దండయాత్రలు వలన 1806 అస్తమించిన పవిత్ర రోము సామ్రాజ్యాన్ని పునరుద్ధరించడం వీలుగాక జర్మనీలోని 100 రాజ్యాలను కుదించి 38 రాజ్యాలుగా ఒక జర్మను సమాఖ్యగా ఏర్పరచి ఆస్ట్రియా ఆధిపత్యంలో ఉంచారు. అందువలన ఆస్ట్రియాకు పూర్వంవలె ఇటలీ జర్మనీలపై ఆధిపత్యం ఏర్పడినది, ఐరోపాలో మరల రాజకీయ ఆధిక్యత ఫ్రాన్సు నుండి ఆస్ట్రియాకు మారినది.

**రష్యా పొందిన ప్రాంతాలు** : రష్యా ప్రష్యాలు రెండు పోలెండ్‌ను కోరాయి. ఐనప్పటికి పోలెండ్‌లోని అధికభాగం రష్యాకు ఇవ్వబడినది. అంతేకాక స్వీడన్‌కు చెందిన ఫిన్ లాండును, టర్కీకి చెందిన బెసరేబియ, వార్సా, శాక్సనీలో కొంతభాగాన్ని కూడా రష్యా పొందినది. బాల్టిక్ ప్రాంతానికి అధిపతి అయింది.

**ప్రష్యా పొందిన ప్రాంతాలు** : ప్రష్యా అనేక ప్రాంతాలు పొంది బలమైన రాజ్యంగా అవతరించింది. నెపోలియన్ ఆక్రమించుకొన్న జర్మను ప్రదేశాలన్ని తిరిగి పొందుటయేగాక స్వీడన్ నుండి పోమరేనియా పోలెండ్‌ను రష్యాకు ఇచ్చివేసినందున శాక్షని, వెస్ట్‌ఫాలియా రాజ్యాలు లభించాయి. భవిష్యత్తులో ఫ్రాన్సు దండయాత్రలను అరికట్టుటకు రెయిన్‌లాండ్ ప్రాంతం గూడా ప్రష్యాకు యివ్వబడినది.

**స్వీడన్ పొందిన ప్రాంతాలు** : స్వీడన్‌కు చెందిన ఫిన్‌లాండ్, పోమరేనియాలను రష్యా, ప్రష్యాలకు యిచ్చినందువలన దానికి ప్రతిఫలంగా స్వీడన్‌కు, డెన్మార్క్‌కు చెందిన నార్వే రాజ్యం యివ్వబడినది. స్వీడన్, నార్వేలు ఏకరాజ్యమయ్యెను.

**డెన్మార్క్ కోల్పోయిన ప్రాంతాలు - పొందిన ప్రాంతాలు** : డెన్మార్క్ నెపోలియన్‌కు సహాయం చేసినందుకు నార్వే రాజ్యాన్ని కోల్పోయి శిక్ష అనుభవించింది. కాని అందుకు ప్రతిఫలంగా జర్మనీకి చెందిన హోల్‌స్టీన్ , డెన్మార్క్‌కు ఇవ్వబడినాయి.

**ఇంగ్లండ్ పొందిన ప్రాంతాలు** : ఫ్రాన్సు, స్పెయిన్‌లకు చెందిన దక్షిణాఫ్రికాలోని గయాన, ట్రినిడాడ్, టోబాగో, ఉత్తర సముద్రంలోని హెలిగోలండు మధ్యధరా సముద్రంలోని మాల్టా, అనియన్ ద్వీపాలు మొ॥ వర్తక స్థావరాలు ఇంగ్లాండుకు ఇవ్వబడ్డాయి. డచ్చి వలసలయిన సిలోన్, కేప్‌కాలని, దక్షిణాఫ్రికాలు గూడా ఇంగ్లాండు పొందినది. దీనితో ఇంగ్లాండు వలస సామ్రాజ్యము బలపడింది. ఈ విధంగా నెపోలియన్ సంపాదించిన సామ్రాజ్యాన్ని పై రాజ్యాలు పంచుకున్నవి.

## 8.4 ఐరోపా రాజ్యకూటమి (Cocert of Europe) :

పైన వివరించినట్లు జార్ మొదటి అలెగ్జాండర్ ప్రతిపాదించిన పవిత్రమైత్రిని ఐరోపా రాజ్యాధినేతలు సంయుక్తంగా క్రైస్తవ ధర్మాలను పాటిస్తూ తమ రాజ్యాలను పాలించుకొనే విధానాన్ని మెటర్నిక్ ఆచరణ సాధ్యంచేశాడు. జార్ ఉద్దేశించినట్లు ఐరోపా రాజ్యాధినేతలు తమ రాజకీయ విధానాల్లో క్రైస్తవ ధర్మాన్ని అనుసరించడం కంటే, అతడు సమిష్టి కృషికి అధికప్రాధాన్యతనిచ్చాడు. ఐరోపా దేశాల్లో ప్రజలు ఉదార భావాలతోను, జాతీయ భావాలతోను ఉత్తేజితులై నిరపేక్షరాచరిక వ్యవస్థ దైవదత్తమైందన్న విషయాన్ని విస్మరించి, విప్లవాలకు పూనుకోవడం, అది క్రమంగా సాంప్రదాయక వ్యవస్థలను ధ్వంసం చేయడానికి, నెపోలియన్ వంటి నియంతలు ఉత్పన్నం కావడానికి దారితీయడమూ, ఇటువంటి దుష్పరిణామాలు ఇకముందు తలెత్తకుండా ఉండటానికి ఐరోపా రాజ్యాధినేతల్లో పరస్పర సహకారం అవసరమని అతడు వారిముందు వాదించి ఒప్పించాడు. తత్ఫలితంగా 1815 నవంబర్ 20న ఆస్ట్రియా, రష్యా, ప్రష్యా ఇంగ్లాండులతో ఐరోపారాజ్య కూటమిని ఏర్పరచాడు.

వాస్తవానికి ఈ నాలుగురాజ్యాల కూటమి నెపోలియన్‌ను ఓడించడానికి ఏర్పడ్డ నాలుగో ఐరోపా రాజ్యసంకీర్ణకూటమి (Fourth Coalition of European Powers) నెపోలియన్‌ను ఓడించడంతో తమ బాధ్యత తీరిపోలేదని, వియన్నా కాంగ్రెస్ పరిష్కారాన్ని అనుసరించి చేసిన ఐరోపా రాజ్యాల పునర్నిర్మాణాన్ని యథాతథంగా నిర్వహించేందుకు తమ మధ్య శాశ్వతమైన అవగాహన, సహకారం అవసరమని, మెటర్నిక్ అటువంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఈ కూటాలని ఏర్పరచినాడు. ఇందులో ఐరోపా ఖండంలోని నాలుగు అగ్రరాజ్యాలు సభ్యులు కావడం చతుష్టయ కూటమి (Quadraple Alliance) అని

గూడ అంటారు. ఈ కూటమి తరచుగా సమావేశం అవుతూ, ఐరోపాలో రాజకీయ పరిణామాలను సమీక్షించాలని, నిరపేక్ష రాచరికాలకు ప్రమాదం కల్గించే ప్రజా ఉద్యమాలను అణచివేయాలని నిర్ణయం అయింది.

ఐరోపారాజ్యకూటమి (Concert of Europe) అనుకున్న విధంగా 1818లో ఎలాషాపెల్(Aix - la - Chappel) 1820లో ట్రొపావూ (Troppau) 1821లో లైబాక్ (Laibach) 1822లో వెరోనా (Verona) నగరాల్లో సమావేశాలు జరిపింది.

ఈ సమావేశాల్లో అప్పటికి ఉత్పన్నమై ఉన్న రాజకీయ స్థితిగతులను సమీక్షించి, కూటమి దేశాలు అనుగుణమైన కార్యక్రమాలు చేపట్టి, తమ అధీష్టానుసారం ఐరోపా రాజకీయాలను నిర్దేశించి, నిర్వహించారు.

## 8.4.1 ఐరోపారాజ్య కూటమి ప్రథమ సమావేశం :

1818 లో జరిగిన ఎలాషాపెల్ (లేదా ఏషెన్) సమావేశం నాటికి ఫ్రాన్సు కూటమి రాజ్యాలకు యుద్ధఖర్చుల పరిహారం క్రింద చెల్లించవలసిన మొత్తాన్ని, విధించిన గడువు కంటే ముందే, చెల్లించివేసింది. కనుక ఈ సమావేశంలో ఫ్రాన్సు నుండి తమ సేనలను ఉపసంహరించుకొనేందుకు కూటమి దేశాలు అంగీకరించాయి. అంతేకాక, 1815 నుండి అప్పటివరకు ఫ్రాన్సులో తాము పునరుద్ధరించిన బూర్బన్ రాజవంశీయుల పరిపాలనకు ప్రజలనుండి ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాలేదు. కనుక ఆ దేశ ప్రభుత్వము, ప్రజలు క్రమశిక్షణ అలవరచుకున్నారని, లోగడ తాము భయపడినట్లు ఐరోపా శాంతిభద్రతలకు ముప్పు తెచ్చిపెట్టబోరని కూటమి విశ్వసించింది. ఆ విశ్వాసంతో ఐరోపా రాజ్యకూటమిలోనికి ఫ్రాన్సును కూడ ఆహ్వానించడం ఉచితమని భావించి, కూటమి సభ్యత్వాన్ని ఇచ్చారు. దీనితో కూటమిదేశాల వాస్తవమైన ఉద్దేశంలో సంపూర్ణమైన మార్పు వచ్చింది. ఫ్రాన్సు పట్ల భయ సంశయాలతో ఏర్పడి, ఫ్రాన్సు నుండి విప్లవ భావాలను, విస్తరణ విధానాలను అరికట్టడం ఆ దేశాల వాస్తవమైన ఉద్దేశం. కాగా, ఫ్రాన్సు పట్ల భయ సంశయాలు తొలగిపోయి, ఆ దేశానికి సభ్యత్వం ఇయ్యడంతో కూటమికి ప్రత్యేకమైన ఉద్దేశం ఏదీలేక, కేవలం ప్రజలలో విప్లవభావాలను, విప్లవ సంఘటనలను అరికట్టడమే ధ్యేయమూ, కర్తవ్యము అయింది.

ఈ సమావేశంలోనే జార్ అలెగ్జాండర్ తరచుగా సమావేశాలు జరపడానికి, రాజకీయ పరిణామాలను సమీక్షించి తగు చర్యలు చేపట్టడాన్ని సూచించాడు. అవసరమైతే అలజడికి లోనైన దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోవడాన్ని అతడు సూచించాడు. కాని గ్రేట్ బ్రిటన్ ఈ రెండు సూచనలకు తన వ్యతిరేకతను వ్యక్తపరచింది. అవసరమైనప్పుడే కూటమి దేశాలు సమావేశం కావాలని, రాజ్యాల అంతర్గత వ్యవహారాల్లో ఇతర దేశాల జోక్యం కూడదని గ్రేట్ బ్రిటన్ స్పష్టం చేసింది.

## 8.4.2 ఐరోపారాజ్య కూటమి ద్వితీయ సమావేశం :

1820 లో ట్రొపావూ వద్ద ఐరోపారాజ్య కూటమి రెండవ సమావేశాన్ని జరిపే సమయానికి అనేక దేశాల్లో ప్రజల విప్లవోద్యమాలు ప్రారంభమైనాయి.

స్పెయిన్‌లో ఏడవ ఫెర్డినాండ్ నెపోలియన్ బోనాపార్టీతో పోరాడే సమయాన, 1812 లో, ప్రజల మద్దత్తును సంపాదించేందుకు వారు కోరినట్లు రాజ్యాంగాన్ని ఆమోదించాడు. అతడు ఆపద్ధర్మంగా రాజ్యాంగాన్ని ఆమోదించాడు కాని వాస్తవంగా అతడు నిరపేక్షాధికారాన్ని (Absolute Power) కోరుకొనేవాడు. 1815 లో నెపోలియన్ పతనానంతరం వియన్నా కాంగ్రెసు ఐరోపారాజ్యాలన్నిటిలో నిరపేక్ష రాచరిక వ్యవస్థలను పునరుద్ధరించి, నిరపేక్ష పరిపాలకులకు మద్దత్తునీయడంతో ఏడవ ఫెర్డినాండ్ ధైర్యం తెచ్చుకొని, 1812 నాటి రాజ్యాంగాన్ని రద్దు చేశాడు. దీనితో ప్రజలు ఆగ్రహించి రీగో (Riego) అనేవాని నాయకత్వంలో కాడిజ్ వద్ద (Cadiz) తిరుగుబాటు ప్రారంభించారు. స్వల్ప వ్యవధిలోనే ఈ తిరుగుబాటు స్పెయిన్ దేశమంతటా వ్యాపించింది. ఆ తిరుగుబాటును అణచలేక ఏడవ ఫెర్డినాండ్ ఐరోపారాజ్యకూటమి సాయం అర్థించాడు.

అదే సమయాన నేపిల్‌లో వియన్నా కాంగ్రెస్ పునరుద్ధరించిన బూర్బన్ రాజవంశం కూడ ప్రజల తిరుగుబాట్లను ఎదుర్కొంటున్నది. ఆ వంశానికి చెందిన మొదటి ఫెర్డినాండ్ పరిపాలన అవినీతిమయము, ప్రజాకంటకమూ కావడాన తిరుగుబాట్లు చెలరేగాయి. స్పెయిన్‌లో జరుగుతున్న తిరుగుబాటు వారికి ఆదర్శమైంది, వారు తమకు కూడ 1812 లో ఏడవ ఫెర్డినాండ్ స్పానిష్ ప్రజలకు ఇచ్చినటువంటి రాజ్యాంగం ఇయ్యవలసిందిగా తమ రాజైన మొదటి ఫెర్డినాండ్‌ను అతడు వారి ఒత్తిడి వలన కోరుతున్నారు. స్పానిష్ రాజ్యాంగాన్ని అమలుజరపడానికి అంగీకరించాడు. అదే సమయంలో కార్బొనరీ (Carbonari) అనే బొగ్గుగని కార్మికుల సంఘం తీవ్ర జాతీయవాదంతో ఉత్తేజితమై రహస్య విప్లవసంఘంగా మారింది. ఆ సంస్థ సభ్యులు నెపోలియన్ దండయాత్రల వల్ల ఇటలీదేశానికి సమకూరిన జాతీయ సమైక్యతను స్మరిస్తూ, వియన్నా కాంగ్రెస్ నెలకొల్పిన చిన్న చిన్న రాజ్యాలను, వాటిని పరిపాలించే హాప్స్‌బర్గ్, బూర్బన్ వంశీయుల నిరపేక్షరాచరికాలను నిర్మూలించాలని, తిరిగి సమైక్య ఇటలీని జాతీయరాజ్యంగా ఏర్పరచాలని ప్రయత్నిస్తున్నారు.

ఈ పరిణామాలు ఐరోపారాజ్యకూటమికి తీవ్రమైన ఆందోళన కలిగించాయి. కనుక ట్రొపావూ సమావేశంలో ఈ ప్రజా ఉద్యమాలను కఠినంగా అణచివేయడానికి కూటమిలోని అగ్రరాజ్యాలు, మెటర్నిక్ ప్రబోధంతో నిర్ణయం తీసుకొన్నాయి. స్పెయిన్‌లో తిరుగుబాటును అణిచివేసి, ఏడవ ఫెర్డినాండ్ పదవిని సుస్థిరం చేయవలసిందిగా మెటర్నిక్ ఫ్రాన్సును ఆదేశించాడు, నేపిల్స్‌లో తిరుగుబాటును అణచివేయడం ఆస్ట్రియా బాధ్యతగా నిర్ణయించాడు. ఆయాదేశాల ఆంతరంగిక వ్యవహారాలైనా, ఈ తిరుగుబాట్లు ప్రమాదకరమైనవని, కనుక వాటిని అణచివేసేందుకు, ఆయా దేశాల రాజులపక్షాన కూటమిసేనలు స్పెయిన్, నేపిల్స్‌లలో ప్రవేశించడానికి అనువుగా మెటర్నిక్ ట్రొపావూ కట్టడి (Protocol of Troppau) ను జారీచేశాడు. ఈ విధమైన నిర్ణయాలు, కట్టడి గ్రేట్ బ్రిటన్ వ్యతిరేకించింది. ఆ దేశ ప్రతినిధిగా వచ్చిన బ్రిటిష్ విదేశాంగ మంత్రి కాసల్‌రీ (Castlereagh) ఆ విప్లవాలు ఆ దేశ ప్రజలకు, పరిపాలనకు నడుమ తలెత్తిన విభేదాలు, అవి వారే పరిష్కరించుకోవలసినవి, బయటివారి జోక్యం ఆ దేశాల సర్వసత్తాక సార్వభౌమత్వాన్ని (Sovereignty) ఉల్లంఘించడమేనని వాదించాడు. అయితే, గ్రేట్ బ్రిటన్ మెటర్నిక్‌ను, కూటమి సేనల దండయాత్రలను నిరోధించడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. అలాగే బ్రిటిష్ వ్యతిరేకతను మెటర్నిక్ కూడ నిర్లక్ష్యం చేయలేకపోయాడు.

### 8.4.3 ఐరోపారాజ్యకూటమి తృతీయ సమావేశం :

1821 లో ఐరోపారాజ్యకూటమి మూడవ సమావేశం లైబాక్ (Laibach) వద్ద జరిగింది. ఈ సమావేశానికి నేపిల్స్‌రాజు మొదటి ఫెర్డినాండ్ స్వయంగా హాజరై ఐరోపా అగ్రరాజ్యాల సాయం అర్థించాడు. ప్రజల ఒత్తిడి వలన తాను లోగడ అంగీకరించిన రాజ్యాంగాన్ని రద్దుచేశాడు. ట్రొపావూ సమావేశం నేపిల్స్‌లో ప్రజల ఉద్యమాన్ని అణచివేయడానికి ఆస్ట్రియాను అనుమతించింది. ఆస్ట్రియా సమావేశం నిర్ణయాన్ని అమలుజరిపి, మొదటి ఫెర్డినాండ్‌ను తిరిగి నేపిల్స్‌లో నిరపేక్ష పరిపాలకునిగా నిలిపింది.

### 8.4.4 పైడ్మాంట్ లో తిరుగుబాటు :

అదే సమయంలో సార్డీనియాను పరిపాలిస్తున్న మొదటి విక్టర్ ఇమ్మాన్యుయేల్ నిరంకుశత్వాన్ని వ్యతిరేకించి, పైడ్మాంట్‌లోని ప్రజలు 1812 నాటి స్పానిష్ రాజ్యాంగాన్ని అమలు చేయవలసిందిగా కోరుతున్నారు. అందుకు అంగీకరించని మొదటి విక్టర్ ఇమ్మాన్యుయేల్ సింహాసన త్యాగం చేసి, తన సోదరుడైన ఛార్లెస్ ఫెలిక్స్‌ను రాజును చేశాడు. ఛార్లెస్ ఫెలిక్స్ సంరక్షకునిగా పరిపాలన నిర్వహిస్తున్న ఛార్లెస్ ఆల్బర్ట్ ప్రజల కోరిక మేరకు రాజ్యాంగాన్ని అమలుజరపడానికి అంగీకరించాడు, కాని, తరువాత తిరిగివచ్చిన ఛార్లెస్ ఫెలిక్స్ రాజ్యాంగాన్ని రద్దుచేశాడు. దానితో తిరిగి విప్లవం ప్రారంభమై, విప్లవసేనలు రాజుపై దండయాత్ర చేయ సమకట్టాయి. నేపిల్స్‌లో తిరుగుబాటును అణచివేసిన ఆస్ట్రియా సేనలు పైడ్మాంట్‌లో ప్రవేశించి, రాజుకు విధేయులైన వారి సాయంతో విప్లవాన్ని అణచివేశాయి. పైడ్మాంట్‌కు ప్రక్కనే ఆస్ట్రియా అధీనంలో ఉన్న లంబార్డీ, వెనీషియా భూభాగాల్లోకి ఈ తిరుగుబాటు విస్తరించకుండా ఆ దేశం ముందు జాగ్రత్తచర్యగా పైడ్మాంట్ తిరుగుబాటును అణచివేసింది.

### 8.4.5 ఐరోపారాజ్య కూటమి చతుర్ధ సమావేశం :

ఐరోపారాజ్యకూటమి నాలుగో సమావేశం వెరోనా (Verona) వద్ద 1822 లో జరిగింది. అప్పటికింకా స్పానిష్ ప్రజల తిరుగుబాటును అణచడం జరగలేదు. కాగా, ఈ సమావేశం ఆ తిరుగుబాటును అణచడానికి ఫ్రాన్సును ఆదేశించింది. లోగడ కాసల్‌రీ వ్యతిరేకించినట్లే ఈ విధమైన ప్రజల ఆకాంక్షలను నియంతృత్వ శక్తులు అణచివేయడాన్ని ఈ సమావేశంలో గ్రేట్ బ్రిటన్‌కు ప్రాతినిధ్యం వహించిన లార్డ్ కానింగ్ కూడ వ్యతిరేకించాడు. అయినా ఐరోపారాజ్య కూటమిలోని తక్కినదేశాలు ఈ తిరుగుబాటును ఫ్రాన్సు అణచడాన్ని సమర్ధించాయి, వాటిని నిరోధించడానికి గ్రేట్ బ్రిటన్ ఎటువంటి చర్య తీసుకోలేదు.

### 8.4.6 ఐరోపారాజ్యకూటమి విచ్ఛిన్నం :

ఐరోపారాజ్యకూటమి లేదా పవిత్రమైత్రి సభ్యులైన ఐరోపా అగ్రరాజ్యాల సాంప్రదాయిక సంరక్షణ విధానము (Conservatism) తిరోగమన విధానమూ (Reactionary policy) మెటర్నిక్ ఆధ్వర్యంలో 1825 వరకు ఈ విధంగా కొనసాగింది. పవిత్రమైత్రిని ప్రతిపాదించిన కాలంలో జార్ మొదటి అలెగ్జాండర్ కొంతవరకు నిజాయితీగా క్రైస్తవ ధర్మాలకు కట్టుబడిఉండాలని సభ్యులను కోరినా, మెటర్నిక్ ప్రభావంతో ఆ కూటమి నిరపేక్షరాజరికాలను నెలకొల్పి సంరక్షించడము, ప్రజల ఆకాంక్షలను అణచివేయడమే తన విధానాలుగా పనిచేసింది. ప్రజావిప్లవంలో స్వేచ్ఛా, సమానత్వాలను, ప్రజా పరిపాలనావ్యవస్థలను నెలకొల్పుకొనేందుకు దశాబ్దిపైగా పోరాడిన ఫ్రాన్సు ప్రజల ఆకాంక్షలను అణచివేయడానికి నియంతృత్వ వ్యవస్థలతో చేయి కలిపి, స్పెయిన్‌పై దండెత్తడం ఈ సందర్భంలో గమనించదగింది. అలాగే జార్ మొదటి అలెగ్జాండర్ పవిత్రభావాలకు వాస్తవమైన అర్థాన్ని సమకూర్చిన మెటర్నిక్ అతన్ని కూడ పూర్తిగా నియంతగా మార్చివేశాడు. ఈ పరిణామాలను గ్రేట్ బ్రిటన్ వ్యతిరేకించినా, ఆ వ్యతిరేకత ఉపన్యాసాలకే పరిమితమై, యదార్థ స్వరూపాన్ని పొందలేదు. అయితే ఐరోపారాజ్యకూటమి ఆధిపత్యం ఆవిధంగా ఎంతో కాలం సాగలేదు. వారి సాంప్రదాయిక సంరక్షణ విధానానికి మొదటి దెబ్బ అమెరికా సంయుక్త రాష్ట్రాలనుండి వచ్చింది.

#### 8.4.6.1 స్పానిష్ వలసలపై దండయాత్ర :

ఫ్రాన్సు స్పెయిన్‌పై దండెత్తి, ఏడవ ఫెర్డినాండ్ నిరపేక్ష పరిపాలనను బలపరచి, ప్రజావిప్లవాలను అణచివేసిన తరువాత పవిత్రమైత్రి దేశాలు అమెరికా ఖండంలోని స్పానిష్ వలసలపై దండయాత్రకు ఆలోచనలు చేయసాగాయి. అక్కడి వలసల్లో స్పానిష్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్వాతంత్ర్య పోరాటాలను, రాజ్యాంగబద్ధ పరిపాలన కొరకు ఆందోళనలను చేస్తున్నారు. ఐరోపాలోని మాతృదేశంలోనే కాక వలసల్లో కూడ ఈ ప్రజావిప్లవాలను అణచి, బూర్బన్ నియంతృత్వాన్ని నెలకొల్పడం ఐరోపారాజ్యకూటమి ఆలోచన. అయితే, ఈ సారి గ్రేట్ బ్రిటన్ కేవలం ఉపన్యాసాలు కాక, ఐరోపారాజ్యకూటమి ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఐరోపా సంయుక్త రాష్ట్రాలతో కలసి తగిన కార్యక్రమం చేపట్టడానికి నిశ్చయించుకుంది. అయితే బ్రిటిష్‌వారి చిత్తశుద్ధి, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మొదటినుండి తెలిసిన విషయమే, వారి ఆధిపత్యాన్ని తొలగించుకోవడానికి 1812 లోనే ఒక తీవ్రపోరాటం కూడ చేసిఉన్నారు; కనుక అప్పటి అమెరికా సంయుక్తరాష్ట్రాల అధ్యక్షుడు మన్రో బ్రిటిష్‌వారి ఉత్సాహాన్ని నిరాకరించి, 1828 లో స్వయంగా ఒక ప్రకటన జారీచేశాడు. అదే మన్రోసిద్ధాంతం (Munroe Doctrine) అనేపేర ప్రసిద్ధమైన ప్రకటన. దాని సారాంశం "ఐరోపారాజ్యాలు అమెరికా ఖండంలోని రాజకీయాల్లో జోక్యం చేసుకోవడాన్ని అమెరికా సంయుక్తరాష్ట్రాలు సహించవు; అలాగే ఐరోపా వ్యవహారాల్లో అమెరికా సంయుక్తరాష్ట్రాలు జోక్యం కలిగించుకోవు". ఈ ప్రకటన ఐరోపారాజ్యకూటమి దేశాల ముందరికాళ్ళకు బంధమైంది. వారు స్పానిష్ వలసలపై దండెత్తినట్లయితే అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పోరాటానికి కూడ సంసిద్ధులు కావలసి ఉంటుంది. ఈ పరిణామంతో ఐరోపారాజ్యకూటమి తన ప్రయత్నాన్ని విరమించింది.

#### 8.4.6.2 పోర్చుగల్‌లో పరిణామాలు :

పవిత్ర మైత్రి, లేదా ఐరోపా రాజ్యకూటమికి రెండవ ప్రతిఘటన పోర్చుగల్‌లోను, పోర్చుగల్ వలసరాజ్యమైన బ్రెజిల్‌లోను ఎదురైంది. పోర్చుగీసురాజు ఆరవ జాన్ కొంతకాలం తన వలసరాజ్యమైన బ్రెజిల్‌లో నివసించాడు. అతడు లేని సమయంలో

పోర్చుగల్‌లో ఒక ప్రజా ఉద్యమం జరిగింది, ప్రజలు 1812 నాటి స్పానిష్ రాజ్యాంగాన్ని పోర్చుగల్‌లో అమలుపరచవలసిందిగా కోరారు. జాన్ 1821లో పోర్చుగల్‌కు తిరిగివస్తూ, బ్రెజిల్‌లో తన పెద్ద కుమారుడైన పెడ్రోను పరిపాలనా నిర్వాహకుని (Regent) గా నిలిపాడు. అతడు పోర్చుగల్‌కు తిరిగివచ్చిన తరువాత ప్రజల కోరికను మన్నించి, రాజ్యాంగాన్ని అమలుపరచాడు. కాని అతని రెండవ కుమారుడైన మైగేల్ (Mighel) తండ్రిపై తిరుగుబాటు చేసి, రాజ్యాంగాన్ని రద్దుచేశాడు. మైగేల్‌కు ఫ్రెంచి మద్దత్తు లభించింది. గ్రేట్ బ్రిటన్ రాజైన ఆరవ జాన్‌కు మద్దత్తు నిచ్చి సైనికసాయం పంపి, మైగేల్ తిరుగుబాటును అణచివేసి, అతన్ని దేశబహిష్కృ తుణ్ణి చేశారు. పోర్చుగీసు వలసరాజ్యమైన బ్రెజిల్‌లో కూడ ప్రజలు రాజ్యాంగబద్ధ పరిపాలనను కోరగా, 1822 లో పెడ్రో రాజ్యాంగాన్ని అమలుచేయడమే కాక ఆ దేశాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించాడు. 1826 లో ఆరవ జాన్ మరణానంతరం పెడ్రో పోర్చుగల్‌కు మరొక క్రొత్త రాజ్యాంగాన్ని అమలుచేస్తూ, తన కుమార్తె అయిన డోనా మారియాను సింహాసనంపై నిలిపాడు. కాని మైగేల్ మద్దత్తుదారులు ఫ్రాన్సు, స్పెయిన్ దేశాల్లోని అరాచక శక్తుల సాయంతో డోనా మారియాను తొలగించి అధికారం హస్తగతం చేసుకో ప్రయత్నించారు. అప్పుడు గ్రేట్ బ్రిటన్ పోర్చుగల్‌లోని రాజ్యాంగబద్ధ పరిపాలనకు, డోనా మారియాకు మద్దత్తుగా సైనికబలగాలను పంపి అరాచకాలను అదుపుచేసింది. ఈ విధంగా 1825 నుండి ఐరోపా రాజ్యకూటమిని గ్రేట్ బ్రిటన్ కొంతవరకు ప్రతిఘటించడంతో కూటమి బలహీనమైంది.

### 8.4.6.3 బాల్కన్ ప్రాంతంలో పరిణామాలు :

పశ్చిమ ఐరోపాలోని స్పెయిన్, పోర్చుగల్ దేశాల్లోనేకాక తూర్పు ఐరోపాలోని బాల్కన్ భూభాగాల్లో, అనగా నల్ల సముద్రం చుట్టూ విస్తరించిన ప్రదేశంలో తలెత్తిన పరిస్థితులు ఐరోపా రాజ్యకూటమి విధానాలకు ప్రతిఘటనలై, తుదకు కూటమి విచ్ఛిన్నానికి దారితీసాయి. కూటమి సభ్యులైన అగ్రరాజ్యాల స్వప్రయోజనాలకు కూటమి విధానాలు విరుద్ధం కావడంతో వారు సమిష్టిగా ఉండడం, సహకరించుకోవడం అసాధ్యమైంది.

తూర్పు ఐరోపానంతటిని ఆక్రమించిన 18వ శతాబ్ది ద్వితీయార్ధం నుండి తురుష్క సామ్రాజ్యం క్రమంగా బలహీనపడుతున్నది. అనేక క్రైస్తవ ప్రజానీకాలను పరిపాలిస్తున్న తురుష్క గవర్నర్లు బలపడుతూ సామ్రాజ్యాన్ని బలహీనపరుస్తూ, ప్రజలను మతమౌఢ్యంతో పీడిస్తున్నారు. ఫ్రెంచివిప్లవ కాలంలో ఐరోపా ప్రజానీకాలను ఉత్తేజపరచిన స్వేచ్ఛాసమానత్వ సిద్ధాంతాలు, జాతీయభావాలు తూర్పు ఐరోపా ప్రజలను కూడ ప్రభావితం చేసి స్వాతంత్ర్య పోరాటాలకు పురికొల్పుతున్నాయి. 1804 లోనే తురుష్క సామ్రాజ్యంలోని క్రైస్తవ ప్రజానీకాల్లో ఒకరైన సెర్బులు (Serbs) స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించారు. వారిని అనుగమిస్తూ 1814 లో గ్రీకులు కూడ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించి, ఐరోపాలో తురుష్కుల ఆధిపత్యాన్ని అంతం చేయ నిశ్చయించుకొన్నారు. ఈ స్వాతంత్ర్య పోరాటాలను అనువుగా చేసుకొని, వారికి నైతిక, సైనిక సాయం అందించి, అందుకు ప్రతిగా నల్లసముద్రంపైన, దానినుండి మధ్యదరా సముద్రంపైన ఆధిపత్యం సంపాదించాలని, పశ్చిమ ఐరోపాదేశాల వలె వర్తక వాణిజ్యాలను నిర్వహిస్తూ అభివృద్ధి చెందాలని రష్యా ఆకాంక్ష. తురుష్కుల దుష్పరిపాలనకు గురవుతున్న క్రైస్తవ ప్రజానీకాలపై అన్ని ఐరోపా దేశాలకు సానుభూతి ఉన్నా, ఆ సామ్రాజ్యం బలహీనపడి, అక్కడి క్రైస్తవ ప్రజానీకాలన్నీ స్వతంత్రమైన జాతీయరాజ్యాలైతే అది రష్యాకు ప్రయోజనకరం కనుక ఐరోపాలో అగ్రరాజ్యాలు ఎటూ తోచని స్థితిలో ఉండిపోయాయి. వియాన్నా కాంగ్రెసు సమావేశాల్లోనే జార్ మొదటి అలెగ్జాండర్ "తురుష్క సామ్రాజ్యం మరణశయ్య మీద ఉంది; కనుక దాని ఆస్తిపాస్తుల పంపకం గూర్చి ఆలోచించడం అవసరం" అని ప్రతిపాదించగా మెటర్నిక్ దానిని పట్టించుకోలేదు.

సెర్బ్, గ్రీకు స్వాతంత్ర్య పోరాటాలు జరుగుతూ, ఆ దేశాల్లోని స్వాతంత్ర్య యోధులను తురుష్కులు అమానుషంగా హింసిస్తూ, వధిస్తున్నప్పుడు ఐరోపా దేశాల్లో, ముఖ్యంగా ఇంగ్లాండ్‌లో పత్రికలు ఉద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేశాయి. సాటి క్రైస్తవ ప్రజల స్వాతంత్ర్య పోరాటాలకు అవసరమైన సహాయ సహకారాలను అందించటం ఐరోపా ప్రభుత్వాల బాధ్యతగా నొక్కిచెప్పాయి. కాని ఐరోపా రాజ్యకూటమి విధానంలో జాతీయభావాలకు, ప్రజల స్వాతంత్ర్యకాంక్షకు స్థానం లేదు. స్వాతంత్ర్య

పోరాటాలు ప్రజల సాంప్రదాయక వ్యవస్థను ధిక్కరిస్తూ చేసే అరాచక కృత్యాలు. ఈ సిద్ధాంతానికి కట్టుబడిన జార్ మొదటి అలెగ్జాండర్ చక్కని అవకాశాన్ని జారవిడుచుకుంటున్నాడనే క్షోభతో, ఉండలేక ఉరకలేక అల్లాడిపోయాడు. 1825లో అతని మరణానంతరం జార్ అయిన అతని కుమారుడు మొదటి నికోలస్ ఈ అవకాశాన్ని వదులుకోదలచుకోలేదు. కాని అతడు సెర్బ్, గ్రీకు స్వాతంత్ర్య పోరాటాలను సమర్థిస్తూ తురుష్కులపై యుద్ధానికి దిగితే, తక్కిన ఐరోపా రాజ్యాలన్ని రష్యాను ఎదిరించే ప్రమాదం ఉంది. 1825లో సుల్తాన్ ఈజిప్టు గవర్నర్ మెహమెట్ ఆలీని గ్రీకు స్వాతంత్ర పోరాటాన్ని అణచివేయవలసిందిగా కోరాడు.

అటువంటి పరిస్థితిలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి అయిన కానింగ్ ఈ అవకాశాన్ని రష్యాకు పూర్తిగా వదలివేయడం కంటే, ఆ దేశంతో సహకరిస్తూ, ఆ దేశానికి పూర్తి ప్రయోజనం దక్కకుండ చేయడం యుక్తమని భావించాడు. అతడు ఫ్రాన్సు, రష్యాలతో కలిసి సుల్తాన్‌కు గ్రీకు స్వాతంత్ర్య యోధులకు నడుమ మధ్యవర్తిత్వం నిర్వహించాలని సూచించాడు. సుల్తాన్ అందుకు నిరాకరించడంతో బ్రిటిష్, ఫ్రెంచి నౌకాబలాలు 1827లో నావోరినో వద్ద తురుష్క, ఈజిప్షియన్ నౌకాబలాలను ధ్వంసం చేశాయి. 1829లో రష్యా టర్కీ సామ్రాజ్యంపై దండెత్తి ఘోరంగా ఓడించింది.

ఈ స్వాతంత్ర్య పోరాటాలు, ఆ సందర్భంలో రష్యా ఆశయాలు, వాటిని సాధించడానికి ఆ దేశం పడిన పాట్లు, రష్యా ప్రయోజనాలను నీరుకార్చడానికి తక్కిన ఐరోపాదేశాలు ముఖ్యంగా ఆస్ట్రియా, అనుసరించిన విధానాలు రాబోయే అధ్యాయాల్లో వివరంగా తెలుసుకుంటారు. ప్రస్తుతం గుర్తించదగిన అంశమేమిటంటే ఐరోపా రాజ్యకూటమి దేశాలు పరస్పర విరుద్ధమైన జాతీయ ప్రయోజనాలు కలిగినవి కనుక బహుకాలం వీరిమధ్య సఖ్యత, సహకారం ఏర్పడే అవకాశాలు లేవు. తూర్పు ఐరోపాలో ప్రజల స్వాతంత్ర్య కాంక్షలను, పోరాటాలను సమర్థించి, వారు తమ నిర్ణయాలను తామే ఉల్లంఘించారు. ఈ పరిణామాల్లో ఐరోపా రాజ్యకూటమి అంతరించింది.

## 8.5 సాంప్రదాయక వ్యవస్థల పతనం : 1830, 1848 విప్లవాలు :

నెపోలియన్ పతనానంతరం 1815 నుండి 1848 వరకు ఐరోపా చరిత్ర విప్లవ భావాలైన జాతీయ ఉదారవాదానికి, మెటర్నిక్ పునరుద్ధరించిన సాంప్రదాయక వ్యవస్థకు సంఘర్షణలని చెప్పవచ్చును. ఈ యుగాన్ని రెండు ఘట్టాలుగా చేయవచ్చును. మొదటి ఘట్టం 1815 నుండి 1830 వరకు. ఈ ఘట్టంలో మెటర్నిక్ విజయం సాధించాడు. రెండవ ఘట్టం 1830 నుండి 1848 వరకు. ఈ ఘట్టంలో జాతీయ ఉదార మెటర్నిక్ సిద్ధాంతాలు విజయం సాధించింది.

ఈ యుగం మొదటి దశలో మెటర్నిక్ సిద్ధాంతాలు విజయం సాధించి ఆ దశలో విప్లవ భావాలను అణచి సనాతన వ్యవస్థను నెలకొల్పాడు. కాని ఉదారవాదం నశించలేదు. అవకాశం లభించినప్పుడల్లా అది సనాతన వాదంపై తిరుగుబాట్లు జరుపుతూనే వచ్చింది. కాని నెపోలియన్ పతనం నుండి 15 సం॥ అనగా 1815 నుండి 1830 వరకు ఉదారవాదతిరుగుబాట్లు సఫలం కాలేదు. ఐరోపా రాజ్యకూటమి వాటిని అణచి ఇంగ్లాండు ఈ కూటమి నుండి వైదొలగి తరువాత కూటమి బలహీనపడింది. దానితో తాత్కాలికంగా అణచబడిన ఉదారము తిరిగి విజృంభించింది. దాని ఫలితంగా 1830 - 1848 విప్లవాలు జరిగాయి. మెటర్నిక్ యుగంలో రెండవ ఘట్టం ప్రారంభం అయింది. ఈ ఘట్టంలో ఫ్రెంచివిప్లవంలాగానే ప్రజల తిరుగుబాట్లు మొదట ఫ్రాన్సులో ప్రారంభమై ఐరోపాలో వ్యాపించి సాంప్రదాయక వ్యవస్థను కదలించినాయి. అందువల్ల ఫ్రాన్స్ తుమ్మితే ఐరోపాకి జలుబు పట్టునని నానుడి ఏర్పడింది. (Whenever France Sneeze Europe catches cold) 1789 విప్లవం నుండి ఫ్రాన్సు విప్లవాలకు నిలయమైంది. విప్లవాలు జరగడం ప్రభుత్వాలు పడిపోవడం ఫ్రాన్సు చరిత్రలో మామూలై పోయింది.

### 8.5.1 ఫ్రాన్సులో బూర్బన్ రాచరికం పునఃస్థాపన :

నెపోలియన్ పతనానంతరం 1815 సం॥లో వియన్నా కాంగ్రెస్ ఫ్రాన్స్‌లో బూర్బన్ వంశాన్ని ప్రతిష్ఠ చేశారు. బూర్బన్ వంశానికి చెందిన 18వ లూయీ ఫ్రెంచి రాజైన 16వ లూయీ సోదరుడు. నెపోలియన్ కాలంలో అతడు ఇంగ్లాండ్‌లో ఒక

మారుమూల గ్రామంలో నివసించినాడు అతనిని ఫ్రాన్సురాజుగా ప్రకటించగానే ఫ్రాన్సు వచ్చి సింహాసనం అధిష్టించాడు. ఇతడు అధికారం చేపట్టగానే బూర్బన్ వంశం పునఃప్రతిష్ఠ చేయబడినది. రాజుకాగానే అతడు తనను రాజును చేయడమంటే సాంప్రదాయకరాచరిక వ్యవస్థను పునరుద్ధరించటంకాదని తాను ఫ్రాన్సును ప్రజాభీష్టం ప్రకారమే పాలించగలనని ప్రకటించాడు. కాని తన వంశపు చిహ్నాలను పాటించెదనని అన్నాడు. అందువల్ల అతను మూడు రంగుల (ఎరుపు, తెలుపు, నీలం) విప్లవ జండాను తొలగించి బూర్బన్ వంశ జండా అయిన రోజా పువ్వుల తెల్లజండాను ప్రతిష్ఠించాడు. ఆనాడు ఫ్రాన్సులో రాచరిక వాదులకు లిబరల్ వర్గం వారిని సమన్వయ పరచడానికి ప్రయత్నించినాడు. అందుకతడు మధ్యేమార్గాన్ని అవలంబించాడు. నెపోలియన్ పరిపాలనా పద్ధతులను, న్యాయవిధానాలను కొనసాగించాడు. నెపోలియన్ పాటించిన సైనికగౌరవం, కంకార్డ్, ఫ్రెంచి బ్యాంకు, విద్యావిధానం కూడా కొనసాగించాడు. అతడు ఫ్రాన్సు నుండి పారిపోదల్చుకోలేదు. రాజుగానే మరణించదల్చుకున్నాడు.

## 8.5.1.1 ఫ్రాన్సులో నూతన రాజ్యాంగం :

జార్ అలెగ్జాండర్ 18వ లూయిని ఫ్రెంచి ప్రజలకు క్రొత్త రాజ్యాంగాన్ని ప్రసాదించమని సలహా యిచ్చినాడు. అతని సలహాను పాటించి లూయి మత, సాంఘిక సమానత్వాలనిస్తూ ప్రజా ప్రాతినిధ్యం కలిగిన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు. అందుకతడు రెండు సభలు కలిగిన పార్లమెంటును ఏర్పాటు చేశాడు. మొదటి ఛాంబర్‌లోని సభ్యులను రాజు నియమించును. వారు జీవిత సభ్యులుగా కొనసాగుతారు. రెండవ ఛాంబర్‌కు ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొనెదరు. వారి కాలపరిమితి 5 సం॥లు. ఓటుహక్కు ఆస్తికలిగిన వారికే యివ్వడం అయింది. 29,000,000 జనాభాకు గాను ఒక లక్ష ఓట్లుమాత్రమే యివ్వబడ్డాయి. లూయి ప్రభుత్వం ఆనాటి అన్ని ఐరోపా ప్రభుత్వాలకన్నా మంచి ప్రభుత్వమని హెజన్ వర్ణించినాడు.

## 8.5.1.2 ఫ్రాన్సులో రాజకీయ వర్గాలు - పరిపాలనా సమస్యలు :

బూర్బన్ వంశాన్ని పునఃప్రతిష్టచేసిన నందున ఫ్రెంచి ప్రజలు రెండు వర్గాలుగా చేరిపోయారు. ఒక వర్గంవారు రాజాభిమానులు. రెండవవర్గం వారు ఉదారవాదులు. రాజాభిమానులకు లూయి ప్రకటించిన నూతన రాజ్యాంగం ఇష్టంలేదు. ఫ్రెంచి విప్లవకాలం నుండి ఈ వర్గం వారు ఎన్నో హింసలకు గురైయ్యారు. వారి ఆస్తులు హరించబడ్డాయి. కొందరు గిలోటిన్‌కు బలిచేయబడినారు. వారు సమయం వచ్చినప్పుడు ప్రతీకారం తీర్చుకొనవలెనని చూచుచున్నారు. మొదటి వర్గం వారైన ఉదారవాదులు లూయి అనుసరించు సామరస్య ధోరణిని సమర్థించారు. కానీ లూయిని ఐరోపా రాజ్యబద్ధ కూటమి రాజుగా ప్రకటించింది. అతనిని చూసినప్పుడల్లా ఫ్రాన్సుకు యుద్ధంలో జరిగిన అవమానం గుర్తుకువస్తుండేది.

లూయి దర్బారులో మొదట రాజాభిమానులదే పైచేయిగా వున్నది. లూయిని వారు రాజ్యాంగాన్ని రద్దుచేయమని కోరారు. కాని అతడు రద్దుచేయలేదు. అందువలన వారు హింసకు దిగి కొన్ని వందలమంది విప్లవాభిమానులను వధించారు. వీరిలో నెపోలియన్ ఘనంగా అభిమానించిన మార్షల్‌నే అను సేనాధిపతి ప్రాణాలను కోల్పోయాడు. ఈ హింసాకాండ వైట్ టెర్రర్ అని పిలువబడింది. ఇట్టి అశాంతి పరిస్థితులలో లూయి ఎన్నికలు జరిపాడు. ఎన్నికలలో రాజాభిమానులే నెగ్గారు. వారు హింసావాదానికి భయపడిన లూయి పార్లమెంటు రద్దుచేసి మరలా ఎన్నికలు జరిపాడు. ఈసారి ఉదారవాదులు గెలిచి ప్రభుత్వ ఏర్పాటు చేశారు. వారు 1816 నుండి 1820 వరకు అధికారంలో ఉన్నారు. ఫ్రాన్స్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. 1818లో మిత్ర రాజ్యాలకు కల్గిన యుద్ధ నష్టపరిహారం చెల్లించి శత్రుసేనలు ఫ్రాన్సు నుండి వెళ్ళిపోయే ఏర్పాటు చేశారు. ఫ్రాన్సు ఐరోపా రాజ్యయుద్ధ కూటమిలో సభ్యత్వాన్ని కూడా పొందింది. కాని 1820లో రాజు మేనల్లుడిని ఎవరో హత్యచేశారు. అది ఉదారవాదులే చేయించారని పుకారు బయల్దేరింది. అందువల్ల రాజపక్షీయులు మరల అధికారానికి వచ్చారు. వారు రాజ్యాంగాన్ని రద్దుచేసి పత్రికలపై ఆంక్షలు విధించారు. కేథలిక్కు ఆధిపత్యాన్ని ఏర్పరచారు. వెయ్యి ఫ్రాంకుల ఫన్నులు చెల్లించిన వారికి రెండు ఓట్లు ఇచ్చారు. పార్లమెంటు కాలాన్ని 7 సం॥లు పొడిగించారు. దేశమంతటా గూఢచారులను నియమించాగా

### 8.5.1.3 స్పెయిన్‌పై దండయాత్ర :

ఐరోపా రాజ్యకూటమి ఆజ్ఞ ప్రకారం 1823 లో స్పెయిన్‌లో విప్లవాలను అణచుటకు స్పెయిన్‌పై **దండెత్తి విజయం** సాధించెను. ఇది ఫ్రాన్సుకి ఐరోపాలో గౌరవ మర్యాదలను కలుగజేసింది. ఈ విజయంతో ఫ్రాన్సులో లూయీ **అధికారం** స్థిరపడింది. ఈ విధంగా ఫ్రాన్సును పరిపాలించిన 18వ లూయీ 1824 సం॥లో మరణించాడు. అతని పరిపాలనా **కాలంలో** కొంత అశాంతి జరిగినప్పటికి అతను కోరుకున్నట్లుగా రాజుగానే మరణించాడు.

### 8.5.1.4 ఫ్రాన్సులో పదవ ఛార్లెస్ ప్రతిపాదన :

18 వ లూయీ మరణానంతరం అతని తమ్ముడు 10వ ఛార్లెస్ సింహాసనానికి వచ్చాడు. ఇతని మొదటి పేరు కౌంట్ ఆర్టాయిస్ (Artois) 1824లో చార్లిన్ అను బిరుదుతో సింహాసనమెక్కినాడు. 16వ లూయీ, 18వ లూయీ, 10వ ఛార్లెస్ ముగ్గురు అన్నదమ్ములు. వీరు ముగ్గురు మూడు రకాల పరిస్థితుల్లో ఫ్రాన్సును పాలించారు. 16వ లూయీ 1793లో ఫ్రెంచి విప్లవంలో గిలోటిన్‌చే వధింపబడినాడు. 18వ లూయీ రాజపక్షీయులు ఉదారవాదుల సంఘర్షణలో సామరస్య ధోరణిని ప్రదర్శించి అధికారాన్ని నిలుపుకున్నాడు. 10వ ఛార్లెస్ పరిస్థితులను సరిగా అంచనా కట్టకుండా విప్లవం తెచ్చుకొని పదవీ త్యాగం చేసి ఫ్రాన్సు నుండి పారిపోయాడు. వీరు ముగ్గురిది మూడురకాల విచిత్రమైన చరిత్ర అని హేజ్ వ్యాఖ్యానించాడు. విప్లవాన్ని అణచడానికి ప్రయత్నించి, అది సాధ్యంకాక ఫ్రాన్సు నుండి పారిపోయాడు. ఫ్రాన్సు వెలుపల ఫ్రాన్సు నుండి పారిపోయి వచ్చిన వారినందర్నీ కూడగట్టి వారికి నాయకత్వం వహించి ఆస్ట్రియా, ప్రష్యాలను ప్రోత్సహించి వారితో రిపబ్లిక్ ప్రభుత్వాన్ని అంతం చేయటానికి ప్రయత్నించాడు. నెపోలియన్ అనంతరం తన సోదరుడు 18వ లూయీ ఫ్రాన్సుకు రాజుకాగానే తాను కూడా ఫ్రాన్స్ చేరాడు. తన సోదరుడు 18వ లూయీ అనుసరించిన సామరస్య ధోరణిని అతడు చేసే ప్రతికార్యాన్ని వ్యతిరేకించాడు. రాచరికవాదులకు నాయకత్వం వహించి ఉదారవాదులను వధింపచేశాడు.

10వ ఛార్లెస్ రాచరికవాదులకు, మతాధిపతులకు పదవులు కట్టబెట్టాడు. మతాధికారులను తన చుట్టూ పెట్టుకొని వెలిగించిన కాండిల్‌తో పారిస్ నగరంలో పర్యటించాడు. అందుకు బ్రిటిష్ సేనాపతి వెల్లింగ్‌టన్ 10వ ఛార్లెస్ మతాధికారుల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడని వ్యంగ్యంగా అన్నాడు. ఇతడు పరిపాలనలో భాగ్యవంతులకు మాత్రమే స్థానం యిచ్చాడు. విప్లవ కాలంలో ఫ్రాన్సు వదలి వెళ్ళిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి పత్రికలపై ఆంక్షలు విధించాడు. నేషనల్ గార్డులను రద్దుచేశాడు. ఈ విధమైన చర్యలవల్ల అతడు త్వరలోనే ప్రజాభిమానాన్ని కోల్పోయాడు. 1827 ఎన్నికల్లో రాచరికవాదులు ఓడిపోయి ఉదారవాదులు గెల్చినారు. అయినా 1829లో పార్లమెంటు కోరికకు వ్యతిరేకంగా పోలిగ్నాక్ (Polignac) అను నతనిని ప్రధానమంత్రిగా నియమించినాడు. ఇతడు ప్రతి పనిలో కీడును ఊహించుకునేవాడు. మతాభిమాని, పార్లమెంట్‌కు వ్యతిరేకి. పూర్వపు మతాధిపత్యాన్ని పునరుద్ధరించటమే తన ధ్యేయమని ప్రకటించాడు. ఇతడు ప్రజలతోను ఒకవైపు రాజుతోను మరియొక వైపు పార్లమెంటుతోను విరోధాన్ని తెచ్చుకున్నాడు. అతని పరిపాలనను పార్లమెంటు, ఉదారవాదులు నిరసించారు. కాని ఛార్లెస్ తన పద్ధతిని మార్చుకోలేదు. అంతేగాక పార్లమెంట్‌ను రద్దుచేసి ఎన్నికలు జరిపాడు. ఆ ఎన్నికలలో రాజును పూర్తిగా వ్యతిరేకించేవారు గెలిచారు. అది సహించలేక 1830 జూలై 28న కొన్ని ఆజ్ఞలు జారీచేసాడు. దానితో 1830 విప్లవం వచ్చింది.

### 8.5.1.5 1830 జులై విప్లవం :

1830 జులై 28 - పై ఆజ్ఞలను జారీచేసిన రోజుననే ప్రజలు కోపోద్రిక్తులై విప్లవానికి దిగిరి. 1830 జులై 28వ తేదీన మాజీ సైనికులు, రిపబ్లికన్‌లు, కార్మికులు, కర్షకులు, పారిస్ వీధులలో 10వేల మంది దాకా పోరాటానికి దిగారు. వారిని నిలువరించుటకు ఛార్లెస్ 14 వేల మంది సైనికులను పంపాడు. రాజ సైనికులమ ముందుకు రానీయకుండా **విప్లవకారులు** పారిస్ వీధులలో దుంగలతో అడ్డంకులు ఏర్పాటుచేసినారు (Barricades) బారికేడ్‌ల వెనుక నుండి రాళ్ళు సైనికులపై విసరివేశారు.

ఈ పోరాటం మూడు రోజులు జరిగింది. రాజు సైనికులు వారి ధాటికి తట్టుకొనలేక వెనుకకు వెళ్ళిపోయారు. ఈ విజయంతో పారిస్ ప్రజలందరూ విప్లవవాదులతో చేతులు కలిపినారు. ఈ పరిస్థితి ప్రమాదాన్ని గ్రహించిన ఛార్లెస్ జులై 31వ తేదీన అనగా పోరాటం ప్రారంభం అయిన మూడవ రోజున తన పదవీత్యాగం చేసి తన 10సం॥ల మనుమని తన వారసునిగా ప్రకటించి తాను కుటుంబంతో సహా ఇంగ్లండుకు పారిపోయాడు. తరువాత ఫ్రెంచి ప్రజలు ఛార్లెస్ మనుమణ్ణి కాదని ఆర్లియన్ వంశానికి చెందిన లూయీ ఫిలిప్పీని తమ రాజుగా ఎన్నుకున్నారు. ఈ విప్లవమే 1830 జులై విప్లవమని పిలిచెదరు. ఈ విధంగా కొద్ది రక్తపాతంతో 1830లో ఫ్రాన్సులో రిపబ్లిక్ విజయం సాధించింది. పదవ ఛార్లెస్ 1836లో ఇంగ్లాండ్‌లో మరణించాడు. ఈ విధంగా ఛార్లెస్ తనను వరించిన పదవిని కోల్పోయి మాతృదేశాన్ని వదలి పారిపోయి, పరాయి దేశంలో మరణించారు.

### 8.5.1.6 ఫ్రాన్సులో విప్లవ ఫలితాలు :

1) విప్లవం ఫ్రాన్సులో ఫ్రెంచి విప్లవం నాటి భావాలు విప్లవ జండా పునఃప్రతిష్ఠించింది. 2) వియన్నా కాంగ్రెస్ అనుసరించిన రాచరిక వారసత్వం దైవదత్త రాచరిక సిద్ధాంతం ఫ్రాన్సులో శాశ్వతంగా అంతరించింది. 3) భూస్వాముల అధికారం పోయి మధ్యతరగతి ప్రజల ఆధిక్యత పెరిగింది. 4) కాథలిక్కు మతాధిక్యత తొలగించబడింది. 5) జాతీయ ఉదారవాదం పూర్తిగా బలపడింది. రాజుగా ఎన్నికైన లూయీ ఉదారవాదులను సమన్వయ పరచుటకు ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టి నూతన రాజ్యాంగాన్ని ప్రసాదించినాడు. కనుకనే లిప్సన్ అను పండితుడు ఇదే 1789 విప్లవానికి ప్రతిబింబం అని వ్యాఖ్యానించాడు. ఈ విప్లవ ప్రభావం ఫ్రాన్సుకే పరిమితంకాక మిగిలిన ఐరోపా రాజ్యాలపై ప్రసరించింది.

## 8.6 ఇతర ఐరోపా దేశాల్లో 1830 విప్లవం :

మెటర్నిక్ చేత ఐరోపా రాజ్యాలలో అణచబడిన జాతీయ ఉదారవాదులకు ఫ్రాన్సులో జులై విప్లవం ధైర్యాన్ని కలుగజేసింది. దాని ఫలితంగా ఈ విప్లవం బెల్జియం, ఇంగ్లాండు, స్పెయిన్, పోర్చుగల్, పోలెండ్, జర్మనీ, ఇటలీలోకి వ్యాపించి ఐరోపాను కుదిపివేసింది.

**బెల్జియం :** మొదట ఈ విప్లవం బెల్జియంలో ప్రవేశించినది. ప్రజల అభిమతానికి విరుద్ధంగా వియన్నా కాంగ్రెస్ బెల్జియంను హాలెండ్‌తో కలిపింది. పూర్వం ఈ రెండు రాజ్యాలు నెదర్లాండు అనే పేరుతో ఒకటిగా వుండేవి. కాని వారికి వున్న జాతి, భాష, మత భేదాల వల్ల విడిపోయి రెండు రాజ్యాలుగా ఏర్పడినారు. వారి మనసుకు విరుద్ధంగా వియన్నా కాంగ్రెసు ఈ రెండు దేశాలను ఏకం చేసింది. డచ్చిరాజు విలియం బెల్జియం ప్రజలపై డచ్చి భాషను రుద్దాడు. పత్రికా స్వేచ్ఛను అణచాడు. విద్యావిధానాన్ని ప్రొటెస్టంటులకు అప్పగించాడు. ఇవన్నీ ఇష్టం లేకపోయినా బెల్జియం ప్రజలు గత్యంతరం లేక 15 సం॥ అణగి వున్నారు. జులై విప్లవం వారికి ధైర్యాన్ని కలుగజేసింది. కనుక వారు 1830 అక్టోబరులో డచ్చిరాజైన ఒకటవ విలియంపై తిరుగుబాటుచేసి స్వతంత్రం సంపాదించుకున్నారు. అప్పటికే ఐరోపా రాజ్యబద్ధ కూటమి విచ్ఛిన్నమైనది. రష్యా యిందులో జోక్యం చేసుకొనలేదు. ఇంగ్లాండు బెల్జియంనకు తన పూర్తి మద్దతు నిచ్చింది. లూయీ ఫిలిప్పీ బెల్జియంకు సానుభూతి చూపాడు. ఇదే సందర్భంలో ఇటలీ జర్మనీ తిరుగుబాట్లతో సతమతమయ్యే మెటర్నిక్ ఏమీ చేయలేకపోయినాడు. దానితో బెల్జియం విప్లవం పూర్తిగా విజయం సాధించింది. 1831లో అంతర్జాతీయ సమావేశం బెల్జియం స్వాతంత్ర్యాన్ని గుర్తించింది. తరువాత బ్రిటన్, ఫ్రాన్సు, ఆస్ట్రియా, రష్యా, ప్రష్యాను బెల్జియం స్వాతంత్ర్యాన్ని అధికారికంగా గుర్తించాయి. దీనితో మెటర్నిక్ విధానానికి ఎదురుదెబ్బ తగిలింది.

**ఇంగ్లాండ్ :** 1830 జులై విప్లవం బ్రిటన్‌పై గూడా తన ప్రభావాన్ని చూపింది. ఇంగ్లాండు ప్రజలు కొత్త సంస్కరణలను కోరుతూ ఆందోళన చేపట్టారు. కనుక 1831లో సంస్కరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినారు. 15 మాసాల చర్చల

**అనంతరం** బిల్లు పాస్ అయినది. ఓటు హక్కు విస్తరింపబడింది. 10 పౌన్ల విలువ గలిగిన ఇల్లువున్న ప్రతి యజమానికి **ఓటుహక్కు** ఇవ్వబడింది.

**స్పెయిన్ :** స్పెయిన్ రాజు ఏడవ ఫెర్డినాండ్ మరణానంతరం స్పెయిన్‌లో వారసత్వ యుద్ధం వచ్చింది. ఫెర్డినాండ్ సోదరుడు ఛార్లెస్ రాజుగా నిర్ణయింపబడినాడు. కాని అతడు నిరంకుశుడు గాన దేశంలో ఉదారవాదులు అతని వారసత్వాన్ని అంగీకరించలేదు. ప్రజలు ఫెర్డినాండ్ కుమార్తె ఇజబెల్లా రాణి కావాలని కోరారు. ఈ వారసత్వ యుద్ధంలో చివరకు ఇజబెల్లా రాణి అయింది. ఆమె ఉదారవాదాన్ని సమర్థించి స్పెయిన్‌లో ఉదారవాద సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలను సంతోషపెట్టింది. ఇచట విప్లవం విజయం సాధించినట్లుగానే భావించాలి.

**పోర్చుగల్ :** పోర్చుగల్‌లో గూడా తిరుగుబాటు ప్రారంభమైంది. అచట పోర్చుగల్ రాజు హెన్రీ నిరంకుశంగా పాలించుచుండెను. అతనికి వ్యతిరేకంగా మైఖేల్ అనువాని నాయకత్వంలో ఉదారవాదులు తిరుగుబాటు ప్రారంభించారు. పోర్చుగల్ రాజు సింహాసనం వదులుకున్నాడు. హెన్రీ తరువాత సింహాసనం కొరకు సోదరుడు ఫెడ్రో తన కుమార్తె రెండవ మేరియాను రాణిని చేయ ప్రయత్నించాడు. అతనికి ఇంగ్లాండు సహాయం చేసింది. రెండు సం॥ల పోరాటంలో మైఖేల్‌ని ఓడించి ఫెడ్రో తన కుమార్తె మేరియాను పోర్చుగల్ రాణిని చేశాడు. మేరియా విప్లవకారులను సమాధానపరచుటకు అనేక ఉదారవాద సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఇచ్చట కూడ విప్లవం విజయం సాధించింది.

**పోలెండ్ :** వియన్నా కాంగ్రెస్ పోలెండ్‌ను రష్యాకు దత్తం చేసినది. 1830 విప్లవ కాలంలో ప్రజలు తిరుగుబాటు చేసి రష్యా సేనలను పారద్రోలి స్వతంత్రులైనారు. కాని వారి మధ్య ఐక్యత లేదు. పార్లమెంటరీ పరిపాలనను ఏర్పరచు విధానాలలో **భేదాభిప్రాయాలు** వచ్చాయి. ఈ అనైక్యతను గమనించి రష్యా జార్ నికోలస్ తన సైన్యాలను పంపి **పోలెండును తిరిగి ఆక్రమించి** రష్యాలో అంతర్భాగంగా చేశాడు. ఇచట విప్లవం ప్రారంభంలో విజయవంతమే అయినా, తుదకు విఫలమైంది.

ఆస్ట్రియాలో విద్యార్థుల తిరుగుబాటును అణచుటకు 1829లో కార్ల్స్‌బడ్ ఆజ్ఞలను ప్రకటించి మెటర్నిక్ నిరంకుశ రాచరిక వ్యవస్థను స్థాపించాడు. కాని జర్మనీలో తిరిగి తిరుగుబాట్లు వచ్చాయి. సాగ్జని, బ్రన్స్‌విక్, హానోవర్‌లో విప్లవాలు జరిగాయి. కాని మెటర్నిక్ వాటిని అణచకల్గాడు. ఇచట విప్లవం పూర్తిగా అపజయం పొందింది.

ఇటలీని పార్మా, మొదేనాలలో విప్లవవాదులు విజయం సాధించి ప్రజలు తనను పరిపాలించే హేప్స్‌బర్గ్ రాజులను పదవీభ్రష్టులను చేశారు కాని మెటర్నిక్ ఇటలీలోనికి సైన్యాలను పంపి విప్లవ వాదులను ఓడించి తిరిగి ఆయా రాజ్యాలను ఆయా పాలకులకు అప్పగించినాడు.

సెర్బియా, గ్రీసులు, టర్కీ సుల్తాను పై తిరుగుబాట్లు చేసి స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నవి. ఈ విధంగా 1830 జులై విప్లవం బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్‌లో అనగా పశ్చిమ ఐరోపాలో విజయం గాంచింది. కాని మధ్య ఐరోపాలో విఫలం అయింది మెటర్నిక్ ప్రభావం అచట 1848 విప్లవం వరకు కొనసాగింది.

### 8.6.1 1830 విప్లవ ఫలితం :

1830 విప్లవం ఫ్రాన్సు, బెల్జియం, స్పెయిన్, పోర్చుగీసు దేశాల్లో విజయవంతంగా రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలను నెలకొల్పింది. కాని ఆస్ట్రియా, ఇటలీలలో దేశాల్లో మాత్రం పూర్తిగా విఫలమై అణచివేయబడింది. అందుకు కారణాలు :

1830 విప్లవం ఫ్రాన్సు, బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్ దేశాల్లో విజయవంతంగా రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలను నెలకొల్పింది. ఈ విధంగా ఆదేశాల్లో ఉదారవాదం విజయం సాధించింది, కాని, ఆస్ట్రియా, ఇటలీ దేశాల్లో మాత్రం పూర్తిగా అణచివేయబడింది.

అందుకు ప్రధాన కారణాలు ఆస్ట్రియాలో కరుడుగట్టిన సాంప్రదాయవాది అయిన మెటర్నిక్ ప్రాబల్యమూ, ఆ దేశానికి గల సైనికబలమూ, పటిష్టమైన రాజరికవ్యవస్థ. మరోవిధంగా చెపితే, ఆస్ట్రియాలో ఉదారవాదము, జాతీయవాదము తగినంతగా వ్రేళ్ళు పాతుకొని ఫలవంతం కాలేదు. అందుకు కారణం ఆ దేశంలో వర్తక వాణిజ్యాల్లోను, పారిశ్రామికంగాను అభివృద్ధి చెందిన మధ్యతరగతి అభివృద్ధి చెందలేదు. కేవలం ఫ్రెంచి విప్లవాన్ని, విప్లవ ఫలితాలను చూచి స్వల్ప సంఖ్యాకులైన ప్రజలు రాచరికం రాజ్యాంగబద్ధం కావాలని కోరుకున్నారు. కాని, వారి తార్కిక సిద్ధాంతాలను అవగాహన చేసుకొని అనుసరించే స్థితికి సాధారణ ప్రజానీకం ఎదగలేదు. అనగా ఆ దేశంలో, మధ్యయుగంనాటి భూస్వామ్య వ్యవస్థ, దానికి అనుబంధమైన నిరపేక్షరాచరికాన్ని దైవదత్తంగా భావించి అనుసరించడమూ కొనసాగుతున్నాయి. ఇటలీలో సైతం అదే పరిస్థితి ఉన్నది. ఆ దేశంలోని ఉత్తరభాగం పూర్తిగా ఆస్ట్రియా అధీనంలోను, మధ్యఇటలీలోని రాజ్యాలు అనేకం హాప్స్‌బర్గ్ వంశీయులు, అనగా ఆస్ట్రియాను పాలించే రాజవంశానికే చెందిన, రాజుల పరిపాలనలో ఉన్నాయి.

అయితే పశ్చిమ ఐరోపాలో మాత్రం ఫ్రాన్సు, బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్ తదితర దేశాల్లో 1830 విప్లవం గణనీయమైన విజయాన్ని సాధించింది. ఆ దేశాలన్నిటిలో రాచరికం రాజ్యాంగబద్ధమైంది, ఆ రాజ్యాధినేతలు వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వాలను మన్నించి ఉదార సంస్కరణలను చేశారు.

మరొక ప్రధానాంశమేమంటే, మెటర్నిక్ ఆధ్వర్యంలో వియన్నా కాంగ్రెస్ పునర్నిర్మించిన ఐరోపా పటం తిరిగి మార్పులు, చేర్పులకు లోనవడమూ, పునరుద్ధరించిన సాంప్రదాయక నిరపేక్ష రాచరికాలు పతనం కావడము. కాంగ్రెస్ ఫ్రాన్సులో నెలకొల్పిన బూర్బన్ వంశీయుల పరిపాలన, వారి నిరపేక్ష రాచరిక విధానమూ పతనమైనాయి; బెల్జియం హాలెండులను కలిపి ఏకరాజ్యంగా చేసినా, బెల్జియం 1830 నాటికి స్వతంత్ర రాజ్యమైంది. స్పెయిన్‌లో మెటర్నిక్ ఆధ్వర్యంలో ఐరోపా రాజ్యకూటమి పునరుద్ధరించిన బూర్బన్ వంశ నిరపేక్షపాలన అంతమైంది. కనుక, కేవలం సైనిక బలంతో మెటర్నిక్ ఆస్ట్రియాలోను, ఇటలీలోను 1830 లో విప్లవాన్ని అణచివేయగలిగినా, సిద్ధాంతపరంగా అతనికి ఈ విప్లవ ఫలితాలు పూర్తిగా విరుద్ధమైనవి.

## 8.7 ఫ్రాన్స్‌లో లూయి ఫిలిప్పీ పరిపాలన :

1830 జూలై విప్లవం ఫ్రాన్సులో కొద్ది హింసాకాండతో విజయం సాధించింది. ఛార్లెస్ దేశం వదలి పారిపోయాడు. తరువాత ఫ్రాన్సులో ఎట్టి పరిపాలనావిధానాన్ని ఏర్పరచవలెను అనే ప్రశ్న ఉదయించింది. రిపబ్లికన్‌లు రిపబ్లిక్‌ను స్థాపించవలెనని కోరగా ఉదారవాదులు రాజ్యాంగబద్ధ రాచరికాన్ని ఏర్పాటు చేయవలెనని కోరారు. ఈ విషయంలో ఈ రెండు వర్గాల వారి మధ్య సంఘర్షణ జరిగింది. అట్టి స్థితిలో వృద్ధుడు, విప్లవకాలంలో విప్లవ సైన్యాధిపతి అయిన లఫాయా ఉభయవర్గాలను సమన్వయపరచి ఆర్లిన్స్‌రాజు అయిన లూయీ ఫిలిప్పీని ఫ్రెంచి రాజుగా చేయడానికి అందరినీ ఒప్పించాడు.

### 8.7.1 లూయీ ఫిలిప్పీ తొలిజీవితం :

లూయీ ఫిలిప్పీ ఆర్లాయన్ శాఖకు చెందిన బూర్బన్ వంశస్థుడు. ఇతని తండ్రి 1789 విప్లవకాలంలో స్వేచ్ఛాసమానత్వాల కొరకు తృతీయవర్గం (Third Estate) తో కలిసి పనిచేసినవాడు. అంతేకాక "సమానత్వవాది అయిన ఫిలిఫ్" (Philippe Egalite) అని సగర్వంగా పిలుచుకున్నవాడు. జాతీయ సమితిలో సభ్యుడై పదునారో లూయీని వధించడానికి అనుకూలంగా ఓటుచేసినవాడు. లూయీ ఫిలిప్పీ రాబిస్పియర్ స్థాపించిన జాకోబిన్ క్లబ్బులో సభ్యుడై ఫ్రెంచి రిపబ్లిక్ కొరకు గట్టిగా పోరాడాడు. అతడు పారిస్ వీధులలోనికి ఒంటరిగా వెళ్ళి కార్మికులతోను సామాన్యులతోను కలిసిమెలసి తిరిగేవాడు. వారితో గూడా కలిసి త్రాగేవాడు. అతని కుమారులు మధ్యతరగతి విద్యార్థులతో కలిసి పబ్లిక్ స్కూలులో చదువుతున్నారు. అతనికి వాల్టేర్, రూసోలు చెప్పిన సిద్ధాంతాలయందు అపార నమ్మకము. ఫ్రెంచి పార్లమెంటు అతనిని రాజుగా అంగీకరించడంతో 1830 జూలైలో లూయీ ఫిలిఫ్ ఫ్రెంచి రాజయినాడు. అతని రాచరికానికి జూలై రాచరికం అని పేరు వచ్చింది. ఇతడు మధ్యతరగతి ప్రజల అభిమాని. వారినే ఉన్నత పదవులలో నియమించాడు. అందువల్ల ఇతనికి బూర్జువా రాజు అనిగూడా పేరు వచ్చింది.

మొదట ఇతడు ఉదారవాదిగా పాలించినాడు. ఫ్రాన్సులో అనేక పరిశ్రమలను స్థాపించాడు. అందుకు యంత్రాలను ఇంగ్లండ్ నుండి తెప్పించాడు. పత్రికలపై ఆంక్షలను రద్దుచేసాడు. ఉదారవాదిగా ఓటుహక్కును విస్తృతంచేసి అన్ని వర్గాల వారికి ఓటు హక్కునిచ్చాడు. విద్యను అభివృద్ధి చేసాడు. అనేక పాఠశాలలను నెలకొల్పాడు. నెపోలియన్ ఏర్పరచిన కంకార్డట్ పద్ధతిని కొనసాగించాడు. మత విషయాలలో జోక్యం చేసుకోలేదు. పరమత సహనం పాటించి అన్ని మతాలను సమానంగా చూశాడు. బ్రిటన్ పద్ధతిలో పార్లమెంటును ఏర్పాటుచేసి మంత్రులను పార్లమెంటుకు బాధ్యత వహించునట్లు చేశాడు.

### 8.7.2 నెపోలియన్ గాథలు (Nepoleonic Legend) :

ఫ్రాన్సులో 1815 తరువాత రెండు విధాలైన గతకాల వైభవం ప్రజల స్మృతుల్లో చోటు చేసుకొని ఉత్తేజపరుస్తున్నది. వీటిలో మొదటిది, విప్లవకాలంనాటి ఉదారభావాలు, రెండవది నెపోలియన్ యుద్ధవిజయాలతో ఉప్పొంగిన జాతీయాభిమానము. 1830 విప్లవంలో ఉదారవాదం విజయవంతమైంది. విప్లవకాలానికి చెందిన సంఘటనల్లో పాల్గొన్న లూయీ ఫిలిప్ ఫ్రెంచిరాజైనాడు. రెండవ అంశమైన నెపోలియన్ ధైర్యసాహసములు, సాధించిన విజయాలు ప్రజల్లో వీర గాథలుగా వ్యాపించసాగాయి. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని లూయీ ఫిలిప్ నెపోలియన్ మరణానంతరం సెంట్ హెలెనా ద్వీపంలో, అతన్ని ఖననం చేసిన ప్రదేశాన్ని త్రవ్వించి, అతని అస్థికలను పారిస్‌కు తెప్పించాడు. ఆ నగరంలోని ఒక పురాతన వైద్యశాలలో వాటిని నిక్షేపించి, అక్కడ నెపోలియన్ స్మృతిచిహ్నంగా ఒక సమాధి (Tomb) ని నిర్మించాడు. దీనితో నెపోలియన్ అభిమానులైన తీవ్ర జాతీయవాదులు సంతృప్తి చెందారు. తరువాత మరింత ఉత్సాహంగా లూయీ ఫిలిప్ నెపోలియన్ వీరగాథల విస్తరణను ప్రోత్సహించి, తన పతనానికి చేజేతుల లింకు రారోపణ చేసుకున్నాడు. వారి ఆలోచనలను, ప్రయత్నాలను అడ్డుకోవడానికి లూయీ ఫిలిప్ పత్రికాస్వాతంత్ర్యము, సభా స్వాతంత్ర్యమూ రద్దుచేసాడు. అంతట ప్రజల సంస్కరణ విందులు (Reom banquets) అనే పేర విందులు చేసుకుంటూ, తరచుగా కలుసుకుంటూ, రాజకీయ వ్యవహారాలను గూర్చి చర్చించుకోసాగారు. రాను రాను ఈ విందులు లూయీ ఫిలిప్‌కు ఆందోళనకరం అయినాయి. 1848 ఫిబ్రవరి 22న జరుపవలసిన అటువంటి విందును అతడు నిషేధించాడు. లూయీ ప్రభుత్వం శాంతియుత విధానాలను అవలంబిస్తూ జాతీయ ప్రతిష్ఠను అభివృద్ధి చేయవలెనని కాంక్షించాడు. ఇంగ్లాండుతో స్నేహసంబంధాలను కొనసాగించాడు. బెల్జియం, స్పెయిన్, పోర్చుగల్ దేశాల్లో ఉదారవాదాన్ని సమర్థించాడు. ఉర్టెంబర్గు, స్పెయిన్లతో వివాహ సంబంధాలు కలుపుకున్నాడు. ఇతని కాలంలో ఫ్రాన్సు ఆఫ్రికాలోని అల్జీరియాను ఆక్రమించింది. 40,000 మంది ప్రజలు ఫ్రాన్సు నుండి వెళ్ళి అల్జీరియాలో స్థిరపడ్డారు.

### 8.7.3 సాంప్రదాయవాదిగా మారటం :

కాని కాలక్రమేణా లూయీఫిలిప్ తన ఉదారవాదవిధానాన్ని వదలివేసి, సాంప్రదాయవాదిగా మారాడు. ప్రజలు ఓటు హక్కును రద్దుచేసాడు. భాగ్యవంతులకే ఓటు హక్కును పరిమితం చేశాడు. ఫ్యాక్టరీలను పెట్టించాడు గాని కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదు. విప్లవ జండా అయిన మూడు రంగుల జండాను తొలగించి రోజా పువ్వులు గల బూర్జువా వంశస్థుల తెల్లజెండాను పునఃప్రతిష్ఠించాడు. దీనితో అతని విధానాలను ఫ్రాన్సులో అన్నివర్గాల వారు వ్యతిరేకించారు. భాగ్యవంతులైన మధ్యతరగతి బూర్జువాలు మాత్రం అతని పాలన సమర్థించారు. ప్రభువులు, కాథలిక్కులు, కొందరు శ్రీమంతులైన రైతులు ఇతని వారసత్వం సరియైనది కాదని సింహాసనాన్ని అన్యాయంగా అపహరించాడని, న్యాయమైన వారసుడు 10వ ఛార్లెస్ మనుమడని తలంచారు. రిపబ్లికన్లు లేక ప్రజాస్వామ్యవాదులు ఇతనిని ఎప్పుడూ సమర్థించలేదు. వారు ఇతని పరిపాలన అప్రజాస్వామికమని, ప్రజాస్వామ్యానికి ఇతడు విరోధి అని భావించారు. సోషలిస్టులు లేక సామ్యవాదులు ఇతడు భాగ్యవంతుల ప్రయోజనాలు రక్షించేవాడని విమర్శించారు. వారు ఆస్థి హక్కును తొలగించాలని కోరినారు. కొంతమంది కేథలిక్కులు న్యాయబద్ధమైన వారసత్వ రాజులను పునరుద్ధరించాలని తలంచినారు. ఇతని విద్యావిధానం కేథలిక్కులకు నచ్చలేదు. నెపోలియన్ బోనపార్టీ అభిమానులకు ఇతని శాంతికాముకవిధానం నచ్చలేదు. ఫ్రెంచి విదేశీవిధానాన్ని ఇంగ్లీషు ప్రయోజనాల దృష్టిలో రూపొందించడం వారికి చాల అవమానంగా ఉన్నవి.

### 8.7.4 గైజో మంత్రిత్వం :

లూయీ ఫిలిప్పీచే ఏర్పాటు చేయబడిన మంత్రివర్గాలు 1830 నుండి 1840 వరకు అస్థిరంగా నడిచినాయి. ఆ కాలంలో 10 మంత్రివర్గాలు మారాయి. 1840లో అతడు ఫ్రాంకోయిన్‌గిజ్ (Francois Guigot) ను ప్రధానమంత్రిగా నియమించాడు. అతడు 1848 వరకు ఫ్రెంచి ప్రధానమంత్రిగా చేశారు. అతనికి ఇంగ్లాండు పరిపాలనా విధానమన్నా చాలా ఇష్టం. గిజో మంచివక్త, చరిత్రకారుడు, కాని అతడు ఫ్రెంచి ప్రజల మనోగతాన్ని, ఉదార భావాలను తెలుసుకోలేకపోయాడు. ఇదే కాలంలో లూయీ బ్లాంకు నాయకత్వంలో ఫ్రాన్సులో సోషలిస్టు ఉద్యమం ప్రారంభమయింది. ఇట్టి వ్యతిరేక పరిస్థితులలో గిజో, ప్రభుత్వ వ్యతిరేకులనందర్నీ అణచడానికి పూనుకున్నాడు. నిరంకుశంగా వ్యవహరించినాడు. అందువలన ప్రజా వ్యతిరేకత ఇంకా పెరిగింది. లూయీ ఫిలిఫ్‌ను, అతని ప్రధానమంత్రిని తొలగించడానికి ప్రజలు ఆలోచించసాగారు. వారి ఆలోచనలను, ప్రయత్నా ఉదారవాదానికి వ్యతిరేకంగా ఎన్నో చట్టాలను ప్రవేశపెట్టాడు. అందువల్ల ప్రజలు ఇతనిని వ్యతిరేకించారు. లామర్టిన్ అను పండితుడు ఫ్రెంచి ప్రజలకు ఇతని పరిపాలన విసుగు కలిగించినది అన్నాడు.

### 8.7.5 1848 విప్లవం - లూయీ ఫిలిప్పీ పతనం :

1848 ఫిబ్రవరి 22న జరుగవలసిన విందును నిషేధించడంతో విద్యార్థులు, కార్మికులు తిరుగుబాటు చేశారు. వారిని దండించటానికి పంపిన ప్రభుత్వపు నేషనల్ గార్డులు విప్లవవాదులతో కలసిపోయారు. దానికి భయపడి లూయీఫిలిప్పీ గిజోను మంత్రిపదవి నుండి తొలగించినాడు. విప్లవగుంపు గిజో ఇంటిని చుట్టుముట్టగా రక్షకదళం ప్రజలపై కాల్పులు జరిపింది. కాల్పులలో 30 మంది గాయపడ్డారు, 20 మంది మరణించారు. శవాలను విప్లవవాదులు పారిస్‌నగర వీధులలో ఊరేగించారు. దానితో కోపోద్రిక్తులైన పారిస్ ప్రజలు విప్లవవాదులలో కలిసిపోయారు. అతనిని కూడా ఛార్లెస్ వద్దకు పంపవలెనని నినాదాలు ఇచ్చారు. అట్టి స్థితిలో ప్రమాదాన్ని గ్రహించి లూయీ ఫిలిప్పీ తన మనుమడిని వారసుడిగా ప్రకటించి కుటుంబంతో రహస్యంగా ఇంగ్లాండ్ పారిపోయాడు. అతని పలాయనం తరువాత విప్లవవాదులు ఫ్రాన్సును రెండవ రిపబ్లిక్‌గా ప్రకటించుకున్నారు. అంతటితో లూయీ ఫిలిప్పీ పాలన అంతమైంది.

**8.8 మెటర్నిక్ :** నెపోలియన్ పతనానంతరం 33 సం॥ మహోన్నతంగా వెలిగి తన ఆశయాలకు అనుగుణంగా ఐరోపా రాజకీయాలను నడిపించిన మెటర్నిక్ 1773లో జర్మనీలో ఒక ప్రభువుల కుటుంబంలో జన్మించాడు. ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించాడు. ఇతడు యూనివర్సిటిలో చదువుకునే రోజుల్లో ఫ్రెంచి విప్లవం వచ్చింది. విప్లవకాలంలో జర్మనీలోకి పారిపోయివచ్చిన విప్లవవ్యతిరేకులతో అతనికి పరిచయాలు కలిగినవి. అప్పటినుండే ఇతనికి విప్లవవ్యతిరేక భావాలున్నవి. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఆస్ట్రియా చక్రవర్తి ఫ్రాన్సిస్ కొలువులో దౌత్యఉద్యోగిగా చేరాడు. ఐరోపాలో దౌత్యవిప్లవాన్ని సాధించి 1755లో సంచలనాన్ని సృష్టించి మేరియా థెరిస్సా ప్రధానమంత్రి కౌనిట్జి మనుమరాలిని మెటర్నిక్ వివాహమాడాడు. అందువల్ల అతని జీవితం ఉశ్చదశకు అందుకున్నది. అతనిని ఆస్ట్రియా చక్రవర్తి విదేశ రాయబారిగా నియమించాడు. అతడు రష్యా, జర్మనీ, ఫ్రాన్సులలో రాయబారిగా పనిచేశాడు. చివరకు 1809లో ఆస్ట్రియా ఛాన్సలర్ అనగా ప్రధానమంత్రిగా నియమించబడినాడు. ఇతడు నెపోలియన్ కన్నా నాలుగు సం॥లు చిన్నవాడు.

మెటర్నిక్ ప్రభువుల కుటుంబంలో జన్మించినందున సహజంగానే అతనికి సాంప్రదాయక రాచరికవ్యవస్థ, స్వేచ్ఛ సమానత్వమన్న అతనికి కంటగింపు. విప్లవాన్ని, ఉదారవాదాన్ని, ప్రజాస్వామ్యం పేరుచెపితే సహించేవాడుకాదు. ఐరోపా ప్రజలకు కావలసినది శాంతిగాని స్వేచ్ఛగాదని స్పష్టంగా ప్రకటించాడు.

ఫ్రెంచి విప్లవానికి పూర్వం ఐరోపాలో సాగిన నిరంకుశ రాచరిక ప్రభుత్వాలను ఐరోపా అంతటా పునఃప్రతిష్ఠ చేసి విప్లవభావాలను పూర్తిగా తుడిచిపెట్టడం, ఐరోపాలో ఆస్ట్రియాకు అఖండ నాయకత్వం సాధించుట.

### 8.8.2. మెటర్నిక్ విధానము :

విప్లవ సిద్ధాంతాలను, ప్రజాస్వామ్యాన్ని, ఉదారవాదాన్ని అణగద్రొక్కడానికి బలప్రయోగాన్ని సాధనంగా చేసుకున్నాడు. అందుకు మొదట వివాదాన్ని కాంగ్రెస్ సమావేశం జరిపి నెపోలియన్ సామ్రాజ్యాన్ని అతడు నెలకొల్పిన రిపబ్లిక్‌లను నాశనంచేసి రాచరికాలను పునఃప్రతిష్ట చేశాడు. తరువాత ఉదారవాదాన్ని శాశ్వతంగా అణచడానికి ఐరోపా రాజ్యకూటమిని ఏర్పరచి ఉదారవాదులను, ప్రజల విప్లవోద్యమాలను అణచడానికి తన సర్వశక్తులు ధారపోశాడు. వియన్నా సమావేశం తరువాత అందు తీసుకున్న నిర్ణయాలు యథాతథంగా అమలు పరచడానికి 1815 నవంబరు 20వ తేదీన ఆస్ట్రియా, ప్రష్యా, రష్యా, ఇంగ్లాండులతో రాజ్యచతుష్టయం కూటమిని (Concert of Europe) ఏర్పాటు చేశాడు. ఈ కూటమి సభ్యులు అవసరమైనపుడు సమావేశమై వియన్నా కాంగ్రెస్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉత్పన్నమైన ఐరోపా సమస్యలను చర్చించి తగిన నిర్ణయాలు తీసుకొనవలెను. ఐరోపా శాంతికి చతుర్ద రాజ్యకూటమి సమిష్టి బాధ్యతలను చేపట్టినది. దీనినే రాజ్యకూటమి అని కూడ అంటారు. మెటర్నిక్ ఈ కూటమిని ఒక ఆయుధంగా చేసుకొని ఐరోపాలో విప్లవ భావాలను, సిద్ధాంతాలను అణచివేసి సాంప్రదాయిక వ్యవస్థను పునరుద్దరించడానికి ప్రయత్నించాడు. మొదట స్వదేశమైన ఆస్ట్రియాలోను, ఇటలీలోని అధీన ప్రాంతాల్లోను అమలు జరిపిన తరువాత మిత్రరాజ్యాలైన ప్రష్యా, రష్యా ఫ్రాన్సులను ఒప్పించి వారిచే అమలు చేయించాడు. తిరుగుబాట్లు చేసిన స్పెయిన్, పైడ్‌మంటులలో సైనికచర్య తీసుకొని అమలు జరిపినాడు. సాంప్రదాయక రాజ్యవ్యవస్థకు అంతటికి ఆస్ట్రియా మార్గదర్శకంగా వుండవలెనని తన విధానాన్ని అమలుజరపడంలో గూఢచారులను నియమించి ఉదారవాదుల వివరాలు సేకరించాడు. వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుచుచున్నారని వారిని బంధించాడు. ఉదారవాదులకు స్థావరాలైన విశ్వవిద్యాలయాల నిర్వహణపై కఠిన నిబంధనలను ప్రవేశపెట్టాడు. వార్తా పత్రికలపై ఆంక్షలు విధించాడు. ఆస్ట్రియన్ ప్రజలను విదేశాలకు వెళ్లరాదని శాసించాడు. విదేశాలకు అనుమతించినట్లయితే వారు విప్లవ భావాల ప్రభావానికి లోనగుదురని భావించాడు. ఈ విధమైన చర్యల వలన ఆస్ట్రియాలో ఉదారవాదం మరుగునపడడమే కాక విద్య కుంటుపడింది. కాని ఈ అభివృద్ధి నిరోధక చర్యల వలన దేశపరిశ్రమలు, వ్యాపారం గూడా క్షీణించాయి.

వియన్నా సమావేశం పరిష్కారం వల్ల జర్మనీ సమాఖ్య ఆస్ట్రియా ఆధిపత్యంలోనికి వచ్చింది. కనుక మెటర్నిక్ తన విధానాలను అన్ని జర్మన్ రాజ్యాల్లోను అమలుజరిపి, ప్రజల హక్కులు హరించినాడు. ప్రష్యారాజు మూడవ ఫ్రెడరిక్ విలియం సహాయంతో జర్మనీ విమోచన యుద్ధసమయంలో పొందిన రాజకీయ హక్కులన్నీ రద్దుచేసి సాంప్రదాయిక రాచరిక వ్యవస్థను నెలకొల్పాడు.

**8.8.3 కారల్స్‌బడ్ ఆజ్ఞలు** (Carlsbad Decrees) : మెటర్నిక్ విధానాలను జర్మనీలో విద్యార్థులు ప్రతిఘటించారు. వారిలో జాతీయభావాలు పెల్లుబికినవి. కనుక వారు ఆస్ట్రియా అధికారానికి వ్యతిరేకంగా 1) టుగన్‌బండ్ (Tuganband) 2) బుర్స్‌డెన్స్ చాఫ్ట్ (Bursdhens Chaft) మొ॥ రహస్య సంఘాలు నేర్పాటు చేశారు. ఈ రహస్య సంఘాలు కార్యకలాపాలను గూర్చి వ్రాసిన కాట్జిబ్యూ (Katgebue) అను రహస్యపత్రికా విలేకరిని విద్యార్థులు 1819లో వధించారు. విద్యార్థులను అణచుటకు ప్రష్యారాజు సహాయంతో మెటర్నిక్ వద్ద కొన్ని కారల్స్‌బడ్ ఉత్తర్వులను జారీచేశాడు. ఈ ఉత్తర్వుల ప్రకారం విద్యాసంస్థలలో విద్యార్థుల సంఘాలు రద్దుచేయబడినవి. విద్యాలయాల్లో కుట్రలను చేయువారిని గమనించి శిక్షించుటకు ఒక ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేశాడు. జర్మనీ పత్రికలపై కఠిన నిబంధనలను విధించాడు. జర్మనీ దేశమంతటా గూఢచారులను నియమించాడు. అయినప్పటికి 1830 విప్లవంలో జర్మనీ గూడా పాల్గొన్నది. కాని మెటర్నిక్ దానిని అణిచాడు. తరువాత జర్మనీ ఐక్యతకు కొన్ని ప్రయత్నాలు జరుగగా దానిని గూడా మెటర్నిక్ సాగనీయలేదు. ఈ విధంగా జర్మనీలో మెటర్నిక్ తన విధానాలను అమలుజరిపాడు.

వియన్నా కాంగ్రెస్ ఆస్ట్రియాకు ఇటలీపై గూడా ఆధిపత్యాన్ని యిచ్చింది. లంబార్డి వెనీస్‌లు ఆస్ట్రియాకు, మధ్య ఇటలీ రాజ్యాలైన టస్కనీ, మొదీనా, పార్మా రాజ్యాలు హాప్స్‌బర్గ్ వంశ రాజకుమారులకు లభించాయి. కనుక మెటర్నిక్ ఇటలీలో తన

విధానాన్ని నిరాటంకంగా అమలుచేశాడు. నేపిల్స్‌లో ప్రజలు తమ రాజు ఫెర్డినాండ్‌పై తిరుగుబాటు చేయగా ఐరోపా రాజ్యకూటమి అనుమతితో ఆస్ట్రియా సైన్యాలు దానిని అణచాయి. అట్లే పైడమాంటులో గూడా ప్రజలు తిరుగుబాటు చేయగా దానిని గూడా అణచాడు.

నెపోలియన్ పతనం తరువాత స్పెయిన్‌లో బూర్బన్ 7వ ఫెర్డినాండ్ వంశీయుడైన ప్రజలు తిరుగుబాటు చేయగా ఐరోపా రాజ్యకూటమి ఫ్రాన్సు దానిని అణచవలెనని మెటర్నిక్ నిర్ణయానుసారం ఆదేశించింది. ఫ్రెంచిరాజు 18వ లూయీ స్పెయిన్ పైకి సేనలను పంపి అక్కడి తిరుగుబాటులను అణచివేశాడు.

### 8.8.4. మెటర్నిక్ పతనం :

మెటర్నిక్ బలప్రయోగం ద్వారా తన విధానాలను కొంతకాలం అమలు జరిపినా, ఫ్రెంచి విప్లవ భావాలైన స్వేచ్ఛా, సమానత్వాలు నశించలేదు. అతడు ఎంత బలంగా వాటి నణచెనో అవి అంత వేగముగా పైకి లేచాయి. 1830లో ఫ్రాన్సులో ప్రారంభమయిన విప్లవం ఐరోపా అంతటా వ్యాపించింది. అతడు అతి కష్టంపై దాని నణచినప్పటికి ఫ్రాన్సు, బెల్జియంలలో తిరుగుబాటు విజయవంతమైనది. ఇది మెటర్నిక్ విధానానికి మొదటి దెబ్బ. 1848లో విప్లవ భావాలు ఆస్ట్రియాలో ప్రవేశించి,వియన్నాలో ప్రజలు తిరుగుబాటు చేశారు. వారిని ఎదుర్కొనలేక మెటర్నిక్ ఇంగ్లాండ్‌కు పారిపోయెను. చివరకు స్వేచ్ఛా స్వాతంత్ర్య భావాలున్న దేశంలోనే అతడు తలదాచుకోవలసి వచ్చింది. ఇట్లు ప్రజాభిప్రాయము నిరోధించుటకు పూనుకొని మెటర్నిక్ చివరకు పతనమయ్యెను. ప్రజల సమిష్ఠిశక్తిని అంచనావేయలేక, సాయుధబలాలను ఉపయోగించి వారిని తేలికగా అణచివేయవచ్చని, వారి ఆశయాలు, ఆకాంక్షలను రాజులు మన్నించడం గాక, రాజాజ్ఞలను పాటించడమే ప్రజల విధి, అని మూర్ఖంగా విశ్వసించడమే మెటర్నిక్ లోపం, అదే అతని పతన హేతువు. కాలానుగుణంగా వస్తున్న పరిణామాలను గుర్తించకపోవడం అతని మూర్ఖత్వం.

ఈ పరిస్థితుల వలన తూర్పుఐరోపాలో ఉత్పన్నమైన సమస్యలనే ఆధునిక ఐరోపా చరిత్రలో ప్రాచ్యసమస్య (Eastern Question) అని వ్యవహరిస్తారు.

స్థూలంగా ప్రాచ్య సమస్య యొక్క స్వరూపమేమంటే, కాన్‌స్టాంట్‌నోపెల్ నగరంలో తురుష్క సుల్తాను కేవలం అలంకారప్రాయుమైనాడు. వాస్తవాధికారాలను వివిధ సామ్రాజ్య భాగాలను పరిపాలించే గవర్నర్లు చేజిక్కించుకున్నారు. వారు తూర్పు ఐరోపాలోని క్రైస్తవ ప్రజానీకాలను హింసిస్తూ, వారి చర్చి భవనాలను, విద్యాలయాలను విధ్వంసంచేస్తూ, మత దురభిమానంతో కూడిన నియంతృత్వ పరిపాలన చేస్తున్నారు. ఫ్రెంచి విప్లవం వలన ప్రపంచానికి తెలిసివచ్చిన ప్రజాబలము, వారిని సంఘటితపరిచి బలీయమైన శక్తిగా రూపొందించే జాతీయభావాలు, స్వాతంత్ర్యకాంక్ష తురుష్క సామ్రాజ్యంలోని క్రైస్తవ ప్రజానీకాలను చైతన్యవంతం చేసి, విప్లవాలకు పురికొల్పుతున్నాయి.

18వ శతాబ్దిలో నిద్రలేచిన ఐరోపాదేశం, రష్యా, పశ్చిమ ఐరోపా దేశాల్లో వికసించిన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానము, అక్కడ విలసిల్లుతున్న పారిశ్రామికాభివృద్ధి, నాగరికతా సంస్కృతుల ఆధునికీకరణ మొదలైన పరిణామాలను గుర్తించి, తాను కూడ ఆ దేశాలవలె అభివృద్ధి చెందానికి నిశ్చయించుకుంది. అయితే, అందుకు మొట్టమొదట కావలసింది ఖండాంతర వాణిజ్యం, అందుకు అనువైన సముద్రతీర రేవుపట్టణాలు. అటువంటి వసతులు రష్యాకు లేవు. పశ్చిమ ఐరోపాదేశాలు భారతదేశంతోను, చైనా, ఆగ్నేయాసియా దేశాలతోను మధ్యధరా సముద్రము, ఎర్రసముద్రము, హిందూ మహాసముద్రాల గుండా వర్తకవాణిజ్యాలు నిర్వహిస్తున్నాయి. రష్యా కూడ మధ్యధరాసముద్రంపై ఆధిపత్యం సంపాదించాలని నిర్ణయించుకుంది. అందుకు ముందుగా నల్లసముద్రంపై పట్టు సంపాదించాలి. నల్లసముద్రం చుట్టూ ఉన్న అనేక క్రైస్తవ దేశాలు తురుష్క సామ్రాజ్యంలో మతదురభిమానంతో కూడిన దుష్పరిపాలనలో క్రుగ్గిపోతూ, స్వాతంత్ర్య పోరాటాలు ప్రారంభిస్తున్నాయి. ఆ దేశాల ప్రజలు స్లావ్ (Slav) జాతీయులు. గ్రీకు ఆర్థడాక్స్ చర్చి ఆధ్వర్యంలోని క్రైస్తవ మతాన్ని అనుసరించేవారు. రష్యన్లు కూడ స్లావ్ జాతీయులే.

గ్రీకు ఆర్థడాక్స్ చర్చి అధీనంలోని క్రైస్తవమతాన్ని అనుసరించేవారే. కనుక రష్యా బాల్కన్ దేశాల స్వాతంత్ర్య పోరాటాల్లో, నైతికంగాను, సైనికంగాను వారికి మద్దత్తునిచ్చి, తురుష్క సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసి, దాని నుండి విముక్తమైన క్రైస్తవ దేశాలన్నిటిని మిత్రదేశాలుగా చేసుకోవడానికి, తద్వారా నల్లసముద్రంపైన, మధ్యధరాసముద్రంపైన ఆధిపత్యం సంపాదించుకోవడానికి ఎత్తులు వేస్తున్నది.

ఐరోపాలో రష్యా ఈవిధంగా తన ఆధిపత్యాన్ని విస్తరింప చేసుకోవడం ప్రక్కనే ఉన్న ఆస్ట్రియాకు ప్రమాదకరం. తూర్పు ఐరోపాలోని క్రైస్తవ ప్రజానీకాలు జాతీయభావాలతో ఉత్తేజితులై స్వాతంత్ర్య పోరాటాలు చేస్తుంటే, ఈ విధమైన భావాలు, భావావేశము క్రమంగా ఐరోపాలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించగలవు. అప్పుడు ఆస్ట్రియా అధీనంలో ఉన్న ఉత్తర ఇటలీ భూభాగాలు, లంబార్డీ, వెనీషియాలు, హంగేరీ, బోహిమియా స్లావ్ జాతీయులైన ప్రజలు కూడ జాతీయభావావేశంతో తిరుగుబాట్లు చేయగలవు. అప్పుడు ఆస్ట్రియా సామ్రాజ్యం కూడ విచ్ఛిన్నం కాగలదు. కనుక తురుష్క సామ్రాజ్య విచ్ఛిన్నం కాకుండ, రష్యా ప్రభావము, పలుకుబడి విస్తరించకుండ చేయడానికి తీవ్రప్రయత్నం చేస్తున్నది.

అలాగే రష్యా నల్లసముద్రంపైన, తరువాత మధ్యధరా సముద్రంపైన ఆధిపత్యం సంపాదిస్తే భారతదేశము, చైనా, ఆగ్నేయాసియా దేశాలతో అప్పటికప్పుడు నిరాటంకంగా వర్తక వాణిజ్యాలు జరుపుతూ, వలసరాజ్యాలను నెలకొల్పుకున్న గ్రేట్‌బ్రిటన్, ఫ్రాన్సు, హాలెండ్ వంటి దేశాల్లో తమ ఆటలు సాగకపోవచ్చు. రష్యా వంటి పెద్దదేశం, సైనికబలం కలిగినది, తమతో ఖండాంతర వాణిజ్యంలో పోటీకి రావడం ఆ దేశాలు ఊహించలేకపోతున్నాయి, అనగా అంత భయాందోళనలు చెందుతున్నాయి. కనుక వారు కూడ తురుష్క సామ్రాజ్య విచ్ఛిన్నత, రష్యా ప్రాబల్య విస్తరణలను ప్రతిఘటిస్తున్నారు.

ఈ విధంగా ఐరోపాఅగ్రరాజ్యాలన్ని సంశయగ్రస్తంగా నిలువలేక, నడువ లేక సతమతం అవుతుంటే, ఫ్రెంచి విప్లవ ప్రభావం వలన తురుష్క సామ్రాజ్యంలోని అనేక క్రైస్తవ ప్రజానీకాలు, ఒకరి తరువాత ఒకరు, తిరుగుబాట్లు చేయడం తురుష్కులు ఆ తిరుగుబాట్లను దారుణ మారణకాండతో అణచివేయ ప్రయత్నించడం జరుగుతున్నది. ఐరోపాదేశాలు ఈ పరిస్థితిని సహించలేకపోతున్నాయి. అలాగే వానికి సాయపడి తురుష్క సామ్రాజ్య విచ్ఛిన్నతను ఆహ్వానించలేకపోతున్నాయి. ఇది స్థూలంగా ప్రాచ్య సమస్య.

ఈ పరిస్థితుల్లో లభించే అవకాశాలను వదులుకోలేక రష్యా బాల్కన్ రాజ్యాల స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొంటూనే ఉన్నది. ఆ దేశం తురుష్క సామ్రాజ్యాన్ని ఓడించి, తనకు అవసరమైన ప్రాదేశిక ఆక్రమణలను, నౌకాయానానికి కావలసిన వసతులను సంపాదించుకోవడము, వెంటనే తక్కిన ఐరోపాదేశాలు ఒక అంతర్జాతీయ శాంతి సమావేశాన్ని జరిపి, మధ్యవర్తిత్వం చేసినట్లు నటిస్తూ, రష్యా సంపాదించుకున్న ప్రయోజనాలను నీరుకార్చడము పరిపాటి అయింది. 1815 నాటి వియన్నా కాంగ్రెసు సమావేశాల్లో జార్ మొదటి అలెగ్జాండర్ టర్కీ సామ్రాజ్యం ఐరోపారోగిగాను, ఆ రోగి మరణావస్థలో ఉన్నట్లు వర్ణించి, అతని తాలూకు ఆస్తిపాస్తులు పంపకం గూర్చి యోచించాలని సూచించాడు. అనగా తక్కిన ఐరోపాదేశాలు కూడ ఎంతో కొంత ప్రయోజనాన్ని పొందవలసిందిగా, తనకు అవరోధం కల్పించకుండ ఉండవలసిందిగా, వాటికి ఆశచూపి, వారి మంచితనంతోనే తురుష్క సామ్రాజ్యాన్ని తలాకొంచెం పంచుకోవడము, తనకు అడ్డుపడకుండడాన్ని జార్ వాంఛించాడు. అయితే అతని సూచనను ఎవరూ పట్టించుకోలేదు. కారణమేమంటే తురుష్క సామ్రాజ్య విచ్ఛిన్నం వలన రష్యా ప్రయోజనం పొందకూడదని వారి ఉద్దేశ్యం.

## 8.9.1 సెర్బియా స్వాతంత్ర్య పోరాటం :

తురుష్క సామ్రాజ్యంపై మొదట తిరుగుబాటు చేసిన తూర్పు ఐరోపా క్రైస్తవదేశం రాజ్యం సెర్బియా. సెర్బియా తిరుగుబాటు కారాజార్జి అను రైతు నాయకత్వం వహించాడు. అతనికి చదువు సంధ్యలు లేవు. కాని గొప్ప బలశాలి. తెలివితేటలు

గలవాడు. అతడు పందులు, ఆవులు వ్యాపారం చేసేవాడు. కొన్నాళ్ళు అతడు ఆస్ట్రియా సైన్యంలో చేరి వాలంటర్‌గా పనిచేసి సైనికానుభవాన్ని గూడా సంపాదించాడు. అతడు ఆస్ట్రియా నుండి తిరిగివచ్చి తన వ్యాపారం చూసుకొనుచుండగా సెర్బియాలోని సైనికునితో వివాదం వచ్చింది. ఆ వివాదంలో టర్కీ సైనికుడు కారాజార్జిని అవమానించాడు. దానికి ఆగ్రహం చెందిన కారాజార్జీ ఆ సైనికుని తన సేవకులచే కొట్టించాడు. అది తెలిసి సెర్బియా గవర్నర్ అతనిని దండించడానికి కారాజార్జి పైకి సైన్యాన్ని పంపాడు. జార్జి కొంతమంది మనుషులను ప్రోగుచేసి వారిని ఎదిరించాడు. ఈ చిన్న సంఘటనతో సెర్బియా ప్రజలు జార్జికి అండదండలుగా నిలబడ్డారు. అంతట అది తిరుగుబాటుగా మారినది. 1805 సం॥లో కారాజార్జి టర్కీ సైన్యాలను పారద్రోలి సెర్బియాను విముక్తి చేశాడు. బెల్‌గ్రేడ్ నుండి సుల్తాన్ ప్రతినిధి పారిపోయాడు. దాంతో సెర్బియా విముక్తి పొందినది. ఈ స్వాతంత్ర్య సమరంలో 1807 సం॥లో రష్యా టర్కీపై దండెత్తి సెర్బుల స్వాతంత్ర్య పోరాటానికి సాయపడింది. ఈ యుద్ధంలో టర్కీ ఓడిపోయి 1812లో బుకారెస్టు సంధి చేసుకొని సెర్బియాలో కారాజార్జి ప్రభుత్వాన్ని గుర్తించింది. సెర్బియా తిరుగుబాటు విజయం సాధించింది. సెర్బియాకు మద్దతుగా రష్యా కొంత సైన్యాన్ని సెర్బియాలో నిలిపింది. 1813 సంవత్సరంలో రష్యా నెపోలియన్‌కు వ్యతిరేకంగా ఏర్పడ్డ నాలుగో ఐరోపా రాజ్యసంకీర్ణ కూటమిలో చేరింది. ఆ పోరాటంలో అవసరమైనందున సెర్బియాలో నిలిపి ఉంచిన సేనలను ఉపసంహరించుకున్నది. అందువల్ల టర్కీ సుల్తాను తిరిగి సెర్బియాపై దండెత్తి కారాజార్జిని ఓడించి సెర్బియా నుండి తరిమివేశాడు. కారాజార్జిని పారద్రోలినంత మాత్రాన సెర్బియా జాతీయ తిరుగుబాటు అంతం కాలేదు. మిలోస్ ఓబ్రనోవిష్ అను వాని నాయకత్వాన తిరిగి సెర్బియా స్వాతంత్ర పోరాటం కొనసాగించినది. టర్కీసుల్తాను సెర్బియాను అణచలేక 1821 లో సెర్బియాకు ఆంతరంగిక స్వేచ్ఛనిచ్చి ఓబ్రనోవిష్‌ను సెర్బియా రాజుగా (Prince of Serbia) అంగీకరించాడు. సెర్బియా స్వేచ్ఛను పొందింది. 1829 లో టర్కీ సుల్తాను సెర్బియా స్వాతంత్ర్యాన్ని గుర్తించాడు. సెర్బియా పూర్తిగా స్వతంత్ర దేశమయ్యింది. 1856 పారిస్ సంధిలో సెర్బియాను స్వాతంత్ర్యాన్ని ఐరోపా రాజ్యాలు గుర్తించినాయి. టర్కీ సుల్తాన్ నామమాత్రపు సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని భావించారు. 1878 బెర్లిన్ కాంగ్రెస్‌లో పూర్తిగా సెర్బియా స్వాతంత్ర్యం గుర్తించబడినది.

## 8.9.2 గ్రీకు స్వాతంత్ర్య సమరం :

సెర్బియా తరువాత టర్కీ సామ్రాజ్య స్వాతంత్ర్య సమరం సాగించిన దేశం గ్రీసు. సెర్బియా విజయం గ్రీకులను ఉత్తేజితులను చేసినది. వారు సెర్బియా మార్గంలో పయనించి స్వాతంత్ర్య సమరాన్ని సాగించారు. గ్రీకులు గొప్ప నాగరికులు, ప్రాచీన చరిత్రలో ఘనకీర్తి వహించిన జాతి, ఐరోపా సంస్కృతికి మూలమైనది గ్రీకు సంస్కృతి. ఫ్రెంచివిప్లవ భావాలైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గ్రీసులో ప్రవేశించాయి. గ్రీకులు పూర్వం గొప్ప నాగరికుల ప్రాచీన కాలంలో ఘనకీర్తి వహించిన జాతి, ఐరోపా సంస్కృతికి మూల పురుషులు. వారి గత వైభవాన్ని ప్రాచీన గ్రీకు యోధుల వీరోచిత గాథలను జ్ఞప్తికి తెచ్చుకొని ఉత్తేజితులైనారు. గత వైభవంతో తమ జాతి టర్కీ సుల్తానుకు లొంగి ఉండటం వారికి అవమానంగా భావించారు. సెర్బియా తిరుగుబాటు వారికి ధైర్యోత్సాహాలను కలిగించింది. సెర్బియాకు సహాయం చేసినట్లే రష్యా తమకు గూడా సహాయం చేయునని ఆశించారు.

ఇట్టి పరిస్థితిలో గ్రీసులో జాతీయభావాన్ని మేల్కొలిపినవారు కొరియాస్, రిగాస్ అను ఇద్దరు దేశ భక్తులు.

**కొరియాస్ :** కొరియాస్ గొప్ప పండితుడు, మేధావి, వక్త. ఇతడు గ్రీసు దేశమంతా తిరిగి గ్రీసు జాతి చాలా గొప్పదని, ఆధునిక యుగంలో కూడా వారు, గొప్ప సాంస్కృతిక అభివృద్ధి సాధించవలసిన కర్తవ్యాన్ని నిర్వహించవలసిన బాధ్యత ఉన్నదని ప్రచారం చేశాడు. అతని ప్రచారం దేశం నలుమూలలా గ్రీకు వీరులను తట్టి లేపింది.

**రిగాస్ :**

కొరియాస్ ప్రచారం ద్వారా గ్రీసులో భావసమైక్యత సాధిస్తే రిగాస్ వారిలో రాజకీయ చైతన్యాన్ని కల్గించాడు. అతడు రహస్య సంఘాల నేర్పరచి రహస్య కరపత్రాల ద్వారా గ్రీకు స్వాతంత్ర భావాలను ప్రచారం చేశాడు. ఇతని కృషి వల్ల గ్రీసులో

రాజకీయ చైతన్యం బాగా అభివృద్ధి చెందింది. ఈ పరిణామాన్ని సహించని టర్కీ ప్రభుత్వం 1794 లో అతనిని కాల్చి చంపింది. గ్రీకు స్వాతంత్ర్య సమరంలో ఆత్మార్పణ చేసిన మొదటి వ్యక్తి రిగాస్.

హిటైరియా ఫిలైక్ (Hetairia Phildlike) సంఘం కొరియాస్ - రిగాస్‌ల కృషివల్ల గ్రీసులో జాతీయ భావం అభివృద్ధి చెంది దేశమంతటా రహస్య సంఘాలు ఏర్పడ్డాయి. అట్టివానిలో హిటైరియా ఫిలైక్ అతి ముఖ్యమైనది. ఈ సంఘం కృషితో జాతీయ భావం బాగా వేళ్ళూనింది. గ్రీకులను స్వాతంత్ర్య యుద్ధానికి పూర్తిగా తయారు చేసింది.

మొదటి వాలాబిమా, మాల్డీవియాలో నున్న గ్రీకులు అలెగ్జాండర్ ఇస్పిలాంటె (Alexander Eispillanti) అను వాని నాయకత్వంలో 1821 లో తిరుగుబాటు చేశారు. అది గ్రీకుల మొదటి తిరుగుబాటు. ఇస్పిలాంటె రష్యా సహాయాన్ని అర్థించాడు. కాని జార్ అలెగ్జాండర్ మెటర్నిక్ సలహాలు విని వారికి సహాయం చేయలేదు. అందువల్ల టర్కీ సుల్తాను అతనిని ఓడించి బందీగా పట్టుకొన్నాడు. తిరుగుబాటును అణిచాడు. అంతటితో రుమేనియా గ్రీకుల తిరుగుబాటు అంతమైంది. అయితే గ్రీసులోని మోరియాలో తిరుగుబాటు ప్రారంభమై గ్రీసు అంతటా వ్యాపించింది. గ్రీకులు అచట నివశించు 35 వేల మంది ముస్లింలను వధించారు. అందుకు ప్రతిగా సుల్తాను గ్రీకులను వధించమని ఆజ్ఞాపించాడు. మాసిడోనియా, కాన్‌స్టాంట్ నోపిల్ ఆసియా మైనర్‌లోని వేలాది గ్రీకులు క్రూరంగా వధించబడ్డారు. కాన్‌స్టాంట్ నోపిల్‌లో క్రైస్తవ మతాధిపతి అయిన ప్రధాన పేట్రార్కును సుల్తాను ఉరితీయించాడు. గ్రీకులు ముస్లింలు 7 సం॥లు ఒకరినొకరు నరుక్కున్నారు. ఈ హత్యలు ఐరోపా అంతటా గొప్ప అలజడులను కల్గించాయి.

సుల్తాన్ జరిపిన ఈ హత్యలు ఐరోపా అంతటా ఉద్రేకాన్ని కలిగించాయి. గ్రీకుల వైపు సానుభూతిని కల్గించాయి. వేలాది క్రైస్తవ యువకులు ఐరోపా నుండి గ్రీసు చేరి స్వాతంత్ర్య సమరానికి సహాయపడ్డారు. ఐరోపా దేశాలు గ్రీకులకు మద్దతునిచ్చాయి.

గ్రీకులకు ఐరోపా మద్దతు ఇవ్వడంతో సుల్తాను తన సామంతుడు. ఈజిప్టు పాలకుడైన మెహమెట్ ఆలీని గ్రీసు తిరుగుబాటును అణచుటకు తనకు సహాయంగా రమ్మని కబురు పంపాడు. మెహమెట్ ఆలీ తన కుమారుడు ఇబ్రహీంను 1824 లో 11 వేల సైన్యంతో గ్రీసు పైకి పంపాడు. ఇబ్రహీం, గొప్ప వీరుడు అతడు, క్రేట్ దీవిని ఆక్రమించి మోరియాలో అడుగుపెట్టాడు. అచట గ్రీకులు ఇబ్రహీంను 1825 లో మిస్సోలింఘీ (Missolinghi) యుద్ధంలో ఎదిరించారు. ఆ యుద్ధంలో ఇబ్రహీం గ్రీకుల నోడించాడు. ప్రసిద్ధి చెందిన ఇంగ్లీషు కవి లార్డు బైరన్ ఈ యుద్ధంలో గ్రీకుల తరుపున పోరాడి మరణించాడు. 1825 లో మోరియా ఇబ్రహీం స్వాధీనమయింది. 1824 నుండి 3సం॥ గ్రీసులో ఇబ్రహీం వీర విహారం చేసి వేలాదిమంది గ్రీసులను క్రూరంగా వధించాడు. వేలాది మందిని బందీలుగా పట్టుకొని ఈజిప్టుకు బానిసలుగా పంపాడు. గ్రీసు సుల్తాను అధీనంలోకి వచ్చింది. గ్రీకుల స్వాతంత్ర్య సమరం అణగిపోయింది. ఇబ్రహీం అద్భుత విజయాలను సుల్తానుకు సంతోషాన్ని ఆత్మ విశ్వాసాన్ని కలిగించాయి.

ఇబ్రహీం విజయాలతో ఐరోపా కలవరపడింది. ఐరోపావాసులు మరియొకసారి గ్రీకులపై జాలిపడ్డారు. కనుక ఐరోపా రాజ్యాలు ఇందు జోక్యం చేసుకున్నవి. గ్రీకులకు అన్యాయం జరిగినదని ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు భావించాయి. గ్రీసు అణగిపోయి సుల్తాను బలపడితే రష్యా గ్రీకుల తరుపున యుద్ధంలో పాల్గొనవచ్చునని అట్లయితే ఇంగ్లాండ్‌కు గ్రీకుల సానుభూతి ఉండదని, గ్రీసువారు రష్యా వైపు మొగ్గుతారని ఇంగ్లాండ్ భావించింది. అందువల్ల గ్రీకులకు రక్షణ కల్పించవలెనని, స్వయం పాలన ఇవ్వవలెనని సుల్తానును ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు కోరాయి. కాని వీరి కోరికను సుల్తాన్ మన్నించలేదు. అందువల్ల ఇంగ్లాండ్, ఫ్రాన్సు, రష్యాలు 1827 లండన్‌లో సమావేశమై ఇబ్రహీం గ్రీసు నుండి వైదొలగేటట్లు చేయవలెనని నిర్ణయించినవి. అవసరమైతే సమిష్ఠిగా వ్యవహరించవలెనని కూడ తీర్మానించెను.

లండన్ తీర్మానాన్ని సుల్తానుకు పంపి ఇబ్రహీంను గ్రీసు నుండి పంపివేయమని కోరెను. కాని సుల్తాను వారి అభ్యర్ధనను తిరస్కరించాడు. అందువల్ల ఇంగ్లాండ్, ఫ్రెంచి నౌకా బలం మధ్యధరా సముద్రంలో ప్రవేశించి టర్కీ, ఈజిప్టు నౌకాదళాలను నౌవరినో అను రేవు దగ్గర ఉండగా చూసి 1827 అక్టోబర్‌లో హఠాత్తుగా దాడి చేశాయి. ఒక్క రోజు యుద్ధంలో సాయంత్రానికల్లా ముస్లిం నావలన్నీ ధ్వంసం చేయబడ్డాయి. టర్కీ భయపడింది. కాని ఇంతలో ఇంగ్లాండ్‌లో కానింగ్ మరణించాడు. ప్రజాభిమానం టర్కీకి అనుకూలంగా మారింది. అంతట ఇంగ్లాండ్ యుద్ధం నుండి ఉపసంహరించుకొంది. ఫ్రాన్స్ తటస్థంగా ఉన్నది. దానితో తిరిగి సుల్తాను యుద్ధానికి తయారయ్యాడు.

ఇట్టి స్థితిలో రష్యా చక్రవర్తి జార్ మొదటి నికోలస్ గ్రీసు తరుపున యుద్ధానికి దిగి టర్కీని ఓడించాడు. రష్యా నౌకాదళం డార్డినల్స్‌లోను, సైన్యం కాన్‌స్టాంట్ నోపిల్‌లోను ప్రవేశించాయి. అంతట సుల్తాను సంధికి అంగీకరించాడు.

రష్యా విజయాలకు ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు భయపడ్డాయి. బాల్కన్‌లో తిరిగి రష్యా ప్రభావం ఎక్కువగునని ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు 1828 లో సుల్తాన్‌ను లండన్ సంధికి అంగీకరింపజేశారు. ఈ సంధి షరతుల ప్రకారం ఇబ్రహీంను మోరియా నుండి వెళ్లిపోయేటట్లు అంగీకరింపచేశారు.

తరువాత సుల్తాన్ అన్ని దేశాలతో కలిపి 1829 లో ఎడ్రియా నోపిల్ సంధి చేసుకున్నారు. ఈ సంధి ప్రకారం 1) సుల్తాన్ గ్రీసును స్వాతంత్ర రాజ్యంగా అంగీకరించాడు. 2) సెర్బియా స్వతంత్ర్యాన్ని గుర్తించాడు. 3) వాలాబియా మాల్డీవియాలు ఏకం చేయబడి రష్యా ఆధిపత్యంలో ఉంచబడ్డాయి. 4) నల్ల సముద్రం డాన్యూబ్ నదిలోని అన్ని నౌకలు అనుమతింపబడ్డాయి. 1833 లండన్ తీర్మానం ప్రకారం బాల్కన్ రాజ్యాల సరిహద్దులు గుర్తింపబడ్డాయి. గ్రీసు పరిపాలన విషయంలో రష్యాకు, ఇంగ్లాండ్‌కు అభిప్రాయ భేదాలు వచ్చినవి. రష్యా గ్రీసు తన ఆధీనంలో వుండవలెనని కోరింది. ఆ కోరిక వినగానే ఇంగ్లాండ్, ఆస్ట్రియా, ఫ్రాన్సులు గ్రీసును స్వతంత్ర రాజ్యంగా గుర్తించారు. రాజ్యాంగ బద్ధ రాచరికం ఉండాలని తీర్మానించారు. 1832 లో బవేరియా రాజవంశ రాజకుమారుడైన ఆటోను గ్రీకులు తమ రాజుగా ఎన్నుకొన్నారు. అంతటితో కొన్ని శతాబ్దాల టర్కీ పాలనలో మ్రగ్గిపోయిన గ్రీసు స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. దీనితో ప్రాచ్య సమస్యలోని తొలి ఘట్టం పూర్తి అయింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. వియన్నా కాంగ్రెస్, దాని నిర్ణయాలు, ప్రాముఖ్యతపై వ్యాసాన్ని వ్రాయండి.
2. ఐరోపా రాజ్యకూటమి, దాని కార్యకలాపాలపై విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.
3. మెటర్నిక్ పాలనను వివరించండి.
4. ప్రాచ్య సమస్యను వివరించండి.

**చదువదగిన గ్రంథాలు :**


2. Hazen Cd : A History of Modern Europe (1789 - 1945)
3. Rose Halland : The Revolutionary and Napoleonic Era
4. Thompson, David : Europe Since Napoleon


**- డా॥ ముప్పాళ్ళ హనుమంతరావు**

పాఠం - 9

# 1848 నుండి 1914 వరకు ఫ్రాన్సు దేశ చరిత్ర

విషయసూచిక :

9.0 లక్ష్యం
9.1 ఉపోద్ఘాతం
9.2 రెండవ ఫ్రెంచి రిపబ్లిక్
9.3 మూడవ నెపోలియన్
9.3.1 రెండో ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షునిగా మూడో నెపోలియన్
9.3.2 చక్రవర్తిగా మూడో నెపోలియన్
9.3.3. మూడో నెపోలియన్ విదేశాంగ విధానం (Foreign Policy)
9.4 ఫ్రాన్స్‌లో మూడో రిపబ్లిక్
9.4.1 తాత్కాలిక ప్రభుత్వం
9.4.1.2 థియర్స్ (Thiers) పరిపాలన
9.4.2 మూడో రిపబ్లిక్ సుస్థిరం కావడం
9..4.3 మూడో రిపబ్లిక్ బలహీనతలు - బలవంతము కావడము

## 9.0 లక్ష్యం:

1789 విప్లవ ఫలితంగా ఫ్రాన్సులో ఏర్పడ్డ రాజ్యాంగబద్ధ రాచరికము, రిపబ్లికన్ లేదా ప్రజాపరిపాలనా వ్యవస్థలు నెపోలియన్ ఆధిపత్యంలోని నిరపేక్ష రాజ్యవ్యవస్థకు దారితీయడాన్ని వియన్నా కాంగ్రెసు తిరిగి బూర్బన్ వంశీయుల నిరపేక్ష రాచరికాన్ని పునరుద్ధరించడాన్ని గూర్చి తెలుసుకున్నారు. జాతీయ భావాలు, స్వేచ్ఛాసమానత్వాలపై ఆధారపడిన ప్రజాపాలనా వ్యవస్థ కొరకు ప్రజలు నిరంతరంగా పోరాడుతూనే ఉండడమూ, అందుచేత 1830 లోను 1848 లోను ప్రజావిప్లవాలు చెలరేగి నిరపేక్షరాచరికాన్ని తొలగించడమూ అనతికాలములోనే ఆ విప్లవ ఫలితంగా నెలకొన్న రాజ్యాంగబద్ధ రాచరికాలు తిరిగి నిరపేక్షరాచరికాలుగా మారిపోవడం గూర్చి తెలుసుకున్నారు. దీనినిబట్టి నిరపేక్ష రాచరిక విధానంనుండి ప్రజాపరిపాలనా వ్యవస్థకు అధికారం బదలాయించడం వివిద దశల్లో సుదీర్ఘమైన సంఘర్షణల వలన మరొక విధంగా సాధ్యంకానిదని , స్పష్టపడుతుంది. ఈ సంఘర్షణలోని తదుపరి దశలను గూర్చి 1848 తరువాత ఫ్రాన్సులో జరిగిన సంఘటనల సమీక్షద్వారా వివరించడం ఈ పాఠం లక్ష్యం.

## 9.1 ఉపోద్ఘాతం :

1789 నాటి ఫ్రెంచివిప్లవం సాంప్రదాయక వ్యవస్థలపై సాధారణ ప్రజానీకం మధ్యతరగతి మేధావుల నాయకత్వంలో తిరుగుబాటు చేసి ఆ వ్యవస్థల్లోని అంశాల నిరపేక్ష రాచరికము, సాంఘిక ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రయత్నించింది. అయితే ఆ విప్లవం క్రమంగా నెపోలియన్ బొనాపార్టీ యొక్క నియంతృత్వానికి దారితీసి ఫ్రాన్సుదేశం ఐరోపా ఖండంలోని అన్నిదేశాల రాజకీయ సుస్థిరతకు భంగకరం అయింది. అందుచేత వారి ఆగ్రహానికి , అసహనానికి గురైంది. ఫలితంగా వియన్నా కాంగ్రెసులో తిరిగి బూర్బన్ వంశీయుల నిరపేక్షరాచరికాన్ని పున: ప్రతిష్ఠించడం జరిగింది. విప్లవకాలంలో దేశ ప్రజానీకాన్ని తీవ్రంగా

ఉత్తేజపరచిన స్వేచ్ఛా, సమానత్వ సౌభ్రాతృత్వ సిద్ధాంతాలు, విప్లవ ప్రభుత్వం సమకాలీన ఐరోపా దేశాల నిరపేక్ష రాచరికాలను ఎదిరించి పోరాడుతూ అలవరచుకొన్న జాతీయాభిమానము (Nationalism), దేశ భక్తి (Patriotism) అన్నీ వియన్నా కాంగ్రెసు నిర్ణయాలతో నీరుకారిపోయాయి. ఆ విధంగా చూచినప్పుడు 1789 విప్లవం విఫలం అయిందని చెప్పక తప్పదు.

1789 విప్లవం ఈ విధంగా విఫలమైనదని భావించినప్పుడు అందుకు కారణాలను గూర్చి ఆలోచించవలసి ఉంది. మొట్ట మొదటగా చెప్పవలసింది - విప్లవానికి అవసరమైన వైజ్ఞానిక, తాత్విక ప్రాతిపదిక తగినంత బలంగా ఏర్పడలేదనేది స్పష్టం. బూర్బన్ రాచరికమే ఆనాటి దేశపరిస్థితికి సంపూర్ణంగా కారణమని, సాంప్రదాయకవ్యవస్థల నిర్మూలన అందుకు తగిన మార్గమని దేశప్రజానీకం ఏకగ్రీవంగా విశ్వసించలేదు. సాంప్రదాయక వ్యవస్థల పట్ల ఆదరాభిమానాలు అప్పటికి అపారంగా ప్రజల్లో నిలిచి ఉండడం చేతనే విప్లవకాలంలో ఘోరమైన హత్యాకాండలు , దౌర్జన్యపూరితమైన సంస్కరణలు అవసరం అయినాయి. తుదకు నెపోలియన్ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొని నియంతృత్వాధిపత్యంతో పరిపాలించినప్పుడు అతనికి విప్లవకారులనుండి, మేధావి వర్గంనుండి ఎటువంటి ప్రతిఘటనా లేకపోవడం, పైగా దేశ ప్రతిష్టలు అతని యుద్ధ విజయాలతో అత్యున్నతస్థాయికి చేరిందని భావించడం ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది.

1815 నాటి వియన్నా కాంగ్రెసు నిర్ణయాలతో పునఃప్రతిష్ఠితమైన బూర్బన్ రాచరికం"మరచిపోయిందేదీలేదు, నేర్చిందేమీలేదు" అన్నట్లు 1789 పూర్వం నాటి అసమర్థమైన నిరపేక్ష రాచరికాన్ని, స్వాధికారవర్గాల ప్రాబల్యాన్ని పునరుద్ధరించడంతో తీవ్రమైన రాచరికవాదులు (Ultra Royalists) సంతృప్తి చెందినా, ప్రజాబాహుళ్యం తీవ్రంగా నిరసించింది. తిరిగి మధ్యతరగతి నాయకత్వంలో సామాన్య ప్రజానీకం ఆందోళనలకు దిగింది. అణచివేతకు పాల్పడ్డ రాచరికాన్ని ప్రతిఘటించింది. పూర్వం విప్లవకాలంలో నిరపేక్ష రాచరికాన్ని ఎదిరించి పోరాడిన చరిత్ర కలిగిన లూయీ ఫిలిప్ నాయకత్వంలో కొంతవరకు పరిమితమైన అధికారాలతో, ప్రజలకు సంతృప్తికరమైన విధంగా రాచరికం ఏర్పడింది. అయితే ఈ మధ్యతరగతి రాచరికం (Burgeoise Monarchy) కూడా ప్రజలకు సంపూర్ణమైన సంతృప్తిని ఇయ్యలేకపోయింది. రాచరికానికి ప్రతిష్ఠాకరమైన వైభవం, సైనిక విజయాలు, జాతిప్రతిష్ఠను పెంపొందించడం లూయీ ఫిలిప్ కాలంలో జరగలేదు. నెపోలియన్ బోనాపార్టీ సాధించిన అపూర్వమైన యుద్ధవిజయాలు, వీటితో ఉప్పొంగిన దేశాభిమానం ప్రజల మనసులో చెలరేగుతున్నాయి. దానికి తగినట్లు, అనగా అటువంటి ప్రతిష్ఠాత్మక విజయాలనేవి సాధించలేకపోగా, ప్రజల్లో ఏర్పడుతున్న అసంతృప్తి తిరిగి మరో విప్లవరూపం ధరిస్తుందేమోనన్న భయంతో లూయీఫిలిప్ క్రమంగా నియంతృత్వాధిపత్యం చలాయిస్తూ, ప్రజల స్వేచ్ఛా సమానత్వాలను హరించివేస్తూ, వారి అసంతృప్తి మరింతగా ప్రజ్వరిల్లడానికి దోహదం చేశాడు. ఈ కారణాల చేత 1848 లో మరో ప్రజావిప్లవం అనివార్యమైంది.

1848 లో విప్లవఫలితంగా ఫ్రాన్సులో మరల రిపబ్లిక్ అవతరించింది. దీనిని రెండవ రిపబ్లిక్ అంటారు. మొదటి రిపబ్లిక్ 1795 లో జాతీయసమితి (National Convention) రూపొందించిన రాజ్యాంగాన్ని అనుసరించి ఏర్పడింది. వాస్తవంగా అది 1792 లో పదునారో లూయీని వధించి ఫ్రాన్సు దేశానికి రిపబ్లిక్ ప్రకటించడంతోనే ప్రారంభమైంది. కాని దానికి అవసరమైన రాజ్యాంగనిర్మాణాన్ని జాతీయసమితి చేపట్టి, 1795 లో పూర్తి చేయడంతో రిపబ్లిక్ సంపూర్ణ స్వరూపాన్ని పొందింది. అయితే అప్పటి అత్యవసర పరిస్థితిలో, దేశం నలుమూలలనుండి విదేశీ శత్రుకూటముల వలన యుద్ధాలు చేయవలసివస్తూ ఉండడం చేత, అచిరకాలంలోనే రిపబ్లిక్ లక్షణాలను కోల్పోయి, సైనిక నియంతృత్వంగా మారిపోయింది. అయినప్పటికి 1804 లో నెపోలియన్ తనను తానే ఫ్రెంచి చక్రవర్తిగా ప్రకటించుకొనేవరకు సమయానుకూలంగా రాజ్యాంగాలను మార్చుకుంటూ, నామమాత్రంగానే రిపబ్లిక్‌గా నిలచింది. ఆ తరువాత 1848 విప్లవానంతరం తిరిగి ఫ్రాన్సుదేశం రిపబ్లిక్‌గా పునర్జన్మను ఎత్తింది.

## 9.2 రెండవ ఫ్రెంచి రిపబ్లిక్ :

1848 విప్లవానంతరం రిపబ్లిక్‌ను నెలకొల్పిన తరువాత, దాని నిర్మాణనిర్వహణల కొరకు ఒక రాజ్యాంగ చట్టం అవసరం అయింది. అందుకొరకు ఒక జాతీయ రాజ్యాంగ నిర్ణాయక సభ (National Constituent Assembly) ను ఎన్నుకోవడం, ఆ

సభ రాజ్యాంగనిర్మాణాన్ని పూర్తిచేసి ఎన్నికలు జరపడానికి, రిపబ్లిక్ ప్రభుత్వం ఏర్పడడానికి కొంత వ్యవధి అవసరం. ఆ వ్యవధిలో పరిపాలనా నిర్వహణకై ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని (Provisional Government) ఏర్పరచడం జరిగింది.

తాత్కాలిక ప్రభుత్వంలోని ప్రముఖులు రెండు వర్గాలకు చెందినవారు. మొదటివర్గం కేవలం రిపబ్లిక్‌వాదులు (Republicans) రాచరికాన్ని తొలగించి రిపబ్లిక్‌ను నెలకొల్పడాన్ని మించి, మరే దీర్ఘకాలిక ప్రణాళిక లేనివారు. కాలానుగుణంగా అవసరమైన కార్యక్రమాన్ని చేపట్టి, రిపబ్లిక్ వ్యవస్థను బలోపేతం చేయడం, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అప్పటికప్పుడు రూపొందించుకోవడం వీరి విధానం. ఒక విధంగా ఆచితూచి అడుగు వేసేవారు కనుక సాంప్రదాయ సంరక్షకవాదులు (Conservatives) గా నిరసనకు గురయ్యేవారు. రెండవవర్గం సామ్యవాదులు (Socialists) రిపబ్లిక్ అవతరణకు ఒక పరమార్థం ఉందని, అది కేవలం సాంఘిక, రాజకీయ స్వేచ్ఛాసమానత్వాలను నెలకొల్పడం కాక, అందరికి సమానమైన ఆర్థికావకాశాలను సమకూర్చి, దేశాన్ని సామ్యవాద విధానంలో ఆర్థికప్రగతి సాధించే విధంగా నడిపించాలని ఆకాంక్షించేవారు. 1789 విప్లవకాలంలో మేధావులవలె, వీరు తెలివైనవారు, చురుకైన ఆలోచనలతో తాత్త్విక దృక్పథాలను ఏర్పరచి కళ్ళముందు స్వర్గాన్ని చూపించేవారు - కళ్ళుతెరచి వాస్తవ ప్రపంచంలోనికి వాటిని అనువదించ ప్రయత్నించడంతో, వారు చూపించే స్వర్గం కరిగిపోయి, ఆచరణయోగ్యంకాని ప్రణాళికగా మిగిలిపోతుంది.

తాత్కాలిక ప్రభుత్వంలోని సామ్యవాదులకు నాయకుడు, ప్రధానమైన సిద్ధాంతకర్త, వక్త, లూయి బ్లాంక్ (Louis Blank). సమాజం మొత్తాన్ని శ్రామికజనుల జీవనశైలిని అభివృద్ధిచేసే విధంగా పునర్నిర్మించాలని అతని యోచన. పూర్వం వలె పాటుపడేవారు ఒకరు, ఫలితం అనుభవించేవారు వేరొకరు కాని, ప్రతి ఒక్కడు పాటుపడి, దేశసంపదను వృద్ధిచేసి, దాని ఫలితాన్ని పంచుకొని అనుభవించాలని అతని తాత్త్విక సిద్ధాంతం. ఇది రూసో ప్రచారంచేసిన ప్రశాంతము, ప్రగతిశీలకము అయిన ప్రాక్తన సమాజానికి మరలిపోవడమనే భావానికి ఆచరణ. తరువాత కాలంలో కారల్‌మార్క్స్ ప్రవచించే సామ్యవాదానికి మార్గదర్శకం (Fore runner). శ్రామికులు, యజమానులు అనే వివక్ష లేకుండా అతని వాదాన్ని అనుసరించి సామ్యవాదులు, నూతన రాజ్యాంగంలో “పనిహక్కు” (Right to work) ను తప్పనిసరిగా పొందుపరచాలని, ప్రతిఒక్కరు తమకు పనిచూపమని ప్రభుత్వాన్ని అడిగేహక్కు కలిగి ఉన్నారని, వాదించారు. ఆ విధంగా ప్రతిఒక్కరికి పనులు కల్పించడానికి శ్రామికులకు సహకార కార్ఖానాలు (Co-operative workshops) ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి ఏర్పరచాలని, అవి సంపూర్ణంగా శ్రామికుల నిర్వహణలో పనిచేయాలని వారు వాదించారు. ఈ ప్రణాళిక సాధ్యాసాధ్యాలను గూర్చి రిపబ్లిక్‌వాదులకు, సామ్యవాదులకు వాదోపవాదాలు చెలరేగాయి. ప్రభుత్వపెట్టుబడితో నెలకొల్పిన కార్ఖానాల్లో శ్రామికులు వేతనంపై నియమితులై పనిచేయాలని లేనిపక్షంలో ఆ పెట్టుబడిమొత్తాలు దుర్వినియోగం కాగలవని రిపబ్లిక్‌వాదులు వాదించారు. సొమ్ము తనదైనప్పుడే ఎవరైనా బాధ్యతాయుతంగా పనిచేయగలరు, తనది కానప్పుడు బాధ్యతారహితంగా పనిచేయడానికి, అవినీతికి పాల్పడడం సహజం. అప్పుడు సాంఘిక ప్రయోజనానికి మారుగా స్వప్రయోజనం కొరకు పాటుపడటానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా వీరు కొంతవరకు తమ వాస్తవవాదం వలన ప్రగతి నిరోధకాలుగా, సాంప్రదాయ సంరక్షణవాదులుగా అపకీర్తి పొందారు. మానవుడు సహజంగా న్యాయశీలి, కష్టజీవి, విశ్వసనీయుడనే నమ్మకంతో అవాస్తవమైన, ఆచరణయోగ్యం కాని ప్రణాళికలను ప్రతిపాదించేవారు ప్రగతిశీలురుగా ప్రసిద్ధులౌతారు.

తాత్కాలిక ప్రభుత్వంలో సంఖ్యాబలము, వాగ్ధాటి కలిగిన సామ్యవాదులు తమ ఆశయాలకు అనుగుణంగా జాతీయ కార్ఖానాల (National Workshops) ను ఏర్పరచారు. వాటిలో కోరిన వారందరికి పని కల్పించబడింది. అయితే, ఏ విధమైన పని, అది ఎంతమేర అవసరం, అటువంటి పనులకు నిపుణులెవరు, అనే అంశాలను గూర్చి సక్రమంగా ఆలోచించనందున, వాటిలోని పని చాలావరకు నిరుపయోగము అయింది. అసలు ఏ పనిలేనివారికి అవి పునరావాస కేంద్రాలుగా, ఉచితవేతన కేంద్రాలుగా మారి, అపారమైన నష్టాలను ఆర్జించాయి. ఈ ప్రణాళిక విఫలం కావడంతో లూయి బ్లాంక్, అతని అనుయాయులైన

సామ్యవాదులు తీవ్రవిమర్శకు, నిరసనలకు గురయ్యారు. నిపుణులైన, అర్హులకు మాత్రం అవకాశాలు ఇచ్చినట్లైతే ఈ ప్రయోగం ఇంత ఘోరంగా విఫలం అయ్యేది కాదు. అలాకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వాలకు, అవధులు లేని అర్థాన్ని ఆపాదించడంతో దేశ ఆర్థిక పరిస్థితి మరింత అస్తవ్యస్తం అయింది.

1848 మే లో జాతీయ రాజ్యాంగ నిర్ణాయకసభ (National Constituent Assembly) ఏర్పడి, తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దుచేసి, అధికారాన్ని చేపట్టింది. ఒకప్రక్క రాజ్యాంగనిర్మాణాన్ని మరొకప్రక్క దేశపరిపాలనను ఆ సభ నిర్వచించింది. అప్పటికే సామ్యవాదులు తమ అవాస్తవికమైన, ఆచరణయోగ్యం కాని ప్రణాళికలతో అపకీర్తి పాలవటంచేత ఈ సభలో అత్యధిక సంఖ్యలో మితవాదులైన రిపబ్లికన్లు ఎన్నికైనారు. వారు మొట్టమొదట జాతీయ కార్ఖానాలను రద్దుచేయడం, దానితో శ్రామికజనులు అసంతృప్తికి గురికావడమూ జరిగింది. వారి అసంతృప్తి విప్లవరూపం ధరించి, సామ్యవాదులకు, రిపబ్లికన్‌లకు రోజుల తరబడి వీధి పోరాటాలు, ఇతర హింసాయుతమైన విధ్వంసక చర్యలకు దారితీసింది. కొన్నివేలమంది మరణాలతో ప్రభుత్వం ఈ అల్లర్లను కఠినంగా అణచివేసింది. ఆచరణయోగ్యం కాని, ఊహాజనితమైన ప్రణాళికలతో ప్రజలను రెచ్చగొట్టే రాజకీయ పక్షాలు, ముఖ్యంగా సామ్యవాదులమని చెప్పుకొనేవారు, ప్రజాస్వామిక వ్యవస్థల బలహీనతకు పతనానికి ఈ విధంగా పాటుపడడం, చరిత్ర ప్రసిద్ధమై, అన్ని దేశాల ఆధునిక చరిత్రల్లోను గమనించదగిన అంశంగా కానవస్తుంది.

జాతీయరాజ్యాంగ నిర్ణాయకసభ రెండవ ఫ్రెంచిరిపబ్లిక్‌కు అధ్యక్ష తరహాలో ఏర్పరచింది. అధ్యక్షుణ్ని నాలుగు సంవత్సరాల పదవీకాలానికి, ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు, అతడు వెంటనే మరొకసారి ఎన్నికల్లో పోటీచేయడానికి వీలులేదు. వెంటవెంటనే ఎన్నుకొనడం ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఒకేవ్యక్తిపై ఆధారపడడం క్రమంగా వంశానుగతంగా పరిణమించే ప్రమాదం ఏర్పడుతుంది. అయితే, వెంటనే రెండవసారి ఎన్నికను నిషేధించడం వలన ఎప్పటికప్పుడు అనుభవశూన్యులు ఎన్నికవుతూ, అనుభవజ్ఞులను ఆటంకపరచడంగా పరిణమిస్తుంది. అధ్యక్షునికి శాసననిర్మాణంలో సహకరించేందుకు ఒకే సభ కలిగిన శాసననిర్మాణ శాఖ (Legislature) ఉంటుంది. అధ్యక్షుడు, శాసనసభ సభ్యులు సర్వజన వోటింగ్ (Universal suffrage) ప్రాతిపదికన ఎన్నుకోబడతారు.

## 9.3 లూయీ నెపోలియన్ :

1848 రాజ్యాంగం ప్రకారం, ఆ సంవత్సరాంతంలో జరిగిన ఎన్నికల్లో లూయీ నెపోలియన్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. అప్పటినుండి 1871 లో ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధం జరిగి, ఫ్రాన్స్‌లో మూడో రిపబ్లిక్ ఏర్పడేవరకు, ఆ దేశచరిత్ర పూర్తిగా లూయీ నెపోలియన్ జీవిత చరిత్రగా మారిపోయింది. రెండో రిపబ్లిక్ అధ్యక్షునిగాను, తరువాత ఫ్రాన్సు చక్రవర్తిగాను అతడు ఐరోపా చరిత్రలో అనేక ప్రధాన పరిణామాల్లో కీలకమైన పాత్ర వహించాడు.

లూయీ నెపోలియన్ నెపోలియన్ బోనాపార్టీ సోదరుడైన లూయీ బోనాపార్టి కుమారుడు. నెపోలియన్ బోనాపార్టీ ఫ్రెంచి చక్రవర్తిగా పరిపాలించిన కాలంలో లూయీ బోనాపార్టీ హాలెండు రాజుగా నియమితుడైనాడు; నెపోలియన్ బోనాపార్టీ మొదటి భార్య అయిన జోసెఫిన్ బోవార్నిస్ (Josephine Beauharnais) కు మొదటి భర్త వలన కలిగిన కుమార్తెను వివాహం చేసుకున్నాడు. వారి కుమారుడే లూయీ నెపోలియన్. ఈ విధంగా నెపోలియన్ వంశంలో జన్మించిన ప్రఖ్యాతి వలన లూయీ నెపోలియన్ అపరిమితమైన ప్రజాదరణ పొంది, రెండో ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు.

లూయీ ఫిలిప్ పరిపాలించే కాలంలోనే (1830 - 48) ఫ్రాన్సులో నెపోలియన్ బోనాపార్టీ వీరగాధలు ప్రజల్లో విస్తృతంగా వ్యాపించి, ఆ చక్రవర్తి కాలంలో అన్ని ఐరోపాదేశాలు ఫ్రెంచి సేనలకు పాదాక్రాంతం కావడమూ, అనేక దేశాల్లో అతని సోదరీ, సోదరులు పరిపాలిస్తుండగా అవి ఫ్రాన్సుకు అనుబంధ రాజ్యాలుగా ఏర్పడడము, ఫ్రెంచి ప్రజానీకానికి గర్వకారణాలైనాయి. అవి వారి మనసులో ప్రబలమైన జాతీయాభిమానాన్ని, దేశభక్తిని రేకెత్తించడము, నెపోలియన్ పరిపాలనతో సరిపోల్చి, లూయీ ఫిలిప్

పరిపాలనను నిరసించడము జరిగింది. ఈ విధమైన పరిణామాలను "నెపోలియన్ లెజెండ్" (Nepolean Legend) అంటారు. లూయీ ఫిలిప్ 1848 లో పతనం చెందటానికి ఈ పరిణామాలు మూలకారణం. ఫ్రాన్సు దేశంలోని సాంప్రదాయక రాచరికవాదులు, బోనాపార్టీ వ్యక్తిత్వాన్ని ఆరాధించేవారూ, ఈ జాతీయాభిమానంతో ఉత్తేజితులైనారు. మరల నెపోలియన్ వంటి సమర్ధుని పరిపాలన ఏర్పడాలని, ఫ్రాన్సు దేశ ప్రతిష్ఠ ఉన్నత శిఖరాలకు చేరాలని వారి ఆకాంక్ష.

1848 తరువాత ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వకాలంలో సామ్యవాదులు, రిపబ్లిక్ వాదులు పూర్తిగా అప్రతిష్ఠ పాలవడం మరో ముఖ్యకారణం. ఇది రాచరికవాదులు (Monarchists), బోనాపార్టీ ఆరాధికులు (Bonapartists), అధిక ప్రజాదరణ పొంది, రాజకీయంగా ప్రాబల్యం సంపాదించడానికి దారితీసింది. ఈ పరిణామాల ఫలితంగా లూయీ నెపోలియన్ అపారమైన ప్రజల మద్దత్తుతో రెండో ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు.

### 9.3.1 రెండో ఫ్రెంచి అధ్యక్షునిగా లూయీ నెపోలియన్ :

లూయీ నెపోలియన్ సంపూర్ణంగా నిరపేక్ష రాచరికవాది. నెపోలియన్ బోనాపార్టీ వంశీయుడైనందున, ఆ చక్రవర్తి కీర్తిప్రతిష్ఠలను, ఘనతను తలచుకొని విపరీతమైన ఆత్మవిశ్వాసం, అహంకారం కలిగినవాడు. ఆనాటి ఫ్రెంచి రాజకీయ వాతావరణంలో బలీయమైన వ్యక్తిత్వం కలిగిన పరిపాలకునికి ప్రజాభిమానం ఏర్పడిన విషయాన్ని, రిపబ్లిక్‌వాదులు, సామ్యవాదులు తీవ్రమైన పరాజయం పొందడాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్నవాడు. కనుక దేశపరిస్థితి పూర్తిగా తనకు అనుకూలంగా ఉందని, తన ఆశయాలు, ఆకాంక్షలను నిజం చేసుకునేందుకు సరైన అవకాశమని అతడు గుర్తించాడు. ఫ్రెంచి ప్రజలు నెపోలియన్ బోనాపార్టీ వంటి వ్యక్తికి అధికారాన్ని కట్టబెట్టాలని ఆశిస్తున్నపుడు సరిగ్గా అదేవిధంగా, రిపబ్లికన్ వ్యవస్థలో అధికారాన్ని సంపాదించి, ఆ వ్యవస్థను కూలద్రోయడం ద్వారా చక్రవర్తిగా ప్రకటించుకొని, నిరపేక్ష రాచరిక విధానంలో పరిపాలించిన వాడు లూయీ నెపోలియన్.

సామ్రాజ్య నిర్మాణాన్ని ఉద్దేశించి లూయీ నెపోలియన్ మొదట సామ్యవాదులను, రిపబ్లిక్ వాదులను, అణచివేయడానికి కఠిన చర్యలు తీసుకున్నాడు. ఏవేవో సాకులు చూపి, వారిని అనేకులను జైళ్ళలో నిర్బంధించాడు. తరువాత ఎన్నికల చట్టాన్ని సవరించి, పేదప్రజానీకానికి ఓటుహక్కు లేకుండాచేశాడు. పత్రికలపై నిషేధాజ్ఞలు జారీచేసి, వాటిలో వార్తల ప్రచురణ, అభిప్రాయాలను, చర్చాగోష్ఠులను ప్రకటించడంలో నియమనిబంధనలను విధించాడు. ఈ చర్యలు ప్రజాస్వామ్య విరుద్ధమైనవిగా, లూయీ నెపోలియన్ నిరపేక్షాధికారాన్ని చలాయిస్తూ, రిపబ్లిక్‌ను తప్పుదారి పట్టిస్తున్నట్లు విమర్శించేవారు లేరు, విమర్శించే పత్రికలు లేవు - ఈ చర్యలు ప్రజలకు అంగీకారమే అయినాయి. తరువాత లూయి నెపోలియన్ శాసనసభను అప్పటి రాజ్యాంగసభను అప్పటి రాజ్యాంగచట్టాన్ని సవరించవలసిందిగా కోరాడు. కేవలం నాలుగు సంవత్సరాల పదవీకాలంలో, తిరిగి మరొకసారి ఎన్నికయ్యే అవకాశం కూడ లేనప్పుడు, అధ్యక్షుడు చేయగలిగిందేమీ ఉండదని, అందుచేత తన పదవీకాలాన్ని పొడిగించవలసిందిగా కోరాడు. అందుకు అసెంబ్లీ నిరాకరించింది.

ఎన్నికల చట్టాన్ని సవరించడం నుండి ప్రారంభమై అధ్యక్షుడు లూయీ నెపోలియన్‌కు, శాసనసభకు తీవ్రమైన అభిప్రాయభేదాలు, సంఘర్షణ ప్రారంభమైనాయి. జాతీయ రక్షకదళ (National Guard) అధిపతి, పారిస్ సైనిక పటాలానికి అధ్యక్షుడు అయిన జనరల్ చాన్‌గార్నియర్ (Changarnier) లూయీ నెపోలియన్ పదవీభ్రష్టున్ని చేశాడు. 1789 లో విప్లవ కాలంనుండి జాతీయరక్షక దళం రిపబ్లిక్ వ్యవస్థ స్థాపన, నిర్వహణల వల్ల, రాచరిక నియంతృత్వం నుండి ప్రజల హక్కులను కాపాడడంవల్ల నిమగ్నమై ఉంది. దాని అధిపతిని పదవినుండి తొలగించడం రిపబ్లిక్‌ను తొలగించడం వంటిది. శాసనసభ అందుకు ప్రతిగా అధ్యక్షుని అభిశంసించి విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ఆమోదించింది, దానిని లూయీ నెపోలియన్ లెక్కచేయకపోగా, అసెంబ్లీ అభిశంసనకు గురైనా పలువురిని తన మంత్రి వర్గంలోనికి తీసుకున్నాడు. తన పదవీకాలాన్ని పొడిగిస్తూ, రాజ్యాంగ సవరణచేయ నిరాకరించడంతో అధ్యక్షునికి, అసెంబ్లీకి నడుమ వైరుధ్యం తారాస్థాయికి చేరింది.

1851 డిసెంబర్ 2 న ఆస్టర్‌లిజ్ యుద్ధం యొక్క 46 వ వార్షికోత్సవ సందర్భంగా లూయీ నెపోలియన్ తన రాజకీయ వ్యతిరేకులను పలువురిని నిర్బంధించి కారాగారంలో వేసి, అసెంబ్లీని రద్దుచేశాడు. ఆ సందర్భంలో అధ్యక్షుడు లూయీ నెపోలియన్ పారిస్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, "ఫ్రాన్స్‌ను శత్రువుల బారినుండి రక్షించడం తన అభిమతమని ప్రభుత్వ వ్యతిరేకుల అణచివేత అందుకు తప్పనిసరి అయిందని ప్రకటించాడు. అయితే అప్పుడు ఫ్రాన్స్‌దేశానికెవరూ శత్రువులు లేరు. శత్రువులు, ప్రభుత్వ వ్యతిరేకులు అనేవారు కేవలం అతని నిరంకుశాధికారానికే. ఈ విషయం స్పష్టమే అయినా, ప్రజలనుండి చెప్పుకోదగిన వ్యతిరేకత లేకుండ, లూయీ నెపోలియన్ తన అభీష్టానుసారం రిపబ్లిక్‌ను రద్దుచేశాడు. కొంతకాలం రాష్ట్రాల్లో తలెత్తే కొద్దిపాటి వ్యతిరేకతను కఠినంగా సైనికబలాలను వినియోగించి అణచివేసి, అతడు తన నిరంకుశాధికారాన్ని నిష్కంటంకం చేసుకున్నాడు. అంతట లూయీ నెపోలియన్ రాజ్యాంగాన్ని సవరించి, తనకు సర్వాధికారాలు కట్టబెట్టడాన్ని ఆమోదిస్తూ ప్రజలను వోటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేయగా, 75 లక్షల వోట్లు అనుకూలంగాను, 6 లక్షల వోట్లు వ్యతిరేకంగాను పోలైనాయి. మరొక సంవత్సరం రిపబ్లిక్‌ను కేవలం నామమాత్ర వశిష్టంగా కొనసాగించి, వాస్తవంగా నిరపేక్ష పరిపాలన చేస్తూ 1852 డిసెంబర్‌లో మరొకసారి ప్రజాభిప్రాయాన్ని సేకరించాడు. మునుపటి కంటే అధిక మెజారిటీతో ప్రజలు అతని సర్వాధికారాన్ని, నియంతృత్వాన్ని ఆమోదించారు. అంతట లూయీ నెపోలియన్ లోగడ నెపోలియన్ బోనాపార్టీ వలెనే, తనను తాను ఫ్రెంచి చక్రవర్తిగా ప్రకటించుకొని ఆ దేశ చరిత్రలో మూడో నెపోలియన్ చక్రవర్తిగా ప్రసిద్ధుడైనాడు.

1810లో నెపోలియన్ బోనాపార్టీ ఆస్ట్రియా రాకుమారి మేరీలూసీని వివాహం చేసుకున్నాక, ఆమెకు కలిగిన కుమారుడు రెండో నెపోలియన్‌గా చరిత్రకారులు భావిస్తారు. నెపోలియన్ బోనాపార్టీ ఐరోపాలోని అనేక రాజ్యాలకు తన కుటుంబ సభ్యులను రాజులుగా, రాణులుగా నియమించేకాలాన, బాలుడైన తన కుమారుని రోమ్ రాజ్యానికి రాజుగా నియమించాడు. అయితే ఆ బాలుడు నాలుగేండ్ల వయసులో ఉండగానే నెపోలియన్ బోనాపార్టీ నాలుగో కూటమి చేత సంపూర్ణ పరాజయం పొంది, సెయింట్ హెలీనా ద్వీపంలో కారాగారవాసం చేస్తూ మరణించాడు. ఐరోపాదేశాల్లో అతడు నెలకొల్పిన రాజ్యవ్యవస్థలను వియన్నా కాంగ్రెస్ రద్దుచేసింది. అందుచేత రెండో నెపోలియన్ ఎన్నడూ, ఎక్కడా రాజ్యపాలన చేసినవాడు కాదు. అయినా చరిత్రకారులు అతన్ని రెండవ నెపోలియన్‌గా ఫ్రెంచి చక్రవర్తిగా లూయీ నెపోలియన్‌ను మూడో నెపోలియన్‌గాను పరిగణిస్తారు.

ఫ్రెంచి చక్రవర్తి మూడో నెపోలియన్ 1852 నుండి 1870 వరకు 18 సంవత్సరాలు పరిపాలించాడు. ఇతని సామ్రాజ్యాన్ని రెండో ఫ్రెంచి సామ్రాజ్యం (Second Empire) అని వ్యవహరిస్తారు. మొదటి ఫ్రెంచి సామ్రాజ్యం నెపోలియన్ బోనాపార్టీ స్థాపించింది. వాటర్లూ యుద్ధం తరువాత అంతమైంది.

### 9.3.2 చక్రవర్తిగా లూయీ నెపోలియన్ :

లూయీ నెపోలియన్ లేదా మూడవ నెపోలియన్ చక్రవర్తిగా అనుసరించిన విధానం అంతకు పూర్వం మొదటి నెపోలియన్ పరిపాలనా విధానాన్ని సరిపోలిందే. అతడు తన పెదతండ్రి (నెపోలియన్ బోనాపార్టీ) ప్రారంభించి, పరిపూర్ణంగా నెరవేర్చలేకపోయిన కార్యక్రమాన్ని పూరించడం తన ధర్మంగా భావించాడు. అలా బహిరంగంగా ప్రకటించాడు. ఆ కార్యక్రమం దేశీయ పరిపాలన (Internal Policy) లో తన నియంతృత్వాధికారాన్ని ఎదురులేకుండ బలపరచుకోవడం, అందుకు అవసరమైన ప్రజల మద్దత్తును కూడగట్టుకోవడం, విదేశాంగ విధానం (External of Foreign Policy) లో ఫ్రాన్సును అగ్రరాజ్యంగా, ఐరోపా రాజకీయాల్లో కీలక పాత్ర కలిగిందిగా సైనిక బలాన్ని, రాజకీయ ప్రతిష్ఠను చేకూర్చడం.

#### 9.3.2.1 మూడో నెపోలియన్ దేశీయాంగ పరిపాలన (Internal Policy) :

సుస్థిరమైన, బలమైన రాజ్యాధిపత్యం సామ్రాజ్యాధిపత్యానికి మొట్టమొదటి సాధనం. కనుక మొదటి నెపోలియన్ వలెనే మూడో నెపోలియన్ రిపబ్లిక్ కంటే, స్వేచ్ఛా సమానత్వాల కంటే, ఫ్రెంచిప్రజలకు జాతీయప్రతిష్ఠ ముఖ్యమని, అందుకై

రాజ్యాధిపత్యం బలమైన పునాదులతో నెలకొల్పబడాలని ప్రకటించాడు. నియంతృత్వాధిపత్యమూ, ప్రభుత్వ వ్యతిరేకతను కఠినంగా అణచివేయడమూ అందుకు మార్గం. అయితే, ఆ తరువాత వ్యక్తి స్వేచ్ఛాసమానత్వాలతో కొంతవరకు ప్రజాభిప్రాయాన్ని గౌరవించే పరిపాలనా విధానాన్ని పునరుద్ధరించడానికి అతడు సంపూర్ణవ్యతిరేకి కాడు. ఈ అంశం అతడు తయారుచేసి అమలు జరిపిన రాజ్యాంగచట్టాల వలన స్పష్టమవుతుంది.

## 9.3.3.2 మూడో నెపోలియన్ సామ్రాజ్య విధానం :

1792 - 95 సంవత్సరాల నడిమి కాలంలో ఫ్రెంచి విప్లవ ప్రభుత్వాన్ని నిర్వహించిన జాతీయసమితి (National Convension) దేశపరిపాలనకై కేంద్రప్రభుత్వాన్ని స్థానికపరిపాలనకై డిపార్టుమెంట్‌లు, ఎరాండిస్మా (Errandisment) అనే స్థానిక విభాగాలను ఏర్పరచింది. కాని తదనంతరం పరిణామాల్లో, అనేక రకాలైన రాజ్యాంగచట్టాలూ, విధానాల్లో ఈ పరిపాలనావ్యవస్థలు మార్పులు చేర్పులకు లోనై కొంతవరకు అవ్యవస్థితమైంది. ఈ పరిస్థితులను చక్కపరచి, మరల పటిష్టమైన పరిపాలనా వ్యవస్థను ఏర్పరచడం ముఖ్యం. సక్రమమైన పరిపాలనా వ్యవస్థలోనే ప్రజల్లో సుఖశాంతులు వృద్ధిచెందుతాయి. వారు స్వేచ్ఛా సమానత్వాలను, అనుభవించగలుగుతారు. అంతవరకు, పరిపాలనా వ్యవస్థను సంస్కరించి, పునరుద్ధరించేవరకు, వారు స్వేచ్ఛా సమానత్వాలను ప్రజా సార్వభౌమాధికారాన్ని త్యాగంచేయక తప్పదని లూయీ నెపోలియన్ ప్రకటించాడు. ఈ ఆశయాలను సాధించడానికి 1852 లో మూడో నెపోలియన్ కొన్ని రాజ్యాంగ సవరణలను అమలుజరిపాడు. ఈ రాజ్యాంగ సవరణలు నెపోలియన్ బోనాపార్టీ అమలు జరిపిన కన్సులేట్ (Consulate) రాజ్యాంగం వంటివే. సర్వాధికారాలు - శాసన నిర్మాణము, పరిపాలన, న్యాయశాఖకు సంబంధించిన సమస్త అధికారం చక్రవర్తి చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుంది. వయోజన వోటింగ్‌పై "లెజిస్లేటివ్ ఛాంబర్" (Legislative Chamber) అనే శాసనసభ ఏర్పడుతుంది. కాని దానికి వాస్తవాధికారాలు ఉండవు. సంవత్సరంలో ఒకసారి, మూడునెలలపాటు దాని సమావేశాలు జరుగుతాయి. అవి చాలావరకు రహస్యంగా జరుగుతాయి. శాసనసభ క్రొత్త చట్టాలకు బిల్లులను ప్రవేశపెట్టలేదు. అందుకు ప్రతిపాదనలు చేయలేదు. అవి "కౌన్సిల్ ఆఫ్ స్టేట్" (Council of State) అనే మరొక శాసనసభ తయారుచేసిన బిల్లులపై చర్చిస్తుంది. కాని వోటు చేయలేదు. కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లోని సభ్యులు చక్రవర్తి అభీష్టాలమేరకు తయారు అవుతాయి. సెనెట్ (Senete) అనే మరొక ఉన్నతాధికారాలు గల సభ రాజ్యాంగాన్ని, ప్రభుత్వ చట్టాలను వివరించడానికి, వ్యాఖ్యానించడానికి అధికారం కలిగిఉంది. అందులోని సభ్యులందరు, ఉన్నతాధికారుల నుండి చక్రవర్తి చేత నియమించినవారు, కనుక వారి వివరణలు, వ్యాఖ్యానాలు చక్రవర్తి సూచనల మేరకే అతని అభిప్రాయాలే అయి ఉంటాయి. మంత్రివర్గాన్ని చక్రవర్తి నియమిస్తాడు, వారిని తొలగించే అధికారం కూడ అతనిదే, కనుక మంత్రులు చక్రవర్తికే జవాబుదారులు.

ఈ విధంగా పాలనాధికారాన్ని సమస్తం హస్తగతం చేసుకొని, తన నియంతృత్వాన్ని పదిలపరచుకొన్నాడు మూడో నెపోలియన్. అతని నియంతృత్వాధికారాన్ని విమర్శించడానికి వీలులేకుండ బహిరంగసభలను పూర్తిగా నిషేధించి, పత్రికలపై తీవ్రమైన ఆంక్షలు విధించడం జరిగింది.

అయితే తన నిరపేక్ష రాచరిక పరిపాలన కేవలం పదవీవ్యామోహాన్ని సంతృప్తిపరచుకొనేందుకు కాకుండ, దేశాభివృద్ధికి దోహదం చేసేలా మూడో నెపోలియన్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిర్వహించాడు. అతని పరిపాలనకాలంలో గణనీయమైన ఆర్థికాభివృద్ధి జరిగింది. బ్యాంకింగ్ వ్యవస్థను విస్తరించి వ్యవసాయానికి, పరిశ్రమలకు ఋణసౌకర్యాన్ని కలిగించడం జరిగింది. వ్యవసాయాభివృద్ధికి, దేశీయంగా సరుకుల రవాణాకు అనువుగా కాలువల త్రవ్వకము, రైలుమార్గాలను మూడోనెపోలియన్ కాలంలో చేపట్టటం జరిగింది. టెలిగ్రాఫ్ వంటి సమాచార సౌకర్యాలు కూడ విస్తారంగా వ్యాప్తి అయినాయి. మూడో నెపోలియన్ కాలంలో ఫ్రెంచి పారిశ్రామికవిప్లవం ప్రారంభమైందని చెప్పడం అతిశయోక్తి కాబోదు. ఈ రవాణా, సమాచార సౌకర్యాలు అభివృద్ధి చెందుతున్న ఫ్రెంచి పరిశ్రమలకు, వర్తకవాణిజ్యాలకు అవసరం అయినాయి. పరిశ్రమలకు అనుబంధంగా

వ్యవసాయాభివృద్ధి సైతం గణనీయంగా జరిగింది. అంతర్జాతీయ వాణిజ్య విస్తరణకు స్టీమర్ల నిర్మాణం అధికంగా జరిగింది. ఇవన్నీ దేశంలో పారిశ్రామికాభివృద్ధికి, తద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదం చేశాయి. ప్రభుత్వానికి అధికాదాయం లభించి, ఆర్థికబలం చేకూరింది.

### 3.2.3 మూడో నెపోలియన్ ఉదార సామ్రాజ్యం :

పారిశ్రామికాభివృద్ధిలో దేశంలో ఉపాధి సౌకర్యాలు మెరుగై, శ్రామికజనుల సంఖ్య అధికమైంది. శ్రామికుల అసంతృప్తి అటు ఆర్థిక వ్యవస్థను, ఇటు రాజకీయ వ్యవస్థను అతలాకుతలం చేయగలదు. అందుచేత మూడో నెపోలియన్ శ్రామికజన సంతృప్తిని, పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక కార్యక్రమాలు చేపట్టాడు. తాను ఎప్పుడూ శ్రామికుల్లో ఒకనిగా కనిపించడానికి, ఎల్లవేళల, ఏ సమయంలోనైనా వారికి అందుబాటులో, వారి వాదనలు వినడానికి సంసిద్ధంగాఉన్నట్లు ప్రవర్తించాడు. 1848 కి పూర్వం నెపోలియన్ బోనాపార్టీ వంశీయులు తమ ప్రాభవాలను పోగొట్టుకొని తిరిగిన కాలంలో లూయీ నెపోలియన్ ఇటలీలో నివసిస్తూ, "కార్బోనరీ" సభ్యుడైనాడు. ఆ కారణాన అతనికి సహజంగానే శ్రామికజనులపట్ల సానుభూతి, స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వాలపట్ల ఆదరణ ఉన్నాయి. ఆ కారణంగా శ్రామికజనుల ప్రయోజనాలకై సహజంగానే శ్రద్ధచూపి, వారి సంఘాలకు ఋణసౌకర్యాన్ని కలిగించడము, తద్వారా వారి ఉపాధి సౌకర్యాలను వృద్ధిచేయడంపట్ల ఆసక్తి ప్రదర్శించాడు. దానివలన పారిశ్రామిక ఉత్పత్తులు వృద్ధికావడము, వర్తకవాణిజ్యాలు విస్తరించడము, ప్రభుత్వాదాయం వృద్ధికావడము మొదలైన ప్రయోజనాలు ప్రాప్తించాయి. శ్రామికులకు గృహవసతులు కల్పించడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. వారి సంఘాలకు ప్రభుత్వగుర్తింపును ఇచ్చి 1864 లో వారికి సమ్మె చేసే హక్కును కూడ కల్పించాడు. అయితే ఈ కార్యక్రమాలన్నీ అతడు 1860 - 70 సంవత్సరాల నడుమ, దిగజారుతున్న ప్రజాభిమానాన్ని తిరిగి సంపాదించుకునేందుకు చేసిన ప్రయత్నాలు. అందుచేత అతనికి సహజంగా అటువంటి అభిప్రాయాలు ఉన్నా, అవి 1850 - 60 సంవత్సరాల మధ్య తన సామ్రాజ్యాధికారాన్ని నియంతృత్వ పరిపాలనను పటిష్టపరచుకొనే సమయంలో జ్ఞప్తికి రాలేదు. 1860 - 70 సంవత్సరాల నడుమ తన సామ్రాజ్యాన్ని "ఉదార సామ్రాజ్యం" (Liberal Empire) గాను తానొక ఉదారచక్రవర్తిగాను మూడో నెపోలియన్ ప్రకటించుకున్నాడు.

నిరుపేద ప్రజానీకం ఆకలిదప్పులతో అలమటిస్తూ, కూడు గుడ్డలు కరువైన సమయంలో వారిలోని నిస్సహాయత, అసహనం నీటిలో మంటవలె 1789 లో ప్రచండమైన విప్లవరూపంలో బహిర్గతమైంది. రాజకీయ, ఆర్థిక అసంతృప్తులకు లోనైన మధ్యతరగతి మేధావుల తాత్విక సిద్ధాంతాలను యదార్ధంచేసే ప్రయత్నంలో ఆ పేదప్రజానీకం శక్తివంతమైన సాధనం అయింది. ఈ విషయాలను లూయీ నెపోలియన్ మరచిపోలేదు. శ్రామిక జన సంతుష్టి వలనే నిరుపేద ప్రజానీకాన్ని ఆదుకొని, వారిలో అసంతృప్తి కలుగకుండ జాగ్రత్తలు తీసుకోదలచి, వైద్యసహాయానికి వైద్యాలయాలు, ఏ ఆధారము లేనివారికి శరణాలయాలు మొదలైనవి నిర్మించాడు. ఈ విధమైన సంక్షేమ ప్రణాళికలతో, స్వప్రయోజనం కొరకే అయినా, సాధారణ మానవుని జీవన ప్రమాణాలను వృద్ధిచేసి, సంతృప్తికరంగా జీవించే వసతులను వారికి కలిగించాడు.

మూడోనెపోలియన్ చక్రవర్తి నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో పారిస్ నగరాన్ని అందంగా తీర్చిదిద్దడం చాలా ప్రధానమైంది. నగరంలోని ప్రధాన రహదార్లను, నగరానికి చేరే రోడ్లను (Boulevards) ను విశాలంగా తీర్చిదిద్ది, పునర్నిర్మించాడు. అనేక భవన సముదాయాలను, రోడ్లకూడళ్ళలో అందమైన కట్టడాలను నిర్మించి నగరాన్ని అత్యంత వైభవోపేతంగాను, సౌందర్యవంతంగాను రూపొందించాడు. 1855 లో అంతర్జాతీయ ప్రదర్శనను నిర్వహించి, ఫ్రెంచి ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని ఇస్తూ విదేశీయాత్రికులు బహుళంగా పారిస్ నగరాన్ని సందర్శించి, ఆ నగర ఐశ్వర్య విలాసాలతో ఆశ్చర్యచకితులు అయేలా చేశాడు. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో ఫ్రెంచి ప్రజానీకం సంతుష్టులై, తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మూడో నెపోలియన్ సామ్రాజ్యవిధానం భంగం కలిగించిందన్న అసంతృప్తిని మరచిపోయారు.

అయితే మూడో నెపోలియన్ ఆనాటి ఆర్థిక వ్యవహారాల్లో బ్రిటన్ అనుసరించే వాణిజ్యరాజ్య విధానాన్ని (Marchantilism) కాదని స్వేచ్ఛావ్యాపారాన్ని అనుసరించాడు. గ్రేట్ బ్రిటన్ టారిఫ్ నిబంధనలను అమలు జరిపి, తమదేశ పరిశ్రమలకు రక్షణ కల్పిస్తూ, ఎగుమతులను వృద్ధిచేసుకోవడము, దిగుమతులను తగ్గించుకోవడము, తద్వారా తమ విదేశీవాణిజ్యం తమదేశ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించుకుంది. కాని మూడో నెపోలియన్ దిగుమతి సుంకాలను తగ్గించి, 1860లో గ్రేట్ బ్రిటన్‌తో వాణిజ్య ఒడంబడికను చేసుకున్నాడు. దీనివలన విదేశాంగ వ్యవహారాల్లో తనకు బ్రిటిష్ మద్దత్తు లభించినా, దేశీయ ఆర్థికవిధానం దెబ్బతిన్నది. గ్రేట్ బ్రిటన్‌నుండి విస్తారంగా పారిశ్రామిక వస్తువులు వచ్చిపడడంతో దేశీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. దీనితో అప్పటివరకు అతని సామ్రాజ్యాధికారాన్ని సమర్థిస్తున్న వర్తక వాణిజ్య వర్గాలు, పారిశ్రామికులు తీవ్రంగా అసంతృప్తి చెందారు.

తన సామ్రాజ్య పరిపాలన ప్రారంభదశలో మూడో నెపోలియన్ విదేశాంగ విధానంలో కొంత సంతృప్తికరమైన ఫలితాలను సాధించినా, నిర్దిష్టమైన ఆశయాలు, ఆచరణలు లేకపోవడంతో క్రమంగా ఘోరమైన వైఫల్యాలను పొందాడు. ఈ వైఫల్యాలు అతని కీర్తిప్రతిష్టలను, ప్రజాదరణను ఘోరంగా దెబ్బతీసాయి. తీవ్రమవుతున్న ప్రజావ్యతిరేకతను తగ్గించడానికి తను లోగడ చేసిన "పటిష్టమైన వ్యవస్థలో స్వేచ్ఛ" నిచ్చే వాగ్దానానికి కొంత సడలింపు అవసరం అయింది. వ్యవస్థను బలపరచిన తరువాత స్వేచ్ఛను పునరుద్ధరించక పోవడం, విదేశీవ్యవహారాల్లో వైఫల్యం, ప్రజావ్యతిరేకతను నానాటికి అధికం చేస్తున్నాయి. అందుచేత 1860 లో మూడో నెపోలియన్ తన సామ్రాజ్యాన్ని "ఉదార సామ్రాజ్యమ" ని ప్రకటించాడు.

ఉదార సామ్రాజ్యంతో పరిమితమైన అధికారాలనైనా, అవకాశం ఉన్నంతవరకు శాసనసభలు తమ కర్తవ్యాన్ని నిర్వహించగల అవకాశం లభించింది. ప్రభుత్వ విధానాలను ఆ సభలు నిశితంగా విమర్శించాయి. వాటి సమావేశాలను, చర్చలను రహస్యంగా ఉంచక బహిరంగంగా ప్రకటించేందుకు పత్రికలకు కొంతవరకు స్వేచ్ఛ కలిగింది. సభలు, సమావేశాలపై కొంతవరకు ఆంక్షలు తొలగి, స్వాతంత్ర్యం వ్యాపించింది. ఈ విధంగా ప్రజలకు స్వేచ్ఛా సమానత్వాలను కలిగించడంతో వారి వ్యతిరేకత తగ్గి, సంతృప్తి చెందగలరని మూడో నెపోలియన్ ఆశించాడు. కాని వాటి ఫలితం అందుకు వ్యతిరేకమైంది.

మూడో నెపోలియన్ ఆ సంస్కరణలను చేయడం పూర్తిగా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకొని తమను బుజ్జగించడానికేనని ప్రజలు గుర్తించారు. వారిలో తిరిగి రాజకీయ పరిణామాల పట్ల ఆసక్తి పెరిగింది. చురుకుగా వాటిని పరిశీలిస్తూ, విమర్శిస్తూ, తమ వ్యతిరేకతను నిర్భయంగా ప్రకటించారు. వారిలో వెనుకటివలె రాజకీయ చైతన్యం ఏర్పడి, మరిన్ని ఉదార సంస్కరణలను కోరసాగారు. ఈ పరిణామాల్లో మూడో నెపోలియన్ క్రమక్రమంగా ఒక్కొక్క మెట్టు దిగి, 1870 లో నూతన రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టవలసివచ్చింది. ఈ రాజ్యాంగం నెపోలియన్ చక్రవర్తిగా పదవిలో కొనసాగనిచ్చినా, పరిపాలనలో స్పష్టంగా రిపబ్లికన్ విధానాలను అనుసరించక తప్పలేదు. శాసనసభలకు సంపూర్ణమైన, వాస్తవమైన అధికారాలు ప్రాప్తించడమూ, మంత్రులు శాసనసభ నుండి ఎన్నికై, శాసనసభకే జవాబుదారులు కావడం జరిగింది. 1870 లో ప్రజాభిప్రాయాన్ని సేకరించి, ప్రజల తీర్పుననుసరించి ఈ నూతన రాజ్యాంగాన్ని మూడో నెపోలియన్ చక్రవర్తి అమలు జరిపాడు.

### 9.3.3. మూడో నెపోలియన్ విదేశాంగ విధానం :

మూడో నెపోలియన్ విదేశాంగ విధానం పైన పేర్కొన్నట్లు స్పష్టమైన ఆశయాలు, ఆచరణలు లేనిది. ఏదో మహత్తరమైన ప్రయోజనాన్ని ఆశించి ఒక విధానాన్ని అనుసరించడం, అంతలో మరేదో అనుమానము, తను అనుకున్న విధంగాకాక వేరొక విధంగా జరుగవచ్చుననే భయంతో, ఆ విధానాన్ని విరమించడం; ఉన్నతమైన ప్రయోజనాలకొరకు పాటుపడుతూ, పనిలో పనిగా స్వల్పమైన లాభాలపై అధికమైన పట్టుదల ప్రదర్శించడంతో ఆశించిన ప్రయోజనం చేకూరకపోవడం, ఇటువంటివి అతని విదేశాంగ విధానంలోని ప్రధాన లక్షణాలు. అంతేకాక, అతని సమకాలికులైన సార్డీనియా ప్రధానమంత్రి కౌంట్‌కవూర్, ప్రష్యా ప్రధానమంత్రి

అయిన బిస్మార్క్ అపారమైన యుక్తిపరులు. వారి రాజకీయతంత్రంముందు మూడో నెపోలియన్ తెలివి తక్కువతనం అపజయం పొందడమేకాక అపహాస్యం పాలైంది.

### 9.3.3.1. పోప్‌తో సంబంధాలు :

1849 లో రెండో ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షునిగా ఎన్నికైన వెంటనే ఇటలీలోని జాతీయ సమైక్యవాదుల తిరుగుబాట్లలో పోప్ రాజ్యాధిపత్యానికి ముప్పు ఏర్పడడాన్ని లూయీ నెపోలియన్ తనకు అనుకూలంగా మలచుకోదలచాడు. ఫ్రాన్సులో అధిక సంఖ్యాకులైన ప్రజానీకం కాథలిక్కులైనందున పోప్‌ను ఆదుకోవడం ద్వారా వారి మద్దత్తు సంపాదించవచ్చునని అతడు ఆశించాడు. గతంలో తను అజ్ఞాతంగా ఇటలీలో నివసించిన సమయంలో కార్బోనరీ సభ్యుడై ఇటలీ జాతీయసమైక్యత కొరకు తీసుకొన్న నిర్ణయాన్ని మరచి, అప్పటి తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకొరకు పోప్‌రాజ్యాల్లో (Papal States) సంభవించిన తిరుగుబాటును అణచివేయడానికి, పోప్‌కు కావలసిన రక్షణ కల్పించడానికి ఫ్రెంచిసేనలను పంపాడు. ఈ సేనలు అతడు ఉద్దేశించిన కార్యక్రమాన్ని జయప్రదంగా పూర్తిచేశాయి; అతడు ఆశించిన విధంగా ఫ్రెంచి ప్రజల అభిమానాన్ని సంపాదించి తన పదవిని సుస్థిరం చేసుకొని, సామ్రాజ్యాధిపత్యాన్ని సాధించడానికి పురోగమించాడు. కాని వ్యక్తిగతంగా లూయీ నెపోలియన్‌కు కాథలిక్ క్రైస్తవంపైకాని, ప్రొటెస్టాంటు శాఖలకు చెందిన క్రైస్తవంపైకాని ప్రత్యేకమైన పట్టుదల ఏదీలేదు. అంతా రాజకీయపుటెత్తుగడ మాత్రమే. ఈ ఎత్తుగడ తాత్కాలికంగా ఫలప్రదమైనా, తరువాత అతని కాలికి బంధమైంది. ఇటలీని మిత్రరాజ్యంగా చేసుకొనేందుకు, ఆస్ట్రియా శత్రురాజ్యం కాకుండ జాగ్రత్తపడేందుకు గల అవకాశాలను దూరం చేసింది. ఈ దూరదృష్టి లేకపోవడానికి తాత్కాలిక ప్రయోజనాలపట్ల అధికాసక్తి మాత్రమే కాక, ఫ్రెంచిచక్రవర్తిగా తాను ఐరోపాలో అంతర్జాతీయ రాజకీయాలను తన ప్రయోజనానికి అనువుగా ఎన్నడైనా, ఎలాగైనా, త్రిప్పగలననే అహంకారం మరొక ముఖ్యకారణం.

### 9.3.3.2. క్రిమియా యుద్ధంలో మూడో నెపోలియన్ :

1852 లో చక్రవర్తిగా ప్రకటించుకొన్న తరువాత అనతికాలంలో బెత్లహామ్‌లో ఏసుక్రీస్తు జన్మస్థలం వద్ద ఉన్న అత్యంత పవిత్రమైన చర్చిపై ఆధిపత్యం కలిగి ఉండడంలో వివాదం చెలరేగింది. ఆ వివాదంలో ప్రధాన వాది ప్రతివాదులైన వారు రోమన్ కాథలిక్ మతవ్యవస్థ అధిపతి అయిన పోప్, గ్రీక్ ఆర్థడాక్స్ చర్చి అధిపతి అయిన పెట్రార్క్. గ్రీక్ ఆర్థడాక్స్ చర్చికి మతపరంగా అనుబంధమైన రష్యా సహజంగా పెట్రార్క్‌ను బలపరచింది. అయితే అంతకన్న బలీయమైన కారణం, బాల్కన్ ద్వీపకల్పంలోని క్రైస్తవ, స్లావ్, దేశాలను తనకు అధీన - మిత్రరాజ్యాలు (Subordinate States) గా చేసుకొని, నల్లసముద్రంపైన, మధ్యధరా సముద్రంపైన ఆధిపత్యం సంపాదించాలనే ధ్యేయం. ఈ సముద్రాలపై ఆధిపత్యం ఖండాంతర వాణిజ్య సంబంధాలకు అవసరం. అటువంటి వాణిజ్య సంబంధాలే ఆధునికమైన ఆర్థిక విధానాలకు, పెట్టుబడిదారీ విధానానికి, పారిశ్రామికాభివృద్ధికి మూలం. నల్లసముద్రంపైన, మధ్యధరాసముద్రంపైన రష్యా ఆధిపత్యం సంపాదించడం భారతదేశంలోని బ్రిటిష్ వలస సామ్రాజ్యానికి, ఇండో-చైనాలో ఫ్రెంచి వలస సామ్రాజ్యానికి ముప్పుగా ఆ దేశాలు భావించగా, నల్లసముద్ర ప్రాంతంలో రష్యా ఆధిపత్య విస్తరణ తన సామ్రాజ్యాధికారానికి ముప్పుగా ఆస్ట్రియా భావించింది. ఈ విధంగా రెండు మతవ్యవస్థల నడుమ ఏర్పడ్డ వివాదానికి అంతర్జాతీయ ప్రాధాన్యత ఏర్పడింది.

తన వలసరాజ్యాల రక్షణ, ఆస్ట్రియా సామ్రాజ్యంతోను గ్రేట్ బ్రిటన్‌తోను సత్సంబంధాలను నేర్పరచుకొనే ప్రయోజనాలతో పాటుగా రష్యాను ఓడించి పాదాక్రాంతం చేసుకొనే అవకాశం లభిస్తుండడాన లూయీ నెపోలియన్ క్రిమియా యుద్ధంలో పాల్గొనడానికి నిర్ణయించాడు. పోప్ పక్షం వహించి పోరాడడం వలన దేశంలోని కాథలిక్‌ల మద్దత్తు లభించి, తన సామ్రాజ్యాధిపత్యం మరింత పటిష్ఠమవుతుందని ఆశించాడు. మొదటి నెపోలియన్ పతనానికి కారణమైన రష్యా దండయాత్రకు ప్రతీకారం తీర్చుకోవచ్చునని కూడ అతని ఆలోచన. ఆ దండయాత్రల్లో పాల్గొన్న కొందరు సైనికులు, సేనాధిపతులకు మూడో నెపోలియన్ రష్యాను ఓడించి

ప్రతీకారం తీర్చుకోవడం పట్ల అపరిమితమైన సంతృప్తి లభించింది. క్రిమియా యుద్ధం తరువాత జరిగిన శాంతిసమావేశం పారిస్‌లో జరగడం కూడ మూడో నెపోలియన్ ప్రతిష్ఠను ఇనుమడింపచేసింది. ఐరోపా రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ, అంతర్జాతీయ ఒడంబడికలకు మధ్యవర్తిత్వం నెరపే స్థాయికి ఫ్రాన్సు చేరుకోవడంతో ఫ్రెంచి ప్రజల జాతీయభావం మరింత బలీయమై, అది చక్రవర్తిపై కేంద్రీకృతం అయింది.

### 9.3.3.3. ఇటలీ సమైక్యతలో మూడో నెపోలియన్ :

అయితే 1856 పారిస్ శాంతి సమావేశం తరువాత మూడో నెపోలియన్ విదేశాంగ విధానంలోని లోపాలు, వాటి దుష్పరిణామాలు క్రమంగా బహిర్గతం కాసాగినాయి. క్రిమియా యుద్ధంలో పాల్గొనడం ద్వారా మూడో నెపోలియన్ మైత్రిని, సైనిక సహకారాన్ని పొందడానికి, అతని సాయంతో ఆస్ట్రియాను ఓడించి లంబార్డీని ఇటలీలో చేర్చడానికి, ఇటలీని సమైక్య జాతీయరాజ్యంగా ఏర్పరచడానికి సార్డీనియా ప్రధానమంత్రి కౌంట్ కవూర్ ఆలోచించాడు. అదేవిధంగా ఫ్రెంచి సేనలకు సాయంగా సార్డీనియా సేన క్రిమియా యుద్ధంలో పాల్గొన్నది, పారిస్ శాంతిసమావేశాలకు కౌంట్ కవూర్ హాజరు అయినాడు. ఆ తరువాత ప్లాంబియర్స్ వద్ద మూడో నెపోలియన్‌తో ఏకాంతంగా సమావేశం అయి, కౌంట్ కవూర్ ఆస్ట్రియాను ఉత్తర ఇటలీనుండి వెళ్ళగొట్టి, లంబార్డీని సార్డీనియా వశం చేసుకోవడానికి సైనిక సాయాన్ని అర్థించాడు. ఈ సందర్భంలో మూడో నెపోలియన్ తను లోగడ కార్బొనరీ సభ్యునిగా ఇటలీ సమైక్యతకై పనిచేయడాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. కాని ఇటలీ ప్రజల మనోభావాలను గురించి, తన సహకారం అందించినట్లయితే అతని దూరదృష్టి, రాజనీతి స్పష్టమై ఉండేవి. అలాకాక, తన సాయానికి ప్రతిఫలంగా సెవాయ్, నీస్ రాజ్యాలను ఇయ్యవలసిందిగా కోరాడు. అనగా ఫ్రెంచి సేనల సహకారానికి విలువకట్టి, వ్యాపారదృష్టితో ఆలోచించి, తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకున్నాడు.

మూడో నెపోలియన్ తెలివితక్కువతనం అంతటితో ఆగలేదు. ఫ్రెంచి సైనికసాయంతో సార్డీనియా సేనలు లంబార్డీలోని ఆస్ట్రియా సేనలతో పోరాడసాగాయి. 1859 లో ఫ్రాంకో - సార్డీనియా సేనలు ఆస్ట్రియాను ఓడించాయి. ఆస్ట్రియా లంబార్డీనుండి ఉపసంహరించుకొంది. ఫ్రెంచిసేనల సహకారంతో ఇటలీలో హాప్స్‌బర్గ్, బూర్బన్ వంశీయుల ఆధిపత్యంలో ఉన్న అనేక చిన్న రాజ్యాలను ఓడించి, ఇటలీ సమైక్యతను సాధించడానికి కవూర్ ఉత్సాహంగా ముందడుగువేశాడు. ఆ సమయంలో ఆకస్మికంగా మూడో నెపోలియన్‌కు ఫ్రెంచి సామ్రాజ్యసరిహద్దుపై జాతీయసమైక్యత సాధించి, రాజకీయంగా ప్రబలమైన ఇటలీ దేశం ఏర్పడడం క్షేమం కాదేమోనని అనుమానం వేసింది. అంతేకాక ఇటలీ సమైక్యతకు తోడ్పడడంలో మున్ముందు పోప్‌తో పోరాడి, అతని ఆధీనంలోని రాజ్యాలను (Papal States) సార్డీనియా పరం చేయవలసివస్తుంది. అందువలన తను దేశీయంగా సంపాదించుకున్న కాథలిక్ ప్రజల మద్దత్తును కోల్పోవలసి వస్తుంది. ఈ కారణాలతో మూడో నెపోలియన్ ఇటలీ సమైక్యతకై తోడ్పడడం విరమించి, ఆస్ట్రియాతో విల్లాఫ్రాంకా సంధి చేసుకొని పోరాటంనుండి విరమించుకొన్నాడు. ఆ సంధి షరతులవలన ఆస్ట్రియా లంబార్డీ, ఉత్తర ఇటలీలను సార్డీనియాకు వదలివేయడానికి అంగీకరించింది.

మధ్యలో సార్డీనియా పొత్తు విరమించినందువలన మూడో నెపోలియన్ అనేక విధాల నష్టపోయాడు. అందులో మొదటిది, తాను ఉదారభావాలు కలిగిన జాతీయసమైక్యతావాదిగా, గతంలో కార్బొనరీ సభ్యునిగా, ఇటలీ సమైక్యతకు కృషిచేసిన ఖ్యాతి, గౌరవమర్యాదలు పొందలేకపోవడం. రెండవది, ఇటలీ సమైక్యతకు కృషిచేసిన కారణాన సమైక్య ఇటలీ కృతజ్ఞతతో అంతర్జాతీయ రాజకీయాల్లో ఫ్రాన్సుకు విశ్వసనీయమైన మిత్రరాజ్యంగా ఏర్పడడం. అలా జరిగినట్లయితే ఫ్రెంచిసామ్రాజ్యానికి అంతర్జాతీయ రాజకీయాల్లో సార్డీనియా ప్రాబల్యం లభించడం - వంటి ప్రయోజనం మద్దతు. దీనివలన మూడవది, తను తాత్కాలిక ప్రయోజనాన్ని ఆశించి, వ్యాపారదృష్టితో కోరిన రెండు ఇటలీ రాజ్యాలను - సెవాయ్, నీస్‌లను గట్టిగా అడిగి పొందలేకపోవడం, నాలుగు, అనవసరంగా ఆస్ట్రియాతో దూరంగా తటస్థంగా ఉన్న సామ్రాజ్యంతో శత్రుత్వాన్ని కొనితెచ్చుకోవడం. ఈ విధంగా 1859 నాటికి మూడో నెపోలియన్ విదేశాంగ విధానము, దౌత్యనీతి బెడిసి కొట్టడంతో అతడు తీవ్ర విమర్శలకు గురికావడం,

దిగజారుతున్న ప్రతిష్ఠను, సామ్రాజ్యాధికారాన్ని నిలుపుకోవడం కొరకు "ఉదారచక్రవర్తి" గా పునర్జన్మనెత్తవలసి రావడం జరిగాయి. అంతేకాక, సార్డీనియాతో సంబంధాన్ని మధ్యలో తెగతెంపులు చేసుకున్నంతమాత్రాన ఫ్రెంచి కాథలిక్కులు అతని పట్ల ఏ మాత్రం సంతృప్తి చెందలేదు.

## 9.3.3.4 మెక్సికో వ్యవహారం :

ఇటలీ సమైక్యతా ఉద్యమంలోని అవ్యవస్థితమైన జోక్యంతో తీవ్రమైన నష్టాన్ని చవిచూసిన వెంటనే, 1861 లో మూడో నెపోలియన్ మెక్సికో ఆంతరంగిక రాజకీయాల్లో జోక్యం చేసుకొని మరొక తీవ్రమైన ఎదురుదెబ్బ తిన్నాడు. మెక్సికోలోని రిపబ్లికన్ ప్రభుత్వం అంతర్జాతీయ వాణిజ్యంలో బ్రిటన్, ఫ్రాన్సు, స్పెయిన్ దేశాలకు పెద్దమొత్తాల్లో బాకీపడి, తీర్చలేని స్థితికి దిగజారింది. అంతేకాక మెక్సికోలో స్థిరపడి వర్తకం చేసుకుంటున్న ఆయాదేశాలకు చెందిన ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ మూడు దేశాల ప్రతినిధులు 1861 లో లండన్‌లో సమావేశమై సంధిచేసుకొని, మెక్సికోపై దండెత్తి తమకు రావలసిన బకాయిలను వసూలు చేసుకోవడానికి, తమదేశాలకు చెందిన ప్రజల సంతతి వారిని ఇబ్బందులకు గురికాకుండ కాపాడుకోడానికి నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా మూడుదేశాల సంయుక్తసేనలు మెక్సికోపై దండెత్తాయి. కాని బ్రిటన్, స్పెయిన్ మధ్యంతరంగా యుద్ధవిరమణ చేసి, తమ సేనలను వెనక్కు పిలిపించాయి, అయితే మూడో నెపోలియన్ మాత్రం దండయాత్ర కొనసాగించాడు.

మెక్సికో దండయాత్రను కొనసాగించడంలో అతని ఆంతర్యం రెండువిధాలైనది. ఆ దేశ ప్రజానీకం అధిక సంఖ్యాకులు కాథలిక్‌లే అయినా, అక్కడి రిపబ్లికన్ ప్రభుత్వం చర్చి ఆధిపత్యాన్ని ప్రతిఘటిస్తున్నది. కనుక అక్కడ రిపబ్లిక్‌ను తొలగించి రాచరికాన్ని నెలకొల్పినట్లయితే, స్వదేశంలోని కాథలిక్ ప్రజానీకం సంతోషించి, తన సామ్రాజ్యాధిపత్యాన్ని సమర్థిస్తారు. రెండవది, మెక్సికోలో అనుకూలమైన ప్రభుత్వం పరిపాలిస్తుంటే, ఫ్రెంచి పెట్టుబడితో, ఫ్రెంచి ఇంజనీర్లను ఉపయోగించి పనామకాలువను త్రవ్వడం, ఆ కాలువ పూర్తిగా ఫ్రెంచిదేశపు సొత్తుగా, ఫ్రెంచి వర్తకవాణిజ్య విస్తరణకు ఉపకరిస్తుంది.

ఫ్రెంచిసేనలు యుద్ధంలో స్పష్టమైన విజయం సాధించకున్నా, మెక్సికన్ రిపబ్లిక్ అధ్యక్షుడైన జువారెజ్ (Juarez) ను వ్యతిరేకించే కొన్ని రాజకీయపక్షాలు అతన్ని పదవీచ్యుతుణ్ణిచేశాయి. అందుకు ఫ్రెంచి సేనలు సహకరించాయి. మెక్సికోలో నెలకొల్పిన రాచరిక వ్యవస్థను ఆస్ట్రియా చక్రవర్తి అయిన ఫ్రాన్సిస్ జోసెఫ్ సోదరుడు, మాక్సిమిలియన్‌ను రాజుగా చేయడానికి మూడో నెపోలియన్ అంగీకరించాడు. ఫ్రెంచి సహకారము, రాజకీయమద్దత్తులు పొందే విధంగా వాగ్దానం తీసుకొని మాక్సిమిలియన్ 1864 లో మెక్సికో రాజుగా సింహాసనం ఎక్కాడు. కాని రిపబ్లిక్ అధ్యక్షుడైన జువారెజ్‌కు పూ ర్తిగా ప్రజల మద్దతు ఉంది; అతని పక్షాన ఆ దేశంలో ప్రజాపోరాటం ప్రారంభమైంది. 1867లో మాక్సిమిలియన్‌ను పట్టుకొని, విప్లవకారులు వధించేవరకు ఆ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. అక్కడి ప్రజాబలాన్ని ఎదిరించి మాక్సిమిలియమ్‌ను, అతని రాచరికాన్ని సంరక్షించడం మూడో నెపోలియన్‌కు అసాధ్యం అయింది. 1865 లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అంతర్యుద్ధం (Civil War) ముగిసింది. వెంటనే ఆ దేశప్రభుత్వం మన్రో సిద్ధాంతం ప్రకారం, అమెరికా ఖండంలోని ఐరోపారాజ్యాలు జోక్యం కలిగించుకోడాన్ని సహించనట్లు, మెక్సికన్ రిపబ్లిక్‌కు సాయంగా ఫ్రాన్సుతో పోరాడటానికి దిగవలసి వస్తుందని హెచ్చరించింది. అప్పటికే మెక్సికో వ్యవహారంలో అనవసరమైన కష్టనష్టాలు, అపజయాలు పొందుతున్న మూడో నెపోలియన్ చేయగలిగింది లేక, మిన్నకుండిపోయాడు. మెక్సికో వ్యవహారంతో అతని కీర్తిప్రతిష్ఠలు దిగజారిపోయాయి.

## 9.3.3.5 జర్మన్ సమైక్యతా ఉద్యమంలో మూడో నెపోలియన్ :

ఇటలీ సమైక్యతా ఉద్యమంలోను, మెక్సికోలో జోక్యం చేసుకున్నందువల్ల వైఫల్యం పొందిన మూడో నెపోలియన్ జర్మన్ సమైక్యతా ఉద్యమంలో జోక్యం కలిగించుకొనకపోవడంతో గొప్ప అవకాశాన్ని జారవిడుచుకొని, వైఫల్యం పొందాడు. సాధారణంగా

ఐరోపా అంతర్జాతీయ రాజకీయాల్లో పెద్దదేశాలు సంఘర్షణకు దిగినప్పుడు మధ్యవర్తిత్వం చేసి పరిష్కరించడానికి, లేదా తుల్యప్రాబల్యత (Balance of Power) కు భంగం కలుగుతుందనే నెపంతో, ఇతర పెద్దరాజ్యాలు తరచుగా జోక్యం చేసు కుంటాయి. ఈ సందర్భంలో రెండు పిల్లుల మధ్య కోతి రోట్టెముక్కను పంచిన విధంగా, మధ్యవర్తిత్వం నెరపిన దేశాలు, లేదా సైనికంగా జోక్యం చేసుకున్న దేశాలు వాటినుండి కొంతమేరకు తమ స్వప్రయోజనాలను సాధించుకుంటూ ఉంటాయి.

జర్మన్ సమైక్యత సాధించడానికి బిస్మార్కు ఆస్ట్రియాను కలుపుకొని డెన్మార్కుపై యుద్ధంచేసి ఓడించి ష్లేష్విగ్, హోల్స్టీన్ అనే రెండు ప్రాంతాలను ఆక్రమించాడు. అయితే తరువాత అతని వ్రేటు ఆస్ట్రియాపైనే పడవలసిఉంది. ఆస్ట్రియా ఆధిపత్యంలోని జర్మన్‌దేశాల సమాఖ్యను రద్దుచేసి, ఆ సమాఖ్య రాజ్యాలన్నిటిని మొదటి స్వతంత్రరాజ్యాలుగా చేసి, తరువాత ఒక్కొక్క పోరాటం ఐచ్ఛికంగా ప్రష్యా నాయకత్వంలోని జర్మన్ సామ్రాజ్యంలో కలసిపోవాలి. ఇది, అతని ప్రణాళిక. దీనిని సాధించేందుకు 1860 లో బిస్మార్కు ఆస్ట్రియాపై ఓడిపోయి ఆస్ట్రియా జర్మన్ కూటమి విచ్ఛిన్నాన్ని ఆమోదించింది. ఈ పోరాటంలోని పరిణామాలు అతి త్వరితంగా, నిర్దిష్టంగా జరిగిపోయి, మూడో నెపోలియన్ చోద్యం చూస్తున్నట్లు నిలిచిపోయేలా, బిస్మార్కు ఖచ్చితమైన ప్రణాళిక ప్రకారం నిర్వహించాడు, అందుచేత మూడో నెపోలియన్ నిశ్చేష్టునిగా నిలిచిపోయాడు.

కాని, బిస్మార్కు ఆలోచనను కొంతవరకైన పసిగట్టి, పరిస్థితులు విషమించి పోరాడటానికి దారితీస్తున్న సమయంలో, మూడో నెపోలియన్ కొంత తెలివిగా, చురుకుగా ప్రవర్తించినట్లైతే, ఆస్ట్రియా మైత్రిని సాధించి ఉండేవాడు. ఇటాలియన్ ఐక్యత సందర్భంగా ప్రాప్తించిన నిష్కారణ శత్రుత్వాన్ని పోగొట్టుకొని ఆస్ట్రియా మైత్రిని సంపాదించుకున్నట్లయితే, ప్రష్యా జర్మన్ సమైక్యతను సాధించగలిగేది కాదు. ఫ్రెంచి సాయం పొందిన ఆస్ట్రియాను ఓడించడం ప్రష్యాకు ఆ సమయంలో అసాధ్యమే అయ్యేది. ఆ తరువాత ఆల్సేస్, లోరైన్ ప్రాంతాల కొరకు ఫ్రాన్స్‌తో పోరాడగలిగేది కాదు. అటువంటి అవకాశాన్ని పోగొట్టుకోవడమేకాక, దౌత్యనీతితో కొంతవరకైనా ఫలితం పొందడానికి మూడో నెపోలియన్ విఫలయత్నం చేశాడు. 1863 లోనే డెన్మార్క్‌తో పోరాటం చేయకముందే, బిస్మార్కు మూడో నెపోలియన్‌తో బయారిజ్ (Biaritz) వద్ద సమావేశమై తను చేయబోయే పోరాటాలకు దూరంగా ఉండవలసిందిగా మూడో నెపోలియన్‌ను కోరాడు. ఆ సమావేశంలో ఉభయులనడుమ ఏ ఒప్పందమూ జరగలేదు. తటస్థంగా పోరాటాలకు దూరంగా ఉన్నందుకు ప్రతిఫలంగా బిస్మార్క్ ఏ వాగ్దానమూ చేయలేదు. అయినా తనంతటతానే మూడో నెపోలియన్ తాను బెల్జియంను ఆక్రమించడానికి బిస్మార్కు అంగీకరించడమో లేక రైన్ నదీప్రాంతంలోని పాలటినేట్‌ను ఇయ్యడమో ఏదో ఒకటి చేయవచ్చని ఆశించాడు. బిస్మార్క్ వంటి దౌత్యవేత్త ఆ విధంగా కేవలం తన తటస్థతికి ఆ విధంగా హూంకరిస్తాడని ఆశించడం మూడో నెపోలియన్ తెలివితక్కువ. ఆ తెలివి తక్కువతోనే బిస్మార్క్ ఆస్ట్రియాను సంపూర్ణంగా ఓడించి మట్టి కరిపించడాన్ని, జర్మన్ రాజ్యాలను కలుపుకొని , సమైక్యజర్మన్ సామ్రాజ్యాన్ని నిర్మించడాన్ని మూడో నెపోలియన్ చూస్తూ ఉండిపోయాడు. పైగా దక్షిణ జర్మనీలో ఏదో కొంత భూభాగాన్ని ఇయ్యవలసిందిగా బిస్మార్క్‌ను కోరడం అక్కడి జర్మన్ పరిపాలకులకు ఆందోళన కల్గించింది. బిస్మార్క్ మూడో నెపోలియన్ ఆక్రమణ కాంక్షను చూపి వారిని భయభ్రాంతులను చేశాడు. ఫలితంగా వారంతా, ప్రష్యా నాయకత్వంలోని సమైక్య జర్మన్ సామ్రాజ్యంలో, ఐచ్ఛికంగా చేరిపోయారు. ఆ విధంగా మూడో నెపోలియన్ జర్మన్ సమైక్యతకు పరోక్షంగా సాయంచేశాడు.

### 9.3.3.6 ఫ్రాంకోప్రష్యాయుద్ధం :

1866 - 70 సంవత్సరాల నడిమి కాలంలో దక్షిణజర్మనీ రాజ్యాలు సైతం సమైక్య జర్మనీ సామ్రాజ్యంలో చేరిపోయిన తరువాత బిస్మార్క్ ఫ్రెంచి వారి అధీనంలోని ఆల్సేస్, లోరైన్ రాజ్యాలను సాధించ సంకల్పించాడు. ఇందుకై బిస్మార్క్ తాను ఫ్రాన్సును ఏకాకిగా చేయడం అవసరమని భావించి, ఫ్రెంచి పరాజయం ఏ ఏ దేశాలకు ఏ ఏ విధంగా ప్రయోజనకరమో ఆ విధంగా ఆ దేశాలకు వివరించాడు. ముందుగా మూడో నెపోలియన్‌కు బెల్జియం ఆక్రమణపై కోరిక ఉన్నట్లు బ్రిటన్‌కు తెలియచేసి, ఆ దేశం ఫ్రాన్సుకు సాయం రాకుండా చేశాడు. అదే విధంగా , రష్యా చక్రవర్తి రెండవ అలెగ్జాండర్‌కు ఫ్రాన్సు ఓటమితో పారిస్

సంధిలోని ఇబ్బందికరమైన షరతులను ఉల్లంఘించవచ్చునని ఆశపెట్టాడు. క్రిమియా యుద్ధానంతరం జరిగిన పారిస్ సంధి (1856) లో రష్యా నల్లసముద్రంలో నౌకాబలాన్ని నిర్మించి ఉపయోగించరాదనే షరతు విధించడం జరిగింది. ఈ షరతును విధించినవారు ఫ్రాన్సు, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు సాయం లేకుండా నల్లసముద్రంలో రష్యాను నిరోధించడం గ్రేట్‌బ్రిటన్ వల్ల కాదని, ఆ విధంగా రష్యాకు సంపూర్ణమైన అవకాశం లభిస్తుందని బిస్మార్క్ రష్యాకు ఆశ కలిగించాడు. అలాగే ఇటలీరాజైన రెండవ ఇమ్మానుయేల్ తో సంధిచేసుకొని, ఫ్రాంకో ప్రష్యాయుద్ధంలో తాను రోమ్ ఆక్రమించడానికి ఫ్రాన్సునుండి భయం చెందే పనిలేదని ఆశ గొల్పాడు. ఆస్ట్రియా ఫ్రాన్స్‌తో చేయికలపడానికి సిద్ధపడదు, కారణమేమిటంటే, తనసేనను నెపోలియన్‌కు సాయం పంపితే, అది రష్యాపట్ల శత్రుచర్యగా పరిణమించి, తన సామ్రాజ్యంపై రష్యా దండెత్తవచ్చు. ఈ విధంగా ఫ్రాన్సు ఐరోపా రాజకీయాల్లో ఏకాకిని చేసి బిస్మార్క్ ఫ్రాన్స్‌తో పోరాడి, ఆల్సేస్, లోరైన్ ప్రాంతాలను ఆక్రమించదలచాడు.

ఆల్సేస్, లోరైన్ అనే రెండు రాజ్యాలు రైన్‌నదికి పడమటదిశగా ఫ్రాన్సు, బెల్జియం సరిహద్దులోని జర్మన్ భూభాగాలు. అయితే, పధ్నాలుగో లూయీ ఫ్రాన్సు దేశానికి సహజ సరిహద్దులను ఏర్పరచే ఉద్దేశ్యంతో తూర్పున, ఈశాన్యాన రైన్ నదివెంబడి వ్యాపించిన భూభాగాలను ఆక్రమించి ఫ్రాన్స్‌లో చేర్చివేశాడు. తరువాత విస్తారంగా ఫ్రెంచి జనాభా ఈ రాజ్యాల్లో వ్యాపించింది. జర్మన్, ఫ్రెంచి ప్రజానీకాలు ఇంచుమించు సమానంగా ఉండడంతో, ఆ రాజ్యాలు ఫ్రాన్సు జర్మనీల మధ్య వివాదానికి, సంఘర్షణకు కారణమైనాయి. జర్మన్ సమైక్యతకు ఆ భూభాగాలను ఆక్రమించడం తప్పనిసరిగా ఫ్రాన్స్‌తో, పోరాటం లేకుండా ఆ రాజ్యాల నాక్రమించడం ఫ్రాన్స్‌తో అసాధ్యమని, బిస్మార్క్ మూడో నెపోలియన్‌తో యుద్ధానికి సన్నాహాలు ప్రారంభించాడు. అందుకు సన్నాహాలలోవి ప్రధానాంశంగా అందులోని అంతర్భాగంగా ఐరోపా దేశమూ సాయంగా రాకుండ ఫ్రాన్సు దేశాన్ని విబంధం (Isolate) చేయదలిచాడు. బిస్మార్కు ఈ దౌత్యనీతిని ఉపయోగించాడు.

### 9.3.3.6.1 స్పానిష్ వారసత్వ సమస్య :

ఫ్రాన్సు దేశాన్ని ఏకాకిగా చేసిన తరువాత ఆ దేశంతో పోరాడటానికి అనువైన అవకాశం కోసం బిస్మార్క్ ఎదురు చూస్తుండగా స్పెయిన్‌లో వారసత్వ సమస్యను గూర్చిన వివాదం కలిసివచ్చింది. బిస్మార్క్ ఆశయం ఫ్రాన్సును దురాక్రమణ దేశంగా చిత్రించి, జర్మన్ రాజ్యాల్లోను, ఐరోపాలోను ఆ దేశానికి సానుభూతి లేకుండా చేసి, జర్మనీ కేవలం తన జాతీయ ప్రతిష్ఠను కాపాడుకోవడం కొరకు పోరాటంలో దిగవలసివచ్చినట్లు సందర్భాన్ని కల్పించడం.

స్పెయిన్‌లో తలెత్తిన ఒక ప్రజా ఉద్యమంలో అక్కడి రిపబ్లికన్ ప్రభుత్వం పతనమై హోవెంజోలరన్ - సిగ్మారింజన్ (Hovenzollern - Sigmaringen) వంశానికి చెందిన లియోపాల్డ్‌ను సింహాసనం అధిష్ఠించవలసిందిగా ఆహ్వానించారు. జర్మన్ సమైక్య సామ్రాజ్యాన్ని ఏర్పరచడానికి నాయకత్వం వహిస్తున్న ప్రష్యాను పరిపాలించేది హోవెంజాలరన్ వంశమే, లియోపాల్డ్ ఆ రాజవంశానికి దూరపు బంధువు కూడ. లియోపాల్డ్ అయిష్టంగానే స్పానిష్ ప్రజల ఆహ్వానాన్ని అంగీకరించాడు, కాని మూడో నెపోలియన్ అందుకు తీవ్ర అభ్యంతరం వ్యక్తపరచాడు. లియోపాల్డ్ పక్షాన ప్రష్యాను పోరాటంలోకి దింపి, ఫ్రాన్సు ఓడించాలని బిస్మార్క్ ఆలోచించాడు. లియోపాల్డ్ స్పానిష్ సింహాసనం అధిష్టించడం ఐరోపారాజ్యాల నడుమ తుల్యప్రాబల్యతకు భంగమని మూడో నెపోలియన్ వాదన.

అయితే లియోపాల్డ్ ఈ ఆహ్వానాన్ని తిరస్కరించడంతో బిస్మార్క్ ఆశాభంగం చెందాడు. కాని మూడో నెపోలియన్ అత్యున్నత స్థాయికి చెందిన తెలివితక్కువతనాన్ని ప్రదర్శించి, బిస్మార్క్‌కు చేజారిన అవకాశాన్ని అందించాడు. లియోపాల్డ్ తిరస్కరించడంతో సంతృప్తిచెందక ప్రష్యాలోని తన రాయబారి అయిన బెనిడెట్టిని ప్రష్యారాజు విలియమ్‌తో సమావేశమై స్పానిష్ సింహాసనంపై హోవెంజొలరన్ వంశీయులు శాశ్వతంగా తమ హక్కులు వదులుకున్నట్లు ప్రమాణం చేయవలసిందిగా, కోరమని కబురు పంపాడు. బెనిడెట్టి అదేవిధంగా 1870 జులై 13 న ఎమ్స్‌వద్ద సమావేశమై ప్రష్యారాజు విలియమ్‌నుండి అటువంటి

ప్రమాణాన్ని కోరాడు. రాజు అందుకు నిరాకరించాడు. అంతటితో ఆ విషయం సమాప్తమైంది. కాని బిస్మార్క్ ఫ్రాన్సుతో యుద్ధానికి సిద్ధమై ఉన్నందున సమాప్తం కానియలేదు. అతడు ఆ సమావేశంలో ప్రష్యారాజు బెనిడెట్టీని అవమానించినట్లు ఫ్రాన్సులో ప్రష్యారాజునే ఫ్రెంచి రాయబారి అవమానించినట్లు జర్మనీలోను అర్థమయే రీతిగా రెండుదేశాల రాజధానులకు టెలిగ్రాఫులు పంపాడు. బిస్మార్కు వేసిన ఈ ఎత్తునే "ఎమ్స్ టెలిగ్రాం" అంటారు. బిస్మార్క్ వేసిన ఎత్తు ఉభయదేశాల్లోను తీవ్రమైన ఉద్రేకాలకు కారణమై యుద్ధానికి దారితీసింది. జర్మన్ సేనలు ఫ్రాన్సుపై దండెత్తి అనేక యుద్ధాల్లో గెలిచి పురోగమించారు. తుదకు 1870 సెప్టెంబర్ 1 న సెడాన్ వద్ద జరిగిన తీవ్ర యుద్ధంలో ఫ్రెంచిసేనలు ఘోర పరాజయం పొందగా, ఆ మరునాడు సెప్టెంబర్ 2 న మూడో నెపోలియన్ చక్రవర్తి జర్మన్ సేనలకు లొంగిపోయాడు.

## 9.4. ఫ్రాన్సులో మూడో రిపబ్లిక్ :

1870 లో సెడాన్ యుద్ధంలో మూడో నెపోలియన్ చక్రవర్తి ఓడి జర్మన్‌లకు లొంగిపోవడంతో అతని రెండో ఫ్రెంచి సామ్రాజ్యం అంతమైంది. అప్పటి గందరగోళంలో అతని వారసుడు ఎవడో ప్రకటించే వ్యవధి లేదు. జర్మన్ సేనలు విజృంభించి, పారిస్, వర్సే నగరాల వైపు తరలివస్తున్నాయి. ఆ సమయంలో సెప్టెంబర్ 4 న, ఫ్రెంచి రిపబ్లికన్‌పార్టీ నాయకుడు గాంబెట్టా (Gambetta) ఫ్రాన్సుదేశాన్ని రిపబ్లిక్‌గా ప్రకటించి ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. 1871 మే నెలలో యుద్ధం పరిసమాప్తమై ఫ్రాంక్ ఫర్ట్ సంధి జరిగే వరకు ఫ్రాన్సుదేశాన్ని ఈ తాత్కాలిక ప్రభుత్వం పరిపాలించింది.

### 9.4.1. తాత్కాలిక ప్రభుత్వం :

1871 జనవరి 28 న ఫ్రెంచి రిపబ్లిక్ (మూడవ) తాత్కాలిక ప్రభుత్వం బిస్మార్క్‌తో తాత్కాలిక యుద్ధవిరమణ ఒప్పందం చేసుకొంది. ఫ్రాన్సులో ఒక జాతీయ సభ (National Assembly) ఏర్పరచి ఆ సభ నిర్ణయానుసారం యుద్ధం కొనసాగించడమో లేక సంధి చేసుకొనేట్లయితే ఏ విధమైన షరతులతో సంధి చేసుకోవడమో నిశ్చయించుకోవడానికి తాత్కాలిక యుద్ధవిరమణ ఒప్పందంలో బిస్మార్క్ అంగీకరించాడు.

జాతీయ సభకు ఎన్నికలు జరిగాయి. అది బోర్డో (Bordeaux) పట్టణంలో సమావేశమై 1871 మే నెలలో జర్మనీతో ఫ్రాంక్‌ఫర్ట్ సంధిచేసుకొంది. ఈ సంధి షరతుల ప్రకారం ఫ్రాన్సు ఆల్సేస్, తూర్పు లోరైన్ ప్రాంతాలను జర్మనీకి బదలాయించడానికి, యుద్ధఖర్చులకు పరిహారం చెల్లించడానికి అంగీకరించింది. అంతేకాక, ఫ్రాన్సులో కొంతకాలం పాటు జర్మనీ తన సేనలను నిలిపి ఉంచడానికి, వాటి నిర్వహణభారాన్ని భరించడానికి కూడా ఫ్రాన్సు అంగీకరించింది.

అయితే, రిపబ్లిక్ నిర్వహణలో చాలా వైరుధ్యాలు, వాటివలన కొన్ని ఒడిదుడుకులు ఎదురైనాయి. ఫ్రెంచి ప్రభుత్వాన్ని రిపబ్లిక్‌గా ప్రకటించిన రాజకీయవర్గం (Political Party) రిపబ్లికన్‌లు. పారిస్ నగరమే వారి ముఖ్యకేంద్రం. గ్రామీణ ప్రజానీకం, అధికంగా వ్యవసాయదారులు, రిపబ్లిక్ పట్ల భయాందోళనలు కలిగినవారు. వారు స్వేచ్ఛాసమానత్వాలను నెలకొల్పడానికి ఆస్తిహక్కును, ముఖ్యంగా వ్యవసాయదారుల పంటభూములపై స్వామ్యహక్కులు (Ownership rights) రద్దు చేయగలరని, తమ ఆస్తిపాస్తులు రాచరిక వ్యవస్థలోనే సురక్షితంగా ఉండగలవని విశ్వసిస్తున్నారు. అంతేకాక దానితోపాటు దేశంలో ప్రశాంతత నెలకొని తమ వృత్తులను వ్యవసాయాన్ని సురక్షితంగా నిర్వహించుకోగల పరిస్థితిని కోరుతున్నారు. కాగా జాతీయసభ దేశంలోని యావన్మంది వోటర్లు ఎన్నుకున్నట్టిది. ఈ విధంగా రిపబ్లిక్‌కూ, జాతీయసభకు నడుమ కొంత వైరుధ్యం ఏర్పడింది. జాతీయసభ యుద్ధాన్ని ముగించి, ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరచడం ముఖ్యమని భావించగా రిపబ్లిక్ యుద్ధాన్ని కొనసాగించి, జర్మనీకి గుణపాఠం చెప్పాలని కోరుకుంటున్నది. జాతీయసభలో అధిక సంఖ్యాకులు రాచరికవాదులైన సభ్యులు. అయినప్పటికీ ఫ్రెంచి రిపబ్లికన్ వ్యవస్థలోనిదే జాతీయసభ, రిపబ్లిక్ నిర్వహణకై "ముఖ్య పరిపాలనాధికారి" అనే హోదాలో థియర్స్ (Theirs) ను ఎన్నుకొంది. అతనికి అధ్యక్షహోదాను ఈయకపోవడం గమనించదగిన అంశం.

జాతీయసభ రాచరికవాదుల ప్రాబల్యం కలిగి, రిపబ్లిక్ పట్ల ఉదాసీనంగా ఉంది కనుక థియర్స్‌కు అధ్యక్ష హోదానియ్యలేదు. అంతేకాక, క్రమంగా రాచరికాన్ని, రాజ్యాంగబద్ధంగా నెలకొల్పాలన్నది అధిక సంఖ్యాకుల అభిప్రాయం. అందుచేత, ఫ్రాంక్‌ఫర్ట్ సంధికి అంగీకరించినా, అమలుజరపడానికి ఫ్రెంచి భూభాగాన్ని జర్మనీకి ధారాదత్తం చేయడానికి జాతీయసభ సుముఖంగా లేదు. అటువంటి చర్యతో నూతన ప్రభుత్వపాలన ప్రారంభించడం వలన ప్రజల దృష్టిలో అప్రతిష్టకు గురై, స్వల్పకాలంలోనే ముగింపుకు రాగలదని వారి భయం. ఇటువంటి అప్రతిష్ఠాకరమైన చర్య రిపబ్లిక్ చేపట్టడం యుక్తమని వారి అభిప్రాయం.

క్రమంగా జాతీయసభ నిర్వహణలోని తాత్కాలిక ప్రభుత్వానికి, రిపబ్లిక్‌ను నెలకొల్పిన పారిస్ ప్రజానీకానికి, జాతీయసభ తన సమావేశాలను వర్సై నగరంలో, పారిస్‌కు సమీపాన నిర్వహించడంతో సంఘర్షణలు ప్రారంభమైనాయి. ఈ పోరాటాల్లో పారిస్ నగరాన్ని కాపాడుతున్న జాతీయ రక్షకదళం (National Guards) ప్రభుత్వసేనలను ఓడించి పారద్రోలాడు. అంతేకాక 90 మంది సభ్యులు కల సాధారణ సమితి (General Council) నొకదానిని ఎన్నుకొని, రిపబ్లిక్‌కు పరిపాలనా యంత్రాంగాన్ని సమకూర్చారు. ఈ సాధారణ సమితి పారిస్ కమ్యూన్ అనేపేర ప్రబలమైన సంస్థగా మారిన రిపబ్లిక్‌కు బలీయమైన సమర్థన ఇచ్చింది. ఇందులోనివారు చాలావరకు విప్లవభావాలు కలిగిన వారు. పారిస్ కమ్యూన్ వంటి సంస్థలను దేశమంతట నెలకొల్పి, వారు రిపబ్లికన్ వ్యవస్థను బలోపేతం చేయదలచారు. పారిస్ కమ్యూను థియర్స్‌ను, అతని నాయకత్వంలోని జాతీయసభను రిపబ్లిక్ విచ్ఛిన్నానికి కుట్రచేస్తున్నట్లు ఆరోపించి నిందించారు. అందుకు ప్రతిగా జాతీయసభ పారిస్ కమ్యూను సైనిక బలంతో అణచివేయదలచింది. జర్మనీ చేత ఘోరపరాజయం పొంది కొద్దినెలలు కూడ గడవకముందే, అప్పటికింకా జర్మన్‌సేనలు పారిస్ నగరానికి ఉత్తరదిశగా అనేక కోటలను ఆక్రమించి ఉండగానే జాతీయసభ ఆధ్వర్యంలోని ఫ్రెంచి ప్రభుత్వసేనలు పారిస్‌నగరాన్ని ముట్టడించి దిగ్బంధం చేశాయి. క్రిందటి సంవత్సరం జర్మన్‌సేనలు నాలుగు నెలలపాటు దిగ్బంధం చేసినప్పటికంటే, ఇప్పటి ఫ్రెంచిప్రభుత్వ సేనలు దిగ్బంధం చేయడంలో పారిస్ ప్రజానీకం అధికాధికమైన కష్టనష్టాలకు గురైనారు, అధికసంఖ్యలో మరణించారు. అయినప్పటికి, జాతీయసభ నిర్వహిస్తున్న తాత్కాలిక ప్రభుత్వం విజయం సాధించడమూ, రిపబ్లికన్‌లతో కూడిన పారిస్ కమ్యూన్ పూర్తిగా పరాజయం పొందడమూ, దాని వలసదేశంలోను, రాజధానీనగరం పారిస్‌లోను క్రమంగా ప్రశాంత పరిస్థితులు నెలకొనడం జరిగాయి. థియర్స్‌ను ప్రభుత్వం ప్రెసిడెంట్ (President of the French Republic) గా గుర్తించింది.

విదేశీ దండయాత్రలవలన పరాజయం పొంది ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రజలు ఆ తర్వాత ఏర్పడే అరాజక పరిస్థితిలో అంతర్యుద్ధాలకు పూనుకోవడం సర్వసాధారణం. జరిగిన నష్టాలకు, అప్రతిష్ఠకు ఒకరినొకరు కారణంగా ఎంచుకుంటూ పరస్పరం ఒకరినొకరు నిర్మూలించుకొనే ఉద్దేశంతో దేశంలోని రాజకీయవర్గాలు ఈ విధంగా అంతర్యుద్ధాలకు దిగుతాయి. 1789 ఫ్రెంచి విప్లవకాలంలో ఆస్ట్రో - ప్రష్యన్ సేనలచేత పరాజయం పొందిన తరువాత ఫ్రాన్సులోని రాజకీయవర్గాలు ఇదేవిధంగా ప్రవర్తించిన విషయాన్ని జ్ఞాపకం చేసుకోవచ్చు. భీతావహ పరిపాలన (Reign of Term) ను ఏర్పరచిన రిపబ్లిక్‌వాదులు మొదట రాచరిక వాదులను, తరువాత రిపబ్లిక్‌వాదుల్లోని గిరాండిస్టులను, ఆ తరువాత ఇతర మితవాదులైన రిపబ్లికన్లను - ఇలా ఏదో కారణంతో రిపబ్లిక్ వ్యవస్థకు శత్రువులుగా నిర్ణయించి వందలాదిగా వధించారు.

అలాగే 1871 ఫ్రాంకో - ప్రష్యా యుద్ధానంతరం జర్మనీ, ఫ్రాన్సులోని రాజకీయవ్యవస్థను విచ్ఛిన్నం చేయడం, ఆల్సేస్ లోరైన్‌లను ఆక్రమించడం, యుద్ధం వలన నష్టానికి పరిహారం వసూలు చేయడం, తన సేనలను ఫ్రాన్సులో కొంతకాలం నిలిపి ఉంచి, వాటి నిర్వహణ భారాన్ని ఫ్రాన్సుపైనే వేయడం - ఇవన్నీ మొదటి ప్రపంచ యుద్ధానంతరం మిత్రరాజ్యాలు (Allied Powers) జర్మనీపైన విధించాయి. ఈ దృష్టితో చూచినప్పుడు 1919 వర్సై సంధిలో జర్మనీకి జరిగిన కష్టనష్టాలు, అవమానాలు అసహజమైనవికావని, అవి లోగడ జర్మనీ ఫ్రాన్సుపై విధించినవేనని స్పష్టపడుతుంది. జర్మనీపై పగ తీర్చుకుందని గుర్తించడం సహేతుకం. అదేవిధంగా ఆనాటి జర్మనీ ఏ విధంగా అంతర్గత కల్లోలాల వలన, ఆర్థిక ఇబ్బందుల వలన క్రుంగిపోయిందో, ఫ్రాన్సు 1871 తరువాత అదేవిధంగా క్రుంగిపోయింది.

## 4.1.2 థియర్స్ పరిపాలన :

మొత్తం మీద ప్రభుత్వసేనలు పారిస్ నగరాన్ని ఆక్రమించి శాంతి భద్రతలను నెలకొల్పగలిగాయి. ఈ విషయంలో థియర్స్ గణనీయమైన విజయం సాధించాడు. అంతేకాక ఫ్రాంక్‌ఫర్ట్ సంధి చేసుకున్న రెండున్నర సంవత్సరాల లోపుగా జర్మనీకి యుద్ధనష్ట పరిహారాన్ని పూర్తిగా చెల్లించడమూ, జర్మన్‌సేనలు ఫ్రాన్స్ నుండి వైదొలగడమూ జరిగింది. ఆ పైన ఫ్రాన్సును నెమ్మదిగా పూర్వపుస్థితికి తీసుకొని వెళ్ళే ప్రయత్నాలు సాధించి, థియర్స్ మొదటి దేశాన్ని సైనికంగా బలోపేతం చేయడం అవసరమని భావించాడు. అదనంగా సైనికబలగాలను పెంచడమూ, వాటికి కఠినమైన శిక్షణనియ్యడము అతని కార్యక్రమం. అందుకొరకు సైనిక శిక్షను నిర్బంధం చేసి తగిన చట్టాలను అమలుచేశాడు. అయితే, అతడు కష్టకాలంలో దేశాన్ని ముందుకు నడిపించి, రాజకీయంగాను, సైనికంగాను బలోపేతం చేస్తున్న జాతీయసభలో అధికప్రాబల్యం కలిగిన రాచరిక వాదులు అతని పట్ల విశ్వాసం కోల్పోయారు. అందుకు కారణం, వారసత్వ ముఖ్యపరిపాలనాధికారిగా ఎన్నుకున్న సమయాన అతడు ఆర్లియన్ (Orlean) రాజవంశానికి చెంది, రాజరికవాదిగా ఉండేవాడు, కాని క్రమంగా రిపబ్లిక్‌వాదిగా మారాడు. అతడు ఫ్రెంచిరిపబ్లిక్‌కు రాజ్యాంగాన్ని రూపొందించవలసిన అవసరాన్ని, పరిస్థితులు చక్కబడినందున అందుకు తగిన సమయం ఆసన్నమైందని జాతీయసభను హెచ్చరించాడు. దీనితో రాచరికవాదులు అతనికి తమ మద్దత్తును ఉపసంహరించారు. 1883 మే నెలలో థియర్స్ పదవీ త్యాగం చేసి తప్పుకోగా, మార్షల్ మెక్ మహాన్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు.

## 9.4.13 రిపబ్లిక్‌కు సందిగ్ధ పరిస్థితి :

పై వివరణ వలన ఫ్రాన్సులో ఆనాడున్న ప్రభుత్వానికి స్పష్టమైన స్వరూపం ఇంకా ఏర్పడలేదని, రిపబ్లిక్‌గా ప్రకటించినా, ప్రభుత్వం రాచరికవాదులు చేతుల్లోనే ఉందని స్పష్టం అవుతుంది. రిపబ్లికన్‌వాదులు పూర్తిగా పరాజయం పొందడంతో ప్రభుత్వం రాచరికవాదులు సంపూర్ణమైన అదుపులోనికి వచ్చింది. కనుక తాత్కాలిక ప్రభుత్వాన్ని శాశ్వత ప్రాతిపదికపై నిర్మించడానికి, వీలైనంతవరకు రాచరికవ్యవస్థనే తిరిగి నెలకొల్పడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని, 1789 నుండి జరుగుతున్న ప్రజాఉద్యమాలు, (విప్లవాలు) విప్లవాలు కూడ ప్రజల మనసుల్లో గంభీరమైన ముద్రవేసి, రాచరిక వ్యవస్థను పునరుద్ధరించడం సులువుకాదని ఋజువుచేశాయి. ఈ విధమైన ఊగిసలాటలో - రెండు రకాలైన ప్రభుత్వ విధానాలు లోపభూయిష్టమైన వానిని స్పష్టమైన తరువాత దేనివైపు మొగ్గాలో తెలియని సంశయచిత్తంతో ఫ్రెంచిప్రజానీకము, రాజకీయవర్గాలు మరికొంతకాలం తమ రాజకీయ ప్రయోగాలను కొనసాగించారు.

ఫ్రెంచి సింహాసనం అధిష్టించడానికి అర్హులైన వ్యక్తులు అప్పుడు ముగ్గురున్నారు. వారిలో మొదటివాడు బూర్బన్ వంశానికి చెందిన కౌంట్ చాम्बర్డ్ లేక అయిదో హెన్రీ; రెండవవాడు ఆర్లియన్ వంశానికి చెందిన కౌంట్ ఆఫ్ పారిస్; మూడో వాడు బోనాపార్టిస్టు వర్గానికి చెందినవాడు, మూడో నెపోలియన్ కుమారుడైన కౌంట్ ఇంపీరియల్ వారిమధ్య పోటీవలన ఉన్నత అధికారుల్లోను, అధిపతు (స్థానిక) ల్లోను మూడు వర్గాలుగా విభజన తప్పదు. అందుకే థియర్స్ పదవిలో ఉన్నప్పుడు "మనల్ను రిపబ్లిక్ అంతగా విడదీయలేద" ని అనేవాడు. ఎందుకంటే రిపబ్లిక్‌లో ఎన్నికద్వారా ఎవరో ఒకరు అధ్యక్షపీఠాన్ని అధిష్టించవచ్చు. కాని రాచరిక విధానంలో రాజవంశంనుండి, దాని ఉపశాఖలనుండి అనేకులు సింహాసనం కొరకు పోటీపడతారు. వారిలో వారికి తీవ్రమైన స్పర్థలు, ఏర్పడి దేశంలోని అంతర్గత పరిపాలన కల్లోలపూరితం అవుతుంది. కనుక సింహాసనానికి వారసుని ఎన్నిక కొంత కల్లోలాలను రేపుతుందని అతని భావం. అయితే, మొదటివాడు కౌంట్ ఆఫ్ ఛాంబర్డ్ సంతానం లేనివాడు, కనుక అతన్ని రాజుగాచేసి, అతని వారసునిగా కౌంట్ ఆఫ్ పారిస్‌ను గుర్తించడానికి ఒక అంగీకారం కుదిరింది. కాని కౌంట్ ఆఫ్ చాంబర్డ్ బూర్బన్ వంశీయులు ఫ్రెంచి విప్లవం పట్ల, ఆ విప్లవం తాలూకు చిహ్నాలపట్ల ఎంత అసహనం కలిగి ఉన్నారో దీనిని బట్టి గ్రహించవచ్చు. వెనుకటి బూర్బన్ వంశీయుల రాజపతాకాన్ని పునరుద్ధరించి, 1789 విప్లవ కాలంనాటి మూడురంగుల పతాకాన్ని రద్దుచేయవలసిందిగా విధించాడు.

కౌంట్ ఆఫ్ చాంబర్డ్ విధించిన షరతు రిపబ్లిక్‌వాదుల్లోనే కాక సాధారణ ప్రజానీకంలో కూడ తీవ్రమైన అభ్యంతరాలను కలిగించింది. రాజకీయవ్యవస్థగా రిపబ్లిక్ విఫలం కావచ్చు, రిపబ్లిక్ విప్లవ ఫలితమేకావచ్చు - కాని విప్లవం ప్రజల్లోని తారతమ్యాలను తొలగించి సమానత్వాన్ని వ్యక్తిస్వేచ్ఛను కలిగించిన విషయం వారు అత్యంత ప్రియమైనదిగా భావించడంలో అసహజమేమీలేదు. ఈ పరిస్థితిలో కౌంట్ ఆఫ్ చాంబర్డ్ పోటీనుండి తప్పుకున్నాడు, రాచరికాన్ని పునరుద్ధరించే ప్రయత్నం కలిసిరాలేదు. అందుచేత ఫ్రాన్సుదేశానికి రిపబ్లిక్ విధానంలో పరిపాలన నిర్వహించేందుకు రాజ్యాంగచట్టం అవసరం అయింది.

జాతీయసభ మూడో ఫ్రెంచిరిపబ్లిక్‌కు రాజ్యాంగ చట్టాన్ని చేయడానికి పూనుకొని, ఆ కార్యక్రమాన్ని 1875 లో పూర్తిచేసింది. ఈ రాజ్యాంగం ప్రకారం ప్రజలచేత ఏడు సంవత్సరాల పదవీకాలానికి ఎన్నుకోబడే అధ్యక్షుడు ప్రభుత్వాధినేతగా ఉంటాడు. సెనెట్ అనే ఎగువసభ, ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ అనే దిగువసభతో కూడిన శాసననిర్మాణశాఖ (Legislature) ఉంటుంది. దిగువ సభనుండి ఏర్పడే మంత్రివర్గం చేతుల్లోనే శాసన నిర్మాణాధికారం ఉంటుంది. మంత్రివర్గం శాసనసభకే జవాబుదారులు. అధ్యక్షుని అధికారం నామమాత్రమే, అధికారం యావత్తు మంత్రివర్గం చేతుల్లోనే ఉంటుంది. ఈ విధంగా 1875 నాటికి ఫ్రాన్సుదేశానికి యథార్థమైన ప్రజాస్వామ్యవ్యవస్థ ఏర్పడింది.

ఐదు సంవత్సరాలపాటు ఫ్రాన్సుదేశాన్ని పరిపాలించి, రిపబ్లికన్ రాజ్యాంగాన్ని నిర్మించి ఇచ్చి, ఆ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌ను, సెనెట్‌ను ఏర్పరచి, 1876 వ సంవత్సరం ప్రారంభంలో జాతీయసభ రద్దయింది.

### 10.4.2 మూడో రిపబ్లిక్ సుస్థిరం కావడం :

రాజ్యాంగ నిర్మాణంచేతనే ఫ్రెంచి మూడో రిపబ్లిక్‌కు సుస్థిరం ఏర్పడలేదు. అధ్యక్షుడైన మెక్‌మహాన్ రాచరికవాది. అతనికి రాజ్యాంగబద్ధంగా ఏ అధికారములేని అలంకారప్రాయమైన పదవి సంతృప్తికరం కాలేదు. ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో రిపబ్లిక్‌వాదుల ప్రాతినిధ్యం బాగానే ఉంది, కాని సెనెట్‌లో రాచరికవాదులకంటె కొంచెం తక్కువే. 1877లో అధ్యక్షుడు రిపబ్లికన్‌వాదుల మంత్రివర్గాన్ని బర్తరఫ్‌చేసి, డ్యూక్ ఆఫ్ బ్రోగ్లీ (Duke of Brogile) ని ప్రధానమంత్రిగా నియమించాడు. డ్యూక్ ఆఫ్ బ్రోగ్లీ రాచరికవాది. మంత్రివర్గాన్ని తొలగించినపుడు రాజ్యాంగం ప్రకారం శాసనసభలు రద్దవుతాయి. అలాగే శాసనసభలను రద్దుచేసి, మరల ఎన్నికలు జరిపించాడు మెక్‌మహాన్, ఆ ఎన్నికల్లో రాచరికవాదులు మతాధిపతులతో చేయికలిపి పోరాడారు. అయినా ఆశించిన విధంగా ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో ఆధిక్యత (Majority) సాధించలేకపోయారు. వారికంటే రిపబ్లికన్‌లకు నూరు పైగా స్థానాలు లభించాయి. ఆ మరుసటి సంవత్సరం, 1878 లో సెనెట్‌కు జరిగిన ఎన్నికల్లో సైతం రిపబ్లికన్‌లకు స్పష్టమైన ఆధిక్యత లభించింది. ఈ ఫలితాలతో మెక్‌మహాన్ పదవీ విరమణ చేశాడు. 1879 లో రిపబ్లికన్ వర్గానికి చెందిన గ్రేవీ (Grevy) అధ్యక్షుడైనాడు. ఈ రాజకీయ పరిణామాలు క్రమంగా ఫ్రెంచి ప్రజానీకం రాచరికంపై ఆపేక్షను పోగొట్టుకొంటున్నట్లు, ముఖ్యంగా వారు మతాధిపతులతో చేయికలిపి పోరాడడం 1789 పూర్వంనాటి పరిస్థితులను పునరావృతం చేయవచ్చనే భయాందోళనలను వారిలో వ్యాపిస్తున్నట్లు సూచిస్తాయి. అందుచేత క్రమంగా వారికి రిపబ్లిక్ వ్యవస్థ పట్ల ఆసక్తి అధికమవుతున్నట్లు గ్రహించవచ్చు.

ఉభయ శాసనసభల్లోను, స్పష్టమైన బలం సంపాదించిన రిపబ్లికనులు లోగడకంటే మరింత ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో తమ రాజకీయ కార్యాచరణను ప్రారంభించగలిగారు. దేశంలోనుండి, వెలుపలినుండి ఉత్పన్నమైన అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను ఆలోచించే పత్రికలపై విధించిన ఆంక్షలను తొలగించి, స్వేచ్ఛనిచ్చింది.

ప్రజల్లో రాజకీయ చైతన్యానికి, మూలాధారమైంది విద్యావిధానం. దేశప్రజలకు, విజ్ఞానము, వివేకము, శాస్త్ర సాంకేతిక నైపుణ్యము కల్పించడం, యావత్ప్రజానీకానికి ప్రాంత, మత ప్రభావాలకు అతీతమైన జాతీయభావాలను కలిగించడానికి సరైన విద్యావిధానం అవసరం. దేశమంతటా ఒకే విద్యావిధానం, ఒకే విధమైన బోధనాంశాలు (Subjects of study) ఉండడంచేత,

యావత్ప్రజానీకము వైజ్ఞానికంగా పురోగమించడమే కాక జాతీయసమైక్యతను కూడ పెంపొందించుకోగలుగుతుంది. రిపబ్లిక్ వ్యవస్థ బలోపేతమై, సక్రమంగా పనిచేయడానికి అటువంటి జాతీయసమైక్యత ప్రజానీకంలో ఆశించిన రీతిలో, అవసరమైన రాజకీయచైతన్యం కలిగించగలదు. ప్రాథమిక స్థాయినుండి, మాధ్యమిక, ఉన్నత స్థాయివరకు ఆధునిక విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడానికి ఈ జాతీయవిద్యావిధానం (National Education) తోడ్పడింది. ఫ్రాన్సులో 1789 విప్లవానంతరం కొలదికాలాన్ని మినహాయిస్తే విద్యాబోధన, వైజ్ఞానిక అభివృద్ధి మతవ్యవస్థ చేతుల్లోనే ఉన్నాయి. ఈ జాతీయ విద్యావిధానం విద్యావ్యవస్థను మతవ్యవస్థ ఆధీనం నుండి శాశ్వతంగా విడుదల చేసింది. అంతేకాక ఈ విద్యావిధానం సంపూర్ణంగా విద్యాలయాల్లో మతవ్యవస్థకు చెందిన వారి నియామకాన్ని నిషేధించింది. మతవ్యవస్థ నిర్వహించే విద్యాసంస్థలు జాతీయవిద్యావ్యవస్థకు సంబంధించినవిగా ప్రకటించడం జరిగింది. అనగా అవి కేవలం మతబోధకు, మతవ్యవస్థకు అవసరమైన ఉద్యోగులను తయారు చేయడానికే ఉద్దేశించబడినవిగా సాధారణ విద్యాసంస్థలుగా అనర్హమైనవిగా ప్రకటించడం జరిగింది.

అధ్యక్షునిగా గ్రేవీ పరిపాలించిన కాలంలో ఫ్రాన్స్ తన వలసరాజ్యాల విస్తరణలో (Prolectorate) బాగా పురోగతి సాధించింది. ఆఫ్రికా ఉత్తరతీరంలో ఫ్రెంచి వలసలను ఏర్పరచడమూ, ట్యూనిసియాను ఫ్రెంచి రక్షకరాజ్యంగా గుర్తించి, క్రమంగా ఫ్రెంచిపాలన లోనికి తీసుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టడము జరిగింది. ఆగ్నేయాసియాలోని ఫ్రెంచి వలసరాజ్యమైన ఇండో - చైనా మరింతగా విస్తరించి, అన్నామ్, టోంకినలను కూడ ఆక్రమించింది. ఇవికాక, పందొమ్మిదో శతాబ్ది తుదిపాదంలో ఐరోపాదేశాల్లోని ఆఫ్రికా కొరకు జరిపిన కుమ్ములాట (Reramble) లో ఫ్రాన్సు చురుకుగా పాల్గొని, ఆ ఖండంలోని పశ్చిమ భాగాల్లో విస్తృతమైన వలసరాజ్యం నెలకొల్పింది.

### 9.4.3 మూడో రిపబ్లిక్ బలహీనతలు, బలవంతం కావడం :

అయిదు సంవత్సరాల కాలంలోనే రిపబ్లిక్ సాధించిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజాబాహుళ్యం ప్రశంసలు పొందాయి. ఇంచుమించుగా రాచరికవ్యవస్థ పునరుద్ధరణ గూర్చిన ఆశయాలు అంతరించాయి. అటువంటి ప్రమాదాలకు ఆస్కారంలేని సుస్థిరత్వాన్ని రిపబ్లిక్ సాధించింది. ఆ ధైర్యంతోనే 1884 లో రిపబ్లికన్ రాజ్యాంగానికి భిన్నసవరణలు చేయడం జరిగింది. అందులో మొదటిది రిపబ్లిక్ స్వరూపస్వభావాలను మార్చడానికి భవిష్యత్తులో ఎటువంటి రాజ్యాంగ సవరణ చేయడాన్ని నిషేధించడం; రెండవది రిపబ్లిక్ అధ్యక్ష పదవికి పోటీచేయడానికి పూర్వపు రాజవంశీయులను ప్రభువర్గానికి చెందినవారి సంతతిని, అనర్హులుగా ప్రకటించడం. పూర్వపు రాజవంశాలకు చెందినవారు 1830 లో లూయీ ఫిలిప్ (ఆర్లియన్ వంశానికి చెందినవాడు) 1848 లో లూయీ నెపోలియన్ (బోనాపార్టీ వంశానికి చెందినవాడు) రిపబ్లికన్ వ్యవస్థలో అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత నిరపేక్ష ధాచరిక వ్యవస్థను నెలకొల్పిన ఉదాహరణల వలన రాజవంశీయులకు రిపబ్లిక్ పూర్తిగా విరుద్ధవిధానమనీ, వారెన్నడూ ఈ విధానాన్ని బ్రతికి బట్టకట్టనీయరని ఫ్రెంచిప్రజలకు స్పష్టమైంది. వారికి క్రమంగా రిపబ్లిక్ వ్యవస్థపట్ల విశ్వాసం బలపడుతున్నది. కనుక అటువంటి నియమనిషేధాలను ఫ్రెంచి రిపబ్లిక్ ధైర్యంగా రూపొందించింది. ఈ సవరణలను అమలుచేస్తూ, 1886 లో పూర్వపు రాజవంశీయులు, వారి సన్నిహిత బంధువులను దేశంనుండి వెళ్ళగొట్టడం జరిగింది.

కాని రిపబ్లికన్ వ్యవస్థలో ప్రజాస్వామ్య పరిపాలనా విధానంలోని, అత్యంత తీవ్రమైన లోపం అభిప్రాయబేధాలవలన ఏర్పడే అనైక్యతలు. ఈ అభిప్రాయబేధాలు దేశాభివృద్ధికై రూపొందించే ప్రణాళికల సందర్భంగా, భిన్నదృక్పథాలను ప్రతిపాదించడం వల్ల కలుగవచ్చు. ఒక్కొక్క రాజకీయపక్షం, ఒక్కొక్కవిధంగా, వ్యవసాయాభివృద్ధిని కొందరు సమర్థిస్తే, పారిశ్రామికాభివృద్ధిని కొందరు సమర్థించడం, పత్రికలకు, ఇతర సమాచార సౌకర్యాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కొందరు వాదిస్తే దేశ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైనంతవరకే అనుమతించాలని కొందరు వాదిస్తూ, ఈ విధంగా అభిప్రాయబేధాలు, ఒకరితో ఒకరు సహకరించుకోని అనైక్యత ఏర్పడడం సహజం. అంతకుమించి, స్వార్థపరత్వంతో, పదవీ వ్యామోహంతో, సిద్ధాంతాల

ముసుగులో రాజకీయనాయకులు ఆడే అధికారక్రీడ (game of power) పైనున్న వాణ్ణి పడగొట్టి పైకి ప్రాకాలనుకునే రాజకీయం ఈ అధికారక్రీడ, మానవ సహజమైన దౌర్బల్యంనుండి పుట్టుకొచ్చేది. మూడోది ప్రజాపాలన వ్యవస్థకు మూలమైన స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం. పరిపాలన ప్రజలది కనుక, ప్రజలంటే మనమే కనుక, ప్రభుత్వసొత్తు మనదే. మనం దానిని కొల్లగొట్టడానికి హక్కుదారులమని భావించుకొని, అవినీతికి, అక్రమాలకు పాల్పడి, స్వప్రయోజనాలను సాధించుకోవడం, ఈ విధమైన జాడ్యాల నుండి మూడో ఫ్రెంచిరిపబ్లిక్ కొంతవరకు అప్రతిష్ఠపాలవడం, కొంత బలహీనం కావడం, క్రమంగా వాటిని సరిదిద్దుకొని అసమర్ధతలనుండి, అవినీతినుండి బయటపడే ప్రయత్నాలు చేయడం జరిగింది.

పైన వివరించినట్లు ప్రజలనుండి వచ్చిన నాయకులు ప్రజాసమస్యలపట్ల, వాటి పరిష్కారం పట్ల భిన్నదృక్పధాలను కలిగి అనేక వర్గాలుగా, పక్షాలుగా చీలిపోవడం, వారిలో సమన్వయం లోపించడంచేత తరచుగా మంత్రులను తొలగించి అనుకూలురైన వారిని నియమించడం రిపబ్లిక్ ప్రజల దృష్టిలో తేలిక చేసింది. ప్రజాపాలనావ్యవస్థ (Republic) చేసిన అనేక పనులు ప్రత్యర్థుల తీవ్ర విమర్శలకు గురికావడం, ఆ విమర్శలనుండి పుట్టుకొచ్చే వైరుధ్యాలు మరొక తీవ్రమైన తిరుగుబాటుకు దారితీయగలవన్న భయం సాధారణమైంది. వాటిలో ప్రధానమైన సంఘటనలను, వాటినుండి ఫ్రెంచి రిపబ్లిక్ బయటపడి బలోపేతమైన విధానము ఈ క్రింద వివరించడము జరిగింది.

### 9.4.3.1 బోలంగర్ ప్రమాదం :

1887లో గ్రేవీ అధ్యక్షునిగా ముగిసి, అతని స్థానంలో కార్నొట్ (Carnot) పదవిని అధిష్టించాడు. కాని ఆ సమయంలో రక్షణ శాఖమంత్రి (Minister for war) అయిన జనరల్ బోలంగర్ (Boulanger) ప్రముఖమైనాడు. అతడు నెపోలియన్ బోనాపార్టీవలె, రిపబ్లిక్‌వలె పడద్రోసి అధికారం చేజిక్కించుకోగలడని ప్రజలు భావించారు. బోలంగర్ రిపబ్లికన్ రాజ్యాంగాన్ని సవరించవలసి ఉందని వాదించాడు. అతడు ఎన్నికల్లో పెద్దమెజారిటీతో ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌కు ఎన్నికైనాడు. అతడు నియంతృత్వాధికారాన్ని చేపట్టినట్లయితే ప్రతిఘటన లేకుండ రిపబ్లిక్‌ను రద్దుచేయగలిగేవాడు. రిపబ్లికన్ వాదులు అతడు దేశక్షేమాన్ని పణంగా పెట్టి, శత్రువులతో చేరి కుట్రచేసినట్లు ఆరోపించారు. అప్పటికే అతడు తనకు ప్రాప్తించిన అవకాశాన్ని ఉదాసీనంగా జారవిడవడం చేత ప్రత్యర్థులకు అటువంటి అవకాశం కలిగింది. రిపబ్లికన్‌ల ఆరోపణలకు జవాబు చెప్పలేక, బోలంగర్ హాలెండ్‌కు పారిపోయి బ్రస్సెల్స్ నగరంలో నివసిస్తూ, ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విధంగా మరొక తిరుగుబాటు ప్రమాదం రిపబ్లిక్‌కు తప్పిపోయింది కాని, అందుకు అవకాశం వ్యవస్థలోని బలహీనత అనే విషయం, దానికి ప్రముఖనాయకుల నడుమ సైద్ధాంతికవిభేదాలు వ్యక్తిగత వైరుధ్యాలుగా పరిణమించడమేనని మాత్రం సరిగా గుర్తింపు రాలేదు.

### 9.4.3.2 పనామా కాలువ - అవినీతి :

అమెరికాఖండంలో ఉత్తర, దక్షిణ అమెరికా భూభాగాలకు నడుమనున్న పనామా జలసంధి (Isthumas of Panama) వద్ద నౌకాయానానికి అనువైన, లోతైన కాలువ నొకదానిని త్రవ్వడానికి మూడో నెపోలియన్ చక్రవర్తి యోచించిన విషయం పైన వివరించడం జరిగింది. కాని ఆ తరువాత అనతికాలంలోనే అతడు జర్మనీచేత ఓడి, పదవీభ్రష్టుడైనాడు. మూడో ఫ్రెంచి రిపబ్లిక్ ఏర్పడిన తరువాత గ్రేస్ అధ్యక్షునిగా పరిపాలించిన కాలంలో ఆగ్నేయాసియాలో ఫ్రెంచి వలసరాజ్యం మరింతగా విస్తరించి, దేశ ఆర్థిక వ్యవస్థకు ఆలంబన అయింది. అందుచేత స్వదేశంనుండి వలసరాజ్యాలకు సన్నిహిత సంబంధం అవసరమై అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలుపుతూ పనామా కాలువ నిర్మాణానికి మరల ఆలోచనలు ప్రారంభమైనాయి.

మూడో ఫ్రెంచిరిపబ్లిక్ పనామాకాలువ నిర్మాణానికై ఒక నిర్మాణసంస్థను (Corporation) 1886 లో నెలకొల్పింది. దానికి ఆర్థికవనరులకై అనేక యూదు (Jew) వడ్డీవ్యాపారస్థులనుండి హెచ్చువడ్డీలపై ఋణాలు తీసుకోవడం జరిగింది. సూయజ్ కాలువను నిర్మించిన ఇంజనీరు ఫెర్డినాంజ్ డి లెస్సెప్స్‌ను ఈ కాలువ నిర్మాణానికి కూడ సాంకేతిక సలహాదారుగా

ప్రభుత్వం నియమించింది. అయితే అనేక కారణాల వలన కాలువనిర్మాణం అనుకున్నవిధంగా ప్రారంభంకాలేదు, పురోగతి సాధించలేదు. కాని 1889 లో పనామా కార్పోరేషన్ ఋణాలు చెల్లించలేక దివాలా తీసింది. ఇందుకు కారణాలను ప్రభుత్వం దర్యాప్తు జరిపించగా సంస్థ డైరెక్టర్లు అనేకవిధాలుగా అవినీతికి పాల్పడినట్లు, వారి అవినీతిలో కొందరు మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు ప్రమేయం ఉన్న సంగతి, ఇంజనీరు లెస్సెప్స్ కూడా అవినీతికి పాల్పడి, తన అక్రమాలకు రక్షణ కొరకు మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు లంచము ఇచ్చినట్లు వెల్లడి అయింది. ఈ అవినీతి వ్యవహారాలు బట్టబయలు కావడంతో రిపబ్లిక్ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి ఏర్పడింది.

### 9.4.3.3. డ్రైఫ్యూస్ ఉదంతం :

ఫెలిక్స్ ఫారే (Felix Faure) అధ్యక్షునిగా ఉన్న కాలంలో (1895 - 99) జరిగిన డ్రైఫ్యూస్ వ్యవహారం వలన పరిపాలనావ్యవస్థలు అసమర్థులకు, అవినీతిపరులకు, ఆశ్రయాలని ప్రజల నిరసనకు గురైనాయి. పరిపాలనలో అసమర్థులకు తోడుగా తీవ్రజాప్యానికి ఆ ప్రభుత్వవ్యవస్థ కారణమని కూడా ప్రజలు మూడో రిపబ్లిక్‌ను నిందించారు.

డ్రైఫ్యూస్ అనే యూదు జాతీయుడు ఫ్రెంచి సేనల్లో కెప్టెన్ హోదాలో ఉన్నాడు. 1894 వ సంవత్సరంలో అతడు దేశద్రోహానికి పాల్పడి సైనిక సమాచారాన్ని రహస్యంగా జర్మనీకి అందించాడన్న అభియోగంపై సైనిక న్యాయస్థానంలో విచారణకు గురైనాడు. కోర్టు మార్షల్ (సైనిక న్యాయస్థానం) విచారణలో అతనిపై అభియోగం ఋజువైంది. అతని చేతివ్రాతలో బోర్డేరో (bordereau) అనే ఒక రహస్యపత్రం లభించడంతో అతని నేరం నిరూపణ అయింది. కోర్టు ఫ్రెంచిగయానాలోని డెవిల్స్ ద్వీపంలో అతనికి ఖైదు శిక్ష విధించింది.

డ్రైఫ్యూస్ బోర్డేరో పత్రం తాను వ్రాయలేదని, ఈ అభియోగంలో నిజం లేదని, తన నిర్దోషిత్వాన్ని తీవ్రంగా సమర్థించుకున్నారు. 1886 లో కల్నల్‌పికార్డ్ (Colonel Picquart) డ్రైఫ్యూస్ వాదనలో నిజం ఉందని అభిప్రాయపడి, బోర్డేరో పత్రం వ్రాసినవాడు మేజర్ ఎస్టేర్‌హేజీ (Major Esterhazy) అని, అతడు డ్రైఫ్యూస్‌ను ఈ కేసులో ఇరికించడానికి కుట్ర చేశాడని వాదించాడు. కాని సరైన విచారణ జరుగక ఈ వాదన వీగిపోయింది.

అయితే ఈ వ్యవహారానికి విపరీతమైన ప్రచారం ఏర్పడి, కొద్దికాలంలో ఫ్రెంచి ప్రజానీకంలో డ్రైఫ్యూస్ అనుకూల, ప్రతికూల వర్గాలు ఏర్పడ్డాయి. ఈ వర్గాలుగా విడిపోవడం రిపబ్లిక్ అనుకూల, ప్రతికూల వర్గాలుగా పరిణమించి, రిపబ్లిక్ సుస్థిరత్వానికి మరో ప్రమాదం ఏర్పడింది. ప్రతికూల వర్గంలోని, రాచరికవాదులు రిపబ్లిక్ అసమర్థవ్యవస్థకు అవినీతికి, అవకాశం కల్పిస్తున్నదని అందుచేత అది అవాంఛనీయమని వాదించారు. మతాధిపతులు రిపబ్లిక్ చేపట్టిన మతవ్యతిరేక సంస్కరణలను ఖండించి, తిరిగి మతవ్యవస్థను బలోపేతం చేసి, దాని ప్రాముఖ్యతను పునరుద్ధరించాలని వాదించారు. యూదులు సెమిటిక్ (Semetic) జాతికి చెందినవారు, ఐరోపాలోని అన్ని ప్రధాన దేశాల్లోను స్థిరపడి, వర్తకవాణిజ్యాల్లో, విద్యా, వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో, సైనిక సర్వీసుల్లో అత్యంత ప్రాముఖ్యతను సంపాదించినవారు. వారు ఏ దేశంలోని ప్రజలతోను కలవక క్రీస్తుపూర్వం నాటి తమ మతాచారాలను అనుసరిస్తూ, జాతీయరాజ్యవ్యవస్థలకు కంటిలో నలుసువలె ఏర్పడి ఉన్నారు. అందుచేత అన్ని ఐరోపా దేశాల్లో వారిపట్ల ద్వేషభావం ఏర్పడి, వారిని అన్నిరంగాల్లో అణచివేయడానికి మారణకాండతో వారి జాతిని రూపుమాపడానికి వివిధ దేశాల్లోని ప్రజలు, ప్రభుత్వాలు పట్టుదల పూనినాయి.

కాని డ్రైఫ్యూస్ ఉదంతంవలన రెండు రాజకీయవర్గాలు సైన్యం పూర్తిగా ప్రభుత్వాధీనంలోనే కాని స్వతంత్రహోదా కలిగి ఉండరాదని, సైనిక ప్రాబల్యం ప్రభుత్వ వ్యవస్థలను బలహీనపరుస్తుందని, కనుక సైన్యంలో ఏర్పడే అవినీతిని కఠినంగా అణచివేయడం అవసరమనే భావం వృద్ధిచెందింది.

మేజర్ ఎస్టర్ హెజీపై తూతూమంత్రంగా విచారణ జరిగి, అతన్ని నిర్దోషిగా భావించి వదలివేసినంతమాత్రాన డ్రైఫ్యూస్ వ్యవహారం ముగింపుకు రాలేదు. ఎమిలీజోలా (Emile Zola) అనే తీవ్ర సామ్యవాద రచయిత, రిపబ్లికన్, ఎస్టర్‌హేజీని విచారించిన సైనిక న్యాయస్థానంలోని న్యాయాధిపతుల పక్షపాత ధోరణిని, అవినీతిని, బట్టబయలు చేస్తూ, పత్రికల్లో వ్యాసాలు ప్రచురించాడు. ఆ కారణంగా జోలాను కోర్టుకీడ్చి విచారించడము, శిక్ష విధించడమూ జరిగింది, కాని బ్రిటన్‌కు పారిపోయి, అతడు శిక్ష తప్పించుకున్నాడు.

ప్రభుత్వం తన చర్యను సమర్థించుకోడానికి, డ్రైఫ్యూస్ నేరాన్ని బుజావు చేసాడు. మూడు ముఖ్యమైన పత్రాలను ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ నుండి విడుదల చేసింది. కల్నల్ పికార్డ్ వీటిలోని రెండింటిని అసలు డ్రైఫ్యూస్ వివాదంతో సంబంధంలేదని, మూడోది కల్పితం (Forgeo) అని వాదించాడు. తరువాత కొద్దిరోజులకు కల్నల్ హెన్రీ అనే సేనాధిపతి ఆ పత్రాన్ని కల్పించింది తానేనని అంగీకరిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. కాని ప్రభుత్వం డ్రైఫ్యూస్‌పై అభియోగాన్ని విరమించవలసిన పనిలేదని, మరో న్యాయస్థానానికి (Court of Cassation) బదిలీ చేసింది. ఆ తరువాత కొద్దిరోజులకు మేజర్ ఎస్టర్‌హేజీ బోర్డెపత్రాన్ని సృష్టించింది తానేనని అంగీకరించి ఇంగ్లాండుకు పారిపోయాడు. కోర్ట్ ఆఫ్ కాసేషన్ పూర్వపు కోర్టు తీర్పును రద్దుచేసి, తిరిగి డ్రైఫ్యూస్‌పై విచారణ జరిపించి, నిజాన్ని నిరూపించవలసినదిగా ఆదేశించింది.

డ్రైఫ్యూస్‌ను జైలు నుండి ఫ్రాన్సుదేశానికి తిరిగి తీసుకొని వచ్చి మరల కేసు విచారణ ప్రారంభించారు. విచారణను ఆటంకపరచడానికి, డ్రైఫ్యూస్‌పై నేరం నిరూపణ కావడానికి ప్రత్యర్థులు తీవ్రప్రయత్నాలు చేశారు. మొత్తం మీద విచారణ అనంతరం 5:2 నిష్పత్తిలో అతనిమీద రెండవసారి నేరాన్ని బుజావు చేస్తూ వోట్లు పడినాయి. డ్రైఫ్యూస్‌కు పదేళ్ళు కఠినశిక్ష విధించడం జరిగింది. కాని అప్పుడు ఎన్నికల్లో గెలిచి, అధ్యక్షస్థానాన్ని అధిష్ఠించిన లోబట్ (Loabat) డ్రైఫ్యూస్‌కు క్షమాభిక్ష పెట్టి శిక్ష రద్దుచేశాడు.

### 9.3.4.3 డ్రైఫ్యూస్ వివాదం రిపబ్లిక్‌కు ప్రయోజనం :

ఈ వివాదం ఆనాడు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం పొందింది. డ్రైఫ్యూస్ వ్యతిరేకులు సైన్యంలో అవినీతిని నిరోధించి, దానికున్న ప్రాధాన్యతను, ప్రామాణిక విలువలను సంరక్షిస్తున్నట్లు భావించారు. కాని సాధారణ ప్రజలు ఫ్రెంచిసేనల విలువలు అడుగంటాయని, క్రమశిక్షణారాహిత్యానికి, అవినీతికి అది ఆలవాలమైందని నిశితంగా విమర్శించారు. డ్రైఫ్యూస్, అతని మిత్రులు క్షమాభిక్ష కాక, అతని నిర్దోషిత్వం బుజావుచేయడానికి పట్టుబట్టారు. 1906 లో మరొకసారి ఈ వివాదం కోర్ట్ ఆఫ్ కాసేషన్ ముందుకు వచ్చింది; ఆ న్యాయస్థానం రెండవసారి విచారించి శిక్షించిన సైనిక న్యాయస్థానం తీర్పును రద్దుచేసి, డ్రైఫ్యూస్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అతడు తిరిగి తన పూర్వపుపదవిలో నియామకాన్ని పొందాడు, తరువాత పదోన్నతులు ఉన్నత సైనికపురస్కారం అయిన (Cross of Legion of Honour) ను పొందాడు. డ్రైఫ్యూస్ వివాదం ఫ్రాన్స్‌లోని రిపబ్లికన్‌లను, సామ్యవాదులను సమీకరించి, సన్నిహితులను చేసి, తద్వారా రిపబ్లిక్‌ను బలోపేతం చేసింది. రాచరికవాదులు, ఇతర సాంప్రదాయ సంరక్షణవాదులు (Conservatives) ఇకపైన రిపబ్లిక్‌ను కూలద్రోసే ప్రయత్నాలు నిష్ఫలమైనవని గుర్తించి, ఈ వ్యవస్థతో సరిపెట్టుకొని పోవలసిన స్థితికి చేరారు.

### 9.4.3.5 డ్రెఫ్యూస్ వివాదం మతవ్యవస్థ :

డ్రైఫ్యూస్ ఉదంతం మతవ్యవస్థ ఆధిపత్యానికి కూడ చరమగీతం పాడింది. రాచరికవాదులతో చేయికలిపి, రిపబ్లిక్‌ను అప్రతిష్ఠపాలు చేయడానికి, అస్థిరంచేసి కూలద్రోయడానికి వారు చేసిన ప్రయత్నాలు సాధారణ ప్రజానీకంలో తీవ్రమైన అసహ్యం కల్గించాయి. ఆ కారణంగా రిపబ్లిక్ మతవ్యవస్థను మరింతగా, దానికి అర్హమైనస్థితికి తగ్గించడానికి ప్రయత్నించడానికి ప్రజానీకానికి అభ్యంతరం కాలేదు.

1880 నుండి సమైక్యమైన జర్మనీలో ప్రధానమంత్రి అయిన బిస్మార్క్ కూడ మతవ్యవస్థ ఆధిక్యతను తగ్గించుకునేందుకు సాంస్కృతిక పోరాటం (Culture Kamph) అనే పేర తీవ్రమైన అణచివేత చర్యలు చేపట్టాడు. ఈ రెండు దేశాల్లోని మతవ్యవస్థ ప్రధానంగా కాథలిక్ మతానికి చెందిన పోప్‌తో సాంస్కృతికమైన, ఆర్థికమైన అనుబంధం కలిగింది. విదేశీయుడైన పోప్ ఆధిపత్యాన్ని ఆమోదించి, అనుసరించడంతో ప్రారంభమై, దేశీయ రాజ్యవ్యవస్థలను తన ఆధిక్యానికి గురిచేసే విధంగా ఈ రెండు దేశాల్లోను పరిస్థితి సమానంగానే ఉంది. అయితే బిస్మార్కు కమ్యూనిస్టుల వలన ప్రమాదం మరింత ప్రబలం అవుతుందని గుర్తించినపుడు కాథలిక్ మతవ్యవస్థతో కొంతవరకు సమాధానపడ్డాడు. కాని ఫ్రాన్స్‌లో సామ్యవాదులు (Socialists) రిపబ్లికన్‌లతో కలసి ఒకవర్గంగా ఏర్పడినందున వారు కమ్యూనిస్టులుగా, ప్రబలమైన ప్రమాదకారులుగా మారలేదు. కనుక ఫ్రాన్స్‌లో మతవ్యవస్థ ఆధిపత్యం పూర్తిగా క్షీణించేవరకు ప్రభుత్వం అవసరమైన అణచివేత చర్యలను తీసుకోగలిగింది. ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటంటే, సమైక్యజర్మనీ రాజవ్యవస్థలో ఉండడాన, మతవ్యవస్థతో బాటుగా సామ్యవాదాన్ని, అది ప్రచారం చేస్తున్న శ్రామికవిప్లవసిద్ధాంతంలో కలిసిన కమ్యూనిజాన్ని కూడ ప్రమాదకరంగానే భావించింది. కాని ఫ్రాన్సులో సామ్యవాదం రిపబ్లికన్ వాదంతో కలిసింది, రెండూ కలిసి రాచరికవాదాన్ని తుదముట్టించాయి. కనుక అది ప్రమాదకరంగా పరిణమిస్తుందనే భయానికి ఆస్కారం లేదు. మూడవ కారణమేమిటంటే, నిరపేక్ష రాజ్యవ్యవస్థలు అప్పటికప్పుడు ఉదారవాదానికి వ్యతిరేకంగా ఉండి మతవ్యవస్థను ఆలంబనగా చేసుకొని బలపడడానికి ప్రయత్నిస్తున్నాయి. కనుక అప్పటికి ఇంకా జర్మనీలో కాథలిక్ మతవ్యవస్థ ప్రబలంగానే ఉంది. ఒక్కసారిగా దాని ఆధిక్యతను తగ్గించడం సాధ్యంకానిది. ఫ్రాన్సులో 1789 విప్లవ కాలంనుండి క్రమక్రమంగా ఉదారభావాల వ్యాప్తి జరుగుతూ నిరపేక్షరాచరికాన్ని, మతవ్యవస్థను రెండింటిని ఏకకాలంలో ఎదిరించి పోరాడటం జరుగుతున్నది. కనుక ఆ దేశంలో మతవ్యవస్థ అప్పటికే ప్రజాదరణ కోల్పోయింది. కనుక రిపబ్లిక్ సులభంగా దానిని అదుపు చేయగలిగింది.

1899 లో వాల్డాక్ రూసో ఫ్రెంచి రిపబ్లిక్‌కు ప్రధానమంత్రి అయ్యాడు. అతడు రిపబ్లికన్. సామ్యవాదుల సంయుక్త కూటమి (block) మద్దత్తు పొందినవాడు. 1901 లో అతడు చేసిన లా ఆఫ్ అసోసియేషన్స్ (Law of Associations) మతవ్యవస్థను అదుపు చేయడానికి, రిపబ్లిక్ వ్యవస్థను బలపరచడానికి మరింత దోహదం చేసింది. అంతకు పూర్వం ఫ్రాన్సులో ఇరవైమందికి మించి ఒక సంఘంగా, సంస్థగా ఏర్పడడానికి ప్రభుత్వ అనుమతి అవసరం అయ్యేది. లేనట్లయితే అటువంటి సంఘాలను చట్టవిరుద్ధంగా నిర్ణయించి, చర్యతీసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే ఈ న్యాయచట్టాన్ని పటిష్ఠంగా అమలు జరిపేవారు కారు. అనేక మతసంస్థలు ఈ విధమైనవి ఏర్పడి పనిచేస్తూ ఉన్నాయి. ఆ సంస్థల్లోని సభ్యులు మతవ్యవస్థ నిర్వహించే అనేక విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండేవారు. రిపబ్లిక్ ఫ్రాన్స్‌లో విద్యావిధానాన్ని మతవ్యవస్థ ఆధిపత్యం నుండి తప్పించదలచినందున ఇటువంటి సంస్థలు, వాటిలోని మతాచార్యులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు రిపబ్లిక్ బలోపేతంకావడానికి అవరోధంగా భావించింది. వాల్డాక్ - రూసో ఈ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూటమి (Block) సంపూర్ణమైన ఆమోదం తెలిపింది. ఈ చర్య ఫ్రాన్స్‌లో కల్చర్‌కాంఫ్ (Culture Kamph) వంటిది. వారు రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో మతాధిపతులు ప్రధానపాత్ర వహిస్తున్నారని ఆరోపణ చేశారు.

లా ఆఫ్ అసోసియేషన్స్‌ను అనుసరించి ప్రభుత్వం ఇటువంటి సంస్థలను ముందుగా ప్రభుత్వానుమతికై అభ్యర్థనలు (applications) చేయవలసిందిగా శాసించింది. గుర్తింపులేని సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేయడాన్ని ఈ చట్టం నిషేధించింది. ఈ విధంగా అనుమతికై అర్థించని, అనుమతిపొందని అనేక మతసంస్థలకు చెందిన సంఘాలను, వారు నిర్వహించే ప్రభుత్వం అణచివేసింది. వాల్డాక్ - రూసో తరువాత కఠినంగా ఈ చట్టాన్ని అమలుజరిపాడు. 1904 లో ఈ చట్టాన్ని మరింత కట్టుదిట్టమైన సవరణలతో, అనుమతిపొందిన సంస్థల నిర్వహణలోని పాఠశాలలు పది సంవత్సరాల కాల వ్యవధిలో సంపూర్ణంగా మూసివేయడాన్ని వీలుగా రూపొందించడం జరిగింది.

ఈ విధమైన మతసంస్థలు ప్రధానంగా సన్యాసులు, సన్యాసినులతో కూడినవి. లా ఆఫ్ అసోసియేషన్స్ ప్రధానంగా వారిపైనే గురిపెట్టబడి, సాధారణమైన స్థానిక మతాధిపతులు (parish clergy) ఈ నిబంధనల నుండి మినహాయించడం జరిగింది. కాని పదో పయస్ పోప్‌గా పదవిని అధిష్ఠించడం (1903) లో తో మతవ్యవస్థకు, రాజ్యవ్యవస్థకు నడుమ మరింత సంఘర్షణ ఏర్పడింది. రాజ్యవ్యవస్థను సంపూర్ణంగా మతవ్యవస్థతో ప్రత్యేకించడం అనివార్యంగా కనిపించింది. అప్పటికి ఇంకా 1801 లో నెపోలియన్ బోనాపార్టీ పోప్ ఏడవ పయస్ (1800 - 1823) తో ఒప్పందం (Concordat) ఆచరణలో లేకున్నా అమలులో ఉంది, అనగా నామమాత్రంగానైనా నిలచి ఉంది. ఆ ఒప్పందం ప్రకారం బిషప్పులను ప్రభుత్వం నియమిస్తే, వారిని పోప్ గుర్తించి, పదవిలో నిలుపుతాడు. ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడైన లాబట్ (Loubat) 1904లో ఇటలీని సందర్శించి రాజైన మూడవ విక్టర్ ఇమ్మానుయేల్‌ను కలుసుకోవడం పట్ల పోప్ పదవ పయస్ తీవ్రంగా ఆగ్రహించాడు. ఈ సంఘటనలు పోప్‌కు ఫ్రెంచి రిపబ్లిక్‌కు సంబంధాలు తెగత్రెంపులు చేసుకోడానికి దారితీసాయి. ఉభయులు తమ రాయబారులను వెనక్కి పిలిపించారు. 1905 లో ఫ్రెంచి రిపబ్లిక్ ప్రత్యేకీకరణచట్టం (Law of Separation) చేసి, అన్నిరకాల మతసంస్థలకు వాటికి అనుబంధమైన సంఘాలకు ప్రభుత్వ గుర్తింపును రద్దుచేసింది. దానితో 1801 నాటి కంకార్డ్ (Concordat) ఒప్పందం పూర్తిగా రద్దు అయింది. కంకార్డ్ ఒప్పందం ప్రకారం బిషప్పులను ఇతర మతాధిపతులను నియమించినట్లే, వారి జీతభత్యాలను చెల్లించేది. ఆ ఒప్పందం ప్రకారం బిషప్పులను ఇతర మతాధిపతులను నియమించినట్లే, వారి జీతభత్యాలను చెల్లించేది. ఆ ఒప్పందం రద్దుకావడంతో ప్రభుత్వానికి ఆ బాధ్యత తొలగిపోయింది. దాని బదులు సీనియర్లయిన మతాధిపతులకు భరణాలు (Pensions) జూనియర్లకు కొంత మొత్తం ఒకేసారి పరిహారంగాను (Compensation) ప్రభుత్వం చెల్లించింది. చర్చి, కెథిడ్రల్ భవనాలు ప్రభుత్వ ఆస్థులుగా గుర్తించి, వాటిని ఆరాధక ప్రజాసంఘాల (Associations Cultuelles) ను ఉపయోగించుకునేందుకు వీలుగా ఏర్పరచడం జరిగింది.

ప్రత్యేకీరణ చట్టం (Law of Separation) ప్రధానంగా కాథలిక్ మతవ్యవస్థను దృష్టిలో ఉంచుకొని చేసింది అయినా, అన్ని క్రైస్తవ మతశాఖలకు, ప్రొటెస్టెంటు క్రైస్తవశాఖలకు కూడ నిష్పక్షపాతంగా వర్తింపచేయడం జరిగింది. అది స్థూలంగా రాజ్యవ్యవస్థను, అనగా రిపబ్లిక్ విధానంలోని ఫ్రెంచి రాజకీయవ్యవస్థను సంపూర్ణంగా మతప్రభావం నుండి ప్రత్యేకీకరించడం ఉద్దేశించి, అమలుపరచబడినది. బహుళంగా అన్ని మతశాఖలకు చెందిన మతాధిపతులు, అనేక కాథలిక్ బిషప్పులు సైతం ఈ చట్టాన్ని అంగీకరించడానికి సంసిద్ధులైనారు. అయితే పోప్ పయస్ ఈ చట్టాన్ని తీవ్రంగా ప్రతిఘటించి, రోమన్ కాథలిక్ మతవ్యవస్థను కూలద్రోయడానికి పన్నిన పన్నాగంగా నిరసించాడు. అందుచేత రోమన్ కాథలిక్ మతస్థుల నుండి ఆరాధన ప్రజాసంఘాలు (Association Cultuelles) ఏర్పడలేదు.

1907లో ప్రత్యేకీకరణ చట్టాన్ని సవరించడం ద్వారా కొంత సడలింపును ఇచ్చి, మతాధిపతులు కూడ స్థానిక పరిపాలనావ్యవస్థ (Local Administration) నుండి అనుమతి సంపాదించి, చర్చి భవనాలను ఉపయోగించుకోవడానికి వీలు కల్పించడం జరుగుతుంది.

పైన వివరించినట్లు రోమన్ కాథలిక్ మతవ్యవస్థ క్రమేణ ప్రజాదరణ కోల్పోతూ ఉండడాన, ఈ విధంగా మూడో ఫ్రెంచి రిపబ్లిక్ ఆ మతవ్యవస్థను ఉద్వాసం, అనగా నివాసం లేనిదిగా చేయగలిగింది. ప్రత్యేకీకరణ చట్టంద్వారా ఆ వ్యవస్థను ఆర్థికంగా నిర్వహించే బాధ్యతను సైతం విసర్జించటంతో అది కేవలం ప్రజల కానుకలపై ఆధారపడవలసి వచ్చింది. ఆ విధంగా కానుకలను సమర్పించి దానిని నిలబెట్టగలిగినంత మంది అనుయాయులు లేకపోయారు. అంతేకాక ప్రజాబాహుళ్యంలో లోగడవలె తన పట్టును నిలుపుకోగలిగినట్టయితే మూడో ఫ్రెంచిరిపబ్లిక్ ఈ ప్రయత్నాల్లో ఇంత విజయం సాధించగలిగేది కాదు. ప్రతి ఎన్నికల సమయంలోను మతవ్యవస్థను అణచివేసి, అదుపుచేయడాన్ని గూర్చి ప్రసంగించిన రిపబ్లికన్ వాదులు క్రమక్రమంగా అ
14 ధికసంఖ్యలో ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌కు ఎన్నిక అవుతూ ఉండడం, రిపబ్లిక్‌కు ఈ విషయంలో సంపూర్ణంగా ప్రజల మద్దతు

లభించేదని స్పష్టపరుస్తుంది. అయితే, ఫ్రాన్సులోని రోమన్ కాథలిక్కులు, ఆ మతవ్యవస్థపై నున్న అసంతృప్తితో ఏ ఇతర క్రైస్తవమతశాఖల్లో చేరలేదు. వారు స్వేచ్ఛగా ఆలోచించే నాస్తికులైనారు.

### 9.4.3.6 సామ్యవాద విస్తరణ :

స్వేచ్ఛగా ఆలోచించే తత్త్వంగల ఫ్రెంచి మేధావులు, ప్రజాబాహుళ్యం క్రమంగా సామ్యవాద సిద్ధాంతాలపై మక్కువ పెంచుకోసాగారు. సాంప్రదాయికమైన ఆలోచన విధానం ఆధునిక ఆలోచనకు క్రమంగా స్థానం కల్పించి, అంతరించడంతో లోగడ సామ్యవాదంపట్ల వారికి భయాందోళనలు తగ్గిపోయాయి. ఒకవిధంగా రిపబ్లిక్ బలీయం కావడంతో సామ్యవాదం కూడ బలీయం అవుతూ వచ్చింది. మతవ్యవస్థ ఆధిపత్యాన్ని, రాచరికవాదుల ప్రాబల్యాన్ని తుదముట్టించడంలో, రెండు వర్గాల కూటమి (Block) గా ఏర్పడి సంయుక్తంగా పోరాడడంతో, ఆ రెండింటి మధ్య సామీప్య స్వభావాలు ఏర్పడ్డాయి. అయితే మొదటి ప్రపంచయుద్ధ కాలంలో ఫ్రెంచి ప్రధానమంత్రి అయిన క్లెమోన్స్యు (Clemenceau) శ్రామికుల తిరుగుబాట్లు, సమ్మెలను తీవ్రంగా ఖండించడంతో సామ్యవాదుల్లోని కొందరు అతివాదులు రిపబ్లికన్‌ల పట్ల అభిమానాన్ని కోల్పోయారు. ఈ పరిణామం కొంతవరకు రష్యాలో సంభవించిన బోల్షివిక్ విప్లవ ప్రభావంగా, సామ్యవాదుల్లో కొందరు విప్లవాన్ని సమర్థించి, ఫ్రాన్సులో అదేవిధమైన పరిణామాలను తీసుకొనిరావాలని కోరుకోవడం వల్ల ఏర్పడింది. కాని ప్రధానమంత్రి పట్టుదలతో వ్యవహరించి, రిపబ్లిక్‌ను కమ్యూనిస్టుల పరం కాకుండ కాపాడాడు. అతని తరువాత ప్రధానమంత్రి అయిన బ్రియాండ్ (Briand) కూడ ఇదే విధానాన్ని అనుసరించాడు.

ఈ విధంగా మూడో రిపబ్లిక్ సామ్యవాదాన్ని (Socialism) అంగీకరించిన పారిశ్రామిక అగ్రరాజ్యాల్లో ఒకటిగా, తీవ్రమైన సామ్యవాద సిద్ధాంతాలతో కమ్యూనిస్టు దేశంగా మారి, తన పారిశ్రామికాభివృద్ధికి భంగపరచుకోని రీతిలో సమతౌల్యాన్ని అవలంబించి అనుసరించగలిగింది.

### మాదిరి ప్రశ్నలు :

1. మూడవ నెపోలియన్ దేశీయాంగ విధానాన్ని వివరించండి.
2. మూడవ నెపోలియన్ విదేశాంగ విధానాన్ని వివరించండి.
3. మూడవ రిపబ్లిక్‌పై విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.

### చదువదగిన గ్రంథాలు :


1. Southgate, G.W. : Modern European History (Vol. III only)
2. Hayes, G.J.H. : Modern Europe to 1870
3. Hayes, G.J.H. : Contemporary Europe Since 1870


రచయిత : ఆచార్య వి. సుందరరామశాస్త్రి

పాఠం - 10

# పారిశ్రామిక విప్లవం - కారణాలు - లక్షణాలు

**విషయసూచిక**

10.0 లక్ష్యం
10.1 ఉపోద్ఘాతం
10.2 పారిశ్రామిక విప్లవం అనగానేమి ?
10.3 పారిశ్రామిక విప్లవం జనించడానికి కారణాలు
10.4 పారిశ్రామిక విప్లవ లక్షణాలు
10.5 పెట్టుబడిదారీ వ్యవస్థ (Capitalism)
10.6 వ్యాపారవాదం (Mercantilism)
10.7 వలసవాదం (Colonialism)
10.8 ఐరోపాదేశాల మధ్య వలసవాద ఘర్షణలు
10.9 ఆఫ్రికా కొరకు కుమ్ములాటలు

## 10.0 లక్ష్యము :

నెమ్మదిగా ఎక్కువ ఖర్చుతో సాగే చేతి తయారీ ఉత్పత్తుల స్థానే వేగంగా, స్వల్ప ఖర్చుతో యంత్రాల సహాయంతో ఉత్పత్తులు సాగించే వ్యవస్థ 18వ శతాబ్దపు ఇంగ్లండ్‌లో నెలకొన్నది. ఈ మార్పులకు పారిశ్రామిక విప్లవం అనే పేరు వచ్చింది. పారిశ్రామిక విప్లవమనగా నేమి ? విప్లవం జనించడానికి కారణాలు, విప్లవ లక్షణాలను గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 10.1 ఉపోద్ఘాతం :

18వ శతాబ్దంలో రాజకీయ, సాంఘిక విప్లవానికి ఫ్రాన్స్ నాంది పలికితే, అదేకాలంలో పారిశ్రామిక విప్లవం ఇంగ్లండ్‌లో మొగ్గతొడిగి చిగురించింది. పారిశ్రామిక విప్లవం ఇంగ్లండ్‌లో మొదలై మిగతా ఐరోపా రాజ్యాలకు, అమెరికా ఖండానికి వ్యాపించింది. పారిశ్రామిక విప్లవ ప్రారంభానికి పూర్వం ఇంగ్లండ్ ఇతర దేశాల నుండి పెక్కు వస్తువులను దిగుమతి చేసుకునేది. కాని ఈ విప్లవానంతరం ఇంగ్లండ్ ఇతర దేశాలకు వస్తువులను ఎగుమతి చేయడం మొదలిడింది.

## 10.2 పారిశ్రామిక విప్లవం అనగానేమి ?

విప్లవమనే పదం సామాన్యంగా రాజకీయ వ్యవస్థలో రక్తపాతంతో కూడిన బృహత్తరమైన మార్పులకు వాడడం పరిపాటి. ఫ్రెంచి విప్లవం, రష్యా విప్లవం దీనికి దృష్టాంతాలు. కాని న్యాయంగా పరిశీలిస్తే ఏ వ్యవస్థలోనైనా సమూలంగాను, విస్తృతంగాను సంభవించే పరిణామాలను కూడ విప్లవమనవచ్చు. ఈ కోవకు చెందినదే పారిశ్రామిక విప్లవం, ప్రపంచ చరిత్రలో 18వ శతాబ్దం వరకు పెద్ద పరిశ్రమలు ఏర్పడలేదు. వస్తువుల తయారీ పూర్తిగా మానవుని శక్తిపైనే ఆధారపడి ఉండేది. కాని 18వ శతాబ్దంలో అనేక నూతన పరికరాలు కనిపెట్టబడి ఒక్కసారిగా యంత్రయుగం ప్రారంభమైంది. యంత్రాల సహాయంతో ఉత్పత్తి పెరిగింది.

పరిశ్రమలు విపరీతంగా అభివృద్ధిచెందాయి. ఒక్కసారిగా మానవశక్తిని యంత్రశక్తి తొలగించి, ఉత్పత్తి విధానాల్లో మార్పులు తెచ్చింది. తత్ఫలితంగా క్రమంగా కాక, ఒకసారిగా, ఒకే శతాబ్దంలో రావడం దీనికి కారణమైన యంత్రాగారాలస్థాపనతో దీన్ని పారిశ్రామిక విప్లవముగా వ్యవహరిస్తారు.

పారిశ్రామిక విప్లవం ప్రప్రథమంగా ఇంగ్లండ్‌లో 18వ శతాబ్దంలో మొదలై మిగతా ప్రపంచానికి వ్యాపించింది. 'పారిశ్రామిక విప్లవం' అనే పదాన్ని ప్రథమంగా 1837లో లూయీ బ్లాంక్ అనే ఫ్రెంచి సోషలిస్టు ఉపయోగించాడు. ఆర్నాల్డ్ టాయన్‌బీ అనే ప్రసిద్ధ చరిత్రకారుడు ఈ పదానికి బహుళ ప్రచారం కల్పించాడు. పారిశ్రామిక విప్లవంలోని మంచి చెడులను పరిశీలించిన జాన్ స్టూవర్ట్ మిల్ ఈ యుగం వల్ల ప్రాప్తించిన అనర్థాలను మానవ శక్తితో, తెలివితో తొలగించవచ్చుననే ఆశావాదం వెలిబుచ్చాడు. ఫ్రెంచి తత్వవేత్త బెర్గ్‌సన్ ఈ విప్లవం పరిశ్రమలకే పరిమితం కాక నూతన భావాల వ్యాప్తికి, మానవ సంబంధాలలో తారుమారుకు దారి తీసిందని అభిప్రాయపడినాడు.

ఇంగ్లండ్ ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం వేగంగా ఇతర ప్రాంతాలకు విస్తరించడమూ, తత్ఫలితముగా సంపూర్ణ పారిశ్రామికీకరణ చెందేదాకా ఈ మార్పు అమితవేగంగా సాగుతూ వచ్చింది. మరో వందసంవత్సరాల్లో ఈ పరిణామక్రమం ఐరోపాను దాటి ప్రపంచంలోని ఇతరదేశాలు, ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకు, ఆయా దేశాల ప్రభావాలకు లోనైన కొన్ని వలసరాజ్యాలకు విస్తరించడంతో అట్లాంటిక్ సముద్రతీరం వెంట ఉన్న ఐరోపాదేశాలు సైతం క్రమంగా ప్రపంచపు రూపురేఖలు మారిపోయాయి. సీజర్ కాలం నాటి రోమన్ తిరిగి ప్రాణం పోసుకొని 1750 కాలంలోని ఇంగ్లండ్‌ను గనుక తిలకిస్తే ప్రజల జీవనసరళి, పారిశ్రామిక పద్ధతులు అంతగా అతనిని ఆశ్చర్యపరచి ఉండేవి కావు. కాని మరొక 100 సంవత్సరాల తర్వాత గనుక అతడు తిరిగి ప్రాణం పోసుకొని వస్తే మాత్రం తనకు బొత్తిగా తెలియని కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు అనుకుని ఉండేవాడు. తీరికలేని నగరజీవనం, ఆ నగరాల్లో కర్మాగారాలు, అబ్బుర పరచే సమాచార, రవాణాసౌకర్యాలు అతనిని ఆశ్చర్యపరచడం ఖాయం.

## 10.3 పారిశ్రామిక విప్లవం జనించడానికి కారణాలు :

క్రీ.శ. 18వ శతాబ్దానికి ముందు ఆరంభమై, నేటి వరకూ కొనసాగుతూ ఉన్న ఈ పరిణామక్రమమే పారిశ్రామిక విప్లవం. ఈ విప్లవం జనించడానికి ప్రేరణనిచ్చింది వాణిజ్యవిప్లవం. ఐరోపావారు, ముఖ్యంగా ఇంగ్లండ్ వారు విదేశీ భూభాగాల్లో సామ్రాజ్య విస్తరణ సాగించాక వాణిజ్య విప్లవం తటస్థించింది. దీనివల్ల ఆర్థిక అభివృద్ధి సాధ్యపడింది. అదే పారిశ్రామిక విప్లవానికి ప్రేరణ అయింది. ఈ పారిశ్రామిక విప్లవం మొదట ఇంగ్లండ్‌లో జనించడానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులు దోహదం చేశాయి.

### 10.3.1 అనుకూల పరిస్థితులు :

పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణము ఇంగ్లండ్‌లో కలదు. పరిశ్రమల కవసరమైన జనశక్తి, ముడి పదార్థాలైన ఇనుము, బొగ్గు పుష్కలముగా ఇంగ్లండ్‌లో లభిస్తుంది. ఇంగ్లండ్‌లోని బొగ్గు గనులు ప్రధాన రేవులకు సమీపముగా ఉండడంతో వాటి రవాణా సులభమైంది.

### 10.3.2 పెట్టుబడి :

ఇంగ్లండ్‌లో పరిశ్రమల స్థాపనకు, ప్రగతికి అవసరమైన పెట్టుబడిపెట్టు సంస్థలు ఉండుట పారిశ్రామిక ప్రగతికి మరో కారణము. ఆనాటి విదేశీ వ్యాపారంలో అత్యధిక భాగాన్ని నిర్వహిస్తూ ఇంగ్లండ్ అత్యధిక లాభాల నార్జించింది. నాటి బ్రిటిష్ ప్రభుత్వము పారిశ్రామిక, వాణిజ్య రంగాలను ప్రోత్సహించి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన, ధనమును అందించుటకు 'బాంక్ ఆఫ్ ఇంగ్లండ్' ను స్థాపించింది.

### 10.3.3. సాధన సామాగ్రి :

సముద్రాంతర వ్యాపారమునకు కావలసిన సాధన సామాగ్రి ఇంగ్లండ్‌కు సమృద్ధిగా ఉంది. తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్‌కు సులభతరంగా చేరవేసి అత్యధిక లాభాలు పొందుట, రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి రవాణా సౌకర్యాలందు ఆధునికీకరణను చేపట్టుట వల్ల ఇంగ్లండ్‌లో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

### 10.3.4 కార్మికులు :

ఐరోపాలోని వివిధ దేశాలలో పరిశ్రమలలో పనిచేసేవారు 18వ శతాబ్దంలో సాంఘిక, ఆర్థిక ఒత్తిడులకు తట్టుకొనలేక తమ స్వస్థాలను వదలి ఇంగ్లాండ్‌కు వలస వచ్చారు. వీరు ఇంగ్లండ్‌లోని నేత, పట్టు, గాజు, కాగితం, ఉక్కు పరిశ్రమల్లో చేరి వాటి అభివృద్ధికి ఇతోధికంగా కృషిసల్పారు.

### 10.3.5 వైజ్ఞానిక వాతావరణం :

సాంకేతిక పరిజ్ఞానము కలిగిన నిపుణులు ఇంగ్లండ్‌లో ఆనాడు ఉండటం వారి పారిశ్రామిక ప్రగతికి దోహదం చేసిన మరో అంశం, పారిశ్రామిక ఉత్పత్తి ప్రక్రియలో నూతన యంత్రాలు కనుగొని, దేశ ఆర్థిక విధానాన్ని మార్చివేసిన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను బ్రిటన్ కలిగిఉంది.

### 10.3.6 వలసలు :

తమ వలసల నుండి పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థములు ఇంగ్లండ్‌కు అధిక మొత్తంలో సరఫరా అయింది. దీనికి తోడు బ్రిటిష్ ఉత్పత్తులకు ఇంగ్లండ్ వలసలయందు మంచి గిరాకి ఉండెను.

### 10.3.7 ధనవంతులు :

ఆనాడు విదేశాల నుండి ఇంగ్లండ్‌కు వచ్చి స్థిరపడిన ధనవంతులు నూతన పరిశ్రమలను స్థాపించుటలో ఉత్సాహం చూపారు. అంతేగాక విదేశీ వ్యాపారం పూర్తిగా ఇంగ్లండ్ ఆధీనంలో ఉండుట, ఇంగ్లండ్‌లో కష్టించి పనిచేయగల కార్మికులుండటం పారిశ్రామిక ప్రగతికి దోహదం చేశాయి.

## 10.4 పారిశ్రామిక విప్లవ లక్షణాలు :

నెమ్మదిగా ఎక్కువ ఖర్చుతో సాగే చేతి తయారీ ఉత్పత్తుల స్థానంలో వేగంగా, తక్కువ ఖర్చుతో, యంత్రాల సహాయంతో ఎక్కువ మొత్తంలో ఉత్పత్తులు సాగించడమే పారిశ్రామిక విధాన ప్రధాన లక్షణము. పారిశ్రామిక విప్లవాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. 1760 నుంచి 1870 వరకు గల కాలాన్ని పారిశ్రామిక విప్లవ తొలిదశగా పరిగణించవచ్చు. ఈ దశలో పరిశ్రమలకు కావలసిన మూల యంత్రాలన్నీ కనిపెట్టబడినవి. 1870 నుంచి రెండో దశ పారిశ్రామిక విప్లవం చోటుచేసుకుంది. ఇది శాస్త్రవిజ్ఞానాన్ని నేరుగా అనువర్తింపచేసి భారీ ఎత్తున ఉత్పత్తులు సాగించడం సాధ్యపడిన దశ. దేశంలోనూ, విదేశాలలోనూ సరుకులకు ఏర్పడిన విపరీతమైన గిరాకీని తట్టుకోవడానికి పారిశ్రామిక విప్లవం ప్రథమంగా ఇంగ్లాండ్‌లో ప్రారంభమయింది. ఈ సరుకుల ఉత్పత్తికి కావలసిన పెట్టుబడి మూలధనం, సహజ వనరులు, కార్మిక బలగం ఇంగ్లండ్‌కు ఉన్నాయి. మూడోదశలో, 1910 తరువాత అణ్వాయుధ పరిశ్రమలు నెలకొల్పబడి విధ్వంసాన్ని కలిగించే పరిస్థితులు ఏర్పడినవి.

### 10.4.1 వస్త్ర వ్యాపార వ్యవస్థ :

పారిశ్రామిక విప్లవానికి మొదట లోనైనది జౌళి లేదా వస్త్ర వ్యాపార పరిశ్రమ. నూలు వస్త్రాలకు గిరాకీ విపరీతంగా పెరిగింది. దీంతో పాత ఉత్పత్తి పద్ధతులు అవసరాన్ని తీర్చడానికి అసలు పనికిరాకుండా పోయాయి. చాలా దేశాలలో ముఖ్యంగా

ఇంగ్లండ్‌లో నూలు వస్త్రాల తయారీకి యంత్రాలను కనుగొనసాగారు. ఉత్పత్తి నిరాటంకంగా సాగేటందుకు ఒక దానితో ముడిపడి మరొకటిగా కొత్త పరికరాలు కనుగొనవలసి వచ్చింది. క్రమక్రమంగా జౌళిపరిశ్రమ గొప్పగా పురోగమించింది. మేలైన యంత్రాలను కనుగొనడం, కొత్త కొత్త కర్మాగారాలను నెలకొల్పడం, ఆవిరి వినియోగం, బొగ్గు, ఇనుముల ఉత్పత్తి పెరగడంలో ఈ విప్లవం విస్తరించింది.

ప్రప్రథమంగా వస్త్రపరిశ్రమ ఇంగ్లాండ్‌లో అభివృద్ధి చెందినది. మొదటిసారిగా నేత పరిశ్రమలో యంత్రాల వాడకం ప్రవేశించింది. దూదిని నూలు వడకడం, రీరీఆ తరువాత నూలును నేయడం అనే రెండు అంచెలు వస్త్ర పరిశ్రమలలో గలవు. ఈ రెండు అంచెల ప్రక్రియ పూర్తి అయితేనే వస్త్రం తయారవుతుంది. 1738లో జాన్ "తురి" అనే యంత్రాన్ని కనిపెట్టాడు. దీనినే ఫ్లైయింగ్ షటిల్ అని అంటారు. ఇది నేతనేసే వేగాన్ని పెంచింది. ఈ తరువాత లాంక్ షైర్ నగరానికి చెందిన జేమ్స్ హర్ గ్రీవ్స్ 'స్పిన్నింగ్ జెన్నీ' అనే నూలు వడికే యంత్రాన్ని కనుగొనడంతో నూలు వడకు పద్ధతిలో వేగం పెరిగింది. ఆ తదుపరి ఆర్క్‌రైట్ అను వ్యక్తి నీటిశక్తితో నడిచే 'రోలర్' ను కనిపెట్టి దాని ద్వారా నూలు వడికే యంత్రాన్ని కనిపెట్టాడు. దీనినే 'స్పిన్నింగ్ ఫ్రేం' లేక 'వాటర్ ఫ్రేం' అని అంటారు. ఇవి భారీ యంత్రాలుకావడంతో, వీటి కోసం ప్రత్యేకంగా నిర్మించిన భవనాలు లేక కర్మాగారాలలో వీటిని ఏర్పరచవలసి వచ్చింది. అందుకే 'ఇంగ్లీష్ ప్రత్తి పరిశ్రమ స్థాపకుడు, కర్మాగార వ్యవస్థకు పితామహుడు ఆర్క్‌రైట్' అని ఫిషర్ వర్ణించాడు. ఆ తరువాత పరిశోధనలు ఒకేసారి రెండు వందల వరకూ దారాలను తీయగలిగే యంత్రాలను కనుగొనడానికి దారితీసాయి. స్పిన్నింగ్ జెన్నీ, వాటర్ ఫ్రేంలను సమన్వయించి 1779 లో శామ్యూల్ క్రాంప్టన్ 'స్పిన్నింగ్ మ్యూల్' ను కనుగొన్నాడు. డాక్టర్ ఎడ్మండ్ కార్ట్ రైట్ అనే మతాధికారి జలశక్తితో, స్వయంచాలితమైన మగ్గాన్ని కనుగొన్నాడు. ఇది వందమంది చేసే పనిచేస్తుంది. కార్ట్‌రైట్ మరమగ్గం ప్రత్తిపరిశ్రమలో వచ్చిన విప్లవాన్ని పూర్తి చేసింది.

బట్టల తయారీలో అన్నిరకాల ప్రక్రియల అభివృద్ధికి కారణమైన అనేక విషయాలను, ఆ తదుపరి కనుగొన్నారు. ఫలితంగా వంద, రెండు వందల మంది పనిని కేవలం ఒక యంత్రం చేయగలిగింది.

### 10.4.2 ఆవిరి యంత్రం :

ఆవిరి యంత్రం క్రమంగా అభివృద్ధి చెంది పారిశ్రామిక రంగంలో ముఖ్యమైన స్థానం సంపాదించింది. 1600 సంవత్సరంలో గనులలో నుంచి నీటిని తోడివేయడానికి ఆవిరి పంపును థామస్ సావేరి కనుగొన్నాడు. 1705 న్యూకోమెన్ అనే మెకానిక్ ఇంగ్లండ్‌లోని గనుల నుండి నీరు తోడడానికి ఆవిరి యంత్రాన్ని కనుగొన్నాడు. దీనిలో ఉన్న అనేక లోపాలవల్ల విస్తృతంగా ఉపయోగించడానికి వీలులేక పోయింది. మరీ లోతు ఎక్కువగా ఉన్నచోట్ల వీటి ఉపయోగం లేకపోయింది. అంతేగాక ఇందులో ఉష్ణశక్తి ఎక్కువగా వృథా అయ్యేది. గ్రీనాగ్ ఇంజనీర్ అయిన జేమ్స్ వాట్ 1769లో ఒక ప్రత్యేక కండెన్సర్‌ను తయారుచేయడం ద్వారా ఆవిరి యంత్రంలోని లోపాలను తొలగించడంలో కృతకృత్యుడయ్యాడు. వాట్ అభివృద్ధిచేసిన ఆవిరి యంత్రం "ఆవిరి యుగం" అనే నూతన యుగారంభానికి కారణమైంది. బ్రిటన్‌లోని పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడంలో ప్రధానపాత్ర వహించింది. ఆవిరి యంత్రాన్ని కనుగొన్నవాడిగా వాట్‌నే గుర్తించడం జరిగింది. జలచక్రం కదలికను అనుసరించి రోటరీ మోషన్‌ను కనిపెట్టడంలో 1781లో ఆవిరి యంత్రం ప్రత్తి కర్మాగారాలలో ప్రవేశించింది. ఆవిరి యంత్రం ఉత్పత్తిలోను, దేశ విదేశాలలో ఉపయోగానికై యంత్రాలను అందించడంలోను, బౌల్టన్ ప్రయత్నాన్ని గుర్తించాలి. ఇతడు వాటిలో కలిసి ఎన్నో యంత్రాలను తయారుచేశాడు. ఇంగ్లండ్‌లోని ప్రాథమిక పరిశ్రమల్లో 1879 నాటికి అత్యంత ప్రభావవంతమైన అంకంగా ఆవిరియంత్రం స్థిరపడింది.

ఇంగ్లండ్‌లో నూతనంగా రూపొందించిన ఆవిరి యంత్రం వస్తూత్పత్తిలో అద్భుతమైన మార్పును తెచ్చింది. అంతకుముందు వస్తూత్పత్తి ప్రధానంగా చేతి పని మీద ఆధారపడి ఉండేది. ఉత్పత్తి అల్పపరిమాణంలో జరిగేది. వస్తూత్పత్తి ఒక దుకాణానికో, ఇంటికో పరిమితమై ఉండేది. ఉత్పత్తిదారుడు కొందరు పనివారిని ఉపయోగిస్తూ తను స్వయంగా పనిలో పాల్గొనేవాడు.

## 10.4.3 బొగ్గు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు :

మానవశక్తికి బదులుగా వీలున్నచోటల్లా ఉత్పత్తి సాధనంగా యంత్రం రావడంలో ఉత్పాదన శక్తి విపరీతంగా పెరిగింది. యంత్రాల ఉపయోగం సర్వసాధారణమయింది. కాని ఇవి భారీ యంత్రాలు కావడంతో వాటిని మానవ శక్తితో నడపటం కష్టమైంది. వాయు, జల శక్తులు కూడా పరిమితమైనవే. పైగా అవి పూర్తిగా ఆధారపడదగినవి కావు. ఈ యంత్రాలను నడపడానికి ఒక కొత్త చోదక శక్తి అవసరమయింది. జేమ్స్‌వాట్ మెరుగుపర్చిన ఆవిరి యంత్రం, నూతన చోదక శక్తిగా మానవాళికి తోడ్పడింది. ఆవిరి యంత్రం, ఇతర యంత్రాల వాడకం ఇనుము, బొగ్గుల అవసరాన్ని సృష్టించింది. యంత్రాల తయారీకి ఇనుమూ, ఆవిరి యంత్రాన్ని నడపడానికి కావలసిన ఆవిరి కోసం బొగ్గు అవసరమయినాయి.

పరిశ్రమల అభివృద్ధికి ఇనుము, ఉక్కు అత్యంత అవసరం. 18వ శతాబ్దానికి ముందు ముడి ఇనుమును కరిగించి ఇనుప వస్తువులు తయారు చేయడానికి వంట చెరుకు ఉపయోగించేవారు. రాక్షసి బొగ్గును తయారు చేయటానికి తగినంత కట్టె లభించకపోవడంతో, రాతి బొగ్గునుపయోగించటం మొదలుపెట్టారు. 16వ శతాబ్దం ప్రథమార్థంలో బొగ్గును కోక్‌గా మార్చే ప్రయత్నంలోను, ముడి ఇనుము కరిగించి శుద్ధం చేయడంలోను, బలమైన గాలి పేలుళ్ళద్వారా, డార్బీలు సఫలులయ్యారు. డార్బీ కోక్ బ్లాస్ట్ ప్రక్రియ మరికొన్ని నూతన ఆవిష్కరణలు, పాత పద్ధతులలో అభివృద్ధికరమైన మార్పులు, 18వ శతాబ్ది ఉత్తరార్థంలో ఇనుము ఉత్పత్తిని పెంచాయి. జేమ్స్‌వాట్ యొక్క స్టీమ్ హేమర్, హంట్స్‌మన్ యొక్క స్టీల్‌ప్రాసెస్, జాన్‌స్మీటన్ యొక్క గాలిపంపు, హెన్రీ కార్ట్, పీటర్ ఓనియమ్‌ల 'రెవర్బరేటరీ ఫర్‌నెస్' పుడ్డింగ్, రోలింగ్ మిల్లులు, నికోల్సన్‌యొక్క 'హాట్ బ్లాస్ట్' మొదలగు కొత్త ఆవిష్కరణలు ఇనుము ఉత్పత్తి వేగంగా సాగటానికి తోడ్పడింది. 1815లో హంఫ్రీ డేవీస్ కనుగొన్న 'సేఫ్టీ లాంప్' గనుల నుండి బొగ్గు ఉత్పత్తి అధికమవటానికి దోహదమయింది.

## 10.4.4. రవాణా సౌకర్యాలు :

పారిశ్రామికీకరణం, అధిక వస్తూత్పత్తి వలన ముడి సరుకునకూ, వస్తు విక్రయ వ్యాపార కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. ఈ రెండు కారణాలు తిరిగి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని సృష్టించాయి. హేస్ అనే చరిత్ర కారుని మాటల్లో చెప్పాలంటే 1830 - 1870 మధ్య రవాణా రంగంలో సాధించిన విస్మయాత్మకమైన అభివృద్ధి విప్లవాత్మకమైనది. 1830 వరకు రవాణా సాధనాలలో పెద్ద మార్పుగానీ, అభివృద్ధిగానీ సాధించిందేమీలేదు. ప్రజలు నడిచో, గుర్రపుస్వారీ చేస్తూనో ప్రయాణం చేసేవారు.

ప్రయాణ సాధనాలకు ఆవిరి యంత్రాన్ని ఉపయోగించడం ఇంగ్లండ్‌లో రవాణా సమస్య పరిష్కారానికి దోహదమయింది. రిచర్డ్ ట్రెవెదిక్ అనునతడు రైలు ఇంజన్‌ని కనిపెట్టి ఆవిరి యంత్రంతో నడిపాడు. 1825 లో రాబర్ట్ లూయీ స్టీఫెన్‌సన్ దానిని ఆధునిక రైలు ఇంజన్‌గా రూపొందించాడు. దానితో ఇంగ్లండ్‌లో రైళ్ళు త్వరితగతిన అభివృద్ధి చెంది దేశం నలుమూలలా రైలు మార్గాలు నిర్మించబడినవి. 1830 నాటికి వున్న 49 మైళ్ళ రైలు మార్గం 1870 నాటికి 15,300 మైళ్ళకు అభివృద్ధి అయింది. 1838లో రాబర్ట్ ఫుల్‌టన్, నికోలస్ రూజ్‌వెల్ట్ ఆవిరిశక్తితో నడిచే నౌకలను నిర్మించారు. 1838లో ఇంగ్లండ్‌లో సిరిన్, గ్రేట్‌వెస్ట్రన్ అనే రెండు ఆవిరి నౌకలు తయారైనవి. ఇవి సవన్నా నుండి బయలుదేరి అట్లాంటిక్ మహాసముద్రం దాటి లివర్‌పూల్ చేరినవి. సిరిన్ 18 రోజులలోను, గ్రేట్ వెస్ట్రన్ 15 రోజులలోను అట్లాంటిక్ సముద్రాన్ని దాటినవి. 1830 నాటికి బ్రిటన్‌లో 298 ఓడలుండగా, 1870 నాటికి ఓడల సంఖ్య 3178 కి పెరిగింది.

## 10.4.5 రహదారులు :

పారిశ్రామిక వ్యవసాయక విప్లవములతోపాటు రవాణా సౌకర్యములు కూడా అభివృద్ధి చెందెను. మట్టి రోడ్లకు బదులు కంకర రోడ్లను నిర్మించు పద్ధతిని స్కాటిష్ ఇంజనీరైన జాన్ మెకడమ్ కనుగొనుటతో రహదారి నిర్మాణము విరివిగా సాగెను. కాలువలు కూడ రవాణా మార్గములుగా ఉపయోగింపబడినవి.

### 10.4.6 వార్తా సౌకర్యములు :

పారిశ్రామిక విప్లవము నాటి నుండి సాంకేతిక భౌతికశాస్త్ర విజ్ఞానము పెరిగి యంత్రనిర్మాణ ప్రగతి అనూహ్యమైన రంగములకు వ్యాపించెను. 1844లో శామ్యూల్ మోర్స్ టెలిగ్రాఫ్, 1876లో అలెగ్జాండర్ గ్రహంబెల్ టెలిఫోన్ కనిపెట్టుట వార్తా విప్లవముగా పరిగణించవచ్చును. ఇవిగాక అణుశక్తి, తంతి, టెలివిజన్, విద్యుచ్ఛక్తి మున్నగు వానిలో సంభవించిన మహత్తర పరిశోధనలు మానవుని జీవిత స్వరూపమునే మార్చివేసాయి.

### 10.4.7 వ్యవసాయక విప్లవము :

18వ శతాబ్ది నాటికి ఐరోపా భూస్వామ్యవ్యవస్థ దాదాపు క్షీణించి భూములు రైతుల పరమయ్యెను. రైతులు వ్యవసాయ రంగమున యంత్రములు ప్రవేశపెట్టి, పంట మార్పిడి విధానం ప్రవేశపెట్టి అధికోత్పత్తిని సాధించిరి. కనుకనే ఈ యుగమును వ్యవసాయక విప్లవమని కూడా అందురు.

### 10.4.8 పారిశ్రామిక విప్లవ వ్యాప్తి :

ఇంగ్లాండ్‌లో 18వ శతాబ్దంలో మొదలైన పారిశ్రామిక విప్లవం అప్పటినుండి అభివృద్ధిని సంతరించుకుంటూనే సాగిపోయింది. ఇంగ్లాండ్ తన శత్రువైన ఫ్రాన్స్‌తో దీర్ఘకాలం యుద్ధం కొనసాగించిందంటే, ఆ దెబ్బను తట్టుకోవటానికి కావలసిన బలం, ఇంగ్లాండ్‌కు పారిశ్రామిక విప్లవాభివృద్ధి కారణంగా ఒనగూడిన అపార సంపదే కారణం. ఇంగ్లాండ్‌లో 1830 కల్లా అభివృద్ధి పొందిన పరిశ్రమలు ఎంతో వేగవంతంగా విస్తృతపరచబడినాయి. బ్రిటిష్ వారి సరుకుల ఎగుమతులు అధికమయ్యాయి. ఇనుము పరిశ్రమలో సాధించిన అభివృద్ధి గుర్తింపగలిగేటంత వేగంగా సాగింది. క్రమక్రమంగా మిగతా దేశాల్లో కూడ ఈ మార్పులు ప్రవేశపెట్టబడినాయి. 18వ శతాబ్దపు ఉత్తరార్థంలో ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్ లాంటి ఐరోపా ఖండ దేశాల్లో, కొత్తగా ఆవిష్కరింపబడిన ఆర్క్‌రైట్ "వాటర్ ఫ్రేమ్స్" లాంటి యంత్రాలు ప్రవేశపెట్టబడినాయి.

### 10.4.9 1870 తరువాత పారిశ్రామిక విస్తృతి :

హేస్ మాటల్లో, గ్రేట్ బ్రిటన్ 1830 నుండి 1870 వరకు గల నలభై సంవత్సరాలు మాత్రమే నిజమైన పారిశ్రామిక విప్లవాన్ని చవిచూసింది. 1870 నుండి 1910 వరకూ గల తరువాతి నలభయి సంవత్సరాల్లో, యంత్ర సహాయంతో కూడిన పరిశ్రమలు అధికోత్పత్తిని సాధించిపెట్టాయి.

### 10.4.9.1 విద్యుచ్ఛక్తి :

1870 నుండి విద్యుచ్ఛక్తి ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది. దాన్ని వివిధ రకాలుగా వాడటం మొదలెట్టారు. రకరకాలైన విద్యుత్పరికరాలు తయారయినాయి. అయితే విద్యుత్ వినియోగంలో పెంపు, ఏ ఒక్కదేశానికీ పరిమితం కాలేదు. ఒకేసారి, బ్రిటన్, అమెరికా, ఇంకా ఐరోపా ఖండంలోని మిగతా దేశాలలోను ప్రాచుర్యం పొందింది. విద్యుత్‌ను, డైనమోల, మోటార్లను రాను రాను మెరుగుపర్చారు. బహుళ సంఖ్యలో అవి ఉత్పత్తి అయ్యాయి. క్రమానుగతంగా విద్యుత్తును వెలుగు ఇచ్చేందుకు కూడ ఉపయోగించ మొదలిడినారు. థామస్ ఎడిసన్ విద్యుద్దీపాన్ని కనుగొనటం, అలెగ్జాండర్ గ్రహంబెల్ టెలిఫోన్‌ను కనుక్కోవటం, మానవాళికి వరంగా పరిణమించాయి. త్వరలో విద్యుచ్ఛోదక రైలుబండ్లు, ట్రాములు అవతరించాయి. 1895 లో ఇటలీ దేశస్థుడైన మార్కోనీ నిస్తంత్రీ టెలిగ్రఫీని కనుగొన్నాడు. 1898 కల్లా ఇంగ్లీషు ఛానెల్ కటూ, ఇటూ నిస్తంత్రీ వార్తా ప్రసారణ మొదలయింది. 1901 కల్లా అట్లాంటిక్‌ను తరించటం సాగించింది.

### 10.4.9.2 గృహ ప్రయోజనాలకై విద్యుత్ వాడకం :

20వ శతాబ్దం నుండి విద్యుత్తును గృహావసరాలకు, ప్రయోజనాలకు వాడటం సాగించారు. దీపాలకు, టెలిఫోన్లకు, ఇండ్లు ఊడ్చే వాక్యూమ్ క్లీనర్లకూ, కుట్టు మిషన్లకూ, వాషింగ్ మిషన్లకు విద్యుత్తు వాడకం అధికమయింది.

### 10.4.9.3 వ్యక్తిగత సౌకర్య సాధనాలు :

విద్యుత్ పరికరాల పరిశ్రమలతోపాటు, ఇండ్లల్లో, దుకాణాల్లో, కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక యాంత్రిక సాధనాల తయారీ మొదలయింది. రకరకాల కొలిమిలతో, కృత్రిమ వెచ్చదనం సమకూర్చటం జరిగింది. రిఫ్రిజిరేటర్లు తయారయినాయి. ఐస్‌ను తయారుచేయటానికి, డబ్బాలో, కుండల్లో ఆహార పదార్థాలను నిలువ ఉంచడానికి, కొన్ని రసాయనిక పదార్థాల వాడకం ఉపయోగంలోకి వచ్చింది. రిఫ్రిజిరేటర్లను, విద్యుత్తును వాడటం, సాంకేతిక నిపుణులు నేర్చుకున్నారు. గృహ ఆర్థిక వ్యవస్థలో కుట్టుమిషన్ పెద్ద మార్పును తీసుకువచ్చింది. వాణిజ్యపరంగా ఈ కుట్టుమిషన్‌ను ఎక్కువగా వాడకంలోనికి తీసుకువచ్చిన ఘనత, అమెరికా దేశస్థుడైన ఐజక్ సింగర్‌కు దక్కింది. 1889లో విద్యుచ్ఛాలక కుట్టుమిషన్‌కు పేటెంట్ తయారయింది. కార్యాలయార్థిక వ్యవస్థలో మార్పు తీసుకువచ్చిన ప్రత్యేక సాధనం, టైప్‌రైటర్. 1874లో న్యూయార్క్‌లో, రెమింగ్టన్ అండ్ సన్స్ వారు టైపు మిషన్లను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం మొదలుపెట్టారు. సైకిల్ ఆవిష్కరణ, వ్యక్తుల శీఘ్ర చలనానికి దోహదకారి అయింది. 1890 నాటికల్లా అమెరికా, ఐరోపా ఖండాల్లో ఇది విరివిగా వాడకంలోనికి వచ్చింది. 1870 నుండి 1910 వరకూ ముఖ్య ఆవిష్కరణలు - ఆవిరి శక్తితో నడిచే టర్బైన్లు, ఇంటర్నల్ కంబశ్చన్ మెషీన్లను, మోటార్ కార్లకు, నౌకలకు, విమానాలకు ఉపయోగించారు. అది పెట్రోలియం, రబ్బర్, సిమెంట్ పరిశ్రమలకు పనిని కల్పించింది. మెల్లగా 19వ శతాబ్దాంతానికల్లా, గాసోలిన్ ఇంజన్ వాట్ తయారుచేసిన ఆవిరి యంత్రంతో పోటీపడసాగింది. ఆ విధంగా, రవాణా సౌకర్యాలలో, ఆపైన మిగతా పరిశ్రమలు చైతన్యాన్ని సంతరించుకోవటంలో, విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చింది.

### 10.4.9.4 పెట్రోలియం, రబ్బర్ :

ఇంటర్నల్ కంబశ్చన్ యంత్రాన్ని మోటారు కార్లు, నౌకలు, విమానాల్లో ఉపయోగించడం వలన, పెట్రోలియం పరిశ్రమాభివృద్ధికి దోహదమయింది. మోటారు కారు వాడకం, రబ్బర్ పరిశ్రమాభివృద్ధికి దోహదకారి అయింది. 1839లో ఛార్లెస్ గుడ్ ఇయర్, రబ్బర్‌ను శక్తివంతమైన దాన్నిగా, ఎలాస్టిక్‌గా చేయటానికి వల్కనైజింగ్ కనుక్కోవటంతో ఆయన రబ్బర్ పరిశ్రమకు స్థాపకుడయ్యాడు. 1850 లో స్కాటిష్ పారిశ్రామిక రసాయన శాస్త్రజ్ఞుడైన జేమ్స్‌యంగ్, ముడినూనె నుండి, లూబ్రికేటింగ్ ఆయిల్, కిరోసిన్, వాక్సాలను వెలికితీసే పద్ధతిని కనుగొన్నాడు. ఈ ఆవిష్కరణా కార్యక్రమం ఏ ఒక్కకాలానికో, యంత్రానికో, పరిశ్రమకో పరిమితమై లేదు; నిరంతరం సాగింది.

### 10.4.10 20వ శతాబ్దం :

20వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవప్రభావం ఆయుధాలపై ప్రసరించింది. అనేక మర తుపాకుల ఉత్పత్తి జరిగింది. మొదటి ప్రపంచ యుద్ధంలో మర తుపాకులను విరివిగా వాడారు. రెండవ ప్రపంచ యుద్ధంలో టాంకుల పరిశ్రమ విపరీతంగా అభివృద్ధి చెందింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అణ్వాయుధాలు తయారైనవి. అనేక ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు తయారైనవి. ప్రపంచాన్ని తృటిలో నాశనం చేయగల శక్తి కనుగొనబడినది. నేడు ఆయుధాల వ్యాపారం జోరుగా సాగుతున్నది. ఈ విధంగా పారిశ్రామిక విప్లవం సత్ఫలితాలతో పాటు వినాశకర ఫలితాలను కూడా తెచ్చినది. మరొకవైపు మానవునికి సుఖసంతోషాలిచ్చే టి.వి.లు, రిఫ్రిజిరేటర్లు, ఎలక్ట్రిక్ ఇంటి సామానులు ఎంతో అభివృద్ధి చెందాయి.

## 10.5 పెట్టుబడిదారీ విధానం (Capitalism) :

పారిశ్రామిక విప్లవానికి మూలమైన పెట్టుబడిదారీ ఆర్థికవిధానం, పారిశ్రామిక విప్లవ ఫలితంగా దేశీయ ఆర్థికవ్యవస్థలను, అంతర్జాతీయంగా వివిధ దేశాల నడుమ సంబంధాలను నిర్ణయించే హేతువు (Causal Factor) అయింది. దేశీయ ఆర్థికవ్యవస్థలో పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధి విస్తరణలు రాజ్యాదాయానికి (State Economy) ప్రధానవనరులై, వ్యవసాయక, ఆర్థికవనరుల

నుండి రాజ్యానికి సమకూరిన ఆదాయం కంటే అనేకరెట్లు అధికాదాయాన్ని సమకూర్చగలిగాయి. అందుచేత ప్రభుత్వాలు, పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయడము, పారిశ్రామికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇతర ప్రజాసముదాయాలు వారి జీవన విధానాలను ఉపేక్షించడమూ జరిగింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలే సైనికంగా బలీయమై, విస్తారంగా వలసరాజ్యాలను ఏర్పరచుకొని అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించే అగ్రరాజ్యాలుగా విలసిల్లాయి. అందుచేత వలస రాజ్యాలను ఏర్పరచుకొని నిర్వహించడంలో వారి నడుమ తీవ్రమైన పోటీ ఏర్పడడం, పోటీ స్పర్థగా, స్పర్థయుద్ధాలుగా పరిణమించి, 20వ శతాబ్ది ప్రథమార్థంలో రెండు ప్రపంచయుద్ధాలు సంభవించడానికి దారితీసింది.

ఉత్పత్తి పద్ధతుల్లో మార్పుకు స్థావరం కావడంతో ఇంగ్లండ్ ఐరోపా దేశాలలో వర్తక వాణిజ్య విస్తరణ, పారిశ్రామికాభివృద్ధికి, వలసవాదవిధానానికి మార్గదర్శకమైంది. లాభకరమైన యంత్రాగారాల స్థాపనకు దారితీసిన అనుకూల పరిస్థితులు, అవసరమైన రంగం ఇంగ్లండ్‌లో సిద్ధంగా ఉండడమే అందుకు కారణం. ఈ మార్పు ఇతర దేశాలలో తరువాత వచ్చింది. యంత్రాల స్థాపనకు పెద్ద పెద్ద పెట్టుబడులు కావాల్సి వచ్చాయి. ఇది కొత్తరకమైన ఆర్థిక వ్యవస్థకు - పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థకు దారితీసింది. యంత్రాలు రావడంతో వస్తువుల ఉత్పత్తి ఎన్నోరెట్లు పెరిగింది. ఉత్పత్తికి తగిన వినిమయం ఐరోపాలో లేదు. వస్తువుల తయారీకి కావలసిన ముడి సరుకుల కోసం, మిగిలిన సరుకుల అమ్మకం కోసం ఖండాంతర వ్యాపారం అవసరమై వలస రాజ్యస్థాపనకు అవసరం ఏర్పడింది. క్రమంగా ఈ ఆర్థికవ్యవస్థ విధానాలు ఇతర ఐరోపాదేశాలకు విస్తరించడంతో ఆ దేశాల నడుమ వలసలను ఏర్పరచుకోవడంలోను, వాటిపై ఆధిపత్యం చలాయించడంలోను పోటీ ఏర్పడింది. వలస రాజ్యవిధానం క్రమంగా సామ్రాజ్య వాదంగా మారి ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని అనేక దేశాలు ఐరోపా సామ్రాజ్యవాదానికి బలైనాయి. పారిశ్రామిక విప్లవంతో ఆర్థిక వ్యవస్థలో రెండు వర్గాలేర్పడ్డాయి. పరిశ్రమలను స్థాపించి అధిక లాభాలు పొందిన పెట్టుబడిదారులు 'కాపిటలిస్టుగా'ను, ఈ పరిశ్రమలలో తమ శక్తినంతా ధారపోసినా, సరైన జరుగుబాటు లేని కార్మికవర్గమనే 'ప్రోలిటేరియట్' అను రెండు వర్గాలు ఏర్పడ్డాయి. వీరి మధ్య ఆర్థిక, సాంఘిక అంతరం మరీ ఎక్కువైనందున, ఈ రెండు వర్గాల మధ్య ప్రథమంలో కొంత సఖ్యత ఉన్నా, తరువాత క్రమంగా వైషమ్యం ఏర్పడింది. కార్మికుల పరిస్థితిని మెరుగుపరచడానికి మానవతావాదులు, సామ్రాజ్యవాదులు, సమాజవాదులు ప్రయత్నించడంతో ఈ వైషమ్యాలు విప్లవాలకు దారితీసింది. కారల్‌మార్క్స్ వర్గ సంఘర్షణ అనివార్యమని, ఏనాటికైనా కార్మికులు జయించి తీరుతారని, వీరిని పీడించే పెట్టుబడిదారులకు పతనం తప్పదని సిద్ధాంతీకరించాడు. పరిశ్రమాభివృద్ధి వల్ల పెద్ద పెద్ద పట్టణాలు నిర్మించబడ్డాయి. మురికివాడలు, పొగగొట్టాలు, ఇరుకు సందులతో ఈపట్టణాలలోని పేదవారి జీవితం దుర్భరంగా తయారయింది.

1) లాభార్జన పైన అశేష సమాజాన్ని నడిపించే శక్తిగా భారీ మొత్తంలో పెట్టుబడి ధనాన్ని సమకూర్చి దానిని అనేక మార్గాలలో ఒక్కొక్కసారి పరోక్ష మార్గాలలో లాభార్జనకు వినియోగించడం' అని పెట్టుబడిదారీతత్వాన్ని నిర్వచించారు. పెట్టుబడిదారీతత్వం ఆవిర్భావం ఒక నూతనశకాన్ని ఆవిష్కరించింది. అది కేవలం మానవ జీవిత ఆర్థిక అంశాన్నేగాక సర్వాన్నీ ప్రభావితం చేసింది. అనేక మార్పులకులోను చేసింది. మధ్యయుగాల ఆరంభకాలంలో డబ్బు తక్కువ వాడకంలో ఉండగా మధ్యయుగాల ఉత్తరార్థం నాటికి అది ఐరోపా అద్భుత అభివృద్ధికి కావలసిన శక్తిని ఇచ్చింది. పెట్టుబడిదారీతత్వం ఆరంభమైనప్పటి నుంచి పెట్టుబడులను పెంచుకోవడానికి లాభాలను మళ్ళించడం జరిగింది. లాభాలను పెట్టుబడికి ఉపయోగించడం అంటే మిగులు ద్రవ్యాన్ని మరింత పెట్టుబడిగా మార్చడం. పెట్టుబడిదారుడు తన ఆస్తులను విస్తరించుకోవాలనే కోరికతో ముందుకు నడుస్తాడు.

2) పెట్టుబడిదారుకు తన పెట్టుబడి మూలంగానే యంత్రాగారాల స్థాపన, వస్తూత్పత్తి సాధ్యమైనాయని భావించి, లాభంలో అధిక శాతం తనకే మిగుల్చుకొంటాడు. అయితే ఉత్పత్తి కేవలం పెట్టుబడితోకాక, శ్రామిక శక్తితో సాధ్యమైందని, కనుక శ్రామికశక్తి మిగులు లాభాలను పొందడానికి అర్హత గలిగిందని, దీనికి దక్కవలసిన లాభంలోని వాటాను పెట్టుబడిదారు దోచుకొంటున్నాడని కారల్‌మార్క్స్ సిద్ధాంతం.

మేధావులు, శక్తిగలవారు తమ ధనాన్ని పరిశ్రమలలో వినియోగించి దానిని వృద్ధి చేసినారు. బౌల్టన్, హోల్ట్ అనేవారు అనేక వస్తువులను తయారుచేసే ఒక పరిశ్రమను స్థాపించి ఐశ్వర్యవంతులైనారు. ఆర్క్‌రైట్ అనునతనిని ఫ్యాక్టరీ పద్ధతికి జనకుడు అని అంటారు. మొదట్లో పెట్టుబడిదారుడే మిల్లు స్వంతదారుడుగా, దానిని పెంపొందించి, నిర్వహించి దానికి విక్రయ ఏజంటుగా కూడా వర్తించడం జరిగింది. వ్యాపారం వృద్ధి అవుతన్న కొద్దీ యోగ్యులైన వారిని ఈ విధులు నిర్వహించడానికి నియోగించి వేతనములిచ్చేవాడు. రాను రాను అతడే పెట్టుబడి దారుడు మాత్రం అయి లాభాలను గడిస్తూ ఉండేవాడు. దానిని తిరిగి ఇతర ఫ్యాక్టరీలకు పెట్టుబడిగా పెట్టినాడు. పరిశ్రమలు వృద్ధి అవుతున్న కొద్దీ పెట్టుబడిదారుల సంఖ్య పెరిగింది. చివరకు వారు జాతీయ వ్యవహారాలలో శక్తివంతమైన వర్గంగా పరిణమించారు.

3) కొత్త సమాజంలో పెట్టుబడిదారులు, వేతనదారులు అని రెండు వర్గాలేర్పడినాయి. ఇది పారిశ్రామిక విప్లవం యొక్క ఫలితము. ధనికులైన మధ్య వర్గం వారిలో పారిశ్రామికులు, వర్తకులు, వ్యాపారస్తులు, గనుల సొంతదారులు, నౌకా యజమానులు, వడ్డీ వ్యాపారస్తులు ఐరోపాలో బూర్జువా వర్గంగా ప్రసిద్ధికెక్కినారు. వేతనాలు పొందేవారు శ్రామిక వర్గంగా ప్రసిద్ధి కెక్కినారు. శ్రామికులలో సమర్థులు, సూక్ష్మగ్రాహులైనవారు ఊర్ధ్వశ్రేణులకు పదోన్నతి పొందడం, ఆ తరువాత వారే పెట్టుబడిదారీ వర్గంలో ఒకటిగా అయిపోవడం ఉండేది.

4) పారిశ్రామిక నాయకులు, స్వయం కృషివల్ల ఏర్పడిన లాంక షైర్ మిల్లు యజమానులు, ఉత్తర ఇంగ్లండ్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్‌లలోని పరిశ్రమదారులు నూతన మార్గానికి చెందిన మొదటి తరంవారు. వీరు క్రమేపీ ఎక్కువగా, పాత వ్యాపార పారిశ్రామిక కుటుంబాల కోవకు చెందినవారు. అప్పటికే ప్రసిద్ధిచెందిన విత్త వ్యవహారాల కోసం ఏర్పడిన సంస్థలు ప్రపంచంలో ప్రముఖస్థానం పొందాయి. పశ్చిమ ఐరోపా అంతా ఒక పెద్దవాణిజ్య పారిశ్రామిక, విత్త సంబంధ, సమాజమైంది. కొత్తగా ఏర్పడిన సంపన్న వర్గం అధిక రాజకీయ ప్రాతినిధ్యాన్ని, అధికారాన్ని కోరసాగారు. కాలదోషం పట్టిన శాసనాలను, అనవసరంగా చేపట్టిన శాసనాలను, అనవసరమైన ఆంక్షలను తొలగించాలని కోరారు.

5) పెట్టుబడిదారీ విధానం విస్తరించిన అనేకదేశాల్లో ఈ పెట్టుబడి వలన వృద్ధిచెందే పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు మొదలైన రంగాల్లో పనిచేసే మధ్యతరగతి ప్రాబల్యం హెచ్చుగా ఉంటుంది. వీరు రాజకీయంగా చైతన్యవంతులు; లోగడ భూస్వామ్య విధానం నుండి జాతీయ నియంతృత్వాల వైపు తమ దేశరాజకీయ వ్యవస్థలను మళ్ళించినారు. తరువాత ఉదార భావాలకు వీరే జన్మనిచ్చి, అనేకదేశాల్లో నియంతృత్వ రాజ్యాలను రాజ్యాంగబద్ధంగా అదుపుచేయడమూ, ప్రజాస్వామ్య విధానాలనూ ఏర్పరచడమూ వీరి కృషి ఫలితమే. అదే విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ వలన ఏర్పడే రాజకీయ సిద్ధాంతాలు, వ్యవస్థలు వారికి అనుగుణంగానే ఉంటాయని, అవి శ్రామిక శ్రేయస్సుకు తగినవికావని కమ్యూనిస్టు తత్త్వవేత్తలు వాదించసాగారు. ప్రభుత్వాలు పెట్టుబడిదారులు తమ సంపదలను మరింతగా పెంచుకొని, మరింతగా పెట్టుబడిని ఉత్పాదన చేసి మరింతగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తాయి. కారణమేమంటే, వారు అభివృద్ధి చెందిన కొలది ప్రభుత్వాలకు పన్నులు, సుంకాల రూపంలో ఆదాయం లభిస్తూంటుంది. ఈ విధంగా పెట్టుబడిదారులకు, ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు నడుమ ఏర్పడే అవగాహనలో శ్రామికవర్గం నలిగిపోతుంది. దోపిడీకి గురవుతుంది. ఈ విధమైన దోపిడీ వ్యవస్థ అంతం కావడం శ్రామికవర్గం ప్రభుత్వాధికారాన్ని, ఉత్పత్తిసాధనాలను స్వాధీనపరచుకొని, స్వయంగా నిర్వహించడం సాధ్యమైనపుడే.

6) ఈ విధమైన ఆలోచనలు తీవ్రస్థాయికి చెందిన మార్క్సిజం మాత్రమేకాక కొంత మృదువైన రీతిలో పలువురు సామ్యవాద సిద్ధాంతవేత్తలు (Socialists) కూడా ప్రతిపాదించారు. పారిశ్రామిక, వాణిజ్యవృద్ధి సాధించిన ఇంచుమించు అన్నిదేశాల్లో రాజకీయాలను ఈ సామ్యవాద సిద్ధాంతాలు ప్రభావితం చేశాయి. కాగా 1917లో రష్యా దేశంలో తీవ్రమైన ప్రజావిప్లవాన్ని ఈ సోషలిస్టు సిద్ధాంతాలు తీసుకొనివచ్చి పూర్వపు జారిస్టు నియంతృత్వపరిపాలనను అంతం చేసాయి. తదాదిగా అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ప్రారంభమైన జాతీయోద్యమాలు, స్వాతంత్ర్య పోరాటాలు సైతం ఈ విధమైన సామ్యవాద సిద్ధాంతాల నుండి

ఉత్తేజాన్ని పొందసాగాయి. వలసవాద విధానం కూడ పెట్టుబడిదారీ విధానానికి తోబుట్టువే కనుక ఈ స్వాతంత్ర్య పోరాటాలు సైతం శ్రామిక వర్గ విప్లవాలుగానే పరిగణించడం జరిగింది.

## 10.6 వ్యాపార వాదం (Mercantilism) :

భౌగోళిక పరిశోధనల ఫలితంగా నూతన భూభాగాలను కనుగొనడం జరిగింది. దీంతో వలసరాజ్యాల విస్తరణ పెరిగింది. ప్రపంచ వ్యాప్తమార్కెట్లు, వాణిజ్య వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. పాలక దేశాల వర్తకులు, వలస రాజ్యాల నుంచి ముడిసరుకులు సమకూర్చుకున్నారు. తయారైన సరకులను వలస రాజ్యాలలో అమ్మసాగారు. ఈ వ్యాపారం లాభదాయకంగా మారింది. ఈ రకంగా వాణిజ్యం విస్తరించడంతో ఐరోపాకు కొత్త కొత్త వ్యాపార పద్ధతులు అవసరమయ్యాయి. 1730 వరకు ఎన్నో మార్పులకులోనైన ఈ కాలాన్ని "వాణిజ్య విప్లవం" అని పిలుస్తారు. విస్తృతమైన భారీ బ్యాంకింగ్ వ్యవస్థ, ఉమ్మడి స్టాక్ కంపెనీలు ఏర్పడ్డాయి.

ఐరోపా దేశాలు, తమకు లాభాలు తెచ్చిపెట్టే వాణిజ్యాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి కొత్తకొత్త మార్గాలు కనిపెట్టాయి. ఈ పద్ధతులను వాటిని సమర్థించే పరిపాలన వ్యవస్థను 'వ్యాపారవాదం' అని అంటారు. దీని ప్రధాన లక్ష్యం ఐరోపా దేశాలనుంచి కొన్ని దానికంటే ఎక్కువ ధరలకు సరుకులను ఇతర దేశాలకు విక్రయించడము. విదేశీ సరుకుల దిగుమతులు తమ దేశంలో వెల్లువలా ముంచెత్తకుండా నిరోధించడానికి ఐరోపా దేశాలు వాటిపై ఎక్కువ సుంకాలు విధించాయి. ఫలితంగా విదేశీ సరుకుల అసలు ధరకు ఇవి తోడై స్వదేశస్తులు వాటిని కొనకుండా నిరోధించడం సాధ్యపడింది.

16వ శతాబ్దం మొదలు 18వ శతాబ్దం వరకు గల కాలాన్ని వ్యాపారవాద యుగంగా పరిగణిస్తారు. ఈ కాలంలోనే ఆధునిక జాతీయ రాజ్యాలతోబాటు "మర్కెంటైలిజమ్" అభివృద్ధి చెందింది. మర్కెంటైలిజంనే వ్యాపారవాద రాజ్యవ్యవస్థ అని పైన వివరించడం జరిగింది. అనగా రాజ్యపరిపాలనలో వ్యాపార ధోరణులను అవలంబించి, లాభార్జన ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వాన్ని నిర్వ హించడం. ఇది వర్తక వాణిజ్య వర్గాలకు అధిక శ్రేయస్సును చేకూర్చి, వారిని మరితంగా వృద్ధిచెంది, బలపడడానికి ఉద్దేశించింది. 16వ శతాబ్దంలోనే హాబ్స్, విలియం పెట్టి వంటివారు సమగ్రతత్వం గురించి ప్రచారం చేశారు. ప్రత్యేక తరహా అంతర్జాతీయ వాణిజ్యం ద్వారా ఇతర దేశాల నుండి వెండి, బంగారం ఇతర దేశాలకు తరలిపోకుండా కట్టుదిట్టాలు చేయడం ఆధునిక జాతీయ రాజ్యాలవిధి అని వీరు ప్రచారం చేశారు. ఈ సిద్ధాంతాన్నే 'స్వర్ణవాదం' అని పిలుస్తారు. 17వ శతాబ్దంలో వ్యాపార వాదంలో ముఖ్యమైన మార్పు చోటు చేసుకున్నది. దిగుమతులకు మించి అత్యధికంగా ఎగుమతులు సాగించడానికి ప్రాధాన్యత ఇవ్వబడింది.

వ్యాపార వాదం ముఖ్యమైన అంశాల జాబితా ఈక్రింది విధంగా ఉంటుంది.

1) జాతీయవాద స్ఫూర్తితో కఠినతర విధానాన్ని రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి.

2) దేశీయాంగ విధానాలు, విదేశీ వాణిజ్య విధానాలు రూపొందించేటప్పుడు ప్రతి అంశాన్ని దేశానికి గల బంగారం నిల్వలు దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి.

3) ఆర్థిక, రాజకీయ రంగాలను దృష్టిలోఉంచుకొని ఒకదానితో మరొకదానిని సాధించేందుకు అనువైన విధంగా విదేశాంగ విధానాలను రూపొందించాలి.

4) దేశంలో బంగారు, వెండి నిల్వలు పెరిగేందుకు వీలుగా ఎక్కువగా ఎగుమతులు సాగిస్తూ దిగుమతులను తగ్గించుకోవాలి.

5) విదేశీ మారకద్రవ్య నిల్వలలో కొరత పూరించేందుకు కూడా ఎగుమతులను అధికం చేయాలి.

ఆధునిక జాతీయ రాజ్యాలు రాజకీయ సుస్థిరత సాధించాక ఆర్థిక రంగాలలో నిలకడ సాధించడానికి ప్రభుత్వ జోక్యాన్ని ప్రారంభించాయి. కొన్ని పరిశ్రమలపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని సాధించడం ద్వారా దీనికి శ్రీకారం చుట్టాయి. కొన్ని పరిశ్రమలను, వ్యాపారాలను పన్నుల నుంచి మినహాయించడం రెండోదశ. ప్రభుత్వానికి కూడా సరుకులను సరఫరా చేసే సంస్థలను ప్రభుత్వ యాజమాన్యంలో నెలకొల్పడం మూడోదశ. 16వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో ఈ పరిణామాలన్నీ సంభవించాయి.

వ్యాపార వాదం రోజులలో ఇంధనంగా బొగ్గువాడకం, కారులను అభివృద్ధి చేయడంతోబాటు పడవలు, నౌకలు వాడుకలోకి తేవడం అనే ముఖ్యమైన మార్పులు వచ్చాయి. గనుల త్రవ్వకానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో బొగ్గు విరివిగా వాడుకలోనికి వచ్చింది. పడవలు, నౌకలు వాడకంలోకి వచ్చాక భారీప్రయాణాలు, సరుకులను చౌకగా రవాణా చేయడం సులభతరమైంది. తుపాకీ మందు, ఫిరంగులు కనుగొనడంతో సముద్ర ప్రయాణానికి భద్రత చేకూరింది. దేశాలలోపల, విదేశాలలో మార్కెట్ల విస్తరణ జోరుగా సాగింది.

మార్కెట్లలో వచ్చిన మార్పులు పారిశ్రామిక నిర్వహణలో మార్పులకు దారితీసింది. ఉదాహరణకు 'పుట్టింగ్ ఔట్‌సిస్టమ్' లేదా 'వెర్లాంగ్ సిస్టమ్' వంటివి ప్రవేశించాయి. ఈ వ్యవస్థలో వర్తకుడు ఉత్పత్తి కేంద్రస్థానంలో భిన్న చేతివృత్తుల వారితో నేరుగా సంబంధాలు కలిగిఉంటాడు. ఉదాహరణకు ఒక జౌళివర్తకునికి నేతపనివారితో, వడికేవారితో, రంగులు అద్దేవారితో నేరుగా సంబంధాలుంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో శ్రమ విభజన జరిగి ప్రత్యేక తరహా పనులకు నిపుణులు ఏర్పడతారు. దీనితో ఉత్పత్తి పెరిగి వర్తకులపై చేతివృత్తులవారు ఆధారపడే పరిస్థితి ఎక్కువ అవుతుంది.

వ్యాపార వాద యుగంలో పెట్టుబడి పురోభివృద్ధి సామాజిక, సాంస్కృతిక పురోభివృద్ధితోబాటు చోటు చేసుకుందని వెబర్ భావించాడు. వారి సిద్ధాంతం ప్రకారం 'ప్రొటెస్టాంటిజం' వ్యాప్తి చెందినంతకాలం ప్రజలు ఎంతో కొంత వెనకేసుకోవాలని తహతహలాడారు. ఇది పెట్టుబడి మూలధనం పేరుకోవడానికి కారణమైంది. నూతన ప్రపంచానికి, ఐరోపాకు మధ్య సంబంధాలు పెరిగినకొద్దీ కొత్త భూభాగాలనుంచి వెండి, బంగారం ఐరోపాకు మళ్ళిన తరువాతే పారిశ్రామిక విప్లవ కాలంలో అవసరమైన పెట్టుబడి మూలధనం వృద్ధిపొందిందని ఈ.జె. హేమిల్టన్ భావించాడు.

## 10.7 వలసవాదం (Colonialism) :

పారిశ్రామిక విప్లవం తరువాత ముడిసరుకుల సరఫరాకి కొత్తగా అవసరాలు ఏర్పడడంతో ఐరోపాదేశాలు వలస రాజ్యాల స్థాపనకై పోటీపడసాగాయి. తయారైన సరుకులకి వలసల ద్వారా భారీ మార్కెట్‌లు ఏర్పాటు చేయాలని యూరప్ భావించింది. అంతేగాక, ఆయుధ తయారీ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల తక్కువ ఖర్చుతో, తక్కువ ప్రాణనష్టంతో వలస రాజ్యాలను జయించవచ్చునన్న నమ్మకం యూరప్ దేశాలకు పెరిగింది. వ్యూహాత్మకంగా కూడా యూరోపియన్లకి వలస రాజ్యాలు అవసరమయ్యాయి. వారి ఆవిరి నౌకలు బొగ్గు, ఇంధనం నింపుకోవడానికి రేవులు అవసరమయ్యాయి. ఆఖరుకు వలస రాజ్యాల ఉనికి నాటి పాలక రాజ్యాల ప్రతిష్ఠకీ, అధికార బలానికీ నిదర్శనాలయ్యాయి.

19వ శతాబ్దిలో ఐరోపా అంతటా జాతీయవాద స్ఫూర్తి పెరగడం కూడా వలసరాజ్యాల స్థాపనకి దారితీసింది. బెంజిమన్ డిస్రాయిలీ, విలియమ్ గ్లాడ్‌స్టోన్ అనేక ఇద్దరు ప్రధానమంత్రుల హయాంలో బ్రిటిష్‌వారి సామ్రాజ్య ప్రాభవం గణనీయంగా విస్తరించింది. దక్షిణాఫ్రికాలో వజ్రాలు, బంగారం బయటపడడంతో బోయర్ యుద్ధం సంభవించింది. దానిలో బ్రిటన్ డచ్చి వలస పాలకులను తరిమివేసి దక్షిణాఫ్రికా భూభాగాలు చేజిక్కించుకుంది. ఆఫ్రికా, ఆసియా, మధ్యధరా సముద్రదేశాలు, కరేబియన్ దీవులలో బ్రిటన్ వలసరాజ్యాలు స్థాపించడంతో బ్రిటిష్‌వారు తమది 'రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం' అని సగర్వంగా చాటుకున్నారు. ఫ్రాన్స్ జనాభాకంటే ఫ్రాన్స్ వలస రాజ్యాలలో జనాభా రెండురెట్లు అధికం. ఫ్రాన్స్‌కు ఆఫ్రికా, దూరప్రాంతం, లాటిన్ అమెరికాలలో వలస రాజ్యాలు ఉన్నాయి. బెల్జియం, ఇటలీ, జర్మనీ, హాలెండ్ కూడా క్రమంగా ఆ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి జరిగిన కొలది, వలస రాజ్యాల స్థాపనకు పోటీలో దిగాయి.

వలసీకరణ ప్రపంచంపై అనేక విధాలుగా ప్రభావం చూపింది. చైనాలో వలసీకరణ భాగంగా పశ్చిమ దేశాల వర్తకులు, పరిశ్రమలవారు ఆ దేశాన్ని బలహీనపరచి, అస్థిరతపాలు చేశారు. తాము ఆర్థిక ప్రయోజనాలు పొందే విధంగా వలసీకరణ సాగింది. జపాన్ వలస రాజ్యాల స్థాపనలో పశ్చిమ దేశాలతో పోటీపడటం నేర్చింది. 20వ శతాబ్దంలో ఆదేశం సామ్రాజ్యవాద పోకడలు పోయిందంటే పశ్చిమ దేశాల ప్రభావం వల్లనే. ఆఫ్రికాలో భూభాగాలను యూరోపియన్లు స్వాధీనపరచుకొన్నాక ఆఫ్రికన్ సాంప్రదాయిక సమాజం విచ్ఛిన్నమైంది. ఆఫ్రికన్ స్వజాతి జనాభా బలవంతంగా నగరాలకు వలసపోవలసిన పరిస్థితి రుద్దబడింది. నగరాలలో ఆఫ్రికన్లను తక్కువజాతి మానవులుగా పరిగణించారు. యూరోపియన్లు ఆఫ్రికా రాజ్యాలకు నిర్ణయించిన సరిహద్దులు సాంప్రదాయిక గిరిజనులు పాటించిన సరిహద్దు పరిధుల ప్రకారం జరగలేదు. ఆఫ్రికన్ ఆర్థిక వ్యవస్థలు యూరోపియన్ల ప్రయోజనాలకు అనుగుణంగా లేకపోవడంతో వారు వాటిని తమ పెట్టుబడులతో మార్పులకు లోనుచేశారు. వలసీకరణలో యూరోపియన్లు తమ ప్రయోజనాల సాధనకు అనువైన విధానాలు అవలంబించడంతో ఇతర దేశాల ప్రజలకు శాశ్వతంగా హాని కలిగింది.

19వ శతాబ్దం ఉత్తరార్థంలో వలసలు అనే పదం శ్వేత జాతీయులు స్థిరపడిన అన్యభూభాగాలు అనే అర్థంతో పరిమితమైంది. అప్పట్లో ఒక వలస దాని పాలకరాజ్యంలో భిన్నమైన రాజకీయ హోదా కలిగిఉండి పాలక రాజ్యంపై ఆధారపడడాన్ని సూచించే విధంగా ఈ నిర్వచనం ఉంది. ఇలా నిర్వచించడంలో ఒక రకమైన తటస్థ వైఖరి కనిపిస్తుంది. కాని 20వ శతాబ్దంలో నిర్వచనం మారి వలసవాద వ్యవస్థ అనే స్పృహతో కూడుకొని వలసరాజ్యాలు కూలిపోయే దశనాటి విమర్శనాత్మక ధోరణి సంతరించుకుంది. సామ్రాజ్యవాదానికి పట్టినగతే వలసవాదానికి కూడా ప్రాప్తించింది. అన్య భూభాగాలను కలిపివేసుకోవడం, వాటిని తమ చెప్పుచేతల్లో అణగద్రొక్కి ఉంచడం అనే రెండింటినీ సూచించేందుకు యూరోపియన్ విమర్శకులు 1900 తరువాత తమ సైద్ధాంతిక ప్రయోజనాల పరిధిలోపల ఈ సామ్రాజ్యవాదం అనే పదాన్ని నిందార్థంలో తప్పుడుగా ప్రయోగించారు. 20వ శతాబ్దం మధ్య నాటికి వలసవాదం అనే పదాన్ని కూడా ఇలా నిందార్థంలో వాడకం మొదలైంది. ఈ రెండు పదాలు క్రమంగా పరిణామం పొంది స్పష్టమైన అర్థం సంతరించుకొన్నాయి. సామ్రాజ్యవాదం అంటే యూరోపియన్ల సామ్రాజ్య విస్తరణ కాంక్ష అని చెప్పుకోవచ్చు. మార్క్సిస్టులు ఈ పదాన్ని సామ్రాజ్యాల సేకరణలో పెట్టుబడిదారీ సమాజాలు ప్రదర్శించే ప్రత్యేక గుణంగా నిర్వచించారు. వలసవాదాన్ని యూరోపియన్, పశ్చిమ దేశాలు తమపై ఆధారపడిన రాజ్యాలపై విధించిన సంక్లిష్టమైన రాజకీయ, ఆర్థిక ఆంక్షలకు పర్యాయపదంగా వాడడం మొదలైంది. అందుచేత వలసవాదం అంటే వలసరాజ్యాల విస్తరణ దశ తరువాత సామ్రాజ్యవాద దేశాలు తమపై ఆధారపడి ఉన్న రాజ్యాలు తమ చెప్పుచేతల్లో అణగి ఉండడానికి నిర్మించిన ఆంక్షల వ్యవస్థగా అర్థం చెప్పుకోవాలి. సామ్రాజ్యవాదం అనే పదం 15వ శతాబ్దం నుంచి యూరోపియన్ దేశాలు తమ రాజకీయ, ఆర్థిక, నైతిక నియమ నిష్ఠలను, అన్య రాజ్యాలకు చేరవేయడంగా అర్థం సంతరించుకుంది. ఇది యూరోపియన్ సమాజానికి గల పదండి ముందుకు పదండి తోసుకు అనే విధమైన చొరబాటు గుణాన్ని వర్ణించే నిర్వచనం. అందుచేత ఈ రెండు పదాలనూ తరచుగా పర్యాయ పదాలుగా వాడడం జరుగుచున్నది. సన్నిహిత అర్థసామ్యం గల ఈ రెండు పదాలూ ఒకే అర్థం గలవికావు. 16, 18 శతాబ్దాల మధ్యనే యూరప్ అయోమయం నుంచి బయటపడి మహాసముద్రాలపై అదుపు సంపాదించడంతో పాటుదాదాపు జనరహితంగా ఉన్న అమెరికా భూభాగాలను ఆక్రమించుకుంది. ఐతే ఇప్పటికీ ఆసియా, ఆఫ్రికాలపై యూరప్ ప్రభావం పెద్దగా లేదు. 18వ శతాబ్దం వరకూ ఆఫ్రికాలో సముద్ర తీరాల వెంబడి కొన్ని బానిస వ్యాపార కేంద్రాలు ఉండగా, ఆఫ్రికా దక్షిణాగ్రాన బోయర్‌లు స్వల్ప సంఖ్యలో స్థిరపడి ఉన్నారు. అదేవిధంగా భారతదేశంలో కూడా యూరోపియన్లు కేవలం కొన్ని కోస్తా వాణిజ్యకేంద్రాలు నడుపుతున్నారు. అంటే సముద్రానికి దూరంగా ఉన్న విస్తారమైన భూభాగంపై వారి కన్ను ఇంకా పడలేదు.

ఆసియా విస్తీర్ణం 1914 నాటికి 16కోట్ల 819 లక్షల చదరపు మైళ్ళుకాగా, దానిలో 94 లక్షల 43 వేల చదరపు మైళ్ళ భాగం యూరప్ ఏలుబడిలోకి వచ్చింది. ఇందులో 6 కోట్ల 54 లక్షల 94 వేల చదరపు మైళ్ళు రష్యా క్రింద, 19 లక్షల 98 వేల

చదరపు మైళ్ళు బ్రిటన్ క్రింద, 5 లక్షల 87 వేల చదరపు మైళ్ళు హాలెండ్ కింద, లక్షా 14 వేల చదరపు మైళ్ళు అమెరికా క్రింద, కేవలం 193 చదరపు మైళ్ళు జర్మనీ క్రింద వలసలుగా మారాయి. ఇందుకు విరుద్ధంగా 1914 నాటికి ఆసియాలో నిజమైన స్వతంత్ర రాజ్యంగా జపాన్ ఒక్కటే మిగిలింది. దీని విస్తీర్ణం కేవలం లక్షా 61 వేల చదరపు మైళ్ళు మాత్రమే. ఈ వలస సొత్తులు ఐరోపాలో కలిసిపోయిన భూభాగాలు కాక తక్కిన భూగోళం అంతా స్వతంత్ర రాజ్యాలతో కూడుకొని ఉన్నా అవి పూర్తిగా స్వతంత్ర రాజ్యాలుగా కాక వలస రాజ్యాలుగా మిగిలాయి. వీటిలో చైనా, ఒట్టోమన్ సామ్రాజ్యాలు కూడా ఉన్నాయి. ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, నేపాల్ వంటి చిన్న రాజ్యాలు ఉన్నాయి. ఈదేశాలన్నీ యూరప్ సైనిక, ఆర్థిక ఆధిపత్యం చవిచూశాయి. వాటికి పేరుకి మాత్రమే యూరోపియన్ దేశాలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుమతించాయి. ఈ విధంగా 1914 నాటికి భూగోళం మొత్తం యూరప్ ఆధిపత్యం కిందకు వచ్చింది. కొన్ని శతాబ్దాలక్రింద పోర్చుగీసు కెప్టెన్లు ఆఫ్రికా తీరం దిగువ ప్రాంతాలకు విస్తరించడం మొదలు పెట్టిన తరువాత పరిణామాలు క్రమంగా తారా స్థాయికి చేరి యూరప్ ఆధిపత్యానికి దారితీసాయి. యురేషియాలో ఒక ద్వీపకల్పంగా ఉన్న పోర్చుగల్ ఇప్పుడు చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా, ప్రపంచానికి కేంద్ర బిందువుగా మారింది. ఎంతో అధికార బలాన్ని చేజిక్కించుకొంది. రాను రాను యూరప్ ప్రాబల్యం పెరిగి 1914 నాటికి దాని ఆధిపత్యం విస్తరించడమే కాక వేళ్ళు పాతుకొని ప్రపంచ ఆర్థిక శక్తులను అది అపారంగా అదుపు చేయగలిగింది. ఇది ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని పరిణామం. ప్రపంచానికి యూరప్ బ్యాంకర్‌గా మారింది. ఖండాంతర రైలుమార్గాలు నిర్మించడమూ, సముద్ర ప్రాంతాలన్నింటినీ సంధానం చేసి కాల్వల నిర్మాణం, గనుల త్రవ్వకం, తోటల పెంపకం వంటి బృహత్ కార్యాలకు పెట్టుబడులు సమకూర్చే స్థాయికి యూరప్ ఎదిగింది. అలాగే యూరప్ కేవలం బ్యాంకర్ గానే కాక ప్రపంచానికే పారిశ్రామిక కార్ఖానాగా మారింది. 1870 నాటికి ప్రపంచం మొత్తంలోని పారిశ్రామిక ఉత్పత్తిలో ఒక్క యూరప్ ఉత్పత్తే 64.7 శాతం. యూరప్ నుంచి పెట్టుబడి, నిధులు, సాంకేతిక పరిజ్ఞానం నలుమూలలకూ ప్రవహించాక ప్రపంచంలో ముందెన్నడూ లేని ఆర్థిక ఐక్యత సాధ్యపడింది.

1914 నాటికి సముద్ర మండలాల్లో 5 లక్షల 16 వేల కిలోమీటర్ల కేబుల్స్ వేశారు. అలాగే భూగోళ ఉపరితలంపై అత్యధిక విస్తీర్ణంలో టెలిగ్రాఫ్, టెలిఫోన్ లైన్లు నెలకొల్పారు. 1914 నాటికి 30 వేల ఓడలు 5 కోట్ల టన్నుల సరుకులను ప్రపంచంలోని ఒక మూల నుంచి మరో మూలకి చేరవేశాయి. ప్రపంచ వాణిజ్యానికి అవసరమైన ఎన్నో కాలువలను నిర్మించారు. అలాంటి ముఖ్యమైన కాలువలలో సూయేజ్ కూడా ఒకటి. ఈ కాలువ నిర్మాణం వల్ల పశ్చిమ యూరప్‌కు భారతదేశానికి మధ్య దూరం నాలుగువేల మైళ్ళు తగ్గింది. 1914 లో నిర్మించిన పనామా కాలువ మరో ముఖ్య కాలువ. న్యూయార్క్‌కు, శాన్‌ఫ్రాన్సిస్కోకు మధ్య 8 వేల మైళ్ళ దూరం ఈ కాలువవల్ల తగ్గిపోయింది. ఖండాంతర రైలు, రోడ్ల నిర్మాణం వల్ల ఇతర ఖండాలను ఆర్థికంగా దోచుకోవడానికి మార్గం ఏర్పడింది. ఖండాల మధ్య ఆర్థిక సమైక్యత సాధ్యపడ్డాక ప్రపంచంలో ఉత్పాదకత అపారంగా పెరిగింది. 1860 - 1914 మధ్య ప్రపంచంలో ఉత్పత్తి ఆరురెట్లు పెరిగింది. అలాగే 1851 - 1913 మధ్య ప్రపంచ వాణిజ్యం 12 రెట్లు పెరిగింది. ఈ ఆర్థిక వాణిజ్యం పురోగతిలో అత్యధిక ప్రయోజనాలు యూరప్‌కే దక్కాయనడంలో సందేహంలేదు. భూగోళం అంతటా పరిస్థితులు ఎలా ఉన్నాయో గణాంక వివరాలు లభ్యం కానప్పటికీ, వలస రాజ్యాలలో ఆదాయం నిష్పత్తి 1800 సంవత్సరం నాటికి 1:3 కాగా, 1914 నాటికి 1:7 కి పెరిగింది. అంటే వలస రాజ్యాలలో తలసరి ఆదాయం అలాగే ఉండగా, యూరప్‌లో తలసరి ఆదాయం రెట్టింపుగా పెరిగింది.

## 10.8 ఐరోపా దేశాల మధ్య వలసవాద ఘర్షణలు :

పారిశ్రామికాభివృద్ధి, వర్తకవాణిజ్యాల విస్తరణ ఐరోపాలోని అభివృద్ధి చెందిన దేశాలకు వలసల ఆవశ్యకతను ఏర్పరచాయి. క్రమంగా ఈ విధమైన ఆర్థికవ్యవస్థ ఐరోపా రాజ్యాలన్నిటా వ్యాపిస్తున్న కొలది, ఆ దేశాలు ఆసియా, ఆఫ్రికా దేశాలను వలసలుగా మార్చుకొని ఆధిపత్యం నెలకొల్పసాగాయి. కాగా, ఎంత ఎక్కువ వలసలపై ఆధిపత్యం ఉంటే అంతగా ఆర్థికాభివృద్ధి సాధ్యమైంది. అంతగా ఆదేశాల ప్రతిష్ఠ గణనకు వచ్చింది. ఈ కారణాల వలన ఐరోపాదేశాలు వలస రాజ్యాల కొరకు పోటీపడసాగాయి.

ఐరోపా రాజ్యాలు 15వ శతాబ్దం నుండి అనేక వలసలు స్థాపించాయి. 15, 16 శతాబ్దాలలో పోర్చుగల్, స్పెయిన్ దేశాలు అమెరికాలో వలసలు, ఆసియాలో వర్తక కేంద్రాలు స్థాపించుకున్నాయి. క్రమంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్, హాలెండ్‌లు కూడా వలసల పోటీకి దిగాయి. వర్తకం, మతవ్యాప్తి, స్థావరాల ఆకాంక్ష, జాతీయ ప్రతిష్ఠలు ఈ వలస రాజ్యాల స్థాపనకు తోడైనాయి. కాని ఈ వలస రాజ్యాల స్థాపన 18వ శతాబ్దంలో, 19వ శతాబ్దం ప్రారంభంలో మరుగునపడింది. ఐరోపా రాజ్యాలు తమ భూభాగాల్లోనే ఎన్నో సంక్షోభాలకు గురైనారు. 1820 నాటికి అనేక రాజ్యాలు తమ వలసలను పోగొట్టుకున్నాయి. స్పెయిన్, పోర్చుగల్, అమెరికా వలస రాజ్యాలను పోగొట్టు కొన్నాయి. అలాగే ఫ్రాన్స్ తూర్పుదేశాలలోను, అమెరికా ఖండంలోను తన వలసలను పోగొట్టుకొంది. ఇంగ్లండ్‌కు విరుద్ధంగా 13 అమెరికా రాష్ట్రాలు తిరుగుబాటు చేసి స్వతంత్రమైనాయి. 1870 నాటికి వలసరాజ్యాల స్థాపనకు వ్యతిరేకత ఐరోపాలోని అన్ని జాతీయ రాజ్యాలలో ద్యోతకమైంది. అయితే ఇదే సమయంలో ఐరోపా రాజ్యాలు తిరిగి వలసల విస్తరణకై 1870 నుండి ఒకరితో ఒకరు పోటీపడి సామ్రాజ్యవాదులైనారు. వలసరాజ్య విధానం 1870 నుండి సామ్రాజ్యవాదంగా మారి ఎన్నో సంక్షోభాలకు దారితీసి చివరకు మొదటి ప్రపంచ యుద్ధ కారణాలతో ఒకటయింది.

### 10.8.1 ఐరోపా రాజ్యాల మధ్య వలస సంఘర్షణలు :

ఐరోపా రాజ్యాలు ప్రపంచంలోని వెనుకబడిన ప్రాంతాలను తమ ఆధీనంలోనికి తెచ్చుకొనుటకు ప్రయత్నించాయి. ఫలితంగా ఐరోపా రాజ్యాల వలస సామ్రాజ్యం విస్తరించింది. భూగోళ పరిశోధనలవల్ల ఇండియాలో పోర్చుగీసువారు, తరువాత డచ్చివారు, ఆంగ్లేయులు, ఫ్రెంచివారు వ్యాపారం మొదలుపెట్టారు. వారి మధ్య ఈర్ష్యా ద్వేషాల వల్ల పోటీ ఏర్పడింది. ఈ పోటీలో చివరిగా ఆంగ్లేయులు విజయం సాధించి ఇండియాను స్వాధీనం చేసుకున్నారు. నూతనంగా కనుగొనబడిన అమెరికాలో పోర్చుగీసు, స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లు పోటీపడ్డాయి. అయితే 1783 నాటికి అమెరికా ఇంగ్లండ్‌ను ఓడించి స్వతంత్రమైనది. పారిశ్రామిక విప్లవ ఫలితంగా నూతన వలసలు సంపాదించుటకు ఐరోపావారు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఆఫ్రికా, చైనాలు వారి కంటపడ్డాయి. ఐరోపా రాజ్యాలు తమ దృష్టిని ఆ ప్రాంతాలపై సారించి ఆక్రమించారు. ఈ క్రమంలో ఐరోపా రాజ్యాల మధ్య అనేక స్పర్థలు, సంఘర్షణలు ఏర్పడ్డాయి.

### 10.8.2 సామ్రాజ్యవాదం :

వలసవిధానం ఒక్క ఆర్థిక కారణాలకే పరిమితమైతే, సామ్రాజ్యవాదంలో ఆర్థికావసరాలకు రాజకీయ ప్రయోజనాలు తోడైనాయి. ఈ నూతన సామ్రాజ్యవాదంలో ఆఫ్రికా, ఆసియాలు ఐరోపా రాజ్యాల సామ్రాజ్యపోటీకి గురైనాయి. 1870 నాటికి ఈ ప్రాంతాలపై ఐరోపా ప్రభావం అంతగా లేకపోయినప్పటికీ తరువాత 40 సంవత్సరాల కాలంలోనే ఈ భూభాగాలన్నీ ఐరోపా వలసలుగా మారిపోయాయంటే ఈ సామ్రాజ్యవాదం ఎంత త్వరితంగా విస్తరించిందో ఊహించుకోవచ్చును.

'సామ్రాజ్యవాదం' అనే పదం 18, 19 శతాబ్దాలలో బాగా వాడుకలోనికి వచ్చింది. 1870 తరువాత 'సామ్రాజ్యవాద యుగానికి' చెందుతుంది కాని సామ్రాజ్యవాదం అనే పదం గురించిన అవగాహనలో మాత్రం పూర్తిగా మార్పు వచ్చింది. అప్పటినుంచి సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాదతత్వం అగౌరవాన్ని సూచించాయి. విపరీతంగా పారిశ్రామికాభివృద్ధి సాధించిన పశ్చిమ, మధ్య ఐరోపా దేశాలలో ఉత్పన్నమైన ప్రత్యేక ఆర్థిక శక్తులవల్ల వలసతత్వం ఏర్పడిందని బ్రిటిష్ ఆర్థిక శాస్త్రవేత్త హాబ్సన్, తరువాత లెనిన్ చెప్పారు. సామ్రాజ్యవాదానికి వారు ఆర్థిక సంబంధాన్ని సూచించారు. తమ వలస విధానానికి ఐరోపా రాజ్యాలవారు చాలా సందర్భాలలో నైతిక, మతపరమైన కారణాలు చూపినా, త్వరలోనే వలసవాదపు అసలు స్వరూపం బయటపడింది. వలస విధానంలో పాత్ర వహించిన ప్రధాన కారణాలు చౌకగా ముడి పదార్థాలను సంపాదించుకోవడం, ఉత్పాదిత వస్తువులను ఎక్కువ ధరలకు విక్రయించడం. వలస వాదంలో ఆర్థిక దోపిడీ ముఖ్యపాత్ర పోషించింది. వలసయుగంలో జరిగిన సంఘటనలను, వాటికి బాధ్యులైన వ్యక్తులను, రాజకీయ సంస్థలను హాబ్సన్, లెనిన్ ఖండించారు. అధిక మూలధనం ఏర్పడి, దాన్ని ఇంకా అధిక లాభాల కోసం పెట్టుబడి దారులు వినియోగించుకోవడానికి చేసిన ప్రయత్నాలవల్ల సామ్రాజ్యవాదం ఏర్పడిందని హాబ్సన్

సిద్ధాంతీకరించాడు. సమాజంలో ఏర్పడిన ఆర్థిక అసమానత అధిక పెట్టుబడులకు దారితీస్తుంది. 19వ శతాబ్దం చివరలో పశ్చిమ దేశాలవారు అధిక లాభాల కోసం ఇతర దేశాలలో పెట్టుబడులు పెట్టడం వలన సామ్రాజ్యవాదం ప్రబలిందని హాబ్సన్ విశ్లేషించి వివరించాడు. పెట్టుబడిదారీ విధానం వల్ల సామ్రాజ్యవాదం ఏవిధంగా ఏర్పడుతుందో లెనిన్ తన పరిశోధనా వ్యాసంలో వివరించి చెప్పాడు. సముద్ర మార్గాలు సామ్రాజ్యవాదానికి అనుకూలించాయని మొదటి ప్రపంచ యుద్ధం కేవలం పెట్టుబడిదారీ రాజ్యాల స్వలాభం కోసం జరిగిన యుద్ధం తప్ప మరొకటి కాదని లెనిన్ చెప్పాడు.

జర్మనీ ఏకీకరణ తరువాత ప్రపంచం మొత్తంలో ఐరోపా ప్రభావం బాగా విస్తరించింది. తమ వలస విధానాలలో ఐరోపావారు ఎటువంటి నైతిక విలువలూ పాటించలేదు. ఈ సందర్భంలో ఐరోపావారిని అదుపులో పెట్టడానికి ఏ విధమైన ప్రపంచ సంస్థ లేదు. ఐరోపా రాజ్యాల వారి మధ్య ఏర్పడ్డ పోటాపోటీ, స్పర్థలు వారి వారి వలసల్లో ప్రతిబింబించాయి. రాజకీయ అవినీతి, ఆర్థికదోపిడీ సామ్రాజ్యవాదంలో అంతర్భాగాలయ్యాయి.

### 10.8.3 ముడిపదార్థాల వేట, పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్లు :

పారిశ్రామిక విప్లవ కారణంగా యంత్ర సాయంతో ఉత్పత్తులు ఎన్నో రెట్లు అధికమైనాయి. ఈ ఉత్పత్తులకు కావలసిన ముడి పదార్థాలకై ఐరోపా రాజ్యాలు ఇతర ప్రాంతాలలో సామ్రాజ్యాలు స్థాపించారు. ఐరోపాలో మిగిలిపోయిన పెట్టుబడులు ఈ దేశాల్లో నియోగించి లాభాలు పొందారు. ముఖ్యంగా ఐరోపాలోని కర్మాగారాలకు సమశీతోష్ణ మండలాలైన ఆఫ్రికా, ఆసియా ముడిసరుకులు అవసరమైనాయి. వీటిలో ప్రత్తి, పట్టు, రబ్బరు,ఖనిజాలు ముఖ్యమైనవి. అంతేగాక ఉత్పత్తి అయిన సరుకులను అమ్మడానికి మార్కెట్లు కావలసి వచ్చింది. 1870 నాటికి బ్రిటిష్ వస్తువులు ఎన్నో మిగతా ఐరోపా రాజ్యాలలో కొనుగోలు చేయబడేవి. కాని క్రమంగా అన్ని ఐరోపా రాజ్యాలు స్వయం సమృద్ధి చెంది బ్రిటిష్ వస్తువుల దిగుమతి నిషేధించాయి. దీంతో మార్కెట్లకు ఆఫ్రికా, ఆసియాలు శరణ్యాలైనాయి.

### 10.8.4 పేరు ప్రతిష్ఠలు కొరకు :

ఈ ఆర్థికావసరాలకు తోడు నూతన సామ్రాజ్యవాదంలో కొన్ని రాజకీయ కారణాలు కూడా తోడైనాయి. వ్యక్తుల వలనే, రాజ్యాలు కూడా కొన్ని బూటకపు పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడడం జరిగింది. అందువల్లనే ఎగుమతి చేయాల్సిన ఉత్పత్తులు లేకపోయినా, పెట్టుబడులు సున్నా అయిన రష్యా, ఇటలీలు ఈ కాలంలో సామ్రాజ్య పోటీలో దిగాయి. సామ్రాజ్య స్థాపనకు జాతీయ గౌరవానికి చిహ్నమయింది.

### 10.8.5 రాజ్యాల భద్రత :

యుద్ధ ప్రయోజనాలకై, తమ రాజ్యాల భద్రతకై మిగతా ఖండాలలో స్థావరాలు ఏర్పరచుకోవడం జరిగింది. దీనికి ఉదాహరణ ఫ్రెంచి వారిచే సైప్రస్ ఆక్రమణ.

### 10.8.6 జనాభా పెరుగుదల :

20వ శతాబ్దం ప్రారంభంలోనే జనాభా పెరుగుదల ఐరోపాకు సమస్యగా పరిణమించడం మొదలైంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించాయి. కానీ, విదేశీయులు స్థావరాలేర్పరచుకొనే విషయంలో అమెరికా, ఆస్ట్రేలియాలలో నిబంధనలు ఏర్పరచడం వల్ల ఐరోపా రాజ్యాలవారు విధిగా ఆఫ్రికా, ఆసియాలపై దృష్టి మరల్చవలసి వచ్చింది.

### 10.8.7 అన్వేషకులు, సాహసికులు :

వలసల స్థాపన విషయంలో ఆర్థిక, రాజకీయ స్వప్రయోజనాలేగాక ఇతర శక్తులు కూడా ప్రవేశించాయి. అన్వేషకులు, సాహసికులు ఐరోపావారికి తమ తమ వలస విధానాలలో బాగా అండగా నిలచారు. ఫ్రాన్స్‌కు చెందిన దుషైలూ, దబ్రజాలు ఆఫ్రికాలోని భూమధ్య రేఖా ప్రాంతాలను, బ్రిటన్‌కు చెందిన హెన్రీ మార్టిన్, స్టాన్లీలు మైదానాన్ని అన్వేషించారు. కారల్ పీటర్స్ అనే జర్మన్ అత్యంత చొరవ ప్రదర్శించి తన దేశం వలసలను స్థాపించుకొనడంలో చాలా సహకరించాడు.

### 10.8.9 క్రైస్తవ మిషనరీలు :

వలసల స్థాపనలో క్రైస్తవ మిషనరీలకు కూడా ప్రముఖ పాత్ర ఉన్నది. ఈ కాలంనాటి మిషనరీలలో అగ్రగణ్యుడు స్కాట్‌లాండ్‌కు చెందిన డేవిడ్ లివింగ్‌స్టన్. లండన్ మిషనరీ సొసైటీవారు మొదట ఇతనిని వైద్యునిగా ఆఫ్రికాకు పంపించారు. ఆ తరువాత అతను మత ప్రచారకుడిగా తిరిగి ఆఫ్రికా వెళ్ళాడు. నైల్ నది జన్మస్థలం కనుక్కొనే అన్వేషణలో ఆయనకు కొంతకాలం ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోయాయి. ఆయనను వెతకడానికి స్టాన్లీని పంపించారు. 1872లో లేక తాంగనైకా ఒడ్డున లివింగ్‌స్టన్‌ను స్టాన్లీ కనుగొన్నాడు. బ్రిటన్ కన్నా ఫ్రాన్స్, ఎక్కువమంది మిషనరీలను ఆఫ్రికాకు తరలించింది. మూడో ఫ్రెంచి రిపబ్లిక్ కాలంలో అధిక సంఖ్యలో మిషనరీలు ఆఫ్రికాకు తరలివెళ్ళారు. దూరప్రాచ్యంలో కూడా ఫ్రెంచి మిషనరీల సంఖ్య బాగా పెరిగింది. ఆఫ్రికాలోని అన్ని ప్రాంతాల్లోకి ఫ్రెంచి మిషనరీలు చొచ్చుకువెళ్ళారు. 1878లో బెల్జియమ్ మిషనరీలు కాంగో నదీ పరీవాహక ప్రాంతాలలో అత్యంత ఉత్సాహంగా క్రైస్తవ మత ప్రచారం చేశారు.

## 10.9 ఆఫ్రికా కొరకు కుమ్ములాటలు :

ఐరోపా దేశాల మధ్య ఆఫ్రికా పంపకం ఏ విధంగా జరిగిందో తెలుసుకుందాం. ఆఫ్రికాకు చీకటి ఖండం అని పేరు ఉండేది. ఇది వైశాల్యంలో ఐరోపా కన్నా మూడింతలెక్కువ. ప్రపంచంలోని అత్యంత ప్రాచీన నాగరికతా కేంద్రాలలో ఒకటైన ఈజిప్టు నాగరికత ఆఫ్రికా ఖండంలోని నైలునది దిగువలోయలో విలసిల్లింది. అతి ప్రాచీన కాలం నుంచి ఆఫ్రికా ఉత్తరకోస్తా ప్రాంతం ఐరోపా వారికి తెలుసు. భౌగోళిక పరిశోధనల వల్ల ఆఫ్రికా ఖండం ఎంత పెద్దదో ఐరోపావారికి తెలియవచ్చింది. కానీ ఆఫ్రికా లోపలి భాగాలు 19వ శతాబ్దం దాకా పూర్తిగా అన్వేషించలేదు.

19వ శతాబ్దం ప్రథమ భాగంలో ఐరోపా రాజ్యాల ఆఫ్రికా ఆక్రమణ మందకొడిగా సాగింది. తురుష్క సామ్రాజ్యం ఉత్తర కోస్తా వెంబడి మొరాకో వరకు వ్యాపించి వున్నది. తూర్పు కోస్తా వెంబడి కొన్ని ప్రాంతాలు పోర్చుగల్ స్వాధీనం చేసుకున్నది. ఇంగ్లండ్ కేఫ్ కాలని సంపాదించుకొని అచటనుండి దక్షిణ ఆఫ్రికాలో తన బలాన్ని విస్తరించసాగింది. ఫ్రాన్స్ అల్జీరియాను ఆక్రమించింది. దక్షిణ భాగంలో బ్రిటన్ క్రమంగా తన అధికారాన్ని విస్తరించుకోసాగింది. డచ్‌వారు దక్షిణాఫ్రికాలో రెండు రిపబ్లిక్‌లు ఏర్పరచారు. ఈ డచ్ వారికి బోయర్లు అని పేరు వచ్చింది.

ఆఫ్రికాను అన్వేషించి దాని గురించి ప్రపంచానికి తెలియజేసిన వారిలో అగ్రగణ్యులు స్టాన్‌లీ, లివింగ్‌స్టన్, బేకర్, బర్టన్, స్పీక్‌లు. లివింగ్‌స్టన్ 1840లో అన్వేషణ ప్రారంభించి 1873 నాటికి జాంబేసి నది, ఎగువకాంగో, తాంగనైకా, సరస్సుల పరీవాహక ప్రాంతాల నన్వేషించాడు. ఆఫ్రికా గురించి ఎంతో సమాచారాన్ని ఐరోపాకు అందించినవాడు స్టాన్లీ. ఇతడు చేసిన అన్వేషణలన్నింటిలో కాంగోనది అన్వేషణ ప్రధానమైంది. బెల్జియం రాజు రెండో లియోపాల్డ్ ఆఫ్రికాలో జరుగుతున్న అన్వేషణవల్ల ప్రభావితుడయినాడు. ఇతడు స్థానికులతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి స్టాన్లీకి ఆఫ్రికా పంపాడు. స్టాన్లీ కాంగో, దాని ఉపనదుల పరీవాహక ప్రాంతాలలో అనేక స్థావరాలను ఏర్పరిచారు. బెల్జియంకు పోటీగాఫ్రాన్స్ ఆఫ్రికా రంగంలోకి దిగింది. ఇటలీలో జన్మించి ఫ్రెంచి నౌకాదళంలో పనిచేస్తున్న దబ్రజా ఫ్రెంచి కాంగోకు పునాదులు వేశాడు.

ఆఫ్రికాలో కొన్ని ఐరోపా రాజ్యాలు వలసలు స్థాపించడం, ఇతర ఐరోపా వలస రాజ్యాలవారిలో ఈర్ష్యా ద్వేషాలను రేకెత్తించింది. ఇంగ్లండ్ అనుమతితో పోర్చుగల్ కాంగో ముఖ ద్వారాలు రెండూ స్వాధీనం చేసుకున్నది. కాని ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాలు కాంగోపై పోర్చుగల్ పెత్తనాన్ని అంగీకరించలేదు.

కాంగో మైదానం మీద అంతర్జాతీయ సదస్సు ఒకటి ఏర్పాటు కావాలనే భావం ఐరోపా అధికారవర్గాల్లో కలిగింది. ఇటువంటి ప్రతిపాదన ఫ్రాన్స్, జర్మనీలు కూడా చేశాయి. ఫలితంగా 1884 నవంబరు నుంచి 1885 ఫిబ్రవరి వరకు బెర్లిన్ సమావేశం జరిగింది. కాంగో మైదానంతో సహా సువిశాల భూభాగంతో కాంగో ఫ్రీస్టేట్ అనే కొత్త రాజ్యాన్ని ఈ సమావేశం సృష్టించింది. బెర్లిన్ సమావేశం చేసిన నిర్ణయాలు. 1) కొత్త రాజ్యం అంతర్జాతీయ వ్యవహారాల్లో తటస్థంగా ఉండాలి. 2) వ్యాపార విషయాలలో అన్ని రాజ్యాలవారికి సమానావకాశాలు కల్పించాలి. 3) వాణిజ్యం సరిగా జరిగేందుకు మాత్రమే ఈ రాజ్యంలో సుంకాలు విధించాలి. 4) వ్యాపార విషయంలో ఎవరికి గుత్తాధిపత్యం ఉండకూడదు. 5) స్థానిక ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలి. 6) బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని నిషేధిస్తూ నిర్ణయాలు జరిగాయి. 7) క్రైస్తవ మిషనరీలకు, ఐరోపా అన్వేషకులకు ఎట్లాంటి అడ్డంకులు కలిగించకూడదు. కాంగో ఫ్రీ స్టేట్ ఆవిర్భవించినప్పటి నుంచి దాని వ్యవహారాల్లో ఉత్సాహం కనపరచిన బెల్జియం రాజు లియోపాల్డ్ దానిపై తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించాడు. 1908 నాటికి ఇది పూర్తిగా బెల్జియం వలసగా మారింది.

19వ శతాబ్దంలో జరిగిన అన్వేషణవల్ల ఐరోపావారికి ఆఫ్రికా గురించిన పూర్తి వివరాలు అందాయి. ఆఫ్రికా పటం కూడా తయారైంది. ఐరోపాలోని ప్రముఖ రాజ్యాలైన ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్, జర్మనీ, స్పెయిన్, బెల్జియంలు ఆఫ్రికాను పంచుకొన్నాయి.

**10.9.1 ఇంగ్లండ్ - ఆఫ్రికా** : ఆఫ్రికాలోని అధిక భాగాన్ని సంపాదించుకున్న ఐరోపా రాజ్యం ఇంగ్లాండ్. ఇంగ్లాండ్ సామ్రాజ్యవాదం ఆఫ్రికాలో గొప్ప విజయం సాధించింది. ఒక్క జర్మన్ తూర్పు ఆఫ్రికా మినహాయిస్తే ఇంగ్లండ్ అధికారం. కైరో నుంచి కూప్ వరకూ విస్తరించింది. దక్షిణ ఆఫ్రికా, రాడీషియాలను ఆక్రమించడంవల్ల సదస్సు, జర్మన్ తూర్పు ఆఫ్రికా దక్షిణ సరిహద్దు వరకూ, బ్రిటిష్ తూర్పు ఆఫ్రికా, ఉగాండా రక్షిత ప్రాంతం, ఆంగ్లో - ఈజిప్షియన్ భూములవల్ల మెడిటరేనియన్ వరకూ బ్రిటిష్ అధికారం విస్తరించింది. ఇది గాక సోమాలీ లాండ్ తూర్పు కోస్తా, పశ్చిమ గాంబియా, సియారా - లియోన్, గోల్డ్‌కోస్ట్, నైజీరియాలతో కూడా బ్రిటిష్ అధికారం ఏర్పడింది. "సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం" అని బ్రిటిష్ వారు తమ సామ్రాజ్య వైశాల్యాన్ని గర్వంగా వర్ణించుకున్నారు.

**10.9.2 దక్షిణాఫ్రికా** : 17, 18 శతాబ్దాలలో గుడ్‌హోప్ అగ్రం వద్దనున్న కేప్‌కాలనీ అనే వలస డచ్ వారి ఆధీనంలో ఉండేది. 1795 లో అది వారి ఆక్రమణలోనికి వచ్చింది. వారి నుండి ఈ వలసను బ్రిటిష్‌వారు సంగ్రహించారు. ఈ వలసలలోని కర్షకులను "బోయర్లు" అని అంటారు. ఈ కాలనీలో నేటాల్ ఒక భాగం. దీనిని స్వతంత్ర వలసగా బ్రిటిష్‌వారు గుర్తించారు. ఆరంజ్ రాష్ట్రంలో ట్రాన్‌వాల్‌లో బోయర్ల ఆధిపత్యం ఉండేది. ఇంగ్లండ్‌వారు ఈ ప్రాంతాలను ఆక్రమించాలని ప్రయత్నించడంతో 1899 - 1902 మధ్య బోయర్ యుద్ధం జరిగింది. బోయర్లు ఓడిపోయారు. 1909లో దక్షిణాఫ్రికా నాలుగు రాజ్యాల సమాఖ్యగా ఏర్పడి స్వయంపాలన ప్రభుత్వాన్ని స్థాపించుకొంది. ఈ సమాఖ్యను బ్రిటిష్ ఆధిపత్యంలోనికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరిగాయి.

**10.9.3 ఈజిప్టు** : ఈజిప్టుపై బ్రిటిష్‌వారి ఆధిక్యత ఇంగ్లండ్‌ను ప్రముఖ సామ్రాజ్యవాద రాజ్యంగా రూపొందించాయి. ఈజిప్టులో మహమ్మద్‌అలీ మరణానంతరం రాజకీయ సంక్షోభం ఏర్పడింది. సయ్యద్ పాలనలో సూయస్ కాలువ త్రవ్వకం ప్రారంభమైంది. ఈ కాలువ త్రవ్వకాన్ని 15 సంవత్సరాలలో ప్రఖ్యాత ఫ్రెంచి ఇంజనీర్ **లెసెప్స్** పూర్తి చేసాడు. ఈజిప్టులో

రైల్వేలు, తంతి తపాలా మొదలైన ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇందువలన ఈజిప్టు పెద్ద రుణం చేయవలసి వచ్చింది. ఆ రుణాన్ని తీర్చడానికై ఈజిప్టు సూయజ్ కాలువ నిమిత్తం ఏర్పడిన కంపెనీలలోని తన వాటాలను అమ్మవలసి వచ్చింది. బ్రిటిష్ ప్రధాని డిస్రేలి సూయజ్ కాలువ ప్రాముఖ్యాన్ని గుర్తించి ఈ వాటాలను కొనుగోలు చేయడంతో సూయజ్ కాలువపై బ్రిటిష్ - ఫ్రాన్స్‌ల సంయుక్త అధికారం ఏర్పడింది. 1870 నుండి ఈజిప్టుపై ఆధిపత్యం సంపాదించాలనే వేచియున్న బ్రిటన్ 1882 లో అలెగ్జాండ్రియాలో విదేశీయులపై జరిగిన తిరుగుబాట్లను ఆధారం చేసుకొని తన సేనలను ఆ దేశానికి పంపింది. బ్రిటిష్ సేనలు తిరుగుబాటును అణచివేసింది. దీనితో ఈజిప్టులో ఇంగ్లాండ్ అధికారం స్థిరపడింది. ఈజిప్టు ఇంగ్లాండ్ వలసగా మారింది.

**10.9.4 సూడాన్ :** ఈజిప్టుకు సరసన దక్షిణంగా ఉన్న దేశం సూడాన్. ఇది ఈజిప్టుకు సామంత రాజ్యంగా వుండేది. కాని మహమ్మద్ అహమ్మద్ అను వీరుడు స్వతంత్ర పోరాటం జరిపి సూడాన్ ఈజిప్టు సార్వభౌమాధికారం నుండి విముక్తి చేసినాడు. ఇతడు కార్టూమ్‌లో తన అధికారాన్ని నెలకొల్పాడు. ఆ సందర్భంలో కార్టూమ్‌లో వున్న బ్రిటిష్ సేనాని జనరల్ గార్డన్‌ను సూడాన్ సైన్యం వధించింది. అహమ్మద్ 20 సంవత్సరాలు సూడాన్‌ను పాలించాడు. అతని తరువాత బ్రిటిష్ ప్రభుత్వం సూడాన్‌ను బ్రిటిష్ ఆధీనంలోకి తెచ్చాడు. సూడాన్ బ్రిటిష్ వారి ఆధీనంలోకి పోయిన తరువాత 1895లో ఫ్రెంచి సేనాని మార్ఛండ్ ఆఫ్రికాలో వలసలు స్థాపించాలని బయలుదేరి సూడాన్‌లో ప్రవేశించి ఫెషోడా అను గ్రామం వద్ద ఒక ఫ్రెంచి స్థావరాన్ని ఏర్పాటు చేశాడు. ఫ్రెంచివారు సూడాన్‌లో ప్రవేశించడం సహించని బ్రిటిష్ ప్రభుత్వం మార్ఛండ్‌ని ఖాళీచేయమని కోరింది. ఆ సందర్భంలో ఫ్రాన్స్ - ఇంగ్లాండ్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నది. కాని ఉభయ దేశాలు అంగీకారానికి వచ్చాయి. ఫలితంగా ఫ్రాన్స్, తన స్థావరాన్ని ఖాళీచేసి సూడాన్‌పై బ్రిటిష్ అధికారాన్ని గుర్తించింది. ఈ సామరస్యం తరువాత స్నేహంగా మారి 1904లో ఆంగ్లో - ఫ్రెంచి సౌహార్థం ఏర్పడింది.

**10.9.5 ఇతర ప్రాంతాలు :** ఈ కాలంలోనే ఇంగ్లండ్ ఆఫ్రికాలోని మరికొన్ని ప్రాంతాలను ఆక్రమించింది. అవి : గోల్డు కోస్టు, ఉగాండా, నైజీరియా, కెన్యా, జాంబిబార్, న్యాసాలాండ్, రాడీషియా, బ్రిటిష్ సోమాలీ లాండ్‌లో కొంత భాగం. దీంతో ఇంగ్లాండ్ తన సామ్రాజ్యంలో రవి అస్తమించదని ప్రకటించింది.

**10.9.6 ఫ్రాన్స్ - ఆఫ్రికా :** ఉత్తర ఆఫ్రికాలోని అల్జీరీయాను ఫ్రాన్స్‌జయించి, ఆ ప్రాంతంలో 1847 నాటికి తమ పాలన ప్రవేశపెట్టింది. అల్జీరియాకుఈశాన్యంగా ఉన్న ట్యూనిస్ టర్కీ పాలనలో వెనుకబడి ఉంది. ఈ ప్రాంత అభివృద్ధికి ఫ్రాన్స్ ఆర్థికసహాయం చేసింది. 1878లో బెర్లిన్ సమావేశ సందర్భంగా ఈ ప్రాంతాన్ని ఆక్రమించమని ఇటలీకి బిస్మార్క్ సలహా యిచ్చాడు. దీంతో ఆగ్రహించిన ఫ్రెంచి అధ్యక్షుడు ఫెర్రీ ట్యూనీషియాను ఆక్రమించాడు. మొరాకోలో జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య ఘర్షణ ఏర్పడింది. ఇంగ్లండ్ ఫ్రాన్స్‌ను బలపరిచింది. మొరాకో ఫ్రాన్స్ స్వాధీనమయింది.

**10.9.7 ఇటలీ - ఆఫ్రికా :** ఇటలీ తూర్పు ఆఫ్రికాలోని సోమాలీలాండ్‌పై తన రక్షణాధికారాన్ని స్థాపించింది. 1911, 1912 ప్రాంతంలో ఇటలీ టర్కీని ఓడించి ట్రిపోలి, సిరనైకా వలసలను ఆక్రమించి, వాటిని సంలీనంచేసి దానికి లిబియా అని పేరు పెట్టింది.

**10.9.8 జర్మనీ - ఆఫ్రికా :** జర్మనీ ఏకీకరణ తరువాత మొదట్లో బిస్మార్క్ వలసలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. కాని తరువాత ఐరోపా రాజ్యాల వారి ఉత్సాహం చూసి, వలసల విషయంలో జర్మనీ వెనుకబడుతుందని బిస్మార్క్ భావించి ఆఫ్రికా పంపకంలో జర్మనీని భాగస్వామురాలిగా చేశాడు. 1884లో ఆరెంజ్ నది నుంచి అంగ్రా పెఖ్వానా వరకుగల భూమి తన రక్షితప్రాంతంగా జర్మనీ ప్రకటించుకున్నది. ఆ తరువాత టోగోలాండ్, న్యూగినీలో ఉత్తరభాగం, న్యూ బ్రిటిష్ దీవులు ఆక్రమించింది. ఆఫ్రికాలో అత్యధిక జనసాంద్రత ఉన్న, భాగ్యవంతమైన ప్రాంతాలను జర్మనీ ఎలాంటి ఘర్షణ లేకుండా ఆక్రమించింది.

**10.9.9 ఇతర రాజ్యాలు - ఆఫ్రికా :** పైన పేర్కొన్న ఐరోపా రాజ్యాలేగాక బెల్జియం కాంగోను, పోర్చుగల్ గినియా, తూర్పు పశ్చిమ భాగాలలో కొంతభాగాన్ని స్పెయిన్ రైడి ఓరో ప్రాంతాలను ఆక్రమించుకున్నాయి.

ఈ విధంగా 1914 నాటికి అబిసీనియా, లిబీరియాలు మినహా మిగతా ఆఫ్రికా ఖండమంతా ఐరోపా రాజ్యాల మధ్య పంపకమైనది. 1885 బెర్లిన్ సమావేశానంతరం ఐరోపా దేశాలు ఒకే పర్యాయం వలసల కోసం పోటీపడటంతో ఆఫ్రికా, దూరప్రాచ్యం మొదలైన చాలాచోట్ల ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటమో, సంఘర్షణలు సంభవించడమో జరిగింది. వలస సంపాదన విషయంలో ఎవరి స్వప్రయోజనాలు కోసం వారు పాటుపడ్డారు. 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం ప్రధాన కారణాలలో ఒకటిగా సామ్రాజ్యవాదాన్ని చెప్పవచ్చు. వలసల కోసం జరిగిన పోటీవల్ల ఐరోపా రాజ్యాల మధ్య స్పర్థాద్వేషాలు రేకెత్తాయి. ఈ వలసల పోటీవల్ల వచ్చిన తగాదాలు చివరకు సామరస్యంగానే సమసిపోయాయి. అయినా, వాటివల్ల ఏర్పడ్డ ఉద్రిక్తత, ఐరోపా రాజ్యాల వారి సంబంధాలను బాగా చెడగొట్టాయి.

**10.9.10 ఐరోపాపై ప్రభావం :** ఐరోపా రాజ్యాలు సునాయాసంగా ఆఫ్రికాను పంచుకున్నాయి. కాని ఈ పంపకాలు ఐరోపా దేశాలపై గొప్ప ప్రభావాన్ని కలిగించాయి.

**10.9.11 ఇంగ్లండ్ - ఫ్రాన్స్‌ల స్పర్థ :** ఆఫ్రికా పంపకం వల్ల ఐరోపా రాజ్యాల మధ్య ఈర్ష్యా ద్వేషాలు కల్గించాయి. సూడాన్‌లోని ఫెషోడా విషయంపై ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య యుద్ధం వచ్చే ప్రమాదమేర్పడింది. ఉభయుల విజ్ఞతవల్ల ఈ ప్రమాదం తప్పింది.

**10.9.12 ఇంగ్లండ్ - జర్మనీల స్పర్థ :**

దక్షిణాఫ్రికాలో జర్మనీ ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా బోయర్లను సమర్థించింది. అంతేగాక ఇంగ్లండ్‌కు పోటీగా నౌకాబలాన్ని వృద్ధి చేసింది. దీంతో ఇంగ్లండ్, జర్మనీల నడుమ ప్రారంభమైన స్పర్థ మొదటి ప్రపంచయుద్ధానికి దారితీసింది. ఐరోపాలో జర్మనీతో ఏర్పడిన శత్రుత్వం చేత ఇంగ్లాండు ఆ దేశానికి శత్రురాజ్యమైన ఫ్రాన్సుకు దగ్గర కాసాగింది.

**10.9.13 ఫ్రాన్స్ - ఇటలీల స్పర్థ :** టర్కీకి చెందిన టునిస్ విషయంలో ఇటలీ ఫ్రాన్స్‌లకు మధ్య స్పర్థ ఏర్పడింది. దీనివల్ల ఇటలీ ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా జర్మనీ, ఆస్ట్రియాతో జతకట్టింది. ఫలితమే 'త్రిరాజ్య సంధి'.

**10.9.14 జర్మనీ - ఫ్రాన్స్‌ల స్పర్థ :**

మొరాకో విషయంలో జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య ఘర్షణ ఏర్పడింది. మొరాకోలో జర్మనీ ఫ్రాన్స్ అధికారాన్ని సవాలు చేసింది. కాని ఫ్రాన్స్ జర్మనీతో యుద్ధానికి దిగలేదు. దీంతో ప్రమాదం తప్పింది. ఐరోపా రెండు రక్షణ కూటాలుగా - త్రిరాజ్య సంధి, త్రిదేశ సౌహార్థం, ఏర్పడడం ఆఫ్రికా పంపకంతో ఐరోపాదేశాల స్పర్థలు మూలకారణాలు అయినాయి.

**10.9.15 సత్ఫలితాలు :**

1) వలస రాజ్యాల స్థాపనకు ఐరోపా దేశాలు ఆఫ్రికాను పంచుకొన్న తరువాత 19 వ శతాబ్దంలో నెలకొన్న అశాంతి, అస్థిరతలు తొలగిపోయి, సుస్థిరత శాంతి ఏర్పడ్డాయి. 2) వలసల ఏర్పాటు, సరిహద్దుల విభజనవల్ల ఆఫ్రికా రాజకీయ ముఖచిత్రం నిర్దుష్టమైన రూపు దిద్దుకున్నది. వలసరాజ్యాల కాలంలో నిర్ణయించిన సరిహద్దులే ఆయా దేశాలు స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా కొనసాగాయి. 3) ఆఫ్రికన్ జాతీయ వాదం, పాన్ - ఆఫ్రికనిజం వ్యాప్తి చెందాయి. 4) ఆఫ్రికాలోని అనేక ప్రాంతాలలో వలస రాజ్యాల వ్యవస్థలవల్ల పశ్చిమ దేశాల నమూనాలో నూతన న్యాయవ్యవస్థ, నూతన అధికార వ్యవస్థ ఏర్పడ్డాయి. 5) వలస వాదంవల్ల ఆఫ్రికా ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక రంగాలలో అభివృద్ధి సాధ్యపడింది. 6) అంతేగాక ద్రవ్యాధార ఆర్థిక వ్యవస్థ

అమలులోకి వచ్చింది. 7) కొన్ని ఆఫ్రికా ప్రాంతాలలో కొత్త సామాజిక వ్యవస్థ నెలకొన్నది. సాంప్రదాయక సామాజిక వ్యవస్థ మనిషి పుట్టుకకు అధిక ప్రాముఖ్యమివ్వగా, వలస సాంప్రదాయం మనిషి వ్యక్తిగత ప్రతిభకు ప్రాముఖ్యమిచ్చింది. ఈ మార్పుకు బానిసత్వం రద్దు, పాశ్చాత్య శైలి విద్యారంగం, క్రైస్తవ మతం, ఇస్లాం వ్యాప్తి, వ్యవసాయ రంగం వాణిజ్య పరంకావడం తోడయి కొన్ని ప్రాంతాలలో సంపద సమీకరణ సాధ్యమైంది. 8) వలస రాజ్యాల పాలనలో ఆఫ్రికా జనాభా 37.5 శాతం పెరిగింది. 9) వలస రాజ్యాల పాలనలో పట్టణీకరణ వేగం అందుకుంది. 10) అధికార భాషలు అభివృద్ధి చెందాయి.

## 10.9.16 దుష్ఫలితాలు :

1) ఆఫ్రికా పంపకం వల్ల కొత్తగా రూపుదిద్దుకున్న రాజ్యాల సరిహద్దులు ఐరోపావారి ఇష్టానుసారం ఏకపక్షంగా నిర్ణయమయ్యాయి. దీనివల్ల రాజ్యాల మధ్య చాలా తెగలు చీలిపోయి అల్లర్లు చెలరేగాయి. 2) కృత్రిమ తరహా విభజన రేఖలవల్ల రాజ్యాల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఏర్పడి వాటి వనరుల మధ్య అసమానతలు నెలకొన్నాయి. 3) ప్రభుత్వం కాని, ప్రజా ఆస్తులుగాని ప్రజలకు కాక పాలక వలస రాజ్యాలకు చెందుతాయన్న భావంతో అవకాశమొస్తే సొమ్ముదోచుకొనే తత్వం అధికారులలో పెరిగింది. 4) వలసీకరణ వల్ల ఆఫ్రికా సార్వభౌమాధిపత్యానికి భంగం ఏర్పడింది. వాటి స్వాతంత్ర్యం పోయింది. వాటి స్వయంనిర్ణయాధికారహక్కు, బయట ప్రపంచంలో స్వతంత్రంగా వ్యవహరించే హక్కులు లుప్తమయ్యాయి. 6) ఆఫ్రికా అభివృద్ధికి ఆ ప్రాంతపు సహజవనరులు పునాది కనుక సహజ వనరులు లేని ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో ఒకే వలస రాజ్యంలో ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. 7) వలస పాలనవల్ల విదేశీయులే బ్యాంకింగ్, నౌకా రవాణా, వాణిజ్య సంస్థలను తెరిచారు. దీంతో ఆఫ్రికన్ ఆర్థిక వ్యవస్థ లాభార్జననుంచి ఆఫ్రికన్లు దూరం చేయబడ్డారు. 8) వలస పాలనలో విద్యారంగం తగినంత పురోభివృద్ధి సాధించలేదు. 9) వలస పాలనలో గుమస్తాగిరి శిక్షణకు ప్రాముఖ్యమివ్వడంలో ఉద్యోగాలపై మోజు పెరిగింది. 10) ఆఫ్రికన్‌లను చాలా హీనమైన రీతిలో అవమానాలకు గురిచేశారు. విద్య నేర్చుకున్న ఆఫ్రికన్ లను కూడా ఐరోపావారు దగ్గరికి చేరనీయలేదు. జాతి వివక్ష మరింత ఎక్కువైంది. దీంతో కొందరు ఆఫ్రికన్‌లలో తాము తక్కువ జాతి వారమన్న ఆత్మన్యూనతాభావనను పెంచింది. స్వాతంత్ర్యం సాధించుకొని దశాబ్దాలు గడిచినా వారిలో ఈ ఆత్మ న్యూనతా భావం పోలేదు.

## మాదిరి ప్రశ్నలు :

1. పారిశ్రామిక విప్లవం అంటే ఏమిటి ? దానికి దారితీసిన కారణాలు ఏమిటి ?
2. పారిశ్రామిక విప్లవం యొక్క లక్షణాలను సవివరంగా చర్చించండి.
3. పారిశ్రామిక విప్లవం - వలసవాద ఘర్షణల మధ్య ఉన్న సంబంధాన్ని వివరించండి.

## చదువదగిన గ్రంథాలు :


1. Louis Gottashhalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.
2. Lipson, E. : Europe in the 19th and 20th Centuries
3. Grant and Tamperly : Europe in the 19th and 20th Centuries


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 11

# మధ్య ఐరోపాలో జాతీయ సమైక్యతా ఉద్యమాలు

విషయసూచిక


11.0 లక్ష్యం

11.1 ఇటలీ ఏకీకరణ

- 11.1.1 ఇటలీ పరిచయం
- 11.1.2 19వ శతాబ్దంలో ఉదారవాద - జాతీయతా భావశక్తుల విజృంభణ
- 11.1.3 ఏకీకరణకు ముందున్న ఇటలీ పరిస్థితి
- 11.1.4 ఇటలీ ఏకీకరణకు తోడ్పడిన భావవాద స్ఫూర్తి
- 11.1.5 ఇటలీ ఏకీకరణకై తొలి యత్నములు
- 11.1.6 జోసెఫ్ మాజినీ (1805 - 1872)
- 11.1.7 జోసెఫ్ గారి బాల్డీ క్రీ.శ. 1807 - 1882
- 11.1.8 జియోబర్టీ వర్గం లేక పోప్‌పార్టీ
- 11.1.9 సార్డీనియా రాజపక్షం
- 11.1.10 రెండో విక్టర్ ఇమ్మాన్యుల్
- 11.1.11 కౌంట్‌కవూర్ (1810 - 1861)
- 11.1.12 వెనీషియా (1866)
- 11.1.3 రోమ్

11.2 ఇటలీ ఏకీకరణ ప్రాముఖ్యం

11.3 జర్మనీ పరిచయం

- 11.3.1 18వ శతాబ్దంలో రెండువంశాల మధ్య పోటీ : ప్రష్యా ఆవిర్భావం
- 11.3.2 ప్రష్యా నాయకత్వం
- 11.3.3 మొదటి విలియమ్ (1861 - 1888)
- 11.3.4 పార్లమెంటులో ఘర్షణ
- 11.3.5 ఆటోవాన్ బిస్మార్క్ (1815 - 1898)
- 11.3.6 జర్మనీ ఏకీకరణకు యుద్ధాలు

11.4 జర్మనీ ఏకీకరణ సంపూర్తి

11.5 జర్మనీ ఏకీకరణ ప్రాముఖ్యం


## 11.0 లక్ష్యం :

ఫ్రెంచి విప్లవ ప్రభావంచేత, స్వేచ్ఛా సమానత్వాల వంటి ఉదారభావాలు, జాతీయ సమైక్యతా భావాలు ఐరోపా అంతట వ్యాపించడము, అవి 1830లో, 1848లో పశ్చిమ ఐరోపాలో విప్లవాలను ప్రేరేపించి విజయవంతంగా జాతీయరాజ్యాల ఏర్పాటుకు, రాజ్యాంగబద్ధ పరిపాలనకు పునాదులు వేయడము పై అధ్యాయాల్లో వివరించడం జరిగింది. అయితే మెటర్నిక్ ప్రభావం చేత

అవి ఇటాలియన్, జర్మన్ భూభాగాల్లో ఆశించిన విజయాలను సాధించలేకపోయాయి. అయితే జాతీయ రాజ్యాల ఏర్పాటు వలన విశాల భూభాగాలు ఏలుబడిలోనికి వచ్చి అధికారికంగా నైసర్గిక వనరులను వినియోగించుకొనే అవకాశాలు కలిగి, పారిశ్రామిక, వాణిజ్య విస్తరణకు దోహదం చేస్తాయని ఆ భూభాగాల్లోని రాజులు, పరిపాలనావేత్తలు గుర్తించి, తమ దేశాలను సైతం జాతీయ రాజ్యాలుగా రూపొందించే ప్రయత్నాలు చేశారు. రాజులే పూనుకొన్నందున ఆ కార్యక్రమాలు యుద్ధాలు, సంధి ఒడంబడికల ద్వారా సాధించబడినాయి. ఈ విషయాలను ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

### 11.1.1 ఇటలీ పరిచయం :

మధ్యయుగాలలో ఇటలీలో నగర రాజ్యాలుండేవి. చాలా వాటిల్లో రిపబ్లిక్ ప్రభుత్వాలు, కొన్నింటిలో మాత్రం నిరంకుశ ప్రభుత్వాలుండేవి. రిపబ్లిక్ నగర రాజ్యాలలో కూడ స్వల్ప జనపాలన (Oligarchy) ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వాధిపతి డోజ్. డోజ్ అధికారాలు అన్ని నగరాల్లో ఒకే తీరుగా లేవు. ఈ నగర రాజ్యాలలో ఐకమత్యం లేదు. అవి పరస్పరం కలహించుకొనేవి. కుట్రలు, కుతంత్రాలు, కలహాలు, ఇటలీ రాజకీయాలలో సర్వసమానమై పోయినాయి. ఆధునిక యుగారంభానికి పూర్వం ఇటలీలో ఉన్న అసంఖ్యాక రాజ్యాలలో ఫ్లారెన్స్, మిలాన్, వెనీస్, నేపుల్స్, పోపు పరిపాలనలోని రాజ్యాలు ప్రధానమైనవి. ఈ రాజ్యాల అనైక్యత, స్వార్థచింతనలు ఆసరాగా తీసుకొని ఇతర ఐరోపా దేశాలు ఇటలీ రాజ్యాలపై దాడులు ప్రారంభించాయి. ఫలితంగా ఐరోపాలోని ప్రధానరాజ్యాలకు (దేశాలకు) ఇటలీ సంగ్రామ రంగం అయింది. క్రమంగా ఇటలీ రాజ్యాలనేకం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విదేశీయుల పాలనలోకి పోయాయి. రాజకీయ అనైక్యత, పరరాజుల ప్రాబల్యం విభిన్న రాజ్యాల ఉనికి, ఇటలీని ఒక సమైక్య రాజ్యంగాకాక నామమాత్రావశిష్టమైన దేశంగా చేశాయి. ఐతే నెపోలియన్ బోనాపార్టీ ఇటలీని జయించి రాజకీయ ఐక్యతను దోహదం చేశాడు. భూభాగాలను అతడు సమైక్యం చేసి 3 పెద్దరాజ్యాలుగా రూపొందించి వాటిని ఒకే కేంద్ర ప్రభుత్వం క్రిందకి తెచ్చాడు. ఈ చర్యల వల్ల ఇటలీలో ప్రాంతీయ భేదాలు కొంతవరకు సమసిపోయి జాతీయభావం ప్రజల్లో ఏర్పడింది.

### 11.1.2 19వ శతాబ్దిలో ఉదారవాద - జాతీయతా భావశక్తుల విజృంభణ :

మెటర్నిక్ ఇటలీని ఐరోపాఖండంలో కేవలం ఒక భూభాగం అని వ్యాఖ్యానించాడు. అనగా రాజకీయంగా కాని, సాంస్కృతికంగా కాని, నాటి ఐరోపాలో ఇటలీకి ఉనికి లేదని, అది కేవలం ఒక భౌగోళిక పదం మాత్రమేనని, అతని అభిప్రాయం. 19వ శతాబ్దంలో ఉదారవాదంతో కూడిన జాతీయవాదమూ, సామ్రాజ్యవాదమూ విస్తరిస్తూ, పరస్పరం సంఘర్షిస్తూ, రాజకీయాలను ప్రభావితం చేయసాగాయి. జాతీయ భావమంటే, ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు ఒకే భాషా, మతం, సంప్రదాయాలకు వారసులుగా సహజీవనం గడుపుతూ తమ జాతి అభివృద్ధికి స్వాతంత్ర్యాన్ని ఆర్జించి తమకనుగుణమైన రాజ్యాంగ వ్యవస్థను ఏర్పరచవలెననే ఆకాంక్ష కల్గి ఉండడం.

1789 లో నాటి ఫ్రెంచి విప్లవ ఫలితంగా ఉద్భవించిన ఈ భావాన్ని వియన్నా కాంగ్రెస్ లక్ష్యపెట్టలేదు. కాని ఇవి 1830, 1848 సంవత్సరాల్లో విప్లవ ఉద్యమాలకు కారణం అయి, నిరపేక్ష రాచరికం చేత అణచివేయబడ్డాయి. అయినా ఈ ఉదార జాతీయతా భావాల ప్రభావం వల్ల క్రీ.శ. 1882 - 1830 సం॥రాల మధ్యకాలంలో సుమారు ఒక డజను జాతీయ రాజ్యాలు ప్రపంచంలో రూపుదిద్దుకున్నాయి. కారణం అవి ఆనాటి మేధావులను, మధ్యతరగతి ప్రజలను విశేషంగా ప్రభావితులను చేయడం. వారు జాతీయ రాజ్యాల, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక దేశాల ఆవిర్భావానికి కృషిసల్పేటట్లు చేసింది. అలాగే ఇటలీలో జాతీయవాదం నిలదొక్కుకోవడానికి కొన్ని పరిస్థితులు బలంగా పనిచేసాయి. అవి ఉమ్మడిభాష, జాతి, మతం, ఆర్థిక ప్రయోజనాలు, చారిత్రక వారసత్వం, రాజకీయ ఆశయాలు మొదలైనవి. ఈ వాస్తవ పరిస్థితులు తెగ నిబంధాలేకాక వీటిలో కొన్నయినా లేకపోతే జాతీయ వాదాన్ని సుస్థిరం చేసే ప్రయత్నాలకు ఆలంబనే లేకుండా పోయేది. ఈ ప్రయత్నాలు మొదలయ్యేవేకావు. డాంటే, మెకియావెల్లీ వంటి తాత్త్వికులు దేశప్రజ తమ సంస్కృతినీ, భావజాలాన్ని ఉమ్మడి భాషా సాహిత్యాల

ద్వారా మరింత బలంగా వ్యక్తం చేయగలరని నిరూపించారు. అందుచే ఒకే భాష మాట్లాడే వారంతా సహజంగా తామంతా ఒక్కటే అనే భావాన్ని పెంచుకుంటారు. ఐతే ఉమ్మడిభాష ఒక్కటే ఐక్యభావానికి తెగని బంధం అని భావించనక్కరలేదు. ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలు ఈ ఐక్య భావాన్ని పెంచడంలో మరింత ముఖ్యకారణమౌతాయి. ఉదా : జోల్‌వైరెన్ అనే వాణిజ్యవ్యవస్థ జర్మన్ రాజ్యాలలో ఒకేవిధమైన పన్నుల నిబంధనలను అమలుపరిచి వాణిజ్యపరంగా అవి ఏకం కావడానికి దారితీసింది. ఈ వాణిజ్యపరమైన ఐక్యత తదనంతరం రాజకీయపరమైన ఐక్యతకు బాటవేసింది. జాతీయవాదం నిలదొక్కుకోవడానికి సహకరించే మరో బలమైన వాస్తవం చారిత్రక వారసత్వం. ఉదా : ఇటాలియన్‌లు ప్రధానంగా తమ చరిత్ర తలచుకొని గర్వపడతారు. రోమ్ నగరంలో పూర్వపు సామ్రాజ్యకాలంనాటి భవనాల అవశేషాలు, నాటి సారస్వతం వివరించే రాజకీయ, సాంస్కృతిక వైభవంతో కూడిన సాహసిక సంఘటనలు వారిని ఉత్తేజితులను చేసేవి. పారిశ్రామిక విప్లవం సమాజంలో ఎన్నో మార్పులు తెచ్చింది. ప్రజల జీవన ప్రమాణం పెరగడంతో వారి జీవన సరళిలో గూడా మార్పు సంభవించింది. ఈ మార్పులు జాతీయవాదాన్ని ఉదారవాదాన్ని, ఆర్థిక ప్రయోజనాలు, చారిత్రకకావ్య, సత్య సంపద వలన కలిగిన ఉత్తేజమూ మరింతగా ప్రబలం చేసి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలను కోరే చైతన్యవంతులైన ప్రజలుగా ఇటాలియన్‌లను రూపొందించాయి.

మధ్య ఐరోపా దేశాలన్నింటిలోను ఇటలీ ఉదారవాద ప్రభావం ప్రబలంగా ఉంది. క్రీ.శ. 1848 విప్లవాలలో ఎదురైన వైఫల్యాన్ని అధిగమించి ఉదారవాద జాతీయరాజ్యాన్ని ఇటలీ దేశం క్రీ.శ. 1870 నాటికి స్థాపించుకుంది. ఇదే ఇటలీ ఏకీకరణగా ఆధునిక ఐరోపా చరిత్రలో ప్రసిద్ధమైంది.

## 11.1.3 ఏకీకరణకు ముందున్న ఇటలీ పరిస్థితి :

ఏకీకరణకు పూర్వం నాటి అనైక్యత వలన అక్కడి అసంఖ్యాకరాజ్యాలపై స్పెయిన్, ఫ్రాన్సు, ఆస్ట్రియా మొదలైన అగ్రరాజ్యాలు తమ రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పినాయి. కాని ఫ్రెంచి విప్లవ ఫలితంగానూ, నెపోలియన్ దండయాత్రలు మూలంగానూ, ఇటలీలోని పలురాజ్యాలలో జాతీయభావం మొగ్గతొడిగింది. నెపోలియన్ దండయాత్రలు ఇటలీరాజ్యాలపై ఆస్ట్రియా, స్పెయిన్‌ల ఆధిపత్యాన్ని తొలగించి, ఇటలీ ద్వీపకల్పం యావత్తు ఫ్రెంచి ఆధిపత్యంలోనికి రావడానికి, తద్వారా కొంతవరకు రాజకీయ సమైక్యతను పొందడానికి దోహదం చేశాయి. అందుచేత ఇటాలియన్‌లు తమకు నెపోలియన్ "ఆదుకున్న ఆప్తుని" గా భావించి అభిమానించేవారు. ఐతే వియన్నా సమావేశము ఇటలీలో ప్రస్ఫుటమౌతున్న జాతీయ భావాన్ని నిర్లక్ష్యంచేసి, తిరిగి, పూర్వంలో వలె విభాగాలుగా చేసింది.

1. ఉత్తర ఇటలీలో లంబార్డీ, వెనీషియాలు, ముఖ్యరాజ్యాలు. ఇవి ఆస్ట్రియా పాలనలో ఉండేవి. సనాతన ఆస్ట్రియా ఈ రాజ్యాల పరిపాలన తన ప్రతినిధులచే నిర్వహించేది.

2. మధ్య ఇటలీలో టస్కనీ, పార్మా, మొదీనా అనే మూడు చిన్న రాజ్యాలు ఆస్ట్రియా రాజవంశానికి చెందిన వారి ప్రత్యక్షపాలనలో ఉండేవి. కనుక ఈ రాజ్యాలు సైతం పరోక్షంగా ఆస్ట్రియా అధీనంలో ఈ ప్రభుత్వాలు కూడా సనాతన నిరంకుశ రాజరికాన్ని అమలుపరచాయి.

3. దక్షిణ ఇటలీలో రెండు సిసిలీల రాజ్యాన్ని, అనగా నేపిల్స్, సిసిలీలను కలిపి, బూర్బన్ రాజైన రెండో ఫెర్డినాండ్ పాలిస్తుండేవాడు. ఇతడు సనాతనవాది, నిరంకుశుడు. తనను వ్యతిరేకించిన వేలమంది ఉదారవాదులను నిర్బంధించాడు. అంతేగాక ఉదారవాద నిలయాలైన పెక్కు నగరాలను ధ్వంసం చేయడంవల్ల ఈయనకు "కింగ్ బాంబ్" అనే మారు పేరు వచ్చింది.

4. మధ్య ఇటలీలో "రోమాగ్ని' అంబ్రియా, సెంటిపీటర్స్ పేట్రిమనీలు పోప్ ఆధిపత్యములో ఉన్నాయి. ఈతని పాలన కూడా సనాతనమూ, అభివృద్ధి నిరోధకమూ అయినది.

5. ఇటలీకి వాయువ్యాన సవాయ్, పీడ్‌మాంట్, సార్డీనియా, జినోవా రాజ్యాలు ఒక చిన్న జాతీయరాజ్యంగా ఏర్పడి ఉన్నాయి. ఉదారవాదానికి ఎడారిమయంగా కన్పించే ఇటలీలో ఈ రాజ్యం ఒయాసిస్సు వంటిది. ఇటలీలోని ఉదారవాదులు దేశభక్తులంతా తమ దేశ ఏకీకరణకు ఈ రాజ్యనాయకత్వాన్ని అభిలషించారు.

మెటర్నిక్ ఐరోపా రాజకీయ పటాన్ని పూర్వస్థితి ప్రాతిపదికగా రూపొందించడంలో ఇటలీని ముక్కలు చెక్కలుగా చేసి పూర్వ పరిపాలకులకు కట్టబెట్టాడు. వియన్నా కాంగ్రెస్ నిర్ణయానుసారం ఉత్తర ఇటలీలో ఆస్ట్రియా పాలన, మధ్య ఇటలీలో హాబ్స్‌బర్గ్ వంశీయులపాలన పునరుద్ధరింపబడెను. దక్షిణ ఇటలీ బూర్బన్ వంశీయుల ఆధీనములోకి తేబడెను. మధ్యఇటలీ పోప్ ఆధీనములోకి తేబడెను. మరియు ఇటలీ వాయువ్యాన ఉన్న రాజ్యాలపై సెవాయ్ వంశస్థుల పాలనలో ఉంచడం జరిగింది. ఈ రాజ్యాల పాలకుల్లో ఒక్క సెవాయ్ వంశస్థులు మాత్రం ఉదార భావాలు కల్గినవారు ప్రజాశ్రేయోభిలాషులు. మిగిలిన వారు మాత్రం నిరంకుశులు. స్వార్థపరులు, ప్రజాకంటకులు. ఇటలీ ఏకీకరణకు అవరోధాలు అనేకం. ముఖ్యంగా ఇటలీలోని వివిధ ప్రాంతాలను పాలించే విభిన్న రాజవంశీయుల పాలకులు ఆ దేశ సమైక్యతకు పెద్ద ప్రతిబంధకం కల్గించేవారు. నిరంకుశులైన రాజులు తమ అధికారం పోతుందని ఇటలీ ఏకీకరణకు విముఖులు. ఇటలీపైన తన పట్టు సడలిపోతుందని, ఉత్తర ఇటలీలోని ప్రాంతాలు చేజారిపోతాయని ఆస్ట్రియా ప్రభుత్వం, ఇటలీ సమైక్యతకు బద్ధవ్యతిరేకి. పోప్ రాజ్యాల్లో పోప్ అధికారం కొనసాగాలని అన్నిచోట్ల క్యాథలిక్‌ల అభిమతం. అందువల్ల పోప్‌తో పాటు క్యాథలిక్‌లుకూడా ఇటలీ ఐక్యతకు విరోధాలు. తమ తమ అధికారాలను పదిల పరచుకొనే తహతహతో ఆ రాజ్యాల్లోని పాలకులు ప్రజలను, వారిలోని ఉదార భావాలను అన్ని విధాలా అణచిపెట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. అనేక చర్యల ద్వారా వారు ప్రజల నోళ్ళు కట్టివేశారు. సమావేశ, పత్రికాస్వాతంత్ర్యాలను కూడా వారు హరించివేశారు. అంతేకా ప్రజాస్వామ్య జాతీయవాదులను వారు క్రూరంగా శిక్షించారు. ఉదాహరణకు నేపుల్స్ ప్రభువైన 2వ ఫెర్డినాండ్ ప్రజలపై జరిపిన క్రూరచర్యలు, దారుణమారణకాండ అతని అధికారదాహానికి చిహ్నంగా నిలచాయి. పీడ్‌మాంట్, సార్డీనియాలు పాలించే రాజవంశం మాత్రం ఇందుకు భిన్నంగా ఉదారవాద జాతీయభావాలు కలిగింది కావడంవల్ల ఇటలీ ప్రజలకు ఆ రాజ్యపాలకులు ఆశాజ్యోతులై నిలిచారు.

## 11.1.4 ఇటలీ ఏకీకరణకు తోడ్పడిన - భావవాద స్ఫూర్తి :

ఇటలీ ప్రజల మెదళ్ళను పదునుపెట్టి వారి ఆలోచనా ధోరణిని మలుపు త్రిప్పిన వారిలో ఎందరో రాజకీయ దార్శనికులు, తత్వవేత్తలు కూడా ఉన్నారు. "విశ్వ సార్వభౌమాధికారం" (Universal Monarchy) అనే ప్రతిపాదనతో ముందుకొచ్చిన పదునాల్గవ శతాబ్దినాటి డాంటే అనే ఇటాలియన్ కవి ఇందుకు ఉదాహరణ. ఇతడు చరిత్రలో విశ్వరోమన్ సామ్రాజ్య వ్యాప్తి ఆవశ్యకత. దైవ నిర్ణయమని, చరిత్రగతి దీనిని నిరూపిస్తూనే ఉన్నదని, రోమ్ చరిత్ర కూడా ప్రపంచ భవిష్యత్తుకు మార్గదర్శకం వహించేస్థాయికి ఎదగడంతో ముడిపడిఉన్నట్లు నిరూపిస్తున్నదనీ ప్రతిపాదించాడు. ఇటాలియన్ వాస్తవిక దార్శనికుడు మెకియావెల్లి ( 16వ శతాబ్దం) (Citizen Army) 'పౌరసైన్యం' అనే ప్రతిపాదన చేస్తూ జాతీయవాదాన్నే వేరేమాటల్లో సూచించాడు. దేశభక్తి, ఇటలీ ఏకీకరణ చెందాలన్న ఆకాంక్ష ఇటలీని అంతరంగిక సమస్యల నుంచి వెలుపల శక్తుల ప్రమాదాల నుంచి తప్పించడం కోసం "పౌరసైన్యం" అవసరమని, దేశంపట్ల పౌరుని కర్తవ్యమే అతడ్ని అన్నివిధుల కంటే ఉన్నతమైనదని ఇటాలియన్ జాతీయ వాదానికి బీజాలు అనదగిన ఈ ఉదాత్తభావాలు శతాబ్దాలపాటు వ్యాప్తిలో ఉండటంతో జాతీయ వాదాన్ని ఆచరణలో పెట్టటానికి ఇటాలియన్ దేశభక్తులు అనువైన తరుణం కోసం వేచియున్నారు. 18, 19 శతాబ్దాలలో వరుసగా అవకాశాలు కలిగాయి. ఫ్రెంచి తత్త్వవేత్త, భావవాది రూసో ప్రవచనాల నుంచి 18వ శతాబ్దంలో ఇటాలియన్ జాతీయవాదం మరింత బలం పుంజుకుంది. రూసో ప్రతిపాదించిన సిటిస్టేట్ (నగర రాజ్యం) 'పాపులర్ సావెర్నిటీ' (ప్రజాసార్వభౌమాధిపత్యం) ఆలోచనలు జాతీయవాదంతో కూడిన దేశభక్తిని ఒక ఆదర్శంగా తీర్చిదిద్దాయి. ఇది ఇటలీకి సరిసమానంగా ఇతర యూరోపియన్ రాజ్యాలను ప్రభావితం చేసింది. క్రొత్తగా ఆవిర్భవించిన భావవాద, ఆదర్శవాద స్ఫూర్తి, జాతీయవాద స్ఫూర్తితో కలిసి 19వ శతాబ్దంలో ఇటలీ పునరుత్థానానికి (Italian Resorgimento) మార్గం సుగమం అయింది.

## 11.1.5 ఇటలీ ఏకీకరణకై తొలియత్నములు :

ఇటలీలోని వివిధ ప్రాంతాలలో నున్న ఉదారవాదులంతా సమైక్య ఇటలీ ఏర్పాటును వాంఛించారు. కాని, ఇటలీపై ఆధిపత్యం గల ఆస్ట్రియా, మెటర్నిక్ ఆధ్వర్యంలో ఇటలీలోను, ఐరోపా ఖండములో కూడా సనాతన వాదానికి, నిరంకుశత్వానికి కేంద్రమై ఇటలీ సమైక్యతను వ్యతిరేకించింది. దురదృష్టమేమంటే, ఇటలీలోని వివిధ రాజ్యాధిపతులు, పోప్, ఐక్య ఇటలీలో తమ అధికారాలు ఎక్కడ తగ్గుతాయనే భయంతో, ఏకీకరణను వ్యతిరేకించారు. వీరి నిరంకుశ విధానాల వలన భావప్రకటనను ఇటలీ ఏకీకరణ విషయమై అనేక రహస్య సంఘాలు బయలుదేరాయి. వాటిలో కార్బోనారి (Carbonari) అనేది ఒకటి బొగ్గును కాల్చేవారు (Charcoal Burner) అని దీని అర్థము. ఇది నేపుల్స్‌లో 19 వ శతాబ్ది తొలి సంవత్సరాలలో స్థాపితమైంది. ఇటలీ అంతటా దీని ప్రభావం వ్యాపించింది. అన్ని వర్గాల వారు ఇందులో సభ్యులుగా ఉండేవారు. ఈ సంఘానికి ప్రత్యేక సాంకేతిక భాష, కర్మకాండ ఉన్నాయి. నిర్దిష్ట రాజకీయ లక్ష్యంతో విదేశీయుల అధికారాన్ని తొలగించి, రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛను సాధింపవలెననే ఉద్దేశాలు ఈ సంఘానికుండేవి. దీనికి నలుపు, ఎరుపు, నీలం రంగులు కలిగిన పతాకముంది. దీని స్థానంలో 1831 నాటి ఆకుపచ్చ, తెలుపు, ఎరుపు రంగుల త్రివర్ణ రంగుల పతాకం అనుకరణలోకి వచ్చింది. కార్బోనారీ కార్యకలాపాల వల్ల నేపిల్స్, పీడ్‌మాంట్, మోడినా, పార్మా, పోప్ రాజ్యాలలో 1820లో తిరుగుబాట్లు జరిగాయి. బోర్బన్ వంశీయుడైన మొదటి ఫెర్డినాండ్ తన దేశంలో ప్రజలు తిరగబడినపుడు ఉదార రాజ్యాంగం ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కాని రహస్యంగా తన నిరంకుశత్వాన్ని నిలుపుకొనడానికి 1820లో ట్రాప్పావ్ (Trappau) సమావేశ సమయంలో అక్కడి రాజులకు సహాయం చేయండని కబురు పంపారు. ఆస్ట్రియా సేనలు నేపిల్స్‌లోని తిరుగుబాటునణచివేశాయి. ఫెర్డినాండ్ రాజరికం సుస్థిరం చేసుకున్నాడు.

పీడ్‌మాంట్‌లో మొదటి విక్టర్ ఇమ్మాన్యుయల్ రాజు ఉదారవాది కాకపోవడం చేత 1821లో కార్బోనారీ ప్రభావం వల్ల తిరుగుబాటు జరిగింది. అయితే ఇక్కడ ప్రజలు రాజభక్తి కల్గి ఉదార రాజ్యాంగం కోసం ఆస్ట్రియా అధికారాన్ని తొలగించవలెనని ఆందోళన చేసారు. ఆస్ట్రియా సేనలు నేపిల్స్‌కు పోతున్నపుడు ఇక్కడివారు వెనుకనుంచి ఆ సేనలపై దాడి చేయవలెననుకున్నారు. కాని సరి అయిన నాయకత్వం లేకపోవడము వలన వారి ప్రయత్నం సఫలం కాలేదు. విక్టర్ ఇమ్మాన్యుల్ రాజు రాజ్యాన్నే పరిత్యజించాడు. అంతట ఛార్లెస్ ఆల్బర్ట్ రాజయ్యాడు. ఈ అవాంతర పరిస్థితులవల్ల తిరుగుబాటు ఉద్యమం సమసిపోయింది.

1830లో ఫ్రాన్సులో జూలై విప్లవం జరిగి దాని ప్రభావం పోప్ రాజ్యాలతోటిపాటు, పీడ్మాంట్, పార్మా, మొడేనాలకు కూడా వ్యాపించింది. తిరుగుబాటుదారుల ప్రయత్నం జయప్రదమౌతున్న సమయంలో పోప్ 16వ గ్రిగరీ ఆస్ట్రియా సహాయాన్ని కోరాడు. అప్పుడు మెటర్నిక్ ఆస్ట్రియా సేనలను పంపగా అవి తిరుగుబాట్లను అణచివేసి మళ్ళా యథాస్థితికి తీసుకొని వచ్చాయి. కానీ ఆస్ట్రియా సేనలు ఇటలీ నుంచి వైదొలగిన వెంటనే మళ్ళీ తిరుగుబాట్లు జరిగాయి. ఈసారి ఆస్ట్రియాయే గాక ఫ్రాన్సు కూడా సేనలను పంపింది. తిరుగుబాట్లు అణిగిపోయాయి. ఇంకా రహస్య సంఘాల ఉద్దేశ్యం జయప్రదం కావడానికి ఇటలీ ప్రజలలో చైతన్యమింకా కలుగలేదేమోననిపిస్తుంది. కానీ కార్బోనారీ వ్యవస్థాపనా విషయంలో కొన్ని లోట్లున్నా విప్లవ భావా న్ని మాత్రం సజీవంగా చేసిందని చెప్పాలి.

1848 సంవత్సరంలో ఫ్రాన్స్‌లో ప్రజ్వరిల్లిన విప్లవ జ్వాలలు జర్మనీ, ఆస్ట్రియాలనే కాక ఇటలీని కూడా దహించివేశాయి. వియన్నాలో జరిగిన తిరుగుబాటు వార్తలు వెనీషియా, లంబార్డీ ప్రజలను ఉత్తేజపరచాయి. వారుకూడా తిరుగుబాటు చేసారు. ఆస్ట్రియా సైన్యాలను తరిమికొట్టి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. వారి నుంచి స్ఫూర్తి పొందిన సిసిలీ, టస్కనీల, ప్రజలు తిరగబడి రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలు స్థాపించుకున్నారు. ఈ తరుణములో పీడ్‌మాంట్ రాజైన ఛార్లెస్ ఆల్బర్ట్ ఇటలీలో స్వతంత్ర రాజ్యస్థాపన చేయ సమకట్టి, ఆస్ట్రియాపై యుద్ధాన్ని ప్రకటించి, ప్రజలకు సమధికోత్సాహాన్ని కలిగించాడు. కాని అతడు ఆస్ట్రియా చేతుల్లో కస్టోజా, నోవారా, యుద్ధరంగాలలో పరిజితుడై రాజ్యపరిత్యాగం చేయగా, అతని కుమారుడు 2వ విక్టర్ ఇమ్మాన్యుల్ రాజై, ఆస్ట్రియాకు నష్టపరిహారం చెల్లించి బయటపడ్డాడు. సార్డీనియా, పీడ్‌మాంట్ రాజ్యంలోని ఉదార రాజ్యాంగాన్ని కూడా రద్దు చేయాలని పట్టు పట్టినప్పటికీ దాని రాజు అభ్యర్థనను పెడచెవినపెట్టాడు. ఆస్ట్రియా సైన్యాలు తిరిగి వెనీషియా,

లంబార్డీలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ విధంగా **1848** విప్లవం విఫలం కావడంతో ఉదారవాద, జాతీయవాదాలు పరాజయం పొంది, నిరంకుశ రాచరికం విజృంభించగలిగింది. కాగా, ఇటలీలోని ఇతర రాజ్యాల పాలకులు ప్రజలకిచ్చిన ఉదారరాజ్యాంగాలను రద్దుచేసారు. క్రీ.శ. 1820 - 50 సంవత్సరాల మధ్యకాలం ఇటలీ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం చేసిన ప్రయత్నాలన్నీ వమ్మైపోయినప్పటికీ, కార్బోనారీ కృషి ఫలితంగా వారిలో ఇంకా ఆశాచైతన్యాలు మిగిలేఉన్నాయి. ఇలాంటి రహస్యసంఘాలేకాక "రిసార్జిమెంటో" అనే ఒక సాహిత్య, సాంస్కృతిక ఉద్యమం గూడా ప్రారంభమైంది. కవులు, రచయితలు, నాటకకర్తలు ఈ ఉద్యమం ద్వారా జాతీయతాభావాన్ని ప్రేరేపించారు.

## ఏకీకరణ శక్తులు :

ఇటలీని సమైక్యం చేసి జాతీయ రాజ్యం స్థాపించాలనేది ఆ దేశ ప్రజలందరి ఏకైక ఆశయం. అయితే స్వతంత్ర జాతీయ సమైక్య ఇటలీలో "రిపబ్లిక్" ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే జోసఫ్ మాజినీ వర్గం, పోప్ ఆధిపత్యంలో 'సమాఖ్య రాజ్యాన్ని' స్థాపించాలని జియోబర్టీపక్షం, సార్డీనియా, పీడ్‌మాంట్ రాజు నాయకత్వంలో 'రాజ్యాంగ బద్ధ రాచరికాన్ని' ఏర్పరచాలనే రాజు పక్షంవారు, ఇటలీలో ఉన్నారు. అందరి ఆశయం ఒకటే అయినా సిద్ధాంతాలు, వీటిని సాధించే మార్గాలు భిన్నరీతులకు చెందినవి. ఆయా వర్గాల నాయకుల గూర్చి, వారి కృషి గురించి కొంత వివరించడం ఇక్కడ సమంజసం. ఇటలీ సమైఖ్యతను వాంఛించే వారిని మూడు వర్గాలుగా పేర్కొనవచ్చును. వారు

## 11.1.6 జోసఫ్ మాజినీ (1805 - 1872) :

రిపబ్లికన్‌ల నాయకుడు, జోసఫ్ మాజినీ. ఇటలీని సమైఖ్య రిపబ్లిక్‌గా రూపొందించాలనేది, ఇతని ఆశయం. ఇతడు జినోవాకు చెందిన ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుని కుమారుడు. బాల్యం నుండి ఇటలీ జాతీయ ఉద్యమ ప్రభావానికి లోనైనాడు. ఐరోపాఖండ మేధావులైన 'డాంటే' షేక్స్పియర్, బైరన్, హ్యూగో మొదలైన వారి రచనలను కూలంకుషంగా చదివి ప్రభావితుడైనాడు. యువకుడుగానే తన దేశదైన్యాన్ని చూచి, వగచాడు, విచార సూచకంగా ఎప్పుడూ నల్లటి బట్టలనే ధరించేవాడు.

సాహిత్యమంటే ఇతనికి ఎనలేని అభిమానాన్ని గూడా త్యజించాడు. దీనిని ఆయన తన మొదటి త్యాగమన్నాడు. తన దేశస్థులలో స్వేచ్ఛా కాంక్షను ఉత్తేజితం చేసిన యువక దేశాభిమాని. ఇతడు గొప్ప పండితుడు. ఆదర్శవాది. నిష్కళంక దేశభక్తుడు, అతడు కవూర్ వలె పరిపాలకుడు గాని, గారీబాల్డీవలె సేనాని కాదు. అయినా ఇటలీ జాతీయతకు, భావాలకు పితవంటివాడు. ప్రముఖ ఆదర్శవాది మాత్రమేగాక కవిత్వం చెప్పగల్గిన నేర్పరి. అతడు ఆల్ప్స్ నుంచి మధ్యధరా సముద్రము పర్యంతం స్వేచ్ఛతో ఐక్యమై ఇటలీ పునరుద్ధారితం కావలెనని కలలుకనేవాడు. జాతీయతను రిపబ్లిక్ భావాన్ని పెంపొందింప జేయవలెనని అతని ఆశయం. 20 మిలియన్‌ల ఇటాలియన్‌లకు కావలసింది విముక్తి. అది సాధించటానికి కావలసింది అధికారం కాదు, దృఢనమ్మకం అనేవాడు. అతడికి ఇటలీలోని విభిన్న రాజ్యాలను ఐక్యంచేసి జాతీయ రిపబ్లిక్ స్థాపించవలెనని ఉద్దేశ్యం ఉంది. అది పోప్ ఆధిపత్యంలోగాని, పీడ్‌మాంట్ ఆధ్వర్యంలోగాని జరగడం అతనికి ఇష్టంలేదు. అతడు కూడా కార్బోనారీ సభ్యుడే, ప్రవక్త ఇటాలియన్ల ఐక్యతా ప్రవచనకర్త అయిన మాజినీ ఇటాలియన్ జాతీయవాదాన్ని పెంచిపోషించడానికి అపారంగా సేవచేశాడు. అతడు మత సహనంగల రాజకీయ దార్శనికుడు, గాఢమైన గణతంత్రవాది. ఉదార (స్వేచ్ఛావాద) సంస్థలు, చట్టాలతో కూడిన ఐక్యఇటలీకోసం అతడు ప్రచారం చేసాడు అతడి గణతంత్ర భావాల మూలంగా అతడిని మాత్రం దేశం నుంచి బహిష్కరించారు. అయినప్పటికీ ఇటలీ ఏకీకరణ గురించి బోధించకుండా అతనిని ఏ శక్తీ ఆపలేకపోయింది. ఇటాలియన్ ఐక్యతా ప్రవక్తగా, ఇటాలియన్ జాతీయోద్యమానికి అంత వరకూ కొరవడిన నైతిక స్ఫూర్తి నందించాడు మాజినీ. ప్రజలను ముఖ్యంగా యువకులను ఉత్తేజపరచి ఇటలీ పునరుద్ధరణ ఆవశ్యకత దిశగా వారిని నడిపించాడు. అతడి ప్రబోధ మౌలికతత్వం అప్రతిహతమైనది. ఆరంభములోని మాజినీ ఒక ప్రముఖ కార్బోనారీ సభ్యుడు. కానీ త్వరలోనే అజ్ఞాతవాసం వల్ల ఏమీ విజయాలు చేకూరవని అతడు నిశ్చయానికొచ్చాడు. అయినప్పటికీ కార్బోనారీ విప్లవ పంథా ఇతనిని బాగా ఆకట్టుకున్నది.

దీంతో అత్యంత సన్నిహిత సంబంధమున్నందున నిర్బంధింపబడి జైలుపాలు కూడా అయినాడు. ఇతడు "యంగ్ ఇటలీ" అనే క్రొత్త సంఘాన్ని స్థాపించాడు. జాతీయ వాదులందరికీ ఇది కేంద్రమైంది. 40 సంవత్సరముల లోపు గల విద్యావంతులు 50 వేలమంది ఈ సంఘ సభ్యులైనారు. దాని లక్ష్యం, "దేవుడు, ఇటలీ ప్రజలు" ఇటలీ యువత ఇటలీని సమైఖ్య పరచగలరని గట్టిగా నమ్మాడు. జోసెఫ్ మాజినీ ఇటలీ ప్రజలు పౌరసత్వంగాని, ఒక దేశాన్ని గాని నోచుకోలేదని వారికెరుక చేసాడు. 'దేవుడు', 'ఇటలీ' ప్రజలు అనేవి యంగ్ ఇటలీ సంఘపు నినాదాలు. విద్యా, సాహిత్యం, ప్రచారం, తిరుగుబాట్లు ద్వారా సమెక్య ఇటలీ ఏర్పడుతుందని వారు భావించారు. సమెక్య ఇటలీ సాధనకు ప్రాణత్యాగానికైనా ప్రజలను సంసిద్ధులను చేయడమే ఈ ఉద్యమ ఉద్దేశ్యం.

ఇటలీ విముక్తిని మాజినీ ఒక మతంగా భావించాడు. ఈ లక్ష్యానికి తనను తాను అంకితం చేసుకొని, ఏ త్యాగానికైనా, చివరకు ఆత్మార్పణకైనా, సంసిద్ధుడైనాడు. ఆస్ట్రియాను వీలయినంత త్వరగా విదేశాల సహాయం లేకుండానే ఇటలీ నుండి తరిమి వేయాలనేదే, ఇతని గట్టి నమ్మకం. 20 లక్షల ఇటాలియన్లలో తమ్ము తాము విముక్తి గావించుటకు కొరవడినది అధికారం కాదని, దృఢ నిశ్చయమేనని మనసారా నమ్మాడు. ఇటలీని విముక్తి గావించి, ఏకీకరణ గావించుట సాధ్యమైన ఆశయమేనని, అసాధ్యమైన కలకాదని ఇటాలియన్‌లలో చొప్పించి, ఇటలీకి ఎనలేని సేవ చేశాడు. ఇతడు తరచు తిరుగుబాట్లను లేవదీస్తూ ఉండటం వలన చాలాకాలం ప్రవాస జీవితాన్నే గడపవలసి వచ్చింది. అయితే ఇటలీ ప్రజలు సాంప్రదాయబద్ధమైన రాచరికాన్ని మన్నించారు. అందుకే ఇటాలియన్లు ఈయన రిపబ్లికన్ భావాలను సమర్థించలేదు. మధ్య తరగతి రిపబ్లికన్‌ల విప్లవ ధోరణులను నిరశించారు. ఏది ఏమైనా జోసెఫ్ మాజినీ ఇటాలియన్ ఏకీకరణ ఉద్యమ ప్రవక్తగా కొనియాడబడ్డాడు.

## 11.1.7 జోసఫ్ గారిబాల్డీ (క్రీ.శ. 1807 - 1882) :

జోసెఫ్ గారిబాల్డీ క్రీ.శ. 1807లో నైస్ అనేచోట జన్మించాడు. ఇతడు మాజినీ శిష్యుడే. తొలుత సార్డీనియా నౌకాదళంలో పనిచేసాడు. మాజినీ ప్రభావానికి విశేషంగా లోనై యంగ్ ఇటలీచే ఆకర్షితుడైనాడు. ఋషులు దేవుని నమ్మినట్లు ఇతడు ఇటలీని నమ్మాడు. నిరాడంబరుడుగా, సచ్ఛీలుడుగా, మహామర్యాద మనిషిగా అందరి ఆత్మీయతను, గౌరవ ప్రతిపత్తులను చూరగొన్నాడు. తన జీవిత కాలాన్ని ఐక్య ఇటలీ స్థాపనకు వినియోగించాడు. ఇతడు మహా సాహసవంతుడు. అంతేగాక గారిబాల్డీ ఏకీకరణలో కీలకపాత్ర వహించడంతో ఇతడిని 'ఇటాలియన్ జాతీయవాదం, ఏకీకరణల కృపాణం' అని పిలుస్తారు. దేశం పిలిచినప్పుడల్లా తన సేవలు కదన రంగంలో వినియోగించిన యోధుడు గారిబాల్డీ. ఇటలీ స్వేచ్ఛ కోసం కత్తిదూయడానికి అతడెప్పుడూ సిద్ధం. అతడు పోరాట పటిమను నమ్ముకున్నాడు. రాజకీయ అవసరాలు, దౌత్య మర్యాదలు, అతడికి తెలియవు. అతడి దూసుకుపోయేగుణం కవూర్‌ను అనేకసార్లు మొహమాట పరిస్థితిలో పడవేసినా, ఇటలీ ఏకీకరణకు దారి ఏర్పరిచినది అతడే.

క్రీ.శ. 1834 లో జినోవాలో తిరుగుబాటుచేసి, యుద్ధనౌకను, ఆయుధాగారాన్ని వశం చేసుకోవాలని ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నం విఫలం కావడంతో మరణశిక్షను పొంది, తప్పించుకొని, దక్షిణ అమెరికాకు పారిపోయాడు. అక్కడి తిరుగుబాట్లలో సాహసోపేతంగా స్వైరవిహారం చేసి యుద్ధభూమిని ఆహ్లాదకరమైందిగాను, కఠినమైన శిబిరాల్లో నివాసం ఉల్లాసకరమైందిగాను జీవించాడు. ఇక్కడే అతను గెరిల్లా యుద్ధవ్యూహాన్ని అలవరచుకొన్నాడు. తరువాత ఇది అతనికెంతో ఉపయోగపడింది. ప్రవాసంలోనే ఒక చిన్న స్వచ్ఛంద సైన్యాన్ని ఏర్పాటు చేసాడు. పద్నాల్గు సంవత్సరాలు ఈ ప్రవాసజీవితంలోని విప్లవయుద్ధాల్లో పాల్గొని, 1848లో తిరిగి స్వదేశంలో అడుగుపెట్టాడు. అతడు "రెడ్‌షర్ట్స్" అనే మూడు వేల స్వచ్ఛంధ సైన్యముతో సార్డీనియాలో ప్రవేశించి, ఆస్ట్రియాకు వ్యతిరేకంగా పోప్ పైన పోరాడాడు. కానీ పరాజితుడై న్యూయార్క్‌కు పారిపోయి, అక్కడ చిన్న వ్యాపారం మొదలుపెట్టి, కొంత ధనాన్ని ఆర్జించాడు. క్రీ.శ. 1854లో మరల స్వదేశానికి తిరిగి వచ్చి, ఏకీకరణ కృషికి ఎంతో సాహసోపేతంగా ఎనలేని నిస్వార్థ సేవచేశాడు. 1850లో పీడ్మాంట్ సేనలతో కలిసి ఆస్ట్రియాను ఎదిరించాడు. 1860లో రెండో

ఫ్రాన్సిస్ రాజు పాలనకు వ్యతిరేకంగా సిసిలీలో తిరుగుబాటు జరుగగా గారిబాల్డీ తన వేయిమంది అనుచరులతో మార్సాలా నుంచి పాలెర్మో పైకి నడిచాడు.

సిసిలీ ఆక్రమించుకొని విక్టర్ ఇమ్మాన్యుల్ తరపున అక్కడ తనను ప్రతినిధిగా ప్రకటించుకొన్నాడు. అంతట నేపిల్స్‌ను ఆక్రమించే ఉద్దేశ్యంతో మెస్సీనా జలసంధిని దాటి నేపిల్స్ ప్రవేశించగా రాజు రెండో ఫ్రాన్సిస్ పారిపోయాడు. ఈ విజయాలతో ఉత్సాహపరవశుడైన గారిబాల్డీ పోప్‌ను కూడ జయించి, అతని ఆధీనంలోని రాజ్యాలను వశపరచుకొని, సమైక్య ఇటలీ ప్రయత్నాలను పూర్తి చేయదలచాడు. అయితే 1856 పారిస్ సంధి షరతుల ప్రకారం పోప్ సంరక్షణ భారం వహించి, ఫ్రెంచి చక్రవర్తి మూడో నెపోలియన్ రోమ్‌లో తన సైన్యాలను నిలిపి ఉంచాడు. అందుచేత గారిబాల్డీ దండయాత్ర వలన ఫ్రాన్స్‌తో పోరాటానికి దిగవలసిన పరిస్థితి ఉత్పన్నం కాగలదని అందుకు గారిబాల్డీ చాలడని కవూర్ గ్రహించాడు. గారీబాల్డీ ఓటమి వలన ఇటలీ సమైక్యతా ఉద్యమం విఫలమై తిరిగి పూర్వపు పరిస్థితి ఏర్పడగలదని కవూర్ భయం అతడు గారిబాల్డీ దండయాత్రను నిలువరిస్తూ సార్డీనియా స్వయంగా సేనలతో దండెత్తడం యుక్తమని భావించి, రోమ్‌పైకి దండయాత్రకు పంపాడు. అంతట అనారోగ్యం పెడ్మాంట్‌లో అంతర్భాగం అయింది. కాసర్ ఫెడార్డో దగ్గర పోప్ సేనలు ఓడిపోయాయి. ఒక్కరోమ్ సెంట్ పీటర్స్ పాట్రిమోని తప్ప తక్కిన వన్నీ సార్డీనియా సేనల వశమయ్యాయి. గారిబాల్డీ ప్రజాభిప్రాయ సేకరణ తరువాత రెండు సిసిలీలను సార్డినియా రాజుకు అప్పగించాడు గారిబాల్డీ. ఇంతకృషి చేసినా కవూర్ దేశ ఏకీకరణ పరిసమాప్తికి చూడకుండానే 1861లో కన్నుమూశాడు.

### 11.1.8 జియోబర్టీ వర్గం లేక పోప్‌పార్టీ :

జియోబర్టీ, పీడ్మాంట్‌కు చెందిన మతాచార్యుడు. ఇతడు ఇటలీ సమైక్యతను బలపర్చాడు. కానీ ఇతనికి రిపబ్లికన్ భావాలు సరిపడవు. అయితే ఇతడు పోప్ ఆధ్వర్యంలో ఇటలీ వివిధ రాజ్యాలు సమైక్యంగా ఏర్పడవలెననే పథకం చేశాడు. ఈ విషయాన్ని అతని గ్రంథం"ఇటలీ దేశస్తుల నైతిక, పౌరప్రాధాన్యత" (Moral and civil primary of the Italians) చెబుతుంది. ఈ పథకానికి అనుకూలంగా ధనికవర్గంవారు, కాథలిక్ మతాచార్యులు, పోప్ తొమ్మిదో పయస్‌తో తమ ప్రయత్నాలు తాము చేశారు. ఈ సమయంలోనే 1848లో విప్లవం జరగడంతో అది అణగిపోవడం జరిగింది. మాజినీ రిపబ్లిక్ ఆశయం ప్రకారం ఏకీకరణ సాధ్యం కాలేదు. పోప్ ఆధ్వర్యంలోనూ జరగలేకపోయింది. అందుచేత ఇటలీ ఐక్యతా విషయంలో సెవాయ్ రాజవంశస్థులే పూనుకొనవలెనని స్పష్టమైంది.

### 11.1.9 సార్డీనియా రాజపక్ష వర్గం :

పై రెండు వర్గాలు ప్రజాబాహుళ్యంలో తమ పలుకుబడిని కోల్పోగా, ఇటలీలోని అధిక సంఖ్యాకులు, తమ దేశ సమైక్యతకు సార్డీనియా రాజవంశ నాయకత్వాన్ని బలపరచారు. పరాధీనమైన ఇటలీ అంతటా, ఇదొక్కటే సిసలైన దేశీయ రాజ్యం. పీడ్మాంట్‌తో కలసి ఉన్న సార్డీనియా ప్రాంతం భాగ్యవంతమైంది. ఇచ్చటి ధనికులు మధ్యతరగతి ప్రజలు జాతీయ భావాన్ని, ఉదార దృక్పథాన్ని కలిగినవారు. దీనికి తగినట్లు ఈ రాజ్యపు రాజు సెవాయ్ వంశస్థుడైన, ఛార్లెస్ ఆల్‌బర్ట్ ఉదార, ప్రజాస్వామిక, రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టి, జాతీయ, ఉదార శక్తుల మద్దతును పొందాడు. క్రీ.శ. 1848లో ఆస్ట్రియాతో యుద్ధానికి తలపడి ఇటలీ విముక్తికి ప్రయత్నించి విఫలుడై రాజ్యవిరమణ చేసాడు. అతని కుమారుడు రెండో విక్టర్ ఇమ్మాన్యుల్ రాజైనాడు.

### 11.1.10 రెండో విక్టర్ ఇమ్మాన్యుల్ :

నూతన రాజైన రెండో విక్టర్ ఇమ్మాన్యుల్ ఉదారుడు. ఇటలీలోని మిగతారాజ్యాలు క్రీ.శ. 1843లో ప్రవేశపెట్టిన రాజ్యాంగాలను రద్దుచేయగా ఈ రాజు తన తండ్రి ప్రవేశపెట్టిన ఉదార రాజ్యాంగాన్ని కొనసాగించాడు. ప్రజలు ఇతనిని ధర్మప్రభువుగా కొనియాడారు. తెలివైన, సాధింప వీలైన విధానాలను చేపట్టి, అందరినీ ఆకట్టుకున్నాడు.

## 11.1.11 కౌంట్ కవూర్ (1810 - 1861) :

ఇటలీ ఏకీకరణలో అందరు ఒక ఎత్తు, కవూర్ ఒక్కడే ఒక ఎత్తు. ఇటలీ సమైక్యత మరేశక్తివలన కాక, కేవలం సెవాయ్ రాజవంశం యొక్క కృషిచేత మాత్రమే సాధ్యం కాగలదని దూరదృష్టితో గ్రహించినవాడు. జోసెఫ్ మాజినీ నుండి దేశభక్తిని, ఇటలీ సమైక్యతను సాధించడం పట్ల అంకిత భావాన్ని గ్రహించి, గారిబాల్డీకి నైతికబలాన్ని చేకూర్చే ఆదర్శవంతుడై ఇటలీ సమైక్యతను సాధించినవాడు కౌంట్‌కవూర్. వారిద్దరికిలేని అధికారం కలిగినవాడు, తన నాయకత్వ పటిమ, దౌత్యవిభాగాలతో సార్డీనియా రాజ్యం ఈ ఉద్యమంలో ప్రధానపాత్ర వహించే విధంగా నడిపించాడు. గారీబాల్డీ కత్తిని జాతీయ ఆయుధంగా కూడా మలచాడు. అతడి న్యాయనిర్ణయ శక్తి, దౌత్యనీతి లేకుంటే మాత్రం మాజినీ ఆదర్శవాదం, దూరదృష్టిలేని గారీబాల్డీ దూకుడు తవం విఫలంగాను మరోసారి చరిత్రలో ఇటలీ ఆశయాలను పేకమేడల్లా కూల్చివేయుటకు దారి తీసేవి.

కవూర్ నిష్ఫలంగాను, రాజైన రెండో ఇమ్మాన్యుల్‌కు, కుడిభుజంగా, కొండంత బలాన్ని చేకూర్చి, సార్డీనియా రాజ్యాన్ని తీర్చిదిద్దాడు. ఇతడు క్రీ.శ. 1810లో పీడ్మాంట్‌లోని ఒక ప్రభుకుటుంబంలో జన్మించాడు. యువకుడుగా ఇంగ్లాండ్, ఫ్రాన్సు, స్విట్జర్లాండు దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. ఇంగ్లీషు రచయితల రచనలచేత ప్రభావితుడై ఉదారవాద వైఖరిని అలవర్చుకున్నాడు. బాగా ప్రగతిని సాధించిన పాశ్చాత్య వ్యవసాయక, పారిశ్రామిక విధానాలంటే, ఎంతో ఉత్సాహం కనపరిచాడు. పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థచేత బాగా ఆకర్షితుడైనాడు. అందువలననే పీడ్మాండ్ రాజ్యాన్నే కాకుండా, ఇటలీనంతటినీ పాశ్చాత్యీకరణ గావించాలన్నదే తన జీవిత ధ్యేయంగా ఎంచాడు. ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాలలో వలెనే రైల్వేలు, కార్ఖానాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, ఇటలీ సత్వర మార్గాలని గట్టిగా నమ్మాడు. క్రీ.శ. 1850లో పీడ్మాంట్ రాజ్య, వ్యవసాయ, వ్యాపార మంత్రిగా ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం, దేశాలతో ఒప్పందాలు చేసుకొని, పశ్చిమ ఐరోపా, స్వేచ్ఛా వ్యాపార దేశాలతో పీడ్మాంట్ అధిష్ఠించి, రాజ్యానికి వర్తక సంబంధాలను సమకూర్చి ఆర్థికౌన్నత్యానికి పునాది వేశాడు. అప్పటి అవసరాలకు కావలసిన మూలధనాన్ని సమకూర్చి పీడ్మాంట్ రాజ్య ఆర్థిక పరిస్థితిని పటిష్టపరిచాడు. నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టి, రహదారులను, ఓడరేవులను మెరుగుపరచాడు. మెరుగుపడ్డ రహదారులతో, వర్తక వాణిజ్యాలను విస్తరణతో పీడ్మాంట్ రాజ్యాన్ని ఆర్థికంగా బలపరచాడు.

కవూర్ సైన్యములో యువఇంజనీర్‌గా ఉన్నప్పుడే, సాంకేతిక దృక్పథాన్ని అలవరచుకున్నాడు. కనుక పీడ్మాంట్, సైనిక నౌకాదళాలలో ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టాడు. ఆర్థిక పురోభివృద్ధి పథకాలను రూపొందించి ఎగుమతి దిగుమతులపై సుంకాలను తగ్గించి, పన్నుల భారాన్ని అన్ని వర్గాల ప్రజలపై వీలైనంత మేరకు సమానంగా పడేటట్లు చూసాడు. రాజకీయ ఉదారవాదంతో బ్రిటీష్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని మన్నించాడు. "రిసార్జిమెంటో" పత్రిక సంపాదకునిగా, సార్డీనియా మంత్రిగా, ప్రధానమంత్రిగా ఇటలీకి ఎనలేని సేవ చేసాడు. ఇతడు మనసావాచా ప్రజాస్వామ్యవాదై తనను తాను స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సుతునిగా భావించుకున్నాడు. పార్లమెంటరీ సమావేశాలు తనకెంతో ఇష్టమనీ అవే తనకు బలాన్ని కల్గిస్తాయని భావించేవాడు.

కవూర్‌లో మాజినీలో లేని యదార్థవాదం గమనార్హం. అందుకే ఇటలీ ఏకీకరణ విదేశీ సహాయంతోనే సాధ్యమౌతుందని నమ్మాడు. అందుకని ఇటలీ ఏకీకరణోద్యమానికి, సార్డీనియా నాయకత్వానికి వేచిఉన్నాడు. కౌంట్‌కవూర్ భావించిన పరిస్థితులు క్రిమియా యుద్ధతరుణం (1854 - 1856) లో సమకూరాయి. టర్కీ విచ్ఛిన్నత నాకాంక్షిస్తున్న రష్యాతో యుద్ధం చేయడానికి పూనుకొన్న ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లకు సహాయంగా సార్డీనియా సేనలను కూడా కవూర్ పంపి ఆ దేశాల సానుభూతి సంపాదించ ప్రయత్నించాడు. క్రిమియా యుద్ధంలో సెబాస్టపోల్ యుద్ధరంగంలో పీడ్మాంట్ వీరుడన్న మాటలు 'ఈ సెబాస్టపోల్ బురదనుండి నూతన ఇటలీ ఉత్పన్నమౌతుంది'. అనేవి చారిత్రాత్మకమైనవి. యుద్ధానంతరం 1855 లో జరిగిన పారిస్ సంధి సంప్రదింపులతో ఇటలీ ఏకీకరణ విషయమై ప్రస్తావించి ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల సానుభూతి పొందాడు కవూర్. మూడో నెపోలియన్‌తో సంప్రదించి

ఆస్ట్రియాను తరిమివేసే యత్నంలో నెపోలియన్ సార్డీనియాతో సహకరిస్తే అతనికి నైస్, సెవాయ్‌లు ప్రతిఫలంగా సార్డీనియా రాజు ఇస్తాడని ప్లాంబియర్స్ దగ్గర 1858లో రహస్య సంధి చేసుకున్నాడు. ఆస్ట్రియా అధికారం తొలగించినట్లైతే ఉత్తర ఇటలీ ప్రాంతాలు ఏకమై ఇటలీ ఏకీకరణలో ప్రథమ దశ పూర్తి అవుతుందని కవూర్ అనుకొన్నాడు. నెపోలియన్ ఉత్తర ఇటలీలో ఆస్ట్రియా అధికారం పోయినట్లయితే ఫ్రెంచి ప్రాబల్యాన్ని విస్తరించవచ్చునని అనుకున్నాడు. ప్లాంబియర్స్ సంధి తరువాత కవూర్ ఆస్ట్రియాను యుద్ధానికి పురికొల్పే ప్రయత్నంలో సేనలను వృద్ధి చేయసాగాడు. కవూర్ ఆశించినట్లే సార్డీనియాను తన సేనను తగ్గించుకొమ్మని, లేనిపక్షంలో యుద్ధానికి సిద్ధం కమ్మనీ ఆస్ట్రియా కఠినమైన తుది హెచ్చరిక చేసింది. దీనిని కవూర్ తిరస్కరించి, ఆస్ట్రియా 1859లో యుద్ధం ప్రకటించేలా కవూర్ వ్యూహం రచించి, అమలు జరిపాడు. మాజెంటా, సల్ఫరినో రంగాలలో సార్డీనియా, ఫ్రాన్స్‌ల సేనలు ఆస్ట్రియన్‌లను ఓడించాయి. లంబార్డీ ప్రాంతం సార్డీనియా వశమయింది. అయితే, ఈ యుద్ధవిజయాలతో లంబార్డీ, వెనీషియాలను ఆక్రమించిన సార్డీనియా ప్రబలం కాగలదని నెపోలియన్ విల్లా ఫ్రాంకా దగ్గర 1859లో ఆస్ట్రియాలో రహస్య యుద్ధవిరమణ సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం లంబార్డీ సార్డీనియాకు చెందినా, ఆస్ట్రియా వెనీషియాకు మిగిలింది. ఇవేకాక టస్కనీ, పార్మా, మోడేనా, రాజులు తమ రాజ్యాలలో పునఃస్థాపితమై పోప్ ఆధ్వర్యంలో సమాఖ్య కావడానికి కూడా ఒప్పందం చేసికోవడమైంది. విల్లా ఫ్రాంకా సంధి తన ప్రమేయం లేకుండా జరగడంతో కవూర్ తన ఛాన్సలర్ పదవికి రాజీనామా చేశాడు. కాని ఇటలీ ఏకీకరణ అతని ముఖ్య ధ్యేయంకావడంవల్ల తిరిగి రోమ్ ప్రాంతాలను ప్రజాభిప్రాయసేకరణ అనంతరం సార్డీనియాతో ఐక్యం చేసాడు. 1860 ఏప్రియల్‌లో విక్టర్ ఇమ్మాన్యుయల్ ట్యూరిన్‌లో ప్రథమ ఇటలీ పార్లమెంటుకు ప్రారంభోత్సవం చేసాడు. దీనితో ఒక్క వెనీషియా తప్ప ఉత్తర ఇటలీ ప్రాంతాలన్నీ ఐక్యమయ్యాయి.

**11.1.12 వెనీషియా (1866) :** వెనీషియాను ఆస్ట్రియా నుండి పొందాలనే ఉద్దేశ్యంతో క్రీ.శ. 1866లో ఇటలీ ప్రష్యాతో చేరింది. క్రీ.శ. 1866లో జరిగిన ఆస్ట్రియా - ప్రష్యా యుద్ధంలో ఆస్ట్రియా "సెడోవా" వద్ద ఘోర పరాజయం పొంది, వెనీషియాను, బిస్మార్క్ ఆదేశానుసారం ఇటలీకి ఇవ్వడం జరుగుతుంది.

**11.1.13 రోమ్ :** ఇటలీ ఏకీకరణ క్రీ.శ. 1870లో జరిగిన ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధంతో పూర్తయింది. మూడవ నెపోలియన్ క్రీ.శ. 1849 నుండి పోప్‌కు అండగా వున్న ఫ్రెంచి సైన్యాలను రోమ్‌నుండి ఈ యుద్ధకారణంగా ఉపసంహరించడంతో రెండో విక్టర్ ఇమ్మాన్యుల్ బిస్మార్క్ అనుమతితో తన 60 వేల సైన్యంతో రోమ్ పట్టణాన్ని వశపరచుకున్నాడు. దాంతో తరతరాలుగా పోప్ నిలయమైన రోమ్‌నగరం క్రీ.శ. 1871లో ఇటలీ జాతీయ రాజధానిగా వెలసింది. ఈ పరిణామంతో, మాజినీ మహాశయుడు కన్నకలలు నిజమయ్యాయి. మాజినీ నైతికబలం, కవూర్ దౌత్యం, గారిబాల్డీ వీరత్వం, ఇమ్మాన్యుల్ మంచితనం ఇటలీని సమైక్యపరచాయి. ఇటలీ ఏకీకరణ అనే మహావ్యక్తికి మాజినీ ఆత్మ, కవూర్ మేధస్సు, గారిబాల్డీ దేహం అని అనడంలో ఎంతైనా ఔచిత్యముంది.

## 11.2. ఇటలీ ఏకీకరణ ప్రాముఖ్యం :

జాతీయ వాదానికి ఇటలీ ఏకీకరణ ఘనవిజయమనాలి. ఇది మెటర్నిక్ అభివృద్ధి నిరోధక సనాతన విధానాలకు చావు దెబ్బ. ఐక్యఇటలీ ఐరోపా రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించింది. "విగత జాతిగా కన్పించిన ఇటలీ, నూతన చైతన్యంతో పునరుత్తేజితమై, గతమనే శృంఖలాలను తెంచుకొని బంగారు భవిష్యత్తుకు సోపానాలు నిర్మించుకుందని" లార్డ్ పామర్‌స్టన్ శ్లాఘించాడు. ఇటలీఏకీకరణ వల్ల క్రిమియా యుద్ధం ఆరంభించిన పని పూర్తి అయిందని అంటారు. అంటే ఇది ఐరోపా రాజకీయ పద్ధతిని మార్చేసింది. క్రిమియా యుద్ధం రాజ్యాల దౌత్య సంబంధాలలో మార్పుతీసుకువచ్చింది. మెటర్నిక్ విధానానికి పూర్తిగా స్వస్తి చెప్పి రష్యాకు ప్రతికూలంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు కలవడం వాటితో ఇటలీ చేరడం గమనించవలసింది. కేవలం ఇటలీ దేశాభిమానాల యత్నాలేగాక విదేశీసహాయం, పరిస్థితులను తన కనుగుణంగా చేసికొనగల్గిన కవూర్ చాకచక్యం వల్ల ఇటలీ ఏకీకరణ సాధ్యమైందని స్పష్టమౌతుంది. ఒకవేళ ప్రష్యాకు ఆస్ట్రియా పట్ల వైషమ్యం లేకపోతే రష్యాకు కూడా ఆస్ట్రియా

పట్ల ఏవగింపు లేకపోతే, రష్యా 1856 పారిస్ సంధి నుల్లంఘించకపోతే ఇటలీ యత్నాలు ఫలించకపోయేవి. ఆ సమయంలో టస్కనీ, పార్మా, రోమగ్నా రాజ్యాల్లో ప్రజలు తిరుగుబాట్లుచేసి, తనను పాలించే నిరపేక్ష రాజవంశాలను తొలగించారు. వారు తమ రాజ్యభాగాలను సమైక్య ఇటలీలో కలిసేందుకు రెండవ విక్టర్ ఇమ్మాన్యుయెల్ రాజ్యాధిపత్యాన్ని అంగీకరించేందుకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచారు. అంతట ఆ రాజ్యాలను విలీనం చేసుకొని 1860లో రెండవ ఇమ్మాన్యుయెల్ కవూర్‌నే ఛాన్సలర్‌గా నియమించాడు.

## 11.3 జర్మనీ - పరిచయం :

జర్మనీ సమైక్యతోద్యమం ఆధునిక యుగచరిత్రలో మరువరానిది. జర్మనీ ఏకీకరణ జాతీయ రాజ్యాల స్థాపనలో మైలురాయి. ఇటలీ వలెనే జర్మనీకూడా ఎన్నో శతాబ్దాల నుంచి సమైక్యరాజ్యంగా లేదు. ఆధునిక యుగారంభానికి జర్మనీ దేశంలో సుమారు 350 రాజ్యాలుండేవి. వాటిలో కొన్ని చిన్న, పెద్ద సంస్థానాలు కొన్ని నగరాలు. ఇవన్నీ పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో ఉండి ఆస్ట్రియా - హంగేరీని పాలించే హాబ్స్‌బర్గ్ వంశసర్వంసహాధీశత్వంలో ఉండేవి. అందుకే దానిని 'జర్మనీ' అనేదానికంటే జర్మన్ రాజ్యాలు అనడం సబబు. మత సంస్కరణోద్యమ ఫలితంగా పవిత్ర రోమన్ సామ్రాజ్యం క్షీణించి, ప్రష్యా, జర్మనీ రాజ్యాలలో ఆస్ట్రియా తరువాత బలీయరాజ్యంగా రూపొందింది. 1618 - 1648 సంవత్సరాల్లో జరిగిన ముప్పయి సంవత్సరాల యుద్ధం (Thirty years, war) తరువాత వృద్ధిలోకి వస్తున్న ప్రష్యా రాజ్యం జర్మనీలో నాయకత్వానికి ప్రయత్నిస్తూ వచ్చింది. కానీ ప్రష్యా, ఆస్ట్రియా పోటీని, వైరాన్ని ఎదుర్కొనక తప్పలేదు. హోహెం జొలర్న్‌ల రాజవంశం ప్రష్యాను పాలించేది. బెర్లిన్ పట్టణం కేంద్రంగా బ్రాండన్‌బర్గ్‌గా పిలువబడిన ప్రాంతం, ఈ ప్రష్యా రాజ్యానికి నాంది. ఫ్రెడరిక్ విలియం హోహన్‌జోలర్న్ వంశప్రతిష్ఠను ఇనుమడింపజేసాడు. ఇతని కుమారుడైన రెండో ఫ్రెడరిక్ విలియమ్ కాలంలో ప్రష్యా రాజ్యం సుసంపన్నమైనది. ఇతని కుమారుడు సుప్రసిద్ధుడైన ఫ్రెడరిక్ మహాశయుని కాలంలో, ప్రష్యా, జర్మనీలో ప్రముఖరాజ్యంగా పరిణమించింది.

### 11.3.1 18వ శతాబ్దంలో రెండు రాజవంశాల మధ్యపోటీ - ప్రష్యా ఆవిర్భావం :

నెపోలియన్ ఐరోపాఖండంలో విజయఢంకా మ్రోగించే కాలంలో జర్మనీలోని పెక్కు చిన్న చిన్న రాజ్యాలను జయించి రైన్ రాజ్య సమాఖ్య, వెస్ట్ ఫాలియా రాజ్యం అనే రెండు రాజ్యాలను తన రెండు రాజ్యాల నూతన స్వీయ ఆధిపత్యం క్రింద ఏర్పరచాడు. ఇప్పుడు మూడు జర్మనీలోని వందలాది రాజ్యాలు నాలుగు రాజ్యాలు అయినాయి. అవి ఆస్ట్రియా ఆధీనంలో ఉన్న జర్మన్ భూభాగము. ప్రష్యా, రైన్ రాజ్యాల సమాఖ్యగా వెస్ట్‌ఫాలియా రాజ్యంగా ఉన్నాయి. దీంతో, ఆస్ట్రియా ఆధిపత్యం తగ్గింది. నెపోలియన్ ఈ రాజ్యాలలో ఎన్నో ప్రజాహిత సంస్కరణలు ప్రవేశపెట్టి, ఒకే విధమైన పాలనా వ్యవస్థను గూడా ఏర్పాటు చేశారు. బానిసత్వం నిర్మూలించడమే గాక భూస్వామ్య పద్ధతిని రద్దుపరచి విప్లవ సిద్ధాంతాలను అనుసరించి, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలలో మార్పులు ప్రవేశపెట్టాడు. దీంతో వివిధ సంస్థానాల మధ్య అడ్డంకులు పోయి జర్మన్‌లంతా ఒక్కటే అనే జాతీయభావాన్ని నెపోలియన్ కల్గించాడు. మొట్టమొదటిసారి, ఈ చర్యలన్నీ జర్మనీలో ముందెన్నడూ లేని జాతీయతా భావాన్ని అంకురింపజేసాయి. ఆధునికి జర్మనీ అవతరణకు, నెపోలియనే మూలపురుషుడిగా పేర్కొనవచ్చును. ఈ జాతీయతా భావ ప్రభావమే చివరకు నెపోలియన్ పతాకానికి కారణమైంది. జర్మనీ ఐక్యాన్ని సాధించగల్గింది కాబట్టి నెపోలియన్ ఒక విధంగా జర్మనీ సృష్టికర్తగా భావిస్తారు.

జర్మనీ జాతీయ వాదానికి మూలం నెపోలియన్‌తో జరిపిన ఆస్ట్రియా, ప్రష్యాలు జరిపిన పోరాటాలతో ముడిపడి ఉంది. జాతీయ భావాలతో ఆవేశితులైన జర్మన్‌లకు నెపోలియన్ ఆధిపత్యంలోని ఫ్రాన్స్‌కు లోబడి ఉండడం దుస్సహాం అయింది. వాటర్లూ యుద్ధం తరువాత జర్మనీ ఉదారవాదులు జాతీయవాదం ప్రాతిపదికగా జర్మనీ పునర్వ్యవస్థీకరణను కోరుకున్నారు. స్వతంత్ర ఐక్యజర్మనీని ఏర్పరచాలన్న వారి ప్రయత్నాలు ఫలించలేదు. వియన్నా మహాసభ జర్మనీని 36 రాజ్యాల సమాఖ్యగా కుదించి ఆస్ట్రియా చక్రవర్తిని అధ్యక్షునిగా ప్రకటించి అధికారం అప్పగిస్తూ తిరోగమన చర్యతీసుకోవడంతో

ఉదారవాదుల ప్రయత్నాలు వమ్మయ్యాయి. ఐతే, ఎటువంటి తిరోగమన చర్యా, స్వేచ్ఛా, జాతీయవాద స్ఫూర్తిని అడ్డుకోలేదు. వియన్నా మహాసభ తరువాత జర్మనీ చరిత్ర రెండు ఉద్యమాలతో ముడిపడి ఉంది. ఒకటి ప్రజాస్వామ్య ఉద్యమం, రెండు జాతీయవాద ఉద్యమం. మొదటి ఉద్యమలక్ష్యం ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగా, రెండో ఉద్యమం లక్ష్యం జర్మనీ ఐక్యత. కానీ జర్మన్ రాజ్యాల పాలకులు ఎటువంటి సంస్కరణలనూ సమ్మతించలేదు. మెటర్నిక్ ఆదేశాలపై ప్రతిఒక్క ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి వారు చేయగల్గినదంతా చేసారు. ఐనా, క్రీ.శ. 1818 లో ప్రష్యా నాయకత్వంలో, వివిధ జర్మన్ రాజ్యాల మధ్య జోల్వెరిన్ అనే సుంకాల సంస్థను ఏర్పరిచింది. స్వేచ్ఛా వర్తక వ్యాపారాల ద్వారా, ఆర్థిక సహకారం పెంపొందింది. ఈ రాజ్యాలలో ప్రష్యా ప్రతిష్ఠత పెరిగింది. ప్రష్యా ప్రతిష్ఠ, ఆస్ట్రియా ఆధిపత్యానికి గొడ్డలిపెట్టు, ఆస్ట్రియా క్రమంగా ఆధిక్యతను కోల్పోతూ వచ్చింది. క్రీ.శ. 1830లో జర్మనీలో కూడా పెక్కు జాతీయ తిరుగుబాట్లు జరిగాయి. కాని అవి విఫలమయ్యాయి. క్రీ.శ. 1848లో ఐరోపాలో సంభవించిన ఉదారవిప్లవాలు జర్మనీని గూడా ప్రభావితం చేసాయి. ప్రష్యారాజు నాలుగో ఫ్రెడరిక్ విలియమ్, జాతీయ పార్లమెంట్‌ను ఫ్రాంక్‌ఫర్ట్‌లో సమావేశపరచాడు. ఈ పార్లమెంటును జర్మనీకి రాజ్యాంగాన్ని రూపొందించమని కోరాడు. జర్మనీకి ఆధిపత్యం వహించమని ఈ పార్లమెంట్ నాలుగో ఫ్రెడరిక్ విలియంను కోరింది. కానీ ఆస్ట్రియా, ప్రష్యాను ఓడించి, ఈ ప్రయత్నాలన్నింటినీ వమ్ము చేసింది. నిరాశ చెందిన ఉదారవాదులు, ఇటలీ ఏకీకరణ విజయాన్ని శ్రద్ధాసక్తులతో గమనించారు. ఇంతలో క్రీ.శ. 1859 లో, ఆస్ట్రియా, సార్డీనియా చేతిలో ఓడి, బలహీనపడింది. దీనితో జర్మనీ సమాఖ్య నుండి ఆస్ట్రియాను గెంటివేయడం అనివార్యమని, అలాంటిది తప్పక సంభవించాలని జర్మనీ ప్రజలు విశ్వసించారు.

## 11.3.2 ప్రష్యా నాయకత్వం :

ఆస్ట్రియా క్రమంగా బలహీనపడడంతో, జర్మనీలో ప్రష్యా ఆధిపత్యానికి తావు కల్పించింది. జర్మనీలోని ఉదారవాదులు, సనాతనులు, దేశభక్తులు, అందరూ మనసారా జర్మనీ ఏకీకరణను వాంఛించారు. క్రీ.శ. 1861లో ప్రష్యారాజైన మొదటి విలియం, ఏకీకరణకు కావలసిన నాయకత్వం లక్షణాలను పుణికి పుచ్చుకున్నాడు.

## 11.3.3 మొదటి విలియం (1861 - 1888) :

నాలుగో ఫ్రెడరిక్ విలియమ్ 1858లో మతిభ్రష్టుడు కాగా అతని సోదరుడు విలియం సంరక్షకుడయి ఫ్రెడరిక్ విలియమ్ 1861లో మరణించగానే ప్రష్యా రాజయ్యాడు. ఇతని రాకతో ప్రష్యాలో నూతన శకం ఆరంభమైందని చెప్పవచ్చు. ఇతనిలో స్వాభావిక బుద్ధికౌశలం, సైనిక లక్షణాలు, వాస్తవిక పరిస్థితిని అవగాహన చేసుకొనేశక్తి, ధృఢనిశ్చయం ఉన్నాయి. అయితే రాచరికం దైవదత్తమని, నిరంకుశత్వమే తగిన విధానమని నమ్మాడు. ఇటలీ ఏకీకరణ సందర్భంలో ఆస్ట్రియా ఓటమి ప్రష్యాకు ప్రోత్సాహం కలిగించింది. కానీ ఆల్మట్ దగ్గర ప్రష్యా సేనలకు జరిగిన అవమానం సైనిక దక్షతకు లోటు అని, సైనిక సంస్కరణలు ముఖ్యమని మొదటి విలియం గుర్తించాడు. అందుచేత సైనిక సంసిద్ధత ఉండవలెనని, దానికి తగిన సిబ్బందిని నియమించవలెనని ప్రష్యాలోని నిర్బంధసైనిక సేవా పద్ధతిని అమలుపెట్టాడు. వాన్‌రూన్ అతని అనే అతనిని యుద్ధమంత్రిగాను, మోల్ట్కే అనే అతనిని సైన్యాధికారిగాను చేసి సైన్యాన్ని బలవంతంగాను చేయదలచుకున్నాడు.

## 11.3.4 పార్లమెంట్‌తో ఘర్షణ :

మొదటి విలియం ప్రష్యా సైనిక శక్తిని పెంచాలని ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదనను క్రీ.శ. 1861లో ప్రష్యా పార్లమెంట్ (లాండ్‌టాగ్) ఒక సంవత్సరానికి అంగీకరించింది. కాని, క్రీ.శ. 1862లో రాజుపై ఒత్తిడితెచ్చి సంస్కరణలను పొందాలని భావించి, సైనిక పెంపు ప్రతిపాదనను తిరస్కరించింది. రాజు తను కోరిన విధంగా సైనిక పెంపు జరగాలని పట్టుబట్టాడు. కాని లాండ్‌టాగ్‌లో సంఖ్యాబలమున్న ఉదారులు సంస్కరణలు కావాలని పట్టుబట్టారు. దాంతో ముందుకు కొనసాగని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులలో లాండ్‌టాగ్ రద్దుచేయబడి ఎన్నికలు నిర్వహించగా నూతనంగా ఏర్పాటయిన లాండ్‌టాగ్‌లో

ఉదారవాదులే అధిక సంఖ్యాకులైనారు. వీరంతా ఇటలీలో వలెనే, రాజ్యాంగబద్ధమైన రాజరికం ఏర్పడాలని పట్టుబట్టారు. దాంతో రెండు వర్గాలు బలాబలాలు ప్రదర్శింప సిద్ధమైనారు. ఈ పరిస్థితిని ప్రష్యాను రాజకీయ సంక్షోభానికి గురిచేసింది. ఏమి చెయ్యాలో రాజుకు పాలుపోలేదు. ఈ విషమ పరిస్థితిని ఎదుర్కోటానికి వాన్‌రూన్ సలహాపై బిస్మార్క్‌ను క్రీ.శ. 1862 లో ప్రధాన మంత్రిగా నియమించాడు. చికాకుకు గురైన తన రాజుకు "అవసరమైతే నేనురాజుతో గూడా నాశనానికి సంసిద్ధుడననీ, కాని రాజు - పార్లమెంటు మధ్య సాగుతున్న బలాబలాల పోటీలో, రాజును ఒంటరిగా ఎన్నడూ చేయను" అని బిస్మార్క్ అభయహస్తమిచ్చాడు.

## 11.3.5 ఆటోవాన్ బిస్మార్క్ (1815 - 1898) :

నిరంకుశ రాజరికానికి ఛత్రం పట్టినవాడు ఆటోవాన్ బిస్మార్క్. రాజ్యాంగాలన్నా, పార్లమెంటరీ వ్యవస్థలన్నా ఇతనికి పరమ అసహ్యం. ప్రష్యా రాజరికమంటే అతనికి అచంచల విశ్వాసం. ప్రష్యా ఘనతకు దాని రాజులే కారణం, ప్రజలు కాదు అని అతడు నొక్కిచెప్పాడు. ఊకదంపుడు ఉపన్యాసాల వల్ల బృహత్కార్యాలు నెరవేరవని, కఠిన దండనీతి (Policy of Blood & Iron) వల్లనే అవి సాధ్యమని నిర్బంధంగా ప్రకటించాడు.

బిస్మార్క్ ఆధునిక ఐరోపా చరిత్రలో అందరినీ ఆకట్టుకొని, ప్రముఖపాత్ర నిర్వహించిన ధీరుడు. ఇతడు బెర్లిన్ సమీపంలోని షోన్‌హౌసన్ గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన క్రీ.శ. 1815లో ప్రభుకుటుంబంలో జన్మించాడు. ఇతడు తండ్రి దేహధారుడ్యాన్ని, తల్లి సునిశిత మేధాసంపత్తిని వారసత్వంగా పొందాడు. ఇతని పూర్వీకులు భూస్వాములుగా, ఉన్నతోద్యోగులుగా ప్రముఖ పాత్రను నిర్వహించారు. బెర్లిన్, గోటింజెన్ విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసించాడు. ప్రభుత్వోద్యోగంలో క్రమశిక్షణా రాహిత్యం వల్ల బర్తరఫ్ చేయబడ్డాడు. క్రీ.శ. 1847లో ఒక భూస్వామి కుమార్తెను వివాహమాడి, ఆమె ప్రభావంలో కరుడుగట్టిన సనాతన వాదిగా తయారయ్యాడు. క్రమంగా అతడు లూథర్ చర్చి సిద్ధాంతాలు నమ్మి గౌరవించసాగారు. 1848 విప్లవకాలంలో ఉదారవాదాన్ని వ్యతిరేకిస్తూ, ప్రష్యా రాచరిక ప్రభుత్వాన్ని శ్లాఘిస్తూ అతడు ప్రచారం చేసాడు. ఉదారవాదులతో పోరాటానికి తన రైతు దళంతో తరలివస్తానని రాజుకు వార్త పంపాడు. జర్మనీ ఏకీకరణకు ఫ్రాంకుఫర్ట్ జాతీయసభ చేపట్టిన పార్లమెంటరీ విధానాలను బిస్మార్క్ అవహేళన చేసాడు. జర్మన్ సామ్రాజ్యాధిపత్యాన్ని తిరస్కరించినందులకు అతడు, 4వ ఫ్రెడరిక్ విలియం రాజును అభినందించాడు బిస్మార్క్ దౌత్య జీవితానికి తర్ఫీదు పొంది, ఫ్రాన్స్, ఇంగ్లాండులో విస్తృతంగా పర్యటించాడు.

క్రీ.శ. 1845లో పామిరేనియా రాష్ట్ర శాసనసభకు ఎన్నికైనాడు. క్రీ.శ. 1847లో సామ్రాజ్య శాసనసభ ప్రతినిధి అయ్యాడు. క్రీ.శ. 1849లో ప్రష్యా దిగువ సభకు ఎన్నికైనాడు. క్రీ.శ. 1851లో ప్రష్యా రాయబారిగా నియమింపబడి ఆ పదవిలో ఎనిమిది సంవత్సరాలు జర్మన్ సమాఖ్యలో ప్రష్యా ప్రతినిధిగా పనిచేస్తూ ఆస్ట్రియాపై విముఖత పెంచుకున్నాడు. ఇదేకాలంలో జర్మనీలోని చిన్న రాజ్యాలతో మైత్రి నెరపి వాటిలో ఆర్థిక సంబంధాలను పటిష్టపరచాడు. దీంతో జర్మన్ రాజ్యాలలో ప్రష్యా ప్రతిష్ఠ బలపడింది. క్రీ.శ. 1859 లో రష్యాకు ప్రష్యా రాయబారిగా వెళ్ళి ఆ పదవిలో మూడేండ్లు కొనసాగాడు. ఈ మూడేండ్లలో రష్యా మద్దతును పొందడమేగాక రష్యా చక్రవర్తి మన్ననలకు పాత్రుడయ్యాడు. క్రీ.శ. 1862 లో ఫ్రాన్సులో కొద్ది కాలమే ప్రష్యా రాయబారిగా నున్నా మూడో నెపోలియన్ బలహీనతను బాగా పసిగట్టాడు.

క్రీ.శ. 1862లో వాన్‌రూన్ సలహాపై, ప్రష్యారాజు బిస్మార్క్‌ను మంత్రిగా నియమించాడు. అది రాజుకు ప్రష్యా శాసనసభ నుండి సవాలు ఎదురైన క్లిష్ట సమయం. మొదట్లో బిస్మార్క్‌ను రాజు సరిగా అంచనా వేయలేదు. అందుకే ఇతనిని అభివృద్ధి నిరోధకుడని, నెపోలియన్ ఆరాధకుడని అనడం జరిగింది. అయితే బిస్మార్క్ అనితర సాధ్యమైన జర్మనీ ఏకీకరణ కర్త అయ్యాడు. మంత్రిగా శాసనసభతో సామరస్య విధానాన్ని అమలు జరపజూసాడు. కానీ ఇది విఫలం కావడంతో, తన విధాన ప్రకటనను చేసాడు. "వర్తమానంలో బృహత్తర సమస్యలు, ఉపన్యాసాల వల్లగానీ, పార్లమెంట్ తీర్మానాల వల్లగానీ పరిష్కరింపబడజాలవు. కఠిన దండనీతే తరుణోపాయమని ఉద్ఘాటించాడు. ఉదార వాదులు వ్యతిరేకించినా, విమర్శించినా, దుయ్యబట్టినా, ఖాతరు

చేయక, పార్లమెంటు ప్రమేయం లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టకుండా, రాజ్యాంగాన్ని పట్టించుకోకుండా పన్నులు విధించి వసూలు చేసి నియంతృత్వపు పోకడలతో సైనికాభివృద్ధిని సాధించాడు. ఈ విధంగా నాలుగేండ్లు ఎదురులేకుండా తన విధానాలను అమలుచేసాడు. పసలేని విధానాలతో పనులు సాధింపశక్యంకాదని, లక్ష్యసాధనే ముఖ్యమని గట్టిగా నమ్మాడు. ప్రష్యాలో ఉదారవాదులు వాక్‌శూరులేగాని, కార్యశూర్యులు కారని సాంప్రదాయ ప్రష్యా విప్లవానికి విరుద్ధమని, జర్మనీ ఐక్యతే ప్రజలంతా మనసారా వాంచిస్తున్నారని, అందుకై ఏ పద్ధతులు అనుసరించినా, ప్రజలు అభ్యంతరం చెప్పరనే ప్రజాభిప్రాయాన్ని బిస్మార్క్ అంచనా వేశాడు. సమైక్య జర్మనీ సాధనకై, సైనికబలమేగాక జర్మనీలో, ఆస్ట్రియాలో ఆధిక్యతను అంతంచేయాలని అందుకు తగు ప్రయత్నాలు కొనసాగించాడు. బిస్మార్క్ ఈ లక్ష్యసాధనలో అతడు మూడు యుద్ధాలు చేయవలసివచ్చింది.

11.3.6 జర్మనీ ఏకీకరణ కొరకు యుద్ధాలు :

### 11.3.6.1 డెన్మార్క్‌తో యుద్ధం (1864) :

జర్మనీ సమైక్యతా సాధనకై, నిర్మించిన సైన్యం ఆస్ట్రియాను ఓడించగలదో, లేదో అసలు ఆ సైన్యానికి గల సామర్థ్యం ఎంతో అంచనావేయడం ముఖ్యమని బిస్మార్క్ భావించాడు. అంతేకాక మున్ముందు ఆస్ట్రియాను దురాక్రమణదారుగాను, యుద్ధోన్మాదిగాను చిత్రించి, ఓడించడానికి ఒక ప్రాతిపదికను నిర్మించాలని కూడ యోచించాడు. ఈ రెండు ఉద్దేశ్యాలు నెరవేరేటట్లుగా ఆస్ట్రియాతో కలిసి డెన్మార్క్‌పై పోరాడే అవకాశాన్ని బిస్మార్క్ సృష్టించాడు. దీనికి బిస్మార్క్, ష్లేస్‌విగ్ (Schelswig) హోల్‌స్టీన్ (Holstein) సమస్యను చక్కగా వినియోగించుకున్నాడు. ఇవి రెండూ డెన్మార్క్ ఆధీనంలో ఉన్నాయి. అయినా, వాటిలోని ప్రజలు అధిక సంఖ్యాకులు జర్మన్‌లు. క్రీ.శ. 1848లోనే ఈ ప్రాంతాలు ఎవరికి చెందాలనే అంశంపై డెన్‌మార్క్ సంలీనం చేయకూడదని అంగీకరించబడింది. కాని క్రీ.శ. 1863లో ఈ అంగీకారాన్ని త్రోసిపుచ్చి డేనిష్ ప్రజల కోరికపై నూతన రాజు 9వ క్రిష్టియన్ ఈ ప్రాంతాలను డెన్మార్క్‌లో కలిపివేశాడు. జర్మన్ జాతి ప్రజలు ఈ చర్యను గర్హించారు. నూతన ప్రష్యా సైన్యశక్తిని పాటవాన్ని పరీక్షించడానికి ఇది ఒక అదునుగా ఎంచిన బిస్మార్క్, ఆస్ట్రియాతో కలసి డెన్మార్క్ రాజును బెదిరించాడు. కాని డెన్మార్క్ రాజు ఈ బెదిరింపులను నిర్లక్ష్యం చేసాడు. ఆస్ట్రియా, ప్రష్యాలు క్రీ.శ. 1864 అక్టోబర్‌లో డెన్మార్క్‌ను ఓడించి వియన్నా సంధి ద్వారా డెన్మార్క్ ఈ ప్రాంతాలను తానాశించిన విధంగా గాస్టీన్ (Gastein) తాత్కాలిక ఒప్పందాన్ని కుదుర్చుకొని, ష్లేస్‌విగ్ ప్రష్యా పాలనలోను, హోల్‌స్టీన్ ఆస్ట్రియా ఆధీనంలోను ఉండే ఏర్పాటు చేశాడు. ఈ సమస్యను భవిష్యత్తులో డయట్‌కు నివేదించరాదు. ఈ ఏర్పాటు బిస్మార్క్ దౌత్యవిధానానికి విజయమని చెప్పొచ్చు.

### 11.3.6.2 ఆస్ట్రియా - ప్రష్యా యుద్ధం (1866) :

ఈ ఆస్ట్రియా - ప్రష్యా యుద్ధానికి ఏడు వారాల యుద్ధం అని కూడా పేరు. ఆస్ట్రియాకు బవేరియా, సాక్జనీ, హానోవర్ తదితర చిన్న జర్మన్ రాజ్యాలు సహాయంగా వెళ్ళాయి. వాటిని ప్రష్యా ఎదుర్కొనాలి. లాంగన్ సాల్జా (Langenealza) అనేచోట 1866లో హానోవర్ సేన ఓడిపోయింది. బొహిమియాలో ఉన్న క్రోనిగ్రాట్జ్ (Koniggratz) లేదా సెడోవా అనేచోట జులై 3, 1866న యుద్ధం జరిగింది. సెడోవా (Sadowa) యుద్ధరంగంలో సాధించిన ప్రష్యా ఘనవిజయం ప్రపంచంలో సాయుధబలంలో దానికి గల కీర్తిప్రతిష్ఠలు బుజువుకావటమేకాక, ఇంకా సుదూర ఫలితాలకు దారితీసింది. ప్రాగ్ దగ్గర ఆగస్టు 1866లో సంధి జరిగి జర్మనీ నుంచి ఆస్ట్రియాను తొలగించడం, జర్మనీ సమాఖ్య రద్దుకావడం, వెనీషియాకు ఇటలీకి అర్పించడం ష్లేస్‌విగ్, హోల్‌స్టీన్‌లు ప్రష్యాకే చెందడం, జర్మనీలో ప్రష్యాచే కార్యక్రమాన్ని ఆస్ట్రియా గుర్తించడం జరిగాయి. హోల్‌స్టీన్ యుద్ధ నష్టపరిహారం ధనం ప్రష్యాకు ఇచ్చింది. ష్లేస్‌విగ్, హోల్‌స్టీన్, హానోవర్, నాసా, హెస్సీకాసెల్‌తో ఉత్తర జర్మనీ సమాఖ్య అనే కొత్త వ్యవస్థను సృష్టించి దానికి అధిపతిగా ప్రష్యాను చేయడమైనది. ఈ యుద్ధఫలితంగా ప్రష్యా గొప్ప సైనిక దేశంగా కీర్తి పొందింది. బిస్మార్క్ విధానం విజయవంతమైనది. ఇటలీకి వెనీస్ దక్కింది. ఇదేకాక ఆస్ట్రియా - హంగేరీలలోని కొన్ని ఆంతరంగిక పరిణామాలకు దారితీసింది. హంగెరికి వేరే ప్రభుత్వం, వేరే శాసనసభ ఆస్ట్రియా చక్రవర్తి ఆధ్వర్యంలోనే ఏర్పడ్డాయి. క్రోషియా,

బానత్, ట్రాన్సిల్వేనియాలు హంగేరికి వచ్చాయి. బుడాపెస్‌లు దీని రాజధాని. ఆస్ట్రియాలో బొహిమియా గెలీషియా, కార్నియెలా, టైరోల్‌లు చేరాయి. దానికి రాజధాని వియన్నా. ఈ రాజకీయ పరిణామాన్ని ఆస్‌గ్లీష్ (Ausgleich) అంటారు.

ఏడువారాల యుద్ధం తరువాత బిస్మార్క్ జర్మనీ ఏకీకరణ కోసం మూడు పద్ధతులు అవలంబించాడు. ఒక పద్ధతిలో లేని ప్రష్యా భౌగోళిక రూపాన్ని చక్కదిద్దటానికి, దానిని సైనిక పరంగా పటిష్టం చేయడానికి కొన్ని జర్మన్ రాష్ట్రాలను నేరుగా ప్రష్యాలో చేర్చటం, ఇట్లా చేర్చిన రాష్ట్రాలు ష్లేస్‌విగ్, హోల్‌స్టిన్, హానోవర్, హెస్సీకాసల్, నాసా, స్వతంత్ర ప్రతిపత్తిగల ఫ్రాంక్ ఫర్ట్ నగరం, ఈ రాష్ట్రాల చేరిక వలన ప్రష్యా విస్తీర్ణం 27,000 చదరపు మైళ్ళు పెరిగింది. దాని జనాభాకు 50 లక్షల మందిని కొత్తగా చేర్చడమైంది. దీనివల్ల మొత్తం జర్మనీలో, ఆస్ట్రియాను మినహాయించి 2/5 భూభాగం, 2/3 జనాభా ప్రష్యా ఆధిపత్యం క్రిందకు వచ్చాయి. "రైన్ నదికి ఉత్తరాన ఉన్న 20 జర్మన్ రాష్ట్రాలు వెంటనే ప్రష్యాలో చేర్చుకోబడలేదు. ఇవి ఉత్తరజర్మనీ సమాఖ్యగా రూపొందబడి ప్రష్యాకు సన్నిహితంగా చేయడం జరిగింది. వీటిలో ప్రతి రాష్ట్రానికి కొంత స్థానిక స్వయం ప్రతిపత్తి (Local Autonomy) ఇవ్వడం జరిగింది.

కానీ ఈ రాష్ట్రాలన్నీ ప్రష్యారాజు వంశపారంపర్య అధ్యక్షుడుగా కార్యనిర్వహణాధికారం చెలాయించే ఒక సమాఖ్య ప్రభుత్వానికి చేయడం జరిగింది. ఈ అధ్యక్షునికి సహాయంగా అతనికి బాధ్యత వహించే ఛాన్సలర్, మంత్రులు ఉంటారు. శాసనాధికారాలు వివిధ రాష్ట్రాధిపతుల ప్రతినిధులతో కూడిన బుండెస్‌రాట్ (Bundstrat Federa Council) అనే ఎగువసభ, సమాఖ్యలోని ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులతో కూడిన రెయిష్ట్యాగ్ (Reichstag) అనే దిగువ సభలతో కూడిన పార్లమెంటు ఇవ్వడం జరిగింది. విదేశీ వ్యవహారాలు, సైనిక వ్యవహారాలపై సంపూర్ణాధికారం అధ్యక్షుడైన ప్రష్యారాజుకు ఇవ్వడం జరిగింది. అవసరమయితే అతడు యుద్ధం ప్రకటించవచ్చు.

ఈ ఉత్తర జర్మనీ సమాఖ్యకు వెలిగా రెయిన్ నదికి దక్షిణాన గల జర్మన్ రాష్ట్రాలు, ఆస్ట్రియా రాజ్యంలోని జర్మన్ ప్రజాబాహుళ్యం గల భూభాగాలు బవేరియా, వర్టంబర్గ్, బీడెన్, హేస్ - డర్మ్‌స్టాట్ రెయిన్ నదికి దక్షిణానగల రాష్ట్రాలు. వీటిలో బేడెన్‌ను మినహాయించి మిగిలిన రాష్ట్రాల ప్రభువులు, ప్రజలు ప్రష్యాతో కలయికకు విముఖులు. ప్రష్యాతో చేరిన తన అధికారాలు తగ్గుతాయని ప్రభువుల భయం, నిర్బంధ సైనికశిక్షణ, క్యాథలిక్ వ్యతిరేక విధానాలకు లోనుగావలెనని ప్రజల భయం. ఈ దక్షిణ జర్మనీ రాష్ట్రాల యెడ బిస్మార్క్ ఒక సామరస్య విధానాన్ని అవలంబించాడు. ఫ్రెంచి దాడులవల్ల రాష్ట్రాలకు గల ప్రమాదమే చివరకు ఈ రాష్ట్రాలను ప్రష్యాలో చేరేటట్లు చేయగలదని విశ్వసించాడు. రహస్య సంధుల ద్వారా వాటికి అభయమిచ్చాడు. కాని వీటన్నింటికన్నా మిన్నగా బిస్మార్క్ వీటిపట్ల చూపిన ఔదార్య విధానమే ఈ రాష్ట్రాలు ప్రష్యాలో చేరటానికి దోహదకారి అయ్యింది.

### 11.3.6.3 దక్షిణ జర్మన్ రాజ్యాల తీరు :

దక్షిణ రాష్ట్రాలైన బవేరియా, వర్టెంబర్గ్, బౌదిన్‌లు అనేవి స్వతంత్రంగానే ఉన్నాయి. కాని బిస్మార్క్ వాటిలో ఫ్రాన్స్ తమ రాష్ట్రాలపై దండెత్తుతుందనే భీతి కలిగించి జర్మన్ జాతీయ భావాన్ని పురికొల్పి వాటి విషయాలలో చాకచక్యతను సమయస్ఫూర్తితోను వ్యవహరించాడు. ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధం '1870 - 71) జరిగేటప్పుడు మూడో నెపోలియన్ దక్షిణ జర్మన్ రాష్ట్రాలు తనతో సహకరిస్తాయని భావించాడు. కాని దానికి విరుద్ధంగా ప్రష్యా తమ జాతికి చెందిన రాజ్యమనీ, పరాయి దేశమయిన ఫ్రాన్స్ దండెత్తితే తమకే నష్టమని ప్రష్యాతో మైత్రిసంధులు చేసుకొన్నాయి. దీనితో జర్మన్ ఏకీకరణ చాలా వరకు కొనసాగిందనీ చెప్పవచ్చు. అట్లు ప్రష్యా తన బలం పటిష్టం చేసుకొని ఫ్రాన్స్ ప్రాధాన్యం తగ్గించడానికి అవకాశం వచ్చిన ఆ యుద్ధం చేయడానికి సిద్ధపడింది.

## 11.3.6.4 ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధం (క్రీ.శ. 1870) :

ఆస్ట్రియా పరాజయం తరువాత బిస్మార్క్ తన దృష్టిని ఫ్రాన్స్‌పై మరలించాడు. అనాదిగా ఆల్సేస్, లోరైన్ అనే రెండు రాజ్యాలను ఫ్రాన్స్ ఆక్రమించింది. అవి జర్మన్ ప్రజానీకం కలిగిన భూభాగాలని, వాటిని ఆక్రమించి, విలీనం చేసుకోనట్లైతే జర్మన్ సమైక్యత అసంపూర్ణమని బిస్మార్క్ విశ్వసించి, వాటి ఆక్రమణకై ఫ్రాన్సును కవ్వించి, యుద్ధంలో దింపే ప్రయత్నాలు మొదలుపెట్టాడు. క్రీ.శ. 1867-70 సంవత్సరాల మధ్య దక్షిణ జర్మన్ రాజ్యాలకు ఆర్థిక, సైనిక సహాయాలను అందచేసి, బిస్మార్క్ వాటిని ప్రష్యాకు అనుకూలంగా మార్చాడు. ఈ పరిస్థితిని గమనించిన మూడవ నెపోలియన్ దక్షిణ జర్మన్ రాజ్యాలను ఉత్తర జర్మన్ సమాఖ్యతో సంలీనం చేయరాదని హెచ్చరించాడు. ప్రష్యా తన సైనికశక్తితో ఫ్రాన్స్ ఓడించగలదని, ఇందుమూలంగా దక్షిణ జర్మనీ రాజ్యాలలో జాతీయతాభావాన్ని, దేశభక్తిని ప్రేరేపించగలదని బిస్మార్క్ సరిగ్గా ఊహించాడు. ఫ్రాన్స్‌లో కూడా జనాభిప్రాయం ప్రష్యాపై యుద్ధానికి సుముఖంగా వుంది. బిస్మార్క్ తన తెలివితేటలచే ఫ్రాన్సును ఐరోపాలో ఏకాకిని చేశాడు. ఇటలీకి, రష్యాకు ఫ్రాన్స్ పట్ల గల శత్రుభావాన్ని ఉపయోగించుకొని తనవైపు త్రిప్పుకోగల్గి అదేవిధంగా ఆస్ట్రియాను సైతం ఆకట్టుకున్నాడు. ఈ అవకాశాలు బిస్మార్క్‌కు స్పెయిన్ వారసత్వపోరాటంలో ప్రాప్తించాయి.

## 11.3.6.5 స్పెయిన్ వారసత్వ విషయం :

1868లో స్పెయిన్‌లో విప్లవం సంభవించింది. అక్కడ పాలిస్తూ ఉండే రాణి ఇసబెల్లాను తొలగించి హోహెంజోలోర్న్ సిగ్మరింజన్ (అంటే ప్రష్యా రాజు బంధువు) వంశస్థుడైన లియోపాల్డ్‌ను రాజుగా ఆహ్వానించారు. మొదట అతడు నిరాకరించినా రెండోసారి బిస్మార్క్ సలహామేరకు స్పెయిన్ అభ్యర్థనను అంగీకరించాడు. ప్రష్యా ప్రాబల్యం మరీ పెరుగుతుందని భావించిన ఫ్రాన్స్, దీనికి తీవ్ర అభ్యంతరం తెలిపింది. లియోపాల్డ్ తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నాడు. కానీ దీంతో తృప్తిపడని మూడవ నెపోలియన్ భవిష్యత్తులో ఎన్నడూ కూడా హోహెంజోలోర్న్ వంశస్థులెవ్వరూ స్పెయిన్ రాజ్యపాలనను స్వీకరించరాదనే వాగ్దానాన్ని ప్రష్యా రాజు నుండి రాబట్టమని ఫ్రెంచి రాయబారిని ఆదేశించాడు. ఫ్రెంచి రాయబారి 'ఎమ్స్' అనేచోట ప్రష్యారాజుతో సమావేశమయ్యాడు. కాని ఈ సమావేశంలో ఏ నిర్ణయము తీసుకొనబడలేదు. ఈ విషయం తెలుసుకున్న బిస్మార్క్ ప్రష్యా సైన్యాధిపతులతో సంప్రదించి ఫ్రాన్స్‌కు, రాయబారి ప్రష్యా రాజు చేత అవమానింపబడ్డాడన్న అర్థం వచ్చేటట్లు "ఎమ్స్" టెలిగ్రాం పంపాడు. ఫ్రెంచి స్వతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్న ఫ్రెంచి ప్రజలు కోపాద్రిక్తులై తమ చక్రవర్తి మూడవ నెపోలియన్‌ను ప్రష్యాపై యుద్ధం ప్రకటింపచేశారు. బిస్మార్క్ తెలివిగా పన్నిన పన్నాగంలో మూడవ నెపోలియన్ పడ్డాడు. ఫ్రాన్స్ యుద్ధానికి దిగిందని ఐరోపాఖండాన్ని బిస్మార్క్ బుకాయించే వీలుకల్గింది. క్రీ.శ. 1870 జులైలో ఫ్రాన్స్ - ప్రష్యాల మధ్య యుద్ధం మొదలైంది. ఉత్తర జర్మన్ సమాఖ్యలే గాక దక్షిణ జర్మనీలోని నాల్గు రాజ్యాలు కూడా ప్రష్యాకు అండగా నిలిచాయి. ప్రష్యా సైనిక ధాటికి ఆగలేక ఫ్రాన్స్ ఎన్నో యుద్ధాలలో ఓడిపోయింది. అయితే అతి ముఖ్యమైన సెడాన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఘోర పరాజయం పొందగా మూడవ నెపోలియన్ ప్రష్యా సైన్యాలకు లొంగిపోయాడు. ఫ్రాన్స్‌లో మూడోనెపోలియన్‌లోని రెండవ సామ్రాజ్యం అంతమై మూడో రిపబ్లిక్ ఏర్పాటయ్యింది. ఈ నూతన ప్రభుత్వం యుద్ధాన్ని కొనసాగించింది. బిస్మార్క్ ప్రష్యా సేనలు పారిస్ నగరాన్ని వశపరచుకోవాలని పట్టుబడ్డాడు. ఫ్రెంచివారు ప్రతిఘటించటంతో పారిస్ నగరముట్టడి ప్రారంభమైంది. బిస్మార్క్ 'ఆల్‌సేస్ - లోరైన్' ప్రాంతాలను కోరాడు. కాని ఒక అంగుళం ఫ్రెంచి భూమైనా, ఫ్రెంచి కోటలోని ఒక చిన్న రాయైనా ప్రష్యాకు లభించదనీ ఫ్రాన్స్ మొరాయించడంతో యుద్ధం క్రీ.శ. 1871 వరకు కొనసాగింది. ఏమైనా చివరకు ఫ్రాన్స్ ప్రష్యాచే ఓడింపబడి, ఫ్రాంక్ ఫర్ట్ సంధికి అంగీకరించింది. ఈ సంధి ప్రకారం ఫ్రాన్స్ ఆల్‌సేస్ భూభాగాన్నంతటినీ, లోరైన్ తూర్పు ప్రాంతాన్ని జర్మనీకి ఇచ్చివేసింది. ఇంతేగాక, ఒక పెద్దమొత్తాన్ని యుద్ధనష్టపరిహారంగా చెల్లించవలసి వచ్చింది. ఈ మొత్తం చెల్లించబడేవరకు జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్ ఉత్తరభాగాన్ని ఆక్రమించుకుంటాయి.

## 11.4 జర్మనీ ఏకీకరణ సంపూర్తి :

ఫ్రాన్స్ పరాజయంతో సమైక్య జర్మనీ బిస్మార్క్ వేసిన ప్రణాళిక ప్రకారం రూపుదాల్చింది. యుద్ధకాలంలో ప్రష్యాకు అండగా నిలచిన దక్షిణ జర్మన్ రాజ్యాలతో బిస్మార్క్ సంలీన ఒడంబడికలు చేసికొన్నాడు. దీంతో ప్రష్యా ఆధ్వర్యంలోని ఉత్తర జర్మన్ సమాఖ్య మహా సామ్రాజ్యంగాను, ప్రష్యా రాజు చక్రవర్తిగాను రూపొందాడు. ఏ ఫ్రాన్స్ రెండు శతాబ్దాల క్రితం జర్మనీని ఓడించి, విభజించి అవమాన పరచిందో, ఆ ఫ్రాన్స్‌లోని వర్సే రాజ ప్రాసాదంలోని పేరుగాంచిన అద్దాలభవనంలో జర్మన్ సామ్రాజ్య ప్రారంభోత్సవం జరగడం అనూహ్యామైన చారిత్రక సంఘటన గదా ! ఈ విధంగా బిస్మార్క్ నాయకత్వంలో, ప్రష్యా ఆధ్వర్యంలో జర్మనీ ఏకీకరణ సాధించుకుంది.

### ఏకీకరణ ప్రక్రియలో బిస్మార్క్, కవూర్‌ల విధానాలు :

కవూర్ ఇటలీ ఐక్యకారకుడు. బిస్మార్క్ జర్మనీ ఐక్యకారకుడు. వారి విధానాలలో భేదం ఉంది. కవూర్ గొప్ప రాజనీతిజ్ఞుడు. రాజ్యాంగ బద్ధంగా కార్యం సాధించవలెననెడివాడు. ఉదారవాది కాని బిస్మార్క్ నిరపేక్ష రాజరికంలో నమ్మకం ఉన్నవాడు. రాజ్యాంగం రాజు ఇష్టం మీదనే ఆధారపడి ఉంటుందనేవాడు. కవూర్ రాజ్యాంగబద్ధమైన రాజరికంలో నమ్మకమున్నవాడు. దురుసుతనం లేకుండా శాంతంగా, జాగ్రత్తతో సమయస్ఫూర్తితో క్రమేపి కార్యం సాధించేవాడు. బిస్మార్క్ కత్తిని ఉపయోగించి రక్తాన్ని కళ్ళచూసి అయినా పరిస్థితులను తన వైపు మళ్ళించుకోవలెననే విధానాన్ని అనుసరించాడు. కవూర్ ఇటలీ ఐక్యం ప్రధానంగాను, సార్డీనియా క్షేమం దాని కనుగుణంగాను ఉండాలని, వాంఛించగా బిస్మార్క్‌కు ప్రష్యా గొప్పతనం ప్రధానంగాను, జర్మనీ ఏకీకరణ దానికనుగుణంగాను ఉండాలని వాదించినవాడు. అయితే కవూర్, బిస్మార్క్‌లకు ముందు ఆస్ట్రియా పలుకుబడిని తగ్గించవలెననేది సామాన్యలక్షణమైంది. ఇద్దరి లక్ష్యాలు చివరకు సఫలమైనా కవూర్ ఇటలీ ఏకీకరణ పూర్తికాకుండానే చనిపోయాడు. బిస్మార్క్ అట్లాకాక తను సృష్టించిన ఐక్యజర్మనీకి సారధ్యం వహించి అనేక సమస్యలు ఎదుర్కొని "బిస్మార్క్ పద్ధతి" అనుదానికి ఒక స్వరూపమిచ్చి జర్మనీ గొప్పతనానికి కృషిచేసాడు.

## 11.5 జర్మనీ ఏకీకరణ ప్రాముఖ్యం :

జర్మనీ ఏకీకరణతో ప్రష్యా సైనిక పాటవం ప్రస్ఫుటమైంది. జర్మనీ రాజ్యాలలో ఆస్ట్రియా బలహీనత విదితమై, ప్రష్యా ఆధిక్యత వెల్లడైంది. కొన్ని శతాబ్దాలుగా విభజింపబడి, దోచుకోబడి, విదేశీ జోక్యానికి లోనై, ఆర్థికంగా, రాజకీయంగా నలిగిపోయిన 'జర్మన్ జాతి, ఐక్యమై, సజీవమై, పటిష్టమై ఐరోపా రాజ్యాలన్నింటిలోనూ అగ్రరాజ్యంగా రూపొందింది. ఈ సమాఖ్య జర్మన్ రాజ్యం కొద్దికాలంలోనే ప్రపంచరాజ్యాలన్నింటిని భయభ్రాంతులను గావించింది.

### మాదిరి ప్రశ్నలు :

1. ఇటలీ ఏకీకరణపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
2. జర్మనీ ఏకీకరణ ఏ విధంగా సాధించబడిందో వివరించండి.

### చదువదగిన గ్రంథాలు :


1. Louis Gottashhalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.
2. Lipson, E. : Europe in the 19th and 20th Centuries
3. Grant and Tamperly : Europe in the 19th and 20th Centuries


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 12

# 1800 నుండి 1856 వరకు రష్యా చరిత్ర : క్రిమియా యుద్ధం

## విషయసూచిక


12.0 లక్ష్యం

12.1 ఉపోద్ఘాతము

12.2 రష్యా స్థితిగతులు

- 12.2.1 మొదటి అలెగ్జాండర్ (1801 - 1825)
- 12.2.3 పవిత్ర మైత్రి (ఽళిజిగి జాజిజిరిబిదీబిలి)
- 12.2.4 పవిత్రమైత్రి పతనం
- 12.2.5 మొదటి నికోలస్ (1825 - 1855)
- 12.2.6 1825 డిసెంబర్ తిరుగుబాటు
- 12.2.7 నిరంకుశత్వం

12.3 ప్రాచ్య సమస్యలో రష్యా

- 12.3.1 19 వ శతాబ్దంలో టర్కీ పరిస్థితి
- 12.3.2 ఐరోపాలో అగ్రరాజ్యాల ఆసక్తి
- 12.3.3 రష్యా
- 12.3.4 ఆస్ట్రియా
- 12.3.5 ఇంగ్లాండ్
- 12.3.6 ఫ్రాన్స్
- 12.3.7 ఇటలీ - జర్మనీలు

12.4 బాల్కనులలో జాతీయతాభావ ఆవిర్భావం

- 12.4.1 సెర్బియాలో తిరుగుబాటు
- 12.4.2 గ్రీసు స్వాతంత్ర్య సమరం
- 12.4.3 ఈజిప్టు - టర్కీల మధ్య యుద్ధం (1831 - 1841)

12.5 క్రిమియా యుద్ధం (1854 - 56)

- 12.5.1 బాల్కన్‌లలో రాజకీయ ఆందోళనలు
- 12.5.2 బ్రిటన్, రష్యాల మధ్య శత్రుత్వం
- 12.5.3 మతసమస్య
- 12.5.4 యుద్ధగమనం
- 12.5.5 పారిస్ సంధి అంశాలు

12.5.6 పారిస్ ఒడంబడిక ఫలితాలు

12.5.7 విమర్శ

## 2.0 లక్ష్యం :

మొదటి అలెగ్జాండర్ ఫ్రెంచి విప్లవ కాలంలో రష్యా చక్రవర్తి. ఆ విప్లవ గమనము, ఫలితాలు, తరువాత నెపోలియన్ ్రామ్రాజ్య నిర్మాణము, పతనము, ఇవన్నీ అతనికి సమకాలీన రాజకీయ పరిణామాలు. నెపోలియన్ పతనానంతరం ఏర్పడిన ‌రోపారాజ్య కూటమి (Concert of Europe) లో ప్రముఖ పాత్రధారి. ఆ తరువాత క్రమంగా బాల్కన్ ప్రాంతాల్లో జాతీయవాదం ‌తెత్తినప్పుడు, రష్యా విదేశాంగ విధానాన్ని రూపొందించడంలో మొదటి అలెగ్జాండర్ పాత్ర గణనీయమైంది. ఎందుకంటే ఆ ‌దేశాంగ విధానాన్ని రష్యా మొదటి ప్రపంచ యుద్ధం వరకు అనుసరించింది. ఈ పరిణామక్రమాన్ని, దాని ఫలితాలను అధ్యయనం ‌యడం ఈ పాఠం యొక్క ఉద్దేశ్యం.

## 2.1 ఉపోద్ఘాతం :

ఇటీవలి కాలం వరకు ప్రపంచ రాజకీయాల్లో అగ్రదేశం అయిన రష్యా తూర్పు ఐరోపాలో సముద్రతీర ప్రాంతానికి ‌కాశంలేక, పూర్తిగా భూ భాగం చేత ఆవరింపబడిన విశాలమైన దేశం. రష్యా జాతీయులు స్లావ్ జాతీయులుగా గుర్తించబడిరి. ‌రు గ్రీకు సాంప్రదాయక క్రైస్తవ మతానికి చెందిన వారు. రష్యా ఎంతో కాలం వరకు, అంతర్గతంగా చెలరేగిన ఒడుదుడుకులలో ‌క్కుకుని వుండటమే గాక, పశ్చిమ దిశనుండి వచ్చిన అనేక దాడులకు తూర్పు, దక్షిణాల నుండి సాగిన మంగోల్ దండయాత్రలకు ‌రైంది. రష్యా బహుకాలంగా తురుష్కుల, మంగోలుల పరిపాలనలో ఉండి, వారి వేషభాషలను, జీవన విధానాన్ని అనుసరిస్తూ, ‌రోపాలో సంభవిస్తున్న నాగరికతా సంస్కృతులను చాలా దూరంగా వెనుకబడి ఉంది.

ఆధునిక యుగారంభంలో రష్యా రోమనోవ్ వంశ పరిపాలనలో జాతీయ దేశంగా ఆవిర్భవించింది. మూడవ ఇవనోవ్ ‌గాన్ ది (గ్రేట్, 1462 - 1505) రష్యాను మంగోలియన్ల ఆధీనమునుండి స్వాతంత్ర్యమును సంపాదించి పెట్టినవాడు. అంతః ‌హాలకు భరతవాక్యం పలుకునట్లు చేసినవాడు. అంతేగాక ఎంతో సాహసంతో రష్యాలో జాతీయ రాజరిక వ్యవస్థకు పునాదివేశాడు. ‌గ్లాగే నాల్గవ ఇవాన్ అరవీర భయంకరుడని పేరుగాంచి, జార్ లేక చక్రవర్తి బిరుదాన్ని పొందాడు. ఆ విధంగా అనిబద్ధత కల్గిన కొత్త జాతీయ రాచరికం, మాస్కో రాజధానిగా రష్యాలో జార్ చక్రవర్తులచే స్థాపించబడింది. 1682 - 1725 సంవత్సరాల్లో ‌పాలించిన రష్యా జార్ పీటర్ మొదటిసారిగా ఐరోపాలో సంభవించిన విద్యా వైజ్ఞానిక పరిణామాలు, పారిశ్రామికాభివృద్ధి, ‌గరాల విస్తరణ, మొదలైన విషయాలను గూర్చి విని, మారువేషంలో ఆ దేశాల్లో బహుకాలం సంచరించి, తిరిగి వచ్చిన తరువాత ‌్య దేశాన్ని కూడ పశ్చిమ ఐరోపా దేశాలవలె శాస్త్ర, సాంకేతిక విజ్ఞానము, పారిశ్రామికాభివృద్ధి కలిగిన దేశంగా సంస్కరించడానికి ‌యత్నాలు ప్రారంభించాడు. కాని ఆ పరిణామాలు రష్యాలో ప్రారంభమై ప్రబలం కావడానికి బహుకాలం పట్టింది. ఈ ‌ణామ క్రమాన్ని వివరంగా తెలుసుకోవడం అవసరం.

## 2.2 రష్యా స్థితిగతులు :

19 వ శతాబ్ది మధ్యదాకా రష్యా పురాతన పద్ధతుల్లో వ్యవసాయం చేసే గ్రామాలను అధికంగా కల్గి, భూస్వామ్య విధానంతో ‌డిన మధ్యయుగ నాగరికతనే కలిగి ఉండేది. రష్యాలో సేద్యబానిస (సెర్ఫడమ్) విధానం అనే ప్రత్యేకమైన భూస్వామ్య వ్యవస్థ ‌కొనివుంది. ఈ విధంగా ఆనాటి సమాజంలో రెండు వర్గాలున్నాయి. ప్రభువులు (Nobles), రైతులు (Peasants) ‌భువులు. సమాజంలో చాలా పలుకుబడి కల్గిన వర్గంగా చెలామణి అవుతూవుంది. అది సామాజికంగా, రాజకీయంగా, ‌ధికారం కలిగిన వర్గం. రైతుల్లో అధిక సంఖ్యాకులు సెర్ఫులు హక్కులు, పలుకుబడి లేని వర్గమిది. వీరికి పన్నులబాధ ‌క్కువగా ఉండేది. వారు సైన్యంలో నిర్బంధముగా చేరవలెను. సైబీరియా ప్రాంతానికి వెళ్లమంటే వెళ్లవలెను. భూస్వాములు ‌క స్వాధికారవర్గం పన్నుల నుంచి మినహాయింపును పొందారు. అయినా వీరు వ్యవసాయాభివృద్ధిలో ఎట్టి శ్రద్ధ తీసుకొనేవారుకారు. ‌ుత్వ ఉద్యోగులలో లంచగొండితనం పెచ్చు పెరిగింది. వారికి జీతాలు సరిగా వచ్చేవికావు.

### 12.2.1 మొదటి అలెగ్జాండర్ (1801 - 1825) :

మొదటి అలెగ్జాండర్ స్వాభావికంగా ఉదారవాది. పీటర్ కాలంనుండి క్రమంగా రష్యాలో చోటు చేసుకొంటున్న ఆధునిక యుగ పరిణామాల పట్ల ఆసక్తి, సానుభూతి కలిగినవాడు. అందుచేత తన దేశ స్థితిని మెరుగు పరచవలెనని కృషిచేసినాడు. ఉద్యోగస్థులలో లంచగొండి తనాన్ని, అవినీతిని రూపుమాపడానికి, ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అంతేగాక రష్యా సమాజాలలో కరుడు గట్టుకొని ఉన్న హీనమైన, అమానుషమైన బానిస వ్యవస్థ స్థితిని రూపుమాపేందుకు అనేక చర్యలు చేపట్టాడు. కాని నెపోలియన్ దండయాత్రలకు రష్యా గురై, ఆ తరువాత నాలుగో రాజ్యకూటమిలోచేరి పోరాటం చేయడం, తరువాత పవిత్రకూటమి నెలకొల్పి, మెటర్నిక్‌తో కలిసి పనిచేయడం అతనిలో తీవ్రమైన మార్పు తెచ్చిపెట్టాయి.

### 12.2.3 పవిత్ర మైత్రి (Holy Alliance) :

ఐరోపా ఖండాన్ని సంక్షుభితం చేసిన నెపోలియన్ యుద్ధాల వంటివి తిరిగి జరగకుండా శాంతి భద్రతలు నెలకొల్పటానికి అవసరమైన సాధనాలకోసం అనేక ఆలోచనలు జరిగాయి. అట్లాంటి సాధనాల కోసం అనేక ఆలోచనలు జరిగాయి. అట్లాంటి సాధనాలలో ఒకటైన జార్ ఒకటో అలెగ్జాండర్ ఏర్పాటు చేసిన పవిత్రమైత్రి. ఇది 1815 సెప్టెంబర్‌లో ఏర్పడింది. దీనిలో ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలు మాత్రం చేరాయి. పవిత్ర క్రైస్తవ విలువలైన ప్రేమసౌహార్థాలు నశించడం వల్లనే యుద్ధాలు సంభవిస్తున్నాయని, వాటిని ప్రపంచంలో పునరుద్ధరించటం వల్ల యుద్ధాలు రాకుండా నిలుపు చేయవచ్చునని ఈ మైత్రి ఉద్దేశం. మతాన్ని, న్యాయాన్ని, శాంతిని రక్షించడానికి పై రాజ్యాలు పరస్పర సహకారంతో మెలగాలని నిర్ణయించాయి. ఈ పవిత్రమైత్రిని ఐరోపారాజులు, పోప్ బలపరచారు. కాని ఇంగ్లాండ్ మాత్రం ఇందులో చేరలేదు. పైగా ఇంగ్లాండ్ విదేశాంగ మంత్రి కాసల్రీ (Castlereagh) "దీనిని అయోమయం అర్థరహితం" (Mysticism and Nonsense) అని అవహేళన చేసాడు. మెటర్నిక్ కూడా దీనిని, "శూన్య నినాదం" (Aloud sounding nothing) గా భావించాడు. దీన్ని తిరోగమనానికి సంకేతమని, ప్రజావ్యతిరేకులైన రాజుల కూటమి అని స్వేచ్ఛావాదాన్ని అణగద్రొక్కేందుకు జరిగిన కుట్ర అని భావించారు.

### 12.2.4 పవిత్ర మైత్రి పతనము :

పవిత్ర మైత్రి సూత్రములను, లక్ష్యములను అందలి సభ్యులు ప్రచారము చేయలేదు. ఆచరణలో కూడా పెట్టలేదు. ఈ మైత్రిని ఏర్పరచిన అలెగ్జాండర్ 1825 లో మరణించుట, ప్రముఖ క్రైస్తవ రాజ్యమైన ఇంగ్లాండ్ ఈ కూటమిలో చేరకపోవడం. క్రైస్తవ మతాధిపతి అయిన పోప్ ఈ ప్రయత్నానికి హృదయపూర్వకంగా సహకరించక పోవడం పవిత్రమైత్రి విఫలం కావడానికి కారణాలైనాయి. ఈ పవిత్ర మైత్రి జాతీయ ఉదార వాదాలను అణచుటకై కాలమంతా వెచ్చించెను. ఈ విధముగా జార్ ఒకటో అలెగ్జాండర్ ప్రవేశపెట్టిన ఈ మైత్రిని బట్టి పరిశీలించగా ఇతడు ఎంతటి సమయస్ఫూర్తిని కల్గినవాడో అవగతమౌతుంది. కాని జార్ ఒకటో అలెగ్జాండర్ 1820 తరువాత మెటర్నిక్ ప్రభావంతో ఉదారవాద ఉద్యమాలకు స్వస్తి పల్కటం, వాటిని అణచివేయడం ప్రారంభించాడు.

సంప్రదాయ వ్యవస్థలను బలపరచడానికి కంకణం కట్టుకొన్న మెటర్నిక్ ప్రభావానికి లోనైన మొదటి అలెగ్జాండర్ జార్, తిరోగామి అయ్యాడు. అతడి వారసుడు మొదటి నికోలస్ (1825-1855) అనిబద్ధ, అనియమిత అధికార సంప్రదాయాలను అనుసరించి రాజ్యం చేశాడు. మొదటి అలెగ్జాండర్ ఆదర్శవాది, ఉద్వేగభరితుడు, ఎప్పటికప్పుడే భావాలు మార్చుకొనే స్వభావం కలవాడు. నెపోలియన్‌తో జరిగిన ఫిన్‌లాండ్ యుద్ధంలో ఓడి నెపోలియన్ అంతటి గొప్పవాడు ఎవడూ లేడని పొగిడాడు. నెపోలియన్ పతనానంతరం మెటర్నిక్ ప్రభావానికిలోనై తన ఆశయాలను వదులుకున్నాడు. బాల్కను ప్రజలకు సహాయంచేస్తానని మొదటిసారి వాగ్దానం చేసి, తరువాత విరమించుకున్నాడు. రష్యాలో ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టవలెనని దీర్ఘంగా ఆలోచించేవాడు. తనతోనే ఉదారవాద యుగం రష్యాలో ఏర్పడుతుందని కలలు కనేవాడు. కానీ తరువాత అన్నింటినీ వదిలివేశాడు. ఐరోపాలో శాంతి స్థాపన కొరకు పవిత్రమైత్రిని స్థాపించాడు. కొంతసేపు రాజకీయాలు, మరికొంత సేపు క్రైస్తవ మత సిద్ధాంతాలు మాట్లాడేవారు.

అతడికి స్థిర అభిప్రాయాలు లేవు కానీ మధ్య ఆసియాలో కొన్ని ప్రాంతాలు జయించి రష్యాలో కలిపి సామ్రాజ్యాన్ని విస్తరణ కూడా చేసాడు. మొత్తం మీద అతని కాలం ప్రశాంతంగా గడిచిపోయింది.

### 12.2.5 మొదటి నికోలస్ (క్రీ.శ. 1825 - 1855) :

మొదటి అలెగ్జాండర్ కుమారుడు మొదటి నికోలస్ తండ్రి మరణానంతరం రష్యా సింహాసనమునకు 1825 లో వచ్చినాడు. ఇతడు కూడా అభివృద్ధి నిరోధకుడే. ఇతడు పత్రికలపై ఆంక్షలను విధించాడు. రష్యాలో ఆవిర్భవించిన రహస్యసంఘాలపై కఠిన చర్యతీసుకొని అణచివేశాడు. ఇతని కాలంలో రహస్య సంఘాలు ఉద్రిక్తత రూపం దాల్చినాయి.

### 12.2.6 1825 డిసెంబర్ తిరుగుబాటు :

నికోలస్ అధికారాన్ని తృణీకరించి ఉదారవాదులు, కొందరు సైనికులు తిరుగుబాటు చేసారు. కాన్‌స్టాంటైన్ గొప్ప ఉదారవాది. మంచి రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసి దేశాన్ని చక్కగా పాలించగలడని ప్రజలు, సైనికులు తలంచారు. అందువల్ల జార్ నికోలస్‌కు వ్యతిరేకముగా కాన్‌స్టాంటైన్ తమకు రాజుకావాలని తిరుగుబాటు చేసారు. నికోలస్ స్వయంగా వారి ముందుకు వచ్చి తన సోదరుడు స్వచ్ఛందంగా సింహాసనాన్ని వదులుకున్నాడని వివరించాడు. అయినప్పటికీ వారు ఆయన మాటలు నమ్మలేదు. కాన్‌స్టాంటైన్‌కు అనుకూలంగా, నికోలస్‌కు వ్యతిరేకముగా నినాదాలు చేసారు. దానితో ఓర్పు కోల్పోయిన నికోలస్ వారిపై తన సైనికులచే కాల్పులు జరిపించాడు. తరువాత వారి నాయకులను పట్టి బంధించి సైబీరియాకు బందీలుగా పంపాడు. ఈ తిరుగుబాటుని డిసెంబరిస్టు విప్లవం అని అంటారు.

డిసెంబర్ తిరుగుబాటుతో నికోలస్ మరీ నిరంకుశుడుగా వ్యవహరించసాగాడు.

### 12.2.7 నిరంకుశత్వం :

పత్రికా నియంత్రణ ప్రవేశపెట్టి మూడో విభాగము (Third Section) అనే గూఢచారి శాఖను వ్యవస్థాపన చేసాడు. విద్యా విధానాన్ని కూడా ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకొని వచ్చాడు. పశ్చిమ ఐరోపాలో వ్యాపిస్తున్న ఉదారభావాలు రష్యాకు రాకుండా చేయడమే తన కర్తవ్యమనుకున్నాడు. రష్యన్‌లు విదేశీయాత్ర చేయకూడదన్నాడు. విదేశ ప్రచురణలు ప్రభుత్వ పరిశీలన లేనిదే ప్రచారం కాకూడదన్నాడు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ప్రవేశాన్ని నిరుత్సాహపరచాడు. విదేశాంగ విధానంలో కూడా తిరుగుబాట్లనణచివేసే పద్ధతిని అవలంభించాడు. 1831 లో పోలండ్ తిరుగుబాటును అణచివేసి అక్కడి రాజ్యాంగాన్ని రద్దుచేశాడు. 1833 లో ఆస్ట్రియా, ప్రష్యాల పాలకులతో ఒకరినొకరు సైనిక సహాయం చేసికోవడానికి, ఉదార ధోరణులను అణచివేయడానికి సంధి చేసుకొన్నాడు. 1849 లో హంగేరియన్లు ఆస్ట్రియాపై తిరుగుబాటు చేసినప్పుడు వారికి సాయంగా రష్యన్ సేనలను పంపాడు. జర్మనీలో జాతీయోద్యమానికి వ్యతిరేకంగా జోక్యం పెట్టుకొనడానికి ప్రయత్నించాడు. మొదటి నికోలస్‌ను 16 వ శతాబ్దంలో స్పెయిన్ రాజు రెండో ఫిలిప్‌తో సాధారణంగా పోలుస్తారు. ఇతని నిరంకుశ విధానాలలో, ఉదారవాద ఉద్యమాలను నిరోధించడంలో వారి వారి దేశాల ప్రజలు నిస్సహాయులై లొంగి ఉండడంలో చివరకు స్పానిష్ ఆర్మడా ఓటమి స్పానిష్ ప్రజలను మేల్కొలిపినట్లు క్రిమియా యుద్ధ (1854 - 1856) ఓటమి రష్యా ప్రజలను హెచ్చరించిందని అనటంలో సమంజసమున్నది. మొదటి నికోలస్ తిరుగుబాట్లను అణచివేయవలెనని చూసినా, రష్యాలో అతని నిరంకుశ ధోరణి వల్ల అరాచకవాదం, భయంకరవాదము, సామ్యవాదము, మార్క్సిస్ట్ వాదము దేశంలో ప్రచారం కావటం జరిగింది.

## 12.3 ప్రాచ్య సమస్యలో రష్యా : క్రిమియా యుద్ధం :

ఆటోమన్ (టర్కీ) సామ్రాజ్యంలో 1815 నాటికి బాల్కన్ రాజ్యాలు ఆసియా మైనర్, సిరియా, పాలస్తీనా, అరేబియా, ఈజిప్టు, మధ్యధరా దక్షిణ తీర ప్రాంతమంతా చేరి ఉండేది. ప్రపంచ తూర్పు ప్రాంతాలను ఐరోపా చరిత్రకారులు దూర ప్రాచ్యం, మధ్య ప్రాచ్యం, సమీప ప్రాచ్యం అని మూడు భాగాలుగా విభజించారు. మనం ప్రాచ్య సమస్య అంటున్నది సమీప ప్రాచ్యం లేక బాల్కన్ ద్వీపకల్పం, టర్కీలతో కూడిన ప్రాంత సమస్య. బాల్కన్ ద్వీపకల్పం, ఐరోపా ఆగ్నేయ ప్రాంతం. దీనికి

ఉత్తరాన డాన్యూబ్‌నది, దక్షిణాన ఏజియన్ సముద్రం, తూర్పున నల్ల సముద్రం, పడమర ఎడ్రియాటిక్ సముద్రము సరిహద్దులుగా ఉన్న ప్రాంతం. ప్రాచ్య సమస్యనే బాల్కన్ సమస్య అని కూడా అంటారు. ఈ ద్వీపకల్పంలోని రాజ్యాలు సెర్బియా, బల్గేరియా, బాస్నియా, హెర్జాగోవినా, మాంటి నిగ్రో, గ్రీసులు. ఈ దేశాల్లోని ప్రజలు ప్రధానంగా స్లావ్ జాతికి చెంది, గ్రీకు సాంప్రదాయిక చర్చి పాలనలోని క్రైస్తవ మతాన్ని అనుసరించేవారు. ఈ దేశాలు బహుకాలంగా తురుష్క సామ్రాజ్యంలో అంతర్భాగాలై, వారి మత దురభిమానం, నియంతృత్వ పరిపాలన వలన తమ మత సంస్కృతులను కాపాడుకోలేని దుస్థితిలో మ్రగ్గిపోతున్నారు. సమకాలీనంగా పశ్చిమ ఐరోపా దేశాల్లోని ప్రజల స్వేచ్ఛా, సమానత్వ భావాలు, జాతీయతాభావం బాల్కన్ ప్రజలను ప్రభావితం చేసి, తురుష్కుల దుష్పరిపాలన నుండి స్వాతంత్ర్యం పొందడానికి పురికొల్పాయి.

17 వ శతాబ్దం నుండి ఆటోమన్ సామ్రాజ్యం పతనం ప్రారంభమైంది. 19 వ శతాబ్దం నాటికి టర్కీ, 'ఐరోపా జబ్బుమనిషి' (Sickman of Europe) అని వ్యవహారంలోకి వచ్చింది. ఈ సమయంలో ఐరోపాలో అగ్రరాజ్యాలు ముఖ్యంగా రష్యా, ఆస్ట్రియా బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు బాల్కన్ ప్రాంతాలలో తమ అధికారాన్ని పలుకుబడి పెంచుకోటానికి తీవ్ర ప్రయత్నాలు చేయసాగాయి. బాల్కన్‌లలో ఉద్భృతమౌతున్న జాతీయ భావానికి తోడు ఐరోపా రాజ్యాలు తమ స్వలాభం కోసం జోక్యం కలుగజేసుకోవడం కూడా బాల్కన్ సమస్యకు దారి తీసింది. ఈ సమస్యనే 'ప్రాచ్య సమస్య' (Eastern Question) అని తూర్పు, ఐరోపా సమస్య అని వ్యవహరిస్తారు.

ప్రాచ్య సమస్య ఎపుడూ అంతర్జాతీయ సమస్యే. 12 శతాబ్దాల ఐరోపా రాజకీయాల సమస్యయే నేపథ్యంగా నిలిచింది. 8 వ శతాబ్దంలో మహమ్మదీయ దండయాత్ర అలలు ఐరోపాను ముంచెత్తినవి. ఈ అలలు తిరోగమించినప్పటికీ ఈ దండయాత్ర వల్ల కలిగిన అలజడి ఫలితం ఎల్లప్పుడూ తన ఉనికిని చాటుతూనే ఉంది. వెయ్యి సంవత్సరాల తరువాత ప్రాచ్య సమస్య మరింత జటిలమయింది. అయితే దాని ప్రభావం మౌలికంగా మార్పు పొందింది. ఐరోపా రాజనీతి కోవిదులు ఆటోమన్ సామ్రాజ్య విస్తరణను గురించి భీతి చెందటం లేదు. ప్రస్తుతం వారు దాని పతనం గురించి వ్యాకులత చెందసాగినారు. ఐరోపా అగ్రరాజ్యాలు టర్కీకి వెలుపల నుంచి వచ్చే అపాయాలను విజయవంతంగా మరలించగలిగినప్పటికీ ఆంతరంగిక బలహీనతల వల్ల టర్కీ సామ్రాజ్యపు పునాదులు నెమ్మదిగా కదులుతుంటే దానిని ఆపలేకపోయినవి. ఈ బలహీనతలు రెండూ మూలాధారాలు నుంచి ఉత్పన్నమైనవి. ఒకటి పాషా (Pasha) లనే రాష్ట్ర గవర్నర్ల అధికార కాంక్ష, కాగా అసమర్థులైన, అవివేకులైన సుల్తానుల పాలన రెండోది. ఈ రెండూ కలసి సామ్రాజ్య క్షీణతను మరింత త్వరితం చేసినాయి. అయితే ఆటోమన్ సామ్రాజ్య విస్తీర్ణం క్రమక్రమంగా తగ్గిపోవటానికి ప్రధాన కారణాలు మత పరమైనవి. ఖడ్గంతో సాధించబడిన టర్కీ అధినివేశం (Turkish Dominion) ఖడ్గముతోనే నిర్వహించబడింది. జయించిన వారికి, జయించబడిన వారికి మధ్య మతపరమైన సమైక్యతగాని, భావసంబంధమైన సమైక్యతగాని లేదు. టర్కులు ఎల్లప్పుడూ స్వాధీన ప్రజల మధ్య ఏకాంతంగా ఉండటం జరిగింది. తిరుగుబాటు ధోరణి బాల్కన్ జాతులలో విస్తరించడంలో ప్రాచ్య సమస్య దౌత్యవేత్తల ఆధీనం నుంచి దాటి పోయింది. అణచబడిన బాల్కన్ ప్రజలు తమ కాంక్షలను, ఆకాంక్షలను, సామర్థ్యాన్ని ప్రపంచ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఈ విధంగా ఒక వైపు అగ్రరాజ్యాల స్పర్థలు ప్రధానంగా టర్కీ పాలననుంచి విముక్తి పొందవలెననే బాల్కన్‌ల తీవ్ర కాంక్షతో కూడిన వాతావరణం కలిగిన, అంతరంగిక పరిస్థితులు మరొక వైపు సమీప ప్రాచ్య సమస్యలో ఇమిడి ఉన్న ప్రధానాంశాలు. ఈ రెండు అంశాలు ఒకదానితో ఒకటి మిళితమవడం ఒక్కొక్కప్పుడు ఒకటి. మరొకసారి ఇంకొకటి అనూహ్య రీతిలో ప్రాముఖ్యతను సంతరించుకొని శతాబ్ది కాలగమనంలో అనేక సంక్షోభాలను కలుగజేయుచున్నవి.

### 12.3.1 19 వ శతాబ్దంలో టర్కీ పరిస్థితి

ఆటోమన్ సామ్రాజ్యంలో 1815 నాటికి బాల్కన్ రాజ్యాలు ఆసియా మైనర్, సిరియా, పాలస్తీనా, అరేబియా, ఆఫ్రికా ఖండం ఉత్తర తీరంలోని ఈజిప్టు, మధ్యధరా సముద్ర దక్షిణ తీరప్రాంతమంతా చేరి ఉండేవి. శతాబ్దం దానిపైన పాతిక సంవత్సరాల కాలంలో తన శక్తివంతమైన పొరుగురాజ్యాలు రష్యా, ఆస్ట్రియాలకు తను కొంత ప్రదేశాన్ని దత్తం చేసికొనవలసి వచ్చినా ఒక్క రష్యాను మినహాయించి, ఐరోపాలో మరేయితర రాజ్యం టర్కీ అంత విస్తీర్ణత గల ప్రదేశాలను గల్గియుండలేదు.

తన ఉత్తర సరిహద్దులలో మాల్దీవియా, వల్లాకియ (Maldivia) (Wallachia) విస్తృత మైదాన ప్రదేశాలు కూడా ఉన్నాయి. తన సరిహద్దులలోనే ఇంకా దక్షిణాన బాల్కన్ ద్వీపకల్ప మంతా ఉన్నది. బాల్కన్ రాజ్యాలు సెర్బియా, బల్గేరియా, బాస్నియా, హెర్జిగోవినా, మాంటినిగ్రో, గ్రీసులు, ఈ ద్వీపకల్పంలోని రాజ్యాలు బాల్కన్‌లలో ఆరు పెద్ద జాతి సమూహాలు - గ్రీకులు, మమేనియన్లు, బల్గేరియన్లు, అల్బేనియన్లు (Albanians) సెర్బులు, టర్కులు ఉండేవారు. 19 వ శతాబ్ది ఆరంభంలో టర్కీ సామ్రాజ్యమంతటా మత, జాతి, సమస్యలు అతిక్లిష్టమైన పరిస్థితిలో ఉన్నవి. ఆధిపత్యములో ఉన్నవారు సున్నీ మహమ్మదీయులు, అయితే అధిక సంఖ్యలో ఉన్నవారు క్రైస్తవులు వీరు సనాతన గ్రీసు చర్చ్‌కి సంబంధించిన వారు గ్రిగోరియన్లు రోమన్ క్యాథలిక్‌లు, వీరిని మహమ్మదీయులు అవిశ్వాసులు (infidels) నిర్ణయించి తక్కువగా చూసేవారు. మహమ్మదీయ పరిపాలకులు కొంతవరకు సహనంతో ఉన్నా మత పట్టుదల కల్గి సంకుచిత భావంతో ఉండడమే ఇందుకు కారణం. మతశాసనానికి అధిక ప్రాముఖ్యత ఉండేది. విద్య అనేది మత వ్యవహారాలకే పరిమితమైనది. మసీదులకు, చర్చీలకు, పాఠశాలలుండేవి. ఫకీరులకు కాదీలకు (cadi) న్యాయమూర్తులు, శాసనాలకు వ్యాఖ్యానమిచ్చే ముఫ్తీలకు (Mufti) మత పవిత్రశాసనమైన షెరికి (Sheri) ప్రతిష్ట, మన్నన, ప్రాముఖ్యత ఉండేది. ఇటువంటి సంకుచిత దృక్పథముండుటచేత టర్కీ ప్రభుత్వం క్రైస్తవులను, యూదులను సామాన్య న్యాయపరిపాలనా సంస్థల పరిధి నుంచి తొలగించి వేసింది. ప్రతి మత వర్గం ఒక ప్రత్యేక మిల్లేట్ (Millet) గా వ్యవస్థీకృతమై దానికి వేరే ఒక అధ్యక్షుడు (Patriarch) బిషప్, లేదా ఇతర మతాధికారి ఎవరైనా నిర్వహించడానికి నియోగితులైనారు. సామ్రాజ్య ఐరోపా భాగాలలో ఉన్న వాటిలో అతి ముఖ్యమైనది సనాతన గ్రీకు చర్చి. దానికి అధిపతి కాన్‌స్టాంట్ నోపిల్‌లో ఉండే పేట్రియార్క్ అనే అతడు గ్రీకు చర్చికి అనుబంధమైన చర్చ్‌లపై అంతా ఇతని అధికారం విస్తరించి ఉన్నది. ఏ జాతికి చెందినా, ఏ స్థానికానికి చెందినప్పటికీ వారు టర్కీ సామ్రాజ్యంలో ఉన్న ప్రజలైనప్పుడు వీరు సుల్తాన్‌కు చెల్లింపవలసిన సైనిక పన్నును చర్చికి చెల్లించవలసిన పన్నులను వసూలు చేయటానికి, ఇంకా వివాహంపైన, విడాకుల వ్యవహారాలపైన, వారసత్వ విషయంలోను తదితర విషయాలపైన అతనికధికారముంది. పేట్రియార్క్ కాన్‌స్టాంట్‌నోపిల్‌లో నివాసమున్నా, టర్కీ సుల్తాన్ చే నియామకమయి టర్కీ ప్రయోజనాలకే సాధారణంగా అంకితమై ఉండవలె, అయినా 'మిల్లెట్' గా వ్యవస్థీకరించడమనేది ఒక శక్తివంతమైన సాధారణంగా తయారైంది. ప్రాచీన సాంప్రదాయాలను కాపాడటం, గ్రీకు సంస్కృతిని వ్యాప్తి చేయడం మున్ముందు స్వాతంత్ర్య సిద్ధికి సన్నద్ధం చేయడం మొదలైన వాటికి ఉపకరించింది. ఆర్థిక పరిస్థితులు కూడా టర్కీలో నిరుత్సాహజనకంగా ఉన్నాయి. టర్కులు చాలా మంది భూస్వాములైనా సాధారణంగా తమ భూములు అభివృద్ధి గురించి అంత పట్టించుకొనేవారు కారు. వారి భూములను స్థానిక రైతులు సాగుచేసేవారు. వారిని భూస్వాములు పీడించేవారు, పర్వత ప్రాంతాలు పరిమితంగా ఉన్నా వాటిని పశువుల మేతకు ఉపయోగించేడివారు. బల్గేరియా, సెర్బియా, మాసిడోనియాలు, సారవంతమైన లోయలు పాక్షికంగా సాగులో ఉండేవి. వర్తక వాణిజ్యాలు, స్వదేశీయుల ఆధీనంలో గాని, విదేశీయుల ఆధీనంలో గాని ఉండేవి. అయితే గ్రీకులు, ఆర్మేనియన్లు, వర్తక వాణిజ్యాలు చేసిన ప్రభుత్వ పన్నుదారుల దోపిడికి గుర్రై పూర్తియైన భద్రత లేకుండా ఉండేవారు. విదేశీయుల విషయమై చూస్తే వారు ప్రత్యేకమైన సమాధాన ఒడంబడికల ఆధారంగా ప్రత్యేక హక్కులు, స్వాధికారాలను అనుభవించేవారు. ఈ ఒడంబడికలు ప్రథమంగా ఫ్రాన్స్, టర్కీల మధ్య ప్రారంభమైంది. (1535) వీటిని 1535 - 1815 ల మధ్య తరచుగా పునర్వచనం చేయడం జరిగింది. ఈ కాలంలోనే ఇతర పాశ్చాత్యరాజ్యాలు చాలా మటుకు అటువంటి స్వాధికార హక్కులు తమ తమ జాతీయులకు పొందగల్గినారు. జాతి, మత, ఆర్థిక కారణాల వల్ల ఇబ్బంది కల్గటమే కాక టర్కీకి మరింత తీవ్రమైన పరిస్థితి ఎదుర్కొనవలసి వచ్చింది. సుల్తాన్ పరిపాలన బలహీనపడిపోయినది. ఐరోపా సమాఖ్య రాజ్యాలలో కంటే ఎక్కువ అవినీతితో నిండి ఉంది. అవినీతి, లంచగొండితనం, ప్రభుత్వ సర్వీసులయందు, సార్వత్రికమై, పరిపాటైపోయింది. సుల్తాన్ తన అంతఃపురంలో ఉండి క్రియాత్మకంగా ప్రభుత్వ సైనిక, పరిపాలనా విషయాలలో పాల్గొనే వాడుకాదు. అంతఃపుర కుట్రలు ఎక్కువైనాయి. తీవ్రమైన అల్లర్లు, అపుడపుడు జరిగి సుల్తాన్ పదవికి ముప్పు వాటిల్లే విధంగా ఉండేది. పైవాటితోపాటు టర్కీ సామ్రాజ్యం అంతరంగికంగా విచ్ఛిన్నమయ్యే బెడద ఒకటి ఉన్నది. పాషాలు, తదితర స్థానికాధికారులు రహస్యంగా తమలో తాము సంప్రదింపులు చేసికొంటూ సాధారణంగా, కుట్రలు పన్నుతూ ఉండేవారు. వీరి కుట్రలు సుల్తాన్ మంత్రులపైన వేస్తూ తరచుగా కేంద్ర ప్రభుత్వాన్ని

ధిక్కరిస్తూ ఉండేవారు. ఇటువంటి వారిలో ప్రసిద్ధికెక్కినవాడు, సాహసికుడు ఈజిప్టును స్వాధీన పరుచుకున్న మహమ్మద్ ఆలీ 19 వ శతాబ్ద ఆరంభం టర్కీ స్థితి సంక్షోభానికి గురైనది. పాశ్చాత్యులు టర్కీ సామ్రాజ్య పతనం త్వరలోనే జరుగగలదని ఊహించసాగిరి. దేశపరిస్థితిని గ్రహించి సంస్కరణ ఆవశ్యకతను గుర్తించిన సుల్తాన్‌లు మూడోసలీమ్, రెండో మహమ్మద్. వీరు విస్తృతమైన సంస్కరణకోసం కార్యక్రమాన్ని రూపొందించినారు. భూస్వామ్య విధానాన్ని రద్దుపరచటం, పరిపాలనా విధానంలో మార్పులు తీసుకు రావడం, పాశ్చాత్య ఐరోపా రాజ్యాలలో శాశ్వత రాయబార వర్గాన్ని ఏర్పరచటం, పాశ్చాత్య నమూనాలో సైన్యాన్ని పునర్ వ్యవస్థీకరించడం ముఖ్యమైనవి. ఐతే వీరు జయం పొందక పోవడానికి అనేక కారణాలున్నాయి. అవి ఏవంటే 1) స్వతః సిద్ధంగా మహమ్మదీయుల మత సనాతనత్వం, తురుష్క సాంప్రదాయం, 2) పాత టర్కీ పార్టీ ప్రతికూలంగా ఉండటం. జాతీయతా భావం ఉద్భవించడం వల్ల బాల్కన్‌లలోని ప్రజలు తిరుగుబాటుకు సన్నద్ధులు కావడం, టర్కీకి బాహ్యంగా ఉన్న ప్రభుత్వాలు గాని, ప్రజలుగాని ఏ మాత్రం సానుభూతి చూపకపోవడం.

### 12.3.2 ఐరోపాలో అగ్రరాజ్యాల ఆసక్తి :

టర్కీ అధికారం క్షీణిస్తున్న తరుణంలో బాల్కన్‌లలోని క్రైస్తవ రాజ్యాలు టర్కీ పాలనను కూలగొట్టే ప్రయత్నాలు చేసాయి. కానీ టర్కీ తన అనారోగ్యం నుండి కోలుకొని క్రైస్తవులను క్రూరంగా అణచివేసింది. ఇది యూరప్‌లోని సోదర క్రైస్తవులలో క్రోధాన్ని రేపింది. ఐరోపాలోని ప్రధానశక్తులు జోక్యం చేసికొన్నాయి. ఇందుకు ఒకే మతానికి చెందిన వారమనే సానుభూతి స్వార్థతతో కూడిన సామ్రాజ్య కాంక్ష కారణమయ్యాయి. బాల్కన్లను ప్రపంచ రాజనీతికి, యుద్ధానికీ రంగంగా మార్చాయి. ఇది సమస్యను మరింత క్లిష్టం చేసింది.

### 12.3.3 రష్యా :

రష్యా బాల్కన్లలో జోక్యం కలుగజేసుకోవడానికి రెండు ముఖ్యకారణాలు గలవు. బాల్కన్ రాజ్యాల ప్రజలు, రష్యా ప్రజలు, ఆర్థడాక్స్ కాథలిక్ మతానికీ స్లావ్ జాతికి చెందినవారు. రష్యా టర్కీ దుష్పరిపాలన నుండి బాల్కన్లను కాపాడే హక్కును, బాల్కన్ల రక్షకుడిగా స్వీకరించింది. పైగా మధ్యధరా సముద్రం ద్వారా ఇతర ఐరోపాదేశాలకు మార్గాన్ని సంపాదించాలంటే రష్యన్లకు బాల్కన్లలో స్థానం కావాలి. జార్ పీటర్ (1689 - 1725) పాలనలో బాల్టిక్ సముద్రం మీద అధికారాన్ని సంపాదించడంలో రష్యా సఫలమైంది. కాథరిన్ మహారాణి (1762 - 1796) పాలనలో రష్యా టర్కీని ఓడించి, కుచ్‌క్కైనార్జ్ ఒడంబడిక విధించింది. దీనివల్ల రష్యాకు నల్లసముద్రం మీద అధికారం లభించింది. ఇపుడు మధ్యధరా సముద్రానికి మార్గం సంపాదించటానికి జల సంధుల మీద అధికారం సంపాదించే ఉద్దేశం పెట్టుకొన్నది. అందుకే బాల్కన్ సమస్యలో రష్యా తరుచుగా జోక్యం చేసికోవడం జరిగింది.

### 12.3.4 ఆస్ట్రియా :

బాల్కన్ ప్రాంతంలో ఆస్ట్రియాకున్న ప్రయోజనాలు, రష్యా, మరి ఇతర దేశాలకంటే ముఖ్యమైనవి. ఆస్ట్రియా చుట్టూ విభిన్న దేశాలున్నవి. సముద్ర తీరం చాలా తక్కువ, మంచి తీరం లేనిలోపం. మంచి నౌకాబలం లేకపోవడానికి హేతువైంది. ఆస్ట్రియా సామ్రాజ్యం ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలను సముద్రం ద్వారా నెలకొల్పుకోవాలంటే సముద్రానికి ఏకైక మార్గం డాన్యూబ్‌నది. డాన్యూబ్ నది మీద రష్యా అధికారం ఆస్ట్రియా ప్రయోజనాలకు హానికరం. పైగా బాల్కన్‌లలో రష్యా ప్రోత్సహిస్తున్న 'స్లావ్‌లంతా ఒకటేనన్న భావం, ఆస్ట్రియాలోని వంశపారంపర్య సామ్రాజ్యానికి ముప్పు కల్గించవచ్చు. అందుకే బాల్కన్లలో రష్యా ప్రభావాన్ని నిలుపుచేయడంలో ఆస్ట్రియాకు ఆసక్తి.

### 12.3.5 ఇంగ్లాండ్ :

బాల్కన్, టర్కీలకు సంబంధించి రష్యా లక్ష్యాల విషయంలో బ్రిటన్‌కు అనుమానాలున్నాయి. తూర్పున బ్రిటీషు వ్యాపార ప్రయోజనాలకు రష్యాను తీవ్రమైన అడ్డంకుగా బ్రిటన్ భావించింది. టర్కీ మీద రష్యా అధికారం తూర్పు వలస

రాజ్యాలలో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని బలపరుస్తుంది. అందుకే సూయజ్ కాలువ త్రవ్వకం జరిగింది. ఈ ప్రాంతంలో ఇంగ్లాండు, రష్యాల మధ్య ఏర్పడ్డ స్పర్థ చాలా ముఖ్యమైన స్థాయికి చేరుకొంది. 19 వ శతాబ్దమంతా రష్యాకు వ్యతిరేకంగా ఇంగ్లాండ్ టర్కీని బలపరిచింది. ఇంగ్లాండ్ బాల్కన్ ప్రాంతంలో రష్యా పురోగతిని ఆపడానికి గాను, ఆటోమన్ సామ్రాజ్య ఐక్యతను కోరింది. అధికార సమతూకాన్ని కొనసాగించడానికి, టర్కీని బలంగా ఉంచడమే ఇంగ్లాండ్ విధానం.

### 12.3.6 ఫ్రాన్స్ :

వాణిజ్య మత కారణాల మూలంగా, ఫ్రాన్స్ కూడా ప్రాచ్య సమస్యలో తలదూర్చింది. తూర్పులో తన స్వంత వాణిజ్య సంబంధాలను కాపాడుకోదలచింది. మధ్యధరా సముద్రప్రాంతంలో తన నౌకా, వాణిజ్య స్థితికి ప్రమాదం వాటిల్లనంతవరకూ రాజకీయంగా ఫ్రాన్స్ ఎల్లప్పుడు దూరంగానే ఉంటూ వచ్చింది.

### 12.3.7 ఇటలీ, జర్మనీలు :

ఇటలీ, జర్మనీలు విలీనీకరణ తర్వాత అందిన లాభాలను సంపాదించుకొనే ఉద్దేశ్యముతో బాల్కన్ సమస్యలో తలదూర్చాయి. బిస్మార్క్ బాల్కన్ సమస్య నుండి తనను తాను దూరంగా ఉంచినప్పటికీ 1878 బెర్లిన్ కాంగ్రెస్‌లో మధ్యవర్తిగా వ్యవహరించి, ఆస్ట్రియా స్నేహాన్ని సంపాదించడానికి రష్యాను విమర్శించాడు. ఈ సంఘటన తరువాత జర్మనీ, టర్కీకి దగ్గరయింది.

## 12.4 బాల్కనులలో జాతీయతాభావ ఆవిర్భావం :

బాల్కన్‌లలో జాతీయతాభావం ఆవిర్భవించడం 18 వ శతాబ్ది ఆరంభంలోనే దానికి అనేక పరిస్థితులు సహకరించినవి. బాల్కన్ ద్వీపకల్పంలో ఉన్న భౌగోళిక సరిహద్దులు, రాష్ట్రీయతత్వాన్ని ఆహ్వానించి ప్రాచీన జాతీయ సాంప్రదాయాలు కొనసాగేటట్లు చేయడం టర్కులు తాము మేటివారమనే ధృక్పథంతో తాము జయించిన ప్రజలను తమలో కలుపుకోలేక పోవడం! "టర్కీ అధికారం తగ్గిపోవడం, అవినీతి, అరాచకం, నిరంకుశత్వం పెచ్చు పెరిగిపోవడం, ఇతర రాజ్యాల వారి ప్రచారం, ముఖ్యంగా రష్యా - స్వలాభాపేక్షతో (రక్షకత్వాలను) ఏర్పరచి చివరకు వీలైతే తమ దేశంలో కలుపుకోవడానికి నిరీక్షించి ఉండటం పశ్చిమ ఐరోపాలో ఫ్రెంచి విప్లవం ఫలితంగానూ, నెపోలియన్ విధానాల వల్లను అభివృద్ధి చెందిన జాతీయతాభావ ప్రభావం జెనీస్సరీలు" అనే టర్కీ సైనికదళం దురంతాల వల్ల బాల్కన్ ప్రజలలో బయలుదేరిన సంతృప్తి మొ॥ ముఖ్యమైనవి.

### 12.4.1 సెర్బియాలో తిరుగుబాటు :

సెర్బియన్లు సుల్తాన్ దుష్పరిపాలనకు ఎదురు తిరిగిన వారిలో మొదటివారు. వీరు ఫిబ్రవరి 1804 లో కారాజార్జి పెట్రూవిష్ (Kara George Petroviesh) నాయకత్వంలో, నిరంకుశ సైనిక అధికారులైన జెనిస్సరీలకు (Janissaries) వ్యతిరేకంగా తిరుగుబాటు సలిపినారు. ఈ అధికారులు సుల్తానునే ధిక్కరించి దేశమంతా అనేక దురంతాలు జరిపినారు. వీరినణచిన తరువాత తిరుగుబాటు దార్ల స్థానిక హక్కుల కోరికను సుల్తాను మన్నించక పోవడంతో ఈ తిరుగుబాటు స్వాతంత్ర్యోద్యమంగా పరిణమించింది. 1805 లో కారాజార్జి టర్కీ సైన్యాన్ని ఓడించి తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినాడు. 1807 నుంచి 1812 వరకు రష్యా, టర్కీల మధ్య జరిగిన యుద్ధంలో అతడు రష్యాకు మద్దతు ప్రకటించినాడు. 1812 లో జరిగిన బుకారెస్ట్ (Bucharest) ఒప్పందం ప్రకారం టర్కీ సుల్తాన్ కారాజార్జి ప్రభుత్వాన్ని సెర్బియాలో రష్యా ప్రభావాన్ని గుర్తించటానికి నిర్ణయం జరిగింది. కాని 1813 లో నెపోలియన్ దండయాత్ర నెదుర్కొనటానికి రష్యా బాల్కన్ల నుంచి తన సైన్యాన్ని ఉపసంహరించినపుడు సుల్తాన్ సెర్బియాపై పవిత్ర యుద్ధంను ప్రకటించి తిరుగుబాటు నణచివేసినాడు. కారాజార్జి ప్రవాసంలోకి వెళ్ళినాడు. అయితే సెర్బులలో నాటుకుపోయిన జాతీయ విప్లవ బీజాలను తొలగించటం సుల్తాను సైన్యాలకు గాని, ఉత్తరువులకు గాని సాధ్యపడలేదు. మళ్ళీ 1815 లో తిరుగుబాటు "మిలోష్ ఒబ్రినోవిష్" (Milosh Obreneo Vish) నాయకత్వం క్రింద తిరుగుబాటు జరిగినది. అతడు వివేకంతో టర్కీతో సంప్రదింపులు జరిపి 1817 లో ఒక సమాధానం కుదిర్చినాడు. దానిని బట్టి సెర్బులు సుల్తాన్‌కు సామంతులుగా ఉండటానికి దానికి ప్రతిగా తమ సొంత సైన్యం నెలకొల్పుకొని స్థానిక ప్రభుత్వంతో భాగస్వాములుగా ఉండేహక్కు సంపాదించుకోవడానికి నిర్ణయమైంది. అతనిని "సెర్బియన్ల ఉన్నత పాలకుడు" (Supreme

Prince) గా గుర్తించడం జరిగింది. తరువాత దశలో రష్యా మద్దతుతో సెర్బియా స్వాతంత్ర్యం కోసం ఒత్తిడి చేయసాగిం 1826 లో "ఆకార్‌మన్" (Akerman) దగ్గర జరిగిన ఒప్పందం ప్రకారం సుల్తాన్ సెర్బులకు స్వయం పాలిత హక్కును త్వర ఇవ్వటానికి అంగీకరించినాడు. అయితే ఈ అంగీకారాన్ని వెంటనే టర్కీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కాని ఎడ్రియానోపిల్ స (1829) ప్రకారం సుల్తాన్ తన వాగ్దానాలను అమలుచేయక తప్పలేదు. 1830 నాటికి సెర్బియా ఆటోమన్ సామ్రాజ్యం సంబంధం తెంచుకొని స్వతంత్రరాజ్యంగా అవతరించింది.

## 12.4.2 గ్రీసు స్వాతంత్ర్య సమరం :

టర్కీ సామ్రాజ్యంలో మరీ విస్తృతమైన, జయప్రదమైన, జాతీయోద్యమం గ్రీస్‌లో జరిగింది. స్వాతంత్ర్య పోరాటం కొర ఈ ఉద్యమంలో అంతేగాక విస్తృతమైన ప్రచారం 'పాశ్చాత్య దేశాలలో జాతీయోద్యమాలలో సామాన్యంగా ఉండే తీవ్రజాతీయ భావం కూడా గోచరమవుతుంది. అంతేగాక మొదటిసారిగా, బాహ్య దేశాల దృష్టినాకర్షించి అంతర్జాతీయ జోక్యానికి దారితీసి ఉద్యమం కూడా. ఈ ఉద్యమం వృద్ధి చెందటానికి ప్రోత్సాహకమైన కొన్ని ప్రత్యేకపరిస్థితులు గ్రీసులో ఉన్నాయి. గ్రీకు భౌగోళిక ఉనికి, సముద్రానికి చేరువ వాణిజ్యరీతిగా, ఆర్థిక సౌకర్యాలు కలిగి ఉండటం వల్ల కలిగే లాభాలు అన్నీ కల ప్రోత్సాహమిచ్చినాయి. వీటన్నింటి ప్రభావం వల్ల గ్రీకుల మధ్య ఐక్యత ఏర్పడటమే గాక ప్రత్యక్షంగా పాశ్చాత్య ఐరోపా విప్ల భావాలతోనూ, రాజకీయ సిద్ధాంతాలతోను పరిచయం ఏర్పడింది. 18 వ శతాబ్దంలో గ్రీకు భాషాధ్యయనంతో కూడిన జ్ఞ పునర్వికాశ (Intellectual Revival) కృషి ప్రారంభమైంది. కొరేయస్ (Korias) అనే పండితుడు, ఈ విషయంలో చెప్పుకోద కృషి సల్పాడు. అందువల్ల ప్రాచీన గ్రీకు వైభవం స్ఫురణకు రావడం జరిగింది. రిగాస్ అనే యువకవి జాతీయగీతాల సంపుటి తయారు చేసినాడు. గ్రీకులలో రాజకీయ చైతన్యం 19 వ శతాబ్ది తొలి కాలంలో కలిగింది. దీనికి తార్కాణంగా గ్రీసులో అ రహస్య సమాజాల (Secret Societies) ఆవిర్భవించడం ఈ సంఘాలు జాతీయ విముక్తి కోసం సమరానికి మద్దతునిచ్చే వీటిలో అతి శక్తివంతమైనది 1814 లో ఒడెస్సాలో (Odessa) స్థాపితమైన 'హిటైరాఫిలికె' (Hetairia Philike) అనే సంఘ టర్కీని వివిధ ప్రాంతాలలో దానికి శాఖలున్నవి. 1820 నాటికి దాని ప్రభావం అధికమైంది.

గ్రీకు స్వాతంత్ర్య సమరాన్ని మూడు కాలావధులుగా (Periods) విభజించవచ్చు. మొదటిది హిటైరా రేకెత్తిం తిరుగుబాటు. అది గ్రీసు దేశమంతటా వ్యాపించింది. మొదటి అలెగ్జాండర్ ఇప్సిలాంటి (Alexander Epsilanti) (1821 24) అనే అతని ఆధ్వర్యంలో హోరాహోరీగా టర్కీతో జరిగిన యుద్ధం. ఈ కాలావధిలో రక్తపాతం రెండు పక్షాల వల్ల జరిగి మహమ్మదీయ ఉద్యోగులను, నివాసులను గ్రీసు తిరుగుబాటుదార్లు హత్యచేసినారు. దీనికి ప్రతిగా టర్కీలు కాన్‌స్టాంట్ నోపిల్‌లో పేట్రియార్క్‌ను హత్యచేసి షియాస్ (Chios) దీవిలోను, సామ్రాజ్య ఇతర ప్రాంతాలలోను ఉన్న వేలాది గ్రీకులనూ చంపివేసినా ఆ తరువాత మూడవ దశ 1824 - 1827 టర్కీ సుల్తాన్ గ్రీకు తిరుగుబాటును అణచటానికి ఈజిప్టు పాషా సహాయ స్వీకరించడంతో ప్రారంభమైంది. ఈజిప్టు పాషా మహమ్మద్ ఆలీ వద్ద తర్ఫీదు పొందిన సైనిక సహాయం పొందకోరి, ట సుల్తాన్ అతనికి అనేక రాయితీలు ఇస్తానని వాగ్దానం చేసినాడు. వీటిలో ఒకటి దక్షిణ గ్రీసులోని మోరియో (Morea) గవ పదవిని మహమ్మద్ ఆలీ కుమారుడైన ఇబ్రహీంకు ఇవ్వడం. ఇబ్రహీం నాయకత్వంలో ఈజిప్టు సేనలు గ్రీకు తిరుగుబాటు అణచివేసి ఏథెన్సును స్వాధీనం చేసుకున్నాయి. పరిస్థితి టర్కీకి అనుకూలంగా మారుతున్నట్లు కన్పించింది. అయితే నిర్దాక్షిణ్యంగా క్రూరంగా గ్రీకు తిరుగుబాటుదార్లను అణచివేయడం విదేశాలలో విస్తృతంగా ప్రజల పత్రికల దృష్టి నాక్రమించింది. వి దేశాలలో ప్రజాభిప్రాయం బలపడి 1827 లో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, ప్రభుత్వాలు లండన్ సంధి (Treaty of Lond సమిష్టిగా సమీప ప్రాచ్యంలో (Near East) సత్వర యుద్ధ విరమణ జరగటానికి చర్యలు తీసుకొనవలెనని నిశ్చయించిన సుల్తాన్ సర్వం సహాధికారం క్రింద గ్రీసు స్వయం పాలిత హక్కు పొందవలెనని వీరు నిర్ణయించారు. ఈ దశలో గ్రీకు జాతీయభావాలతో చేస్తున్న స్వాతంత్ర్య పోరాటంలో అంతర్జాతీయ జోక్యం ప్రారంభమైంది. మొదటి ఫ్రెంచి, ఇంగ్లీష్ మిత్రరాజ్య నౌకాదళాలు 1825 లో టర్కీ, ఈజిప్టు నౌకాదళాన్ని 'నోవారినో అఖాతం' (Bay of Navarino). గ్రీసు స్వయం పాలన

సుల్తాన్ ఒప్పుకొనేటట్లు మాల్డేవియా, వల్లాకియాలు టర్కీ అధికారం నుంచి విడిపోయేటట్లు 1825 లో 'ఆకిర్మన్' దగ్గర జరిగిన ఒప్పందాన్ని ఖరారు చేయాలని టర్కీ సుల్తాన్ ఒత్తిడి చేసింది. కానీ అందుకు సుల్తాన్ నిరాకరించడంతో 1827 లో రష్యా సేనలు ఎడ్రియానోపిల్ వరకూ సాగినాయి. ఈజిప్టు సేనలు బ్రిటన్, ఫ్రాన్స్‌ల ఒత్తిడి వల్ల అక్కడి నుంచి ఉపసంహరించుకొన్నాయి చివరకు టర్కీసుల్తాన్ ఎడ్రియా నోపిల్ సంధికి (1829) అంగీకరించక తప్పలేదు. దీని ప్రకారం మాల్డేవియా (Moldevia), వల్లాకియాలు (Wallachia) టర్కీ పాలననుంచి విముక్తి పొందాయి. సెర్బియా స్వాతంత్ర్యాన్ని గుర్తించడమైంది. గ్రీసు స్వతంత్ర్య రాజ్యమైంది.

గ్రీకు స్వాతంత్ర్య పోరాటం చివరిలో రష్యాకు ఎడ్రియా నోపిల్ సంధివల్ల బాగా లాభం కలిగింది. సెర్బియాలోనూ, డాన్యూబ్ రాష్ట్రాలలోను తమ ప్రభావం పటిష్టం చేసికోవడమే గాక, వాణిజ్య విషయాలలో టర్కీ జలాలలో అనేక రాయితీలు పొందినది. అంతేకాక కొన్ని ప్రదేశాలను డాన్యూబ్ నదీ ముఖ ద్వారాన కాకసస్ (Caucasus) క్షేత్రాన పొందినది. 1832 లో గ్రీసు హోదా ఖచ్చితంగా నిర్ణయించబడినది. సుదీర్ఘ సంప్రదింపుల తరువాత అగ్రరాజ్యాలు టర్కీ కూడా గ్రీసు పూర్ణ స్వాతంత్ర్యం పొందవలెనని అంగీకరించినవి. అయితే దాని సరిహద్దులు మధ్య, దక్షిణ గ్రీకు ద్వీపకల్ప ప్రాంతానికే పరిమితం అయినాయి. సరిహద్దుల నిర్ణయంతో బాటు నూతన ప్రభుత్వం రూపొందింది. నూతన గ్రీసు రాజ్యం గణతంత్రరాజ్యం నడపడానికి ప్రయత్నించింది, కాని విఫలమయింది. అంతఃకలహాలు చెలరేగినవి. 1831 లో అధ్యక్షుడైన కపోడిస్ట్రియా (Capodestfria) అనే అతడు హత్యకు గురైనాడు. అగ్రరాజ్యాల వారు గ్రీసులో రాచరిక ప్రభుత్వం ఉండవలెనని ప్రకటించినారు. 1832 లో బవేరియా రాజకుమారుడు ఆటో (Prince Otto) గ్రీసుకు రాజయ్యాడు.

### 12.4.3 ఈజిప్టు - టర్కీల మధ్య యుద్ధం (1831 - 1841) :

టర్కీ సుల్తాన్ రెండో మహమ్మద్ (Sultan Mohammad II) కు, ఈజిప్టు పాషా మహమ్మద్ ఆలీకి మధ్య కలహం సంభవించినపుడు టర్కీ సామ్రాజ్య వ్యవహారాలలో అంతర్జాతీయ జోక్యానికి పోటీ అవకాశం లభించింది. మహమ్మద్ ఆలీ టర్కీ సుల్తానుకు గ్రీకు స్వాతంత్ర్య సమర సమయంలో సహాయపడినందువల్ల క్రీట్ (Crete) దీవిని బహుమానంగా పొందినాడు. టర్కీ సుల్తాను అధికారాన్ని నామమాత్రంగా అంగీకరించిన అతడు దానితో తృప్తిపడక, తన అధికారాన్ని సిరియా, డమాస్కస్‌లకు (Damascus) విస్తరించవలెనని కుతూహల పడినాడు. అందుకు టర్కీ సుల్తాను, సుముఖంగా లేడు. ఇది గ్రహించిన మహమ్మద్ ఆలీ 1831 లో తన కుమారుడైన ఇబ్రహీం నాయకత్వంలో సిరియాపైకి సేనలను పంపినాడు. నవంబర్ 1831 లో ఇబ్రహీమ్ పాలస్తీనా (Palestine) ముట్టడించినాడు. ఏక్రీ (Acre) మే 1832 లో అతనివశమైంది. జూన్‌లో డమాస్కస్, జులైలో అలెప్పో (Alleppo) ను అతడు స్వాధీనపరచుకొని టారస్ (Taurus) పర్వతశ్రేణిని జులై నెలాఖరుకు దాటినాడు. డిసెంబరు 1832 లో మహమ్మద్ తన సైన్యాన్ని చివరిసారిగా ఇబ్రహీమ్‌ను ఎదుర్కొనటానికి పంపినాడు. కొనియా (Koniah) యుద్ధంలో టర్కీ సైన్యం ఘోర పరాజయం పొందింది. కాన్స్టాంట్‌నోపిల్ ఇబ్రహీమ్ హస్తగతమయ్యే పరిస్థితి ఏర్పడటంతో మహమ్మద్ నిస్సహాయుడై గ్రేట్ బ్రిటన్, సుల్తాన్ ఫ్రాన్స్, రష్యాల సహాయం కోరినాడు. పాశ్చాత్య దేశాలు తమ ఇతర సమస్యలతో సతమతమవుతూ ఉండటం చేత టర్కులకు సహాయం చేయలేక పోయినవి. ఒక్క రష్యా మాత్రం అనుకూలంగా ఉండి సహాయం చేసింది. సుల్తాన్‌తో మిత్రత్వం వహిస్తూ బెదిరించి, బలప్రయోగం చేసి అయినా తన ప్రయోజనాలను సాధించుకోవచ్చునే సిద్ధాంతంతో రష్యా సైనిక, నౌకాదళాలను కాన్స్టాంట్ నోపిల్ రక్షణార్థం సుల్తానుకు సహాయంగా పంపింది. రష్యా సేనలు బాస్పరస్‌లో ఫిబ్రవరి 1833 లో కనబడే సరికి రష్యా విధానం గురించి అనుమానిస్తున్న, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్‌లు కలవరపడి, రష్యా జోక్యానికి అసమ్మతి తెలిపినాయి. తాముకూడా ఈ విషయంలో జోక్యం చేసుకొంటూ టర్కీకి, ఈజిప్టుకు మధ్య ఒక సమాధానం కుదిరేట్లు కృషిచేసినాయి. దీని ఫలితంగా పాలస్తీనా, సిరియా, అలెప్పో డమాస్కస్‌లు మహమ్మద్ ఆలీకి అర్పితమయినవి. ఆడానా (Adana) సముద్ర ఓడరేవులను అతడు ఆక్రమించడానికి అనుమతి ఇవ్వబడింది. దీనితో ఇబ్రహీమ్ సిరియాకు మరలినాడు. అంతటితో ఈ సంక్షోభం ముగిసినట్లు అనిపించింది.

అయితే తమ సేనలు ఆసియానుంచి ఉపసంహరించే ముందు టర్కీ సుల్తాను ఒక రహస్య ఒడంబడిక చేసికొనేటట్లు రష్యా వత్తిడి చేసింది. దీని ఫలితమే ఊంకియర్ స్కేలస్సీ (Unkiar Skelessi) అనే సంధి (8 జులై 1833) ఈ సంధిని వాస్తవంగా ఈ రెండు రాజ్యాల మధ్య రక్షణార్థమైన అదిమాత్ర (Dffensive) మైత్రిగా పేర్కొనడం జరిగింది. రష్యా చక్రవర్తి ఈ సంధి వల్ల రెండు రాయితీలు పొందినాడు. మొదటిది సుల్తాన్‌కు రష్యాచక్రవర్తి పరమ మిత్రుడుగా, టర్కీకి బెడద వచ్చినపుడు తగిన సహాయం చేయడానికి ఒప్పందం చేసుకోవడం. రెండోది బాస్పరస్, డార్డనెల్స్ (Dardanelles) జలసంధులు ఒక్క రష్యా యుద్ధ నౌకలకు తప్ప ఇతర దేశాలకు ప్రవేశాన్ని టర్కీ ప్రతిఘటించడం. ఈ విధంగా రష్యా టర్కీ సుల్తాన్‌కు సైనిక రక్షకత్వం వహించింది. కాని వాస్తవంగా నల్ల సముద్రం, మధ్యధరా సముద్రాలపై విశేషమైన ఆధిపత్యం సంపాదించింది. ఈ ఒప్పందం కాన్‌స్టాంట్ నోపిల్ లో రష్యా ప్రభావాన్ని అధికం చేసింది. ఊంకియర్ స్కేలస్సీ సంధిషరతులు గురించి తెలిసికొన్నవెంటనే ఫ్రాన్స్, బ్రిటన్‌ల వైరుధ్యం రష్యా పట్ల అధికమైంది. పత్రికలలో బెదిరింపు ధోరణిలో వ్యాసాలు వచ్చినవి. సంధి నిబంధనలు విస్మరింపగలవని ఆ రెండు దేశాలు రష్యాకు టర్కీకి హెచ్చరికలు చేశారు. ఇది చాలదన్నట్లు ఒక సంయుక్త నౌకాదళం తూర్పు మధ్యధరా జలాలలో పయనించడానికి పంపబడింది. రష్యా అదే విధంగా పశ్చిమ ప్రత్యర్థులపై ప్రవర్తించి వారి హెచ్చరికను లక్ష్య పెట్టలేదు. తరువాత పరిస్థితి శతాబ్దాంతం కొరకు కొంత సద్దు మణిగినట్లున్నది. కానీ సమీప ప్రాచ్యంలో క్రొత్త సంక్షోభం ఏర్పడింది. టర్కీ సుల్తాన్ సిరియా, అడానాలు కోల్పోయిన దానికి సమాధానపడక తన అపాయకరమైన సామంతునితో తిరిగి పోరుసల్పడానికి విస్తృతంగా సన్నాహాలు చేసినాడు. వాన్‌మోల్టుకీ (Von Moltke) అనే జర్మన్ సైనిక సలహాదారుని పర్యవేక్షణ క్రింద తన సైన్యాన్ని పునర్ వ్యవస్థీకరించినాడు. తుదకు 1839 లో ఐరోపా రాజ్యాల ప్రతినిధుల హెచ్చరికను లక్ష్యపెట్టక తన సైన్యాన్ని సిరియాకు తరలించినాడు. 24 ఏప్రిల్ 1839 న సుల్తాన్ నెజిబ్ (Nezib) అనే చోట యుద్ధం జరిగింది. ఈసారి ఫ్రాన్స్ మహమ్మద్ ఆలీకి అండగా నిలిచింది. ఈ యుద్ధంలో నాటి యుద్ధంలో కన్నా 1832 లో నిశ్చయార్థంగా ఓడిపోయినాడు. సేనలు చెల్లాచెదురు అయిపోయినాయి. నౌక లొంగిపోవలసి వచ్చింది. ఈ సంక్షోభం మధ్యలో సుల్తాను చనిపోయినాడు.

కాని బ్రిటన్‌కాని, రష్యా కాని, మహమ్మద్ ఆలీ ఆధిక్యాన్ని, సహించే స్థితిలో లేవు. అయితే ఫ్రాన్స్ మాత్రం మధ్యధరా సముద్రంలో తన పలుకుబడిని పెంచుకొనేందుకు కలలుగంటూ మహమ్మద్ ఆలీకి రహస్య సహాయాన్ని అందజేయసాగింది. బ్రిటన్ కాన్‌స్టాంట్ నోపిల్‌లో రష్యా ఆధిక్యత ఎంత ప్రమాదకరమో ఈజిప్టులో ఫ్రాన్స్ పలుకుబడి కూడా అంతేనని భావించి, టర్కీ సమగ్రతను నిలపటానికి నిశ్చయించుకుంది. టర్కీ బలహీనపడిన కొలది, రష్యా, ఫ్రాన్సు దేశాల ఆధిక్యత పెరిగి, ఆసియాలోని తమ వలసరాజ్యాల ఆధిపత్యం దెబ్బతింటుంది. అందుచేత, ఈ అగ్రరాజ్యాల సహకారంతో కాక, కేవలం స్వయంగా టర్కీని సమర్థించి బలపర్చడాన్ని తన రాజనీతిగా నిర్ణయించుకొన్నది. ఫ్రాన్స్ ఎత్తుగడలను చిత్తుచేయడానికి తనకున్న పరిమితులను గుర్తించి, రష్యా బ్రిటన్‌కు చేరువకాసాగింది. ప్రాచ్య సమస్య విషయంలో సహకారాన్ని కోరుతూ ఊంకియర్ స్కేలస్సీ సంధిని విడిచిపెట్టడానికి కూడా సంసిద్ధతను తెలియపర్చింది. ఈ విధానం వల్ల కాన్‌స్టాంట్‌నోపిల్ మహమ్మద్ ఆలీకి దక్కక పోవడమే గాక పశ్చిమ అగ్రరాజ్యాల ఐక్యతను భంగం కలిగించి దౌత్యపరమైన విజయాన్ని సాధించడానికి అవకాశం ఉంది. అందుచేత ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడమైంది. తక్కిన నాలుగు రాజ్యాలు గ్రేట్ బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యాలు ఫ్రాన్స్‌ను లక్ష్య పెట్టక 1840 లో లండన్ సంధి చేసుకొని మహమ్మద్ ఆలీపై ఒత్తిడి తెచ్చాయి. మహమ్మద్ ఆలీ రాచరికం వారసత్వంగా వస్తున్న ఈజిప్టు ప్రాంతాలకే పరిమితం చేయబడింది. అతనికి సిరియాపై హక్కు పోయింది. యుద్ధ సమయాల్లో ఏ దేశ నౌకలు జలసంధులలో ప్రవేశించడానికి వీలులేదని ఈ సంధి నిబంధనలు అంగీకరించవలెనని ఈ నాలుగు దేశాలు టర్కీ సుల్తానును, ఈజిప్టు పాషాను వత్తిడి చేసినవి. మరుసటి సంవత్సరం పరిస్థితి తీవ్రతను గ్రహించిన ఫ్రాన్స్ తన ధోరణిని నాలుగు అగ్రరాజ్యాలతో చేతులు కలిపింది. 1841 లో మహమ్మద్ ఆలీకి వారసత్వంగా వస్తున్న ఈజిప్టు ప్రదేశాలు అతనికి ప్రసాదించబడిన తర్వాత, అయిదు రాజ్యాలు జలసంధి సమాధానం అనే దానికై సంతకం చేసినాయి. దీనిని బట్టి భాస్పరస్, డార్డెనెల్స్ జల సంధులలో ఒక్క టర్కీకి తప్ప ఏ ఇతర రాజ్య యుద్ధ నౌకలకు ప్రవేశం లేదు.

## 12.5 క్రిమియా యుద్ధం (1854 - 1856) :

1841 లండన్ సంధి తర్వాత 10 సం॥ల పాటు టర్కీ సామ్రాజ్యం శాంతి యుతంగా కొనసాగింది. క్రిమియా యుద్ధం ప్రారంభం కావడంతో ప్రాచ్య సమస్య మళ్ళీ తలెత్తింది. వాటర్లూ తరువాత ఆ ఐరోపాలో ఇదే తొలి పెద్ద యుద్ధం. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ యుద్ధం తుర్కులకు, బాల్కన్లకు మధ్యగాక బాల్కన్ దేశాల ప్రయోజనాలతో సంబంధంలేని ఐరోపా రాజ్యాల మధ్య జరిగింది. క్రిమియా యుద్ధ కారణాలను ఈక్రింది విధముగా విశ్లేషించవచ్చు.

### 12.5.1 బాల్కన్‌లలో రాజకీయ ఆందోళనలు :

గ్రీకు స్వాతంత్ర్య పోరాటం రుమేనియన్లు, బల్గేరియన్లు, ఆల్బేనియన్లు మొదలైన బాల్కన్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షకు ప్రేరణను నిచ్చింది. టర్కీ బలహీనమౌతున్న కొద్దీ, దాని ప్రభుత్వం అసమర్థ లంచగొండిగా నుండటం సామంతరాజ్యాలు తమను గూర్చి మరింతగా ఆలోచించుకొనేటట్లు చేసింది. ఐరోపాలోని పెద్ద రాజ్యాల స్వార్థపూరిత సామ్రాజ్యవాద ధోరణులు, బాల్కన్లలో ఆందోళన మరింత తీవ్రమయ్యేట్లు చేసాయి.

### 12.5.2 బ్రిటన్, రష్యాల మధ్య శత్రుత్వం :

పీటర్ మహారాజు కాలం నుండే కాన్‌స్టాంట్‌నోపిల్ మీద రష్యా తన కన్నేసి ఉంది. గ్రీకు యుద్ధం నుండి బాల్కన్లలో రష్యా పలుకుబడి పెరుగుతూ వచ్చింది. బాల్కన్లలో పరిస్థితిని విషమింపజేయడానికి రష్యా ఎల్లప్పుడూ సన్నద్ధమే. జార్ 1 వ నికోలస్ టర్కీని గూర్చి మాట్లాడుతూ ఇది "ఐరోపా యొక్క జబ్బు మనిషి" అని మరణానికి సిద్ధంగా ఉందనీ టర్కీ సామ్రాజ్యానికి రష్యాయే సహజమైన వారసురాలని అన్నాడు. సమీప ప్రాచ్యంలో రష్యా ఎత్తుగడలు తూర్పున తన వాణిజ్య ప్రయోజనాలకు ప్రమాదకరంగా ఇంగ్లాండ్ భావించింది. అందుకే టర్కీ సామ్రాజ్య భౌగోళిక భద్రత మీద ఇంగ్లాండ్ కు ఆసక్తి. అది రష్యా ఎత్తుగడలను ప్రాచ్యంలో అణచివేసింది. ఈ విధంగా రష్యా గ్రేట్ బ్రిటన్ విరుద్ధ స్వార్థ ప్రయోజనాలు క్రిమియా యుద్ధానికి మరో కారణమయ్యాయి.

### 12.5.3 మత సమస్య :

క్రిమియా యుద్ధ ప్రారంభానికి తొలికారణం, మతసమస్య 1854 టర్కీ సామ్రాజ్యంలోని బెతెల్‌హామ్ పుణ్యస్థలం విషయంలో లాటిన్ మత గురువులకూ, గ్రీకు మత గురువులకూ మధ్య చిన్న వివాదం తలెత్తింది. అక్కడి చర్చిని ఇరుపక్షాల వారూ ఉపయోగించేవారు. గ్రీకు మత గురువులు ప్రధాన ద్వారం తాళపు చెవిని రోమన్ గురువులు ప్రక్క ద్వారం తాళం చెవినీ కలిగియుండేవారు. సమాన హక్కుల కోసం రోమన్ కాథలిక్కులు ప్రధాన ద్వారానికి కూడ తాళం చెవిని కోరారు. కాథలిక్ పార్టీ సమర్థనను సంపాదించడం ద్వారా రాజకీయంలో తన స్థానాన్ని బలపరచుకోదలచుకొన్న 3 వ నెపోలియన్ చక్రవర్తి రోమన్ క్యాథలిక్‌ల పక్షం వహించాడు. రష్యా గ్రీకు మత గురువుల పక్షాన, సుల్తాన్ మీద ఒత్తిడి తెచ్చింది. బ్రిటన్, ఫ్రాన్స్‌ను బలపర్చింది. ఆటోమన్ సామ్రాజ్యంలో గ్రీకు క్రైస్తవుల హక్కుల పరిరక్షకుడుగా రష్యా కోర్కెను సుల్తాన్ తిరస్కరించాడు. ఇరుపక్షాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. ఈ యుద్ధంలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు, రష్యాకు వ్యతిరేకంగా టర్కీని సమర్థించాయి. రష్యా ఆస్ట్రియా సహాయాన్ని ఆశించింది. కాని ఆ దేశం తటస్థంగానే ఉండింది.

### 12.5.4 యుద్ధ గమనం :

వాస్తవానికి జూలై 1854 లో మొదలైంది. ఇది ప్రధానంగా క్రిమియాలోనే జరిగింది. ఆలా, బాలాక్లావా, ఇంకెర్‌మన్ మొదలైన యుద్ధరంగాలలో వరసగా రష్యా ఓడిపోయింది. తుర్కులు, మాల్డేవియా, వల్లాకియాలనుండి రష్యన్లను వెడలగొట్టారు. సెబాస్టపోల్ ముట్టడి క్రిమియా యుద్ధంలో ప్రధానాంశం. ప్రసిద్ధమైన లైట్ బ్రిగేట్ సంఘటన ఇక్కడే జరిగింది. ఈ సంఘటన మీద ఆంగ్ల కవి టెన్నిసన్ ఒక కవితను రచించాడు. మిత్రదేశాలు సెప్టెంబర్ 9, 1855 న సెబాస్టపోల్‌ను పట్టుకోవడంతో

క్రిమియా యుద్ధం ముగిసింది. 1 వ నికోలస్ తర్వాత కొత్తగా జార్ అయిన 2 వ అలెగ్జాండర్ 1856 లో సంధిని కోరాడు. తత్ఫలితంగా 1856, మార్చి 30 వ తేదీన పారిస్ ఒడంబడిక మీద సంతకాలు జరిగాయి.

### 12.5.5 పారిస్ సంధి అంశాలు :

1) మాల్డేవియా, వల్లాకియాలు రక్షణ బాధ్యతను రష్యా కోల్పోయింది. అవి సుల్తాన్ ఆధీనంలో రెండు ప్రత్యేక ప్రతిపత్తి గల రాజ్యాలుగా ఏర్పడ్డాయి. కాని తరువాత ఈ రెండు రాజ్యాలు కలసి, రుమేనియా అన్న పేర ఒకే స్వాతంత్ర్య రాజ్యంగా ఏర్పడ్డాయి.

2) నల్ల సముద్రం తటస్థమైంది. దాని రేవులు అన్నిదేశాలకూ, కేవలం వాణిజ్య నౌకలకు మాత్రమే తెరిచి ఉంటాయి.

3) డాన్యూబ్‌నది అంతర్జాతీయం చేయబడింది.

4) రష్యాకు క్రిమియాను తిరిగి ఇవ్వడం జరిగింది.

5) ఆటోమన్ సామ్రాజ్యము భౌగోళిక ఐక్యతను ఐరోపాలోని ప్రధాన రాజ్యాలన్నీ కలసి గ్యారెంటీ ఇచ్చాయి. టర్కీ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకొనకుండా ఉండటానికి అంగీకరించాయి.

6) తన పాలనలోని క్రైస్తవులను మానవతా దృష్టితో చూడడానికి ఉదార సంస్కరణలను ప్రవేశపెట్టడానికి సుల్తాన్ అంగీకరించాడు.

### 12.5.6 పారిస్ ఒడంబడిక ఫలితాలు :

1) సమీప ప్రాచ్యంలో రష్యా ప్రయోజనాలను అడ్డుకోవడం జరిగింది.

2) భౌగోళిక విచ్ఛిన్నత నుండి టర్కీ తాత్కాలికంగా రక్షించబడింది.

3) సమీప ప్రాచ్యంలో బ్రిటీష్ ప్రయోజనాలు కాపాడబడ్డాయి.

4) ప్రజల మనస్సులను చూరగొనటానికి జార్ 2 వ అలెగ్జాండర్ దేశంలో అనేక సంస్కరణలు చేయవలసి వచ్చింది.

5) రష్యా - ఆస్ట్రియాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. రష్యా ప్రయోజనాలకు స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి.

### 12.5.7 విమర్శ :

పారిస్ ఒడంబడిక అంశాలు అసమగ్రంగానూ, అసంతృప్తిగానూ, ఋజువయ్యాయి. సంధి టర్కీకి మళ్ళీ జన్మనిచ్చినా దాని విచ్ఛిత్తిని ఆపలేకపోయింది. సెర్బియా, మాంటినిగ్రోలు వాస్తవానికి స్వతంత్రమయినట్లే వల్లాకియా, మాల్డేవియాల విభజన చాలా తాత్కాలికమయింది. 1870 లో, సంధి సూత్రాలలోని నల్ల సముద్రానికి సంబంధించిన అంశాలకు బద్ధంగా ఉండటానికి రష్యా నిరాకరించింది. సుల్తాన్ బాల్కన్లలో మంచి ప్రభుత్వాన్నెప్పుడూ ప్రవేశపెట్టలేదు. ఈ విధంగా ప్రాచ్య సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కోవడంలో పారిస్ సంధి ఒడంబడిక విఫలమైంది.

### మాదిరి ప్రశ్నలు :

1. మొదటి అలెగ్జాండర్ దేశీయ, విదేశాంగ విధానాన్ని వివరించండి.
2. ప్రాచ్య సమస్యలో రష్యా పాత్రను వివరించండి.
3. బాల్కన్‌లలో జాతీయభావం ఎలా ఉద్భవించిందో సోదాహరణంగా వ్రాయండి.
4. క్రిమియా యుద్ధం, పారిస్ శాంతి ఒడంబడికపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.

### చదువదగిన గ్రంథాలు :


1. Rose Halland : The Revolutionary and Napoleonic Era
2. Thompson, David : Europe Since Napoleon
3. Fisher. H.A.L., : A History of Europe (Vii, II only)


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 13

# మధ్య ఐరోపాలో నియంతృత్వ సామ్రాజ్యాలు : జర్మనీ, ఆస్ట్రియా, హంగరీలు

విషయసూచిక


13.0 లక్ష్యం
13.1 జర్మన్ సామ్రాజ్యం : అంతర్గత పరిపాలన
13.2 ప్రష్యా ఆధిపత్యంలో జర్మనీ సామ్రాజ్యం
13.2.1 మొదటి విలియమ్ - బిస్మార్క్
13.3 వైదేశిక విధానం
13.3.1 ముగ్గురు చక్రవర్తుల కూటమి
13.3.2 ఆస్ట్రియా - జర్మన్ మైత్రి
13.3.3 త్రిరాజ్య కూటమి (Triple Alliance)
13.3.4 బిస్మార్క్ - ఇంగ్లాండ్
13.3.5 విమర్శ
13.4 బిస్మార్క్ యొక్క బర్తరఫ్
13.5 బిస్మార్క్ - సమీక్ష
13.6 ఆస్ట్రియా సామ్రాజ్యాలు లేదా ఆస్ట్రియా - హంగరీలు రాజోద్యమం
13.6.1 మెటర్నిక్ విధానం
13.6.2 కారల్స్‌బడ్ ప్రకటనలు (1819)
13.6.3 మెటర్నిక్ విధానం అమలు
13.6.4 మెటర్నిక్ విధానానికి ప్రతిఘటన : స్పానిష్ అమెరికా తిరుగుబాటు
13.6.5. ఆస్ట్రియా - హంగరీల్లో 1848 సంవత్సరం తిరుగుబాట్లు


## 13.0 లక్ష్యం :

పై అధ్యాయంలో జర్మనీ, ఇటలీలు జాతీయ సమైక్యత ప్రజల ఉద్యమాల వలనకాక, రాజ్యాధినేతల ఆశయాలకు అనుగుణంగా, రాజ్యాల మధ్యయుద్ధాలు, సంధి ఒడంబడికల వలన సంభవించినట్లు వివరించడం జరిగింది. అందువలన ఆ దేశాల పరిపాలనా వ్యవస్థలు ఉదారభావాలపైకాక, నియంతృత్వాలపై ఆధారపడ్డాయి. ఆ సామ్రాజ్యాల చక్రవర్తులు కూడా పశ్చిమ ఐరోపా దేశాలవలెనే కొంతవరకు ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వాలను ఇచ్చినట్లు, పారిశ్రామిక, వాణిజ్య విస్తరణకు కృషిచేసినట్లు, వలస రాజ్యస్థాపనకు ప్రయత్నించినట్లు గమనించవచ్చు. అలాగే భూస్వామ్య విధానాన్ని క్రమంగా తొలగించి, ప్రభువర్గాలను, మతాధిపతులను అదుపులో ఉంచారు. అయితే, ఇవన్నీ ప్రజల ఉద్యమఫలితాలు కావు; రాజ్యాధినేతలు తమ స్వప్రయోజనాలను సాధించుకొనేందుకు, తమ ఆధిపత్య దర్పాలను ప్రదర్శించేందుకు సాధనాలు మాత్రమే. అయితే ఈ రాజ్యాలు పశ్చిమ ఐరోపాదేశాల కంటే చాలా ఆలస్యంగా ఆధునికీకరణ చెందడాన, అచిరకాలంలోనే తాము వాటిని అధిగమించాలనే ధ్యేయంతో అవాంఛనీయమైన, అనారోగ్యకరమైన పోటీకి దిగి, ప్రపంచ యుద్ధాలకు కారణమైనాయి. ఫ్రాన్సు, బ్రిటన్ వంటి దేశాలు వ్యాపారవాద పరిపాలన, వలస సామ్రాజ్యాల విస్తరణలో పోటీపడినా, అవి ప్రధానంగా ప్రజాస్వామిక దేశాలైనందున కొంతవరకు ఓటమి కలిగి, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించుకొనే వైఖరిని కలిగి ఉండగా, ఈ మధ్యఐరోపాదేశాలు నియంతృత్వ సామ్రాజ్యాలైనందున సరాసరి

కయ్యానికి కాలు దువ్వే వైఖరిని అవలంబించాయి. ఈ పరిణామాలు, వీటి స్వభావాలు ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

## 13.1 జర్మన్ సామ్రాజ్యం - అంతర్గత పరిపాలన :

ఆటోవాన్ బిస్మార్క్ 1815లో బెర్లిన్‌కు పశ్చిమాన 40 మైళ్ళ దూరములో ఉన్న షోన్‌హౌసన్ అనే గ్రామంలో ఒక సంపన్న భూస్వామ్యకుటుంబంలో జన్మించారు. గోటింజన్, బెర్లిన్ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించెను. అనంతరము ప్రభుత్వ ఉద్యోగములో చేరాడు. 1847లో అతనికి వివాహమైంది. అతనికి ప్రజాస్వామ్య పద్ధతులలో నమ్మకంలేనివాడు. 1848లో విప్లవ సమయంలో అతడు ప్రష్యా శాసనసభలో సభ్యుడుగా ఉండి రాజ్యాంగం మార్పును వ్యతిరేకించాడు. ప్రష్యా రాజులే ఘనతకు గర్వకారణం అనేవాడు. ప్రష్యా దౌత్య ప్రతినిధిగా సెంట్ పీటర్స్ బర్గ్‌లో పదవీబాధ్యతలు నిర్వహిస్తూ, ఆ సమయంలో రష్యా చక్రవర్తి గౌరవమర్యాదలు సంపాదించాడు. పారిస్ నగరంలో రాయబారిగా ఉండి మూడవ నెపోలియన్ రీతులను సమగ్రంగా అవగాహన చేసుకున్నాడు. ప్రష్యా పేరు ప్రతిష్టల కోసం పాటుపట్టారు. అతడు ఛాన్సలర్ పదవిని స్వీకరించిన తరువాత రాజకీయ సమస్యలు సిద్ధాంతాల వల్లగాని, శాసనసభల తీర్మానాలు వల్లగాని పరిష్కారం కావని, కత్తినుపయోగించి రక్తపాతం చేయడానికి సిద్ధమైతేనే (బ్లడ్ అండ్ ఐరన్) కాని అంటే దండోపాయం ప్రయోగిస్తే కాని పరిష్కారం జరుగదు అని చెప్పాడు. ప్రష్యా రాజు తలపెట్టిన మిలిటరీ విధానానికి బిస్మార్క్ పూర్తిగా సహకారమిచ్చాడు. జర్మనీ ఏకీకరణ ప్రష్యా నాయకత్వంలోనే సాధ్యమౌతుందని దృఢంగా విశ్వసించాడు.

## 13.2 ప్రష్యా ఆధిపత్యంలో జర్మనీ సామ్రాజ్యం :

జర్మనీ ఏకీకరణ సామ్రాజ్య స్థాపన, అంతర్జాతీయ రాజకీయాలలో ఒక నూతన శకానికి నాంది పలికింది. ఈ జర్మన్ సామ్రాజ్య భవితవ్యాన్ని రెండు దశాబ్దాల కాలం, మొదటి విలియం చక్రవర్తి వద్ద ప్రధానమంత్రిగా బిస్మార్క్ విశేషంగా ప్రభావితం చేసాడు. ఈ నూతన సామ్రాజ్యం 25 దేశాల సమాఖ్య. ప్రష్యా వీటన్నింటిలో అతి పెద్దది. విశేషాధికారాలు గలది కూడ. నూతన రాజ్యాంగం ప్రకారం హోహెన్‌జోలర్న్ రాజవంశస్తుడైన ప్రష్యారాజు, జర్మన్ సామ్రాజ్యానికి చక్రవర్తి. ప్రధానమంత్రి చక్రవర్తికే బాధ్యుడు. అతనిని నియమించే అధికారంగాని, తొలగించే శక్తిగాని ఆయనకొక్కనికే గలదు. చక్రవర్తి ఆదేశానుసారం ప్రధానమంత్రి సామ్రాజ్య విధానాలను నిర్వర్తించేవాడు. మిగతా మంత్రులందరూ ప్రధాన మంత్రికి లోబడి విధులను నిర్వర్తించవలసిందే. ప్రష్యా సైనిక పద్ధతే, సామ్రాజ్య పద్ధతిగా కొనసాగుతుంది. అధికారాలన్నీ చక్రవర్తి చేతిలో కేంద్రీకృతమైనందున శాసనసభకున్న పరిమితాధికారాలతో చక్రవర్తిని అదుపులో పెట్టుట అసాధ్యమైంది. యుద్ధప్రకటన, శాంతి ఒప్పందాలను చక్రవర్తి చేసేవాడు. సైనికదళాలు సంపూర్ణంగా చక్రవర్తి ఆధీనంలో ఉండేవి. సామ్రాజ్యంలోని సమాఖ్య రాజ్యాల పరిపాలకులకు సైన్యంపై ఎలాంటి అజమాయిషీ లేదు. ఈ విధంగా చక్రవర్తి సర్వాధికారైనాడు. చక్రవర్తి సామ్రాజ్యానికి సర్వాధికారైనా, మిగతా రాజ్యాల పాలకుల వారి ప్రాంతాలలో పరిమితంగా కొనసాగుతుంది. తమ పరిధిలోని ప్రాంతాలలో విద్య, ప్రజారోగ్యం మొదలైన విషయాలలో మాత్రం స్వతంత్రంగా వ్యవహరించేవి. సామ్రాజ్య శాసనాధికారం 'రీచ్‌స్టాగ్', బుండెస్‌రాత్ అనే రెండు సభలకు చెందుతుంది. రీచ్‌స్టాగ్ సభ్యత్వం జనాభాపైన, బుండెస్‌రాత్ సభ్యత్వం, వివిధ జర్మన్ రాష్ట్రాలపైన ఆధారపడి ఉంటుంది. 'రీచ్‌స్టాగ్' కంటే ఇది ముఖ్యమైంది. దీని అనుమతి లేనిదే సామ్రాజ్యానికి సంబంధించిన చట్టాలు చేయబడవు. దీనిలో ప్రష్యాకు ప్రాతినిధ్యం అధికంగా ఉంటుంది. అందుకే ప్రష్యా పలుకుబడి హెచ్చుగా ఉండేది. పదాతి, నౌకాదళాలకు సంబంధించిన ఏ ప్రతి సాధననైనా ప్రష్యా చేయవచ్చు. సామ్రాజ్య రాజ్యాంగానికి ప్రతిపాదించబడే సవరణనైనా ప్రష్యా తిరస్కరించవచ్చు. రీచ్‌స్టాగ్‌కు పరిమితాధికారాలు మాత్రమే కలవు. కొత్త పన్నులు వేయటానికి దీని అనుమతి అవసరం. అమలులో ఉన్న పన్నులను కొనసాగించడానికి దీని అనుమతి అవసరం లేదు. అయితే క్రొత్త శాసనాలు రూపొందించడంలో ఈ రెండు సభలకు సమాన ప్రాముఖ్యం ఉంటుంది. ఈ సామ్రాజ్యం కొనసాగినంతకాలం (క్రీ.శ. 1870 - 1914) సామ్రాజ్య

విషయంలో ఇద్దరు వ్యక్తులు విశేషాధికారాలను చలాయించారు. ఒకరు సామ్రాజ్య ప్రధానమంత్రి బిస్మార్క్ (క్రీ.శ. 1870 - 1890) మరొకరు, రెండో విలియం చక్రవర్తి (క్రీ.శ. 1888 - 1918).

## 13.2.1 మొదటి విలియం - బిస్మార్క్ :

క్రీ.శ. 1871 నుండి 1890 వరకు దాదాపు 20 సంవత్సరాల కాలం మొదటి విలియం చక్రవర్తిగా, బిస్మార్క్ ప్రధాన మంత్రిగా జర్మన్ సామ్రాజ్య చరిత్రను ప్రభావితం చేసారు. ఈ 20 సంవత్సరాల కాలంలో ఇటు జర్మనీ ఆంతరంగిక విషయంలోనేగాక, అటు ఐరోపా రాజకీయాలలో గూడా, బిస్మార్క్ అత్యంత ప్రధాన పాత్రను పోషించాడు. తొలుత బిస్మార్క్‌కు జర్మనీ సామ్రాజ్యాన్ని పటిష్టం చేయడంలో ఉభయశాసన సభల మద్దతు చాలా మేరకు లభించిందనే చెప్పాలి.

### 13.2.1.1. న్యాయవ్యవస్థ :

జర్మన్ సామ్రాజ్యంలో 25 రాజ్యాలున్నాయని తెలిసికొన్నారు. ఈ రాజ్యాల ప్రజలలో ఎన్నో జాతి, భాషా, సాంప్రదాయ విభేదాలు అంతకంటే పరిపాలనా వైవిధ్యం కలవు. కనుక సామ్రాజ్యం సమైక్యం కావడానికి కొంతకాలం పట్టింది. ముఖ్యంగా ఒక్కొక్క రాజ్యంలో ఒక్కొక్క రకమైన న్యాయసూత్రాలు అమలులో ఉండేవి. బిస్మార్క్ ఏకరూప న్యాయసూత్రాలు. నాణేల పద్ధతి, సైనిక, తపాలా పద్ధతులు ఏర్పాటు చేయడం, జర్మన్ సమాఖ్యకు దోహదం చేసింది. క్రీ.శ. 1873లో ఏర్పాటు చేయబడ్డ రైల్వే బ్యూరో వివిధ రాష్ట్రాలలోని రైల్వేలను కలిపి సమైక్యతను పెంపొందించింది. క్రీ.శ. 1857 సంవత్సరపు బ్యాంకింగ్ చట్టం, బ్యాంకింగ్ విధానాన్ని సంస్కరించి, కేంద్రీకృతం గావించింది. 'రీష్' అనే సామ్రాజ్యపు బ్యాంక్ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను అమలుజరిపి, ఆర్థిక పరిస్థితిని పర్యవేక్షించి, చక్కబరిచింది. ఈ చర్యలు సామ్రాజ్య ప్రతిష్ఠకు ఎంతగానో దోహదం చేసాయి.

### 13.2.1.2. సైనిక సంస్కరణలు :

బిస్మార్క్ జర్మన్ సామ్రాజ్య నిర్మాణానికై సైనిక సంస్కరణలు చేపట్టి, ఆస్ట్రియా ఫ్రాన్స్‌లను వివిధ యుద్ధాలలో ఓడించి తన ఆశయాన్ని సాధించాడు. తరువాత ఈ సైన్యాన్ని సామ్రాజ్య పటిష్టతకు, జర్మనీ అంతర్జాతీయ ఆధిక్యతకు అత్యంత అవసరమని భావించి తీర్చిదిద్దాడు. అందుకై అతడు నిర్బంధ సైనిక సేవను ప్రవేశపెట్టాడు. శాంతి సమయంలో సైతం జర్మన్ సైనికబలాన్ని 40 వేలకు తగ్గకుండా నిర్వహించారు. సైనిక జీవనం గౌరవప్రదం, ఆరాధ్యం కూడా అయ్యింది. పరిపాలనా వ్యవహారాలలో గూడా సైనిక విషయాలకు ప్రాధాన్యత ఉండేది. జర్మనీ పారిశ్రామికీకరణ, సైనికశక్తి ఉపయోగాన్ని ఇనుమడింపజేసింది. క్రీ.శ. 1914 నాటికి జర్మనీ ఐరోపాలో సాటిలేని మేటి సైనిక రాజ్యమైంది.

### 13.2.1.3 జర్మనీలోని రాజకీయ వర్గాలు :

బిస్మార్క్ జాతీయలిబరల్ పార్టీ, స్వేచ్ఛా సనాతన వర్గాల మద్దత్తును పొందినా, ప్రగతిశీలుర వ్యతిరేకతను ఎదుర్కొనక తప్పలేదు. ఈ ప్రగతిశీలురు క్రీ.శ. 1871 జర్మన్ రాజ్యాంగంతో సంతృప్తి చెందక దానిని తీవ్రంగా సవరించాలని కోరారు. బిస్మార్క్ నిరంకుశ వైఖరిని, కఠిన చర్యలను వారు దుయ్యబట్టారు. శాసనసభలలో దీర్ఘోపన్యాసాలు చేసి బిస్మార్క్‌కు చికాకు కల్గించేవారు. వీటికితోడు కారల్‌మార్క్స్ అనుయాయులైన సామ్యవాదులు బిస్మార్క్ విధానాలను వ్యతిరేకించారు. ష్లేస్‌విగ్ నుండి వచ్చిన ప్రతినిధులు ఉత్తర ష్లేస్‌విగ్‌ను డెన్మార్క్‌కు తిరిగి అప్పగించమని కోరారు. బిస్మార్క్ యొక్క పోలిష్ వ్యతిరేక విధానాలను పశ్చిమ ప్రష్యా పోసిన్ ప్రతినిధులు నిరశించారు. ఆల్‌సేస్ - లొరైన్ ప్రాంతపు 15 మంది ప్రతినిధులకు, బిస్మార్క్‌కు తరచు వాదోపవాదాలు జరుగుచూ ఉండేవి. మొత్తం మీద బిస్మార్క్ యొక్క కేంద్రీకృత పాలన వివిధ రాజకీయ పక్షాల నిరసనకు, విమర్శకు, వ్యతిరేకతకు గురైంది.

## 13.2.1.4 చర్చితో వైరం (కల్చర్ కాంఫ్) :

ప్రొటస్టంట్ ప్రష్యా ఆధ్వర్యంలో ఏర్పడ్డ జర్మన్ సామ్రాజ్యాన్ని కాథలిక్కులు సహించలేకపోయారు. సామ్రాజ్య నిర్మాణంతో వారు తమ పలుకుబడికి భంగం వాటిల్లిందని భావించి 'సెంటర్' అనే రాజకీయ పార్టీని ఏర్పరచుకున్నారు. వీరు రీచ్‌స్టాగ్‌లో చాలా సీట్లు సంపాదించుకున్నారు. వీరిని సామ్రాజ్య వ్యతిరేకులని బిస్మార్క్ ద్వేషించాడు. అయితే క్రీ.శ. 1870 లో ఈ కాథలిక్కులలో చీలిక ఏర్పడింది. పోప్ అమోఘత్వ ప్రకటన జారీచేసాడు. కాథలిక్కులందరూ దీనికి విధేయులు కమ్మని పోప్ కోరాడు. కాని మేధావి వర్గానికి చెందిన విశ్వవిద్యాలయ, విద్యాలయాల ఆచార్యులు, ఉపాధ్యాయులు పోప్ ప్రకటనను తిరస్కరించి ప్రాచీన కాథలిక్ వర్గంగా ఏర్పడ్డారు. ఈ వర్గం వారిని పోప్ ఎన్నో ఆంక్షలకు గురిచేసాడు. వారు చర్చి నుండి బహిష్కరింపబడ్డారు. చర్చి సమావేశాలకు, ఉపన్యాసాలు వినుటకు, ప్రార్థనలు జరుపుటకు అనర్హులైనారు. ఈ వర్గమంతా పోప్‌చే వేధింపబడి ప్రభుత్వ రక్షణను కోరారు. వీరి అభ్యర్థన బిస్మార్క్‌కు కాథలిక్ చర్చిపై విరుచుకుపడడానికి మంచి అవకాశాన్ని కల్గించింది. దీంతో చర్చి, సామ్రాజ్యం మధ్య తగాదా మొదలైంది. దీనినే కల్చర్‌కాంఫ్ లేక సాంస్కృతిక పోరాటం అని పిలుస్తారు. ఇందులోని భాగంగా బిస్మార్క్, పోప్‌కు విధేయులైన జెస్యూట్‌పై ఆంక్షలను విధించి, తుదకు దేశ బహిష్కారం చేశాడు. విద్య, వివాహం, మతాచార్యుల నుండి విముక్తం చెయ్యబడ్డారు. పోప్ స్థానమైన వాటికన్ నుండి జర్మనీ రాయబారిని ఉపసంహరించాడు. దీనికి వ్యతిరేకతను తెలిపిన మతాచార్యులను శిక్షించాడు. క్రీ.శ. 1873, 74, 75 మే నెలలో కాథలిక్‌లకు వ్యతిరేకంగా 'మే చట్టాలను' ఏర్పాటు చేశాడు. ఈ చట్టాలు కాథలిక్‌లు మత, విద్యావిషయాలపై ఎన్నో ఆంక్షలు విధించి వారిపై ప్రభుత్వ ఆధిపత్యాన్ని పంచాయి. అన్ని మత వర్గాలను రద్దుచేయడం గూడా జరిగింది. కానీ పోప్ యివన్నీ చెల్లవని ప్రకటించాడు. కాథలిక్ అర్చకులు వీటిని ఖాతరు చేయలేదు. అయితే బిస్మార్క్ వీరి పౌరసత్వపు హక్కులను రద్దుచేసి, ఖైదుచేసి, దేశ బహిష్కరణ గావించి, ఎన్నో విధాలుగా బాధించాడు. ఈ కఠిన చర్యల వలన ఒకే సంవత్సరములో 6మంది బిషప్పులు జైలు పాలుకాగా, 1500 ల చిన్న చర్చీలలో కాథలిక్ పూజా కార్యక్రమం నిలిపివేయబడింది. కానీ జర్మన్ కాథలిక్‌లు ఊహించని ఐక్యతతో పట్టువదలక గట్టిగా బిస్మార్క్‌తో పోరాడారు. కాథలిక్‌లపై ప్రభుత్వ ప్రతీకార చర్యలను ఆపించమని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్పుడే బిస్మార్క్ బాగా బలాన్ని పుంజుకుంటున్న సామ్యవాదులతో పోరాడవలసి వచ్చింది. ఈ పోరాటంలో అతనికి కాథలిక్‌ల 'సెంటర్' పార్టీ మద్దతు అవసరమైంది. అంతేగాకుండా, నూతన పోప్ అయిన పదమూడో 'లియో' సామరస్య ధోరణిని వ్యక్తం చేశాడు. దీంతో బిస్మార్క్ పోప్‌తో అంగీకారాన్ని కుదుర్చుకొని వాటికన్‌కు జర్మన్ రాయబారిని పంపాడు. క్రీ.శ. 1876 లో మే చట్టాలను ఉపసంహరించారు. జెస్యూట్‌లు మినహా తక్కిన వర్గాలవారు తిరిగి జర్మనీకి రావటానికి అవకాశం కల్పించబడింది. వీటన్నిటితో బిస్మార్క్, చర్చి మధ్య తగాదా ముగిసింది. అయితే తన కల్చర్‌కాంఫ్ వైఫల్యం పొందిందని బిస్మార్క్ అంగీకరించక తప్పలేదు.

## 13.2.1.5 సామ్యవాదులతో వివాదం :

ఇదే కాలంలో సామ్యవాద ఉద్యమం జర్మనీలో ఉద్భవించి శ్రామికులను విశేషంగా ఆకర్షించింది. సామ్యవాదులు క్రీ.శ. 1874 నాటికే 'రీచ్‌స్టాగ్'లో నాల్గుసీట్లు సంపాదించుకోగల్గారు. క్రీ.శ. 1875లో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఏర్పాటైంది. క్రీ.శ. 1877 నాటికి సామ్యవాదులు శాసనసభలో తమ బలాన్ని 12కు పెంచుకోగలిగారు. సామ్యవాదమంటే గిట్టని బిస్మార్క్ సామ్యవాద సూత్రాలు దేశ, కుటుంబ, నాగరికతా విరుద్ధాలని భావించి సామ్యవాదులను అణచివేయ సంకల్పించాడు. క్రీ.శ. 1878 లో చక్రవర్తి మొదటి విలియంపై జరిగిన హత్యా ప్రయత్నానికి సామ్యవాదులు బాధ్యులను చేసి, వారిపై విరుచుకుపడ్డాడు. క్రొత్తగా ఏర్పాటైన శాసనసభలో బిస్మార్క్ మద్దతుదారుల సంఖ్య పెరిగింది. వీరి మద్దతుతో సామ్యవాద పుస్తకాలను, కరపత్రాలను, వార్తాపత్రికలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసాడు. పోలీసులకు సామ్యవాదుల సమావేశాలను ఛిన్నాభిన్నం గావించడానికి, వారి ప్రచురణలను నిరోధించడానికి, విస్తృత అధికారాలు ఇవ్వబడ్డాయి. సామ్యవాదులను సామాన్య న్యాయస్థానాలలోగాక,

ప్రత్యేక న్యాయస్థానాలలో విచారించబడి శిక్షింపబడే ఏర్పాటును గావించాడు. సామ్యవాదులపై ఈ చట్టాలు, మొదట నాలుగు సంవత్సరాలకే జారీచేయబడ్డా, వాటిని తిరిగి ప్రవేశ పెట్టడం జరిగింది కూడా. విచిత్రమేమిటంటే, క్రీ.శ. 1890లో బిస్మార్క్ బర్తరఫ్ అయ్యే నాటికి, ఈ సామ్యవాద వ్యతిరేక చట్టాలన్నీ అమలులో ఉన్నా, ఈ అణచివేత చర్యలు వారి సంఖ్యా బలాన్ని పెంచాయి. ప్రజలు వారిని అమర వీరులుగా భావించడంతో వారి ప్రజాబలం పెరిగింది. దీంతో ప్రతి ఎన్నికల్లో వారి సభ్యుల సంఖ్య రీచ్‌స్టాగ్‌లో పెరిగిపోతూనే ఉండేది.

### 13.2.1.6 ప్రభుత్వ సామ్యవాదం :

సామ్యవాదుల ప్రభావాన్ని అరికట్టడానికి బిస్మార్క్ రెండు విధానాలను అనుసరించాడు. మొదటిది అణచివేత చర్యలు. ఇంతకు ముందే, అవి వివరించబడ్డాయి గదా. పోతే రెండోది ప్రభుత్వ సామ్యవాదము. ప్రభుత్వపరంగా సామ్యవాద సంస్కరణలను ప్రవేశపెట్టిన ఐరోపా రాజకీయవేత్త, బిస్మార్క్. ఆయన విధానాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ లోపించినా, మిగతా ఐరోపా రాజ్యాలకన్నా జర్మనీలోనే పెక్కు ప్రగతిశీల సంస్కరణలు జరిగాయి. ప్రష్యాలో విప్లవాత్మక మార్పులు ప్రజలచేగాక రాజులచే సాధింపబడతా"యని బిస్మార్క్ వ్యాఖ్యానించాడు. సాంఘిక భీమాపద్ధతి, వయో వృద్ధులకు పింఛన్, జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టబడ్డాయి. కార్మికుల మద్దతుకై బిస్మార్క్ ఎన్నో సామ్యవాద సంస్కరణలు గూడా చేసాడు. వారి సాంఘిక భద్రతకై, పెక్కు ప్రణాళికలు ప్రవేశపెట్టి ఉదారవాదులనే ఆశ్చర్య చకితులను చేశాడు. ఈ ప్రభుత్వ సామ్యవాద విధానాలన్నీ జర్మనీ ప్రపంచ దేశాలలో పారిశ్రామిక రంగంలో ఎంతో ప్రగతిని సాధించడానికి ఉపకరించాయని చెప్పాలి.

### 13.2.1.7 జాతీయ ఆర్థిక స్థితిగతులు :

సనాతనుల, సెంటర్ పార్టీల మద్దతుతో బిస్మార్క్, జర్మనీలో ఉదార ఆర్థిక విధానం స్థానే జాతీయ ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టాడు. అయితే ఈ మార్పు ఆనాటి జర్మనీదేశ వ్యవసాయ రంగాలలో వస్తున్న మార్పుల వలననే అని భావించాలి. ఒక రకంగా ఇది దేశంలో పెల్లుబుకుతున్న సామ్యవాద శక్తులకు ప్రజలిచ్చిన జవాబుగా కూడా పరిగణించాలి. ఈ మార్పును ఆనాటి జర్మన్ జాతిలో పెరుగుతున్న రాజకీయ జాతీయతా భావానికి చిహ్నంగా కూడా గుర్తించవచ్చు. దీనికి స్వేచ్ఛా వ్యాపారానికి మన్నించే సనాతనుల సెంటర్ పార్టీ మద్దతు కూడా కలదు. బిస్మార్క్ దేశంలో వస్తున్న మార్పును గమనించి, మూడు విధానాలను ప్రవేశపెట్టాడు. ఒకటి, జర్మనీని రక్షక విధానాన్ని కేంద్రీకృతం చేయడం, రెండోది విస్తృతంగా వలస విధానము ద్వారా, కేవలం ఐరోపా దేశంగా ఉన్న జర్మనీని ప్రపంచదేశంగా అభివృద్ధి చేయడం, మూడోది, పెట్టుబడిదారీ వర్గానికి, శ్రామిక వర్గానికి మధ్య ఉన్న సంబంధాలతో ప్రమేయం లేనట్లు కన్పరుస్తూనే జర్మనీ, ఐరోపా దేశాలలో, ప్రభుత్వ జోక్యవిధానానికి మార్గదర్శకురాలుగా చేయడం. ఇందుకు ఆతడు ఏర్పరచిన సుంకాల విధానం ఉదాహరణ.

### 13.2.1.8 సుంకాల విధానము :

క్రీ.శ. 19వ శతాబ్దంలో స్వేచ్ఛా వ్యాపారాన్ని విడనాడి, రక్షణ విధానాన్ని అనుసరించిన ఐరోపా రాజకీయ వేత్తలలో బిస్మార్క్ ప్రథముడు. ఈ లక్ష్యసాధనకే, ఆతడు ఉదారజాతీయ వాదులతో తెగతెంపులు చేసికొని సెంటర్ పార్టీలో చేరాడు. జర్మనీలో ఉత్పత్తి అయ్యే సరుకుల రక్షణ నిమిత్తం క్రీ.శ. 1879లో విదేశీ దిగుమతులపై హెచ్చు సుంకాలను విధిస్తూ ఒక శాసనం చేశాడు. ఈ సుంకాల హెచ్చింపు విధానం పారిశ్రామిక రంగానికి లాభదాయకంగా ఉందని వ్యవసాయక ఉత్పత్తిదారులు విమర్శించగా, వారిని సమాధాన పర్చటానికి పొగాకు, చక్కెరలపై హెచ్చు సుంకాలు విధిస్తూ మరొక చట్టం చేశాడు. ఈ రక్షణ విధానం శైశవ దశలోనున్న జర్మన్ పారిశ్రామికరంగాన్ని అప్పటికే పారిశ్రామికంగా బాగా ప్రగతిని సాధించిన ఇంగ్లాండ్ లాంటి దేశాల పోటీ నుండి సంరక్షింపడానికే ఉద్దేశింపబడింది. అంతేగాకుండా జర్మనీకి ఈ విధానం వలన హెచ్చు ఆదాయపు పన్ను

లభించింది. విదేశీ దిగుమతులపై వేసే సుంకాల ద్వారా ధనాన్ని రాబట్టవలసిన అవసరం లేకుండా పోయింది. ఈ సుంకాల విధానం ప్రభుత్వాన్ని పటిష్టపరచి జర్మన్ సామ్రాజ్యాన్ని సంఘటిత పరచింది.

### 13.2.1.9 సామ్రాజ్యవాదం :

మొట్టమొదటిగా బిస్మార్క్ వలస రాజ్య విధానానికి, నౌకావిభాగపు పెంపుకు వ్యతిరేకి. ఇంగ్లాండ్‌తో పోటీపడటం గానీ, ఘర్షణ పడటం గాని అతని అభిమతం కాదు కనుక, ఇంగ్లాండ్, జర్మనీలు, నీటి, భూఏలికలుగా ఉన్నంతకాలం వాటి రెండింటిమధ్య యుద్ధం అసంభవమని అతడు తలపోశాడు. అందుకే అతడు క్రీ.శ. 1871 లో ఫ్రాన్స్ తన వలసలలో ఏదో ఒక దానిని ఆల్సెస్ - లొరైయిన్‌కి బదులుగా అంగీకరించమనగా అతడు దానికి సమ్మతించలేదు. అతని మాటలలోనే చెప్పాలంటే "నా ఆఫ్రికా పటం ఐరోపాలోనే ఉంది. ఇక్కడ రష్యా, అక్కడ ఫ్రాన్స్ ఉన్నాయి. వీటి రెండింటి మధ్య మేమున్నాము. అదే నా ఆఫ్రికా పటం" అన్నాడు. కాని కొన్ని కారణాల వలన, ఒత్తిడి వలన, పరిస్థితుల ప్రభావం వలన తన విధానాన్ని మార్చుకొని వలసవాద విధానాన్ని ప్రారంభించాడు. అవి :

1) హాంబర్గ్ వర్తకులు తదితరులు, మిగులు సరుకులకు కొనుగోలు మరియు ముడిపదార్థాలు లభించే స్థావరాలు
2) క్రైస్తవ మత బోధకులు, క్రైస్తవ మతవ్యాప్తికి నూతన ప్రాంతాలను కాంక్షించడం
3) దేశభక్తులు తమ దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపచేయాలని వాంఛించడం, మరియు
4) అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తరలివెళుతున్న జర్మనీ దేశ మిగులు జనాభాకు నివాసమేర్పరచడం.

జర్మనీ వలసల స్థాపనలో వ్యాపారస్తులు, మత బోధకులు మార్గదర్శకులైనారు. హాంబర్గ్‌కు చెందిన వాణిజ్య కంపెనీలు కొన్ని సదుపాయాలు పొంది, నైరుతి ఆఫ్రికా, టోగోలాండ్, కామరూన్, తూర్పు ఆఫ్రికా, మారిషస్ ద్వీపాలు, న్యూగినియాలో కొంతభాగం, బిస్మార్క్ ద్వీప సముదాయంలో వర్తక సంఘాలను ఏర్పాటు చేసారు. క్రీ.శ. 1884 - 1885 నాటికి ఈ ప్రాంతాలపై జర్మనీ రక్షిత ప్రభుత్వాలు ఏర్పాటు చేయబడ్డాయి. క్రీ.శ. 1890లో పదవీ విరమణ చేసే నాటికి బిస్మార్క్ వాటిని సామ్రాజ్య వలసలుగా మార్చాడు. వీటిని జర్మన్ అధికారులు పాలించగా, జర్మన్ దళాలు వీటి రక్షణ బాధ్యతను వహించాయి.

## 13.3 వైదేశిక విధానం :

క్రీ.శ. 1870లో ఫ్రాన్స్ - ప్రష్యా యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయి ఆల్సేస్ - లొరైయిన్‌లు పోగొట్టుకొని జర్మనీ చేతిలో భంగపడింది. జర్మనీ ఐరోపాలో ప్రముఖ రాజ్యం అయ్యింది. అయితే ఏనాటికైనా ఫ్రాన్స్ తలపడి తిరిగి ప్రతీకార యుద్ధం చేయగలదని అటువంటి పరిస్థితిలో ఫ్రాన్స్‌కు మిత్రులు లేకుండా చేయడం అవసరమని భావించి తన వైదేశిక విధానాన్ని రూపొందించాడు. దీనిని సాధించడానికి ఆస్ట్రియా, రష్యా, ఇంగ్లండ్, ఇటలీ రాజ్యాలతో మైత్రిని నెరపాడు. అతని మాటలలోనే చెప్పాలంటే "క్రీ.శ. 1870 నుండి జర్మన్ సామ్రాజ్యపు వైదేశిక విధానం జర్మనీ వ్యతిరేక కూటముల ఏర్పాటును భంగపరుస్తూ, శాంతిని పరిరక్షించడమే. దీనికి రష్యా కీలకకేంద్రం" అని వివరించాడు. ఐనా ఫ్రాన్స్‌తో మైత్రితో మెలగి, బెర్లిన్, పారిస్‌ల మధ్య వీలయినంత వరకు, మైత్రిని పెంపొందించాలని ప్రయత్నించాడు. ఫ్రాన్స్ కోల్పోయిన ఆల్సేస్ - లొరైన్ ప్రాంతానికి నష్టపరిహారంగా "ట్యూనిస్" "మొరాకో" లను ఫ్రాన్స్ ఆక్రమించడాన్ని ఆమోదించాడు. కాని ఫ్రాన్స్ ఇలాంటి వాటితో తృప్తి చెందదని బిస్మార్క్‌కు పూర్తిగా ఎరుకే.

### 13.3.1 ముగ్గురు చక్రవర్తుల సమితి :

క్రీ.శ. 1872లో ఆస్ట్రియా, రష్యా చక్రవర్తులతో కలిసి, బిస్మార్క్, ముగ్గురు చక్రవర్తుల సమితి ఏర్పాటు చేసాడు. దీనిని కూటమి అనేకంటే, ఈ మూడు రాజ్యాల మధ్య నెలకొన్న సత్సంబంధాలు తెలిపే అంగీకారమనవచ్చు. ఇది ప్రధానంగా

ఫ్రాన్సుకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమి, అయితే ఆస్ట్రియా, "సెడోవా' యుద్ధంలో పొందిన ఘోరపరాజయాన్ని మరిపించాలని బిస్మార్క్ చేసిన ప్రయత్నంగా గూడా చెప్పవచ్చు. ఏది ఏమైనా, ఈ సమితి ఏర్పాటు బిస్మార్క్ సాధించిన విజయంగా పేర్కొనవచ్చు. కాని, దీనిని కొనసాగించడం ఏర్పాటు చేసినంత సులువుకాదని విదితమైంది. క్రీ.శ. 1875లోనే జర్మనీ ఒకవేళ ఫ్రాన్స్‌పై దాడి జరిపితే, అలాంటి పరిస్థితులలో జర్మనీకి తన మద్దతు వుండబోదని రష్యా స్పష్టం చేసింది. దీంతో బిస్మార్క్ ఆస్ట్రియా మైత్రిని కాంక్షించాడు.

## 13.3.2 ఆస్ట్రియా - జర్మన్ మైత్రి :

క్రీ.శ. 1878 బెర్లిన్ కాంగ్రెస్ తర్వాత రష్యా, జర్మనీల మధ్య సంబంధాలు బెడిసి కొట్టడంతో, ముగ్గురు చక్రవర్తుల సమితి పూర్తిగా విచ్ఛిన్నమైంది. బెర్లిన్ కాంగ్రెస్‌ను రష్యా తనపైన జరిగిన కుట్రగా భావించింది. పరిస్థితి విషమించిందని పసిగట్టిన బిస్మార్క్ క్రీ.శ. 1879లో ఆస్ట్రియాతో మైత్రి చేసికున్నాడు. ఈ రహస్య మైత్రి, రష్యాకు వ్యతిరేకంగా నిర్దేశించబడింది. ఈ మైత్రి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లేటంత వరకు కొనసాగింది. బిస్మార్క్ ఎల్లప్పుడూ ఒకే పంథాలో నడిచే వ్యక్తిగాదు, కనుకనే క్రీ.శ. 1881లో ముగ్గురు చక్రవర్తుల సమితిని పునరుద్ధరించాడు. కాని దీనికి, క్రీ.శ. 1872లో ఏర్పాటైన దానికి, ఏ మాత్రం సంబంధం లేదు. ఆస్ట్రియా, రష్యాలు దీనిని కేవలం వైదేశిక విధానంలో ఒక మలుపుగా భావించినా, బిస్మార్క్ సనాతన వాదానికి విజయమని తలచాడు. మూడు రాజ్యాలలో ఏదైనా, నాల్గో రాజ్యంతో యుద్ధానికి తలపడితే మిగిలిన రెండు రాజ్యాలు తటస్థంగా ఉండాలన్నదే దీని అంతర్యం. రష్యాకు బహుశా బిస్మార్క్‌కు గూడా, ఇదొక విజయమేనేమో. ఒకరకంగా ఇది మునుపటి పవిత్ర కూటమిలాంటిది. బాల్కన్‌లలో ఆస్ట్రియా - రష్యాల మధ్య సంఘర్షణ నివారించడమే దీని లక్ష్యం. అయితే ఎట్టి వివాదం లేనంతకాలమే ఇది పని చేసింది. క్రీ.శ. 1881 - 85 సంవత్సరాల మధ్య ఇది ఐరోపాకు యుద్ధభయాన్ని కొంతమేరకు తగ్గించి, ఊరట కలిగించిందనే చెప్పాలి. ఏమైనా బల్గేరియా క్లిష్ట సమస్య తలెత్తినపుడు ఆస్ట్రియా, రష్యాల మధ్య ఏర్పడ్డ వివాదాల ఫలితంగా ఈ సమితి భగ్నమైంది. ఆ పరిస్థితులలో బిస్మార్క్ 'బల్గేరియాలో నేను రష్యన్‌ను అని ప్రకటించి క్రీ.శ. 1887లో బిస్మార్క్ రష్యాతో "పునర్భద్రతా సంధి" (Re-insurence Treaty) అనే రహస్య అంగీకారాన్ని చేసికొన్నాడు. ఈ ఒడంబడికననుసరించి రష్యా, ఫ్రాన్స్‌కు ఎట్టి సహాయము చేయనట్లు అయితే అందుకు ప్రతిఫలంగా జర్మనీ, ఆస్ట్రియాకు విరుద్ధంగా బాల్కన్ రాజ్యాలలో రష్యాను సమర్థించగలదు. ఈ సంధి ఆస్ట్రియా, రష్యాల మధ్య యుద్ధాన్ని నివారించడమేకాక ఫ్రాన్స్, రష్యాల కూటమిని బలహీనపరచడానికి తోడ్పడింది. అయితే రష్యా - ఆస్ట్రియాల నడుమపోరాటం సంభవించినప్పుడు బిస్మార్క్ తన మాట నిలబెట్టుకోలేదు.

## 13.3.3 త్రిరాజ్య కూటమి (Triple Alliance) 1882 :

బిస్మార్క్ క్రీ.శ. 1882లోనే జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీలతో, త్రిరాజ్య కూటమిని ఏర్పాటు చేసాడు. ఇది కూడా రహస్య సంధియే. దీని ఏర్పాటును సమర్థించడానికి, ఇటలీ పెద్ద రాజ్యమని బిస్మార్క్ భ్రమింపచేసాడు. క్రీ.శ. 1881లో ఫ్రాన్స్, ట్యూనిస్‌ను తన రక్షిత ప్రాంతంగా ప్రకటించడంతో, ఇటలీ ఆస్ట్రో - జర్మనీ మైత్రీలో చేరింది. ఈ సంధితో, ఇటలీ, ఫ్రాన్స్‌తో చేరకుండా చేయగల్గాడు బిస్మార్క్. ఈ సంధి 5 సం॥లు కొనసాగింది. క్రీ.శ. 1887లో దీనిలో కొన్ని మార్పులు చేయబడ్డాయి. ఇది క్రీ.శ. 1914 వరకు ఇటలీ ప్రత్యర్థి వర్గంలో చేరిపోయినా కొనసాగింది. ఈ సంధి లక్ష్యం ఐరోపాలో శాంతిని పరిరక్షించడమే.

## 13.3.4 బిస్మార్క్ - పాలికలు :

ఇంగ్లాండ్‌తో బిస్మార్క్ మైత్రితోనే మెలిగాడు. ఎలాగైనా ఇంగ్లాండ్‌తో సఖ్యతగా ఉండటమే తన విధాన ప్రధాన సూత్రంగా భావించాడు. ఇంగ్లాండ్, జర్మనీలను నీటి, భూమి ఏలికలుగా వర్ణిస్తూ, ఈ రెంటి మధ్య యుద్ధానికి తావులేదన్నాడు. తన కుమారుడైన హెర్బర్ట్‌ను ఇంగ్లాండ్‌కు జర్మన్ రాయబారిగా పంపి, రెండుమార్లు ఇంగ్లాండ్‌తో సంధి ప్రయత్నించాడు. కాని,

ఇంగ్లాండ్ ఈ ప్రయత్నాన్ని పట్టించుకోలేదు. ఇంగ్లాండ్‌తో వైరం రాకూడదనే కారణంతోనే బిస్మార్క్ జర్మనీ నౌకాదళ పెంపును, వలసల ఏర్పాటు ప్రోత్సహించలేదు. క్రీ.శ. 1878లో జరిగిన బెర్లిన్ కాంగ్రెస్‌కు బిస్మార్క్ అధ్యక్షత వహించి, నమ్మకస్తుడైన మధ్యవర్తిగా పేర్కొనబడ్డాడు.

### 13.3.5 విమర్శ :

బిస్మార్క్ యొక్క వైదేశిక విధానం ఐరోపాను ఒక సాయుధ శిబిరంగా మార్చింది. ఇతడు తన చాకచక్యంతో అపార అవగాహనతో, ఐరోపా దేశాల మధ్య సంబంధాలను దాదాపు 20 సంవత్సరాలు ఆదేశించగలిగినా చివరకు అది ఎన్నో అవాంఛనీయ పరిణామాలకు దారితీసింది. అతడు కొంతకాలమే "నలుపును తెలుపుగాను, తెలుపును నలుపుగాను" చిత్రించగలిగాడని, అది ఎల్లప్పుడూ సాధ్యపడలేదని విమర్శించడం కూడా కద్దు. బిస్మార్క్ యొక్క వైదేశిక విధానం గజిబిజిగా తోస్తుంది. అందుకే బిస్మార్క్ లాంటి మాంత్రికుడు ఒకేసారి ఐదు బంతులను గాలిలో ఎగురవేసి, వాటిని సమర్థవంతంగా నిర్వహించగలిగాడని వ్యాఖ్యానించడం జరిగింది. ఈతని కూటముల ఏర్పాటు విరుద్ధ రాజ్యకూటముల సైనిక శిబిరాలకు దారితీసిందని విమర్శించడం జరిగింది. ఐరోపా దేశాలలో అర్థరహితమైన యుద్ధ సామాగ్రిని సమకూర్చుకోవడానికి, పోటాపోటీలు జరిగాయి. ఈ పోటీలు ఐరోపా ఖండాన్ని రెండు సాయుధ యుద్ధకూటాలుగా విభజించాయి. ఆ రకంగా బిస్మార్క్ మొదటి ప్రపంచ యుద్ధానికి కారకుడైనాడు.

## 13.4 బిస్మార్క్ యొక్క బర్తరఫ్ :

బిస్మార్క్ యొక్క అధికారం జర్మనీలో క్రీ.శ. 1871 నుండి 1888 వరకు ఎదురులేకుండా సాగింది. ఆ కాలంలో జర్మనీ చక్రవర్తిగా ఉన్న మొదటి విలియంకు, అతనికి పూర్తి సఖ్యత ఉండేది. అయితే క్రీ.శ. 1888 రెండో విలియం జర్మన్ చక్రవర్తి గావడంతో బిస్మార్క్ రాజకీయ అధికారం సన్నగిల్లింది. నూతన చక్రవర్తి బిస్మార్క్ నుండి ఆదేశాలు స్వీకరించ నిరాకరించి, తన స్వంత విధానాలను ప్రవేశపెట్టాడు. బిస్మార్క్ తన కుమారుడైన హెర్‌బర్ట్‌ను తన వారసునిగా చేయ ప్రయత్నించగా దానిని అటు ప్రజలు, ఇటు చక్రవర్తి నిరసించారు. క్రీ.శ. 1888 - 89 సంవత్సరాల మధ్య, బిస్మార్క్ బెర్లిన్‌లో లేనందున అక్కడి ప్రముఖ వ్యక్తులతో,మంత్రులతో, విధాన నిర్ణేతలతో సంబంధాలు లేక తనపై వచ్చే విమర్శను ఎదిరించి, సమర్థించుకునే అవకాశం కోల్పోయాడు. నానాటికి ఈతని విధానాలు తీవ్ర విమర్శకు గురికావడంతో, ఛాన్సలర్ పదవిలో మార్పును వాంఛించడం జరిగింది. బిస్మార్క్‌కు, నూతన చక్రవర్తితో సంబంధం చెడ్డాయి. చక్రవర్తి సెంట్ పీటర్స్ బర్గ్, వియన్నా, లండన్, ఏథెన్స్, కాన్‌స్టాంట్ నోపిల్ నగరాలను సందర్శించడం బిస్మార్క్ నిరసించాడు. దీంతో, చక్రవర్తికి ఆగ్రహం కలిగింది. అంతేకాకుండా బిస్మార్క్ తన సుదీర్ఘ ఎదురులేని అధికార నిర్వహణలో ఎంతో మందిని శత్రువులుగా చేసికోవలసి వచ్చింది. జర్మనీలోని వివిధ వర్గాలవారు ఏదో ఒక విషయంలో ఇతనితో తలపడ్డవారే. విచిత్రమేమంటే, సైనిక దళాధిపతులు కూడా ఇతనిపై కుట్ర జరిపారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇతని ప్రత్యర్థులంతా, ఇతనికి, చక్రవర్తికి వచ్చిన విభేదాలను గోరంతను కొండంతలుగా చేసి సంతోషించారు. యువ చక్రవర్తి, రాజ్యంలో తన మాటే చెలామణి గావాలని బాహాటంగా వ్యక్తపరిచాడు. "ఈ రాజ్యానికి అధిపతి ఒక్కడే. అతడిని నేనే. నా ప్రక్క మరొకరిని సహించను". అని చక్రవర్తి నిష్కర్షగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. బిస్మార్క్‌పై పలుమార్లు వత్తిడి తేబడింది. చివరకు తన రాజీనామాను చక్రవర్తికి క్రీ.శ. 1830 మార్చిలో సమర్పించగా, ఆయన పేరుగాంచిన ప్రధానమంత్రి రాజీనామాను అంగీకరించుటకు చింతిస్తున్నానంటూ బిస్మార్క్‌ను పదవీ బాధ్యతనుండి తప్పించాడు. చక్రవర్తి బిస్మార్క్ అమోఘసేవలను కొనియాడుతూ, అతనిని లాయన్స్‌బర్గ్ డ్యూక్‌గా, సైన్యంలో ఫీల్డ్ మార్షల్ హోదాతో సత్కరించాడు. బిస్మార్క్ 83 సంవత్సరాల పండు జీవిగా క్రీ.శ. 1898 లో మరణించాడు.

## 13.5 బిస్మార్క్ సమీక్ష :

బిస్మార్క్ మంచి దేహధారుఢ్యం గలవాడు, సైనిక లక్షణాలు ఉట్టిపడేటట్లు ఉండేవాడు. చురుకైన మేధస్సుతో, చూపరులను ఆకట్టుకొనే వ్యక్తిత్వంతోనూ, లోతుగా ఆలోచించి, తిరుగులేని నిర్ణయాలు చేయటంలోనూ అతనికి అతనేసాటి. జర్మనీ రాజకీయ చరిత్రలో కాకలుతీరిన మేటిగా ప్రసిద్ధికెక్కాడు. క్రీ.శ. 19 వ శతాబ్దంలో ఐరోపా ఖండ అంతర్జాతీయ విషయాలలో అత్యంత ప్రముఖ పాత్ర వహించాడు. ప్రష్యాజాతి పౌరుషం ఇతనిలో మూర్తీభవించిందనే చెప్పాలి. గృహ జీవితంలో భార్యా బిడ్డలకు అత్యంత ఆప్తుడై వారిపై ప్రేమానురాగాలను ఒలికించాడు. బిస్మార్క్ సాటిలేని దేశభక్తుడు. అతని ఏకైక లక్ష్యం, ప్రష్యా ఆధ్వర్యంలో జర్మనీని సమైక్య పరచడం. యథార్థ, తార్కిక వాదాలు ఇతనిలో సమపాళ్ళలో మేళవించుకున్నాయి. ఐరోపా ఖండాన్ని శాసించి జర్మనీకి ఐరోపా ఖండంలో అగ్రరాజ్యంగా నిలపాలన్నదే అతని జీవిత ధ్యేయం. బిస్మార్క్ జర్మన్ చరిత్రలోనే కాక, ఆధునిక ప్రపంచ అగ్రశ్రేణి రాజకీయ దురంధరుడుగా పేరు మోసాడు. ఇతడు మూర్తీభవించిన పనిమంతుడు. క్రీ.శ. 19 వ శతాబ్దపు దౌత్య చరిత్రలో అత్యంత ప్రతిభావంతమైన పాత్రను నిర్వహించాడు. ఒక్క కవూర్‌ను మినహాయిస్తే ధైర్యంలో ఇతనికి ధీటు రాగల నాయకుడు ఆనాడు మరొకడు లేడు. క్రీ.శ. 19 వ శతాబ్దపు ఉత్తరార్థాన్ని బిస్మార్క్ యుగంగా కూడా వ్యవహరించడం కద్దు. ప్రష్యాకు సామ్రాజ్యాన్ని, వలస సామ్రాజ్యాన్ని ప్రసాదించాడు. ఈతని ప్రభావం వల్ల వియన్నా, పారిస్ నగరాల స్థానే, బెర్లిన్, ఐరోపా రాజకీయ ప్రముఖ పట్నంగా పరిణామం పొందింది. జర్మన్ సామ్రాజ్యకర్త, ఆధునిక యుగపు అమోఘశక్తిగా పేరుగాంచాడు.

## 13.6 ఆస్ట్రియా సామ్రాజ్యము - లేదా ఆస్ట్రియా - హంగరీ రాజ్యద్వయం :

రాజకీయ చైతన్యంతో ప్రజలు సుసంఘటితమై, స్వేచ్ఛా సమానత్వాలను కోరుతూ, ప్రజాస్వామ్యయుతమైన జాతీయ ప్రభుత్వాల నిర్మాణాన్ని కోరుతూ విప్లవాలకు పూనుకోకుండ అరికట్టడానికి కంకణం కట్టుకొన్న సామ్రాజ్యం. ఈ విధానాలకు రూపకర్త ఆస్ట్రియా ఛాన్సలర్ అయిన మెటర్నిక్. పద్దెనిమిదో శతాబ్దంలో ఆస్ట్రియా - హంగరీ దేశాలు కలసి ఏర్పడిన ఆస్ట్రియా సామ్రాజ్యం ఐరోపా రాజకీయాల్లో ఒక ప్రబలశక్తి. నిరపేక్ష రాజరికాన్ని సర్వవిధాల సంరక్షిస్తూ, జనసామాన్యంలో రాజకీయ చైతన్యమూ, జాతీయ భావాలు, స్వేచ్ఛా సమానత్వాలను కోరే ఉదారవాదము ఎట్టి పరిస్థితుల్లోను తలెత్తకుండ అణచివేయడానికి కర్ర చేతపట్టుకొని కూర్చున్న కాపలాదారు.

మెటర్నిక్ ఒక ప్రఖ్యాత జర్మన్ ప్రభు కుటుంబంలో 1773 మే 15 వ తేదీన జన్మించాడు. స్ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి, పిన్న వయసులోనే ఆస్ట్రియా దౌత్యశాఖలో చేరాడు. రష్యా, జర్మనీ, ఫ్రాన్స్‌లలో రాయబారిగా ఉండి, సమకాలీన ఐరోపా రాజకీయ వ్యవహారాలను బాగా ఆకళింపు చేసుకున్నాడు. 36 సంవత్సరాల ప్రాయంలోనే, ఆస్ట్రియా ప్రధాన మంత్రి అయి ఆ పదవిని 40 సంవత్సరాల సుదీర్ఘకాలం నిర్వహించాడు. క్రీ.శ. 1818 - 1848 సంవత్సరాల మధ్య అతడు ఐరోపా ఖండ రాజకీయాలపై అజమాయిషీ వహించి "ఐరోపా ఖండ ప్రధాన మంత్రి"గా పిలువబడ్డాడు.

### 13.6.1 మెటర్నిక్ విధానం :

మెటర్నిక్ తన ప్రారంభ జీవితాన్ని స్వాధికారవర్గ వాతావరణంలో గడిపాడు. విశ్వవిద్యాలయ విద్యార్థిగా ఉంటున్న రోజులలోనే అతడు ఫ్రెంచి వలసదారుల కష్టగాథలను విని, ఫ్రెంచి విప్లవోద్యమానికి ప్రబల వ్యతిరేకి అయ్యాడు. అతని కుటుంబానికి చెందిన సంస్థాన భూములను నెపోలియన్ ఆక్రమించుకొనడంతో, అతని పట్ల వ్యతిరేకత, ద్వేషం పెచ్చు పెరిగింది. 1795 లో అతడు ఆస్ట్రియాకు చెందిన ప్రముఖ దౌత్య వ్యవహర్త, ప్రిన్స్‌కౌనిట్జ్ (Kaunitz) మనుమరాలిని వివాహమాడటంతో అతని ప్రతిష్ఠ, రాజకీయ సంబంధమైన పెరుగుదల, శీఘ్రగతిలో సాగింది. తరువాత ఆస్ట్రియా చక్రవర్తి ఒకటవ ఫ్రాన్సిస్ యొక్క దౌత్య శాఖలో చేరి, సాక్సనీ ప్రష్యా, రష్యా రాజ్యాలలో ఆస్ట్రియా ప్రతినిధిగా దౌత్య వ్యవహారాలను నిర్వహించాడు. 1806 లో

అతడు ఫ్రాన్స్‌కు ఆస్ట్రియా తరుపున రాయబారిగా నియామకం పొంది ఆస్ట్రియాకు ఫ్రాన్స్‌తో సంఘర్షణ పడటానికి సరైన అవకాశం వచ్చే వరకు నెపోలియన్‌తో మంచిగా వ్యవహరించాడు. 1809 లో అటువంటి అవకాశం తటస్థ పడినట్లుగా అతడు భావించాడు. కానీ వాగ్రామ్ (wagram) వద్ద ఆస్ట్రియా సైన్యాలు చిత్తుగా ఓటమిచెందడంతో అతని ఆశ నిరాశయై అతడు వేసుకున్న పథకం విఫలమైంది. 1809 లో అతడు ఆస్ట్రియన్ మంత్రి మండలికి ఛాన్సలర్‌గా నాయకత్వం వహించి 40 సంవత్సరాల పాటు వియన్నా ప్రభుత్వంలో కడు ప్రధానవ్యక్తిగా రూపొందాడు.

ఫ్రెంచి విప్లవ గమనాన్ని, అందలి విపరీతమైన క్రూర ఘట్టాలను, ప్రభువర్గం పొందిన దురవస్థలను కళ్ళార చూచినవాడు కనుక మెటర్నిక్ కు మొదటినుండి విప్లవం యెడ కడు తీవ్రమైన వ్యతిరేక భావాలుండేవి. "విప్లవం రోగం వంటిదని, అది సకాలంలో నివారింపబడాలని, విప్లవం, అగ్ని పర్వతం లాంటిదని అది వెంటనే చల్లార్చబడాలని, విప్లవం, పుట్టుకురుపు వంటిదని, దానిని ఎఱ్ఱగా కాలిన ఇనుముతో కాల్చాలని, అది బహు శిరస్సులుగల రాక్షసి అని అది తన వికృతమైన నోటిని తెరచి సామాజిక వ్యవస్థలను కబళించి వేస్తుందని" అతడు విప్లవం గూర్చి చెపుతూ, దానిని తన జీవితాంతం వ్యతిరేకించాడు. సర్వాధికారులైన రాజ్యాధిపతులే వారి ప్రజల భవితవ్యానికి తగిన మార్గదర్శకం చేయగలవారని, ఈ కార్యంలో వారు భగవంతునికి తప్ప ఇంకెవ్వరికీ బాధ్యత వహించరని, ఉద్ఘాటించేవాడు. స్వయంగా భగవంతుని దూతగా ప్రకటించుకొనిన మెటర్నిక్ యూరప్ ప్రజలకు కావలసింది శాంతిగాని, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కావని," పతనం చెందుతున్న సామాజిక వ్యవస్థను నిలబెట్టడం తన ఉద్యమ లక్ష్యమని" ప్రకటించేవాడు.ఈ ఆశయాలనే మెటర్నిక్ పద్ధతి (Metternich System) అంటారు. మెటర్నిక్ కరుడు గట్టిన అభివృద్ధి నిరోధకుడు, ప్రజాస్వామ్య, ఉదారవాద, రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాలు అంటే అతనికి మంట. అందుకే అతడు మార్పు సహింపని సనాతనుడైనాడు. ఐరోపా దేశాలలోని నిరంకుశ ప్రభుత్వాలకు కారకుడైనాడు. అతని ఆధ్వర్యంలో ఆస్ట్రియా సనాతన రాజకీయ వ్యవస్థకు కేంద్రంగా ఏర్పడింది. ఉదారవాదం ఎక్కడ తలెత్తినా, దానిని క్రూర సైనిక శక్తితో అణచివేయడానికతడు సర్వ సన్నద్ధంగా ఉండేవాడు.

### 13.6.2 కారల్స్‌బాడ్ ప్రకటనలు - 1819 :

క్రీ.శ. 1819 సంవత్సరంలో జారీచేయబడ్డ కారల్స్ బాడ్ ప్రకటనలు మెటర్నిక్ యొక్క కరుడు గట్టిన అభివృద్ధి నిరోధక విధానాలకు చక్కని నిదర్శనాలు. ఆ ప్రకటనలతో అతడు వార్తా పత్రికలపై కఠిన నిబంధనలను విధించాడు; విశ్వవిద్యాలయాలను సంపూర్ణంగా ప్రభుత్వ అజమాయిషీ లోనికి తెచ్చాడు. విశ్వవిద్యాలయాల్లో విద్యాబోధనపై గట్టి నిఘా ఉంచబడింది. ఆచార్యులు, విద్యార్థులు ఏవైనా ప్రమాదకరమైన ఉదారభావాలను వ్యక్తం చేస్తే దేశం నుండి బహిష్కరింపబడేవారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వం అనుమతితోనే ఏర్పాటు కావాలి. ప్రజలు విదేశాలకు వెళ్ళడం నిషేధించబడింది. నేరస్తులను ఏరిపారవేసే చర్యలు తీసుకోబడ్డాయి. ఉదారవాద వ్యాప్తికై పోలీస్ శాఖ యొక్క గట్టి నిఘా ఉంచబడింది. అనుమానితులు ఖైదు శిక్షకు దేశ బహిష్కరణకు గురయ్యేవారు. ఈ కారల్స్ బాడ్ ప్రకటనలు తు.చ. తప్పకుండా అమలు జరపబడ్డాయి. హాబ్స్‌బర్గ్ రాజ్యాలు ఇతర ఐరోపా రాజ్యాలకు ఆదర్శంగా ఉండవలెననే దృష్టితో మెటర్నిక్ ఆస్ట్రియాలో పూర్తిగా అభివృద్ధి నిరోధక పద్ధతులు అవలంబించాడు.

### 13.6.3 మెటర్నిక్ విధానం అమలు :

మెటర్నిక్ 1815 లో నెలకొల్పిన ఐరోపా రాజ్యకూటమి (Concert of Europe) సాధనంగా ఐరోపాలో ప్రజా ఉద్యమాలను అణచివేయ ప్రయత్నించాడు. వియన్నా పరిష్కార ఫలితంగా స్పెయిన్ రాజుగా చేయబడ్డ బూర్బన్ వంశస్థుడైన ఫెర్డినాండ్, ముసుపటి రాజ్యాంగాన్ని రద్దు చేసి, ప్రజల్లో ఉదార భావాలను ఆందోళనలను అణచివేయసాగినవాడు. ప్రజలు రాజు ఆటకట్టించి రాజ్యాంగ బద్ధుని చేసారు. మెటర్నిక్ ప్రోద్బలంతో ఫ్రెంచి సేనలు స్పెయిన్ ఉదారవాదులను అణచి తిరిగి ఫెర్డినాండ్ యొక్క నిరంకుశ అధికారాన్ని పునరుద్ధరించాయి. అలాగే పొరుగు దేశమైన పోర్చుగల్‌లో కూడా ఉదారవాదులు అణచివేతకు గురైనారు.

మెటర్నిక్ సహవాసంతో, ఐరోపా రాజ్యకూటమి సభ్యునిగా రష్యా చక్రవర్తి మొదటి అలెగ్జాండర్ కూడ ఉదారవాదానికి, ప్రజా చైతన్యానికి బద్ధ శత్రువుగా పరిణమించాడు. ఫ్రాన్స్‌లో అధికారానికి వచ్చిన 18 వ లూయీ, కొంత మేరకు సనాతన, ఉదార వాదాల మధ్య తాటస్థ్యం వహించాడు. క్రీ.శ. 1820 లో రాజు మేనల్లుడు ఒక ఉదారవాదిచేత హత్యచేయబడటంతో ఉదారవాదులు తీవ్రంగా అణచివేతకు గుర్రై దారుణంగా వధింపబడ్డారు. భయకంపితులైన ఉదారవాదులు ఎన్నికలలో పోటీ చేయడానికి భయపడ్డారు. దీనితో ప్రతినిధుల సభ సనాతనుల వశమైంది. క్రీ.శ. 1824 లో సనాతనుడైన 10 వ ఛార్లెస్ రాజు అవ్వడంతో ఫ్రాన్స్ పూర్తిగా మెటర్నిక్ విధానాన్ని అమలు పరచింది. ఈ విధంగా ఐరోపా ప్రముఖ రాజ్యాలైన స్పెయిన్, రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు 1815 - 1830 సంవత్సరాల మధ్య మెటర్నిక్ విధానాన్ని అనుసరించి ఉదారవాదాన్ని, విప్లవ సిద్ధాంతాలను పూర్తిగా అణచివేశారు ఐరోపా తిరిగి సనాతన వ్యవస్థ పిడికిళ్ళతో బిగించబడింది. దీనికి మెటర్నిక్ తిరుగులేని నాయకుడు.

### 13.6.4 మెటర్నిక్ విధానానికి ప్రతిఘటన : స్పానిష్ అమెరికా తిరుగుబాటు - విజయం :

క్రీ.శ. 1808 - 1820 సంవత్సరాల మధ్య లాటిన్ అమెరికా విమోచన ఉద్యమం చెలరేగింది. అమెరికా ఖండంలోని స్పెయిన్ వలసలు తిరుగుబాటు చేసాయి. ఈ తిరుగుబాటుకు ఇంగ్లాండు తన వర్తక ప్రయోజనాల దృష్ట్యా మద్దతు నిచ్చింది. ఇందు మూలంగా ఇంగ్లాండ్ ఐరోపాబద్ధ కూటమి జోక్యాన్ని ఐరోపా ఖండంలో నిరోధించలేక పోయినా వలస రాజ్యాలలో ప్రతిఘటించింది. క్రీ.శ. 1820 నాటికి ఈ వలసలు స్వతంత్రమైనాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు మన్రో తన ప్రముఖ ప్రకటన ద్వారా 1823 లో అమెరికా ఖండంలో ఐరోపా రాజ్యాల జోక్యాన్ని సహించబోమని హెచ్చరించాడు. అందువలన, పై తిరుగుబాట్లను అణచివేయాలనుకున్న మెటర్నిక్ ఉద్దేశ్యం వమ్ముకాబడింది. మెక్సికో, కొలంబియా, అర్జెంటైనా, చిలీ వలసలు స్వతంత్రమైనాయి. ఇదే విధంగా పోర్చుగీసు వలస దేశమైన బ్రెజిల్ తిరుగుబాటు చేసి క్రీ.శ. 1822 లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొంది. తూర్పు ఐరోపాలోని ఆటోమన్ సామ్రాజ్యానికి కూడా ముప్పు వాటిల్లింది. క్రీ.శ. 1805 లో కారా జార్జి నాయకత్వంలో సెర్బియా తిరుగుబాటు చేసి బెల్‌గ్రేడ్‌లోని ముస్లిం గవర్నర్‌ను పారద్రోలింది. దీంతో సెర్బియా స్వతంత్ర రాజ్యమైంది. ఐతే ఈ తిరుగుబాటులో అన్నిటికంటే గ్రీకుల తిరుగుబాటు ఐరోపా దృష్టిని విశేషంగా ఆకట్టుకొంది. ఐరోపా దేశాల సానుభూతి రష్యా మద్దతు గ్రీసును క్రీ.శ. 1830 నాటికి స్వతంత్రం చేసాయి.

### 13.6.5 ఆస్ట్రియా - హంగరీలలో 1848 సంవత్సరం తిరుగుబాట్లు :

ఫ్రాన్స్‌కు జలుబు పడితే ఐరోపా తుమ్ముతుంది. అన్న మాటలో ఎంతో సత్యమున్నది. 1848 లో ఫ్రాన్స్‌లో మొదలైన విప్లవం మిగతా ఐరోపా రాజ్యాలకు శరవేగంతో ప్రాకి, ఆస్ట్రియా, హంగరీ, బొహిమియాల రాజకీయ భవితవ్యాన్ని తారుమారు చేసింది. ధీనితో ఐరోపా రాజకీయాల్లో మెటర్నిక్ యుగం అంతమైంది.

**ఆస్ట్రియా** : క్రీ.శ. 1948 మార్చిలో వియన్నా నగరం విద్యార్థుల శ్రామికుల అలజడులకు గురైంది. వారు రాజభవనము ముందు మెటర్నిక్ నివాసం ముందు గుమికూడారు. కాపలాకాస్తున్న రక్షక దళాలు, ఆందోళన కారులను సమర్థించి వారితో చేరిపోయాయి. దాంతో మెటర్నిక్ నివాసం వారి దాడికి గురై ధ్వంసం చేయబడింది. విషమించిన పరిస్థితిని ఆకళింపు చేసికొన్న మెటర్నిక్ తన పదవికి రాజీనామా చేసి భార్యాసమేతంగా ఇంగ్లాండ్‌కు పారిపోయాడు. ఆస్ట్రియా చక్రవర్తి విజ్ఞతతో నూతన రాజ్యాంగాన్ని ప్రకటించి, ఉదారవాదులతో కూడిన మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసాడు. ప్రజల సాంఘిక, మత, రాజకీయ హక్కులు గుర్తింపబడ్డాయి. సేద్య బానిసత్వం రద్దయింది.

**హంగరీ** : మెటర్నిక్ పరారీ, హంగరీలో 'కోస్యూత్' నాయకత్వంలో తిరుగుబాటుకు దారి తీసింది. తిరుగుబాటు చేసిన హంగరీ ప్రజలు ఎన్నో సంస్కరణలను సాధించారు. మంత్రులు శాసన సభలకు బాధ్యులైనారు. పత్రికా స్వాతంత్ర్యం ప్రకటించబడింది. జాతీయ రక్షక దళం ఏర్పాటు అయ్యింది. భూస్వామ్య వ్యవస్థ, సేద్య బానిసత్వం, ప్రభువర్గ స్వాధికారులు

(Aristocratic privileges) అయినాయి. సూక్ష్మంగా చెప్పాలంటే హంగరీ తన జాతీయ పతాకంతో ఆస్ట్రియా సామ్రాజ్యంలోనే ఉంటున్న స్వతంత్ర రాజ్యంగా వెలసింది.

**బొహిమియా** : ఆస్ట్రియా, హంగరీ దేశాల్లోని పరిణామాలు బొహిమియాలో ప్రభావాన్ని చూపాయి. ముఖ్యనగరమైన ప్రాగ్ ఉదారవాదులు ప్రత్యేక శాసన సభను, మంత్రి వర్గాన్ని, సైనిక దళాన్ని ఏర్పరచుకున్నారు. ఆస్ట్రియా చక్రవర్తి ఈ ఏర్పాట్లు అన్నింటినీ ఆమోదించాడు.

**ఇటలీ** : మెటర్నిక్ పరారీ ఇటలీలోని ఆస్ట్రియా అధీన రాజ్యాలైన మిలాన్, వెనిస్, పార్మా, మొదీనాలలో తిరుగుబాట్లు లేచినాయి. రెండు సిసిలీల రాజ్యంలో ప్రథమంగా ఈ తిరుగుబాట్లు ప్రారంభమైనాయి. రాజు ఫెర్డినాండ్ గత్యంతరం లేక ఉదార రాజ్యాంగాన్ని ప్రకటించాడు. సార్డీనియా రాజు ఛార్లెస్ ఆల్బర్ట్ ఏకంగా ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్ధ రాజరికాన్ని ప్రవేశపెట్టాడు.

క్రీ.శ. 1830లో పశ్చిమ ఐరోపాలోనూ, క్రీ.శ. 1848లో మధ్య ఐరోపాలోను, సంభవించిన పెక్కు ఉదారవాద తిరుగుబాట్లు విజయవంతమై నిరంకుశ ప్రభుత్వ వ్యవస్థలను దెబ్బతీయడంతో మెటర్నిక్ విధానాలు పరాజయం పొందాయి. అయితే ఈ ఉదారవాదం చాలావరకు నగరవాసులకు, మధ్య తరగతి ప్రజలకే పరిమితమైంది. సాంప్రదాయబద్ధమైన గ్రామీణ ప్రజలు దీనికి అంతగా ప్రభావితులు కాలేదు. అందుచేత భూస్వాములు, మతాధికారులు, ఉదారవాదాన్ని సమర్థించలేదు. నగరవాసులైన మధ్యతరగతి ప్రజలకు, కార్మికులకు మధ్య వైషమ్యాలు ఏర్పడ్డాయి. కొందరు స్వేచ్ఛను అభిలషిస్తే, మరికొందరు భద్రతే ముఖ్యమని భావించి, వాదించారు. ఈ వైషమ్యాలు ఉదారవాద ఉద్యమాన్ని క్రమంగా బలహీనపరచాయి. క్రీ.శ. 1848 జూన్‌లో బొహిమియాలో ఈ ఉద్యమాన్ని అణచివేసి సైనిక పాలన విధించబడింది. ఇటలీలో ఒక్క సార్డీనియా మినహా తక్కిన అన్ని రాజ్యాలలోనూ ఉదారవాదులు అణచివేయబడ్డారు. నిరంకుశ ప్రభుత్వాలు తిరిగి స్థాపించబడ్డాయి. ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలలో చరిత్ర పునరావృతమై స్థానికబలంతో తిరిగి రాజ్యాలను పొందారు. అంతేకాకుండా వీరు విప్లవకాలంలో ప్రకటించిన ఉదార రాజ్యాంగాలను, సంస్కరణలను రద్దుచేసారు. ఉదారవాదులు జర్మనీ రాజ్యాలను రిపబ్లిక్‌లుగా ప్రకటించాలని చివరి ప్రయత్నంగావించారు. కానీ ఈ ప్రయత్నం విఫలం కావడంతో తిరిగి ఐరోపా అంతట విప్లవ పూర్వపు రాజకీయ వ్యవస్థ నెలకొన్నది. ఉదారవాదం మరుగున పడిపోయింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. బిస్మార్క్ విధానాలను వివరించండి.
2. మొదటి విలియమ్ - బిస్మార్క్‌ల విదేశీ విధానాన్ని చర్చించండి.

**చదువదగిన గ్రంథాలు :**


1. Hayes, G.J.H. : Contemporary Europe Since 1870
2. Louis Gottashhalk and Donald Lach : Europe and the Modern World, 2 Vols.
3. Lipson, E. : Europe in the 19th and 20th Centuries


- **డా॥ వి.కె. మోహన్**

# పాఠం 14

# 1856 నుండి 1914 వరకు ప్రాచ్య సమస్య

# రష్యాలో 1917 బోల్షివిక్ విప్లవం

## 14.0 లక్ష్యం :

ప్రాచ్య సమస్య ప్రారంభము, తదనంతర పరిణామాలను గూర్చి పై అధ్యాయాల్లో తెలుసుకున్న తరువాత, ఈ సమస్య ఏ విధంగా మరింత జటిలమై మొదటి ప్రపంచయుద్ధానికి ఒక ప్రధాన కారణం అయిందో వివరించడం ఈ అధ్యాయం యొక్క లక్ష్యం. తూర్పు ఐరోపాపై అధిపత్యం కొరకు అన్ని విధాలైన ఉపాయాలతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న రష్యా తుదకు తన ఆశయ సిద్ధికొరకు ప్రత్యక్షంగా ఆస్ట్రియాతో తలపడింది. కాని మొదటి ప్రపంచయుద్ధ ప్రారంభ దశలోనే ఘోర పరాజయాలు పొందడమూ, ఆ కారణాన ప్రజలు జార్ రెండవ నికలస్ పరిపాలనను వ్యతిరేకించి విప్లవం చేయడమూ, ఈ దశలోని అత్యంత ప్రధానమైన పరిణామం.

## విషయక్రమం


14.1 పారిస్ సంధి తరువాత తూర్పు ఐరోపా

14.2 రష్యా - టర్కీ యుద్ధం (1877-78)

14.3 బెర్లిన్ కాంగ్రెసు (1878)

14.4 బల్గేరియా ఏకీకరణ (1885)

14.5 క్రీట్, ఆర్మేనియా తిరుగుబాట్లు

14.6 ఆస్ట్రియా ఆక్రమణలు : మొదటి ప్రపంచ యుద్ధం

14.7 యంగ్‌టర్క్ ఉద్యమం

14.8 బాల్కన్ యుద్ధాలు (1912 - 13) మొదటి ప్రపంచయుద్ధం

14.8.1 మొదటి బాల్కన్ యుద్ధం (1912)

14.8.2 రెండో బాల్కన్ యుద్ధం (1913)

14.9 బాల్కన్ యుద్ధాల ఫలితాలు

14.10 రష్యాలో 1917 బోల్షివిక్ విప్లవం

14.10.1 ఉపోద్ఘాతం

14.11 బోల్షివిక్ లేదా కమ్యూనిస్టు ప్రభుత్వం

14.11.1 లెనిన్ (1870 - 1924)

## 14.1 పారిస్ సంధి తరువాత తూర్పు ఐరోపా

మార్చి 30, 1856 లో జరిగిన పారిస్ సంధితో క్రిమియా యుద్ధం ముగిసింది. కాని పారిస్ సంధి నెలకొల్పిన శాంతి కేవలం తాత్కాలికమే అయింది. పారిస్ సంధి షరతుల తర్వాత కూడా అప్పటి టర్కిష్ సుల్తాన్ అయిన అబ్దుల్ అజీజ్ (1861-76) తన సామ్రాజ్యంలో ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టకుండా నిరంకుశంగానే పాలించాడు. తత్ఫలితంగా బాల్కన్ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ప్రబలింది. దీనికి తోడు రష్యా బాల్కన్ ద్వీపకల్పంలోని స్లావ్ జాతివారిని, క్రైస్తవులను సంరక్షించేది తానేననే మిషతో వారిని తిరుగుబాటు చేయడానికి పురికొల్పింది. నల్ల సముద్రంపై రష్యా ఆధిపత్యం కొనసాగితే డాన్యూబ్ నదీ ప్రాంతం కూడా రష్యా ప్రాబల్యం లోనికి వెళుతుందేమోనని ఆస్ట్రియా భీతిల్లింది. బయట ప్రపంచంతో సంబంధబాంధవ్యాలు కల్గి ఉండేందుకు ఆస్ట్రియా సామ్రాజ్యానికి డాన్యూబ్ నది తప్ప వేరే మార్గం లేదు. పైగా బాల్కన్ ప్రజల్లోని జాతీయతాభావం ఆస్ట్రియాకు వ్యాపించి, తమ ఆధీనంలో ఉన్న స్లావ్ జాతివారు స్వతంత్రులవుతారనీ, తత్ఫలితంగా ఆస్ట్రియా రాజరికవ్యవస్థ నాశనమవుతుందని ఆస్ట్రియా ఆందోళన చెందింది. అందుచేత ఆస్ట్రియా ఒకవైపు రష్యా పలుకుబడిని నిరోధిస్తూనే, మరోవైపు బాల్కన్ రాజ్యాలలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పాలనే ప్రయత్నంలో ఉంది. సుల్తాన్ నిరంకుశపాలనకు వ్యతిరేకంగా మొదటి తిరుగుబాటు చేసింది మాంటినిగ్రో. తర్వాత మాల్దేవియా, వల్లాచియాలు సంయుక్తంగా టర్కీ అధికారాన్ని ధిక్కరించి రుమేనియా అనే పేరుతో ఒక నూతన రాజ్యంగా ఆవిర్భవించాయి. రష్యా ప్రోత్సాహంతో బాల్కన్‌లలో అఖిల స్లావ్ ఉద్యమప్రభావం వృద్ధి చెందుతూ వచ్చింది.

బోస్నియా, హెర్జిగొవినాల్లోని ప్రభుత్వాల పాలనలో క్రైస్తవులకు భాగస్వామ్యం లేనందు వల్ల వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. దీనికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు 1874 లో గొప్ప కరువు సంభవించటంతో ప్రజలు నానా బాధలు పడి హెర్జిగొవినాలో తిరుగుబాటు చేశారు. వాటి జ్వాలలు బోస్నియాకు కూడా ప్రాకి టర్కీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది.

క్రమేణా ఈ తిరుగుబాట్ల ప్రభావం బల్గేరియాకు కూడా వ్యాపించి 1876 లో అక్కడి క్రైస్తవులను తిరుగుబాటుకు ప్రోత్సహించింది. అప్పుడు టర్కిష్ సుల్తాను తన సేనలనే కాక, బషి-బజూక్ అనే ఉపసైనిక దళాన్ని కూడా ఉపయోగించి అతి క్రూరంగా బల్గేరియన్ల తిరుగుబాట్లను అణచి వేశాడు. తురుష్కుల అణచివేత కార్యక్రమంలోని దారుణ మారణ కాండతో యావత్ ఐరోపా ఖండం దద్దరిల్లింది. బ్రిటన్ ప్రధాన మంత్రి డిస్రేలి టర్కీ పట్ల సానుభూతి వహించి ఈ దురంతాలు నమ్మదగ్గవి కావని చెప్పినప్పటికీ ప్రతిపక్ష నాయకుడైన గ్లాడ్‌స్టన్ టర్క్‌లను క్రైస్తవ రాష్ట్రాల నుంచి మూటాముల్లెలతో తరిమి వేయాలని ఉద్ఘాటించాడు.

## 14.2 రష్యా-టర్కీ యుద్ధం (1877-78), సాన్ స్టిఫానో సంధి :

బల్గేరియాలో జరుగుతున్న తురుష్కుల దురంతాలతో ఐరోపా అంతటా సానుభూతి కలిగిందని, ఈ సమయంలో తాను తురుష్క సామ్రాజ్యాన్ని తదముట్టించడం సులువు అనీ రష్యా భావించి తిరిగి బాల్కన్ రాజ్యాలలో జోక్యం చేసుకోవటం ప్రారంభించింది. ఐరోపా రాజ్యాలు టర్కీకి ఎట్టి పరిస్థితులలో కూడా సాయపడవని నమ్మిన రష్యా 1877 లో యుద్ధం ప్రకటించి, డాన్యూబ్ నదిని దాటి టర్కీలో ప్రవేశించింది. టర్కీ సైన్యం 'ప్లెవ్‌నా' (Plevna) యుద్ధంలో వీరోచితంగా పోరాడినప్పటికీ, రష్యా సైనికుల చేతిలో ఓటమి తప్పలేదు. విజయ గర్వంతో రష్యా సేనలు కాన్‌స్టాంట్‌నోపిల్ వైపు పురోగమించాయి. అప్పుడు గత్యంతరం లేక టర్కీ సుల్తాన్ రెండో అబ్దుల్ హమీద్ (1876-1909) 1878లో సాన్ స్టిఫానో (San Stefano) సంధి చేసుకున్నాడు.

సాన్ స్టిఫానో సంధిలోని ప్రధానాంశం సెర్బియా , మాంటినిగ్రో, రుమేనియాలను స్వతంత్ర రాజ్యాలుగా సుల్తాన్ గుర్తించడం జరిగింది. బోస్నియా, హెర్జిగోవినాలలో ఉదార సంస్కరణలు ప్రవేశ పెట్టి సక్రమంగా పాలన నిర్వహిస్తానని టర్కిష్ సుల్తాన్ వాగ్దానం చేశాడు. బాటుమ్ కార్స్‌తో పాటు డొబ్రుడ్జా ప్రాంతాలు రష్యాకు సంక్రమించాయి. వీటన్నింటి కంటే ముఖ్యమైన అంశం - విస్తృత బల్గేరియా ఏర్పడడం. డాన్యూబ్ నది నుంచి ఈజియన్ సముద్రం వరకు, అల్బేనియా ఉంచి నల్ల సముద్రం వరకు విస్తరించిన

భూభాగంలో ఈ విస్తృత బల్గేరియా లేదా పెద్ద బల్గేరియా రాజ్యం అవతరించింది. ఇది నామ మాత్రంగా సుల్తాన్ సామంతరాజ్యంగానే ఉంటుంది కాని స్వయంపాలితరాజ్యంగా గుర్తించడం జరిగింది. బాస్పరస్, డార్డనల్స్ జలసంధులలో శాంతియుతంగా వాణిజ్యం నిర్వహించడం కోసం అన్నిదేశాల వాణిజ్య నౌకలకు ప్రవేశం లభిస్తుంది. ఎఫ్) డాన్యూబ్ నది పొడవునా గతంలో నిర్మించిన కోటగోడలను టర్కీ కూల్చి వేస్తుంది.

ఈ విధంగా లోగడ పారిస్ సంధితో దెబ్బతిన్న తన పలుకుబడిని రష్యా తిరిగి సాన్ స్టిఫానో సంధితో పెంచుకోగలిగింది. అంతే గాక ఈ సంధి ఫలితంగా ఐరోపాలోని టర్కీ సామ్రాజ్యందాదాపుగా అంతరించి పోయిందని చెప్పవచ్చు. నల్ల సముద్రం రష్యా ఆధీనంలోకి పోయింది. అయితే, రష్యా సాధించుకున్న ఈ ప్రయోజనాలు ఎంతోకాలం నిలువలేదు.

## 14.3 బెర్లిన్ కాంగ్రెస్ (1878)

బాల్కన్ రాజ్యాలలో రష్యా పలుకుబడి ఏకంగా పెరిగి పోవడంతో ఇంగ్లాండ్, ఆస్ట్రియాలు ముందు ముందు తమకు ముప్పు వాటిల్ల గలదని ఆందోళన చెందాయి. ఇంగ్లండ్ భారత దేశాల మధ్య వలస మార్గం మధ్యధరా సముద్రం ద్వారా ఉండేది. ఈ మార్గాన్ని సురక్షితం చేయాలంటే రష్యా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయాలి, బాల్కన్ రాజ్యాలలోని రష్యా ప్రాబల్యం ఆస్ట్రియా ఆధిక్యతకు ప్రతిబంధకంగా తయారైంది. దీంతో ఈ రెండు రాజ్యాలు ఇంగ్లండ్, ఆస్ట్రియా సాన్‌స్టిఫానో సంధి షరతులను ఐరోపా రాజ్యాలకు నివేదించి, పునర్వ్యవస్థీకరించాలని రష్యాను కోరాయి. రష్యా అందుకు సమ్మతించలేదు. కాని యుద్ధానికి వెరచినట్లుంది. ఇంగ్లండ్ ప్రధాని డిస్రేలి ఇంగ్లీషు సేనలను మాల్టాకు బయలు దేరమని ఆజ్ఞాపించాడు. మళ్ళీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అప్పుడు ఆస్ట్రియా పక్షపాతి అయిన బిస్మార్క్ రష్యా విస్తరణను అరికట్టడం కోసం తాను గౌరవ ప్రదమైన మధ్యవర్తి గా ఉండి సంధి షరతులను పునఃపరిశీలించడం కోసం 1878 లో ఐరోపా రాజ్యాల సమావేశాన్ని బెర్లిన్‌లో ఏర్పాటు చేశారు. దీనిని బెర్లిన్ కాంగ్రెస్ (Congress of Berlin) అంటారు. రష్యా బెర్లిన్ కాంగ్రెస్‌కు హాజరు కావడమే కాకుండా అందలి తీర్మానాలను, షరతులను అంగీకరించడం అనివార్యమైంది.

బెర్లిన్ కాంగ్రెస్, సాన్‌స్టిఫానో సంధి షరతులలోని రుమేనియా. మాంటినిగ్రో, సెర్బియాల స్వాతంత్ర్యం గుర్తించింది. కాని తక్కువ అంశాల్లో చాలా వరకు తారుమారు చేసి, కొన్ని కొత్త నిర్ణయాలను చేసింది. విస్తృత బల్గేరియాను రెండు రాజ్యాలుగా (బల్గేరియా, తూర్పు రుమీలియా) విభజించింది. వీటిలో బల్గేరియా అనే భాగం సుల్తాన్‌కు కప్పం చెల్లిస్తూ స్వయంపాలితరాజ్యంగా ఉంటుంది. మరో భాగం (తూర్పు రుమీలియా) టర్కీ సుల్తాన్ ఆధిపత్యంలో క్రైస్తవ ప్రతినిధిచే స్వయంపాలన కల్గి ఉంటుంది. ఈ రెండు రాజ్యాలను భవిష్యత్తులో సమైక్య పరచకూడదు. బోస్నియా, హెర్జిగోవినాలు టర్కీ ఆధిపత్యంలో ఉన్నప్పటికీ వాటి పైన ఆస్ట్రియా పాలనాపరమైన అధికారాలు కల్గి వుంటుంది. రష్యా ఆసియా మైనరులోని కార్స్, బాటమ్, అర్ధహాన్‌లను పొందింది. మాసిడోనియా టర్కీ ఆధీనంలోకి తిరిగి వచ్చేసింది. బ్రిటన్ సైప్రస్ దీవిని పొందింది. అయితే ఇక్కడ కూడా టర్కీ సుల్తాన్ నామమాత్రపు ఆధిపత్యం ఉంటుంది.

బ్రిటీష్ ప్రధాన మంత్రి డిస్రేల్ బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయాలపై వ్యాఖ్యానిస్తూ "గౌరవ ప్రదమైన శాంతి సాధింపబడింది" అని అన్నాడు. అదే విధంగా తాను నిజాయితీ పరుడైన మధ్యవర్తిని బిస్మార్క్ తనను తాను వర్ణించుకున్నాడు. బెర్లిన్ కాంగ్రెస్ తాత్కాలికంగా గౌరవ ప్రదమైన శాంతిని సాధించడంలో కొంత మేర సఫలీకృతమైందనడంలో కొంత వాస్తవం లేక పోలేదు. కాని ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అంత గౌరవ ప్రదనమైనవి కావు. ఎలాగంటే -

ఎ) బెర్లిన్ కాంగ్రెస్ టర్కీ సామ్రాజ్య విచ్ఛిన్నతను తాత్కాలికంగా ఆపి, టర్కీలో రష్యా ప్రాబల్యాన్ని నిరోధించగలిగిందే గాని ప్రాచ్య సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొన లేక పోయింది.

బి) బాల్కన్ లో తన ప్రాబల్యం తగ్గడంతో రష్యా తన దృష్టిని భారత దేశ సరిహద్దులైన ఆఫ్ఘనిస్థాన్, టిబెట్‌లపై, చైనా ఉత్తర భూ

భాగం వైపు మళ్ళించింది. ఆ విధంగా భారతదేశం లోని బ్రిటీష్ సామ్రాజ్యానికి ముప్పు పెరిగింది. లార్డ్ శాలిస్‌బరీ పశ్చాత్తాపంతో బెర్లిన్ కాంగ్రెస్‌లో ఇంగ్లండ్ "చెడుగైన గుర్రాన్ని ఎక్కింద'ని (Backed The Wrong horse) అన్నాడు. సి) టర్కీ సామ్రాజ్యాన్ని కాపాడడమే తమ ధ్యేయమని చెప్పిన ఇంగ్లండ్, ఆస్ట్రియాలు ఈ రాజ్య భూభాగాలు కబళించడం శోచనీయం.

డి) బల్గేరియాను విభజించడం, బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా ఆధీనంలో ఉంచడం బాల్కన్ రాజ్యాల జాతీయ పిపాసను అవమాన పరచడమే.

ఇ) బెర్లిన్ సమావేశానంతరం రష్యా-జర్మనీల మధ్య వైషమ్యం పెరిగింది. రష్యాకు వ్యతిరేకంగా ఆస్ట్రియా, జర్మనీలు పరస్పరం సన్నిహితమయ్యాయి. అది ముమ్ముందు ఐరోపా రెండు సాయుధ శిబిరాలుగా ఏర్పడి మొదటి ప్రపంచ యుద్ధానికి నాంది పలికినట్లయింది.

ఎఫ్) బోస్నియా, హెర్జిగోవినా, నోవిబజార్లు, ఆస్ట్రియా ప్రాబల్యంలో ఉండడం వల్ల అవి సెర్బియాతో ఐక్యం కావడానికి సాధ్యపడలేదు. ఈ రాజ్యాలను చేర్చుకొని ఒక విశాలమైన క్రైస్తవ స్లావ్ జాతీయ రాజ్యంగా ఏర్పడాలనేది సెర్బియా చిరకాలవాంఛ. అటువంటి విశాలమైన స్లావ్ జాతీయరాజ్యం ఏర్పడడం ఆస్ట్రియాకు ఎంతమాత్రం సహించని విషయం. తన సామ్రాజ్య సరిహద్దుల్లో అటువంటి రాజ్యం. తన ఆధీనంలోని స్లావ్ జాతీయులను రెచ్చగొట్టి, ఆ రాజ్యంతో చేరిపోవడానికి దారితీస్తుందని, తన సామ్రాజ్యం విచ్ఛిన్నమవుతుందని ఆస్ట్రియా భయం. బల్గేరియా నుంచి తూర్పు రుమేలియాను విడదీయడం కేవలం తాత్కాలికంగా. ఆ రెండు రాజ్యాలు తిరిగి 1885 లో సమైక్యం కావడంతో బెర్లిన్ కాంగ్రెస్ నిర్ణయం విఫలమైంది. అటువంటి విభజన బల్గేరియా ప్రజలకు ఎంత మాత్రమూ అంగీకారయోగ్యం కాలేదు. ఇది అప్పుడు బాల్కన్ రాజ్యాల్లో వ్యాపిస్తున్న విశాల స్లావ్ జాతీయవాద (Panslavism) ప్రభావం. మాసిడోనియాలో కూడా టర్కీ పాలన ఆశాజనకంగా లేదు. పైగా సెర్బియా, గ్రీస్, బల్గేరియాలు బెర్లిన్ కాంగ్రెస్ వల్ల తమకు ఒరిగింది ఏమిలేదంటూ, తమ లక్ష్య సాధన కోసం వేచి ఉన్నాయి. వీటన్నింటి వల్ల బాల్కన్‌లలో జాతీయతాభావం మరింత పెరిగి వివిధ పరిణామాలకు దారి తీసింది. ఇవే మొదటి ప్రపంచ యుద్ధం జరగటానికి కారణమయ్యాయి. ఏ మైనా ఆచార్య టేలర్ చెప్పినట్లు బెర్లిన్ కాంగ్రెస్ ఐరోపాలో 34 సంవత్సరాల పాటు శాంతిని నెలకొల్పింది. ఆ విధంగానే హేజన్ చెప్పినట్లు టర్కీ కుదింపబడి, సుమారు 18 మిలియన్లు జనాభా కల్గిన టర్కీలో 11 మిలియన్ల మంది టర్కిష్ పాలన నుండి విముక్తి పొందారు.

## 14.4 బల్గేరియా ఏకీకరణ (1885)

బల్గేరియన్ జాతీయతకు విరుద్ధంగా బెర్లిన్ కాంగ్రెస్ బల్గేరియాను విభజించిన విషయంపైన ప్రస్తావించడం జరిగింది. జాతీయ భావ ప్రేరితులైన తూర్పు రుమీలియాలోని బల్గేరియన్‌లు తిరుగుబాటు చేసి, టర్కిష్ అధికారాన్ని నిర్మూలించి బల్గేరియాలో విలీనం కావడానికి నిర్ణయించుకున్నారు. వీరికి బిస్మార్క్ మద్దతు లభించింది. అప్పుడు తూర్పు రుమీలియాలోని టర్కీ గవర్నర్‌ను తొలిగించి అక్కడి ప్రజలు బల్గేరియా రాకుమారుడైన అలెగ్జాండర్‌ను పాలకునిగా నియమించారు. అతని ఆధ్వరంలోనే ఉత్తర దక్షిణ భాగాలు ఏకమై సమైక్య బల్గేరియా తిరిగి అవతరించింది (1885). తమ భద్రతకు ముప్పు అని ఈ విలీనీకరణను మిగతా బాల్కన్ రాజ్యాలు-ముఖ్యంగా గ్రీస్,సెర్బియాలు-ప్రతిఘటించాయి. ఈ నిర్ణయం బెర్లిన్ కాంగ్రెస్‌కు విరుద్ధమని యధాపూర్వ స్థితే కొనసాగాలని రష్యా కూడా తన నిరసనను వ్యక్తపరిచింది. ఒకప్పుడు రష్యాకు అనుకూలంగా ఉన్న బల్గేరియా ఇప్పుడు (1885లో) రష్యా విస్తరణను అరికట్టే అడ్డుగోడగా మారింది. బాల్కన్‌లో తిరిగి అశాంతి నెలకొంది.

## 14.5 క్రీట్, ఆర్మినియా తిరుగుబాటు

సుల్తాను దుష్పరిపాలనకు వ్యతిరేకంగా 1896 లో క్రీట్‌లోని గ్రీకులు తిరుగుబాటు చేశారు. అక్కడ ముస్లింలకు అల్ప సంఖ్యాకులైన క్రైస్తవులకు అంతర్యుద్ధం జరిగింది. గ్రీస్‌తో విలీనం కావాలని అక్కడి గ్రీకులు ఉద్యుక్తులయ్యారు. 1897 నాటికి అంతర్యుద్ధం ముగిసి క్రీటును గ్రీస్ పొందగలిగింది. ఆర్మినియాలోని క్రైస్తవులు కూడా తరుచుగా తిరుగుబాటు చేస్తుండేవారు. దీనిని

సహించని సుల్తాన్ 50,000 మంది ఆర్మీనియా క్రైస్తవులను హతమార్చాడు. దీనిని బట్టి జాతీయ భావం పెంపొందుతూ ఉందని తెలుస్తున్నది.

## 14.6 ఆస్ట్రియా ఆక్రమణలు : మొదటి ప్రపంచ యుద్ధము :

బెర్లిన్ కాంగ్రెస్ తీర్మానాల ప్రకారం బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా ఆధీనంలో ఉంచడమైంది. అయిత ఆస్ట్రియా ఈ రాజ్యాలను తన సామ్రాజ్యంలో **విలీనం** చేసుకోరాదని విధించడం జరిగింది. ఈ ఏర్పాటు సెర్బియాకు అమోదం కాకున్నా, ముప్పది సంవత్సరాలు సజావుగానే సాగింది. అయితే 1908 లో యువటర్కీ పార్టీ ప్రాబల్యం పొంది, టర్కీ సామ్రాజ్యంలో కొన్ని రాజకీయ పరిణామాలకు కారణమైన సందర్భంలో తిరిగి ఆసామ్రాజ్యం బలపడగలదని, బాల్కన్ ద్వీపకల్పంలో తన ఆధిపత్యానికి చెల్లు చీటి వ్రాయడం జరుగుతుందని ఆస్ట్రియా భయపడింది. ఈ పరిణామాలను అరికట్టేందుకు బెర్లిన్ కాంగ్రెస్ నిబంధనను నీళ్ళకు వదిలి, ఆస్ట్రియా-తన ఆధీనం లోని బోస్నియా, హెర్జిగోవినాలను సంపూర్ణంగా తన సామ్రాజ్యంలోఅంతర్భాగాలుగా విలీనం చేసుకొంది. ఆ రాజ్యాలను ఎప్పటికైనా కలుపుకొవాలని, విశాలమైన ఒక స్లావ్ రాజ్యంగా రూపొందాలని, కలలు కంటున్న సెర్బియాకు ఆస్ట్రియా చర్య విపరీతమైన ఆగ్రహం కల్గించింది. దీని ఫలితమే 1914 లో ఆస్ట్రియా రాకుమారుడు ఆర్చ్‌డ్యూక్ ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్, బోస్నియా పర్యటనలో హత్యకు గురికావడం.

అయితే బోస్నియా, హెర్జిగోవినా రాజ్యాలను విలీనం చేసుకోనే ముందు ఆస్ట్రియా రష్యాతో మంతనాలు జరిపి, వారి నౌకలను డార్డనల్స్. జలసంధిలోకి ప్రవేశం కల్పించడానికి అంగీకరించింది. అయితే, ఆ రాజ్యాలను విలీనం చేసుకోబోతున్న విషయాన్ని మాత్రం తమ మంతనాల్లో ప్రస్తావించలేదు. కాగా సెర్బియన్లతో సానుభూతి కలిగిన రష్యాకు ఆస్ట్రియా చర్య ఆగ్రహకారణమైంది. 1914 లో ఆర్చిడ్యూక్ హత్యానంతరం ఆస్ట్రియా సెర్బియాపై తీసుకోదలచిన చర్యలను వ్యతిరేకించి, సెర్బియానే సమర్థించింది. ఈ విధంగా ఈ ఉభయ అగ్ర రాజ్యాలు బాల్కన్ ప్రజల మనోభావాలను, కేవలం టర్కీని అదుపులో ఉంచి, తమ స్వార్థ ప్రయోజనాలను సాధించుకోనే ప్రయత్నంలో-తీవ్రంగా దెబ్బతీసాయి. అంతే కాక, ఈ రాజ్యాల విలీనం బెర్లిన్ కాంగ్రెసు నియమాలను ఉల్లంఘిస్తూ, తమ అనుమతి లేకుండ జరిగిందని బ్రిటన్, ఫ్రాన్స్‌లు కూడా ఆస్ట్రియా పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఈ పరిణామాలు మొదటి ప్రపంచయుద్ధానికి ముందు వివిధ అగ్రరాజ్యాలు ఏర్పరచుకొన్న సైనిక సంధులను, కూటములను బలపరచి. యుద్ధానికి సంపూర్ణమైన సందర్భాన్ని ఏర్పరచాయి.

## 14.7 యంగ్‌టర్క్ ఉద్యమం

టర్కిష్ సామ్రాజ్యం క్రమంగా శిథిలం కావడం సహించలేని ఉదారవాదులైన తురుష్క యువకులు ఆ సామ్రాజ్యం ఆధునికమై బలపడాలని వాంఛిస్తూ, ఒక రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఫ్రెంచి విప్లవ భావాల వలన ప్రభావితులైన, వారు టర్కీని ఆధునికం చేసి, పార్లమెంటరీ రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాలని, వైజ్ఞానికంగా, మత విషయికంగా స్వేచ్ఛఉండాలని, పత్రికలకు స్వాతంత్ర్యమివ్వాలని, వర్తకం పెంపొందించాలని, ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలతో సంబంధబాంధవ్యాలేర్పరచుకోవాలని కోరేవారు. దీనిని 'యంగ్ టర్క్ ఉద్యమ మంటారు' ఈఉద్యమానికి నాయకుడు ఎన్వర్‌బే అనే సైనికాధికారి. అప్పటి టర్కిష్ సుల్తాన్ రెండో అబ్దుల్ హమీద్ (1866-1909) ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టి, సనాతన ముస్లింల నుంచి ప్రతిఘటన ఎదురయ్యే సరికి తిరిగి వాటిని రద్దుపరచాడు. అప్పుడు యువతురుష్కులు తిరిగి సంస్కరణలు కావాలని కాన్‌స్టాంటినోపిల్ పై దాడి చేసి హమీద్‌ను పదవీచ్యితుని చేసి అతని సోదరుడైన ఐదవ మహమ్మద్‌ను (1909-1918) సుల్తాన్ చేశారు. ఎన్వర్‌బే ఆధ్వర్యంలో నూతన పరిపాలన ప్రారంభమైంది. వీరు ప్రవేశపెట్టిన సంస్కరణల్లో ప్రతి సంస్థను జాతీయం చేయడం, తురుష్కభాషను అధికారభాషగా చేయడం, తురుష్క జాతీయపాఠశాలలు నెలకొల్పడం, నిర్బంధ సైనికసేవ ప్రవేశపెట్టడం మొదలైనవి ఉన్నాయి. అయితే ఇది క్రమేపి సైనిక నియంతృత్వానికి దారి తీసింది. దీంతో బాల్కన్ లో జాతీయభావం మరింత వృద్ధి చెందింది.

## 14.8 బాల్కన్ యుద్ధాలు (1912-13), మొదటి ప్రపంచ యుద్ధం :

బాల్కన్ రాజ్యాల్లో ఆస్ట్రియా ఆక్రమణలు ఏ విధంగా మొదటి ప్రపంచ యుద్ధానికి కారణం అయిందో, వాటి పరస్పర పోరాటాలు కూడ అందుకు కొంతవరకు కారణం అయినాయి. బెర్లిన్ కాంగ్రెస్ తర్వాత బాల్కన్ రాజ్యాలు పరస్పరం అసూయ ద్వేషభావాలతో మెలగసాగాయి. తూర్పు రుమీలియా బల్గేరియాలో విలీనం కావడాన్ని సెర్బియా ప్రతిఘటించింది. తమ వాణిజ్యానికి ముప్పు అని సెర్బియా భావించడమే అందుకు కారణం. అందుచేత సెర్బియా 1885 లోనే బల్గేరియాపై యుద్ధం ప్రకటించి ఓడిపోయింది. ఆస్ట్రియా జోక్యం చేసుకవడం వల్ల రెండు దేశాల మధ్య సంధి జరిగింది.

**14.8.1 మొదటి బాల్కన్ యుద్ధం (1912) :** టర్కీ బలహీనతను అవకాశంగా తీసుకొని 1908 లో బోస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా ఆక్రమించిన సంగతి విదితమే. ఆస్ట్రియా చర్యను సెబ్బియా తీవ్రంగా వ్యతిరేకించింది. అందుకు రష్యా మద్దత్తు పొందింది. రష్యా సాయంతో సెర్బియా పోరాటానికి దిగినట్లయితే, తాను ఆస్ట్రియాకు మద్దత్తుగా పోరాటంలో దిగనున్నట్లు జర్మనీ ప్రకటించింది. దానితో రష్యా, సెర్బియా వెనుకంజ వేయక తప్పలేదు. 1912 లో బల్గేరియా స్వాతంత్రం ప్రకటించుకుంది. ఇటలీ టర్కీని ఓడించి ట్రిపోలి ఉత్తర ఆఫ్రికాని కైవసం చేసుకుంది.

మాసిడోనియాలోని క్రైస్తవుల పట్ల అనుసరిస్తున్న హింసాత్మక వైఖరిని విడనాడి వారికి వసతులు కల్పించాలని, సంస్కరణలు చేపట్టాలని బాల్కన్ రాజ్యాలు టర్కీని కోరాయి. కాని అందుకు టర్కీ అంగీకరించలేదు. అప్పుడు మాసిడోనియాను తురుష్కులను జయించి స్వాదీన పరచుకోడానికి బల్గేరియా, బాల్కన్ కూటమిగా ఏర్పడ్డాయి. మాసిడోనియా, ఆల్బేనియా దేశాలు తిరుగుబాటు చేయడంతో బాల్కన్ కూటమి రాజ్యాలు అక్టోబర్ 1912 న టర్కీపై యుద్ధం ప్రకటించాయి. బాల్కన్ కూటమి సేనలు నవంబరు 1912 నాటికి కాన్‌స్టాంట్ నోపిల్‌కు 40 కి. మీ. సమీపంలోనికి చేరాయి. టర్కీ సేనలు వీటిని ఆడ్రియానోపిల్ దగ్గర ఎదుర్కొని, పోరాడి ఘోరపరాజయం పొందాయి. అప్పుడు ఐరోపా రాజ్యాలు జోక్యం చేసుకొని ఈ యుద్ధాన్ని 1913 మే 30 న జరిగిన లండన్ సంధితో ముగించాయి. ఈ సంధి ప్రకారం టర్కిష్ సుల్తాన్ కాన్‌స్టాంట్‌నోపిల్, గాలిపోలి , మర్మారా సముద్ర ఉత్తర తీరభూమి మినహా మిగిలిన భూభాగాలన్నింటిని కోల్పోయింది. ఆల్బేనియా స్వతంత్ర రాజ్యమైంది. ఈ విధంగా టర్కీ ప్రబలమైన ఐరోపా దేశాలకు తన సువిశాల సామ్రాజ్య భాగాలను ఒక ప్రక్క కోల్పోతూ, మరొక విధంగా, సామ్రాజ్యంలో బాల్కన్ ప్రజల జాతీయ పోరాటాల్లో పరాజయం కూడా పొందుతూ ఉంది. ఇది జాతీయభావ చైతన్యం ముందు బలహీనమైన సామ్రాజ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడం.

అయితే టర్కీ అధికారం నుంచి విముక్తి పొందినప్పటికీ విశాలస్లావ్‌వాదం కంటే స్థానిక (Pan-Slavism) జాతీయవాదమే ప్రబలమై వారిలో వారికి అంతఃకలహాలు చెలరేగడంతో రెండో బాల్కన్ యుద్ధానికి దారి తీసాయి.

**14.8.2 రెండో బాల్కన్ యుద్ధం (1913) :** టర్కీని విచ్ఛిన్నంచేసిన తర్వాత బాల్కన్‌కూటమిలో విభేదాలేర్పడ్డాయి. ముఖ్యంగా మాసిడోనియా పంపకం విషయంలో ఈ రాజ్యాలలో భిన్నాభిప్రాయాలు పొడసూపాయి. ఆస్ట్రియా ఇటలీలు కలిసి ఆడ్రియాటిక్ తీర ప్రాంతంలో ఆల్బేనియా అనే నూతన స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పచటం వలన, సెర్బియాకు సముద్రమార్గాన్ని మూసివేయాలని ప్రయత్నించాయి. ఆడ్రియాటిక్ తీరం సెర్బియాకు చెందితే అందులోని అధిక సంఖ్యాకులైన స్లావ్ జాతి వారికి ప్రాముఖ్యం పెరిగి, అది రష్యా చేతిలో కీలు బొమ్మ అవుతుందని ఆస్ట్రియా కలవరపడింది. అందుకే అగ్రరాజ్యాలు 1913లో లండన్ సంధి షరతుల్లోని అంశంగా ఆల్బేనియా అనే నూతన రాజ్యాన్ని ఏర్పరచారు. అప్పుడు సెర్బియా తీరప్రాంతం తనకు లభించలేదు గనక అందుకు నష్టపరిహారంగా మాసిడోనియా తనకు చెందాలని కోరింది, ఇందుకు బల్గేరియా అంగీకరించకుండా గ్రీస్, సెర్బియాలపై ఎటువంటి హెచ్చరిక లేకుండా యుద్ధం ప్రకటించింది. అప్పుడు గ్రీస్, సెర్బియా, మాంటినిగ్రో కలిసి సమైక్యంగా బల్గేరియాను అంతం చేయడానికి నిర్ణయించుకున్నాయి. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకొని టర్కీ ఆడ్రియానోపుల్‌ను తిరిగి ఆక్రమించింది. ఈ యుద్ధంలో బల్గేరియా చిత్తుగా ఓడిపోయి బుఖారెస్ట్ సంధికి అంగీకరించింది. (ఆగస్టు 1913). ఈ సంధి ప్రకారం క్రీట్, ఈజియన్ దీవులు, మాసిడోనియాకు చెందిన సెలోనికా

ప్రాంతాలు గ్రీసుకు చెందుతాయి. బల్గేరియాకు సముద్ర ప్రాంతం దక్కింది. సెర్బియాకు, ఎలాంటి సముద్ర ప్రాంతం లభించలేదు. బోస్నియా, హెర్జిగోవినాలు ఆస్ట్రియా పాలన క్రిందనే ఉండిపోయాయి. టర్కీకి ఆడ్రియానోపిల్, బాస్పరస్, డార్డనల్స్ జలసంధులు దక్కాయి.

## 14.9 బాల్కన్ యుద్ధాల ఫలితాలు:

బాల్కన్ యుద్ధాల వల్ల టర్కీ అత్యధిక భూభాగాన్ని కోల్పోయింది. తన భూభాగంలోని 6,130,200 జనాభా నివసించే 65,350 చ.కి. మీటర్ల విస్తీర్ణం నుండి 4,239, 200 జనాభాను కోల్పోయి, కేవలం 882 చ.కి.మీటర్ల విస్తీర్ణంతో మిగిలిపోయింది. టర్కీ పొందిన నష్టం వలన గ్రీసు అత్యధిక ప్రయోజనాన్ని పొందింది. ఆదేశ జనాభా 2,66,000 నుండి 4,363,000 కు విస్తీర్ణం 25,014 చ.కి.మీటర్ల నుండి 41,933 చ.కి.మీటర్లకు పెరిగినాయి. సెర్బియా మూడు మిలియన్ల లోపు జనాభా కలిగిఉండేది. ఇప్పుడు నాలుగున్నర మిలియన్లకు, విస్తీర్ణాన్ని సుమారు రెట్టింపు చేసుకొని 18,650 చ.కి.మీటర్ల నుండి 33,871 చ.కి.మీటర్లకు వృద్ధి చెందింది. 286,000 జనాభాను, 2,687 చ.కి.మీటర్ల విస్తీర్ణం గల భూభాగాన్ని పొంది, రుమేనియా బాల్కన్ దేశాలన్నింటి కంటే పెద్దదయింది. బల్గేరియాకు 125, 490 జనాభా, 9,663 చ.కి.మీటర్ల భూభాగం మాత్రమే అదనంగా లభించింది. కాని తన భూభాగాంలోని 2,687 చ.కి.మీటర్లు విస్త్రీర్ణాన్ని రుమేనియాకు వదులుకోవలసి వచ్చింది. మాంటినిగ్రో జనాభా 250,000 నుండి 480,000 కు, విస్తీర్ణం 3,474 చ.కి. మీటర్ల నుండి 5,603 చ.కి.మీటర్లకు పెరిగినాయి. ఈ విధంగా చివరకు బాల్కన్ ద్వీపకల్పంలో టర్కీ, బల్గేరియాలు బలహీనపడ్డాయి. అందుచేత టర్కీ, జర్మనీ మద్దతును ఆశించగా, బల్గేరియా, ఆస్ట్రియా మద్దతును కోరింది. సెర్బియా ఆస్ట్రియాల మధ్య నెలకొన్న ఎడతెగని పోటీ సమసిపోలేదు. సెర్బియా బలం పెరిగింది. అందుచేత బాల్కన్‌లలో రష్యా ఒకవైపు, జర్మనీ ఆస్ట్రియాలు మరోవైపు పట్టుసాధించి తమ ప్రాబల్యం కోసం పెనుగులాడడం మొదటి ప్రపంచయుద్ధానికి దారితీసింది. 1914 లో ఆస్ట్రియా యువరాజు ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్ బోస్నియాలో పర్యటిస్తున్నప్పుడు సెరాజివో అనే చోట తన భార్యతో సహా హత్యకు గురయ్యాడు. ఇది సెర్బియా చేసిన పని అని ఆస్ట్రియా సెర్బియాపై యుద్ధం ప్రకటించింది. ఆ హత్యతో ఆరంభమైన ఘర్షణలు ఆరువారాలకు మొదటి ప్రపంచయుద్ధానికి దారితీశాయి.

## 14.10 రష్యాలో 1917 బోల్షివిక్ విప్లవం :

**14.10.1. ఉపోద్ఘాతం :** 1917 నవంబరు 7 న రష్యాలో జరిగిన బోల్షివిక్ విప్లవం మొదటి ప్రపంచయుద్ధగతిలో మార్పును తీసుకువచ్చింది. దీని ఫలితంగా ఆ దేశంలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వం 1918 మార్చి 13 న జర్మనీతో "బ్రెస్ట్‌లిటోవిస్క్" సంధి చేసుకొని యుద్ధం నుంచి వైదొలిగింది. దాని ప్రాబల్యంలో ఉన్న రుమేనియా కూడా మే 7 న అక్షరాజ్యాలతో 'బుఖారెస్ట్' సంధి చేసుకొని యుద్ధవిరమణ చేసింది.

1905 నాటికి రష్యాలో జార్ చక్రవర్తుల నిరంకుశ పాలన, ప్రజల ఆర్థికదుస్థితి పరాకాష్టకు చేరుకున్నది. రష్యాలో కల్లోల పరిస్థితులు నెలకొని విప్లవదిశగా పయనించి, సమత్వసిద్ధాంతం ప్రాతిపదికగా హక్కుల కోసం, సక్రమమైన జీవనవిధానం కోసం తిరుగుబాటు జరిపి, ప్రజాప్రభుత్వం స్థాపించాలనే ధ్యేయంతో, చక్రవర్తుల నిరంకుశపాలన నుండి విముక్తి పొందడానికి ఆ దేశప్రజలు 1917 లో ఒక విప్లవాన్ని లేవదీశారు. దీనికే బోల్షివిక్ విప్లవమనీ లేదా కమ్యూనిష్టు విప్లవమనీ పేరు. కార్మికులకు నాయకత్వం వహిసున్న బోల్షివిక్ పార్టీని అనుసరిస్తూ, రష్యాదేశంలోని పారిశ్రామిక కార్మికవర్గం ఈ విప్లవంలో ముందు నిలువగా, సాధారణ ప్రజానీకం సైతం వారిని అనుసరించింది. మొత్తం మీద ఈ విప్లవం ప్రజాసామాన్యం నియంతృత్వ జారిస్టు ప్రభుత్వాన్ని ఎదిరించి పడగొట్టిన మహోద్యమం.

ఈ విప్లవాన్ని సరైన పంథాలో నడిపి, విజయం సాధించి రష్యాప్రజలు సోషలిష్ట్ ప్రభుత్వాన్ని స్థాపించుకున్నారు. 1990 వరకు ఈ ప్రభుత్వమే రష్యాలో కొనసాగింది. ఫ్రెంచివిప్లవం వలె ఈ విప్లవం కూడా ఆధునిక చరిత్రలో పెనుమార్పులను సృష్టించింది. ఈ విప్లవం ఫలితంగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

### 14.10.2 విప్లవ కారణాలు

**14.10.2.1 జార్ చక్రవర్తుల నియంతృత్వం :-** పీటర్ ది గ్రేట్, రష్యాను ఆధునిక నాగరిక దేశంగా, కాథరిన్ ది గ్రేట్ బలిష్టమైన రాజ్యంగా తీర్చిదిద్దినప్పటికీ, రష్యా మిగతా ఐరోపా రాజ్యాల స్థాయికి ఎదగలేదు. రష్యాను పాలించిన జార్ చక్రవర్తులంతా, రెండో అలెగ్జాండర్ మినహా నిరంకుశులై ప్రజాశ్రేయస్సును, సంక్షేమాన్ని విస్మరించి చాలా క్రూరంగా పాలించారు. అధికారమంతా జార్ చక్రవర్తుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండేది. ప్రజలు ఎలాంటి హక్కులు లేకుండా జార్ నిరంకుశపాలనలో కీలుబొమ్మలుగా మిగిలిపోయారు. ఉదారవాద ఉద్యమాలు అణచివేయబడ్డాయి. ప్రజలకు భావస్వాతంత్ర్యం లేదు. వ్యక్తి స్వేచ్ఛలేదు. ఒకే చోట సమావేశం కావడానికి వీలులేదు. వార్తా పత్రికలు నిషేధించబడ్డాయి. విదేశీ ప్రచురణలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే విడుదల చేసేది. విద్యాభ్యాస నిమిత్తంగాని మరే ఇతరపనుల నిమిత్తంగాని విదేశీపర్యటనలు ప్రభుత్వానుమతి లేకుండా చేయకూడదు. అలా విదేశాలలో పర్యటిస్తే ప్రజలు పాశ్చాత్య ప్రభావానికి లోనవుతారేమోననే భయం చక్రవర్తులకు ఉండేది. ఏ వ్యక్తినైనా నిర్బంధించి, విచారణ లేకుండా శిక్షించడం జార్ ప్రభుత్వానికి అలవాటు, ఆచారం అయిపోయింది. లేదా సైబీరియాకి పంపి ప్రవాస జీవితం గడపమనే వారు. మతాచార్యులు చక్రవర్తికి లోబడి మసలుకోవాలి. పాఠశాలలు ప్రభుత్వనియంత్రణలో ఉండేవి. రష్యాలో రూసీకరణ విధానం (Russification) ప్రవేశపెట్టి, పాఠశాలల్లో రష్యన్ భాష తప్ప మిగతా వాటిని పోలిష్, లిథువేనియన్, ఫిన్నిష్, ఎస్తోనియన్ లాట్వియన్ మొదలైన భాషలను తొలగించి, వాటిస్థానే రష్యన్ భాషను, విధించడం జరిగింది. యూదులపై రకరకాల నిర్బంధాలు విధించడం వల్ల చాలా మంది రష్యా వదలిపెట్టి వెళ్ళిపోయారు. రష్యాలో ఈ నిరంకుశపాలన మొదటి నికోలస్ కాలంలో మరింత అధికమై, క్రూరపరిపాలనగా మారింది. విప్లవం కాలంలో రష్యాను రెండో నికోలస్, అతని భార్య అలెగ్జాండ్రా పాలించేవారు. ఫ్రెంచి విప్లవం కాలంనాటి 16 వ లూయీ, అతని భార్య మేరి ఆంటోని వలె వీరిరువురూ కూడా మతమూర్ఖులై అనాగరికంగా, అనాలోచితంగా ప్రవర్తించారు. వీరిద్దరూ రస్పుటిన్ అనే మూర్ఖమతగురువు ప్రభావానికిలోనై, పూర్తిగా తప్పుదారిపట్టి, ఫలితాన్ని అనుభవించారు.

**2. ఆర్థికవ్యవస్థ :-** విప్లవం నాడు రష్యా ఆర్థికవ్యవస్థ ప్రముఖంగా భూస్వామ్యపద్ధతిని అనుసరించి ఉండేది. రష్యా ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నా వ్యవసాయభివృద్ధికి ప్రభువులు తీసుకున్న చర్యలు శూన్యం. దేశజనాభాలో భూస్వాములు, సేద్యబానిసలు (Serfs) అనే రెండు వర్గాల వారు ఉండేవారు. రష్యాలోని అత్యధిక భూభాగం భూస్వాముల చేతులలోనే ఉండేది. వీరు అనేక హక్కులను అనుభవిస్తూ, పన్నుల నుండి మినహాయింపు పొందారు. ప్రభువులు పన్నులు కూడా చెల్లించేవారు కారు. సాగు చేసేవారే పన్నులు చెల్లించాలి. సేద్యబానిసలు తమ యజమానుల ఎస్టేట్లలో చాకిరీ చేసేవారు. వారికి ఎలాంటి హక్కులు లేవు. 1861 లో రెండో అలెగ్జాండర్ సేద్యబానిసవ్యవస్థను రద్దు చేసినప్పటికీ వారి పరిస్థితి మాత్రం దయనీయంగానే ఉండేది. వారు తినడానికి తిండీ, కట్టుకోవడానికి బట్టా లేక బానిసల కన్నా హీనమైన బ్రతుకు బ్రతికేవారు. వ్యవసాయదారులు పెట్టుబడి లేని కారణంగా గ్రామాలలో ఉండే కులక్స్ అనే శ్రీమంతుల వద్ద పెచ్చు వడ్డీరేటుపై అప్పులు తీసుకునేవారు. ఈ వడ్డీలు పెరిగి అసలుకన్నా ఎక్కువైపోయి వారు ఋణవిముక్తులు కావడం కష్టసాధ్యంగా ఉండేది. అందుచేత భూస్వాములు, కులక్‌ల దౌర్జన్యాలను అరికట్టడానికి రైతులు, సేద్యపుబానిసలు సమాయత్తమయ్యారు.

**14.10.2.3. పారిశ్రామికవిప్లవ ప్రభావం:** 19 వ శతాబ్దిలో పారిశ్రామిక విప్లవఫలితంగా రష్యాలో కూడా యంత్రాలను ప్రవేశపెట్టి ఫ్యాక్టరీలను స్థాపించారు. పెట్టుబడిపెట్టి పరిశ్రమలను, ఫ్యాక్టరీలను స్థాపించే పారిశ్రామికవేత్తలు బయలుదేరారు. రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. అయితే, ఈ పెట్టుబడిదారులు, పారిశ్రామిక యజమానులు అధికశాతం ఫ్రెంచివారు కాగా, రష్యన్‌లు వాటిలో కూలిపని చేసే కార్మికులైనారు. అంతేగాక జర్మనీ, ఫ్రాన్స్ దేశాల ఆర్థిక సహాయంతో ట్రాన్స్ సైబీరియన్, ట్రాన్స్ - కాకేషియన్ రైలుమార్గాల నిర్మాణం జరిగింది. దీంతో రష్యాలో కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. విప్లవం నాటికి రష్యా జనాభాలో సుమారు 1/5 వ వంతు కార్మికులు ఉండేవారు. నూతనంగా నగరాలు, పారిశ్రామికవాడలు వెలిశాయి. పెట్టుబడి దారులు అధిక లాభాలు గడించినప్పటికీ కార్మికుల స్థితిగతులు మాత్రం మెరుగుపడలేదు. వారు దుర్భరదారిద్ర్యం అనుభవిస్తూనే ఉన్నారు. ఎక్కువ పని చేయించుకుని

తక్కువ వేతనాలు చెల్లించడం, బాలకార్మికులను పనిలోకి తీసుకొని నామమాత్రపు వేతనాలు చెల్లించడం మొదలైన లోపాలు తలెత్తాయి. ఇలాంటి లోపాలను నిర్మూలించడానికి, పెట్టుబడిదారీవర్గం నుండి తమ హక్కులను పొందడం కోసం, కార్మికులు అనేక కార్మిక సంఘాలుగా ఏర్పడ్డారు. మార్క్స్ సిద్ధాంతాల ప్రాతిపదికగా 'సాంఘిక విప్లవకారులు' అనే రాజకీయ పార్టీ ఏర్పడింది. వీరి సాహసోపేతమైన కోర్కెలను విన్న అప్పటి జార్ చక్రవర్తి రెండోనికోలస్ 'అర్థంలేని పగటి కలలు' అని అవహేళన చేశాడు. దేశంలో నెలకొన్న ఆర్థికదుస్థితి, ప్రభుత్వం మొండివైఖరి వల్ల కార్మికుల కోర్కెలు, కోర్కెలుగానే మిగిలిపోయాయి.

**14.10.2.4 విద్యావేత్తల ప్రభావం:** ఇటువంటి పరిస్థితులలో మధ్యతరగతికి చెందిన కొందరు విద్యావేత్తలు రష్యా ప్రభువుల నిరంకుశత్వాన్ని, ప్రభుత్వంలో ప్రబలిన లంచగొండితనాన్ని భూస్వాముల, పెట్టబడిదారుల దోపిడీవిధానాన్ని తమ రచనల ద్వారా నిశితంగా విమర్శించి, ప్రజలదృష్టికి తెచ్చి, వారిని చైతన్యవంతులను చేశారు. అటువంటి వారిలో ముఖ్యులు టాల్‌స్టాయ్, గోర్కి, టర్గనోవ్, మయకోవస్కీ, చెకావ్‌లు. టాల్‌స్టాయ్ 1857 నుండి 1861 వరకు జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లు పర్యటించి అక్కడి శ్రామికుల స్థితిగతుల్ని నిశితంగా పరిశీలించాడు. 1828 లో వివాహం చేసుకున్న టాల్‌స్టాయ్ ఆ తర్వాత ప్రపంచ ప్రసిద్ధగ్రంథం "వార్ అండ్ పీస్" రచించాడు. జర్మనీకి చెందిన కారల్‌మార్క్స్ ఇంగ్లాండుకు చెందిన ఎంగెల్స్, సామ్యవాదభావాలను ప్రబోధించి, దానిని ఒక ఉద్యమంగా రూపొందించి, ప్రపంచ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ఆవిష్కరించారు. పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక వర్గానికి అధికారం కోసం సంఘర్షణ జరిగి తీరుతుందని చివరకు కార్మికవర్గమే విజయం సాధిస్తుందని ఉపన్యాసాల ద్వారా, రచనల ద్వారా వీరు ప్రచారం చేశారు. సమానత్వ ప్రాతిపదికగా వర్గరహితమైన సాంఘిక, ఆర్థిక వ్యవస్థను నెలకొల్పడమే ప్రముఖాంశమని వారు నొక్కి చెప్పారు. మార్క్స్ తన సిద్ధాంతాన్ని 1848 లో 'కమ్యూనిస్ట్ ప్రకటనల పత్రం' (Communist Manifesto) లో నిర్వచించాడు. ప్రపంచదేశాల కమ్యూనిస్టు సమావేశం 1866 లో జరిగింది. అనేక దేశాల ప్రతినిధులు హాజరై కమ్యూనిస్టు భావాలను ఆకళింపు చేసుకున్నారు.

మార్క్స్ సిద్ధాంతాలను అమలుపరచడానికి కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆవిర్భవించాయి. మార్క్స్ సిద్ధాంతాల ప్రభావానికి లోనైన కార్మికసంఘాలు సమ్మెలు చేయడం, నిరసన తెలపడం తమ ప్రాథమిక హక్కుగా ప్రథమ కర్తవ్యంగా భావించి ప్రారంభించాయి. అయితే ఆనాడు రష్యాలో సమ్మెచేయడమంటే మామూలు విషయం కాదు. ఆ విధంగానే గ్రామీణ ప్రాంతాలలో రైతులు కులక్‌లపై తిరగబడి చెల్లించవలసిన వడ్డీలను ఎగవేశారు.

**14.10.2.5. వివిధ రాజకీయ పక్షాల వైఖరి :** జార్ చక్రవర్తుల నిరంకుశపాలనను, భూస్వాముల దోపిడీ విధానాన్ని దుయ్యపడుతూ విజ్ఞులు చేసిన రచనలు సమాజంపై అపారమైన ప్రభావం చూపాయి. దీని ఫలితంగా వివిధ రాజకీయ పక్షాలేర్పడి ప్రభుత్వవ్యతిరేకచర్యలు చేపట్టాయి. ముఖ్యంగా టాల్‌స్టాయి, చెకోవ్ రచనల ఫలితంగా దేశంలో విధ్వంసనవాదులు (Nihilists) బయలుదేరారు. వీరే అరాచకవాదులు (Anarchists). దేశంలో నెలకొని ఉన్న వ్యవస్థ లేదా సంస్థలు ఎందుకూ పనికిరానివని, వాటిని సమూలంగా నాశనం చేయాలని వీరు ప్రచారం చేశారు. బకూనిన్ అనే అరాచకవాద రచయిత వీరిలో ప్రముఖుడు. అతడు తన రచనల ద్వారా హింసను ప్రోత్సహించాడు. వీరేగాక క్రైస్తవ సామ్యవాదులు (Christian socialists) అనే తీవ్రవాదులు సంఘసంస్కరణకు పూనుకున్నారు. ఇంకా ఉదారవాదులు (Liberals), తీవ్రవాదులు (Radicals) కొందరు డ్యూమాను సమావేశపరచాలని, నిరంకుశపాలన అంతంకావాలని ఆందోళన చేపట్టారు. 'డ్యూమా'ను సమావేశపరిచే ప్రయత్నంలో ఉండగా జార్ రెండవ అలెగ్జాండర్ 1881 లో ఈ భయంకరవాదుల చేతులలోనే ప్రాణాలు కోల్పోయాడు.

సామ్యవాదసిద్ధాంతాల చేత ప్రభావితులైన కార్మికులు, మేధావులు, వర్తకులు, రైతులు మొదలైన వారు సాంఘిక విప్లవపక్షంగా ఏర్పడ్డారు. లెనిన్ నాయకత్వంలో సామ్యవాదవిప్లవభావాలను ఇస్క్రా (Iskra నిప్పుకణం) అనే మార్క్సిస్ట్ పత్రిక ద్వారా రష్యాలో ప్రచారం అయినాయి. 1903 లో లండనులో జరిగిన సాంఘికవిప్లవపక్షం సమావేశంలో పార్టీలో క్రమశిక్షణ, పార్టీనిర్మాణం, కార్మికేతరవిప్లవకారులతో సహకరించడం మొదలైన విషయాలపై అభిప్రాయబేధాలు పొడసూపాయి. ఈ సమావేశంలోనే సాంఘిక విప్లవపక్షం మెన్షివిక్, బోల్షివిక్ అనే రెండుపక్షాలుగా చీలిపోయింది. క్రమేణా శాంతియుత మార్గాల ద్వారా, లేక పరిణామం ద్వారా

సామ్యవాదాన్ని సాధించాలని మెన్షివిక్‌లు భావించగా, బోల్షివిక్‌లు మాత్రం విప్లవం, లేక బలప్రయోగం ద్వారా సామ్యవాదాన్ని సాధించాలని భావించారు. లెనిన్ మద్దతుదారులే బోల్షివిక్‌లు. మెన్షివిక్‌లు అల్పసంఖ్యాకులు. బోల్షివిక్ అనే పదానికి అధిక సంఖ్యాకులని, మెన్షివిక్‌లంటే అల్పసంఖ్యాకులని అర్థం.

**14.10.3. విప్లవక్రమం :** జార్ నియంతృత్వ పరిపాలన, ఆర్థిక, సాంఘిక అసమానతలు, దారిద్ర్య బాధలు, తాత్త్విక సిద్ధాంతాల వలన ఏర్పడే ఉద్వేగంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలకు 1905 లో రష్యా - జపాన్ యుద్ధంలో రష్యా ఓడిపోవడం ఆగ్రహావేశాలను కల్గించింది. జార్ బలహీనత బహిర్గతమైంది. దేశవ్యాప్తంగా మహోధృతంగా సమ్మెలు జరిపి, ఆందోళనకు దిగిన కార్మికులు ఫాదర్ గాస్కన్ అనే మతాచార్యుని ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్ళి రాజభవనాన్ని ముట్టడించారు. కాని వీరినందరినీ రాజసైనికులు దారుణంగా వధించారు. ఆ రోజుకే 'బ్లడీ సండే' (Bloody Sunday) అనే పేరు వచ్చింది. ఈ రక్తపాతంతో రెచ్చిపోయిన కార్మికులు జార్ నికోలస్‌పై హత్యాయత్నం చేశారు. సైన్యంలో, నౌకాదళంలో తిరుగుబాట్లు చెలరేగాయి. గృహదహనాలు, లూటీలు నిత్యకృత్యమైపోయాయి. రెచ్చిపోయిన ఆందోళనకారులు చక్రవర్తి సోదరిని వధించారు. దీనితో భీతిల్లిన రెండో నికోలస్ డ్యూమాను సమావేశపరచడానికి అంగీకరించాడు. నాలుగుసార్లు డ్యూమా సమావేశాలు జరిగినప్పటికీ అవి ఆశించిన ప్రగతిని సాధించలేకపోయాయి. అయినప్పటికీ రెండో నికోలస్ విప్లవశక్తులను అణచే ప్రయత్నాన్ని మాత్రం మానుకోలేదు. రస్పుటిన్ అనే కపట సన్యాసి ప్రభావానికి లోనై అతడిచ్చిన చెడు సలహాలను పాటించి, అతడు డ్యుమాసభ్యులను బర్తరఫ్ చేశాడు. దీనికితోడు మొదటి ప్రపంచయుద్ధంలో రష్యాపరాజయం చెందింది. రష్యన్ సైనికులకు సరిఅయిన శిక్షణ, మందుగుండు సామాగ్రి కొరత ఏర్పడినందున, సుశిక్షితులు, సాయుధులైన జర్మన్ సైన్యాల ముందు నిలవలేక సుమారు నాలుగు మిలియన్‌ల సైనికులు యుద్ధంలో మరణించారు. ఫలితంగా రష్యాలో అరాచకత్వం మరింత పెరిగిపోయింది. ఆహారపదార్థాల కొరత ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులలో సామ్యవాద సిద్ధాంతాలకు ప్రభావితులైన సైనికులు, రక్షకదళం సైతం చక్రవర్తికి అవిధేయులై విప్లవకారులతో చేరిపోయారు.

1917 మార్చి 15 వ తేదీన విప్లవకారులు నికోలస్‌ను సింహాసనం నుండి తొలగించి ప్రిన్స్‌ల్వావ్ (Prince Lvov) నాయకత్వంలో డ్యూమా తరపున కార్యనిర్వాహకమండలిని ఏర్పరచి రిపబ్లిక్ ప్రభుత్వాన్ని స్థాపించారు

ఈ రిపబ్లిక్ ప్రభుత్వం సామ్యవాద సిద్ధాంతాలకు అనుగుణంగా ఆర్థిక సంస్కరణలు చేపట్టింది. రష్యాలోని మండలాలన్నింటిని అనేక సోవియట్‌లుగా విభజించి, వాటిని సైనికుల, కార్మికుల, కర్షకుల ఆధిపత్యంలో ఉంచడం జరిగింది. తర్వాత అంటే 1917 జులైలో ల్వావ్ రాజీనామా చేయగా, అలెగ్జాండర్ కెరన్‌స్కీ ప్రభుత్వంపై విశ్వాసం లేని బోల్షివిక్‌లు ఆ ప్రభుత్వాన్ని 'మధ్యతరగతి నియంతృత్వం'గా అభివర్ణించి పరిపాలనాధికారాలను సోవియట్ల ప్రతినిధులకు బదిలీ చేయాలని ఆందోళన చేశారు. ఈ విధంగా మళ్లీ రష్యాలో అరాచకం ప్రబలింది. ఇటువంటి పరిస్థితులలో బోల్షివిక్‌లు సోవియట్‌లనన్నింటిని హస్తగతం చేసుకున్నారు. 1917 నవంబరు 7 న "పెట్రోగ్రాడ్" లో బోల్షివిక్‌ల "అఖిల రష్యన్ సోవియట్ల ప్రతినిధుల సభ" జరిగింది. ఈ సభనే సర్వాధికారాలు గల శాసననిర్మాణసంస్థగా పరిగణించారు. ఈ సభ బోల్షివిక్ విప్లవానికి చట్టబద్ధ గుర్తింపునిచ్చి డ్యుమాను కెరెన్స్కీ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాన్ని రద్దుచేసి, నూతన ప్రభుత్వాన్ని ఏర్పరచమని లెనిన్‌ను ఆదేశించింది. లెనిన్ అధ్యక్షతన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఇందులోని సభ్యులను 'ప్రజాకమిస్సారులు' (People's commissors) అనేవారు. దీనితో రష్యాలో బోల్షివిక్ పరిపాలన ప్రారంభమైంది. 1918 నాటికి ఇది దేశమంతటినీ తన అదుపులోకి తెచ్చుకోగలిగింది. దీనినే బోల్షివిక్ విప్లవమని, నవంబరు విప్లవమని, కమ్యూనిస్టు విప్లవమని అంటారు.

నవంబరు విప్లవంతో రిపబ్లిక్ అదృశ్యమై లెనిన్ నాయకత్వంలో కార్మికనియంతృత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం జర్మనీతో మార్చి 1918 లో బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధిచేసుకొని జర్మన్ సేనలను రష్యా నుంచి ఉపసంహరించుకుంది. తమ ప్రథమ కర్తవ్యం రష్యా పునర్నిర్మాణమని లెనిన్ ప్రకటించాడు. 1917 లో ఏర్పడిన బోల్షివిక్ లేదా కమ్యూనిస్టు ప్రభుత్వం ఐరోపా చరిత్రలోనే గాక ప్రపంచ చరిత్రలోనే అద్వితీయమైన ఘట్టం. విప్లవశక్తుల ధాటిముందు పాతకాలపు రాజరికనిరంకుశత్వం ఆగలేకపోయింది. ప్రభుత్వం ప్రజలపరమైంది. చారిత్రాత్మకమైన ఈ సంఘటన 1917 వ సంవత్సరం నవంబరు ఆరో తేదీన జరిగింది. ఈ విప్లవ ఫలితాలు

ష్యాకు పరిమితంకాక, అచిరకాలంలోనే ప్రపంచ వ్యాప్తమయ్యే సూచనలు కానవచ్చాయి. పట్టణాలలోని పారిశ్రామిక కార్మకవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు చేయడాన, ఆ వ్యవస్థపై ఆధారపడి అభివృద్ధి చెందిన పశ్చిమ ఐరోపా దేశాలకు, అభివృద్ధి చెందుతున్న మెరికా సంయుక్తరాష్ట్రాలకు ఈ విప్లవం తీవ్ర ఆందోళన కల్గించింది. దీనిని ఉదాహరణగా తమ దేశాల్లో సైతం కార్మిక విప్లవాలు లరేగితే, ప్రజాస్వామ్య వ్యవస్థకు మనుగడ ఉండదని వారు భావించారు. ఈ విప్లవం శ్రమజీవుల ఆశాజ్యోతియై 'శ్రమించే వానిదే రాజ్యం' అనే నినాదంతో నూతన శకానికి నాంది పలికింది.

## 14.11 రష్యాలో బోల్షివిక్ లేదా కమ్యూనిస్ట్ ప్రభుత్వం

ఎట్టకేలకు 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' సృష్టికర్తలయిన మార్క్స్, ఏంగెల్స్‌లు 50 సంవత్సరాలుగా కన్నకలలు నిజమై ప్రపంచంలో మదటిసారిగా రష్యాలో కార్మికరాజ్యం ఆవిర్భవించింది. వర్గపోరాటం ద్వారానే ఇది సాధ్యమౌతుందన్న వారి వాదన నిజమైంది. కాని ార్మికవర్గం పరిపాలనాధికారాన్ని పొందడంవల్ల వర్గనిర్మూలన జరుగుతుందన్న వారి సిద్ధాంతం కేవలం భ్రమ అని చరిత్ర నిరూపించింది. మనిషి స్వతహాగా సంఘజీవే, సామ్రాజ్యవాదుల వల్లే స్వార్థపరత్వం పెచ్చుమీరి దోపిడీ మనస్తత్వం ప్రబలి హెచ్చుతగ్గుల సమాజం ఏర్పడుతుందని ఈ మేధావులు వాదించేవారు. శాస్త్రీయమైన పోరాటాల ద్వారా ఈ హెచ్చుతగ్గులను నిర్మూలించి సమసమాజాన్ని స్థాపించవచ్చని వీరు సిద్ధాంతీకరించారు. ఈ సిద్ధాంతాలు కార్యరూపం దాల్చి సోవియట్ యూనియన్ ఆవిర్భవించింది. కమ్యూనిస్టు రాజ్యంలో ప్రజలంతా సమానమే. ప్రజల అవసరాలను ప్రభుత్వమే తీరుస్తుంది. పార్టీదే పెత్తనం. ఈ సిద్ధాంత ప్రభంజనం - రోపాదేశాలలోని అనేకమంది మేధావులను ప్రభావితం చేసింది. కమ్యూనిస్టు విప్లవజ్వాలలు విశ్వమంతటా అల్లుకోవడం ప్రారంభించాయి.

**14.11.1 లెనిన్ (1870 - 1924) :** ఆచరణలో మార్క్సిజం సిద్ధాంతాలను కట్టుదిట్టంగా అమలుపరిచిన ఖ్యాతి లెనిన్‌కు దక్కుతుంది. ెనిన్ ప్రజాసేవ పట్ల అంకిత భావంతో నిండుస్ఫూర్తితో సోవియట్ యూనియన్‌ను ప్రగతిపథం వైపు నడిపించాడు.

లెనిన్ అసలు పేరు వ్లాడిమిర్ ఇలిల్యులిచ్ ఉల్యనోవ్. ఆత్మరక్షణార్థం, పోలీసులనుండి తప్పించుకొనడానికి ఎన్. లెనిన్ అని పేరు మార్చుకున్నాడు. 1870 ఏప్రిల్ 22 వ తేదీన వోల్గానది ఒడ్డున ఉన్న ఒకప్పటి సింబర్క్స్, ఇప్పటి ఇల్యనోవ్స్క్, అనేచోట ఆరుగురి సంతానంలో మూడవ సంతానంగా జన్మించాడు. 1887 లో కజన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. పదిహేడేళ్ళ వయస్సులోనే 1887 నవంబరులో ఒక విద్యార్థిప్రదర్శనకు నాయకత్వం వహించినందుకు అరెస్టయ్యాడు. దీనితో అతణ్ణి ఆ విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించారు. అయినప్పటికీ నిరాశచెందకుండా 1819 లో సెయింట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుంచి ప్రయివేటుగా చదివి లా డిగ్రీ పొందాడు.

తర్వాత 1895 లో లెనిన్ యూరోపియన్ సోషలిజం అవగాహన చేసుకునేందుకై ఐరోపాదేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తిరిగి స్వదేశానికి వచ్చి కార్మికవర్గాన్ని విముక్తిచేయడం కోసం పోరాటసమితిని (Union for the struggle for the liberation of the working class) స్థాపించాడు. అప్పుడు మళ్ళీ ప్రభుత్వం అతణ్ణి అరెస్ట్ చేసింది. 14 నెలల జైలుశిక్ష అనంతరం అతణ్ణి సైబీరియాకు ప్రవాసం పంపడం జరిగింది. సైబీరియాలో ప్రవాసం గడుపుతుండగానే 1896 జులైలో క్రుప్స్కాయా అనే యువతిని వివాహమాడాడు. పూర్తిగా లెనిన్ భావాలకు దగ్గరగా ఉండే ఆమె అనువైన గృహిణిగా, విప్లవకార్యకర్తగా చేదోడువాదోడుగా ఉండేది. ఈ ప్రవాస జీవితంలోనే "రష్యాలో పెట్టుబడిదారీ విధానం - వ్యాప్తి" (The Develpment of Capitalism in Russia) అనే గ్రంథాన్ని రచించాడు.

లెనిన్ 1900 నుంచి 1917 వరకు ఎంతో శ్రమించి పోలెండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, సైబీరియా మొదలైన దేశాలు పర్యటించి, అక్కడ తలదాచుకుంటున్న బోల్షివిక్‌లను విప్లవానికి సమాయత్తం చేశాడు. విదేశాల్లో ఉంటూనే ఇస్క్రా (నిప్పురవ్వ) అనే పత్రికను నిర్వహిస్తూ దాని ప్రతులను రష్యా ప్రజలకు అందేటట్లు ఏర్పాటు చేశాడు. రష్యా విప్లవం ఆరంభంనాడు (మార్చి 1917) లెనిన్ స్విట్జర్లాండ్‌లో ఉన్నాడు. ఎలాగో నానా ఇబ్బందులుపడి కొందరు జర్మన్ మిత్రుల సాయంతో రైలుపెట్టెలో దాక్కొని తిరిగి రష్యాకు చేరుకున్నాడు.

కెరెన్స్కీ నాయకత్వంలోని తాత్కాలిక రష్యా ప్రభుత్వం లెనిన్ అరెస్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. అరెస్టు తప్పదని తెలుసుకున్న లెనిన్ తిరిగి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. అవసరమైన బలాన్ని సమకూర్చుకుని, ప్రజల మద్దతుతో కెరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలద్రోసి, నూతన సోవియట్ ప్రభుత్వాన్ని స్థాపించాడు.

**14.11.2 రష్యాపునర్వ్యవస్థీకరణ :** లెనిన్ అధ్యక్షతలో ఏర్పడిన నూతన సోవియట్ ప్రభుత్వం ఎదుర్కోనవలసి వచ్చిన సమస్యలు ముఖ్యమైనవి రెండు. ఒకటి విదేశీ శత్రువులను ఎదుర్కోవడం. రెండు ఆంతరంగికంగా సామ్యవాద సిద్ధాంతాల కనుగుణంగా రష్యాను పునర్వ్యవస్థీకరించడం.

విదేశీ, స్వదేశీశక్తుల నుండి విప్లవాన్ని పరిరక్షించడం కోసం, విప్లవ వ్యతిరేకశక్తులను ఏరివేయడం కోసం 'చెకా' అనే రహస్య పోలీసుశాఖను ఏర్పరచడం జరిగింది. దీనినే 'ఆగ్‌పూ' అనేవారు. విప్లవభావ ప్రేరితులైన రష్యా ప్రజలతో 'ఎర్రసైన్యాన్ని' (రెడ్ ఆర్మి) తయారుచేశాడు. ఈ కృషిలో అతని యుద్ధమంత్రి ట్రాట్స్కీ అతనికి తోడ్పడ్డాడు. శత్రువుల సైన్యాన్ని "శ్వేతసైన్య"మని పిలిచేవారు. 1918 లో జర్మనీతో బ్రెస్ట్‌లిటావిస్క్ సంధి చేసుకుని తన భూభాగంలో కొంత జర్మనీపరం చేసి యుద్ధం నుంచి విరమించుకుని తద్వారా శాంతి నెలకొల్పాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం రష్యా తన భూభాగాన్ని తిరిగి జర్మనీ నుంచి కైవసం చేసుకోగలిగింది.

1918 జులైలో చెకా సహాయంతో లెనిన్ నాయకత్వంలోని ఎర్రసైన్యం జార్‌చక్రవర్తి రెండోనికోలస్‌ని అతని కుటుంబాన్ని యూరల్ పర్వతశ్రేణుల అవతలికి తీసుకొనిపోయి దారుణంగా హత్యచేశారు. పోలెండ్ సేనలు యుక్రెయిన్‌పై దాడిచేయగా, వాటిని లెనిన్ ప్రభుత్వం ఎదుర్కొని తరిమివేసింది. చివరకు 1920 లో 'రీగా' సంధితో సరిహద్దు విషయమై రష్యా, పోలెండ్‌ల మధ్య సమాధానం కుదిరింది. పారిస్ శాంతి షరతులను అనుసరించి రష్యా పోలెండ్, ఫిన్లెండ్, లాట్వియా, ఎస్తోనియా, ఉక్రయిన్‌లపై తనకు గల హక్కులను వదులుకుంది.

రష్యాను పునర్వ్యవస్థీకరించడంలో లెనిన్‌కు ముఖ్యంగా ఇద్దరు నాయకులు - ట్రాట్స్కీ, జోసఫ్ స్టాలిన్ - కుడి, ఎడమ భుజాల వలె తోడ్పడ్డారు. ట్రాట్స్కీ దక్షిణరష్యాలోని సంపన్న యూదుకుటుంబంలో 1879 జూన్ 16 న జన్మించాడు. విప్లవ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నాడన్న ఆరోపణ మీద బుడెస్సా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరించబడ్డ ట్రాట్స్కీ అనేక సంవత్సరాల పాటు సైబీరియా కారాగారంలో దారుణమైన జీవితాన్ని గడిపాడు. అరెస్టు అయినప్పుడల్లా అక్కడినుంచి తప్పించుకొని విదేశాలకు చేరుకుని అక్కడి నుండి విప్లవప్రచారాన్ని నిర్వహించేవాడు. 1917 లో జార్ ప్రభుత్వపతనం తర్వాత రష్యాకు తిరిగి వచ్చి పెట్రోగాడ్ సోవియట్‌కు అధ్యక్షుడయ్యాడు. ట్రాట్స్కీ అంటే లెనిన్‌కు ఎంతో అభిమానం. ఆయన ప్రభుత్వంలో యుద్ధమంత్రి పదవి నిర్వహించాడు. ట్రాట్స్కీ అంతర్యుద్ధంలో 'రెడ్‌ఆర్మీ' ని స్థాపించి బోల్షివిక్ పార్టీ విజయం సాధించడంలో అద్వితీయమైన పాత్ర వహించాడు. లెనిన్ జీవించి ఉండగానే స్టాలిన్‌తో ఘర్షణకు దిగిన ట్రాట్స్కీని లెనిన్ మరణానంతరం రష్యా నుండి, పార్టీనుండి బహిష్కరించడంలో స్టాలిన్ విజయుడయ్యాడు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కృషి చేసే తరుణంలో స్టాలిన్ అనుయాయులు చేత 1940 లో ట్రాట్స్కీ మెక్సికోలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

లెనిన్ తర్వాత స్టాలిన్ అధికారంలోకి వచ్చాడు. జోసఫ్ స్టాలిన్ జార్జియాలో ఒక చర్మకారకుటుంబంలో జన్మించాడు. అతడు సిద్ధాతాలతో రాద్ధాంతాలతో సతమతమయ్యే వ్యక్తి కాదు, మాటకారి కూడ కాదు. కార్యవాది, ఖడ్గవాది. స్టాలిన్ అంటే ఉక్కుమనిషి అని అర్థం. లెనిన్ మరణానంతరం ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. రాజ్యాంగనిర్మాణవిషయంలో ఈ భేదాభిప్రాయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. కమ్యూనిస్టు విధానాలను ప్రపంచమంతటా ఒకేసారి వ్యాప్తి చేయాలని స్టాలిన్ వాదన. వీరిద్దరి మధ్య చెలరేగిన ఈ వివాదాలు 1927 దాకా కొనసాగుతూనే ఉన్నాయి. చివరకు అధికారం కోసం పెనుగులాట జరిగి అందులో స్టాలిన్ విజయం పొంది అధికారం హస్తగతం చేసుకున్నాడు. ట్రాట్స్కీని పార్టీ నుండి బహిష్కరించి దేశం నుండి వెళ్ళగొట్టి, చివరకు 1940 లో మెక్సికోలో అతనిని చంపించాడు.

**14.11.3. యు.ఎస్.ఎస్.ఆర్.** : 1922 డిసెంబరు 30 న జోసెఫ్ స్టాలిన్ ఆధ్వర్యంలో సోవియట్ యూనియన్ ఏర్పడింది. ఆ సమయంలో శంలోని దుర్భరమైన పరిస్థితులను స్టాలిన్ ఇలా వర్ణించాడు. "పొలాలు నిరర్థకంగా ఉన్నాయి. ఫ్యాక్టరీలు పనిచేయడం లేదు. ఉత్పత్తి శక్తులు నిర్వీర్యమయ్యాయి. ఆర్థికవనరులు తరిగిపోయాయి. ఇదంతా రిపబ్లిక్‌లు విడివిడిగా ఉండడం వల్ల, పునర్నిర్మాణ కృషిలో సమన్వయం లేకపోవడం వల్ల జరిగింది." అటువంటి పరిస్థితుల్లో రష్యాలో తన పాలనా సామర్థ్యంతో ఆర్థికప్రగతిని సాధించి, వర్ధమానదేశంగా అంతర్జాతీయరంగంలో, ప్రపంచంలో అగ్రరాజ్యంగా రూపొందేటట్లు చేశాడు.

లెనిన్ రూపొందించిన నూతన రాజ్యాంగం 1918లో అమలులోకి వచ్చి, 1923, 1936 లలో సవరణలను పొందింది. ఈ రాజ్యాంగం ప్రకారం వివిధజాతుల సమ్మిళితమైన రష్యాలో సమారస్యాన్ని నెలకొల్పడానికి ఒక్కొక్క జాతిని ఒక్కొక్క రిపబ్లిక్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రిపబ్లిక్‌నే సోవియట్ అంటారు. ఈ సోవియట్‌లు సోషలిస్ట్ సిద్ధాంతం ప్రకారం ఏర్పడ్డాయి. కాబట్టి "రష్యా సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ సమాఖ్య" (యు.ఎస్.ఎస్.ఆర్.) అయింది. దేశంలో కమ్యూనిస్టుపార్టీ తప్ప మరే ఇతర రాజకీయపార్టీ ఉండకూడదు. వార్తా పత్రికలు, విద్యా సంస్థలు, రేడియోలు, సినిమాలు పార్టీపరమై ప్రభుత్వ ప్రచార సాధనాలుగా మారిపోయాయి. కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపనలో - మంది సభ్యులతో కూడిన 'పొలిట్‌బ్యూరో' అనే ఉన్నతాధికార సంఘం పార్టీ విధానాలను రూపొందించి ప్రభుత్వంచేత అమలు చేయిస్తుంది. ఈ పద్ధతిలో పార్టీ, ప్రభుత్వం ఒకే విధానంలో నడుస్తుంది. అందుచేత రష్యాలోని ప్రభుత్వం సామ్యవాదము, లేక సోషలిస్టు ప్రాతిపదికపై నెలకొల్పబడిందని చెప్పుకున్నా. అది వాస్తవంగా "కమ్యూనిస్టు నియంతృత్వమే."

సాంఘిక, ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించడానికి లెనిన్ అనేక చర్యలు తీసుకున్నాడు. ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా భూస్వాముల నుంచి మతవ్యవస్థ నుండి భూములను స్వాధీనం చేసుకుని రైతులకు పంచిపెట్టాడు. పరిశ్రమలను హస్తగతం చేసుకుని కార్మికులవశం చేశాడు. మొత్తం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ రష్యాలో విచ్ఛిన్నమైపోయింది. అయితే ఈ సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా లెనిన్ అంతరంగికంగా తీవ్రప్రతిఘటనలు ఎదుర్కోవలసి వచ్చింది. భూములు కోల్పోయిన భూస్వాములు, పరిశ్రమలను వాణిజ్యాన్ని ఆస్తులను కోల్పోయిన పెట్టుబడి దారులూ ఏకమై బోల్షివిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపారు. వారి సైన్యాలకు ఆ వర్గాలకు చెందిన రాంజల్, డెనికిన్, కోల్చాక్ వంటి సైనికాధికారులు నాయకత్వం వహించారు. తమ పెట్టుబడులను జాతీయం చేసినందుకు, జర్మనీతో ఏకపక్షంగా సంధి చేసుకున్నందుకు ఆగ్రహించిన బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, అమెరికాలు కూడా తిరుగుబాటుదార్లతో చేతులు కలిపి రష్యాపై అప్రకటిత యుద్ధం ప్రారంభించాయి. బోల్షివిక్ ప్రభుత్వం సమీకరించిన ఎర్రసైన్యం కార్మికుల, రైతుల తోడ్పాటుతో 1920 నాటికి ఈ స్వదేశీ, విదేశీ శత్రువులను ఓడించగలిగింది. ఓటమి చవిచూసిన శ్వేతరష్యన్లు విదేశాలకు పారిపోయారు. శ్రామికజీవులకు ఆర్థిక, ...తిక సౌఖ్యాలను కలుగజేయడమే కమ్యూనిస్టు నియంతృత్వ ప్రభుత్వకర్తవ్యమని లెనిన్ ఉద్ఘాటించాడు. మార్క్స్ ఆశయాలను నెరవేర్చడమే ...న ముఖ్యకర్తవ్యమని చాటాడు.

సొంత ఆస్థిని సమూలంగా రద్దు చేయడం జరిగింది. పరిశ్రమలు ప్రభుత్వపరమయ్యాయి. ప్రభుత్వమే పరిశ్రమలకు కావలసిన ...ాలధనమిచ్చి నిర్వహించేటట్లు ఏర్పాటు జరిగింది. వస్తు వినిమయ పద్ధతి ద్వారా ప్రభుత్వమే వర్తకం సాగిస్తుంది. కాని ఈ జాతీయాకరణ ...ానాల వల్ల ఉత్పత్తులు తగ్గిపోయాయి. పైగా దేశాన్ని పీడిస్తున్న కరువుకాటకాలు అంతంకాలేదు. దాదాపు లక్షకుపైగా ప్రజలు ...మానికి బలి అయ్యారు. వ్యవసాయరంగంపై సరైన నియంత్రణ లేక ఆహారపదార్థాల ఉత్పత్తి పడిపోయింది. అదే విధంగా పరిశ్రమల ...హణకు నియమితులైన కార్మికులకు నైపుణ్యం, అనుభవం లేనందువలన పారిశ్రామిక ఉత్పత్తులు కూడా తగ్గిపోయాయి. ...ట్టుబడిదారీ దేశాలు విధించిన ఆర్థిక దిగ్బంధంవలన పరిస్థితి మరింత విషమించింది. అందుచేత లెనిన్ ప్రభుత్వం 1921లో "నూతన ...ర్థిక విధానాన్ని" చేపట్టింది. ఈ విధానం ప్రకారం తాత్కాలికంగా భూమిపై రైతు ఆధిపత్యాన్ని నెలకొల్పారు. దీనితో రైతు వ్యవసాయంపట్ల ...ద్ధ వహించి ఉత్పత్తిని పెంచాడు. అదే విధంగా కొన్ని చిన్న పరిశ్రమలను తాత్కాలికంగా వ్యక్తిరంగానికి బదిలీచేసి వాటి అభివృద్ధికి ...హకార సంస్థలను ఈ నిపుణులచేత కార్మికులకు శిక్షణ ఇప్పించారు. వాణిజ్యరంగంలో కూడా టోకు వ్యాపారాన్ని ప్రభుత్వరంగంలోనే ... చిల్లర వర్తకాన్ని వ్యక్తిగత రంగానికి బదిలీ చేశారు. విదేశీవాణిజ్యం పై ప్రభుత్వాలు విధించిన ఆర్థిక దిగ్బంధం సడలిపోయింది. ...వ్యావర్తకంతో లాభం పొందిన పాశ్చాత్య దేశాలు క్రమక్రమంగా బోల్షివిక్ ప్రభుత్వాన్ని గుర్తించడం ప్రారంభించాయి. దీనితో రష్యా

రాజకీయ ఏకాంతవాసం కూడా అంతమైంది.

జార్‌చక్రవర్తుల పాలనలో ఆక్రమించిన ఉక్రెయిన్, బైలోరష్యా, జార్జియా, అజర్‌బైజాన్, కుర్దిస్తాన్, ఆర్మేనియా, కజక్‌స్తాన్, తుర్క్‌మెనిస్తాన్, కిర్గిస్తాన్‌లకు కూడా బోల్షివిక్ ప్రభుత్వం స్వతంత్రమిచ్చింది. అవి స్వతంత్ర రిపబ్లిక్‌లను ఏర్పరచుకున్నాయి. కాని అంతర్యుద్ధ కాలంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు వాటి మద్దతుగల టర్కీ, ఇరాక్, ఇరాన్‌లు వాటిపై దాడులు చేశాయి. కుర్దిస్తాన్ వాటికి బలిఅయిపోయింది. ఇక స్వతంత్ర్యంగా ఉంటే తమకు రక్షణలేదనే భయంతో మిగిలిన రిపబ్లిక్‌లు రష్యాతోనే ఉండడానికి నిశ్చయించుకున్నాయి. దీని ఫలితంగా 1924 లో తయారైన రాజ్యాంగం ఈ రిపబ్లిక్‌లన్నీ గల దేశాన్ని "యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్" (U.S.S.R) గా ప్రకటించింది. ఈ విధంగా బోల్షివిక్ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసి లెనిన్ 1924 జనవరి 21 వ తేదీన మాస్కో సమీపాన ఉన్న గోర్కి అనే చోట మరణించాడు. అతడు నాటికీ, నేటికీ కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాలలో పరమపూజ్యుడుగా ఎంచబడుతున్నాడు.

స్టాలిన్ పంచవర్ష ప్రణాళికల ద్వారా రష్యాలోని పారిశ్రామికాభివృద్ధిని అనూహ్యామైన రీతిలో సాధించాడు. బొగ్గు, ఇనుము, పెట్రోలియం, పరిశ్రమలు, ఉక్కు ఫ్యాక్టరీలు, యంత్రాలు, ట్రాక్టర్లు, విద్యుచ్ఛక్తి అభివృద్ధికి కృషి చేశాడు. భూములన్నింటిని సుమారు రెండులక్షల సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా విభజించాడు. రష్యాలో నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్యావిధానం, కమ్యూనిస్టు విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విద్యావిధానం ప్రకారం పాఠ్యాంశాలన్నీ కమ్యూనిస్టు సిద్ధాంతబద్ధమైనవి. శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి అద్వితీయమైంది.

స్టాలిన్ పరిపాలనలోని సోవియట్ యూనియన్ 1936 లో నూతన రాజాంగ్యం రూపొందించుకొంది. ఈ రాజ్యాంగం ప్రకారం రష్యాలో కార్మికుల, కర్షకుల సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడింది. ఈ సోషలిస్టు ప్రభుత్వానికి పునాది శ్రమజీవుల సోవియట్‌లు(Soviets of Toilers) స్థానికంగా నగరాలలో, గ్రామలలో సోవియట్ల స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ ఉంది. దీనిని యు.ఎస్.ఎస్.ఆర్. సమాఖ్య రాజ్యమని (Federal state) చెప్పవచ్చు. వీరి శాసనసభను సుప్రీంసోవియట్ అంటారు. ఇందులో ప్రధానమంత్రి ఉంటాడు. వాస్తవానికి రష్యాలో ఈ ప్రధానే సర్వాధికారి, నియంత. రాజధానిలో జరిగే సోవియట్ మహాసభలకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి, ప్రాంతీయ సోవియట్ల చే ఎన్నుకోబడిన ప్రతినిధులు హాజరవుతారు. ఈ సమావేశాల్లో మంత్రులను(Commissars) ఎన్నుకుంటారు. 1936 లో నూతన రాజ్యాంగాన్ని ప్రవేశపెడతూ స్టాలిన్ "సోవియట్ యూనియన్ సోషలిజమ్‌ను సాధించింది. ఇది కమ్యూనిజానికి తొలిమెట్టు మాత్రమే" అని చెప్పాడు. సోవియట్ రాజ్యాంగంలో నేటి ప్రజాస్వామ్య సూత్రాలన్నీ పేర్కొనబడినందున "సోవియట్ ప్రజాస్వామ్యమే నిజమైన ప్రజాస్వామ్యమ"ని స్టాలిన్ ఉద్ఘాటించాడు. ప్రభుత్వం అనుమతి పొందిన పార్టీ కమ్యూనిస్టు పార్టియే. రాజ్యంగమనే యంత్రానికి ఈ పార్టీ ఇంజను వంటిది. పార్టీ సభ్యత్వం కూడా పరిమితికి మించి ఇచ్చేవారు కాదు. 1939 లో రష్యా జనాభా 17 కోట్లలో 25 లక్షలమందికి మాత్రమే పార్టీలో సభ్యత్వం ఇవ్వడం జరిగింది. సభ్యత్వం పొందిన వారంతా మార్క్స్ సిద్ధాంతాలను లెనిన్, స్టాలిన్ భాష్యీకరించినట్లు అంగీకరించాలి. దేశంలో అప్పుడప్పుడూ తలెత్తుతున్న ప్రజాస్వామ్యభావనలను కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ అణచివేసేది. స్టాలిన్ హయాంలో రెండో అభిప్రాయానికి తావు లేకుండా అతి కఠినంగా వ్యవహరించడం జరిగింది. సోవియట్ యూనియన్‌లో పార్టియే ఆర్థిక, సామాజిక రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకుంటూ అవి అమలు జరిగేలా చూస్తూ ఉండేది.

**14.11.4 విదేశాంగ విధానం :** 1921 లో బ్రిటన్‌తోను, 1922 లో జర్మనీతో రష్యా వర్తక సంధులు చేసుకుంది. 1924 లో ఇటలీ, 1933 లో అమెరికా ఫ్రాన్స్‌లు రష్యాలోని నూతన ప్రభుత్వాన్ని గుర్తించాయి. వర్తక సంబంధాలు ఏర్పరచుకున్నాయి. 1934 లో రష్యా నానాజాతి సమితిలో సభ్యత్వం పొందింది. ముఖ్యంగా జర్మనీ దాడులను నిరోధించడానికి రష్యా ఆత్మరక్షణార్థం తన ఇరుగుపొరుగు రాజ్యాలతో సత్సంబంధాలను నెలకొల్పుకుంది. ఫ్రాన్స్‌తో స్నేహపూర్వకమైన సంబంధాలను ఏర్పరచుకుంది. 1939 లో జర్మనీలో నాజీ ప్రభుత్వంతో దురాక్రమణలను నిలువరించే విధంగా సంధి చేసుకుంది. దూర ప్రాచ్యంలోని మంచూరియాను జపాన్ ఆక్రమించినప్పుడు

దూర ప్రాచ్యంలో రష్యా కొంత సైన్యాన్ని నిలిపింది. రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా జర్మనీని స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో ఓడించింది. కాని ఈ యుద్ధంలో రష్యా సైన్యం అపారంగా వీరస్వర్గమలంకరించింది. 1943 లో సాన్ ఫ్రాన్సిస్కోలో సమావేశంలో రష్యా సభ్యురాలుగా ఉండి, తర్వాత ఐకరాజ్య సమితిలో సభ్యదేశమైంది.

రెండో ప్రపంచయుద్ధానికి ముందు తర్వాత కూడా సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణకు స్టాలిన్ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా అమెరికాకు ధీటుగా రష్యా అగ్రరాజ్యంగా ఎదిగింది. అజేయమైన సైనిక శక్తిగా అభివృద్ధి చెందిన సోవియట్ యూనియన్ ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికాతో పోటీపడి అణ్వాయుధాల ఉత్పత్తికి, అసంఖ్యాకమైన సైనిక పోషణకు అపారంగా నిధులు ఖర్చు చేయవలసి వచ్చింది. అమెరికా సామ్రాజ్య విస్తరణ వాదం నుంచి పేద దేశాలను, అభివృద్ధి చెందుతున్న తృతీయ ప్రపంచ దేశాలను ఆదుకుంటూ వచ్చిన సోవియట్ యూనియన్ రచ్చగెలిచినా ఇంట గెలవలేకపోయింది. లెనిన్ నాటి భావన, ప్రకటనాస్వేచ్ఛ స్టాలిన్ హయాంలో నశించింది.

**డా ॥ వి.వి. సుబ్బారెడ్డి**

పాఠం - 15

# అంతర్జాతీయ సంబంధాలు

**లక్ష్యం :**

1871లో జర్మనీ ఏకీకరణ జరిగిన నాటినుండి 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు గల అంతర్జాతీయ సంబంధాలు మరియు తూర్పు సమస్య గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**ప్రధానాంశాలు :**

1. ఉపోద్ఘాతం
2. నిరోధాలు - సమతుల్యాల సిద్ధాంతం
3 త్రిసామ్రాట్ మిత్ర మండలి
4. ద్విపక్ష మైత్రి
5. త్రిరాజ్య సంధి
6. పునర్భద్రతా సంధి
7. బిస్మార్క్ దౌత్యనీతి
8. బిస్మార్క్ తరువాత జర్మన్ విదేశాంగ విధానం
9. ఫ్రాన్స్ - రష్యా మైత్రి
10. ఇంగ్లాండ్ - ఫ్రాన్స్ సాహార్థం
11. త్రిదేశ సౌహార్థం
12. కూటముల మధ్య పోటీ
13. హేగ్ సమావేశము

## 1. ఉపోద్ఘాతము :

ఐరోపాలో ఉన్న ప్రముఖ రాజ్యాలుగా పరిగణించబడు, ఫ్రాన్స్, జర్మన్‌లకు మధ్య ఉమ్మడి సరిహద్దు ప్రాంతమైనందువల్ల వాటి మధ్య తీవ్ర శత్రుత్వము నెలకొనటం జరిగింది. అలాంటి పరిస్థితులలో ఈ రెండు రాజ్యాలకు అంతర్జాతీయంగా అనేక ఒప్పందాలు చేసికొనటం జరిగింది. ప్రధాన ఐరోపా రాజ్యాల మధ్య ఎట్లాంటి సంధులు, ప్రతిసంధులు, మిత్రపక్షాలు ఏర్పడ్డా అవన్నీ ఫ్రాన్స్, జర్మనీ మధ్య ఏర్పడినటువంటి సంబంధాలే బిస్మార్క్‌కు ఉన్న ఒకే ఒక లక్ష్యం అంతర్జాతీయ రంగంలో 1871 యొక్క ఒప్పందమును పరిక్షించుకోవటమే. ఎన్నో సంవత్సరాల తరువాత జర్మనీ ప్రజలు అన్ని త్యాగాలకు ఓర్చి సాధించిన ఏకీకరణను ఎటువంటి దుష్ట శక్తుల నుండి భంగం వాటిల్లకుండా కనీసం ఒక తరానికి చెందిన జర్మన్లు సంపూర్ణంగా ఈ స్వేచ్ఛను అనుభవించాలని బిస్మార్క్ వాంచించినాడు.

**అదే** విధంగా ఫ్రాన్స్‌లో ఉన్న రాజకీయ స్థితిని గమనించగా **1871**లో సంభవించిన ఘోర పరాజయం వలన ఐరోపా అంతటిలోను ఫ్రాన్స్‌కు మిత్ర రాజ్యం అంటూ లేకుండా పోయింది. అంతేకాక ఏదో ఒక నెపంతో ఎప్పుడో అనుకోకుండా జర్మనీ నుండి ముప్పు వాటిల్లుతుందన్న భయంతో ఫ్రాన్స్ తన ఒంటరితనాన్ని కొనసాగిస్తూ ఉన్నది. అందువలన ప్రాథమికంగా ఫ్రాన్స్, జర్మనీలు, వాటి యొక్క ఆత్మ రక్షణ కొరకు మాత్రమే ప్రాముఖ్యతను ఇచ్చాయి. ఒక దేశం యొక్క విధానం ఇంకొక దేశంపై మిషతో కాలుదువ్వేదిగా లేదు. మారీస్ బరీ (Maurice Barres), రెయిమాడ్ ఫాయిన్ కేర్ (Raymond Poincare) లాంటి లోరేన్ ప్రాంతానికి చెందిన వారు కూడా ఆల్సెస్, లోరేన్‌లను తిరిగి యధావిధిగా ఫ్రాన్స్‌కి అప్పగించటం కంటే ఐరోపాలో క్షణం క్షణం పెచ్చు పెరిగిపోతున్న జర్మనీ ఆధిక్యాన్ని అడ్డుకోవడమే ప్రధానంగా భావించారు. వాస్తవంగా ఫ్రాన్స్‌కు పశ్చిమ, మధ్య ఐరోపాలో సాంప్రదాయబద్ధమైన పట్టు ఉండేది. దాన్ని ఇప్పుడు జర్మనీ హరించి వేసింది. అందువలన ఫ్రెంచి దౌత్యవేత్తల దృష్టిలో ప్రాబల్యతుల్యత సిద్ధాంతానికి ప్రమాదం ఏర్పడిందని ప్రగాఢంగా విశ్వసించారు. దీనిని బట్టి యూరప్‌లో జర్మనీ ఆధిక్యత తగ్గించి, తుల్య ప్రాబల్యంలో వచ్చిన హెచ్చు తగ్గులను సవరించాలనేది ఫ్రాన్స్‌కు పరమధ్యేయమైంది.

## 2. నిరోధాలు - సమతుల్యాలు సిద్ధాంతం : (Cheks and Balances)

తాననుకున్న విధానాన్ని అమలు పరచడంలో తనతో బ్రిటన్ సహకరించదనే భావం ఫ్రాన్స్‌కు అవగతమైంది. 19వ శతాబ్దం అంతము నాటికి యూరప్‌లో అయిదు అగ్ర రాజ్యాలున్నాయని అందువల్ల తుల్య ప్రాబల్యం దానంతట అదే సర్దుకొంటున్నదని బ్రిటన్ తలచింది. తుల్యప్రాబల్యమునకు ఎపుడైనా ప్రమాదం ఏర్పడితే అది ఫ్రాన్స్, రష్యాల ద్వారా జరుగుతుందేగాని ఆస్ట్రియా - హంగరీ లేదా జర్మనీ వల్ల జరగదని బ్రిటన్ నిర్ధారించుకొంది. దౌత్యరంగాలలోనూ, ఆర్థిక రంగాలలోనూ జర్మనీ అధిక్యత వల్ల తమకు ప్రమాదం ఏర్పడుతుందని బ్రిటిన్ మొదట్లో భావించనేలేదు. తన ప్రధాన ప్రత్యర్థి ఫ్రాన్స్ అన్న భావంతోనే బ్రిటన్ తూర్పుకోస్తాలో నౌకాశ్రయాలు నిర్మించుకొంది. తన రాజ్యాంగం మాదిరే యూరోపియన్ రాజ్యాల దౌత్య సైనిక సంబంధాలు, నిరోధాలు - సమతుల్యాలు (Cheks **and balances)** సిద్ధాంతం పైన నడుస్తాయని ఈ సిద్ధాంతానికి ప్రమాదం ఏర్పడి ఏదేని ఐరోపా రాజ్యం తన భద్రతకు ముప్పుతెచ్చిపెట్టే విధంగా నడుచుకొంటే అపుడు తాను జోక్యం చేసుకోవచ్చని బ్రిటన్ నిర్ణయించుకొంది. అట్లాంటి పరిస్థితి ఏర్పడినపుడు వెనుక 14వ లూయీకి వ్యతిరేకంగానూ, నెపోలియన్‌కు వ్యతిరేకంగానూ క్రిమియన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగానూ బ్రిటన్ పాల్గొంది. అసలు బ్రిటన్ ధ్యేయాలే వేరుగా ఉన్నాయి. వాటిని సాధించుకోవడానికి బ్రిటన్ ఒక పక్షం వైపుచేరి, నిర్ణీత వైఖరి నవలంభించదలచలేదు. తన ప్రపంచ వలససామ్రాజ్యాన్ని బ్రిటన్ సంరక్షించుకోవాలి. దీన్ని నౌకా పాటవంతో బ్రిటన్ సాధించుకొంటూ వచ్చింది. 1870 నాటికి కూడా ఎదురులేని నౌకా శక్తిగా బ్రిటన్ ఉన్నది. ఈ కారణాలన్నింటి వల్లా బ్రిటన్ యూరోపియన్ దౌత్య రంగానికి దూరంగా ఉంటూ వచ్చింది.

## 3. త్రిసామ్రాట్ మిత్ర మండలి (Three Emperor's League) :

1871 నుంచి 1890 వరకూ యూరోపియన్ రాజ్యాల మధ్య మధ్యవర్తిగా వ్యవహరించగల ప్రతిభ, సామర్థ్యం బిస్మార్క్ సంపాదించాడు. జర్మనీ పూర్తిగా "తుష్టి పొందిన" (Satiated) దేశమని బిస్మార్క్ చెప్పుకొనటం జరిగింది. ఏకీకరణను సంపాదించటం కొరకు జర్మనీ యుద్ధాలు చేసి విజయం సాధించింది. తిరిగి యుద్ధానికి తలపడితే యూరోపియన్ రాజ్యాలు తనకు వ్యతిరేకంగా తిరుగుతాయని, అందువల్ల తాను సాధించుకొన్నదంతా తుడిచిపెట్టుకు పోతుందని జర్మనీ గ్రహించింది. రాజకీయ సమాఖ్యకూ ఆంతరంగిక పటిష్ఠతకు కొంత కాలం వరకు జర్మనీకి శాంతి ఎంతో అవసరం. క్రీ.శ. 1875 నాటికి ఫ్రాన్స్ పటిష్టం చెందడం చూసి దాని నుంచి ప్రమాదం ఏర్పడడానికి ముందే తగిన ప్రతిచర్యలు తీసుకొని శత్రువును తుదముట్టించాలని జర్మనీలో ఒక వర్గం ప్రచారం చేస్తూ వచ్చింది. కాని బిస్మార్క్ ఆ వర్గానికి మద్దతు ఇవ్వకపోగా అణచివేశాడు. తిరిగి ఫ్రాన్స్‌తో యుద్ధమే సంభవిస్తే జర్మనీకి ఎట్లాంటి గడ్డు పరిస్థితి ఏర్పడుతుందో బిస్మార్క్ గ్రహించాడు. 1815 తరువాత మెటర్నిక్ మాదిరి క్రీ.శ. 1871 తరువాత బిస్మార్క్ శాంతి కోసం యథాస్థితిని పరిరక్షించుదలచు కొన్నాడు. బలవంతం మీద ఫ్రాంక్‌ఫర్డ్ సంధికి ఫ్రాన్స్‌ను ఒప్పించానని, అందువల్ల ఏదో సమయంలో అవకాశం వస్తే, ఫ్రాన్స్ దాన్ని త్రోసిపుచ్చి జర్మనీపై కక్ష సాధించి తీరుతుందనే భీతి బిస్మార్క్‌కు పట్టుకొంది. అందువల్ల జర్మనీ భద్రతను

కాపాడుకొనేందుకు ఫ్రాన్స్‌ను యూరోపియన్ రాజకీయాలలో ఏకాకిని చేయాలనే కృత నిశ్చయానికి బిస్మార్క్ వచ్చాడు. ఆస్ట్రియా-హంగరీ (ద్వంద్వ రాజరికం)తో స్నేహం కలపడానికి బిస్మార్క్ ప్రయత్నించాడు. రష్యా, ఇటలీలతో స్నేహానికి కూడా బిస్మార్క్ ప్రయత్నించాడు. ఇంగ్లీషు వారి ఉదారవిధానాలంటే నచ్చకపోయినా, బ్రిటన్‌తో స్నేహం చేయడానికి కూడా అతడు ప్రయత్నించాడు. వలస విషయాల్లో జర్మనీ, బ్రిటన్‌ల, మధ్య బేదాభిప్రాయాలు పొడచూపినా క్రీ.శ. 1890లో బిస్మార్క్ రాజీనామా చేసేవరకూ రెండు దేశాలు స్నేహంగా ఉన్నాయి. బిస్మార్క్ కాలంలోజర్మనీ తన నౌకాదళాన్ని విస్తృత పరచుకొని, బ్రిటిష్ ఆధిక్యతను సవాలుచేసే స్థితికి రాలేదు. అంతేకాకుండా బ్రిటన్ యూరోపియన్ ఖండ రాజకీయ దౌత్యరంగాల ఎత్తులు పై ఎత్తులలో పాల్గొనకుండా అసలు యూరోపియన్ రాజకీయాలకే దూరంగా ఉంటూ వస్తున్నది. ఈ కారణాల వలన జర్మనీ బ్రిటన్‌ల మధ్య బిస్మార్క్ హయాంలో ఏ విధంగానూ చెప్పుకోదగ్గ చిక్కులు ఏర్పడలేదు. "భూమి ఎలుక, నీటి ఎలుక" (Land rat and water rat) ల మధ్య ఘర్షణ ఏర్పడ్డానికి అసలు అవకాశమే లేదని బిస్మార్క్ చెప్పాడు.

ప్రష్యాలో అధికారానికి వచ్చినప్పటి నుండి ప్రష్యా, రష్యాల మధ్య మైత్రి పెంచడానికి బిస్మార్క్ ప్రయత్నిస్తూ వచ్చాడు. క్రీ.శ. 1870 తరువాత జర్మనీ సాధించిన విజయాలు రష్యాలో ఈర్ష్యా ద్వేషాలు రేకెత్తించిన మాట యథార్థమే! కానీ ప్రష్యాతో స్నేహం చేసినందువల్ల రష్యాకు మేలు జరుగుతూ వచ్చింది. రాజకీయంగా పరిశీలిస్తే రిపబ్లికన్ ఫ్రాన్స్‌కన్నా రాజరిక జర్మనీ మేలని జార్ రెండో అలెగ్జాండర్ భావించాడు. తన దేశానికి చెందిన విప్లవకార్లు ఫ్రెంచి విప్లవం నుంచి చాలా పాఠాలు నేర్చుకొన్నారని జార్ భావన. 1863లో పోలిష్ తిరుగుబాటును అణచడంలో తనకే విధంగా ప్రష్యా అండగా నిలిచిందో రష్యాకు గుర్తుంది. నల్ల సముద్రములోకి యుద్ధనౌకలను పంపడానికి రష్యా అనుమతి సంపాదించుకోవడంలో బిస్మార్క్ ఏ విధంగా సహకరించాడో కూడా జార్ గుర్తుంచుకొన్నాడు. బాల్కన్‌లలో ఆసియాలో బ్రిటీష్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా రష్యా విస్తరణకు బిస్మార్క్ సహకారం ఎంతో అవసరమనే భావం రష్యన్ అధికార వర్గాలలో బాగా ఏర్పడింది.

జర్మనీ ఏకీకరణకు ఆస్ట్రియాతో తలపడి, దాన్ని ప్రష్యా ఓడించిన మాట నిజమే! కానీ, హాబ్స్‌బర్గ్ సామ్రాజ్యంతో శాశ్వతంగా తెగతెంపులు చేసుకొనే ఉద్దేశం బిస్మార్క్‌కు లేదు. అందువలన కానిగ్రాట్జ్ యుద్ధం జరిగిన 1866 జులై 3వ తేదీ నుంచి ఆస్ట్రియాతో మైత్రి సంధి కుదుర్చుకోవడానికి బిస్మార్క్ ప్రయత్నాలు ప్రారంభించాడు.

1872 సెప్టెంబరులో జర్మనీ చక్రవర్తి మొదటి విలియం, ఆస్ట్రియా - హంగరీ చక్రవర్తి ఫ్రాన్సిస్ జోసఫ్, రష్యన్ జార్ రెండో అలెగ్జాండర్ తమ మంత్రులతో సహా బెర్లిన్‌లో సమావేశం జరిపారు. మధ్య తూర్పు యూరప్‌కు చెందిన తమ సామ్రాజ్యాల మధ్య అవగాహన సదభిప్రాయం నెలకొన్నాయని ముగ్గురు చక్రవర్తులు ప్రకటించారు. బెర్లిన్ సంప్రదింపుల ఫలితంగా జర్మనీ రష్యా, ఆస్ట్రియా-హంగరీల మధ్య 1872లో 'డ్రైకైజర్‌బుంద్' ఏర్పడింది. దీన్ని స్థూలంగా 'త్రిసామ్రాట్ మిత్రమండలి' అని చెప్పవచ్చు. దీని ధ్యేయం "అంతర్జాతీయ సమాజవాదాన్ని ఎదుర్కోవడం, సామ్యవాద సిద్ధాంతాలను అరికట్టటం" కానీ, ఈ మిత్ర కూటమికి దౌత్యపరమైన ప్రాముఖ్యం కూడా ఉన్నది. ఈ ఒప్పందంతో కానిగ్రాట్జ్ యుద్ధానంతరం ప్రష్యా, ఆస్ట్రియా- హంగరీల మధ్య ఏర్పడ్డ బేదాభిప్రాయాలను మరిచి పోవడానికి రెండు దేశాలు అంగీకరించినట్లు అయింది. జర్మనీ నుంచి తన బహిష్కరణను ఆస్ట్రియా అంగీకరించినట్లయింది కూడా. శాంతి పరిరక్షణకు పరస్పర సహకారానికి యుద్ధ ప్రమాదం ఏర్పడితే సంప్రదింపులు జరుపుకోవడానికి త్రిసామ్రాట్ మిత్రమండలి అంగీకరించింది. 1872లో ఏర్పడ్డ ఈ కూటమి మొదటినుంచి సమస్యలను ఎదుర్కొంది. ఫ్రాన్స్ యుద్ధ ప్రయత్నాలు మొదలు పెట్టిందని 1875లో జర్మన్ పత్రికలు గగ్గోలు పెట్టాయి. ఫ్రాన్స్ మీద యుద్ధం ప్రారంభించడానికి బిస్మార్క్ ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నాడని రష్యా విశ్వసించింది. జర్మన్ పత్రికల వైఖరి వలన రష్యా నిరసన తెలియజేసింది. ఫ్రాన్స్‌పై యుద్ధ చర్యలేవీ జర్మనీ తీసుకోవడం లేదని బిస్మార్క్ ప్రకటించాడు. దీనివల్ల జర్మనీ, రష్యాల మధ్య కొద్దిపాటి మనస్పర్థ ఏర్పడింది. త్రిసామ్రాట్ మిత్రమండలిని పదిలపరచడంలో బిస్మార్క్ ఎదుర్కొన్న అతిగడ్డు సమస్య క్రీ.శ. 1877-1878 నాటి రష్యా-టర్కీ యుద్ధం. ఈ యుద్ధానంతరం జరిగిన బెర్లిన్ కాంగ్రెస్‌లో "నిజాయితీ పరుడైన మధ్యవర్తిగా వ్యవహరిస్తానని బిస్మార్క్ ప్రకటించినా, రష్యాకు వ్యతిరేకంగానూ, ఆస్ట్రియా-హంగరీకి అనుకూలంగానూ జర్మనీ వ్యవహరించింది. యుద్ధంలో సాధించుకొన్న విజయాలను వదులుకోవలసి వచ్చిందనే ఆగ్రహం రష్యాకు కలిగింది. కాన్‌స్టాంటినోపుల్

తనకు ఎప్పటికైనా దక్కుతుందనే ఆశ రాష్యా వదిలింది. తాను ప్రదర్శించిన వైఖరివల్ల మరో యూరోపియన్ యుద్ధాన్ని బిస్మార్క్ నివారించగలిగాడేగాని రష్యా మిత్రత్వాన్ని కోల్పోయాడు. బెర్లిన్ కాంగ్రెస్ అనంతరం 1881 దాక జర్మనీ, రష్యాల మధ్య శత్రుభావం నెలకొంది. అయినా 1881లో త్రిసామ్రాట్ మిత్రమండలి కాలపరిమితిని మరో మూడేళ్ళకు బిస్మార్క్ పొడిగించ గలిగాడు. తమ దేశాలలో ఏదేని నాలుగో దేశంతో యుద్ధానికి దిగితే తతిమ్మా రెండు దేశాలు తటస్థంగా ఉండాలని జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, రష్యాలు అంగీకరించాయి. 1884లో తిరిగి మరోమూడు సంవత్సరాలకు త్రిసామ్రాట్ మిత్ర మండలి కాలపరిమితిని పొడిగించడం జరిగింది. కానీ త్రిసామ్రాట్ మిత్ర మండలి మొదటినుంచి అంతశక్తి వంతమైందికాదని తేలిపోయింది. ఆస్ట్రియా-హంగరీకి రష్యాతో యుద్ధం సంభవిస్తే జర్మనీ, ఆస్ట్రియా-హంగరీకి అండగా నిలబడుతుందని బిస్మార్క్ ద్వంద్వ రాజరికానికి మాట ఇచ్చివున్నాడు. 1878 తరువాత బాల్కన్‌లలో ఆస్ట్రియా-హంగరీకి, రష్యాల మధ్య వైషమ్యం పెరుగుతూ వచ్చింది. అందువల్ల త్రిసామ్రాట్ మిత్ర మండలి క్రమంగా బలహీనపడి నామమాత్రంగా బ్రతికి ఉన్నది.

## 4. ద్విపక్ష మైత్రి క్రీ.శ. 1879 :

ఆస్ట్రియా-హంగరీ రష్యాలతో స్నేహం చేసి ఫ్రాన్స్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేయడం క్రీ.శ. 1871 నుంచి బిస్మార్క్ పరమలక్ష్యమని తెలుసుకొన్నాం. 1873లో కుదుర్చుకొన్న త్రిసామ్రాట్ మిత్రమండలి వల్ల ఈ లక్ష్యాన్ని బిస్మార్క్ కొద్దిపాటిగా సాధించాడు. కానీ బాల్కన్ తగాదాల వల్ల ఆస్ట్రియా-హంగరీ, రష్యాల మధ్య అంగీకారం ఎక్కువ కాలం మన్నేటట్లు కనపడలేదు. రెండు దేశాలను దగ్గరకు చేర్చడం బిస్మార్క్‌కు అలవిగాని పనైంది. 1878 బెర్లిన్ కాంగ్రెస్ అనంతరం రష్యా, జర్మనీల మధ్య, రష్యా, ఆస్ట్రియా హంగరీల మధ్య తీవ్రబేధాభిప్రాయాలు పొడచూపాయి. సాన్‌స్టెఫెనో సంధివల్ల బాల్కన్‌లలో రష్యా ఆధిపత్యం సంపాదించింది. కానీ ఈ సంధిలో సంపాదించుకొన్న వాటిని రష్యాకు దక్కకుండా చేయడానికి ఆస్ట్రియా-హంగరీ చేయగలిగినదంతా చేసింది. ఈ విషయంలో బ్రిటన్ సహకారం ఆస్ట్రియా-హంగరీకి లభ్యమైంది. బెర్లిన్ కాంగ్రెస్‌లో ఆస్ట్రియా-హంగరీ, బ్రిటన్‌లు చాలా వరకు కలిసికట్టుగా వ్యవహరించాయి. "నిజాయితీ పరుడైన మధ్యవర్తి"గా వ్యవహరిస్తానని ప్రకటించిన బిస్మార్క్ ఆస్ట్రియా-హంగరీని సమర్థించాలా వద్దా అని కొంత సంశయించినా, చివరకు ఆస్ట్రియా-హంగరీని సమర్థించాలనే తుదకు నిశ్చయించాడు. రష్యా, జర్మనీల మధ్య బేదాభిప్రాయాలు కలగడం బెర్లిన్ కాంగ్రెస్ ప్రధాన ఫలితాలలో ఒకటని జి.పి. గూచ్ అంటాడు. బెర్లిన్ కాంగ్రెస్‌లో జర్మనీ వైఖరి రష్యన్‌లకు ఏమాత్రం నచ్చలేదు. తాము వెచ్చించిన ధనానికి, చిందించిన రక్తానికి తాము సంపాదించింది స్వల్పమని రష్యా భావించింది. బెస్సరేబియా, బాటూమ్, కార్స్‌లను సంపాదించడం రష్యన్‌లకు ఏమాత్రం తృప్తినివ్వలేదు. తమ ప్రయోజనాలకు జర్మన్‌లు తీవ్ర నష్టం కలిగించారని రష్యన్‌లు భావించారు. రష్యా యుద్ధ మంత్రిమిల్యూటిన్ (Milutin) బహిరంగంగా ఫ్రాన్స్‌తో మైత్రి ప్రకటించాడు. రష్యా విదేశాంగ మంత్రి గార్షకాఫ్ (Gorshakoff) బిస్మార్క్ పట్ల శత్రుభావం వహించి అతడితో ఏ విధమైన సంబంధాలు పెట్టుకోవడానికి నిరాకరించాడు. జార్‌కు కూడా జర్మన్‌లమీద ఆగ్రహం కలిగింది. జర్మనీ, రష్యాల మధ్య ఏర్పడుతున్న భేదాభిప్రాయాలు మరో సంఘటన వల్ల మరీ ఉధృతమయ్యాయి. పరిమితి నిర్ణయాల (de-limitations) కోసం ఏర్పడ్డ అంతర్జాతీయ సంస్థలో జర్మన్ ప్రతినిధులు ఆస్ట్రియా-హంగరీని సమర్థిస్తున్నారనే భావం రష్యాకు ఏర్పడింది. 1879 నాటికి రష్యాలో జర్మనీ, ఆస్ట్రియా-హంగరీలపై తీవ్రమైన అసంతృప్తి పెరిగి, ఆస్ట్రియా హంగరీతో యుద్ధమే సంభవిస్తే ఇటలీ తనకు మద్దతుకు నిలుస్తుందా అని అడిగే వరకూ రష్యా వెళ్ళింది. రష్యా, ఆస్ట్రియా-హంగరీల సంబంధాల విషయంలో ఒక వైఖరిని స్పష్టం చేయవలసిందిగా ఫ్రాన్స్‌ను కోరింది. కానీ ఆశించిన మద్దతు సంపాదించలేక పోయేసరికి ఆస్ట్రియా-హంగరీ, జర్మనీ సరిహద్దుల్లో రష్యా సైనిక మోహరింపు చర్యలు ప్రారంభించింది. ముందుగా నిర్ణయించుకొన్న జర్మన్ పర్యటనను కూడా జార్ విరమించుకొన్నాడు. జర్మన్‌లే గనక తమతో ఒక వంద సంవత్సరాలపాటు స్నేహం చేయదలచుకొంటే తమ వైఖరిని పూర్తిగా మార్చుకోవాలని జార్ బహిరంగంగా ప్రకటించాడు. జర్మన్ వైఖరిని నిరశిస్తూ జార్, కైజర్‌కు ఒక లేఖ పంపించాడు. 1870లో తాము ఏవిధంగా ప్రష్యాకు అండగా నిలిచింది, కైజర్‌కు జార్ గుర్తు చేసాడు. పరిస్థితి విషమిస్తే రెండు దేశాలకు దుర్దినాలు ప్రాప్తించినట్లేనని జార్ హెచ్చరించాడు. ఈ లేఖలో జార్ ప్రయోగించిన తీవ్ర పదజాలం కైజరుకు ఆగ్రహం కలిగించింది. తగిన సమాధానం రాయమని కైజర్ బిస్మార్క్‌ను ఆదేశించాడు. అదే తీవ్ర పదజాలంతో రష్యాకు సమాధానం వెళ్ళినట్లయితే జర్మనీ, రష్యాల మధ్య ఖచ్చితంగా యుద్ధం సంభవించి

ఉండేది. రష్యా ముందు జర్మనీ తలవంచలేదు, కాని బెర్లిన్ నుంచి కైజర్‌కు సౌమ్య పదజాలంతో సమాధానం వెళ్ళింది. ఈ సంఘటన వల్ల జర్మనీ రష్యాల మధ్య సంబంధాలు చెడిపోయాయి. మారిన పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని జార్ తన విదేశాంగ విధానాన్ని పునర్వ్యవస్థీకరించదలచుకొన్నాడు. జర్మనీకి ముఖ్యంగా బిస్మార్క్‌కు వ్యతిరేకంగా రష్యన్ పత్రికల్లో దుమారం చెలరేగింది. రష్యన్ రాజకీయ వర్గాల్లో ఎక్కడ బట్టినా బిస్మార్క్ పట్ల వ్యతిరేక భావం కొట్టివచ్చినట్లు కనబడింది. బిస్మార్క్ దీన్ని కృతజ్ఞతారాహిత్యంగా భావించాడు. బెర్లిన్ కాంగ్రెస్‌లో తాను "రష్యన్ ప్రతినిధిగా" వ్యవహరించానని కాంగ్రెస్‌లో రష్యా కోరినదేది తాను కాదనలేదని తన స్థానంలో ఉన్న మరే ఇతర మంత్రికూడా మరో దేశం కోసం అంత దూరం వెళ్ళడని, ఈ కారణాలవల్ల తనకు వ్యతిరేకంగా రష్యాలో చెలరేగుతున్న దుమారం తనను ఆశ్చర్య పరుస్తున్నదని 1886లో బిస్మార్క్ ప్రకటించాడు. రష్యా, ఆస్ట్రియా-హంగరీ ఈ రెండు దేశాల మధ్య ఏదేశాన్ని మైత్రికోసం ఎంపిక చేసుకోవాలనే సమస్యకు పరిష్కార సమయం వచ్చిందని బిస్మార్క్ అనుకొన్నాడు. ఆర్థిక దృష్ట్యా రష్యాతో సంబంధమే జర్మనీకి లాభసాటి కానీ ఆస్ట్రియాలో జర్మన్‌ల జనాభా అధికం. అందువల్ల అవసరకాలంలో తనతో ఆస్ట్రియా తప్పనిసరిగా సహకరిస్తుందని బిస్మార్క్ భావించాడు. బిస్మార్క్ ఈ విషయంలో వెంటనే ఒక నిర్ణయానికి రావడానికి మరోకారణం ఉన్నది. ఆస్ట్రియా-హంగరీ విదేశాంగ మంత్రి ఆండ్రసీ (Andressy) రాజీనామా చేయబోతున్నాడనే వార్తలు బెర్లిన్‌కు చేరాయి.

బెర్లిన్ కాంగ్రెస్ లో బిస్మార్క్, ఆండ్రసీలకు మంచి అవగాహన కుదిరింది. అందువల్ల ఆండ్రసీ రాజీనామా చేసే ముందే ఆస్ట్రియాతో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రగాఢ వాంఛ ఆండ్రసీకి కూడా ఉన్నది. ఒప్పందం కుదుర్చుకోవడంలో ఆలస్యము అనవసరమని బిస్మార్క్, ఆండ్రసీలు భావించారు. దానికిగానూ ఇరువురూ గాస్టీన్ (Gastein)లో సమావేశం జరిపారు. తమ పాలకులతో సంప్రదించి తిరిగి కలుసుకోవాలని ఇరువురు రాజనీతిజ్ఞులు నిశ్చయించారు. ఫ్రాన్సిస్ జోసెఫ్ జర్మనీతో మిత్ర సంధి కుదుర్చుకోవడానికి సిద్ధంగా వున్నాడని బిస్మార్క్‌కు ఆండ్రసీకి ఒక పత్రం పంపించాడు. కానీ, కైజర్ వైఖరి మరో విధంగా ఉన్నది. జార్ అతనికి దగ్గర బంధువు, అదీగాక సాంప్రదాయంగా వస్తున్న రష్యన్ సంబంధాన్ని తుంచుకోవద్దని కైజర్, బిస్మార్క్‌ను హెచ్చరించాడు. కైజర్ వైఖరి వ్యతిరేకంగా ఉన్నా, ఆస్ట్రియా-హంగరీతో మిత్ర సంధి కుదుర్చుకోవడానికీ బిస్మార్క్ నిశ్చయించాడు. ఆస్ట్రియా-హంగరీపై దాడి జరిగితే, తన సొంత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆస్ట్రియా-హంగరీని జర్మనీ సమర్థించవలసి ఉంటుందని బిస్మార్కు కైజర్‌ను హెచ్చరించాడు. శత్రుదేశమైన ఫ్రాన్స్ ఒకవైపు, ఓడిపోయి బలహీనపడిన ఆస్ట్రియా-హంగరీ మరోవైపు ఉంటే అట్లాంటి పరిస్థితి జర్మనీ భద్రతకే ప్రమాదమని కైజర్‌ను బిస్మార్క్ వారించాడు. ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నంత వరకే జార్, జర్మనీతో స్నేహంగా ఉంటాడనీ ఆ తరువాత వదిలేస్తాడని బిస్మార్క్ జర్మనీ రాజకీయ వర్గాలలో తీవ్రంగా ప్రచారం చేసాడు. ఈ విషయంలో అతడు బల్గేరియా పాలకుణ్ణి తన వైపుకు తిప్పుకొన్నాడు. జర్మనీలో పలుకుబడి ఉన్న ప్రతి రాజకీయ వేత్తను బిస్మార్క్, కైజర్‌పై ప్రయోగించాడు. ఈ వ్యవహారంలో తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని బిస్మార్క్ తెలియజేస్తే రాజ్య పరిత్యాగం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని కైజర్ ప్రకటించాడు. "ద్రోహం కన్నా రాజ్య పరిత్యాగమే మేల"ని కైజర్ ప్రకటించాడు. కానీ చివరకు బిస్మార్క్ పట్టునెగ్గింది. 1879 అక్టోబర్ 5న కైజర్ ఆస్ట్రియా-హంగరీతో సంధికి అంగీకరించాడు. వియన్నాలో సంధిపై సంతకాలు జరిగాయి. తరువాత రెండు నెలల్లో రెండు ప్రభుత్వాలు దాన్ని ధృవీకరించాయి. ఈ సంధికి ద్విపక్ష మైత్రి (Dual Alliance) అని పేరు. ద్విపక్ష మైత్రి ప్రకారం 1) తమ ఆశలకు. ఆకాంక్షలకు భిన్నంగా రెండు దేశాలలో దేని మీదైనా రష్యా దాడి జరిపితే దాడికి గురైన దేశానికి రెండో దేశం సహాయం అందించాలి. రెండు దేశాలు కలిసే శాంతి సంధి కుదుర్చుకోవాలి. 2) రెండు దేశాలలో దేనిపైనైనా రష్యా సహాయంతో మరోదేశం దాడిచేస్తే దాడికి గురైన దేశానికి రెండో దేశం సహాయం చేయాలి. ఆస్ట్రియా-హంగరీ, జర్మనీలపై మరోదేశం రష్యా సహకారం లేకుండా దాడిచేస్తే రెండో దేశం తటస్థవైఖరి అవలంభించాలి. 3) సంధి షరతులను రహస్యంగా ఉంచాలి. 4) ఈ సంధి కాలపరిమితి అయిదు సంవత్సరాలు; అవసరమైతే మరో మూడు సంవత్సరాలకు దీన్ని పొడిగించవచ్చు. అవసరం లేదనిపిస్తే అయిదు సంవత్సరాల తరువాత రెండు దేశాలు పరస్పర అంగీకారంతో దీన్ని రద్దు చేయవచ్చు. సంధి షరతులపట్ల బిస్మార్క్, ఆండ్రసీ ఇరువురూ సంతోషం వ్యక్తం చేసారు. "ప్రతిచోటా యుద్ధభీతి తొలగిపోయి, శాంతి నెలకొన్నది." అని బిస్మార్క్ ప్రకటన చేసాడు. 1866లో తాను ప్రారంభించిన పని నేటితో ముగిసిందని, సంధి జరిగిన మరుసటిరోజు బిస్మార్క్ తెలియజేసాడు. తానాశించింది జరిగిందని ఆండ్రసీ అన్నాడు. ఆస్ట్రియా-హంగరీ, జర్మనీలమధ్య మిత్ర సంధి కుదిరిందన్న వార్త సెంట్ పీటర్స్ బర్గ్ చేరగానే రష్యా వైఖరిలో మార్పు వచ్చిందని, రష్యన్ పత్రికల్లో జర్మన్ వ్యతిరేకోద్యమం

ఆగిపోయిందని బిస్మార్క్ సగర్వంగా ప్రకటించాడు. ఈ సంధివల్ల రష్యా, ఆస్ట్రియా-హంగరీపై దాడిచేసే ప్రమాదం తప్పిందని తన చివరి రోజుల్లో కూడా బిస్మార్క్ చెప్పుకొన్నాడు. ద్విపక్ష మైత్రివల్ల జర్మనీ, రష్యాల మధ్య వెంటనే శత్రుత్వం ఏర్పడిందని చెప్పటానికి వీలులేదు. కానీ 1914లో ఈ రెండు దేశాలు కలిసి తలపడ్డానికి ఇది దోహదం చేసిందని స్పష్టంగా చెప్పవచ్చును. ఈ సంధిని గురించి ఐరోపా రాజ్యాలవారు ఎట్లాంటి వ్యాఖ్యానాలు చేసినా, ఒక విషయం మాత్రం స్పష్టంగా తేలిపోయింది. బహిరంగంగా ఇక మీదట దౌత్య సంబంధాలు ఉండవు, రహస్య సంధులు, రహస్య ప్రతి సంధులు యూరోపియన్ దౌత్య చరిత్రలో అంతర్భాగమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ కారణాల్లో ఇది ఒక ప్రముఖ కారణం అని చెప్పాలి. 1918 నవంబరులో జర్మనీ, ఆస్ట్రియా - హంగరీలు పతనయ్యేదాకా, ఆ రెండు దేశాలు అంటిపెట్టుకొనే ఉన్నాయి. చివరి వరకూ బిస్మార్క్‌గానీ, అతడి తరువాత అధికారానికి వచ్చిన ఛాన్సలర్‌లుగానీ సంధి షరతులకు భిన్నంగా వ్యవహరించలేదు. బిస్మార్క్ అధికారంలో ఉన్నంతకాలం ఇది రక్షణ సంధిగా మాత్రమే ఉన్నది. అఖండ స్లావ్ ఉద్యమం (Pan-Slavism) ప్రబలుతున్న ఆ రోజుల్లో ఈ సంధి జర్మనీ, ఆస్ట్రియా హంగరీలకు రక్షణ నిచ్చింది. ఫ్రెంచ్ కక్షసాధింపు చర్యల నుంచి తనకు రక్షణ ఏర్పడిందని జర్మనీ భావిస్తే ఇటాలియన్ ప్రాంతాలు ఎవరి ఆధీనంలో ఉన్నా అవన్నీ ఇటలీకి చెందాలనే ఉద్యమం (Italian Irridentism) నుండి తనకు రక్షణ దొరికిందని ఆస్ట్రియా-హంగరీ సంతోషపడింది. ఏది ఏమైనా, ఈ సంధి కుదుర్చుకొని బిస్మార్క్ దౌత్య రంగంలో అత్యంత ప్రతిభను ప్రదర్శించాడని సమకాలీన రాజకీయ వేత్తలు అభిప్రాయపడ్డారు.

## 5. త్రిరాజ్య సంధి (1882)

క్రీ.శ. 1879 నాటి ద్విపక్ష మైత్రిలో 1882లో ఇటలీ చేరేటప్పటికి అది త్రిరాజ్య సంధి (Tripple Alliance) అయింది. 1882 ముందు నుంచీ జర్మనీ, ఆస్ట్రియా-హంగరీలలో ఏదో ఒకరకమైన అంగీకారం కుదుర్చుకోవడానికి ఇటలీ ప్రయత్నిస్తూ వచ్చింది. ఇటాలియన్ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించిన ఫ్రాన్సిస్కో క్రిస్పీ (Fransisco Crispi) కి 1877లో బిస్మార్క్ ఈ విధంగా తెలియజేసాడు. ఫ్రాన్స్, ఇటలీపై దాడి చేస్తే జర్మనీ ఇటాలియన్‌ల పక్షం వస్తుంది, దీనికోసం ఇటలీతో సంధి చేసుకోవడానికి కూడా జర్మనీ సిద్ధమే. ఆస్ట్రియాతో ఇటలీకి శత్రుత్వం ఏర్పడుతుందని జర్మనీ భావించడం లేదు. ఆస్ట్రియా, బోస్నియాను ఆక్రమిస్తే ఇటలీ, అల్బేనియాను ఆక్రమించవచ్చు. కనుక ఆస్ట్రియా-జర్మనీ మిత్ర సంధిలో వచ్చి కలవమని 1879లో బిస్మార్క్ ఇటలీని ఆహ్వానించాడు. జర్మనీ ఆహ్వానించడం పట్ల ఇటాలియన్‌లు మొదట ఉత్సాహం చూపించలేదు. కానీ 1881లో ట్యునిస్ తన రక్షిత ప్రాంతమని ఫ్రాన్స్ ప్రకటించడంతో ఇటాలియన్ రాజకీయ ఆలోచనలలో మార్పు వచ్చింది. ట్యునిస్ ఇటలీకి సమీప ప్రాంతం అందువల్ల తన వలసల రక్షణకు ట్యునిస్ ఎంతో అవసరమని ఇటలీ భావించింది. ట్యూనిస్‌లో ఫ్రెంచి నియంత్రణ ఏర్పడగానే ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా ఇటలీలో ఆగ్రహావేశాలు చెలరేగాయి. ఇటాలియన్ జాతీయవాదులు ఫ్రాన్స్‌పై తమ దేశం సైనిక చర్యలు తీసుకోవాలని పట్టు పట్టారు. ట్రిపోలిని ఆక్రమించుకోవటానికి తొలి చర్యగా ఫ్రాన్స్ ట్యునిస్‌ను ఆక్రమించిదని ఇటలీ భావించింది. తన చుట్టూ ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలో చాలా మంది ఇటాలియనులు హతులయ్యారు. ఈ సంఘటనలకు వ్యతిరేకంగా ఇటలీలో ప్రదర్శనలు జరిగాయి. ఐరోపా రాజకీయ రంగానికి దూరంగా ఉంటే అది తనకు ఆత్మహత్యా సదృశ్యమౌతుందని ఇటలీ భావించింది. ప్రపంచములో అతిశక్తివంతమైన నౌకా బలమున్న బ్రిటన్‌తో మిత్ర సంధి కుదుర్చుకొంటే బాగుంటుందని ఇటలీ ఆశించింది. కానీ బ్రిటన్ సుముఖత చూపించలేదు. ఇట్లాంటి పరిస్థితులలో ఇటాలియన్ పాలకుడు రెండో విక్టర్ ఇమ్మాన్యూల్ తన ప్రధానమంత్రిని, విదేశాంగ మంత్రిని, వెంటబెట్టుకొని వియన్నాకు వెళ్ళాడు. ఆస్ట్రియా, ఇటలీల మధ్య చర్యలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. ఇటలీ, ఆస్ట్రియా-హంగరీ, జర్మనీలు 1882 లో మే 20న త్రిరాజ్య సంధిపై సంతకాలు చేసాయి. కాలపరిమితి ఐదు సంవత్సరాలు, సంధి షరతులు రహస్యంగా ఉంచాలి. ఎట్లాంటి కారణం లేకుండా ఫ్రాన్స్, ఇటలీపై దాడి చేస్తే ఆస్ట్రియా-హంగరీ, జర్మనీలు ఇటలీకి మద్దతుగా నిలవాలి. ఇట్లాంటి పరిస్థితులే జర్మనీకి ఏర్పడితే ఇటలీ, జర్మనీకి సహాయం అందించాలి. జర్మనీపైనైనా ఆస్ట్రియా-హంగరీపైనైనా, రష్యాదాడి జరిపితే ఇటలీ తటస్థ వైఖరి అవలంబించాలి. జర్మనీ-ఆస్ట్రియా-హంగరీలపై ఏ రెండు దేశాలు అంతకన్నా ఎక్కువ దేశాలు యుద్ధం ప్రకటిస్తే జర్మనీ, ఆస్ట్రియా-హంగరీలకు ఇటలీ సహాయం అందించాలి. 1879 నాటి జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ మైత్రి సంధిని గురించి ఇటలీకి తెలియదు. త్రిరాజ్య సంధిలోనికి బ్రిటన్‌ను చేర్పించాలని ఇటలీ ప్రతిపాదించింది. కానీ బిస్మార్క్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించినందువల్ల ఇటాలియన్ ప్రతిపాదన వీగిపోయింది.

త్రిరాజ్య సంధి ఎట్లాంటి పరిస్థితులలో కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా ఉద్దేశింపబడినటువంటిది కాదని మూడు రాజ్యాలు ప్రకటించాయి. 1878 బెర్లిన్ కాంగ్రెస్‌లో ఇటలీ పాత్ర స్వల్పమైంది, కానీ 1882 తరువాత యూరోపియన్ రాజకీయాల్లో ఇటలీ గమనించాల్సిన దేశంగా గుర్తింపు పొందింది. త్రిరాజ్య సంధివల్ల జర్మనీ, ఆస్ట్రియా-హంగరీలకు మేలు కల్గింది. తన బద్ధ శత్రువు ఫ్రాన్స్‌తో ఇటలీ కలుస్తుందనే భయం జర్మనీకి ఇపుడు పోయింది. త్రిరాజ్య సంధివల్ల ఐరోపా రాజకీయాల్లో ఫ్రాన్స్‌ను బిస్మార్క్ ఇంకా ఏకాకిని చేయగలిగాడు. రష్యాతోటి యుద్ధంగాని సంభవిస్తే ఇటలీ తనకు వెన్నుపోటు పొడుస్తుందనే భయం ద్వంద్వ రాజరికానికి ఉండేది. ఇపుడా భయం ఆస్ట్రియా-హంగరీలకు తొలగిపోయింది. త్రిరాజ్య సంధి మొదట రక్షణ సంధిగా మాత్రమే కనబడింది. కానీ, కాలక్రమంగా దాని ప్రభావం అన్ని కోణాలకు విస్తరించింది. జర్మనీ విషయంలో మాత్రం ఇది కేవలం రక్షణ సంధి మాత్రమే. కానీ, తమ విస్తరణ విధానాలకు ఆస్ట్రియా హంగరీ, ఇటలీ త్రిరాజ్య సంధిని ఉపయోగించుకో చూసాయి. ఉత్తర ఆఫ్రికాలోనూ, ఇతర చోట్ల తన ఆధిపత్యం పెంచుకోవటానికి ఇటలీకి ఈ సంధి ఉపకరించింది. త్రిరాజ్య సంధి మధ్య యూరప్‌ను కలిపివేసి పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని పునఃప్రతిష్టించిందా అన్నట్లు కనబడింది. త్రిరాజ్య సంధికాల పరిమితిని 1887లో పొడిగించడం అయింది. మధ్య యూరప్‌లో బాల్టిక్ నుంచి మెడిటరేనియన్ వరకు ఉన్న రాజ్యాలపై దీని ప్రభావం పడింది. 20 లక్షల సైనిక బలం మీద ఇది ఆధారపడి ఉన్నది. జర్మనీ దీనికి నాయకత్వం వహించింది. అంతర్జాతీయ రంగంలో జర్మన్ ప్రభావం మరీ కొట్టొచ్చినట్లు కనబడింది. జర్మన్ ఆధిపత్య రాజకీయాలు యూరప్‌లో చాలా రాజ్యాల మీద పడడం మొదలు పెట్టింది.

## 6. పునర్భద్రతా సంధి (క్రీ.శ. 1887) :

బాల్కన్‌లలో ఆస్ట్రియా-హంగరీ, రష్యాల మధ్య ఏర్పడ్డ సంఘర్షణ వల్ల రష్యా త్రిసామ్రాట్ మిత్ర మండలినుంచి 1887లో ఉపసంహరించుకొంది. జర్మనీపై యుద్ధం ప్రకటించి కక్ష తీర్చుకోవాలనే బాలాంజర్ ఉద్యమం ఫ్రాన్స్‌లో ఈ సమయంలో ప్రబలి ఉన్నది. ఈ పరిస్థితిని ఎదుర్కొడానికి బిస్మార్క్ కొన్ని అసాధారణ చర్యలు తీసుకోవడం మొదలు పెట్టాడు. ఆస్ట్రియా-హంగరీ, ఇటలీలతో త్రిరాజ్య సంధిని ఒకవైపు పటిష్టం చేసుకొంటూ వస్తూ మరోవైపు రష్యాతో బిస్మార్క్ రహస్యంగా మూడు సంవత్సరాల పునర్భద్రతా సంధి (Re-insurence Treaty) చేసుకొన్నాడు. ఈ రహస్యసంధి ప్రకారం కాన్‌స్టాంట్‌నోపిల్‌ను రష్యా ఆక్రమించుకోవడానికి, బల్గేరియాను రష్యన్ అధికార క్షేత్రంగా గుర్తించడానికి జర్మనీ అంగీకరించింది. జర్మనీ పై ఫ్రాన్స్ యుద్ధం ప్రకటిస్తే తటస్థంగా వ్యవహరించడానికి రష్యా అంగీకరించింది.

## 7. బిస్మార్క్ దౌత్యనీతి :

ఈ విధంగా అధికార విరమణ చేసే సమయానికి బిస్మార్క్ జర్మనీకి రక్షణ సంధులను ఏర్పరచాడు. జర్మనీపై ఆస్ట్రియా-హంగరీ దాడి జరిపితే రష్యా తటస్థ్యాన్ని, ఫ్రాన్స్ దాడి జరిపితే ఇటలీ మద్దతును, రష్యా, ఫ్రాన్సులు దాడి జరిపితే ఆస్ట్రియా-హంగరీ ఇటలీల సహాయాన్ని బిస్మార్క్, జర్మనీకి సంపాదించిపెట్టాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో అంగీకారం కుదుర్చుకోగల్గిన నేర్పరి బిస్మార్క్ "అయిదు బంతులతో గారడీ చేయగలవాడు అతడు ఒకడే వాటిలో రెండు ఎపుడూ గాలిలోనే ఉంటాయి." అని కైజర్ మొదటి విలియం బిస్మార్క్ రాజనీతిని గురించి ప్రస్తావించాడు. తాత్కాలికంగా బిస్మార్క్ ఫ్రాన్స్‌ను యూరప్‌లో ఏకాకిగా చేయగల్గాడు. అధికారంలో ఉన్నంత కాలం యధాస్థితిని కాపాడుకొంటూ శాంతిని పరిరక్షించాడు. కానీ బిస్మార్క్ నిర్మించిన సంధులు, ప్రతిసంధులు ఎక్కువ కాలం మన్నేవికావు. బిస్మార్క్ అధికార విరమణ చేయడానికి ముందే రష్యా, జర్మనీ నుంచి దూరమై ఫ్రాన్స్‌కు దగ్గర కావడం మొదలు పెట్టింది. బిస్మార్క్ విధానంలో మరికొన్ని లోపాలు పొడచూపాయి. ఆస్ట్రియా-హంగరీ, ఇటలీలతో కుదుర్చుకొన్న సంధుల పునాదులు బలహీనమైనవి. అదీగాక, తన మిత్ర సంధులు, ప్రతిమిత్ర సంధులలో బిస్మార్క్ బ్రిటన్‌కు స్థానం ఇవ్వలేదు. బిస్మార్క్ పదవీ విరమణ చేసే సమయానికి ఇంగ్లాండ్, జర్మనీల మధ్య సంబంధాలు బాగానే ఉన్నాయి. జర్మనీకి వ్యతిరేకంగా ఇంగ్లాండ్ ఏ విధమైన చర్య తీసుకొని ఉండలేదు. కానీ జర్మనీ నిర్మిస్తున్న సంధులవల్ల, యూరోపియన్ దౌత్య రంగానికి దూరంగా ఉండడం ప్రమాదకరమని బ్రిటన్ గ్రహించింది. అదే విధంగా బిస్మార్క్ కేవలం తాత్కాలికంగా మాత్రమే ఫ్రాన్స్‌ను వేరు చేయగలిగాడు. కానీ ఆ దేశానికి దగ్గరగా

రావడానికి కానీ, ఆ దేశాన్ని నిరాయుధం చేయడానికి కానీ ఎట్లాంటి ప్రయత్నం చేయలేదు. బిస్మార్క్ పన్నుతున్న వలయం నుంచి తప్పించుకోవడానికి ప్రతి సంధి కుదుర్చుకోకపోతే, అది ఆత్మహత్య లాంటిదని ఫ్రాన్స్ గుర్తించింది. ఈ కారణాల వల్ల, బిస్మార్క్ పదవీ విరమణ చేసిన తరువాత అతడి ఉన్నతాధికారులు విదేశాంగ విధానంలో గడ్డు సమస్యలే ఎదుర్కొన్నారు.

## 8. బిస్మార్క్ తరువాత జర్మన్ విదేశాంగ విధానం :

1890లో బిస్మార్క్ రాజీనామా చేసిన తరువాత 1914లో మొదటి ప్రపంచ యుద్ధం సంభవించే వరకూ జర్మన్ ఛాన్సలర్ పదవికి నలుగురు వచ్చారు. కానీ, జర్మన్ విదేశాంగ విధానం రూపొందించడంలోనూ, జర్మన్ విధానాలు కొత్త పుంతలు తొక్కడంలోనూ కైజర్ రెండో విలియం పాత్ర అధికంగా ఉన్నది. మంచి పాలకుడికి కావలసిన అర్హతలన్నీ రెండో విలియంకున్నాయి. బాగా కష్టపడి పనిచేసేవాడు. పురావస్తు విషయాలనుంచి సంక్లిష్టమైన సైనిక ఎత్తుగడలు, విధానాల వరకూ అర్థం చేసుకోవడానికి అతడు ప్రయత్నించేవాడు. కానీ, మంచి రాజనీతిజ్ఞునికి కావలసిన కొన్ని అర్హతలు అతనిలో లోపించాయి. దౌత్యనీతికి కావలసిన మితభాషిత్వం కానీ వాస్తవిక దృష్టికానీ అతడికి లేవు. అనవసరంగా ఇతరులను గాయపరిచే వాడు. ఉద్వేగ సిద్ధాంతాలలో తలదూర్చడం చేత బిస్మార్క్ మాదిరి ఏ విషయాన్ని విశ్లేషించి అవగాహన చేసుకోవడం అతడికి చేతగాని పని. బిస్మార్క్ మాదిరి రెండో విలియం "జర్మనీ తుష్టి చెందిన దేశం"గా భావించలేదు. జర్మనీ విస్తరణకు అతని దృష్టిలో అవధులు లేవు జర్మన్ ట్యుటానిక్ జాతి సర్వోత్కృష్టమైంది. అది ఒక యూరప్‌కే గాక మొత్తం ప్రపంచానికి ఆధిపత్యం వహించాలని రెండో విలియం ఆశయం. జర్మనీ, జర్మన్ సామ్రాజ్య ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వేదికలకు సంపూర్ణత లేదని కొత్త కైజర్ వాదన. కొత్త శతాబ్దం ప్రారంభమయ్యే కాలానికి ప్రపంచ రాజకీయాలలో జర్మనీ పలుకుబడి జర్మన్ విస్తరణ నీటిని అమలు చేయడానికి కావలసిన నౌకాబలం రెండో విలియం కార్యక్రమంలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. దీనివల్ల బిస్మార్క్ జర్మన్ విదేశాంగ విధానానికి వేసిన పునాదులు మొదలంతా కదలిపోయాయి. బిస్మార్క్ పదవీ విరమణ చేసిన 3 సంవత్సరాలలో పునర్భతా సంధి కాలం తీరిపోయింది. రష్యా జర్మనీకి దూరమై ఫ్రాన్స్‌తో మైత్రి కుదుర్చుకొంది. ఆరేళ్ళ తరువాత ఇంగ్లాండ్ కూడా జర్మనీకి దూరమైంది. 1907 నాటికి త్రిరాజ్య సంధికి ప్రతి సంధిగా త్రిదేశ సౌహార్థం (Tripple Entente) ఏర్పడింది. త్రిరాజ్య సంధిలో ఇటలీ పాత్ర నీరసించింది. .

## 9. ఫ్రాన్స్ - రష్యా మైత్రి (క్రీ.శ. 1893) :

1893కు చాలా సంవత్సరాల ముందు నుంచే ఫ్రాన్స్-రష్యా మైత్రి సంధిని గురించిన వార్తలు ప్రపంచంలో ఉన్నాయి. రెండు దేశాలలోని అధికార, అనధికార రంగాలలో దీన్ని గురించి తర్జన భర్జనలు జరుగుతూ వచ్చాయి. కానీ దీనికి ఒక రూపం అంటూ వచ్చి, దీనిపై సంతకాలు జరిగేటప్పటికి కొంతకాలం పట్టింది. ఫ్రాన్స్-రష్యా సంధి కుదరడంలో గల జాప్యానికి కారణాలున్నాయి. 1871 నుంచి 1890 దాకా ప్రపంచ రాజకీయాల్లో ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడం బిస్మార్క్ దౌత్యనీతిలో ప్రాముఖ్యం సంతరించుకొంది. రష్యా, ఫ్రాన్స్‌లు దగ్గరకు చేరుకోకుండా చేయడానికి బిస్మార్క్ విశ్వ ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు. 1873 నుంచి 1878 వరకూ అమల్లో ఉన్న త్రిసామ్రాట్ మిత్రమండలి బిస్మార్క్ విధానానికి బాగా అనుకూలించింది. 1879 నుంచి 1881 వరకూ జర్మనీ, రష్యాల మధ్య సంబంధాలు చెడిన కారణంగా ఫ్రాన్స్, రష్యాల మధ్య సంధి కుదిరే అవకాశం ఏర్పడింది. దాంతో బిస్మార్క్ కొద్దిపాటిగా ఫ్రెంచ్ అనుకూల విధానం అనుసరించి జర్మనికి ఆ ప్రమాదం నుంచి తప్పించాడు. పునర్భద్రతా సంధిని 1887లో కుదుర్చుకొని రష్యా, ఫ్రాన్స్ వైపు మొగ్గకుండా 1890 వరకూ బిస్మార్క్ జాగ్రత్త పడ్డాడు. ఫ్రాన్స్-రష్యా మైత్రి సంధి జాప్యానికి మరోకారణం ఉన్నది. ఈ సమయంలో ఫ్రాన్స్‌లో చాలా మంత్రి వర్గాలు మారుతూ వచ్చాయి. మంత్రి వర్గం రష్యాతో సంప్రదింపులు జరుపుకొని సంతకాలు చేసే సమయానికి ఆ మంత్రి వర్గం పడిపోయి మరో మంత్రి వర్గం అధికారానికి వచ్చేది. ఫ్రాన్స్-రష్యాల మధ్య మైత్రి సంధి రహస్యంగా ఉండాలి. మంత్రి వర్గాలు తరచూ మారుతుంటే అది సాధ్యపడదని జార్ అభిప్రాయపడ్డాడు. అదీగాక రష్యా అధిరాజరికం నెలకొన్నదేశం ఫ్రాన్స్‌లో ప్రజాస్వామ్యం అమలులోఉంది. ఈ రెండు పరస్పర విరుద్ధ రాజకీయ వ్యవస్థల వల్ల రష్యా, ఫ్రాన్స్‌ల మధ్య మైత్రి అసంభవమని జార్ చాలాకాలం వరకు భావించాడు. ఈ కారణాలున్నప్పటికి ఫ్రాన్స రష్యాలు తమ స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మిత్రసంధిని కుదుర్చుకొన్నాయి.

తనమీద దాడి జరిగే పక్షంలో తనకు అండగా నిలుస్తుందా అని ఫ్రాన్స్, రష్యాను 1873లో వాకబు చేసింది. ప్రత్యక్ష సహాయం అందిస్తానని వాగ్దానం చేయకపోయినా ఫ్రాన్స్ సమైక్యంగానూ, పటిష్టంగానూ ఉండాలనేది తన అభిమతమని రష్యా సమాధానం చెప్పింది.

1875 లో జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య యుద్ధ మేఘాలావరించాయి. అప్పుడు జార్ తన విదేశాంగ మంత్రి గోర్చికోవ్‌తో బెర్లిన్ వెళ్ళి ఫ్రాన్స్‌పై జర్మనీ దాడిచేస్తే రష్యా తటస్థంగా ఉండదని జర్మన్ పాలక వర్గాలను హెచ్చరించాడు. అప్పటినుంచి రష్యా, ఫ్రాన్స్ మధ్య సంబంధాలు మెరుగవడం మొదలు పెట్టాయి. 1887లో బౌలంజర్ ఉద్యమం ఉధృతమై ఫ్రాన్స్, జర్మనీల మధ్య యుద్ధం సంభవించే పరిస్థితి తిరిగి ఏర్పడింది. యుద్ధమే వస్తే తన వైఖరి ఏ విధంగా ఉంటుందో తెలియజేయమని బిస్మార్క్-రష్యాను కోరాడు ఇంత వరకూ జరిగిన మూడు యుద్ధాల్లో రష్యా తటస్థంగా ఉందనీ, ఇకమీదట తటస్థంగా ఉండటం రష్యన్ ప్రయోజనాలకు ప్రమాదకరమని ఫ్రాన్స్ పతనమైతే యూరప్‌లో తుల్య ప్రాబల్యం చెందుతుందని జార్ హెచ్చరించాడు. దీనితో ఆగక తన నైతిక సహకారాన్ని ఫ్రాన్స్‌కు అందించడానికి రష్యా సిద్ధంగా ఉన్నదని కూడా జార్ స్పష్టం చేసాడు. 1883లో రష్యన్ గాండ్ డ్యూక్ ఫ్రాన్స్‌లో పర్యటన చేసాడు. ఫ్రాన్స్ ఉత్పత్తి చేస్తున్న కొత్త తరహా రైఫిళ్ళను పరిశీలించడానికి అతడు అనుమతికోరాడు. కొంతసేపు ఫ్రాన్స్ తటపటాయించి ఆ తరువాత అనుమతించింది. 1889లో 500,000 రైఫిళ్ళను కొనుగోలు చేయడానికి రష్యా నిశ్చయించింది. 1990లో ఫ్రెంచి రైఫిళ్ళు రష్యాకు ఎగుమతి కావడం మొదలు పెట్టాయి. సైనిక సమీకరణ, రవాణా సరఫరాలు మొదలైన విషయాలలో రష్యన్ సైనికోద్యోగులు ఫ్రాన్స్‌లో శిక్షణ పొందడం ప్రారంభించారు. ఆయుధాల ఉత్పత్తిలో రష్యాకు సాంకేతిక సలహా లివ్వడానికి ఒక ఫ్రెంచి ఇంజనీర్ సెంట్ పీటర్స్ బర్గ్‌లో దిగాడు. 1883లో రష్యన్ ప్రభుత్వం ఫ్రాన్స్ నుంచి ఋణం తీసుకోదలచింది. దీనికి ఫ్రాన్స్‌లో మంచి ఆదరణ లభించింది. 1889లో తిరిగి ఫ్రాన్స్ నుంచి మరో ఋణం రష్యా సంపాదించింది. ఫ్రాన్స్‌లో ముట్టిన ఋణాలవల్ల బెర్లిన్ మీద ఆధారపడవలసిన అవసరం సెంట్ పీటర్స్ బర్గ్‌కు లేకుండా పోయింది. అంత పెద్ద మొత్తంలో ఋణాలు ఒక పెద్ద రాజ్యం మరో పెద్ద రాజ్యానికి మిత్ర సంధి వున్నందువల్లనైనా గాని, లేదా ఏర్పడుతుందనే భావం వల్లనైనాగానీ ఇవ్వడం జరుగుతుందని జి.పి. గూచ్ విశ్లేషించి చెప్పాడు. ఫ్రాన్స్, రష్యాల మధ్య సంబంధాలు పటిష్టం కావడానికి 1890 మార్చిలో ఫ్రాన్సులో ఫ్రెసైన్ (Freycinet) మంత్రి వర్గం ఏర్పడ్డం బాగా దోహదం చేసింది. ప్రధాని కావడానికి ముందు ఫ్రెసైన్ యుద్ధమంత్రిగా పనిచేసాడు. ఈ సమయంలోనే ఫ్రెంచి రైఫిళ్ళను రష్యా కొనుగోలు చేసుకోవడం రష్యన్ సైనికులకు ఫ్రెంచి నిపుణులు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఫ్రెంచి అధ్యక్షుడు కార్నో (Carnot) విదేశాంగ మంత్రి రైబా (Ribot), ఫ్రాన్స్ - రష్యా మిత్ర సంధికి సుముఖంగా ఉన్నారు. బిస్మార్క్ రాజీనామా అతడి తరువాత జర్మన్ ఛాన్స్‌లర్ అయిన కాప్రివీ పునర్భద్రతా సంధికి తిలోదకాలివ్వడం వల్ల ఫ్రాన్స్, రష్యాల మధ్య మిత్రసంధి ఏర్పడ్డానికి అడ్డంకులు తొలగిపోయాయి. 1890 మే నెలలో రష్యన్ గ్రాండ్ డ్యూక్ నికలస్ తిరిగి ఫ్రాన్స్‌లో పర్యటించాడు. యుద్ధ సమయంలో రెండు దేశాలు కలిసి కట్టుగా ఉండాలని ఈ విధంగా ఉంటే ప్రపంచములో ఏ శక్తికూడా ఫ్రాన్స్, రష్యాలను కదలించలేవనీ ఫ్రెంచి ప్రధాన మంత్రికి నికలస్ తెలియజేసాడు. 1890 మేలో ఫ్రెంచి ప్రభుత్వం జార్‌కు గొప్ప సహాయం చేసింది. రష్యన్ శూన్యవాదులు చాలా మంది ఫ్రాన్స్‌లో తలదాసుకొంటున్నారు. వారిలో కొందరు శక్తివంతమైన పేలుడు పదార్థాలలో రష్యాకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. అట్లాంటి 9 మంది శూన్య వాదులను అరెస్టు చేయించి ఫ్రెంచి ఆంతరంగిక శాఖామంత్రి కాన్‌స్టాన్ (Constan) జార్ కృతజ్ఞతకు పాత్రుడయ్యాడు. 1891 జులై 23న ఫ్రెంచి నౌకాదళం ఒకటి కార్న్‌స్టాండ్ (Karnstand) చెరలోంచి క్రిమియన్ యుద్ధానంతరం మొదటిసారిగా రష్యన్ సముద్ర జలాల్లోకి సుహృద్భావ పర్యటన చేసింది. కానీ ఇది సుహృద్భావ పర్యాటన. ఫ్రెంచి నౌకాదళానికి మంచి ఆదరణ లభించింది. ఫ్రెంచి నౌకాదళం రష్యన్ జాతీయ గీతాన్ని ఆలపించిన తరువాత జార్ ఫ్రెంచి జాతీయ గీతాన్ని రష్యాలో ఆలపించమని ఆదేశించాడు. ఫ్రెంచి జాతీయగీతాన్ని బహిరంగంగా రష్యాలో ఆలపించకూడదనే నిషేధం దీనితో పోయింది. ఫ్రెంచి నావికులకు ప్రతిచోటా ఘన సన్మానం లభించింది. ముఖ్యంగా మాస్కో, పెట్రో గ్రాడ్‌లలో ఫ్రెంచి నావికులపట్ల రష్యన్‌లు ప్రదర్శించిన ప్రేమాభిమానాలు మరపురానివి. ఫ్రెంచి నౌకాదళానికి చెందిన నౌకలు రష్యన్ ఓడరేవుల్లో లంగరు వేసుకోవడంతో రష్యా-ఫ్రాన్స్‌ల మధ్య మైత్రి కుదిరినట్లయిందని కొందరి భావన, ఇకదాన్ని అధికార పూర్వకంగా ప్రకటించడమే తరువాయి. 1893లో ఒక రష్యన్ నౌకాదళం తూలూన్ (Tulon)లో తిరుగు పర్యటన జరిపింది. పారిస్ నగర వీధుల్లో ఫ్రెంచి పురుషులు స్త్రీలు రష్యన్ నావికులను తీసుకొని వెడుతున్న శకటాల వెంట ఆనందోత్సాహాలతో పరుగులెత్తారు. రష్యన్ నౌకాధికారులు తరచు తమకేర్పరచిన వసతి గృహాల నుంచి బయటకు వచ్చి వారి కోసం గుమిగూడి ఉన్న ఫ్రెంచి వారికి దర్శనం

ఇవ్వవలసి వచ్చింది. రష్యన్ నావికులు తమ 'గ్లౌవ్స్' (Gloves)లను చించి ఆ ముక్కలను జ్ఞాపికల కింద ఫ్రెంచి వారికి పంచి పెట్టారు. పారిస్, తూలూన్‌లలో రష్యన్‌లకు బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. రష్యన్ నావికులకు లభ్యమైన స్వాగతం జార్‌కు కూడా సంతోషాన్ని కలిగించింది. దీనితో ఫ్రాన్స్, రష్యాలు తాము మిత్ర రాజ్యాలు కలిసి ప్రకటించుకొన్నట్లయింది. ఫ్రాన్స్, రష్యా ద్విపక్ష మైత్రి పత్రంపైన 1893 డిసెంబర్ 31న సంతకాలు జరిగాయి.

### ఈ సంధి ప్రకారం :

1) ఫ్రాన్స్‌పై జర్మనీ కాని జర్మనీ సహాయంతో ఇటలీగానీ దాడి జరిపితే తన సర్వసైనిక బలంతో రష్యా జర్మనీతో తలపడుతుంది. రష్యాపై జర్మనీగాని, జర్మనీ సహకారాంతో ఆస్ట్రియా-హంగరీగాని దాడి జరిపితే ఫ్రాన్స్ తన సైన్యమంతటితో జర్మనీపై యుద్ధానికి దిగుతుంది.

2) త్రిరాజ్య సంధి సభ్యదేశాలు లేదా ఏదేని త్రిరాజ్య సంధి సభ్యదేశం తన సైన్యాలను సమీకరించుకొంటే రష్యా, ఫ్రాన్స్‌లు, ఎట్లాంటి ప్రాధమిక చర్యలు లేకుండానే తమ తమ సైన్యాలను సమీకరించుకొని సరిహద్దులో మోహరింపజేయాలి.

3) జర్మనీకి వ్యతిరేకంగా ఫ్రాన్స్ 1,30,000 మంది సైనికులను రష్యా 7 నుండి 8 లక్షల సైనికులను నియోగిస్తాయి. దీనివల్ల జర్మనీ తూర్పు, పశ్చిమరంగాల్లో ఏకకాలంలో యుద్ధం చేయవలసి వచ్చింది.

4) పై షరతులును అమలు చేయుటకు రెండు దేశాల సైనికాధికారులు ఎల్లవేళలా సహకరించుకొంటారు. శాంతి కాలంలో త్రిరాజ్య సంధి సభ్య రాజ్యాల సైనిక విషయాలను గురించి ఎప్పటికప్పుడు ఫ్రెంచి, రష్యన్ సైనికాధికారులు సమాచారం అందించుకొంటారు. యుద్ధ కాలంలో సమాచారం ఏ విధంగా అందించుకోవాలో తరవాత నిర్ధారించడం జరుగుతుంది.

5) యుద్ధానంతరం విడి విడిగా రష్యా, ఫ్రాన్సులు శత్రు దేశంతో శాంతికోసం ఒప్పందం కుదుర్చుకోకూడదు.

6) త్రిరాజ్య సంధి అమలులో ఉన్నంతకాలం పై షరతులు అమలులో ఉంటాయి. ఫ్రాన్స్, రష్యాల మధ్య సంధికుదిరిందని అందరకు తెలిసినా దానిని 1895 జనవరిలోగాని అధికార పూర్వకంగా ప్రకటించలేదు. ఫ్రాన్స్, రష్యా మైత్రి ఒప్పందం కైజర్‌ను బాగా కలవర పెట్టింది. 1895 సెప్టెంబర్ అక్టోబర్‌లలో, జార్‌కు కైజర్ పంపిన లేఖల్లో ఇది బాగా బైటపడింది.

ఫ్రెంచి రిపబ్లికన్‌లు స్వభావ సిద్దంగా విప్లవకారులని, ఫ్రెంచి రిపబ్లిక్, రష్యాతో సహా మొత్తం యూరప్‌ను నెత్తురులో ముంచెత్తుతుందనీ అందువల్ల క్రైస్తవ పాలకులు, చక్రవర్తులు, ఫ్రాన్స్‌తో సంబంధాలు పెట్టుకోకూడదనీ రిపబ్లికన్ ఫ్రాన్స్‌తో మిత్ర సంధి ఏ దృష్టితో చూసినా పనికి రాదని కైజర్ జార్‌ను హెచ్చరించాడు. కానీ కైజర్ హెచ్చరికలను జార్ పెడచెవిన పెట్టాడు. 1917లో జార్ వ్యవస్థ రష్యాలో అంతమయ్యే వరకూ రష్యా-ఫ్రాన్స్ మిత్ర సంధి అమలులో ఉన్నది. 1896లో జార్, జారినా ఫ్రాన్స్‌లో పర్యటించారు మూడో రిపబ్లిక్ కాలంలో ఇంత వరకూ ఎప్పుడూ ఐరోపా రాజులెవ్వరూ ఫ్రాన్స్‌లో పర్యటించి ఉండలేదు. 1897లో ఫ్రెంచి అధ్యక్షుడు ఫారీ (Faure) రష్యాలో పర్యటించగా అతడి కక్కడ బ్రహ్మాండమైన సత్కారం లభించింది. ఫ్రాన్స్, రష్యాల మధ్య కుదిరిన ద్విపక్ష మైత్రి ఫ్రాన్స్ రష్యాలకే గాకుండా ఐరోపా మొత్తానికి ప్రధాన సంఘటన. దాంతో ఐరోపా చరిత్రలో నూతనాధ్యయం ప్రారంభమైంది. అంతర్జాతీయంగా తాను ఏకాకినై పోయాననే భీతి ఇపుడు ఫ్రాన్స్‌కు తొలగిపోయింది. "ఇపుడు మనం ఎవరిని గురించి భయపడనవసరం లేదు." అని ఫ్రాన్స్ అధికార పూర్వకంగా ప్రకటించింది. రిపబ్లికన్‌లు ఫ్రాన్స్‌తో చేతులు కలిపాయేమోనన్న అనుమానం కూడా రష్యా త్వరలోనే వదులుకొంది. దూర ప్రాచ్యంలో విస్తరించుకొంటూ పోవాలనుకొన్న రష్యాకు, ఫ్రాన్స్ అవసరం ఎంతో ఉన్నది ముఖ్యంగా సైబీరియన్ రైల్వే నిర్మాణానికి ఫ్రెంచి పెట్టుబడులు రష్యాకు చాలా ఉపకరిస్తాయి. తేలిక వడ్డీలతో రష్యాకు అప్పులివ్వడానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉన్నది. ఫ్రాన్స్-రష్యా మైత్రి సంధి మొదట రక్షణ సంధిగా ఉన్నా, దక్లాసా (Declasse) ఇజ్వోల్‌స్కీ కాలంలో అది సైనిక సంధిగా మారింది.

## 10. ఇంగ్లాండ్ - ఫ్రాన్స్ సౌహార్దం (1904) :

బ్రిటన్ ఫ్రాన్స్‌ల మధ్య వలసల విషయాల్లో చాలా కాలంగా మనస్పర్థలు ఏర్పడినాయి. 1898లో ఈ మనస్పర్థలు పరాకాష్ట నందుకొని ఈ రెండు దేశాల మధ్య యుద్ధం సంభవించే పరిస్థితి ఏర్పడింది. ఫ్రెంచి సైన్యానికి చెందిన కెప్టెన్ జీన్ బాప్టిస్టు మార్షా (Captain Jean Baptiste Marchand) 1898 జులై 16న ఫిషోడా చేరుకొన్నాడు. మార్షా స్థానిక ప్రముఖునితో ఒప్పందం కుదుర్చుకొని ఫి షోడా కోటపై ఫ్రెంచి పతాకాన్ని ఎగురవేశారు. ఇది జరిగిన పక్షం రోజుల తరువాత మార్షా సైన్యం కన్నా పెద్ద సైన్యంతో జనరల్ హెర్బర్ట్ కిచ్‌నర్ (General Herbert Kitchner) అక్కడకు చేరుకున్నాడు. రెండు సైన్యాలు ఘర్షణకు జరిగే ప్రమాదం ఏర్పడింది. కానీ మార్షా కిచ్నర్‌లు దూర దృష్టిని ప్రదర్శించి ఘర్షణ తప్పించారు. కోట బయట ఈజిప్షియన్ పతాకాన్ని, కోటపై ఫ్రెంచి పతాకాన్ని ప్రస్తుతానికి ఎగురవేసి ఇరువురూ సమ్మతించి సమస్య శాశ్విత పరిష్కారాన్ని తమదేశ ప్రభుత్వాలకు వదిలివేయాలని మార్షా-కిచ్నర్‌లు అంగీకరించారు. ఫ్రెంచి విదేశాంగ మంత్రి దక్లాసా ఇంగ్లాండుతో యుద్ధానికి దిగడం ఆత్మహత్యాసదృశ్యమౌతుందని గ్రహించాడు. ఫిషోడా నుంచి సైన్యాన్ని ఉపసంహరించడానికి అతడు నిర్ణయించాడు. 1898లో కుదిరిన ఒడంబడిక ప్రకారం ఆఫ్రికాపటంపై గీసిన రేఖకు పడమర ఇంగ్లాండ్ తూర్పున ఫ్రాన్స్ ఆక్రమించుకోకూడదని రెండు దేశాలు అంగీకరించాయి. 1898 ఒప్పందం ఫ్రాన్స్‌లో జనాదరణ పొందలేదు. బ్రిటన్ ఒత్తిడికి దక్లాసా లొంగిపోవటాన్ని ఫ్రెంచి రాజకీయ వేత్తలు చాలా మంది భావించారు. ఆఫ్రికాలో బోయర్ యుద్ధం ప్రారంభం కావడంతో ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌ల మధ్య సంబంధాలు తిరిగి చెడిపోయాయి. బోయర్లకు బ్రిటన్‌కు జరిగిన యుద్ధంలో బోయర్లను ఫ్రాన్స్ సమర్థిస్తే, బ్రిటన్‌ను జర్మనీ సమర్థించింది. ఈ కారణంగా బ్రిటన్‌లో తీవ్రమైన వ్యతిరేక భావం పెల్లుబికింది. విక్టోరియా మహారాణి అంత్యక్రియలకు రెండో విలియం హాజరయ్యాడు. దీనివల్ల బ్రిటన్, జర్మనీలు కొద్దిగా దగ్గరయ్యాయి. బ్రిటన్, జర్మనీతో సంధి కుదుర్చుకోవడానికి ప్రయత్ని విండి. కానీ జర్మనీ దానికి సుముఖతను చూపించలేదు.

బ్రిటన్ ఫ్రాన్స్‌ల మధ్య ఏర్పడ్డ భేదాభిప్రాయం ముఖ్య కారణం ఈజిప్టు, మొరాకోలలో వారి వ్యాపార ప్రయోజనాలు, రాజకీయ ప్రాబల్యాలను గూర్చిన స్పర్ధలు. అవి తేలికగా నివారించరానివి, ఉభయదేశాల నడుమ మైత్రి ఒడంబడికలు అసాధ్యమనిపించే స్థాయికి చెందినవి. అయితే, ఉభయులు తమపట్ల జర్మనీ అవలంబించిన వైఖరి వలన తెలివి తెచ్చుకున్నారు. ఈజిప్టులో ఇంగ్లాండ్, మొరాకోలో ఫ్రాన్స్ తమ ఇష్టం వచ్చిన విధంగా వ్యవహరించుకోవచ్చునని ఆ రెండు దేశాలు అంగీకరించాయి. ఫ్రెంచి అధ్యక్షుడు ఎమిలీలూబా (Emileloubet) విదేశాంగ మంత్రి దక్లాసా ఏడో ఎడ్వర్డ్‌కు సింహాసనం అధిష్టించే సమయంలో శుభాకాంక్షలు అందించారు. ఇంగ్లీష్ రాజుకు ఇది చాలా సంతోషం కలిగించింది. జర్మన్‌లు అన్నా, రెండో విలియం అన్నా ఎడ్వర్డ్‌కు అమిత అసహ్యం. రెండో విలియం చాలా పర్యాయాలు ఎడ్వర్డ్‌ను అవమానించాడు. ఈ పరిస్థితి దృష్ట్యా గమనిస్తే ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల పాలకుల మధ్య సంబంధాలు క్రమంగా మెరుగవుతూ వచ్చాయి. ఫ్రాన్స్‌లో ఎడ్వర్డ్ ఎప్పుడు పర్యటించినా అతడికి మంచి సత్కారం లభించింది. 1903లో తిరిగి అతడు ఫ్రెంచి పర్యటనకు వెళ్లగా పారిస్ నగరవాసులు అతడికి బ్రహ్మాండంగా స్వాగతం పలికారు. ఫ్రెంచి అధ్యక్షుడు విదేశాంగ మంత్రి ఇంగ్లాండ్‌లో పర్యటిస్తే అక్కడ అన్ని విధాలైన సత్కారాలు లభించాయి. తరువాత ఇంగ్లాండు ఫ్రాన్స్‌లు అధికార వర్గాల వారి మధ్య దాదాపుగా ఒక సంవత్సరం పాటు సంప్రదింపులు జరిగాయి. వీటి పర్యవసానంగా రెండు దేశాల మధ్య మైత్రి సంధి కుదిరింది. 1904 ఫిబ్రవరి 8న మైత్రి సంధి మీద రెండు దేశాల సంతకాలు చేసాయి. దీన్ని ఆంగ్లో - ఫ్రెంచి సౌహార్దం (Anglo-French Entente) అంటారు. ఈ ఒప్పందం సంపూర్ణంగా వలసల విషయాలకు మాత్రమే పరిమితమైనటువంటిదని బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి లార్డ్ లాండ్స్ డౌన్ (Lord Lands down) అభిప్రాయపడ్డాడు. మొత్తం మీద ఈ ఒడంబడిక అటువంటిదేనని స్థూలంగా చెప్పవచ్చు. సౌహార్ద సంధిలోని ముఖ్య షరతుల ప్రకారం ఈజిప్టులో ఇంగ్లాండుకు ప్రత్యేక స్థానం ఉందని ఫ్రాన్స్, మొరాకోలో ప్రత్యేక స్థానం ఫ్రాన్స్‌కుందని ఇంగ్లాండు అంగీకరించాయి. దీనివల్ల ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు ఉత్తర ఆఫ్రికాలో రెండు అధికార క్షేత్రాలను ఏర్పాటు చేసుకొని వాటిని గుర్తుంచుకొన్నట్లయింది. సయాం, మెడగాస్కర్, న్యూహెబ్రిడీస్, న్యూఫౌండ్‌లాండ్ పశ్చిమ ఉత్తర ఆఫ్రికాలలో గూడా ఈ సౌహార్దం వల్ల వివాదాలను ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌లు పరిష్కరించుకొన్నాయి. 1904 ఆంగ్లో - ఫ్రెంచి సౌహార్దంలో ఎటువంటి సైనిక షరతులు లేకపోయిన కొన్ని పరిస్థితుల వల్ల రెండు దేశాలు ముందు సంవత్సరాలలో ఇంకా దగ్గరకు చేరుకున్నాయి. జర్మనీ తన నౌకాశక్తిని పెంచుకొంటూ వచ్చింది. తననౌకా

దళాన్ని తన నౌకాధిపత్యాన్ని యధాతథంగా పరీక్షించుకోదలిస్తే ఇంగ్లాండ్, జర్మనీకన్నా ఎక్కువ నౌకలు నిర్మించుకొన వలసింది. పసిఫిక్ నుంచి తన యుద్ధ నౌకలను ఉపసంహరించి వాటిని ఉత్తర సముద్రానికి ఇంగ్లాండ్ తరలించదలచింది. మెడిటరేనియన్ నుంచి కూడా యుద్ధ నౌకలను ఇంగ్లాండ్ ఉపసంహరించుకోదలచింది. మెడిటరేనియన్ మిత్ర దేశనౌకలు గస్తీ తిరిగితే అది వీలుపడుతుంది. మెడిటెరేనియన్ పై ఫ్రాన్స్‌కు ఆధిపత్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌కు దగ్గర కావడం మొదలుపెట్టింది. 1905, 1906, 1908, 1911లలో మొరాకోలో ఉద్రిక్తత ఏర్పడింది. అయినా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, సౌహార్థం చెక్కు చెదరలేదు సరికదా, అది ఇంకా పటిష్టమైంది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య సహకారం రోజు రోజుకు ఎక్కువై 1912లో హాల్డెన్ మిషన్ బ్రిటన్‌లో పర్యటించేటపుడు జర్మనీ స్నేహం కోసం ఫ్రాన్స్‌ను వదులుకొనేది లేదని బ్రిటీషు విదేశాంగ కార్యదర్శి సర్ ఎడ్వర్డ్‌గ్రే (Sir Edward Grey) తెలియజేసాడు. ఇంగ్లాండు భద్రతకు పటిష్టమైన ఫ్రాన్స్ ఎంతో అవసరమని ఇంగ్లాండ్ రాజకీయ వర్గాలవారు గుర్తించారు. నౌకా విషయాల్లో గూడా రెండు దేశాలు సహకరించుకోవడం మొదలు పెట్టాయి. 1912 జులైలో రెండు దేశాల మధ్య నౌకా ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం మెడిటేరేనియన్‌లో ఇంగ్లీషు, ఫ్రెంచి ప్రయోజనాలను ఫ్రాన్స్ కనిపెట్టి ఉండేటట్లు, ఇంగ్లీషు ఛానెల్‌లో రెండు దేశాల ప్రయోజనాలను ఇంగ్లాండ్ కనిపెట్టి ఉండేటట్లు రెండు దేశాలు అంగీకరించాయి. 1914 ఆగస్ట్ 3వ కామన్స్ సభలో మాట్లాడుతూ సర్ ఎడ్వర్ట్‌గ్రే, ఫ్రాన్స్‌కు సహాయంగా జర్మనీతో యుద్ధానికి దిగడానికి ఇంగ్లాండ్ సమ్మతించలేదని చెప్పాడు. అయినా యుద్ధమే సంభవిస్తే ఫ్రాన్స్‌కు మద్దతుగా నిలవడం ఇంగ్లాండ్ నైతిక బాధ్యత అని ఇంగ్లాండ్ రాజనీతిజ్ఞులందరు గుర్తించారు.

## 11. త్రిదేశ సౌహార్థం :

19వ శతాబ్దంలో ఇంగ్లాండ్ ఐరోపా రాజకీయ దౌత్య రంగం నుంచి చాలా వరకూ దూరంగా ఉంటూ వచ్చింది. కానీ 19వ శతాబ్ది చివరి నాటికి అట్లాంటి విధానం వల్ల తాను చాలా పోగొట్టుకున్నానని తన ప్రయోజనాలకది అనుగుణంగా లేదని ఇంగ్లాండ్ గుర్తించింది. ఈ కారణం ఇంగ్లాండ్ 1902లో ఆంగ్ల - జపాన్ మైత్రి సంధిని, 1904లో ఆంగ్ల - ఫ్రెంచి సౌహార్థాన్ని కుదుర్చుకొంది. 1904 నాటి ఆంగ్ల-ఫ్రెంచి సౌహార్థం సైనిక సంధి గాకపోయినా రెండు దేశాలు బాగా దగ్గరకు వచ్చి మొరాకో విషయంలో 1906, 1908, 1911లలో ఫ్రాన్స్‌కు ఇంగ్లాండ్ బాగా అండగా నిలిచింది. ఇంగ్లాండ్, రష్యాల మధ్య మైత్రికుదరకపోతే ఇంగ్లాండ్-ఫ్రాన్స్ సౌహార్థం నిస్సారమౌతుందని ఫ్రాన్స్ గ్రహించింది. దక్లాసా అధికారంలో ఉన్నంత కాలం ఇంగ్లాండ్, రష్యాలను దగ్గరకు తీసుకొని రావడానికి చేయగల్గిందంతా చేసాడు. ఇంగ్లాండ్, రష్యాల మధ్య యుద్ధం సంభవిస్తే 1893 నాటి ఫ్రాన్స్-రష్యా సౌహార్థం నీరసించి పోతుందని దక్లాసా భావించాడు. ఇంగ్లాండ్ - రష్యాల మధ్య యుద్ధం ఏర్పడితే రష్యా, జర్మనీతో కలసి పోతుందనీ ఈ పరిణామం వల్ల ఫ్రాన్స్‌కు తీవ్రహాని జరుగుతుందనీ కూడా దక్లాసా గ్రహించాడు. 1904-1905 రష్యా-జపాన్ యుద్ధం వల్ల రష్యా బాగా బలహీన పడింది. భవిష్యత్తులో తిరిగి జపాన్‌తో యుద్ధం సంభవించవచ్చు రష్యా తన కాళ్ళమీద తాను నిలబడి శక్తి పుంజుకోవడానికి శాంతి చాలా అవసరం.

జపాన్-మిత్ర దేశమైన ఇంగ్లాండ్ సహకరిస్తే రష్యాకు శాంతి చేకూరుతుంది. రష్యా-జపాన్ యుద్ధ కాలంలోనే ఇంగ్లాండ్ రష్యా సంబంధాల గురించి ఏడో ఎడ్వర్డ్. రష్యా ప్రతినిధి ఇద్వోల్‌స్కీ మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య మైత్రి కుదిరితే బాగుటుందని ఇరువురూ అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌తో సంబంధాలు మెరుగు పడితే బాల్కన్‌లలో దూర ప్రాచ్యంలో ఇనుమడించిన ఉత్సాహంతో తన విధానాలను అమలు చేసుకోవచ్చునే అభిప్రాయం రష్యాకు ఏర్పడింది. ఏడో ఎడ్వర్ట్, సర్ ఎడ్వర్ట్ గ్రే ఇద్దరూ రష్యాతో మిత్ర సంధి కుదుర్చుకోవడానికి అనుకూలంగా ఉన్నారు. 1905-1906లో సంభవించిన ఉద్రిక్తత వల్ల నానాటికీ పెరరిగుతున్న జర్మన్ శక్తివల్లా ఇంగ్లాండ్‌లో భయాందోళనలు ఏర్పడ్డాయి. రష్యాతో మైత్రి సంధి ఇంగ్లాండ్‌కు ప్రయోజనకారిని రష్యా బ్రిటీష్ రాయబారిగా మాస్కోలో పని చేసిన సర్ ఛార్లెస్ హాడింజ్ అభిప్రాయపడ్డాడు. అతడు ప్రస్తుత సమయంలో ఇంగ్లాండ్ రాయబారిగా మాస్కోలో పనిచేస్తున్న, సర్ ఆర్థర్ నికల్సన్ విదేశాంగ కార్యదర్శి సర్ ఎడ్వర్ట్ గ్రేలకు రష్యాతో సంబంధాలు మెరుగు పరచుకోవలసిన ఆవశ్యకత గురించి విశ్లేషించి చెప్పాడు. 1906లో మేలో ఇజ్వోలెస్కీ రష్యా విదేశాంగ మంత్రికాగానే రష్యా-ఇంగ్లాండుల మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. 1902 మార్చిలో రష్యా నౌకాదళం ఒకటి పోర్ట్స్‌మౌతలో సుహృద్భావ పర్యటన జరిపింది. బ్రిటీష్ ప్రభుత్వ ఆహ్వానంపై రష్యా నౌకాదళం ఇంగ్లాండ్ పోయింది. ఈ సందర్భంగా జరిగిన వేడుకలకు బ్రిటీషు నౌకాదళాధిపతి సర్‌జాన్ ఫిషర్ బ్రిటీష్ విదేశాంగ కార్యదర్శి సర్ ఎడ్వర్డ్

గ్రే హాజరయ్యారు. ఇంగ్లాండ్ - రష్యా సౌహార్ధ సంధికి మరో అడ్డంకి ఈ విషయంలో రష్యా-జపాన్‌ల మధ్య సంప్రదింపుల ప్రారంభం కావడంతో ఆ అడ్డంకి తొలగిపోయింది. టిబెట్ ఆఫ్ఘనిస్థాన్ పర్షియాలకు సంబంధించిన వివాదాలకు 1902 సౌహార్ధంతో రష్యా ఇంగ్లాండ్‌లు పరిష్కరించుకొన్నాయి. ఏమైనా 1904 నాటి ఫ్రాన్స్-ఇంగ్లాండ్ సౌహార్ధం, 1907న ఇంగ్లండ్ - రష్యా సౌహార్ధం కలసిపోయి ఈ మూడు దేశాల మధ్య సౌహార్ధంగా రూపం సంతరించుకొన్నాయి.

**కూటముల మధ్య పందెం :** క్రీ.శ. 1907-1914 మధ్య కాలంలో త్రిరాజ్య కూటమిలో దేశాలు, త్రిరాజ్య మిత్ర దేశాల మధ్య పందెం విపరీతంగా పెరిగిపోయింది. త్రిరాజ్య మిత్ర సంధిని కట్టుదిట్టం చేయడానికి జర్మనీ అన్ని ప్రయత్నాలు చేసింది. త్రిరాజ్య సౌహార్ధాన్ని పటిష్టం చేయడానికి ఫ్రాన్స్ అన్ని విధాలా కృషి చేసింది. త్రిరాజ్య సంధి కాల పరిమితిని క్రీ.శ. 1907, క్రీ.శ. 1912లో విస్తరించడం జరిగింది. కానీ కాలక్రమంగా అది బలహీనపడసాగింది. ఆస్ట్రియా-హంగరీ బాల్కన్ వ్యవహారాలలో బాగా చిక్కుకొని పోయింది. ఆస్ట్రియా-హంగరీ, ఇటలీల మధ్య బేదాభిప్రాయాలు తలెత్తాయి. ఆస్ట్రియా-హంగరీ, ఆక్రమణ క్రింద ఉన్న ఇటాలియన్ ప్రాంతాలను వదులు కోవడానికి ఇష్టపడకపోయేసరికి రెండు దేశాల మధ్య అనుకున్నంత అవగాహన ఏర్పడలేదు. అదీగాక ఆస్ట్రియా-హంగరీ ఇటలీల మధ్య పందెం ఎక్కువై రెండు దేశాలు ఎరిట్రియన్ సముద్రముపై నియంత్రణకు పాకులాడడం మొదలు పెట్టాయి. త్రిరాజ్య సౌహార్ధ దేశాల మధ్య సహకారం పెరిగింది. ఆ దేశాల మధ్య బేదాభిప్రాయాలు లేకపోలేదు. కానీ, ఆ దేశాల రాజనీతిజ్ఞులు దూర దృష్టితో వ్యవహరించారు. సర్ ఎడ్వర్డ్ గ్రే, మొరాకో విషయంలో ఫ్రాన్స్‌ను హృదయ పూర్వకంగా సమర్ధించాడు. ఈ విషయంలో అతడు జర్మనీతో యుద్ధానికి దిగడానికి కూడా సిద్దపడ్డాడు. ఏది ఏమైనా, యూరప్ రెండు యుద్ధ కూటములు ఏర్పడిన ఫలితంగా విడిపోయింది. రెండు కూటముల మధ్య తీవ్రమైన ఆయుధ పోటీ ప్రారంభమైంది. ఒక కూటమి పటిష్టమైందని తెలుసుకోగానే మరో కూటమి దానికి ప్రతి చర్యలు తీసుకోవడం మొదలు పెట్టింది. దీని పర్యవసానంగా పందోమ్మిదో శతాబ్దం చివరి సంవత్సరాలలో విపరీతమైన సైనిక పోటీ పెరిగింది. 1900లో జర్మనీ తలపెట్టిన యుద్ధ నౌకల నిర్మాణ కార్యక్రమాల వల్ల బ్రిటన్ తన నౌకాధిక్యతకు అందువల్ల తన భద్రతకే ముప్పు ఏర్పడుతున్నదని భావించింది. నౌకా రంగంలో జర్మన్ సవాలును ఎదుర్కొనడానికి బ్రిటన్ నిశ్చయించుకొంది. దీనివల్ల కొత్త యుద్ధనౌకల నిర్మాణం ప్రారంభమైంది. లార్డ్‌ఫిషర్ "డ్రెడ్ నాట్‌లు" (Dread noughts) అనే యుద్ధ నౌకలను రూపొందించాడు. వీటికి అతిచిన్నవైన ఫిరంగులు అమర్చారు. వీటిని జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ అనుకరించగానే, బ్రిటన్ మొదట పదిహేను తరువాత 16 అంగుళాల ఫిరంగులు అమర్చి యుద్ధ నౌకలను నిర్మించుకొంది. విమాన దళాన్ని ఏర్పరచుకోవడానికి జర్మనీ ప్రయోగాలు ఆరంభించింది.

**హేగ్ సమావేశాలు :** అంతకు ముందెన్నడూ జరగనటువంటి ఆయుధాల పందెం ద్వారా యూరోపియన్ రాజ్యాల మీద విపరీతమైన ఆర్థిక భారం పడింది. ఆయుధాల పోటీని తగ్గించాలనే భావం యూరప్‌లో అక్కడక్కడ ఏర్పడింది. ఈ సమస్యను చర్చించటానికి అంతర్జాతీయ సమావేశం జరగాలని రష్యన్ జార్ రెండోనికోలస్ 1898 ఆగష్టు 24న ప్రతిపాదించాడు. జార్ సూచన ప్రకారం ఈ సమావేశం క్రీ.శ. 1899లో హేగ్‌లో నిర్వహించబడింది. 26 దేశాలు ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది. వీటిలో 20 యూరోపియన్ దేశాలు చైనా, జపాన్, పర్షియా, సయామ్, హేగ్ సమావేశంలో పాల్గొన్న యూరోపియనేతర దేశాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో అమెరికా నుంచి వచ్చి పాల్గొన్నాయి. ఈ సమావేశం మే 18న ప్రారంభమై జులై 29న ముగిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న 100 మంది సభ్యులు ఆయుధాల పోటీవలన ఏర్పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ఎత్తి చూపించారు. ఆయుధాల ఉత్పత్తికి వినియోగిస్తున్న ధనాన్ని విద్యాభివృద్ధికి సాంఘిక ప్రయోజనాలకు వినియోగిస్తే బాగుంటుందని వీరు సూచించారు. కానీ ఒక జర్మన్ ప్రతినిధి నిర్బంధ సైనిక విధానం వల్ల తన దేశం బాగుపడిందని తన దేశ భవిష్యత్తు కూడా దానిపై ఆధారపడి ఉందని వాదించాడు. బేదాభిప్రాయాలతో హేగ్ సమావేశం ముగిసింది. ఏ సమస్య పరిష్కారము కొరకైతే ఈ సమావేశం ఏర్పాటైందో దానిని పరిష్కరించడంలో ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు విఫలులైనారు. మానవాళి నైతిక, భౌతిక, ప్రయోజనాలకు సైనిక ఖర్చులు తగ్గించుకొంటే బాగుంటుందని భూమిమీద, సముద్రముపైన సైనిక పోటీ తగ్గించటానికి ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాలని హేగ్ సమావేశంలో తీర్మానాలు చేయడం జరిగింది. దేశాల మధ్య బేదాభిప్రాయాలు ఏర్పడితే వాటిని పరిష్కరించుకోవడాన్ని హేగ్ సమావేశం ఒక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసింది. దీనిపేరు 'పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' (Perminent court of Arbitration) వివాదం ఏర్పడ్డ రెండు దేశాలు

అంగీకరిస్తే దప్ప ఈ న్యాయస్థానంలో విచారణ జరగదు. హేగ్ సమావేశం ఆశించిన ఫలితాలను సాధించలేదు. సమావేశం ముగిసి, ముగియక ముందే దక్షిణాఫ్రికాలో యుద్ధం జరిగింది. ఆ తరువాత రష్యా-జపాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. యూరోపియన్ రాజ్యాల మధ్య సైనిక పందెం ఎక్కువైంది. క్రీ.శ. 1898లో యూరోపియన్ దేశాల సైనిక ఖర్చు 250,000,000 పౌండ్లు, కాగా అది క్రీ.శ. 1906 నాటికి 320,000,000ల పౌండ్లకు పెరిగింది. మొదట హేగ్ సమావేశం విఫలమైనా శాంతి కాముకులు తమ ప్రయత్నాలను వదులుకోలేదు. రెండో హేగ్ సమావేశం క్రీ.శ. 1907లో ఏర్పాటు చేయడం జరిగింది. దాన్ని గూడా జార్ రెండో నికోలస్ ఏర్పాటు చేసాడు. అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కూడా కొంత చొరవ చూపించాడు. రెండో హేగ్ సమావేశం జూన్ 15 నుండి అక్టోబరు 18 వరకు జరిగింది. మొత్తం 44 దేశాల నుంచి 256 మంది ప్రతినిధులు రెండో హేగ్ సమావేశంలో పాల్గొన్నారు. యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు మానవత్వ సూత్రాలను పాటించాలని రెండో హేగ్ సమావేశం నిర్ణయించింది. నిరాయుధీకరణ గూర్చి కాని, ఆయుధాల ఉత్పత్తుల మీద పరిమితులు నిర్ధారించడం గూర్చి గాని, రెండో హేగ్ సమావేశం ఏ విధమైన ప్రగతిని సాధించలేదు. సైనిక ఖర్చు మీద ప్రతి దేశం తీవ్రంగా అధ్యయనం చేయాల్సి ఉందని రెండో హేగ్ సమావేశం తీర్మానించింది. రెండో హేగ్ సమావేశ తీర్మానాలు, తీర్మానాలుగానే మిగిలిపోయాయి. యూరోపియన్ దేశాలను తమ బడ్జెట్ కేటాయింపుల్లో ఆయుధాల ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. క్రీ.శ. 1912, క్రీ.శ. 1913లలో జరిగిన బాల్కన్ యుద్ధాలు పరిశీలించినట్లయితే హేగ్ సమావేశాల వైఫల్యాలు తెలుస్తున్నాయి. క్రీ.శ. 1912లో జరిగిన మొదటి బాల్కన్ యుద్ధం, మాసిడోనియాలో టర్కీ దుష్పరిపాలన, బాల్కన్ కూటమి సభ్యులనుత్తేజ పరచింది. టర్కీ క్రూర పాలన నుండి తమ సోదరులను కాపాడుకోవాలని, వారు నిర్ణయించుకొన్నారు. అల్బేనియాలోని తిరుగుబాటు, ఈ సమస్యను మరింత క్లిష్టం చేసింది. బాల్కన్ సమస్య మళ్ళీ విషమ స్థాయికి చేరుకుతంది. పెద్ద రాజ్యాలు, మితవాదాన్ని ప్రభావితం చేసినా కూటమి క్రీ.శ. 1912 అక్టోబర్‌లో టర్కీ మీద యుద్ధాన్ని ప్రకటించింది. ఇది మొదటి బాల్కన్ యుద్ధం.

ఇది చాలా కొద్ది కాలంలోనే ముగిసింది. బల్గేరియన్ల అద్భుత విజయంతో, టర్కీ పతనం, పూర్తయింది. బాల్కన్ రాజ్యాల కూటమి మాసిడోనియాను ఆక్రమించుకొంది. కాన్‌స్టాంట్‌నోపిల్ తప్ప, టర్కీ సామ్రాజ్యానికి ఏమీ మిగలలేదు. ఈ సమయంలో పెద్ద రాజ్యాలు జోక్యం చేసికొని, లండన్‌లో శాంతి సంభాషణలకు టర్కీని పిలిచాయి. క్రీ.శ. 1913 మే లో, లండన్ సంధితో ఈ యుద్ధం ముగిసింది. లండన్ సంధి వెంటనే భూభాగాల పంపిణీ విషయంలో బాల్కన్ రాజ్యాల మధ్య కలతలు ఏర్పడ్డాయి. బాల్కన్ కూటమి విచ్ఛిన్నమయింది. అల్బేనియా ఏర్పాటును సెర్బియా వ్యతిరేకించింది. బల్గేరియా నుండి మాసిడోనియాలో పరిహారాన్ని, ఏజియన్ సముద్ర తీరంలో ఒక రేవునూ, సెర్బియా కోరింది. మాసిడోనియా విభజన, గ్రీస్ బల్గేరియాలు రెండింటికీ, అసంతృప్తిని కల్గించింది. తత్ఫలితంగా బల్గేరియతో ఇతర బాల్కన్ రాజ్యాల సంబంధాలు చెడిపోయాయి. బల్గేరియాకు వ్యతిరేకంగా, రక్షణాత్మకంగానూ, పోరాటాత్మకంగానూ గ్రీస్, సెర్బియా, మాంటినిగ్రో, రుమేనియార్చి కూటమి ఏర్పడింది. మొదటి బాల్కన్ యుద్ధంలో ప్రేక్షకులుగా మాత్రమే ఉన్న రుమేనియన్లు, బల్గేరియాలోని ఈశాన్య భూభాగాల కోసం, రెండో యుద్ధంలో పాల్గొన్నారు. కోల్పోయిన భూభాగాలను కొంతవరకైనా, సంపాదించుకోవచ్చునన్న ఆశతో, వీరితో టర్కీ కూడా చేరింది. పరిహారాలనివ్వడానికి అంగీకరించకపోవడంతో క్రీ.శ. 1913 జూన్‌లో బల్గేరియా మీద, ఈ కూటమి యుద్ధాన్ని ప్రకటించింది. ఇది రెండోవ బాల్కన్ యుద్ధం. ఇది కూడా కొద్ది కాలమే జరిగింది. క్రీ.శ. 1913 జూలైలో టర్కీ ఎడ్రియా నోపిల్‌ను తిరిగి ఆక్రమించింది. కూటమి బల్గేరియాపై దాడిచేసి రాజధాని సోఫియా ఆక్రమణకు కాలు దువ్వింది. అన్ని వైపులు శత్రువుల చుట్టుముట్టి యుండటంతో, బల్గేరియా సంధినంగీకరించింది. క్రీ.శ. 1913 ఆగష్టు 10 బుకారెస్ట్ సంధి రూపంలో యుద్ధం ముగిసింది. మరియు క్రీ.శ. 1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచ యుద్ధం హేగ్ సమావేశాల వైఫల్యాన్ని సూచిస్తాయి.

డా. వి.కె. మోహన్

# మొదటి ప్రపంచ యుద్ధము - అనంతర పరిణామాలు

## 16.0 లక్ష్యం :

మొదటి ప్రపంచ యుద్ధము 1914లో ఐరోపాలో ప్రారంభమయి క్రమంగా ప్రపంచమంతా వ్యాపించింది. మానవజాతి చరిత్రలో ఇటువంటి యుద్ధం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదు. అందువల్లనే ఈ యుద్ధాన్ని మొదటి ప్రపంచ యుద్ధమనవచ్చు. ఈ యుద్ధంలో సంభవించిన జననష్టము, ధనమూ అస్తినష్టాలతో ఇరుపక్షాలు తల్లడిల్లిపోయాయి. ఆ కష్టనష్టాలు, భవిష్యత్తులో అటువంటి ఘోర పరిణామాలు సంభవించకుండ రాజ్యాధినేతలు తగుజాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని, అందుకు తగిన అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించడం అవసరమని గుర్తించడం జరిగింది. ఈ ప్రపంచ యుద్ధానికి గల కారణాలు, యుద్ధ గమనం, యుద్ధ ఫలితాలు, యుద్ధానికి జర్మనీ బాధ్యత, యుద్ధంలో మిత్రరాజ్యాల విజయానికి కారణాలు, అనంతర పరిణామాలను గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం


16.1 పరిచయం

16.2 మొదటి ప్రపంచయుద్ధ కారణాలు

16.3 యుద్ధ గమనం

16.4 యుద్ధ ఫలితాలు

16.5 యుద్ధానికి జర్మనీ బాధ్యత

16.6 మిత్ర రాజ్యాల విజయానికి కారణాలు

16.7 వర్సే - సంధి. విమర్శ.

16.8 వర్సే సంధిలోని అంశాలు

16.9 వర్సే సంధి విమర్శ

16.10 ఇతర సంధులు

16.11 నానాజాతి సమితి

16.12 నానాజాతి సమితి స్థాపన

16.13 సమితి కార్యకలాపాలు.


## పరిచయం :

ఐరోపా చరిత్రలోనేగాక ప్రపంచ చరిత్రలోనే జర్మనీ ఏకీకరణకు మొదటి ప్రపంచ యుద్ధానికి మధ్యగల కాలం అభివృద్ధికి, వైజ్ఞానిక ప్రగతికి, ఆశావాదానికి, శాంతికి ప్రతిబింబంగా కన్పించింది. ప్రప్రథమంగా అజ్ఞానం, క్షామం, దారిద్ర్యం, యుద్ధమనే దుష్ట శక్తులపై మానవ మేధస్సు విజయం సాధించినదని పెక్కుమంది భావించసాగారు. రవాణా సౌకర్యాలు అభివృద్ధిచెంది రాకపోకలు త్వరితమై

ప్రపంచ దేశాలు పరస్పరం దగ్గరైనాయి. అంతర్జాతీయ సంఘాలనేకం ఏర్పడ్డాయి. రాజకీయ, మత, వైజ్ఞానిక, ఆర్థిక, అంతర్జాతీయ సమావేశాలు ఏర్పాటయ్యాయి. వివిధ దేశాల మధ్య వైజ్ఞానికుల, ఉపాధ్యాయుల, విద్యార్థుల మార్పిడి జరిగింది. అంతర్జాతీయ సహకారం పెంపొందింది. ప్రపంచ శాంతికై అనేక సమావేశాలలో ప్రతిపాదనలు, నిర్దిష్ట ప్రయత్నాలు జరిగాయి. ఇందుకు నిదర్శనం 1899, 1907లో జరిగిన హేగ్ సమావేశాలే. శాంతి ప్రయోజనాలకై ఆల్‌ఫ్రెడ్ నోబెల్, ఆండ్రూ కార్నిజ్ మొదలైన వారు తమ ధనాన్ని, శక్తిని వినియోగించారు. మేధావులు, రచయితలు శాంతి ప్రయోజనాలను శ్లాఘిస్తూ యుద్ధోన్మాద శక్తులను గర్హించారు. దీంతో ఈ కాలం శాంతికి నాందిగా, అభివృద్ధికి ఆయువుగా కన్పించింది. కాని నిశితంగా పరిశీలిస్తే ఈ అభివృద్ధి, ఈ నాగరికతా వ్యాప్తి ఏ క్షణంలోనైనా, ఏ చిన్న సంఘటనతోనైనా సర్వనాశనం కాగలదని కొందరు భావించక పోలేదు. ఆనాటి దౌత్యనీతిని గమనించిన కొందరు మేధావులు ఐరోపాలో ఏర్పడ్డ శాంతి స్థిరమైంది కాదని, ఏ క్షణంలోనైనా ప్రపంచం భయంకర యుద్ధానికి గురికావలసి వస్తుందని భయపడక పోలేదు. ఆనాటి ఆయుధాల తయారీ, సైనిక సమీకరణ గమనించిన కొందరు ఆకాలాన్ని సాయుధ శాంతి కాలంగా భావించారు. అయితే ఐరోపాలో అధిక సంఖ్యాకులు తమ ప్రభుత్వాధినేతల మంచితనంపైన, వారి శాంతి కాముకత్వం పైన నమ్మకముంచారు. ఈ నమ్మకం ఎంత తెలివితక్కువైనదో రాజ్యాలు, రాజ్యాధినేతలు పట్టుదలతో ఎంత మౌఢ్యంగా జరిగిన సంఘటనలను బట్టి తెలుసుకోవచ్చు.

ఈ పాఠంలో మూడు ప్రధానాంశాలు చర్చించబడినాయి. అవి

అ) మొదటి ప్రపంచ యుద్ధానికి గల కారణాలు, యుద్ధగమనం, యుద్ధ ఫలితాలు, యుద్ధానికి జర్మనీ బాధ్యత, యుద్ధంలో మిత్ర రాజ్యాల విజయానికి కారణాలు.

ఆ) వర్సేసంధి నిబంధనలు, వర్సే సంధి - విమర్శ

ఇ) నానాజాతి సమితి స్థాపన, సమితి ఉద్దేశాలు, లక్ష్యాలు, సమితి నార్మణము.

## 16.2 మొదటి ప్రపంచ యుద్ధ కారణాలు

**16.2.1 మొదటి ప్రపంచ యుద్ధ కారణాలు :** మొదటి ప్రపంచ యుద్ధం 1914 ఆగస్ట్‌లో ప్రారంభమై 1918 వరకు కొనసాగింది. ఈ యుద్ధంలో ఐరోపా రాజ్యాలేగాక, దానికి సంబంధించిన వలస రాజ్యాలు, అమెరికా, జపాన్‌లు మొత్తం 27 రాజ్యాలు పాల్గొన్నవి. 1871లో జర్మన్ సామ్రాజ్య స్థాపన జరిగినప్పటి నుంచి ఐరోపా చరిత్రను పరిశీలిస్తే ఈ యుద్ధకారణాలు తెలియ వస్తుంది. అందువల్ల 1914 వరకూగల ముఖ్యమైన చారిత్రక సంఘటనలను పరిశీలించవలసి ఉంటుంది. ప్రధానంగా జర్మన్ సామ్రాజ్య స్థాపన జరిగినప్పటి నుంచి ఐరోపా రాజ్యాల దౌత్య సంబంధాలలో ఎన్నో విప్లవాత్మక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ఈ పరిణామాల ఫలితంగా ఐరోపా రాజ్యాలు రెండు విరోధ కూటాలుగా ఏర్పడి యుద్ధానికి సిద్ధమైనాయి.

**16.2.1.1 విరుద్ధ రాజ్య కూటాల ఏర్పాటు :** 1870-71 ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయిన తరువాత 1871 లో జర్మన్ సామ్రాజ్య స్థాపన జరిగింది. ఈ యుద్ధంలో ఫ్రాన్స్ ఆల్సేస్ - లొరైన్‌లను కోల్పోయి జర్మనీ చేతిలో అవమానానికి గురి అయింది. ఎప్పటికైనా ఫ్రాన్సు తలపడి తిరిగి ప్రతీకార యుద్ధం చేయగలదని జర్మనీ ఛాన్సలర్ బిస్మార్క్ భావించాడు. అందువల్ల ఫ్రాన్సును ఐరోపా రాజకీయ, దౌత్యరంగాలలో ఏకాకిని చేయడం ప్రధాన లక్ష్యంగా బిస్మార్క్ పెట్టుకొన్నాడు. దీని కోసం బిస్మార్క్ మిత్ర సంధులను ఏర్పరచాడు. 1872లో బిస్మార్క్ రష్యా, ఆస్ట్రియా - హంగరీ చక్రవర్తులతో కలసి 'ముగ్గురు చక్రవర్తుల సమితి'ని ఏర్పాటు చేశాడు. కాని రష్యా ఫ్రాన్స్‌ల మైత్రిని గమనించిన బిస్మార్క్ ఆస్ట్రియాతో రహస్యంగా మైత్రి చేసుకున్నాడు. 1878 బెర్లిన్ సమావేశంలో ఆస్ట్రియాకు మద్దతు నిచ్చాడు. రష్యాతో పూర్తిగా తెగతెంపులు చేసుకుంటే, రష్యా ఫ్రాన్స్‌తో చేరగలదనే భయంతో 'ముగ్గురు చక్రవర్తుల సమితిని కొనసాగించాడు. కాని బాల్కన్‌లలో ఆస్ట్రియా-రష్యాల మధ్య ఏర్పడిన వైరుధ్య ఫలితంగా ఈ సమితి భగ్నమయింది. కాని రష్యాతో బిస్మార్క్ పునర్ భద్రతా సంధి అనే రహస్య అంగీకారాన్ని చేసుకొన్నాడు. ఈ సంధి ప్రకారం రష్యా, ఫ్రాన్స్‌కు ఎటువంటి సహాయం చేయకూడదు. ఇందుకు ప్రతి ఫలంగా ఆస్ట్రియాకు విరుద్ధంగా జర్మనీ బాల్కన్ రాజ్యాలలో రష్యాను సమర్థించగలదు. కాని బిస్మార్క్ తరువాత వచ్చిన జర్మన్ ఛాన్సలర్‌లు ఈ సంధిని కొనసాగించలేదు. దీంతో ముగ్గురు చక్రవర్తుల సమితి, రష్యాతో సంధి ముగిసాయి.

1882లో బిస్మార్క్, జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీలతో 'త్రిరాజ్య సంధి' ఏర్పాటు చేశాడు. ఇది కూడా రహస్య సంధే. ఈ సంధి ప్రకారం ఈ మూడు రాజ్యాలలో ఏ రాజ్యంపై దురాక్రమణ జరిగినా మిగతా రెండు రాజ్యాలు దాని రక్షణకు రావాలి. కాని ఈ సంధిలోని ఇటలీ, ఆస్ట్రియా-హంగరీ రాజ్యాల మధ్య ఇటాలియా ఇరిడెంటా, ఏడ్రియాటిక్ సముద్రాధిపత్యం అన్న రెండు అంశాల్లో విరుద్ధ అభిప్రాయాలున్నాయి. దీనితో ఆస్ట్రియా, జర్మనీలకు తెలియకుండా ఇటలీ 1902లో ఫ్రాన్సుతో రహస్య సంధి చేసుకొన్నది. అయినా త్రిరాజ్య సంధి కొనసాగించబడింది. దీనిని బట్టి నాటి దౌత్యనీతి ఎంత నిగూఢమైనదో, ప్రమాదకరమైనదో తెలుస్తుంది.

1870-71 ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధం తరువాత రెండు దశాబ్దాల పాటు ఫ్రాన్సు ఏకాకిగానే ఉంది. ఈ కాలంలో ఏదో ఒక ఐరోపా రాజ్యంతో సంధి చేసుకోవడానికి ఫ్రాన్స్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. 'పునర్ భద్రతా' సంధికి జర్మనీ అంగీకరించకపోవడంతో ఆగ్రహించిన రష్యా కూడా మిత్రుల కోసం వెదకటం మొదలు పెట్టింది. రష్యా తన ఆర్థికాభివృద్ధి కై ఫ్రెంచి పెట్టుబడులపై ఆధారపడింది. పైగా 'త్రిరాజ్య సంధి'లో ఇంగ్లాండ్ చేరగలదని రష్యా భయపడింది. ఈ పరిస్థితులలో ఫ్రాన్సు, రష్యాలు 1891లో రహస్య సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం అన్ని యుద్ధ విషయాలలో రెండు రాజ్యాలు సంప్రదించుకోవాలని, సంయుక్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించబడింది. 1894లో ఈ సంధి బహిరంగ పరచబడి సైనిక సంధిగా రూపొందించబడింది. దీనినే 'ద్విపక్ష మైత్రి' అంటారు. ఈ మైత్రితో ఫ్రాన్సుకు తాను ఒంటరిననే భయం పోయి ధైర్యం చేకూరింది.

'త్రిరాజ్య సంధి', ద్విపక్ష మైత్రులతో ఐరోపాలో రెండు విరుద్ధ రాజ్యకూటాలేర్పడ్డాయి. 1890 నుండి ఇంగ్లాండు ఈ రెండు కూటాలతో ఎటువంటి సంబంధం పెట్టుకోకుండా తటస్థవైఖరిని అవలంబించింది. ఈ రెండు కూటాలలోని రాజ్యాలతో ఇంగ్లాండుకు ఏదో ఒక చోట వివాదం ఉండుటయే దీనికి కారణం. ఆఫ్రికాలో ఫ్రాన్సుతో వివాదం ఎషోడా సంఘటన కారణంగా యుద్ధం దాకా వెళ్ళింది. పర్షియా, ఆఫ్ఘనిస్థాన్, దూర ప్రాచ్యంలో రష్యా వైఖరి ఇంగ్లాండుకు విరుద్ధంగా ఉంది. వర్తక వ్యాపారాలలో ఇంగ్లాండ్ ప్రాబల్యాన్ని జర్మనీ సవాలు చేయడం ప్రారంభించింది. కాని బోయర్ యుద్ధంలో అన్ని ఐరోపా రాజ్యాలు ఇంగ్లాండుకు విరుద్ధంగా బోయర్‌లకు సానుభూతి చూపడంతో తమ తటస్థ వైఖరిలోని బలహీనత బయటపడింది. జర్మనీతో సంధికోసం ఇంగ్లాండు 1900-02 మధ్య కాలంలో ఎన్నో ప్రతిపాదనలు చేసింది. జర్మనీతో అంగీకారం కుదరకపోతే మిగతా రాజ్యాలతో మైత్రి చేసుకోగలనని ఇంగ్లాండ్ బెదిరించింది. కాని ఇంగ్లాండ్ స్నేహ ప్రతిపాదనలను జర్మనీ త్రోసిపుచ్చింది. ఇంగ్లాండ్ ఎట్టి పరిస్థితులలోను ఫ్రాన్సుతో, రష్యాతో సంధి చేసుకోలేదని, వారి విధానాలు ప్రయోజనాలు పరస్పర విరుద్ధాలని జర్మనీ భావించింది. జర్మనీచే నిరాకరింపబడి, భంగపడిన ఇంగ్లాండ్ 1902లో జపాన్‌తో సంధి చేసుకొంది.

జర్మనీతో ఇంగ్లాండ్ చేసిన మైత్రి ప్రతిపాదన తిరస్కరింపబడడంతో ఇంగ్లాండు తన విధానాన్ని పునర్విమర్శ చేసుకోవలసి వచ్చింది. ఇంగ్లాండ్ అభ్యంతరాలను త్రోసిపుచ్చి జర్మనీ నావికాబలాన్ని పెద్ద పెట్టున విస్తృతపరచడం ప్రారంభించింది. దీంతో జర్మనీ ఉద్దేశాలపై ఇంగ్లాండ్‌లో సందేహ ఆందోళన లేర్పడ్డాయి. వలసలకై జర్మనీ తాపత్రయం గ్రహించింది. జర్మనీ సముద్రాధిపత్యాన్ని కూడా సాధిస్తే తమ వలసలకేగాక తమజాతి మనుగడకే ప్రమాదం వాటిల్లగలదని ఇంగ్లాండ్ భావించింది. దీంతో ఫ్రాన్సుతో తనకున్న వైరుధ్యాన్ని విస్మరించి సర్దుబాట్లకై ప్రయత్నాలు చేసింది. ఫ్రాన్స్‌లో కూడా కొత్త ప్రభుత్వం ఏర్పడి ఇంగ్లాండ్‌తో సత్సంబంధాల కృషి చేసింది. అనేక చర్చల తరువాత ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌ల మధ్య అంగీకారం కుదిరింది. ఈ అంగీకారం ప్రకారం ఈజిప్టులో ఇంగ్లండ్‌వారి ఆధిక్యతను ఫ్రాన్స్ గుర్తిస్తే, మొరాకోలో ఫ్రెంచి ప్రయోజనాలను ఇంగ్లాండు సమర్థించింది. ఈసంధినే 'ఎంటెంటీ కార్డియల్' అని అంటారు. 1907 నాటికి రష్యా, ఇంగ్లండ్‌ల మధ్య సర్దుబాట్లు జరిగాయి. క్రమంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యాల మధ్య మైత్రి ఏర్పడింది. వీరి మధ్య ఏ సంధి లేకపోయినా ఈ మూడు రాజ్యాలు ఒక పక్షమనే అభిప్రాయం ఏర్పడింది. ఈ మూడు రాజ్యాలను కలిసి 'త్రిరాజ్య సౌహార్దం' అని పిలిచారు. ఈ కూటమి త్రిరాజ్య సంధికి సమాధానం ఈ విధంగా ఐరోపా రెండు కూటాల క్రింద విడిపోయింది. ఒక కూటమిలో జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీ సభ్య దేశాలు. మరో కూటమిలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్‌లు సభ్య దేశాలు. టర్కీని జర్మనీ తన వైపుకు తిప్పుకొన్నది. ఈ రెండు కూటాల మధ్య స్పర్థా ద్వేషాలే గాకుండా శత్రుభావం ఏర్పడింది. రహస్య కూటాలు సృష్టించిన స్పర్థా ద్వేషాలు, శత్రు భావం 1914 యుద్ధానికి చాలా వరకూ కారణమని స్థూలంగా చెప్పవచ్చు.

**16.2.1.2 సైనిక తత్త్వం** : 1914కు ముందు ఐరోపాలో సైనిక తత్త్వం బాగా వ్యాపించినది. రెండు కూటాలలోని ప్రతి రాజ్యం తమ సైనిక సంపత్తిని అపారంగా వృద్ధి చేయడం ప్రారంభించింది. శాంతి కాలంలో కూడా నిర్బంధ సైనిక శిక్షణ, పెద్ద సైన్యాల సమీకరణ జరుగుతూ వచ్చింది. రాజ్యాల మధ్య ఆయుధ సమీకరణ పోటీ ఏర్పడింది. శాస్త్ర విజ్ఞానం, పారిశ్రామిక విప్లవం ఆయుధ సంపత్తిని అధికం చేయడమేగాక వాటి విధ్వంసక శక్తిని కూడా వృద్ధి చేశాయి. ఈ సైనికాభివృద్ధి స్వీయ రక్షణకేనని ప్రతి రాజ్యం, తలపోసింది. ప్రతి ప్రభుత్వ విధానం సైనికావలసరాలకు అధీనం చేయబడింది. అన్ని ముఖ్య విషయాలలోను సైన్యాధిపతుల సలహాలు తీసుకోవడం మొదలైంది. దీనిలో సైన్యాధికారుల పలుకుబడి హెచ్చుతూ వచ్చింది. యుద్ధానికి ముందే యుద్ధ వ్యూహాలు రచింపబడ్డాయి. ఆయుధాల సమీకరణ వల్ల ఐరోపాలో భయాందోళనలు, అపనమ్మకము బాగా పెరిగిపోయాయి.

నౌకాబల విస్తరణ విషయంలో జర్మనీ, ఇంగ్లాండ్‌తో పోటీపడింది. ఐరోపా మొత్తంలో ఇంగ్లండుకు ఉన్నటువంటి నౌకా శక్తి మరే దేశానికి లేదు. రెండో విలియం అధికారానికి వచ్చేంతవరకూ నౌకాబలం పెంచుకొనే ఉద్దేశం జర్మనీకి లేదు. కాని 20వ శతాబ్దం ప్రారంభంలో జర్మనీ తన నౌకా పాటవాన్ని పెంచుకోవడానికి అనేక పథకాలు వేసుకొంది. జర్మన్ సైనిక బడ్జెట్‌లో నౌకల నిర్మాణానికి ఎక్కువ మొత్తాలు కేటాయించడం జరిగింది. 'డ్రెడ్‌నాట్'లు అనే కొత్త రకం యుద్ధ నౌకల నిర్మాణం ప్రారంభమైంది. ఈ విధంగా జర్మనీ తన నౌకా విస్తరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తే అయిదేండ్లలో తనను జర్మనీ దాటి పోతుందని ఇంగ్లండ్ భయపడింది. హేగ్ శాంతి సమావేశాలు నిరాయుధీకరణకు విఫల ప్రయత్నాలు చేసాయి. ఈ ఆయుధ పోటీవలన ప్రజలపై పన్నుల భారమధికమయింది.

'త్రిరాజ్య సంధి'కి నాయకత్వం వహించిన జర్మనీకి మంచి సైనిక సామగ్రి, వ్యవస్థ, త్వరగా సైన్యాలను తరలించడానికి అవసరమైన రవాణా సదుపాయాలు, కీలకమైన రైల్వే వ్యవస్థ ఉన్నాయి. 'త్రిరాజ్య సౌహార్దం' వారు సంఖ్యాబలాన్ని, సముద్ర మార్గాలను, యుద్ధానికి అవసరమైన ఇతర వనరులను సమకూర్చుకొన్నారు. రెండు పక్షాలవారు ఏక్షణంలోనైనా యుద్ధరంగంలోకి దిగడానికి సిద్ధమయ్యారు. ఈ విధంగా సైనిక తత్త్వం ఐరోపాలోని అన్ని రాజ్యాలలో స్వైర విహారం చేసింది.

**16.2.1.3 జాతీయోన్మాదం** : ఒకేభాష సంప్రదాయాలు కల్గిన జాతీయ ప్రజలు ఒకే దేశంగా రూపొందాలనే జాతీయవాదం అతి ప్రాచీనమైంది. మధ్య యుగంలో మరుగున పడినా, ఆధునిక యుగంలో ఈ భావం జాతీయ రాజ్యాల స్థాపనకు దారి తీసింది. ఫ్రెంచి విప్లవం, నెపోలియన్ యుద్ధాలు జాతీయ భావాన్ని వృద్ధి చేశాయి. ఈ భావమే ఇటలీ, జర్మనీల ఏకీకరణకు కారణమైంది. ఇది ఆ తరువాత మితిమీరిన జాతీయోన్మాదంగా మారింది. జాత్యాహంకారం వల్ల వివేకం, సౌభ్రాత్రం ఐరోపాలో నశించాయి. ఇతర దేశాలకన్నా తానే మిన్న అని ప్రతి దేశం భావించడం మొదలు పెట్టింది. ఈ విధంగా వెర్రి తలలు వేసిన జాతీయ భావం ఐరోపా రాజ్యాల మధ్య వైషమ్యాలను తెచ్చి పెట్టింది.

19వ శతాబ్దాంతానికి అనేక జాతిపరమైన రాజకీయ విధానాలు పరిష్కారం కాకుండా నిలిచిపోయి నాటి రాజ్యాల మధ్య సంఘర్షణలకు దారితీసాయి. దీనికి తోడు ఐరోపా రాజ్యాలలో ప్రబలిన జాతీయోన్మాదం వివిధ రంగాల్లో ప్రస్ఫుటించింది. ప్రపంచంలో ప్రతి చోటా ఐరోపా రాజ్యాలవారు మార్కెట్‌లను సంపాదించడానికి ప్రయత్నించసాగారు. అధికార క్షేత్రాల కోసం, మార్కెట్‌లకోసం, రక్షిత ప్రాంతాల కోసం ఐరోపా రాజ్యాలవారు ఎగబడడంతో ఐరోపా అనేక సంక్షోభాలను ఎదుర్కొంది.

కొత్తగా ఏర్పడిన జర్మనీ తన విస్తరణ కార్యక్రమంలో ఎట్లాంటి అడ్డంకులనైనా అధిగమించడానికి సిద్ధంగా ఉన్నది. 1871లో జర్మనీ వశపరచుకొన్న ఆల్సేస్-లొరైన్ ప్రాంతాలలో జర్మన్లు, ఫ్రెంచివారు కలరు. లొరైన్‌లో అధికంగా ముడి ఇనుము దొరుకుతుంది. తాము కోల్పోయిన ఆల్సేస్ - లొరైన్‌లను తిరిగి సాధించుకోడానికి ఫ్రాన్సు నిరంతరం కృషి చేసింది. ట్రెంటినో, ట్రియస్టీ ప్రాంతాలలో ఇటలీ జాతీయులధికం. కాని ఈ ప్రాంతాలు ఆస్ట్రియాపాలనలో వున్నాయి. ఇటలీ ఈ ప్రాంతాలను జయించడానికి ప్రయత్నించడంతో ఆస్ట్రియా - ఇటలీల మధ్య వైరం ఏర్పడింది. బాల్కన్ ప్రాంతం అనేక జాతుల, భాషల సముదాయం ఈ ప్రాంతంలో గ్రీస్, సెర్బియా, బల్గేరియా, రుమేనియాలు ఒకరితో ఒకరు కలహించుకోసాగిరి. 'పాన్ స్లావిజమ్' అనే జాతీయతాభావం బాల్కన్ ప్రజలను, ఆస్ట్రియా ఆధీనంలో ఉన్న

జాతులను స్వాతంత్ర్య తిరుగుబాట్లకు, యుద్ధాలకు పురి కొల్పింది. ఈ జాతీయతా భావాన్ని రష్యా సమర్థిస్తే, ఆస్ట్రియా, జర్మనీలు రష్యాకు విరుద్ధంగా ఈ ప్రాంతంలో జోక్యం చేసుకున్నాయి. ప్రపంచ యుద్ధ కారణాలన్నింటిలోను బాల్కన్ సమస్యలే శాంతియుత పరిష్కార దుర్లభాలని ఒక చరిత్ర కారుని అభిప్రాయం.

**16.2.1.4 సామ్రాజ్య తత్వం :** 19వ శతాబ్దంలో ఐరోపాలో సంభవించిన పారిశ్రామిక విప్లవం అనేక క్లిష్టమైన సమస్యలను సృష్టించింది. పారిశ్రామికాభివృద్ధి చెందిన రాజ్యాలు ముడి పదార్థాలకు, మార్కెట్లకు వెనుకబడిన ప్రాంతాలలో అన్వేషణ చేయడం వల్ల అగ్ర రాజ్యాల మధ్య తీవ్ర రాజకీయ, ఆర్థిక స్పర్థలు బయలుదేరాయి. ప్రపంచములోని వెనకబడిన ప్రాంతాలలో తమ వలసలను, రక్షక ప్రదేశాలను స్థాపించుకోవడం కోసం అగ్రరాజ్యాలు పోటీ పడటం ప్రారంభమయింది. ఆస్ట్రియా, రష్యాలు బాల్కన్ రాజ్యాలలో పోటీకి దిగినవి. 19వ శతాబ్దపు అంత్యానికి జర్మనీ మిగతా వలస రాజ్యాలతో పోటీపడటం ప్రారంభించింది. బెర్లిన్ నగరం నుంచి బాగ్దాద్ వరకు ఒక బృహత్తరమైన రైలు మార్గాన్ని నిర్మించాలని రెండవ కైజర్ విలియం సంకల్పించాడు. ఈ ప్రణాళిక పట్ల రష్యా, ఇంగ్లండ్ దేశాలు వైముఖ్యాన్ని ప్రదర్శించినవి. బాల్కన్ రాజ్యాలలో రష్యా ప్రాబల్యానికిది గొడ్డలి పెట్టులాంటిది. అలాగే ఇంగ్లండుకు తూర్పు రాజ్యాలలోని తన స్వప్రయోజనానికి వరోధంగా కనిపించింది. ఆఫ్రికాలో జర్మనీ ప్రాబల్యం వల్ల కూడ ఇంగ్లండు యొక్క ప్రయోజనాలకు ప్రమాదం వాటిల్ల వచ్చని ఇంగ్లీషువారు భావించారు. జర్మన్ చక్రవర్తి కీలు కాల్వను నిర్మించటం వల్ల ఇంగ్లీషు నావికా దళానికి జర్మనీ పోటీగా నిల్చింది. అలాగే మొరాకోలో జర్మనీ ఫ్రాన్స్ దేశాలు పోటీ పడటం ప్రారంభించాయి.

**16.2.1.5 జర్మనీలో యుద్ధోన్మాదం :** ప్రష్యా మొదటినుంచి సైనిక సంపత్తిపై ఆధారపడి ఉంది. ప్రష్యాలో యుద్ధమే జాతీయ పరిశ్రమ అని మిరాబు వ్యాఖ్యానించాడు. ప్రష్యా నాయకత్వంలో జర్మనీ ఏకీకరణ చెందడమేగాక బలమైన సైనిక రాజ్యంగా రూపొందింది. 1888లో రెండో విలియం జర్మనీ చక్రవర్తి అయినాడు. ఈతని పాలనలో జర్మనీలో యుద్ధోన్మాద ధోరణి బాగా వ్యాపించింది. యుద్ధము జర్మనీ యొక్క జాతీయ పరిశ్రమ అనే నినాదం జర్మనీలో ప్రతిధ్వనించింది. ఇచ్చటి జంకర్స్ (పెట్టుబడిదారులు) యుద్ధం యొక్క ఆవశ్యకతను గూర్చి బోధించసాగారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు యుద్ధంవల్లనే పరిష్కరింపబడతాయని వారి వాదన. పైగా జర్మనీకి ప్రపంచ రాజ్యాలలో ఆధిక్యత కావాలని వారు కాంక్షించారు. తమ జాతి నాగరిక జాతులలో వున్నతమైనదనే భావాన్ని వారు వ్యక్తీకరించారు. వారి సంస్కృతి ప్రపంచాన్ని జయించడానికి నిర్దేశింపబడిందనే విషయాన్ని గాఢంగా విశ్వసించారు. పైగా రెండో విలియం దురాక్రమణ విధానం దీనికి తోడైంది.

**16.2.1.6 అంతర్జాతీయ సంస్థ లేకపోవడం :** సుహృద్భావాన్ని, శాంతిని కోరే అంతర్జాతీయ సంస్థ ఆనాడు వుండినట్లయితే యుద్ధం నివారింపబడేది. రహస్య దౌత్య పద్ధతుల వల్ల పరస్పర ద్వేష పూరిత వాతావరణం నెలకొన్నది. పైగా జారు రెండో నికోలస్ అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించడానికి రెండు హేగ్ సమావేశాలు ఏర్పరచాడు. కాని అది కూడా విఫలమైంది.

**16.2.1.7 బాల్కన్‌లో ఉద్రిక్తత పరిస్థితి :** 'తూర్పు సమస్య' బాల్కన్‌లలో పరిస్థితిని తీవ్రతరం చేసింది. టర్కీ దుష్టపాలన వల్ల బాల్కన్‌లలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. వివిధ మతాల, జాతుల జనాభా ఉన్న మాసిదోనియాపై నియంత్రణకు గ్రీస్, సెర్బియా, బల్గేరియాల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. బాల్కన్ రాజకీయాలలో రష్యా అమిత ఉత్సాహం చూపించింది. బాస్నియాలో ఉద్రిక్తత ఏర్పడినపుడు సెర్బియాను రష్యా సమర్థించింది. భవిష్యత్తులో కూడా అట్లాంటి పరిస్థితి ఏర్పడితే అదే విధంగా రష్యా వ్యవహరించగలదు. అఖండ స్లావ్ ఉద్యమం బాల్కన్ సమస్యను తీవ్రతరం చేసింది. ముఖ్యంగా బాల్కన్‌లలో బాస్నియా, హెర్జిగోవినాలు తీవ్రమైన సంక్షోభాన్ని తెచ్చి పెట్టాయి. 1878 బెర్లిన్ సమావేశంలో ఈ రెండు రాష్ట్రాలను ఆస్ట్రియాకు ఇచ్చి వేయడం జరిగింది. ఆస్ట్రియా వాటిని పాలించాల్సిందేగాని తన రాజ్యంలో కలిపివేసుకోగూడదు. టర్కీ సుల్తాన్ సార్వభౌమత్వం వాటిపై ఉన్నది. కాని ఏకపక్ష నిర్ణయం చేసి బాస్నియా, హెర్జ్‌గోవినాలను ఆస్ట్రియా తన సామ్రాజ్యంలో కలిపి వేసుకొంది. దీంతో సెర్బియాలో తీవ్రమైన ఆందోళన ప్రారంభమైంది. బాస్నియా, హెర్జిగోవినాలను ఆస్ట్రియా నుంచి వేరు చేసి సెర్బియాలో కలిపివేయాలని సెర్బియన్‌లు తీవ్రంగా ఆందోళన చేశారు.

**16.2.1.8 పత్రికలు, మేధావుల పాత్ర :** జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టడంలో పత్రికలు కూడా పెద్ద పాత్ర వహించాయి. దేశాల మధ్య సంబంధాలను తరచు పెద్ద పత్రికలు, వాటి వైఖరులను ఖండిస్తూ విదేశాలలోని రాయబారులు ప్రకటనలు చేస్తూ వచ్చారు. కాని, ఉద్రిక్త పరిస్థితి ఏర్పడినప్పుడల్లా, దాన్ని ఉపశమింప జేయడానికి బదులుగా, పత్రికలు పరిస్థితిని ఉద్రిక్తం చేశాయి. నాటి జర్మన్ చరిత్రకారులు, విజ్ఞులు యుద్ధం ద్వారా దేనినయినా సాధించవచ్చుననే నీతిని ప్రచారం చేశారు. వీరి బోధనలు యువకుల హృదయాలకు హత్తుకుపోయాయి. దాల్మన్, డ్రాయిడన్, సైబెల్, ట్రీట్స్కే మొదలగు చరిత్రకారులు యుద్ధం ద్వారా ప్రసాదించిన ప్రగతిని ఆకాశానికెత్తారు. ప్రష్యావల్ల జర్మన్ ప్రభావం ఏవిధంగా ఇనుమడించిందో ప్రపంచంలో ఐరోపా ప్రభావం జర్మనీ పరిపాలనవల్ల ఇనుమడిస్తుందని ట్రీట్స్కే వ్రాసాడు. ఇటువంటి రచనలు ఆనాటి జర్మన్ జాత్యాహంకారానికి నిదర్శనం.

**16.2.1.9 అంతర్జాతీయ అరాచకం :** ఆనాడు ప్రపంచ సంబంధాల్లో అరాచకం పెరిగిపోయింది. దౌత్య సంబంధాలు, సంప్రదింపులు బాగా గోప్యంగా ఉండేవి. అంతర్జాతీయ సంబంధాలు తనప్రభుత్వాలు ఏ విధంగా నిర్వహిస్తున్నాయో శాసనసభలకు తెలియదు. రహస్య దౌత్య నీతివల్ల ఐరోపాలో చాలా గందరగోళం ఏర్పడింది. దొంగ సంతకాలు, అసత్యాలు, అవినీతి, లంచగొండితనం ఐరోపా రాజ్యాల విదేశాంగ శాఖల్లో బాగా పేరుకొని పోయాయి. అంతర్జాతీయ నీతి, నియమముల గురించి ప్రవర్తనా నియమావళి ఉన్నది, కానీ దాన్ని అమలు పరచడానికి ఏ విధమైన యంత్రాంగం లేదు.

**16.2.1.10 మొరాకో సంఘటన :** మొరాకోలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు పోటీపడటం ప్రారంభించింది. ఈ ఉద్రిక్తత వాతావరణాన్ని అగాదిర్ సంఘటన మరింతగా ప్రోత్సహించింది. 'అల్జిసిరాస్' సమావేశమందు మొరాకో శాంతి భద్రతలను రక్షించే అధికారం ఫ్రాన్స్ దేశం సంపాదించింది. దానిని సహించలేని జర్మన్ చక్రవర్తి 'అగాదిర్' (మొరాకో ఓడరేవు)కు తన ఫిరంగి నౌకయైన 'ఫాందేల్'ని పంపించాడు. దీనికి ప్రతిగా ఫ్రాన్స్ తన యుద్ధ నావలను పంపించింది. ఈ సంర్భములో ఇంగ్లండ్ జోక్యం చేసుకొని జర్మనీపై ఒత్తిడి తెచ్చి 'ఫాందేర్' యుద్ధ నౌకను వెనుకకు మరలేటట్లు చేసింది. దీని ఫలితంగా మొరాకోపై ఫ్రాన్స్ యొక్క సంరక్షకత్వ హక్కును జర్మనీ గుర్తించవలసి వచ్చింది. ఈ క్లిష్ట సమస్య జర్మనీ, ఇంగ్లండ్ దేశాల మధ్య తీవ్రమైన విభేదాలను సృష్టించింది.

**16.2.1.11 తక్షణ కారణం :** పైన పేర్కొనబడిన సంఘటనలను బట్టి 1914 నాటికి ఐరోపాలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమవుతుంది. ఇటువంటి పరిస్థితులలో **1914 జూన్ 28**న ఆస్ట్రియా - హంగరీ యువరాజు ఫ్రాన్జ్ ఫెర్డినాండ్, అతని భార్య బాస్నియ రాజధాని 'సెరజీవో'లో ఒక రహస్య సంస్థకు చెందిన సెర్బియా యువకుడు ప్రిన్జిట్‌చే కాల్చి చంపబడ్డారు. అప్పటికే స్లావ్ జాతీయ వాదంవల్ల ఆస్ట్రియా హంగరీ - సెర్బియాల మధ్య ఘర్షణ కలదు. ఇది అవకాశంగా సెర్బియాపై పగతీర్చుకోవడానికి ఆస్ట్రియా నిశ్చయించింది. ఈ హత్యకు సెర్బియా ప్రోత్సాహం కలదని ఆరోపించి 10 సూత్రాలు కలిగిన ఒక తుది హెచ్చరిక పత్రాన్ని సెర్బియాకు ఆస్ట్రియా అందజేసింది. ఈ పత్రంలోని విషయాలకు రెండు రోజులలో అంగీకారం తెలుపమని ఆస్ట్రియా కోరింది. ఈ కోరికను అంగీకరిస్తే సెర్బియా, ఆస్ట్రియా - హంగరీ అధీనం కాగలదు. అందువల్ల సెర్బియా పత్రంలోని రెండు అంశాలను అంగీకరించనని తెలియజేసింది. దీంతో ఆస్ట్రియా హంగరీ 1914 జూలై 28న సెర్బియాపై యుద్ధం ప్రకటించింది. సెర్బియా పక్షాన ఉన్న రష్యా సెర్బియాకు సహాయంగా ఆస్ట్రియాపై యుద్ధం ప్రకటించింది. త్రిరాజ్య సంధి ప్రకారం జర్మనీ ఆస్ట్రియా పక్షాన చేరి రష్యాపై యుద్ధం ప్రకటించింది. ఫ్రాన్స్ త్రిరాజ్య సౌహార్థం ప్రకారం జర్మనీపై యుద్ధం ప్రకటించింది. ఇంగ్లండ్ మొదట శాంతి ప్రయత్నాలు చేసింది. కాని జర్మనీ తటస్థ రాజ్యమైన బెల్జియం గుండా సైన్యాలను ఫ్రాన్స్‌పైపు తరలిచింది. బెల్జియం తటస్థ విధానాన్ని కాపాడే రక్షణ బాధ్యత ఇంగ్లండ్‌కు కలదు. బ్రిటిష్ ప్రజాభిప్రాయం జర్మనీపై యుద్ధానికి సముఖమైంది. దీంతో ఇంగ్లండ్ 1914 ఆగస్టు 4వ తేది రాత్రి 11 గంటలకు జర్మనీపై యుద్ధం ప్రకటించింది. ఫలితంగా బాల్కన్‌లో జరిగిన ఒక చిన్న సంఘటన ప్రపంచ యుద్ధంగా మారింది.

## 16.3 యుద్ధ గమనం :

1914 జూన్ 28న ఆస్ట్రియా హంగరీ యువరాజు ఫ్రాన్జ్ ఫెర్డినాండ్ సతీసమేతంగా బోస్నియా రాజధాని సెరాజివోను సందర్శించినపుడు రహస్య సంఘంలోని సభ్యుడైన ఒక యువకుడు **వారిని కాల్చి** చంపాడు. ఈ సంఘటన ఆస్ట్రియా - హంగరీ. సెర్బియాల మధ్య

యుద్ధానికి దారి తీసింది. సెర్బియాకు సహాయంగా రష్యా, ఆస్ట్రియాకు సహాయంగా జర్మనీ యుద్ధంలోకి ప్రవేశించాయి. జర్మనీ బెల్జియం మీద దాడి చేయడంతో ఇంగ్లండ్ కూడా యుద్ధంలోకి దిగింది. ఈ విధంగా ఆస్ట్రియా - హంగరీ, సెర్బియాల మధ్య ప్రారంభమైన స్థానిక యుద్ధం ప్రపంచ యుద్ధంగా మారింది.

ఈ యుద్ధం ప్రపంచ చరిత్రలో నూతన శకం ప్రవేశపెట్టింది. ఇదివరలో జరిగిన స్థానిక యుద్ధాలవలె గాక ఈ యుద్ధము ప్రపంచ -యుద్ధంగా పరిణమించింది. ఎప్పుడూ కనివినీ ఎరుగని యుద్ధ సాధనాలు, ఆయుధాలు, విషవాయువులు, మర ఫిరంగులు, విమానాలు ఈ యుద్ధంలో ఉపయోగించడం జరిగింది. రక్షించుకోవడానికి గోతులు త్రవ్వి తుపాకులు పేల్చడం, సముద్రాలలో జలాంతర్గాములు ఉపయోగించడం, మందు పాతరలు ఏర్పరచడం ఈ యుద్ధ కాలంలో జరిగింది.

ఈ యుద్ధంలో మొత్తం 27 రాజ్యాలు పాల్గొన్నవి. జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ, బల్గేరియాలను మధ్య ఐరోపా రాజ్యాలంటారు. ఫ్రాన్స్, రష్యా, ఇంగ్లండ్ కూటమిని మిత్ర రాజ్యాలని అంటారు. మిత్ర రాజ్యాల కూటమిలో తరువాత జపాన్, ఇటలీ, రుమేనియా, పోర్చుగల్, గ్రీస్, చైనా, బ్రెజిల్ మొదలగు దేశాలు చేరాయి. మిత్ర రాజ్యాల తరపున 4 1/2 కోట్లు, జర్మనీ వైపు 2 1/2 కోట్ల యుద్ధంలో పాల్గొన్నారు.

ఈ యుద్ధం ప్రారంభమయినప్పటినుండి, యుద్ధంలో ప్రవేశించిన ప్రతిదేశం సైనిక తరలింపులను వెంటనే చేపట్టింది. యుద్ధ ప్రయత్నాలు తీవ్రస్థాయిలో జరిగాయి. ఆంతరంగికంగా ప్రతిదేశం విభేదాలను విడనాడి శత్రువుకు గుణపాఠం చెప్పడంలో నిమగ్నమైంది. ప్రతి పక్షాలు, ప్రభుత్వ పక్షాలు ప్రతి దేశంలో ఏకమయ్యాయి. పరిశ్రమలు, రవాణా, వ్యవసాయం, వాణిజ్యం మొదలైన నిత్య జీవితానికి సంబంధించిన ప్రతి రంగం యుద్ధావసరాల కోసం ప్రభుత్వ నియంత్రణ కిందకు వచ్చింది.

1914లో ప్రారంభమై 1918లో అంతమైన ఈ యుద్ధ గమనంలో ప్రతి సంఘటన గురించి కూలంకషంగా చర్చించడం కష్ట సాధ్యం. అందువల్ల యుద్ధానికి సంబంధించిన ప్రధాన సంఘటనల గురించి తెలుసుకొందాం.

**16.3.1 ప్రథమ ఘట్టం :** జర్మనీ రూపొందించిన వ్యూహం ప్రకారం పెద్ద సైన్యాన్ని బెల్జియం గుండా ఫ్రాన్స్‌పైకి తరలించి ఫ్రెంచి సైన్యాన్ని త్వరితగతిలో ధ్వంసం చేస్తే విజయం తథ్యమని భావించింది. ఆల్సెస్‌లో ఫ్రెంచి సైన్యాన్ని సులభంగా చుట్టుముట్టవచ్చునని భావించారు. కాని ఈ వ్యూహం ఆశించినంత సమర్థవంతంగా నిర్వర్తించబడలేదు. ఫ్రెంచి సైన్యం జర్మన్‌లతో వీరోచితంగా పోరాడింది. సెప్టెంబర్ 5 నుంచి 10 వరకు పారిస్ నుంచి వెర్డన్ వరకూగల 150 మైళ్ళ ప్రాంతంలో జరిగిన ఈ పోరాటం మార్నే యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. ఈ యుద్ధంలో జర్మన్‌లు పరాజయం చెందారు. జర్మన్‌లు తాము అనుకొన్న విధంగా 6 వారాలలో ఫ్రాన్స్‌ను ఆక్రమించలేకపోయారు. యుద్ధం అతి త్వరలో అంతమవుతుందనే జర్మన్‌ల ఆశ అడియాశలైనాయి.

తూర్పు రంగంలో రష్యా సైన్యం రెండు విభాగాలుగా తూర్పు ప్రష్యా, ఆస్ట్రియాలవైపు పురోగమించింది. టానన్ బర్గ్, మసూరియన్ లేక్స్ యుద్ధాలలో రష్యా జర్మనులచే ఘోరంగా ఓడిపోయింది. దీంతో జర్మనీకి రష్యా భయం తొలగింది. కాని రష్యా సైన్యం ఆస్ట్రియాపై అనేక విజయాలు సాధించి తూర్పు గెలిషియాను ఆక్రమించింది. ఆస్ట్రియాపై రష్యా ఒత్తిడి తగ్గించడానికై జర్మనీ పోలెండ్‌పై దాడి చేసింది. 1915 నాటికి జర్మనీ వార్సాను ఆక్రమించుకొంది. రష్యా 10 లక్షల సైన్యాన్ని కోల్పోయి బలహీనమయింది.

బాల్కన్ ప్రాంతంలో ఆస్ట్రియా మూడు సార్లు సెర్బియాపై దాడులు చేసింది. టర్కీ, బల్గేరియా ఆస్ట్రియా పక్షాన చేరాయి. డార్డనెల్స్‌ను ఆక్రమించడానికి బ్రిటిష్ నావికాబలం ప్రయత్నించి విఫలమయింది. 1915లో ఇటలీ మిత్ర రాజ్యాల పక్షాన చేరింది.

సముద్రాధిపత్యంగల ఇంగ్లండ్ జర్మనీ కోస్తా ప్రాంతాన్ని దిగ్బంధం చేసి జర్మనీ వలసలను ఆక్రమించుకొని, జర్మనీ నౌకలను మందు పాతరలచే భగ్నంచేసి జర్మనీ సైన్యం రాకపోకలకు అంతరాయం కలిగించింది. ఈ పరిస్థితులలో జర్మనీ జలాంతర్గాములను ఉపయోగించి అనేక బ్రిటిష్, ఫ్రెంచి నౌకలను ముంచి వేసింది. ఫ్రెంచి ప్రయాణికుల నౌకముంచి వేతలో అనేకమంది అమెరికన్లు మరణించారు.

జలాంతర్గాముల ప్రయోగంపై అమెరికా జర్మనీని హెచ్చరించింది. నాటినుంచి అమెరికా ప్రజాభిప్రాయం మిత్రరాజ్యాల కనుకూలంగా మారింది.

**16.3.2 రెండో ఘట్టం :** ఫ్రెంచి సైన్యాన్ని నాశనం చేయాలని జర్మనీ వెర్డూన్‌పై దండయాత్ర చేసింది. భీకర పోరు తరువాత జర్మనీ వెనుతిరిగింది. బ్రిటిష్ సైన్యం సోమ్ నది ప్రాంతంలో జర్మన్‌లపై దాడి చేసింది. కాని ఫలితం శూన్యం. రష్యా ఇదే సమయంలో లుట్స్క్ వద్ద ఆస్ట్రియనులను ఓడించి బుకోవినా ఆక్రమించింది. రుమేనియా రష్యా పక్షాన చేరింది. దీంతో రుమేనియాను బల్గేరియ, టర్కీలు ఓడించి ఆక్రమించుకొన్నాయి.

**16.3.3 మూడో ఘట్టం :** 1917 నాటికి పశ్చిమ రంగంలో సైనిక ప్రతిష్ఠంభన ఏర్పడింది. దీనితో విసిగిన మిత్ర రాజ్యాలు జనరల్ నెవిలే వ్యూహం ప్రకారం కందకాలనుదాటి నష్టపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీలలో ఆర్థిక పరిస్థితులు విషమించి ప్రజా జీవితం దుర్భరమైంది. యుద్ధోత్సాహం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో అమెరికా జర్మనీపై 1917లో యుద్ధం ప్రకటించింది. జలాంతర్గాములను తమ ఇష్టం వచ్చిన రీతిన జర్మనీ ప్రయోగించడం, అమెరికా పెట్టుబడిదారులు మిత్ర రాజ్యాలలో అధికమొత్తంలో పెట్టుబడులు పెట్టి ఉండడం, జర్మనీ నిరంకుశ రాజ్యమనే భావన అమెరికా జోక్యానికి దోహదం చేసాయి. ప్రపంచంలో ప్రజాస్వామ్య రక్షణకై యుద్ధంలో దిగుతున్నామని అమెరికా అధ్యక్షుడు విల్సన్ ప్రకటించాడు.

అమెరికా మిత్ర రాజ్యాలలో చేరడం ఈ యుద్ధంలో ముఖ్యమైన మలుపు. ఇదే కాలంలో యుద్ధంలో పరాభవింపబడి తీవ్ర నష్టానికి గురైన రష్యాలో మార్చి నెలలో జార్ అధికారంపై తిరుగుబాటు జరిగింది. కెరన్స్కీ నాయకత్వంలో 1917 మార్చిలో రష్యాలో ఏర్పాటయిన ప్రభుత్వం ఒక వైపు ఉదారపాలనను ప్రవేశపెడుతూ, రెండోవైపు యుద్ధం కొనసాగించింది. ఈ ప్రభుత్వం ప్రజామోదాన్ని పొందలేదు. 1917 నవంబర్‌లో లెనిన్ నాయకత్వంలో కమ్యూనిస్టులు విప్లవం ద్వారా రాజ్యాధికారం సంపాదించడం జరిగింది. లెనిన్ ఆనాటి యుద్ధాన్ని పెట్టుబడి దారుల నడుమ జరుగుతున్న పోటీకి ఫలితమని రష్యాకు సంబంధించింది కాదని ప్రకటించి, జర్మనీతో 1918లో బ్రెస్ట్‌లిటోవ్స్క్ సంధి చేసుకొని యుద్ధ విరమణ చేశారు. దీనితో జర్మనీ తన సైన్యాలన్నింటిని ఆఖరు ప్రయత్నంగా బ్రిటిష్, ఫ్రెంచి వారి నోడించడానికి పశ్చిమ రంగానికి తరలించింది.

**16.3.4 చివరి ఘట్టం :** 1918 మార్చిలో జర్మనీ తన సైన్యాన్నంతా సమీకరించి మిత్ర రాజ్యాలపై పెద్ద ఎత్తున దాడి చేసింది. ఒక్కనెలలోనే ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌లు 8 లక్షల సైన్యాన్ని కోల్పోయాయి. కాని మిత్ర రాజ్యాలు నిరుత్సాహం చెందలేదు. వారికి సాయంగా 10 లక్షల అమెరికా సైన్యం ఈ ప్రాంతానికి తరలింపబడింది. ఈ సంయుక్త సైన్యాలు ఫోక్ నాయకత్వంలో జర్మనీ సైన్యంపై దాడులు జరిపాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఇదే సమయానికి చిన్న చిన్న నావల సాయంతో జలాంతర్గాములను పసిగట్టి నిరోధించాయి.

సమీప ప్రాచ్యంలో టర్కీ క్రమంగా బ్రిటిష్ వారిచే ఓడింపబడింది. జర్మనీ ప్రాబల్యంలోని బాల్కన్ రాజ్యాలు ఛిన్నాభిన్నమైనాయి. బ్రిటిష్ సైన్యం జెరూశలేమ్‌ను ఆక్రమించింది. తురుష్కులు ఆసియా మైనర్ నుండి గెంటివేయబడ్డారు. మిత్ర రాజ్యాల సైన్యం సలోనికా, గ్రీస్, బల్గేరియాలను ఆక్రమించుకొన్నారు.

నాల్గు సంవత్సరాల నిరంతర యుద్ధం జర్మనీని బలహీన పరచింది. ఒక్క జర్మనీయే మిత్రరాజ్యాల ధాటిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆస్ట్రియా తన రాజ్యంలోని తిరుగుబాట్ల వల్ల అంతగా జర్మనీకి సాయం చేయలేక పోయింది. జర్మనీలో సైనిక సంక్షోభం ఏర్పడింది. తూర్పు రంగంలో పని చేసిన జర్మన్ సైన్యం రష్యాలోని విప్లవ భావాలచే ప్రేరేపితమైంది. నిస్సహాయుడైన జర్మన్ చక్రవర్తి హాలెండ్ పారిపోయాడు. అమెరికా అధ్యక్షుడు విల్సన్ 14 సూత్రాల ఆధారంగా శాంతి సంధి చేసుకోవడానికి తమ దేశము సిద్ధమేనవి జర్మన్ ఛాన్సలర్ మాక్స్, విల్సన్‌కు తెలియజేసాడు. అయితే యుద్ధ విరమణకు షరతులుగా జర్మనీ మిత్ర రాజ్యాల నుంచి తన సైన్యాలను ఉపసంహరించుకోవలెనని, జర్మనీలో నిరంకుశ ప్రభుత్వం స్థానే ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడవలెనని విల్సన్ తన సమాధానంలో సూచించాడు.

ఈ షరతులకు జర్మనీ అంగీకరించడంతో 1918 నవంబర్ 18న మిత్ర రాజ్యాలకు జర్మనీకి మధ్య యుద్ధ విరమణ ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక ప్రకారం జర్మనీ తన సైన్యాలను మిత్ర రాజ్యాల భూభాగాలనుంచి ఉపసంహరించుకొన్నది. రైన్ భూభాగాన్ని నిస్సైని మండలంగా ప్రకటించడం జరిగింది. జర్మనీ తన యుద్ధ సామగ్రినంతా మిత్ర రాజ్యాల వశం చేసింది. తాను లోగడ రష్యాతో చేసుకొన్న బ్రెస్ట్ - లిటో వస్క్ సంధిని, రుమేనియాతో చేసుకొన్న బుకారెస్ట్ సంధిని జర్మనీ రద్దు చేసుకొన్నది.

## 16.4. యుద్ధ ఫలితాలు :

1914లో ఐరోపాలో ప్రారంభమయిన యుద్ధం ప్రపంచమంతా వ్యాపించి, 1918 వరకు కొనసాగింది. మానవ జాతి చరిత్రలో ఇంతకు ముందెన్నడూ ఇటువంటి యుద్ధం జరగలేదు. అందువల్లనే ఈ యుద్ధాన్ని మొదటి ప్రపంచ యుద్ధమన్నారు. ఈ యుద్ధం వల్ల అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంతర్జాతీయ పరిణామాలు సంభవించాయి.

**16.4.1 అపార ధన ప్రాణ నష్టములు :** మొదటి ప్రపంచ యుద్ధం వల్ల అపార ధన, ప్రాణ నష్టములు జరిగాయి. ఈ యుద్ధంలో ఎనిమిదిన్నర మిలియన్‌లు మరణించారు. 29 మిలియన్‌లు గాయపడడమో, కనించకుండా పోవడమో, యుద్ధ ఖైదీలుగా పట్టుబడడమో జరిగింది. తూర్పు, మధ్య ఐరోపా, ఇటలీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లలో దగ్గర బంధువునో, మిత్రుణ్ణో పోగొట్టుకోని కుటుంబమంటూ లేదు. 200 బిలియన్ డాలర్లు యుద్ధం ఖర్చని అంచనా. పరోక్షంగా మరో 150 మిలియన్ డాలర్లు యుద్ధంలో ఖర్చు పెట్టారని తేలింది. ఇంత వరకు ఇంత భారీ ఎత్తున జరిగిన యుద్ధం మరొకటి లేదు.

**16.4.2 ప్రపంచ రాజకీయ గరిమనాభి అమెరికా బదిలీకావడం :** మొదటి ప్రపంచ యుద్ధం వల్ల సంభవించిన ఫలితాల్లో ప్రధానమైంది ప్రపంచ రాజకీయ, సైనిక, ఆర్థిక గరిమనాభి ఐరోపానుంచి అమెరికాకు బదిలీకావడం. యుద్ధానికి ముందు ఐరోపాలోని ఆరు దేశాలు మాత్రమే దాదాపు అన్ని రంగాలలో ప్రధాన పాత్ర పోషించేవి. యుద్ధం అంతమయిన తరువాత ఆస్ట్రియా - హంగరి సామ్రాజ్యం అంతమయింది. విప్లవం వల్ల రష్యా పడిపోయింది. జర్మనీలో అరాచకం పెరిగింది. బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు బాగా అలిసిపోయి ఉన్నాయి. యూరోపియనేతర రాజ్యాలైన అమెరికా, జపాన్‌ల శక్తి విపరీతంగా పెరిగింది.

**16.4.3 అమెరికా ఋణదాతగా మారడం :** మిత్రరాజ్యాల వారికి అమెరికా యుద్ధానికి ముందు, ప్రధానంగా యుద్ధకాలంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరా చేస్తూ వచ్చింది. అప్పులు తీసుకొన్నందువల్ల మిత్ర రాజ్యాలవారు అమెరికాకు బాగా రుణపడి పోయారు. మొదటిసారిగా అమెరికాలో ఐరోపా చేసిన ఋణాలు అధికమైంది. అమెరికా ఋణదాతగా మారింది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్ ప్రపంచంలోనే అగ్రగామి అయింది. ఈ యుద్ధం వల్ల అమెరికా పోగొట్టుకొన్న దానికన్నా సంపాదించుకొన్నది ఎక్కువని ఐరోపావారు భావించారు. తామే కనుక సకాలంలో సహాయం అందచేయకపోయినట్లయితే ప్రష్యా యుద్ధ యంత్రం క్రింద మిత్ర రాజ్యాలు నలిగిపోయి ఉండేవని అమెరికన్‌లు భావించారు.

**16.4.4 జాతీయ వాదం అధికం కావడం :** మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జరిగిన సంఘటనలవల్ల జాతీయవాదం విజృంభించింది. వలస వాదానికి చావు దెబ్బ తగిలింది. విల్సన్ 14 సూత్రాలలో చోటు చేసుకొన్న జాతీయతాభావం ప్రాతిపదికగా ఐరోపా రాజకీయ పటము పునర్వ్యవస్థీకరించబడింది. జాతీయతా భావం ప్రాతిపదికగా చెకొస్లొవేకియా, యుగోస్లావియా, పోలెండ్, ఇస్తోనియా, లాట్వియా, ఫిన్‌లాండ్, లిదువేనియా మొదలగు రాజ్యాలు కొత్తగా ఆవిర్భవించాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం సుమారు 4 కోట్ల మంది విదేశీ పాలనలో ఉండగా యుద్ధానంతరం కేవలం 20 లక్షల మంది మాత్రమే మిగిలిరి.

ఆసియా ఖండంలో 'జాతుల స్వయం నిర్ణయాధికారం' అనే నినాదం మార్మోగింది. స్వయం నిర్ణయాధికార సూత్రం చివరకు ఆంగ్ల సామ్రాజ్య విచ్ఛిత్తికి దారి తీసింది. యుద్ధం తరువాత ఆంగ్ల సామ్రాజ్యం కింద వున్న పాలిత ప్రజలు స్వాతంత్ర్యం కోసం ఇనుమడించిన ఉత్సాహంతో పోరాడారు. ఇండియా, మలయా, సింహళం, బర్మాలలో ప్రభవించిన జాతీయోద్యమాలు డచ్, ఫ్రెంచి సామ్రాజ్యాలకు పాకాయి.

.4.5 **ప్రజా స్వామ్య ప్రభుత్వాలకు విజయం చేకూరడం :** ఈ యుద్ధంలో ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇటలీ, అమెరికాలలోని ప్రజాస్వామ్య భుత్వాలకు విజయం చేకూరింది. నియంతృత్వ ధోరణులున్న జపాన్, మిత్రరాజ్యాల ప్రభావం వల్ల రాజ్యాంగ బద్ధమైన పాలనవైపు ాగడం మొదలు పెట్టింది. నియంతృత్వ, అర్థ నియంతృత్వ సామ్రాజ్యాలు రష్యా, జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ పతనం చెందాయి. ఓడిపోయిన మ్రాజ్యాల నుంచి ఉద్భవించిన దేశాలు రిపబ్లికన్ రాజ్యాంగాలను అమలు జరుపుకొన్నాయి. ఇంగ్లండ్ తన వలసల్లో స్వయం నిర్ణయాధికార ాయితీలు మంజూరు చేయడం మొదలు పెట్టింది.

.4.6 **నియంతృత్వ ప్రభుత్వాల స్థాపన :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు నాటి సమస్యలను ష్కరించడంలో విఫలమయ్యాయి. దీంతో ప్రజలకు ప్రజాస్వామ్యంపై విశ్వాసము సన్నగిల్లెను. ఫలితంగా నియంతృత్వ ప్రభుత్వాల ాపన జరిగింది. జర్మనీలో నాజిజమ్, ఇటలీలో ఫాసిజమ్, రష్యాలో బోల్షివిజమ్ ప్రభుత్వాలు వెలిసాయి. ఈ ప్రభుత్వాల పాలనలో వ్యక్తి ్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యము హరించబడ్డాయి.

## .5. యుద్ధానికి జర్మనీ బాధ్యత :

మొదటి ప్రపంచ యుద్ధానికి ప్రధానమైన బాధ్యత ఏ దేశానిదనే విషయం వివాదాస్పదమైనది. యుద్ధం ముగిసిన తర్వాత విజయం ధించిన మిత్ర రాజ్యాలు ఈ యుద్ధానికి జర్మనీదే బాధ్యత అని నిందించినవి. ఇది కొంత వరకు మాత్రమే సత్యం. జర్మనీలోని ానేతలు తమజాతి మాత్రమే ప్రపంచాన్ని పాలించడానికి నిర్దేశింపబడిందనే సిద్ధాంతాన్ని ప్రబోధించి పెద్ద ఎత్తున యుద్ధోన్మాదాన్ని ష్టించిన మాట వాస్తవమే గాని యుద్ధానికి పూర్వం జరిగిన సంఘటనలు పరిశీలిస్తే జర్మనీ కంటే ఆస్ట్రియా ఎక్కువ బాధ్యత వహించిందని ్పవచ్చు. ఆస్ట్రియా యొక్క పెడవాదన, మొండి ధోరణి అగ్రరాజ్యాల మధ్య ద్వేష పూరితమైన వాతావరణాన్ని సృష్టించింది. కాబట్టి ుద్ధ బాధ్యతను ఒక్క జర్మనీపైనే వేయటం సమంజసం కాదు. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో వెనువెంటనే ప్రవేశించిన గ్రరాజ్యాలు ఐదు కూడా ఆస్ట్రియా-హంగరి, రష్యా జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండులు సమానంగా ఈ బాధ్యతను పంచుకోవలసి వస్తుందని రిత్రకారుల అభిప్రాయం.

## 6.6. మిత్ర రాజ్యాల విజయానికి కారణాలు :

మిత్ర రాజ్యాలకు, మధ్య ఐరోపా రాజ్యాలకు మధ్య నాల్గు సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగా సాగిన మొదటి ప్రపంచ యుద్ధంలో ుత్ర రాజ్యాలు విజయం సాధించాయి. జర్మనీ కూటమి పరాజయం చెందింది. అందుకు అనేక అంశాలు దోహదం చేసాయి.

.6.1 **ఆర్థిక సుస్థిరత :** ఈ యుద్ధంలో ఆర్థిక సుస్థిరత ప్రధానంగా జయాపజయాలను నిర్ణయించ గల్గిందని చెప్పవచ్చు. మిత్ర ్యాలకు ఆర్థిక వనరులు పుష్కలంగా వుండుటచేత, మధ్య ఐరోపా రాజ్యాలపై అంతిమ విజయం సాధించగల్గాయి. ముఖ్యంగా మిత్ర ాజ్యాలలో ప్రధానమైన ఇంగ్లండ్‌కు కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి వలసలనుంచి మరియు భారతదేశంలాంటి అధీన దేశాల ుండి అంగబలము, ఆర్థిక బలము లభించడం చేత కూడా మిత్ర రాజ్యాలకు మరింత బలం చేకూరింది.

6.6.2 **బ్రిటిష్ వారి నావికాదళం :** మిత్ర రాజ్యాలవారి విజయానికి తోడ్పడిన మరో అంశం బ్రిటిష్ వారి నావికాదళం. జర్మన్ ావికాదళం యొక్క ఉధృతాన్ని బ్రిటిష్ నావికాదళం అతి సమర్థతతో నిరోధించ గల్గింది.

6.6.3 **ఇటలీ, రుమేనియాలు ప్రదర్శించిన ధోరణి :** ఇటలీ రుమేనియాలాంటి దేశాలు ప్రదర్శించిన ధోరణి వల్ల మిత్ర రాజ్యాలకు ్ఠం చేకూరింది. ప్రాథమికంగా ఈ రెండు రాజ్యాలు మధ్య ఐరోపా రాజ్యాలతో సంధి ఒప్పందాలు కల్గి ఉన్నప్పటికీ అవి మధ్య ఐరోపా ాజ్యాలను వదలి మిత్ర రాజ్యాలను ఆశ్రయించటం వల్ల మిత్ర రాజ్యాలకు శక్తి చూకూరింది.

.6.4 **విభిన్న జాతులు కల్గిన ఆస్ట్రియా, టర్కీ :** మధ్య ఐరోపా రాజ్యాల పక్షం వహించిన ఆస్ట్రియా, టర్కీలాంటి దేశాలు వివిధ భిన్న ాతులతో కూడుకొని ఉండడం చేత ఈ రెండు రాజ్యాలతో ఆంతరంగిక సుస్థిరత దెబ్బతిన్నది. తీవ్రంగా యుద్ధం జరుగుచున్న

సమయంలోనే హంగరి, ఆస్ట్రియా నుంచి విడిపోయింది. అలాగే బోస్నియన్, హెర్జిగోవియన్ జాతుల వారు ఆస్ట్రియాకు వ్యతిరేకం. సెర్బియాను సమర్థించారు. టర్కీలో అరబ్బులు ఇంగ్లండ్‌ను సమర్థించారు. ఈ విధమయిన ఆంతరంగిక బలహీనతలవల్ల మధ్య ఐరోపా రాజ్యాలు దెబ్బతిన్నవి.

**16.6.5 బోల్షివిక్ విప్లవం :** 1917లో రష్యాలో వచ్చిన బోల్షివిక్ విప్లవం కూడా మిత్ర రాజ్యాల వారికే తోడ్పడింది. రష్యాలో జ ప్రభుత్వం పడిపోయిన తరువాత లెనిన్ జర్మనీతో సంధి చేసుకొన్నాడు. దాంతో యుద్ధం నుంచి రష్యా ఉపసంహరించుకొన్నది. తాత్కాలిక. ఈ చర్యవల్ల అగ్రరాజ్యాలకు నష్టం వాటిల్లినా చివరకు వారికే మేలు చేకూరింది. రష్యా నుండి విడుదల చేయబడిన జర్మన్ యుద్ధ ఖైదీ మాతృదేశం వెళ్ళి విప్లవ భావాలను ప్రబోధించారు. అవకాశం కనిపెట్టిన సోషల్ డెమోక్రాటిక్ పార్టీ జర్మన్ ప్రభుత్వాన్ని యుద్ధ విషయ వ్యతిరేకించింది. దీనివల్ల జర్మన్ సైనిక శక్తి నైతికంగా దెబ్బతిన్నది.

**16.6.6 అమెరికా :** అమెరికా మిత్ర రాజ్యాల తరుపున మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రవేశించడం వల్ల మిత్ర రాజ్యాలకు శక్తినీ, ధైరా చూకూర్చినవి.

**16.6.7 మిత్రరాజ్యాల ఐక్యత :** యుద్ధం జరిగినంత కాలం మిత్ర రాజ్యాలు గొప్ప ఐక్యతను ప్రదర్శించింది. వారి ఐక్యత, చిత్త శు మధ్య ఐరోపా రాజ్యాల యొక్క స్థైర్యాన్ని ఛేదించినవి.

## 16.7 వర్సే సంధి - విమర్శ

మొదటి ప్రపంచ యుద్ధానంతరం విజయం సాధించిన మిత్ర రాజ్యాలు పారిస్‌లో సమావేశమై, చర్చించి పరాజయం చెంది జర్మనీతో వర్సే సంధి పత్రాలమీద సంతకాలు చేయించారు. వర్సే సంధి నిబంధనలు, దానిపై విమర్శ గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**16.7.1. ఉపోద్ఘాతము :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతి సంధికి సంబంధించిన వివరాలు చర్చించి నిర్ణయాలు చేయడాని పారిస్ శాంతి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ప్రపంచంలోని వివిధ రాజ్యాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొనే హక్కు పరాజయం చెందిన దేశాలకు, ప్రపంచ యుద్ధకాలంలో మధ్యలో విరమించినందువలన రష్యాకు, నిరాకరించడ జరిగింది. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్ దేశాలవారు అనేక విషయాలపై చర్చిం చివరకు పరాజయం చెందిన దేశాలతో విడివిడిగా సంధులు చేసుకొన్నారు. వాటిలో ప్రధానమైంది మిత్ర రాజ్యాలు జర్మనీతో చేసుకొ వర్సే సంధి. ఈ సంధి ఆధునిక కాలానికి చెందిన ఒక ముఖ్యమైన వివాదాస్పదమైన సంధి.

**16.7.2. పారిస్ సమావేశాలు :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతికి సంధికి సంబంధించిన వివరాలు చర్చించి నిర్ణయాల చేయడానికి యుద్ధ విరమణ ఒడంబడిక ప్రకారం పారిస్ శాంతి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొ హక్కును అక్షరాజ్యాలు అయిన జర్మనీ, ఆస్ట్రియా - హంగరి, బల్గేరియా, టర్కీలకు నిరాకరించడం జరిగింది. అలాగే యుద్ధ జరుగుచున్నపుడు యుద్ధం నుంచి ఉపసంహరించుకొన్న రష్యాకు ఈ సమావేశంలో ప్రాతినిధ్యం లేదు. ఈ సమావేశంలో అమెరి అధ్యక్షుడు విల్సన్, బ్రిటన్ ప్రధాని లాయిడ్ జార్జి, ఫ్రాన్స్ ప్రధాని క్లెమన్ సూ, ఇటలీ ప్రధాని ఆర్లెండో, దక్షిణ ఆఫ్రికా తరపున జనరల్ స్మట గ్రీస్ తరపున వెనిజిలోస్ మొదలైన ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం మీద 32 దేశాలు పారిస్ సమావేశంలో పాల్గొన్నాయి.

**16.7.2.1 సమావేశంలో ముఖ్య పాత్ర నిర్వహించిన నాయకులు :** పారిస్ శాంతి సమావేశం వియన్నా కాంగ్రెస్‌వలె నిరంకుశులైన పాలకుల అదుపులోగాక ప్రజాప్రభుత్వాల ప్రతినిధుల చేతిలో వుంది. అయితే రెండు సందర్భాలలో శాంతి చర్చలు బహిరంగ ప్రదేశాలలో జరగలేద బహిరంగ చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కుదరడం కష్టమని సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ప్రతినిధులంతా అభిప్రాయపడ్డార

ఈ అభిప్రాయంలో కేవలం సాధ్యా సాధ్యాలను మాత్రమే పరిగణనలోనికి తీసుకొన్నారని భావించడం కష్టం. వియన్నా కాంగ్రెసు నెపోలియన్ దండ యాత్రల వలన ఐరోపా శాంతి భద్రతలకు కారణమైందనే నేపంతో ఫ్రాన్సును శిక్షించదలచి సమావేశమైనట్లే, ఈ శాంతి సమావేశంలో కూడ జర్మనీని శిక్షించడమనే అభిప్రాయం ప్రబలంగా ఉండిన కారణాన అటువంటి నిర్ణయం తీసుకోడం జరిగిందని అర్థం చేసుకోవడం పొరపాటు కాదు. ఉడ్రోవిల్సన్ గొప్ప ఉదారవాది అయినప్పటికి, జర్మనీ పట్ల కక్ష తీర్చుకొనే ప్రవృత్తిని మిత్ర పక్షాల మనస్సులనుండి తొలగించలేక పోయాడు. బ్రిటిష్ ప్రధానమంత్రి, పారిస్ శాంతి సమావేశంలో ఆ దేశానికి ప్రాతినిధ్యం వహించిన లాయడ్ జార్జి సైతం ఔదార్యంగానే వ్యవహరించదలచినా, స్వదేశంలోని రాజకీయ పరిస్థితులు అతని ఔదార్యాన్ని హరించివేసి, కక్ష తీర్చుకొనే విధంగా పురికొల్పాయి. అందువల్ల సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు సూచించే పనిని 5 అగ్ర రాజ్యాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్ దేశాల ప్రతినిధులకు అప్పగించారు.

**16.7.2.1.1 ఉడ్రోవిల్సన్ :** పారిస్ శాంతి సమావేశంలో పాల్గొన్న వారిలో ప్రత్యేక ప్రాముఖ్యమున్న వ్యక్తి అమెరికా అధ్యక్షుడు విల్సన్. ఇతడు మంచి వక్త, ఆదర్శవాది, దృఢ సంకల్పుడు. ఇతడు యుద్ధ కాలంలోనే 14 సూత్రాలు ప్రకటించిన భావవాది. ఇతని దృష్టంతా న్యాయం మీద, ప్రజాస్వామ్య సూత్రాలమీద, జాతుల స్వయం నిర్ణయాధికారం మీద, నానాజాతి సమితి సంబంధిత లిఖిత ఒడంబడికలమీద కేంద్రీకరించి ఉన్నది. ఇతనికి అమెరికా ప్రజల అండదండలులేవు. దౌత్య విసయాలలో ఆరితేరినవాడు కాదు.

**16.7.2.1.2 లాయిడ్ జార్జ్ :** పారిస్ శాంతి సమావేశంలో బ్రిటన్ తరపున ప్రాతినిధ్యం వహించిన వ్యక్తి బ్రిటిష్ ప్రధాని లాయిడ్ జార్జ్. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి, దౌత్య విషయాలలో ఆరితేరినవాడు. వాస్తవికవాది. ఇతనికి బ్రిటిష్ ప్రజలందరి అండదండలున్నాయి. ఇతడు బ్రిటిష్ ప్రయోజనాలను కాపాడుకొన్నాడు.

**16.7.2.1.3 క్లిమెన్‌సూ :** పారిస్ సమావేశంలో ఫ్రెంచి ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించినవాడు ఫ్రెంచి ప్రధాని జార్జి క్లిమెన్‌సూ. ఇతడు దౌత్య వ్యవహారాల్లో బాగా అనుభవం గడించిన వ్యక్తి, రాజనీతి కోవిదుడు. ఇతడు ఉద్వేగంతో కూడిన జాతీయ భావంతో జర్మనీపట్ల తీవ్ర వ్యతిరేక భావం వ్యక్తం చేశాడు. జర్మన్ శక్తిని అణచివేస్తేనే తప్ప ఫ్రాన్స్‌కు భవిష్యత్తులేదని ఇతడి విశ్వాసం. ఈ సమావేశంలో ప్రతి కీలకమైన విషయంపై చర్చ జరిగినపుడు విల్సన్‌పై ఇతడు విజయం సాధించాడు.

**16.7.2.1.4 ఆర్లెండో :** ఈ సమావేశంలో ఇటలీ ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించినవాడు ఇటలీ ప్రధాని ఆర్లెండో. ఇతడు మంచి విద్వాంసుడు, వక్త, దౌత్యవేత్త. ఇతడు రహస్య సంధులకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు.

పైన పేర్కొన్న నాల్గు అగ్రరాజ్యాల ప్రతినిధులు ఈ సమావేశంలో ముఖ్య పాత్ర వహించారు. ఇందులో రెండు పరస్పర విరుద్ధ బావాలు, భావవాదం, యదార్థవాదం వ్యక్తమయినాయి. ఈ రెండింటిలో చివరకు యదార్థవాదం నెగ్గింది. వీటిలో నిరుపయోగమైన భావవాదం ఉడ్రోవిల్సన్‌ది కాగా, చివరకు పట్టు సాధించి, నెగ్గిన యథార్థవాదం ఫ్రెంచి ప్రతినిధి అయిన క్లెమెన్స్యూది.వియన్నా సమావేశంలో వలె పారిస్ సమావేశంలోకూడా ప్రతినిధులు తీసుకొన్న నిర్ణయాలు విజేతలకు ప్రయోజనాలు చేకూర్చేవిగానూ, ఓడిపోయిన వారికి గుణపాఠాలు నేర్పేవిగానూ ఉన్నాయి.

పారిస్ సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంఖ్య చాలా ఎక్కువ. దీనికి తోడు పత్రికా విలేకరులు సమస్యలను మరింత జటిలంచేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు పరస్పర విరుద్ధమైన స్వార్థ ప్రయోజనాలున్నాయి. సమావేశానికి స్థానంగా పారిస్ పట్టణాన్ని ఎన్నిక చేయడం ఒక అవరోధమయింది. ఆదర్శ విషయాలలో అగ్రనాయకులకు ఏకాభిప్రాయం లేదు. విల్సన్ రహస్య సంధులకు వ్యతిరేకంగా ఉన్నాడు. మొత్తం మీద ఈ సమావేశంలో రెండు సిద్ధాంతాల మధ్య ఘర్షణ ఏర్పడింది. అందులో ఒకటి ఆదర్శవాదం, రెండోది అవకాశవాదం. అయితే చివరకు విల్సన్ ఆదర్శవాదం గెలవలేదు. చాలామంది అగ్రనాయకులు అనుసరించిన అవకాశవాదమే గెలిచింది.

పారిస్ శాంతి సంధులకు విల్సన్ 14 సూత్రాలు, రహస్య సంధులు, బోల్షివిక్ విప్లవం, జాతీయ సమస్య ప్రాతిపదికగా తీసుకొని చర్చలు జరిపి ఐరోపా దేశాల పునర్విభజనచేయడం జరిగింది.

**16.7.2.3.1 విల్సన్ 14 సూత్రాలు :** యుద్ధం కొనసాగుతూ ఉన్నపుడే ప్రపంచ శాంతి స్థాపన 14 సూత్రాల మీద ఆధారపడి జరగాలని అమెరికా అధ్యక్షుడు విల్సన్ 1918 జనవరి 8న ప్రకటించాడు. ఆ తరువాత ఫిబ్రవరి 11న 4 సూత్రాలు జాల్లై, సెప్టెంబర్‌లలో మరో రెండు ప్రకటనలు శాంతి స్థాపనకు ప్రాతిపదికగా విల్సన్ చేశాడు. ఈ సూత్రాల ప్రాతిపదికగా శాంతి సంధులను తయారు చేయడం కష్టమయింది. అయితే విల్సన్ ప్రతిపాదించిన సూత్రాలు శాంతి స్థాపనకు చాలా వరకు దోహదం చేసినాయని చెప్పవచ్చు.

**16.7.2.3.2 రహస్య సంధులు :** యుద్ధం జరుగుతున్న కాలంలో వివిధ దేశాలకు మధ్య పరస్పర శ్రేయస్సు కోసం అనేక రహస్య సంధులు జరిగాయి. వాటిలో కాన్‌స్టాంటినోపుల్ సంధి, లండన్ సంధి, సైక్స్-పికో సంధి, ఇటలీతో సంధి, రుమేనియాతో సంధి, జపాన్‌తో సంధి, ఫ్రాన్స్, రష్యాల మధ్య పేర్కొనదగింది. అయితే పైన పేర్కొన్న రహస్య సంధులను అమలు పరచడానికి అనేక కారణాలవల్ల కష్టమయింది. విల్సన్ రహస్య సంధులకు వ్యతిరేకిగా ఉన్నాడు. అయితే శాంతి సంధులను రూపొందించేటపుడు ఈ రహస్య సంధులలోని కొన్ని భాగాలు ఆమోదం పొందాయి.

**16.7.2.3.3 బోల్షివిక్ విప్లవం :** రష్యాలో జరిగిన బోల్షెవిక్ విప్లవ ప్రభావానికి పారిస్ శాంతి సమావేశం చాలా వరకు లోనయింది. రష్యాలో నిరంకుశ చక్రవర్తుల పాలన అంతమై కమ్యూనిష్ట్ ప్రభుత్వం ఏర్పాటయింది. దాంతో ఐరోపా తూర్పు భాగాన్ని కమ్యూనిష్ట్ ప్రభావానికి లోనుకాకుండా కాపాడటానికి మిత్ర రాజ్యాలు చేసే ప్రయత్నాలకు వర్సేసంధి సూత్రాలే ప్రాతిపదిక అయినాయి. అనగా కమ్యూనిస్టు ప్రభావాన్ని అరికట్టడమనే ప్రయోజానాన్ని మనసులో ఉంచుకొని ఈ సంధి సూత్రాలను రూపొందించడం జరిగింది.

**16.7.2.3.4 జాతీయ భావ సమస్య :** అయితే అన్ని విధాలయిన రాజకీయ సిద్ధాంతాలు, భావాల్లో, పారిస్ శాంతి సమావేశాన్ని బాగా ప్రభావితం చేసింది జాతీయవాదం మొదటి ప్రపంచ యుద్ధానికి పునాదులు వేసింది జాతీయవాదానికి, సామ్రాజ్య వాదానికి, నడుమ ఏర్పడ్డ సంఘర్షణ అని పైన వివరించడం జరిగింది. అగ్రరాజ్యాల కుమ్ములాటల్లో చితికిపోతున్న జాతీయతావాదం, ముఖ్యంగా తూర్పు ఐరోపా దేశాల్లోని ప్రజల మనోభీష్టాలకు పారిస్ శాంతి సమావేశం ఆలంబనగా నిలిచింది. విల్సన్ ప్రతిపాదించిన సూత్రాలలో భాగమైన స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చిన తరువాత ప్రపంచంలోని వివిధ జాతుల ప్రజల్లో జాతీయ భావనలకు మద్దత్తు దొరికింది. ఇంత వరకు విదేశీ పాలనలో పీడితులైన ప్రజలు స్వయం నిర్ణయం సిద్ధాంతం ప్రకారం జాతీయ రాజ్యాలు ఏర్పడాలని పట్టుదల చూపసాగినారు. పీడిత ప్రజల కోరికల కనుగుణంగా పారిస్ సమావేశం నూతన రాజ్యాలను ఏర్పాటు చేసింది. అలాగే అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, మొదలైన మిత్ర రాజ్యాల జాతీయ ప్రయోజనాల కనుగుణంగా పారిస్ శాంతి సంధులలోని నిబంధనలను రూపొందించింది. అయితే అటువంటి ఏర్పాట్లు ఆయాదేశాల విస్తరణ విధానాలకు, మరోమాటలో చెప్పాలంటే ఆ దేశాల సామ్రాజ్యవాదానికి అనుగుణమై భవిష్యత్తులో సంఘర్షణలకు రెండో ప్రపంచ యుద్ధానికి పునాది వేశాయి. అయితే ఇటలీ తన లక్ష్యాలను సాధించుకోవడంలో చాలా వరకు విఫలమయింది. పారిస్ సమావేశానంతరం ఇటలీ పూర్తిగా అసంతృప్తి చెందినది.

## 16.8. వర్సే సంధిలోని అంశాలు :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతి సంధికి సంబంధించిన వివరాలు చర్చించి నిర్ణయాలు చేయడానికి, 1918 నవంబర్ 11న మిత్ర రాజ్యాలకు జర్మనీకి మధ్య జరిగిన యుద్ధ విరమణ ఒడంబడిక ప్రకారం, పారిస్ శాంతి సమావేశం 1919 జనవరి 18న ప్రారంభమైంది. ఈ సమావేశంలో నానాజాతి సమితి, ఫ్రాన్స్ దేశపు భద్రత, ఇటలీ రాజ్యకాంక్ష, ఓడిపోయిన రాజ్యాలైన జర్మనీ, టర్కీలకు చెందిన వలసలు, జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్ట పరిహారం మొదలగు అనేక జటిల సమస్యలమీద నాలుగైదు నెలల పాటు సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. ఈ కాలంలో అనేక రహస్య సమావేశాలూ, బహిరంగ సమావేశాలు జరిగాయి.

ఈ చర్చల్లో ప్రముఖ సమస్య జర్మనీ యుద్ధోన్మాదాన్ని అరికట్టి, భవిష్యత్తులో ఆ దేశంనుండి ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లకుండ తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు నాల్గింటిని రూపొందించారు. అందులో మొదటి అంశం ఒక వేళ జర్మనీ తిరిగి తన పరాభవాన్ని మాపుకొనే ప్రయత్నంలో మరొక పోరాటానికి పూనుకొన్నట్లయితే, దానిని అరికట్టే బాధ్యత ప్రధానంగా ఫ్రాన్సుపై ఉంటుందని, అందుకై ఆ

దేశాన్ని తగు విధంగా బలోపేతం చేయాలని భావించడం. రెండవది పోలెండును పునరుద్ధరించడం. పందొమ్మిదో శతాబ్దంలో ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలు మూడు దఫాలుగా పోలెండు దేశాన్ని తమలో తాము విభజించి పంచుకొన్నాయి. ఆ కారణంగా పోలెండు వాస్తవ ప్రపంచంలో భౌగోళికంగా అంతర్ధానమైంది. పోలెండును పునరుద్ధరించడం పారిస్ సంధి సమావేశ కాలంలో అసాధ్యం కాదు. కారణమేమంటే ఆస్ట్రియా, జర్మనీగా పరిణామం చెందిన ప్రష్యా పరాజిత దేశాలై మిత్ర రాజ్యాల షరతులను ఆమోదించ వలసిన స్థితిలో ఉన్నాయి. ఆ సమయాన అనేక ఐరోపాదేశాల్లో ఉద్భుతమౌతున్న జాతీయ భావాలను గౌరవించి, ప్రాదేశిక నియమాలను (Territorial Provisions) రూపొందించదలచినందున మిత్ర రాజ్యాలు పోలెండు పునరుద్ధరణను చాలా న్యాయబద్ధమైన, ఆవశ్యకమైన అంశంగా పరిగణించారు. మూడవది జర్మనీని సైనికంగా బలహీన పరచడం. నాలుగోది రాజ్యాల నడుమ తలెత్తే పోటీలు, స్పర్థలు, చినుకులు గాలివాన అయినట్లు కాకుండ ఆదిలోనే వాటిని చర్చల ద్వారా పరిష్కరించడం. ఎందుకంటే, బాల్కన్ ద్వీపకల్పంలో తలెత్తిన ఇటువంటి చిన్న సమస్యలే అగ్రరాజ్యాల స్వార్థ రాజకీయాల వలన ప్రపంచయుద్ధంగా పరిణమించడం జరిగింది కనుక ఈ దిశగా పారిస్ శాంతి సమావేశం తీసుకున్న నాలుగో ముందు జాగ్రత్త చర్య నానాజాతిసమితి స్థాపన.

1919 మే నాటికి సంధి ముసాయిదా పత్రాలు 230 పేజీలలో, 15 భాగాలుగా 439 ప్రకరణాలుగా తయారయినాయి. ముసాయిదాను సంతకాల కోసం జర్మన్ ప్రతినిధుల ముందు వుంచారు. 1919 ఏప్రిల్ 30 నాటికి పారిస్ పట్టణం చేరుకొన్న జర్మన్ ప్రతినిధులు పారిస్ పట్టణంలో దాదాపుగా ఖైదీలుగా ఉండి అవమానానికి గురి అవుతూ సంధి ముసాయిదాను గత్యంతరం లేక అంగీకరించారు. వారు పరిశీలించి అంగీకరించడానికి మిత్ర రాజ్యాలు కేవలం మూడు వారాల వ్యవధి మాత్రమే ఇచ్చాయి. సంధి షరతులు చాలా కఠినంగానూ, విల్సన్ ప్రతిపాదించిన 14 సూత్రాల భావానికి భిన్నంగా ఉన్నాయని జర్మన్ ప్రభుత్వ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం తెలియజేసారు. జర్మన్‌ల అభ్యంతరాలను తోసిపుచ్చి జూన్ 23 లోపల ముసాయిదాకు తమ సమ్మతి తెలియ జేయాలని, లేని పక్షంలో తిరిగి యుద్ధం ప్రారంభిస్తామని విజేతలు ప్రకటించారు. వైమార్‌లో సమావేశమైన జర్మన్ జాతీయ శాసనసభ 237-138 ఓట్ల మెజారిటితో ముసాయిదా సంధిని ఆమోదిస్తూ తీర్మానం చేసింది. 1919 జూన్ 28న వర్సే సంధిపై జర్మన్ విదేశాంగ మంత్రి హెర్మన్ ముల్లర్, విజేతలు, వారి సంబంధితుల తరపున జోహన్నెస్ బెల్ సంతకాలు చేశారు. ఈ చారిత్రాత్మక సంఘటన వర్సే రాజ ప్రాసాదంలో జరిగింది. అయితే అమెరికా ఈ సంధిని ధృవపరచలేదు.

వర్సే సంధిలోని నిబంధనలను ఈ క్రింద వివరించినట్లు ఏడు విధాలుగా వర్గీకరించవచ్చు.

### 16.8.1 ప్రాదేశిక ఏర్పాట్లు (Territorial Provisions) :

పైన వివరించినట్లు ప్రాదేశిక నిబంధనలు భవిష్యత్తులో జర్మన్ దురాక్రమణను అరికట్టడము, వివిధ ఐరోపా ప్రజానీకాల జాతీయ భావాలను, ఆకాంక్షలను నెరవేర్చడం ప్రధానంగా ఉద్దేశించినవి. అవి 1) 1871లో జర్మనీ ఆక్రమించిన ఆల్సేస్ - లొరైన్ ప్రాంతాలను తిరిగి ఫ్రాన్స్ పొందింది. 2) జర్మనీ దురాక్రమణ వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా యూపెన్, మాల్‌మెడి, మొర్సెనెట్ అనే ప్రాంతాలను బెల్జియం పొందినది. 3) ప్రజాభిప్రాయాన్ని అనుసరించి ఉత్తర ష్లెస్‌విగ్‌ను డెన్మార్క్‌కు ఇవ్వడం జరిగింది. 4) పోసెన్, పశ్చిమ ప్రష్యా, కషూబ్‌జిల్లా, ఎగువ సైలీషియా ప్రాంతాలతో పోలెండ్‌ను పునరుద్ధరించారు. 5) సార్‌లోయ నానాజాతి సమితి ఆధీనంలో ఉంచారు. 6) సార్‌లోయలోని బొగ్గు గనులు ఫ్రాన్స్‌కిచ్చినారు. 7) 15 సంవత్సరాల తరువాత జనవాక్య సేకరణ ప్రాతిపదికగా సార్‌లోయ భవిష్యత్‌ను నిర్ణయించడం జరుగుతుంది. 8) మెమెల్‌ను మిత్ర రాజ్యాల పరంచేసి తరువాత లిథూవేనియాకిచ్చారు. 9) ఎగువ సైలీషియాలో కొద్ది భాగం చెకొస్లోవాకియాకిచ్చారు. 10) ఆస్ట్రియాను సంపూర్ణ స్వతంత్ర దేశంగా జర్మనీ గుర్తించింది. 11) జర్మన్ రేవు పట్టణమైన డాన్‌జిగ్ స్వేచ్ఛా పట్టణంగా ప్రకటించి నానాజాతి సమితి పరిపాలన కింద ఉంచినారు. 12) ఆ రేవు పట్టణానికి మార్గాన్ని జర్మన్ భూభాగం నుండి వేరు చేసిన కారిడార్ గా ఏర్పరచి పోలెండ్ ఆధీనంలో ఉంచడం జరిగింది.

జర్మనీ తన వలసలన్నిటిని కోల్పోయింది. 1,27,000 చదరపు మైళ్ళ విస్తీర్ణమున్న జర్మన్‌వలసలు మిత్ర రాజ్యాల పర్యవేక్షణలోకి వచ్చాయి. వీటిని 'అధిష్ట ప్రాంతా'లంటారు. 1) టోగోలాండ్, టాంగనీకా బ్రిటిష్ పాలనలోకి వచ్చాయి. 2) జర్మన్ నైరృతి ఆఫ్రికా

పాలనాధికారం దక్షిణాఫ్రికా ప్రభుత్వానికిచ్చారు. 3) జర్మన్ సమోవా దీవులు న్యూజీలాండ్ ఆధీనంలో ఉంచినారు. 4) మార్షల్ దీవుల పాలనా బాధ్యతను జపాన్‌కు ఇచ్చినారు. 5) జర్మన్ న్యూగయానా పాలన ఆస్ట్రేలియాకు అప్పగించినారు. 6) చైనా, సయామ్, మొరాకో మొదలైన దేశాలలో జర్మనీ తనకున్న కొన్ని హక్కులను అధికారాలను కూడా వదులుకోవలసి వచ్చింది. 7) చైనాలోని కియాచౌ. షాన్‌టుంగ్ రాష్ట్రాలు జపాన్‌కు ఇచ్చినారు.

**16.8.2 సైనిక నిబంధనలు :** పైన వివరించినట్లు భవిష్యత్తులో జర్మన్ దురాక్రమణ భయాన్ని పూర్తిగా నివారించేందుకు పారిస్ శాంతి సమావేశం ఆ దేశాన్ని సైనికంగా బలహీనపరచదలచింది. ఈ కారణంతో విధించిన అనేక సైనిక నిబంధనలు జర్మనీకి చాలా అవమానకరమైనాయి. ఏ దేశంపైనా విధించని కఠినమైన సైనిక ఆంక్షలను ఆ దేశంపై విధించడం జరిగింది. అవి : 1) జర్మనీ నిర్బంధ సైనిక విధానాన్ని విడనాడవలెను. జర్మనీ సైనిక బలం ఒక లక్షకు పరిమితం చేయాలి. 2) రైన్ నది ఎడమ భాగం పూర్తిగా, కుడి భాగం కొంత వరకు నిస్సైనిక మండలంగా ప్రకటించడానికి జర్మనీ అంగీకరించింది. జర్మనీలోని రక్షణ నిర్మాణాలు, యుద్ధ సామగ్రి పూర్తిగా ధ్వంసం చేశారు. 3) జర్మన్ నౌకాబలము ఆరు యుద్ధ నౌకలకు, ఆరు చిన్న యుద్ధ నౌకలకు 12 నౌకా విధ్వంసక నావలకు పరిమితమయింది. 4) జర్మనీకి విమాన బలం ఉండకూడదు. 5) రైన్ భూభాగము 15 సంవత్సరాల వరకు మిత్ర రాజ్యాల సైనిక ఆక్రమణలో ఉంటుంది. 6) జర్మన్ నదులు, కాలువలు అంతర్జాతీయ కమిషన్ అధికారంలో ఉంచడం జరిగింది.

**16.8.3. ఆర్థిక నిబంధనలు :** వర్సే సంధి ద్వారా జర్మనీని ఆర్థికంగా కూడా బలహీనపరచడం జరిగింది. వర్సే సంధిలోని ఆర్థిక నిబంధనలు : 1) జర్మన్ వాణిజ్య నౌకలు ఫ్రాన్స్‌కు, యుద్ధ నౌకలు బ్రిటన్‌కు ఇచ్చినారు. 2) యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలు పోగొట్టుకొన్న నౌకలస్థానే కొత్తగా నౌకలను జర్మనీ తన ఖర్చుమీద నిర్మించి ఇవ్వవలెను. 3) సయామ్, లైబీరియా, మొరాకో, ఈజిప్టు, టర్కీ, బల్గేరియాలలో తనకున్న ఆస్తి హక్కులను, అధిరాజ్య హక్కులను జర్మనీ వదులుకొన్నది. 4) విదేశాలలో ఉన్న జర్మన్ పౌరుల ఆస్తులను జప్తుచేసే అధికారం మిత్ర రాజ్యాలకు వచ్చింది. 5) జర్మనీ రాబోయే 10 సంవత్సరాలలో నిర్దిష్ట పరిమాణంలో బొగ్గును ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియంలకు సరఫరా చేయాలి. 6) 5వేల రైలు ఇంజన్‌లు 1,50,000 మోటారులను జర్మనీ మిత్ర రాజ్యాలకు ఇవ్వవలెను. 7) ఐదు సంవత్సరాల కాలం జర్మన్ ఎగుమతి దిగుమతి వ్యాపారాలమీద మిత్ర రాజ్యాలకు ప్రత్యేకాధికారాలు ఉంటాయి. 8) జర్మనీలోని ఎల్బ్, ఓడర్ నదులు అంతర్జాతీయమైనాయి. ఈ ఏర్పాటు ఫలితంగా స్విట్జర్లాండ్, చెకొస్లొవాకియాలకు స్వేచ్ఛగా సముద్రాలతో సంబంధం ఉండటానికి అవకాశం ఏర్పడింది. 9) కీల్ కాలవను అంతర్జాతీయం చేశారు.

**16.8.4 నష్ట పరిహార నిబంధన :** యుద్ధకాలంలో జర్మనీ దాడుల వలన మిత్ర దేశాల్లో ధ్వంసం అయిన పట్టణాలు, వాటిలోని పారిశ్రామికశాలలు, దేశంలో ధ్వంసం అయిన పంటపొలాలు మొదలైన వాటికి జర్మనీ చెల్లించ వలసిన నష్టపరిహారం ఒక ప్రధాన సమస్య అయితే అప్పటికప్పుడు ఆ మొత్తం ఎంతో లెక్కించడం సాధ్యంకాదు, కనుక ఆ మొత్తాన్ని ఖచ్చితంగా నిర్ణయించడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్ దేశాల ప్రతినిధులతో కూడిన నష్టపరిహార నిర్ణాయక సంఘాన్ని ఏర్పరచడం జరిగింది. యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలలోని పౌరుల ఆస్తులకు సంభవించిన నష్టాన్ని, మిత్ర రాజ్యాలు తమ సేనలకిచ్చిన సైనిక భత్యాలను, బెల్జియం మిత్ర రాజ్యాలకివ్వవలసిన యుద్ధకాలపు రుణాలను కూడా పరిగణనలోకి తీసుకొని సంఘం నష్ట పరిహారం మొత్తాన్ని నిర్ణయిస్తుంది. జర్మనీ మే 1921 నుంచి 30 సంవత్సరాల కాలంలో వాయిదాల పద్ధతి ప్రకారం చెల్లించాలి. ఈలోగా జర్మనీ మిత్రరాజ్యాలకు ఒక బిలియన్ పౌనులను చెల్లించాలి. సంధిలోని నష్టపరిహారానికి, సంబంధించిన నిబంధనల ప్రకారం 1) జర్మనీ తనకున్న పెద్ద వాణిజ్య నౌకలను, ఓడలలో సగంభాగాన్ని ఆవిరి ఓడలలో నాల్గో భాగాన్ని చేపలు పట్టే నావలను మిత్ర రాజ్యాలకు అప్పగించవలెను. 2) యుద్ధ కాలంలో విధ్వంసం చేసిన భవనాల స్థానే కొత్త భవనాలను నిర్మించడానికి కావలసిన భవన నిర్మాణ సామగ్రి జర్మనీ సమకూర్చవలెను. 3) ఫ్రాంకో - ప్రష్యా యుద్ధ కాలంలో, మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఫ్రాన్స్‌నుంచి సంగ్రహించిన ట్రోఫీలను, ప్రాచీన పత్రాలను, కళా ఖండాలను తిరిగి ఫ్రాన్స్‌కు అప్పగించవలెను. 4) మాజీ కేయిజర్ రెండో విలియం కు లోగడ బహుకరించిన ఖురాన్ ప్రతిని హెజాజ్ రాజుకు ఇవ్వవలెను. 5) లోరెయిన్ విశ్వ విద్యాలయానికి సంభవించిన నష్టాన్ని జర్మనీ గుర్తించి పరిహారంగా వ్రాతప్రతులను, పుస్తకాలను ఇవ్వడానికి అంగీకరించింది. 6) యుద్ధ కాలంలో బెల్జియం మిత్ర రాజ్యాల నుంచి అప్పుగా తీసుకొన్న డబ్బును 5 శాతం వడ్డీతో జర్మనీ మిత్ర రాజ్యాలకు చెల్లించాలి. 7) జర్మనీలో ఉన్న రెండు ప్రఖ్యాతి వహించిన వర్ణ చిత్రాలను బెల్జియంకు ఇవ్వవలెను.

**16.8.5 న్యాయపరమైన నిబంధనలు** : వర్సే సంధి ప్రకారం జర్మన్ చక్రవర్తి రెండో విలియంను యుద్ధ నేరస్థుడుగా ప్రకటించారు. విలియంతో సహా దాదాపు 100 మంది జర్మన్ యుద్ధ నేరస్థులను విచారించడానికి ఈ సంధి ప్రకారం ఏర్పాటు చేసినారు. అయితే హాలండ్ రక్షణలో ఉన్న విలియంను విచారించడానికి వీలుపడలేదు. చివరకు 12 మంది యుద్ధ నేరస్థులను మాత్రమే జర్మన్ న్యాయ స్థానాలలో విచారణ చేశారు.

**16.8.6 యుద్ధ దోషారోపణ నిబంధన** : మొదటి ప్రపంచ యుద్ధానికి, యుద్ధ కాలంలో జరిగిన నష్టాలకు పూర్తి బాధ్యత జర్మనీమీద పడింది. యుద్ధానికి పూర్తి బాధ్యత జర్మనిదే అనే అంశం వర్సే సంధిలో చేర్చడం జరిగింది.

**16.8.7 రాజకీయ నిబంధనలు** : రాజకీయ నిబంధనల్లో భాగంగా 1) వర్సే సంధిలో భాగంగా నానాజాతి సమితి స్థాపనను సంబంధించిన నిబంధనలు చేర్చారు. 2) రష్యా, జర్మనీలు చేసుకొన్న బ్రెస్ట్-లిటో వస్క్ సంధివంటి యుద్ధ కాలంలో జరిగిన సంధులు రద్దయినాయి. 3) జర్మనీ తూర్పు సరిహద్దు కొత్తగా నిర్ణయమయింది. 4) బెల్జియం, పోలెండ్, యుగోస్లావియా, చెకొస్లావాకియా దేశాలను స్వతంత్ర దేశాలుగా గుర్తించడం జరిగింది. యుగోస్లావియా దేశాన్ని బాల్కన్ దేశాల్లో జాతీయోద్యమాలను సంతృప్తి పరచేందుకు, చెకొస్లొవేకియాను జర్మనీ, ఆస్ట్రియా దేశాల్లో రాజకీయ పరాధీనతను అనుభవిస్తున్న స్లావ్ జాతీయులకు స్వేచ్ఛ ప్రసాదించిన ఫలితంగాను ఏర్పడినవి.

వర్సే సంధివల్ల మొత్తం మీద జర్మనీ 28 వేల చదరపు మైళ్ళ భూభాగాన్ని, దాదాపు 7 మిలియన్‌ల జనాభాను పోగొట్టుకుంది. దీని ఫలితంగా జర్మనీ ఆర్థికంగా ఎక్కువ నష్టానికి గురి అయింది. ఇనుప ఖనిజాలు, బొగ్గు గనులు, రబ్బరు, కొబ్బరి మొదలైన భూములను జర్మనీ పోగొట్టుకొన్నది. ఫలితంగా జర్మనీ అతి బలహీనమైన దేశంగా తయారయి, అవమానానికి గురి అయింది. ఈ అవమానమే ప్రతీకార జ్వాలగా మారి రెండో ప్రపంచ యుద్ధానికి దారి తీసింది.

## 16.9 వర్సే సంధి - విమర్శ :

మిత్ర రాజ్యాల ఆదేశానుసారం జర్మన్ ప్రతినిధులు సంధి పత్రాల మీద 1919 జూన్ 28న వర్సే అద్దాల భవనంలో సంతకాలు చేసినారు. దీనినే వర్సే సంధి అంటారు. వర్సే సంధి ఆధునిక కాలానికి చెందిన ఒక ముఖ్యమైన వివాదాస్పదమైన సంధి. ఈ సంధి తమ మీద జరిగిన ఒక పెద్ద కుట్ర అని, బలవంతంగా రుద్దిన శాంతి అని, అందువల్ల నైతికంగా తాము దానికి కట్టుబడి ఉండనక్కరలేదని జర్మన్లు వాదించారు. ఏ దృష్టితో పరిశీలించినప్పటికీ వర్సే సంధి జర్మనీ పట్ల అన్యాయంగా లేదని గెత్రోన్ హార్డీ అను చరిత్రకారుడు అభిప్రాయపడినాడు. "శాంతి సంధి సంతృప్తి కరమైనది కాక పోయినా, యుద్ధ విరమణకు తప్పనిసరైనందున సంతకం పెట్టా"నని మిత్ర రాజ్యాల ప్రతినిధులలో ఒకరైన జనరల్ స్మట్స్ పేర్కొన్నాడు. నిష్పాక్షికమైన చరిత్రకారులు కొంత మంది వర్సే సంధి లక్ష్యము జర్మనీని నిర్దాక్షిణ్యంగా అణచడమేనని అభిప్రాయపడినారు. ఈ సంధి కఠినాతికఠినమైనదే గాక, అవమాన కరమైనదని, షరతులకు కట్టుబడి ఉండడం అసాధ్యమని కేన్స్ పండితుడు వ్యాఖ్యానించాడు. ఈ సంధి మరొక యుద్ధ ప్రకటన వంటిదని ఫిలిప్ స్నోడెన్ అభిప్రాయపడినాడు. ఈ సంధి పరిష్కరించిన సమస్యలకన్నా కొత్తగా సృష్టించిన సమస్యలే ఎక్కువని, బలప్రయోగం ద్వారా విధింపబడిన ఈ ఒప్పందం బలవంతంగా కొనసాగింపబడవలెనని, విల్సన్ 14 సూత్రాలు 14 నిరాశలుగా మిగిలాయని, నిరాయుధీకరణ చెదరిన కలగా మిగిలిపోయిందని కార్విన్ పండితుడు పేర్కొన్నాడు. నిజానికి ఈ సంధివల్ల జర్మనీ దయాదాక్షిణ్యాలు లేకుండా అవమానకరంగా శిక్షితురాలయిందని చెప్పవచ్చు.

**16.9.2.1 మిత్ర రాజ్యాల పగ సాధింపు ధోరణి** : మిత్ర రాజ్యాలకు జర్మనీ పట్ల ఎంత పగ, ద్వేషము ఉన్నాయో దయాదాక్షిణ్యాలు లోపించిన వర్సే సంధి నిరూపించింది. పారిస్ శాంతి సమావేశపు నాయకులు జర్మనీపట్ల కనీసపు మర్యాదకూడా చూపలేదు. మిత్ర రాజ్యాలు జర్మనీ పట్ల చాలా అవమానకరమైన విధానాన్ని అనుసరించాయి. రెండు ముఖ్య సిద్ధాంతాల మీద ఆధారపడి ఈ సంధి తయారుకావడం జరిగింది. ఒకటి యుద్ధానికి కారణమైన జర్మనీని శిక్షించడం, రెండోది భవిష్యత్‌లో జర్మనీ దురాక్రమణనుంచి ఐరోపాను కాపాడటం. సంధి షరతులను తయారు చేసేటప్పుడు మిత్ర రాజ్యాలు జర్మనీ ప్రతినిధులను ఏమాత్రం సంప్రదించలేదు. పైగా పారిస్ సమావేశంలో మిత్రరాజ్యాలు జర్మన్ ప్రతినిధులను దోషులుగా పరిగణించి అవమానించారు. మిత్రరాజ్యాల నాయకులు బెదిరించి జర్మన్ ప్రతినిధుల

చేత సంతకాలు పెట్టించారు. శాంతి సంధిని తయారు చేసిన వారు జర్మనుల మనో భావాలను గాని మానిసక ప్రతి క్రియనుగాని లక్ష్యం చేయలేదు. మిత్రరాజ్యాలు జర్మనీ పట్ల మితిమీరిన కఠిన వైఖరిని అవలంబించక పోయినట్లయితే, జర్మన్‌లు మారిన పరిస్థితుల కనుగుణంగా సర్దుకొని పోయే వారని విప్పన్ అంటాడు. మిత్ర రాజ్యాల పగసాధింపు ధోరణివల్ల జర్మన్ ప్రజలలో అసంతృప్తి, ద్వేషమూ ఎక్కువైనాయి. ఈ సంధివల్ల జర్మనీకి ఆర్థికంగా చాలా అన్యాయం జరిగింది. జర్మనీ తన వలసలన్నిటినీ పోగొట్టు కోవడమేగాక పారిశ్రామిక ప్రదేశాలను, ఖనిజ ప్రాంతాలను కోల్పోయి, శక్తికి మించిన నష్ట పరిహారాన్ని కూడా చెల్లించవలసి వచ్చింది.

**16.9.2.2 పాక్షికంగా జాతీయతా సిద్ధాంతం అమలు** : జాతీయతా సిద్ధాంతాన్ని, స్వయం నిర్ణయ సిద్ధాంతాన్ని నిష్పాక్షికంగా అనుసరించడం జరగలేదు. ఈ సిద్ధాంతాలననుసరించి చెకొస్లొవాకియా, యుగోస్లావియా, పోలెండ్ మొదలైన స్వతంత్ర రాజ్యాలను సృష్టించడం జరిగింది. కాని దీనికి భిన్నంగా జర్మన్ జాతి ప్రజలు పోలండ్, బొహీమియా, ఇటలీ మొదలైన దేశాల ఆధిపత్యంలో ఉన్నారు. అల్ప సంఖ్యాక ప్రజల సమస్యలు భవిష్యత్తులో అనేక అనర్థాలకు దారితీసినాయి.

**16.9.2.3 నిరాయుధీకరణ పాక్షికంగా అమలు** : జర్మనీని బలహీన పరచే ఉద్దేశం మాత్రమే కాక, సైనిక బలాన్ని, ఆయుధ సందను మితిమీరి వృద్ధి చేసుకోవడం ఏ దేశానికైనా యుద్ధోన్మాదాన్ని కలిగిస్తుందని, అందుకొరకై అన్ని దేశాలు తమ అంతర్గత శాంతి భద్రతల సంరక్షణకు అవసరమైనంత మేరకే సైనిక బలాన్ని కలిగి ఉండాలని, క్రమంగా సైనికదళాల సంఖ్యను ఆయుధాలను తగ్గిస్తూ, నిరాయుధీకరణ దిశగా నడవాలని పారిస్ శాంతి సమావేశం ఆదర్శయుతంగా భావించింది. వర్సే సంధిమీద సంతకాలు చేసిన దేశాలన్నీ నిరాయుధీకరణ సూత్రాన్ని ఆమోదించినాయి. కాని మిత్ర రాజ్యాలు నిరాయుధీకరణను తమ విషయంలో అమలులో పెట్టలేదు. ఆ నిబంధనలను, నీతివాక్యాలను జర్మనీ పై నిర్దాక్షిణ్యంగా విధించి అమలు జరిపారు. జర్మనీ సైనిక బలము, నౌకాబలము మాత్రం పూర్తిగా నాశనమయినాయి. అందువల్ల అవకాశం దొరికినపుడు సంధిలోని సైనిక నిబంధనలను జర్మనీ తోసివేస్తే ఆశ్చర్యపడనక్కరలేదు.

**16.9.2.4 విల్సన్ 14 సూత్రాల కనుగుణంగా లేకపోవడం** : మిత్ర రాజ్యాలు జర్మనీకి, యుద్ధ విరమణ సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు కాలేదు. వర్సే సంధి పూర్తిగా విల్సన్ సూత్రాల కనుగుణంగా లేదు. స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతం, స్వేచ్ఛా నౌకాయాన సిద్ధాంతము నిష్పాక్షికంగా అమలులోకి రాలేదు. శాంతి పరిరక్షణలో భాగంగా తాను ప్రతిపాదించిన 14 సూత్రాలలో 14వ సూత్రం కోసం తతిమ్మా 13 సూత్రాలను చాలా వరకూ విల్సన్ వదులుకొన్నాడు.

**16.9.2.5 నిబంధనలకు నైతిక నిబద్ధత లోపించడం** : వర్సేసంధి నైతికంగా సమర్థనీయం కాదు. సంధిలోని నిబంధనలు న్యాయ సూత్రాని కనుగుణంగా తయారు కాలేదు. తనమీద విధించే నష్ట పరిహారం మొత్తాన్ని చెల్లించడం జర్మనీకి సాధ్యం కాలేదు. ఆర్థికంగా, సైనికంగా బలహీనమయిపోయిన జర్మనీకి నష్ట పరిహారం చెల్లించడం మోయలేని భారమయింది. మిత్ర రాజ్యాలు జర్మన్ వలసలను తమ పాలనలో ఉంచుకోవడం నైతికంగా సమర్థనీయం కాదు. ఈ వలసల్లో మిత్ర రాజ్యాల పాలన జర్మనీ పాలనకంటే మెరుగ్గా లేదు. జాతీయతా సిద్ధాంతము, స్వయం నిర్ణయ సిద్ధాంతము జర్మనీ విషయంలో సరిగా అనుసరించలేదు. ఇది నైతికంగా సమర్థనీయం కాదు. నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని మిత్ర రాజ్యాలు అనుసరించలేదు. అందువల్ల జర్మనీ మిత్ర రాజ్యాలను నిందించటం నిరాధారం కాదు.

**16.9.2.6 ఆచరణ సాధ్యం కాని అంశాలుండడం** : వర్సేసంధిలో ఆచరణకు సాధ్యంకాని అంశాలు ఉన్నాయి. జర్మనీవంటి ప్రథమశ్రేణికి చెందిన అగ్ర రాజ్యాన్ని ఎక్కువ కాలం బలహీన పరిస్థితులలో ఉంచడం సాధ్యం కాదు. జర్మనీకి చెందిన భూభాగాలు అనేక దేశాలకు బదిలీ చేయడం, జర్మనీలో పోలిష్ కారిడార్ సృష్టించడం, జర్మన్ బొగ్గు గనులు, ఇనుప ఖనిజాలు ఫ్రెంచివారి ఆధీనంలో ఉంచడం మొదలైన ఏర్పాట్ల వల్ల జర్మనులు చాలా అవమానానికి గురి అయినారు. గొప్ప సంస్కృతి కలిగిన జర్మనీ వంటి అగ్ర రాజ్యం అవమానాన్ని ఎంతో కాలం భరించలేక పోయింది. అందువల్ల భవిష్యత్‌లో జరగబోయే అనేక అనర్థాలకు వర్సే సంధిలో బీజాలున్నాయని చెప్పవచ్చు. వర్సే సంధివల్ల జర్మనీ వలసలనేగాక తన రాజ్యంలో 8వంతు భూభాగాన్ని, 7 మిలియన్‌ల జనాభాను కోల్పోయింది. పరిశ్రమలను, పశు సంపదను కోల్పయింది. జర్మనీ ఆర్థిక దుస్థితిని గమనించకుండా మిత్ర రాజ్యాలు పెద్ద మొత్తం నష్ట పరిహారాన్ని జర్మనీ మీద విధించాయి.

ఆర్థిక సంక్షోభానికిలోనై నిరుద్యోగమూ, వర్తకమాంద్యాలతో సతమతమవుతున్న జర్మనీ పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని చెల్లించడం సాధ్యపడని విషయం.

**16.9.2.7 జర్మన్‌ల మీద బలవంతంగా రుద్దిన శాంతి :** వర్సే సంధిని తమమీద బలవంతంగా రుద్దిన శాంతి అని జర్మన్‌లు వర్ణించినారు. యుద్ధంలో గెలిచిన రాజ్యాలు ఓడిపోయిన రాజ్యం మీద దయాదాక్షిణ్య రహితంగా విధించిన శిక్ష అని జర్మన్‌లు భావించినారు. అయితే ఏ సంధినైనా న్యాయమైనదో, అన్యాయమైనదో నిర్ణయించడం సులభం కాదు. అంతేగాక ఒక గొప్ప యుద్ధం తరువాత న్యాయమైన సంధి నిబంధనలు తయారు చేయడం తేలికైన పనికాదు. మిత్ర రాజ్యాలు తమపట్ల పగ సాధింపు ధోరణిని, అవమానకరమైన ధోరణిని అనుసరించినాయని జర్మనులు భావించారు. వర్సే సంధి నిబంధనలను తయారు చేసేటప్పుడు పారిస్ సమావేశం నాయకులు జర్మనీపట్ల ఐరోపా ప్రజలకున్న కోపాన్ని, ద్వేషాన్ని, కప్పిపుచ్చడం సాధ్యపడలేదు. అంతేగాక శాంతి సంధులు ఎప్పుడూ ఓడిపోయిన రాజ్యాల దృష్టిలో అన్యాయంగానే ఉంటాయి. ఈ సంధి విల్సన్ సూత్రం కనుగుణంగా తయారు చేయడం జరగలేదని కూడా జర్మన్‌లు భావించారు. నిజానికి స్వయం నిర్ణయ సిద్ధాంతాన్ని జర్మనీపట్ల నిష్పాక్షికంగా అమలు చేయలేదు. ఇ.హెచ్. కార్ చెప్పినట్లుగా మొత్తం మీద వర్సే సంధి జర్మన్‌ల మీద బలవంతంగా రుద్దిన శాంతి అని చెప్పవచ్చు. ఈ సంధిని తయ రు చేసేటప్పుడు జర్మన్ ప్రతినిధులతో మిత్ర రాజ్యాలు సంప్రదించలేదు. అంతేగాక మిత్ర రాజ్యాలు బెదిరించి బలవంతంగా జర్మన్ ప్రతినిధుల చేత వర్సే సంధి పత్రాల మీద సంతకాలు చేయించారు.

వర్సే సంధిలోని కొన్ని నిబంధనలు జర్మనీపట్ల చాలా కఠినంగా ఉన్నమాట యదార్థం. ఈ సంధివల్ల జర్మన్ ప్రజలలో ఆగ్రహం పెరిగి జాతీయ భావం మరింత తీవ్రమై శాంతి భద్రతలకు భంగం కలిగింది. నిజానికి వర్సే సంధి 20 సంవత్సరాల కాలం మాత్రమే అమలులో ఉన్న తాత్కాలిక సంధి అని చెప్పవచ్చు. రెండో ప్రపంచ యుద్ధానికి బీజాలు వర్సే సంధిలోనే ఉన్నాయని కొంతమంది విమర్శకుల అభిప్రాయం. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా జర్మనీ వంటి గొప్ప దేశము కఠినమైన షరతులతో కూడిన వర్సే సంధిని ఎక్కువ కాలం అమలు పరచడం సాధ్యం కాలేదు. చాలా మంది చరిత్ర కారులు చెప్పినట్లుగా జర్మనీ వర్సే సంధిని ఉల్లంఘించడం రెండో ప్రపంచ యుద్ధానికి ఒక ముఖ్య కారణమని చెప్పవచ్చు. 1926లో జర్మనీ సమితిలో సభ్య రాజ్యంగా చేరినప్పటి నుండి ఒక దాని తరువాత ఒకటి సంధి సరతులను ఉల్లంఘించడం ప్రారంభించింది. 1938 నాటికి హిట్లర్ నాయకత్వంలో జర్మనీ బలమైన సైనిక రాజ్యంగా రూపొందింది. 1939లో హిట్లర్ బొహీమియా, మొరేవియా, పోలెండ్‌లను ఆక్రమించుకోవడంలో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. వర్సే సంధివల్ల తూర్పు ఐరోపాలో ఏర్పడ్డ చిన్న చిన్న రాజ్యాలు ఆ తరువాత నాజీ జర్మనీ ధాటికి లొంగిపోయాయని సీమన్ పండితుడు పేర్కొన్నాడు. సాధ్యమైనంత వరకూ న్యాయమైన పద్ధతుల మీదనే ఐరోపా పటాన్ని పునర్నిర్మించారని లిప్సన్ పండితుడు పేర్కొనగా, ఈ సంధి పూర్తిగా కఠినమైనదని గానీ, పూర్తిగా సరళమైనదని గాని చెప్పడానికి వీలు లేదని పామర్ పండితుడు చెప్పాడు.

## 16.10 ఇతర సంధులు :

మొదటి ప్రపంచ యుద్ధఆనంతరం శాంతి సాధన కోసం జర్మనీతోబాటు యుద్ధంలో ఓడిపోయిన ఇతర దేశాలలో కూడా మిత్ర రాజ్యాలు సంధులు చేసుకొన్నాయి. అవి 1) సెంట్ జర్మేయిన్ సంధి 2) న్యూల్లీ సంధి 3) ట్రియనాక్ సంధి 4) సెవెర్స్ సంధి 5) మైనారిటీ లకు సంబంధించిన సంధులు.

**16.10.1 సెంట్ జర్మేయిన్ సంధి :** మిత్ర రాజ్యాలు ఆస్ట్రియాతో 1919 సెప్టెంబర్ 10న చేసుకొన్న సంధిని సెంట్ జర్మేయిన్ సంధి అని అంటారు. ఈ సంధి ప్రకారం : 1) ఆస్ట్రియా - హంగరీ సామ్రాజ్యాన్ని రెండు భాగాలుగాచేసి హంగరీని స్వతంత్ర రాజ్యంగా గుర్తించడం జరిగింది. 2) కొత్త ఆస్ట్రియా రాజ్యం ఎక్కువ భూభాగాన్ని, జనాభాను కోల్పోయింది. 3) ట్రియస్టీ, ఇస్ట్రియా, బ్రెన్నర్ కనుమ, డాల్మేషియాలో కొన్ని భాగాలు ఇటలీకిచ్చినారు. 4) బోస్నియా, హెర్జిగోవినా, డాల్మేషియాకిచ్చినారు. 5) బొహీమియా, మొరేవియా, స్లావాకియాలను చెకొస్లావాకియాలో చేర్చారు. 6) బుకోవినా, ట్రాన్సిల్వేనియాలను రుమేనియకిచ్చారు. 7) గలీషియాను పోలెండ్‌కిచ్చారు. 8) ఆస్ట్రియా సైనికబలం 30 వేల సైనికులకు పరిమితం చేశారు. 9) యుగోస్లావియా భూభాగం ద్వారా ఆస్ట్రియాకు ఏడ్రియాటిక్

సముద్రంతో సంబంధాలుంటాయి. 10) ఆస్ట్రియా తన వలస సామ్రాజ్యాన్ని, వ్యాపార సదుపాయాలను కోల్పోయింది. ఈ సంధి ఫలితంగా ఆస్ట్రియా చిన్న దేశంగా రూపొందింది.

**16.10.2 న్యూల్లీ సంధి :** మిత్ర రాజ్యాలు బల్గేరియాతో 1919 నవంబర్ 27న నూల్లీ సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం : 1) బల్గేరియనులు అధికంగా వున్న పశ్చిమ బల్గేరియాను యుగొస్లావియాకిచ్చినారు. 2) పశ్చిమ థ్రేస్, ఈజియన్ తీరాన్ని గ్రీస్‌కు ఇచ్చారు. అయితే బల్గేరియాకు ఈజియన్ తీరంతో సంబంధాలు ఉంటాయి. 3) బల్గేరియా సైనిక బలం 20 వేలకు పరిమితమయింది 4) నౌకా బలాన్ని పూర్తిగా నిషేధించినారు. 5) బల్గేరియా పెద్ద మొత్తం నష్టపరిహారాన్ని చెల్లించవలసి వచ్చింది. ఈ సంధి ఫలితంగా బల్గేరియా విరోధి దేశాల ద్వారా సముద్ర తీరంలో సంబంధాలను పెట్టుకోవలసి వచ్చింది. మొత్తం మీద బల్గేరియా బాల్కన్ ప్రాంతంలో చాలా బలహీనమైన రాజ్యంగా రూపొందింది.

**16.10.3 ట్రియనాన్‌సంధి :** మిత్ర రాజ్యాల సహాయంతో అడ్మిరల్ హోర్థి నాయకత్వంలో హంగరీలో కొత్త ప్రభుత్వమేర్పడింది. మిత్ర రాజ్యాలు హోర్థి ప్రభుత్వంతో 1920 జూన్ 4న ట్రియనాన్ సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం 1) హంగరీని ఆస్ట్రియా నుంచి విడదీసి స్వతంత్ర రాజ్యంగా చేసినారు. 2) ట్రాన్సిల్వేనియాను రుమేనియా కిచ్చినారు. 3) క్రోషియాను యుగొస్లావియా కిచ్చినారు. 4) స్లావాకియాను చెకొస్లావాకియా కిచ్చారు. 5) ఫ్యూయ్ రేవును స్వతంత్ర ప్రతిపత్తిగల నగరంగా మార్చి తరువాత ఇటలీకిచ్చినారు. 6) హంగరీ సైనిక బలం 35 వేలకు పరిమితమయింది. 1) హంగరీ నష్ట పరిహారాన్ని కూడా చెల్లించవలసి వచ్చింది.

**16.10.4 సెవెర్స్ సంధి :** మిత్ర రాజ్యాలు టర్కీతో 1920 ఆగస్ట్‌లో సెవెర్స్ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం : 1) టర్కీనుంచి ఆసియా మైనర్, థ్రేస్, ఏడ్రియానోపుల్, గల్లి పోలీలను విడదీసి గ్రీస్‌కు ఇచ్చినారు 2) సిరియాను ఫ్రాన్స్‌కిచ్చినారు 3) పాలస్తీనా, మెసపొటేమియాలను ఇంగ్లండ్ కిచ్చినారు. 4) హెజాజ్ రాజును స్వతంత్రుడుగా ప్రకటించడమయింది. 5) టర్కీ రాజ్యము ఆసియాకు పరిమితమయింది. 6) టర్కీ సైనిక బలం 50 వేలకు పరిమితమయింది. 7) కాన్‌స్టాంట్ నోపుల్, అలెగ్జాండ్రియా మొదలైన టర్కీ రేవులు అంతర్జాతీయ నియంత్రణలో ఉంచబడింది.

**16.10.5 మైనారిటీలకు సంబంధించిన సంధులు :** పారిస్ శాంతి సమావేశం ఫలితంగా జరిగిన శాంతి సంధులవల్ల అనేక నూతన రాజ్యాలు అవతరించినాయి. ఈ నూతన రాజ్యాలలోను, అనేక ఇతర రాజ్యాలలోను అతి క్లిష్టమైన అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలు తలెత్తినాయి. మైనారిటీల భద్రతా సమస్యలను పరిష్కరించడానికి పారిస్ శాంతి సమావేశం ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘం సిఫారసుల ఆధారంగా అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలను పరిష్కరించడానికి వారి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మానవతా హక్కులను కాపాడడానికి మిత్ర రాజ్యాలు చెకొస్లావాకియా, యుగోస్లావియా, రుమేనియా, గ్రీస్ మొదలైన దేశాలతో మైనారిటీ సంధులు చేసుకొన్నాయి.

## 16.11 నానాజాతి సమితి ప్రాదుర్భావం - నిర్మాణం

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ సుస్థిరమైన శాంతి స్థాపనకై 1918 జనవరిలో 14 సూత్రాల పథకాన్ని ప్రకటించాడు. ఈ 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితి అనే ఒక అంతర్జాతీయ సంస్థను 1920లో ఏర్పాటు చేయడం జరిగింది. నానాజాతిసమితి ప్రాదుర్భావం, సమితి నిర్మాణం గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**16.11.1. ఉపోద్ఘాతము :** మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ దేశాల మధ్య అనేక యుద్ధాలు జరగడమేగాక మానవజాతి నాగరికతనంతా విధ్వంసం చేయగల మారణాయుధాలు కూడా కనుగొన్నారు. అయితే ఇదే కాలంలో ప్రపంచ దేశాల మధ్య సహకారమూ, సదవగాహనమూ, ఐకమత్యమూ పెంపొందించి యుద్ధాలను నివారించడానికి కొన్ని ప్రయత్నాలు కూడా జరిగినాయి. అంతర్జాతీయ వివాదాలు శాంతియుతంగా పరిష్కరించటానికి మొదటి ప్రపంచ యుద్ధం తరువాత నానాజాతి సమితి అనే ఒక అంతర్జాతీయ సంస్థను నెలకొల్పడం జరిగిందింది.

**16.11.2 సమితి ప్రాదుర్భావం :** మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోనూ, యుద్ధం అంతమయిన తరువాత జరిగిన ప్రయత్నాల ఫలితంగానూ నానాజాతి సమితిని స్థాపించడం జరిగింది. టాయిన్బీ చెప్పినట్లుగా ఆస్ట్రియా ఛాన్సలర్ మెటర్నిక్, రష్యా చక్రవర్తి మొదట అలెగ్జాండర్లు నెలకొల్పిన ఐరోపా రాజ్య కూటమిస్థానే నెలకొల్పినటువంటి సంస్థ నానాజాతి సమితి అని చెప్పవచ్చు. అయితే ఐరోపా రాజ్యకూటమి ఐరోపాకు చెందిన కొన్ని అగ్రరాజ్యాలకే పరిమితమైన సంస్థ. నానాజాతి సమితిలో సభ్యత్వము ఒడంబడికలోని షరతులను అంగీకరించిన ప్రపంచ దేశాలన్నిటికీ ఇవ్వవచ్చు. అందువల్ల నానాజాతి సమితిని మొదటి ప్రపంచ సంస్థ అని చెప్పవచ్చు. సమిష్టి భద్రతకు ప్రాముఖ్యము ఇవ్వడం సమితి విషయమై చెప్పుకోదగిన ప్రత్యేకత అని కూడా చెప్పవచ్చు.

**16.11.3 తొలి ప్రయత్నాలు :** నానాజాతిసమితి ఏర్పడాలనే భావం కేవలం మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడినటువంటిది కాదు. ప్రాచీన యుగంలో రోమన్ సామ్రాజ్యము, మధ్య యుగంలో పవిత్ర రోమన్ సామ్రాజ్యము, రోమన్ కాథలిక్ చర్చి ప్రపంచ దేశాల మధ్య సార్వత్రిక సహకారము ఉండవలెననే ఆదర్శాన్ని ప్రబోధించాయి.

ఫ్రాన్స్ రాజు నాలుగో హెన్రీ కాలంలో ఐరోపా రాజ్యాల మధ్య శాంతి సహకారాల పెంపుకై ఓ అంతర్జాతీయ సమాఖ్య ఉండాలనే ప్రయత్నం జరిగింది. నాలుగో హెన్రీ (1589-1610) ముఖ్యమంత్రి అయిన డ్యూక్ ఆఫ్ సల్లీ ప్రపంచ రాజ్యాల మధ్య శాంతి స్థాపనకై అన్ని దేశాలతో సమ్మేళనా రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చేసాడు. దీనికి 'సల్లీస్ గ్రేట్ డిజైన్' అనే పేరు వచ్చింది. కాని ఆనాడు దేశాల మధ్య గల వైషమ్యాల వలన ఇది నెరవేరలేదు.

పారిశ్రామిక విప్లవం తరువాత శాస్త్ర పరిశోధనలు జరిగిన తరువాత, అంతర్జాతీయ సహకారమనే ఆదర్శము ఎక్కువగా ప్రాముఖ్యంలోకి వచ్చింది. నెపోలియన్ పతనానంతరం స్థాపితమైన ఐరోపా రాజ్య కూటమి, అగ్రరాజ్యాల మధ్య సహకారం పెంపొందించడానికి ప్రయత్నించింది.

ఐరోపా రాజ్యాల మధ్య ఆయుధాల పోటీ తగ్గించాలనే ఆశయంతో రష్యా జార్ రెండో నికోలస్ 1899లో హేగ్‌లో ప్రథమ శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సమావేశంలో 26 దేశాలు పాల్గొన్నాయి. వీటిలో 20 ఐరోపా దేశాలు, చైనా, జపాన్, పర్షియా, సయాం, అమెరికా, మెక్సికో మొదలైనవి హేగ్ సమావేశంలో పాల్గొన్న ఐరోపా కాని దేశాలు. ఈ సమావేశంలో పాల్గొన్న 100 మంది సభ్యులు ఆయుధాల పోటీవల్ల ఏర్పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించారు. ఆయుధాల ఉత్పత్తికి వినియోగిస్తున్న ధనాన్ని విద్యాభివృద్ధికి, సాంఘిక ప్రయోజనాలకు వినియోగిస్తే బాగుంటుందని వీరు సూచించారు. మానవాళి నైతిక, భౌతిక ప్రయోజనాలకు సైనిక ఖర్చు తగ్గించుకొంటే బాగుంటుందని, సైనిక పోటీ తగ్గించడానికి ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాలని హేగ్ సమావేశంలో తీర్మానాలు చేయడం జరిగింది. దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడితే వాటిని పరిష్కరించుకోడానికి హేగ్ సమావేశం ఒక న్యాయ స్థానాన్ని ఏర్పాటు చేసింది. వివాదం ఏర్పడ్డ రెండు దేశాలు అంగీకరిస్తే తప్ప ఈ న్యాయస్థానంలో విచారణ జరగదు. హేగ్ సమావేశం ఆశించిన ఫలితాలు సాధించలేదు. సమావేశం ముగియక ముందే దక్షిణ ఆఫ్రికాలో యుద్ధం జరిగింది. ఆ తరువాత రష్యా జపాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. ఐరోపా రాజ్యాల మధ్య సైనిక పోటీ ఎక్కువైంది.

మొదటి హేగ్ సమావేశం విఫలమైనా జార్ రెండో నికలస్ తన ప్రయత్నాలు వదలలేదు. అతడు 1907లో రెండో హేగ్ సమావేశాన్ని ఏర్పాటు చేయగా దీనికి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కూడా కొంత చొరవ చూపించాడు. మొత్తం 44 దేశాల నుంచి 256 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు మానవత్వ సూత్రాలను పాటించాలని రెండో హేగ్ సమావేశం నిర్ణయించింది. నిరాయుధీకరణ మీదగాని, ఆయుధాల ఉత్పత్తుల మీద పరిమితులు నిర్ధారించడం మీదగాని ఈ సమావేశం ప్రగతిని సాధించలేదు. సైనిక ఖర్చుమీద ప్రతి దేశం తీవ్రంగా అధ్యయనం చేయాల్సి ఉందని ఈ సమావేశం తీర్మానించింది. కాని, ఈ తీర్మానాలు తీర్మానాలుగానే మిగిలిపోయాయి. ఐరోపా దేశాలన్నీ తమ బడ్జెట్ కేటాయింపుల్లో ఆయుధాల ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. 1912, 1913లలో జరిగిన బాల్కన్ యుద్ధాలు, 1914లో ప్రారంభమైన ప్రపంచ యుద్ధం హేగ్ సమావేశాల వైఫల్యాన్ని సూచిస్తాయి.

**16.11.4 మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జరిగిన ప్రయత్నాలు :** మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా ఐరోపా దేశాలు చెప్పలేని బాధలకు గురి అయినాయి. ఈ యుద్ధ కాలంలో జరిగినటువంటి జన నష్టమూ, ధన నష్టమూ మారణాయుధాల ఉపయోగమూ ప్రపంచ ప్రజలలో విపరీతమైన భయాందోళనలు కలుగ జేసినాయి. వివిధ దేశాల మధ్య సహకారం పెంపొంది తద్వారా ప్రపంచ శాంతి నెలకొనవలెనని ప్రపంచ ప్రజలు ఆతురతను చూపసాగారు. అంతర్జాతీయ సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పడవలెనని యుద్ధ కాలంలోనే ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలోని రాజకీయ వేత్తలు గుర్తించారు.

జర్మనీతో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు యుద్ధం చేస్తున్న రోజులలోనే సుస్థిర శాంతి స్థాపన కోసం అమెరికాలో అనేక ప్రయత్నాలు జరిగినాయి. 1915లో అమెరికాలో శాంతి పరిరక్షణ కోసం ఒక సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. 'నానా జాతి సమితిని ఏర్పరచడంలో అమెరికా చొరవ తీసుకోవాలని' అమెరికన్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ తీర్మానించింది. 1916లో జరిగిన వాషింగ్‌టన్ సమావేశంలో అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ పాల్గొని ప్రపంచ మంతటిలోను శాంతిని ధర్మాన్ని నెలకొల్పడానికి ఒక అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రకటించాడు. అయితే ఈ సమావేశం జరిగిన కొద్ది కాలంలోనే అమెరికా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, సుస్థిర శాంతి స్థాపన కోసం మిత్ర రాజ్యాల తరపున యుద్ధంలో చేరింది. విల్సన్ సూచనల మేరకు 1918 వేసవిలో కర్నల్ హౌస్ ఒక ముసాయిదాను తయారు చేసాడు. దీనికి ప్రాతిపదిక ఫిల్లిమోర్ కమిటీ నివేదిక. అంతకు ముందే 1919 జనవరి 8న విల్సన్ తన 14 సూత్రాల పథకాన్ని ప్రకటించాడు. ఈ 14 సూత్రాలలోని చివరి సూత్రం చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యానికి, దేశ సమైక్యతకూ హామీ ఇచ్చే లిఖిత ఒడంబడికలు గల ప్రపంచ వ్యవస్థ ఏర్పడాలని. ఈ సూత్రం ఆధారంగా నానాజాతి సమితిని ఏర్పాటు చేయడం జరిగింది.

బ్రిటిష్ ప్రధాన మంత్రి ఆస్క్విత్ యుద్ధం ప్రారంభానికి ఒక నెల ముందు బ్రిటిష్ ప్రజల యుద్ధానంతర ధ్యేయాల్లో నానాజాతిశాంతి స్థాపన ఒకటి అని చెప్పాడు. 1915 ఏప్రిల్‌లో 'శాశ్వత శాంతికి కేంద్ర సంస్థ' అనేది లండన్‌లో ఏర్పడింది. అదే సంవత్సరం మేలో 'బ్రిటిష్ నానాజాతి సమితి సమాజం' ఏర్పడింది. బ్రిటిష్ విదేశాంగ మంత్రి బాల్ ఫూర్ ప్రపంచ శాంతి స్థాపన కోసం అంతర్జాతీయ వ్యవస్థ అవసరాన్ని గుర్తించి 'ఫేబియన్ సొసైటీ ఆఫ్ ఇంగ్లండ్' ను 1915లో నియమించినాడు. ఈ సంఘంలో బ్రైన్ అనే ఒక ప్రముఖుడు అమెరికా అధ్యక్షుడు సూచించినటువంటి ఒక పథకాన్ని సూచించాడు. ప్రపంచ వ్యవస్థకు రాజ్యాంగ ముసాయిదా తయారు చేసే ప్రయత్నాలు 1916 చివరలో ప్రారంభమయ్యాయి. దీన్ని గురించి లార్డ్ రాబర్ట్ సెసిల్ బ్రిటిష్ మంత్రి మండలికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించాడు. సెసిల్ రోడ్సును 'నానాజాతి సమితి పిత' అని కొందరు భావించారు. 1916 డిసెంబర్‌లో సర్ వాల్టర్ ఫిల్లిమోర్ అధ్యక్షతన ప్రపంచ సంస్థ స్థాపనకు సంబంధించిన విషయాలు అధ్యయనం చేసి ఒక ముసాయిదా పథకాన్ని తయారు చేయడానికి బాల్ ఫూర్ ఒక సంఘాన్ని నియమించినాడు. 1918 మార్చి 20న ఫిల్లిమోర్ కమిటీ తన నివేదికను సమర్పించింది. నివేదికలోని సూచనలు, అది ప్రదర్శించిన విజ్ఞత అందరికి తృప్తి కలిగించింది. అందువల్ల తరవాతి ముసాయిదాల కది మూలమైంది. వివిధ రాజ్యాల మధ్య వివాదాలు శాంతి యుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కావలెనని ఈ సంఘం తన నివేదికలో సిఫారసు చేసింది.

అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ప్రపంచ సంస్థకు సంబంధించిన వివరాలను రూపొందిస్తూ ఫ్రాన్స్ కూడా ఒక పథకాన్ని తయారు చేసింది. 1917 జూలైలో 'ఫ్రెంచ్ ఛేంబర్ ఆఫ్ డెప్యుటీస్' నానాజాతి సమితి ఏర్పడాలని ఒక తీర్మానం చేసింది. లియో బూర్జువా నాయకత్వంలో ముసాయిదాను తయారు చేయడానికి ఒక కమిటీ ఏర్పడింది.

ఇతర ప్రభుత్వాలు కూడా ఇట్లాంటి కొన్ని చర్యలు తీసుకొన్నాయి. యుద్ధాలను నివారించడానికి, సుస్థిర శాంతిని స్థాపించడానికి దక్షిణాఫ్రికాకు చెందిన జనరల్ స్మట్స్ కూడా ఒక పథకాన్ని తయారు చేసినాడు. అంతర్జాతీయ సంస్థ నిర్ణయాలు అమలు పరచడానికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని స్మట్స్ సూచించాడు. నానాజాతి సమితికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి యుద్ధంలో పాల్గొంటున్న దేశాలలోనూ, తటస్థ దేశాలలోనూ కొన్ని స్వచ్ఛంద సంస్థలు వెలిశాయి.

ఈ విధంగా యుద్ధ కాలంలోనే అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలలో అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి ప్రపంచ సంస్థ అవసరాన్ని గుర్తించడం జరిగింది. అయితే దేశాల మధ్య యుద్ధాలు నివారించడానికి, వివాదాలు శాంతియుతంగా పరిష్కారం కావలెననే కోరికలు ఐరోపాదేశాల నాయకులలో యుద్ధానంతరం ఎక్కువైనాయి. అంతేగాక ప్రపంచ సంస్థ అవసరాన్ని ఐరోపా నాయకులందరూ యుద్ధం ముగిసిన తరువాత బాగా గుర్తించారు.

## 16.12 నానాజాతి సమితి స్థాపన :

ఉడ్రో విల్సన్ 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితి అనే ప్రపంచ సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. నానాజాతి సమితి స్థాపనకు సంబంధించిన వివరాలు రూపొందించడానికి పారిస్ శాంతి సమావేశము విల్సన్ అధ్యక్షుడుగా 19 మంది సభ్యులతో కూడిన ఒక సంఘాన్ని నియమించింది. కర్నల్ హౌస్, లార్డ్ రాబర్ట్ సెసిల్, జనరల్ జాన్స్మట్స్‌లు తయారు చేసిన ముసాయిదాలను సమన్వయ పరచడానికి గ్రేట్ బ్రిటన్‌కు చెందిన సెసిల్ జె.బి. హర్స్ట్ అమెరికాకు చెందిన మిల్లర్‌లను నియమించడం జరిగింది. వారిద్దరు కలిసి చేసిన దానికి హర్స్ట్ - మిల్లర్ రిపోర్ట్ అని పేరు వచ్చింది. దీని ఆధారంగా మిత్ర రాజ్యాల వారి సూచనలకు అనుగుణంగా నానాజాతి సమితి లిఖిత ఒప్పందం తర్జన భర్జనల అనంతరం 1919 ఫిబ్రవరి నాటికి తయారు చేసింది. నానాజాతి సమితి కావాలని చివరి వరకు విల్సన్ పట్టుబట్టాడు. శాంతి ఒప్పందంలో నానాజాతి సమితి ఏర్పాటు అంతర్భాగం కావడం విల్సన్ పట్టుదలవల్లనే జరిగిందని చెప్పవచ్చు. పారిస్ శాంతి సమావేశం 26 ప్రకరణాలతోను ఒక ప్రవేశికతోను కూడిన సమితి ఒడంబడిక పత్రాన్ని ఆమోదించి వర్సే సంధిలో మొదటి భాగంగా చేర్చింది. నానాజాతి సమితి లిఖిత ఒడంబడిక 1920 జనవరి 10న అమల్లోకి వచ్చింది. ఆనాడు సమితి సభ్యదేశాల సంఖ్య 23.

**16.12.1 సమితి ఉద్దేశాలు, లక్ష్యాలు :** సమితి ఒడంబడికలో సమితి ఉద్దేశాలు, లక్ష్యాలు ప్రవేశికగా చేర్చినారు. సమితి లక్ష్యాలు : 1) అంతర్జాతీయ సహకారం పెంపొందించి శాంతి భద్రతలు సాధించడం 2) యుద్ధం తలపెట్టక బాధ్యతలు నిర్వహించడానికి వివిధ దేశాలు అంగీకరించేటట్లు చేయడం 3) దేశాల మధ్య బహిరంగంగా న్యాయంగా ఉండే సంబంధాలు నెలకొల్పడం 4) ప్రభుత్వాల మధ్య అంతర్జాతీయ న్యాయరీత్యా సంబంధాలు ఏర్పరచడం 5) సమితి ఒడంబడిక పత్రాన్ని ప్రపంచ దేశాలన్నీ అంగీకరించేటట్లు చేయడం.

సమితి సభ్య దేశాలు కొన్ని బాధ్యతలకు కట్టుబడి ఉండటానికి అంగీకరించాయి. అవి : 1) సభ్య రాజ్యాల మధ్య తగాదాలు వచ్చినపుడు యుద్ధానికి దిగక శాంతి యుతంగా పరిష్కారం చేసుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. 2) ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన రాజ్యాలమీద తక్కిన సభ్య రాజ్యాలు తగిన చర్య తీసుకోవలెను. 3) సమితి సభ్య రాజ్యాల మధ్య తగాదాలు వచ్చినపుడు సమితి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించారు. 4) తమ ఆధీనంలో ఉంచబడిన 'ఆధిష్ట రాజ్యాల' పరిస్థితుల మీద వార్షిక నివేదికను సమితి నివేదించాలి.

సమితి ముఖ్య విధులు : 1) అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం 2) రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విజ్ఞాన రంగాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం.

సమితి ప్రత్యేక విధులు : 1) అల్ప సంఖ్యాక వర్గ ప్రజల రక్షణకు హామీ ఇవ్వడం 2) విద్య, ఆరోగ్యం, రాకపోకలు, ఆర్థికాభివృద్ధి, శ్రామిక ప్రజల పరిస్థితులు మొదలగు విషయాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం 3) దేశాల మధ్య వివాదాలు శాంతియుతంగా పరిష్కరించి యుద్ధాలను నివారించడం.

**16.12.2 సమితి నిర్మాణము :** నానాజాతి సమితి లిఖిత ఒడంబడిక 1920 జనవరి 10న అమలులోకి వచ్చింది. ఆనాడు సమితి సభ్య దేశాల సంఖ్య 23. 1920 నవంబర్ 15న సమితి మహాసభ మొదటి సమావేశం జరిగే నాటికి సభ్య దేశాల సంఖ్య 42కు పెరిగింది. ఆ తరువాత మరో ఆరు దేశాలు సమితిలో చేరాయి. 1935 నాటికి సమితి సభ్యత్వం 60 అయింది. అంతకన్నా సభ్య దేశాల సంఖ్య పెరగలేదు. సమితి చివరి సంవత్సరం 1946లో సభ్య రాజ్యాల సంఖ్య 43. వర్సే సంధిని, దానితోబాటు నానాజాతి సమితి లిఖిత ఒడంబడికను అమెరికన్ సెనెట్ ధృవీకరించడానికి నిరాకరించడం వల్ల అమెరికా సమితిలో సభ్య రాజ్యంగా చేరలేదు.

నానాజాతి సమితి ఒడంబడికలోని 26 ప్రకరణాలలోని తొలి ఏడు ప్రకరణాలు సమితి నిర్మాణం, అధికారాలు, విధులకు సంబంధించినవి. 14వ ప్రకరణం అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటుకు సంబంధించింది. 26వ ప్రకరణం సమితి ఒడంబడిక సవరణకు సంబంధించినది. ఈ ప్రకరణ ప్రకారం సమితి మండలి ఏకగ్రీవామోదం, సమితి మహాసభ మెజారిటీ ఆమోదంతో మాత్రమే ఒడంబడికలో సవరణలు చేయవచ్చు.

నానాజాతి సమితిలో మూడు ప్రధాన అంగాలున్నాయి. అవి 1) సమితి మహాసభ 2) సమితి మండలి 3) సమితి సచివాలయం. సమితికి సంబంధించిన మరి రెండు స్వయం పాలనాధికారమున్న అంగాలు 4) శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానం 5) అంతర్జాతీయ కార్మిక సంస్థ. ఇవిగాక సహాయక అంగాలు కూడా ఉన్నాయి. అవి : 1) ఆధిష్ట ప్రాంతాల సంఘము 2) అంతర్జాతీయ జ్ఞానాభివృద్ధి సంస్థ 3) అంతర్జాతీయ టారిఫ్ సంఘం 4) అంతర్జాతీయ ఆర్థిక సంఘం 5) అంతర్జాతీయ రాకపోకల సంఘం మొదలగునవి.

**16.12.3 సమితి మహాసభ :** మహాసభ సమితికి చెందిన శాసనాధికారమున్న సంస్థ. సమితి సభ్య రాజ్యాల ప్రతినిధులు ఇందులో సభ్యులు ప్రతి రాజ్యానికి ఒక ఓటు వుంటుంది. మహాసభ ఒక అధ్యక్షున్ని 8 మంది ఉపాధ్యక్షులను ఎన్నుకొంటుంది. మహాసభ వార్షిక సమావేశాలు జెనీవాలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో జరగాలి. మహాసభ తీర్మానాలు ఏకగ్రీవంగా జరగాలి. మహాసభలో కొన్ని స్థాయీ సంఘాలు, ఉపసంఘాలు ఉంటాయి. ఈ స్థాయి సంఘాల, ఉపసంఘాల సహాయంతో మహాసభ కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుంది.

కొత్త సభ్యులను మహాసభలో చేర్చుకోవడం, సమితి మండలికి తాత్కాలిక సభ్యులను వార్షికంగా ఎన్నుకోవడం, మండలి చేసిన ప్రధాన కార్యదర్శి నియామకాన్ని ధృవపరచడం, 15 మంది న్యాయమూర్తులను మండలితో కలిసి ఎన్నుకోవడం, సమితి ఒడంబడికను సవరించడం, సమితి మహాసభ నిర్వహించవలసిన విధులు, న్యాయ సంబంధమైన సమస్యలు, ఆరోగ్యం, ఆర్థిక విషయాలు, రవాణా, నిరాయుధీకరణ, సాంఘిక సమస్యల మీద ప్రత్యేక కమిటీలు సమర్పించిన నివేదికలను మహాసభ తరచు చర్చించేది. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే నేరుగా రంగంలోకి రాక, మహాసభ సమావేశం జరిపి సలహాలిచ్చేది. చిన్న దేశాలు తమ అభిప్రాయాలు ప్రకటించడానికి మహాసభ నుంచి వేదిక అయింది.

**16.12.4 సమితి మండలి :** సమితి కార్య నిర్వాహక అంశం మండలి. ప్రథమంలో మండలిని అగ్రరాజ్యాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించే శక్తి మంతమైన సంస్థగా తయారు చేయడానికి అగ్ర రాజ్యాలు ప్రయత్నించాయి. కాని చిన్న రాజ్యాలు గట్టిగా వ్యతిరేకించడంవల్ల అగ్ర రాజ్యాల పథకం విరమించబడింది. మండలిలో 5 అగ్ర రాజ్యాలు శాశ్వత స్థానం పొందేటట్లు 4 తాత్కాలిక రాజ్యాలు మహాసభ ఎన్నుకొనేటట్లు అంతిమ నిర్ణయమయింది. తాత్కాలిక సభ్య రాజ్యాలు కాల పరిమితి 3 సంవత్సరాలుగా నిర్ణయించడం జరిగింది. మండలిలో శాశ్వత సభ్య రాజ్యాలు ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్‌లు 1926 తరవాత జర్మనీ. తాత్కాలిక సభ్య రాజ్యాలు 1922 వరకు 4, ఆ తరువాత 6, 1926 తరువాత 9, 1936 తరువాత 11 ఉండేవి.

మండలి సంవత్సరానికి కనీసం 3 మార్లు జెనీవాలో సమావేశం కావలెను. ప్రతి సమావేశం ప్రారంభంలో అధ్యక్షుని, ఉపాధ్యక్షులను ఎన్నుకోవలెను. సాధారణంగా అక్షర క్రమ పద్ధతిని అనుసరించి అధ్యక్షుని ఎన్నుకోవలెను. మండలి ముఖ్యమైన నిర్ణయాలు ఏకగ్రీవంగా జరగాలి. మండలి సమావేశాలు సాధారణంగా బహిరంగంగా జరగాలి.

తనకు నివేదించిన తగాదాలను విచారించి వాటి పరిష్కారానికి మహాసభకు సలహా ఇవ్వడం మండలి ముఖ్య విధి. స్వతంత్రంగా వ్యవహరించడానికి మండలికి అధికారం లేదు. మండలికి ఈ క్రింది ప్రత్యేకాధికారాలు, విధులు కూడా ఉన్నాయి. డాన్‌జిగ్ పట్టణ పరిపాలనకు, సార్ ప్రాంత పాలనకు మండలి బాధ్యత వహించవలెను. ఆధిష్ట ప్రదేశాల సంఘం సహాయంతో ఆధిష్ట ప్రాంతాల పరిపాలనను మండలి పర్యవేక్షణ చేయాలి. సమితి ఒడంబడికను ఉల్లంఘించిన సభ్య రాజ్యాన్ని సమితినుంచి బహిష్కరించే అధికారం మండలికి ఉంది. ఆయుధాల తగ్గింపుకు సమితి ప్రణాళికలు తయారు చేయవలెను. సభ్య రాజ్యాల మధ్య వివాదాలను శాంతియుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవలెను. సచివాలయం పనిచేసే విధానాన్ని పర్యవేక్షణ చేయవలెను, సభ్య రాజ్యాల ప్రాదేశిక సమగ్రతను కాపాడవలెను.

**6.12.5 సమితి సచివాలయము :** సమితి మూడు ప్రధాన అంగాలలో ముఖ్యమైనది సచివాలయం. దీని కేంద్ర స్థానం జెనీవా పట్టణం. ప్రధాన కార్యదర్శి, అతడు నియమించిన దాదాపు 600 మంది సిబ్బంది ఆధిపత్యంలో సచివాలయముంటుంది. ప్రధాన కార్యదర్శి మహాసభ ఆమోదంతో మండలిచేత నియమితుడవుతాడు. సచివాలయ సి... ని ప్రధాన కార్యదర్శి మండలి ఆమోదంతో నియమిస్తాడు. సచివాలయ నిర్వహణ కయ్యే ఖర్చులు సభ్య రాజ్యాలు భరించవలెను. సచివాలయ పాలనా యంత్రాంగము ఆదిష్ట ప్రాంతాలు, నిరాయుధీకరణ, అల్ప సంఖ్యాక వర్గ ప్రజలు, ఆర్థిక సమస్యలు మొదలైన 11 భాగాలుగా విభజితమయింది. మహాసభ, మండలి చేసిన తీర్మానాలు సచివాలయం అమలు పరచవలెను. సమితి మొదటి ప్రధాన కార్యదర్శి సర్ ఎరిక్ డ్రమండ్ నిష్పాక్షికమైన పరిపాలకుడు అని పేరుగాంచాడు. చివరి ప్రధాన కార్యదర్శి స్టీన్ లెస్టర్ కూడా మంచిపేరు ప్రతిష్టలున్నవాడు.

**16.12.6 శాశ్వత అంతర్జాతీయ న్యాయ స్థానము :** సమితి ఒడంబడికలోని 14వ ప్రకరణననుసరించి సభ్య రాజ్యాల మధ్య తగాదాలను పరిష్కరించడానికి ఒక అంతర్జాతీయ న్యాయస్థానం నెలకొల్పడం జరిగింది. ఈ న్యాయ స్థానం 1922 నుండి హేగ్‌లోని శాంతి భవనంలో పని చేయడం ప్రారంభించింది. ఈ న్యాయస్థానంలో 15 మంది న్యాయమూర్తులుంటారు. వీరిని మహాసభ, మండలి కలిసి మెజారిటీ వోటు పద్ధతి ద్వారా 9 సంవత్సరాల కొకసారి ఎన్నుకొంటారు. వీరిని తొలగించడానికి మహాసభ, మండలికి అధికారం లేదు. ఈ న్యాయ స్థానానికి చెందిన న్యాయమూర్తులు మాత్రమే ఏకగ్రీవ నిర్ణయం ద్వారా ఒక న్యాయమూర్తిని తొలగించగలరు. న్యాయ మూర్తులు తిరిగి ఎన్నిక కావచ్చు. న్యాయస్థాన అధ్యక్ష ఉపాధ్యక్షులను న్యాయమూర్తులే 3 సంవత్సరాల కాలపరిమితికి ఎన్నుకొంటారు. ఈ న్యాయస్థానానికి ఒక రిజిస్ట్రార్ కూడా ఉంటాడు. న్యాయస్థానం తీర్పు అంతర్జాతీయ న్యాయ సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది. న్యాయస్థానం కనీసం సంవత్సరానికి ఒకసారి సమావేశం కావాలి.

సమితి సభ్య రాజ్యాల మధ్య తగాదాలను, సమితి ఒడంబడికకు జతపరచబడిన జాబితాలోని రాజ్యాల మధ్య తగాదాలను మాత్రమే ఈ న్యాయస్థానం స్వీకరించి తీర్పు ఇస్తుంది. తమకు సంబంధించిన కేసులను సమర్పించడం రాజ్యాల ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుంది. సమితిలో సభ్యత్వం లేని దేశాలు కూడా తమ కేసులను ఈ న్యాయస్థానానికి నివేదించవచ్చు. అయితే న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తప్పనిసరిగా అంగీకరించి అమలు పరచవలెను.

అంతర్జాతీయ న్యాయస్థానం అధికార పరిధి రెండు రకాలు. ఒకటి స్వచ్ఛందము, రెండోది నిర్బంధము. రెండుగాని అంతకంటే ఎక్కువ రాజ్యాలు గాని తమ తగాదాను అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించినపుడు న్యాయస్థానమిచ్చిన తీర్పును ఆ రాజ్యాలు స్వచ్ఛందంగా ఆమోదించవచ్చు లేదా వ్యతిరేకించవచ్చు. సమితి సభ్య రాజ్యాలు, ఒడంబడికకు జతపరచబడిన జాబితాలోని రాజ్యాలు తప్పనిసరిగా సంధుల అమలుకు అంతర్జాతీయ బాధ్యతల అమలుకు సంబంధించిన తగాదాలను అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించడమేకాక న్యాయస్థానమిచ్చిన తీర్పును తుది పరిష్కారంగా పరిగణించి అంగీకరించవలె. మహాసభగాని, మండలిగాని తనకు నివేదించిన సమస్యలమీద అంతర్జాతీయ న్యాయస్థానం సలహాలు ఇవ్వవలెను. అయితే న్యాయస్థానమిచ్చిన సలహాలను మహాసభగాని, మండలిగాని, తగాదాతో సంబంధం ఉన్న పక్షాలు గాని విధిగా పాటించవలసిన అవసరం లేదు.

**16.2.7 అంతర్జాతీయ కార్మిక సంస్థ :** వర్సే సంధిలోని 13వ భాగం వల్ల అంతర్జాతీయ కార్మిక సంస్థ అమలులోకి వచ్చింది. సమితిలో సభ్యులందరూ అంతర్జాతీయ కార్మిక సంస్థలో కూడా సభ్యులు. సమితిలో సభ్యత్వంలేని రాజ్యాలు కూడా అంతర్జాతీయ కార్మిక సంస్థలో చేరవచ్చు. సమితిలో సభ్య రాజ్యంగా చేరడానికి నిరాకరించిన అమెరికా ఈ కార్మిక సంస్థలో 1934లో చేరింది. సమితిలో చేరకముందే జర్మనీ కార్మిక సంస్థలో ప్రాతినిధ్యం పొందింది.

ఒడంబడికలోని 23వ ప్రకరణం ప్రకారం వివిధ దేశాలలోని కార్మికుల మధ్య, కార్మికులకు యజమానులకు మధ్య సహకారం పెంపొందించడం, అంతర్జాతీయ కార్మిక సంస్థ ముఖ్య లక్ష్యం. కార్మికుల పని స్థితిగతులను మెరుగుపరచడం, కార్మికుల పని కాలాన్ని న్యాయంగా నిర్ణయించడం, కార్మికులకు సబబైన జీతభత్యాలు, పెన్షన్, బోనస్ మొదలైన సౌకర్యాలు, కల్గజేయడం, స్త్రీల, శిశువుల యోగ క్షేమాల రక్షణకు ఏర్పాట్లు చేయడం, కార్మికులను యాజమాన్యంలో పాల్గొనేటట్లు చేయడం ఈ సంస్థ ఇతర లక్ష్యాలు.

అంతర్జాతీయ కార్మిక సంస్థ తన విధులను ఒక రాజ్యాంగం ప్రకారం నిర్వహించింది. అంతర్జాతీయ కార్మిక సంస్థలో మూ విభాగాలున్నాయి. అవి సాధారణ సమావేశం, పాలక వర్గము, అంతర్జాతీయ కార్మిక కార్యాలయం.

**16.12.8 సాధారణ సమావేశము :** అంతర్జాతీయ కార్మిక సంస్థ సాధారణ సమావేశానికి ప్రతి సభ్యరాజ్యము నల్గురు ప్రతినిధు పంపవచ్చు. ఇందులో ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులు, ఒకరు కార్మిక ప్రతినిధి, మరొకరు యాజమాన్య ప్రతినిధి. సాధారణ సమావే జెనీవా పట్టణంలో జరగవలెను. దీని నిర్ణయాలు సాధారణంగా ఏకగ్రీవంగా జరుగుతాయి. కార్మిక సంస్థ రాజ్యాంగ సవరణకు మూడిం రెండువంతుల మెజారిటీ కావలెను. సాధారణ సమావేశం చేసిన రాజ్యాంగ సవరణకు పాలకవర్గము ధృవపరచవలెను. సభ్య రాజ్యా కార్మిక చట్టాలు చేయడానికి కావలసిన సిఫారసులను సాధారణ సమావేశం చేయవలెను.

**16.12.9 పాలక వర్గము :** సాధారణ సమావేశము 32 మంది సభ్యులున్న పాలక వర్గాన్ని 3 సంవత్సరాల కాలపరిమితికి ఎన్నుకొంటుం ఇందులో 16 మంది ప్రభుత్వ ప్రతినిధులు. వీరిలో సగం మందిని పారిశ్రామికంగా ప్రాముఖ్యమున్న రాజ్యాలనుండి. ఎన్నిక చేయవలెన మిగిలిన 8 మంది ప్రభుత్వ సభ్యులను సాధారణ సమావేశానికి చెందిన ప్రభుత్వ ప్రతినిధులు ఎన్నుకొంటారు. పాలక వర్గం 8 మం ప్రతినిధులను, ఉద్యోగులు మరి 8 మంది ప్రతినిధులను యాజమాన్యం ఎన్నుకొంటుంది. పాలకవర్గం సాధారణ సమావేశం కార్యక్రమా పట్టికను నిర్ణయించడమే గాక అంతర్జాతీయ కార్మిక కార్యాలయానికి ఒక డైరెక్టర్‌ను కూడా నియమిస్తుంది. పాలక వర్గం కనీసం నెలలకొకసారి సమావేశమవుతుంది.

**16.12.10 అంతర్జాతీయ కార్మిక కార్యాలయం :** అంతర్జాతీయ కార్మిక కార్యాలయానికి కేంద్రము జెనీవా. దీనిలో సుమారు 350 మం సిబ్బంది ఉంటారు. ఈ సిబ్బంది డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో ఉంటుంది. ఇతనిని పాలకవర్గం నియమిస్తుంది. కార్మికుల సంబంధించి సమాచారాన్ని సేకరించి ఈ కార్యాలయం ప్రచురిస్తుంది. సాదారణ సమావేశం కార్యక్రమాల పట్టికను తయారు చేయడంలో పా వర్గానికి సహాయం చేస్తుంది. అంతేగాక సచివాలయం కొన్ని ముఖ్యమైన దర్యాప్తులు చేయడం, జర్నల్స్ ప్రచురించడం, క్రమమైన కార్మి శాసనాల తయారుకు సహాయం చేయడం మొదలైన పనులను కూడా చేయవలెను.

అంతర్జాతీయ కార్మిక సంస్థ ఒక ప్రపంచ చర్చావేదికగా పనిచేసింది. ఈ సంస్థలో కార్మిక సమస్యలన్నింటినీ చర్చించిన తరువాత ప్రపంచ కార్మిక విధానాన్ని ఒక విధంగా రూపొందించడం జరుగుతుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ స్వయం నిర్ణయాధికారం ఉన్న సం అయినప్పటికీ సమితిలో అంతర్భాగమే. దీని ఖర్చులన్నింటిని సమితి భరిస్తుంది.

**16.12.11 ఆదేశిక పద్ధతి :** నానాజాతి సమితి ఒడంబడికలోని 22వ ప్రకరణం ప్రకారం నానాజాతి సమితి ఆదేశిక (ఆదిష్ట) రాజ్యాల సంక్షేమానికి, అభివృద్ధికి బాధ్యత వహించింది. ఇది వరలో జర్మనీకి చెందిన వలసలు, ఆటోమాన్ సామ్రాజ్యం క్షీణించినందువల్ల ఏర్ప ప్రాంతాలు అగ్ర రాజ్యాల ఆధీనంలోకి, నియంత్రణలోకి వచ్చాయి. వాటినే ఆదిష్ట ప్రాంతాలు అంటారు. వీటిలో కొన్నిటిని బ్రిటన్‌కు, కొన్నిటిని ఫ్రాన్స్‌కు ఆదేశించడమయింది. ఈ దేశాలు ప్రతి సంవత్సరం సమితి మండలికి తమ తమ ఆదిష్ట ప్రాంతాల గురిం నివేదికలు పంపవలసి ఉంటుంది. ఈ విధానాన్ని పర్యవేక్షించేందుకు శాశ్వత ఆదేశిక ప్రాంతాల కమీషన్‌ను సమితి ఏర్పాటు చేసింది. దీ సభ్యుల సంఖ్య 11.

ఆదిష్ట ప్రాంతాలన్నింటిని ఎ.బి.సి. అనే మూడు వర్గాల క్రింద విభజించారు. 'ఎ' వర్గానికి చెందిన ప్రాంతాలు కొద్దిపాటి సహకారంత స్వతంత్ర రాజ్యాలుగా రూపొందగలవు. అవి బ్రిటన్ క్రింద వున్న ఇరాక్, పాలస్తీనా; ఫ్రాన్స్ నియంత్రణ క్రింద వున్న సిరియా, 'బి' వర్గాని చెందిన ఆదిష్ట ప్రాంతాలు వెనుకటి జర్మన్ వలసలు. వీటి సంఖ్య మొత్తం 6 వీటికి అధికసాయం అవసరం కనుక గుయానా, టాగోలాండ్‌లోని కొంత భాగం, కామరూన్స్‌లోని కొంత భాగం బ్రిటన్‌కు; టాంగోలాండ్, కామరూన్స్‌లో మిగిలిన భాగాలు ఫ్రాన్స్‌కు; రువాండా, ఉరుండీ బెల్జియంకు ఇయ్యడం జరిగింది. 'సి' వర్గానికి చెందిన జర్మన్ నైరుతి ఆఫ్రికా సౌత్ ఆఫ్రికాకు; పశ్చిమ సమావో న్యూజిలాండ్‌కు; జర్మన్ న్యూగినీ, జర్మన్ దక్షిణ పసిఫిక్ దీవులు ఆస్ట్రేలియాకు; జర్మన్ ఉత్తర పసిఫిక్ దీవులు జపాన్‌కు ఇయ్యడం జరిగింది. నారు (Nauru) సంయుక్తంగా బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల నియంత్రణ కిందకు వచ్చాయి.

సిద్ధాంత రీత్యా అగ్రరాజ్యాలు తమ ఆధీనంలో వున్న ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొనవలెను. కాని అమలులో ాత్రం అగ్రరాజ్యాలు సమితి పర్యవేక్షణను ఏ మాత్రమూ లక్ష్యపెట్టక తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాయి. ఆదిష్ట పద్ధతి వల్ల అగ్రరాజ్యాల ్యకాంక్ష నెరవేరిందని చెప్పవచ్చు. యుద్ధంలో ఓడిపోయిన రాజ్యాలకు చెందిన వలసలన్నీ అగ్రరాజ్యాలకు ఆదేశించడం వల్ల వెనుకబడిన ంతాలలో చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదు.

## .13 సమితి కార్యకలాపాలు :

నానాజాతి సమితి 20 సంవత్సరాలు పనిచేసింది. సమితి తొలి దశలో అనగా 1920 నుండి 1923 వరకు చెప్పుకోదగిన ప్రగతిని ుంచలేక పోయింది. ఈ కాలంలో సమితి సహాయ కార్యక్రమాలను మాత్రమే నిర్వహించి తన మనుగడను నిలబెట్టుకో గలిగింది. 1925 ుచి 1930 వరకు సమితి కొన్ని ఘన విజయాలను సాధించి తన ప్రతిష్టను పెంచుకొన్నది. 1923 వరకు సభ్య రాజ్యాలు సమితి కార్య ాపాలలో పాల్గొనడానికి తన ప్రతినిధులుగా సాధారణ ఉద్యోగులను మాత్రమే పంపేవి. 1924 నుంచి సభ్య రాజ్యాలు తమ ప్రతినిధులుగా దేశాంగ మంత్రులను పంపడం ప్రారంభించిన తరువాత సమితి ప్రతిష్ట పెరిగింది. ఇదే కాలంలో సమితి కొన్ని అంతర్జాతీయ తగాదాలను ుతియుతంగా పరిష్కరింపగలిగింది. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించింది. 24 నుండి 1930 వరకు సాధించిన విజయాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఈ కాలం (1924-1930) సమితి ప్రతిష్ఠ ుకాష్టనందుకొన్న కాలం అని ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు. అయితే 1931లో మంచూరియా మీద జపాన్ దురాక్రమణను అరికట్టలేక వడంతో సమితి క్షీణ దశ ప్రారంభమైనదని చెప్పవచ్చు. 1939లో యుద్ధం ప్రారంభం కావడంతో సమితి అంతిమ శ్వాస విడిచింది.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| M.A. History | Ist Year | Paper - IV : History of Modern Europe (1789 to 1919) |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)